కీర్తనలు

హరి నీమయమే అంతాను: 1-4



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం

గురు దక్షిణామూర్తి

గురు వేదవ్యాస మహర్షి

గురు శుక మహర్షి

గురు నారద మహర్షి

గురు వాల్మీకి మహర్షి

గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ

గురు బాబాజి

గురు గౌతమ బుద్ధ

గురు ఆదిశంకరాచార్య

గురు రామానుజాచార్యులు

గురు జ్ఞానేశ్వర్

గురు రవిదాస్

గురు కబీర్ దాస్

గురు చైతన్య మహా ప్రభువు

గురు నానక్

గురు రాఘవేంద్ర స్వామి

గురు వీరబ్రహ్మేంద్ర స్వామి

యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి

గురు లాహిరి మహాశయ

గురు రామకృష్ణ పరమహంస

అమ్మ శారదా దేవి

గురు వివేకానంద

గురు సాయిబాబా

గురు అరబిందో

గురు రమణ మహర్షి

గురు యోగానంద

గురు భక్తివేదాంత ప్రభుపాద

గురు మళయాళ స్వామి

గురు విద్యాప్రకాశానందగిరి

గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

గీతా దీక్ష వారి వెబ్ సైట్:

http://www.geetadeeksha.com

అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

హరి నీమయమే అంతాను

సంపుటం -1,2,3,4

ఎన్నుకొన్న

అన్నమయ్య సంకీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

ఎన్నుకొన్న

అన్నమయ్య సంకీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

ఏప్రిల్ 2013

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

అంకితము

దశరథుని కంటివెలుగు అయిన

శ్రీరామచంద్ర మూర్తికి..

నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై
సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో
కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అచ్చుతు శరణమే అన్నిటికిని గురి	16
2.	అతడేమిసేసినా మాకదే గురి	42
3.	అదెవచ్చె రాఘవుడాతని దాడి ముట్టె	67
4.	అలమేల్మంగవు నీవు యక్కుననుందానవు	69
5.	అల్లదెకో విజయధ్వజము	55
6.	ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల	7
7.	ఆ రూపమునకే హరి నీకు మొక్కెదను	164
8.	ఇంతలేకుంటే నది యెక్కడి సుజ్ఞానము	193
9.	ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే	162
10.	ఇందిరానాథుడవు ఇందరికి నేలికవు	26
11.	ఇందులోనే కానవద్దా యితడు దైవమని	195
12.	ఇప్పటినుండియు నిన్ను ఇంతేసి దూరగనేల	9
13.	ఇలవేల్పితడే ఇందరికిని	5
14.	ఇహపరములకును యేలికవు	84

15.	ఇహము బరము జిక్కెనీతని వంక	38
16.	ఈతడఖిలంబునకు నీశ్వరుడై	117
17.	ఈతడు విష్ణుడు రిపులెక్కడ చొచ్చేరు	125
18.	ఈతని మహిమలు యెంతని చెప్పెద	20
19.	ఈసురలీ మునులీ చరాచరములు	109
20.	ఎంతసేయగలేదు ఇటువంటి విధియభవు	94
21.	ఎంత ప్రతాపమో నీదియెంచి చూచితే	51
22.	ఎందరివెంట నెట్లు తిరుగవచ్చు	139
23.	ఎందుగాపురము సేతు నేది	170
24.	ఎందుబొడమితిమో యెఱుగము	103
25.	ఎక్కడిదురవస్థలేటిదేహములోన	130
26.	ఎక్కడిపాపము లెక్కడి పుణ్యము	197
27.	ఎనుబోతుతోనెద్దు నేరుగట్టినయట్లు	107
28.	ఎఱుకగలుగు నాడెఱంగడటా	205
29.	ఎవ్వరికైనను యీ వ్రాత	145
30.	ఏటి బిడ్డగంటివమ్మ యశోదమ్మ	57
31.	ఏణ నయనల చూపులెంత సొబగైయుండు	111

32.	ఏతపములునేల యే దానములునేల	166
33.	ఏది చూచినా నీవే ఇన్నియును	113
34.	ఏమని చెప్పగవచ్చు నీతనిప్రతాపము	77
35.	ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను	117
36.	ఏమిచెప్పేది ప్రతాపమెట్టి విలుకాడితడు	119
37.	ఏలికవు నీవట ఇంకాదైన్యమేల	178
38.	ఔదువయ్యా జాణవు ప్రహ్లాదవరద	90
39.	కంచుగాదు పెంచుగాదు కడుబెలచు మనసు	48
40.	కంటిమి వింటిమి అట్టే కానీవయ్యా	86
41.	కొండంత పొడవుతోడ కోనేటి రాయుడు	183
42.	కొండవంటి దేవుడు నే గొలిచే దేవుడు	179
43.	కామధేనువు దేవకల్పితము	153
44.	కావగ నీకే పోదు కరుణానిధివిగాన	160
45.	కొలువరో మొక్కరో కోరి తలచరో	22
46.	కొలువుడు వలసితే గొలవక మానుడు	187
47.	గోవింద నీవన్నిటిలో గూడితేజాలు	156
48.	గోవిందకేశవ నీకు కుయ్యో మొఱ్ఱో	28
49.	ఘనుడీతడొకడు కలుగ గదా!	137

50.	చేకొన్న భక్తులపాలి చింతామణి	63
51.	జీవములు దవ్వులోయ చీమలును	172
52.	తలవ వెనక నుయ్యి తగరు ముందట	30
53.	త్రివిక్రమమూర్తియైన దేవునివలెనున్నాడు	71
54.	తెలియడుగాక ద్రిష్టము జీవుడు	123
55.	తెలియరాదు మాయదేహమా	201
56.	తోరణములే దోవెల్లా	99
57.	దానవారితోడి పగ ధరించరాదు	46
58.	దేవతలు చెలగిరి దిక్కులెల్లా సంతోషించె	92
59.	దైవమా నీవే దయాధర్మము దలచుట	185
60.	నవమూర్తులైనట్టి నరసింహము వీడె	180
61.	నాకుగల పనియిదే నారాయణుడ	189
62.	నిజమో కల్లో నిమిషములోననే	34
63.	నీటముంచు పాలముంచు నీచిత్తమికను	11
64.	పదిలము కోటపగవారు	143
65.	పసలేని యీ బ్రతుకు	141
66.	పరమోపకారులు ప్రత్యక్షదైవములు	191
67.	పట్టిన వ్రతమే పంతము హరితో	174

68.	పుట్టించినవాడు దానె బుద్ధి చెప్పెడి	176
69.	బంటుకు బంటవుదురా పాపముగాక	73
70.	బొడ్డుతామరలోన గడ్డి వయసు పెద్ద	13
71.	బ్రహ్మాదులకు నిదేపరచింత	168
72.	మమ్ముజూడ నేమున్నది మావంకనీకే	53
73.	మానరాదు నీకింక మముగావవలెను	36
74.	మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి	32
75.	మొక్కరో సేవించరో మునులాల ఋషులాల	88
76.	రాచాజ్ఞ మరలించ రాజేకర్తగాన	1
77.	రామచంద్రా రామభద్రా రఘువీర	40
78.	రాముడు లోకాభిరాముడుదయించె	151
79.	వాసివంతు విడిచిన వాడే	121
80.	విచ్చేయవమ్మా వెన్నెల బొమ్మా	158
81.	విడువుము మనసా వీరిడి చేతలు	128
82.	విధి నిషేధములకు వెఱవగబనిలేదు	203
83.	వినయాలు సేసేవు వేంకటేశుడా	82

84.	వినోదకాడవౌదువు విఠలేశ్వరా	59
85.	వెఱవకు మనసా విష్ణుని యభయము	44
86.	వెదకితే నీవంటి వేల్పు లెవ్వరున్నారు	65
87.	వీడివో కొలువున్నాడు విట్ఠలేశుడు	18
88.	వీడివో కలశాపుర వీరహనుమంతుడు	24
89.	వెలయనిన్నియును వృథా వృథా	105
90.	వెన్నవట్టుక నేయి వెదకనేలా	135
91.	వేలగట్టినట్టి వేవేలు చక్కిలాలు	80
92.	వేదవేద్యులు వెదకేటిమందు	97
93.	శిష్టులను మన్నించే శిశువీతడు	75
94.	సడిబెట్టె గటకటా సంసారము	132
95.	సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను	199
96.	సరిలేరితనికి సాహస విక్రముడీతడు	61
97.	సులభమా మనుజులకు హరిభక్తి	101
98.	సులభుడు మధుసూదనుడు	207
99.	హరినెఱగని పుణ్యమంటేరు	147
100.	హరి నీమయమే అంతాను	3
101.	హరి మంగళము	210

ప్రార్థన

కం॥ శ్రీహరి నీమయమంతా
సాహసమగు నిన్ను వీడి జతనము సలుపన్
ఊహాతీతము జీవికి
ఆహా! నీలీల నెఱుగ నది సాధ్యంబే!!

ఉ॥ ఆకలిగొన్నవేళ తన అక్కున జేర్చుచు స్తన్యమిచ్చి చీ-
కాకను మాటలేక తను కమ్మగ నింపును బొజ్జ బిడ్డకున్
నాకము సాటికాగలదె నా జననీమణికీ జగంబులన్
హేకరుణామయా! తిరుమలేశ్వర! అమ్మలకమ్మనీవెగా.

చం॥ నలుపుగనుండువాడు నవనీతము ముచ్చిలి మ్రింగువాడు ఆ
వలపులఱేనిగన్న హరి వంటి కృపాకరుడేడి సృష్టిలో
చెలువుడు వేంకటేశ్వరుడు చేరెను నందవ్రజంబు వెన్నుడై
తలవక కొచెగోవులను తన్వుల మానము కొల్లగొట్టుచున్

సీ॥ అలవాటుకును జిక్కి అలమటించుట కద్దు
ఇదియేమి అలవాటు ఇందిరేశ!
వ్యసనంబునకు జిక్కి వాపోవుటది కద్దు
వింత వ్యసనమిద్ది వేంకటేశ!
కోర్కెలకును జిక్కి కుందుట అది కద్దు
తీరేటి కోరికా? తిరుమలేశ!
మోహంబుకును జిక్కి మునిగిపోవుట కద్దు
పెనుమోహమిద్దిరా శ్రీనివాస!

ఆ.వె॥ మంచిలేదు నాకు యెంచ చెడును లేదు
దారితప్పినట్టి తనయుడనని
ఉద్ధరించవయ్య! ఉర్వీధరా! హరీ
వెట్టి బానిసలను తిట్టనేల?

మ॥ హరి నీమాయనెరుంగ మాకు వశమే! అజ్ఞానికెట్లౌనురా?
కురిపించంగదవే! కృపన్ నిలుచుచున్ కూటస్థుడౌ శ్రీపతీ!
ధర నీకెవ్వరు సాటిరాగలరురా! తండ్రీ! జగన్మోహనా!
వర శ్రీవేంకటనాయకా! విడువ నీ పాదంబులన్ జుట్టెదన్.

తే.గీ.॥ కనుల గోచరమవనట్టి కమలనాభు
వేదరాశులకందని విశ్వరూపు
భక్తిలేకున్న స్థిరముగా మనసునందు
తెలియసాధ్యమా!! యేరికి, కలను గాదు.

కం॥ తిరుమలరాయని గొలువుడు
తరుగునురా పాపరాశి ధన్యత కలుగున్
తరగని వరములు కురియును
తరియించును వంగడంబు తరతరములకున్

శా॥ నాదోపాసన గొప్పసాధనమురా నారాయణున్ జేరగా
వాదం బేటికి? ప్రాప్యస్థానమతడే వాంఛించకైవల్యమున్
ఏదో జన్మసుకృత్యమిట్లు వెలసెన్ హే శ్రీపతీ! ధన్యుడన్
తాదాత్మ్యంబుగ అన్నమయ్య కృతులన్ తర్కించి నే జెప్పెదన్

ఆ.వె॥ కాడు అన్నమయ్య, కాడురా త్యాగయ్య
కారు రామదాసు ధరణి నరులు
కూనిరాగములతో కొలిచినా హరి మెచ్చు
భక్తిలేని నోట భజనలేల?

ఉ॥ పాదరసంబు వోలెవడి బట్టగ కాదుర చంచలంబు, ఆ
వేదన జిక్కు నా మనసు వేంకటనాయక యేమిసేతురా
పాదము బట్టి వేడెదను పాయక కట్టుము నీదు ధ్యాసలో
కాదనకయ్య! నీచమగు కావిరి జన్మలనెత్తలేను రా!

సీ॥ శోధించి వేధించి శుష్కింప జేసిన
"హరి ఆర్తరక్షకు" డనుటయెట్లు?
కర్మగిర్మయటించు కథలన్ని నాకేల
నాదు భారము నీది నందకధర!
తొలగించి వేదన తుడువక కన్నీరు
దీనబంధుడవెట్లు తిరుమలేశ!
శరణాగతత్రాణ బిరుదంబదేలరా?
కరుణగావకయున్న కమలనాభ!

ఆ.వె॥ బిడ్డ తప్పుజేయ బిగియించునా తండ్రి?
తప్పు దిద్ది మంచి దారి జూపు
జగతినెందునైన సర్వసామాన్యమే
వెకలిజెప్పుటేల వేంకటేశ!

మత్తకోకిల:

ఏమిటీ హరిమాయ దెల్వను యేమి నాగతి శ్రీపతీ!
కామక్రోధములొగ్గనైతిని కండకావరమెక్కగా
ఏమిసేతును కాలుడొచ్చెను ఇంటివాకిట నిల్చెనే
రామచంద్రుని గొల్వనైతిని లక్షబుద్ధుల జెప్పినన్.

కం॥ నమ్మి చెడినవాడెవ్వడు
ఇమ్ముగ శ్రీవేంకటేశు నిహపరములకున్
అమ్మలకమ్మగు అమ్మను
నెమ్మదిలో నిల్పుకొన్న నిపుణుండితడే.

ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా స్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము "హరి నీ మయమే అంతాను" గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను "గూగుల్" నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. "geetadeeksha" అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. "భగవద్గీత" అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక "హరి నీమయమే అంతాను" అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen. Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు.

గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు,

సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అధవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.

హరి నీమయమే అంతాను



హరి నీమయమే అంతాను సంకీర్తనలు

సంఖ్య: II/447 రాగం : సామంతం
కీర్తన : రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన

సామంతం

1 రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥పల్లవి॥

కడు నహంకరించినను తొల్లి ఘనుడు నారదమౌని
బెడిదపుటింతిఁ జేసి నీమాయ ఆతని బిడ్డలఁ గనిపించెను
అడరి నే ననఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁగలనా
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁజేయవే
॥రాచా॥

మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనిని
సహజపునీహస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ
బహుముఖముల, నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ
అహిశయనుఁడ నే నీశరణంటిని అది నన్ను దగ్గరకుండఁ జేయవే
॥రాచా॥

సారపుశ్రీవేంకటేశ స్వతంత్రుఁడవు నీవు
గారవపుమాయ నీదే కమ్మి నే నీవాఁడనే
మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ
బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ ॥రాచా॥ **447**

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! నీవు జగన్నియంతవు. ఒక దేశపు రాజు వేసిన శిక్షను తప్పించుటకు రాజే సమర్థుడు. అన్యులకు అది అసాధ్యం. నీవు విధించిన

శిక్షను ప్రపంచంలో ఏ రాజూ కాదనలేడు. దానిని మానుప నీకే సాధ్యము. ప్రభూ నిన్ను శరణన్నాను. నన్ను రక్షించు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

రాజుగారు విధించిన శిక్షనుమరలించుటకు రాజువొక్కడే సమర్థుడు. నీవు జగన్నియంతవు. నీవు నాకు విధించిన ఈ "బ్రతుకు" శిక్ష మానుపవయ్యా! నీకు నేను శరణంటిని.

పూర్వం నారదుడు తనని నీమాయ యేమీ చేయలేదని గర్విస్తే నీమాయ ఆతని భార్యయై సంసారిని జేసి బిడ్డలనుకని కన్నీరుబెట్టించి గుణపాఠం నేర్పినది. దేవమౌని అయిన ఆయన అన్ని తిప్పలు బడితే ఇక మాబోటి వారెంత ప్రభూ! ఓ రాక్షసవైరీ! నీమాయనే దాటగలనా? దానిని మాత్రం నా వద్దకు రానీయకు. నీకు శరణంటిని తండ్రీ!

నీ వాహనమైన గరుత్మంతునికి నిన్ను మోయుచున్ననే గర్వం కలిగింది. వాని గర్వం ఖర్వం చేయుటకు అతనిని యెంత అశక్తుని చేశావంటే, అతను నీ చేతిని కూడా ఎత్తలేకపోయాడు. మరి నీమాయ అంటే దుస్సాధ్యము కదా! అసంఖ్యాకమైన తీరులనుండే నీమాయను నేను దాటగలనా?

ఓ శేషశయనా! నీ మాయను మాత్రం నాదగ్గరకు రానీకు. ఇదే నిన్ను శరణంటున్నాను. సారముగల శ్రీ వేంకటేశ్వరా! నీవు సర్వ స్వతంత్రుడవు ప్రభూ! అతి సమర్థవంతమైన నీ మాయకు జిక్కినా నేను నీ ఆశ్రితుడను. నన్ను రక్షించుటకు ఇంకొక దేవుడు లేనేలేడయ్యా! అందుకని నిన్నే పేర్కొని శరణంటిని. నీ మాయను నివారింపుము తండ్రీ!

పద్యవివరణ:

ఆ.వె.॥ **రాజువేయు శిక్ష రాజొక్కడే బాపు**
ఒరులకది యసాధ్యమో మురారి!
నీదుమాయ దునుప నీవేసమర్థుడౌ
జంకునెవ్వడైన వేంకటేశ!

సంఖ్య: IV/418 రాగం : సాళంగ భైరవి
కీర్తన : హరి నీమయమే అంతాను

సాళంగ భైరవి

2 హరి నీమయమే అంతాను
అరసి నీకు శరణనియెద నేను ॥పల్లవి॥

యెదుట నెవ్వరిక నేమాటాడిన
అది నీ ఘననామాంకితమే
అదివో సకల శబ్దాఖ్యుడవని నిన్ను
పొదలి చదువులు పొగడీగాన ॥హరి॥

యెవ్వరి బొడగని యెక్కడనుండిన
నివ్వటిల్ల నది నీరూపే
నెవ్వదీర నిదె నిను విశ్వరూపు
డెవ్వల నని శ్రుతులెంచీ గాన ॥హరి॥

భావన యిది నీ బ్రహ్మాత్మకమే
శ్రీవేంకటేశ నాచింత యిదే
ఆవల నిను సర్వాంతర్యామని
దేవ శాస్త్రములు తెలిపీ గాన ॥హరి॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య వినిపిస్తున్న చక్కని హరి శరణాగతి నాలకించండి. అణువణువున విశ్వమంతా నిండిన నారాయణుని కీర్తిస్తున్నారు. అంతా నీమయమే అని గ్రహించి నీకే శరణంటున్నాను ప్రభూ! అంటున్నారు.

ఇంత సరళమైన కీర్తనలో కూడా రెండు మూడు చోట్ల తెల్లమొగము వేసే ప్రమాదం వున్నది సుమండీ!

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! అంతాను (ఈ విశ్వమంతా) నీ మయమే (నీతోనే నిండిపోయినది). నేను అరసి (ఇది గ్రహించి) నీకు శరణనియెదను ప్రభూ!

నేను ఇక మాటాడిన (పలికిన) అది నీ ఘనమైన నామాంకితమే (నామ సంకీర్తనమే). ఇకపై నాయెదుట యెవ్వరూ లేరు. అదిగో పొదలి (వర్ధిల్లిన) చదువులు (వేద వేదాంగములు) నిన్ను సకల శబ్దాఖ్యుడవని (సృష్టిలోని సకల శబ్దములచేత కీర్తించబడువాడవు).

ఎక్కడనుండిన (ఏలోకంలోనున్నా) ఎవ్వని బొడగని (ఏదేవుని చూచినా) అది (ఆ రూపము) నివ్వటిల్ల (అతిశయించుచూ) నీరూపే అని గ్రహించితిని. ఇదే, నెవ్వదీర (నిరపాయముగా) నిన్ను విశ్వరూపుడవని శ్రుతులు (వేదరాశి), నిన్ను యెంచెను గాన, అంతా నీమయమే అనడంలో అతిశయమేమున్నది?

ప్రభూ! నీ బ్రహ్మత్వమే (పరబ్రహ్మతత్త్వమే) శ్రీవేంకటేశ స్వరూపము.ఇదే నా భావము మరియు నా చింతన. ఆవల (అటుపై) సకల శాస్త్రములు నిన్ను సర్వాంతర్యామివి (అందరిలో నున్న అంతర్యామివి) అని తెలిపీగాన, అంతా నీమయమే అని గ్రహించి ఆనందంతో పులకించిపోయాను, తండ్రీ!

పద్యవివరణ:

కం॥ హరి నీమయమే అంతా
అరయన్ మరి యొకటి లేదు అంబుజనాభా!
మరి మరి శ్రుతులిదె జెప్పెను
శరణంటిని నీకు మ్రొక్కి శబ్దాఘ్యు! తగున్

సంఖ్య: IV/133 రాగం : శ్రీరాగం
కీర్తన : ఇలవేల్పితడే ఇందరికిని

శ్రీరాగం

3 ఇలవేల్పితడే ఇందరికిని మరి
పలువేల్పులతో పని యికనేలా ॥పల్లవి॥

కమలారమణుని కరుణేకాదా
అమరులుగొనియెడియమృతము
అమితపుశ్రీహరి యాధారముగాదా (గద?)
నెమకేటి ప్రాణులు నిలిచినభూమి ॥ఇలవేల్పు॥

దనుజాంతకుబొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు
మనికై హరిసతిమహిమే కాదా
నినుపై భువిలో నిండినసిరులు ॥ఇలవేల్పు॥

యితనికొడుకు రచనింతాగాదా
సతులపతులసంసారరతి
గతి శ్రీవేంకటపతిలోకమె వు-
న్నతివైకుంఠపునగరపుముక్తి ॥ఇలవేల్పు॥

ఉపోద్ఘాతము:

ఈ లోకంలో వున్న ఇంతమందికీ కులదైవము ఈ శ్రీవేంకటేశ్వరుడే. అవునా? అటువంటప్పుడు ఇతర దేవతలను కొలిచి యేవేవో పనికిమాలిన కోరికలతో సతమతమవుతూ బ్రతకాల్సిన పనేమిటి చెప్పండి? అసలు ముక్తి అంటే యేమిటి శ్రీమన్నారాయణుని వైకుంఠపురం చేరి తిరిగి జన్మలేకుండా వుండటమే కదా! అంటున్నారు తాళ్ళపాక అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఇందరికిని (ఈ లోకంలోని వారందరికీ) ఇలవేల్పు (కులదైవం) ఇతడే (ఈ శ్రీవేంకటేశ్వరుడే). మరి (ఇంకా) అసంఖ్యాకులైన అన్యదేవతలతో ఇక యేమిపని వున్నది చెప్పండి?

ఈనాడు అమరులు (దేవతలంతా) లొట్టలు వేసికొంటూ అమృతం త్రాగుతున్నారంటే, అది కమలారమణుడు (శ్రీనాథుడు) అయిన శ్రీహరి కరుణే కాదా (కృపయే కదా!) అంతెందుకు నేడు మనమంతా నిలుచుని వున్న ఈ భూమి ఆనాడు శ్రీహరి హిరణ్యాక్షుని వరాహమూర్తియై వధించి కాపాడుట వలననే మనకు దక్కింది. కాబట్టి అమితపు (అనంతుడైన) శ్రీహరియే ప్రాణులన్నిటికీ ఆధారము అని ఒప్పుకొంటారా?

దనుజాంతకుడు (రాక్షసాంతకుడు) అయిన శ్రీహరి బొడ్డుతామెర (నాభికమలము)లో జన్మించిన బ్రహ్మ జరుపుతున్న సృష్టియే ఈ జగత్తు. ఆ విధంగా అందరి పుట్టుకకు హరియే కారణము. ఈ భూమిపైనున్న సిరులు (సంపదలన్ని) నినుపై వున్నవంటే (సమృద్ధిగా వున్నవంటే) హరి సతి అయిన లక్ష్మీదేవి కరుణే కదా!

అవన్నీ ఒక పక్కన పెట్టండి. ఈ లోకంలో భార్యాభర్తలు రతిలోదేలి సంసార సుఖులై సృష్టి నిర్వహిస్తున్నది ఈ శ్రీహరి కొడుకైన మన్మథుని రచనా చమత్కారమువల్లనే సుమా! ఈ శ్రీవేంకటపతి గతి (నిర్దేశనమే) వైకుంఠపురమున ముక్తులై వుండే వైభవం కల్పిస్తుంది. ఇంతకు మించి యేమి కావాలి?

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఇందరికిని భువిని ఇలవేల్పితడెజుమ్మి!**
పలు దివిజులతోటి పని యదేమి?
వేంకటేశు జేర వెలయు వైకుంఠమ్ము
అదియె ముక్తిపథము హరికి నెలవు.

సంఖ్య: XXI/385 రాగం : ధన్యాసి
కీర్తన : ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల

ధన్యాసి

4 ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల
ఏతుల నాడేటి కృష్ణుడీతడే కాడు-గదా ॥పల్లవి॥

కందువ దేవకి బిడ్డగనెనట నడురేయి
అంది యశోదకు కొడుకైనాడట
సందడించి పూతకి చంటిపాలు తాగెనట
మందల ఆవులగాచి మలసెనట ॥ఆతడె॥

మంచి బండిదన్నెనట మద్దులు విరిచెనట
ఇంచుకంత వేల కొండ ఎత్తినాడట
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట
మించుల పిల్లగోవి పట్టి మెరసెనట ॥ఆతడె॥

కాళింగుని మెట్టెనట కంసుని పొరిగొనెనట
పాలించి సురల చేపట్టెనట
ఈలీల శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుడట
ఏలెనట పదారువేల ఇంతుల నిందరిని ॥ఆతడె॥

ఉపోద్ఘాతము:

ఓ అమ్మలారా! ఆతడు శ్రీవేంకటేశ్వరుడా లేక ఉద్ధతితో మన ముంగిట ఆడుచున్న శ్రీకృష్ణుడా అనే అనుమానము వ్యక్తం చేసి అన్నమయ్య ఆ కృష్ణుని లీలలను వివరిస్తున్నారు.

మంచాలపై గొల్లెతల మానము చేకొనెనట కాని అంత గడుగ్గాయి పిల్లగాడూ యెవరో కాదట శ్రీవేంకటాద్రిని ఇరవయిన శ్రీనివాసుడేనట.

తాత్పర్య వివరణ:

ఓ అమ్మలారా! ఆతడు (ఆ శ్రీవేంకటేశ్వరుడు) యెవ్వాడో చూపరే (యెవ్వరో తెలియపరచండి). ఏతుల (ఉద్ధతితో) మన యెదురుగా ఆడుతున్న ఈ కృష్ణుడు, ఆతడు కాడుగదా!

కందువ (ఏకాంతమున) దేవకీదేవి ఒక మగ బిడ్డను నడిరేయి కన్నది (అర్ధరాత్రివేళ ప్రసవించింది). అటుపిమ్మట ఆ పిల్లవాడే రేపల్లెలో యశోద పొత్తిళ్ళలో బాలుడైనాడట. సందడించె (ఆర్భాటంగా వచ్చిన) పూతన చనుబాలు త్రాపగా తాగెనట. మరి పాపం అంతటి రాక్షసి యెందుకు చచ్చిందో తెలియదు. కానివాడే పెరిగి ఆవులమందని కాచి మలసెనట (తిరిగాడట).

ఈ పిల్లవాడి లీలలు యేమి చెప్పమన్నారు. మంచి (గట్టి) బండిని ఒక్క తన్ను తన్ని ముక్కలు ముక్కలు చేశాడట. పెద్దపెద్ద మద్దిచెట్లను రోటికి అడ్డంగా లాగి పడకొట్టాడట. ఇంచుకంతవేల (చిటికెనవ్రేలిపై) గోవర్ధన పర్వతాన్ని యెత్తాడట. గొల్లభామలు మంచాలపై నిద్రిస్తుంటే తనూ మంచంపై చేరి మానము దోచుకొన్నాడట. మధురమైన పిల్లనగోవి (మురళి) పట్టి వెలుగులు జిమ్మెనట.

కాళీయుడనే సర్పముపైనెక్కి ఆడి వాని గర్వము ఖర్వము జేసెనట. కంసుని పొరిగెనట (చంపాడట). ఇన్ని లీలలు చేసి శ్రీవేంకటాద్రి మీద దేవుడైనాడట. ఆ కృష్ణయ్యగా పదియారువేల మంది ఇంతులను పెళ్ళాడాడట. నేడు ఇందరినీ యేలుతున్నది ఆయనే కదా!

పద్యవివరణ:

ఉ.॥ **కందువ దేవకీసుతుడు కన్నులపంట గనా యశోదకున్**
సందడి బిడ్డ, పూతనను చన్నుల పాలను పీల్చి చంపెరా,
పొందుగ జూపరే యతని పొంతల నాడెదమంటిరే సతుల్
విందగు వేంకటేశ్వరుడు వీధుల గొల్లెత మోవి జుఱ్ఱెనో!!

సంఖ్య: XXIX/495 రాగం : వకుళాభరణం
కీర్తన : ఇప్పటి నుండియు నిన్ను ఇంతేసి దూరగనేల

వకుళాభరణం

5 ఇప్పటి నుండియు నిన్ను ఇంతేసి దూరగనేల
చెప్పనేల నీవేమైనా చేయవయ్య చేతలు ॥పల్లవి॥

వెంగెము లాడిన గాక వెరచేవా సతులకు
అంగము సోకినగాక అలసేవా
కొంగు వట్టితేగాక కొసరుకులోనయ్యేవా
చెంగట నేమైనా నీవు సేయవయ్యా చేతలు ॥ఇప్పటి॥

కన్నులను తిట్టననుగాక కడు కరగేవా
చన్నుల నొత్తిన కాక సమ్మతించేవా
చిన్ని గోరూదిన గాక చేతికి వసమయ్యేవా
చెన్ను మీర నేమైనా చేయవయ్యా చేతలు ॥ఇప్పటి॥

కాలు దొక్కితే గాక కౌగిట నీవు గూడేవా
కేలుపై జాచిన గాక కిందుపడేవా
యీలీల శ్రీవేంకటేశ యేలితివి ననునేడు
చేల కొంగిచ్చి యేమైన చేయవయ్య చేతలు ॥ఇప్పటి॥

ఉపోద్ఘాతము:

"ఇంకా యెంత జీవితం వున్నదో యెవరు చెప్పగలరు? నీ వ్యవహారం తెలిసిపోయాక యెన్ననుకొని యేమి లాభం? నిన్ను అనవసరంగా మాటలని తిట్టి వుపయోగమేమిటి? నీవేమైనా చేసికోవయ్యా నాకేమిటి? నీకు నేను చెప్పవలసిన అవసరమేమి వున్నది" అని నాయిక శ్రీవేంకటేశ్వరుని దెప్పుతున్నది. ఆయన చిలిపి చేష్టలు, వ్యంగ్య సంభాషణలు, శృంగార చేతలు ఆమెకు లోపల సంతోషం కలిగిస్తున్నా పైకిమాత్రం 'కారం' అద్దినట్లు మండిపడుతోంది. అన్నమయ్య శృంగారకీర్తన అజరామరం.

తాత్పర్య వివరణ:

స్వామీ! ఇప్పటినుండియు (ఇంకపైన) నిన్ను ఇంతేసి (ఇన్ని మాటలని) దూరనేల (తిట్టడం యెందుకు)? నీవేమైనా చేతలు చేయవయా? నీకు నేను చెప్పనేల?

ప్రభూ! సతులు నీగురించి యెన్ని వెంగెములాడుచున్నారో (పరాచికాలు పలుకుతున్నారో) చూశావా?అయినా వాటికి నీవు వెరచేవా యేమి? (నీకు జంకు కూడా లేదు). ఆడవాళ్ళ అంగములు తాకుతూవుంటే నీకు అలుపుయెందుకువస్తుందయ్యా? అయినా ఇదేమి పని స్వామీ! నీవు స్త్రీల కొంగులు పట్టుకోవటమేమిటి, కొసరుకు లోనవటం (మా కసురుకోవటానికి) యేమటి? నీవు దేవదేవుడవు. నిన్ను కాదనే దెవరు? చెంగట (నా దగ్గర) వుంటే చాలును. నీవు యేమి చేసికొనినా నేనభ్యంతరం చెప్పను.

ప్రభూ! నీవు చేసే చిలిపి చేష్టలకు నేను నాకళ్ళతోనే నిన్ను మందలిస్తాను. నేనొక పక్క తిడుతుంటే నీవు కడుకరగేవ (అంత పరవశించిపోతావా?) ఇదేమి చోద్యం? నా చన్నులు నొక్కితేగాని వూరకుండవా?చిన్ని గోరూదినగాక (గోటి గాటుపెట్టేదాకా) నీ చేతులు వూరకుండవు గదా! చెన్నుమీర (ఇంపుగా) నీవు చేసే చిలిపి చేష్టలుంటాయి. నీవేమి చేసినా మాకిష్టమే.

స్వామి! నేను చూసుకోకుండా నీకాలు తొక్కానని నన్ను కౌగలించికూడెదవా? అదొక వంకయా నీకు. నీపై చేయివేయగానే, కిందుపడేవా (లొంగిపోతావా?) యెంత విచిత్రం!! ఇన్ని తమాషాలు చేస్తావు కాబట్టే పరవశించనివారుండరు.ఓ శ్రీ వేంకటేశ్వరా ! నీవు ఈ లీల (ఈ విధముగా) యేలితివి. నా కొంగు నీ చేతికిచ్చాను. నీవేమి చేసినా నేను కాదనను ప్రభూ!

పద్యవివరణ:

తే.॥ చెప్పనేల నీవేమైన చేయవయ్య!
ఇప్పుడిటు నిన్ను దూరిన యేమి ఫలము?
కినిసి వేంకటవిభునిపైయనె వధూటి
చేల కొంగిచ్చి యేమైన చేయవయ్య!

సంఖ్య: IV/224 రాగం : సాళంగనాట
కీర్తన : నీటముంచు పాలముంచు నీచిత్త మిఁకను

సాళంగనాట

6 నీటముంచు పాలముంచు నీచిత్తమిఁకను
చాటితి నీకృప గురి సంసారమునకు ॥పల్లవి॥

హరి నీవే గురి నాయాతుమలోపలికి
అరిది శంఖచక్రాలే యంగపుగురి
పరమపదమే గురి పట్టినవ్రతమునకు
తిరుమంత్రమే గురి దిష్టపునాలికకు ॥నీట॥

గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు
తావుల నాభక్తికి నీదాసులే గురి
ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు ॥నీట॥

నగుశ్రీపతి గురి నన్ను రక్షించుటకును
తగుసంకీర్తన గురి తపమునకు
తెగనిజ్ఞానమునకు తిరుమణులే గురి
మిగుల శ్రీవేంకటేశ మించి నీవే గురి ॥నీట॥ **224**

ఉపోద్ఘాతము:

'గురి' అంటే లక్ష్యము. ప్రతి మనిషికీ ఒక లక్ష్యం వున్నట్లే ప్రతిపనికీ ఒక లక్ష్యం వుంటుంది. మాయామేయ జగత్తు యొక్క విచిత్ర లక్షణం యేమంటే ఇది నిత్యము, సత్యము అనే భ్రమ కల్పిస్తూ వుంటుంది. తన వైభోగం నిత్యము అనే భ్రమవల్లనే లోకంలో ఇన్ని అన్యాయాలు జరుగుతున్నాయి. ఒక పెద్ద భూకంపంవస్తే అయిదు నిముషాల్లో అంతా తుడిచిపెట్టుకుపోతుంది.

అప్పుడెవ్వరు నీకు గతి? శ్రీహరికృప ఒక్కటే. కాబట్టి ఈ సంసారపు వునికికి గురి కేవలం ఆ దేవదేవుని దయ. కనుక తండ్రీ! మమ్మల్ని పాలలోముంచినా నీటిలో ముంచినా నీదే భారం అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ప్రభూ! మేము నీ శరణాగతులము. మమ్మల్ని నీటిలో ముంచినా (చెడు చేసినా), పాలలో ముంచినా (మేలు చేసినా) నీ చిత్తము (నీ ఇష్టం). దీనిని అందరికీ చాటితిని-నీకృపయే ఈ సంసారమునకు (జగతికి) గురి (కావలసినది).

ఓ శ్రీహరీ! నా ఆత్మలో నెలకొనివుండుటకు నీవే గురి (నీవే నా లక్ష్యము). నా శరీరాంగాలకు గురి పవిత్రమైన అరుదైన నీ శంఖ చక్రముల ముద్రలు. మేము ఇన్ని వ్రతముల నాచరించుచున్నాము. వీటికి మేము యెంచుకొన్న 'గురి' పరమపదము (కైవల్యము). మీ దిష్టపు నాలుకకు (నాలుక ఉపదేశమునకు) గురి "నమో నారాయణ" అనే నీ పవిత్ర మంత్రము.

ఓ గోవిందుడా! నా దాస్యమునకు గురి నీ పాదసేవ. మరి నా భక్తికి గురి యెవరు? హరిదాసులే కదా! నా గత పాప నివారణార్థం నేను అనేక పుణ్య కర్మలు చేస్తున్నాను. వీటిని నాచేత చేయిస్తున్నది మా ఆచార్యుడే. కావున నా కర్మలన్నింటికీ ఆచార్యుడే గురి. మరి ఈ నా జన్మకు గురి నీ శరణాగతి మాత్రమే.

నన్ను రక్షించుటకు గురి నగవులొలికే శ్రీపతి. అసంఖ్యాకులు చేసే తపస్సునకు గురి శ్రీహరి నామసంకీర్తనము. మరి అఖండమైన జ్ఞానమునకు గురి తిరుమణి (పవిత్రమైన నుదుటి నామము అనే బొట్టు). ఓ శ్రీవేంకటేశ్వరా! అన్నిటినీ మించిన గురి నీవే తండ్రీ!

పద్యవివరణ:

కం.॥ **గురి సంసారంబునకును**
హరికృపయే, భారమంత యతనిదె సుండీ!
గురినన్ను గావ శ్రీపతి
హరి సంకీర్తనమె "గురి" కదా! తపములకున్

సంఖ్య: IV/36 రాగం : సామంతం
కీర్తన : బొడ్డు తామెరలోన గడ్డి వయసు పెద్ద

సామంతం

7 బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁ గన్నట్టివాఁడు పిన్నవాఁడు ॥పల్లవి॥

బిరుసైనదొకకొండ పెనుబాముతోఁ జుట్టి
బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు. ॥బొడ్డు॥

బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోఁగూడ
పెడచేతనే వేసెఁ (వేసేపి?) బిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపే పిన్నవాఁడు ॥బొడ్డు॥

ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై
పెక్కురూపములైన పిన్నవాఁడు
ఇక్కడఁ దిరువేంకటేశుఁడై జగమెల్ల
పిక్కిటిల్లినవాఁడు పిన్నవాఁడు ॥బొడ్డు॥ 36

ఉపోద్ఘాతము:

పిన్నవాడు అంటే చిన్నవయసున్న పాపడు అని అర్థం. ఈ కీర్తనలో ఈ పిన్నవాడు యెటువంటివాడో వివరిస్తున్నారు అన్నమయ్య. కొన్ని

మాటలకు అర్థాలు నిఘంటువులో దొరకవు. ఉదాహరణకు గడ్డి వయసు పెద్దబిడ్డ గన్నట్టి అంటే గడ్డము వుండే వయస్సు వున్న పెద్దకొడుకునే తానే కన్నవాడు అని అర్థం. అంటే గడ్డాలు మీసాలు వున్న బ్రహ్మదేవుని తానే తల్లిలేకుండా కన్నవాడు అన్నమాట. అటువంటి పిన్నవాడెవరు? ఇంకెవరు... నారాయణుడు. ఈ కీర్తన పౌరాణిక వాఙ్మయంతో పరిచయం వుంటేగానీ వివరించటం కష్టం.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! బొడ్డుతామెరలోన (తన నాభినుండి ఉద్భవించిన కమలములోంచి), గడ్డి వయసు (గడ్డము వచ్చేవయస్సువున్న) పెద్ద బిడ్డన్ (పెద్దకొడుకును) కన్నట్టివాడు (తానే కన్నట్టివాడు) పిన్నవాడు (పిల్లవాడా!) ఏమి చోద్యము!!

ఒక కొండ బిరుసైనది (ఒక పర్వతము అతి కఠినమైనది వున్నది). దానిని పెనుబాముతోజుట్టి (చాల పొడుగైన సర్పముతో బిగించి) బిరబిరనే త్రిప్పె (అంత పెద్ద పర్వతాన్నీ గిరగిరా కవ్వములా త్రిప్పినాడు. (శ్రీహరి క్షీరసాగరమధనమున మందర పర్వతాన్ని వాసుకి చేత కవ్వములా మధింపజేసి అమృతావిష్కరణకు దేవతలకు సహాయపడ్డాడు). ఇంతచేసినవాడు పిన్నవాడా? ఇంకొక కొండవున్నది. అది గురుతైన కొండ (ప్రసిద్ధికెక్కిన పర్వతము). అదే గోవర్ధన పర్వతము. ఈతడు ఆ కొండను గొడుగులాగా ఒక చేతి పెరికి పట్టుకొని ఇంద్రుడి రాళ్ళవాన నుండి గోకులాన్ని రక్షించాడు. ఇది పిల్లగాళ్లు చేసే పనియేనా?

శిశుపాలుడు అనే తన మేనత్తకొడుకు, బెడిదంపు పెనుమోతతో (పరుష వచనములాడుచూ గొప్ప రండెలు వేస్తే) వాడిని పెడచేతనే (చేతి వెనుక

భాగంనుంచి సుదర్శన చక్రాన్ని తెప్పించి తల నఱికి వేశాడు). ఔరా! సుదర్శన చక్రం తెప్పించేవాడు పిన్నవాడా? మధురానగరంలో జగత్ప్రసిద్ధుడైన చాణూరుడు అనే మల్లయోధుడున్నాడు. వాడు పర్వత కాయుడు. శ్రీకృష్ణుడు వాడిని పట్టి పడవేసి వాడి యెదురుఱొమ్ము మీద తొక్కి పిడికిటితో ఒక గుద్దు గుద్ది చంపివేశాడు. ఇంకా మీరు వీడు చిన్నవాడు అనుకొంటున్నారా?

ఇక పెద్దవాడయ్యాక తాను రక్షించిన పదియారువేలమంది రాచకన్నెలను వారి కోరిక మేరకు తానే పెండ్లాడి పదియారువేల భవనాలలో వుంచి పదియారువేల కృష్ణులై ప్రతిచోటా తన గృహస్థ ధర్మం నెరవేర్చాడు. నారదుడు ఇది చూద్దామని వచ్చి పెక్కురూపములనున్న ఆయనను చూచి బిక్కమొగము వేశాడు. అటువంటి చతురుడు పిన్నవాడా? ఇక్కడ శ్రీవేంకటాద్రి మీద శ్రీవేంకటేశ్వరుడై జగమెల్లా పిక్కటిల్ల (సుప్రసిద్ధుడై) సర్వులను రక్షించే ఈ దేవదేవుడు పిన్నవాడటయ్యా? మీకు బుఱ్ఱ వున్నదా?

పద్యవివరణ:

ఆ.వె. ‖ **వీడు పిన్నవాడ!! విశ్వాత్ముడీతండు**
వేంకటాద్రి మీద విభుడు తానె
పిన్నవయసువాడు వెన్నుడీ జగపతి
వీని లీల దెలియ వేరికగును?

సంఖ్య: IV/3 రాగం : కళ్యాణి
కీర్తన : అచ్యుతుశరణమే అన్నిటికిని గురి

కళ్యాణి

8 అచ్చుతు శరణమే అన్నిటికినిగురి
హెచ్చుకుందు మరి యెంచగనేది ‖**పల్లవి**‖

యోని జనకమగు యొడలిది
యే నెలవైనా నేటి కులము
తానును మలమూత్రపు చెలమ
నానాచారము నడచీనా ‖**అచ్చుతు**‖

పాప పుణ్యముల బదుకిది
యే పొద్దు మోక్షం బెటువలె దొరకు
దీపన బాధల దినములివి
చూపట్టి వెదకగ సుఖమిందేది ‖**అచ్చుతు**‖

మరిగిన తెరువల మనసు యిది
సరవినెన్న విజ్ఞానంబేది
యిరవుగ శ్రీ వేంకటేశ్వరుడే
వెరవని కంటే వెలితిక నేది ‖**అచ్చుతు**‖

ఉపోద్ఘాతము:

జీవితం అన్నాక హెచ్చుతగ్గులు వుంటూనే బ్రతకాలి. ప్రతిసారీ ఆధిక్యంలో వుంటామనే నమ్మకంలేదు. మరి దేన్ని మంచి అని యెంచుతాము, దేన్ని చెడు అని యెంచుతాము? తల్లి కడుపులోంచి అందరూ ఒకేలా పుడుతున్నారు. ఒకడి గొప్ప యేమిటి, ఒకడి తక్కువేమిటి? అసలు వీడు అమ్మకడుపులో మలమూత్రాల చెలమలో కదూ తాను భూమ్మీదకువచ్చేదాకా గడిపింది? వీడు

పుట్టినదగ్గరనుంచి చచ్చేదాకా పాపపుణ్యాలతోనే బ్రతికాడు. మోక్షం యెలా వస్తుంది? అచ్చుతశరణమే అన్నిటికినీ గురి అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

అన్నిటికి (సమస్తమునకు) గురి (లక్ష్యము), ఒక్కటే సుమా! అది అచ్చుతు శరణమే. మరొకటి కాదు. ఎంచగ (లెక్కించి చూస్తే) మరి ఇందులో హెచ్చు కుందులు (యెక్కువ తక్కువలు) లేవు. శరణాగతులందరూ ఆయనకు సమానమే. ఈ హెచ్చుతగ్గులు మనము కల్పించుకొన్నవి.

ఈ శరీరం యొక్క ఆవిర్భావం యెక్కడనుండి వచ్చింది? ఏ నెలవైనా (ఏ చోటునైనా) అంతేకాక తేడా వున్నదా? ఇక యెక్కడి కులము? ఆలోచించండి. పోనీ ఈ జీవి తల్లి గర్భంలో యెంత హీనంగా వున్నాడో చూడండి. మల మూత్రాల చెలమ (రొంపి)లో గడిపాడు కదా! ఇంకా వీడి ఆచారాలు యేమిసాగుతాయి?

ఈ జీవి అమ్మకడుపులోంచి బయటకు వచ్చింది మొదలు అనేక పాప పుణ్యాలు రెండూ చేస్తూనే వున్నాడు. ఏదో ఒకటి అనుభవిస్తూనే వుండే వీడికి మోక్షం యెట్లా దొరుకుతుంది? వీడి పాపపుణ్యాలననుసరించి వీడిదినములన్నీ యేదోవొక బాధతో నెట్టుకు రావలసిందే. ఇక ఇందులో చూపించి వెదకాలంటే సుఖము అనేది దొరుకుతుందా?

ఇకపోతే ఈ జీవుడికి ఒక మనస్సు అఘోరిస్తుంది. దాంట్లో కలికమేసి చూసినా విజ్ఞానం (భగవత్ జ్ఞానం) అన్నదే కనబడదు. ఇక మరి ఈ జీవుడి గతి ఇంతేనా? కాదు, యేదో ఒక నాటికి శ్రీ వేంకటేశ్వరుడే, వెరవని (ఉపాయమని) కంటే (తెలుసుకొంటాడు.) ఇరవుగ వెలితి ఇకనేది? (ఇక వాడికే లోటూ వుండదు).

పద్యవివరణ:

చం.॥ **వెరవక పాపపుణ్యముల వేదనజెందుచు జీవితాంతమున్**
యెరుగకనే సుఖంబు చరియించును జీవుడు తల్లి గర్భమున్
తెరలిన కాలమున్ మఱచు, దిక్కని వేంకటనాథు నమ్మడే?
హరిశరణార్థులే ఘనులు, అన్నిటికిన్ గురి ఆ శరణ్యమే.

సంఖ్య: IV/526 రాగం : రామక్రియ
కీర్తన : వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు

రామక్రియ

9 వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు
మూఁడుమూర్తులతేజపుమూలమీతఁడు ॥పల్లవి॥

పంతముతో పాండవపక్షపాతి యీతఁడు
వింతలేని విదురునివిందు యీతఁడు
మంతుకెక్కినద్రౌపదీమానరక్షకుఁ డీతఁడు
చెంతనే వుద్ధవుపాలి చింతామణి యీతఁడు ॥వీఁడివో॥

మందగొల్లెతలకెల్లా మంగళసూత్ర మీతఁడు
కందువ నక్రూరునిభాగ్యం బీతఁడు
నందగోప యశోదల నవనిధాన మీతఁడు
అందపురుక్మిణీ మనోహరుఁడీతఁడు ॥వీఁడివో॥

దేవకీవసుదేవులదివ్యపద వీతఁడు
భావింప నందరిపరబ్రహ్మ మీతఁడు
కైవశమై దాసులకు కల్పవృక్ష మీతఁడు
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతి యీతఁడు ॥వీఁడివో॥ **526**

ఉపోద్ఘాతము:

వీడేవో విట్ఠలేశ్వరుడై కొలువుదీరియున్నాడు. ఈతని మూల తేజస్సునకు కారణమేమంటే, బ్రహ్మవిష్ణు మహేశ్వరులని పిలువబడే ఆ ముప్పురికి మూలమైన పరబ్రహ్మము ఈ విట్ఠలదేవుడే అంటున్నారు అన్నమయ్య. అటుపైన ఆ స్వామి లీలలన్నీ వివరిస్తున్నారు. కైవశమై దాసుల పాలిటి కల్పవృక్షమైన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఈ విట్ఠలుడేనట.

తాత్పర్య వివరణ:

ఈ విట్ఠలేశుడు వీడివో (విడిదియై ఇదో) వీడే కొలువుదీరియున్నాడు. ఈతడు మూడు మూర్తుల (త్రిమూర్తులని పిలువబడే) బ్రహ్మవిష్ణు మహేశ్వరుల తేజోమూలము (తేజస్సునకు ఆదిమూలము).

ఈతడు తననందరూ పాండవపక్షపాతి అని విమర్శిస్తూ వున్నా లెక్కసేయక ధర్మం వైపే వున్నాడు. కడజాతి వాడైనా విదురుడు ధర్మమూర్తిగావున ఆతని ఇంటనే విందు స్వీకరించిన ధర్మమూలము. సభకీడ్వబడి కౌరవుల చేత వలువలొలువబడిన ద్రౌపది పాలిటి మానసంరక్షకుడీ, దేవదేవుడే. అర్జునునివలె తనకే శరణాగతుడైన ఉద్ధవునికి ఉద్ధవగీత వినిపించి ధన్యుని చేసి ఆతని పాలిటి చింతామణియైనాడు.

నందవ్రజమున గొల్లెతల మందకు, వారి మనోకామనలు తీర్చి మంగళసూత్రమై మానసికముగా మగడైనాడు. అక్రూరునికి ఒకే సమయంలో రెండుచోట్ల కనుపించి తాను అవతార స్వరూపుడనని గ్రహించే భాగ్యము ప్రసాదించాడు. ఇక యశోదా నందగోపులకు ఈ శ్రీకృష్ణదేనవనిధానము (కుబేరుని నవనిధులవంటి సౌభాగ్యము). ఆ తరువాత రుక్మిణీదేవి తనను వలచి బ్రాహ్మణునితో సందేశం పంపించి మనోహరా నన్ను కాపాడమంటే పరిణయమాడిన యదువల్లభుడు.

ఇతడు తనను కన్న దేవకీవసుదేవులకు తన పుత్రపౌత్ర వాత్సల్యం అనుభవప్రాప్తే కాక అంత్యమున మోక్షముకూడా ప్రసాదించాడు. భీష్మాదులందరూ అందుకే ఆయనను పరబ్రహ్మగా భావించారు. ఈనాడు కలియుగంలో శ్రీవేంకటాద్రిమీద శ్రీపతియై తన దాసులకు తాను కైవశమై (స్వాధీనుడై) వారిపాలిట కల్పవృక్షమై వారి కోరికలను తీరుస్తున్నాడు ఇతడే.

పద్యవివరణ:

ఉ.॥ **పాండవపక్షపాతియట పాయకద్రౌపదిమానదాతయున్**
మెండుగ గోపకన్నెలకు మేటిమగండట విట్ఠలేశుడున్
నిండుగ మూడుమూర్తులకు నిక్కపు మూలము బ్రహ్మమీతడే
అండగు వేంకటేశ్వరుడు ఆర్తులదాసుల కల్పవృక్షమౌ.

సంఖ్య: IV/527 రాగం : లలిత
కీర్తన : ఈతని మహిమలు యెంతని చెప్పెద

లలిత

10 ఈతని మహిమలు యెంతని చెప్పెద
చేతులమొక్కెదఁ జెలఁగుచు నేను ॥పల్లవి॥

శ్రీనరసింహుడు చిన్మయమూరితి
నానావిధకరనఖరుఁడు
దారుణదైత్యవిదారుఁడు విష్ణుఁడు
తానకమగు మా దైవంబితఁడు ॥ఈతని॥

అహోబలేశుఁడు ఆదిమపురుషుఁడు
బహుదేవతాసార్వభౌముఁడు
సహజానందుఁడు సర్వరక్షకుఁడు
యిహపరములొసఁగుయేలిక యితఁడు ॥ఈతని॥

కేవలుఁడగు సుగ్రీవనృసింహుఁడు
భావించ సుజనపాలకుఁడు
శ్రీవేంకటేశుఁడు చిత్తజజనకుఁడు
వేవేలకు నిలువేలుపు యితఁడు ॥ఈతని॥ **527**

ఉపోద్ఘాతము:

అహోబలంలోని సుగ్రీవనృసింహునిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఈ స్వామి మహిమలెంతని చెప్పగలను? నావల్ల అయ్యే పనియేనా? అందుకనే రెండు చేతులూ యెత్తి మ్రొక్కుతాను, అని అంటున్నారు. దైత్యులను మట్టుబెట్టటానికి వచ్చిన విష్ణువే ఇతడు. ఈ నరసింహుడు చిన్మయమూర్తి. అహోబలంలో వెలసిన ఆదిపురుషుడు. ఈ

సుగ్రీవ నరసింహుడు కైవల్యపుదాత. అంతేకాదు ఆ యేడుకొండలపై వెలసిన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఆయనే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈతని (ఈ నృసింహుని) మహిమలు యెంతని చెప్పెద (వివరించెదను)? నేను చెలగుచు (అతిశయించుచూ) చేతులెత్తి ఈ స్వామికి మ్రొక్కెదను.

ఈ శ్రీ నరసింహుడు చిన్మయమూర్తి (చిదానందస్వరూపుడు). ఈయన నానావిధ (అనేక విధములగు) నఖములను (గోళ్ళను) ఆయుధములుగా వాడిన నఖరుడు. దారుణ (భయంకరమైన) దైత్య (రాక్షసుని) విదారుడు (చీల్చి సంహరించినవాడు). ఈయనే విష్ణువు. ఇతడే తానకమగు (సుస్థిరుడైన) మా దైవము (ఇలవేల్పు).

ఈ అహోబలేశ్వరుడు ఆదిమపురుషుడు (ఆదిమూర్తి). దేవతలందరికీ ఈయనే సార్వభౌముడు (చక్రవర్తి). ఈయన ఎపడూ సహజానందము (ఆత్మానందం)లో వుంటాడు. ఇహపరములు (ఇహలోకమున) ప్రాపంచిక సుఖములు, పరలోకమున దివ్య సుఖములు ఒసగులోకపాలకుడు ఈతడే.

కేవలుడగు (పరమాత్మయైన) ఈ సుగ్రీవనరసింహుడు ఆలోచిస్తే సజ్జనులకు యేలికవంటివాడు. ఈ మహానుభావుడే మన్మథుని తండ్రిగారైన శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఇతడు వేవేలకున్ (వేలాదిమంది భక్తులకు) ఇలవేలుపు (ఇంటి దైవము).

పద్యవివరణ:

తే.గీ.॥ **మహిమలెంతని చెప్పెద మనవిజేసి**
చెలగి మ్రొక్కెదనితనికి చేతులెత్తి
ఈ అహోబలేశుడు దీర్చు నిహముపరము
వేంకటేశుడు యీతడే శంకలేల?

సంఖ్య: IV/282 రాగం : ముఖారి
కీర్తన : కొలువరో మొక్కరో కోరి తలచరో

ముఖారి

11 కొలువరో మొక్కరో కోరి తలఁచరో
చెలఁగి మనల రక్షించీని వీఁడె ॥పల్లవి॥

పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు
వేయినామములవెన్నుఁడు
పాయకకొల్చినభక్తప్రపన్నుఁడు
యీయెడనే వరములు యిచ్చీని వీఁడే ॥కొలు॥

పరిపూర్ణుఁడు మహానుభావుఁడు
తిరమగు దేవాధిదేవుఁడు
పరమానందస్వభావుఁడు
గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె ॥కొలు॥

తెలియుఁ డీతఁడె దేవాగ్రగణ్యుఁడు
వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు
అలరఁగ శ్రీవేంకటాచలేశపుణ్యుఁడు
నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె ॥కొలు॥ **282**

ఉపోద్ఘాతము:

నల్లబల్లి అనే గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. మనల్ని రక్షించగల అనాథరక్షకుడు వీడే. వీనిని ధ్యానించండి పూజించండి. మీ కోరికలు నెరవేరుటకు మొక్కండి అని ప్రబోధిస్తున్నారు. నవ్వులొలికిస్తున్న ఈ ప్రసన్నమూర్తే అక్కడ తిరుమలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడూను అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! కొలువరో (ఈ నల్లబల్లి చెన్నకేశవుని సేవించండి). కోరి మొక్కరో (మీకు అభీష్టములైన కోర్కెలను కోరుకొని అవి నెరవేరాలని ఈ స్వామికి మొక్కండి). తలచరో (ఈ దేవుని ధ్యానించండి). వీడె (ఈ దేవదేవుడే) చెలగి (అతిశయించి) మనందరినీ రక్షించును.

ఈ నల్లబల్లి చెన్నుడు పాయపువాడు (మంచి కోడె వయసులో వున్నవాడు). ఈయనే వేయినామములతో కీర్తించబడెడి శ్రీకృష్ణపరమాత్మకూడా. ఎన్నడూ తనపై నమ్మకం పాయక (వీడక) కొలిచే తన భక్తులకు అతిప్రసన్నుడు. ఇదిగో చూడండి వీడె ఇక్కడికిక్కడే వరములనెలా ఇచ్చేస్తున్నాడో!

ఈ చెన్నకేశవుడు పరిపూర్ణుడైన మహానుభావుడు. తిరమగు (సుస్థిరమైన) దేవదేవుడు. ఎప్పుడూ పరమానందము తన స్వభావంగా కలవాడు. వీడె (ఈస్వామే) గరిమన్ కరుణతో (అద్భుతమైన దయాస్వభావముతో) గాచీని (సంరక్షిస్తాడు).

ఓ మానవులారా! ఈతడే దేవతలందరిలోనా అగ్రగణ్యుడని తెలియండి. వలనుగ (అనుకూలుడై) యోగీంద్రులకు, వరేణ్యుడు (ముఖ్యుడు). ఈయనే శ్రీవేంకటాచలమున నెలకొన్న పుణ్యుడు (పుణ్యాత్ముడు). వీడె (ఈయనే)c నల్లబల్ల చెన్నుడై భక్త ప్రసన్నుడై నలి నవ్వులొలికిస్తున్నాడు (మొలక నవ్వులు చిందిస్తున్నాడు).

పద్యవివరణ:

ఆ.వె.॥ **నల్లబల్లిలోన నగుమోము చెన్నుడు**
వేయిపేర్లవాడు వెన్నుడితడు
కొలువుదీరిగాచు తలచేటి భక్తుల
ఇతడె తిరుమలయ్య ఇది నిజంబు

సంఖ్య: IV/525 రాగం : బౌళిరామక్రియ
కీర్తన : వీడివో కలశాపుర వీరహనుమంతుడు

బౌళిరామక్రియ

12 వీఁడివో కలశాపుర వీరహనుమంతుఁడు
వాఁడిమిమెరసినట్టివజ్రపాణి యితఁడు ॥పల్లవి॥

చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తలకొన్న రాముని ప్రతాపపువాఁడు
యెలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు
కలగుండు వడ లంకఁ గాలిచినవాఁడు ॥వీఁడివో॥

మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయమువాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రముల చదివినవాఁడు
పగటున మీఁదిబ్రహ్మపట్టమేలేవాఁడు ॥వీఁడివో॥

యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు
చెప్పఁగొప్తైనమహిమఁ జెన్నొందువాఁడు
ముప్పిరి శ్రీవేంకటేశుమూలబలమైనవాఁడు
వొప్పగు వరా లిందరి కొసగేటివాఁడు ॥వీఁడివో॥

ఉపోద్ఘాతము:

కలశాపురంలో వెలసిన వీరాంజనేయస్వామిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆచార్యులవారు హనుమంతుడు రామబంటుగా చేసిన ఘనకార్యాలను మననం చేస్తూ కొసమెరుపుగా ముప్పిరి శ్రీవేంకటేశు మూలబలమైనవాడు అని వేంకట మకుటంతోనే కీర్తన ముగిస్తున్నారు. ప్రస్ఫుటంగా కనుపిస్తున్న ఈ స్వామి వజ్రమంతటి కఠినమైన చేయి మెఱిసిపోతున్నదట. అంతేకాదు వరాలివ్వటంలో కూడా ఈ హనుమంతుడు దిట్టయే.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! వీడివో (ఇదిగో వీడే) కలశాపురమున వెలసిన వీరహనుమంతుడు. ఇతడు వాడిమి మెరసినట్టి (తేజస్సుతో మెరిసిపోతున్న) వజ్ర పాణి (వజ్రసదృశమైన అరచేయి కలవాడు).

ఈ మహానుభావుడు, చలపట్టి (కృతనిశ్చయుడై) జంగచాచి (తన జంగను, అనగా పిక్కను బార చాచిన వాడై) ఇతడు నూరుయోజనముల జలధిని దాటినాడు. ఇతడు శ్రీరాముని ప్రతాపమును తలకొన్నవాడు (కార్యరూపం దాల్చినవాడు). ఎలమి (సంతోషముతో) సీతమ్మకు శ్రీరాముని ఉంగరమును అందించి మెప్పు పొందిన వాడు. కలగుండువడ (గొప్ప క్షోభ కలుగునట్లు) లంకానగరమును కాల్చివేసినవాడే ఈ వీరహనుమంతుడు.

ఈ రామబంటే, మగిడి (కిష్కింధకు మరలివచ్చి) రాఘవునకు సీతమ్మ చూడామణిని ఆనవాలుగా అందించినాడు. తన శక్తి యేపాటిదో చూపుటకు గగనము మోచిన (ఆకాశమునే మోసిన) తన శరీరమును పెంచి చూపించాడు. సూర్యుడు యెలా ప్రయాణిస్తుంటే అలా తన తలత్రిప్పి శాస్త్రములన్నిటినీ ఆయన నుండి నేర్చుకొన్నాడీ హనుమంతుడు. అందుకనే రాబోయే కల్పములో ఈయన బ్రహ్మపదవిని నిర్వహించబోతున్నాడు.

ఇల (భూలోకంలో) ఈ కలశాపురములో యిప్పుడూ నేటికీ ప్రాణమున్న వానిలా ఊపిరిపీలుస్తూ సాటిలేని దేవుడై అతిశయించి యున్నాడు. రకరకములైన వినూత్న మహిమలను ప్రదర్శించువాడు ఈ స్వామి ముప్పిరి (సంతోషంతో) శ్రీవేంకటేశ్వరునికి మూల బలము ఈయనే. తన భక్తులకు ఒప్పయిన అనేక వరములను ఈ వీరహనుమంతుడు అనుగ్రహిస్తున్నాడు.

పద్యవివరణ:

కం.॥ **వీడే కలశాపురమున**
వాడిమిమెరసేటివజ్రపాణి, చెలగుచున్
కూడిన వేంకటపతికిని
తోడుగు బంటాయె హనుమతొలగని నీడై

సంఖ్య: IV/209 రాగం : కేదారగౌళ
కీర్తన : ఇందిరానాథుడవు ఇందరికి నేలికవు

కేదారగౌళ

13 ఇందిరానాథుఁడవ యిందరికి నేలికవు
చిదరవందరలైన చింతలు మరేలా ॥పల్లవి॥

వుండుమంటే నుండవీ(డినవి?) వూరకే బ్రహ్మాండాలు
నిండుమంటే నిండినవి నీరధులెల్లా
మెండగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె
వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా ॥ఇంది॥

పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచినదేవతలెల్ల
అట్టే యణఁగిరిగా అసురలెల్ల
పట్టిన నీ చలమిదె బహుళస్వతంత్ర మిదె
వెట్టిదైవాలపనులు వేరే మరేలా ॥ఇంది॥

కమ్మంటే నాయను కైవల్యపదవులు
రమ్మంటే వచ్చె వేదరాసులెల్లను
కమ్మిన శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీకు
యిమ్ముల నీమహి మిదె యితరములేలా ॥ఇంది॥ **209**

ఉపోద్ఘాతము:

కడప (దేవునిగడప) లో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఇందరికి ప్రభువువైన ఇందిరానాథుడవు నీవే. నీవు నా యేలికవై నన్ను కాపాడుతుంటే నన్ను చిందరవందర (గజిబిజి) చేసే చింతలు (దిగుళ్ళు) మరేల (మరెందుకు) అంటున్నారు. దేవతలంతా నీవు పుట్టమంటే పుట్టారు. రాక్షసులంతా నీవు చావమంటే చచ్చారు. నీవు సర్వ స్వతంత్రుడవు. ఆ వెట్టి దైవాలు నీకు సరితూగుతారా స్వామీ! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! నీవు ఇందిరానాథుడవు. ఇందరికీ ఈ త్రిభువనాలలోవున్న సర్వులకు యేలికవు (దొరవు). నీవు మాకు రక్షకుడవైతోడుండగా మాకు చిందరవందరలైన (గజిబిజి చేసే) చింతలు (దిగుళ్ళు) మరేల? (ఇంకా యెందుకు?)

ఈ సృష్టిలో అనేకమైన బ్రహ్మాండాలు వున్నాయి. అవన్నీ నీవు వూరకనే వుండవద్దు అంటే మరుక్షణంలో వుండవు. అసలు ఈ సముద్రాలలోకి నీరెలావచ్చింది? అవి నీవు నిండమంటే నిండాయి. రేపు నీవు వద్దంటే వాటిలో ఒక్కచుక్క నీరుండదు. ఈ సృష్టి అంతా నీ వినోదం కోసం నీ ప్రతాపము చూపుటకు నీవు చేసికొనినదే. నీవు వుండగా వూరకే పరదేవతలను కొలువవలసిన అవసరం నాకేమిటి?

ఓ దేవదేవా! ఈ దేవతలంతా నీవు పుట్టమంటే పుట్టారు. త్రేతాయుగంలో కోతులుగా కూడా పుట్టారు కదా! అట్టే (అదేవిధంగా) అసురులంతా నీవు చావమంటే చచ్చారు. నీ చలమిదే (నీ పట్టుదల నీదే). నీవు అన్ని విధములా సర్వస్వతంత్రుడవు. నీవుండగా వెట్టి దేవాలతో (చిల్లర దేవుళ్ళతో) పనులు యెందుకయ్యా?

ప్రభూ! నీవు కైవల్యపదవుల (మోక్షము) కమ్మంటే నాయెను (కావాలనుకొన్నవారికి ఇయ్యగలవు). ఎవ్వనికైనా వేదవిద్య రావాలంటే రాదు. అది నీవు దయగొని వీనికి వేదవిద్యరావాలి అనుకొంటే వస్తుంది లేకపోతే రానేరాదు (ధారణయే వుండదు కదా!) కడపలో ఆవరించిన శ్రీవేంకటేశ్వరా! నీకు ఇమ్ముల (మనోజ్ఞమైన సృష్టిఅంతా) నీ మహిమే. ఇతరములు అనవసరము.

పద్యవివరణ:

ఉ.॥ **చిందరవందరైన పలు చింతలికన్ మరియేల, నమ్ముడీ**
ఇందరి నేలినట్టి విభుడీతడె యెంచిన ఇందిరాపతే,
ఎందుకు వెట్టి దైవముల యేపుగ గొల్చుట? వేంకటేశుడే
విందగు రాయడై కడపవీధులనేగెను బ్రోవయెల్లరన్.

సంఖ్య: XV/76 రాగం : బౌళి
కీర్తన : గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో

బౌళి

14 గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో
వోవల నీపాలఁజిక్క దోహో నా మనసు ॥పల్లవి॥

వొకటిపైఁ గాంక్షించు వొకటిపై వేసారు
వొకవేళ దుర్మాన మొడిగట్టును
వికలుఁడై యంతలోనే విషయపుబారిఁ జిక్కు
అకటా యిన్నిటాఁ దుమురాయఁబో నా మనసు ॥గోవింద॥

తలపోను నొకవేళ తమకించు నొకవేళ
వొలుఁ గోపము చల మొకవేళ
కలఁగించు నొక వేళ గర్వించు నొకవేళ
పొలసి యిన్నిటా వీదిఁబోయఁ బో నా మనసూ ॥గోవింద॥

సంతసించు నొకవేళ జయమందు నొకవేళ
పంతమాడు నొక మట్టుపడినవేళ
యింతలో నీవు శ్రీవేంకటేశ కావకయుండితే
రంతుల నేమీఁ జెప్పరాదువో నా మనసూ ॥గోవింద॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య చెప్పిన చక్కటి కీర్తననాస్వాదించండి. తండ్రి అంత పరిపుష్ఠి కఱువైనా భక్తిశృంగార అధ్యాత్మ కీర్తనలు చెప్పడంలో ఈయన దిట్టయే. నన్నేం చెయ్యమంటావు గోవిందా! నా ఈ పాపిష్టి మనస్సు నీపట్ల చిక్కదాయె. నేనెంత కుయ్యో! మొఱ్ఱో అని యేడ్చినా దీని దారి దీనిదే. ఇంత చంచలమైన, విషయలోలత్వముగల, కోపిష్టి గర్వపోతు మనస్సు నాకెందుకు పెట్టావు స్వామీ! నీవు కావకుండితే రంతులన్ యేమీ జెప్పరాదువో నా మనస్సు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

హే! గోవిందా! హే! కేశవా! నీకు కుయ్యో! మొఱ్ఱో (కుయ్యో! మొఱ్ఱో అని నీ కొఱకు యేడుస్తున్నానయ్యా!) ఇదేమిటి ప్రభూ! ఈ నా మనస్సు వోవల (ఒప్పుగా) నీపాల జిక్కదు (నీయందులగ్నముకాదు!) ఓహో! యేమి నా దౌర్భాగ్యము!!

ప్రభూ! ఈ నామనస్సుందే... ఇది ఒకటిపై గాంక్షించు (ఒకదాన్ని కోరుకుంటుంది). కానీ ఇంకోదానికోసం వెంపర్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు దుర్మార్గమైన పనులకు ఒడిగడుతుంది. మళ్ళీ అంతలోనే వికలత్వమునొంది విషయలోలత్వము నొందుతుంది. అకటా! (అయ్యో!) నా మనస్సు యిన్నిటా ఇన్ని విధాలుగ తుమురాయెబో (ముక్కలు ముక్కలయిపోయింది కదా!)

ప్రభూ! ఈ మనస్సువున్నదే ఒక్కొక్కప్పుడు నిన్ను తలపోస్తూ వుంటుంది.) ఒక్కొక్కప్పుడు తమకిస్తుంది. (చలించిపోతుంది). ఒక్కొక్కప్పుడు విపరీతమైన కోపమునకు లోనవుతుంది. ఒకప్పుడు మత్సరముతో వుంటుంది. ఒక్కొక్కప్పుడు పోట్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు విపరీతమైన గర్వమును పొందుతుంది. ఓ దేవా! పొలసి (కావాలని) నా మనస్సు నన్నిలా వీధిపాలు చేసిందయ్యా!

ఈ నా మనస్సు ఒక్కొప్పుడు విజయగర్వంతో గొప్ప సంతోషంతో వుంటుంది. ఒక మట్టుపడినవేళ (అణగారివున్నవేళ) పంతముకూడా నా మనస్సు పడుతుంది. అంతెందుకు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు కనుక దీన్ని దయదలచకుండావుంటే ఈ పాటికి రంతుల (భోగాసక్తమై) యేమయ్యేదో ఈ మనస్సు నేను చెప్పలేను.

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఏమిసెబుదునయ్య! హే! వేంకటేశ్వరా!**
పట్టదాయెనిన్ను పాపి "మనసు"
కుయ్యో! మొఱ్ఱో! నీకు గోవింద కేశవా!
పెద్ద తిరుమలయ్య వెతను బొందె.

సంఖ్య: I/310 రాగం : ఛాయానాట
కీర్తన : తలప వెనక నుయ్యి తగరు ముందట

ఛాయానాట

15 తలఁప వెనక నుయ్యి తగరు ముందట (?) దీనఁ
దొలఁగ నాకుఁ దెరువుదోప దేమి సేతు ॥పల్లవి॥

మమకార(ము) విముక్తి మార్గదూరము నీపై
మమతసేయక నాకు మనరాదు
మమత మేలో నిర్మమత మేలో దీని
క్రమము నక్రమము నేఁ గాన నేమిసేతు ॥తలఁ॥

కర్మమార్గము జన్మగతికిఁ జేరువ ని-
ష్కర్మము పాతకమునకుఁ దొడవు
కర్మిగావలెనో నిష్కర్మి గావలెనో యీ
మర్మంపుమదము మాన దేమిసేతు ॥తలఁ॥

శరణాగతరక్షకుఁడ వైనయట్టి
తిరువేంకటగిరిదేవుఁడా
పరిపూర్ణుఁడవో నీవు పరిచ్ఛిన్నుఁ డవో ని-
న్నరసి భజింప లేనైతి నేమిసేతు ॥తలఁ॥

ఉపోద్ఘాతము:

తగురు అంటే పొట్టేలు అని అర్థం. ఒకటి పరిస్థితి యెట్లా వున్నదంటే వాడిని పొడవడానికి కొమ్ములు తిరిగిన పొట్టేలు వాడి ముందునుంచి వస్తున్నది. పోనీ వెనుకకు తిరిగి పారిపోదామా అంటే వెనుక భాగాన పెద్ద దిగుడు బావి వున్నది. నాకు వేరే దారి కనుపడుట లేదు అని వాపోతున్నారు అన్నమ్య. నేను దిక్కుతోచనివాడనవుతున్నాను స్వామీ! మమకారం వదులుకోకపోతే విముక్తి లేదు, ముక్తి రాదు అంటారు. మరి

నీపై మమకారం చూపించకుండా నేను వుండలేను. అంటే ఇకనాకు ముక్తి వచ్చే దారే లేదా ప్రభూ! అన్నమయ్య శరణాగతి అసామాన్యము.

తాత్పర్య వివరణ:

ప్రభూ! తలప (ఆలోచిస్తే) నా అవస్థ చాలా దయనీయంగా వున్నది. నా వెనుక పెద్ద నుయ్యి (దిగుడు బావి) వున్నది. వెనకడుగేస్తే దాంట్లో పడిపోతాను. ఇక నా ముందర తగరు (కొమ్ములు తిరిగిన పొట్టేలు) కుమ్మటానికి సిద్ధంగా వున్నది. దీనన్ (దీనుడను) తొలగనాకు తెరవు దోపదు (తప్పించుకోటానికి దారి తెలియటంలేదు). ఏమిసేతు (యేమి చేయగలను?)

పెద్దలేమంటారంటే, మమకారము యెవరిపైన పెంచుకోరాదు. అది విముక్తి మార్గదూరము (ముక్తి మార్గం నుండి మనల్ని దూరం చేస్తుంది.) కానీ నాకేమో నీపై మమకారం వదులుకోవటం సాధ్యంకావటం లేదు. మరి నేను సందిగ్ధంలోవున్నాను. మమత మేలా? నిర్మమతమేలా? ఏది సక్రమమైనది? ఏది అక్రమమైనది? నాకేమీ గోచరమగుటలేదు. నేనేం చేయను తండ్రీ!

సరే! కర్మమార్గముననుసరిద్దాంలే అనుకుంటే దానివల్ల యేవేవో జన్మలను పొందటం తప్పించి నాకు ఒరిగేదేమున్నది? పోనీ యేమీ చేయకుండా, నిష్కర్మిగా వుందామంటే, అది పాతకమునకు తొడవు (పాపానికి హేతువు). అందుకని కర్మిగా వుండాలో నిష్కర్మిగా వుండాలో, దాని రహస్యమేమిటో కర్మిష్ఠినైతే కోరికోరి మదోన్మత్తుడనవటం దేనికా, అనిపిస్తున్నది.

శరణాగత రక్షకుడవైన ఓ తిరువేంకటేశ్వరా! నీకూ నాకూ పోలికేమిటి ప్రభూ! నీవు పరిపూర్ణుడవు. నీలో లోపం అనేదానికి ఆస్కారమే లేదు. మరి నేనో? నేనొక పరిచ్ఛిన్నుడను (సక్రమమైన మార్గాన్ని వదలివేసినవాడను). నిన్నరసి (నిన్ను చూచి కూడా) భజించలేకున్నాను. నేనేమి సేతును? నాకు దిక్కెవరు?

పద్యవివరణ:

చం.॥ **తలపగనుయ్యి నా వెనుక దారి యొకింతనెరుంగనైతిన**
న్నిలువున కుమ్మగా "తగరు" నిల్చునియున్నది నాదు ముందరన్
తొలగనశక్తుడైతినిక తోపదు యేమియు వేంకటేశ్వరా!
కొలుతును కావుమా శరణుకోరిన కాదన నీకు కాదురా!

సంఖ్య: I/411 రాగం : దేవగాంధారి
కీర్తన : మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి

దేవగాంధారి

16 మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి
తక్కిన వారు మీ కృప దప్పిన వారు హరి ॥పల్లవి॥

వున్నతపు సంపదల నోలలాడే యట్టివాఁడు
మున్నిటి జన్మాన నీకు మ్రొక్కినవాఁడు హరి
పన్ని పడనిపాట్లఁబరులఁగొలిచే వాఁడు
వున్నతి మిము సేవించ నొల్లని వాఁడు హరి ॥మిక్కి॥

పూని దేవేంద్రాదులై పొడవు కెక్కిన వారు
శ్రీనాథ మిమ్మునే పూజించినవారు హరి
నానానరకముల నలఁగుచుండే వారు
నానాఁడే నీ మహిమ నమ్మని వారు హరి ॥మిక్కి॥

పావనులై నిజభక్తి ప్రపన్ను లయ్యిన వారు
శ్రీ వేంకటేశ మిమ్ముఁ జేరినవారె హరి
వేవేలు దేవతల వెంటఁదగిలేటివాఁడు
కావించి మిమ్మెఱఁగని కర్మి యాతఁడే హరి ॥మిక్కి॥

ఉపోద్ఘాతము:

"నానాఁడు" అంటే ప్రతిదినము అని అర్థం. నానాఁడే అంటే 'ఏనాడూ' అనే నేటి కాలము మాటకి అన్నమయ్య కాలం నాటి రూపం. ఓ ప్రభూ! నానా నరకబాధలతో నలిగిపోయే వారెవరంటే యేనాడూ నీ మహిమను నమ్మనివాడు అంటున్నారు. మనం అష్టకష్టాలు పడుతున్నవారిని చూస్తుంటాం. వారంతా హరినిగాక పరులను సేవించే వారే అంటున్నారు. ఒక్క హరిదాసులు తప్పించి తక్కినవారంతా నీ దయను పోగొట్టుకొన్నవారే స్వామీ! అని నమ్మకంగా చెబుతున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! ఈ ప్రపంచంలో మిక్కిలి పుణ్యులు ఎవరయ్యా? అంటే మీ దాసులు మాత్రమే. తక్కినవారంతా మీ కృప దప్పినవారే (పోగొట్టుకొనిన వారలేనయ్యా) శ్రీహరీ!

ఈ ప్రపంచంలో కొంతమంది వున్నతమూ, అనంతము అయిన సిరి సంపదలలో నోలలాడుతుంటారు? ఎందుకో తెలుసా? అట్టివారు మున్నిటి జన్మలో (వారి గత జన్మలో) నీకు భక్తితో మొక్కినవారు. వాడి కర్మకొద్దీ అరిషడ్వర్గాలకు లోనై ఈ జన్మలో వాడు దుర్మార్గుడే కావచ్చును.కానీ గత జన్మలో నీ భక్తి వున్నందున ఈ జన్మలో సిరి సంపదలుంటాయి. మరికొంతమంది వుంటారు. వారు పన్ని (తప్పక) పడరానిపాట్లు పడుతూ పరులకు దాస్యం చేస్తుంటారు. ఉన్నతముగా మిమ్ము (శ్రీహరిని) సేవించనొల్లని (ఒప్పుకోని) వారే ఆ తిప్పలు పడుతున్నవారంతా.

ఓ శ్రీహరీ! దేవేంద్ర పదవినలంకరించి, పొడవుకెక్కినవారు (మంచి ఔన్నత్యమును పొందినవారు) వేరెవరో కాదయ్యా! శ్రీనాథా వారంతా పూని మిమ్ము భక్తితో కొన్ని జన్మలుగా నిత్యమూ పూజించినవారే సుమా! మరికొంతమంది వున్నారు. వారు నానా నరకయాతనలు, అష్టకష్టాలుపడుతూ నలిగిపోతుంటారు. వారెవరో తెలుసా? గత జన్మలో నానాడే (ఏనాడూ) నీమహిమను నమ్మని నాస్తికులు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తితో పావనులై, ప్రపన్నులైన (శరణాగతులైన) వారు మిమ్ము చేరుకొంటారు. ఓ హరీ! తక్కిన భ్రష్టులంతా, వేవేలు దేవతలు (రకరకాల దేవతల) నాశ్రయించి వారి వెంట తగులుతుంటారు. అట్టివాడు కర్మిష్టియై యజ్ఞయాగాలు ఆర్భాటంగా చేస్తాడు కానీ కావించి (సంగ్రహించి) యెన్నడు మీ తత్త్వమునెరుగడు.

పద్యవివరణ:

కం.॥ **మిక్కిలి పుణ్యులు హరి నీ**
లెక్కకు మిక్కుటములైన లెంకలు దాసుల్
తక్కినవారలు మీ కృప
ఒక్కింతయులేనివారు ఉర్వీరమణా!

సంఖ్య: IV/4 రాగం : బౌళి
కీర్తన : నిజమో కల్లో నిమిషములోననె

బౌళి

17 నిజమో కల్లో నిమిషములోననె
భజించువారల భాగ్యముకొలఁది ॥పల్లవి॥

వొకఁడు కనుదెరచి వున్నది జగమను
వొకఁడు కన్నుమూశొగి లేదనును
సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును
వెకలినరులు భావించినకొలఁది ॥నిజ॥

కడుపు నిండొకఁడు లోకము దనిసె ననును
కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు
తడవిన నిట్లనే దైవ మిందరికి
వెదగు నరులు భావించినకొలఁది ॥నిజ॥

ముదిసి యొకఁ దనును మోక్షము చేర్వని
తుదఁ బుట్టొకఁడది దూరమనును
యెదుటనే శ్రీవేంకటేశ్వరుఁ డిట్లనే
వెదకి నరులు భావించినకొలఁది ॥నిజ॥

ఉపోద్ఘాతము:

భగవంతుని వునికి నిజమా? కల్లయా? కొందరికి వారి జీవితాంతమూ తపస్సు చేసినా కానరాడు. కొందరికి నిమిషములో ప్రత్యక్షమవుతాడు. ఇదంతా యెందువలన జరుగుతున్నది? ఆ దేవదేవుని భజియించేవారి సుకృతమును బట్టి జరుగుతున్నది అంటున్నారు అన్నమయ్య. అసలిదంతా యెందుకు జరుగుతున్నది? దేవుడు వున్నాడా లేదా? అది వారి వారి భావన మీద ఆధారపడివున్నది. కళ్ళు తెరచిన వాడు ప్రపంచం వుందనుకొంటాడు. కళ్ళు మూసుకొన్నవాడు ప్రపంచమనేదే లేదంటాడు. సర్వేశ్వరుడు కూడా అంతే వెదకితే కనుపిస్తాడు. లేడులే అని వెదుకకుంటే కనబడడు.

తాత్పర్య వివరణ:

భగవంతుని వునికి నిజమో? కల్లయొ (అబద్ధమో) చెప్పుటెట్లు? కొందరికి నిమిషములో తన దర్శన భాగ్యం కలిగిస్తాడు. కొందరికి జన్మంతా ప్రయత్నించినా కనబడడు. అదంతా ఆ స్వామిని భజించేవారి భాగ్యము కొలది (సుకృతాన్నిబట్టి) వుంటుంది.

కళ్ళు తెరచుకొనియున్న ఒకడు, నిజమే ఈ జగము సత్యమే అంటాడు. కాని కళ్ళుమూసికొనిన ఇంకొకడు ఒగి (నమ్మకంగా) అసలీ జగత్తు లేనేలేదు అంటాడు. సకలము ఇదే విధంగా వుంటుంది. సర్వేశ్వరుడు కూడా ఇంతే. వెకలి (ఆసక్తితో) నరులు భావించినట్లే సర్వేశ్వరుడూ వుంటాడు. లోకముతీరే ఇంత.

ఒకనికి కడుపు నిండి తనిసినాడు (తృప్తి చెందినాడు) అనుకోండి. వాడికి లోకమంతా తృప్తి చెందినట్లు కనిపిస్తుంది. అదే కడుపులో తిండి సరిగా లేక వెలితివుంటే వానికి ప్రపంచమంతా కడమ (కొఱత)తో వున్నట్లే తోస్తుంది. తడవిన (విచారిస్తే) ఇందరికీ (లోకులందరికీ) దైవము కూడా ఇంతే సుమండీ! వెడగునరులు అవివేకులైన మానవులు భావించిన విధంగానే భగవంతుడుంటాడు.

ముసలివాడైన ఒకడు తనకు మోక్షము చేరువయైనదని అనుకొంటాడు. ఇంకొకడు తనకు పుట్టుకయే తిరిగి వుండదంటాడు. ఏమో యెవరికి తెలుస్తుంది? అంతా భావనయే కదా! మన యెదురుగావున్న ఈ శ్రీవేంకటేశ్వరుడూ ఇంతే కదా! శోధించి నరులు భావించిన కొలదీ ఆ స్వామి వుంటాడు. నిజమో కల్లయొ యెవరు తెలియగలరు?

పద్యవివరణ:

మ.॥ **నిజమో కల్లయొ నేర్వలేము జగమే నిక్కంబు భావించినన్**
త్యజియింపన్ సరికాదురా యెఱిగి సత్యంబిట్లు శోధించగా
అజునిన్ కన్న సురేంద్రవందితహరీ! ఆలింపుమమ్మెల్లరన్
భజియింపంగనె మానవాళి దయతో భజించు పాపంబులన్.

సంఖ్య: XV/416 రాగం : కుంతలవరాళి
కీర్తన : మానరాదు నీ కింక మముగావవలెను

కుంతలవరాళి

18 మానరాదు నీ కింక మముఁ గావవలెను
పేనిపట్టి నీకు నీవే బిరుదులై వున్నవి ॥పల్లవి॥

సరవి నిన్ను భక్తరక్షకుఁ డని నారదుఁడు
పరువడి లోకములఁ బాడిపాడి చాటినాఁడు
సరగ నీ యర్థములకు శాసనాలై వేదములు
మొరయుచు బ్రహ్మనాల్గుమొగముల నున్నవి ॥మాన॥

శరణాగతవజ్రపంజరుఁ డని వాల్మీకి
సురలకు రామకథ చూపి చెప్పె గుఱిగాను
పొరి నీ సుద్దు లివే పురాణపత్రికలై
పెరుగుచు వ్యాసుల పెట్టెలలో నున్నవి ॥మాన॥

తారకబ్రహ్మ మనవి తగఁ గాశిలో శివుఁడు
యేరుపరచి ప్రాణుల కెప్పుడుఁ జెప్పుచున్నాఁడు
యీ రీతి శ్రీవేంకటేశ యిందులకు సాక్షులు నీ వరాలు
ఆరూఢి గరుడగంభ మండ నేఁ డున్నవి ॥మాన॥

ఉపోద్ఘాతము:

ఇది తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి కీర్తన. పల్లవి కొద్దిగా భావించవలసివుంటుంది. ఓ దేవా! నీ కినుక మానరాదా? మమ్ము రక్షించరాదా? నీకున్న బిరుదేమిటి? ఆర్తజనరక్షకుడు కదా? మరి మమ్మల్ని యెందుకు రక్షించవు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీకున్న బిరుదులు నారదుడు, బ్రహ్మదేవుడు, వాల్మీకి, వ్యాసుడు, శంకరుడు యేనాడో పొగిడారు. నీ

గరుడధ్వజ దర్శనము చేతనే మాకు అనేక వరాలు లభిస్తున్నాయి. ఇంకా మేము యెవ్వరిని యేమికోరవలెనయ్యా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! నీ కింక (కినుక లేక కోపము) మానరాదు (విడిచిపెట్టరాదా!) మమ్ము గావవలెను. (మమ్మల్ని రక్షించవలసినది నీవేకదా!) పేనిపట్టి (నియోగింపబడి) నీకున్ ఇవే బిరుదులైవున్నవి. (నీ చేతనే నీకు బిరుదులై ప్రసిద్ధి చెందినవి).

నారదుడు నిన్ను సరవి (క్రమముగా) భక్త రక్షకుడు అని లోకములందు, పరువడి (క్రమముగా) పాడి పాడి (సన్నుతించి) చాటినాడు (ప్రచారము చేశాడు.) నీచేత శాసించబడిన వేదశాస్త్రములు నీ శాసనమువలె మొరయుచు (ధ్వనించుచు) చతుర్ముఖ బ్రహ్మగారి నాలుగు మొగములనుండి వెలువడి ప్రసిద్ధముగానున్నవి.

వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రమూర్తిగా రావణ వధకు అవతరించినావని దేవతలకు రామకథ ముందే వినిపించి, గుఱిగాను (నమ్మకంగా) నీవే శరణాగతులకు వజ్రపంజరమువలె రక్షకుడవవుదువని చాటినాడు. విశేషించి నీ కథలు (లీలలు) పురాణ పత్రికలై పౌరాణిక గాధలై వ్యాపించుచూ, వ్యాసులవారి పెట్టెలలో (అష్టాదశ పురాణాలలో) వున్నవి. అందరూ నేడు ఆ పురాణాలనే వ్యాపింప చేయుచున్నారు.

కాశీ నగరంలో పరమశివుడు దేహం వదలిన ప్రాణులకు యేరుపరచి (ఏర్పాటుగా) తారకబ్రహ్మ శ్రీరామచంద్రుడని రామనామం వారి అంత్యకాలంలో వారితో చెప్పించి ముక్తి ప్రసాదిస్తాడు. ఈ విధముగా ఓ శ్రీవేంకటేశ్వరా! యిందులకు (వీటన్నిటికీ) నీవు మాకిస్తున్న ఈ వరములే సాక్షి. నేడు ఆ రూఢి (యెక్కిన) నీ గరుడ ధ్వజమే ఆ వరములన్నీ అయివున్నవి ప్రభూ!

పద్యవివరణ:

ఆ.వె. **॥ మమ్ముగావ కినుక మానరాదా ప్రభూ!**
ఆర్తరక్షకుండవనెడి బిరుదు
పెద్దతిరుమలయ్య వేదరాసులు సాక్షి
విడువతగదు యనెను వేంకటేశ!

సంఖ్య: III/34 రాగం : వసంతవరాళి
కీర్తన : ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక

వసంతవరాళి

19 ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక
అహిశయనునిదాసు లంతవారు వేరీ ॥పల్లవి॥

సిరికలిగినవారు చింత లన్నిటనుఁ బాసి
నిరతపువర్గ (గర్వ?) ముతో నిక్కేరటా
సిరికి మగఁడయిన శ్రీపతి యేలి మ-
మ్మురయుచున్నాఁడు మాయంతవారు వేరీ ॥ఇహ॥

బలవంతుఁ డైనవాఁడు భయము లిన్నిటఁ బాసి
గెలిచి పేరువాడుచుఁ గెరలీ నటా
బలదేవుఁడైన శ్రీపతి మాయింటిలోన
అలరివున్నాఁడు మాయంతవారు వేరీ ॥ఇహ॥

భూము లేలేటివాఁడు భోగములతోఁ దనిసి
కామించి యానందమునఁ గరఁగీనటా
సేమముతో భూపతైన శ్రీవేంకటేశుఁడు మాకు
ఆముకొని వుండఁగా మాయంతవారు వేరీ ॥ఇహ॥

ఉపోద్ఘాతము:

కొద్దిపాటి సిరిసంపదలుంటే నిర్విచారంగా వుండటమే కాక గర్వముతో నిక్కుతూ వుండటం మానవసహజమే. కాని ఆలోచించి చూడండి కొద్దిపాటి వైభవానికే అంత గర్వమైతే సిరికి మగడైన శ్రీపతి మారక్షకుడు, మా యజమాని, మరి మాకెంత నిక్కువుండాలి చెప్పండి. మానవులందరికీ ఇహము (ఈ భూలోక వైభవాలూ) పరమూ (పరలోక సద్గతులు) ఈ

దేవదేవుని వలననే చిక్కుతున్నాయి. మేము స్వయంగా ఆ శేష శయనుని దాసులము. మా అంతటి వాళ్ళెవరండీ? అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! ఈతని వంక (ఈ శ్రీహరి మూలంగా) మాకు ఇహము (ఈ భూలోకంలో సౌఖ్యములు) పరమున్ (పరలోక ప్రాప్తికి తగిన అర్హతా) చిక్కే (లభ్యమవుతున్నాయి). అందువలననే అహిశయనుని (ఆదిశేషునిపై శయనించు శ్రీహరి) దాసులంతటి ఘనులు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

ఈ ప్రపంచంలో సిరి సంపదలు కలిగినవారు ఎట్టి చింత (దిగులు) లేక అధికమైన గర్వముతో నిక్కి వుంటారట. అది వారికి సహజము. మరి మా సంగతియేమిటి? మేము ఆ సిరికే (శ్రీదేవికే) మగడయిన శ్రీపతి యేలికలో వున్నందును ఆయనే స్వయంగా మా రక్షకుడు. మరి మా అంతటి వారు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

బలవంతుడైనవాడు ఒక్కసారి భయము వదలి గెలిచి పేరు సంపాదించగానే అందరూ అతనినే ఆశ్రయిస్తారు. శ్రీపతి అందరికంటే బలవంతుడైన మా ఇలవేల్పువలె అలరియున్నాడు. ఇక మా అంతటి గొప్పవారు వేరీ (ఏరీ ఎవరున్నారు?)

ఏదో కొద్దిపాటి భూమివుంటే దానిని యేలేటి వాడు (పరిపాలించేవాడు) భోగములలో దనిసి (వైభోగములలో తేలుతూ) కామించి (అనేకమైన కోరికలతో) ఆనందపరవశుడై కరగీనట (మమేకమై వుంటాడట). మరి భూదేవీ రమణుడైన శ్రీవేంకటేశ్వరుడు మమ్ము ఆముకొని (పైకొని) వున్నాడు. ఇక మాబోటి వారు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

పద్యవివరణ:

కం.॥ **చిక్కును ఇహపరములు, మరి**
దక్కును ఈ శేషశాయి దయ దాసులకున్
తక్కినవారలు సరియా?
చక్కని శ్రీవేంకటేశు శరణార్థులకున్

సంఖ్య: XV/23 రాగం : పాడి
కీర్తన : రామచంద్రా రామభద్రా రఘువీరా

పాడి

20 రామచంద్రా రామభద్రా రఘువీరా
నీ మహిమ దెలిసేరా నేఁటివారు ॥పల్లవి॥

అరయ జటాయువున కట్టె మోక్ష మిచ్చితివి
హరునివిల్లు విరిచి అలరితివి
యిరవై రాతికిఁ బ్రాణ మిచ్చితి వింతటి నిన్ను
నరుఁడంటా నుండిరిగా నాఁటివారు ॥రామ॥

నెమ్మది సరయువులో నించితి వైకుంఠము
పమ్మి మారుతికి బ్రహ్మపట్ట మిచ్చితి
దుమ్ములుగ రాక్షసులఁ దుత్తుమురు సేసితివి.
నమ్మరిగా రాజవంటా నాఁటివారు ॥రామ॥

యెందునుఁ జెడని పట్ట మిచ్చితి విభీషణుని
కంది పరశురాముని నంగవించితి
యిందునే శ్రీవేంకటేశ యెఱుఁగక దశరథ-
నందనుఁడే యనిరిగా నాఁటివారు ॥రామ॥

ఉపోద్ఘాతము:

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి రామరసాయనామృతాన్ని ఆస్వాదించండి. ఓ రఘువీరా! ఆనాటి వారు నీ మహిమ దెలిసేరా అంటే రామాయణ గాధల్లో ఆ సంగతి సందిగ్ధంగానే వున్నది. శివధనస్సును విరిచినా, అహల్యా శాపవిమోచనం గావించినా, సరయూ నదిలో వైకుంఠాన్నే నింపి చూపినా, పదివేలమంది ఖరదూషణాది రాక్షసులను చూస్తుండంగా ఒంటి చేతో మట్టికరిపించినా, పరశురాముని వివశుణ్ణి

చేసినా ఓహో! రాజశేఖరుడు మహాపరాక్రమశాలి ఈ దశరథ నందనుడు అన్నారుకానీ ఈయనే విష్ణువు అన్నారా? పోనీ నేటివారికైనా నీ మహిమపూర్తిగా తెలిసిందా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ రామచంద్రా! రామభద్రా! రఘువీరా! నేటి ప్రజలకు నీ మహిమ తెలిసిందంటావా? ఏమో! కాని నాటివారు మాత్రం నీవు నరుడవనే నమ్మారు.

ప్రభూ! ఆనాడు అరయ (అందరూ చూస్తుండగానే) జటాయువునకు అట్టే మోక్షమిచ్చితివి (సునాయాసముగా ముక్తి నొసగినావు). శివధనస్సును విరిచి అతిశయించినావు. రాయివలె పడివున్న స్త్రీకి (అహల్యకు) ప్రాణమిచ్చితివి (చైతన్య మొసగినావు). ఇంతటి (ఇటువంటి) నిన్ను, నాటి అయోధ్యా వాసులంతా నిన్ను నరునిగానే భ్రమపడినారు.

అందరూ చూస్తుండంగానే వైకుంఠాన్ని సరయూనదిలా చూపావు. నెమ్మదిగా నీవూ నీ తమ్ముళ్ళు ఒక్కొక్కరే వైకుంఠం చేరటం అందరూ చూశారు. నీకు అంత సేవ చేసిన మారుతికి (హనుమంతునికి) బ్రహ్మపదవిని అనుగ్రహించినావు. దుమ్ములగు (ధూళియొనర్చి) రాక్షసులను తుత్తురుము (పొడిపొడి) చేసినావు. మానవుడు యెంత రాజవంశస్థుడైనా అంతమంది రాక్షసులను చంపటమేమిటని అనక నీవు రాజువలనే నాటివారు నమ్మారు.

అవన్నీ అటుంచి విభీషణునికి రాక్షసుడైనా అభయమిచ్చి చిరంజీవిని చేసి శాశ్వతంగా లంకారాజ్యమిచ్చావు. పరశురాముడు తాను బ్రాహ్మణుడైనా నిన్ను అవమానించాడని అంగవించితివి (అతిక్రమించితివి). కలియుగంలో ఈనాడు కూడా తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై వుంటే యెరుగక నీవు దశరథనందనుడవే దేవుడవు కాదు అనుకొన్నారు.

పద్యవివరణ:

తే.గీ.॥ **రామచంద్ర! వో రఘువీర! రామభద్ర!**
నీ మహిమనేర్వరైతిరే నేటివారు
దశరథ సుతుండ యని నిన్ను తలచినారు
యెరుగరైతిరి నీమాయ తిరుమలేశ!

సంఖ్య: IV/13 రాగం : శంకరాభరణం
కీర్తన : అతడేమిసేసినా మాకదే గురి

శంకరాభరణం

21 అతఁ డేమిసేసినా మాకదే గురి
మతిలో నాతఁడుండఁగా మాయలు మా కేఁటికి ॥పల్లవి॥

ఆసలకెల్లా గురి హరి యొక్కఁడేకాని
వేసరక కన్నవారి వేఁడనోపను(ము)
చేసేటిసేఁతకు గురి శ్రీవిభుఁడేకాని
వాసి దప్పి హీనులసేవలు సేయ నోపము ॥అతఁడేమి॥

ముచ్చటకెల్లా గురి ముఱహరుఁడే కాని
చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్పనోపము
నిచ్చలు మాబ్రదుకెల్లా నీలవర్ణునికే కాని
రచ్చల దుష్టులతోడిరాఁపులకు నోపము ॥అతఁడేమి॥

పరము నిహమునకు పరమాత్ముఁడే గురి
పరుల కధీనమైనబాఁతి యేఁటికి
సిరులకెల్లా గురి శ్రీవేంకటేశుఁడే కాని
అరపిరికితనపుటలమట లేదు ॥అతఁడేమి॥

ఉపోద్ఘాతము:

"బాఁతి" అంటే ప్రేమ అని అర్థం. ఇంకొకరిపై ప్రేమ (ఇష్టము) వుండటంలో తప్పు లేకపోవచ్చు కాని వారికి బానిస అయ్యేంత ప్రేమ పనికిరాదు. ఆ ప్రేమ పరమాత్మునిపై వుంటే ఇహమున ఆనందం, పరమున ముక్తి దక్కుతాయంటున్నారు అన్నమయ్య. ఆ శ్రీహరి యేమి చేసినామాకు ఆయనపై గురి సడలదు. ఆయన మామనస్సులో వున్నంత కాలము ఈ భ్రమలు మాయలు అంటే మాకేం భయం? వాటిజోలి మాకెందుకు అంటున్నారు. వాళ్ళనీ వీళ్ళనీ దేబిరించాల్సిన అవసరం

మాకేమిటి? దుర్మార్గులతో దుస్సాంగత్యము మాకేటికి? మాకు శ్రీహరి చాలు ఇంకేమీ వద్దు. మా ఆసలకు, చేతలకు, ముచ్చటకు, బ్రతుకుకు కూడా గురి ఆ శ్రీహరియే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అతడు (ఆ శ్రీహరి) యేమి సేసినా మాకు అదే గురి (సమ్మతము). మా మతిలో తలపులలో అతడు వుండగా మాయలు మాకేమిటి? (పరులు యెన్ని మాయలు పన్నినా మాకెందుకు?)

ప్రపంచంలో మనిషికి ఆశ కలుగుటకు గురి (కారణము) శ్రీహరి ఒక్కడే. కాని వేసరక (విసుగులేక) కన్నవారి (కనబడ్డ ప్రతివాడినీ) వేడనోపము (యాచించుటకు ఇష్టపడము). మేము చేసే యేపనికైనా గురి (కారణము) శ్రీవిభుడే (లక్ష్మీవల్లభుడే) కాని వాసి దప్పి (అపకీర్తిపాలయి) హీనులైనవారికి సేవలు చేపట్టుము.

ముచ్చటలాడుటకు గురి (లక్ష్యము) అనగా, మనం మాట్లాడగలుగుటకు కారణం శ్రీహరియే కానీ ఆయన సంకల్పం లేకపోతే మాట పెగిలి చెచ్చెర (శ్రీఘ్రముగా) ఎవ్వరికైనా చెప్పజాలము. నిచ్చలు (ప్రతిదినము) మేము బ్రతికి బట్టకడుతున్నది నీలవర్ణుడైన శ్రీపతి కరుణ వల్లనే అందుచేత మాకు దుష్టులతో రాపులు (ఘర్షణలు) రచ్చకెక్కుటకు ఇచ్చగించము.

పరమునకు (పరలోక ప్రాభవానికి) ఇహమునకు (ఈ భూలోక వైభవానికి) గురి (కారణభూతుడు) సర్వాంతర్యామియైన ఆ పరమాత్ముడు. అటువంటప్పుడు ఇంకొకరికి లొంగిపోవలసినంత "బాఁతి" (ప్రేమ) అవసరం కదా! దానివలన లాభమేమిటి? సిరులంతటికీ శ్రీపతి ఆ శ్రీవేంకటేశ్వరుడే, గురి (కారణభూతుడు). కాని (అయినా) అరపిరికి తనపు (కీడు తెచ్చె పిరికితనంతో) అలమట (చింత చీకాకు) లేదు (అవసరం లేదు). ఆయనే దిక్కనండి.

పద్యవివరణ:

ఆ.వె.॥ **హరియేమి సేసినా 'గురి'**
తిరముగ మది ఆతడుండత్రెళ్ళము "మాయన్"
పరమాత్ముడిహపరంబుల
"గురి" లోకుల బ్రతుకు కొఱకు గొలుతురె ఛీ! ఛీ!

సంఖ్య: III/276 రాగం : లలిత
కీర్తన : వెఱవకుమనసా విష్ణుని యభయము

లలిత

22 వెఱవకు మనసా విష్ణునియభయము
నెఱవుగ నెదుటనె నిలిచనది. ॥పల్లవి॥

శ్రీపతికరుణే జీవరాసులకు
దాపును దండై తగిలినది
పైపై దేవునిబలుసంకల్పమే
చేపట్టి రక్షించఁ జెలఁగేది. ॥వెఱవక॥

నలినోదరునిజనామాంకితమే
యిలపై దాసుల నేలేది
కలిభంజనుశంఖచక్రలాంఛన-
మలవడి శుభముల నందించేది. ॥వెఱవక॥

శ్రీవేంకటపతిసేసినచేఁతలే
వేవేలువిధుల వెలసేది
భూవిభుఁ డీతఁడు పూఁచినమహిమలే
కైవశమై మముఁ గాచేవి. ॥వెఱవక॥

ఉపోద్ఘాతము:

భక్తి ప్రబోధన చేసే చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ మనసా! నీకు విష్ణుదేవుని అభయహస్తము అండగా వున్నది. కావున భయపడకు. స్వామి అభయహస్తము నీకు తోడై నిలుస్తుంది అంటున్నారు. శ్రీవేంకటపతి చేతలు అంత తేలికగా గ్రహింపుకురావు. మమ్మల్ని రక్షించేది ఆ ధరణీధరుని మహిమయే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మనసా! నీవు వెఱవకు (భయపడకుము). నీకు విష్ణుని (శ్రీహరియొక్క) అభయము (భయపడకు అని అనునయించే) హస్తము తోడున్నది. ఆ హస్తము నెఱవుగ (పూర్తిగా) నీ యెదుటనే నిలిచియున్నది.

శ్రీపతియొక్క కరుణయే సమస్త జీవరాసులకు (జీవులన్నింటికీ) దాపునుదండై (తోడు విడనాడని అండయై) తగిలినది (తగులుకొనియున్నది). పైపై దేవుని (సర్వోన్నతుడైన ఆ దేవుని) బలమైన సంకల్పమే (నిర్ణయమే) చేపట్టి (పూనుకొని) రక్షించి అతిశయిస్తుంది.

నళినోదరుడు (పద్మనాభుడైన) శ్రీహరి నిజనామ సంకీర్తనమే ఈ అవనిపై ఆయనదాసులను యేలేది (పరిపాలిస్తుంటుంది). కలిభంజనుడు (కలిపురుషుని ఖండించగల) ఆ శ్రీహరి లాంఛనములైన శంఖచక్రముల ముద్రలు, అలవడి శుభముల (తగిన శుభలములను) అందించును.

శ్రీ వేంకటేశ్వరుని యొక్క సేసినచేతలు (లీలలు) వేవేల విధముల (అనేక విధములుగ) వెలసేది (ద్యోతకమవుతుంటాయి). ఈతడు భూ విభుడు (ధరణీవల్లభుడు). ఈయన పూచిన (అలరిన) మహిమలే మమ్ము కైవశమై (అనుగుణ్యమై) కాచేది (రక్షిస్తుంది).

పద్యవివరణ:

ఆ.వె.॥ **విష్ణుని "యభయమ్మె" వెనుదన్ను జీవికి**
నెఱవుతోటి యెదుట నిలిచియుండు,
వేంకటేశుడుండ వెఱవకు మనసా! ధ-
రణి విభుండి యొకడె రక్షమాకు

సంఖ్య: II/229 రాగం : నాట
కీర్తన : దానవారితోడి పగ ధరించరాదు మీకు

నాట

23 దానవారితోడి పగ ధరించరాదు మీకు
కాను కిచ్చి శరణని కప్పము లియ్యరో ॥పల్లవి॥

భ్రమసి వార్ధిఁబడ్డాను పాతాళము దూరినాను
సమయింపక మానఁడు శత్రులార
రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న
తమిఁ జంపక మానఁడు దైతేయులాల ॥దాన॥

రాసి మిన్నులో దాఁగిన రాచమూకలలో నున్న
కోసివేసీఁ దల లరికుమతులాల
ఆసఁ ద్రికూట మెక్కినా ఆ చక్రవాళ మంటినా
తోసి సాధించకపోఁడు దుర్మతులాల ॥దాన॥

సతులమాఁటున నున్నా సరి నెందెందు వోయినా
రతి మెట్టకమానఁడు రాకాసులాల
యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులే దితనికి
గతియని మొక్కరో వో కపటులాల ॥దాన॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య చేసే ఈ విచిత్ర ప్రయోగం మనము మరెక్కడా చూడము. కవి రాక్షసులకు మంచిని ఉద్బోధిస్తుంటాడు. ఈ కీర్తనలో ఒరే రాక్షసుల్లారా! దానవుల శత్రువైన శ్రీహరితో పగ ధరించియుంటే మీ మరణం మీరే ఆహ్వానించుకొన్నట్లుంటుంది. ఇప్పటికైన ఆ దేవదేవుని శరణాగతిని బొంది ఆయనకు కానుకలిచ్చి మంచి చేసికొనండి. ఆయనకు లొంగి కప్పములు (కట్నములు) చదివించండి, అంటున్నారు. ఇక్కడ

దానవులంటే రావణాదులే కాదు నేటి కాలపు భూకబ్జాదారులు కూడా. స్వామి, వారినైనా మంచిగా మారితే కరుణిస్తాడంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఒరే! కపటులైన రాక్షసులారా! నామాటవినండి. మీకు దానవుల అరి (శత్రువైన) శ్రీహరి తోడి పగ ధరించరాదు. (దాల్చియుండుట తగదు). ఇప్పటికైన మీరు మారండి. సన్మార్గులై శ్రీహరి శరణుబొంది ఆ స్వామికి అనేక కానుకలిచ్చి కప్పములు (కట్నములు) చెల్లించండి.

ఒరే! నామాట వినండిరా. భ్రమపడి మీరు సముద్రంలో పడిదాగినా, పాతాళలోకములో దూరి దాగినా, శత్రువులైన మిమ్ము సమయింపక (సంహరింపక) వదలడు. రమణ భూమిచొచ్చినా (చక్కగా భూమిలో దూరినా) బ్రహ్మగారిచేత ఏవేవో వింతవింత వరాలు పొందినా, ఓ దైత్యులారా! మీ వరాలను నిరుపయోగం చేసి మిమ్ము సంహరింపక మానడుగాక మానడు.

ఒరే! మీరు ఆకాశంలో ఇంద్రజిత్తులా దాగికొన్నా వదలడు. రాచమూకలలో నున్నా (కంసుడు, జరాసంధుడు వంటి రాజులుగా పుట్టినా) వెదకి వెదకి చంపుతాడు. ఓ కుమతులైన (దుష్టబుద్ధిగల) శత్రుమూకల్లారా! మీతలలు కత్తిరించి వేస్తాడు, జాగ్రత్త! మీరు పేరాశతో త్రికూట పర్వతమునెక్కినా, చక్రవాళమంటినా, (చక్రవాళ పర్వతమునెక్కినా) దుర్మతులైన మిమ్మల్ని త్రోసివేసి సాధించక వదలడు.

ఒరే! ఆయన దేనినీ లెక్కచేయడు. మీరు స్త్రీలవలె ఆడవాళ్ళలో దాగినా లాభంలేదు. ఇంకా యెక్కడెక్కడో దాగినా ప్రయోజనం లేదు. ఓ రాకాసులారా! మిమ్ము మెట్టక (తొక్కివేయక) వదలడు. ఎందుకంటే ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. ఇతనికి యెదురు లేనే లేదు. ఓ కపటబుద్ధులారా! ఇప్పటికైనా ఈయనే గతి అని మొక్కండిరా!

పద్యవివరణ:

మ.॥ **భళిరా! దానవవైరితోడి పగ మీపాపంబు పండించురా**
నళినీకాంతుడు వేంకటేశ్వరుడు యీ నాడే తలల్ ద్రెంపగా
పెళుసౌ రక్కసులార! పూని వెడలెన్, విష్ణుండజేయుండురా
నళినాక్షున్ శరణంచుమ్రొక్కి, యిడరో నాణ్యంబుగా కప్పముల్.

సంఖ్య: II/21 రాగం : మలహరి
కీర్తన : కంచుగాదు పెంచుగాదు కడుబెలుచు మనసు

మలహరి

24 కంచూఁగాదు పెంచూఁగాదు కడుఁబెలుచు మనసు
యెంచరాదు పంచరాదు యెట్టిదో యీ మనసు ॥పల్లవి॥

పట్టఁబసలేదు చూడ బయలుగా దీ మనసు
నెట్టనఁ బారుచునుండు నీరూఁగా దీ మనసు
చుట్టిచుట్టి పాయకుండుఁ జుట్టమూఁగా దీ మనసు
యెట్టనెదుటనే వుండు నేఁటిదో యీ మనసు ॥కంచూ॥

రుచులెల్లాఁ గానుపించు రూపులేదు మనసు
పచరించు నాసలెల్లాఁ బసిఁడిగా దీ మనసు
యెచటాఁ గరఁగదు రాయిఁగాదు మనసు
యిచటా నచటాఁ దానే యేఁటిదో యీ మనసు ॥కంచూ॥

తప్పక నాలోనుండు దైవముఁగాదు మనసు
కప్పి మూఁటగట్టరాదు గాలీఁగాదు మనసు
చెప్పరాని మహిమల శ్రీవేంకటేశుఁ దలఁచి
యిప్పు డిన్నిటా గెలిచె నేఁటిదో యీ మనసు ॥రాచా॥

ఉపోద్ఘాతము:

ఓ మానవులారా! ఈ మనస్సు వున్నది చూశారా! ఇది యెంతో పెళుసు (FRAGAIL) స్వభావం కలది. అయినా ఇది కంచువంటి లోహము కాదు. పెంచు, అనగా మట్టితో చేసిన పెంకువంటిదీ కాదు. అసలు దీన్ని

యెంచరాదు, అనగా అంచనా వేయలేము. అలాగని దీనిగురించి ఇంకొకళ్ళతో పంచుకోలేము. నిజంగా ఇది యెట్లాంటిదో తెలియకుండావున్నది అంటున్నారు అన్నమయ్య. చూశారా పల్లవే ఇంత కొరకరాని కొయ్యగా వుంటే ఈ మనసు మర్మం అంతా విప్పి చెబుతుంటే అన్నమయ్య భావనా శక్తికి జోహారు అనక తప్పదు. ఈ మనస్సును గెలువదలచినవారికి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించక తప్పదు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! మానవుని మనస్సును భగవంతుడు దేనితో తయారుచేసినాడో తెలియరాకున్నది. ఇది కంచువంటి లోహమూ కాదు అయినా దానికున్న పెళుసుతనం దీనికీ వున్నది. ఇది పెంచూ (పెంకు) వంటి మట్టి పదార్థముకాదు. అయినా పెంకుకున్న పెళుసుతనం ఈ మనస్సుకూ వున్నది. ఇది ఇట్టిది అని యెంచరాదు (అంచనా వేయలేము) అంతేకాదు దీని ప్రవృత్తిని ఇంకొకరితో పంచుకోలేము. ఎట్టిదో ఈ మనస్సు తెలియుట లేదు.

ఈ మనస్సును పట్టుకొనవీలులేదు, యొందుకంటే ఇది బయట లేదు. పోనీ ఎదురుగా ప్రవహించే 'నీరు' అందుమా అంటే అదీకాదు. మనల్ని చుట్టి అంటిపెట్టుకొనే వుంటుంది కాని చుట్టము కాదు. మన యెదుటనే వున్నా ఈ మనస్సు పట్టరానిదిగా వున్నది. ఏమి మనస్సిది?

ఈ మనస్సునకు ఒక రూపము అంటూ లేదు. కాని రుచులు (ఇష్టాయిష్టాలు) దీనికి యెన్ని వున్నాయో చెప్పలేం. ఇది యెన్ని ఆశలు కలిగిస్తుందో చెప్పనలవి కాదు. కాని బంగారము వంటి గొప్ప విలువైనదీ కాదు. ఇది యెంత పాషాణమంటే దీనిని కరిగించడం బహుకష్టము. కాని ఇది రాయికాదు రప్పాకాదు. ఇచ్చటా (ఈ ఇహలోకమున) అచ్చటా (ఆ పరలోకంలోనూ) దీనిదే పెత్తనం. ఎట్టిదో కదా! ఈ మనస్సు?

ఇంకొక వింతయేమంటే ఇది నాలోనే తప్పకయున్నది. కాని అందరూ అనుకొనే భగవత్ స్వరూపమైన అంతరాత్మ కాదు. పోనీ మూటగట్టి అవతల పారేద్దామా అంటే బంధించలేము. పోనీ అగోచరముకాబట్టి 'గాలి' అనుకొందామా అంటే వీలులేదు. అయితే ఇంతపనికిరాని మనస్సుకూడా ఆ శ్రీవేంకటేశ్వరుని తలచి ఇప్పుడన్నిటిలోనూ గెలుపొందింది. ఆహా! ఈ మనస్సు యెట్టిదో కదా!

పద్యవివరణ:

సీ.॥ **కంచుపెంచూగాదు, కడబెలుచు మనసు**
యెంచిపంచగరాదు, యెట్టిదొ ఇది?
చుట్టియు కాదుర చుట్టము, నెట్టన
పట్టరానిది కదా! పాడుమనసు,
రుచులెల్ల చూపించు, పచరించు నాసలు
కరుగదు రాయియుగాదు మనసు
తగనుండు దేహాన దైవమా? అదికాదు
కట్టమూటగరాదు గాలికాదు

ఆ.వె.॥ **చెప్పరాని మనసు శ్రీనివాసుదలంచి**
ఇన్నిటా గెలుచును ఈ మనస్సు
ఎట్టిదో తెలియగ యేరికినిని గాదు
మాయదారిదయ్య! మనిషి మనసు.

సంఖ్య: XV/393 రాగం : లలిత
కీర్తన : ఎంతప్రతాపమో నిదియెంచి చూచితే

లలిత

25 ఎంతప్రతాపమో నీది యెంచి చూచితే
వింతలేల నిన్ను సేవించు టింతెకాక ॥పల్లవి॥

ముప్పిరి నీ సంకల్పము ముంచి బ్రహ్మేంద్రాదులైన
తప్పించలేరు మఱి దాఁటా లేరు
యెప్పుడైనా దైత్యులపై యెత్తిన నీ చేచక్రము
తిప్పలేరు నీ మహిమ తెలియా లేరు ॥ఎంత॥

ఆముక నీవు మన్నించే నంటే ననాదికర్మాలు
యేమిటా మానుప లేవు యిప్పించా లేవు
నేమించక లోకాలపై నీవు పరాకై వుండితే
ప్రేమం బెడరేఁచ లేవు పెనఁగా లేవు ॥ఎంత॥

చేరి నీవు మమ్మేలితే చేసిన యపరాధాలు
మారుకొనలేవు మఱి మలయా లేవు
గారవాన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ
యీ రీతి నీవే కాక యితరులు లేరూ ॥ఎంత॥

ఉపోద్ఘాతము:

ఇది తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి కీర్తన. "ఓ శ్రీవేంకటేశ్వరా! నీ ప్రతాపము గురించి ఏమిచెప్పను? నీది ఎంత ప్రతాపము యెంచి చూడాలిగాని దానికి పరిమితులున్నవా? అందుకని ఇది ఎట్టి వింతరా అని ఆశ్చర్యంతో తబ్బిబ్బయ్యే బదులు నిన్ను సేవించుటయే శ్రేయస్కరం" అంటున్నారు. నీవు మమ్ము కరుణతో యేలితే మా అపరాధములు మమ్మల్నేమీ చేయలేవు అంటున్నారు. నేను నీ భజనను వదలను స్వామీ! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీది ఎంత ప్రతాపమో యెంచి చూచితే అవతలివారు నీకు దాసానుదాసులై నిన్నే సేవించుటలో యేమాత్రమూ వింతలేదు. ఇంతేకాక మరేమియూలేదు.

ప్రభూ! నీ ముప్పిరిసంకల్పము (వివశుల్ని చేసే నీ నిర్ణయాన్ని) బ్రహ్మేంద్రాదులైనా పూని తప్పింపలేరు. మరి దాటాలేరు (అతిక్రమించను కూడా లేరు). ఎప్పుడైనా నీవు ఆగ్రహించి దైత్యులపై నీ చక్రాయుధాన్ని ప్రయోగిస్తే దాన్ని తిప్పలేరు మరల్చుట యెవ్వరికీ సాధ్యంకాదు. అంతేకాదు నీ మహిమ నేనాటికీ గ్రహించలేరు.

ఆముక (పైకొని) నీవు ఎవ్వరినైనా మన్నించేనంటే (వీని పాపవిముక్తుని చేస్తానంటే) వాడిని అనాదికర్మలు (వాడి పూర్వకర్మలు) యేమిటామానుపలేవు (ఏమీ చేయలేవు). యిప్పించాలేవు వాడికి వాటి ఫలముల పీడను కూడా ఇప్పించలేవు). నీవు లోకాలను సేవించక (కాపాడదలచక) పరాకైతే (విముఖడవైతే) ఈ జగములను పెరరేచలేవు (ప్రేరేపించేదెవరు?) అసలు జీవన పోరాటమే జరగదు.

దేవా! నీవు మమ్ము యేలితే (కరుణించి పరిపాలించితే) మేము తొల్లి చేసిన పాపములు మమ్మేమీ చేయలేవు. మారుకొనలేవు (యెదుర్కొనలేవు). మఱి (అలాగని) మలయాలేవు (తిరగబడలేవు). అవి సమసిపోతాయి. దేవి అలమేల్మంగ విభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా ఈ రీతి నీవు కాక వేరెవ్వరూ లేరు. నీ ప్రతాపము ఇంకొకరికెలా వుంటుంది తండ్రీ!

పద్యవివరణ:

తే.గీ.॥ ఎంతటిది నీ ప్రతాపము యెంచి చూడ!!
వింతలేల నిన్‌సేవించుటింతె గాక,
నీవు తలచినగాదన నెవరికగును?
పెద్దతిరుమల కీర్తించె వేంకటేశ!

సంఖ్య: III/286 రాగం : బౌళి
కీర్తన : మమ్ముజూడనేమున్నది మావంక నీకే లాభము

బౌళి

26 మమ్ముఁజూడ నేమున్నది మావంక నీ కేలాభము
కమ్మిక దయదలఁచి కరుణింతుగాక ॥పల్లవి॥

శ్రీకాంతుఁడ నీ పాదసేవకు లయినవారు
పాకశాసనాదులును బ్రహ్మాదులు
పైకొని నరుఁడ నేను బంటఁగాఁగ నెంతవాఁడ
కైకొని నీపుణ్యానకుఁ గాచు టింతేకాక ॥మమ్ము॥

నారాయణుఁడ నిన్ను నమ్మినట్టిదాసులు
నారదాది సనక సనందనాదులు
వీరిలో నే నెంతవాఁడ వికటపుజీవుఁడను
యీ రీతి నీమూకఁగూడ నేలుటింతేకాక ॥మమ్ము॥

శ్రీవేంకటేశ నీపై చేరి భక్తి సేసేవారు
కావించి యనంతముఖ్యగరుడాదులు
దేవ నే నొక్కనీచుఁడ దీనరక్షకుఁడవు నీ-
వీవిధ మెంచుక మమ్ము నీడేరింతుగాక ॥మమ్ము॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్యకాలంనాటి తెలుగు నుడికారానికీ నేటి తెలుగు నుడికారానికి యెంత తేడా వున్నదో గమనించండి. ఈ పల్లవిని నేటి తెలుగులో "మమ్మల్ని చూచుట కేమున్నది? మావలన నీకేమి లాభము? మమ్ము కమ్ముకొని దయదలచి కరుణింతువుగాక!" అని చెప్పవచ్చును. ఓ ప్రభూ! బ్రహ్మాది దేవతలు నీ పాదసేవకులు అయినప్పుడు మానవమ్రాతుడను నేను నీబంటునవటంలో ఆశ్చర్యమేమున్నది? నారద, సనకాదులు నీవు నమ్మిన దాసులు. అట్టి యెడ నేను దుర్మార్గుడైన జీవుడను కదా! నన్ను నీవు

అటువంటిమూకలో కలుపుకోవాలంటే, నన్ను నీవే యేలుకోవాలి అంతేగానీ నాకేమి అర్హతవున్నదయ్యా? అని ప్రశ్నిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! మమ్ము జూచుటకు యేమున్నదయ్యా? మా వంక (వలన) నీకేమి లాభము? కమ్ముక (కమ్ముకొని) మమ్ము దయదలచి కరుణింతువు గాక! లేనిచో నాకు దిక్కెవరు తండ్రీ!

ఓ శ్రీకాంతుడా! పాకశాసనుడు (దేవేంద్రుడు), బ్రహ్మాదులు (చతుర్ముఖ బ్రహ్మ మొదలైనవారు) నీపాద సేవకులు, అయినవారు. నరుడనైన నేను నీబంటును కాకపోతే నేనెంతవాడను స్వామీ? ఏదో పుణ్యానికి నన్ను కనికరించి నీవు కైకొని (పూనుకొని) కాచుట న్యాయము. ఇంతేకాని నీకు చెప్పగలవాడనా స్వామీ?

ఓ శ్రీమన్నారాయణుడా! నారదాది హరిదాసులు సనక సనందనాది మహర్షులు నిన్ను నమ్మినట్టి నీ దాసులు. వీరితో పోల్చి చూస్తే నేనేపాటివాడను? నేను ఒక వికటపు జీవుడను (గొప్ప వంకర స్వభావము కల జీవుడను). అయితే నీ దాసులైన "మూక" అనంతమైనది కావున నన్ను కూడా ఈ రీతి వారితో పాటు యేలుకుంటే చాలు కదా! ఇంతకంటే నేను కోరింది మాత్రమేముంది తండ్రీ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తుల పట్టిక చూద్దామా అంటే అందులో అనంతుడు (ఆదిశేషుడు) గరుత్మంతుడు మొదలైన హేమాహేమీలున్నారు. ఓ దేవా! నేను భక్తిలేని పాపిష్ఠివాడిని, నీచుడిని అయినా నీవు దీనరక్షకుడవు కదా! బ్రహ్మాదులు, సనకాదులు, గరుడాదులను కాసేపు మరచి ఈ విధముగా కాస్త మమ్ముకూడా ఈడేర్చేవంటే మేము కూడ బ్రతికిపోతాము కదా! స్వామీ!

పద్యవివరణ:

కం.॥ **మము జూడనేమి యున్నది?**
తమరే దయదలచి కరుణ ధరియించవలెన్
అమలంపుదాసుడను ప్రభు!
భ్రమలేటికి పోల్చనేల బ్రహ్మాదులతో

సంఖ్య: IV/364 రాగం : సామంతం
కీర్తన : అల్లదెకో విజయధ్వజము జగ–

సామంతం

27 అల్లదెకో విజయధ్వజము జగ –
మెల్లఁ జేకొనియె నీతఁడు ॥పల్లవి॥

తొక్కనిచోట్లుదొక్కెటితురగపు
రెక్కలమీఁదటిరేవంతుఁడు
చక్కగ నసురల సంహరించి యిదె
దిక్కులుగెలిచెను దేవదేవుడు ॥అల్లదె॥

వోడక శంఖము నొగిచక్రముతో
సూడుకుఁ దిరిగేటి శూరుఁడు
యీడనుండి సురలిందరిఁ గాచెను
మేడెపుమనలక్ష్మీవిభుఁడు ॥అల్లదె॥

శరణనవారలఁ జయ్యనగాచిన
శరణాగతరక్షణఘనుఁడు
తిరమై యింతకు దిక్కై నిలిచెను
గరిమెల శ్రీవేంకటవిభుఁడు ॥అల్లదె॥

ఉపోద్ఘాతము:

'కో' అనే మాటను మనం 'కో' అంటే కోటిమంది దొరుకుతారు అనే సందర్భంలో వుపయోగిస్తాము. "ఓహో! అల్లదే ఎగురుతున్న ఆ విజయకేతనాన్ని చూడండి. ఈతడు జగమెల్లా చేకొనినాడు" అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. స్వామి తురగవాహనమునెక్కి వూరేగుతున్నాడు. రేవంతుడు అంటే రౌతు అని అర్థం. ఇది రెక్కల గుఱ్ఱములా వున్నది. ఈ

రేవంతుడు దానిపైనెక్కి అసుర సంహారానికి బయలుదేరాడు. ఈయన దశదిశలను గెలిచిన దేవదేవుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అల్లదేకో (ఓహో! అల్లదిగో) విజయధ్వజము (శ్రీ వేంకటేశ్వరుని విజయకేతము)

ఈతడు జగమెల్లా జేకొనియె (ప్రపంచాన్నంతా కైవశం చేసికొనినాడు). ఈయన గొప్ప రేవంతుడు (అశ్వచోదకుడు). ఇక ఈ తురగము (గుఱ్ఱము) యెటువంటిది? తొక్కని చోట్లు (చొరరాని చోట్లకు) దొక్కేటిది (పోగలిగినది). ఎందుకంటే ఇది రెక్కలువున్న గుఱ్ఱము చక్కగా (చక్కగా) ఇదె అసురులను సంహరించి ఆ దేవదేవుడు దిక్కుల నన్నింటినీ గెలిచినాడు.

ఈయన యెటువంటి శూరుడో తెలియునా? సూడుకు దిరిగేటిశూరుడు (తనశత్రువులపై పగతో తిరిగి తిరిగి సంహరించే శూరుడు.) మరి దానికోసం ఈయన వోడక (వెనుదీయక) వుపయోగించే ఆయుధాలేమిటో తెలియునా? పాంచజన్యమనే శంఖము, సుదర్శనమనే చక్రము. వాటినుపయోగించిన ఆయన యీడనుండియే (ఇక్కడనుంచే) సురలను (దేవతల) నందరినీ కాపాడుతాడు. అందుకే మన ఈ లక్ష్మీపతి "మేడెపు"వాడు (అందమైన నగిషీలు చెక్కిన జుమికీలు అనే కర్ణాభరణములను ధరించిన శ్రీహరి.

ఈ స్వామికున్న ఇంకొక విశిష్ట లక్షణం యేమంటే యెవడన్నా శరణు మహాప్రభో! అంటే వారిని, చయ్యనగాచీ (సై... అని కాపాడుతాడు). అట్టి శరణాగతత్రాత ఈ ఘనుడు. ఈ తిరుమలలో తిరమై (స్థిరపడి) యింతటికీ దిక్కై నిలిచియున్నాడు. ఈయన గరిమేల (మహిమాన్వితుడైన) శ్రీవేంకటనాథుడు.

పద్యవివరణ:

చం.॥ **తురగపు వాహనంబుగొని తోయజనాభుడు ఊరనేగెబో**
తిరుగును శంఖచక్రములదీటుగ దాల్చుచు వేంకటేశుడే
శరణన గాచు'సై'యనుచు సజ్జన రక్షకుడేగుదెంచెరా!
సురులను గాచునిందరిని సొంపగు శ్రీసతివల్లభుండవో!!

సంఖ్య: IV/237 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏటిబిడ్డ గంటివమ్మ యెశోదమ్మ

శంకరాభరణం

28 ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ
గాఁటపుదేవతలెల్లఁ గాచుకున్నా రితని ॥పల్లవి॥

చెక్కుమీఁటి పాలువోయ చేరి వోరు దెరచితే
పక్కుననుఁ బొడచూపె బ్రహ్మాండాలు
అక్కున నలముకొంటే నంగజతాపము మోఁచె
మక్కువకు వెరతుము మాయపు బాలునికి ॥ఏఁటి॥

పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగుదోఁచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకొన్న వేకమై యెవ్వరికి వసగాఁడు
హత్తిచూడ వెరతు మీ యారడిబాలునికి ॥ఏఁటి॥

తేఱి వీనితోడిముద్దు దేవలోకము పనులు
మీఱి యేవి చూచినాను మితిలేనివి
ఆఱుడిగొల్లెతలము అట్టె కూడి యాడితిమి
వెఱు సేయ వెరతు(ము?) శ్రీవేంకటాద్రిబాలుని ॥ఏఁటి॥

ఉపోద్ఘాతము:

తానూ ఒక గోపికయై అన్నమయ్య యశోదాదేవితో ఎటువంటి బిడ్డను కన్నావమ్మా! అని శ్లాఘిస్తున్నారు. నీ బిడ్డను కనులార వీక్షించి మనసారా నమస్కరిద్దామని దేవతలందరూ యెలా వేచియున్నారో చూడు అని ఆశ్చర్యపోతున్నారు. వీడి చెక్కిలి మీద చిటికె వేసి నోరుతెరిస్తే నోట్లో పాలుపోద్దామనుకొంటే... అయ్యబాబోయ్... ఆ చిన్నారి నోటిలో మాకు అండపిండ బ్రహ్మాండమంతా కనుపించిందమ్మా! వీడు మీ ఆరడి బాలుడ కాదు స్వయంగా శ్రీవేంకటేశుడే నమ్మా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ యశోదమ్మా! ఏటి బిడ్డ గంటివమ్మా? (ఎటువంటి బిడ్డను కన్నావమ్మా నీవు?) గాటపు దేవతలెల్లా (సర్వాధికులైన దేవతలంతా) ఇతని కోసం కాచుకొని వున్నారు.

వీడి లీలలు యెన్నని చెప్పమంటావమ్మా? మేము వానిని చేరి చెక్కిళ్ళు మీటి, వాడి నోరుతెరచి నోట్లో పాలుపోద్దామని ప్రయత్నించాము. వాడు పక్కున నవ్వాడు. మాకు ఆ నోట్లో బ్రహ్మాండమంతా కనుపించి భయంవేసిందమ్మా! అందాల ముద్దుల పాపాయి కదా! అని వీడిని అక్కున జేర్చుకొని హత్తుకొంటే మాకు మదనతాపము కలుగుతున్నది. ఇదేమివింత? వీడిపై మక్కువ ఎక్కువై మాకు భయమేస్తున్నది. ఈ మాయలమారి బాలుడంటే కంగారుగా వున్నది.

పొత్తులలోనుండగానే (కన్నతల్లి దేవకీదేవి పొత్తిళ్ళలో వున్నప్పుడే) ఇతడు చతుర్భుజుడైన శ్రీమన్నారాయణునిగా కనుపించినాడు. ఇత్తలబాలునికి (ఈలోకపు పాపడికి) యిటువంటివి సాధ్యమా? ఒకసారి యశోద చెలికత్తెలు ఈ బాలుని ఎత్తుకొందామని ప్రయత్నించి వాని చేయిని కూడా యెత్తలేక యెవరికీ వశముగాక బిత్తరపోయారట. వత్తి చూచిన (కూడి పరికిస్తే) ఈ ఆరడిబాలుడు (ఆరాటపెట్టే బాలుని వంటివానిని చూశామా?)

వీడు స్వయంగా దేవలోకము గరుత్మంతునిపై వెళ్ళి ఇంద్రుని తల్లి అదితికి నరకాసురుని వధించి తెచ్చిన కుండలాలు తిరిగి ఒప్పగించి ఆమె కృతజ్ఞతలు పొందాడు. ఏమి చూచినా ఇవన్నీ మానవమాత్రులు చేయకలిగిన పనులు కావు. నీ పిల్లవాడు స్వయంగా గొల్లెతలమైన మమ్ము కూడిన వేళమేమూ వానితో ఆడితిమి. ఈ వేంకటాద్రిబాలుని యెడబాయుట మాకు భయావహము.

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఎట్టిబిడ్డ గంటివే వో యశోదమ్మ!**
కాచుకున్నవారు వేచి సురులు
నాల్గు భుజములున్న నారాయణుండయ్య,
గొల్లపడుచురతుల కూడె నితడు.

సంఖ్య: IV/171 రాగం : శంకరాభరణం
కీర్తన : వినోదకాడవౌదువు విఠలేశ్వరా

శంకరాభరణం

29 వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా ॥పల్లవి॥

పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాలవయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయలెల్లా యివె విఠలేశ్వరా ॥వినో॥

వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విఠలేశ్వరా
చన్ను దాగి రాకాసిపీఁచము హరించితివి
యెన్నికకెక్కె నీబిరు దిటు విఠలేశ్వరా ॥వినో॥

గొల్లెతలఁగూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విఠలేశ్వరా
బల్లిదపు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా ॥వినో॥

ఉపోద్ఘాతము:

కడపజిల్లాలోని పాండురంగము అనే వూరిలో వెలసిన విఠలేశ్వరునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. బ్రహ్మ భ్రమచెంది చిన్నారి విఠలుని పరీక్షించెదనని గోపబాలురను వారు కాస్తున్న దూడలను మాయంచేశాడు. చిన్నారి విఠలుడు తానే గోపబాలుడై తానే దూడలై గోకులంలో అందరినీ అలరించాడు. చివరికి బ్రహ్మకే అసలేం జరుగుతున్నదో అర్థంకాక నాలుగు తలల జుట్టు పీక్కోవాల్సినంత పనయిందట. అట్టి నీ మహిమ

యెంతటిదయ్యా విఠలేశ్వరా! అని కీర్తిస్తున్నారు. వినోదకాడైన ఈ విఠలేశ్వరుని యెంత వినుతించినా తక్కువే, మరి.

తాత్పర్య వివరణ:

ఓ విఠలేశ్వరా! నీవు గొప్ప వినోదకాడవౌదువు. (అందరికీ గొప్ప వినోదమునందించే అలవాటు వున్నవాడవు). నిన్ను వినుతించ నెటువచ్చు (ఏవిధముగా సన్నుతింపగలము?) మేము అశక్తులము నీ మహిమ నెరుగలేకున్నాము.

ఓ విఠలా! పరమాత్ముడవైన నీవు పశులకాపరివైతే చతుర్ముఖ బ్రహ్మగారు నీ మహిమను వెసనెరింగి (బాగా అర్థమై) నిన్ను అనేక విధములుగా కీర్తించాడు. ఓ విఠలేశ్వరా! నీవు పసిపాపగా వున్నపుడే ఒక పెద్ద బండిని ఒక్క చిన్న తన్నుతో ముక్కలుగా విరిచావు. చూస్తుండంగానే శకటాసురుడనే రాక్షసుడు చచ్చాడు. నీ మాయలన్నీ ఇదే తీరున వుంటాయి స్వామీ!

ఓ దేవా! నీవు వెన్న దొంగతనం చేస్తే వేదము నిన్ను పరమాత్మ అని కీర్తించింది. ఇటువంటి సుద్దులు (పురాణాలు) యెవరు విన్నారు? ఎవరు కన్నారు? చన్నుద్రాపవచ్చిన (పాలుత్రాగించదలచిన) రాకాసి (రాక్షసి పూతనను) ప్రాణములను హరించి వేశావు. ఓ విఠలేశ్వరా! నీ బిరుదు (కీర్తి) ఇటు (ఈ విధముగా) ఎన్నిక కెక్కినది సుప్రసిద్ధమైనది.

ఓ విఠలేశ్వరా! రాసక్రీడలో గోపికలనలరించిన నీవే వారితో కలిసి బ్రహ్మచర్యదీక్ష చేబూని ఆనందం శరీరాలది కాదు ఆత్మలకు సంబంధించినది అన్న సత్యం నిరూపించావు. నీ పనులు అలా విఖ్యాతమైనాయి. ఈ పాండురంగమునందు నీవే వీరాగ్రేసరుడవైన వేంకటేశ్వరుడవై చల్లగా వెలసియుంటివి, ప్రభూ! ఓ విఠలేశ్వరా, నీవే జగద్రక్షకుడవు తండ్రీ!

పద్యవివరణ:

కం.॥ **అవుదువు వినోదకాడవు**
జవరాండ్రనుకూడు బ్రహ్మచారీ విఠలా!
చవులూర నిను నుతింతుము
ఎవరికి వేంకట విభుండు ఈవని తెలియున్.

సంఖ్య: IV/499 రాగం : నాట
కీర్తన : సరిలేరితనికి సాహసవిక్రమడీత-

నాట

30 సరిలే రితనికి సాహసవిక్రముఁ డీతఁ-
డరయ కలశాపురహనుమంతుఁడు ॥పల్లవి॥

వుదధి లంఘించినాఁడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్టనడుమఁ బూజగొన్నాఁడు
సదరాననే లంక సాధించి వచ్చినాఁడు
అదివో కలశాపురహనుమంతుఁడు ॥సరి॥

సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు
భంజించి (న) వానరుల బదికించినాఁడు
అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యేపనుల -
నంజఁడు కలశాపురహనుమంతుఁడు ॥సరి॥

బలురాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు
ఇల రామునికిఁ గడు హితుఁడైనాఁడు
చెలఁగి శ్రీవేంకటేశు సేవ సేయుచున్నవాఁడు
అలరి కలశాపురహనుమంతుఁడు ॥సరి॥ **499**

ఉపోద్ఘాతము:

కలశాపురమున వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. సాహస విక్రముడీతడు. కలశాపుర హనుమంతుని సరిబోలినవారు లేనేలేరు అంటున్నారు అన్నమయ్య. హనుమంతునిపై చెప్పిన కీర్తనలన్నింటిలోనూ ప్రత్యేకత యేమంటే హనుమ శ్రీవేంకటేశుని బంటు అని స్వామి భక్తులకు హనుమంతుడే అంతులేని వరాలనిస్తాడు అని కీర్తిస్తుండటం పరిపాటి. ఈ కీర్తనలో "భంజించి వానరుల బదికించినాడు" అనే చరణంలో వ్రాయసకాని

పొరబాటు సుస్పష్టమే. "భంజించిన వానరుల బదికించినాడు" అని వుంటే బాగుంటుంది. అంజు - అంటే భయపడటం అని అర్థం.

తాత్పర్య వివరణ:

అరయ (పరికించగా) ఈతడు, కలశాపురమున వెలసిన హనుమంతుడు. ఈతడు సాహసవిక్రముడు (సాహసవంతుడైన పరాక్రమశాలి). నిజంగా ఇతనికి సరిలేరు (సమానమైనవారు లేరు).

ఈయన వుదధి లంఘించినాడు (సముద్రమును దూకినాడు). ఉబ్బున (సంతోషించినవాడై) మైనాకముచే (మైనాకుడను పర్వతరాజుచే) పొదలి (పెరిగిన తన రూపం చూపించి) అతనిచే సముద్ర మధ్యముననే పూజలు స్వీకరించినాడు. సదరాననే (బాహాటంగానే) రావణాదులు చూస్తుండంగానే లంకను సాధించినాడు (గెలిచినాడు). అదివో చూశారా ఈ కలశాపుర హనుమంతుడు యెంత పరాక్రమవంతుడో!

సమరరంగమందు (యుద్ధరంగములో) లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు, ఈయన సంజీవి పర్వతమునే యెత్తుకవచ్చి లక్ష్మణునే కాదు అంతవరకు రణరంగంలో భంజించిన (చనిపోయిన) వానరులనందరినీ బ్రతికించినాడు. అంజనీదేవికి కొడుకైన ఈ కలశాపుర హనుమంతుడు, యే పనులన్ (యెట్టి సాహ కార్యమునకైనా) అంజడు (భయపడడు.)

ఈయన బలురాకాసులనైనా (బలవంతులైన రాక్షసులనైనా) పట్టి చదిపినవాడు (చిదిపివేసినాడు). భూలోకంలో శ్రీరామచంద్రమూర్తికి కడుహితుడైనాడు (పరమ ఆప్తుడైనాడు). ఇట్లు అలరిన ఈ కలశాపుర హనుమంతుడు, చెలగి (వికాసముతో) శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుచున్నాడు. వీనిని సేవించి తరించండి.

పద్యవివరణ:

చం.॥ **సరియగు వారులేరిలను సాహసవిక్రముడీతడే యహో!**
అరయనశక్యమౌ హనుమ అంజన సూనునవక్రవిక్రమం
బరికుల భంజనుండు సమరాంగన దక్షుడు రామబంటుతా
నిరవుగ నిల్చె శ్రీరమణు యేలికలో కలశాపురంబునన్.

సంఖ్య: IV/466 రాగం : శుద్ధ వసంతం
కీర్తన : చేకొన్న భక్తులపాలి చింతామణి

శుద్ధ వసంతం

31 చేకొన్న భక్తులపాలిచింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుఁడు ॥పల్లవి॥

వాఁడిగోళ్ళచేత వడి హిరణ్యునిఁ జంపి
వేడుకనెత్తురులెల్ల వెదచల్లుచు
పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె
మూఁడుమూర్తులకును మూలమీతఁడు ॥చేకొన్న॥

కొండమీఁదఁ గూచుండి కోప ముపసంహరించి
అండనున్నదేవతల కభయమిచ్చి
మెండుగ సులభుఁడై మెరయుచు నున్నవాఁడు
దండిజగములకెల్ల దైవ మీతఁడు ॥చేకొన్న॥

వేవేలుచేతులను వెస నాయుధాలు వట్టి
చేవమీరి ప్రతాపాన సిరులు మించి
యావల నహోబలాన నిరవై యున్నవాఁడు
శ్రీవేంకటాద్రిమీఁది సిద్ధమూర్తి యీతఁడు ॥చేకొన్న॥ **466**

ఉపోద్ఘాతము:

సర్వేశ్వరుడైన శ్రీ నరసింహుడు సాకారముతో ఈ అహోబలంబున వున్నాడు. ఈ దేవదేవుడు తాను ఆదరించిన తన భక్తులపాలి చింతామణియై అభీష్టములను నెరవేరుస్తుంటాడు అంటున్నారు అన్నమయ్య. పనిలోపనిగా ఆస్వామిని సహజాలంకారయుక్తముగా వర్ణిస్తూ కొసమెరుపులాగా శ్రీవేంకటేశుడై శ్రీవేంకటాద్రి మీద వెలసిన సిద్ధమూర్తి కూడా ఈ అహోబలేశ్వరుడే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

చేకొన్న (స్వీకరించిన) తన భక్తులపాలి చింతామణియై, వారి అభీష్టములను నెరవేరుస్తూ, సర్వేశ్వరుడైన పరమాత్ముడు సాకారమై నరసింహ రూపమున ఈ అహోబలముననున్నాడు.

ఈయన యెలావున్నాడో చూడండి. తన వాడిగోళ్ళచేత (పదునైన కొనదేలిన గోళ్ళతో) హిరణ్యకశిపుని వడిజంపి (శీఘ్రముగా సంహరించి) పెల్లుబికిన వాని నెత్తురును వేడుకతో యెల్లా (అన్నిచోట్లా) వెదచల్లుచూ, పోడిమి (హిరణ్యకశిపుని షరతులకు ఒప్పునట్లుగా) నరసింహుడై పొడచూపె. అల్లవాడే (అదిగోవాడే) త్రిమూర్తులకు మూలమైన పరమాత్ముడు ఈ అహోబలేశ్వరుడే.

హిరణ్యుడు ప్రహ్లాదుని పెట్టిన హింసకు ఆగ్రహోదగ్రుడైన ఈ ఉగ్రనరసింహుడు ఈ గరుడాద్రి కొండమీద కూర్చొనగానే శాంతుడై కోపమునుపసంహరించుకొని భయపడవద్దని తన అండజేరిన దేవతలకు నభయమొసంగినాడు. మెండుగా సులభుడై (సులభముగా అనుగ్రహించువాడై) జగములకెల్లా దండిదైవము (రక్షకుడైన పరమాత్మ) ఈతడు (ఈ అహోబల నృసింహుడు).

ఈయనకు వేవేల చేతులున్నాయి (అనేక హస్తములు వున్నాయి). అన్ని చేతులలోనూ, వెస (వేగముగా) శంఖ చక్రాది ఆయుధములను చేబూనినాడు. చేవమీరి (ధైర్యోపేతుడై) ప్రతాపవైభవము వుప్పొంగగా ఇక్కడ అహోబలేశ్వరుడై వున్నాడు. భక్తులారా! శ్రీవేంకటాద్రి మీది సిద్ధమూర్తి (దేవదేవుడు) ఇతడే.

పద్యవివరణ:

కం.॥ **ఈ కడ నహోబలంబున**
చేకొని ఆశ్రితులపాలి చింతామణియై
శ్రీకరుడు వేంకటేశుడె
సాకారనృసింహుడాయె సర్వేశ్వరుడున్.

సంఖ్య: XV/338 రాగం : నాట
కీర్తన : వెదకితే నీవంటి వేల్పు లెవ్వరున్నారు

నాట

32 వెదకితే నీ వంటివేల్పు లెవ్వ రున్నారు
అదన నీ దాసుఁడైన యతఁడే పుణ్యుఁ డయ్యా ॥పల్లవి॥

యేలేది పరమపద మీశ్వరుఁడ వింద రికి
మేలిమి శ్రీభూమీసమేతుఁడవు
పాలింతువు లోకమెల్ల బ్రహ్మంతవాఁడు కొడుకు
వాలాయించి నిన్నుఁ గొల్చువాఁడే ధన్యుఁ డయ్యా ॥వెదకి॥

పండేది పాలజలధి పంపుసేసేది చక్రము
నిండువన్నెపైఁడికోక నీ మేనిది
వుండుదు వందరిలోన యోగమాయ నీ మహిమ
అండ నిన్ను నమ్మినవాఁ డన్నిటాఁ బూజ్యుఁ డయ్యా ॥వెదకి॥

సురలు నీ యాజ్ఞవారు సూర్యచంద్రులు కన్నులు
బిరుదుటెక్కెములు చూపే వేదములు
వురమున నలమేల్మంగ యొప్పెను శ్రీవేంకటేశ
గరిమ నీ శరణన్నఘనుఁడే నేర్పరయ్యా ॥వెదకి॥

ఉపోద్ఘాతము:

ఇది తాళ్ళపాక పెదతిరుమలయ్య రచన. శ్రీ వేంకటేశ్వరుని "యెంత వెదకినా నీవంటి దేవుడు కనుపించడయ్యా! ఈ ప్రపంచంలో గొప్ప పుణ్యాత్ముడెవరంటే, నీదాసుడే సుమా!" అంటున్నారు. పెదతిరుమలయ్య కీర్తనలలోని కొన్ని అచ్చతెలుగు పదములకు వివరణ, నేటికాలంలో నిఘంటువులు, కొంత పౌరాణిక వాఙ్మయ పరిచయం, చాలా చాలా శ్రీహరికృప లేకపోతే జరిగేపనికాదు. ఇది నేను స్వానుభవంతో చెబుతున్నమాట. కావాలంటే ఈ కీర్తననొకటికి రెండుసార్లు చదవండి మీకే అర్థమవుతుంది.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! వెదకి చూస్తే, నీవంటి దైవము యెవ్వరున్నారు? అదన (అధికముగా) నిన్ను సేవించు నీదాసుడైన వాడే పుణ్యాత్ముడయ్యా!

ప్రభూ! నీవేమన్నా సామాన్యుడవా? నీవు యేలికవై పరిపాలించేది పరమపదము (మోక్షస్థానమైన వైకుంఠం). ఈ సర్వజీవులకు నీవే ఈశ్వరుడవు. బంగారు వన్నెగల శ్రీదేవికి, సిరులభూదేవికి నీవు పతిదేవుడవు. పదునాల్గు భువనములను పాలించునాథుడవు నీవే. ఇక నీ కొడుకులేమన్నా తక్కువ తిన్నారా? చతుర్ముఖ బ్రహ్మగారు నీ పెద్దకొడుకు. ఆయనే లేకపోతే సృష్టే లేదు. ఇక ఆయన వ్రాసిన నుదుటి వ్రాతకు తిరుగే లేదు. తండ్రీ! వాలాయించి (నిరంతరము) నిన్నే కొలుచుచూ జీవించేవాడు ధన్యుడయ్యా.

ఓ దేవా! నీవు పండేది (పరుండి విశ్రాంతి తీసికొనేది) క్షీరసాగరములో. శత్రుసంహారానికి నీవు పంపుసేసేది (నీవు నియోగించేది) సుదర్శనచక్రము. నీ మేనిది (శరీరంపై ధరించేది) నిండు వన్నె పైడికోక (బంగారు పసుపు వర్ణముగల పట్టు పీతాంబరము). ఇక నీవు నిరంతరం వుండేది అందరి అంతర్యామిగా. నీ మహిమకు ప్రతిరూపమే నీ యోగమాయ. దానికి తిరుగులేదు. నిన్ను నమ్మినవానికి చెడు జరుగనే జరుగదు. వాడే పూజ్యుడు.

దేవతలందరూ నీ ఆజ్ఞను శిరసావహించేవారే. సూర్య చంద్రులు కన్నులుగా గల నీ దృష్టి నుండి తప్పుకొనుట సాధ్యమే కాదు. వేదములన్నియూ నీ బిరుదు టెక్కెము (విజయ కేతనములు). హృదయ పీఠమున అలమేల్మంగ స్థితుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! మహిమాన్వితుడవైన నిన్ను శరణుచొచ్చినవాడే నిజమైన నేర్పరి.

పద్యవివరణ:

తే.గీ.॥ **వెదకితే లేరు నీవంటి వేల్పులెవరు?**
నీదు దాసుడే పుణ్యుడు వేదవినుత!
సూర్యచంద్రులు నయనాలు సురులు బంట్లు
పెద్దతిరుమల వినుతించె, వేంకటేశ!

సంఖ్య: IV/530 రాగం : నాట
కీర్తన : అదెవచ్చె రాఘవు డాతని దాడి ముట్టె

నాట

33 అదె వచ్చె రాఘవుఁ డాతని దాడి ముట్టె
యెదిరించరాదు మీకు నేది దెరు విపుడు ॥పల్లవి॥

భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు
అవల మీకు దిక్కేది యసురలాల
తివిరి మిమ్ము వెదకె దివ్యబాణాలాతనివి
రవళి నెందు చొచ్చేరు రాకాసులాల ॥అదె॥

చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట
తల చూపరాదు మీకే దైత్యులాల
వలగొని దేవతలు వానరులై వచ్చిరట
నిలువరా దిఁక మీకు నిశాచరులాల ॥అదె॥

రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక
దావతిఁ బారరో మీరు దానవులాల
యీవేళ శ్రీవేంకటేశుఁడితడే విభీషణుని
లావున శరణనరో లంకావాసులాల ॥అదె॥ **530**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన చదివాక వావిలిపాడు వీరరాఘవునిపై మన అన్నమయ్య చెప్పిన కీర్తనేమో అనిపించింది. వీరరాఘవుడు లంకను ముట్టడించాడు. ఒరే రాకాసుల్లారా! ఆయనను యెదిరించడం మీవల్ల అయ్యేపనికాదు. ఇక మీకు వేరే దారి యేమున్నది! పారిపోండి అని హితవు చెబుతున్నారు. రావణుడే చచ్చాక మీకు దిక్కెవరురా? ఆయనను శరణనండి అంటున్నారు

ఈ శ్రీవేంకటేశుడే ఆనాటి విభీషణ వరదుడు కూడా, కాబట్టి ఓ లంకవాసుల్లారా! ఈయనే దిక్కనండి అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అదె వచ్చె రాఘవుడు (వీరరాఘవుడు) లంకపై ఆతని దాడి (ఆక్రమణ) ముట్టె (ముట్టడించింది). మీకు యెదిరించరాదు (నిలువరించ నసాధ్యము). ఏది తెరువు యిపుడు (ఇప్పుడు మీకు తప్పించుకొనేదారియేది).

ఒరే! రాక్షసుల్లారా! శ్రీమహావిష్ణువే రావణ సంహారం కోసం భూమిమీద రాముడై పుట్టాడట. అవల (ఆపైన) మీకు దిక్కేదిరా? ఆయన బాణాలు దివ్యమైనవి. అవి మిమ్ము తివిరి వెదకి (పనిగట్టుకొని వెదకి) మరీ చంపుతాయి. రవళి (పొలోమని పారిపోయి) యెందు చొచ్చేరురా (యెక్కడకు పోగలరురా?)

ఓ దైత్యులారా! చలపట్టి (పట్టుబట్టి) కొండరాళ్ళు చేత సముద్రమును గట్టెనట (సేతు బంధనము చేశాడట). ఇక మీకే తల చూపరాదు (పొడచూపరాదు). వలగొని (అటు తిరిగి ఇటు తిరిగి) దేవతలంతా వాలి, సుగ్రీవుల వంటి వానర ప్రముఖులై జన్మించారంట. ఓ నిశాచరులారా! మీకు నిలుచునే చోటుండదు. నామాట వినండి.

ఒరే! దానవుల్లారా! మీకు ఒక దుర్వార్త. రణములో శ్రీరాముడు మీ యేలికయైన రావణుని జిక్కించుకొని (పట్టుకొని) తుదముట్టించాడట. మీరంతా దావతి బారరో (ఏడుస్తూ పారిపోండిరా!) ప్రస్తుతం మీ రాజైన విభీషణుడు చిరంజీవి, రామ భక్తుడు. ఓ లంకవాసులారా! మీరుకూడా లావున (ధైర్యంతో) ఈవేళ శ్రీవేంకటేశుడై నిలిచిన ఆ దేవదేవుని శరణనరో!

పద్యవివరణ:

కం.॥ **అదిగో రాఘవుడొచ్చెను**
యెదిరించగరాదు మీకు నేది తెరువికన్?
తుదముట్టె రావణుండును
పదిలంబుగ బారరోరి! పాపులు దనుజుల్.

సంఖ్య: XXVIII/324 రాగం : శంకరాభరణం
కీర్తన : అలమేల్మంగవునీవు అక్కున నుందానవు

శంకరాభరణం

34 అలమేల్మంగవు నీవు అక్కున నుందానవు
లలి నీగుణమెఱిఁగి లాలించీఁగాక ॥పల్లవి॥

కొచ్చి కొచ్చి పలుమారుఁ గొసర నేమిటికే
మచ్చికతో నాతఁడే మన్నించీఁగాక
కచ్చుపెట్టి రతులకుఁ గక్కసించనేఁటికే
యిచ్చకము సేయఁగానే యెనసీఁగాక ॥అల॥

విన్నపాలు సేసి సేసి వేసిరించనేఁటికే
తన్నుఁదానే నీపై దయదలఁచీఁగాక
చన్నుఁ గొండలనే వొత్తి చండిసేయ నేఁటికే
యెన్నికతో వేఁడుకొంటే నియ్య కొనీఁగాక ॥అల॥

పిక్కటిల్లఁ జేయివట్టి పెనఁగఁగ నేఁటికే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డేలీఁగాక
తక్క నిన్నుఁ బెండ్లాడీ తమకించ నేఁటికే
చక్కఁగా సేవ చేసితే చనవిచ్చీఁగాక ॥అల॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య శృంగారకీర్తన మాధుర్యం వర్ణింపనలవిగానిది. ఆరువందల యేళ్ళనాటి తెలుగు కీర్తన ప్రతిపదార్థ వివరణ అంత ఆషామాషీ వ్యవహారంకాదు. "అక్కున నుందానవు" అంటే 'అక్కుననున్నదానవు' అని అర్థం చేసికోవాలి. "కొచ్చి కొచ్చి పలుమారు గొసరనేమిటికే" అంటే "గుచ్చి గుచ్చి ఆయనగారిని అనేకమార్లు ప్రార్థించటం యెందుకమ్మా?" అని ప్రశ్నించడం అన్నమాట. ఇలా వివరిస్తూ పోతే ఉపోద్ఘాతమే కొండవీటి

చాంతాడంత అవుతుంది. స్వామి ఆమె "గుణమెరిగి లాలించీగాక" అంటే ఆమె చిత్తప్రవృత్తి యెలావుందో తెలిసి లాలిస్తాడట.

తాత్పర్య వివరణ:

తల్లీ! నీవు అలమేల్మంగవు. శ్రీవేంకటేశ్వరుని అక్కున (వక్షస్థలమున) నుందానవు (వున్నదానవు). లలి (ప్రేమాస్పదమైన) నీగుణగణములన్నియు యెఱిగినవాడు కనక నీ స్వామి నిన్ను తప్పక లాలించునమ్మా!

దేవీ! కొచ్చి కొచ్చి (గుచ్చి గుచ్చి) ఆయనగారిని అనేక మారులు కొసర నేటికే (బ్రతిమిలాడుకోవటం దేనికమ్మా?) మచ్చికతో (నీకు అనుకూలుడై) ఆతడే మన్నిస్తాడు లేవమ్మా! కచ్చుపెట్టి (ఆశపడి) ఆయనతో సురతమునకు కక్కసించనేటికే (ఆశతో వేదన జెందుట దేనికమ్మా?) నీవు కాస్త ఇచ్చకము చేయగానే (వలపు కురిపించగానే) యెనసీ గాక (పొందుకు చేరడా)? దిగులు నీకెందుకమ్మా?

అమ్మా! ఆయనగారికోసం అన్ని విన్నపాలు చేయటం దేనికి? ఆయన కరుణాసాగరుడు. తనంతట తానే నిన్ను దయతలుస్తాడు లేవమ్మా! చింతించకు. దేవీ! నీ కుచగిరులు ఆయనకు వొత్తి నీ ఆగ్రహం ప్రదర్శించటం దేనికమ్మా? తగిన విధంగా వేడుకొంటే ఇయ్యకొనీగాక! (నీవు చెప్పినట్లే వింటాడు లేవమ్మా!)

దేవీ! పిక్కటిల్ల (అతిశయముగా) ఆయనే నీచేయి పట్టుకొంటే పెనగులాడుటెందుకమ్మా? ఇది ఎవరి సామ్రాజ్యమనుకొంటున్నావు? ఇది శ్రీవేంకటేశ్వరుని యేలుబడి. అయినా, తక్క నిన్ను బెండ్లాడి (కావాలని వలచి వలపించుకొని నిన్ను పరిణయమాడి) ఇంత తమకించుటెందుకమ్మా (చలింపజేయుట దేనికమా?) నీవు చక్కగా సేవిస్తే నీకు అనుకూలుడు కాడా?

పద్యవివరణ:

తే.గీ.॥ నీవు అలమేలు మంగవు నీలవర్ణు
అక్కుననెయున్నదానవు, చక్కనైన
నీదు గుణమెరిగిన హరి నిన్ను ప్రేము
తాను లాలించె నోయమ్మ! తమకమలర.

సంఖ్య: XXVIII/496 రాగం : ఆహిరినాట
కీర్తన : త్రివిక్రమూర్తియైన దేవునివలె నున్నాడు

ఆహిరినాట

35 త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాఁడు
భువి సేవించేవారిపాలి పుణ్యఫల మీతఁడు ॥పల్లవి॥

అంచె నుదయాస్త గిరులందు నొక జంగ చాఁచి
వంచించక మిన్ను దాఁక వాలమెత్తి
ముంచి బ్రహ్మలోకము మోవఁగఁ బ్రతాపమున
పెంచినాఁడు తనమేను పెద్దహనుమంతుఁడు ॥త్రివి॥

తిరముగ హస్తములు దిక్కులు నిండఁ బరపి
వరుసఁ గర్ణము లిరువంకఁ జిక్కించి
దుర దుర మస్తకము ధ్రువమండలము సోఁక
పెరిగినాఁ డిదివో పెద్దహనుమంతుఁ ॥త్రివి॥

అక్కజపు రోమము లన్నిలోకము లొరయ
మొక్కుచు శ్రీవేంకటేశుమోహపు బంటై
పక్కన నజాండ కప్పరము నిండాఁదాను
పిక్కిటిల్లినాఁ డిదివో పెద్దహనుమంతుఁడు ॥త్రివి॥

ఉపోద్ఘాతము:

ఈ పెద్దహనుమంతుడు శ్రీమహావిష్ణువు యొక్క త్రివిక్రమ మూర్తివలె దిక్కులు పిక్కటిల్లునట్లు ఆద్యంతములు లేనట్లు వున్నాడు. ఈయన పుడమిలో తనను సేవించు వారి పాలిట పుణ్యఫలము. అంతేకాదు ఈయన ఒక్కొక్క రోమములో ఒక్కొక్కలోకము ఇమిడి యున్నది. ఈ అనంతమూర్తి రామబంటు త్రేతాయుగంలో కానీ నేడు శ్రీవేంకటేశ్వరుని మోహపు బంటై యెట్లు మొక్కుచున్నాడో చూడండి అంటున్నారు అద్వితీయుడు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఇదిగో పెద్దహనుమంతుడైన ఈ స్వామి, త్రివిక్రమమూర్తి (త్రిభువనములను ఆక్రమించిన) వామనమూర్తివలె పెరిగియున్నాడు. ఈతడు భువి (పుడమిపై) తనను సేవించేవారి పాలిటి పుణ్యఫలమై తోచుచున్నాడు.

అంచె (వరుసతో) తూర్పు పడమర గిరులలో తాకునట్లు తన జంగ (రెండు పిక్కలను) చాచి, వంచించక (సంకోచించక) మిన్నుదాక (ఆకాశమును తాకునట్లు) వాలమెత్తి (తన తోకను పైకెత్తి) యున్నాడు. బ్రహ్మలోకము ఆయనప్రతాపమునకు మోవగా (అబ్బురపడగా) ఈ పెద్దహనుమంతుడు తన మేను (శరీరము) పెంచినాడు.

ఈ పెద్ద హనుమంతుడు తిరముగ (స్థిరముగ) తన హస్తములను దిక్కులు నిండునట్లుగా బరపి (పరచి) ఆ వరుసలో తన కర్ణములను (చెవ్వులను) ఇరువంకల (రెండువైపులా) చిక్కించి (రిక్కించి) తన మస్తకమును (శిరస్సును) దురదుర (శీఘ్రముగా) ధ్రువమండలము సోక (తాకునట్లు) పెరిగినాడు. ఇదివో ఈ విధంగా ఆయన సూర్యుని గురువుగా వేదములను నేర్చినాడు.

అట్టి విశ్వరూప ప్రదర్శనమున ఆయన రోమములు (వెంట్రుకలు) మిక్కిలి పొడవై లోకములన్నింటినీ ఒరిపిడికి గురి చేసినవి. ఆ విశ్వవ్యాప్త హనుమంతుడు తన యజమాని అయిన మోహనాకారుడు శ్రీవేంకటేశ్వరుని నమ్మినబంటై ఈ భూమండలం ప్రక్కనున్న అజాండము (విశ్వము) కప్పరమునిండ (కప్పుకొనినట్లు నిండిపోయి) తాను పిక్కటిల్లినాడు (నిండి వ్యాపించినాడు). అదిగో ఆ పెద్ద హనుమంతునికి భక్తితో మొక్కండి.

పద్యవివరణ:

చం.॥ **పెరిగెను చూడుడీహనుమ విష్ణుత్రివిక్రమరూపమట్లుగా**
గిరులను తూర్పుపశ్చిమల క్రిందుగ జేసెను జంగచాచుచున్
వరుసగ జిక్కజేసి తన బారగువీనులు నేర్చెవేదమున్
తిరుమల తేని బంటితడు దిక్కుల నిండిన పావనే భళా!

సంఖ్య: IV/225 రాగం : లలిత
కీర్తన : బంటుకు బంటవుదురా పాపముగాక నీ-

లలిత

36 బంటుకు బంటవుదురా పాపముగాక నీ-
బంటుకు బంట్లమై బదికేము నేము ॥**పల్లవి**॥

పాతాళముననున్నబలివాకిలి గాచేవు
దూతవై పాండవులపొందున నుంటివి
యీతల యేలిక బంటు యీవరుస దప్పె నిఁక
చేతనే నిన్నుఁగొలువఁ జింతయ్యీ నిందుకే ॥**బంటు**॥

పాండవులదూతవై పనిసేసితివి వారు
అండ నీదూతలయ్యేది అమరుఁగాక
నిండి గురు దైవమనే నియమము దప్పె నిదే
మెండునీదాసులకెల్ల మేర మితి యేదయ్యా ॥**బంటు**॥

పరగ నౌలే నీవు భక్తవత్సలుండ వౌదు
తిరమై యెరఁగకాడితిమి యిందాఁకాను
అరుదైన శ్రీవేంకటాద్రిశుఁడవు నీకు
సిరులనే శరణంటిఁ జేసినట్టు సేయవే ॥**బంటు**॥ **225**

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! మేమంతా నీ బంట్లము. నీవే మాకు బంటువై మమ్మల్ని సేవిస్తావుట కదా! ఇంతకంటే మాకు పాపము యేముంటుందయ్యా! నీబంటు అయిన శ్రీ రామానుజగురుదేవులకు మేము బంటమై బ్రతికితే మేము తరించినట్లే. ఇంకా మేము కోరేదేముంటుంది అంటున్నారు

అన్నమయ్య. మేము అజ్ఞానంవల్ల తెలియక నీగురించి యేమన్నా అంటే మమ్ము మన్నించవయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ దేవా! మేమంతా నీబంట్లము. నీ బంట్లకు నీవే బంటువౌతావా? ఇంతకంటే పాపము మాకు వుంటుందా? మరి మా పాప నివారణార్థం నీ బంటయిన శ్రీరామానుజాచార్యులవారికి బంట్లమై నేము (మేము) బ్రతికేమయ్యా!

ప్రభూ! పాతాళముననున్న బలిచక్రవర్తి వాకిలికి కాపలాదారువైనావు. రాజ్యం పోగొట్టుకొన్న పాండవులకు పొందున (స్నేహబంధంతో) వుంటివి. ఈ విధంగా ఎవరు ఎవరికి బంటయినట్లు భావించాలి? నీవు వారికి బంటువా వారు నీ బంట్లా? ఈ వరుస తప్పినట్టయింది కదా! ఇందుకే నిన్ను కొలవాలంటే చింతించాల్సివస్తోంది. నీవు మాకు బంటువు అయితే మాకు పాపం రాదా?

నీవు పాండవుల దూతవై పనిచేశావు. అసలు వారంతా వారి పూర్వజన్మలలో నీ దూతలే కదా! యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వనీదేవతలు నీ పనుపున నే భూమిపై అవతరించారు కదా! ఈ విధముగా గురువు దైవము అనే నియమం కూడా నీవు పాటించలేదు. అందుకే మెండైన నీ దాసులకు మితము(హద్దు) యేమీలేవయ్యా!

ఔలే (అవునులే) నీవు భక్త వత్సలుడవనుమాట నిజము. ఏదో యెరుగక ఆడితిమి (అన్నాము లేవయ్యా!) ఇందాకాను ఇప్పటిదాకా నీ భక్త వాత్సల్యం అర్థం చేసికోలేక యేదో వాగాను లేవయ్యా! అరుదైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు వైభవంతో శరణార్థినయ్యాను. ఇక నీకు తోచినట్లు చేయవయ్యా! నీ చిత్తము మా ప్రాప్తము.

పద్యవివరణ:

ఉ.॥ **బంటుకు బంటువౌదువట, పాపముగాకిదియేమిటయ్యా? నీ**
బంటుకు బంట్లమై బ్రతికి పావనులౌదుము, యేలనందువా
బంటులు పాండవుల్, తమరు వాకిలిగా చెడి ఆ బలీంద్రుడున్
పంటగచూప, నీ శరణు బట్టితి ధన్యుడ వేంకటేశ్వరా!

సంఖ్య: XXVIII/172 రాగం : గౌళ
కీర్తన : శిష్టులను మన్నించే శిశు వీతడు

గౌళ

37 శిష్టులను మన్నించే శిశు వీతఁడు
దుష్టుల నణఁచి భూమిఁ దుదకెక్కు నీతఁడు ॥పల్లవి॥

దేవకీదేవివసుదేవులకు జనియించె
భావించఁ గృష్ణుఁడు పరబ్రహ్మము నేఁడు
శ్రావణ బహుళాష్టమి సమకూడె నడురేయి
యీవేళ రోహిణి యిన్నిటను మంచిది ॥శిష్ట॥

గండముతోఁ బుట్టె నదె కంసునికి మేనల్లుఁడు
పాండవుల కందరికి బావమఱఁది
దుండగపు భూభారము తొలఁగదొబ్బు నీతఁడు
యెండనీడ కన్నులవాఁ డిఁక నింతా మంచిది ॥శిష్ట॥

ఆవు లీతనిపేరిట నచ్చివచ్చు లెంచి చూడ
వేవేలు గొల్లెతలకు విటుఁ డవును
శ్రీవేంకటాద్రి నున్నాఁడు చేరి యలమేల్మంగతో
యీవలఁ బెద్దలు చెప్పి రిఁక నింతౌ మంచిది ॥శిష్ట॥ **172**

ఉపోద్ఘాతము:

ఒకానొక శ్రావణ బహుళాష్టమి (శ్రీకృష్ణాష్టమి) నాడు అన్నమయ్య వినిపించిన కృష్ణరసాయనామృతమిది. తనివిదీరా ఆస్వాదించి తరించండి. మీరు చూస్తున్న ఈ శిశువు శిష్టరక్షణ దుష్ట శిక్షణ చేయుటకు అవతరించిన పరబ్రహ్మ. కంసవధ చేసినా పాండవుల బావగా భారతయుద్ధం నడిపించినా, భూభారాన్ని నిర్మూలించుటకే. ఆలమందలను కాచినా, వేవేలు గొల్లెతల

విటుడైనా ఈ జగద్గురునకు సాటియెవరు? నేడు అలమేలుమంగతో తిరుమల శిఖరాలజేరి మనకోసం నిలిచియున్నాడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈతడు (ఈ శ్రీకృష్ణుడు) శిష్టులను (సద్వర్తనులను) మన్నించు (ఆదరించు) శిశువు (బాలకృష్ణుడు). ఈతడు దుష్టుల నణచి (దుర్మార్గులను పరిమార్చి) భూమిపై తుదకెక్కెను (విఖ్యాతి చెందినాడు).

నేడు (ఈ కృష్ణాష్టమినాడు) పరబ్రహ్మము (ఆదిమధ్యాంతరహితుడైన పరమాత్మ) దేవకీదేవి వసుదేవులకు కృష్ణుడు అని జగములు భావించునట్లు జన్మించినాడు. ఈ బాలుడు శ్రావణ బహుళ అష్టమి నాడు, నడురేయి (అర్ధరాత్రివేళ) సమకూడె (పుట్టినాడు). ఈ రోజున రోహిణీ నక్షత్ర ప్రభావము యిన్నిటను (ఈ లీలలన్నిటికీ) యెంతో మంచిది.

ఈ బాలుడు కంసుడు అనే తన మేనమామ గండముతోటి పుట్టి ఆ దుష్టునకు మృత్యువైనాడు. శిష్టులైన పాండవులకు బావమరిదియై యెన్నో మేళ్ళు చేసినాడు. ఈతడు దుష్టుల వలన భూమికి కలిగిన భారమును తొలగదొబ్బినాడు (తొలగించివేసినాడు). ఈయన, యెండనీడ కన్నులవాడు (రవిచంద్ర నేత్రుడు). ఇక నింతా మంచిది (ఇకపై సర్వమూ మంచే జరుగుతుంది).

ఎంచి చూడగా ఆవులంటే ఈ కృష్ణయ్య పేరుతో మమేకమై గోపాలకృష్ణుడు అనునట్లు అచ్చివచ్చినది. వేవేల (అసంఖ్యాకులైన) గోపికలకు ఈ కృష్ణమోహనుడు గొప్ప విటుడు. నేడు తన దేవేరి అలమేలుమంగతో చేరి శ్రీవేంకటాద్రిపైనున్నాడు. ఇవన్నీ మాకు మా పెద్దలు చెప్పినారు. ఇక ఇంతౌ (ఈ జరుగబోయేదంతా) మంచిది అనేమాట నిజము.

పద్యవివరణ:

తే.గీ.॥ **శిష్టులను బూని మన్నించు శిశువితండు**
దుష్టులనణచి అవనిలో తుదకునెక్కె
గురుడు జగతికి కృష్ణుండు గోపి విటుడు
నేడు తిరుమలనున్నాడు నెలతగూడి.

సంఖ్య: XXVIII/371 రాగం : సాళంగనాట
కీర్తన : ఏమని చెప్పగవచ్చు నీతని ప్రతాపము

సాళంగనాట

38 ఏమని చెప్పఁగవచ్చు నీతని ప్రతాపము
భూమిలో నారదాదులు పొగడే రీతనిని ॥పల్లవి॥

పిడుగులు రాలఁజొచ్చె పెనుఁగంభము వగిలే
వెడలె నందులోల వీరసింహము
కడుపుచించి పేగులు గక్కన జంద్యాలు వేసె
పడె హిరణ్యదైత్యుఁడు పగదీరె నదివో ॥ఏమ॥

ఘోర చక్రము గెరలె కోలువెల్ల బెదరెను
ఆరభటి గావించె నాదిసింహము
ధీరుఁడై నెత్తురు నలుదిక్కులకు వెదచల్లె
పారిరి రాకాసులెల్ల పగదీరె నదివో ॥ఏమ॥

సురలు జయవెట్టిరి శుభములు భువి నిండె
తిరమాయ శ్రీవేంకటదేవ సింహము
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచె దాసుల రక్షించె
పరసేనలు సమసె పగదీరెనిదివో ॥ఏమ॥

ఉపోద్ఘాతము:

ఇతని (ఈ నరసింహుని) ప్రతాపమును యేమని చెప్పవచ్చును? ఇతను భూమిపై నవతరించిన విధమును నారదాదులే కీర్తించినారు అంటున్నారు అన్నమయ్య. అనేక కీర్తనలలో మాదిరిగానే సహజమైన ఆ

నృసింహదేవుని వర్ణనలో సహజత్వం వుట్టిపడుతుంటుంది. ఏడిరా విష్ణువు? ఇందుగలడందులేడని సందేహము వలదు అంటున్నావే? అయితే దీంట్లో చూపించరా అని అక్కడనే వున్న స్తంభాన్ని తన గదతో మోదాడు హిరణ్యకశిపుడు. అప్పుడు ప్రహ్లాదవరదుడు నారసింహుడై దాంట్లోంచి వెలువడి ఆ హిరణ్యకసిపుని గోళ్ళతో చీల్చి, సంధ్యాసమయంలో తన ఒడిలో వుంచుకొని ప్రేగులు వూడపీకి చంపివేశాడు. భీభత్స రస ప్రధానమైన కీర్తన ఇది. చదివి తరించండి.

తాత్పర్య వివరణ:

ఇతని (ఈ నారసింహుని) ప్రతాపమును (శౌర్యమును) యేమని చెప్పగవచ్చును (మాటలలో చెప్పగలమా)? ఈతనిని భూమిపై చేరిన నారదాది మునులు పొగడేరు (కీర్తించేరు).

ఆ హిరణ్యకశిపుడు తన గదతో అక్కడనున్న స్తంభమును మోదగా ఆపెనుగంభము (పెద్ద స్తంభము) వగిలె (పగిలిపోయింది). పిడుగులు రాలుతున్నట్లు ధ్వనులావిర్భవించాయి. దాంట్లో నుండి వీరసింహము వెలువడింది. వస్తూనే ఆ దానవుని కడుపు చించి (పొట్టను చీల్చి) గక్కురన (గబుక్కున) వాని పేగులు జంద్యాల మాదిరి వేసికొనినాడు. అదివో హిరణ్యకశిపుడు పడె (చచ్చిపడ్డాడు) విష్ణుని పగదీరె (పగ చల్లారింది).

ఘోరమైన హరి సుదర్శన చక్రము కెరలె (విజృంభించినది). కోలువెల్లా బెదరె (హిరణ్యకశిపుని కొలువు కూటమి అంతా) భయపడింది. ఆది-నరసింహము ఆరభటి (మ్రోతమోగేట్లు) చేసినాడు. ధైర్యంతో నాల్గు దిక్కులా రక్తము వెదజల్లబడినది. రాకాసులెల్లా పారిరి (పారిపోయారు) అదిగో ఆ నరసింహుని పగదీరె (పగ చల్లారినది).

దేవతలందరూ జయజయధ్వానములు పలికిరి. భూమిపై శుభములు పొడజూపినవి. శ్రీవేంకటమున నెలకొన్న దేవసింహము (కృతయుగంలో నరసింహమైనట్టి ఈ కలియుగపు దివ్య సింహుడు శ్రీవేంకటేశ్వరునిగా) తిరమాయ (స్థిరపడినాడు). ఆనాడు ప్రహ్లాదునిగాచినట్లు నేడు తన దాసులను రక్షించుచున్నాడు. పరసేనలు (శత్రుసేనలు) సమసె (అణగిపోయినవి). అదిగో విష్ణుమూర్తి పగతీరినది.

పద్యవివరణ:

సీ.॥ **పెనుగంభము వగిలె పిడుగులు రాలెను**
వీరసింహమొకటి వెడలెనురికి
వొగి చీల్చి కడుపును ప్రేగుల జంద్యాలు
చేసి, హిరణ్యుని చించి చంపె
ధీరుడైనెత్తురు దిక్కుల వెదజల్లె
పారంగ దనుజులు బావురనుచు
గాచెను ప్రహ్లాదు గరుణించెదాసుల
పరసేన సమసెను పగయుదీరె

ఆ.వె.॥ **ఏమి చెప్పవచ్చునితని ప్రతాపము**
నారదాదులితని శరణువారు
వేంకటాద్రి సింహ విభవంబుదెల్పుడీ
సురులకెల్ల కలుగు శుభములన్ని.

సంఖ్య: XXVIII/173 రాగం : దేవగాంధారి
కీర్తన : వేల గట్టినట్టి వేవేలు చక్కిలాలు

దేవగాంధారి

39 వేలc గట్టినట్టి వేవేలు చకిలాలు
కోలలెత్తుకొని కొట్టీ వీcడె ॥పల్లవి॥

వుట్టులు జతనము వోవో చెలులాల
రట్టడి కృష్ణుdు రావాడీని
గుట్టుతోనే వచ్చి గోపాలులుcదాము
చుట్టి వెన్నలుcబాలు జుట్టీ వీcడె ॥వేలc॥

దొంతులు జతనము దొడ్డుల సతులాల
ఇంతలోc గృష్ణుdు ఇదె వచ్చీని
రంతుసేసుకొని రయమున వీదుల
వింతగా నడుకులు వెదకీ వీcడె ॥వేలc॥

వాడలు జతనము వల్లవాంగనలాల
వేడుకc గృష్ణుdు వెలసీని
యీడనే శ్రీవేంకటేశుc డలమేల్మంగc
గూడి నీతో ముద్దు గునిసీ వీcడె ॥వేల॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో "వేలcగట్టిన" అంటే వేలికి కట్టిన అని కాదు. వ్రేలాడ గట్టిన అని అర్థం. ఆ రోజుల్లో చక్కిలాలు చేసి ఎత్తుగా గోడలకి వ్రేలాడగట్టేవారన్నమాట. వేవేలు అంటే అసంఖ్యామైన అని అర్థం. అసంఖ్యాకమైన చక్కిలాలను ఎత్తుగా వ్రేలాడదీస్తే వీడు కష్టలెత్తి కొట్టి క్రిందపడేసి తన స్నేహితులతో తినేశాడట. అట్లాంటి అఘాయిత్యాలు

చేసిన ఆ దొంగ పిల్లాడు నేడు శ్రీవేంకటేశ్వరుడై మా తల్లి అలమేలుమంగ దగ్గర ముద్దులు గుడుస్తున్నాడు చూడండి అంటున్నారు అన్నమయ్య. ఇందులో శృంగారంపాలు కాస్త యెక్కువే.

తాత్పర్య వివరణ:

ఓ అమ్మలారా! ఈ కృష్ణుడు యేమిచేశాడో చూశారా? అనేకమైన వేలగట్టినట్టి (వ్రేలాడగట్టినట్టి) చక్కిలాలను, వీడే కోలలెత్తికొని (కట్టలను యెత్తి) కొట్టి చిన్న చిన్న ముక్కలు చేశాడు. తిన్నన్ని తిన్నాడు.

వోవో చెలులారా! మేము ఉట్లలో దాచుకొన్న వాటికి ఈ రట్టడి (అఘాయిత్యపు) కృష్ణుడు రావాడీని (ఉపద్రవం కలిగిస్తాడు). గుట్టుతోనే (రహస్యంగా) వచ్చి గోపాలులు తానూ కలిసి చుట్టి (చుట్టుముట్టి) వీడే పాలు, వెన్నా జుఱ్ఱుకొన్నాడు. సరే ఇదంతా ఒక యెత్తయితే వాడి శృంగార చేష్టలు యేమి చెప్పను?

దొడ్డుల సతులారా! (దొడ్డవారైన ఓ వనితల్లారా!) భార్యాభర్తా దొంతుల జతనము (రతిక్రీడ) కు సిద్ధంగా వుంటే ఇంతలో కృష్ణుడు యెక్కడినుండో వూడిపడి, రయమున (శీఘ్రంగా) రంతు సేసుకొని (రతిపూర్తిచేసికొని) వింతగా ఏమీ తెలియనట్లు వీధిలో అటుకులు పడిపోలేదు కదా! అన్నట్లు వెతుకుతాడు. ఎంత జిత్తులమారో చూడండి.

ఓ వల్లవాంగనలాలా! (ఓ గొల్ల భామల్లారా!) గొల్లవాడలలో ఈ వేడుక కృష్ణుడు యేజతనము (ప్రయత్నమూ) లేకుండానే వెలసీని (యెక్కడినుంచో వెలుస్తాడు). ఈడనే (ఈ తిరుమలలోనే) తాను శ్రీవేంకటేశుడై ఓ అలమేల్మంగ తల్లీ! వీడే నీతో ముద్దు గునిసీ (ముద్దులు కుడుస్తున్నాడు).

పద్యవివరణ:

ఆ.వె॥ **వ్రేలఁ గట్టినట్టి వేవేల చకిలాలు**
కోలలెత్తి పడగ గొట్టె వీడు
ముద్దు గునిసినాడు ముదిత శ్రీదేవితో
వేంకటేశుడిపుడు వేడుకాయె.

సంఖ్య: XXVIII/494 రాగం : దేవగాంధారి
కీర్తన : వినయాలు సేసేవు వేంకటేశుడ

దేవగాంధారి

40 వినయాలు సేసేవు వేంకటేశుఁడ
వెనువెంటఁ బాయక వేంకటేశుఁడ ॥పల్లవి॥

విరుల వేసే వదేమో వేంకటేశుఁడ
వెరగయ్యో నీ చేతఁకు వేంకటేశుఁడ
విరివాయ నీసుద్దులు వేంకటేశుఁడ
అరుదుగ వింటిమోయి అన్నీ వేంకటేశుఁడ ॥విన॥

వేడుకకాఁడ వౌదువు వేంకటేశుఁడ
వీడుదోడాడేవు మాతో వేంకటేశుఁడ
వీడెపు మోవి నవ్వేవు వేంకటేశుఁడ
జాడలెల్లా గంటిమోయి సారె వేంకటేశుఁడ ॥విన॥

వేసాల వాఁడవుగదో వేంకటేశుఁడ
వేసారపు రతులను వేంకటేశుఁడ
వేసేవు నాపైఁ జేయి వేంకటేశుఁడా నన్ను
సేసవెట్టి పెండ్లాడేవు శ్రీవేంకటేశుఁడా ॥విన॥

ఉపోద్ఘాతము:

జానపదుల బాణీలో సాగే కీర్తన శ్రీవేంకటేశ్వరునిపై వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ వేంకటేశుడా లేనిపోని వినయములను యెందుకు చూపిస్తావు? నీ అసలు రంగు మాకు తెలియదా? నీవు జగద్వల్లభుడవు క్షణం తీరిక నీకు వుండదు. నిజమే. కానీ నీవు మా వెనువెంటనుండుట మానకయ్యా! అంటున్నారు. తనని తానే నాయికగా వూహించుకొంటున్న అన్నమయ్య నీవే నాపై చేయివేస్తే నేను కరిగిపోకుండా వుండగలనా అటువంటిది నీవేసేసవెట్టి నన్ను పెండ్లాడేవు. నాకింకా కావలసినదేముంటుంది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ వేంకటేశుడా! నీవు లేనిపోని వినయాలు సేసేవు (వినయములను ప్రదర్శిస్తున్నావు). నీవు జగత్పాలకుడవు నిజమే, కానీ యెన్నటికీ నా వెనువెంట (తోడు) బాయక (వదలిపెట్టకు).

ఓ వేంకటేశుడా! నాపై విరులు వేసేవదేమో (పూలను విరజిమ్ముతున్నావు యెందుకనో!) నీ చేతలు వెరగయ్యా (ఆశ్చర్యం కలిగిస్తున్నాయి). ఓ స్వామీ! నలుగురూ నానావిధాలుగా చెప్పుకొంటుంటే నీ సుద్దులు (నీ గురించిన కథలు) విరివాయ (పెల్లుబికిపోతున్నాయి). ఓ వేంకటేశుడా అవన్నీ మేమూ అరుదుగా (ఆశ్చర్యంతో) విన్నాము లేవయ్యా!

ఓ వేంకటేశుడా! నీవు వేడుకకాడవవుదువు (నీవు విలాసపురుషుడివి అనుమాట నిజము). నీవు కావాలని మాతో వీడుదోడాడేవు (విభేదించేవు) తాంబూలం వేసికొన్న పరిమళ భరితమైన నోటితో ఎట్టని పెదవులతో నన్ను చూచి నవ్వేవు. ఓ వేంకటేశుడా ప్రతిసారీ నీజాడలెల్లా (పద్ధతులన్నీ) గమనిస్తూనే వున్నాము.

ఓ వేంకటేశుడా! నీవు వేసాలవాడవు గదో (నటనలో ఆరితేరినవాడవు కదా!) కానీ రతి అంటే మాత్రం నీవు యెన్నటికీ వేసారవు (విసుగు జెందవు) . నీకు అంతమంది కావలసినవారున్నా నా అదృష్టం కొలదీ నీవు నాపై (మీద) చేయివేసి అనుగ్రహించావు. సేసవెట్టి (నాపై అక్షతలు చల్లి) నన్ను పరిణయమాడినావు. నేను ధన్యురాలిని ప్రభూ!

పద్యవివరణ:

కం॥ వినయాలు చేతువేలా?
వెనుదీయక నటనజూపి వేంకటరమణా!
వెనువెంట బాయకయ్యా!
అనవరతము నిన్ను గొలుతు అద్రిజవినుతా!

సంఖ్య: XXVIII/490 రాగం : శంకరాభరణం
కీర్తన : ఇహపరములకును యేలికవు

శంకరాభరణం

41 ఇహపరములకును యేలికవు
బహురూపంబుల ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

వేయిగరంబుల వివిధాయుధంబుల
దాయల నడఁచిన దైవమవూ
నీయందు నున్నవి నిఖిల జగంబులు
పాయక మమ్మేలు ప్రహ్లాదవరదా ॥ఇహ॥

కదిమి దుష్టులను గతము సేసితివి
త్రిదశులఁ గాచిన దేవుఁడవు
వదల కిందరికి వరము లొసంగఁగ
బ్రదికితి మిదివో ప్రహ్లాదవరదా ॥ఇహ॥

శ్రీ వల్లభుఁడవు చిత్తజగురుఁడవు
కావలసినచోఁ గలుగుదువు
శ్రీవేంకటాద్రిని శ్రీయహోబలానను
భావింతు నీమూర్తి ప్రహ్లాదవరదా ॥ఇహ॥

ఉపోద్ఘాతము:

అహోబలంలో వెలసిన ప్రహ్లాదవరద నారసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. అహోబలంలో ఈయన నవనారసింహుడై తొమ్మిది విలక్షణ రూపాలలో వెలసినాడు కావున బహురూపంబుల ప్రహ్లాద వరదుడని కీర్తిస్తున్నారు. మానవులందరికి ఇహమున (ఈ భూలోకంలో) ఈప్సితములు నెరవేరాలి. పరమున అంటే మరణానంతరం ఊర్ధ్వలోకాలో సుఖశాంతులు,

తుట్టతుదకు ముక్తి కావాలి. ఇవన్నీ అనుగ్రహించగలిగినవాడీ నారసింహుడు. ఈయనే తిరుమలేశుడు కూడా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రహ్లాదవరదా! నారసింహా! నీవు ఇహపరంబుల రెండిటికీ యేలికవు (అధిపతివి). బహురూపంబుల (నవవిధములుగానున్న నవనారసింహుడైన) ఆర్తరక్షకుడవు.

ఓ దేవదేవా! నీకున్న వేయి హస్తంబులలో వివిధమైన ఆయుధములను ధరించియుంటివి. మా దాయల (సమీపముననే) నడచిన దైవమవు (దేవుడవు). నిఖిలజగంబులు (సమస్త లోకములు) నీలోనే వున్నవి. అట్టి ఓ ప్రహ్లాదవరదా! పాయక (వదలక) మమ్మేలుమయ్యా!

ఓ ప్రభూ! నీ ఘనకార్యములనేమని చెప్పను? నీవు కదిమి (ఆక్రమించి) దుష్టులను గతము చేసితివి (గతించిన వారిగా చేసినావు). త్రిదశులను (వృద్ధాప్యము అను నాల్గవ దశ లేక మూడే దశలు గల దేవతలను) రక్షించిన దేవుడవు. మమ్మల్ని త్యజించక నేటికి అనేక వరములొసంగుచున్న ప్రహ్లాదవరదుడవు నీవే. అందుకే మేము బ్రతికి బట్టకట్ట గలిగాము ప్రభూ!

ఓ మహానుభావా! నారసింహా! నీవే శ్రీవల్లభుడవు (శ్రీసతి యెప్పుడూ తోడు నీడై వుండు శ్రీపతి అయిన వాడవు). చిత్తజుడైన మన్మథుని గురుడవు (కన్నతండ్రివి). ఓ ప్రభూ! ఆ తిరుమల శిఖరాలపై నున్న శ్రీవేంకటేశ్వరుని గానూ ఈ శ్రీ అహోబలమున ప్రహ్లాదవరదుడైన నిన్నే నేను భావించుచున్నాను. నీ మూర్తి మా యెదుట అహోబలేశుడే. నీవే శ్రీహరివి.

పద్యవివరణ:

కం. త్రిదశుల గాచిన దేవుడు
ఇదిగో మన ఇహపరాల యేలిక యితడే
బ్రదికితిమి సప్తగిరిపతి
యెదురాయె నహోబలంపుయీ నరసింగై.

సంఖ్య: XIII/417 రాగం : మాళవగౌళ
కీర్తన : కంటిమివింటిమి అట్టే కానీవయ్యా

మాళవగౌళ

42 కంటిమి వింటిమి అట్టే కానీ వయ్యా
వెంటనే యశోదకు విన్నవించే మయ్యా ॥పల్లవి॥

చల్లలమ్మే గొల్లెతలో సాములెల్లాఁ జేసితివి
చెల్లునయ్యా నేఁడు నీకు చేసినవెల్లా
గొల్లు(ల్ల?) కంపు నీమెయి నంటె గోరురేక లాపె కంటె
యెల్లవారము నిన్ను నేమనే మయ్యా ॥కంటి॥

మగనాండ్ల సిగ్గులు మానమే కొల్లలాడితి
తగునయ్య తలఁచిన తలఁపెల్లాను
తగిలెఁ బయ్యద నీకు తమక మాపెకు రేఁగె
యెగసక్కే లాడఁగా మాకేమి చలమయ్యా ॥కంటి॥

దొడ్డివారి వావులెల్ల దోమటి దొడికితివి
అడ్డము లేదయ్య నీకు నన్నిటాను
జడ్డు నీకాఁగిట మించె సేస లాపెమీఁద నిండె
వొడ్డి శ్రీవేంకటేశ నేమొనరితి మయ్యా ॥కంటి॥

ఉపోద్ఘాతము:

జానపదశైలిలో కొనసాగిన ఈ గొల్లెతల గోల మధురాతి మధురంగా వినిపిస్తున్నారు అన్నమయ్య. నీగురించి మీ అమ్మ యశోదకు అన్నీ చెప్పేస్తాము. నీవంటిమీదనుంచి వచ్చే గొల్లకంపు నీ గోరురేకలు మేము ఆవిడకు చూపించలేమనుకున్నావాయేమి అంటున్నారు? గొప్పవారితో పెట్టుకొనే సంబంధాలు నిలుస్తాయా యేమి? కానీ నీవామె కౌగిలి వదలవు కదా! నీవే వేంకటేశుడవు నీకు ఒదిగి వుండేమయ్యా! అంటున్నారు. అతి కష్టంమీద గ్రాహ్యమయ్యే శృంగారకీర్తన ఇది.

తాత్పర్య వివరణ:

ఓ కృష్ణా! నీ అల్లరి చేష్టలను కంటిమి (కొన్ని చూస్తూనేవున్నాము), వింటిమి (కొన్ని వివరంగా విన్నాము). అట్టే కానీవయ్యా! (నీ ఇచ్చవచ్చినట్లు కానిమ్ము). మేమూ వూరకుండబోము. నీ తల్లి యశోదకు వెంటనే విన్నవించేమయ్యా! (వివరంగా మనవి చేస్తాము).

నీవు చేసినది యెటువంటి చెడ్డపని? నీవు చల్లలు అమ్ముకొనే గొల్లపడుచుతో సాములెల్లా జేసితివి. (సాహసకృత్యాలు చేసినావు). నేడు నీవు చేసిన కొంటెపనులెల్లా నీకే చెల్లునయ్యా (తగునయ్యా!) నీవు చేసిన కొంటె పనులకు సాక్ష్యం కూడా మావద్ద వున్నది. నీమెయినంటే (నీ ఒంటిని వదలని) ఆ గొల్లకంపు నీవంటిపై యువతి గోటి గీతలు యెల్లవారము (అందరమూ) కంటిమి. నిన్నేమనేమయ్యా!

నీవు మగనాండ్ల (భర్తచాటు భార్యలను) కూడా వదలవు. వారి సిగ్గులూ, మానము (మర్యాద) కొల్లలాడేవు (కొల్లగొడతావు). నీవు తలచిన తలపెల్లా తగునా అయ్యా? వచ్చిన చిక్కేమిటంటే, తన పైటకొంగు నీకు తగిలించి ఆవిడ మైమరిచిపోతోంది. నీతో యెగసక్కేలాడగా (సరసాలాడటానికి) మాకేమి చలమయ్యా (మాకేమిపట్టిందయ్యా?)

కృష్ణా! నీవు అవతలివారు దొడ్డివారా (దొడ్డవారు అనగా బాగా స్థితిపరులు) అని చూడక, వావులెల్లా (సంబంధాలన్నీ) దోమటి తొడికితివి (దొంగవేషాలు వేసి, పెట్టుకుంటున్నావు). అన్నిటాను (దేంట్లోనూ) నీకు అడ్డూ అదుపూ లేవా యేమయ్యా? నీ బిగికౌగిలి, జడ్డు (సంకటము) గా వున్నది. మించిపోయినీ తలంబ్రాలు ఆమెను నిండా ముంచెత్తాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! మేమంతా నీకు ఓడిపోయి ఒనరితిమయ్యా (లొంగిపోయామయ్యా!)

పద్యవివరణ:

ఆ.వె.‖ **వెంటనే యశోద వినగ జెప్పేమయ్యా!**
గొల్లవాడ తమరి కొంటెపనులు
కంటిమన్ని మేము వింటిమి, కానిమ్ము
వేంకటేశుడువు వెలితియేల?

సంఖ్య: XIII/385 రాగం : సాళంగనాట
కీర్తన : మొక్కరో సేవించరో మునులాల ఋషులాల

సాళంగనాట

43 మొక్కరో సేవించరో మునులాల ఋషులాల
దిక్కులు సాధించీ నదే దేవదేవుఁడు ‖పల్లవి‖

(అ)ఆరదముమీఁద నెక్కి అమరులు గొలువఁగ
సిరితో వీధుల నేఁగీ శ్రీవిభుఁడు
గరుడ ధ్వజముతోడ ఘనచక్రాయుధముతో
దొరదైవ మదిగో పొందుగ మెరసీని ‖మొక్కరో‖

గొడుగులుఁ బడిగెలు కోటానఁ గోట్లాడఁగా
వెడలె వెడలె నదే విష్ణుదేవుఁడు
నడుమను రంభాదులు నాట్యములాడఁగాను
అడరి వుత్సవమందీ నాదిమూరితి ‖మొక్కరో‖

సారె నింటింటి విందులు చవులు చూచుకొంటాను
సారెకు రథము దోలీ సర్వేశుఁడు
ఆరీతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
కోరిన వరములిచ్చీఁ గుంభినీరమణుఁడు ‖మొక్కరో‖ **385**

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశుడు భూదేవి అలమేల్మంగలతో కూడి తిరువీధులలో వూరేగింపుగా పోతున్నాడు. అన్నమయ్య ఆనందానికి అవధులు లేవు. ఆయన కళ్ళకు బారులు తీరి స్వామికి మొక్కుదామని వచ్చిన మునులు సేవించుదామని వచ్చిన ఋషులు కనిపిస్తున్నారు. (మనబోటి అల్పులకు కనుపించరు). అత్యుత్సాహంతో అయ్యలారా దిక్కులను సాధించిన ఈ

దేవదేవునికి మొక్కండయ్యా అంటున్నారు. ఈ శుభ సందర్భంలో కోరిన వరాలిస్తాడయ్యా! ఇంకా ఆలోచించకండి స్వామిని సేవించండి అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మునులారా! మ్రొక్కుడయ్యా! ఓ ఋషులారా! సేవింపుడయ్యా! ఇదే తగిన సమయము. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరులతో వూరేగుతున్నాడు. ఆయన దిక్కులన్నీ సాధించిన (గెలిచిన) మొనగాడు. శ్రీవిభుడు (శ్రీకాంతుడు). అరదము (రథము) పైనెక్కి దేవతలు కొలుస్తుండగా సిరితో (వైభవముతో) వీధులలో నేగీ (తిరువీధులలో వూరేగింపుగా పోతున్నాడు.) అదిగో ఆయన గరుడధ్వజము. అదిగో ఘనమైన సుదర్శన చక్రకము. పొందికగా మెరసిపోతున్న ఆ దొరదైవము (పొడవుకు పొడవైన పురుషోత్తముడు) అదిగో చూచితరించండి.

కొందరు స్వామికి గొడుగులు పట్టుకొని వెంటబోతున్నారు. కొందరు పడిగెలు (స్వామి తాంబూలము వుమియుటకు వీలైన పాత్రలు) ధరించి వూరేగింపులో పోతున్నారు. కోటానుకోట్లుగా వున్న జనసందోహంతో అదిగో విష్ణుదేవుడు వెడలెవెడలె (పోతున్నాడయ్యా!) ఆ మధ్యలో రంభాది అప్సరసలు పరవశించి, చక్కగా నర్తించుచున్నారు. ఆదిమూర్తియైన స్వామి అడరి (అతిశయమున) ఉత్సాహముతోనున్నాడు.

ప్రతి ఇంటిముందూ ఆగి వారిచ్చిన నివేదన, విందుగా చవులు చూచుకొంటూ (రుచిచూస్తూ) ముందుకు పోతున్నాడు. తానే స్వయంగా ఆ సర్వేశ్వరుడు రథము తోలుతున్నాడు. ఆ విధముగా శ్రీవేంకటేశ్వరుడి అలమేల్మంగమ్మతో కూడి భక్తులకు అంతులేని వరములనిస్తూ ముందుకు పోతున్నాడు. ఎందుకంటే ఆయన కుంభినీ రమణుడు (భూకాంతుడు) కదా!

పద్యవివరణ:

తే.గీ.॥ **మొక్కి సేవింపుడితనిని మునులు ఋషులు,**
దేవదేవుడు సాధించె దిక్కులన్ని
వీదులను యేగె సతులతో వేంకటపతి
కోరు వరముల నిచ్చును కొఱతలేక.

సంఖ్య: XIII/344 రాగం : శంకరాభరణం
కీర్తన : ఔదువయ్య జాణవు ప్రహ్లాదవరద

శంకరాభరణం

44 ఔదువయ్య జాణవు ప్రహ్లాదవరద
ఆదిగొని మొక్కీని ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

యెదురుఁగొండలెక్కిన యిందిరఁ బెండ్లాడితివి
అది జాణతనము ప్రహ్లాదవరద
వుదుటఁ గోపముమాని వూరకే నవ్వు నవ్వితి-
వదన నాపెఁజూచి ప్రహ్లాదవరదా ॥ఔదు॥

మొగము చూచితేనే మోహముపైఁ జల్లితివి
అగదాయఁ బనులు ప్రహ్లాదవరద
తగిలి కొంగువట్టితే తమకించేవింతలో
అగవుదగవుల ప్రహ్లాదవరదా ॥ఔదు॥

చేయి చాఁచగా నా పెను సిగ్గువీడఁ గూడితివి
ఆయ మెఱుఁగుదువు ప్రహ్లాదవరదా
యీయెడ నహోబలాన నిట్టే శ్రీవేంకటాద్రిని
ఆయిత్తము పెండ్లిండ్లు ప్రహ్లాదవరదా ॥ఔదు॥ **344**

ఉపోద్ఘాతము:

ఆదిగొనుట అంటే కన్నువేయుట అని అర్థం. ఓ ప్రహ్లాదవరదా! నీవు గొప్ప చతురుడవు అవుదువులే. అందుకనే ప్రత్యేకంగా నీపై కన్నువేసి నీకు మొక్కేమయ్యా! అంటున్నారు అన్నమయ్య. నీ గరుడాద్రి, భవనానికి నదికి ఇద్దరిని వుంటే నదికి ఆవలిగట్టున వున్న కొండమీద ఇందిరాదేవి వున్నది. ఈయనగారు నదిని దాటి వెళ్ళి ఆమెను తాను వైభవంగా పెండ్లాడుతాడు. ఆయన అంతటి జాణ

అంటున్నారు. అంతేకాదు శ్రీవేంకటాద్రిమీద ఈ ప్రహ్లాదవరదునికే ఆయుత్తపు (సిద్ధముగానున్న) నిత్యకళ్యాణములు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రహ్లాదవరదా! నీవు జాణవు (చతురుడవు) ఔదువయ్యా! (అయ్యెదవులేవయ్యా!) మేము నీకు ఆదిగొని (నీపై కన్నువేసి), నీకు మొక్కేమయ్యా!

ఓ ప్రహ్లాదవరదా! యెదురు గొండలెక్కిన (గరుడాద్రి కెదురుగాన్ను శ్రీగిరి కొండలెక్కి వెలసిన) యిందిరను (ఆదిలక్ష్మిని) పెండ్లాడినావు. అది జాణతనముకాదా ప్రభూ! నీ వుదటు కోపమును (ఉప్పొంగు ఆగ్రహమును) మాని (వదలివైచి) వూరకే నవ్వు నవ్వితివి (నవ్వులు వెదజల్లుచున్నావు). స్వామీ! అదన (తగిన సమయం చూసికొని) ఆపెను రహస్యముగా చూచుచున్నావు.

ఓ ప్రహ్లాదవరదా! ఆమె నీ ముఖమును పరిశీలనగా చూస్తే నీ జగన్మోహన వదనం కనబడునట్లు చేసి మోహమును, పైచల్లితివి (గుప్పించితివి). నీ చేతలు ఆగడాయె (నింద్యములాయె). ఇదెక్కడి చోద్యమయ్యా! ప్రహ్లాదవరదా? ఆమె తగిలి (పురికొల్పి) నీకొంగు (ఉత్తరీయపు అంచును) పట్టుకొనగానే, ఇంతలోనే తమకించేవు (పరవశిస్తావు). ఆపై అగవుతగవులయ్యేవు (శోభనమునకు సంసిద్ధుడయ్యేవు).

ఓ ప్రహ్లాదవరదా! నీవు శృంగారరాయడవు. ఆమె తన చేయి నీకు తన చేతిని అందించగానే సిగ్గును వదలి ఆమెను కూడితివి. నీవు ఆయమెరుగుదవయ్యా (మర్మములన్నియు తెలిసినవాడు.) ఇపుడు ఈ అహోబమున అక్కడ ఆ వేంకటనగమున పెండ్లిడ్లకు ఆయిత్తమై (సంసిద్ధుడవై) నిత్యపెండ్లికొడుకని పేరుగాంచితివి. ఓ ప్రహ్లాదవరదా! నీకు నీవే సాటి.

పద్యవివరణ:

కం.॥ **ఔదువు జాణవు నీవే**
ఆదిగొనేమయ్యమేము అవుభళసింహా!
ఆదిమలక్ష్మీవల్లభ!
యేదీ ప్రహ్లాదవరద! యెదురికనీకున్

సంఖ్య: XIII/92 రాగం : సాళంగనాట
కీర్తన : దేవతలు చెలగిరి దిక్కులెల్లా సంతోషించె

సాళంగనాట

45 దేవతలు చెలఁగిరి దిక్కులెల్లా సంతోషించె
ఆవల నసురలెల్ల నడఁగిరి యపుడే ॥పల్లవి॥

అందమై మధురలోన నదివో కృష్ణావతార-
మందెను శ్రావణబహుళాష్టమి నేఁడు
దిందుపడిరి దేవకీదేవి వసుదేవుఁడును
అందిరి బ్రహ్మానంద మంతరంగములను ॥దేవ॥

నడుమ రేపల్లెలోన నందగోప యశోదల
కొడుకై పెరిగెనదే గోవిందుఁడు
అదరి గోపికలును ఆవులమందలును
వుడివోనివేడుకల నుప్పొంగఁ కలిగెను ॥దేవ॥

ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిదె తిరుపతిలోన
వుప్పతిల్లి దేవుఁడై వున్నాఁడిదే
చిప్పిలి సేవకులును శ్రీసతిదేవియును
కప్పి నానాగతులఁ బొగడఁగఁ దొడఁగిరి ॥దేవ॥

ఉపోద్ఘాతము:

ఒకానొక కృష్ణాష్టమి సందర్భంగా అన్నమయ్య వినిపించిన శ్రీకృష్ణావతారదృశ్యాన్ని ఈ కీర్తన ద్వారా ఆస్వాదించండి. దేవతలు కేరింతలు పెట్టారట సంతోషంతో. అందువల్ల దిక్కులన్నీ ఆనందించాయట. అటుపైన రాక్షసులు రాక్షస అంశలతో జన్మించిన రాజలోకం అంతా క్రమంగా నశించాయట. ఆ కృష్ణమూర్తే ఇప్పుడు తిరుపతిలో వుప్పతిల్లి దేవుడై

వున్నాడట. ఇట్లాంటి కీర్తనలు అసంఖ్యాకంగావున్నప్పటికి, ఇది అన్నమయ్య భక్తియజ్ఞం కాబట్టి దీని మాధుర్యం దీనిదే.

తాత్పర్య వివరణ:

దేవతలు చెలగిరి (ఉత్సాహంతో కేకలు పెట్టారు). దిక్కులన్నియు సంతోషించినవి. ఆవతల (తదనంతరం) అప్పుడే అసురులెల్లా (రాక్షసజాతి అంతా) అడగిరి (నశించిపోయారు).

నేడు శ్రావణ బహుళ అష్టమి. శ్రీకృష్ణునిగా శ్రీమహావిష్ణువు అవతరించినాడు. అదిగో అందమైన మధురానగరంలో ఆ కృష్ణావతారము జరిగినది. దేవకీదేవి వసుదేవుడు, దిందుపడిరి (ఆనందంతో మూర్ఛపోయినట్లయ్యారు). వారు అంతరంగమున బ్రహ్మానందమును పొందారు. పరమాత్మ తమ కన్నబిడ్డ అయితే ఇంకా కోరేదేముంటుంది?

అటుపిమ్మట వసుదేవుడు పరమాత్మ ఆజ్ఞప్రకారం ఆ బాలుని రేపల్లె మధ్యలోనున్న నందగోపుని భవనం చేర్చి ఆయన భార్య యశోదాదేవి పొత్తిళ్ళలో వున్న యోగమాయతో మార్పిడి చేశాడు. తిరిగి మధురకు పోయాడు నాటినుండి పరమాత్మ యశోదా నందగోపుల కొడుకై పెరిగినాడు. అదరి (అతిశయించి) గోపికలు, రేపల్లెలోని ఆవులమందలు, వుడివోని (తొలగని) సంబరాల్లో వుప్పొంగి పోయిరి.

ఇప్పుడు ఇదె శ్రీవేంకటాద్రి నెలకొన్న తిరుపతిలో గోవిందరాజస్వామివలె వుప్పతిల్లి (ఉత్పత్తియై) దేవుడైవున్నాడు. చిప్పిలి (ఉప్పొంగి) సేవకులును శ్రీమన్నారాయణుని పరివారమూ, శ్రీలక్ష్మీదేవీ క్రిందకు దిగివచ్చి అనేకవిధములుగా ఆ గోవిందుని బొగడగ నొడగిరి (కీర్తించనారంభించిరి.)

పద్యవివరణ:

చం.॥ **చెలగిరిదేవతల్ దిశల చిప్పిలె సంతస సౌరభమ్ములున్**
తొలగిరి దైత్యులున్ యముని తోవనుబట్టిరి పాసిజీవముల్
వెలసెను కృష్ణమూర్తి ఇలవేడుకజేయగ నందగోపులున్
అలరెను నేడు వేంకటము ఆతడె వేంకటరాయడౌటచే.

సంఖ్య: I/134 రాగం : ముఖారి
కీర్తన : ఎంతసేయగలేదు యిటువంటివిధి యభవు

ముఖారి

46 ఎంత సేయఁగలేదు యిటువంటివిధి యభవు-
నంతవానిని భిక్షమడుగుకొనఁజేసె ॥**పల్లవి**॥

కోరి చంద్రునిఁ బట్టి గురుతల్ప గునిఁ జేసె
కూరిమలరఁగ నింద్రుఁ గోడిఁ జేసె
ఘోరకుడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె
వీరుఁడగు నలుఁ బట్టి విద్రూపుఁ జేసె ॥**ఎంత**॥

అతివ నొడ్డుగఁ జూదమాడ ధర్మజుఁ జేసె
సతి నమ్ముకొన హరిశ్చంద్రుఁ జేసె
కుతిలపడ శూద్రకుని గొత్తెముచ్చుగఁ జేసె
మతిమాలి కురురాజు మడుఁగుచొరఁజేసె ॥**ఎంత**॥

పడనిపాట్లఁ బరచి బ్రహ్మతల వోఁజేసె
తొడరి కాలునికాలు దునియఁ జేసె
అడర నీవిధికి విధియగు వేంకటేశుకృప
పడయకుండఁగ భంగపడకపోరాదు ॥**ఎంత**॥ **134**

ఉపోద్ఘాతము:

ఇటువంటి ఘోరమైన 'విధి' ఎంతైనా చేయగలదు అంటున్నారు అన్నమయ్య. దీనికి అసాధ్యమంటూ యేదీవుండదు. పుట్టుకేలేని పరమశివుడంతటి వాడిచేత బిచ్చం యెత్తించిందండీ ఆ విధి, అంటూ విధి వంచితుల నేకరువుపెడుతున్నారు.

చక్కటి సీసపద్యంలో కూడా దీన్ని వివరించాను. కుతిలపడు శద్రకుని గొఱ్ఱెముచ్చుగజేసిందట విధి. బాగా ఆలోచిస్తేనే గాని దీని అంతు చిక్కలేదు. ఈ శూద్రకుడినే దక్షప్రజాపతి అని కూడా అంటారు. వీరభద్రుడు ఆయన తలత్రుంచి అగ్నిగుండంలో వేశాడు. శివుడు కరుణించి అతనికి గొఱ్ఱెతల పెట్టాడు. అట్లా ఆతని మత్సరము నశించింది. ఆ శ్రీవేంకటేశుని కృపలేకపోతే ఆ విధిచే భంగపాటు తప్పదంటున్నారు.

తాత్పర్య వివరణ:

అశక్యమైన 'విధి'యనునది, ఎంతసేయగలేదు? (ఎంతటి పని చేయలేదు?) ఇటువంటి 'విధి' యెంతైనా చేయగలదు. పుట్టుకయేలేని అభవుడైన పరమశివునియంటివానిని అది కాశికానగరములో భిక్షమడుగుకొను బిచ్చగానిగా చేసినది కదా!

లక్ష్మీదేవితోబుట్టువైన సద్గుణ సమోన్నతుడు చంద్రుడంతటివానిని 'గురుతల్పగుని' గురుపత్నితో ఏకశయ్యాగతుని చేసి పంచమహాపాతకములలో ఒకదానిని అంటగట్టినది. కూరిమి అలరగ (ప్రేమోన్మాదియైన) దేవేంద్రుడంతటి వానిని అహల్య కొరకు కోడివలె కూయునట్లు జేసినది. "త్రిశంకు" వంటి ఇక్ష్వాకుకుల సంజాతుని ఘోరమైన అంత్యజుని (ఛండాలుని) జేసినది. వీరాధివీరుడు, అందగాడుయైన "నల" మహారాజుని విద్రూపుని (కురూపిని) చేసినది.

అంతేకాదు అసాధ్యమైన 'విధి' ధర్మరాజంతటి ధర్మమూర్తితో పెండ్లామును పందెముగానొడ్డి ఓడిపోయి, వలువలు విప్పింపజేసినది, హీనునిగావించినది. హరిశ్చంద్రునంతటి శ్రీరామచంద్ర పూర్వజునిచేత తన స్వంత భార్యను అంగడిలో అమ్ముకొనునట్లు చేసినది. కుతిలపడు (ఈర్ష్యతోబాధపడు) శూద్రకుని (దక్షప్రజాపతి) అంతటివానిని శివద్వేషిగాజేసి, గొఱ్ఱెముచ్చు (గొఱ్ఱెతల కలిగిన బ్రతుకు నంటగట్టినది.) కురుసార్వభౌముడైన, మానధనుడు

సుయోధనుని జేత మడుగున దాగించి ఇంకా బ్రతికియేమి వుపయోగమని తిట్టించినది.

ఆవిరి (పడరాని) పాట్లతో బ్రహ్మదేవునంతటివానిని అసత్యవాదిని జేసి, పరమశివునిచేత ఒక శిరస్సును తెగవేయించినది. కాలుని చేత (యమునితో) శివుని తొడరి (ధిక్కరింపజేసి) మార్కండేయుని ప్రాణములు గొనిపోవునాడు త్రిశూలముచే ఒక కాలిని నరికించి కుంటివానిని జేసినది. ఇవన్నీ ఇట్లగుట నిజమే అయినా, అడర (అతిశయించునట్లుగా) ఈ దుస్సహమైన "విధి"కి విధియగు (అశక్యుడగు) శ్రీవేంకటేశ్వరుని, కృప పడయకుండగ (పొందకుంటే) ఆ విధితో భంగపాటు తప్పదు సుమా!

పద్యవివరణ:

సీ. అభవునంతటివాని అల భిక్షమెత్తించు,
చంద్రుని గురుపత్ని సంగమించు.
కూర్మితో ఇంద్రుని గూయించుకోడిగా,
అంత్యజుగావించునటు త్రిశంకు,
నగుబాట్లతో జేయు నలరాజును కురూపి,
ధర్మజు జూదానదగులజేయు.
సతినమ్మగాజేయు సత్యహరిశ్చంద్రు,
కురురాజు మడుగున గూలజేయు
కాలునంతటి వాని కాలు కుంటిగజేయు,
బ్రహ్మతలను తెగిపడగజేయు

తే.గీ.॥ **ఎంతసేయగ లేదయ్య యీ విధి మము**
విధిని యేమందుమోరయ్య! వేంకటేశ!
విధికి విధియగు నీకృప వెలయగాను
భంగపాటుండబోదయ్య! భయములేదు.

సంఖ్య: I/2 రాగం : దేసాక్షి
కీర్తన : వేదవేద్యులు వెదకేటిమందు

దేసాక్షి

47. వేదవేద్యులు వెదకేటిమందు
ఆదినంత్యములేని ఆమందు ॥పల్లవి॥

అడవిమందులుc గషాయములు నెల్లవారు
కడగానక కొనcగాను
తొడిcబడ నొకమందు దొరకె మాకు భువి-
నడియాలమైనట్టి ఆమందు ॥వేద॥

లలితరసములుc దైలములు నెల్లవారు
కలకాలము గొనcగాను
చెలువైన దొకమందు చేరె మాకు భువి-
నలవిమీఱినయట్టియామందు ॥వేద॥

కదిసినజన్మరోగముల నెల్లవారు
కడలలేక వుండcగాను
అదన శ్రీతిరువేంకటాద్రిమీcదిమందు
అదివో మాగురుc డిచ్చె నామందు. ॥వేద॥ **2**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో అన్నమయ్య మహామహులైన వేదనిష్ణాతులు ఏమందుకోసం వెదకుతారో, ఏమందు అనాదిగావుండి భవిష్యత్తులోకూడా నిరంతరం వుపయోగంలో వుంటుందో, పుట్టుకలు అనే అందరికీ వచ్చే మాయరోగానికి ఒక తిరుగులేని మందును సూచిస్తున్నారు. దాని విశిష్టత చెప్పనలవికానిది అంటున్నారు. దాన్ని మామూలు నాటు వైద్యులు ఇవ్వలేరు, స్వయంగా మా గురుదేవులిచ్చారు. తిరుగులేని ఆ మందు తిరుమల శిఖరాలమీద దొరుకుతుంది అంటున్నారు. ఇంతకీ యేమిటామందు?

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! ఇప్పుడు మీకు ఒక గొప్ప మందు (ఔషధం) స్వీకరించమని సూచిస్తున్నాను. అది యెంతటిదో తెలియునా? వేదమును కూలంకషంగా నేర్చినవారు యెక్కడ దొరుకుతుందా అని వెదకేమందు అదే.

దానికి 'ఆది' యెన్నడో తెలియదు. 'అంత్యము' లేనేలేదు. మీకు ఇదివరలో తెలియక, యెన్నో అడవి మూలికల మందులూ, కషాయములూ కడగానక (అంతులేకుండా) కొనగాను (తీసికొన్నాము). ఆపై మాకు, తొడిబడన్ (సంభ్రమం కలిగించునట్లు) ఒకమందు దొరికింది. అది అడియాలమైనమందు (బాగా గుర్తుపెట్టుకోదగ్గ మందు). ఎన్నడూ మరువరాదు.

బాగా స్థితిపరులు, ధనికులు లలితరసములు (చక్కటి రసాయనాలను) తాగుతారు. వారు మంచి తైలములనుపయోగిస్తారు. ధనవంతులైనందువల్ల కలకాలము వారు బ్రతికున్నంతకాలము వారు యెంతో శ్రమపడతారు. ఆ బాధ దేనికండీ? మావద్ద ఒక చెలువైన (అందమైన) మందు వున్నది. అది ఈ భూమిమీద, సులభంగా మాకు దొరికింది. ఆ మందు 'అలవిమీరిన'యట్టి మందు (పరిమితిలేని మందు). ఎంతైనా, యెప్పుడైనా, యెక్కడైనా ఆ మందు తీసికొనవచ్చును.

ఒక రోగంవున్నది. దానిపేరు 'జన్మ'. ఆ రోగం రానివాడు వుండడు. సన్మార్గులకూ వస్తుంది, దుర్మార్గులకూ వస్తుంది. అది వచ్చినవారు కదలలేరు (తప్పించుకోలేరు). కదిసిన జన్మలను (అనుబంధాలను కలిగించే జన్మలు) తప్పనే తప్పవు. అయితే మా గురుదేవులు ఈ జన్మల మాయరోగానికి ఒక గొప్ప మందును సూచించారు. అది శ్రీవేంకటాద్రిమీద, అదన (నిరంతరం) దొరుకుతుంది. ఆ మందుపేరు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి.

పద్యవివరణ:

తే.గీ.॥ **వేదవేద్యులు పనివడి వెదకు మందు**
ఆదినంత్యములేకుండ అలరు మందు
అదన శ్రీవేంకటాద్రిపై అమరుమందు
అదియె మాగురుడిచ్చినయట్టి మందు.

సంఖ్య: I/116 రాగం : ఆహిరి
కీర్తన : తోరణములే దోవెల్లా

ఆహిరి

48 తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచినలతల ॥పల్లవి॥

కూరిమిమటములు గోపురంబులును
తేరుపడగెలే తెరువెల్లా
కోరినపండ్లుగురిసేటితరువులు
తోరములైన వెదురు జొంపములు ॥తోర॥

ఆటలుc దిరుపులు నందపుటురుపులు
పాటలు వనవైభవమెల్లా
కూటువ నెమళ్ళ కోవిల గుంపుల
పేటలc దేటలపెనుcగూటములు ॥తోర॥

వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయcడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవcగను ॥తోర॥ **119**

ఉపోద్ఘాతము:

పరుషలు అంటే బాటసారులు అని అర్థం. ఇక్కడ తిరుమల సందర్శించే భక్తులు అని విశేషార్థం చెప్పుకోవాలి. తిరుమల శిఖరాలమీద ఆనాటి వైభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. ప్రకృతి సిద్ధమైన ఆశోభ, పండ్లతోటలు, నెమళ్ళ ఆటలు, కోయిలల పాటలు గురించి యెంత చెప్పినా తక్కువే అవుతుంది. ఈ కీర్తనలో మనము యెన్నడూ వినని, గొంజెగొడుగులు, పేటల దేటల పెనుగూటములు, తోరములైన వెదురు జొంపములు – వంటి మాటలకు అర్థాలు అంత తేలికగా అంతుచిక్కవు.

తాత్పర్య వివరణ:

శ్రీవేంకటేశ్వరుని ఊరేగింపు తిరుమలలో సాగుతున్నది. ఆ తోవెల్లా (దారియంతా) తోరణములే (మామిడి ఆకులతోనూ, రంగు రంగుల పూదండలతోనూ, ద్వారముల వద్ద కట్టు దండలు) కొన్ని తోరణములు లతలతో కట్టారు. ముంచిన (కమ్ముకొనిన) ఆ లతలు కొన్ని మూరెడువున్నాయి), కొన్ని బారెడు వున్నాయి.

ఆ తిరుమల నిండుగా యాత్రికులకొరకు, కూరిమితో (ప్రేమగా) కట్టిన 'మటములు' (మఠములనెడి యాత్రికుల నివాస మంటపములు) వున్నవి. ఎక్కడ చూచినా గోపురాలే కనబడుతున్నాయి. తెరువెల్లా (దారినిండా) తేరుపడగలె (రథములయొక్క జెండాలే). అక్కడ తరువులు (చెట్లు) కోరినపండ్లను (కావలసి ఫలములను) ఇస్తున్నాయి. కొందరు, వెదురు జొంపములను (వెదురు కొమ్మలను) తోరణములుగా కట్టారు.

ఇక ఆ ఊరేగింపులో, ఆటల తిరుపులు (నృత్యంచేస్తూ తిరిగే వారు) వారంతా అందమైన వరుపులు (అలంకరణ) కలవారు. ఆ వనమంతా వారి పాటలతో మారుమ్రోగుతున్నది. వైభవము తాండవిస్తున్నది. వారి కూటమిలో వనములలోని నెమళ్ళూ చేరి ఆడుతున్నవి. పాడేవారితోపాటు కోయిలలు కూడా గొంతు కలిపినవి. పేటల దేటల పెనుగూటములు (స్వచ్ఛమైన హారములను ధరించినవారు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు.)

ఊరేగింపులో వింజామరలతో వీచేవారూ, విసనకఱ్ఱలతో స్వామికి విసిరేవారూ, గొంజెగొడుగులు (వారికి అవసరమైతే ముడుచుకొనే గొడుగులు) పట్టుకొని స్వామిని సేవించేవారూ, ఆ కొండనిండా కనుపించుచున్నారు. అంజనాద్రీశుడైన శ్రీవేంకటేశ్వరుడు పరుషలకు (యాత్రికులైన బాటసారులకు) సంజీవని (ప్రాణమును నిలబెట్టే దివ్యౌషధమై) ఒదవగ (అమరియున్నాడు).

పద్యవివరణ:

ఆ.వె.॥ **తోరణములె చూడుదోవెల్ల దండిగా**
మూరబారలున్న ముంచు లతలు
అంజనాద్రిపతియె అమరిన సంజీవి
గిరుల వరుసమీద పరుషలకును.

సంఖ్య: I/144 రాగం : సామంతం
కీర్తన : సులభమా మనుజులకు హరిభక్తి

సామంతం

49 సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుఁడౌట ॥పల్లవి॥

కొదలేనితపములు కోటానఁగోటులు
నదన నాచరించి యటమీఁద
పదిలమైనకర్మబంధము లన్నియు
వదలించుకొనికదా వైష్ణవుఁడౌట ॥సులభ॥

తనివోనియాగతంత్రములు లక్షలసంఖ్య
అనఘుఁడై చేసినయటమీఁద
జననములన్నిట జనియించి పరమపా-
వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట ॥సులభ॥

తిరిగితిరిగి పెక్కు తీర్థములన్నియు-
నరలేక సేవించినటమీఁద
తిరువేంకటాచలాధిపుఁడైన కరిరాజ-
వరదునికృపఁగదా వైష్ణవుఁడౌట. ॥సులభ॥

ఉపోద్ఘాతము:

పెద్దలు చెప్పేది పరమసత్యమైనది ఒక మాట వున్నది. హరి భక్తి మనిషికి కలుగవలెనంటే అది అంత తేలికైన పనికాదు. జన్మాంతరవాసనలవల్ల అది (హరిభక్తి) కలుగుతుంది. అలాగే జన్మాంతపుణ్యంవలన హరి భక్తి మన మనస్సులో స్థిరపడుతుంది. ఇంతటితో సరిపోదు జన్మాంతర సాధన దీక్షవలన మాత్రమే మోక్షం లభిస్తుంది. అయితే ఆ జన్మలు మానవ జన్మలవ్వాలని నియమం కూడా యేమీలేదు. ఏజీవియైనా యెప్పటికైనా వైష్ణవుడు కావాలంటే తిరువేంకటేశ్వరుని కృప కలిగి తీరవలసిందే. గజేంద్రమోక్షం గాధ మనకు నొక్కి వక్కాణించేది ఈ

మాటనే. ఎన్ని తపస్సులు చేసినా కర్మబంధం అంత తేలికగా వదలదు. ఎన్ని యాగ తంత్రములు చేసినా, యెన్నో జన్మలు పొందటమేగాని పరమపావనుడైన వైష్ణవుడవాలంటే హరికృప వుండితీరాలి అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

మనుజులకు హరిభక్తి కలుగవలెనంటే సులభమా? (అంత తేలికయైన పనియా?) వలనొంది (వైష్ణవదీక్షకు అనుకూలుడై) మరి కదా! (తదుపరి కదా!) నిజమైన వైష్ణవుడౌట.

కొదలేని (అంతులేని) కోటానుకోట్ల సంఖ్యలో తపములనాచరించిన, యటమీద (ఆపైన) అదన (అప్పుడు) పదిలమైన (భద్రంగా వెంటవచ్చే) కర్మబంధములనన్నింటినీ వదిలించుకొనవలెను. అప్పుడు కదా నరుడు వైష్ణవుడై వర్ధిల్లగలడు.

ఇట్లు తపస్సు చేసేవారి గురించి చెప్పుకొన్నాం. వీరు, తనివోని (తృప్తి అనేది లేకుండా) లక్షల సంఖ్యలో యాగతంత్రములను (గొప్ప తంత్రముతో కూడిన యాగములను) నిర్వహిస్తారు. ఆ యాగములను చేయుటవలన అనఘుడై (పుణ్యుడై) అనేకము చేసినమీదట, అన్నిరకములైన జన్మలను పొందిన అనంతరం పరమపావనుడై (గొప్ప పుణ్యాత్ముడై) జీవిస్తాడు. అప్పుడు కదా! అతడు వైష్ణవుడై తరించేది?

ముందుగా జీవికి తీర్థయాత్రలపై మక్కువ ఆ హరిభక్తి వలననే కలుగుతుంది. అప్పుడు తిరిగి తిరిగి పెక్కు (అనేక) తీర్థములను అరలేక (తొందరపాటులేక) సేవిస్తాడు. అటుమీద (ఆపైన) కరిరాజవరదుడైన (గజేంద్రప్రాణ సంరక్షకుడైన) తిరువేంకటేశ్వరుని కృపను సంపాదిస్తాడు. అప్పుడు కదా! వాడు నిజమైన వైష్ణవుడవుతాడు అది అంత సులభమనుకున్నారా యేమిటండీ?

పద్యవివరణ:

చం.॥ **సులభముకాదు మానవుడు సొంపగువైష్ణవభక్తుడౌటయున్**
వలనుతనొందినన్ మనునువైష్ణవుడై, చనుపెక్కు తీర్థముల్
కొలుచును వేంకటేశ్వరుని కోరికలొగ్గుచు దాస్యదీక్షచే
కలుగును అట్టి జన్మ ఘనకర్మల యాగపు తంత్రపంక్తులన్.

సంఖ్య: I/83 రాగం : ముఖారి
కీర్తన : ఎందు బొడమితిమో యెఱగము మా-

ముఖారి

50 ఎందుఁ బొడమితిమో యెఱఁగము మా-
కందువ శ్రీహరికరుణేకాక ॥పల్లవి॥

ఏఁటిజన్మమో యెఱఁగము పర-
మేఁటిదో నే మెఱఁగము
గాఁటపుకమలజుఁ గాఁచినయీ-
నాఁటకుఁడే మానమ్మినవిభుఁడు ॥ఎందుఁ॥

యెవ్వారు వేల్పులో యెఱఁగము సుర-
లెవ్వరో నే మెఱఁగము
రవ్వగుశ్రీ సతిరమణుఁడు మా-
కవ్వనజోదరుఁ డంతరియామి ॥ఎందుఁ॥

యింకానేఁటిదో యెఱఁగము యీ-
యంకెలబాముల నలయము
జంకెల దనుజులఁ జదిపినతిరు-
వేంకటేశుఁడు మావిడువనివిభుఁడు ॥ఎందుఁ॥ **83**

ఉపోద్ఘాతము:

ఇప్పుడు ఈ జన్మలో ఇక్కడున్నాము కానీ మనం ఎక్కడనుంచి వచ్చామో ఈ జన్మతరువాత మరణానంతరం యెక్కడకు పోతామో మనమెవ్వరమూ యెఱుంగము. మా శ్రీహరి కరుణాసాగరుడు. అనన్యమైన ఆయన కరుణే లేకపోతే మేము యేమైపోయేవారమో అని అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశ్వరుడు మేము నమ్ముకొన్న దైవము. అందుచేత అంకెల బాముల

నలయము అంటున్నారు. అంటే... మేము, యెన్నో జన్మలను పొందినా శ్రమపడము, యెందుకంటే మేము తిరుమలేశుని శరణాగతులము.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! మేము ఎందు బొడమితిమో (ఎక్కడినుంచి పుట్టామో) తెలియదు. మా యొక్క కందువ శ్రీహరి (సమర్థుడైన విష్ణువు) యెంతో కరుణామయుడు. ఆయన కరుణేకాక మాకు దిక్కేమి వున్నది?

మేము అజ్ఞానులము అని వేరే చెప్పవలసిన పనిలేదు. మాకు దొరికిన ఈ జన్మ యెటువంటిదో యెరుగము. మాకు రేపు ఏమవుతుందో తెలియదు కదా! ఒకవేళ ఈ జన్మ అంతమై పరలోక ప్రాప్తి కలిగితే ఆ పరలోకమెట్లుండునో యెరుగము. గాటపు (సృష్టికర్తయైన) కమలజుని (బ్రహ్మదేవుని) సోమకాసురుని బారినుండి కాచిన (రక్షించిన) ఈ నాటకుడే (జగన్నాటక సూత్రధారియే) మా నమ్మిన విభుడు (జగపతి).

అనేకులు ఈస్వామి ఆశ్రితులు. వీరిలో యెవ్వారువేల్పులో (దేవతలో) సుర లెవ్వారో (ఊర్ధ్వలోకాలలో వుంటూ తమ కర్మశేషం అనుభవిస్తున్నవారెవరో) మేము యెరుగము. వజ్రమువలె విలువైన శ్రీరమాపతి మాదైవము. అంతెందుకు అంతర్యామిగా మాలోవున్నది మాకుసర్వస్వమైన ఆ వనజోదరుడే (ఆ పద్మనాభుడే) సుమా!

సరే! యిప్పటివరకు అయినదేదో అయినది. ఇకపై యేమవుతుందో అదైనా యెరుగము. ఈ అంకెల బాముల నలయము (ఈ, యెన్నోచెప్పలేని జన్మల పీడతో అలసిపోము.) జంకెల దనుజుల (భయంకరమైన రాక్షసులను) చదును చేసిన శ్రీవేంకటేశ్వరూడు, మమ్ము యెడబాయని విభుడు మా భర్త.

పద్యవివరణ:

ఉ.॥ **ఎందుజనింతుమో యెఱుగ మించుకయైనను శ్రీహరే కదా!**
కందువగాచినాడతడు గాటపు బ్రహ్మను, నాటకీడు, భో!
ముందుగ నమ్మి మొక్కెదము మోదముతో తిరువేంకటేశ్వరున్
యెందును దైత్యమూకలకునెన్నడు జంకము వీడ మీ హరిన్.

సంఖ్య: I/84 రాగం : రామక్రియ
కీర్తన : వెలయ నిన్నియును వృథా వృథా

రామక్రియ

51 వెలయునిన్ని యును వృథా వృథా
తలఁపున శ్రీహరిఁ దడసినను ॥పల్లవి॥

ఎడయనిపుణ్యము లెన్నియైనా
విడువక సేయుట వృథా వృథా
బడిబడి నే శ్రీపతి నాత్మలోఁ
దడవక యితరము దడవినను ॥వెలయు॥

యెరవులతపముల నెంతైనా
విరవిరవీఁగుట వృథా వృథా
హరినచ్యుతుఁ బరమాత్మునిని
మరిగి తలఁచక మఱచినను ॥వెలయు॥

దైవము వెఱఁగక తమకమున
వేవేలైన వృథా వృథా
శ్రీవేంకటగిరి చెలువునిని
సేవించక మతిఁ జెదరినను. ॥వెలయు॥

ఉపోద్ఘాతము:

ఎన్నిచేసినా, యేమిచేసినా అంతా వృథా వృథా. బూడిదలోపోసిన పన్నీరు వలె శుద్ధ దండుగ. మనకి ఈ జన్మనిచ్చిన శ్రీహరినే తలపులో యెప్పుడోకానీ తలుచుకోకపోతే ఇక మనిషిగా బ్రతికి యేమివుపయోగం అంటున్నారు అన్నమయ్య. శ్రీపతి నీ ఆత్మలో నిలుపుకోలేనప్పుడు యెన్ని పుణ్యకర్మలు చేసినా యేమి ప్రయోజనం చెప్పండి. అంతా వృథా వృథా అని అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! తలపున (మీ ఆలోచనలో) అనగా మీ మనస్సులో శ్రీహరి, తడసినను (ఆలస్యముగా కూడా మీకు స్ఫురణకు రాకపోతే...) ఇన్నియునూ వెలసి (వుండి) కూడా అంతయునూ వృథావృథా! (శుద్ధ దండుగే).

ఎడయక (యెడబాటన్నది లేక) విడువక యెన్నైనా పుణ్యములు చేయుట వృథా వృథా! ఎందుకంటారా? శ్రీపతిని బడిబడి (దృఢముగా) ఆత్మలో తడవక (వెదకకుండా) అన్యమైన వాటి గురించి తడలిన (విచారించినచో) యేమి ప్రయోజనం వుంటుంది చెప్పండి?

ఎరవుల తపములు (మన తత్త్వానికి సరిపడని తపోదీక్షలు) యెంతైనా (యెన్ని చేసినా), వాటితో విరవిర వీగుట (త్రెళ్ళి త్రెళ్ళి నిక్కటం) వృథా వృథా (శుద్ధ దండుగ). ఎందుకంటే మన రక్షకుడైన హరిని, అచ్యుతుని, పరమాత్ముని యెన్నడూ మరువరాదు. మరిగి (భోగవస్తువులకు అలవడి) ఆ దేవదేవుని తలవక మఱచిపోతే ఈ బ్రతుకునకేమి ప్రయోజనం చెప్పండి?

జగద్రక్షకుడైన దైవమును (పరమాత్మను) తాము యెఱుగక తమకమున (జగన్మాయలో) వేవేలైన (అనేకపెడదారులు బట్టినచో) అంతా వృథా వృథా. శ్రీవేంకటగిరిమీదనున్న చెలువుని ఆపుని, శ్రీవేంకటేశుని సేవించక మతి చెదరిన (మనోవైక్లబ్యము) పొందితే బ్రతుకంతా వృథావృథా... శుద్ధ దండుగ.

పద్యవివరణ:

కం.॥ **తలపున శ్రీహరి తడసిన**
వెలసియునిన్నియును మాకు విడువదగినవే,
విలువేమిరా? వృథా వృథ
కొలువైవున్నట్టి ఏడుకొండలతేడా!

సంఖ్య: I/156 రాగం : లలిత
కీర్తన : ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు

లలిత

52 ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
యెనసి ముందర సాగ దేఁటిబ్రదుకు ॥పల్లవి॥

కడలేనియాసచే కరఁగికరఁగి చిత్త-
మెడమవంకకు వచ్చె నేఁటిబ్రదుకు
పొడవైనమమతతోఁ బొదలఁ బొదల మాన-
మిడుమపాట్లఁ బడె నేఁటిబ్రదుకు ॥ఎనుపోతు॥

తెగుదెంపులేనిభ్రాంతికిఁ జిక్కి యాచార.
మెగసి గొందులు దూరె నేఁటిబ్రదుకు
పగగొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన-
మిగురువెట్టక మానె నేఁటిబ్రదుకు ॥ఎనుపోతు॥

భావింప రోఁతలో ఁబడి పొరలెడిసౌఖ్య-
మేవగింపఁడు జీవుఁ డేఁటిబ్రదుకు
శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటె కాని
యేవంక సుఖము లే దేఁటిబ్రదుకు ॥ఎనుపోతు॥

ఉపోద్ఘాతము:

'ఏరు' అంటే, దున్నుటకు ఎద్దులను కట్టి సిద్ధపరచిన నాగలి అని అర్థం. వ్యవసాయంలో ఏరుకి మంచి జోడీగా వున్న యెద్దులను కడతారు. అవి చకచక దున్నేస్తాయి. కాని భగవంతుడు ఒక్కొక్కప్పుడు ఆ ఎద్దుకు జతగా ఎద్దుకు బదులు దున్నపోతును జోడీగా కడతాడు. ఇక ఆ జంటలో ఒకటి ముందుకు లాగితే ఒకటి వెనకకు లాగుతుంది. ఇక ఆ రైతు తిప్పలు తిరుమలేశునికే యెరుక. ఇట్లా సాగే ఇదేమి బ్రతుకు? ముందుకు

పోనే పోదాయె. ఏమిటీగతి?ఓ శ్రీవేంకటేశా! మనసుకు సుఖమే లేదయ్యా! ఇదేం దరిద్రపు బ్రతుకు అంటున్నారు అన్నమయ్య. నందకాంశ సంభూతునికే అట్లయితే నాబోటి వాడి సంగతేమిటి?

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! వ్యవసాయం కోసం పొలము దున్నుటకు నాగలికి, ఎనుబోతుతో (దున్నపోతుతో) యెద్దును 'ఏరు' గట్టినయట్లు (నాగలికి కట్టినట్లయింది.) ఎనసి (పూని) ముందుకు సాగదు. ఇదేమిబ్రతుకయ్యా? స్వామీ!

అంతుపొంతులేని ఆశ చేత నా మనస్సు కరిగి కరిగి యెడమ వైపుకు ఈడ్చుకొనిపోయింది. ఇదేం బ్రతుకయ్యా? పొడవైన (అధికమైన) మమతతో (మమకారంతో) పొదల పొదల (బలిసీ బలసీ) మానము (అభిజాత్యము) ఇడుమపాట్లబడె (ఆపదలతో కూడిన అవస్థలొచ్చాయి). ఇదేమి బ్రతుకయ్యా?

తెగతెంపులేని (యెడతెగని) భ్రాంతికి వశమై నా ఆచారమంతా యెగసి గొందులు దూరె (సిగ్గులేక పెడదారులు పట్టినది). ఛీఛీ! ఇదేమి బ్రతుకయ్యా? ఇక నా మోహతాపము నాపై పగబూని వేరేవిధముగా నా శాస్త్ర విజ్ఞానమును ఇగురబెట్టెను (ఇగిరి ఆవిరియైపోయేట్లు చేసింది). నా బ్రతుకు ఇట్లా కాలిపోయిందేమి ప్రభూ?

ఇక నాలోవున్న జీవుడు సరేసరి. వాడు రోత కలిగించే బ్రతుకుగడుపుతూ ఏనాడూ దానిని రోతగా భావించక ఏమాత్రమూ ఏవగించుకోకుండా అదే సౌఖ్యమని పొంగిపొరలుతుంటాడు. ఇదేమి బ్రతుకయ్యా స్వామీ? శ్రీవేంకటేశ్వరునిపై తగిలియున్న నా చిత్తము ఒక్కటి తప్ప, యేవంక చూచినా సుఖము లేనేలేదు. ఇదేమి బ్రతుకురా ఏడుకొండలవాడా?

పద్యవివరణ:

కం.॥ **ఎనుబోతు నెద్దుతో జత**
పనివడ 'నేరు' నకు గట్టి పనిచిన యటులే
చని ముందు బ్రతుకుసాగదు
మనమున సుఖమసలులేదు, మనసిజగురుడా!

సంఖ్య: I/93 రాగం : నాదరామక్రియ
కీర్తన : ఈసురలీమును లీచరాచరములు

నాదరామక్రియ

53 ఈసుర లీమును లీచరాచరములు
యీసకలమంతయు నిది యెవ్వరు ॥పల్లవి॥

ఎన్నిక నామము లిటు నీవై యుండఁగ
యిన్ని నామములవా రిది యెవ్వరు
వున్నచోటనే నీవు వుండుచుండఁగ మరి
యిన్నిటాఁ దిరుగువా రిది యెవ్వరు ॥ఈసు॥

వొక్కరూపై నీవు వుండుచుండఁగ మరిఁ
తక్కిన యీరూపములు తా మెవ్వరు
యిక్కడనక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ
మక్కువ నుండువారు మరి యెవ్వరు ॥ఈసు॥

శ్రీవేంకటాద్రిపై చెలఁగి నీ వుండఁగా
దైవంబులనువారు తా మెవ్వరు
కావలసినచోట కలిగి నీ వుండఁగ
యీవిశ్వపరిపూర్ణు లిది యెవ్వరు ॥ఈసు॥ 93

ఉపోద్ఘాతము:

ఈ మధురమైన కీర్తనలో అన్నమయ్య, వివిధ నామరూపాలతోనున్న దేవతలు, మునులు, చలనముగల జీవులు, చలనములేని జీవులు యెవ్వరు? అని ప్రశ్నిస్తున్నారు. కానీ నీవు పరమాత్మవలె అంతా నిండియుండగా ఈ రూపాలతో తిరుగుతున్నవారెవ్వరు? అందరిలోనూ అంతర్యామివి నీవే అయినప్పుడు ఇన్ని రూపాలెందుకు? ఈ తిరుమల

శ్రీవేంకటేశ్వరుడవై నీవుండగా ఇంకొక దేవుడెలావుంటాడు? ఈ విశ్వపరిపూర్ణుడవు నీవు కాక వేరెవ్వరున్నారు తండ్రీ? అని ప్రశ్నిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! ఈ సురలు (దేవతలు), మునులు, ఈ సృష్టిలో చలనముగల జీవులు, చలనము లేని జీవులు, ఈ సర్వమంతయునూ యెవ్వరు?

"పరమాత్మ' అనే యెన్నికయైన నామము (విశిష్టమైన పేరు) నీవై వుండగా ఇంకా ఇన్ని వేర్వేరు నామములతో పిలువబడే జీవులెవ్వరు? నీవు స్థిరుడవు. నీవు వున్నచోటు వీడవు. మరి అటువంటప్పుడు యిన్నిటా ఈ శరీరాలతో తిరుగుతున్నవారెవరు?

వేదము నీవు ఒక్కడవే అని చెబుతున్నది. మరి తక్కిన ఇన్ని రూపాలతో సృష్టిలో చలామణి అవుతున్న వారెవ్వరు? ఆత్మరూపి, అంతర్యామివై నీవే వున్నప్పుడు ఇన్ని ఆత్మలెక్కడివి? ఇక్కడ (ఈ భూమిమీదా) అక్కడా (ఆ దేవలోకాలలోనూ) ఆత్మవై నీవేవున్నప్పుడు మరి పరమాత్మయెవ్వరు?

ఈ శ్రీవేంకటాద్రిపై నీవు శ్రీవేంకటేశ్వరుడవై అతిశయించుచుండగా ఇంకా దైవము అని పిలువదగినవారెవ్వరు? కావలసినచోట, కావలసిన రూపంలో నీవే మాతో వుండగా ఇంకా విశ్వ పరిపూర్ణులని పిలువదగినవారెవ్వరు? ఓ ఏడుకొండలవాడా! నీవే తప్ప ఇతఃపరం బెరుగను ప్రభూ!

పద్యవివరణ:

ఉ.॥ **ఎవ్వరు యీసురుల్ మునులు యీ జగమందు చరాచరంబులున్**
ఎవ్వరు సృష్టిలో మనిరి యిన్ని తెరంగుల నామ రూపులన్
ఎవ్వరు నిత్యముండెదరు యేపుగ కాయములందు ఆత్మయై
ఎవ్వరు లేరు, నీవొకడ వియ్యది సత్యము వేంకటేశ్వరా!

సంఖ్య: I/99 రాగం : నారణి
కీర్తన : ఏణనయనల చూపులెంత సొబగై యుండు

నారణి

54 ఏణనయనలచూపు లెంత సొబగై యుండు
ప్రాణసంకటములగుపనులు నట్లుండు ॥పల్లవి॥

ఎడలేనిపరితాప మేరీతిఁ దా నుండు
ఆడియాసకోరికెలు నటువలెనె యుండు
కడలేనిదుఃఖసంగతి యెట్లఁ దా నుండు
అడరు సంసారంబు నట్లనే వుండు ॥ఏణ॥

చింతాపరంపరలఁ జిత్త మది యెట్లుండు
వంతఁ దొలఁగని మోహవశము నట్లుండు
మంతనపుఁ బనులపయి మనసు మరి యెట్లుండు
కంతుశరమార్గములగతి యట్ల నుండు ॥ఏణ॥

దేవుఁడొక్కఁడెయనెడి తెలివి దన కెట్లుండు
శ్రీవేంకటేశుకృపచేఁత లట్లుండు
భావగోచరమైనపరిణ తది యెట్లుండు
కైవల్యసౌఖ్యసంగతులు నట్లుండు ॥ఏణ॥

ఉపోద్ఘాతము:

"ఏణ" అంటే నల్లని పెద్దపెద్ద కన్నులున్న "జింక" అని అర్థం. ఏణనయనలంటే స్త్రీలని అర్థం. ఏణ నయనల చూపులు ఎంతో శోభాయమానంగా వుండి పురుషుని భ్రమింపజేయుటవలన, వాడు ఆమెకోసం ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాడు. ప్రాణమునకు నష్టం తెప్పించే పనులు కూడా అట్లే వుంటాయి. శ్రీవేంకటేశ్వరుని కృప వుంటేనే దేవుడొక్కడే అనే జ్ఞానం కలుగుతుంది అని అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఏణనయనల (నల్లజింకవలె పెద్ద పెద్ద కన్నులున్న స్త్రీల) చూపులు యెంత సొబగై యుండు (మనోహరంగా వుంటాయో) ఆలోచించండి. అంతమాత్రంచేత వారిని నమ్మవచ్చునా? ప్రాణ సంకటములైన (ప్రాణహాని కలిగించే) పనులు కూడా అట్లుండు (అట్లాగే పైకి నిరపాయకరమైన పనులవలెనే వుంటాయి.)

ఎడలేని పరితాపము (విరామం లేని సంతాపము) తాను ఏరీతి నుంటుందంటే, అడియాస (దురాశ)తో కూడియున్న కోరికలూ అలాగే వుంటాయి. ఎందుకంటే ఇవి ఒకదానివల్ల ఇంకొకటి వస్తాయి కదా! మరి కడలేని (అంతులేని) దుఃఖపు కూటమి యెందుకు కలుగుతున్నది? నరులు ఈ సంసార సాగరంలో మునిగి నానా ప్రయాసలు పడుతున్నందువలన.

చిత్తము (మనస్సు) చింతాపరంపరల (ఒకదానివెంట ఇంకొకటి వచ్చే వేదనలతో) యెందుకుంటుంది? అది విచారము మానలేని మోహవశమైనందున అని గ్రహించవలెను. మరి మనస్సు, మంతనపు పనులపై (రహస్యపు చెడుపనులపై) యెందుకుంటుంది? కంతుశర మార్గముల గతి (మన్మథుని బాణములు తగిలి) చెడుమార్గములలో వెళ్ళినందువలన. ఇవన్నీ స్వయంకృతాపరాధములేకదా! ఇంకొకరి ననటం దేనికి?

ఇక, మానవులకు పరమాత్మ ఒక్కడే అనే జ్ఞానం ఎట్లా కలుగుతుంది? శ్రీవేంకటేశ్వరుని అమితమైన కరుణ వానిపై పడుటచేత, "ఏకం సత్ బహుధా వదంతి' అనే జ్ఞానం కలుగుతుంది. భావమునకు మాత్రమే గోచరించే పరిణత (పరిణామవైభవం) యెట్లా కలుగుతుంది? కైవల్య సౌఖ్యసంగతుల (మోక్షానంద ప్రాప్తి) చేత మాత్రమే కలుగుతుంటుంది.

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఏణనయన చూపులెంత సొబగు నుండు**
ప్రాణసంకటంపు పనులు యటులె
వేంకటేశు కరుణ వెలయక నెఱుగము
సకల మోక్షదాత యొకడె యనుచు.

సంఖ్య: I/60 రాగం : సామంతం
కీర్తన : ఏదిచూచినా నీవే యిన్నియును మరి నీవే.

సామంతం

55 ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే
వేదవిరహితులకు వెఱతు మటుగాన ॥పల్లవి॥

ఇరవుకొని రూపంబులిన్నిటానుఁ గలనిన్నుఁ
బరికించవలెఁగాని భజియింపరాదు
గరిమచెడి సత్సమాగంబు విడిచిన నీ-
స్మరణవిజ్ఞానవాసన గాదుగాన ॥ఏది॥

యిహదేవతాప్రభలనెల్ల వెలుఁగుట నీకు
సహజమనవలెఁగాని సరిఁ గొలువరాదు
అహిమాంశుకిరణంబు లన్ని చోట్లఁ బరగు
గ్రహియింపరా దవగ్రాహములు గాన ॥ఏది॥

యింతయునుఁ దిరువేంకటేశ నీవునికిఁ దగఁ
జింతింపవలెఁగాని సేవింపరాదు
అంతయు ననరుహమును నరుహంబనఁగరాదు
అంతవానికిఁ బరుల కలవడదుగాన ॥ఏది॥ **60**

ఉపోద్ఘాతము:

వేదమునెరింగి, భగవంతుని తత్త్వం తెలిసికొన్న జ్ఞానికి అంతా ఆ శ్రీహరిమయమే. అన్నమయ్య ఆ సత్యాన్ని యేనాడో బోధించారు. ఆ సత్యం తెలిసినవారికి ఏది చూచినా శ్రీహరియే. ఈ సృష్టిలోవున్నవన్నీ శ్రీహరే. అయితే వేద విరహితులు మాత్రం కుతర్కంతో మాకు కనబడనిదేవుడు లేనేలేడు అంటారు. మాకు అటువంటి దుర్మార్గులతో కలియుట అంటేనే భయం. అన్నిరూపాలలోనూవున్నది ఆ శ్రీహరియే అని చూడవలసిందే అది సత్యమే. కానీ ఆ రూపాలన్నింటినీ, వైష్ణవులైన మీరు భజించకూడదు. ఇది మా సిద్ధాంతం. దీనిలో కుతర్కానికి ఆస్కారమే లేదు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా నాకు ఏది చూచినా నీ రూపమే కనుపిస్తున్నది. మరి ఇన్నింటిలోనూ నీవే వున్నట్లు తోచుచున్నది. కాని వేదవిరహితులు (వేదములను, భగవంతుని నమ్మని నాస్తికులు) కొందరుంటారు. వారికి నేవెఱతునయ్యా! (వారంటే మాత్రం నేను భయపడతాను).

ఆ నాస్తికులకు పెరధర్ములవారికి నావిదే విన్నపములు. రకరకములైన ఈ దేవతారూపంబులలో నున్న "నిన్ను" పరికించవలెనేగాని (గమనించి దర్శించవలెను, అంతే కాని)భజియింపరాదు (వారి భజన చేయరాదు). ఎందుకంటే, ఎవడైన హరిభక్తుడు గరిమచెడి (భ్రష్టుడై) సత్సంగమును విడిచిపెడితే నీయొక్క స్మరణ వాడికి విజ్ఞాన వాసన కలిగించదు. అందుకని సత్సంగము ద్వారా సదా నీ స్మరణలో వుండాలికాని కుతర్కములు పనికిరావు.

ఇహదేవతలు (ఇహలోకంలో ప్రాపంచిక కోరికలు కోరినట్లే తీర్చే దేవతలు) అనేక వైభవాలతో దీప్తించుచుందురు. వారికాశక్తి అనుగ్రహించినదీ నీవే. ఆ వైభవం అందువలన వారికి సహజమే అనుకొనవలెను. అంతేగాని వారిని గొలువరాదు. ఆ హిమాంశుడైన చంద్రుని కిరణములు పడని చోటు బయట వుంటుందా? ఆ కిరణాలలో దారి చూసుకోవాలిగాని శృంగారభావాలను పొందరాదు. ఎందుకని? అవి అవగ్రాహములు (భక్తి జ్ఞానములకు అడ్డంకులు). అందుచేత.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతయునూ(ఇదంతా) నీవునికి (నీ అస్థిత్వము) తగినట్లు ఇట్లు భావించుట దోషముకాదు. కానీ యెవరిని పడితే వారిని సేవించరాదు. నీ సృష్టిలో అన్నీ అర్హమే అయినప్పటికీ విష్ణువిరహితములు సేవించుటకు అనర్హంబులు. వాటిని అర్హములననేకూడదు. ఎందుకంటే, అంత (సర్వమూ హరియే అనే భావన) వానికి (ఆ వేదవిరహితులైన ఇతరులకు) ఆ భావన అలవడదుకదా! అందుకని.

పద్యవివరణ:

తే.గీ.॥ ఏది చూచినా నీవెగానెందునైన
వేద విరహితులను జూడ వెఱతునయ్య!
వెలయ నీవునికిన్నిటా వేంకటేశ!
అర్హమవనిది సృష్టిలో అసలులేదు.

సంఖ్య: I/170 రాగం : శ్రీరాగం
కీర్తన : ఈతడఖిలంబునకు నీశ్వరుడై సకల

శ్రీరాగం

56 ఈతఁ డఖిలంబునకు నీశ్వరుఁడై సకల-
భూతములలోనఁ దాఁ బొదలువాఁ డితఁడు ॥పల్లవి॥

గోపాంగనల మెఱుఁగుగుబ్బచన్నులమీఁద
చూపట్టుకమ్మఁగస్తురిపూఁత యితఁడు
తాపసోత్తములచింతాసౌధములలోన
దీపించుసుజ్ఞానదీప మితఁడు ॥ఏత॥

జలధికన్యాపాంగలలితేక్షణములలో
కలసి వెలుఁగుచునున్న కజ్జలం బితఁడు
జలజాసనునివదనజలధిమధ్యమునందు
అలర వెలువడినపరమామృతం బితఁడు ॥ఏత॥

పరివోనిసురతసంపదలనింపులచేత
వరవధూతతికి పరవశ మైనయితఁడు
తిరువేంకటాచలాధిపుఁడు దానై యుండి
పరిపాలనము సేయ భారకుం డితఁడు ॥ఏత॥ 170

ఉపోద్ఘాతము:

తేనెలూరే అన్నమయ్య కీర్తననాస్వాదించండి. ఈ పొడవుకు పొడవైన పురుషోత్తముడు సృష్టికంతటికీ ఈశ్వరుడు. ప్రతిప్రాణిలోను తానే ఆత్మ రూపంలో వ్యవహరిస్తుంటాడు. ఆయన భక్తులమైన మనందరి కోసం యెన్నో అవతారాలెత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణచేసి మనందరినీ అలరించాడు. నేడు ఈ మహానుభావుడే తిరువేంకటాధినాథుడై జగములను

పరిపాలించుచున్నాడు. మనందరి "బరువు" తానే భరిస్తూ భారకుడని పేరు పొందాడు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈతడే అఖిలంబునకు (సమస్తమునకు) ఈశ్వరుడై (అధినాథుడై) వ్యవహరించుచున్నాడు. సకల భూతములలోనూ (సర్వప్రాణులలో) తానే ఆత్మరూపములో పొదలువాడు (వర్ధిల్లుతుంటాడు)

జవ్వనులైన గోపకన్నెల మెఱుగు ఘనస్తనములపై కనుపించు, కమ్మగస్తూరిపూత (కమ్మటి కస్తూరిమైపూత) యితడే (ఈ శృంగారరాయుడే). అలాగని ఈయన కేవలం విలాస పురుషుడా? కానేకాదు. ఉత్తమోత్తములైన తాపసుల, చింతాసౌధములలో (భావనా భవంతులలో) వెలుగుతున్న సుజ్ఞానమనే దీపము ఈ యోగీశ్వరేశ్వరుడే సుమా!

జలధికన్య (క్షీరసాగర తనయయైన శ్రీమహాలక్ష్మి) అపాంగలలితేక్షణముల (అందమైన కడకంటి చూపుల) లోనున్న వెలుగులు విరజిమ్ము కజ్జలంబు (కాటుక) ఇతడే (ఈ రమాకాంతుడే). జలజాసనుని ((బ్రహ్మదేవుని) ముఖములనే సంద్రములమధ్య వెలసి అలరుచున్న పరమజ్ఞానామృతము ఈతడే.

పరిమితులులేని సంభోగసమాగములలో వధూవరులకు వైభవము నింపుతూ పరవశత్వము కలిగించునది యెవరనుకున్నారు? ఈ జగన్నాథుడే. ఇదిగో నేడు తిరుమల శిఖరాలపై శ్రీవేంకటేశ్వరుడై తానేయుండి పరిపాలనము చేయుచున్న భారకుడు (అందరి భారమును వహించేవాడు) ఈ దేవదేవుడే.

పద్యవివరణ:

ఉ.॥ **ఈతడు జూడనీయఖిలమింతటికీశ్వరుడెంచగా తగన్**
భూతములన్నిటిన్ బొదలు భూరమణీమణి నాథుడీతడే
ప్రీతిని బొంది గోపికల బింకపుచన్నుల కమ్మఁ బూతయున్
యీతడె, వేంకటాధిపుడు యిందరి భారకుడీమహాత్ముడే.

సంఖ్య: I/172 రాగం : బౌళి
కీర్తన : ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను

బౌళి

57 ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను
యేమరక కొలిచిన నీతఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై
తనుఁగొలువుమని చిత్తములిచ్చుఁ గరుణించి
వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితములేనికొడుకుల నిచ్చును
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు
నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము ॥ఏమి॥

పంతమాడి కొలిచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు
యెంతటిపదవులైన నిట్టె యిచ్చు
వింతవింతవిభవాలవేంకటేశుఁ డిదె మా-
యంతరంగముననుండే అరచేతిదైవము. ॥ఏమి॥ **172**

ఉపోద్ఘాతము:

చాలామంది దేవతలు వారి నర్చించి యేది కోరుకుంటే ఆ వరమునను గ్రహిస్తారు. అందులో విశేషమేముంది? కానీ ఈ తిరుమల నాథుడున్నాడే ఏది కోరుకుంటే అది, యెన్నిసార్లైనా, యెప్పుడడిగినా ఇస్తాడు. ఎందుకంటే ఈయన పరమాత్మ. ఈయనకు పరిమితి లేదు. కాకపోతే ఒక నిబంధన వున్నది. ఈయనను మరువరాదు. తిరుమలకు వచ్చి మొక్కు తీర్చుకొనే వారు గమనించవలసినదిదే. మీ కోరిక తీరాక ఆయనను మఱచితే ఆయనా మిమ్మల్ని పట్టించుకోడు. "పంతమాడి

కొలిచిన ప్రాణమిచ్చు" నంటున్నారు అన్నమయ్య. ఈయన వింత వింత వైభవాల వేంకటేశ్వరుడయ్యా! ఘటనా ఘటన సమర్థుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈ మహానుభావుని ప్రత్యేకతేమంటే, ఈయన తన ఆశ్రితులకు, ఏమివలసిన (ఏది కావలెనన్నా) యెప్పుడైనను (యెప్పుడుపడితే అప్పుడు) ఇస్తాడు. ఎందుకంటే ఈతడే దైవము (పరమాత్మ). కాకపోతే ఈతనిని ఏమరక కొలువవలెను (మఱచిపోకుండా కొలవాలి). అవసరం తీరాక మఱచినచో ఆయనా మిమ్మల్ని వదిలేస్తాడు.

ఘనముగా తన ఆశ్రితులకు ఈయన కళ్ళుపోతే కళ్ళిస్తాడు. కాళ్ళులేని అవిటివాడైతే కాళ్ళిస్తాడు. పనిచేసికొని బ్రతికేవారికి చేతులనిస్తాడు. బలియుడై (బలవంతుడై) తనను కొలిచేటందుకు చిత్తము (మనస్సులోని కోరిక) కూడా ఆయనే ఇస్తాడు. ఈవిధంగా తన భక్తులను అనుగ్రహిస్తాడు. ఈ లోకమునకెల్లా ఇటువంటి దైవము యెవరంటే, ఈయన ఒక్కడే.

మచ్చికతో (స్నేహభావనతో) తనను కొలిచినచో ఈయన ఇవ్వలేని వైభవం వుంటుందా? అసలు ముందుగా తనను కొలిచేటందుకు కోరికను కూడిన మనస్సును ఇచ్చేది ఈతడే. కొలిచేటందుకు మాటలనుకూడా ఇస్తాడు. తన భక్తుల శేషజీవితము నిశ్చింతగా గడచిపోవుటకు వారికి మోసము నెరుగని నిర్మలులైన కొడుకులనిస్తాడు. వెళ్ళిన భక్తుల దగ్గరకే వెళ్ళి వారికి శుభములనిస్తాడు. సుఖ సంపదలనిస్తాడు. ఏనాడైనా లోకమునకెల్లా నిజమైన దేవుడెవరంటే, నిస్సందేహంగా ఈయనే.

పంతమాడి (పట్టుదలతో) ఈ స్వామిని కొలిస్తే ప్రాణమిచ్చు (అవసరమైతే ప్రాణదానంచేసి గండం గట్టెక్కిస్తాడు). ప్రాయమిచ్చు (ఆయుర్దాయం తక్కువవుంటే దాన్నీ ఇస్తాడు). ఎంతటి ఉన్నత పదవులు కోరినా, ఇట్టే (సులభంగా) ఇస్తాడు. ఎన్నో వింత వింత వైభవముల నొసగే ఈ వేంకటేశ్వరుడు, ఇదే మా అంతర్యామిగా వుండే మా అరచేతి దైవము (ఎప్పుడు కావాలంటే అప్పుడనుగ్రహించే దైవము).

పద్యవివరణ:

కం.॥ **ఏమి వలసినను యిచ్చును**
ఏమరకన్ గొల్వుడితనియిచ్చుసమస్తం-
బీమహివేంకటనాథుడె
ఏమైనా యిచ్చు దైవమెప్పుడునైనన్

సంఖ్య: IV/279 రాగం : దేవక్రియ
కీర్తన : ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకా డితడు

దేవక్రియ

58 ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడే మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు ॥పల్లవి॥

విడిసెఁ గపిబలము వెస సముద్రము దరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని ॥ఏమి॥

చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలుగాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
మెచ్చిరందరు సీతాసమేతుఁడాయ నితఁడు ॥ఏమి॥

మగుడెఁ బుష్పకముపై మహిమ నీతనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చి నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు ॥ఏమి॥ **279**

ఉపోద్ఘాతము:

నేడు శ్రీరామనవమి. భద్రాద్రిపై సీతారామకళ్యాణం జరుగుతుంటే ఈ వివరణ వ్రాస్తున్నాను. అన్నమయ్య చెప్పిన మధురమైన కీర్తన వివరిస్తూ పులకించిపోతున్నాను. ఈ శ్రీరాముడు యెట్టివిలుకాడయ్యా!! ఈయన ప్రతాపము నేమని చెప్పేది? వీడే రాముడు, రణరంగ ధీరుడు. ఈయనకు మ్రొక్కండయ్యా! అంటున్నారు. అక్కడ తిరుమలలో వున్న శ్రీవేంకటేశ్వరుడే ఈ జగదేకమూర్తి, కౌసల్యాసుతుడూను అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఆహా! ఈ శ్రీరామచంద్రుని ప్రతాపము గురించి యేమి చెప్పేది? ఇతడు యెట్టి విలుకాడో యేమని చెప్పేది? వీడె (ఈతడే) రాముడు. ఇతడు రణరంగమున, ధీరుడు (అసహాయ శూరుడు). ఈయనకు మ్రొక్కరో.

అంతట సముద్రపుదరిని (ఒడ్డున) వెసె (వేగముగా) కపి బలము (వానరసేన) విడిసినది. ఆ లంకంపై ఫౌజు (కపిసేన) నానాగతుల (అనేకదిక్కులకు) నడిచింది. అప్పుడు ఆ యుద్ధమున రాముడు తన వింటిదొనలో బ్రహ్మాస్త్రమును తొడిగినాడు. ఆ అస్త్రమును రావణునిపై వేసినాడు. అంత రావణుని తలలు పంక్తులై ధరణని భూమిపై పడెను.

రావణవధానంతరము సుగ్రీవుడు అంగదులతో కూడిన వానరసైన్యము లంకను చొచ్చినది (ప్రవేశించినది). రాకాసి చెర (రావణాసురుని చెరసాల) తెప్పలుగాను (అంతరించిపోగా) జానకీదేవి విముక్తురాలైనది. ఇంద్రాది దేవతలు నింగినుండి ఇదంతా చూచి జయజయధ్వానములు పెట్టిరి. అందరూ ఆహా అని మెచ్చుకొన్నారు. ఇతడు (ఈ శ్రీరాముడు) సీతాసమేతుడాయెను (సీతతో జతకలిసినవాడైనాడు).

ఆ తరువాత, మగుడ (అయోధ్య మరలివచ్చుటకు) ఈతని దండు (రాముని కపి సైన్యము) మహిమగల పుష్పకము అను విమానమునెక్కి అయోధ్య చేరి పట్టాభిషిక్తుడై తమ్ములతో రాజ్యమును పరిపాలించాడు. ఈనాడు శ్రీవేంకటాద్రిపై అగపడి ఇతడు నిలిచియున్నాడు. ఈతడే జగదేకమూర్తియైన కౌసల్యాకుమారుడు.

పద్యవివరణ:

ఉ.॥ **ఏమని చెప్పవచ్చునిక యీతని వీరప్రతాపమెంచుచున్**
రాముడు వీడె ఘోర రణరంగపు ధీరుడు మ్రొక్కుడీతనిన్
కోమలి జానకీరమణి గూడి తనేలెనయోధ్య, నేడు బల్
దీమసమూర్తి యీ గిరుల తిమ్మడు వేంకటరాముడాయెబో.

సంఖ్య: I/167 రాగం : సాళంగనాట
కీర్తన : వాసివంతు విడిచినవాడేయోగి

సాళంగనాట

59 వాసివంతు విడిచినవాఁడే యోగి: యా–
ఆసలెల్లా విడిచినాతఁడే యోగి ॥పల్లవి॥

గద్దించి పారెడుతురగమువంటిమనసు
వద్దని మరలించినవాఁడే యోగి
వొద్దనే కొండలవంటి వున్నత దేహగుణాలు
దిద్ది మట్టుపెట్టువాఁడే ధీరుఁడైనయోగి ॥వాసి॥

ముంచుకొన్న యింద్రియపుమోహజలధిలోన
వంచన మునుఁగనట్టివాఁడే యోగి
పొంచి పుణ్యపాపములు పొట్టువంటికర్మములు
దంచి పారఁజల్లువాఁడే తత్త్వమైనయోగి ॥వాసి॥

వెగటుకామాదుల వెళ్లఁగొట్టి శాంతుఁడై
వగలుడిగినయట్టివాఁడే యోగి
నిగిడి శ్రీవేంకటపతినిజదాసుఁడై భక్తిఁ
దగిలి నిలుపువాఁడే ధన్యుఁడైనయోగి ॥వాసి॥ **167**

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశ్వరుని నిజదాసుడై భక్తి పారవశ్యంలో బ్రతికే యోగియెలావుంటాడో వర్ణిస్తున్నారు అన్నమయ్య. "వాసి" అంటే కీర్తి. ప్రతిమంచిపని, అది చేసిన వానికి "వాసి"ని తెస్తుంది. ఒక్కసారి అది వచ్చాక "వంతు" అంటే పోటీపెరుగుతుంది, నీకీర్తి గొప్పదా? నా కీర్తి గొప్పదా? దాని వలన "ఆసలు" పెరుగుతాయి. దానివల్ల యెంతగొప్ప యోగి అయినా భ్రష్ఠుడవుతాడు. కాబట్టి యోగి అయిన ప్రతివాడూ మొదట చేయాల్సినపని, వాసి–వంతు– ఆస విడిచిపెట్టడం. తరువాత

యేమేం చేయాలో కీర్తనలో వివరిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ హరిభక్తులారా! వాసి (కీర్తి, వంతు (పోటీమనస్తత్వము) విడిచిపెట్టినవాడే అసలైన యోగి. ఆశ కోరికలను విడిచిపెట్టినవాడే అత్యుత్తమ యోగి.

మనస్సు గద్దించి (యెదిరించి) పారెడు తురగము (పరుగులువెట్టు పొగరుబోతు గుఱ్ఱము) వంటిది. దానిని వద్దని (అట్లా వుండరాదని) మంచి స్వాధీనమున వుంచు వాడే నిపుణుడైన యోగి. కొండలవలె ఉన్నతమైన దేహగుణాలను ఒద్దని, ప్రేరేపించే మానసిక వైక్లబ్యములను దిద్ది (సవరించి) మట్టుబెట్టేవాడే (తుదముట్టించేవాడే) గొప్పయోగి. అతడే ధీరుడు (ధైర్యవంతుడు).

ఇంద్రియములు ముంచుకొని (లొంగదీసికొని) మోహము అనే మహాసముద్రంలో పడవేస్తాయి. వంచించబడిన మనిషి దానిలో మునిగిపోతాడు. అట్లా మునిగిపోనివాడే మోక్షార్హుడైన యోగి. పాపపుణ్యాలనే ధాన్యపు గింజల మీద "పొట్టు" వంటివి నరులు చేసే కర్మములు. పొట్టు ఒలిస్తేగానీ, గింజ మంచిదో (పుణ్యమో), చెడ్డదో తెలియదు. తత్త్వవేత్త అయిన యోగి ఆ గింజలను పొట్టుతో సహా దంచిపారవేయవలెను.

వెగటు (హేయమైన) కామము మొదలైన వానిని వెళ్ళగొట్టి శాంతి పొందినవాడే సఫలుడైన యోగి. పగ, కపటము విడనాడినవాడే పరమయోగి. అతిశయించి శ్రీవేంకటపతికి నిజదాసుడై భక్తిన్ తగిలి (భక్తిమార్గంలో జీవిస్తూ) వైష్ణవ ధర్మాన్ని నిలుపువాడే ధన్యుడై, హరిమెచ్చినయట్టి యోగి.

పద్యవివరణ:

ఆ.వె.**॥ వాసి వంతు విడచి వరలువాడే యోగి,**
ఆసలెల్ల విడచి అలరు యోగి
నిగమవేద్యుడు హరి నిజదాసుడై భక్తి
దగిలియుండు వాడె ధన్యయోగి.

సంఖ్య: IV/303 రాగం : భూపాళం
కీర్తన : తెలియడు గాకద్రిష్టము జీవుడు

భూపాళం

60 తెలియఁడుగాక ద్రిష్టము జీవుఁడు
సులభమిదివో యిచ్చోటనే పరము ॥పల్లవి॥

మనసునఁ దలచిన మర్మములు గరఁగి
చొనుపుచు నింద్రియసుఖ మిచ్చు
అనువుగ నిటువలె హరిఁదలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా ॥తెలి॥

మాటలాడినను మరిగి మానవులు
యీటున మెచ్చిత్తురేమైనను
నాఁట నిట్ల హరినామము నొడివిన
గాఁటపువరములు కలుగునె కాదా ॥తెలి॥

చేసినపుణ్యము చేతఁజుట్టుకొని
రాసి వెనుతగిలి రక్షించు
వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని
ఆసల కైంకర్యము ఫలించును ॥తెలి॥ **303**

ఉపోద్ఘాతము:

మన దేహంలోవుండే జీవుడున్నాడే, వాడు వాడి ద్రి (ది) ష్టము (భాగ్యము) యెట్లా వుండబోతున్నదో తెలియడు కదా! వాడు జీవితకాలంలో అనేక భ్రమలకు లోనై, కామక్రోధాది అరిషడ్వర్గాల పాలై తీరని వేదన అనుభవిస్తుంటాడు. మోక్షము యెక్కడో వుందనుకొని దానికోసం ఆరాటపడుతుంటాడు. కానీ ఆ 'పరము' ఈ భూమిమీదనే సులభంగా లభించగలదని గ్రహించలేకున్నాడు అంటున్నారు అన్నమయ్య. మనస్సును తలచి వెంపర్లాడేవాడికి ఇంద్రియ సుఖములు ఆనందాన్నిస్తాయి.

సందేహంలేదు. కానీ శ్రీహరిని తలచి ఆయన కోసం ఆరాటపడే వాడికి బ్రహ్మానందం కలుగుతుంది. దుఃఖం రానేరాదు.

తాత్పర్య వివరణ:

జీవుడు తన ద్రి(ది)ష్టము (భాగ్యము) యెట్లావుండబోతున్నదో తెలియడు గాక! తెలియడు. ఇదివో సులభమైన మార్గం వున్నది. పరము (ముక్తి) ఇచ్చోటనే లభిస్తుంది. మీరూ ఇలాగే చేయండి మరి.

మనస్సును తలచిన (ఆశించి నమ్ముకొంటే) మర్మముల (మర్మాంగముల యందు) కరగిపోయి, చొనుపుచు (చొరబడి) అత్యంత ఇంద్రియ సుఖములనిస్తుంది. కానీ జవసత్త్వాలుడిగాక ఈ సుఖమే తీరని దుఃఖమవుతుంది. ఇటువలె (ఈ విధముగా) అనువుగ (తేలికగా) శ్రీహరిని తలపోసిన (నమ్ముకొని మీ ఆలోచనలలో నిలుపుకొంటే) తనకు (ఆ భక్తునికి) తప్పక బ్రహ్మానందము కలుగుతుంది కదా! మరి ఈ ఐహిక ఆనందాలతో పనేమిటి?

మానవులైన రాజులు, ధనవంతులు మాటలాడినను (వారిని పొగడుతూ మాటలు చెబుతే) మరిగి (వశులై) యీటున మెచ్చి (ఊరకనే మెచ్చుకొని) ఏమడిగినా ఇత్తురు. కానీ అవన్నీ యెలా వచ్చాయో అలాగే పోతాయి. అయితే నాటుకొని పోవునట్లు శ్రీహరినామమును తలపోసిన (ధ్యానించుచున్న) వానికి, గాటపు వరములు (అధికమైన వరములు) దొరుకుతాయి కదా! ఇక ఈ రాజులు దొరలు ఇచ్చే వెందుకయ్యా?

మనము చేసిన పుణ్యము, మన చేతికి చుట్టుకొన్నట్లు రాసి (కుప్పలుగా) వెనుతగిలి (మన వెనువెంటనే వుండి) రక్షిస్తుంటుంది. ఇటు (ఈ విధముగా) వేసరక (విసుగు చెందక) ఆసల (ఆశక్తితో) శ్రీవేంకటేశ్వరుని కైంకర్యము (ఊడిగము) ఫలించును (అద్భుతమైన ఫలితములను ఇస్తుంది).

పద్యవివరణ:

కం.॥ **తెలియడు దిష్టము జీవుడు**
సులభంబగు పరము గలదు చూడుడిచటనే
ఫలియించు వేంకటేశుని
కొలువే కైంకర్యదీక్ష కొనసాగంగా

సంఖ్య: IV/306 రాగం : భైరవి

కీర్తన : ఈతడు విష్ణుడు రిపులెక్కడ చొచ్చేరు మీరు

భైరవి

61 ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాఁడు శ్రీవేంకటేశుఁడు ॥పల్లవి॥

జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు
చలమునఁ బాతాళము సాధించినాఁడు
బలుభూమిదూరి వొక్కకొలికికిఁ దెచ్చినాఁడు
నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు ॥ఈతఁ॥

చేరి బ్రహ్మాండము తూఁటుసేసి చూచినాఁడు
వీరుఁడై రాచమూఁకల వెదకినాఁడు
ఘోరపు త్రికూటాదికొండలు జయించినాఁడు
వారించి చక్రవాళపర్వతము దాఁటినాడు ॥ఈతఁ॥

మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు
చుట్టువేడెమున యింతా సోదించినాఁడు
యిట్టె శ్రీవేంకటాద్రినిరవై యెక్కినవాఁడు
రట్టుగాఁ దనదాసులనిట్టె రక్షించినాఁడు ॥ఈతఁ॥ **306**

ఉపోద్ఘాతము:

ఇది దశావతారవర్ణనగల అన్నమయ్య కీర్తన. చాలా శ్రమపడితేగాని ఇటువంటి కీర్తన వివరించడం కుదరదు. ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడే

విష్ణువు. తన చేత సుదర్శన చక్రమును ధరించియున్నాడు. ఒరే! శత్రుమూకల్లారా! యెక్కడ దూరినా మీ అంతు చూస్తాడు. ఆయన దాసులైతే రక్షిస్తాడు. కాబట్టి పది అవతారముల నెత్తి మీపని బట్టిన ఆయన చరణాలే శరణనండి రా దైత్యుల్లారా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈతడు విష్ణుమూర్తి. నేడు శ్రీవేంకటేశ్వరుడై తన చేత చక్రమెత్తినాడు (సుదర్శన చక్రమును ధరించినాడు). మీరు ఆయన రిపులు (శత్రువులు). ఎక్కడ చొచ్చేరు (యెక్కడ దూరి దాక్కుంటారురా?)

"జలధులు చొచ్చి చొచ్చి సారె ప్రతాపించినాడు" సప్త సముద్రాలలోనూ దూరి అతిశయముగా తన ప్రతాపము చూపినాడు (మత్స్యావతారము). **"చలమున పాతాళము సాధించినాడు"** మత్సరముతో పాతాళలోక వాసులను సాధించినాడు (కూర్మావతారానంతరము మోహిని అయిన శ్రీహరి). **"బలు భూమిదూరి వొక్క కొలికికి దెచ్చినాడు"** బలవంతంగా భూమిక్రిందకు దూరి నీటినుండి తన ముట్టెపై యెత్తి తీర్చిదిద్దినాడు (వరాహావతారము). **"నిలిచియంతరిక్షము నిండి భేదించినాడు"** హరణ్యకశిపుని వధించిన పిదప ఆకాశమంతా అణుమాత్రం సందులేకుండా నిండిపోయి, వారిని భేదించి మట్టుపెట్టాడు (నరసింహావతారము).

"చేరి బ్రహ్మాండము తూటుసేసి చూచినాడు" అండపిండ బ్రహ్మాండమంతా తన రెండు అడుగులతో సందులేకుండా ఆక్రమించి, తూటుసేసి (బలిచక్రవర్తిని చిన్నబుచ్చి) చూచినాడు. మూడవ అడుగునకు చోటేది అన్నట్లు చూశాడు (వామనావతారం). **"వీరుడై రాచమూకల వెదకినాడు"** జన్మతః బ్రాహ్మణుడైనా, క్షత్రియ తేజస్సుతో రాజలోకాన్నంతా

ఇరువదిన్నొక్కమారులు భూమి చుట్టివచ్చి వధించినాడు (పరశురామావతారము). **"ఘోరపు త్రికూటాది కొండలు జయించినాడు"** ఎక్కుటకు సాధ్యముకాని త్రికూటాద్రి మొదలైన కొండలను తానేకాక తన వానరసేనూ యెక్కించి లంకను జయించినాడు (శ్రీరామావతారము). **"వారించి చక్రవాళ పర్వతము దాటినాడు"** దారకుడు రథంతోలగా అర్జునునితో కూడి, పరమాత్ముని దర్శనం చక్రవాళ పర్వతముదాటిన తరువాత చేయించి ఆశీర్వాదములను పొందునట్లు చేశాడు (శ్రీకృష్ణావతారము).

"మట్టిదైత్యపురాల మర్మాలు విదళించినాడు" త్రిపురాసురుల పట్టణములను వాటిమర్మములను బట్టబయలుచేసి మట్టుబెట్టినాడు (బుద్ధావతారము). **"చుట్టువేడెమున యింతా సోధించినాడు"** మేలుజాతి అశ్వముమీద ఈ విశ్వమంతా వెదకి దుర్మార్గులను తుదముట్టించినాడు (కల్కి భగవానుడు). నేడు ఇట్టే (సులువుగా) శ్రీవేంకటాద్రి ఇరవై (స్థానముగా) యెక్కియున్న శ్రీవేంకటేశ్వరుడు ఇతడే. ఈ దేవదేవుడు రట్టుగా (బాహాటముగానే) తన దాసులను, ఇట్టే రక్షించినాడు.

పద్యవివరణ:

ఉ.॥ **ఈతడు విష్ణుమూర్తి, రిపులెక్కడబోయెదరెందుచొచ్చినన్**
చేత సుదర్శనం బలర చీల్చునుదైత్యుల వేంకటేశుడై
భూతలినెత్తెరూపములు పోల్చుడువీని దశావతారముల్
మీతలనొప్పియే మిగల మేలుగ యీ వివరంబు జూడుడీ.

సంఖ్య: IV/216 రాగం : శోకవరాళి
కీర్తన : విడువుము మనసా వీరిడి చేతలు

శోకవరాళి

62 విడువుము మనసా వీరిడిచేఁతలు
తడియక శ్రీహరిఁ దలఁచవొ యిఁకను ॥పల్లవి॥

నానాఁడే యెనఁబడినాలుగులక్షలు
యోనుల వెడలితి నొక్కఁడనే
అనిన భోగములందలివే పో
కానము యిఁకనేమి గడియించేము ॥విడు॥

నలుగడ నటు పదునాల్గు లోకములు
వెలయఁ జొచ్చితిని వెడలితిని
కలిగినదేదో కలుగనిదేదో
తెలియ దేమిటికిఁ దరిగేమో ॥విడు॥

భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము
కవిసి యాఫలము గైకొంటిని
యివల శ్రీవేంకటేశుఁడింతలో
తవిలి యేలఁగా ధన్యుఁడనైతి ॥విడు॥

ఉపోద్ఘాతము:

వీరిడి చేతలు అంటే అవివేకమైన పనులని అర్థం. ఓ మనసా! అవివేకముతో కూడిన పనులను మానుకోరాదా? ఇకనైనా ఆలశ్యం చేయక శ్రీహరిని ధ్యానించరాదా? అంటున్నారు అన్నమయ్య. ఎన్నడో నా జన్మల సంఖ్యఎనుబది నాలుగు లక్షల సంఖ్యను దాటింది. అవే భోగాలను అనుభవిస్తూ ఒక్కటంటే ఒక్క జన్మలోనూ మోక్షం కోసం ప్రయత్నించలేదు.

ఇదిగో నేడు ఈ శ్రీవేంకటేశ్వరుని శరణని ఆయన నన్ను యేలగా ధన్యుడనయ్యాను అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మనసా! నీవు సత్వరమే వీరిడి చేతలు (తెలివితక్కువ పనులను) విడనాడుము (విడిచిపెట్టుము). ఇకను (ఇకపై) తడయక (ఆలస్యం చేయకుండ) శ్రీహరిని తలచవో (ధ్యానింపుము).

ఓ ప్రభూ! నేనొక్కడనే, నానాటి బ్రతుకు వెళ్ళబుచ్చుతూ ఎనుబది నాలుగులక్షల, యోనుల వెడలితి (పుట్టుకలను పొందాను). కాని ఒక్క దానిలోనూ నిన్ను తలుచుకోనేలేదు. నాకు ఆ జన్మలలో అనేక ఆనిన భోగములు (నన్ను అణచివుంచే భోగములను) పొందాను. పో! ఇక కానము (ఒళ్ళుపై తెలుస్తుందా?) ఇకనేమి గడించేము? మరి మా ఉన్నతికి మేము ఏమి చేసికొన్నాము? ఏమీ లేదు.

సరే! ఆ విధముగా నాలుగు దిక్కులాగల పదునాల్గులోకాలలోనూ చొచ్చి వాటిల్లో కూడా జీవించి వుంటాను. ఈజన్మలవల్ల నాకు యే మేలు జరిగిందో, యేమేలు కలుగలేదో కూడా తెలియని ఆయోమయంలో వున్నాను. మరి యేమిటికి తిరిగేము (ఈ జన్మల వెంట దేనికోసం తిరిగామో అర్థము కావటం లేదు.)

ఓ దేవదేవా! ఈ భూమిపై పుట్టి కొన్ని పుణ్యములను చేశాను. కొన్ని పాపములను కూడా చేశాను. కర్మ అనుభవించక యెంతటి వారికైనా తప్పదు కాబట్టి నేను చేసిన కర్మల ఫలములను కూడా అనుభవించాను. ఇంతలో ఈ జన్మలోనూ అదృష్టం పండి తిరుమల దర్శించి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించాను. ఆయన దయామయుడై నన్ను తగిలి యేలగా (శరణిచ్చి ఆదరించగా) ధన్యుడనైతి (దన్యతతో తరించాను).

పద్యవివరణ:

కం॥ **విడువము వీరిడి చేతలు**
తడయక శ్రీహరిని మదిని తలచగరాదో
విడువక వేంకటపతియే
తడబడు నినుదరికి జేర్చి ధన్యునిజేయున్.

సంఖ్య: I/107 రాగం : లలిత
కీర్తన : ఎక్కడి దురవస్థలేటి దేహములోన

లలిత

63 ఎక్కడిదురవస్థ లేఁటిదేహము లోనఁ
జిక్కి జీవుఁడు మోక్షసిరిఁ జెందలేఁడు ॥పల్లవి॥

ఒడలు మాంసపూర మొక పూఁటయిన మీఁదు
గడుగకున్నఁ గొరగాదు
కడలేనిమలమూత్రగర్హిత మిది, లోను
గడుగరాదు యెంతగడిగినఁ బోదు ॥ఎక్కడి॥

అలర చిత్తము చూడ నతిచంచలము దీనఁ
గలసిన పెనుగాలి గనము
మెలుపులేనిచిచ్చు మీఁదమిక్కిలిఁ గొంత
నిలుపు లేదు పట్టి నిలుపఁగరాదు ॥ఎక్కడి॥

తిరువేంకటాచలాధిపుఁడు నిత్యానంద-
కరుఁడు జీవునకు రక్షకుఁడు
కరుణించి యొకవేళఁ గాచినఁగాని మేను-
చొరకమానెడుబుద్ధి చోఁక దెవ్వరికి ॥ఎక్కడి॥

ఉపోద్ఘాతము:

భగవంతుడా! ఇదెక్కడి దురవస్థ? నాకు, ఎట్లాంటి దేహమిచ్చావయ్యా! దీంట్లో చిక్కివున్న జీవుడు ఎన్నటికీ మోక్షలక్ష్మిని పొందలేకున్నాడే!! అంటున్నారు అన్నమయ్య! ఏమిచూసికొని గర్వించాలి? ఒక్కదినము స్నానం చేయకపోతే కంపుకొట్టే ఒళ్ళు. ఏమాత్రం నిలకడలేని మనస్సు. మరి ఈ జీవుడి గతేమిటి? శ్రీవేంకటేశ్వరుడు కరుణిస్తేగాని వీడు నానా దేహాల్లోకి దూరకమానడు.

తాత్పర్య వివరణ:

అయ్యోయ్యో! యెక్కడి దురవస్థలు వచ్చిపడినవి? ఈ నాజీవుడు యేటిదేహములోన (యెటువంటి శరీరంలో) జిక్కె (చిక్కుకుపోయినాడు). ఈ దేహంలో వున్నంతకాలమూ వీడు మోక్షలక్ష్మిని పొందలేడు.

ఈ మానవుని ఒడలు (శరీరం) ఒక మాంసపూరము (మాంసపు రసికారే ముద్ద). ఏపూటకాపూట దీన్ని కడుక్కోకపోతే కంపు భరించలేము. ఈ దేహం బ్రతికున్నంతకాలమూ నీచమైన మలమూత్రాలను విసర్జిస్తూనే వుంటుంది. దీనిని యెంతని కడుగగలము? కడిగినా, గర్షించ దగిన (నిరసించదగిన) మలినం పోతుందా?

ఇక ఈ శరీరంలో అలరియున్న చిత్తము చూద్దామా అంటే... అది అతి చంచల స్వభావంకల పెనుగాలివంటిది. అది కనబడనే కనబడదు. ఏమాత్రమూ మెతక తనము లేని నిప్పు కణిక. పైగా మీదుమిక్కిలి (ఇది చాలదన్నట్లు దీనికి కొంచెం కూడా నిలకడలేదు. పోనీ కట్టేసి వుంచుదామంటే అది సాధ్యంకాదు. దీని వల్ల మనశ్శాంతి వుండటం లేదు.

ఒకటి మాత్రం పరమసత్యము. శ్రీ వేంకటేశ్వరుడొక్కడే నిత్యానందకరుడు. ఈ జీవునకు రక్షకుడు ఆయనే. ఆయన ఈ జీవునిపై కరుణవహించి ఒకవేళ కాచినగాని (రక్షిస్తేగాని) భ్రమకులోనై ఇంకొక జన్మకలిగితే బాగుండుననే బుద్ధి పోదు. చచ్చేటప్పుడు ఆ జన్మనే ఆశిస్తూ మళ్ళీ ఆ తొంపిలోనే పుట్టి చస్తుంటాడు.ఆ స్వామి కృపవుంటేనే... ముక్తి.

పద్యవివరణ:

ఆ.వె.॥ **హేయమైన ఒడలు, హీనమౌ చిత్తంబు**
నిలుపులేదు పట్టి నిలుపలేము
ఇట్టి దేహమందు యిటుజిక్కె జీవుడు
ఇంక మోక్షమెట్లు వేంకటేశ!

సంఖ్య: I/199 రాగం : భైరవి

కీర్తన : సడిబెట్టెగటకటా సంసారము

భైరవి

64 సడిఁబెట్టెఁ గటకటా సంసారము! చూడ–
జడధిలోపలియీఁత సంసారము ॥పల్లవి॥

జమునోరిలో బ్రదుకు సంసారము! చూడ
చమురుదీసినదివ్వె సంసారము
సమయించుఁబెనుదెవులు సంసారము చూడ
సమరంబులో నునికి సంసారము ॥సడి॥

సందిగట్టినతాడు సంసారము చూడ
సందికంతలతోవ సంసారము
చందురునిజీవనము సంసారము చూడ
చంద మేవలెనుండు సంసారము. ॥సడి॥

చలువలోపలివేఁడి సంసారము చూడ
జలపూఁతబంగారు సంసారము
యిలలోనఁ దిరువేంకటేశ నీదాసులకు
చలువలకుఁ గడుఁజలువ సంసారము ॥సడి॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో క్లిష్టమైన ఈ సంసారంయొక్క అవగుణాలను వర్ణిస్తున్నారు అన్నమయ్య. రకరకాల పోలికలతో ఈ సంసారము యెంత హేయమైనదో

వివరిస్తున్నారు. యముడి నోట్లో బ్రతుకుటయేనట ఈ సంసారము. ఆయన యెప్పుడుగుటుక్కుమని మింగుతాడో యెవరికి తెలుసు? సందికంతల తోవట యీ సంసారము. ఇరుకు సందుల్లోంచి కంతలలోంచి పోక తప్పదు మరి. అయ్యయ్యో! ఈ పాడు సంసారం వూదరగొడుతున్నదే అని వాపోతూ ఓ వేంకటేశ్వరా! నీదాసులకి మాత్ర ఇది చలువలకు చలువ ఈ సంసారం అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కటకటా! (అయ్యయ్యో!) పాడు సంసారము సడిబెట్టెనే (యెన్ని నిందల పాలు చేసింది!!) చూడబోతే యీ సంసారమంటేనే జడధిలోపలి (సముద్రంలో) ఈత మాదిరిగా అతి క్లిష్టంగా వున్నదే!!

ఈ సంసారమున్నదే ఇది అనుక్షణం మృత్యువును ఒడిలోపెట్టుకోవటం మాదిరే. యముడి నోట్లో బ్రతుకు గడుపుట లాంటిది. ఇది నూనె కారిపోయిన దివ్వె లాంటిది. సమయించు (ఇబ్బందిపెట్టే) వెనుదెవులు (పెద్ద రోగము) వంటిది ఈ సంసారం. ఎప్పటికీ తగ్గేదికాదు? ఇది యుద్ధభూమిలో మనుగడవంటిది. ఎప్పుడు చావు వస్తుందో యెవ్వడూ చెప్పలేడు.

ఈ సంసారమున్నదే, ఇది సందిగట్టిన తాడు (రెండు పడవల మధ్య త్రాటితో కట్టి ఒక పడవనే నడుపుతారు. ఆ త్రాడును సంధిగట్టిన త్రాడు అంటారు. అదెప్పుడు తెగిపోతుందో యెవరికి తెలుసు?) ఈ సంసారం ఇరుకు గొందుల్లోంచి దూరడంలాంటిది. ఈ సంసారము చంద్రుని జీవితం లాంటిది పెరుగుతుంది తరుగుతుంది. దీని చందము (పద్ధతి) యెలావుంటుందో యెవ్వడూ చెప్పలేడు.

ఈ సంసారమనేది వున్నదే, అది చలువలోపలి వేడి (శీతాకాలము యెండవలె, సుఖంగా వున్న ప్రాణాన్ని తపింపజేస్తుంది). ఇది చూడబోతే బంగారు జలపూత (బంగారపు పూత మాత్రమే. లోపలి లోహము రాగి మాత్రమే). అయినా, ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులకు మాత్రం యే ఇబ్బందీ వుండదు. వారికి ఈ సంసారము, చలికాలంలో చలిలాగా చల్లగా హాయిగా వుంటుంది.

పద్యవివరణ:

సీ.॥ **యమునిజేతికి జిక్కి యల్లాడు బ్రతుకురా**
చమురు దీసినదివ్వె ఏమిటికిని?
సమయించు దెవులు యీ సంసారమను పీడ
సమరంబునను దక్కు చావుకాదె?
సందిగట్టినతాడు సందికంతలతోవ
పెరుగు తరుగులున్న వెన్నెలయ్య.
జలపూత బంగారు చలువలోపలివేడి
ఏమి సంసారంబు యేడమేలు?

ఆ.వె.॥ **సడిని బెట్టి నట్టి సంసారమైనను**
జలధి ఈతవోలె కలతయైన
చలువనుందురయ్య! యిల నీదు దాసులు
వెరపుమాట లేక వేంకటేశ!

సంఖ్య: I/202 రాగం : శ్రీరాగం
కీర్తన : వెన్నవట్టుకనేయి వెదకనేలా మరియు

శ్రీరాగం

65 వెన్న వట్టుక నేయి వెదకనేలా మరియు-
నెన్నివలసినను దమ(యెదిటివే) కావా ॥పల్లవి॥

తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు
కలుగుటే కలుగవలెఁగాక
వలనైనభోగములు వైభవంబులు మరియు
కలవెల్ల తమయెదుటఁ గలిగినవె కావా ॥వెన్న॥

పదిలముగ హరినామపఠన మంత్రము నోరు
కదియుటే కలుగవలెఁగాక
తుదలేనిసంపదలు తొలగనిముదంబులును
కదల కెప్పుడుఁ దమకుఁ గలిగినవె కావా ॥వెన్న॥

యించుకైనను వేంకటేశుగిరిశిఖరంబు
కాంచుటే కలుగవలెఁగాక
అంచితంబైననిత్యానందపదవులును
మించి తమయెదుటఁ బ్రభవించినవె కావా ॥వెన్న॥

ఉపోద్ఘాతము:

నీ చేతిలో వెన్నవుండగా, నెయ్యి యెక్కడ దొరుకుతుందని వెదకుట యెంత తెలివితక్కువపని? ఆ శ్రీహరి యెన్నికావాలంటే అన్ని తమయెదుటనే వున్నాయి అని మనకిచ్చాడు కాదా! అంటున్నారు అన్నమయ్య. విష్ణుచింతన కలవారికి యే వైభోగమైనా నిమిషంలో సముకూడుతుంది. పైగా అవి వారి యెదుటకే వస్తాయి. మరి ఇంకా

వెంపర్లాటదేనికండీ? నిత్యానంద పదవులన్నీ వేంకటేశుని దాసుల స్వంతం. అది వారి యెదుటనే ప్రభవిస్తుంది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! చేతిలో వెన్ననుపట్టుకొని వున్నవారు నెయ్యి యెక్కడ దొరుకుతుందా, అని వెదకితే యెంత హాస్యాస్పదంగా వుంటుంది? ఎన్ని వలసినను (మనకు యేమికావాలంటే దానిని) తమ "యెదిటివే" అన్నట్లు శ్రీహరి మనకిచ్చాడు కాదా?

తలపున (మనస్సున) విష్ణుచింతన నిమిషమాత్రము చేసే యోచన కలుగుట అనేది కలుగవలెను. మరుక్షణం కావలసిన భోగములు, వైభవములు మరియు యెన్ని కావాలంటే అన్ని సిరులు తమ యెదుటనే వున్నట్లు కావా?

పదిలముగా (భద్రముగా) శ్రీహరి నామమంత్రము నోర (నోటిలో) కదియుటే (చేరుటే) సంభవించవలెగాక! ఆపైన తుదలేని సంపదలు (అంతులేని సంపద) యెన్నడూ విడిపోని ముదంబులు (సంతోషములు) కదలకుండానే మనంవున్న చోటికే వచ్చి యెప్పుడూ స్వంతం అయిపోవా? ఇందులో సందేహమేముంది?

ఇంచుకైనను (కొద్దిగానైనా) శ్రీవేంకటాద్రి శిఖరదర్శనం కాంచుటే (కన్నులకు సోకితే) కలుగువలెగాక! మీ అదృష్టం పండితీరుతుంది. అంచితంబైన (పూజింపదగిన) నిత్యానందానుభవము కలిగించు దివ్యపదవులను మించిన పదవులు తమ యెదుటనే ప్రత్యక్షమై మీ స్వంతం అయిపోవా? శ్రీవేంకటేశ్వరుడు తలచుకొంటే మీకు యేది ఇవ్వలేడు చెప్పండి.

పద్యవివరణ:

చం.॥ **వెదకుటదేటికిన్ జనులు వెన్నలు వట్టుక నేతికోసమై**
యెదుటనువున్నవే యగును యేయదికావలెనన్న నిత్యమున్
పదిలముగా తలంచిహరి బాడిన మంత్రము నోరు పండదో?
వదలక వైభవమ్ములును పాయక దక్కును వేంకటేశ్వరా!

సంఖ్య: I/116 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఘనుడీతడొకడు కలుగగ గదా వేదములు

శుద్ధవసంతం

66 ఘనుఁ డీఁతఁడొకఁడు గలుగఁగఁగదా వేదములు
జననములుఁ గులము లాచారములుఁ గలిగె ॥పల్లవి॥

కలుషభంజనుఁ డితఁడు గలుగఁగఁగదా జగతిఁ
గలిగె నిందరిజన్మగతులనెలవు
మలసి యితఁడొకఁడు వొడమఁగఁగదా యిందరికి
నిలువ నీడలు గలిగె నిధినిధానములై ॥ఘనుడీ॥

కమలాక్షుఁ డితఁడు గలుగఁగఁగదా దేవతలు
గుమిగూడి రిందరును గండిగడచి
ప్రమదమున నితఁడు నిలుపఁగఁగదా సస్యములు
అమర ఫలియించె లోకానందమగుచు ॥ఘనుడీ॥

గరిమె వేంకటవిభుఁడొకఁడు గలుగఁగఁగదా
ధరయు నభమును రసాతలము గలిగె
పరమాత్ముఁడితఁడు లోపల గలుగఁగాఁగదా
అరిది చవులును హితవు లన్నియునుఁ గలిగె. ॥ఘనుడీ॥

ఉపోద్ఘాతము:

ఘటనాఘటన సమర్థుడు, ఘనుడు ఈ పరమాత్ముడు శ్రీవేంకటేశ్వరుడు కలుగుట చేతనే ఈ సృష్టిలో వేదములు, జననములు, కులాచారంబులు, జన్మలు, నిధినిధానములు, దేవతలు, రాక్షసులు, పదునాలుగులోకములు కలిగినవి అంటున్నారు అన్నమయ్య. లొట్టలేసుకొంటూ మనం తిండి తింటున్నామంటే రసోత్పత్తి కలిగిస్తున్నదీతడే కదా! మరి ఇతనిని, విడువవచ్చునా?

తాత్పర్య వివరణ:

ఘనుడైన ఈ శ్రీహరి యొక్కడు కలుగుట చేతనే కదా! ఈ సృష్టిలో వేదములు, నరుల పుట్టుకలు, వారి కులములు, వారి ఆచారములునూ యేర్పడినవి.

ఇతడు కలుషభంజనుడు (పాప నిర్మూలకుడు). ఎవరిపాపం, యెంత నిర్మూలిస్తాడో తెలియదు. ఆ మిగిలిన పాపపుణ్యాలవల్లనే ఉత్తమ, అధమ జన్మలు కలుగుతున్నాయి. ఈ దేవదేవుడు, మలసి (ఉద్యమించి) నిశ్చయించబట్టే ఈ జీవులన్నిటికీ నిలువ నీడ దొరికింది. వాటి జీవనమున, నిధినిధానము వంటివాడు ఈ పరమాత్ముడే.

కమలాక్షుడైన ఈ దేవదేవుని కృపవలననే దేవతలు అనేకమార్లు గండిగడచి (కష్టాల రంధ్రంలోంచి బయటపడి) రక్షించబడ్డారు. ప్రపంచంలో, ప్రమదములు (సంతోషములు) ఇతడు నిలుపుతుంటే లభిస్తున్నాయి. సస్యములు (పంటలు) యితని వల్ల కలిగి లోకులు తిండి తినగలుగుతున్నారు. అందువలననే వారి ఆనందము ఫలించి సుఖంగా వున్నారు.

గరిమె (మహిమాన్వితుడైన) శ్రీవేంకటేశ్వరుడు వుండబట్టే, ఈ భూమి, ఆకాశము, పాతాళాదిలోకములు కలిగినవి. పరమాత్ముడైన ఈ స్వామి జీవులపైన అమితదయగలవాడై వాటికి అనేకమైన, చవులు (రుచులు) హితవులు (మేళ్ళు) కల్పిస్తుంటాడు. ఈ జీవుల జీవిక బహు రుచికరంగా వుండటానికి ఈ స్వామియే కారణం.

పద్యవివరణ:

కం.॥ **ధరయు నభము పాతాళము**
అరయగ జననములు, కులము లాచారంబుల్
సురలు నసురలును శ్రుతులును
పరమాత్ముడు వీనివల్ల ప్రాప్తించె జుమీ!!

సంఖ్య: I/201 రాగం : దేవగాంధారి
కీర్తన : ఎందరివెంటనెట్లు దిరుగవచ్చు

దేవగాంధారి

67 ఎందరివెంట నెట్లఁ దిరుగవచ్చు
కందువెఱిఁగి చీఁకటిదవ్వుకొనుఁగాక ॥పల్లవి॥

తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలినయట్టిదేహి
కొలఁదిమీరినదేవకోట్లు ధనలోన
కలవాని నొక్కనిచే కొలుచుఁగాక ॥ఎందరి॥

కాలీచపడఁగ నెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టిప్రాణి
మేలిమిజగములు మేనిలోఁ గలవాఁడు
పాలిటివాఁడై ప్రణుతికెక్కుఁగాక ॥ఎందరి॥

నూరేండ్ల నెందరి నుతియింపఁగలవాఁడు
చేరఁదావులేనిజీవి
శ్రీరమణీశుఁడు శ్రీవేంకటేశుని
కోరికెఁ దలఁచి నుతి కొల్లగొనుటగాక ॥ఎందరి॥

ఉపోద్ఘాతము:

మానవుడు అనేక భ్రమలతో ఎందరివెంట నెట్లా తిరిగినప్పటికీ అతనికి చివరికి మిగిలేది అజ్ఞానాంధకారమే. తలబండబారునట్లు యెంతమందికి మొక్కినా యేమి ప్రయోజనం తనలోనే పరమాత్ము వున్నాడని వీడికి తట్టడం లేదే? ఈ జీవి నూరేండ్లు యెందరిని స్తోత్రించినా

వుపయోగమేమి? వీడు ఒక్కసారికూడా శ్రీవేంకటేశుని కోరిక దీరా కొలిచి నుతించడే!! అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ మానవుడా! నీవు యెందరివెంట (యెంతమంది వెంటపడి) యెట్లా తిరగవచ్చు (తిరగగలవు?) కందువెరిగి (నీ సామర్థ్యం తెలిసి) మసలుకోకపోతే నీకు చివరికి మిగిలేది అజ్ఞానాంధకారమే.

నీ తలబండ బారేటట్లు యెంతమందికి మ్రొక్కుతావు? ఓ తెలివితక్కువ దేహీ! ఈ కోట్లకొలది దేవతలు తన ఆత్మలోనే వున్నా వానిని ఒక్కని కొలిచిన చాలదా? ఇంతమంది దేవతలను పేరుపేరునా కొలుచుట యెంత తెలివితక్కువతనం?

కాలసర్పం పడగలమీదెక్కి పయనిస్తూ యెంత దూరం పోగలవు? ఉచ్ఛమూ నీచమూ లేని ప్రాణి అంతకంటే హితమేమి చేయగలదు? పదునాల్గు భువనాలూ తన మేనిలోనే కలవాడు తనవాడై ప్రయోజనం కలిగిస్తే చాలదా? ఇంకా యేమి కావాలి?

ఈ జీవి నూరేండ్లు బ్రతికి యెందరిని నుతించినా వాడికి చచ్చాక చేరటానికి తావే వుండదు. వాడు అలా ఆత్మరూపంలో పరుగులు పెడుతూనే వుంటాడు. శ్రీవనితావల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని కోరిక దీరా తలచి నుతించిన ఆ కోరికలన్నీ కొల్లగొట్టబడతాయి కదా!

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఎంతమంది వెంట నెట్ల తిరుగవచ్చు**
చీకటొకటె మిగులు చింతపోదు
వేంకటేశుడుండ వేల్పులన్యులు యేల?
కోర్కెలన్ని దీరు కొల్లగాను.

సంఖ్య: I/203 రాగం : భైరవి
కీర్తన : పసలేని యీబ్రదుకు

భైరవి

68 పసలేని యీబ్రదుకు
అసలు చొచ్చిచొచ్చి అలసినట్టాయె ॥పల్లవి॥

తొల్లిటిజన్మాదులఁ గానినరరూపు
పల్లించుకొన్న యీబ్రదుకు
కల్లసుఖములచే కనలి కమ్మర
ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్టాయ ॥పస॥

బూటకములనెల్లఁ బొరలి సంసారంపు-
పాటుదెచ్చినయీబ్రదుకు
నీటుగ నెద్దు దన్నీనని గుఱ్ఱము-
చాటు కేఁగినయట్టిచందమాయె ॥పస॥

పగగొన్న పొగ కోపక మంటఁ బడిపడి
పగలు రేలైనయీబ్రదుకు
తగువేంకటేశ్వరుఁ దలఁచి నేలనుండి
యెగసి మేడమీఁది కేఁగినట్లాయె ॥పస॥

ఉపోద్ఘాతము:

"అసలు" అంటే మూలధనము. మన అకౌంటెన్సీలో ప్రిన్సిపుల్ అన్నమాట. "అసలు" అంటే బురద అని కూడా అర్థము వున్నది. ఈ రెండవ అర్థంలో కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఈ జీవితంలో యేమాత్రమూ పసలేదు. ఎంతకాలం బ్రతికినా ఒకే తీరున నిస్సారంగావున్నది. చివరికి యేమి వుపయోగం కలిగింది? ఏమీలేదు. బురదలో పడి దొర్లి దొర్లీ వూరకనే అలిసిపోయినట్లయింది అంటున్నారు.

ఈ శ్రీవేంకటేశ్వరుడి కృపవల్ల నాకు కూడా మేలు జరిగి నేలపై వుండవలసినవాడు మేడ యెక్కినట్లయింది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! ఏమాత్రమూ పసలేని (సారములేని) ఈ బ్రతుకుయెంత నిరుపయోగమైనది!! దీనివలన నాకేమి ఒరిగింది? అసలు (బురదలో) చొచ్చీ చొచ్చీ (దూరీదూరీ) అమితంగా అలసిపోయినట్లయింది.

తొల్లింట నరజన్మలలో మనిషిరూపము దక్కించుకొన్న నేను ఈ బ్రతుకున సాధించేదేమిటి? కల్ల సుఖములచే (నిజముకాని సుఖములతో) కనలి (పీడింపబడి) క్రమ్మర (స్వార్థం) లో నలిగి నా బ్రతుకేమైనదో తెలుసా? గుచ్చుకొనిన ముల్లును తీసివేసి దాని స్థానంలో మేకును గుచ్చుకొన్నట్లయింది.

ఛీఛీ! ఈ బ్రతుకంతా బూటకమే. ఈ సంసారంలో పొరలితే ఇది నాకు యెన్నో పాట్లు (తిప్పలు) తెచ్చిపెట్టింది. మొరటుగా వున్న ఆ యెద్దు తన్నిందని ఈ గుఱ్ఱము నీటుగా వుంది ఇదే నయము అనుకొని గుఱ్ఱమెక్కినవాడి గతియే నాకూ పట్టింది. దాని వేగము నేను తట్టుకోగలనా? నన్ను క్రిందపడవేసి ఈడ్చుకెళ్ళింది ఆ ఆశల గుఱ్ఱము.

పగతో రగిలిపోతూ ఆతాపానికి ఆగలేక మంటలలో మాడిపోయిన ఈ బ్రతుకున పగలూ రేయీ అనే ధ్యాస లేక పగలూ సెగలూ అంటూ గడిచిపోయింది. చివరికి ఆ శ్రీవేంకటేశ్వరునికే ఈ జీవిపై జాలి కలిగి జ్ఞానోదయం కలిగించాడు. ఆయననే ధ్యానించి నేలపైన నుండవలసిన నేను దివ్యసౌధాగ్రముల తిరిగినట్లయినది.

పద్యవివరణ:

కం.॥ **పసలేని దయిన బ్రతుకున**
అసలునబడి చొచ్చి చొచ్చి అలసితిని హరీ!
వెస సప్తశిఖరనాయక!
కొసకెక్కితి మేడపైకి కొలుచుచు నిన్నే.

సంఖ్య: I/61 రాగం : శంకరాభరణం
కీర్తన : పదిలము కోట పగవారు

శంకరాభరణం

69 పదిలము కోట పగవారు
అదనఁ గాచుకొందు రాఱుగురు ॥పల్లవి॥

ఇమ్మెఁ జెప్ప యిందరిచేత
తొమ్మిదినెల్లఁ దోఁగినది
కొమ్మతీరునఁ గుదురైనకోట
దొమ్మికాండ్లైదుగు రుందురు ॥పది॥

వొంటికాఁడు రాజు వుడుగక తమలోన
వొంటనీనిమంత్రు లొకయిద్దరు
దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు-
బంటు లేడుగురు బలవంతులు ॥పది॥

కలవు తొమ్మిది కనుమల తంత్రము
నిలుపఁగలిగినట్టినెరవాదులు
తెలిసి కొనేటితిమ్మినాయఁడు చొచ్చె
బలిసె యీకోట భయమేల ॥పది॥

ఉపోద్ఘాతము:

ఈ అధ్యాత్మ కీర్తనలో అన్నమయ్య మానవదేహాన్ని రాజుగారి కోటతో పోల్చి అందులోని జీవాత్ముడు రాజు అంటున్నారు. ఆ కోటను కొల్లగొట్టటానికి అనేకమంది పగవారు ప్రయత్నిస్తుంటారు. ఆరుగురు దుర్మార్గులు సమయం యెప్పుడొస్తుందా, యెప్పుడీకోటను ఆక్రమిద్దామా అని యెదురుచూస్తున్నారట. ఈ కీర్తనంతా ఇలాగే సాగుతుంది. తాత్త్విక చింతన కవితాహృదయం లేనిదే ఇటువంటి కీర్తన చెప్పలేరు. కోనేటి తిమ్మినాయుడంటే శ్రీవేంకటేశ్వరుడు. ఆయనే స్వయంగా ఆక్రమించి ఈ కోటను బలిష్టం చేశాడు భయమేల

అటున్నారు. అక్కడక్కడా ఈ రచయిత పప్పులో కాలేస్తే నవ్వుకొని క్షమించేయండి మరి.

తాత్పర్య వివరణ:

మానవదేహము అనే ఈ 'కోట' పదిలమైనదే (రక్షణ కలిగినదే). సందేహం లేదు కాని దీనికి పగవారు (శత్రువులు కూడా) అదన (తగిన సమయం కోసం) కాచుకొందురు (వేచివుంటారు). వాళ్ళెంతమందో తెలుసా ఆఱుగురు (వారినే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సరాలని పిలుస్తాము).

ఇమ్మెజెప్ప (ఇంపుగా చెప్పవలెనంటే) ఇది (ఈ కోట) ఇదివరలో తొమ్మిది నెలలపాటు యెంతమందితో నిర్మించబడినదో చెప్పలేము. (దీన్ని యెందరు తల్లులు తొమ్మిది నెలలు మోసి ప్రసవించారో?) ఈ కోటకు కొమ్మతీరున (చక్కటి శిఖరముతో) కుదురైవున్నది. ఈ కోటను ఆక్రమించటానికి ఐదుగురు దొమ్మికాండ్లు (బందిపోటు దొంగలు) సిద్ధంగా వున్నారు (వారే పంచేంద్రియములని పిలువబడే కన్ను, ముక్కు, చెవి, నాలుక మరియు చర్మము.

ఈ కోటలో పాపం, రాజుగారు నిజానికి ఒంటరివాడే (ఆతనిపేరు ఆత్మ). కానీ ఆయనను ఒంటరిగా వుండనీయక ఇద్దరు మంత్రులు యెప్పుడూ మంతనాలు చేస్తూనే వుంటారు. వారే మనస్సు, బుద్ధి. వీరి అండతో, దంటతనంబున (ధైర్యముతో) ఏడుగురు సైనికులు బలవంతులై తిరుగాడుతున్నారు (ఏడు ఇంద్రియములు వారే).

పోనీ ఈ కోట గట్టిదా అంటే అదీకాదు. దీనికి తొమ్మిది కంతలు వున్నాయి (నవరంధ్రాలు). మధ్యమధ్యలో తంత్రులు (నరాలున్నాయి). వీరంతా ఈ కోటను నిలుపగల నెరవాదులు (నేర్పరులు). ఇంతటితో ఈ కోట భద్రమనుకొంటే అది పెద్ద తప్పు. దీని అసలు రక్షకుడు కోనేటి తిమ్మనాయుడు (శ్రీవేంకటేశుడు). బలిసివున్న ఈ కోట గురించి ఇక భయమేల?

పద్యవివరణ:

కం.॥ **పగవారు! కోట పదిలము**
వొగి ఆర్గురు కాచుకొనిరి వొదలక యెపుడున్
వగవక కొండల తిమ్మని
తెగకొల్వుడు భయముబాపి తీర్చును కోటన్.

సంఖ్య: I/233 రాగం : మఖారి
కీర్తన : ఎవ్వరికైనను ఈవ్రాత । నను

మఖారి

70 ఎవ్వరికైనను యీవ్రాఁత । నను
నవ్వులు నేసెఁబో నావ్రాఁత ॥పల్లవి॥

తొలిజన్మంబున దోషకారియై
నలుగడఁ దిప్పెను నావ్రాఁత
యిల దుర్గుణముల కీజన్మంబున-
నలఁకువ నేసెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥

పరుషునిఁ జే శల్పుని ననిపించుట
నరజన్మమునకు నావ్రాఁత
తరుచయ్యినపాతక మరుపెట్టుక
నరకము చూపెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥

పామతితనమున బహువేదనలను
నామన సెనసెఁబో నావ్రాఁత
కామితఫలు వేంకటపతినిఁ గొలిచి
నామతి దెలిపెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥

ఉపోద్ఘాతము:

విధివ్రాత అని పెద్దలంటుంటారే అది యెవ్వరికైనను తప్పింప నసాధ్యము నేను ఈనాడు నలుగురిలో నవ్వులపాలయ్యానంటే అది నా 'వ్రాత' వల్లనే కదా! అంటున్నారు అన్నమయ్య. దాన్నే విధివ్రాత అంటారు. అది పూర్వజన్మల దోషాలను కూడా వదలక ఈ జన్మలో దేశద్రిమ్మరిని చేసి, అనేక దుర్గుణాలు అంటగట్టి యెంత ఏడిపించాలో అత యేడిపిస్తుంది. వీడెంత అల్పుడైన పురుషుడురా అని గేలిపాలయేట్లు చేస్తుంది. పండితుడినైనా పామరుని కంటే

అధముని చేస్తుంది. నా నుదిటివ్రాత. ఒక్క వేంకటపతిని నిత్యమూ కొలిచిన హరిదాసుని మాత్రం ఈ'వ్రాత' యేమీ చేయలేదు.

తాత్పర్య వివరణ:

ఎవ్వరికైననూ ఈ వ్రాత (విధివ్రాత) యెదురులేనిదే. నావ్రాత (నా నుదుట ఆ విధి వ్రాసిన వ్రాత) నన్ను నవ్వులపాలు, సేసెబో (చేసేసింది పోండి.) అందుకే ఇన్ని అవమానాలను పొందుతున్నాను.

నా నుదుటివ్రాత నా తొలిజన్మంబులలోని దోషముల నన్నింటిని నావెంటనే తీసికొనిపోయి, నలుగడల దిప్పెను (నలుదిక్కులా తిరిగే దేశద్రిమ్మరిని చేసింది.) ఈ జన్మలో నాకు ఇన్ని దుర్గుణాలు వున్నాయంటే మరి వేరే కారణం యేముంది? నేను యెందుకింత "అలకువ" (ఆయాసము) పొందుతున్నాను? నన్నిట్లా చేసింది నావ్రాతయే కదా!

నేను నరజన్మనెత్తిన పిదప నావ్రాత తప్పింపలేక పురుషుడననే మర్యాదను పోగొట్టుకొని అందరి చేత వీడు "అల్పుడు" అనిపించి తల యెత్తుకోకుండా చేసినది నా వ్రాత. తరచుగా నేను చేసే పాతకములను, అఱుపెట్టుక (దక్కించుకొంటూనే) నానుదుటివ్రాత నాకు నరకమును ఈ భూమిమీదే చూపింది.

నా నుదిటివ్రాత వలన పామరితనమున (నిరుపయోగి, అయోగ్యుడు అయిన పామరుని వలె) అనేక వేదనలను అనుభవించాను. తత్త్వజ్ఞానం మఱచిపోయాను. ఇంతలో నానుదుటి వ్రాతలో మార్పువచ్చి కామితఫలదాత (కోరిన కోర్కెల ఫలము కలిగించు) శ్రీవేంకటేశ్వరుని కొలిచితిని. నావ్రాతే నామతిని తెలిపి ఆస్వామి దాసుని చేసినది.

పద్యవివరణ:

ఉ.॥ **ఎవ్వరికైన"వ్రాత" యిది హేయపురీతుల గేలి క్రుందగన్**
నవ్వులపాలుచేసి సిరినాశము జేయును మాన్పసాధ్యమా?
అవ్వల పూర్వజన్మముల అంటిన దోషము చేయు ద్రిమ్మరిన్
రవ్వగు వేంకటేశ్వరుడె 'రావలదే' యని 'వ్రాత' నాపురా.

సంఖ్య: I/219 రాగం : ఆహిరి
కీర్తన : హరినెఱగనిపుణ్య మంటేరుగాన

ఆహిరి

71 హరినెఱఁగనిపుణ్య మంటేరుగాన
దురితాలే దురితాలే దురితాలే సుండీ ॥పల్లవి॥

దొడ్డపుణ్యములు సేసి తుదలేనిసంపదలు
అడ్డగించుకొని రాసులగుగురుతు
జడ్డులేనిహరికథ చవిలేకుండిన నిట్టే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండీ ॥హరి॥

వలెనని మేలెల్ల వడిఁజేసి కైవల్య-
మలమి చేతికిలోననగు గురుతు
తలఁపు వైష్ణవభక్తిఁ దగులకుండిన నంతా
అలయికే అలయికే అలయికే సుండీ ॥హరి॥

తిరమైన తీర్థాలు దిరిగి యందరిలోన
ధరఁ బుణ్యఁడవుట యంతకు గురుతు
తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా
విరసాలే విరసాలే విరసాలే సుండీ ॥హరి॥ **219**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో అన్నమయ్య హరినెఱగనివారు యెన్ని పుణ్యకార్యాలు చేసినా నిరుపయోగమేనంటున్నారు. వారు చేసిన పుణ్యకార్యాలు పాపాలేనని నొక్కి వక్కాణిస్తున్నారు. తొలి జన్మపుణ్యమువలన ఈ జన్మలో కోటీశ్వరుడై పోతాడు. కానీ అదే గురుతు. హరి కథామృతమున రుచి లేకపోతే వాడి జీవితం గొడ్డేరే అంటున్నారు అంటే నీళ్ళు యెండిపోయిన 'ఏరు' అన్నమాట. విష్ణుభక్తిలేని వైష్ణవుని జీవితం అలయిక మాత్రమే, అంతే వుత్త శ్రమ మాత్రమే అంటున్నారు. కీర్తన అంతా చదివితే అన్నమయ్య అద్భుత మేధస్సుకు అబ్బురపడతారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! హరినెఱగని పుణ్యము (హరివిరహితమైన పుణ్యకార్యాలను) అంటేరు గాన (ముట్టుకోరుకదా!) ఎందుకంటే అట్టి పుణ్యకార్యాలన్నీ దురితాలే, దురితాలే, దురితాలే (పాపాలే, పాపాలే, పాపాలే) సుండీ! (సుమా!)

మీ తొలిజన్మలలో మీరు దొడ్డపుణ్యము (అధికమైన పుణ్యము) చేసినట్లు గుర్తు యేమిటో మీకు తెలుసా? ఎన్నడూ అడ్డగించబడని రాసుల కొలదీ దనము సంపద వాడిని చేరుతుంది. అదే కొండ గురుతు. కానీ యెంత ఐశ్వర్యమున్నా జడ్డులేని (ఇష్టాగోష్టులులేని) హరికథాశ్రవణము నందు, చవిలేక (రుచిలేకపోతే) ఆ హరికథంతా, గొడ్డేరే గొడ్డేరే, గొడ్డేరే సుండీ (అంటే యెండిపోయిన ఏరువలె వ్యర్థమైనది సుమా!)

వలెనని (పూనుకొని) తోటిజీవులకు అంతులేని మేళ్ళను వడిజేసి (శీఘ్రముగా చేసిన) ఏదో ఒకనాడు కైవల్యము అరచేతికి చిక్కుతుంది. అదే (ఆ మోక్షప్రాప్తే) చక్కటి గురుతు. కానీ తలపులో నిరంతరం విష్ణువు లేని పైపై విష్ణుభక్తి దగిలి భజనలతో కాలం వెళ్ళబుచ్చితే, అంతా అలయికే అలయికే అలయికే సుండీ (శ్రమయే శ్రమయే శ్రమయే సుమా!)

అందరిలోనా అతి పుణ్యుని గుర్తించుట యెట్లు? ఆతడు ధరలో (ఈ భూలోకంలో) తిరమైన (ప్రసిద్ధమైన) తీర్థయాత్రలు చేస్తూ అందరికంటే యెక్కువ పుణ్యం సాధిస్తాడు. అదే గురుతు. తిరువేంకటేశ్వరుని తెలియకుండిన వాడికింకేమి తెలిసినా, అంతా విరసాలే విరసాలే విరసాలే సుండీ (రసహీనమైనవే సుమా!)

పద్యవివరణ:

కం.॥ **హరినెఱిగిన గురుతేమిటి?**
నరుడేధరపుణ్యుడగుట నయముగ సుండీ!
తిరువేంకటేశు దెలియక
విరసాలే విరివియైన విరసాలె కదా!

సంఖ్య: IV/496 రాగం : గుజ్జరి
కీర్తన : కొండవంటి దేవుడు నే గొలిచే దేవుడు

గుజ్జరి

72 కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు వీఁడే
నిండుకున్నాఁడు తలఁచు నెమ్మదినోమనసా ॥పల్లవి॥

నన్నుఁ బుట్టించే దేవుఁడు నాలోనున్నాఁడు దేవుఁడు
కన్నచోటులనే వుండే కాచే దేవుఁడు
వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు
యెన్నెని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు ॥కొండ॥

సిరులిచ్చిన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు
గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు
మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు
ఇరవై మాయింటనున్నాఁ డీదేవుఁడు ॥కొండ॥

దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు
రూపు చూపె నిదివో బోరున దేవుఁడు
శ్రీపతియైన దేవుఁడు శ్రీవేంకటాద్రి దేవుఁడు
చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు ॥కొండ॥ 496

ఉపోద్ఘాతము:

కొండలలో వెలసిన కొండవంటి సమున్నతుడైన దేవుడు ఈ శ్రీవేంకటేశ్వరుడే అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఈయన ఈ విశ్వమంతా నిండియున్నాడు. మనసారా తలుచుకొంటే చాలు మన్నిస్తాడు. పైకి భజన కూడా చేయనక్కరలేదు. నెమ్మదిలో ధ్యానించవే మనసా! అంటున్నారు. ఆ స్వామి చేసిన ఘన కార్యములను భజనరూపంలో వివరిస్తున్నారు. ఈయనే దాపుదండైన దేవుడట. తను కరుణించదలచుకొన్న వానిని తన దగ్గరకు బలవంతాన పిలిపించుకొని, మరీ అనుగ్రహిస్తాడట. నేను కూడా దీనికి సాక్ష్యమే.

తాత్పర్య వివరణ:

నేను కొలిచే ఈ దేవుడు కొండవంటివాడు (కొండ వలె సుస్థిరమైనవాడు) నెమ్మదిని (నా అంతరంగమున) వీడే నిండుకున్నాడు (నిండిపోయి వున్నాడు). ఓ మనసా! వీనిని ధ్యానింపవేలనే?

ఓ మనసా! నాకోసం ఈయన యెంత శ్రమించాడో వినవే. ఈ దేవుడే నన్ను పుట్టించినవాడు. కన్న చోటులనే (నా మనుగడ మొదలు బెట్టిన నా తల్లి గర్భంలోనే) నన్ను నిరంతరం రక్షించిన దేవుడితడే. అమ్మరూపంలో అమిత వాత్సల్యంతో వెన్నతినిపించి గోరుముద్దలు పెట్టి మరీ నన్ను పెంచాడీ దేవుడు. ఈయనను యెంతని పొగడవచ్చును. ఈతడొక్కడే మా దైవము. అంతే... అదే నిజం.

ఓ మనసా! ఎవ్వరికైనా సిరులనీయగల దేవుడితడే. నీవు అశాస్త్రీయంగా సేవించినా ఆక్షేపించక నీ సేవలను స్వీకరిస్తాడు. నేను అజ్ఞానినైనందున జగద్గురువై నాకు జ్ఞానమిచ్చిన గురుదేవుడితడే. అంతే కాదు నన్ను చేకొని జ్ఞానమార్గంలో నడిపాడు. ఈయనను మరిగించిన (నా పాపములను నిర్మూలించిన దైవము). నేను మూగవానిని కాకుండ నా చేత మాటలాడించినదీ దేవుడే. ఇరవై (సుస్థిరుడై) మా ఇలవేల్పువలెవున్న దేవుడితడే.

ఓ మనసా! ఈ దేవదేవుడే నాకు దాపుదండైనవాడు (ఎప్పుడూ నా ప్రక్కనే రక్షించుటకు సిద్ధంగా వుంటాడు). ఎక్కడెక్కడో అగమ్యంగా తిరిగే నన్ను ఒక ఒడ్డుకుచేర్చినదీయనె. నాకు తన రూపము చూపిన శ్రీ లక్ష్మీవల్లభుడైన దేవుడు ఈ శ్రీవేంకటేశ్వరుడొక్కడే. ఈయన మమ్మల్ని చేపట్టినాడు, మమ్మేలినాడు. ఈయన చేజేతనే (నా అరచేతనే)వున్న దైవము.

పద్యవివరణ:

ఆ.వె.॥ **కొండవంటి వేల్పు నిండునామనసంత**
నేను కొలుచు దేవుడైనవాడు
వేంకటేశుడనెడి వెలలేని దేవుడు
తీర్చెమమ్ముబట్టి దేవుడితడె.

సంఖ్య: IV/520 రాగం : మాళవిగౌళ
కీర్తన : రాముడు లోకాభిరాముడుదయించుగాను

మాళవిగౌళ

73 రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను ॥పల్లవి॥

తటుకన మారీచుతలపైఁ బోయఁ గర్మము
కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను ॥రాము॥

తరగె రావణు పూర్వతపములయాయుష్యము
ఖరదూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తాకు చినిఁగె నంతటను ॥రాము॥

పొరిఁ గుంభకర్ణునికి పుట్టినదినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె (గ?) నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీవేంకటేశుచేఁతలెల్లా దక్కెను ॥రాము॥ **520**

ఉపోద్ఘాతము:

అద్భుతమైన ఈ రామగాధ కీర్తనలో కొరుకుడు పడని పద ప్రయోగాలు పుష్కలంగా వున్నాయి. కొన్ని నా భావనకు తట్టినట్లు వివరిస్తున్నాను. అన్నమయ్య భావము ఇది అని చెప్పటానికి వీలులేదు. ఉదాహరణకు "పొరిగుంభ కర్ణునికి పుట్టిన దినము వచ్చె మరలి" అంటే యేమిటి? బాగా ఆలోచించినమీదట నాకు ఇలా తట్టింది. కుంభకర్ణుడు తన పుట్టినరోజునాడు నిద్రలేచి బాగా తిని ఆరు నెలలు మెలకువతో వుంటాడు. ఆపైన ఆరు నెలలు నిద్రపోయి తిరిగి తన పుట్టినరోజునాడు నిద్రలేస్తాడు. అయితే యుద్ధంలో వరుసగా యోధులందరూ చచ్చిపోతే వాడిని బలవంతాన నిద్రలేపారు. వాడు

తన పుట్టిన రోజు వచ్చిందనుకొని నిద్రలేచాడు. కానీ అదే వాడు చచ్చినరోజయింది, అవునా? ఈ లోకాభిరాముడు పుట్టుటవలన కదా! వాల్మీకికి అంతులేని పుణ్యం దక్కింది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

రాముడు (శ్రీరామచంద్రమూర్తి) లోకాభిరాముడు (లోకమున అందరికంటె మనోజ్ఞమూర్తి). భూలోకంలో ఈయన ఉదయించగాను (మానవజన్మనెత్తగానే) వాల్మీకికి (వాల్మీకి మహర్షికి) జన్మజన్మల పుణ్యం అంతా దక్కినది.

ఈ రఘురాముని మూలంగా మారీచుని తలపై రాక్షసుని వలె జన్మించవలసిన కర్మము పోయన్ (నశించినది). వానికి వైకుంఠప్రాప్తి కలిగినది. కుత్సితురాలైన శూర్పనఖకు ముక్కున రక్తముతో పండిపోయెను. రాక్షసుల భార్యల మెడలలోని మాంగల్యములన్నియు పుటుక్కుమని తెగినవి. మరి ఆపైన మటమాయ (గొప్ప మాయావులైన) దైత్యులకు నూరేండ్లు నిండినవి (మృత్యువు వచ్చేసింది).

రావణాసురుడు కొన్నివేల యేండ్లు చేసిన తపముల ఆయుర్దాయము నశించినది. దానితో వాడూ చచ్చాడు. ఖరదూషణాది రాక్షసులు పదివేలమందీ కాలము తీరి ఒకే క్షణంలో నశించారు. లంకా నగరానికి నవగ్రహముల మహిమ తాకి ఛిన్నాభిన్నమయింది. సిరి సంపదలలో వోలలాడే ఇంద్రజిత్తునకు, చినిగె నంతటను (అంతట వాడి బ్రతుకంటా చినిగిపోయి చిందరవందరయినది).

కుంభకర్ణునికి, పొరి (నాశనము తప్పదన్నట్లు) వాడి పుట్టినరోజు అతివేగముగా మరలివచ్చినది (ఉపోద్ఘాతమును జాగ్రత్తగా చదవండి...) మండోదరి మాంగల్యమునకు గండము సంప్రాప్తించి వైధవ్యము తప్పలేదు. అయోధ్యానగరమునకు భాగ్యములు ఫలించినవి. శ్రీవేంకటేశ్వరుని చేతలెల్లా (లీలలన్నీ) చిరమై (బహుకాలముదాకా) దక్కెను (ప్రకటింపబడినవి).

పద్యవివరణ:

తే.గీ.॥ **రాముడుదయించలోకాభిరాముడగుచు**
పుడమి వాల్మీకికినీదక్కె పుణ్యమెల్ల
పాడెరామాయణంబిట్లు భక్తితోడ
అన్నమయ్య వేంకటనాథు సన్నుతించి.

సంఖ్య: IV/127 రాగం : పాడి
కీర్తన : కామధేనువు దేవకల్పితము భువిలోన

పాడి

74 కామధేనువు దేవకల్పితము భువిలోన
వోముచును భోగించ యుక్తివలెఁగాని ॥పల్లవి॥

తలఁచినట్లనౌ దైవముద్రాసినద్రాఁత
పలికినట్లనౌ పలుమంత్రజపములు
నిలిపినట్లనౌ నిర్మలచిత్తముకీలు
నెలవునఁ బనిగొన నేర్పువలెఁగాని ॥కామ॥

యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము
కమ్మన్నట్లనౌ ఘనతపములశక్తి
తెమ్మనినయట్లఁ దెచ్చు ద్రిష్టము యక్షిణీవిద్య
చిమ్ములను దనకంత చింతవలెఁగాని ॥కామ॥

వునిచినట్లనుండు నొక్కడే దేహగుణము
యెనలేని శ్రీవేంకటేశ్వరుమాయ లివి
పెనచిన యిహమేపో బీజము వుద్యోగులకు
తనివి నలమేల్మంగదయ వలెఁగాని ॥కామ॥ 127

ఉపోద్ఘాతము:

కామధేనువు అంటే దేవలోకంలో వుండే గోవు. ఇది క్షీరసాగరమథనమున ఐరావతము మొదలైన అనేక దివ్య వైభవములతోపాటు జన్మించి ఇంద్రునికి పారిజాత కల్పవృక్షములతోపాటు

సంక్రమించినది. కామధేనువు కావలసినవి సృష్టించుటేకాదు, ఎంతమంది శత్రువులతోనైన పోరగల సైన్యమును క్షణంలో సృష్టించగలదు. దీని సంతానం కూడా దివ్యమహిమాన్వితమైన 'నందిని' వంటి గోవులే. అన్నమయ్య యేమంటున్నారంటే... కామధేనువు దేవలోకవాసుల కొరకు కల్పించబడి వుండవచ్చు. భువిలో దానిని చూచిన వాడెవ్వడూ లేడు కదా! అది కల్పితమైనది కూడ కావచ్చును. ఎవ్వరు చూచారు భువిలో వొముచును అంటే రక్షించుచూ కోరుకొన్న భోగములు కావలెననే యుక్తివలె అది వూహింపబడినది. నిజజీవితంలో అటువంటివేవీ లేవు అంటున్నారు. నేర్పు, కృషి, శ్రీవేంకటేశ్వరుని కృప – ఈ మూడు మాత్రమే ఇహమున సుఖముల నివ్వగలదు. ఏ వుద్యోగము నెరవేరాలన్నా అలమేల్మంగ దయకలుగ వలసిందే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కామధేనువు దేవకల్పితము (దేవలోకమైన స్వర్గం యొక్క వైశిష్ట్యాన్ని చెప్పే వైభవము.) ఇది కల్పితము అయిననూ ఆశ్చర్యపోనక్కరలేదు). భువిలో అందులోనూ ఈ కలియుగంలో, వోముచును భోగించ మనకు అండయైన భోగములను పొందవలెనంటే యుక్తివలెగాని (ఉపాయముండాలి) అంతేకానీ కామధేనువూ, కల్పవృక్షము కాదు.

ఒక్కటి గుర్తుపెట్టుకోండి. దైవము వ్రాసిన నుదుటివ్రాత తిరుగులేనిది. అది ఆయన ఏవిధముగా తలచినాడో అట్లే అవుతుంది. మంత్ర బలముతో నిత్యమూ జపమునందు నిమగ్నమౌ మహానుభావులు వాక్సుద్ధి కలిగివుంటారు. వారు అన్నది అన్నట్లే జరుగుతుంది. నిర్మలుడైన వాని చిత్తము కీలు (మర్మము) తెలిసి నిలిపినట్లే సుస్థిరంగా నిలుచును. వీటన్నిటినీ, నెలవున బనిగొన (సుస్థిరంగా నియోగించుటకు కావలసినది) "నేర్పు" అంతేకానీ కామధేనువు కాదండీ!

ఏచిన కర్మఫలము (అతిశయించిన కర్మఫలము) యిమ్మనినట్ల నిచ్చును (ఆ సర్వేశ్వరుడు యెట్లా ఇమ్మంటే... అట్లా ఇస్తుంది). ఘనమైన తపోశక్తి కలవారు, కమ్మన్నట్లనే (ఏవిధంగా జరుగమంటే అట్లాగే జరుగుతుంది). యక్షిణీ విద్యసిద్ధించిన మహానుభావులు ద్రిష్టము (భాగ్యము) తెచ్చినట్లే దెచ్చును (ఎట్లా తెమ్మంటే అట్లా తెస్తుంది). "చిమ్ములను దనకెంత చింతవలె గాని"... చిమ్మినట్లుగా తనకెన్ని చింతలు కలిగిననూ ఏ కామధేనువూ కాపాడలేదు. నీ స్వయంకృషే నీకు రక్ష అవుతుంది.

ఒక దేహధారియొక్క స్వగుణము యెన్నటికీ మారదు. అది వునిచినట్లే, ఒక చోట వుంటుంది. ఇదంతా ఆ దేహి గత జన్మ సుకృతమునుబట్టి వుంటుంది. ఇవి అంత తేలికగా అర్థమయ్యే విషయాలు కావు సుమా! ఇవన్నీ యెనలేని (సాటిలేని) శ్రీవేంకటేశ్వరుని మాయలు. ఇదిట్లా వుండగా పైకి మాత్రం పెనచిన ఇహము (చుట్టుకొనివున్న ఈ ప్రపంచమే), పో... అన్నిటికీ కారణము బీజము... ఉద్యోగులందరికీ ప్రపంచమే నిజమనిపిస్తుంది. అలమేల్మంగమ్మ దయవుంటే ఆస్వామి మనని ఈ భ్రమలోంచి బయటపడేస్తాడు.

పద్యవివరణ:

ఆ.వె.॥ **కామధేనువనెడి కామ్యప్రదాయని**
ఊహబుట్టు భోగ ఉపకరంబు
నేర్పు, కృషియు, లక్ష్మి నిలయుని కృపలేక
ఇహమునందు పోదు దేహగుణము

సంఖ్య: IV/128 రాగం : శ్రీరాగం
కీర్తన : గోవింద నీవన్నిటిలో గూడితే జాలుగాని

శ్రీరాగం

75 గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁగాని
యీవల సంసారమైన (నా?) యిది ధ్రువపట్టమే ॥పల్లవి॥

తలఁపులోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాఁపురముఁ గైవల్యమే
బెళకునాలుకకు నీపేరు వచ్చితేఁజాలు
పలికినవన్నియు పరమవేదములే ॥గోవిం॥

తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు
పడుచులబొమ్మరిండ్లు బ్రహ్మలోకమే
కడలేనినీభక్తి గలిగితేనే చాలు
కడజన్మమయినా నిక్కపువిప్రకులమే ॥గోవిం॥

కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు
పాయపు రతిసుఖము పరతత్వమే
యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే ॥గోవిం॥ **128**

ఉపోద్ఘాతము:

సంసారముమాయామేయము. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు వంటి ద్వంద్వముల మూలంగా ఈ సంసారము యెప్పుడూ నిలకడలేనిదానివలెనే అనేక భ్రాంతులను కలిగిస్తుంటుంది. కాని గోవిందుని ఆశ్రయించి కూడితే చాలును ఈ సంసారమే ధ్రువమండలప్రాప్తి దక్కినట్లు శాశ్వత కీర్తిగలవానిగా చేస్తుంది. ఓ వేంకటేశ్వరా! నీకు శరణార్థులైన వారికి

చేసినపాపమెల్ల పుణ్యకర్మగానే పరిణమిస్తుంది అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ గోవిందుడా! నీవు అన్నిటిలోనూ కూడియున్నావు అనే భావన కలిగితే చాలును. ఎంతో అస్థిరమైన ఈ సంసారము (జగత్తు), ధ్రువపటమే అవుతుంది (అత్యంత స్థిరమైన) ధ్రువమండలమువలె వుంటుంది.

ఓ నారాయణుడా! నీవు ఒక్కసారి తలపులలోనైనా మాకు దగ్గరితేనే చాలు (దగ్గరయైనచో అంతే చాలును). కైవల్యప్రాప్తికూడా కలలో జరిగినట్లు జరుగుతుంది. బెళకు నాలుకకు (తళతళమని ప్రకాశించు నాలుకకు) నీపేరును పలుకుట వచ్చిన చాలును. అది పలికిన పనికిరానిమాటలు కూడా పరమవేదములవలె మానవునికి అంతులేని పుణ్యాన్నిస్తుంది.

ఓ దేవదేవా! నీపూజతొడరి (యత్నించి) చేతదొరకితేనే (చేజిక్కించుకొంటే) చాలును. జవ్వనుల భ్రుకుటీ విలాసములు బ్రహ్మలోక ప్రాప్తికి అడ్డురావు. కడలేని (అంతులేని) నీ భక్తి కలిగినంతమాత్రమున కడజాతివాడైనా విప్రునికంటే విశేషమైన పుట్టుక కలవానివలె ఉన్నతుడవుతాడు.

ఓ శ్రీహరీ!యెవడన్నా భక్తితో తన శరీరంపై నీ శంఖచక్ర ముద్రలు ధరించితే చాలును. వాని శరీరము పరతంత్రమైనట్లు (పరాధీనమైనట్లు) పాయపురతిసుఖమును (వయస్సుకు సహజమైన రతి) కూడా కాంక్షించదు. ఓ శ్రీవేంకటేశ్వరా! యెచ్చోటనైనా నీ శరణార్థులమైన మాకు అంతా పుణ్యమే. పాపమనేది లేనేలేదయ్యా!

పద్యవివరణ:

చం॥ **తలపున శ్రీపతీ! తగిలి దగ్గరయైనను చాలునయ్య నీ**
విలువగుభక్తి దాపయిన విప్రుని జన్మముతో పనేమి? యీ
చెలువగు దేహమందు హరి శ్రీప్రదముద్రలుగాచు, చాలదా
నిలకడలేని యీజగతి నిక్కముగా ధ్రువపట్టమేయగున్.

సంఖ్య: VI/104 రాగం : రామక్రియ
కీర్తన : విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా

రామక్రియ

76 విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా
మచ్చికమరునిధాక మగువనీరాక ॥పల్లవి॥

పంచలపసిండినిగ్గు వచ్చిదేరే సిగ్గు
వంచనవలపుతీపు వాలుకచూపు
కంచపుంబాలకూడు కాఁకలనీవాడు
మంచపునీతలఁబ్రాలు మట్టెలపాదాలు. ॥విచ్చే॥

కోవిలకొసరుఁబాట కొమ్మరో నీమాట
తావులచెంగావి నీతళుకుమోవి
గోవజవ్వాది కరంగు గుబ్బల నీమెఱుంగు
భావజుదాడిరొదలు పాదపునీకదలు. ॥విచ్చే॥

ముద్దుల నీనగవు చిమ్ములరతిబిగువు
అద్దలింపుఁగసరు మోహంపుఁగొసరు
గద్దరినీయలపు వెంకటపతితలఁపు
అద్దపునీమోము మోహనరతిసాము. ॥విచ్చే॥

ఉపోద్ఘాతము:

అలమేల్మంగ శ్రీవారి శోభన కార్యక్రమానికి అలంకరించబడి ఆంతరంగిక చెలికత్తెలు తోడుకొని తెస్తుంటే వేంకటరమణుని సన్నిధికి తోడుకొని రాబడింది. అన్నమయ్యకూడా తన భావనా వినీలాకాశంలో శ్రీదేవిని వెంటతీసికొనివస్తున్న ఒక చెలికత్తె అయ్యారు. మధుర శృంగార కీర్తన ఆవిష్కరింపబడింది. ఈ కీర్తనలో కేవలం పాండిత్యంవల్ల అన్నమయ్య మన భావనలకు అందడు. భక్తి, హరికృప, సమయస్ఫూర్తివున్నవాడే ఈ కీర్తన వివరించగలడు. ఒక నిఘంటువుని పెట్టుకొని పనికానిచ్చేస్తానంటే "రాముని తోక పివరుండిట్లనియె" అని చదివిన గ్రంథసాంగునివలె అవుతుంది. అలమేల్మంగను వెన్నెలతో చేసిన బొమ్మ అని వర్ణిస్తున్నారు. ఓ మగువా! నీ రాకను మన్మథుడు మచ్చికతో "ధాకవేసి" (ధంకా

బజాయించి) అట్టహాసంగా హరికి తెలుపుతున్నాడు. ఆ జగదేకపతి కూడా పరవశంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడట. ఔరా! అన్నమాచార్యా! లేరయ్య నీసాటి.

తాత్పర్య వివరణ:

స్నిగ్ధమైన వెన్నెలబొమ్మవంటి ఓ అలమేల్మంగా! మెల్లగా నీపతి వద్దకు విచ్చేయవమ్మా! (రావమ్మా!) ఓమగువా! నీరాక, మచ్చికతో మిమ్ము అలరించ దలంచిన, మరుని (మన్మథుని) ధాక (ధక్కావలె) స్వామివారికి వినపడుతున్నది కాబోలు.

ఓ దేవీ! నీవు సిగ్గుపడుతుంటే, పసిండికి (బంగారమునకు) పంచల నిగ్గు (పంచవన్నెల కాంతి) సమకూడినట్లయినది. నీ వాలుకన్నుల చూపు, ప్రియుని వంచించే వలపులు కూడా తీపిగానే వుంటాయేమో అనిపిస్తున్నది. నీవాడు (నీ మనోహరుడు) కాకలవున్నాడమ్మా (ఆయన నీవు ఆలోచనలో మెదలగానే వేడెక్కిపోతున్నాడు.) ఆయనకు కంచము నిండా పాలతో నిండిన మధురాన్నం తినిపించవమ్మా! మట్టెల సవ్వడి చేసే నీ పాదాలు నీవు వంగి చూసికొనగానే నీ శిరసునున్న తలంబ్రాలు నీ పాన్పుపై పడినవమ్మా!

కొమ్మరో! (ఓ యువతీ!) నీవు మాట్లాడుతుంటే కోయిల కొసరి కొసరి పాడుతున్నట్లుంది. తళతళ మెరయుచున్న నీ మోవి (అధరము) చెంగావిరంగు తాపినట్లున్నది. గోవ (మనోజ్ఞముగా) జవ్వాది మెత్తిన (మెత్తగా), దానిలో కరిగినట్లున్న నీ చనుగుబ్బలు మెరిసిపోతున్నాయి. కదలెడి నీ పాదముల సవ్వడి భావజుడు (మదనుడు) మీపై దాడి చేస్తున్నట్లున్నది తల్లీ!

దేవీ! ముద్దులొలికే నీ చిరునవ్వు, రతికేళిలో నీ బింకమూ, నీ ప్రియుని నీవు అదిలించి కసురుకొనే వుత్తిత్తి చిరాకు స్వామికి విపరీతమైన మోహాన్ని కలుగజేస్తున్నది. దిట్టతనముగల సురతమున నీ అలయక (నిస్సత్తువ) చూపినా, నీపతి వేంకటపతి తలపు, అద్దమువంటి నీమోమున నీపతి రతిసామ్రాజ్యము ప్రతిఫలింపచేస్తున్నదమ్మా!

పద్యవివరణ:

కం.॥ **విచ్చేయవమ్మ! నీపతి**
మెచ్చిన బంగారుకొమ్మ! వెన్నెల బొమ్మా!
హెచ్చెను హరి పరవశమిక
మచ్చిక నీరాక మగువ! మదనుని "ధాకే".

సంఖ్య: IV/126 రాగం : లలిత
కీర్తన : కావగనీకేపోదు కరుణానిధివిగాన

లలిత

77 కావఁగ (క?) నీకే పోదు కరుణానిధివిగాన
దేవ నీ బంట్లము మా తెరు వేఁటి తెరువు ॥పల్లవి॥

బండుబండై వూరఁగలపనులెల్లాఁ జేసేము
యెండా (డౌ?) తా నీడౌతా నెఱఁగము
కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు
బెండువంటివారము మా బిగు వేఁటిబిగువు ॥కావఁ॥

దీనుఁడనై (లమై?) యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము
కాని దెందో మంచి దెందో కానము
శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండుఁగాను
మానువంటి వారము మా మనసేటి మనసు ॥కావఁ॥

బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా
యెందుకా (కౌ?) తా నేడకౌతా నెఱఁగము
యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే
చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత ॥కావఁ॥ **126**

ఉపోద్ఘాతము:

నేటి తెలుగులో ఇదే పల్లవిని "కావగ నీకు తప్పదు కరుణానిధివి కావున, దేవ నీ బంటులము మా తెరువేటితెరువు" అని చెప్పవలసి వుంటుంది. 600 ఏళ్ళనాటి తెలుగులో ఆ మార్పు సహజమే. మానవసహజంగా మాకు కొంత బిగువు వుంది. మాకు మనస్సు వుంది. కాని ఆ బిగువు యేమిబిగువు? ఆ మనస్సు యేమి మనస్సు? మేము నీ బంటులమయ్యా మా కంటూ స్వతంత్రంగా ఒక గమ్యం వుంటుందా? నీవెట్లా చెబుతే అట్లా చేస్తాము. మేము నీ దాసులము ప్రభూ! మా చేతలు యేమి చేతలు? అంతా నీ దయ మా ప్రాప్తము అంటున్నారు, అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! నీవు కరుణానిధివి, గాన కావున) నన్ను కావగ (రక్షించక) పోదునీకే (నీకు తప్పదు). ఎందుకంటే, ఓ దేవా! మేము నీ బంట్లము (భృత్యులము), మా తెరువేటి తెరువు? మాకు స్వతంత్రంగా ఒక తెరువు (గమ్యము) వుంటుందా తండ్రీ!

పోనీ మా గత ప్రవర్తన చూద్దామా అంటే యేమి చెప్పను? బండు బండై (ఆకతాయితనమునకు హద్దులు లేకుండా) వూరిలోగల నిరుపయోగమైన పనులన్నీ చేసేస్తాము. యెండయినా నీడయినా లెక్కసేయక ఇచ్చవచ్చినట్లు తిరిగేము. ఓ కొండలరాయడవైన శ్రీవేంకటేశ్వరా! మమ్ము నీవే యేదో మానుంచి కావాలని మమ్ము పుట్టించావు. మేము బెండువంటి వారము (బలహీనులము) మా బిగువు (బింకము) యేపాటి బింకమయ్యా?

స్వామీ! అంతులేని ఆశలతో మా దైన్యము చాటుకొంటూ, దిక్కులన్నీ కలియతిరిగేము. కానీ యేది మంచిదో యేది చెడ్డదో కాననైతిమి. మేము మానువంటవారము, అడవిచెట్టువంటివారము. నీవు అందించే గాలి, నీరు, సూర్యకాంతియే మా జీవనాధారము. ఓ శ్రీనాథా! ప్రకృతి రూపంలో అవన్నీ నీవు అందిస్తుంటే బ్రతుకుతున్నాము. మా మనస్సు యేమి మనసు? అది యెన్నాళ్ళయినా నీ తత్త్వం యెరుగనీయని అజ్ఞానంలోనే మమ్మల్ని వుంచుతుంది.

ఓ దేవదేవా! మేము ఈ బొందితో (శరీరంతో) పుట్టాము కాబట్టి యేమైనా సరే! భోగమే కావాలంటుంది ఈ శరీరము. ఇట్లా యెందుకవుతున్నదో, దీని మర్మం యెక్కడవున్నదో తెలియము. ఓ శ్రీవేంకటేశ్వరా! మాకు ఇహలోకమున కోర్కెలను పరలోకమున మోక్షమును ఇచ్చుచున్నది నీవేనయ్యా! నీకు చెంది దాసులమై (నీ స్వంత దాసులమైనవారము. మా చేతలు యేటిచేతలు? స్వతంత్రించి మేము యేమిచేయగలమయ్యా?

పద్యవివరణ:

ఉ.॥ **కావగనీకు తప్పదుర గారవమొప్పగ వోదయానిధీ!**
దేవర! నీదు బంట్లముర తీరిచి మాతెరువేటిదో ప్రభూ!
ఆవల దిక్కులెల్ల తిరుగాడెద మాసల నీల్గినీల్గి వో–
శ్రీవనితామనోరమణ! శ్రీపతి! వేంకటరాయ యీయెడన్.

సంఖ్య: IV/511 రాగం : పాడి
కీర్తన : ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు

పాడి

78 ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీనరసింహుఁడు ॥పల్లవి॥

సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా
సొరిది మోములు తోఁగి చూచుకొంటాను
విరులచెండులఁగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీనరసింహుఁడు ॥ఇంతు॥

భవనాశిలోని నీరు పైఁ జల్లులాడుకొంటాను
నవకపుసిరులను నవ్వుకొంటాను
జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను
చివన నిందిరనంటె శ్రీనరసింహుఁడు ॥ఇంతు॥

వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా
ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా
ఆముక శ్రీవేంకటాద్రి నౌభళాన నిలిచిరి
శ్రీవమాలక్ష్మితోడ శ్రీనరసింహుడు ॥ఇంతు॥ 511

ఉపోద్ఘాతము:

"భవనాశి" నదీజలములలో తృప్తిగా తన దేవేరి శ్రీమహాలక్ష్మితో జలకములాడిన అహోబల శ్రీనరసింహుడు చివ(వ్వ)న నిందిరనంటినాడట. వారు సొరిదిమోములు తోగి (తొంగి) చూచుకొంటున్నారుట. ఆవిడకు ఉగ్రనరసింహుడు కాదు, అందాల వేంకటరమణుడు కానవస్తాడు. అందుకనే ప్రేమాతిశయముతో ఆ శ్రీహరి మధురోహలలో మునిగి ఈ 'హరి' (సింహము) కౌగిళ్ళ పెనగుకొంటా స్వామిని రంజింపజేస్తున్నదట. నేను

ఇదివరలో చాలాసార్లు చెప్పినట్లు అహోబలేశుని అపరశృంగార మూర్తిగా కీర్తించుట ఒక్క అన్నమయ్యకే సాధ్యము.

తాత్పర్య వివరణ:

ఓ ఇంతులాల! శ్రీదేవి ఆంతరంగిక చెలికత్తెలారా! చూడరమ్మా! వీరు ఈ శ్రీమహాలక్ష్మి మరియు శ్రీనరసింహుడు, ఇద్దరు జాణలే (చతురులే). ఈ శ్రీనరసింహుడు, రమాదేవిని (శ్రీలక్ష్మిని) చెంతన్ కూడెన్ (చేరువయై కూడినాడు).

సరిగొండలెక్కుకొని (సరిసంఖ్యలో వున్న కొండలపై నెలకొన్నవారైన) ఒకరితో ఇంకొకరు సరసోక్తులను విసురుకుంటూ సొరిది (ఒకరి తరువాత ఇంకొకరు) మోములు తమ ముఖములను, తోగి చూచుకొంటాను (తొంగి చూసికొనుచు), విరుల చెండులగొని (పూలదండలు విసురుకొంటూ, సిరితోడ (శ్రీదేవితో) నరసింహుడు విహరించుచున్నాడు.

"భవనారి" జలములతో జల్లులాడుకొంటా (జలకములాడుకొనుచు), నవకపు సిరులను (తొమ్మిది సిరులకు రాణియైన) తన దేవేరితో నవ్వుల జల్లులతో నానిపోతూ, తమ జవళిగెమ్మోవులు (జంట అరుణాధరములను సన్నలజూపుకొంటా (సంకేతములుగా కదలించుచూ, ఈ శ్రీనరసింహుడు చివన (చివ్వున) ఇందిరను అంటెను (తాకీతాకనట్లు తాకినాడు).

వేమరు (అనేకమారులు) స్వామితొడపై ఆసీనురాలై వీడుదోడు ఆడుకొంటూ (మాటకుమాట సరసోక్తిగా) చెప్పుకొంటూ వారిద్దరూ ప్రేమాతిశయమున ఒకరి కౌగిట నింకొకరు పెనుగులాడినారు. ఈ విధముగా ఆక్రమించి శ్రీవేంకటాద్రిపైనా మరియు ఈ ఔబళాన (అహోబలమున) శ్రీనరసింహుడు శ్రీమహాలక్ష్మితో నిలిచినాడు.

పద్యవివరణ:

కం.॥ **ఎంతో జాణలు యిద్దరు**
చెంత రమాదేవిగూడె శ్రీనరసింహుం-
డింతట వేంకటవిభుడట
ఇంతులు చూడండి "హరి"ని ఇందిరపెనకెన్

సంఖ్య: IV/457 రాగం : సామంతం

కీర్తన : ఆ రూపమునకే హరి నేను మొక్కెదను

సామంతం

79 ఆ రూపమునకే హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి ॥పల్లవి॥

ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు
సోలి నగ్నియును సూర్యచంద్రులును
నీలోనుండఁగ నెరిఁ గనెఁ గిరీటి
మూలభూతివగుమూర్తివి గాన ॥అరూ॥

అనంతశిరసుల ననంతపదముల -
ననంతనయనము లనంతకరముల
ఘన నీరూపము గనుఁగొనెఁ గిరీటి
అనంతమూరితి వన్నిటఁ గాన ॥ఆరూ॥

జగము లిన్నియును సకల మునీంద్రులు -
నగు శ్రీవేంకటనాథుఁడ నిన్నే
పొగడఁగఁ గిరీటి పొడగనె నీరూపు
అగణితమహిముఁడ వన్నిటఁగాన ॥ఆరూ॥ 457

ఉపోద్ఘాతము:

విశ్వతోముఖుడైన తన విశ్వరూపం కిరీటికి చూపించి అతని క్లైబ్యాన్ని నశింపజేసి శత్రు సంహారానికి ఆయత్తుని చేశాడు శ్రీకృష్ణపరమాత్మ. బ్రహ్మాది దేవతలు సేవిస్తున్న ఆ మూలభూతిరూపాన్ని చూచి కిరీటి పరవశించాడు. అనంతశిరసులు, కన్నులు, చేతులు గల ఆ విశ్వరూపుని చూచి కిరీటి వినమ్రుడై కర్తవ్యోన్ముఖుడైనాడు. కానీ ఆనాడు శ్రీమన్నారాయణుడే మానవుడిగా వచ్చి రావణుని సంహరిస్తాడని తెలిసిన విభీషణుడు మాత్రం ఆ

మానవుని రూపంలో విశ్వరూపుని చూచి శరణాగతుడయ్యాడు. ఓ శ్రీహరీ! ఆ రూపమునకే నేనూ మొక్కెదనయ్యా! అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! విశ్వతోముఖుడవైన విశ్వరూపుడవు నీవు. ఈ శ్రీమన్నారాయణుడే రావణ సంహారానికి మానవునిగా వస్తాడని ముందే తెలిసిన విభీషణుడు, ఆయనకు శరణాగతుడైనాడు. స్వామీ! నీవు వానిని చేకొనిగాచితివి. నేడు నేను కూడా నీకే మొక్కెదను. నన్ను కాపాడుము.

ముక్కంటియైన శంకరుడు, బ్రహ్మ, ఇంద్రుడు, అగ్నిదేవుడూ, సూర్యచంద్రులు నీలోనే వుండుట స్వయంగా ఆ కిరీటి తన కన్నులారా గాంచినాడు. అదెట్లు సాధ్యమైనది? ఆ దేవతలందరికీ మూలభూతి (మూలకారణమైన) మూర్తివి నీవే కాబట్టి కిరీటి ఆవిధంగా చూడగలిగాడు.

ప్రభూ! నీ విశ్వరూపములో కిరీటికి అనంతమైన శిరసులు, అనంతమైన పాదములు, అనంతమైన నయనములు (కన్నులు), అనంతమైన కరములు (చేతులు) కనుపించినవి. ఘనమైన నీ విశ్వరూపము చూచి కిరీటి అచేతనుడై నీకు శరణాగతుడైనాడు. అన్నివిధములా నీవు అనంతమూర్తివి అయినందు వల్ల తను కేవలం నిమిత్తమాత్రుడననే సత్యం అతనికి తెలియవచ్చింది.

ఓ శ్రీవేంకటనాథుడా! నీలో వున్న ఈ జగములు, మునీంద్రులు, సకలము నిన్నే పొగడుచుండగా స్వయంగా ఆ కిరీటి కనులారా కనుగొన్నాడు. నీ చతుర్భుజ రూపమును చూచిన కిరీటి స్వాంతనము పొంది అన్నివిధములా నీవు అగణిత మహిమకలవాడవని నీకుదాసుడై రణరంగమున విజయుడైనాడు.

పద్యవివరణ:

తే.గీ.॥ **జగములన్నియు, మునులును, సకలమున్ను**
విశ్వరూపానగాంచెను విజయుడంత
ఆ విభీషణునేలిన ఆర్తత్రాణు
విభుని రూపము గొలుతును వేంకటేశ!

సంఖ్య: IV/68 రాగం : లలిత

కీర్తన : ఏతపములు నేల యేదానములు నేల

లలిత

80 ఏతపములు నేల యేదానములు నేల
శ్రీతరుణీపతినిత్యసేవే జన్మఫలము ॥పల్లవి॥

దేహపుటింద్రియముల దేహమందే యణఁచుటే
దేహముతోనే తాను దేవుఁడౌట
సోహలను వెలిఁ జూచేచూపు లోనుచూచుటే
ఆహా దేవతలఁ దనందే తాఁ గనుట ॥ఏత॥

వెలి నిట్టూరుపుగాలి వెళ్ళకుండా నాఁగుటే
కులికి తపోధనము గూడపెట్టుట
తలఁపు తనందే తగ లయముసేయుటే
లలిఁ బాపబంధముల లయముసేయుట ॥ఏత॥

వెనక సంసారమందు విషయవిముక్తుఁడౌటే
మునుపనే తా జీవన్ముక్తుఁడౌట
పనిని శ్రీవేంకటేశుపదములు శరణంటే
అనువైన దివ్యపదమప్పుడే తా నందుట ॥ఏత॥ **68**

ఉపోద్ఘాతము:

జన్మసాఫల్యం చెందాలంటే ఏతపమో ఏ దానమో చేయవలెనా? అవసరంలేదంటున్నారు అన్నమయ్య. శ్రీసతీవల్లభుని నిత్యసేవగా ఆరాధించువారికి జన్మ సఫలమవుతుందని వేరే చెప్పవలెనా? ఒక మానవమాత్రుడు దేవుడవ్వాలంటే బ్రహ్మవిద్యేమీ కాదు. దేహములో అలజడి కలిగించు ఇంద్రియాలను అణచుటే సశరీరంగా మనిషి దేవత్వం పొందటానికి అర్హతనిస్తుంది. సోహలను (సోహం భావనతో)

బయటకానబడేదిగాక లోనగానబడే ఆత్మను దర్శించుటే దేవతలను తనలోనే దర్శించుటవంటిది. ఒకసారి శ్రీవేంకటేశుని శరణంటే దివ్యపదమును తాను అప్పుడే అందుకొనుటవంటిది.

తాత్పర్య వివరణ:

ఏవిధమైన తపములు యెందులకు? ఏవిధములైన దానములు కూడా యెందులకు? శ్రీతరుణీపతి (రమాకాంతుని) నిత్యసేవే (అనుదినము సేవించుటే) జన్మఫలము (జన్మ సాఫల్యత కలిగించును).

దేహమునకు సంబంధించిన ఇంద్రియములను దేహమునందే అణచుటయే సశరీరముగా తానే దేవుడౌట (దైవత్వమును పొందుటవంటిది). సోహం (ఆత్మయే నేను) అనే భావముతో వెలిజూచే చూపు (బాహ్యముగా చూచే చూపు) లోను జూచుటే (అంతర్ముఖునిగా చూచుటయే). దీనినే దేవతలను తనలోనే దర్శించుట అని భావించ వచ్చును.

ఆలోచించి చూస్తే తపోధనము కూడబెట్టుట అంటే యేమిటి? వెలుపలికి రావలసిన 'నిట్టూర్పు' గాలిని వెళ్ళకుండ (బయటకు పోకుండా ఆపుటయే). ఈ విధమైన ప్రాణవాయువు నిరోధమున గొప్ప తపోదీక్షను కొనసాగించవచ్చును. ఆలోచనలను తనలోనే నిరోధించుచు, తనలోనే లయము సేయుటే తన పాపబంధనములను లయము చేయుటతో సమానము.

వెనుక (ఆపైన) సంసారమున విషయసుఖాసక్తుడుగాక విషయ విముక్తుడై యుండుటే మేలు. ఈ విధముగా వుంటే అందరికంటే ముందే జీవన్ముక్తుడవుతాడు. పనివి (పూనుకొని) శ్రీవేంకటేశ్వరా! నీ పదములను శరణంటే, అప్పుడే తనంతటతానే అనువైన దివ్యపదము లభ్యమవుతుంది.

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఏతపములు నేల? యేదానములునేల?**
శ్రీసతీవిభునికి సేవచేయ,
జన్మసఫలమౌను సమయపాపములన్ని
వేంకటేశు శరణు విలువ బెంచు.

సంఖ్య: IV/48 రాగం : లలిత
కీర్తన : బ్రహ్మాదులకు నిదేపరచింత

లలిత

81 బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మాఁ గన్న తండ్రియైన పరమాత్మచింత ॥పల్లవి॥

మూఁడు లోకములకెల్లా మొదలిచింత
మేడెపుఁ గర్మములకు మీఁదిచింత
తోడ జనించిననాటి తొల్లిటిచింత
వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత ॥బ్రహ్మా॥

అంగములోవెదకేటి యానందచింత
నింగివలెఁ బొడచూపే నిర్మలచింత
కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁగలిగె మాకు నోహో యీచింత ॥బ్రహ్మా॥

కిందు మీఁదు నేకమైన కేవలచింత
సందు లేక నిజమైన సహజచింత
కందువ శ్రీవేంకటేశుఁ గన్నచింత
యిందునే మాకుఁ గలిగె నితఁడే చింత ॥బ్రహ్మా॥ **48**

ఉపోద్ఘాతము:

పరచింత అంటే పరమాత్ముని గురించిన చింత అని అర్థం. బ్రహ్మాది దేవతలు యెవరి గురించి చింతిస్తుంటారు అంటే ఈ పరమాత్ముని గురించే చింతిస్తుంటారు అని గ్రహింపునకు వస్తుంది. ఈ శ్రీవేంకటేశ్వరుడు, బ్రహ్మదేవుని కన్నతండ్రి. పరమాత్ముడని అందరూ ఆరాధించి చింతించేది యీతని గురించే అంటున్నారు అన్నమయ్య. చింత అనే పదము నెన్నుకొంటే కీర్తనలో ప్రతి చరణమూ 'చింత'తోనే పూర్తి

అవుతుంది. ఈ కీర్తన అంత తేలిక అనుకోవద్దు. "ఉంగిట గలిగిన మాకు ఓహో యీచింత" – అంటే యేమిటి?

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! బ్రహ్మాదులకు బ్రహ్మ మొదలైన దేవతలకు) ఇదె (ఈ శ్రీమన్నారాయణుని స్మరణే) పరచింత (ముక్తినొసగు చింతనము). బ్రహ్మను కన్నతండ్రి ఈ పరమాత్ముడు. ఈతని చింతయే ఉత్కృష్టమైన చింత.

దేవ, మనుష్య, పాతాళలోక వాసులందరూ మొదట చింతించునది ఈయన గురించే. మేడెపు కర్మల (వదిలించుకోవటం సాధ్యం కాని కర్మల మీది) గురించిన చింతయే ఈ పరమాత్ముని చింత. మనతోపాటే పుట్టి మనతొల్లిటి జన్మల ఫలమును కూడా అందించే చింత. దేనికీ జంకని మాకు ఈనాటికి ఈ పరమాత్ముని చింత ఒక్కటే మిగిలింది.

అష్టాంగసిద్ధులు పొందినవారు ఆనంద స్వరూపుడైన ఈ పరమాత్మను చింతించుచూ వెదకుతుంటారు. ఈయన పంచభూతాలలో ఒకటైన ఆకాశమువలె నిత్యమూ మనని రక్షణగా కప్పివుంటాడు. ఏదో ఒకనాడు కుంగేటి (క్రిందకు పడిపోయేటి) భోగములకు కొనచింత (ఆఖరి చింత). ఉంగిట (కపటము) కలిగిన మాకు, ఓహో ఈతన చింతయే నిర్మలులను చేయును.

ఈతని చింతకలుగగానే పాపపుణ్యములు నశించి కైవల్యం గురించిన చింతన కలుగుతుంది. సహజమైన ఈ పరమాత్ముని చింత సందులేకుండా అతనిని మనసంతా నింపివుంచుతుంది. శ్రీవేంకటేశ్వరుని దర్శించాలనే చింత ఇంతలోనే మాకు కలిగినది. నిజానికి 'చింత' అంటే అదే సుమండీ!

పద్యవివరణ:

కం॥ **పరచింత యిదియె సుండీ!**
వరబ్రహ్మాదులకు చింత పరమాత్మునిదే
వరమాయెనితని చింతయు
తిరుమలరాయడిని గూడు దీటగు చింతే.

సంఖ్య: IV/47 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎందుగాపురము సేతు నేది నిజమేది గల్ల

శ్రీరాగం

82 ఎందుఁ గాఁపురము సేతు నేది నిజమేది గల్ల
ముందర నొక్కదినమే మూఁడు గాలములు ॥పల్లవి॥

తనుభోగముల నివే తగ నొక లోకము
మనసులో తలపోఁత మరి యొక్క లోకము
యెనసిన కలలోని దిది యొక్క లోకము
మునుపు వెనకలివే మూఁడు లోకములు ॥ఎందుఁ॥

పంచభూతములచేతిబంధ మొక్కదేహము
యెంచఁగ నూరుపుగాలి యిది యొక్కదేహము
కొంచక త్రిగుణములగురి సూక్ష్మదేహము
ముంచె నిదె వొకటిలో మూఁడుదేహములు ॥ఎందుఁ॥

జీవునిలోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు
తావై వెలినున్నవాఁడు తా నొక్కఁడే
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగినాతఁ డీతఁడే
మావంకల మముఁ గాచె మొక్కితి మాతనికి ॥ఎందుఁ॥ 47

ఉపోద్ఘాతము:

మాయామేయ జగమునబడ్డాను. ఇందులో అబద్ధం యేదో, నిజముయేదో తెలియకుండావుంది. ఇందులో నేను కాపురము యెట్లావుండగలను? భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలములు కూడా, ముందర ఒకే దినముతో మొదలవుతున్నాయి.

మూడు లోకాలు అని అంటుంటారే... అవేవి? ఒకటి మనం భోగిస్తున్న ఈ భూమి, మనస్సు వూహించుకొనేదొకలోకము మరి మూడవలోకము స్వాప్నికము. ఇవేనయ్యా! మూడులోకాలంటే అంటున్నారు అన్నమయ్య.

కాల్పనిక జగత్తులో మూడుదేహాలేమిటో వివరిస్తున్నారు. పరమాత్ముడైన వేంకటేశ్వరుడు జీవాత్మలకు అధిపతి.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నేను జీవాత్ముడను. నేనుండే ఈ జగత్తు నిజమో కల్లయో తెలియరాకున్నది. ఇక నేను ఇందుయెట్లు కాపురము సేయగలను? భూత, వర్తమాన, భవిష్యత్ కాలములని నేను విభజించుకొనిన మూడు కాలములు మొట్టమొదట ఒక్కదినమే కదా?

మానవుడు తను భోగిస్తూ సుఖించే ఈ భూలోకమే కన్నులకు కనుపించులోకము. మరియొక లోకము వీనిమనస్సునుండి ఊహలలో పుట్టినది.అదే స్వర్గమనుకొంటున్నాడు వాడు. ఇకపోతే మూడవలోకము వీని స్వాప్నికలోకము. అందులో అన్నీ భ్రమలే.అదే పాతాళము. మునుపు పెద్దలు చెప్పిన ముల్లోకాలు ఇవేనయ్యా- ఇందులో యేదికల్ల? యేది నిజము.

ఈ దేహములు కూడా మూడు వున్నాయి. పంచభూతములైన గాలి, నీరు, వేడిమి, మన్ను (కార్బన్), శూన్యప్రదేశములతో నిర్మించబడినవే దేహములన్నీ.ఇంకొక దేహముంది. అది మన శ్వాసక్రియను నియంత్రిస్తుంది. ఈ ఊర్పులు లేనిచో పాంచభౌతిక దేహము వున్నా మరణించినట్లే. ఈ రెండూగాక త్రిగుణాత్మకమైన సూక్ష్మదేహము ఇంకొంకటుంది. అదే గుణములను కలిగిస్తుంది. మూడు దేహాలంటే ఇవేసుమండీ!

మానవులలో ప్రాణిరూపంలో జీవాత్ముడుంటాడు. వాడే శ్రీవేంకటేశ్వరుడు కూడా. బయటకు అన్ని పనులను చేస్తున్నట్లు కనబడుతున్నవాడూ తానొక్కడే. శ్రీవేంకటాద్రిమీద, చెలగిన (విలసిల్లుతున్న) ఆతడే, ఈతడు (ఈ జీవాత్ముడు కూడా). మేము ఆతనికి మొక్కితిమి. మూడు వంకల మాకు రక్షకుడైనది ఈ శ్రీవేంకటేశుడే.

పద్యవివరణ:

ఆ.వె.॥ **ఏది నిజము? చూడనేదియు కల్లరా?**
యెందుకాపురంబు నెటుల సేతు?
మూడు కాలములును ముందొక్క దినమెబో
జీవుడెవరు? ఇముడు శ్రీవిభుండె.

సంఖ్య: IV/79 రాగం : మంగళకౌశిక
కీర్తన : జీవములు దవ్వువోయ చీమలును పుట్టచొచ్చె

మంగళకౌశిక

83 జీవములు దవ్వువోయ చీమలునుఁ బుట్టచొచ్చె
వేవేలయిన నిది విడువనయ్యా ॥పల్లవి॥

చింతలిన్నియుఁ బాసె చిత్తమింతట రోసె
యెంత లే దీయాసలు యిఁకనేలయ్యా
అంతలో గురునిగంటి హరికే శరణంటి
దొంతులభవములాల తొలఁగరో ॥జీవ॥

గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె
యెక్కడిపలురుచులు యిఁనేలయ్యా
చిక్కె విజ్ఞానము నేఁడె జిహ్వానారాయణుఁగూడె
వుక్కునఁ బాపములాల వుడుగరో ॥జీవ॥

జీవుఁడు పావనమాయ దేవుఁడే జీవనమాయ
యీవలి యావని(లి?) కర్మమిఁక నేలయ్యా
శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను
భావపుబంధములాల పారరో ॥జీవ॥ **79**

ఉపోద్ఘాతము:

పుట్టలోంచి చీమలు వెలువడినట్లు జీవులందరూ దవ్వువోయి (యెక్కడెక్కడికో పోయి) వేవేలయిన జన్మలను పొందుచూ కర్మఫలమును అనుభవిస్తున్నారు. నేను కూడా ఈ కర్మబంధాన్ని విడువలేకున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! జీవుడు పావనుడైతే వానికి దేవుడే జీవన గమ్యమవుతాడు. వానిని ఈ జన్మలో చేసిన పాపములుకాని గతజన్మల పాపకర్మలు కాని

ప్రతి బంధకములు కావు. వానికి స్వామిశరణమే భవబంధములను పారద్రోలుతుంది అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

జీవులందరూ దవ్వువోయ (యెక్కడెక్కడికోపోయి) చీమలకు (చీమలయందు) బుట్టి చొచ్చె (జన్మించసాగిరి). నేనుకూడ యెన్ని వేల చీమ జన్మలెత్తినా, ఇది (ఈ జనన మరణ చక్రాన్ని), విడువనయ్యా! (విడువలేకున్నాను.)

అయితే ఆ దేవదేవుని కృపవలన, నా చింతలన్నియును తొలగినవి. నామనస్సు ఈ బ్రతుకుపై రోసినది. ఈ ఆసలు యెంతలేదు (అంతులేనేలేదు). ఇకన్ యేలయ్యా? (ఇంకా యెందుకయ్యా?) అంతలో నా గురుదేవులను చూచాను. శ్రీహరికే శరణుచొచ్చాను. దొంతుల భవములలో (ఒకదానిపై ఇంకొకటి కుండలు పేర్చినట్లు, కలిగే జన్మములారా!) తొలగరో (నన్ను వదలి తొలగిపోండి.)

ఆహారం తీసికొనిన వెంటనే కడుపు నిండిపోయి ఇక వద్దంటుంది. కాసేపు చూశాక కళ్ళుకూడా అలసి విశ్రాంతిని కోరుకొంటాయి. ఎన్నివిధాలుగా చూచినా రుచులుకూడా కేవలం ఆరు మాత్రమే. మరి ఈ మానవుడు ఇంకా రుచులు కావాలని వెంపర్లాడుతున్నాడు? ఎన్నడైతే నా జిహ్వా (నాలుక) రుచులు విసర్జించి నారాయణుని రుచి తెలుసుకున్నదో, విజ్ఞానము నాకు చిక్కినది. ఉక్కులాంటి నా పాపములారా! మీకు ఉడుగక (కృశించక) తప్పదు.

ఆ శ్రీవేంకటేశుని కృపవలన నాజీవుడే పావనుడైనాడు. నాకు ఆ దేవుడే జీవనమైనాడు. నాకు ఈ జన్మలోగాని, గత జన్మలలోగాని కర్మబంధముల గొడవ యెందుకయ్యా? శ్రీహరిని ఆశ్రయించి శరణని భక్తితో వున్నాను. ఓ భవబంధములారా! పారరో (మీదిక్కువున్న చోటికి పారిపోండి).

పద్యవివరణ:

తే.గీ.॥ **చీమజన్మలనెత్తుచు శ్రమనెణుగక**
జీవులందరు దవ్వులతావులందు
జన్మలెత్తుచుకర్మల సమయు చుండ్రు
విడువలేకుంటి నేనిది వేంకటేశ!

సంఖ్య: IV/83 రాగం : సామంతం
కీర్తన : పుట్టినప్రతమే పంతము హరితో

సామంతం

84 పట్టినప్రతమే పంతము హరితో
గుట్టున శరణని కొంకఁగఁదగవా ॥పల్లవి॥

అవ్వల రోసినయన్నము గుడిచిన
నెవ్వరు నవ్వరు యిఁకనేలా
రవ్వగ నొల్లక రాజసము విడిచి
దవ్వులఁ జేకొనఁదగవా మనకు ॥పట్టి॥

విడిచినభూతము వెస మరలించిన
యెడయనియేహిత విఁకనేలా
యిడుములఁ బిలుచుచు నిచ్చిన నొల్లక
అడుగఁబోయితే నమరునె మనకు ॥పట్టి॥

శ్రీవేంకటపతిసేవవారమై
యీవిధిఁ బరులసే విఁకనేలా
కైవస మీతఁడు కంటి మితనికృప
యీవల నావల నెదురా మనకు ॥పట్టి॥ **84**

ఉపోద్ఘాతము:

మాకు కొద్దిగా పట్టుదల యెక్కువ. అట్లాంటిది అనుకోకుండా శ్రీహరితో పంతానికి పోయాము. అదేదో వ్రతము పట్టినట్లు దీక్షగావున్నాము. అయ్యా!మాకెందుకండీ ఈ తిప్పలు. గుట్టుగా ఆ శ్రీహరికి శరణు మహాప్రభో! అని కొంకకన్ తగవా, అంటే, భయపడకుండావుండరాదా? అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో అన్నమయ్య ఇచ్చిన వుదాహరణలు చాలా గొప్పగా వున్నాయి. మనము

శ్రీవేంకటపతి సేవవారమైనాము. మనకు ఇంకొకడిని సేవించవలసిన అవసరం యేమిటి? అంటున్నారు. అదండీ దృఢ భక్తి అంటే. ఎందుకైనా మంచిదని చిల్లర రాళ్ళకు మొక్కుతూవుంటే చెడిపోదువురా ఒరే ఒరే!!

తాత్పర్య వివరణ:

మేము శ్రీహరితోనే పంతము పట్టినాము. అదే మా వ్రతము. కానీ ఈ తిప్పలన్నీ మాకెందుకు చెప్పండి? ఏదో గుట్టుగా (రహస్యంగా) శరణు మహాప్రభో! అని అంటే, కొంకగన్ తగవా (భయమును వదిలేస్తే సరిపోతుంది కదా!)

నాకు అన్నంవద్దు అని భీష్మించుకొని ఆ తరువాత రోసిన (పాడైపోయిన) అన్నం తింటే నలుగురూ నవ్వరా? ఇంఒకెందుకు ఈ పట్టుదలలు? రాజసము (దర్పము)విడిచిపెట్టవలసిన గుణము.దానిని శ్రేష్ఠముగా విసర్జించాలి. దూరపుదేశాలకుపోయి, యెవ్వరినో సేవించటం మంచిపనేనా?

ఎవ్వడినన్నా భూతం పట్టుకొంటే దాన్నివిడిపించినంతమాత్రాన సరిపోదు. అది మళ్ళీ పట్టుకొంటే యేమి ప్రయోజనం వుంటుంది? ఎవరన్నా పిలిచి ఇది తీసికోండి అనిఇస్తే నిరాకరించి మళ్లీ మనఅవసరానికిదాన్నే వారినుండి యాచిస్తే, అమరునె మనకు (గౌరవం వుంటుందా?)

మనము శ్రీవేంకటేశ్వరుని సేవావారము (భృత్యులము) మనకు ఆయనే పతి, మతి, గతి, స్థితి. ఈవిధంగా జీవించెదము. మనకు ఇంకొకరిని సేవించవలసిన అవసరం యేమివున్నది? ఈయన మనకు కైవసమైనాడు (స్వాధీనమైనాడు) ఇతని కృపను కంటిమి (చూచాము). ఈవల నావల (ఈ భూమ్మీద, ఆ పరలోకాల్లోనూ) యెదురా మనకు (మనకెదురుంటుందా?)

పద్యవివరణ:

కం॥ **పట్టినవ్రతమే పంతము**
గుట్టుగ శరణనుచు హరికి కొంకగ దగవా?
దిట్టయినవేంకటేశుని
కట్టితి మది మనకుయెదురు కలరే ధాత్రిన్?

సంఖ్య: IV/189 రాగం : దేవగాంధారి
కీర్తన : పుట్టించినవాడు తానే బుద్ధిచెప్పేవాడు తానే

దేవగాంధారి

85 పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు దానే
యిట్టె శ్రీహరి నన్నె ట్టీదేరించీనో ॥పల్లవి॥

యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని
యించుకవడిలోనే మోహింతు నందుకు
కంచువంటి దీమనసు కటకటా యేది వాటి
చంచలుఁడ హరి నన్నేసంగతి సేసీనో ॥పుట్టిం॥

తలఁతు నేనొకవేళ దైవము గనేనని
కలిమి నంతటిలోనె కడు మరతు
చలపట్టె నిదివో నాజన్మములకేది వాటి
కలుషచిత్తుఁడ నన్నేకందువఁ బెట్టీనో ॥పుట్టిం॥

జ్ఞానినౌదు నొకవేళ సరిఁ గర్మినౌదును
మానువంటిదీగుణము మరేది వాటి
కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మానిసి నింతే యెట్టు మన్నించీనో ॥పుట్టిం॥ **189**

ఉపోద్ఘాతము:

మానవుని పుట్టించుటయేకాదు, యేదిమంచి యేది చెడు అనే బుద్ధిని ఇచ్చేవాడు కూడా తానే అంటున్నారు అన్నమయ్య. ఈడేర్చటం అంటే సిద్ధింపజేయటం అని అర్థం. శ్రీహరి నన్ను ఇట్టే ఈడేరించేనో అని చింతామతి అవుతున్నారు. సంశయాలతో సతమతమయ్యే ఒక శరణాగతుని ఆవేదన ప్రతిఫలింపజేస్తున్నారు. నేను జ్ఞానినవుతానా లేక జీవనోపాధికి వెంపర్లాడే కర్మిష్టినవుతానా? మానవుని గుణములు మానువంటివి. నరికినా మళ్లీ

చిగురిస్తూనేవుంటుంది. ఇటువంటి మనిషిని కూడా మన్నించేవాడే మన శ్రీవేంకటేశ్వరుడు. అన్నట్లు 'వాటి' అంటే హద్దు.

తాత్పర్య వివరణ:

మనలనందరినీ పుట్టించనివాడు తానే. మనకు మంచీ చెడూ గ్రహించగల బుద్ధి (వివేకము) నిచ్చిన వాడు కూడా తానే. ఆ శ్రీహరి నన్నెట్లు ఈడేరించేనో (సిద్ధింపజేస్తాడో కదా!) ఇట్టే (సులభముగా) నాకు యోగ్యత కలిగించుట ఆయనొక్కడికే సాధ్యము.

నేను ఒక్కొక్కసారి ఛీ! ఇదెటువంటి సంసారము అని విముఖుడనవుతాను. అంతలోనే ఈ సంసారాన్ని మోహించి దీని ఉధృతానికి వివశుడనవుతాను. కటకటా! (అయ్యయ్యో!) ఈ మనసు కంచువలె పెళుసు స్వభావం కలది. అది యెప్పుడైనా విరిగిపోవచ్చును. దీనికి హద్దు యేది? శ్రీహరిపూని అతి చంచల స్వభావుడనైన నా సంగతి యేమిచేస్తాడో?

నా గత జన్మల సంస్కారమువలన ఒక్కొక్కసారి దైవమును యెరుగవలెనను కొంటాను. కాని కలిమి కళ్ళకు పొరలు కట్టి అంతలోనే అన్నీ మరచి సుఖవాంఛలో ఇరుక్కుపోతాను. దానితో చలపట్టి (మత్సరం పెరిగి) కలుషచిత్తుడనయ్యాను. దీనికి హద్దు యేదీ. ఇదిగో నా జన్మలకు తెగతెంపెట్లావస్తుంది? మరి ఇంకా నా జీవితంలో యెన్ని చమత్కారాలు జరుగుతాయో, యేమో?

సరే! ఈ జన్మలోనైనా జ్ఞానివలె సిద్ధిపొందుతానో లేక కర్మిష్ఠినై అందరితో సంగత్వం పెట్టుకొంటానో లేక మానువలె యెప్పటికప్పుడు చిగురించే గుణాలతో పరిమితి యెలా సాధ్యమవుతుంది? కోనలలోని శ్రీవేంకటేశ్వరా! నిన్నే కొలిచి శరణంటిని. నేను మానవమాత్రుడను, నీవుగాక నన్నెవరు మన్నిస్తారు తండ్రీ!

పద్యవివరణ:

ఉ॥ **పుట్టుకనిచ్చువాడు హరిబుద్ధిని నేర్పినవాడు దానెయౌ**
ఇట్టె మురాంతకుండు నను యెవ్విధి బ్రోచునే దెల్వనైతి
గట్టిగ మోహపాశమును కాదని వీడను కర్మినౌదు నే
దిట్టతనంపు మానిసిని దీటుగ నీ శరణంటి శ్రీహరీ!

సంఖ్య: IV/203 రాగం : నారాయణి
కీర్తన : ఏలికవు నీవట యింకా దైన్యమేల

నారాయణి

86 ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేఁతలకుఁ దగవు గాదనరా ॥పల్లవి॥

ఘనకర్మానుభవమే కావలె నొండె నాకు
వనజాక్ష నీసేవే వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మీ ॥ఏలి॥

పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె
తూకొని నీనామముచేఁదుంచుట యొండె
సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
మేకొని యీమాట వింటే మెత్తురా నిన్నును ॥ఏలి॥

యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె
సరస రెండును నైన సంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరిబేసి జంటమాట జరపకు మిఁకను ॥ఏలి॥ **203**

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! నీవు ఏలికవు. మాకు నీవుండగా ఇంకా దీనత్వమెందుకుంటుంది? నీవు దయాసాగరుడవు. నీ క్షమాగుణాన్ని ప్రదర్శించే చేతలు న్యాయం కాదనగలవారెవరయ్యా? అంటున్నారు అన్నమయ్య. నేటి తెలుగువారికి సుపరిచితంకాని యెన్నో తెలుగు మాటలున్నాయి ఈ కీర్తనలో. 'ఒండె' అంటే "అట్లా కాకపోతే" అని అర్థం. ఈ నా దౌర్భాగ్యానికి కారణం నేను చేసిన పాపమే కాబోలు. ఒండె, పూనుకొని

నీ నామమును చేదుంచుట. ఒండె, సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండునేల? ఈ మాటవింటే నిన్ననుమెత్తురా? అంటున్నారు. అర్థం కావటంలేదు కదూ!

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! మాయేలికవు నీవట. మరి మాకు ఇంకా దైన్యమేల (దీనత్వమెందుకయ్యా?) తాలిమి (క్షమాగుణాన్ని ప్రదర్శించు) నీ చేతలకు (పనులను) తగవు కాదనరా (న్యాయం కాదనగలవారెవరున్నారయ్యా?)

నా ఈ దుస్థితికి కారణం ఎంతో అధికమైన కర్మను అనుభవించవలసి వచ్చుటయేమో? ఒండె (అట్లా కాకపోతే) ఓ వనజాక్షా (పద్మనయనా) నాకు నీసేవ ఒక్కటిచాలును. ఒండె, (అట్లా కాకపోతే) నాపై నీఆగ్రహ ప్రదర్శనము నన్ను సంకెలబెట్టుట – రెండూ దేనికయ్యా? స్వామీ నన్నిట్లా చేస్తే నిన్నే నవ్విపోతారు సుమా!

ప్రభూ! ఈ నా దౌర్భాగ్యానికి కారణం గత జన్మలో నేను చేసిన పాపమే కాబోలు. ఒండె, (అట్లా కాకపోతే) పూని నీనామమును చేదుంచుట (నా చేత్తో నేనే వదలివేయటం) కావచ్చును. ఒండే (అట్లా కాకపోతే) సాకిరి (సాక్షిగా)చంకలో దాచుకొన్న దుడ్డు (రొక్కము) మంచిదే, అట్లే నీ శరణార్తీ మంచిదే. కానీ రెండిటినీ ఒకేసారి నమ్ముకోవటం మంచిదా? ఈ మాటని యెవ్వరైనా మెత్తురా?

స్వామీ! మాకు మరపు, ఒండే యెఱుక కావలయును. ఒండే (అట్లాకాక) రెండూ ఒకేసారి వుంటే కుదురుతుందా? ఓ వేంకటేశ్వరా! నీ మహిమతో నన్ను కరుణించితివి. ఇకనైనా లల్లాయి కూతలు, రెండర్థాల మాటలు నాతో జరుపకుము ఇకను (ఇకనైనా). నన్ను దయదలచవయ్యా!

పద్యవివరణ:

కం॥ **ఏలికవు నీవు వుండగ**
ఈ లీలను దైన్యమింకనేలా నాకున్?
తాలిమి నీ చేతలకును
ఏలా తగవింక వలదు ఇనచంద్రాక్షా!

సంఖ్య: IV/182 రాగం : వరాళి
కీర్తన : నవమూర్తులైనట్టి నరసింహము వీడె

వరాళి

87 నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము ॥పల్లవి॥

నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము
నగముపై యోగానందనరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము ॥నవ॥

నాఁటుకొన్న భార్గవూటునరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమళ్లనరసింహము
నాఁటి యీ కానుగమానినరసింహము వీఁడె
మేఁటి వరాహపులక్ష్మీనారసింహము ॥నవ॥

పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన
నలిరేఁగిన ప్రహ్లాదనరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీవేంకటాద్రిమీఁద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము ॥నవ॥ **182**

ఉపోద్ఘాతము:

శ్రీ కదిరినరసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. వీడు నవమూర్తులైన నరసింహము, అంటున్నారు. ఈ నరసింహము

క్రొత్తగానున్న నరసింహమట. ఆ తరువాత అచ్చట గల నవనారసింహులను పేరుపేరునా ప్రస్తుతించారు. చివరికి అన్నమయ్య కొసమెరుపులా ఈ కదిరిలో వున్నదీ, ఆ శ్రీవేంకటాద్రిమీదవున్నదీ చక్కని ఈ లక్ష్మీనారసింహుడే అని ముక్తాయింపునిచ్చారు. ఇంత చక్కటి కీర్తనలో నవనారసింహులను కీర్తించటంలో అన్నీ సరళమైన పదములే అనుకొంటే అంతకంటే తెలివితక్కువతనం వుండదు.

తాత్పర్య వివరణ:

వీడే (ఈ దేవదేవుడే) నవమూర్తులైనట్టి (తొమ్మిది రూపములలోనున్న) నరసింహము. ఈ కదిరి నృసింహుడు, నవమైనవాడు (బహు నూతనముగానున్న దేవుడు).

ఈ కదిరి నగరమున గద్దెమీది (సింహాసనముపై) కూర్చున్న నరసింహము వీడేనండీ! అల్లదిగో అక్కడ నగుచున్న (నవ్వులొలకబోస్తున్నవాడే) జ్వాలా నరసింహుడు. ఆ కనుపించుచున్న నగముపై (కొండమీద) యోగముద్రలో వున్న జ్ఞానస్వరూపుడే యోగానంద నరసింహుడు. మిగుల (అతిశయించి) ఈ వేదాద్రి వెలసినవాడే లక్ష్మీనరసింహుడు.

నాటుకొన్న (సుస్థిరముగా నిలిచిన) వీడే భార్గవూటు నరసింహము. ఇదిగో ఈ మట్టెమళ్లలో వెలసిన నరసింహుడు ఆర్తుల ఆపదలను మట్టుబెడతాడు. ఈ కానుగమానిలో వున్న, నాటి (అనాదివాడైన) నరసింహుడు వీడే. వీనికి భక్తితో మొక్కండి. ఈ మేటి వేలుపే వరాహలక్ష్మీనారసింహుడు. ఈయన ఈప్సితప్రదాత.

ఇదిగో ఈయనే అహోబలంలోని ప్రహ్లాదనరసింహుడు. ఇక్కడ కదిరిలో మనని బ్రోచుటకు అవతరించినాడు. బొమ్మిరెడ్డి చెర్ల (పల్లె) అనే ఈవూరిలో నలిరేగిన (యోగ్యముగా స్థిరపడిన) ఈ నరసింహుడు కూడా ప్రహ్లాద నారసింహుడే. ఇదిగో వేంకటాద్రిమీద భక్తుల కొంగు-బంగారమైన ఆ శ్రీవేంకటేశ్వరుడే చక్కగా మెలగేటి ఈ కదిరి లక్ష్మీనారసింహము. మన రక్షకుడు.

పద్యవివరణ:

సీ॥ శ్రీ కదిరి నృసింహ నీకు మ్రొక్కెదమయ్య!
నవరూపములుగల నవ్యసింహా!

జ్వాలానృసింహుడు సకల యోగానంద
బలుకేసరివి వేద పర్వతమున

భార్గపూటునృసింహా! మట్టెమళ్ళ నృసింహా!
కానుగమానిలో ఘన నృసింహా!

శ్రీవరాహలక్ష్మి శ్రీనృసింహా! అహో-
బలసింహ బొమిరెడ్డిపల్లె సింహ

ఆ.వె॥ గద్దెపైన చెలగె కదిరినృసింహుడు
వేంకటేశుడయ్య విదితమాయె
చక్కనైనవాడు సాధు నృసింహుడు
మొక్కుడయ్య! జన్మముక్తినొంద.

సంఖ్య: IV/181 రాగం : కౌశి
కీర్తన : కొండంత పొడవుతోడ కోనేటి రాయుడు వీడె

కౌశి

88 కొండంతపొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు ॥పల్లవి॥

పాతాళవాసులైన బలురక్కసులమీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధిఁకొచ్చినట్టిదానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున ॥కొండ॥

ఆకాశముదూరినట్టియదటుదైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి ॥కొండ॥

ధరమీఁదు గలిగిన దనుజకోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పారఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరముకొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి ॥కొండ॥ **181**

ఉపోద్ఘాతము:

కోనేటిరాయుడి రథోత్సవము కన్నులపండువగా జరుగుతున్నది. రథమంతా నిండుకొని ఆ స్వామి దానిపై నిలుచునివున్నాడు. ఆయన సామాన్యంగా కనుపించుటలేదు. కొండంత పొడవుతో (కొండ అంత ఉన్నతుడై) కనువిందు చేయుచున్నాడు. ఆయన రథముపై పోతున్నదెందుకని అనుకొంటున్నారు? రక్కసులను, దానవులను, దైత్యులను, అసురులను మరియు దనుజులను పారద్రోలుటకట. అది సరే, ఈపై చెప్పినవాళ్ళంతా

ఒకటికాదా? మరి వాళ్ళమధ్య తేడా యేమిటి?అన్నమయ్యకు సాటి మరెవ్వరూ లేరని అందుకే అంగీకరించాలి.

తాత్పర్య వివరణ:

వీడే (ఈ స్వామియే) కొండంత పొడవుతోడ (కొండయంత ఎత్తు కలిగిన) కోనేటిరాయుడు. ఈయన కొండలలో నెలకొనియుండుట చేత తానూ ఒక కొండవలె ఉన్నతుడై వున్నాడు. రథమునెక్కి నిలుచుని వున్న ఆ దేవదేవుడు నిండుకొని (రథమంతా విస్తరించి) యున్నాడు.

ఆయన యెవ్వరెవ్వరిని ముట్టడించడానికి వెళ్ళుచున్నాడో తెలియునా? మొదట పాతాళలోకవాసులైన బలవంతులగు రక్కసులమీదకు ఇదే ఆ దేవుడు తన తేరును (రథమును) యేతుల బరపై (ఉద్ధతితో నడిపినాడు.) ఆతల (ఆ తరువాత) సముద్రములో దాగి నివసించు దానవుల మీదకు అతి రభసముతో (వేగముగా) ఘాతతో (దెబ్బతీయుటకు) అదె తన రథమును తోలినాడు.

ఇకపోతే దైత్యులని దితిసంతానం నుంచి వచ్చిన దుర్మార్గులున్నారు. ఆకాశగమన శక్తిగల వీరు ఆకాశంలో దూరి అదటున (గర్వముతో) వుంటారు. స్వామి దేవుడైనందున వాళ్ళని తుదముట్టించాలని పంతం పట్టి తన రథమును, దాకతో (భీకరముగా) నడిపించాడు. అష్టదిక్కులలో గమ్యంలేక చరించేవారు అసురులు. పైగా దుష్కృత్యాలు చేస్తుంటారు. తన బిరుదు (ప్రతిజ్ఞ) నెరవేరునట్లు స్వామి భీకరముగా విజయదుందుభిని మోగించినాడు.

భూలోకంలోవున్న కోట్లాది దుష్ట స్వభావులే దనుజులు. భూమిపై నున్న మక్కువచేత శ్రీవేంకటేశ్వరుడు వారందరినీ సొరిది (క్రమముగా) పారద్రోలినాడు. మహిమాన్వితుడైన స్వామి తన దేవేరి అలమేల్మంగను తన ఉరమున నిలుపుకొని, తేరు తిరముకొలిపె (స్థిరముగా) నడిపి, దిక్కులనన్నింటినీ గెలిచినాడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **కొండయంత పొడవు కోనేటిరాయడు**
నిండి రథమునెక్కి నిలిచినాడు
అసురులున్ను దైత్యులవలరక్కసు లెల్ల
దిక్కులందు బారి సొక్కుడికను.

సంఖ్య: IV/202 రాగం : నాగవరాళి
కీర్తన : దైవమా నీవే దయా ధర్మము దలచుటింతే

నాగవరాళి

89 దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే
వావిరి నౌఁగాదన నవ్వల నిఁక నెవ్వరో ॥పల్లవి॥

యెంచఁగ నీదేహమిది యింద్రియాదులకుఁ జర(ఁజెఱ?)
వంచనతో విడిపించువారలెవ్వరో
పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంట దయఁజూడ నిఁక నెవ్వరో ॥దైవ॥

పోరచి నామన సిది పుణ్యపాపాలకుఁ జర
మారుకొని విడిపించ మరి యెవ్వరో
తీరనినాజన్మ మిది దినభోగాలకుఁ జర
యీరీతి విడిపించ నిఁక నెవ్వరో ॥దైవ॥

అతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర
ఆతల నెవ్వరికైనా నరుహమౌనా
యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక
ఘాతల నీదాసులకు గతి యెవ్వరో ॥దైవ॥ **202**

ఉపోద్ఘాతము:

ఓ దైవమా! నీవే ఎలాగో ఒకలాగ మమ్మల్ని దయదలచాలి. వావిరి (క్రమముగా) నీవే మమ్మల్ని ఔగాదన, అంటే, ఒకసారి అవును ఒకసారి కాదు అనిన యెడల ఆపైన ఇక మాకు, నెవ్వరో (ఇంక మాకు దిక్కుయెవ్వరు స్వామీ!) అని అంటున్నారు అన్నమయ్య.

జుట్టుపీక్కుంటే నా బుద్ధికి ఆ మాత్రం తట్టింది. అన్నమయ్య భావన మనము అందుకోలేము. ఓ శ్రీహరీ! ఆతుమ అనాదినుండి నీ భక్తికి

"చెర'యైనది. ఇక అదియెవ్వరి నీ అంగీకరించదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే దానిని కాపాడాలయ్యా! అని అంటున్నారు. కీర్తన చూడగానే ఇది తట్టింది అనుకోకండి ఎంతో పరిశ్రమ అవసరమైంది.

తాత్పర్య వివరణ:

ఓ దైవమా! ఏదో విధముగా నీవే నన్ను దయాధర్మము అని తలచి రక్షించాలి. ఇంతేకాక మరి దారిలేదు. ఇట్లు అవ్వల (ఆ తరువాత) నీవు, వావిరి (ఒక క్రమములో) ఔగాదన (ఒకసారి అవునని, ఒకసారి కాదని అనినయెడల) ఇకయెవ్వరో (దిక్కుయెవ్వరున్నారయ్యా!)

ప్రభూ! నీవు కల్పించినవన్నీ ఒకదానికింకొటి "చర" (చెఱ). అది తప్పింపలేని బంధనమే. ఎంచి చూచిన ఈ నా దేహమున్నదే... ఇది నా ఇంద్రియాలకు చెఱ. దీనినుంచి కిటుకుతో నన్ను విడిపించే వారెవ్వరో! నేను బ్రతికేటి ఈ బ్రతుకున్నదే... ఇది పంచభూతములకు చెఱ, అయిపోయింది. ఇక కొద్దిపాటి కరుణ చూపుటకు యెవ్వరో?

స్వామీ! పొరచి (వ్యర్థమైన) నా ఈ మనస్సు పాపపుణ్యాలకు చెఱ. అది నిరంతరం ఆ రెంటిలో ఏదో ఒక దాన్ని మూట కట్టుకుంటూనే వుంటుంది. ఈ పీడ నుంచి మమ్ము విడిపించే దిక్కు యెవ్వరో? అంతులేని ఈ నా జన్మవున్నదే... ఇది నేను దినదినమూ వెంపర్లాడే భోగాలకు చెఱ. దీనినుండి నన్ను విడిపించుటకు, ఇక నెవ్వరో?

ఓ దేవదేవా! శ్రీహరీ! నా ఈ ఆత్మవున్నదే... ఇది అనాదిగా (పూర్వమునుంచీ) నీ భక్తికి చెఱ. ఆతల (ఆ తరువాత) యెవ్వరినైననూఅది అర్హులని ఒప్పుకోదు. ఈతల (ఇటుపై) ఓ వేంకటేశ్వరా! నీవే నన్ను కాతువుగాక (రక్షించెదవుగాక!) అట్లా కాకున్న నీ దాసులకు ఘాతల (ఆపదలలో) గతియెవ్వరో? (దిక్కు యెవ్వరున్నారు తండ్రీ!)

పద్యవివరణ:

కం॥ **రోతగు 'చెర' యే బ్రతుకిది**
ఆతల నీ భక్తి యెవరికైన అరుహమే
ఈ తీరున నౌగాదన
నా తరమా? ధర్మమనుచు నడిపించు హరీ!

సంఖ్య: IV/183 రాగం : శంకరాభరణం
కీర్తన : కొలువుడు వలసితే గొలువక మానుడు

శంకరాభరణం

90 కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు
తెలియ నీతఁడే సుండీ దేవదేవోత్తముఁడు ॥పల్లవి॥

పుడిమికాధారము పురుషోత్తముఁడె
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి
విడువఁ దేఁటికిఁ బారవేసినగుంటికినెల్ల
వొడయఁ డీతఁడే సుండీ వున్నతోన్నతుఁడు ॥కొలు॥

అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడే
సముల్లై జీవించువారు సతానసంఖ్య(?)
భ్రమయకుఁ డెండమావిబయళ్లు చెరువులంటా
అమర నీతఁడే సుండీ హరి వాసుదేవుఁడు ॥కొలు॥

చెలువుఁ డీతఁడె సుండీ శ్రీవేంకటేశుఁడె
పలుకుఁ బంతాలవారు పదివేగురు
తలఁచకుఁ డీదోమ దంతితోను సరిగా
జలజనాభుఁడే సుండీ సకలలోకేశుఁడు ॥కొలు॥ **183**

ఉపోద్ఘాతము:

ఈతడే దేవదేవోత్తముడు. తెలియాలంటే ఇదే నిజము. కావాలంటే ఈయనను కొలవండి. వద్దనుకుంటారా కొలవకండి. ఇక మీ కర్మకు మీరే బాధ్యులు అంటున్నారు అన్నమయ్య. సుండీ! అనే మాటకు అర్థం సుమా! అని. ఈతడే చెలువుడైన శ్రీవేంకటేశ్వరుడు సుమా! పంతముతో వరములిచ్చే ఇతర దేవతలు పదివేలమంది వుండవచ్చును. కాని వారికి ఈ దేవదేవోత్తమునికీ పోలికయా? ఏనుగెక్కడ దోమయెక్కడ,

ఆలోచించండి. సకలలోకాలకు ఈశ్వరుడు ఈ జలజనాభుడే సుండీ అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! వలసితే (కావలెనంటే) ఇతనిని కొలువుడు (పూజించండి). కాదనుకొంటే కొలువక మానుడు (పూజించటం మానేయండి). ఎవరి భాగ్యానికి యెవ్వరు కర్తలు? కాని తెలిసినయెడల ఈతడే దేవదేవోత్తముడు, సుండీ (సుమా!)

ఈ పుడమికి ఆధారమైనవాడు పురుషోత్తముడైన శ్రీహరి. ఆయన కృపవల్ల తిండి తింటూ, బట్టకట్టగలవారుమాత్రం కోటానుకోటి (కోట్లకొద్దీ) వున్నారు. మీరు పారవేసిన (ఉపయోగించని) గుంటిక (గొయ్యివంటి వ్యర్థులైనా) ఆయనే దిక్కుంటే యేటికీ (యెన్నటికీ) విడువడు. ఉన్నతోన్నతుడైన, ఒడయడు (మగడు) ఈతడే సుండీ! (ఈయనే సుమా!)

ప్రపంచానికి అమృతమిప్పించినవాడు ఈ ఆదినారాయణుడే. సములై (మేము ఆయనతో సమానమైనవారము అని జీవించేవారు ఈ లోకంలో సతానసంఖ్య (వందలకొద్దీ సంఖ్యలోనున్నారు). ఓ అమాయకులారా! ఆయన మిమ్మల్ని భ్రమకు గురి చేస్తున్నాడు. ఎక్కడన్నా ఎండమావి, ఆరుబయటవున్న చెఱువుతో సమానమవుతుందా? మనకు అమరిన ఈతడే శ్రీహరి సుండి! ఈయనే వసుదేవ సుతుడైన వాసుదేవుడు.

చెలువుడు (స్నేహశీలి) యైన ఈతడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సుండీ! ఈ ప్రపంచంలో మాటమాటకు పంతంపట్టి దర్పంతో పలికేవారు పదివేగురు (పదివేలమందిపైన) వుంటారు. దోమ, దంతి (ఏనుగు) సమానమని ఎన్నడూ తలచవద్దు. వేరెవ్వరు ఈయన సరికాజాలరు. సకలలోకేశ్వరుడు ఈ జలజనాభుడే (ఈ పద్మనాభుడే) సుమండీ!

పద్యవివరణ:

చం॥ **కొలువుడు కావలెన్యనిన గొల్వక మానుడు మీదు చిత్తమే**
తెలియగ సత్యమొక్కటియె దేవతలందరిదేవుడీతడె
చెలువుడు వేంకటేశ్వరుడు శ్రీధరుడీతనిసాటి యుందురా?
తెలియక దంతి దోమలొక తీరుగ జూచెడి వెట్టి నేమనన్?

సంఖ్య: IV/200 రాగం : ధన్నాసి
కీర్తన : నాకు గలపని యిదె నారాయణుఁడ నీవు

ధన్నాసి

91 నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు
శ్రీకాంతుఁడవు నాకు సిద్ధించుకొరకు ॥పల్లవి॥

జలధివంటిదిసుమీ చంచలపు నామనసు
కల విఁద్రియముల నేటిజలచరములు
వొలసి భక్తినెడి వోడ యెక్కితి నేను
జలశాయి నీవ నేటిసరకు దెచ్చుటకు ॥నాకుఁ॥

కొండవంటిదిసుమీ కొనకెక్కు నామనసు
వుండుఁ గామాదులను వురుమృగములు
వుండి నీశరణమనువూఁత గొని యెక్కితిని
కొండలప్ప నీవనేటికొనఫలముకొరకు ॥నాకుఁ॥

టీ(ఠీ?)వులను ధరణివంటిదిసుమీ నామనసు
నీవె శ్రీవేంకటేశ నిక్షేపము
వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి
భూవిభుఁడ నీవనేటి పురుషార్థము ॥నాకుఁ॥ **200**

ఉపోద్ఘాతము:

ఓశ్రీమన్నారాయణుడా! నాకువున్నపని ఇదియే. నాకు శ్రీకాంతుడవైన నీవు సిద్ధించుటకొరకు నీపదములను విడువను, అంటున్నారు అన్నమయ్య. దీని పల్లవి, ఆపైరెండుచరణాలు తేలికగానేవున్నాయని మురిసిపోయాను. మూడవ చరణం నన్నుఛిన్నాభిన్నం చేసేసి నామీదనాకే నమ్మకంపోయేట్లు చేసింది.

"వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి" అనే చరణం, మరణం అయింది. ఈక్షణం వరకూ అయోమయమే. ఆపై వెంకన్న దయ.

తాత్పర్య వివరణ:

ఓ నారాయణుడా! నాకుగలపని (నా కర్తవ్యం) ఇదే. శ్రీకాంతుడవైన నీవు నాకు సిద్ధించుట కొరకు నిన్ను శరణని యెన్నటికీ వదలను.

ప్రభూ! బహుచంచలమైన నా మనస్సు జలధివంటిదిసుమీ (అల్లకల్లోలమైన సాగరము వంటిది, సుమ్మి!) ఇందులో ఇంద్రియములనేటి ఘోరమైన జలచరములున్నవి.నా అదృష్టం వలన, ఒలసి (దీనిలో ప్రవేశించాక) భక్తి అనే ఓడను యెక్కగలిగాను. కష్టపడి నౌకాయానం చేస్తూనే వున్నాను. దేనికో తెలియునా స్వామీ! నీవు జలధిశాయివి కావున యెప్పటికైనా నీవు అనే సరకు తెచ్చుకొని నా జన్మ తరింపజేసికొంటాను.

ఓ దేవదేవా! కొనకెక్కు (అధికమగు) నా మనస్సు కొండవంటిది సుమా! ఈ కొండమీద కామ, క్రోధ, మోహ, లోభ, మద, మచ్చరములను గొప్ప మృగములు సంచరించుతూనేవుంటాయి. కానీ నాకేమి భయము లేదు. ఎందుకంటే నేను నీ శరణము అనే వూతను (ఆవలంబమును అంటే సపోర్ట్‌ను), కొని (పట్టుకొని) కొండనుయెక్కితిని. ఇదంతా యెవరికోసం స్వామీ! ఓ కొండలప్ప! (ఏడుకొండలవాడా!) నీవు అనేటి కొనఫలము (అంతిమఫలము) కొరకేనయ్యా!

ఓ సర్వేశ్వరా! నా మనస్సు, ఠీవులను (వైభవములలో) ధరణి (భూదేవి) వంటిది. దీనివలన దొరికే గొప్పనిక్షేపము (నిధి) శ్రీవేంకటేశ్వరుడవైన నీవే. "వావాత నీవనేటి వసిదవ్వికైకొంటి" అటుపైన నా వావాత (నా నోరారా) నీవు (అంటే శ్రీమన్నారాయణుడు) అనేటి వసిదవ్వి (ఔషధము) కైకొంటి (సేవించితిని). దాని ఫలితంగా భూవిభుడవైన నీవు అనే పురుషార్థమును (మోక్షమును) నేను సాధించితిని.

పద్యవివరణ:

ఆ.వె.॥ **నాకుగల పని యిదె నారాయణుడ నీవు**
శ్రీహరివిదె నీదు సిద్ధికొఱకు
మ్రొక్కువాడనయ్య! చక్కని, వేంకన్న
భూవిభువడవు నీవు పురుషశ్రేష్ఠ!

సంఖ్య: IV/199 రాగం : మలహరి
కీర్తన : పరమోపకారులు ప్రత్యక్షదైవములు

మలహరి

92 పరమోపకారులు ప్రత్యక్షదైవములు
హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము ॥పల్లవి॥

పాపుదురు లోకములో పాపపంకమెల్లాను
దీపించ శ్రీపాదతీర్థమున
వోపుదురు హీనుల వున్నతులఁగాఁ జేయ
చేపట్టి కన్నులెదుటిసేవామాత్రమున ॥పర॥

చెఱుతు రజ్ఞానమెల్లా జనులు తమ్ముఁజేరిన
మఱియుఁ దమప్రసాదమహిమవల్ల
తెఱచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా
మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున ॥పర॥

చెల్లఁబెట్టుదు రెందైనా చిల్లరకులమువారి
తెల్లమిగా మంత్రోపదేశమున
యిల్లిదె శ్రీ వేంకటేశ యెక్కుడుసేసిరి మమ్ము
సల్లాపనల తమసహవాసములను ॥పర॥ **199**

ఉపోద్ఘాతము:

ఈ లోకంలో హరిదాసులందరూ తమ ఆశ్రితులకు బ్రహ్మానందమునొసగెదరు. ఎందుకంటే వారు పరుమోపకారులు. వారు ప్రత్యక్షదైవమువంటివారు, అంటున్నారు అన్నమయ్య. అటువంటి గురుపుంగవుల శ్రీపాదతీర్థము ఎంత మహిమాన్వితమో వివరిస్తున్నారు. వారు మోక్షమును కూడా ప్రసాదించగల సమర్థులు అంటున్నారు. చిల్లరకులమువారు అంటే (హీనకులజులని భావము). ఆ గురువుల విశిష్ఠత యేమంటే హీనకులజుడైనా వానిని శ్రీవేంకటేశుని చేర్చుటకు మంత్రోపదేశము చేయగలరు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! ఈ హరిదాసులున్నారే, వారు ప్రత్యక్ష దైవమువంటివారు. వారు పరమోపకారులు (అతి శ్రేష్ఠమైన వుపకారమును చేయగలిగినవారు). అందుచేత వారు వారినాశ్రయించిన శిష్యులకు పరమానందసుఖమును అనుభవపూర్వకముగా నిత్తురు.

వారు (హరిదాసులు) లోకములోని పాపమనే బురద కడిగివేయగల సమర్థులు. శోభాయమానముగా వారు తమ శ్రీపాదతీర్థమునొసగి ఆ పంకిలమెల్లా పాపుదురు (పారద్రోలుతారు). హీనులైన మనబోటివారికి, మన కన్నులయెదుటనే వారిసేవామాత్రమున గొప్ప ఉన్నతి నొసగ సమర్థులు. వారు అనుగ్రహించి మనలను చేపట్టితే చాలును.

వారు (హరిదాసులు) తమను ఆశ్రయించిన జనులను, కేవలము తమ ప్రసాదము యొక్క మహిమతో వారి అజ్ఞానాంధకారమును పటాపంచలుచేసి చెఱుతురు (మళ్ళీ తలెత్తకుండా చేస్తారు). వారు ఈ ప్రాణులకెల్లా మోక్షమార్గమును తెఱచి (బాహాటముగానే) ఇయ్యగల సమర్థులు, మనము చేయవలసినదల్లా... ఒకమూలనిలబడి మ్రొక్కితేచాలును.

వారు (హరిదాసులు) యెందైనా, చిల్లరకులమవారిని (అంత్యజులను) తెల్లమిగా (స్పష్టముగా) మంత్రోపదేశము (ఓం నమోనారాయణాయ అనే మంత్రోపదేశము చేత) వారి పాపములనెల్లా చెల్లబెట్టెదరు. ఓ శ్రీవేంకటేశ్వరా! కేవలము తమ సహవాసముచేత సల్లాపముచేత (చక్కటి బోధనతో) ఇల్లిదే (ఇదిగో) మమ్ముకూడా యెక్కుడు సేసిరి (అన్నమాచార్యులవారిని చేశారు) తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **పరమోపకారులట భువి**
పరికించగ దైవములట ప్రత్యక్షముగా
హరిదాసులిత్తురయ్యా!
చిరబ్రహ్మానందసుఖము శ్రీగిరినిలయా!

సంఖ్య: IV/198 రాగం : బౌళి
కీర్తన : ఇంతలేకుంటేనది యెక్కడి సుజ్ఞానము

బౌళి

93 ఇంత లేకుంటే నది యెక్కడి సుజ్ఞానము
దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా ॥పల్లవి॥

యెదిటివా రెరిఁగితే యేమీ ననక మరి
చెదరకుండుటే పో శ్రీవైష్ణవం
కదిసినకాంతలను కనకము వొడగంటే
పదరకుండుటే పో పరమసాత్వికము ॥ఇంత॥

క్రియయెరఁగనివారు కీడు సేసితేఁ దాను
దయఁ జూచుటే హరిదాస్యఫలము
రయమునఁ దామసము రాజసము గలిగితే
భయపడి తొలఁగుటే ప్రపన్నగుణము ॥ఇంత॥

వొరసి యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన
నిరతితో వీఁగనిదే నిచ్చ(శ్చ?)లబుద్ధి
యిరవై శ్రీవేంకటేశ్వరుదాసులఁ గని
శరణని మొక్కుటే సర్వజ్ఞగుణము ॥ఇంత॥ **198**

ఉపోద్ఘాతము:

జీవుల జన్మలన్నీ దొంతుల జన్మలే. ఒకదానిపై ఇంకొకటిబెట్టిన కుండలదొంతివలె ఈ జన్మలు కూడా దొంతిలాగ దేని కర్మ అనుభవం దానిదే అన్నట్లుంటాయి. ఒక్కొక్కసారి ఆ కర్మయేదో ఒక జన్మలో అనుభవించాల్సివస్తుంది. దీని వెనుక ఇంత తిరకాసువున్నది. ఇంత లేకుంటే బహుశా అది సుజ్ఞానము కాదేమో అంటున్నారు అన్నమయ్య. అలాగే

అలవోకపదములలో శ్రీవైష్ణవం, పరమసాత్వికము, హరిదాస్యము, ప్రపన్నగుణము, నిశ్చలబుద్ధి, సర్వజ్ఞగుణము అంటే యేమిటో వివరిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! కుండలన్నియు ఒకదానిపై నింకొకటి దొంతులుగా అమర్చబడినయెడల, ఏ కుండలో యేమున్నదో తెలియుట అసంభవము కదా! అట్లే మన తొల్లిటి జన్మలలో మనము యేమేమి కర్మలు చేశామో యెవరికి తెలుసు? మనబోటి జీవులకు ఆ కర్మను అనుభవించక తప్పదు. ఇంత తిరకాసువున్నది ఇందులో.ఇంత లేకుంటే బహుశా అది సుజ్ఞానము కాదేమో!!

ఎదుటివారు ఎరిగితే (నమస్కరిస్తే) యేమీననక (ప్రత్యుత్తరమీయక) మరి చెదరక (గర్వించక) మౌనముగా "కృష్ణార్పణం" అనుకోవటమే పో, శ్రీవైష్ణవం అంటే. తమను సమీపించి నమస్కరించిన కాంతలను బంగారమును, వొడకంటె పదరకుండుటే (వోర కంటకూడా చూడకపోవుటయే) "పరమసాత్విక" గుణము.

క్రియనెరుగనివారు (శిక్షాస్మృతి తెలియనివారు) కీడుసేసితే (అపకారము చేస్తే) తనూ వానిని దయజూచుటే నిరంతర హరిదాస్యమువలన కలిగే ఫలితము. రయమున (ఏదో తొందరపాటులో) తామస రాజసుగుణములు ప్రకోపించితే, వెంటనే భయపడి తొలగుటే (అక్కడనుండి నిష్క్రమించుటయే ప్రపన్న గుణము అంటారు.

ఒరసి (తనకు చేరువయై) యెవరన్నా తనను వుబ్బించి పొగిడితే, నిరతితో (ఆసక్తితో) వీగనిదే (చెదరిపోని) బుద్ధినే నిశ్చల బుద్ధి అంటారు పెద్దలు. ఇరవై (స్థిరచిత్తులై) శ్రీవేంకటేశ్వరునిదాసులను చూచి శరణాగతులై వారి పదములను తాకి మ్రొక్కుటయే సర్వజ్ఞత్వము అని పిలువబడుచున్నది.

పద్యవివరణ:

కం॥ **దొంతుల తొల్లిటిజన్మల**
ఇంతటిసుజ్ఞానమంత యెక్కడిదయ్యా?
యెంతయు నేరిచి నను శ్రీ-
కొంతుని శరణనక సిద్ధి కలుగునెధాత్రిన్?

సంఖ్య: I/477 రాగం : నాట
కీర్తన : ఇందులోనేకానవద్దా యితడు దైవమని

నాట

94 ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని
విందువలె నొంటిమెట్టవీరరఘురాముని ॥పల్లవి॥

యెందు చొచ్చె బ్రహ్మవర మిల రావణుతలలు
కందువ రాఘవుఁడు ఖండించునాఁడు
ముందట జలధి యేమూల చొచ్చెఁ గొండలచే
గొందిఁబడఁ గట్టివేసి కోపగించేనాఁడు ॥ఇందు॥

యేడనుండె మహిమలు యిందరి కితఁడు వచ్చి
వేడుకతో హరివిల్లు విఱిచేనాఁడు
వోడక యింద్రాదు లెందు నొదిగి రీతనిబంటు
కూడఁబట్టి సంజీవికొండ దెచ్చేనాఁడు ॥ఇందు॥

జముఁ దెక్కడికిఁ బోయ సరయువులో మోక్ష-
మమర జీవుల కిచ్చె నల్లనాఁడు
తెమలి వానరులై యీదేవతలే బంట్లైరి
తిమిరి శ్రీవేంకటపతికి నేఁడు నాఁడు ॥ఇందు॥ 477

ఉపోద్ఘాతము:

ఒంటిమెట్ట అనే గ్రామంలో వెలసిన వీరరఘురాముని మీద చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ ఒంటిమెట్టయే పోతనగారి భాగవతావిష్కరణ జరిగిన వూరని పోతన రాయలసీమవాడని నేటికీ కొందరు నమ్ముతారు. ఈ రఘురాముని చూస్తేనే పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడితడే అని గ్రహించవచ్చును, అంటున్నారు. ఇక ఆ తరువాత అన్నమయ్య ఆనవాయితీగా శ్రీరామగాథ మళ్ళీమళ్ళీ వివరించి మనల్ని పునీతులను చేస్తారు. ఈ

వానరులంతానాడు శ్రీరామునికి నేడు శ్రీవేంకటపతికి బంట్లైరి అంటున్నారు. ఎందుకంటే వారు నిజానికి దేవతలే.

తాత్పర్య వివరణ:

ఇందులోనే (ఈ సంఘటనలతోనే) ఈతడు దైవమని కానవద్దా (గ్రహించవలదా)? విందువలె (కన్నులకువిందువలె) కనుపించుచున్న ఈ ఒంటిమిట్ట వీరరఘురాముడు రావణసంహరణార్థం అవనికి దేవతలు కపులుగా తన ఆయుధములు సోదరులుగా నరజన్మనెత్తినారు.

ఈ రాఘవుడు రామరావణ యుద్ధములో అప్రతిహతముగా రావణుని తలలను ఖండించుచున్నప్పుడు వానికి బ్రహ్మ ఇచ్చినవరములన్నీ యెందు, చొచ్చినవి? ఆ శ్రీరాముడు జలధిపై కోపించగా ముందుగా సముద్రుడు యేమూలదాగుటకు వీలులేక గొందిబడి, కొండలచే వారధిగట్టివేసి కపిసేనతో దాటమని అభ్యర్థించెను.

పరశురాముని దర్పమణచుటకు, వేడుకతో హరివిల్లు సంధించి, తాను హరుని విల్లు విఱిచినది యాదృచ్ఛికమని చెప్పినప్పుడు ఇందరికీ ఇతని మహిమలు యేడనుండి వచ్చినవని అనిపించనేలేదు. ఈతని తమ్ముని ప్రాణరక్షణకు మారుతి సంజీవని కొండ తెచ్చిననాడు ఇంద్రాది దేవతలు జైజై అన్నారేకానీ వారంతా యెక్కడికిపోయారయ్యా?

అల్లనాడు (ఆనాడు) తన అవతారపరిసమాప్తి సమయమున సరయూనదిలో తన నమ్మిన బంట్లను ముంచి ఆ జీవులందరికి మోక్షమును అనుగ్రహిస్తుంటే యముడంతటివాడు యేమీ చేయలేక చూస్తూ వుండిపోయాడు. ఈ దేవతలే తెమలి (చలించి) వానరులవలె అవతరించి శ్రీరామబంట్లయిరి. వారు నేడు, నాడూ ఆ శ్రీవేంకటేశ్వరుని బంట్లే సుమా!

పద్యవివరణ:

ఉ॥ **ఈతడె వొంటిమిట్ట గల ఈప్సిత దాతగు వీరరాఘవుం**
డీతని జూచి దైవమనియెంచని మందుని కేమి చెప్పుదున్
సీతమనోవిభున్ పొగడి చెప్పిన కీర్తన, వేంకటేశుడే
ఆతల రాముడై కపుల ఆలముదీర్చెను దేవతల్ కదా!

సంఖ్య: I/408 రాగం : గుజ్జరి
కీర్తన : ఎక్కడిపాపములెక్కడి పుణ్యము

గుజ్జరి

95 ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము-
లొక్కట గెలిచితి మోహో నేము ॥పల్లవి॥

ప్రపన్నులెదుటనుఁ బడినయాతుమకు
చపలత మరి నాశము లేదు
ఉపమల గురుకృపనొనరినమనసుకు
రపముల మఱి నేరములే లేవు ॥ఎక్క॥

ఘనతరద్వయాధికారగుదేహికి
మినుకుల భవభయమే లేదు
చనవుల హరిలాంఛనకాయమునకు
వెనుకొనుకర్మపువెట్టియు లేదు ॥ఎక్క॥

శ్రీవేంకటేశ్వరుఁ జేరినధర్మికి
ఆవల మఱి మాయలు లేవు
కైవశమాయను కైవల్యపదమునుఁ
జావుముదిమితో సడ్డే లేదు ॥ఎక్క॥ **408**

ఉపోద్ఘాతము:

ఓహో! మేము ఒకేసారి శ్రీపతికృప గెలిచాము.ఇక మాకు పాపములెక్కడివి, పుణ్యములెక్కడివి అని అంటున్నారు అన్నమయ్య. ఆత్మకి సహజమైన చిత్త చాపల్యము వుంటుంది. అది దుస్సాంగత్యంలో వుంటే దానికి నాశనము తప్పదు. కానీ ప్రపన్నుల యెదుట శరణాగతినొందితే గురుకృపవలన చెల్లుబడివేయటం, వేయకపోతే నేరారోపణలు వంటి ఉపమలతో అంటే ఉపాయాలతో నిమిత్తం వుండదు అంటున్నారు. మరి ఈ

పీకులాటంతా యెందుకు శ్రీవేంకటపతిని జేరిన ధర్మికి కైవల్యం తప్పక సిద్ధిస్తుంది కదా! అంటున్నారు. చావుముదితో సడ్డే లేదట, అంటే యేమిటో?

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! ఏము (మేము) చిత్త చాంచల్యము వంటి బలహీనతలను గెలిచాము. ఓహో! ఒక్కట (ఒకేసారి) భవమును, గురుకృపవలన గెలిచిన మాకు, ఇక పాపములెక్కడివి? పుణ్యములెక్కడివి చెప్పండి.

ప్రపన్నులనగా అచంచల భక్తితో శరణాగతి పొందినవాడని అర్థము. అటువంటి వారి యెదుట బడిన ఆత్మకు చపలత (చిత్త చాపల్యము) మరియు నాశనము వుండవు. ఉపమల (వివిధోపాయముల ద్వారా) గురుకృపను సంపాదించిన మనస్సునకు వెనుకొను (వెంబడించు) పురాకృత కర్మల వెట్టి (వెట్టి చాకిరి) వుండనే వుండదు.

ఇహపరములను సాధించుటకు తీవ్రకృషి సలిపినదేహి ఘనతరముగా రెంటికీ అధికారికాగలదు.అటువంటిదేహికి, "మినుకుల భవభయమేలేదు" ఆకాశం నుండి భూమ్మీదకు పుట్టడం అనే భయమేవుండదు.అధికారముతో హరిలాంఛనములైన శంఖచక్ర ముద్రలు శరీరముపై ధరించిన ధర్మశీలికి, పురాకృతకర్మలుకానీ దాని పీడగానిఅంటవు.

ఏ ధర్మాత్ముడైనా శ్రీవేంకటేశ్వరుని జేరితే (ఆశ్రయిస్తే) ఆవల (అటుపైన) వానికి మాయలు లేవు.ఆ దేవదేవుడు సృష్టించే భ్రమలు, భ్రాంతులూ వశపరచుకోవు. వానికి కైవల్యపదము (మోక్షప్రాప్తి) కైవసమాయను (స్వాధీనమవుతుంది). ఇక వానికి చావు, ముదిమి (ముసలితనముతో) "సడ్డే" (ఆపదయే) లేదు.

పద్యవివరణ:

కం॥ **ఎక్కడిపాపము, పుణ్యము**
లెక్కడివిర? గెల్చినాము మేమునొకటిగా
యెక్కినతిరుమలధర్మికి
దక్కును కైవల్యపదము తగులదు మృతియున్.

సంఖ్య: I/409 రాగం : లలిత
కీర్తన : సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను

లలిత

96 సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను
సర్వాపరాధినైతి చాలుఁజాలునయ్యా ॥పల్లవి॥

వూరకున్న జీవునికి వొక్కొక్క స్వతంత్ర మిచ్చి
కోరేటియపరాధాలు కొన్ని వేసి
నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటా
దూరువేసే వింతేకాక దోష మెవ్వరిదయ్యా ॥సర్వా॥

మనసు చూడవలసి మాయలు నీవే కప్పి
జనులకు విషయాలు చవులుచూపి
కనుఁగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి
ఘనముసేసే విందుఁ గర్త లెవ్వరయ్యా ॥సర్వా॥

వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే
కన్నకన్న భ్రమతలే కల్పించి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
నిన్ను నన్ను నెంచుకొంటే నీకే తెలుసునయ్యా ॥సర్వా॥ **409**

ఉపోద్ఘాతము:

మేము అస్వతంత్రులమైన జీవులమయ్యా! ఈ జీవులకు కోర్కెలు కల్పించేది మళ్ళీనీవే. మంచి చెడు కల్పించి మాకు స్వర్గమో నరకమో అంటకట్టే వాడివి నీవే. వాటిని పొందాక మామీద నేరం మోపేదీ నీవే. నీవు సర్వాంతరాత్ముడవు. మేము నిన్ను ఆశ్రయించి శరణుచొచ్చిన శరణాగతులము. ఈనాడు నీవు కల్పించిన బలహీనతలవలన నేను అపరాధినై నీయెదుటబడవలసి వచ్చింది. చాలుజాలునయ్యా! నన్ను యేలికవై నీవే నేరములెంచక ఆదుకో అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ప్రభూ! నీవు సర్వాంతరాత్ముడవు (అందరిలోనూ అంతరాత్మవోలె యుండువాడు) మరి నేనో, నీ శరణాగతుడను. నాలోని బలహీనతలకు, వున్నతికి కారణము నేనే అని అనిపించినా అసలు కారణం నీవే. సర్వాపరాధములను చేసిన చవటగ మిగిలి పోయాను. ఇక చాలుజాలునయ్యా!

ఏదో వాడిదారిన వాడున్న జీవుడికి కొంత కొంత స్వతంత్ర్యము ఇచ్చి వాడిని యేవేవో కోరికలతో కొన్ని అపరాధములను చేయిస్తావు. జీవికి తెలివి లేకపోతే ఇదిగో పాపము చేశావని నరకము అంటకట్టెదవు. వాడు నీ తత్త్వము నేర్చి మంచిగా వుంటే స్వర్గప్రాప్తి ఆపైన అహంకారం అనే దోషం అంటకట్టెదవు. ఓ దేవదేవా! ఇందులో దోషమెవ్వరిదో చెప్పవయ్యా!

ఇకపోతే మాకు మనస్సు అనే దౌర్భాగ్యాన్ని అంటగట్టి దాన్ని లేనిపోని మాయలలో ముంచితేల్చి, మమ్మల్ని ఆదుకోవలసిన నీవే ఈ జనులందరికి విషయసుఖముల రుచిచూపించి... ఇదంతా నీమాయ అను సత్యాన్ని గ్రహించినవాడికి మోక్షం ఇస్తావు. ఒకవేళ వాడు సత్యమును కానకుంటే వాడికి కర్మబంధం అంటకడతావు. నీవేమో ఘనుడిగానే వుండిపోతావు. మరి మేము కర్మబద్ధులమై పోతాము. ఏమిటీ అన్యాయం? దీనికి కర్తలెవరయ్యా?

దేవా! అసలీ ప్రాణులందరూ వున్నది వొక్కనీగర్భముననే కదా! మరి నీ గర్భంలో వున్న నీ బిడ్డలకి నీవే, కానలేని, కానరాని భ్రమలను కల్పించి అనేక కర్మలు చేసేట్లు పురికొల్పుతావు. మళ్ళీ నీవే శిక్షిస్తావు. ఏమిటి స్వామీ ఈ ఆట. నీ శరణాగతులకు ఈ బాధలేవీ వుండవు. ఓ శ్రీవేంకటేశ్వరా నీవు మమ్ము ఇట్టే యేలితివి. నన్ను యెంచుకోవాలని నీకే తెలుసును తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **సర్వాంతరాత్ముడవు హరి!**
సర్వావస్థలలోన శరణాగతుడన్
సర్వాపరాధినైతిని
ఉర్వీధర! చాలుజాలు వున్నతినిమ్మా!

సంఖ్య: I/416 రాగం : భైరవి
కీర్తన : తెలియరాదు మాయదేహమా మమ్ము

భైరవి

97 తెలియరాదు మాయదేహమా మమ్ము
పలువికారాలఁబెట్టి పనిగొన్న దేహమా ॥పల్లవి॥

దినమొక్క వయసెక్కె- దేహమా సారె
పెనుమదముగురిసే బెండుదేహమా
దినదినరుచిగోరేదేహమా నన్ను
ఘనమోహపాశాలఁ గట్టెఁగదె దేహమా ॥తెలి॥

తెలివినిద్రలుగలదేహమా నీ-
పొలము పంచభూతాలపొత్తు దేహమా
తిలకించి పాపపుణ్యాలదేహమా
బలువుగలదాఁకా బదుకవో దేహమా ॥తెలి॥

తీరనిసంసారపుదేహమా ఇట్టె
వూరట లేనిభోగాల వోదేహమా
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలిచితి నిఁక నాకు
కారణజన్మమవై కలిగినదేహమా ॥తెలి॥ 416

ఉపోద్ఘాతము:

ఓ మాయదారిదేహమా! నీ ఉద్ధతి తెలియరానిది సుమా! నీవు మమ్ము అనేక రకములైన వికారములపెట్టి మాపని పడుతుంటావు. నిన్ను ఒక్కనాటికీ నమ్మరాదు. పోనీ నీవు శాశ్వతంగా వుండేదానివా అంటే కానే కాదు. దినదినము నీవయస్సు యెక్కుతూనే వుంటుంది. పైగా నీకురోజుకొక క్రొత్తరుచి కావాలి. మమ్మల్ని గొప్ప మోహపాశబద్ధులనుచేసి ఆడిస్తావు కదే! దేహమా! నీ సంసార తాపత్రయం యెన్నటికీ తీరనిదే. ఎన్ని భోగాలు అనుభవించినా నీకు తృప్తిలేదు. నీవు శ్రీవేంకటేశుని కొలిచేదాకా నీగతి అంతేనే దేహమా! అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ మాయదేహమా! (మాయలమారి శరీరమా) నీమాయలను పూర్తిగా అవగతం చేసికోవటం మావలన కావటం లేదు. మమ్ము పలువికారముల బెట్టి (అనేక చిత్త వికారములకు లోనుజేసి) మా పనిగొన్న (మమ్మల్ని నియోగించిన) దేహమా! నీ మాయ దుస్సాధ్యము.

ఓ దేహమా! నీవేమన్నా యెప్పటికీ ఇలాగే వుండిపోతావా అంటే నీ వయస్సు దినదినమూ పెరిగేదే కాని తరిగేది కాదు. ఓ బెండు దేహమా! (నిస్సారమైన శరీరమా!) అవకాశం దొరికితే విపరీతమైన మదమును ప్రదర్శిస్తావు. ఓ దేహమా! నీవు దినదినము క్రొత్తక్రొత్త రుచులు కోరుతావు. ఆ విధంగా నన్ను గొప్ప మోహపాశముతో కట్టిపడేస్తావు కదే! ఓసిమాయలమారి దేహమా!

నిద్రపోవటం మళ్ళీ తెలివితెచ్చుకోవటం నిత్యకృత్యాలైన ఓ దేహమా! పంచభూతాలతో పొత్తుపెట్టుకొని జీవనయానమే వ్యవసాయంగా జీవిస్తావు. మళ్ళీ పాపపుణ్యాల గురించి ఆలోచించి నీకు బలువుగలదా (శరీరంలో సత్తువవున్నంతవరకు) నీకు నచ్చింది చేస్తూనే వుంటావు. ఓ దేహమా! నీకు చెప్పగలవారెవ్వరే? నీ ఇష్టం వచ్చినట్లు బ్రదుకవో!

ఓ దేహమా! నీ సంసారతాపత్రయం యేవొక్క నాటికీ తీరేది కాదు. ఏనాడూ ఊరట (తృప్తి) లేని భోగాల మాయలో చిక్కిన ఓ దేహమా! నీవు ఇట్టే వశురాలై సద్గతిని పొందనేరవు. నాపై కూరిమితో శ్రీవేంకటేశ్వరుడు నాకు తనను కొలిచే భాగ్యమును కల్పించినాడు. ఓ దేహమా! నీది కారణజన్మమై వైభవము కలిగినదే.

పద్యవివరణ:

చం॥ **తెలియగరాదు నీ మహిమ దేహమ! మాయలమమ్ముబెట్టుచున్**
పలువిధులౌవికారముల బాగుగబెట్టినయట్టి దేహమా!
తెలివియు నిద్రయున్ గలుగు దేహమ తోడగు పంచభూతముల్
కొలిచితి వేంకటేశ్వరుని కూరిమితో కలిగావు దేహమా!

సంఖ్య: I/393 రాగం : దేవగాంధారి
కీర్తన : విధినిషేధములకు వెఱవగబనిలేదు

దేవగాంధారి

98 విధినిషేధములకు వెఱవఁగఁబనిలేదు
మధుసూదన నీమన్ననదాసుఁడైతే ॥పల్లవి॥

విడువరానిధర్మ విధుల పురుషులను
విడిచి గోపికలు విచ్చనవిడి
బడి నిన్నుఁ దగులుటే పరమధర్మమాయ
యెడయునితరధర్మా లిఁకనేఁటికయ్యా ॥విధి॥

మానరానికర్మమార్గము లటు మాని
పూనినయతులే పూజ్యులట
నీనారాయణనియతే ధర్మమాయ
యీనిజ మొకటియు నెఱఁగఁగవలయు ॥విధి॥

యిన్నిట శ్రీ వేంకటేశ నీదాసుఁడై –
వున్న విచారాల నొదుగనేలా
నిన్నుఁ గూర్చినట్టినిజభక్తి గలదని
తిన్ననై తెలిపేటితెలివే కలది ॥విధి॥ **393**

ఉపోద్ఘాతము:

శ్రీ వేంకటేశ్వరుని దాసులైనవారికి 'మధుసూదన దాసుడు' అనిపించుకోవటమే ఒక గొప్ప మన్నన. వారికి విధి నిషేధముల వలన భయమే వుండదు. ఆ దేవదేవుడు చేసిందే న్యాయం, చెప్పిందే నీతి ఆయన యెడల తగులే పరమధర్మము. ఇక మీదట ఇతర ధర్మాలతో నాకు యేమిపనయ్యా అంటున్నారు అన్నమయ్య. నీదాసులకు

విచారములెందుకు కలుగుతాయి అంటున్నారు. నీ నిజభక్తుడను అని తెలిపేటి తిన్ననైన తెలివే కావలసినది.

తాత్పర్య వివరణ:

విధి నిషేధములు (విధి యొక్క కాదను నిర్దేశములను) గురించి వెఱవగ బనిలేదు (భయపడవలసిన పనిలేదు). ఎందుకంటే అది సామాన్యుల విషయములో నిజమే, కానీ మధుసూదనుని మన్నన పొందిన హరిదాసుల విషయంలో మాత్రం ఏమీ పర్వాలేదు.

పురుషులకు విధింపబడిన విడువరాని ధర్మమును విడిచిపెట్టి, గోపికలతో విచ్చలవిడిగా ప్రవర్తించి, బడి (వరుసగా) వారంతా నిన్ను దగులుటయే (పొందుటయే...) పరమధర్మము అయినది. ఓ దేవదేవా! ఇకమాకు యెడయు (ఎడువదగిన) పరధర్మములతో పనియేమి వున్నదయ్యా?

మానరాదని, పెద్దల నిర్దేశమైన, కర్మమార్గమును పూర్తిగా మానివేసి శరణాగతులైన యతులే పూజ్యులు. ఓ దేవా! నీ నారాయణ నియతే ఆ యతీంద్రులకు పరమధర్మమైపోయింది. మేము ఈ నిజమొక్కటి మనస్సులో నిలుపుకొని యెఱిగివుండవలయును. అదే మేలైన విధానము.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసుడైవున్నవాడు అనవసరమైన విచారములలో తగులుకొనుట యెందులకు? నిన్ను గురించిన నిజభక్తి నాకు కలదని, తిన్నని (యుక్తముగా) తెలుపునట్టి తెలివే (జ్ఞానమే) ... కలది (కలిగినది).

పద్యవివరణ:

ఆ.వె॥ **విధి నిషేధములకు వెఱవంగ బనిలేదు**
నీదుదాసుడైన అదియె ఘనము
నిన్ను గూర్చినట్టి నిజభక్తి నీబంట్లు
వేడుచుండ్రు శరణు వేంకటేశ!

సంఖ్య: I/304 రాగం : ముఖారి
కీర్తన : యెఱుక గలుగునాడెఱగడటా

ముఖారి

99 ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా
మఱచినమేనితో మరి యెఱిఁగీనా ॥పల్లవి॥

పటువైభవములఁ బరగేటినాఁడే
తటుకున శ్రీహరిఁ దలఁచఁడటా
కుటిలదేహియై కుత్తికఁ బ్రాణము
తటతటనదరఁగఁ దలఁచీనా ॥ఎఱు॥

ఆలుబిడ్డలతో మహాసుఖ మందుచు
తాలిమితో హరిఁ దలఁచఁడటా
వాలినకాలునివసమైనప్పుడు
దాలు వెండఁగాఁ దలఁచీనా ॥ఎఱు॥

కొఱఁతలేక తేఁకువఁ దా నుండేటి-
తఱి వేంకటపతిఁ దలఁచఁడటా
మఱులు దేహియై మఱచివున్నయడ
తఱుచుటూరుపులఁ దలఁచీనా ॥ఎఱు॥ **304**

ఉపోద్ఘాతము:

ఈ జీవి ఇదివరలో అనేక జన్మలెత్తాడు. వాడికి కొన్ని జన్మలలో ఎఱుక (తానెవరో అనే జ్ఞానం) కూడా తానెరుగడటా. తానెవరో మఱచిన మేనితో ఇక యేవిధంగా జ్ఞానం పొందగలడు చెప్పండి అంటున్నారు అన్నమయ్య. ఇది నాకు తట్టిన భావన. ఈ జీవి యెంతటి హీనుడంటే వీడు వైభవాలతో విలసిల్లునాడు పట్టుమని ఆ శ్రీహరిని తలచుకొనుట కూడా చేయడు. అటువంటి వాడు ప్రాణంపోయే సమయంలో తటతట అదిరిపడుతుంటాడు, కాని ఆ శ్రీహరిని తలుచుకొంటాడా? ఒక్కనాటికీ తలవడు. మరి వాడి గతేమిటి?

తాత్పర్య వివరణ:

ఎఱుక (తానెవ్వరు అనునట్టి జ్ఞానము) కలుగునాడు (కలుగబోతున్న తరుణంలో) యెరుగడటా (కన్నూమిన్నూ గానక నిజం తెలిసికొనలేడట). అంతటి అహంభావియైన ఈ జీవి, మఱచిన మేనితో (ఏది మంచి ఏది చెడు అనే విచక్షణ మఱచిపోయిన శరీరంతో భోగిస్తున్నప్పుడు), మరి యెఱిగీనా (ఇక తెలుసుకోగలడా?)

ఇక ఈ జీవుడి దౌర్భాగ్యం యెట్టిదో వినండి. వీడు పలు వైభవముల (వైభోగముల సమూహములో) పరగేటినాడు (తలమునకలవుతున్నప్పుడు) తటుక్కున (చటుక్కున) శ్రీహరిని తలచుకోవటం కూడా చేయడట. అటువంటివాడు కుటిల దేహియై (శుష్కించిన శరీరంతో) గొంతులో ప్రాణం కొట్టుమిట్టాడుతుంటే, తటతట అదిరిపడుతుంటే, తలచీనా (భగవంతుని స్మరించగలడా?)

ఈ జీవి, ఆలుబిడ్డలతో సంసారసుఖం అనుభవిస్తున్నప్పుడు తాలిమితో (ఓపికతో) ఒక్కసారికూడా శ్రీహరిని తలచుకొనడట. ఇక వీడి గడపలో వాలిన యమధర్మరాజు తన పాశము బిగిస్తున్నప్పుడు, దాలువెండగ దలచీనా (నోటిలో తడి యెండిపోతుంటే... అప్పుడు శ్రీహరిని ధ్యానించాలనే ఆలోచనైనా వస్తుందా?) నామాట నమ్మండి... రానేరాదు.

తనకు యేకొఱతా లేక, తాను తేకువతో (ధైర్యంతో) వున్నప్పుడు ఈ జీవి, శ్రీవేంకటేశ్వరుని తలచుకోవటం కూడా చేయడట. మఱులుకొన్న దేహముతో తనను తానే మఱచివున్నయెడ (మైమరిచినవేళ) ఊపిరివేగము అధికమై గాలి అందక సతమతమైపోతున్నప్పుడు, దేవదేవా! నిన్ను తలుచుకోగలడా ప్రభూ! ఈ జీవిని నీవే కరుణించాలయ్యా!

పద్యవివరణ:

కం॥ **ఎఱుక గలుగునాడెరుగడు**
మఱచిన తనమేని తోటి మరియెటులెఱుగున్
గుఱి వేంకటేశుదలవడు
మఱులను ఈదేహియెపుడు మానడు భళిరా!

సంఖ్య: I/394 రాగం : రామక్రియ

కీర్తన : సులభుడు మధుసూదనుడు మన-

రామక్రియ

100 సులభుఁడు మధుసూదనుఁడు మన-
మెలమి నమ్మిన నిట్టేసుండీ ॥పల్లవి॥
పడుచుమాటన కాప్రహ్లాదునెదుట
పొడచూపె నాదిపురుషుఁడు
అడవిదేహనక (గ) ఆదంతి మొఱకును
తడవికాచినదైవముసుండీ ॥సుల॥
ఆఁడుమాటలనక అంతలో ద్రౌపదిని
వాఁడిమిఁ గాచినవరదుఁడు
పోఁడిమిఁ బేదనక పొందినకుచేలుని
వీఁడె సంపదిచ్చె విష్ణుఁడు సుండీ ॥సుల॥
వీరువారన కిదె వేఁడినవరములు
సారెకు నిచ్చినసర్వేశుఁడు
మేరతో లోకముల మెఱసె నిప్పుడును
యీరీతి శ్రీవేంకటేశుఁడేసుండీ ॥సుల॥ **394**

ఉపోద్ఘాతము:

ఓ భక్తులారా! ఈ మధుసూదనుడు భక్తులను సులభముగా అనుగ్రహించువాడు. ఈయనపై నమ్మకముంచితే మిమ్మల్ని ఇట్టే రక్షిస్తాడు సుమా! అంటున్నారు అన్నమయ్య. కీర్తన అంతా ఒక సీస పద్యములో

ఇమిడ్చకలిగాను. అయితే వచ్చిన చిక్కేమిటంటే, పద్యంలో కీర్తనలోని కొన్ని పదాలను యధాతధంగా వాడాను. మీకు తాత్పర్యవివరణ అర్థమైతేనేగాని పద్యం అర్థం కాదు. ఈ శ్రీవేంకటేశ్వరునికి వీరు వారని తేడాలేమీ వుండవట. వేడినవారికెల్లా వరములిచ్చే సర్వేశ్వరుడట.

తాత్పర్య వివరణ:

ఓ భాగవతోత్తములారా! మీకన్నులయెదుటనున్న ఈ మధుసూదనుడు, సులభుడు (భక్తులను సులభముగా అనుగ్రహించు దయాళువు). మనమందరమూ, యెలమి (సంతోషంతో) ఈ స్వామిని నమ్మితే, మనల్ని ఇట్టే (తేలికగా) రక్షిస్తాడు సుండీ (సుమా!)

ఈయన నృసింహుడెట్టైనాడు? "ఇందుగలడందు లేడని సందేహము వలదు" అన్నమాట పడుచుమాట (బాలుని పలుకులు) అనక (అని తోసివేయక), ఈ ఆదిదేవుడు బాలప్రహ్లాదునియెదుట పొడచూపె (కనబడినాడు). కీకారణ్యం కొలనులో మొసలితో పోరి, ప్రాణములు కడబట్టి "మన్నింపన్ తగున్ దీనునిన్ రావే ఈశ్వర కావవే" అని రోదించి, ఆ దంతిని (గజేంద్రుని) మొఱకును (వేదనకు) తడవి (రక్షించి) కాచిన (అనునయించిన) దైవము ఇతడే సుండీ!

ఆడుమాటనక (ఏదో స్త్రీల గొడవ అని తలచక)అంతలో మొరబెట్టిన తక్షణమే నిండుసభలో ద్రౌపదిని, వాడిమి (ప్రతాపముతో) కాచిన వరదుడు (వరప్రదాత) ఇతడే సుండీ! పోడిమి (ఒప్పుగా) పేదనక (పేదవాడు అని భావించక) పొందిన (ఆదరించిన) కుచేలునికి అంతులేని సంపదలిచ్చి అనుగ్రహించిన విష్ణుమూర్తి, వీడే సుండీ!

ఈయన సర్వేశ్వరుడు గనుక వీరు వారనక (వీరు నావారు, వీరు పరాయివారు అను బేధభావములేక) ఇదే తనను వేడిన (అర్ధించిన) వారందరికీ, సారెకు (ప్రతిసారీ) వరములనిచ్చినాడు. మరి ఇప్పుడు మీ కనులయెదుట ఈ శ్రీవేంకటేశ్వరుడు ఈరీతిగా, మేరతో (మర్యాదతో) ఇప్పుడు మెఱసె (శోభించుచున్నాడు). లోకములు ఈ స్వామి ప్రభలతో నిండినవి సుండీ!

పద్యవివరణ:

సీ॥ **పడుచుమాటనకనా ప్రహ్లాదునెదుటనే**
పొడచూపె నీ ఆదిపురుషుడపుడు

అడవి నలమటించి ఆర్తితో రోదించు
కరిరాజు గాచిన హరి యితండు

అడ్డజెప్పక బూని అంతలో
ద్రౌపది వాడిమి గాచిన వరదుడితడు

పేదనకుండగ వేడు కుచేలుని
వెలలేని సిరులిచ్చు విష్ణుడితడు

ఆ.వె॥ **వేంకటేశుడితడు వీరువారనిగాక**
శరణువేడినంత కరుణజూపు
సులభుడితడట మధుసూదనుడితడెపో
యెలమి నమ్మిగొలువ యేలికగును.

మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



హరి నీమయమే అంతాను

(సంపుటి - II)

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

హరి నీమయమే అంతాను

(సంపుటి - II)

మొదటి ప్రచురణ

ఆగష్టు 2013

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

అంకితము

దశరథుని కంటివెలుగు అయిన

శ్రీరామచంద్ర మూర్తికి..

నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై
సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో
కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

హరి నీమయమే అంతాను

(సంపుటి - II)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు ఉపోద్ఘాతము మరియు తాత్పర్య వివరణ

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అంతరాత్మ హరిగలడ	171
2.	అంతవానికింతసేయ	159
3.	అచ్చపురాలయమునలో	141
4.	అదివో నిత్యశూరులు	163
5.	అదెవాడెయిదెవీడె	173
6.	అరుదరుదీగతి యహోబల	131
7.	అడ్డములేని నాలుక నాది	177
8.	అనుచు బొగడెజొచ్చె	175
9.	అన్నిటా భాగ్యవంతుడవవుదువయ్యా	51
10.	ఇంకనైనా కరుణించవేమయ్యా	27
11.	ఇందరి గాచిన నీవు యిట్టే నీవు	85
12.	ఇందిరకునురము మీద	145
13.	ఇటునిను దెలియగ నెంతటి	187
14.	ఇటువలె నుండవద్దా యిరవై	43
15.	ఇట్టే నీమోము చూచిమోవినవ్వేవు	19
16.	ఇదివో తెలుసుకోమ్మా యీరెంటికీ	07

17.	ఈకె కలుగగ గదా! ఇన్నియును నెలవెట్టి	39
18.	ఉవిదలాల చూడరే	129
19.	ఎంచుకొమ్మా నీకు నీవే ఈ తగవులు	41
20.	ఎంతప్రతాపము వాడు యెంతటి నేర్పరి	109
21.	ఎంత మోహమో ఇతడు నీమీదను	37
22.	ఎంత భాగ్యవంతులమో	139
23.	ఎక్కడి పరాకు నీకు యెందాకాను	11
24.	ఎక్కడి పురాకృతమేమి	189
25.	ఎట్టయినా జేయుము	199
26.	ఎట్టున్నదో నీ చిత్తమెదురాడ నేవెఱతు	99
27.	ఎదిరించిపోట్లాడ	101
28.	ఎన్నడు నేగందు నిందు నిందిరాపతి	89
29.	ఎరిగితి నమ్మితి నితడు	169
30.	ఎరిగీనెరుగదు ఏమిసేతు	113
31.	ఎల్లలోకములవారికేలిక	149
32.	ఎదుటనే వున్నది ఇంతి గదుబిన్నది	15
33.	ఏమిసేయుదు నింతయు నీమాయ	91
34.	ఏలమమ్ముగాసి సేసేరింకా	193
35.	ఔభళేశ వోగునూతలౌభళేశ	23
36.	కంటిరా వోజనులాల	123
37.	కందము విందముగాక కన్నులారను	75
38.	కటకటా యీప్రాణి గతిగనుట	185

39.	కలది యీ మూర్తి వల్లగతెగ	153
40.	కలదొక్కటే గురి కమలాక్షనీకరుణ	93
41.	కలుషపు చీకటి	147
42.	కైకొంటే కాక కమలనాభుని	181
43.	కొలచిన వారికి	121
44.	చొక్కపు నీ పెండ్లినాడే సుక్కురారము	17
45.	తలచరో జనులు యీతని	191
46.	తల్లి బాసినబిడ్డ	137
47.	తాపసులడవియేడ తరుణియేడ	33
48.	తెగక పరమునకు తెరువు	119
49.	తెగగోయుటకు హరిదివ్య	195
50.	దానికేమి దోసమా తగినగేస్తురాలవు	03
51.	దైవమా నీకు వెలితా తలపువెలితేగాని	01
52.	దైవమొక్కడే సంతత భజనీయుడు	83
53.	నడువరో జడియక	105
54.	నదులొల్లవు నాస్నానము	167
55.	నమ్మితిజుమ్మీ ఓమనసా	115
56.	నమో నారాయణ నా విన్నపమిదివో	87
57.	నారాయణ నీదాసుల నడకలివి	117
58.	నిండు కంతటా నున్నది	135
59.	నిఖిలమంతయు మేలు	111
60.	నిన్ను గొసరేటి యట్టి నేనే యెడ్డె	05

61.	నిన్ను గూడిన విభుని నిలువెల్లా	49
62.	నిన్ను బాయగలడటే నిమషమైనా	47
63.	నీకు నీవే వలసితే నీవు నన్నుగాచుకొమ్ము	201
64.	నీకునాకునెట్టు గూడె నీవెట్టు నన్నేలితి	97
65.	నీటముంచు పాలముంచు నీ చిత్తమికను	79
66.	నీడల చూపులు నీకేలే యీ	57
67.	నీతో నవ్వగలమా నెఱజాణవు	09
68.	నీవెకా చెప్పజూప	161
69.	నీవారైన వారికి నీపై	127
70.	నీవెఱగవా చెలియా నెఱజాణవు	45
71.	నేనన్నిటా గ్రూరుడ	155
72.	నెరబిరు దిన్నిటాను నీ బంటు	143
73.	పరమ పురుషుడీ బాలుడట	165
74.	పలుయోనులందు పుట్టి	197
75.	పొదలెనిండుకళల పున్నమినేడు	55
76.	పొద్దిక నెన్నడు వొడచునోపోయిన	53
77.	బాపుబాపు కృష్ణా బాలకృష్ణా	31
78.	బిరుదు బంటీతడు	107
79.	మదన రాగము నీకు మదనాతురము నాకు	77
80.	మానరెమాయలు మగువలు	65
81.	మేటి నేరుపరులాల మెలతలాల	61

82.	మేమెరుగమాయేమి మీ సుద్దులు	69
83.	మొక్కలీడువయ్య నీవు ముద్దువిట్టలా	13
84.	రట్టడి కడపరాయడిట్టె వీడు	21
85.	రాతి బతిమసేసిన రామచంద్ర	29
86.	లేదందువల్ల తెలివి	125
87.	వలదను నొరులకు వసమటవే	73
88.	వాడుగదే ప్రహ్లాదవరదుడు	35
89.	వాదమేల సారెసారెవడి	183
90.	విరులదండతోడి విట్టలేశా!	25
91.	విశ్వరూప నీమూర్తి	133
92.	వెక్కసమగు కుచవిభవము	71
93.	వెలది సొబగులివి విన్నవించితిమి	67
94.	శ్రీపతీ నీకెదురుచూచేనాకు నిట్టనే	81
95.	సమసె రావణుడు సమరము	151
96.	సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితిమిదె	95
97.	సేయగల విన్నపము సేసితిమి నీతోడి	63
98.	హరిగొలిచియు మరీ	179
99.	హరిదాసులతోడ	157
100.	హరి నిన్ను పిలిచీని అదివో అమ్మా	59
101.	మంగళం	203

ప్రార్థన

కం॥ శ్రీ వేంకటగిరివాసా!
నీ విరహము నీ చతురత నీ సరసములన్
కావించె అన్నమార్యుడు
చేవగు విందాయె, మాకు జీవన భృతియున్

ఉ॥ కూడెను వేంకటేశ్వరుడు కోమలి పద్మను జాలువారెబో
వేడుకతీరు భోగములు వెన్నెలతాపము వింతచేష్టలున్
తోడగు నెచ్చెలై రతుల తోయజనాభుని గుట్టు విప్పెరా
వీడని అన్నమయ్యకిది విష్ణుని సేవయె వేదఘోషయే.

చం॥ తిరుమల వేంకటేశ్వరుడు తీయని ప్రేమలముంచె దేవులన్
వరముగ అన్నమయ్య కిటు పాడుము నారతి వైభవం బనెన్
సురుచిర లీల తెల్పె కవి సుద్దుల ముద్దుల మోవి తేనెలన్
విరియును మాధురీ భకితి విందుగ మున్నుడి భావముల్ వినన్.

సీ॥ కరుణామయా! హరీ! కనకాంబరా! హరీ
కరుణించు కడదాక శరణు శరణు
తిరువేంకటాధీశ! పురుషోత్తమా! హరీ!
శమియించునేరాలు శరణు శరణు
కరిరాజవరద! శ్రీకర! చారుదరహాస!
హరి నాకు వరమిమ్ము శరణు శరణు
మరణమ్ము దరిజేర చిరునాల్కపై జేరి
హరిహరీ! అననిమ్ము శరణు శరణు

ఆ.వె॥ భక్తి నిలువనిమ్ము పరమాత్మ శరణంటి
భ్రమలపారద్రోలు పనిచి శరణు
దిక్కు నీవె తండ్రి! దేవోత్తమ! శరణు
చక్కజేయుమయ్య! శరణు శరణు

మ॥ హరి నీమాయనెరుంగ మాకు వశమే! అజ్ఞానికెట్లౌనురా?
కురిపించంగదవే! కృపన్ నిలుచుచున్ కూటస్థుడౌ శ్రీపతీ!
ధర నీకెవ్వరు సాటిరాగలరురా! తండ్రీ! జగన్మోహనా!
వర శ్రీవేంకటనాయకా! విడువ నీ పాదంబులన్ జుట్టెదన్.

తే.గీ.॥ కనుల గోచరమవనట్టి కమలనాభు
వేదరాశులకందని విశ్వరూపు
భక్తిలేకున్న స్థిరముగా మనసునందు
తెలియసాధ్యమా!! యేరికి, కలను గాదు.

కం॥ తిరుమలరాయని గొలువుడు
తరుగునురా పాపరాశి ధన్యత కలుగున్
తరగని వరములు కురియును
తరియించును వంగడంబు తరతరములకున్

శా॥ నాదోపాసన గొప్పసాధనమురా నారాయణున్ జేరగా
వాదం బేటికి? ప్రాప్యస్థానమతడే వాంఛించకైవల్యమున్
ఏదో జన్మసుకృత్యమిట్లు వెలసెన్ హే శ్రీపతీ! ధన్యుడన్
తాదాత్మ్యంబుగ అన్నమయ్య కృతులన్ తర్కించి నే జెప్పెదన్

ఆ.వె.॥ కాడు అన్నమయ్య, కాడురా త్యాగయ్య
కారు రామదాసు ధరణి నరులు
కూనిరాగములతో కొలిచినా హరి మెచ్చు
భక్తిలేని నోట భజనలేల?

ఉ॥ పాదరసంబు వోలెవడి బట్టగ కాదుర చంచలంబు, ఆ
వేదన జిక్కు నా మనసు వేంకటనాయక యేమిసేతురా
పాదము బట్టి వేడెదను పాయక కట్టుము నీదు ధ్యాసలో
కాదనకయ్య! నీచమగు కావిరి జన్మలనెత్తలేను రా!

సీ॥ శోధించి వేధించి శుష్కింప జేసిన
"హరి ఆర్తరక్షకు" డనుటయెట్లు?
కర్మగిర్మయటించు కథలన్ని నాకేల
నాదు భారము నీది నందకధర!
తొలగించి వేదన తుడువక కన్నీరు
దీనబంధుడవెట్లు తిరుమలేశ!
శరణాగతత్రాణ బిరుదంబదేలరా?
కరుణగావకయున్న కమలనాభ!

ఆ.వె॥ బిడ్డ తప్పుజేయ బిగియించునా తండ్రి?
తప్పు దిద్ది మంచి దారి జూపు
జగతినెందునైన సర్వసామాన్యమే
వెకలిజెప్పుటేల వేంకటేశ!

మత్తకోకిల:

ఏమిటీ హరిమాయ దెల్వను యేమి నాగతి శ్రీపతీ!
కామక్రోధములొగ్గనైతిని కండకావరమెక్కగా
ఏమిసేతును కాలుడొచ్చెను ఇంటివాకిట నిల్చెనే
రామచంద్రుని గొల్వనైతిని లక్షబుద్ధుల జెప్పినన్.

కం॥ నమ్మి చెడినవాడెవ్వడు
ఇమ్ముగ శ్రీవేంకటేశు నిహపరములకున్
అమ్మలకమ్మగు అమ్మను
నెమ్మదిలో నిల్పుకొన్న నిపుణుండితడే.

ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా ప్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము "హరి నీ మయమే అంతాను" గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను "గూగుల్" నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. "geetadeeksha" అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. "భగవద్గీత" అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక "హరి నీమయమే అంతాను" అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen.

Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు. గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి

ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు, సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇకపోతే, ఈ సంపుటి- II గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అన్నమయ్య చేపట్టిన శృంగార వర్ణన అంతా అమలినమే. పైకి స్త్రీ, పురుష రతి సమాగమం వలె అనిపించినా అది ఆత్మ - పరమాత్మల ఐక్యమే. మనోవాక్కాయ కర్మలా పరమాత్మలో ఐక్యమవ్వాలని ఆత్మపడే తహతహలే, మనకి స్త్రీ పురుష విరహవేదనవలె అనిపిస్తున్నది. కాని అన్నమాచార్యులంతటి యోగికి రతిలీలా వర్ణన, ఆత్మ, పరమాత్మల అనుసంధానమే.

అందుచేత ఈ కీర్తనలను శృంగారకీర్తనలని కాక మధురభక్తి కీర్తనలు లేక మధుర కీర్తనలు అని వ్యవహరిద్దాం. అన్నమయ్యవలె నాకు పరమాత్మ తత్త్వం అవగతమే కాలేదు. నేను ఒక జగన్నాయకుని సేవలో తుదిశ్వాస విడువాలనే ఆశతో జీవిస్తున్న అసంఖ్యాకులలో అతి సామాన్యుడను. అన్నమయ్యకు కైవల్యాన్ని ప్రసాదించిన ఆ శృంగారరాయడు నాబోటివానిని కనీసం ఎవడురా వీడు అని చూస్తాడా అంటే... అవుననే అర్థతే లేదు. అయినా నా కర్తవ్యం నేను నెరవేరుస్తాను. ఫలితాన్ని ఆశించను. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరితో గూడి రతులదేలి భారతావనిని నిరంతరం శాంతి సౌభాగ్యాలతో వుంచుగాక!

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అథవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.



హరి నీమయమే అంతాను సంకీర్తనలు

సంఖ్య: IV/407 రాగం : సాళంగనాట
కీర్తన : దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక

సాళంగనాట

1 దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక
వేవేలుకర్మాల వేసారఁగవలసె ॥పల్లవి॥

హరియంటేఁ బాపేటి అన్ని పాపాలు సేసిన
పొరి నందుపై నమ్మిక పుట్టదుగాక
నరసింహాయంటే వచ్చేనానాపుణ్యాలకు
తిరముగా ఋణములు దీర్చుకొనఁగలనా ॥దైవ॥

దేవ జగన్నాథయంటే తెగనిజన్మములేవి
కైవశము నామనసు గాదుగాక
గోవిందయనియంటేఁ గూడనిపదవు లేవి
కావిరిఁ గాల మూరకె కడపేము నేము ॥దైవ॥

వేదనారాయణయంటే వీడేటిబంధములు
ఆదిగా మూఁడులోకాలనైనా నున్నదా
శ్రీదేవిపతియైన శ్రీవేంకటేశ్వరుఁడా
యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాక ॥దైవ॥ **407**

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! నీకు యేమితక్కువయ్యా! మా తలపులలో వెలితివుంటుంది కానీ, నీలో వెలితి వుంటుందా? ఆలోపమువలననే మేము వేవేల (అనేకములైన) కర్మల నాచరించుచు వేసారిపోవలసివస్తున్నది, అని అంటున్నారు అన్నమయ్య ఈ కీర్తనలో.

ఒక్కసారి మనస్ఫూర్తిగా హరీ అంటే అన్ని పాపాలు ఆయనే పోగొడతాడట. గోవిందా అంటే మనల్ని కూడని పదవులే వుండవు. వేద

నారాయణుడా అని వేడుకొంటే భవ బంధములన్నీ వీడిపోతాయి. ఆ శ్రీమన్నారాయణుని ధ్యానించకపోవటం మన నేరము కానీ ఆ స్వామిలోపమా?

తాత్పర్య వివరణ:

ఓ దైవమా! నీకు వెలితా (నీకేమితక్కువయ్యా) వెలితి అంటూవుంటే అది మా తలపులలో కాక (ధ్యానములోవున్న లోపమే గానీ) నీవు యేలోపమూలేని నిష్కళంకుడవు. మేము నిన్ను సరిగా ధ్యానించక, వేవేల (అనేకమైన) కర్మబంధములలో వేసారవలెసె (తపించవలసి వచ్చింది).

"హరి" అన్నంతమాత్రాన మన పాపములనన్నింటినీ ఆయన నిర్మూలిస్తాడు. అయితే మన దౌర్భాగ్యం యేమంటే అందుపై (ఆమాటమీద) నమ్మకం కలుగనే కలుగదు. దానికి ఆయనేంచేస్తాడు? నరహరీ! అంటే నానాపుణ్యాలు వస్తాయి. నా ఋణములైన పాపములను స్థిరముగా తీర్చుకోవచ్చుకదా!

ప్రభూ! నా మనస్సు నా స్వాధీనంలో వుండదు గానీ, మనస్ఫూర్తిగా దేవా! జగన్నాథా! అంటే తెగిపోని జన్మములు (భవబంధములు) వుంటాయా? స్వామీ! మేము మాకున్న కొద్దిపాటి కాలమును వ్యర్థము చేస్తూనేవున్నాంగాని, దానిబదులు గోవిందా! అని అంటే దక్కని పదవులు వుంటాయా?

దేవా! మా జీవితాంతము పీచువంటి బంధుత్వాలను పెట్టుకొని తెగతాపత్రయపడిపోతుంటాం. ఆ బంధాలన్నీ మనసారా వేదనారాయణుడా అంటే సడలిపోతాయి. అట్లా సడలిపోని బంధం, మూడులోకాలలోనైనా వుంటుందా? ఉండదు. శ్రీదేవీవల్లభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! యేదెస (దిక్కు) చూచినా నీవే నన్ను ఈడేర్చు (కాపాడు)చుందువుగాక!

పద్యవివరణ:

తే.గీ.॥ **దైవమా నీకు వెలితియా? తలపు వెలితి**
వివిధకర్మాలవేసారి అవియవలసె
శ్రీపతైనట్టి తిరుమల శ్రీహరివట
నీవె ఈడేర్చవలెనయ్య! నిశ్చయముగ.

సంఖ్య: VII/571 రాగం : బౌళి
కీర్తన : దానికేమి దోసమా తగిన గేస్తురాలవు

బౌళి

2 దానికేమి దోసమా తగిన గేస్తురాలవు
నేను నిన్ను నేమనేను నీకేలే సిగ్గులు ॥పల్లవి॥

కొండవంటిదొర నిన్ను కొంగువట్టి తీసితేను
వొండేమీననలేక వొద్దికైతివే
అండనుండి సారెసారె నాతఁడే పిలువఁగాను
బండుబండు గాలేక పలికితివే ॥దాని॥

చక్కని జాణఁడు నీజవ్వనము దడవఁగ
గక్కన విడువలేక కైకొంటివే
వెక్కసానఁ గమ్మటిని వీడె మాతఁడియ్యఁగాను
అక్కరఁ దోయలేక అందుకొంటివే ॥దాని॥

శ్రీవెంకటేశ్వరుఁడు చెక్కు నిన్ను నొక్కఁగాను
కైవశమై అంతలోనఁ గరఁగితివే
యీవేళ నన్నేలి వచ్చె నిద్దరి సవతులగా
కావించి నవ్వితినిట్టే కదిసితివే. ॥దాని॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన శృంగార సౌరభాలను నింపే మధురు భక్తి కీర్తన. ఇలాంటి కీర్తనలు చెప్పటంలో అన్నమయ్య సిద్ధహస్తులు. ఈ సరసశృంగార సాహిత్యమంతా జానపదులు వాడే తెలుగు అవటంవల్ల కొన్ని పదములకు సరిఅయిన అవగాహన కొంచెము కష్టమే. "అండనుండి సారెసారెకు నాతడే పిలువగ బండు బండు గాలేక పలికితివే" – అనే తెలుగు

పదప్రయోగాలు కోకొల్లలు వీటిని నేటి నాగరికులు అర్థం చేసికోవటం ఇబ్బందే. అన్నమయ్య అలమేల్మంగ చెలికత్తెయై హితోపదేశం చేస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! దానికి (నీవు స్వామికి లొంగిపోవటంలో) యేమి దోసము (అపరాధము) వుందమ్మా? నీవు తగినగేస్తురాలవు (భోజ్యేషుమాతా, శయనేషు రంభా అని బుధ జనులు మెచ్చుకొనే ఇల్లాలివి. నేను నీ చెలికత్తెనమ్మా! నేను నీకు చెప్పగలదాననా? కానీ ఒక మాట జెప్పెదను. ఇన్ని సిగ్గులు నీకేలనమ్మా?

కొండవలె సమోన్నతుడైన దొర (స్వామి) నిన్ను పైట చెంగుపట్టి నిలువరిస్తే, ఒండేమీననలేక (అన్యమైన సాకులు చెప్పలేక) ఒద్దికైతివి (స్వామికి అనుకూలవతివైనావు). ఆయన రాజప్రసాదమునకు నిన్ను సారెసారెకు (మాటిమాటికి) పిలువనంపగా బండు బండుగా లేక (సిగ్గుతో చితికిపోలేక) పలికితివే (ఆయనతో మాటలు కలిపినావు). ఇట్లా అయితే యెట్లాగమ్మా?

ఓ దేవీ! నీ స్వామి గొప్ప జాణడు (చతురుడు) శృంగారకళా ప్రావీణ్యుడు. ఆయన నీ జవ్వనమును (నీ యౌవనమును) తడవగా (స్పృశిస్తే) విడువలేక (ఆ స్వామిని నిరాకరించలేక) గక్కున కైకొంటివి (చటక్కున స్వీకరించితివి). అధికమైన అనురాగంతో ఆయన నీకు తాంబూలమునీయగానే, అవకాశాన్ని వదలుకోలేక అందుకొని స్వీకరించావు.

ఓ దేవీ! ఆ శ్రీవేంకటేశ్వరుడు సుతారముగా నీచెక్కిలి నొక్కగానే ఆయనకు స్వాధీనమై కరగిపోతివి. మరీ ఇంత బేలవైతే యెలాగమ్మా? ఆ ముచ్చట్లన్నీ అటుంచి నేడు ఆ శ్రీవేంకటేశుడే నన్నేలగా (నన్ను అనుగ్రహించుటకు) శ్రీదేవి భూదేవీ, ఇద్దరి సహితుడై కామించివచ్చినాడు ఆయనను సమీపించి నేను కూడా నవ్వితిని.

పద్యవివరణ:

కం॥ **తగినట్టి గేస్తురాలవు**
ఒగినీకిక నేలనమ్మ! ఓపని సిగ్గుల్
జగపతి చతురుడు నీపతి
మగడపుటకు నాశపడని మగువుండునటే?

సంఖ్య: VII/457 రాగం : కాంబోధి
కీర్తన : నిన్ను గొసరేటియట్టి నేనే యెడ్డనింతే

కాంబోధి

3. నిన్నుఁ గొసరేటియట్టి నేనే యెడ్డనింతేకాక
యెన్ని మాటలాడినా నీకేడ మొకదాకిరి ॥పల్లవి॥

సిగ్గులనే తెరగట్టి చెలిమోవివిందువెట్టె
కగ్గనిచనవులుడుగరలిచ్చెను
అగ్గలమై ఆపెకడ ఆడకెట్టు మానేవు
నిగ్గుల నిచ్చకునికి నీకేడ నిజము ॥నిన్ను॥

కన్నుల నివాళిచ్చె కాఁగిట విడిది వెట్టె
కన్నె దనకుచముల కప్పము వట్టె
చెన్ను మీరనాపెపంపు సేయకెట్టు మానవచ్చు
మన్ననఁ బక్షపాతికి మరియేడ తగవు ॥నిన్ను॥

ఇచ్చకానఁ బోఁకవెట్టి యింపులనె పెండ్లాడె
మెచ్చెను శ్రీ వెంకటేశ మేలములను
ఇచ్చట నన్నుఁ గూడితివిరుమొనసూదివైతి
విచ్చన విడికాఁడవు వెరపేల యిఁకను. ॥నిన్ను॥ **457**

ఉపోద్ఘాతము:

'మొకదాకిరి' అంటే మోమాటము లేక బిడియము అని అర్థము. 'ఎడ్డె' అంటే ఇబ్బందిపెట్టేవారు అని అర్థం. నాయిక స్వామితో నిష్కారమాడుతున్నది. "సరే! నేనే యెప్పుడూ కొసరుకొనే ఎడ్డెదానను. నీవు నన్నెన్ని మాటలనినా క్షణంలో నన్ను కరిగిస్తావు. నీకు అసలు బిడియం అనేది వున్నదా ప్రభూ?" అంటున్నది. అన్నమయ్యే ఆ నాయిక. ఈ కీర్తన అర్థంచేసికొని వివరించాలంటే పాండిత్యం కొంత, పరమాత్ముని దయ అంతా వుండాలి. రుచిచూడండి మరి.

తాత్పర్య వివరణ:

స్వామీ! నిన్ను కొసరేటియట్టి (దేబిరించే) నేనే ఎడ్డెను (ఇబ్బందిపెట్టే ఆడుదానను). ఇంతేకాక నన్ను యెన్నిమాటలాడినా (యెన్ని నిష్కారాలు పలికినా) నీకేడ మొకదాకిరి? (నీకేమి మోమాటము వున్నదిలే).

సిగ్గులనే తెరచాటున ఇప్పటిదాకా దాగిన నీ చెలి నీవు ఆశించిన మోవివిందు పెట్టినది. కగ్గని (వెనుకాడని) చనవులుడు (చొరవతీసికొనే సాహసి) గరలిచ్చెను (ఘర్షణ పడుతున్నాడు). ఆమె కడ (ఆమెవద్ద) అగ్గలమై (ఎంతో వినయ విధేయతలు కలవాడవై) ఆడకెట్టుమానేవు (ఆమె చెప్పినట్లెల్లా ఆడక యెట్లు మానుతావు? నీవు నిగ్గుదేరిన ఇచ్చకాలరాయుడవు. నీకేడ నిజము (నీవు నిజం చెప్పటమూ నేను వినడమూ).

ప్రభూ! ఆమె అయితే కన్నులతోనే నీకు హారతులిస్తుంది. తన కౌగిలి నీకు విడిది చేసి సంతోషపెడుతుంది. తన కుచగిరులను నీకు కప్పముగా కూడా కడుతుంది. అందాలొలికే ఆమె, పంపుసేయక (నిన్ను ఆజ్ఞాపించక) మానుతుందా? నీవు పక్షపాతముగలవాడవని చూస్తూనే తెలుస్తున్నది కదా! మరి ఇంకా నీతో నాకు తగవెందుకయ్యా?

స్వామీ! ముఖస్తుతిచేసి, అదేపోకవెట్టి (బహుమానముగా ఇచ్చి) శోభాయమానంగా పెండ్లాడతావు. శ్రీవేంకటేశ్వరుడు మెప్పును పొందునట్లుగా మేలమాడె (సరసోక్తులను చెప్పెను). ప్రభూ ! నీవు నన్నునూ ఇచ్చటనే కూడితివి. నీవు ఇరుమొన సూదివైతివి (రెండుదువైపులా వాడిగల సూదివైనావు. నీవు విచ్చలవిడి వీటుడవు. ఇక నీకు వెరపేలనయ్యా?

పద్యవివరణ:

ఆ.వె॥ **నిన్ను గొసరుదాన నేనె'యెడ్డెను,' కాక**
యెన్నిమాటలనిన యేమినీకు?
ముందు విడచినావు 'మొకదాకిరి'ని ప్రభూ!
మేలమాడునట్టి వేంకటేశ!

సంఖ్య: VII/458 రాగం : శంకరాభరణం
కీర్తన : ఇదివో తెలుసుకొమ్మా యీరెంటికి నీవేగురి

శంకరాభరణం

4 ఇదివో తెలుసుకొమ్మా యీరెంటికి నీవేగురి
పదివేలు విన్నపాలు భావించుకోనీవే ॥పల్లవి॥

సరవితో నడచితే జగడముఁ జవులే
విరసాన నడచితే వెగటౌఁ బొందు
నిరతి నావద్దనుంటే నీవేమన్నా నాకునింపౌ
పరులవొద్దనుంటే నీపలుకే వేసటలు ॥ఇది॥

తగవులు దప్పకుంటే తమవారే యిందరును
యెగసక్యమైతే తనయిల్లే యెరవు
నగుతా నీవూరకుంటే ననుపులీడేరును
మొగము ముణుచుకొంటే మోపులౌఁ బ్రియములు ॥ఇది॥

కాఁగలించుకొంటేను కపటమంతయుఁ బాసు
ఆఁగుక వూరకుండితే అదియే కాఁక
వీగక శ్రీవేంకటేశ వెసనన్నుఁ గూడితివి
మాగిన నీ నామనము మాఁటువే యిన్నియును ॥ఇది॥ **458**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య సరసమధురశృంగారకీర్తనలకు ప్రతిపదార్థం వివరిస్తే చాలామందికి అందులోని మధురభక్తి అవగాహనకు రాదు. మన మనస్సులు పరిపక్వంకాక జీవాత్మ పరమాత్మల చేరికను స్త్రీ పురుషశృంగార సమాగమములాగా భావిస్తుంటాము. మన పరిపక్వత అంతేమరి. బహుశా అన్నమయ్య సాళ్వనరసింహరాయల ప్రాపకంలో వున్నప్పుడు ఆ రాజుని 'ఉల్లాస' పరచుటకు కొన్ని కీర్తనలలో మోతాదుకి మించిన శృంగారం తొంగి చూస్తుంది. కానీ ఒక్కమాటనిజం శ్రీవేంకటేశ్వరునిగా పరమాత్మను భావించినపుడు ఆ స్వామిని వాంఛించని పడుచు వుంటుందా చెప్పండి. ఈ

కీర్తనలో పల్లవి అర్థమయ్యే సరికి గగనమయిందంటే నమ్మండి. ఇందులో అన్నమయ్య దేవి చెలికత్తె.

తాత్పర్య వివరణ:

ఇదిగో ఓదేవీ! ఇది తెలుసుకోవమ్మా! ఈ రెంటికీ (నీ మంచికి, నీ చెడుకు) నీవేగురి (నీవే లక్ష్యం). అది నీ చేతిలోనే వున్నది. నీవు ఆయనకు పదివేల విన్నపాలు చేస్తున్నట్లు ఆయనను భావించుకోనీవమ్మా. దీనితో ఆయనకు నీపై ప్రేమ ఇనుమడిస్తుంది. అయినా నా సలహా వినవమ్మా!

సరవితో (ఒక క్రమపద్ధతిలో) నడిస్తే శృంగారంలో జగడాలుకూడా మధురంగా వుంటాయి. అదే ఆడది విరసము కలిగినదైతే ఆమె పొందు పురుషునికి వెగటవుతుంది. నాకు నీమీద "ఆసక్తి" వుంటే నీవేమన్నా నాకు ఇష్టముగానే వుంటుంది. అదే నీవు నాకు నచ్చనివారి ప్రాపకంలో వుంటే నీ పలుకులు నాకు తీయగా వుండవు. పైగా వెగటుగా వుంటాయి.

ఓ దేవీ! తగవులు, తప్పకుంటే (తప్పుకుంటే అని వుంటే బాగుంటుంది) నీ స్వామికి ఆశ్రితములైన వారందరూ నీవారే అనిపిస్తుంది. అదే ఎగసక్కెమైతే (ఒకరినొకరు అవమానించుకొంటుంటే) ఆ ఇల్లే యెరవు (అన్యుల ఇల్లులాగా కనుపిస్తుంది). నీవు నవ్వుతూ ఆయనను సంతోషబెడితే నీ ననుపులు (అనురాగములు) ఈడేరుతాయి. అదే నీవు మొగము ముడుచుకొనివుంటే, నీ ప్రేమలన్నీ మోపులు (భారము) అవుతాయి.

ఓ దేవీ! నీవు స్వామిని ప్రేమగా కౌగలించుకుంటే విభేదాలన్నీ సమసిపోతాయి కదా! నీవు నాకేం పట్టిందని నిర్లిప్తంగా వుంటే, కాక (వేడి) ఎక్కువైపోతుంది. సరే! ఆ గొడవ అట్లావుంటే... ఓ శ్రీవేంకటేశ్వరా పనిలోపనిగా నీవు నన్నునూ కూడినావు. కానీ నా మనస్సు నీ మనస్సు మాగినా అది ఆమె ముందు చాటుమాటు వ్యవహారాలేనయ్యా!

పద్యవివరణ:

చం॥ **తెలియుము రెంటికిన్ నెలత! దీటుగ బాధ్యత నీదెయౌ సుమా**
పలువిధముల్ కదా! వినతి భావన జూపుట వానిగెల్చుటల్
చిలుకలకొల్కిరో! వినుము శ్రీపతిగెల్తువు ప్రేమ చేతనే
నెలతలు నాదు బోంట్లు హరినెమ్మది కోరరె సంగమించరే?

సంఖ్య: XVIII/516 రాగం : లలిత
కీర్తన : నీతో నవ్వగలమా నెరజాణవు

లలిత

5 నీతో నవ్వఁగలమా నెరజాణవు
గాతసేయ కెట్టైనాఁ గరుణించవయ్యా ॥పల్లవి॥

గోవులనెల్లాఁ గాచి గొల్లెతలపొందు సేసి
కోవిదుఁడ వైతివి గోవిందరాజా
వావు లొక్కటిగాఁ జేసి వన్నెకాఁడవై తిరిగి
గోవాశుఁడ వైతివి గోవిందరాజ ॥నీతో॥

దూడలఁ గొన్నాళ్లు గాచి తూలేటివుట్లు గొట్టి
కూడుకొంటివి బాలుల గోవిందరాజ
వేడుకకాఁడవై వేవేలు సేఁతలు సేసి
కోడెకాఁడ వైతివి గోవిందరాజ ॥నీతో॥

చిఱుతవాఁడవై నీవు చీరలు దొంగిలుకొని
కొఱతలు మాన్పితివి గోవిందరాజ
యెఱిఁగి శ్రీవేంకటాద్రి నిందరినిఁ బెండ్లాడి
గుఱిగా నిలిచితివి గోవిందరాజ ॥నీతో॥ **516**

ఉపోద్ఘాతము:

తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామిపై మధురభక్తి ప్రతీకయైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. నీవు నెరజాణవు స్వామీ! నీతో నవ్వగలమా అంటున్నారు. మాతో దెబ్బలాడ మమ్ము కరుణించవయ్యా! అని ప్రాధేయపడుతున్నారు. అన్నమయ్య కూడా గోవిందుని సాంగత్యం కోరుకొనే గొల్లెతే ఇక్కడ. ఆయన (అన్నమయ్య) భావనా సామ్రాజ్యంలో గోవిందునికి ప్రియురాలై కొన్నిసార్లు ఆయన దేవేరికి నెచ్చెలియై, కొన్నిసార్లు ఆయన ఇష్టసఖియై కొన్నిసార్లు ఆయాపాత్రలలో జీవించి ఈ కీర్తనలు చెప్పారు. అందుకే ఇవి అజరామరము.

తాత్పర్య వివరణ:

ఓ గోవిందరాజా! నీవు గొప్పనెరజాణవు (నేర్పరియైన చతురుడవు). ప్రభూ! నన్ను గాతసేయక (దెబ్బలాడక) యెట్టైనా కరుణించవయ్యా!

ఓ గోవిందరాజా! చిన్నపిల్లవాడిగా గోవులనెల్లా కాచినావు. కొంతవయసు రాంగానే గొల్లెతల (గోపికల) పొందుసేసి (రమించి) శృంగార కళలో కోవిదుడవైతివి (అమోఘమైనట్టి ప్రావీణ్యముకలవాడవైతివి). ఏమి చెప్పను స్వామీ? ఓ గోవిందరాజా! నీవు వావులొక్కటిగా చేశావు. ప్రతిగొల్లెతకు భర్త అయినందువల్ల అందరూ అక్కచెల్లెళ్లయి ఒకే వావిగలవారైనారు. నీవు అట్లా చేసిన వన్నెకాడవైనావు (సౌందర్యవంతుడైనావు). ప్రభూ! ఈ విధముగా కొన్నాళ్ళకు నీవు గోవాళుడవైతివి. (యౌవన పండితుడవైతివి.)

ఓ గోవిందరాజా! నీవు కొన్నాళ్ళు లేగదూడలనుకాచినావు ఆ రోజుల్లో తూలేటివుట్లు (కదులుతున్న వుట్లను) కఱ్ఱలతోకొట్టి, గొల్లపిల్లలను కూడుకొని విపరీతమైన అల్లరి చేసితివి. వేడుకకాడవై (వినోదప్రియుడవై) అనేకములైన పనులు చేసి మెల్లగా కోడెకాడవైతివి (కోడెవయసు కుఱ్ఱవాడివైతివి). ఓ గోవిందరాజా! నీ లీలలను యేమని వర్ణించనయ్యా?

ఓ గోవిందరాజా! నీవు చిరుతవాడవై (చిన్నవాడవై) యున్నప్పుడే యమునలో స్నానము చేయుచున్న గోపికల చీరెలు దొంగిలించి చెట్టెక్కి కూర్చుని వారిని బలవంతంగా నగ్నంగా యమున ఒడ్డునకు వచ్చునట్లు చేసి వారికి దేహాభిమానమనే కొఱత (లోటు) లేకుండా చేశావు. ఓ గోవిందరాజా! నేడు అందరికీ తెలియునట్లుగానే నిత్యపెళ్ళికొడుకువై శ్రీవేంకటాద్రిపైన వెలిసినావు.

పద్యవివరణ:

కం॥ **నీతోనవ్వగనగునే**
గాతను సేయంగబోకు కరుణించవయా!
చేతలనెరజాణవురా
ఆతల గోవిందరాజ! అతివల రేడా!

సంఖ్య: XVIII/567 రాగం : గుండక్రియ
కీర్తన : ఎక్కడి పరాకు నీకు నెందాకాను

గుండక్రియ

6 ఎక్కడి పరాకు నీకు నెందాఁకాను
చక్కనిరమణి కిట్టు నచవియ్యవయ్యా ॥పల్లవి॥

సానఁబట్టినచూపులు చల్లఁగా నీపైఁ జల్లి
తేనెలమాటలెల్లా నొద్దికతో ముంచె
కానుక సెలవినవ్వు కప్పురముగా నిచ్చె
మానవతి నిఁకనైన మన్నించవయ్యా ॥ఎక్క॥

సరి చన్నులు మీఁదెత్తి సమ్మతిఁ గాచుకున్నది
యిరవై చెమటపన్నీ రిదివో నించె
మురిపెపుసిగ్గులనే ముగ్గులు నీకుఁ బెట్టె
తరుణి నింతట నిట్టె దయఁజూడవయ్యా ॥ఎక్క॥

నిండుజవ్వనపాయమే నిలువు సేసలు వెట్టి
దండిసరసపుఁదమి దయిలువోసె
అండనె శ్రీవేంకటేశ అన్నిటా నేలితివి
మెండైనవనిత నింకా మెప్పించవయ్యా ॥ఎక్క॥ **567**

ఉపోద్ఘాతము:

పరాకు అంటే అన్యమనస్కంగా వుండటం లేదా పరధ్యానముగా వుండటం అని అర్థం. ఈ నాయిక మీద ఇంత నిర్లక్ష్యమెందుకు స్వామీ? ఇట్లా యెందాకా ఆమెను బాధిస్తూవుంటావు? నీ రమణి చక్కనిచుక్క. ఇక ఆమెకు అనురాగం పంచి ఇయ్యవయ్యా! అని నచ్చచెబుతున్నారు అన్నమయ్య తానూ స్వామికి అంతరంగిక చెలికత్తెయై. ఇకపోతే ఇది అన్నమయ్య మధురకీర్తన కాబట్టి ఒకటికి నాలుగుసార్లు చదివితేనే కానీ అర్థంకాదు. అంతా శ్రీనివాసకృప.

తాత్పర్య వివరణ:

దేవా! నీకు యెక్కడి పరాకు (పరధ్యానము)? ఇట్లా యెంతదాకా వుంటావు? ఈ నీ దేవేరి చక్కటి రమణి (సుందరాంగి). ఇట్లు (ఇకపైన)ఆమెకు చనవు (అనురాగము) నియ్యవయ్యా!

సానబట్టిన చూపులు (తన నిశితదృష్టి) నీపై చల్లగా నిలిపినది, ఆ రమణి. నిన్ను తేనెలూరు తన తీయని మాటలతో, ఒద్దికగా (అనుకూలవతియై) ముంచినది (తలమునకలు చేసినది). ఎవరైనా గొప్పవారు ఇంటికి యేతెంచినవారిని స్వాగతించి కర్పూరతాంబూలమివ్వటం మన ఆచారము. మరి ఈ దేవి నీకిచ్చిన కర్పూరతాంబూలమేమిటో తెలుసునా స్వామీ? తన సెలవినవ్వులే (మధురమైన చిరునవ్వులే). ప్రభూ! ఈ మానవతిని (అభిమానధనురాలిని) ఇకనైనా మన్నించవయ్యా!

స్వామీ! ఆమె పొంకమైన తన స్తనములనెత్తి బిగించి కచబంధమును కట్టి ప్రశాంత చిత్తయై నీ కొరకు వేచియున్నది. అధికముగా చెమటపట్టినందున సువాసనాభరితమై పన్నీట జలకములాడినదా అనిపించుచున్నది. ఆమె తన ప్రాంగణమున నీ కొరకు పెట్టిన రంగవల్లులే ఆమెకు నిను చూడగానే కలిగిన సిగ్గులు. ప్రభూ! ఆతరుణిని ఇకనైనా దయజూడవయ్యా!

దేవా! ఆమె తన నిండు యౌవన ప్రాయమే నీకు నిలువు నీరాజనమునిచ్చినది. దండి సరసము (అధికమైన సరసముల) యొక్క తమి (ఆపేక్షను) ఆమె నీకు ధారపోసినది. ఆమెకు అండవై ఓ శ్రీవేంకటేశ్వరా ఆమెను అన్నిటిలోనూ యేలితివి. శ్రేష్ఠమైన ఆవనితమనమును ఇంకా మెప్పించి అలరించవయ్యా!

పద్యవివరణ:

తే.గీ॥ **ఎక్కడి పరధ్యానంబులు యెంతదాక?**
వనితదరిజేరవయ్య నీ చనవునిమ్ము
వేంకటేశ యేలుము నీవు వెలదినిపుడు
మెండు అయిన వనితనిన్ను మెచ్చగాను.

సంఖ్య: XVIII/369 రాగం : సాళంగనాట
కీర్తన : మొక్కలీడవయ్య నీవు ముద్దు విట్ఠలా

సాళంగనాట

7 మొక్క లీఁడవయ్య నీవు ముద్దు విట్ఠలా మా-
పక్క వాయ వెప్పుడును పండరంగివిట్ఠలా ॥పల్లవి॥

చిక్కనిచల్ల లమ్మఁగాఁ జేరి విట్ఠలా మా-
జక్కవచన్నులంటేవు సారె విట్ఠలా
తొక్కేవు మాపాదాలు దొమ్మివిట్ఠలా
పక్కన మై చెమరించెఁ బండరంగివిట్ఠలా ॥మొక్క॥

వేళగాచి వచ్చేవు మావెంట విట్ఠలా కడు-
మేలములాడఁ జేరేవు మేటివిట్ఠలా
కోలుముండై చెనకేవు గొంటువిట్ఠలా
పాలుగాంచి(చే?) వేళనే పండరంగివిట్ఠలా ॥మొక్క॥

సొరిది గచ్చకాయలు చూపి విట్ఠలా
సరిబేసులాడేవు జాణవిట్ఠలా
దొరబై శ్రీవేంకటాద్రిఁ గూడి విట్ఠలా
పరగ మావద్దనుంటి పండరంగి విట్ఠలా ॥మొక్క॥ 369

ఉపోద్ఘాతము:

మొక్కలీడు అంటే కుటిలుడు లేక మాయావి అని అర్థం. శూరుడు అని ఇంకొక అర్థం వుంది. అందుకే అన్నమయ్య విట్ఠల ప్రభువును, మొక్కలీడు అని సంబోధిస్తున్నారు. స్వామిని నిందించటం చేసినా ముద్దుతోనే చేశారు. ఈ పండురంగిలో (రాయలసీమ పల్లెటూరు) లో నెలకొన్న విట్ఠలా నీకున్న గుణమేమిటంటే, ఎట్లా దూరిపోతావోగానీ, మా పక్కలు వదిలిపెట్టవు అంటున్నారు. ఇది సరసభక్తి. స్వామి యేమిచేసినా గోపికల కిష్టమే. నీవెంత టక్కరివంటే గచ్చకాయలతో మాయచేసి అన్ని పందేలూ నీవే గెలుస్తావు.

ఎందుకంటే నీవు దొరబైవేంకటాద్రి మీద మా అందరినీ కూడెదవు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ముద్దులొలికే విట్ఠలా! నీవు మొక్కలీడవయ్యా (కుటిలుడవయ్యా!) పండరంగిలో నెలకొన్న ఓ దేవా! ఇదేమి చిక్కు? నీవు మా పక్కల్లో దూరి వాయవు (మమ్మల్ని వదలిపెట్టవు). ఎప్పుడూ ఇదేగోల.

ఓ విట్ఠలా! మేము చిక్కనైన చల్లలమ్ముటకు మధురానగరం పోతుంటే నీవు మా పక్కన చేరి పొంకమైన స్తనగిరులను మాటిమాటికీ తాకుతావు. నీవెంత దొమ్మికాడవు (సందడిచేసేవాడు) అంటే యేదో ఒక నెపంతో కావాలనే మా పాదాలు తొక్కుతావు. నీవు మా పక్కన చేరి మామేను చెమరించునట్లు చేస్తావు. ఓ పండరంగి విట్ఠలా నిన్ను వారించుట దుస్సాధ్యము.

ఓ విట్ఠలా! నీవు మేటివి (నేర్పరివి). ఎందులో తెలుసా? మాబోటి గొల్లెతలతో, మేలములాడ (సరసములాడుటకు) ఎట్లా వస్తావోగాని దారిగాచి సరైన వేళకు వచ్చి పట్టుకొంటావు. ఓ గొంటు విట్ఠలా! (కుత్సితుడవైన విట్ఠలా) మేము పాలు కాస్తుంటే మా పాలన్నీ నేలపాలు చేస్తావు. నీకిది తగునా? ఈ పాలు అమ్ముకొనుటే మా జీవనభృతి కదా! పండరంగి విట్ఠలా!

ఓ విట్ఠలా! గచ్చకాయలాట ఆడుటలో నీకు నీవే సాటి. సొరిది (ఒక వరుసలో) గచ్చకాయలను చూపి నీకు కావలసిన పందెంవేసుకొని 'సరిబేసి' లనే ఆట ఆడెదవు. నీవెంత జాణవంటే, యెప్పుడూ నీకు కావలసిన 'పందెమే' పడుతుంది. అట్లా నాతో పందెంగెలిచి దొరబై (దొరవలె) శ్రీవేంకటాద్రిమీద నన్ను గూడితివి. ఓ పండరంగి విట్ఠలా! జగత్ప్రసిద్ధుడవై అటుపైన మావద్దనే వుంటివి.

పద్యవివరణ:

ఆ.వె॥ **మొక్కలీడువయ్య! ముద్దుల విట్ఠలా!**
పక్కవాయవెపుడు పండరంగి!
వేంకటాద్రిపైన వేడ్క గూడితివయ్య!
పరగ మాదుబోంట్ల వద్దనుండి.

సంఖ్య: XVIII/559 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎదుటనే వున్నది యింతి గదుబిన్నది

శ్రీరాగం

8 ఎదుటనే వున్నది యింతి గదుఁబిన్నది
ఇదివో మావిన్నపా లిచ్చగించవయ్యా ॥పల్లవి॥

సెలవుల నవ్వుగారీ చెక్కులఁ జెమట జారీ
నిలువెల్లా సిగ్గుదేరీ నెలఁతకు
పలుకులఁ దేనె లూరీ భావములోఁ దమి మీరీ
కలసి మెలసి యీకెఁ గాఁగిలించవయ్యా ॥ఎదు॥

కన్నుల వెరగుమించీ కళలు మోమునఁ బొంచీ
చన్నులపైఁబులకలు సారెకు ముంచీ
సన్నలు బొమ్మల వంచీ చవు లాసలనుఁ బెంచీ
మన్ననల నీకెను మరిగించవయ్యా ॥ఎదు॥

మోవి నమృతము చిందీ మూఁపునఁ దురుము చెందీ
సేవలుగా చెనకులు చేతికి నందీ
యీవేళ నలమేల్మంగ ఇన్నిటాను నిన్నుఁ బొందీ
శ్రీవేంకటేశ యీకెఁ జేకొంటివేలవయ్యా ॥ఎదు॥ **559**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీయెదుటనే వున్న ఈ యింతిని చూచినావా? ఈమె కదుపిన్నది (చాలా చిన్నవయసుగల జవరాలు). ఇదిగో స్వామి ఇటుచూచి మా విన్నపవములనాలకింపవయ్యా! ఈమె మోవి అమృతముల జాలువారుతుంది. ఆమె సిగలో కొప్పు కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నది. ఈవేళ యీ అలమేల్మంగను అన్నిటా గూడుమయ్యా! ఈమెను నీ సతిగా స్వీకరించావు. ఇక ఆమె బాధ్యత నీదే ప్రభూ! అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! అతిపిన్న వయసులోనున్న యీ యింతి నీ ఎదుటనేవున్నదయ్యా! ఇదివోమేము వినమ్రులమై చేయు మా విన్నపములను ఇచ్చగించవయ్యా! (అంగీకరించవయ్యా!)

స్వామీ! ఆమె పరిస్థితిని గమనించితివా? ఆమె లేత పెదవులపై చిరునవ్వు చెదరలేదు. అద్దములవంటి చెక్కిళ్ళనుండి చిరుచెమట కారిపోవుచున్నది. ఆ నెలతకు (భామినికి) యెక్కడ చూచినా నిలువెల్లా సిగ్గులు మొగ్గలు తొడుగుచున్నది. ఆమె పలుకులు దేనెలూరునట్లు మధురముగానున్నవి. ఆమె భావములో తమి (ఆపేక్ష) తొణికసలాడుచున్నది. ఇటువంటి చిన్నదానిని చింతకు గురిచేయవచ్చునా? ఇకనైనా కలసి మెలసి ఈమెను నీ కౌగిలిలో కరిగించవయ్యా!

దేవా! ఆమె కన్నులలో అంతులేని వెరగు (అచ్చెరవు) తొంగిచూస్తున్నది. చక్కటి ఆ వదనమున కళలు పొంచి చూస్తున్నాయి. నీ తలపులతో ఆమె చనుగవ పలుమారు పులకలతో వింతశోభలీనుచున్నది. ముడివడిన ఆమె కనుబొమలు యేదో సంకేతమును నీకందజేయుచున్నది. నీపై చవులు (ప్రీతి) కల ఆమె నీపై అనురాగము పెంచుకొన్నది. ఈకెను (ఈమెను) నీ మన్ననలతో మరగించవయ్యా! (ఆశలలో ముంచవయ్యా!)

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె పెదవులు అమృతము చిందించుచున్నవి. ఆమె తరుము (కేశబంధము) ఆమె మూపురమున స్థిరముగా నిలిచినది. ఆమెకు శృంగారసేవయనునట్లు నఖక్షతముల నందిమ్ము. ఈ వేళ అలమేల్మంగ త్రికరణశుద్ధిగా నిన్ను పొందినది ప్రభూ! ఈకెను (ఈమెను) చేపట్టిన నీవు ఆమెను యేలుకో దేవదేవా!

పద్యవివరణ:

కం॥ **ఎదుటనె వున్నది చిన్నది**
ఇదివో మా విన్నపాలనిక వినుమయ్యా!
అదె నీ అలమేల్మంగను
సదనంబునగూడుమయ్య! సప్తగిరీశా!

సంఖ్య: XVIII/558 రాగం : సామంతం
కీర్తన : చొక్కపునీపెండ్లి నేడె సుక్కురారము

సామంతం

9 చొక్కపునీపెండ్లి నేఁడె సుక్కురారము
అక్కరతో నిన్నియు నవధరించవయ్యా ॥పల్లవి॥

పడఁతిచెమటలే పన్నీటిజలకము
వెడగుముద్దమాటలు వేదమంత్రాలు
యెడయనియాకె పయ్యెదకొంగే తడియొత్తు
ఆడియాలపుమజ్జన మవధరించవయ్యా ॥చొక్క॥

తరుణిసెలవినవ్వు తగినకప్పురకాపు
తరమైనకనుచూపు తట్టుపుణుఁగు
విరులతావివూర్పులే విసరేటిచల్లగాలి
అరుదైనవుపచార మవధరించవయ్యా ॥చొక్క॥

అలమేలుమంగకాఁగి లంటుదామెరల పూజ
పొలివోనిమేనికాంతి భూషణములు
యెలమి శ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
అలవడె విభవము లవధరించవయ్యా ॥చొక్క॥ 558

ఉపోద్ఘాతము:

నేడు శుక్రవారము. శోభాయమానమైన మీపెండ్లి నేడే జరుగుచున్నది. మాకందరికీ ఇది గొప్ప వేడుక. నీవు బహుశ్రద్ధగా ఇవన్నియు అవధరింపుము స్వామీ అంటున్నారు అన్నమయ్య. అలమేల్మంగ కౌగిలి అంటుదామెరపూల పూజవలె నీకు అత్యంత ప్రియమైనది. తరగని ఆమె మేనికాంతి ఏ భూషణములకాంతితోటి సరిపోల్చలేనిది. ఓ శ్రీవేంకటేశ్వరా! మీరిద్దరు సమరతిగూడగా వైభవములన్నియు అలవడినవి, చిత్తగించుము స్వామీ! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

నేడు సుక్కురారము (శుక్రవారము). తిరుమలలో స్వామివారికీ, అమ్మవారికి చొక్కపు (దోష రహితమైన) పెండ్లి జరుగుతున్నది. ఇన్నియు (ఈ నీ కర్తవ్యములను) అక్కరతో (బహుశ్రద్ధగా) అవధరించవయ్యా (చిత్తగించవయ్యా!)

స్వామీ! జగదేకపతితో తన పెండ్లి జరుగుతున్నదని సంభ్రమంతో ఆ పడతి పన్నీటి పరిమలభరితమైన తన చెమటలలో స్నానమాడినట్లుంది. వెడగు (అమాయకమైన ఆమె ముద్దుమాటలే ఆ పెండ్లిలో వేదమంత్రములైనవి. అవిశ్రాంతముగా ఆమె తన పయ్యెదతో తన చెమటనొత్తుకొనుచున్నందున ఆ చిత్తడి మజ్జనమునకు (స్నానమునకు) గురుతుగానున్నది. ప్రభూ! ఈ మజ్జనము నవధరించవయ్యా!

ఆరోజుల్లో పెదవులతడి ఆరిపోకుండా కర్పూరముతో ఒక 'కాపు' లేతపూతవేసికొనేవారు. ఈమెకు (అలమేల్మంగకు) ఆ అవసరమే లేదు. తరమైన (స్థిరమైన) ఆమెకనుచూపులు, స్వామివారికి తట్టుపుణుగు (సుగంధద్రవ్యము) అద్దినట్లున్నది. సుగంధపరిమళభరిత పుష్పములపైనుండి వచ్చే చల్లని మధురమైన వాయువువలె ఆమె వూర్పుల (శ్వాస) పరిమళం అంతటా అల్లుకొనినది. అరుదైన ఆమె యీ వుపచారములనన్నీ స్వీకరించి ఆమెను అవధరించవయ్యా!

ప్రభూ! దేవి అలమేల్మంగ బిగికౌగిలి నీకు జంటతామెరపూవులతో పూజగావించినట్లున్నది. పొలివోని (యెన్నడూ తరుగని ఆమె శరీరద్యుతి అసంఖ్యాకమైన భూషణముల మిలమిలలా అన్నట్లున్నవి. నేడు ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడూఅలమేల్మంగ ఇద్దరూ కూడినారు.ఇక యెన్నియో విభవములు (వైభవములు) సిద్ధించినవి. అవధరించి మమ్ము తరింపజేయము తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **చొక్కపుపెండిలినేడే**
సుక్కురవారంబుమీకు శుభమగునయ్యా!
అక్కరతొఅవధరింపుము
చక్కని వేంకటవిభుండు సమరతి గూడున్.

సంఖ్య: XVIII/150 రాగం : సాళంగనాట
కీర్తన : ఇట్టినామోము చూచి యేమినవ్వేవు

సాళంగనాట

10 ఇట్టె నామోము చూచి యేమినవ్వేవు
చుట్టమవై వూరికెల్లాఁ జూపట్టినవాఁడవు ॥పల్లవి॥

ఆసపడేవారి నెంత అలయించేవు పెండ్లి –
సేసుకోరాదా యేల సిగ్గువడేవు
దోసముగా దెందరైనా దొడ్డిఁ బెట్టుకొనవచ్చు
బేసబెల్లిరేపల్లెఁ బెరిగినవాఁడవు ॥ఇట్టె॥

తోడనే మాటాడేవారిఁ దోయనేల సరసము–
లాడరాదా యేఁటికి నీవండుకాచేవు
వాడికగా వలపులవల్లెలు వేయఁగవచ్చు
కోడెల నావులఁ గాచేగొల్లమందవాఁడవు ॥ఇట్టె॥

ననిచి చుట్టాలై మొక్కినవారిఁ గాఁగలించు –
కొనరాదా మరియేమి గుట్టుసేసేవు
పెనఁగులాడఁగవచ్చు బెట్టుగా శ్రీవేంకటేశ
యెనసితి గోవర్ధనమెత్తినట్టివాఁడవు ॥ఇట్టె॥ 150

ఉపోద్ఘాతము:

ఓ కృష్ణా నీవు వూళ్లో అందరికీ చుట్టానివై కనుపిస్తావు. ఇప్పుడు నీపై ఆసపడనివారెవరు వుండరు నిజమే. అంతమాత్రాన నామొకముచూచి నీకు అంతనవ్వు యెందుకువస్తున్నదయ్యా? అంటున్నారు అన్నమయ్య. నీపై ఆశపడే వారినెందుకు అన్నివిధములుగా శ్రమపెడతావు? వారిని పెండ్లాడరాదా? నిన్ను కాదనేవారెవరున్నారు? నీవెంతమందినైనా రహస్యంగా పెళ్ళాడవచ్చును. నిన్ను కాదనగలజవ్వని యెవ్వరు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ గోపీకృష్ణా! నీతో ప్రతివారూ చుట్టరికం కలుపుకోవాలనే ఆలోచిస్తుంటారు. అందువలన నీకు వూరినిండా చుట్టాలే. అదంతా అటుంచి నా మోము (మొకము) చూచి ఇట్టే (తేలికగా) యెందుకు నవ్వుతున్నావు? ముందు ఆ సంగతి చెప్పు, స్వామీ!

కృష్ణా! నీవంటే ఆసపడేవారు చాలామంది వుండవచ్చును. వారినెందుకంత అలయించేవు. (శ్రమపెడుతున్నావయ్యా?) ఇంకా నీవు సిగ్గుపడెదవేల? నీవు వలచిన దానిని పెండ్లియాడరాదా? నీవు రేపల్లెలోనే పెరిగి, రేపో మాపో దీని ఏలిక అవబోతున్నావు. మరి ఇంకా నీకు బేసబెల్లి (సంగనాచివేషాలు) యెందుకయ్యా? దోసము గాదు. నీవెందరినైనా నీ దొడ్డిబెట్టవచ్చు (నీ స్వాధీనములో ఉంచుకోవచ్చును).

కృష్ణా! నీవంటే ఇష్టపడి, మాటలు కలిపి నీతో మాటలాడదలచిన ఆడదంటే నీకు లక్ష్యములేదు. ఒకింత వారితో సరసములాడరాదా? వారిని దోయగనేల (అలక్ష్యపెట్టుట యెందులకు?) పైగా మా రహస్యాలను కూపీలాగాలని చూస్తావు. నీకు ఇదేమిబుద్ధి? నీవు కోడెగిత్తలను,ఆవులను (పొగరుబోతువారినని సాధువర్తనలను) కాచే గొల్లవాడివి (పరబ్రహ్మవు). నీకు అడ్డుచెప్పేదెవరు? అందరికీ వలపుల వల్లెవాటు వేసేయవయ్యా!

ఓ గోవర్ధనధరా! కృష్ణా! మరియేమి గుట్టు సేసేవు? నీకు మొక్కినవారంతా చుట్టాలే (ఆప్తబంధువులే). ననిచి (చిగురించి లేక, పులకించి) వారంతా నీకు వశమైనవారే. ఆనాడు గోవర్ధనమెత్తి మా గోపికల ప్రాణములను కాపాడిన నాడే త్రికరణశుద్ధిగా గోపికలమందరమూ నీవారమైతిమి. నేడు ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మాతో యెంత పెనగులాడినా నిన్ను కాదనగలవారెవరు తండ్రీ!

పద్యవివరణ:

తే.గీ॥ **ఏమినవ్వేవు నామోము నిట్టెచూచి?**
ఊరికెల్లను చుట్టమై వుంటివయ్య!
నీవు గోవర్ధనమునెత్తి నిలిచినావు
నేడు వేంకటేశుడవయ్య! ఏడుగిరుల.

సంఖ్య: XXVI/298 రాగం : దేసాళం
కీర్తన : రట్టడి కడపరాయ డిట్టె వీడు

దేసాళం

11 రట్టడి కడపరాయఁ డిట్టెవీఁడు
గట్టిగా నేడిపుడు తగవుదేర్చరే ॥పల్లవి॥

చలము సాదించరాదు సముకానఁ గొంచరాదు
పలుమారు మాటలాడి పదరీ వీఁడు
మొలకచన్నులు నావి మొనలెత్తీఁదనమీఁద
చెలులూర మాకు బుద్ధిచెప్పఁగదరే ॥రట్ట॥

పందెములడువరాదు పంతము విడువరాదు
కందువలు చూసి పొత్తుగలసీ వీఁడు
అందపు నాచూపు లివి అంటుకొనీఁ దనమీద
చందపు మావలపులు చక్కఁబెట్టరే ॥రట్ట॥

తమక మాఁపఁగరాదు తాలిమి చూపఁగరాదు
అమర గూడె శ్రీవెంకటప్పఁడు వీఁడు
చెమటల నామేను చేఁతసేసీఁ దనమీఁద
జమళి మమ్మిద్దరిని సారె మెచ్చరే ॥రట్ట॥

ఉపోద్ఘాతము:

వీడు ఆగడాలమారియైన కడపరాయడు. గొప్పతగవులమారివాడు. నేడు యిప్పుడే మీరూ గట్టిగానే వుండండి అంటున్నారు, అన్నమయ్య. ఈతడు కలిగించు తన్మయత్వము ఆపుట దుస్సాధ్యము. పోనీ ధైర్యము చూపింతుమా అంటే అదీ కుదురుట లేదు. అప్పుడు నన్ను వేంకటేశుడు జంటగా గూడినాడు మమ్మిద్దరినీ బాగుగా మెచ్చరే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈ రట్టడి కడపరాయుడు (ఆగడాలమారి, దేవుడు గడప శ్రీవేంకటేశ్వరుడు) నేడు ఇపుడు ఇట్టే తగవుదీరే (గిల్లికజ్జాలకు సిద్ధమగుచున్నాడు). వీడు (ఈ స్వామి) వలె మీరూ గట్టిగానే (బెట్టుసరిగానే) వుండండమ్మా చెలులూ!

అయినా మీకు తగని పనులు కొన్ని వున్నాయి. వాటిని ఆలకించండి. చలము సాధించరాదు (మత్సరమును ప్రదర్శించరాదు). సముకాన గొంచరాదు (ప్రత్యక్షముగానే కించపరచరాదు). అలా చేస్తే ఈ కడపరాయనికి యెంత కోపము వస్తుందంటే రకరకములైన మాటలతో అనేకమార్లు నొప్పించుచునే వుంటాడు. నా మొలకచన్నులను వానికి మొనలు తాకునట్లు ఆనించినాము. చెలులారా! మాకు బుద్ధిచెప్పి యేమి ప్రయోజనం?

ఈ కడపరాయనితో యెన్నడూ పందెములడువవరాదు. (పందెము కట్టరాదు). అట్లని వీనితో పంతమువీడి వెంటనే రాజీకి రాకూడదు. ఎందుకంటే వీడు యేదో ఒక కందువలు చూపి (చమత్కారం చేసి) తను కోరుకొన్నవారిని పొందుతాడు. మనోహరమైన నా చూపులు ఈతనిపై అంటుకొనినవి. ఇక చందపు మావలపులు (న్యాయసమ్మతమైన మా వలపులను) చక్కబెట్టినాకు న్యాయం చేయండి.

ఈ కడపరాయుడే అల్లదే ఆ తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. ఈయనను జూచిన తమకము (తన్మయత్వము) నాపుకొనుట దుస్సాధ్యము. అట్లని తాలిమి (ధైర్యము) ప్రదర్శింతనా అంటే అదీ సాధ్యమగుటలేదు. నా మేను విపరీతముగా స్వేదించుచున్నది. జమళి (జంటగా) కూడిన మమ్మిద్దరినీ సారె (చక్కగా) మెచ్చరే (కీర్తింపుడు).

పద్యవివరణ:

కం॥ **రట్టడిగ కడపరాయడ**
ఇట్టే తీర్చేవుతగవు ఇంతుల నడుమన్
గట్టిగ పంతములాడుట
యెట్టవునుర వేంకటేశ యేలికకైనన్?

సంఖ్య: XXVII/3 రాగం : సాళంగనాట
కీర్తన : ఔభళేశ వోగునూతులౌభళేశ

సాళంగనాట

12 ఔభళేశ వోఁగునూతులౌభళేశ
శోభనము నీకు నాకు జోడుగూడెఁగాదా ॥పల్లవి॥

వున్నతి గిరు లెక్కితి వోఁగునూఁతులౌభళేశ
యెన్నిక నాకుచగిరు లెక్కరాదా
యెన్నఁగ నిట్టూరుపులతో యేఁటికైనా నలసేవు
అన్నిటా నారతులలో నలయరాదా ॥ఔభ॥

ఆకసము మోవ రూప మందితి వందరిలోన
ఆకసము నానడుము నంటరాదా
పైకొని వెన్నెలలోనఁ బతి గాఁగ నవ్వేవు
మేకొని నాసరసాన మించి నవ్వరాదా ॥ఔభ॥

తెరచి నోరు ముయ్యవు తియ్యని ఆసలతోడ
సారిది నామోని చవిచూడరాదా
అరిది శ్రీవేంకటాద్రి నటు గూడి నేఁడీడ
నరసింహరూపమైతి నాటకము గాదా ॥ఔభ॥ **3**

ఉపోద్ఘాతము:

అహోబల శ్రీనరసింహునిపై జానపదుల శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. జానపదులు అహోబలేశ్వరుని ఔభళేశుడు అంటారు. ఆక్షేత్రం వెలసిన ప్రదేశంపేరు ఓగునూతుల, ఓగునూతులుఅంటే కీడు కలిగించే నూతులున్న ప్రదేశం అని అర్థం. అక్కడ తొమ్మిదిరూపాలలో నరసింహుడు వెలిశాడు. నేటి కర్నూలు జిల్లాలో గొప్ప పుణ్యక్షేత్రం అది. చదివినకొద్దీ మాధుర్యం తెలిసే కీర్తన ఇది.

తాత్పర్య వివరణ:

ఔభళేశా! ఓగునూతులలో భక్త జనోద్ధరణకై వెలసిన ఔభళేశా! నేడు నీకు నాకు శోభనము యేర్పాటు చేయబడినది. మనిద్దరిదీ యెంత చక్కటి జోడీయో (జంటయో) యేమి చెప్పమంటావు?

ఔభళేశా! నీవు ఓగునూతులలో ఉన్నతమైన గిరులనెక్కి కూర్చున్నావు. దానికి బదులు సమున్నతమైన నా కుచగిరులనధిరోహించరాదా? (అహోబలనృసింహుడు నిట్టూర్పులువదిలిపెడుతుంటాడని ప్రతీతి). దీర్ఘమైన నిట్టూర్పులువిడచుచు,యేటికైనా (యెందులకు) అలసేవు. ఆ అలసిపోయేదేదో నాతో రతులు సాగించి అలిసిపోరాదా?

ఔభళేశా! నీవెంత యెత్తుకి యెదిగినావంటే ఆకాశమునే నీవు మోస్తున్నావా అన్న భ్రమ కలుగుతున్నది. కనీసం అప్పుడన్నా నీకు ఆకాశమువలె శూన్యమైన నానడుము గుర్తుకు రాలేదా? అట్టి నానడుమును ఒక్కసారి తాకరాదటయ్యా? వెన్నెలలోనన్నాక్రమించి నేను నీ మగడిని అన్నట్లు నవ్వుతావు. నా సరసములతో మేకొని (సమ్మతించి) అలాగే యెప్పుడూ నవ్వుతూ వుండరాదా స్వామీ?

ఔభళేశా! నీవు సింహస్వరూపుడవు. తెరచిన నీ నోటిని మూయవు. తీపి తీపి ఆశలతో నెమ్మదిగా నా మధురాధరమును రుచి చూడరాదా? అరుదైన శ్రీవేంకటాద్రిమీద కూడా నీవే నెలకొనివున్నావు. నేడు ఇక్కడ నరసింహరూపముతో ఈడవున్నావు. ఇదంతా నాటకము కాక ఇంకేమిటి ప్రభూ!

పద్యవివరణ:

ఆ.వె॥ **ఓగినూతులందు ఒగి ఔభలేశుడా!**
శోభనంబు మనకు జోడు కుదిరె
వేంకటాద్రి దొరవు వింతసింగము రూప
నాటకంబుగాదె ఆటకాదె?

సంఖ్య: XXVII/277 రాగం : దేసాళం
కీర్తన : విరులదండలతోడి విట్ఠలేశా నీవు

దేసాళం

13 విరులదండలతోడి విట్ఠలేశా| నీవు
యెరవులేనివాఁడవు యెపుడు విట్ఠలేశా ॥పల్లవి॥

విచ్చేయు మా ఇంటికి విట్ఠలేశా| నీకు
విచ్చనవిడాయ నిది విట్ఠలేశా
విచ్చి చెప్పే నిటు నీకు విట్ఠలేశా| నాకు-
నిచ్చినబాసదప్పకు మిఁక విట్ఠలేశా ॥విరు॥

వీడె మియ్యఁగదవోయి విట్ఠలేశా| కడు-
వేడుకకాఁడవు నీవు విట్ఠలేశా
వీడుజోడాయ వలపు విట్ఠలేశా
పాడిఁ బంతాలెల్లఁ జెల్లె బాపు విట్ఠలేశా ॥విరు॥

విడిచేవు పోఁకముడి విట్ఠలేశా| యెంత
వెడమాయకాఁడవయ్య విట్ఠలేశా
కడఁగి శ్రీవేంకటాద్రిఁ గలసితివి
అడియాలముగ నన్ననౌర విట్ఠలేశా ॥విరు॥ **277**

ఉపోద్ఘాతము:

పూలదండలతో అలంకరించుకొన్న విట్ఠలేశ్వరా! నీవు యెపుడు భేదభావము లేనివాడివయ్య! అంటున్నారు అన్నమయ్య. ఓ విట్ఠలేశ్వరా! నీకేముంది అడ్డు? విచ్చలవిడితనము నీ ప్రత్యేకత. నిన్ను కాదనేవారు లేరు మరికనేమి? మా ఇంటికి విచ్చేసి యధేచ్ఛగావుండి, పూనుకొని శ్రీవేంకటాద్రిమీద నన్ను కూడితివి. ఔరా! అదే రసికతకు తిరుగులేని గురుతు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓవిట్ఠలేశా! నీవు చక్కటి విరులదండలతోడ (పూలదండలతో) శోభిల్లుతున్నావయ్యా! ఓదేవదేవా! నీవు యెప్పుడూ, యెరవులేని వాడివే (నీవారు పెరవారు అను భేదభావము లేని జనార్దనుడవు).

ఓవిట్ఠలేశ్వరా! మేము హృదయపూర్వకంగా నిన్ను ఆహ్వానిస్తున్నాము. దయచేసి మాఇంటికి విచ్చేయవయ్యా? నీకు అడ్డుచెప్పగలవారెవరు? విచ్చన విడాయె (విచ్చలవిడితనమంతా నీదే). మరి ఇంక ఆలోచించకు. నీకు ఇదివరకే, ఇటువిచ్చి చెప్పెను. (ఇదంతా వివరించి చెప్పాను). నాకు నీవిచ్చిన బాసలు (వాగ్దానములు) తప్పుతావా స్వామీ! వద్దు నీమాట నిలబెట్టుకో.

ఓ విట్ఠలేశ్వరా! నన్ను స్వీకరించినందుకు గుర్తుగా నాకు వీడెమియ్యగదవోయి (తాంబూలము నా నోటికందించు). నీవు సహజంగానే కడు వేడుకకాడవు (గొప్ప విలాస పురుషుడవు). ఓ విట్ఠలేశ్వరా! మన వలపు వీడూ జోడాయె (సరికాని జంట మధ్య ప్రణయం అంకురించడం వల్ల అది పరిమళించదు). ఇక నీకేది న్యాయమనిపిస్తే అలా చేసి నీ పంతాలెల్లా నెగ్గించుకో. నిన్ను కాదనేదెవరయ్యా?

ఓ విట్ఠలేశ్వరా! చూస్తుండంగానే మా చీరెలకు మేము బిగించుకొన్న పోకముడిని వదులు చేస్తావు. నీవు యెంత వెడమాయకాడవయ్యా? (వికృతచేష్టలు గల మాయదారివాడవయ్యా) ఔరా! నన్ను శ్రీవేంకటాద్రి మీద కలసితివి. ఆపైన అడియాలముగ (తిరుగులేని గురుతుగా) నన్నాదరించితివి.

పద్యవివరణ:

తే.గీ॥ **విరులదండలతోనున్న విట్ఠలేశ!**
యెరవులేనివాడవు నీవు యెపుడు గాని
కడగి శ్రీవేంకటాద్రిపై గలసినావు
నన్ను అడియాలముగ నౌరచెన్ను విఠల

సంఖ్య: XXVII/17 రాగం : ఆహిరి
కీర్తన : ఇంకనైన గరుణించవేమయ్య

ఆహిరి

14 ఇంకనైనఁ గరుణించవేమయ్య శ్రీ-
వేంకటేశ మా ఇంటికి విచ్చేయవయ్యా ॥పల్లవి॥

చింతాజలధి దాఁటఁ జెక్కు చేయి తేపసేసి
కాంత నీ కెదురుచూచీఁ గదవయ్యా
కొంతపుఁ గోరికలనే కొండవాఁకఁ దనజడ
ఇంతలో నిచ్చెనసేసీ నిది చూడవయ్యా ॥ఇంక॥

వెడ చింతచీఁకటికి వెలుగుగా నిట్టచూపు
కడఁగి పంజువట్టె రాఁగదవయ్య
అదరి తమకమనేఅడవి దాఁట నిట్టూర్పు
యెడ గుఱ్ఱముగఁ జేసి యెక్కె నిదె కోవయ్యా ॥ఇంక॥

మదనానలం బార్చ మంతనానఁ జెమటల-
నదులు వరపి నిన్ను నవ్వెనయ్య
యిదివో శ్రీవేంకటేశ యింతలోఁ గూడఁగ నిన్ను
మదిరాక్షి నీపొందు మరువలేదయ్యా ॥ఇంక॥ **17**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకనైనా నన్ను అనుగ్రహించవేమయ్యా? మా ఇంటికి విచ్చేయవయ్యా! నన్ను కృపజూడవయ్యా! అని విన్నపంతో వేడుకొంటున్నారు అన్నమయ్య. స్వామీ! నీ దేవిని చింత అనే జలధిలో ముంచి యెన్నడు బయటపడనీయవు. కోరికల నిచ్చెనలను యెక్కించేదీ నీవే చటుక్కున దించేదీ నీవే. ఈ చింత అనే చిమ్మ చీకటిలోంచి ఆమె బయటకు రాలేకపోతున్నది.

ఆమెను బయటపడేయవయ్యా! ఆమె మదనాగ్నిని నివారించటానికి నీ చెమటల చిత్తడితో ఆర్పి మురిసి పోతున్నావు. ఆమెకు దిక్కు చూపవయ్యా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఇంకమీదటైనా కరుణించవేమయ్యా? దయచేసి మా ఇంటికి విచ్చేయవయ్యా!

ఒక్కసారి నీ విరహమనే చింతాజలధిని దాటటానికి ఆదేవి తన చెక్కిలిపై చేర్చిన చేతినే తెప్పగా చేసినదయ్యా! ఆమె 'జడ' ఆమెను కల్లోలపరచుచున్న కోరికలనే పర్వతఝరిపై నిచ్చెనవలె సేసి, కాస్త నీ దృష్టిలో వుంచుకోవయ్యా!

ఆమె వెడ (తుచ్ఛమైన) చింత అనే చీకటికి వెలుగువలె నిట్టచూపు చక్కటి దివిటీ చేపట్టి ఆమెకు సాయము రారాదుటయ్యా? పాపం ఏమిచేయాలో తోచక ఆమె తమకము అనే అడవిని దాటటానికి తన సుదీర్ఘమైన నిట్టూర్పనే ఒక అశ్వమును చేసినది. ఎట్లాగో యెక్కి పయనిస్తున్నది. ఇదే ఆమెను యేలుకోవయ్యా!

స్వామీ నీకు తెలియందేముంది? నీ విరహమనే అనలమున (అగ్నిలలో) బడి ఆమె సతమతమగుచున్నది. మంతనాన (సమయస్ఫూర్తితో) దాన్ని ఆర్పుటకు తన చెమటలనే నదుల సహకారము ఆమె తీసికొనుచున్నది. అట్లు చేసి నేను జయించాను సుమా! అన్నట్లు చిరునవ్వు నవ్వుచున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మాత్రం తక్కువవాడివా? ఆమెను మనస్సు పులకరించునట్లు కూడితివి. ఇక ఆ మధిరాక్షి (మదము కప్పిన కన్నులుగల స్త్రీ) నీ పొందు యెన్నడూ మరువలేదయ్యా.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇంకనైన బ్రోచి ఇంటికి విచ్చేయి**
వేంకటేశ! నీకు విన్నపమిదె
ఎన్నగలుగునీవు ఇంతలోనే కూడ
మదిరనయన పొందు మరువలేవు.

సంఖ్య: XXVII/36 రాగం : రామక్రియ
కీర్తన : రాతి బతిమసేసిన రామచంద్ర

రామక్రియ

15 రాతిఁ బతిమసేసినరామచంద్ర నీ-
చేతిలోనిదాన నింతే శ్రీరామచంద్ర ॥పల్లవి॥

వట్టిరట్టు సేయ కిఁక వద్దు రామచంద్ర
నెట్టన నే దూరనోప నిను రామచంద్ర
వొట్టితిఁ బ్రేమము నీపై వో రామచంద్ర మమ్ము
వట్టిజాలిఁ బెట్ట కిఁక వద్దు రామచంద్ర ॥రాతిఁ॥

విన్నపాలు వేయునేల విను రామచంద్ర నా-
కన్నులకు నీవె గురి ఘనరామచంద్ర
యెన్నిక నన్నుఁ బాయకు మిఁక రామచంద్ర
నిన్ను నన్ను నెంచుకొమ్మీ నీవు రామచంద్ర ॥రాతిఁ॥

ఆయము లంటితివి నెయ్యపురామచంద్ర వొక్క-
పాయమే ఇద్దరికిని బలురామచంద్ర
ఆయెడ వావిలిపాటి హరిరామచంద్ర
చేయార శ్రీవేంకటాద్రిఁ జెందితి రామచంద్ర ॥రాతిఁ॥ **36**

ఉపోద్ఘాతము:

రాతినే ప్రతిమవంటి స్త్రీమూర్తినిచేసిన ఓ శ్రీరామచంద్ర నేను నీ చేతిలోని దాననింతే నయ్యా! శ్రీరామచంద్రా అంటున్నారు అన్నమయ్య, తాను సీతాదేవిగా భావించుకొంటూ కలిగిన భావావేశంలో. వావిలిపాటి వీరరాఘవునిపై చెప్పిన కీర్తన ఇది. అన్నమయ్య ప్రత్యేకత అది. సీతాదేవి రాఘవునితో సంభాషించడం నిజంగా ఒక ప్రత్యేకతే.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీరామచంద్రా! రాతిని నీ పదస్పర్శతో ప్రతిమవంటి స్త్రీ మూర్తిని చేసినావు. నేను సీతను. నీ చేతిలోని దానను (వశవర్తనురాలను). ఇంతే ప్రభూ! రామచంద్రా! నన్నూ కరుణించుము.

ఓ శ్రీరామచంద్రా! వట్టిరట్టు (నిష్ప్రయోజనమైన ఆగడము) జేయవద్దు. నిన్ను నేను నెట్టన (అనివార్యముగా) నిందించగలనా? ఓ రామచంద్రప్రభూ! నా ప్రేమనంతా నీపై ఒట్టితిని (ఉంచితిని). ప్రభూ! నాపై వట్టిజాలి (నిష్ప్రయోజనమైన సానుభూతి) పెట్టకిక (ప్రదర్శించవలదు). అయినా నీవు కోసలేంద్రుడవు. ప్రజావాక్యమే నీకు శిరోధార్యము. మాబోటి వారి మనోవేదన నిన్నేల బాధించవలె.

ఓ శ్రీరామచంద్రా! నీవు పరమాత్మ మానవ రూపంలో అవతరించినవాడవు. ఇది వినవయ్యా! నీకు వేయి విన్నపములను చేసికొనవలెనా? ఘనుడవైన ఓ రామచంద్రా! నా కన్నులకు నీవే గురివి (లక్ష్యానివి). నేను అన్యములను కన్నెత్తి చూడను. ఇప్పటివరకు అయినదేదో అయినది. ఇకనైనా యెన్నికతో నన్ను మన్నించి నాతోడు విడనాడకుము. నిన్ను నన్ను యెంచబడిన జంటవలె నాకు కీర్తిననుగ్రహింపుము.

ఓ శ్రీరామచంద్రా! నెయ్యపు (ప్రేమాస్పదమైన భావనలతో) నీవు నా ఆయములంటితివి (మర్మములను తాకితివి). బలిష్ఠుడవైన రామచంద్రా! ఇద్దరమూ ప్రాయములోనే వున్న ప్రేమికులము. అక్కడ వావిలిపాడులో వెలసిన శ్రీహరివి వీరరాఘవుడవూ నీవే. చేయార (మా చేతిలోనున్న) శ్రీవేంకటాద్రికి చెందిన రామచంద్రుడవు నీవే.

పద్యవివరణ:

కం॥ **రాతిఁబతిమ సేసిననీ-**
చేతిని వున్నట్టిదాన శ్రీరామప్రభో!
ప్రీతిగవావిలిపాటిలొ
సీతాపతి, వేంకటేశ! సిరిపతివయ్యా!

సంఖ్య: XXVII/152 రాగం : బౌళి
కీర్తన : బాపు బాపు కృష్ణా బాలకృష్ణా

బౌళి

16 బాపు బాపు కృష్ణా బాలకృష్ణా
బాపురే నీ ప్రతాప భాగ్యము లివివో ॥**పల్లవి**॥

బాలుఁడవై రేపల్లెఁ బాలు నీ వారగించఁగ
పాల జలనిధి యెంత భయపడెనో
ఆలించి తొదలుమాట లాడనేరుచుకొనఁగ
యీలీల ననురసతు లెంత భ్రమసిరో ॥**బాపు**॥

తప్పటడుగులు నీవు ధరమీఁదఁ బెట్టఁగాను
తప్పక బలీంద్రుఁ డేమి దలఁచినాఁడో
అప్పుడే దాఁగిలిముచ్చు లందరితో నాడఁగాను
చెప్పేటివేదాలు నిన్నుఁ జేరి యెంత నగునో ॥**బాపు**॥

సందడి గోపికల చంకలెక్కి వున్ననాఁడు
చెంది నీ వురము మీఁది శ్రీసతి యేమనెనో
విందుగ శ్రీవేంకటాద్రి విభుఁడవై యున్న నేఁడు
కందువైన దేవతలఘనత యెట్టుండునో ॥**బాపు**॥ **152**

ఉపోద్ఘాతము:

అన్నమయ్యనోటినుండి ఇంత అపురూపమైన కీర్త యెలావచ్చిందంటారు? "పలికెడిది విష్ణుకీర్తన, పలికించెడివాడు గిరులవల్లభుడట ఆ, తలపే రాదట ఒరులకు, కలరే అన్నయ్య సాటి కవులీజగతిన్"? ఎంత చక్కటి కందపద్యం వచ్చేసిందో చూడండి. దీని తాత్పర్యవివరణ చదివి మీరు పులకించకపోతే "బాపుబాపు కృష్ణ బాలకృష్ణా" అనటం తప్ప నేనేం చేయగలను? అన్నట్లు, "బాపు" అంటే "భళీ"! అని అర్థం.

తాత్పర్య వివరణ:

బాపు బాపు (భళి భళీ!) కృష్ణా! ఓ బాలకృష్ణా! బాపురే (అమ్మయ్యో!) నీప్రతాపము యొక్క భాగ్యమును వివరించే రమ్యమైన వుదాహరణలివివో (ఇవిగో) ఆలకించుతండ్రీ!

బాలుడవై (పసిపాపడివై) రేపల్లెలో నీవు పాలుత్రాగేరోజుల్లో, నీవు పాలుతాగే వేగము, పాలంటే నీకున్నఇష్టము చూచి బహుశా నీవు శ్రీమన్నారాయణుడవై తిరిగివచ్చినప్పుడు ఆపాలజలనిధిలో ఒక చుక్కఅయినా వుండదేమోనని క్షీరసాగరము యెంత భయపడెనో కదా! కొంచెము పెద్దవాడివి అయ్యాక నీవు తొదలు మాటలాడ నేర్చితివి, (మాటలు రాని పాపాయిలు తొస్సి మాటలు మాట్లాడతారు). వాటని ఆలించి (విని) కంసుడివద్దనుండే రాక్షస స్త్రీలు వీడు మా అసురుల పాపాయే అని భ్రమపడి నీలీలకు భ్రమసిరయ్యా!

ప్రభూ! బుల్లిబుల్లి పాదాలతో నీవు తప్పటడుగులు, భూమిపై వేస్తుంటే బలిచక్రవర్తి రసాతలమునుంచి దాన్ని చూచి యేమితలచినాడో? అయ్యో! ఈ బుల్లి అడుగులే మూడడుగులు ఆనాడు నేను దానం ఇచ్చివుంటే పృథ్వినే పరిపాలించేవాడిని కదా! అనుకొనివుంటాడు. కొంచెము పెద్దయ్యాక అందరితో దాగిలిముచ్చులు (దాగుడుమూతలు) ఆడుతుంటే, నీవు దొంగవై దాక్కుంటుంటే, వేదములన్నీ పకపకా నవ్వుకొన్నాయి. వేదరక్షకుడు జగన్నాథుడూదొంగా మరి ఇక సృష్టిలో దొరయెవరు?

స్వామీ! రేపల్లె గోపికలంతా తమ చంకల్లో నిన్నెత్తుకొని తిరుగుతుంటే నీ వురముపైనున్న శ్రీదేవి నిన్ను వాళ్ళు పడవేస్తే తనగతియేమిటని యెన్ని మాటలన్నదో నిన్ను? నేడు విందుగా శ్రీవేంకటాద్రి విభుడవై యున్నావు. మరి ఇతర దేవతలని కొలిచేవారెవరు? కందువైన (మలినమైన) తమ ఘనత యెట్లుండునో అని ఒకటే బెంగపడివుంటారు.

పద్యవివరణ:

ఆ.వె॥ **బాపు బాపు కృష్ణ! బాలకృష్ణా! నీదు**
బాపురే! ప్రతాప భాగ్యములివి
వేంకటాద్రి విభుడు విందుగనున్నాడు
కందువైన సురులఘనతయెటులొ?

సంఖ్య: XXVII/76 రాగం : సాళంగనాట
కీర్తన : తాపసులడవి యేడ తరుణి యేడ

సాళంగనాట

17. తాపసులడవి యేడ తరుణి యేడ
బాపుబాపు రామచంద్రభావించి చూడుమా ॥పల్లవి॥

సీతఁ బాసిబంగారు సీతఁ బెండ్లియాడితివి
ఆతలఁ బరస్త్రీల నంట వందురు
చేతులార ముత్తేలసేస వెట్టె నీకు అ-
చేతనుఁజెక్కుమోఁపి చింతించే కొరకా ॥తాప॥

వెంటనే భూమిజఁ బాసి వేరేభూమి చేకొంటి
జంటనే సత్యముగలజాణ వందురు
వింటివంక నీకు నాకె వేడుకఁ జేరి మరు-
వింటిబారిఁబడి యొంటి వేఁగేటికొరకా ॥తాప॥

కొడుకులవంకఁ బెండ్లికొడుకవైజానకి-
నడరి కమ్మరఁ బెండ్లియాడితివి
తొడరి శ్రీవేంకటాద్రిఁ దోడనె వావిలిపాట
కడఁగి రాముఁడవై కరుణించే కారకా ॥తాప॥ 76

ఉపోద్ఘాతము:

ఓ శ్రీరామచంద్రా! తపస్సు చేసికొనే వారు ఉండవలసిన అడవి యెక్కడ? ఎండకన్నెరగని సుకుమారమైనతరుణి జానకి యెక్కడ? భళిభళీ! ఓ రామచంద్రా! నీవే భావించి చూడవయ్యా! అంటున్నారు అన్నమయ్య. అసలు సీతను విడనాడి బంగారు సీతను చేపట్టావు, మరువింటి బారిబడి ఒంటరిగా వేసారినావు. నీ ధర్మదీక్ష నిరుపమానమయ్యా! నీవు ఏకపత్నీవ్రతుడవైనా మాకోసంవావిలిపాటిలో యెన్నో పెండ్లిండ్లు చేసికొన్నావు. అదే నీకు వేంకటాద్రిపై నిత్యకళ్యాణం పచ్చతోరణం అయింది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

బాపుబాపు (భళి భళీ!) శ్రీరామచంద్రా! తాపసులడవియేడ (తపస్సు చేసుకొనే మునీశ్వరులుండవలసిన అడవి (అరణ్యము యెక్కడ) తరుణియేడ (ఎండ కన్నెరగని సీతాదేవి యెక్కడ)? భావించి చూడుమా! (ఒక్కసారి ఆలోచించి చూడవయ్యా! మహానుభావా!

ఏకపత్నీవ్రతుడవు అయినా నిన్నువిధి వదలలేదు. రాజ్యాభిషిక్తుడవై రజకునిమాటకు వెఱచి సీతను బాసినావు. ప్రజలకోసం అశ్వమేధయాగం చేసి బంగారు శిల్పరూపి సీతను పెండ్లియాడితివి. అందుకనే పరస్త్రీని తాకవనే ఖ్యాతి నీకు వచ్చింది. ఆమెపై ఏ చేతులతో ముత్యాల తలంబ్రాలు చల్లావో నేడు ఆ చేతులనే నీ చెక్కిళ్ళకానించుకొని చింతిస్తున్నావు. అందుకేనా శివధనస్సువిరిచి ఆమెను చేపట్టినది? బాపు బాపురఘునాథా!

దేవా! భూమిజ (సీత)ను బాసి భూవల్లభుడవు (చక్రవర్తి) అయితివి. అయినా నిన్ను సత్యవాక్య పరిపాలకుడవనే కీర్తించారు. రాజులు భోగులు, అసత్యం వారికి వెన్నతో పెట్టిన విద్య అంటారు. కానీ నీకు సత్యమే యెన్నడూ వీడని జంట. నీవు నిత్య కోదండ దీక్షాదక్షుడవు. అట్టి నీకు ఆకె (ఆమె... సీత) వేడుకగా తోడై సుఖించాలనుకొన్నది. ఆమెకు దక్కిన సుఖమేమిటి రావణుని చెరలో మరువిలుకాని బాధను ఒంటరిగా సైచి యెంతకుమిలిపోయింది? ఇందుకేనా ఆమె నీ మెడలో వరమాల వేసినది?

ఓ శ్రీరామచంద్రా! కొడుకులకు పెండ్లి చేయవలసిన వాడివి మా అమ్మ జానకమ్మను మళ్ళీమళ్ళీ పెళ్ళాడుతున్నావు. ఇదెక్కడి వింత ప్రభూ! అడరి కమ్మర బెండ్లియాడ (అతిశయముతో తిరిగి మళ్ళీ పెళ్ళాడుతున్న నిన్ను చూచి, వావిలిపాటి వీరరాఘవుడవైన నీవు శ్రీవేంకటేశ్వరుడవైనందువల్ల ఇన్ని పెళ్ళిళ్ళు చేసికొంటున్నావు. ఇది మమ్మల్ని కరుణించేకొరకు కాక నీకే కోరికవుంటుందయ్యా?

పద్యవివరణ:

ఉ॥ **తాపసులుండుకారడవి తానదియెక్కడ తన్వి యేడనో**
కాపురముండ వచ్చినది కర్కశ దానవ చిత్రకూటమా
బాపుభళారె! రాఘవుడ భావన సుంతయుజేయవైతివే
తోపెను వేంకటేశ్వరుడె తోయజనేత్రుడు రామచంద్రుడున్

సంఖ్య: XXVII/276 రాగం : మాళవి
కీర్తన : వాడు గదె ప్రహ్లాదవరదుడు

మాళవి

18 వాఁడు గదె ప్రహ్లాదవరదుఁడు
నాఁడాడినమాటలకు నవ్వీని చూడరే ॥పల్లవి॥

పంతములెల్లాఁ జెల్లించె ప్రహ్లాదవరదుఁడు
వంతుకెక్కించెఁ బ్రహ్లాదవరదుఁడు
బంతి విడేలు వెట్టెను ప్రహ్లాదవరదుఁడు
ఇంతటి నారమణుని నేమని చెప్పుదునే ॥వాఁడు॥

బలిమిఁ జన్ను లంటె నీ ప్రహ్లాదవరదుఁడు
వలపు నించెఁ బ్రహ్లాదవరదుఁడు
పలుకుఁబంత మీదేర్చెఁ బ్రహ్లాదవరదుఁడు
అలరించె నిన్నిటా నేమని పొగడుదునే ॥వాఁడు॥

పన్నుగ శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదుఁడు
వన్నెగాఁ గూడెఁ బ్రహ్లాదవరదుఁడు
పన్నినమాయ దెలిపె ప్రహ్లాదవరదుఁడు
యిన్నిటా నీతనిసుద్దు లెన్నెని నే మెత్తునే ॥వాఁడు॥ **276**

ఉపోద్ఘాతము:

ప్రహ్లాదవరదుడైన నరసింహునిపై కనీ, వినీ, యెరుగని శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. నాడు ఆడిన మాటలకు (తన దేవిని వురముపై పెట్టుకొంటాను,... యెన్నడూ విడువను వంటి అనేక వాగ్దానాలను గుర్తుకు తెచ్చుకొని, నవ్వీని చూడరే అంటున్నారు.

ఆయన పంతములెల్లా జెల్లించుకొని తన మాట నెగ్గించుకొంటాడట. బలవంతంగా శ్రీలక్ష్మి వురోజాలను స్పృశిస్తాడట. అన్ని రకాలుగాను అలరించగల ఆ స్వామిని యేమని పొగడాలే... అంటున్నారు. ఈ

వేంకటాద్రి ప్రహ్లాదవరదుడు పన్నిన మాయలు యెన్నని చెప్పము? యేమని చెప్పము అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అమ్మలారా! ప్రహ్లాదవరదుడంటే వాడేగదే. శ్రీలక్ష్మిని సతిగా స్వీకరించినవాడు ఆమెస్థానం తనఉరముపైన అని నాడుఆడిన మాటలు, నేటి ఈ భీకరావతారంతో యెలా పోల్చనా! అని "నవ్వీని" (నవ్వుకొంటున్నాడు) చూడరే (చూడండమ్మా!)

ఈయనేమీ సామాన్యుడనుకొంటున్నారా? ఈయన పంతములెల్లా జెల్లించుకొని (హిరణ్యకశిపుడి షరతులన్నింటినీ నెరవేర్చి, వానిని చంపి) ప్రహ్లాదవరదుడై అనుగ్రహించినాడు. ఆ ప్రహ్లాదుని వంతుకెక్కించినాడు (అతనిని తన భక్త శిఖామణిని చేసినాడు). బంతి విడేలువెట్టె (వీరు వారని గాక) తన ఆశ్రితులందరికీ ఒకే వరుసలో తాంబూలమునిచ్చాడు. ఓ అమ్మలారా! ఇంతటి వుద్దండుడైన నా రమణుని (నా నాథుని) యేమని చెప్పెదనే?

అమ్మలారా! అతి గోప్యమైన మాటను చెబుతాను ఆలకించండి. ఏదో మిషతో ఈయన బలవంతాన నా వురోజములను స్పృసిస్తాడు. ఆపైన నా హృదయంనిండా వలపుల అలజడి కలిగిస్తాడు. పలుకు పంతము తను అన్నట్టి మాటను పంతముగా తీసికొని తన పట్టుదల ఈడేర్చుకొన్నాడు. అటు శత్రు సంహారములోనూ, ఆశ్రిత రక్షణలోనూ, తన హృదయేశ్వరిని రంజింప చేయటంలోనూ అలరినాడు. ఈ స్వామిని యేమని పొగడనే

నేడు పన్నుగ (ఒక ఆశయముతో) శ్రీవేంకటాద్రిపై ప్రహ్లాదవరదుడైనాడు. నన్ను అనుగ్రహించి, వన్నెగా (శోభాయమానంగా) కూడినాడు. తాను పన్నిన మాయను తన భక్తులకు తెలిపి అనుగ్రహిస్తాడు. ఈ విధముగా ఈతని సుద్దులు (లీలలు) యెన్నని నేను మెచ్చుకోనమ్మా?

పద్యవివరణ:

తే.గీ॥ **వాడు ప్రహ్లాదవరదుడు పకపకమనె**
నాడు నేనాడుమాటకు చూడరమ్మ!
వన్నెగా గూడెనే నన్ను పన్నిమాయ
వేంకటాద్రిపై ఆ సుద్ది పేరుకొనరె!

సంఖ్య: XXVIII/65 రాగం : హిందోళం
కీర్తన : ఎంత మోహమోగాని ఇతడు నీమీదను

హిందోళం

19 ఎంత మోహమోగాని ఇతడు నీమీదను
సంతతము బాయకిటు సరుసనున్నాడు ॥పల్లవి॥

పలుకవేపతితోడ పగడ వాతెర దెరచి
చిలుకవే సెలవులను చిరునవ్వులు
మొలక సిగ్గులివేల మోనంబులింకనేల
కలయికకు వచ్చి ఇదె కాచుకొన్నాడు ॥ఎంత॥

కనుగొనవె వొకమాటు కలువకన్నులనితని
పెనగవే కరములను ప్రియము చల్లి
పొనిగేటి తమక మేల పొసగిగుట్టిక నేల
నినుగదియువేడుకను నిలుచున్నవాడు ॥ఎంత॥

కొసరవే యీవేళ కూరిములు సారెకును
విసరవే సణగులిటు వేమారును
వెసరతుల మరిగి శ్రీ వేంకటేశుడుగూడి
సుసరమున నీతోడ జొక్కుచున్నాడు ॥ఎంత॥

ఉపోద్ఘాతము:

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమయ్య, ఎంత మోహమోగాని ఇతడు నీపై అనురాగముతో ఎప్పుడూ వదిలిపెట్టక ఇట్లు నీ సరసననే వుంటాడు అంటున్నారు. ఇది సరసకీర్తన అయినందువల్ల కొన్ని పదాలకు అర్థము మరీ విడమరచే ప్రయత్నం చేయటం లేదు. కొన్ని పడకటింటి రహస్యాలు రహస్యంగా వుంటేనే అందం. దిశమొలలో అందమేముంటుంది? పాపం స్వామి సుసరమున దేవితో జొక్కుచున్నాడట.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! ఇతడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు) నీమీద ఎంత మోహముతోనున్నాడో గాని, నిన్ను సంతతము (ఎల్లవేళలా) పాయక (వదలివుండలేక) ఇటు (ఇట్లా) నీ సరసనున్నాడు. (నిన్ను అంటిపెట్టుకొనేవున్నాడు).

ఓ దేవీ! పగడవాతెర తెరచి (పగడముల కాంతిగల నీ నోటిని కొద్దిగా తెరచి) నీ పతితోడ, పలుకవే (మాట్లాడవమ్మా!) సెలవులను (నీ లేతపెదవుల మూలలనుండి) చిరునవ్వులు చిలికించవమ్మా! ఈ సమయంలో నీకు వుండకూడనిదే మోనంబు (ముంగిలా మౌనంగా వుండటం.) మరియు మొలక సిగ్గులు (సిగ్గుల మొగ్గ అయ్యే దురలవాటు). నీ భర్త యెవరనుకున్నావు? జగదేకపతి.ఆయనే నిన్ను కూడవలెనని వస్తేఇట్లా కాచుకొని నిరీక్షింపజేస్తావా? ఏమిటి తల్లీ ఇది.

ఓ దేవీ! తెల్లకలువలవంటి కన్నులుగల ఇతనిని ఒక మాటు కనుగొనవే. ప్రియములన్నీ చల్లి అతని బాహువులమధ్య పెనగవే. ఓ దేవీ! పొనిగేటి (నిస్తేజమైన) తన్మయత్వము యెందుకమ్మా? ఇద్దరు కూడినాక గుటకలు మింగుతావు దేనికమ్మా? ఇదిగో ఈ జగదేకపతి నిన్ను తన కౌగిలలో తీసికొనవలెనని యెంత వేడుకతో నిలుచున్నాడో ఒకపరి పరికింపరాదా?

ఓ దేవీ! ఈవేళ ప్రతిసారీ అతనిపై నీ కూరిమి కొసరి కొసరి చూపించవమ్మా!ఆయనపైవేమారు (పలుమార్లు) ఇటు సణుగులు (సణిగేమాటలు) విసరవే (కుమ్మరించవమ్మా!) శ్రీవేంకటేశ్వరుడు నీ రతుల మరిగి ఆపై నిన్ను కూడినాడమ్మా! నీతోడుతో సుసరమున (మధుర నిశ్శ్వాసములవలన) జొక్కుచున్నాడు అలిసియున్నాడు.

పద్యవివరణ:

కం॥ **ఎంతటిమోహమొ ఇతనికి**
సంతతమును బాయడాయె సరసనెకూడున్
చెంతనె రతులను మఱిగిన
కాంతుడు వేంకట విభుండు కౌగిలిపెనగన్.

సంఖ్య: XXIX/104 రాగం : తిలంగ్
కీర్తన : ఈకె కలుగగ గదా యిన్నియును నెలవెట్టి

తిలంగ్

20 ఈకె కలుగగ గదా యిన్నియును నెలవెట్టి
దాకొని వొందొకటితో దారుకాణలాయనే ॥పల్లవి॥

పొలతి మోమును పోలు పున్నమ చందురుడు
కలికి కన్నుల పోలు కలువలివి
నిలువు తురుము పోలు నెమ్మది తుమ్మిదగుంపు
యెలమి మదను సిరులెంత నోమునోచెనో ॥ఈకె॥

వనిత బొమ్మల పోలు వరుస చెరకుటిల్లు
చను గుబ్బలను పోలు చక్రవాకాలు
తనువున పోలును తాలిమితో చిగురాకు
యెనలేని మరుసిరులెంత నోము నోచెనో ॥ఈకె॥

యింతి పిరుదుల పోలు యీతని బండి కండ్లు
చెంత పాదాల పోలు చెందామరలు
సంతోసాన శ్రీవేంకటేశ్వరుడు కాగిట కూడె
యింతటా కంతుని సిరులెంత నోము నోచెనో ॥ఈకె॥

ఉపోద్ఘాతము:

ఈమె మన కనులయెదుట కలుగుట చేతనే ఇన్నియుననెలవెట్టి (సంభవించి) ఈమెలో ఆ లక్షణములన్నియు దాగికొని ఒకదానికింకొటి కారణభూతములైనవి అంటున్నారు అన్నమయ్య. కీర్తనలోని విశేషాలన్నీ ఇదివరకుచాలా మధురకీర్తనలలో అన్నమయ్య యేకరువుపెట్టినవే. కాని దేని మాధుర్యం దానితే. దేనిప్రత్యేకత దానిదే. ఆమె జగదేకపతి కౌగిటకరిగే భాగ్యంపొందింది. ఇంతటి మదనవైభవమును అనుభవించుటకు ఆమె యేమి నోము నోచెనో కదా! అని అబ్బురపడిపోతున్నారు పదకవితా పితామహులు.

తాత్పర్య వివరణ:

ఈకె (ఈమె... అలమేల్మంగ) ఇతనికి కలుగగ గదా (దక్కుట చేతనే కదా!) నెలవుగా ఈతనిని, దాకొని (సమీపించి) వొందొకటితో (ఒకరి చేతులకింకొరు) తారుకాణాలాయెనే (దృష్టాంతములైనవికదా!) (భావం చదివిన కొద్దీ మీకే స్ఫురిస్తుంది).

ఈ పొలతి (యువతి) పున్నమి చందురుని పోలియున్నది. ఈ కలికి (యువతి) కన్నులున్నాయే అవి తెల్ల కలువల జంటను పోలియున్నది. ఈమె ఘననీలకేశముల తురుము (కొప్పు) వున్నది చూశారా, ఇది నెమ్మదిగా గుమిగూడిన తుమ్మెదల గుంపువలెనున్నది. ఈమె ఇంత మదన సిరులతో (మన్మధుని వైభవములతో) అలరారుటకు యేమి నోములు నోచినదో కదా!

ఈ వనిత కనుబొమ్మలు చెరకుటిల్లు (చెరకు విలుకాడైన మన్మధుని) విల్లును పోలియున్నది. ఈమె స్తనయుగ్మము చక్రవాక పక్షులజంటను పోలియున్నది. సుకుమారమైన ఈమె తనువు, తాలిమితో (మృదుత్వంలో... అనే... భావించాలి) చిగురాకును బోలియున్నది. ఎనలేని (గణించశక్యముకాని) మన్మథ శోభలతో శృంగారమూర్తియై విరాజిల్లుటకు ఈమె యేమి నోములు నోచినదో కదా!

"బండి కండ్లు" అంటే బండిలో ఉన్నవారు బయట దృశ్యములను చూచుటకు అమర్చిన పెద్దపెద్ద కిటికీలు. ఈమె ఘననితంబములు, వేంకటరమణుని తేరుకుగల బండికండ్లవలెనున్నవి. ఈమె పాదములు ఎఱ్ఱని తామరపూవులను పోలియున్నవి. ఈమె శ్రీవేంకటేశ్వరుని సంతోషముతో కూడినది. ఇంతటి కంతుని (మన్మథ) సిరులు పొందుటకు ఈమె యేనోము నోచెనో కదా!

పద్యవివరణ:

తే.గీ॥ దాగి వొందొక్కటితొ నాయె దారుకాణ–
ములుగ, ఇదియెల్ల నెలకొనె ముదితవలన
సంతసంబున వేంకన్న సకియగూడె
కంతుని సిరికై నోములు యెంత నోచె!!

సంఖ్య: XXV/185 రాగం : భౌళి
కీర్తన : ఎంచుకొమ్మా నీకునీవే యీ తగవులు

భౌళి

21 ఎంచుకొమ్మా నీకునీవే యీ తగవులు
మంచితనాన చెలిని మన్నించవయ్యా ॥పల్లవి॥

వంతలకు వాసులకు వనితలు సొలసితే
పంతమాడిరంటూ యెగ్గు పట్ట తగునా
వింతలుగా తీగెలు వసంత కాలాన చిగురు
యెంత పెంచినా నందు కిచ్చగించవలదా ॥ఎంచు॥

ననుపైన రమణులు నవ్వులెంత నవ్వినాను
ఘనగర్వములంటాను కాదందురా
యెనసి వానాకాలాన యేరులు మించి పారితే
యెనలేని వేడుకతో నీదులాడ వలదా ॥ఎంచు॥

రతివేళ వనితలు రాపు నిన్ను చేసితేను
తతిగొని నీవూ కడుదమకింతురా
క్షితి నాడు కోవిలలు చెలగి యెంత వుండినా
సతమై శ్రీవేంకటేశ సారెవినవలదా ॥ఎంచు॥

ఉపోద్ఘాతము:

స్త్రీలన్నాక యేవో చిట్టిపొట్టి తగవులు తమ ప్రియునితో ఆడుతూనే వుంటారు. ఈ తగవులకెంత ప్రాముఖ్యం ఇవ్వాలన్న విషయం నీకు నీవే ఎంచుకొమ్మా (నిర్ణయించుకోవయ్యా!) ఏది ఏమైనా మంచితనాన నీ చెలియను మన్నించావంటే ఆమె నీకు వశవర్తనురాలవుతుంది కదయ్యా! అంటున్నారు అన్నమయ్య. స్త్రీలతో ఎంతలలితంగా వుండాలో స్వామికి ఉద్బోధిస్తున్నారు. ఈ కీర్తనలోని అమలిన శృంగారం రసహృదయాలను పరవళ్ళు తొక్కిస్తుంది.

తాత్పర్య వివరణ:

ఓ సప్తగిరీంద్రా! యీ తగవులు (చిటిపొటి పంతములు, పోట్లాటలు) మీ దంపతులకు మేలు చేస్తాయా నీవే ఆలోచించు. నీకు నీవే జగదేకపతివి. ఏదియుక్తమో ఏది కాదో నీవే ఎంచుకొమ్మా (బేరీజు వేసికొనుము ప్రభూ!) ఏది ఏమైనా నీ చెలిని నీమంచితనముతో మన్నించవయ్యా!

ప్రభూ! స్త్రీలు ఏడుస్తుంటే తమమాట నెగ్గించుకోవాలని బెట్టుచేసి సొలసితే (నైరాశ్యత చెందితే) అబ్బా! ఈమెకు ఇంత పంతమేమిటి? అని యెగ్గు పట్టదగునా (నేరారోపణ చేయవచ్చునా?) వసంతకాలమున చిగురులు లతలు వింతగా తీగెలల్లుకుపోతుంటే వాటిని యెంత పెంచినా అందుకు సమ్మతించి ఆమెను సంతోషపెట్టవలదా? ఇది నీకు తెలియనిదా స్వామీ!

దేవా! ననుపైన రమణులు (ఇంపైన వనితలు) పకపకా నవ్వుతుంటే ఆమె ప్రియుడు ఇంకా అధికముగా ఆనందించాలి. అట్లా కాక ఆమె గర్విష్ఠి అని తలచి ఆమెను నిరాకరింతురా? ఇది నీకు తగునా ప్రభూ! వానాకాలములో యేరులన్నియు ఉరకలెత్తి పారుతుంటే, యెనలేని (చెప్పలేని) వేడుకతో ఈదులాడి రంజింపచేయవలెను. నీకు నీవే స్తబ్దుగా వుండదగునా ప్రభూ!

స్వామీ! రతివేళ వనితలకు రాపులు (రకరకములైన ఒరిపిడి, వత్తిడులు) సహజంగానే కలిగిస్తుంటారు. పంతముపూని నీవు కూడా ఆమెను తమకించవచ్చునా (ఉద్వేగపరచవచ్చునా) లోకంలో ఆడుకోకిలలు యెన్ని వున్నా ప్రయోజనమేమిటి? శాశ్వతుడైన శ్రీవేంకటేశ్వరుడనే గండుకోయిల కూజితము చక్కగా వినవలదా?

పద్యవివరణ:

కం॥ **ఈ తగవులెంచుకొమ్మా**
ఆ తరుణిని నీకు నీవె అలరించదగున్
ప్రీతిని మన్నించు విభో!
చేతల నీమంచితనము చెలి మరువదికన్

సంఖ్య: XXIX/143 రాగం : వలజ
కీర్తన : ఇటువలెనుండ వద్దా యిరవైన మోహము

వలజ

22 ఇటువలె నుండవద్దా యిరవైన మోహము
తటుకన నీమీది తగులెంతోకాని ॥పల్లవి॥

సొరిది నీమోము సారె జూచియును తనియదు
తరుణి మాటలాడియు తనియదు
సరసము లాడియాడి చాలునని తనియదు
అరుదైన మదిలోని యాస యం(యెం)తోకాని ॥ఇటు॥

ననుపుసేసుక చెలి నవ్వియును తనియదు
తనువునోక పెనగి తనియదు
మునుకొని చేతులెత్తి మొక్కియును తనియదు
యెనసి నీపై వలపింకా నెంతోకాని ॥ఇటు॥

నీకాగిట రతిసేసి తనియదు
తమితో గుబ్బలనొత్తి తనియదు
జమళి శ్రీవేంకటేశ సన్ననేసి తనియదు
అమరిన సంతోసమది యెంతోకాని ॥ఇటు॥

ఉపోద్ఘాతము:

తటాలుమని నీమీద అతనికి యెంత ఆసక్తి కలిగిందో చెప్పలేము కానీ ఒక్కమాట చెబుతాను వినవమ్మా! ఒకసారి సుస్థిరమైన మోహము ఇటువలె (ఇట్లా వినమ్రతతో) వుండవద్దా? తమకము బరిదాట వచ్చునా అని అంటున్నారు దేవితో అన్నమయ్య. ఈ కీర్తనలో మధురభక్తి పరవళ్ళు తొక్కి శృంగారపుటంచులను తాకి రతి సామ్రాజ్యంలో గతులెన్నో చూచింది. బాలబాలికలు దీనిమీద కొన్నేళ్ళు వేచివుంటే, యెంతో మంచిది. ఇందులో అన్నమయ్య అలమేల్మంగ చెలికత్తె.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! యిరవైనమోహము (సుస్థిరమైన మోహము) ఇటువలెనుండవద్దా (ఇట్లా వినమ్రతతో వుండవలదా)? ఆయనకు తటకున (తటాలున... అంటే... హఠాత్తుగా) నీమీద, తగులెంతో కాని (యెంత ఆసక్తి కలిగిందో చెప్పలేము కానీ) ఆయన నిన్ను యెంచుకొనుటే నీ భాగ్యము తల్లీ!

ప్రభూ! ప్రతిసారీ మెల్లిమెల్లిగా నీ మొగమును చూడ ప్రయత్నిస్తుంది. కాని అదేమిటో యెంత చూచినా తనియదు (తృప్తిచెందదు). నీతో యెంతసేపు మాట్లాడినా ఆమె తృప్తి జెందదు. నీతో చిలిపి సరసాలు యెంత ఆడినా ఆమెకు గొప్ప ఆనందం కలిగే మాట నిజమే కాని తృప్తి మాత్రం కలుగుట లేదు. అరుదైన (అంచనా వేయలేని) ఆమె మనస్సులో నీపై ఆశ యెంత వున్నదో కాని, ఆమె నిను విడచి వుండలేదు.

స్వామీ! ఆ చెలి, ననుపు సేసుక (నీపై అనురాగము ప్రదర్శించుచూ) నవ్వి నిన్ను మత్తెక్కిస్తుంది కాని దానితో ఆమెకు తృప్తి కలుగుటలేదు. నీ శరీరాన్ని పైనవైచికొని తాకినా, ఆ తరుణి తనియదాయెను. వెంటనే నీకు దాసోహమని, మునుకొని (ముందుకువచ్చి చేతులెత్తి నీకు మొక్కుతుంది. అదేమి వింతయో దానికీ ఆమె తృప్తిచెందదు. ఎనసి (నిన్ను పొంది) నీపై ఆమె వలపు ఇంకా యెంత పెరిగిందో అంచనా వేయలేము.

దేవా! ఆమె నీకౌగిలిలో యెంత రతివుద్విగ్నత జెందినా తనియదు. అనురాగాతిరేకమున తన గబ్బిగుబ్బలను నీకెంత ఒత్తినా తనియదు. ఓ శ్రీవేంకటేశ్వరా! జమళి (నీతో జతగూడి) ఆమె యెన్ని సైగలు చేసినా తనియదు. మరి ఆమె యెదలో యెంత సంతోషము రంజిల్లినదోగాని ఆమె నీవు లేక తనియదు.

పద్యవివరణ:

కం॥ **ఇటువలె యుండగ వద్దా?**
తటుకుననీపైన యెంత తగులున్నా? నీ
సటకారిప్రియుడు జగపతి
కిటుకున కౌగిటను కరగి కిలకిలనగుమా!

సంఖ్య: XXVIII/94 రాగం : ఖమాస్
కీర్తన : నీవెఱగవా చెలియా నెఱజాణ విన్నిటాను

ఖమాస్

23 నీవెఱగవా చెలియా నెఱజాణ విన్నిటాను
వావిరి నే జెప్పనేల వలపుజాడలివి ॥పల్లవి॥

వినయము కలిగితే వేడుకలు సమకూరు
మనసెనసితేను ప్రేమము పుట్టును
ననుపు గలిగితేను నాటుకొను మోహము
వనితకు పతికిని వలపుజాడలివి ॥నీవె॥

వోరుపుగలిగితేనేవొనరు చుట్టరికాలు
నేరుపే కలిగితేను నేస్తమీడేరు
కూరిమి గలిగితేను కొనసాగు భోగములు
వారక యెవ్వరికైనా వలపు జాడలివి ॥నీవె॥

యిచ్చకము గలిగితే నింపులెల్లా నిండుకొను
ముచ్చట లొనరితేను ముదమలరు
యిచ్చట శ్రీవేంకటేశుడేలె నిన్ను నింతలోనె
వచ్చి యిదెవున్నాడు మీవలపుజాడలివి ॥నీవె॥

ఉపోద్ఘాతము:

దేవి చెలికత్తె అయిన అన్నమయ్య ఆమెతో "ఓ చెలియ! నీవెఱగవటమ్మా! నీవేం తక్కువదానవా? నెఱజాణవు. నేను ఎక్కువగా చెప్పవలసిన పనేలేదు. ఇవివలపు చిగురించిన వారిలో కనుపించే జాడలేనమ్మా" అని అంటున్నారు. స్త్రీ వినయముతో వుంటేనే పురుషునికి వేడుక కలుగుతుంది. మనసు నీపై తగులు కొంటేనే ప్రేమ పుడుతుంది. ఓరుపు కలిగిన స్త్రీయే చుట్టరికాలను గౌరవిస్తుంది. అప్పుడే నీపై ముచ్చట గలిగి శ్రీవేంకటేశ్వరుడు నీవాడై నీవలపు మన్నిస్తాడు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! ఇది నీవెఱగవా? నీవేం తక్కువదానవా? నీవు ఇన్నిటాను (ఈ వలపు తలపులలో) అన్నీ తెలిసిన నెఱజాణవు. నేను నీగురించి, వావిరి (ఎక్కువగా) చెప్పవలసిన పనిలేదు. నీకూ తెలుసును. ఇవి (ఈ సంకేతాలు) వలపు జాడలు.

నేనొకటి చెబుతాను విను. స్త్రీకి వినయము వుంటేనే పురుషునికి వేడుక పుడుతుంది. మనస్సుపొందు కోరుకుంటేనే ప్రేమ పుట్టి చిగురిస్తుంది.ననుపు (అనురాగము) కలిగితేనే మగనిపై మోహము నాటుకొని వర్ధిల్లుతుంది. వనితకు ఆమె భర్తకు మధ్య ఇటువంటి వలపు జాడలు గోచరిస్తే వారు ప్రేమకై తహతహలాడుతున్నారని వెంటనే గుర్తించాలి.

ఓ దేవీ! స్త్రీకి ఓర్పు ఉండాలి. తన భర్తవైపు బంధువులను గౌరవంగా చూస్తేనే...వారు మీ ఇంటికి వచ్చిపోతూ ఉంటారు. వారు నీ స్నేహితులుగా మారవలెనంటే నీవు ఎంతో నేర్పరితనము చూపించవలసి వుంటుంది. అప్పుడు మీ భార్యాభర్తలకు ఒకరికింకొరిపై కూరిమిగలిగి అంతులేని భోగాలు అనుభవిస్తారు.దేవీ! వారక (అనివార్యముగా) యెవ్వరికైనా వలపు జాడలు ఇలాగే వుంటాయమ్మా!

ఓ దేవీ! సతీపతులమధ్య యిచ్చకములు (ప్రియ సంభాషణములు) కలిగితే వారి సంసారములో ఇంపులెల్లా (ఇష్టములన్నీ) పరిపూర్ణంగా నెరవేరుతాయి. ముచ్చటలు తీరితే ముదములు వృద్ధి చెందకపోవటం వుంటుందా? ఇంతలోనే శ్రీవేంకటేశ్వరుని కృప నీపై కలిగి నిన్ను స్వీకరింపజేసినది. నీకోసమే వచ్చి అదిగో యెలా వేచియున్నాడో చూడు. ఇవేనమ్మా! మీ వలపు జాడలు.

పద్యవివరణ:

తే.గీ॥ **చెలియ! నీవెఱగవా ఇది? చెప్పలేని**
జాణవిన్నిటా, వలపుల జాడలివియె
వేంకటేశుడు నినుగూడ విడిసినాడు
ముచ్చటలదీర్చి ముదితరో! ముదము నిమ్ము.

సంఖ్య: XXIX/179 రాగం : తిలంగ్
కీర్తన : నిన్ను బాయగలడటే నిమిషమైనా నీతడు

తిలంగ్

24 నిన్ను బాయగలడటే నిమిషమైన నీతడు
వున్నతి నీ కతలనే వోలలాడు నీతడు ॥పల్లవి॥

తాపము విరహమేలే తలవంచుకొననేలే
నీపై బత్తిగలడు నీమగడు
మాపు దాకా చింతేలే మమ్ము నింతడుగనేలే
యేపొద్దు నీ గుణములే యెంచుకొను నీతడు ॥నిన్ను॥

లేకలు వా (వ్రా?) యించనేలే లేమల నంపగనేలే
వాకిటికి నింతలోనే వచ్చె నీతడు
జోకతో సగినాలేలే చూచి తమకించనేలే
నీకుగానే యాకారు నిచ్చ నిచ్చా నీతడు ॥నిన్ను॥

చెక్కిట చేయికనేలే సిగ్గులు వడిగనేలే
ఇక్కడ శ్రీవేంకటేశుడెలె నిన్నును
మొక్కులు మొక్కగ నేలే ముసిముసి నవ్వులేలే
మక్కువ నీరతులే మరిగినాడితడు. ॥నిన్ను॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో కూడా అన్నమయ్య, దేవికి ఆంతరంగిక చెలికత్తెయై, ఆమెను అధైర్యపడవద్దనీ శ్రీనివాసుడు నిన్ను వదలి నిముషమైనా వుండలేడని బుజ్జగిస్తున్నారు. ఇతడు పైకి ఇలా గంభీరంగా వుంటాడు గానీ మాచేత నీకతలు (కథలు) కొసరి కొసరి చెప్పించుకొని మురిసిపోతుంటాడమ్మా! అయినా యేమాటకామాటే చెప్పుకోవాలి, ఆయనంటే నీకెందుకమ్మా! అంత విరహతాపం. ఇంత వేగముగా నీ సందిట జేరవచ్చేవానికి ఇంతలోనే లేఖలు

పంపించడం స్త్రీలను రాయబారం పంపటం యెందుకమ్మా! ఏమీలేదు మక్కువతో నీరతులను మఱిగినాడమ్మా ఆ శృంగారరాయుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! ఈతడు నిముషమైనా నిన్ను పాయగలడటే (నిన్ను వదలి వుండగలడా?) దేవీ! అది జరిగే పనికాదు. ఈతడు నిరంతరం నీ కతలనే (కథలనే) చెప్పించుకొని విని తనలో తానే మురిసిపోతుంటాడు.

ఓ దేవీ! ఆయన నిన్ను సమీపించగానే తలవంచుకొని సిగ్గుపడిపోతావు. మరి ఆయన కనుమరుగవంగానే ఇంత విరహతాపమెందుకమ్మా? నీ మగడు నీపై బత్తి (భక్తితో కూడిన ఆరాధన) కలిగియున్నాడు. మమ్మల్ని ఇంత అడుగవలెనటమ్మా? రాతిరి యెంతో పొద్దుపోయినదాక ఈ చింతలన్నీ నీకెందుకమ్మా? ఈతడు పొద్దు యేదయినా నీ గుణగణాలు వింటూ పరవశించిపోతుంటాడు.

ఓ దేవీ! ఈయన నీవాకిటిలోనే నీ కొరకు నిరీక్షిస్తున్నాడు. ఇంతలోనే నీ చెలికత్తెలను అతని కోసం పంపించాలా? ప్రేమలేఖలు పంపించాలా? ఏమి చోద్యమమ్మా? జోకతో (బాగుగా) శకునములన్నీ చూసుకొంటావు. మంచిదే. కానీ ఇంత తమకించనేల (తొందరపాటు యెందుకమ్మా?) ఇతడు, నిచ్చనిచ్చ (ప్రతినిత్యమూ) నీకుగానే ఆకారు (పిలుపునందుకొంటాడు).

ఓ దేవీ! ఇక్కడే శ్రీవేంకటేశ్వరుడు నిన్ను ఏలినాడు. ఇంకా నీకు చెక్కిట చేయిబెట్టుకొని చింతయెందులకే? దానికితోడు అంతులేని ఈ సిగ్గులు దేనికమ్మా?ఆయనకు అంతులేని మొక్కులు మొక్కుతున్నావు మళ్ళీ ముసిముసి నవ్వులను ఒలకబోస్తున్నావు. ఇతడు మక్కువతో నీరతులను మఱిగినాడు మరి ఇక నిన్నెట్లు వదలగలడు?

పద్యవివరణ:

ఆ.వె॥ **నిన్ను బాయగలడె నిముసమైనా హరి**
నీదుకతలలోనె నీదులాడు
మరిగినంత రతుల మక్కువనితనికి
వేంకటేశుడైన వెలదిప్రియుడె.

సంఖ్య: V/376 రాగం : చంద్రజ్యోతి
కీర్తన : నిన్ను గూడిన విభుని నిలువెల్ల సొంపాయ

చంద్రజ్యోతి

25 నిన్ను గూడిన విభుని నిలువెల్ల సొంపాయ
నిన్నియునునొనగూడె నింతలోపలనె ॥పల్లవి॥

సొలపు నీకడగంటి చూపు హృదయము గాడి
లలినితడు శ్రీ వత్సలాంఛనుండాయ
వెలది నిను బెడబాసి విరహంపు మెయికాక
వలన నీతడు నీల వర్ణుడై నాడు ॥నిన్ను॥

అదన నీ చను గుబ్బలను చక్రములచేత
బదిల పరపుచు చక్రపాణియైనాడు
సుదతి నీ దేహమున సొబగు కుంకుమపూత
లెదిగి పీతాంబరం బీతనికి నాయ ॥నిన్ను॥

ఆలింగనాపేక్ష ననయంబు నినుగూడ
లోలుడటుగాన నాలుగు చేతులాయ
శ్రీలలిత మూర్తియగు శ్రీవేంకటేశ్వరుడు
పాలించె నిను నీకు బరి తోషమాయ ॥నిన్ను॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య శ్రీదేవికి ధైర్యం చెబుతున్నారు. తల్లీ! నిన్ను కూడిన తక్షణమే నీ విభునికి నిలువెల్లా చెప్పలేని సొబగులు అద్ది నాయమ్మా! ఆయనకేమేమి యొనగూడినవో వివరిస్తాను వినవమ్మా! తల్లీ! నీ కడగంటి చూపులోని వేడిమి ఆయన హృదయమున్నచోట తొలిచి ఆ వేడికి నల్లటి మచ్చ అయినదమ్మా! అదే మేము భక్తితో నమస్కరించే శ్రీవత్సము అనే పుట్టుమచ్చ. అన్నమయ్యకు ఈ ఊహలెలాతట్టి స్వామిని అలరిస్తాయో... ఆ తిరుమలేశునికే తెలియాలి.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! నిన్ను గూడిన నీ విభునికి నిలువెల్లా (ఆయన వంటినిండా) సొంపాయె (వింత వింత సొగసులు అబ్బినవమ్మా!) ఇవన్నీ ఒనగూడుటకు ఏమాత్రము సమయం పట్టలేదు. ఇంతలోనే (చిటికెలో) అవి కలిగినవమ్మా!

ఓ దేవీ! నిశితమైన నీ కడగంటిచూపు (ఓరచూపు) సొలపు (వాడిగా) నాటుకొనుట చేత ఆయన హృదయము గాడి (తొలచి) నల్లబడినది. మరి ఇతడు లలి (అందమైన) శ్రీవత్సమనే పుట్టుమచ్చ లాంఛనముగా గలవాడైనాడు. ఓ వెలదీ! నిన్ను యెడబాసివిరహమువలన స్వామి శరీరం తాపానికి కమిలిపోయి చివరికి ఈయన నీలవర్ణుడైనాడు (నల్లనయ్య అయిపోయాడు). ఇందులో ఆయన తప్పేముందమ్మా?

ఓ దేవీ! సుదర్శన చక్రపాణి అయినందువల్ల ఈయనకు చక్రధారి అన్నపేరు రాలేదు, చ్రకములవంటి నీచనుగుబ్బలను పదిలపరచుకొనుచున్నాడా యన్నట్లు ఒడిసిపట్టుట చేత ఈయన చక్రపాణి అయినాడమ్మా! ఓ సుదతీ! అనేకమార్లు నీ చెమటతో తడిసిన నీ దేహమున అద్దుకొనిన కుంకుమ చిట్టచివరికి పీతాంబర వర్ణము (పసుపురంగు) గా యెదిగి ఇతడు పీతాంబరధరుడాయెను.

ఓ దేవీ! ఇంకొక పరమాద్భుత రహస్యం చెబుతాను వినవమ్మా! అవి శంఖ చక్రగదా పద్మములను ధరించుటకు కాదమ్మా! అవి ఆపేక్షతో బిగి కౌగిలిలో నిన్ను నించుటకు రెండు చేతులు, తమకమాగక లోలుడై నీతో పెనగుటకు తక్కిన రెండు చేతులూ ఉపయోగిస్తాడమ్మా! శ్రీలలితమూర్తియైన శ్రీవేంకటేశ్వరుడు నిను పాలించినాడమ్మా! అదే నీకు "బరితోషమాయ" (మిక్కిలి సంతోషదాయకమాయెను).

పద్యవివరణ:

ఆ.వె॥ **నిన్నుగూడు విభుని నిలువెల్ల సొంపాయె**
నిన్నియు నొనగూడెనింతలోనె
వేంకటేశ్వరుండు వెలది నిన్‌పాలించె
సకియ! గొప్ప సంతసంబులాయె.

సంఖ్య: VII/168 రాగం : హరికాంభోజి
కీర్తన : అన్నిటా భాగ్యవంతుడవవుదువయ్యా

హరికాంభోజి

26 అన్నిటా భాగ్యవంతుడ వవుదువయ్యా
పనిన్నందుకల్లా వచ్చు భామ నీ కిపుడు ॥పల్లవి॥

పడతి మోహరసము పన్నీటి మజ్జనము
కడలేని ఆపె సిగ్గు కప్పురకాపు
నిడుదకన్ను చూపులు నించినతట్టపునుగు
తొడిబడ సులభాన దొరకె నీ కిపుడు ॥అన్నిటా॥

కామిని కెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రకావి
ఆముకొన్న మోముకళలు ఆభరణాలు
దోమటి మాటలవిందు ధూపదీప నైవేద్యాలు
కామించినటువలెనే కలిగె నీ కిపుడు ॥అన్నిటా॥

అలమేలు మంగ నవ్వులు అంగపు పువ్వుదండలు
కలసి వురాన నీకె కట్టిన తాళి
చలపట్టి ఈకె రతి సకలసంపదలు
ఇలనబ్బె శ్రీవేంకటేశ నీకు నిపుడు ॥అన్నిటా॥

ఉపోద్ఘాతము:

పురుషులకు రకరకాలైన భాగ్యములు సమకూడుతుంటాయి. వస్తు, వాహన, ధన, ధాన్య, పరివార, వైభవములన్నీ దాదాపు శ్రీమంతులందరూ అనుభవించే వైభోగాలే. కానీ కావాలనుకొన్నప్పుడల్లా కోరుకున్న స్త్రీ అతని పన్నిక (వ్యూహం) ప్రకారం వచ్చి ఆయనకు సురత సౌఖ్యమునీయుట అందరికీ ఒనగూడే నేర్పుకాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకేమయ్యా? నీవు అన్నిటా భాగ్యవంతుడవు అవుదువు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ప్రభూ! నీవు అన్నిటా (అన్ని విషయములలోను) భాగ్యవంతుడవవుదువయ్యా! నీకు ఇప్పుడు పన్నిన (కావాలని వ్యూహరచన చేస్తే) భామ (నీవు వలచిన చిన్నది) అందుకల్లా వచ్చును (అందుకే తహతహలాడుతూ వస్తుంది.)

ఈ దేవికి నిమజ్జనం జరుగుతున్నది. ఆమె మజ్జనమాడుచున్న పన్నీరు యెక్కడిదనుకొన్నావు స్వామీ! ఆ పడతి మోహరసమే అది. మరి ఆమెకు వేస్తున్న కర్పూరపుకాపు పరిమళములొలుకుతున్న, కడలేని (అంతులేని) ఆమె సిగ్గే. ఆమె నిడుద కనుచూపు (రెప్పవాల్చక నిన్ను చూచే చూపు) బాగా అలముకొనిన తట్టు పునుగు నించినట్లువున్నది. నీ సౌభాగ్యమేమని చెప్పను? తొడిబడ (చలించిపోవుచున్న) ఈమె సులభముగా నీకు దొరికినది.

ప్రభూ! ఆమె కట్టుకొన్న "చంద్రకావి" (సింధూరవర్ణము గల వస్త్రము), ఆ కామిని యొక్క అరుణాధరమును గుర్తుచేయుచున్నది. ఆమె ఆముకొనిన (పైకొనిన) వదనపు కళలే ఆమెకు ఆభరణములు. ప్రియ సంభాషణలతో ఆమె చేయు మాటల విందే ముప్పిరిగొనినట్లు వేసిన ధూప, దీప నైవేద్యములు. దేవీ! నీకిపుడితడు కామించినటువలెనే (కోరినట్లే) లభించినాడు.

ఓ దేవదేవా! ఆమె మెడలో కనుపించుచున్న పూలదండలు మరేవో కాదయ్యా! అలమేల్మంగ నవ్వులే. పురుషుడు స్త్రీ మెడలో తాళి కడతాడు అది జగద్విదితమే. కానీ ఈమె నీవురముపై వెలసి నీకే కట్టినతాళియైనది. ఈకె (ఈమె) చలపట్టి (మత్సరముతో) నీతో రతిలోని సకల సంపదలను పొందినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇపుడు నీకు సమస్తము స్వాధీనమే.

పద్యవివరణ:

తే.గీ॥ **అన్నిటా భాగ్యవంతడవవుదువయ్య!**
పన్నినందుకు వత్తురు భామలెల్ల
ముదితరతినీకు సర్వసంపదలనిచ్చె
వేంకటేశ్వరా! అవి నీకు విరివినబ్బె.

సంఖ్య: V/138 రాగం : రేవతి
కీర్తన : పొద్దికనెన్నడు వొడచునొ పోయిన చెలిరాదాయను

రేవతి

27 పొద్దిక నెన్నడు వొడచునొ పోయిన చెలిరాదాయను
నిద్దురగంటికి తోపడు నిమిషం బొక యేడు ॥పల్లవి॥

కన్నులనవ్వెడి నవ్వులు గబ్బితనంబుల మాటలు
నున్నవి యొయ్యారంబులు నొచ్చిన చూపులును
విన్నతనంబుల మఱపులు వేడుక మీరిన యలపులు
సన్నపు చెమటలు తలచిన ఝల్లనె నామనసు ॥పొద్దిక॥

ఆగినరెప్పల నీరును నగ్గలమగు పన్నీటను
దోకియు తోగని భావము దోచిన పయ్యెదయు
కాగిన దేహపు సెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేగిన చెలితాపమునకు వెన్నెల మండెడిని ॥పొద్దిక॥

దేవశిఖామణి తిరుమలదేవుని తలచిన బాయక
భావించిన యీ కామిని భావములోపలను
ఆ విభుడే తానుండిక నాతడెతానెఱగవలె
నీవెలదికిగల విరహంబేమని చెప్పదము ॥పొద్దిక॥

ఉపోద్ఘాతము:

ఇంకా యెప్పుడు పొద్దుపొడుస్తుందో ఆయన సమాచారం తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్న చెలియ ఇంకారాదాయెను అని దేవి విచారపడుతున్నది. ఆమెకు కంటికి నిద్దురరాదు. నిముషమొక ఏడుగా (ఒక ఏడాదిగా) అనిపిస్తున్నది అంటున్నారు అన్నమయ్య. కీర్తనలోని చరణాలలో నేటి తెలుగు నుడికారములో లేని పదములు కోకొల్లలు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు చదివితేనేగాని అవగతం కాని కీర్తన ఇది. వేంకటపతిని విడిచి ఈ వెలది హద్దెరగని విరహతాపానికి గురి అయినది.

తాత్పర్య వివరణ:

ఈపొద్దు యెంతకీ పొడవదేమిటి? ఇక పొద్దు యెప్పుడు వొడచునో తెలియుటలేదు.నా ప్రియుని సమాచారం తెలిసికొనివస్తానని పోయిన చెలియ రాదాయెను. ఇప్పుడేం చేయాలి? కంటి నిద్దుర తోపదు (వచ్చుటలేదు). నిముషంబొక యేడు (ఏడాది) అనిపిస్తున్నది.

నా మనస్సుఝల్లుమని వులికిపడుతున్నది. దీనికి ప్రియుని తలపులె పరవశం కలిగిస్తున్నది. నవ్వుతున్నట్లున్న ఆ కన్నుల నవ్వులు,గబ్బితనము (గర్వము తొంగిచూచే మాటలు, చెప్పలేని ఒయ్యారము, ఆయన ప్రవర్తనకునొచ్చినట్లున్న ఆమె చూపులు, విన్నతనంబులు (ఆయనకే అర్థమయ్యే విజ్ఞాపనములు) వాటిని ఆయనే మరచుట, వేడుకలధికమవగా కలిగిన అలసటలు,సన్నని చిరుచెమటలు. ఇవన్నీ ఆమె తలపులను కలచివేస్తున్నాయి.

అప్పుడే ఆగిన కనురెప్పల మాటున నీరు, చల్లటి పన్నీటి స్నానముచేసినా చేయనట్లే చిరాకుగాఅనిపించుట వేంకటరమణుడు అపహరించిన తన పయ్యెద, దాని వలన కాగిపోయిన తన దేహమునుండి వెలువడే సెకలును (వేడి నిట్టూర్పులు), ఆమె ఒంటినిండా కప్పిన పూమాలల సౌరభములు. ఓ చెలులారా! ఇంకా యెక్కువగా వేగిన ఆమె తాపము చెప్పనేల? ఆమెకు వెన్నెలమండెడిని (మండిపోతున్నది).

చెలులారా! అప్పుడు ఈ కామిని యేమిచేసిందనుకొన్నారు? పాయక తన భావములోపలనే తన స్వామిని భావించినది. దేవశిఖామణియైన తిరుమలదేవుని తలపులలో నిలిపినది. అప్పుడు ఆమె తాను వేరొకరుకాదని తానే ఆతడని, ఆతడే తానని గ్రహించినది. ఈ వెలదికి కలిగిన నూతన విరహంబేమని చెప్పెదము.

పద్యవివరణ:

కం॥ **పొద్దికనెన్నడు వొడచునొ**
నిద్దురరాదాయె తోచి నిముషంబేడై
గద్దరి వేంకటపతి విడి
హద్దెరగక వెలదికి విరహంబాయె చెలీ!

సంఖ్య: XXIX/434 రాగం : ఆనందభైరవి
కీర్తన : పొదలె నిండుకళల పున్నమనేడు

ఆనందభైరవి

28 పొదలె నిండుకళల పున్నమనేడు
అదనుతప్పక జాజరాడుదువురావయ్య ॥పల్లవి॥

జలజాక్షి మోమునను చంద్రోదయమాయ
నెలకొన్ననవ్వుల వెన్నెలగాసెను
కలికి కన్నుల నల్ల కలువలు వికసించె
అలరి ఈకెతో జాజరాడుదువు రావయ్య ॥పొదలె॥

ఎనసి జవ్వనమున ఏతెంచె వసంతకాల
మొనరి మోవి చిగురులుప్ప తిల్లెను
గొనకొన్నతురుమున కూడె తుమ్మిదమూక
అనుమానించక జాజరాడుదువు రావయ్య ॥పొదలె॥

కుంకుమ చెమట చనుకొప్పెరల నిండుకొనె
కొంకక గోళ్ళే బుఱ్ఱట కొమ్ములాయను
లంకెలైశ్రీవేంకటేశ లలనతో కూడితివి
అంకెల నేపొద్దూ జాజరాడుదువు రావయ్య ॥పొదలె॥

ఉపోద్ఘాతము:

నేడునిండుకళలున్న పున్నమరేయి వర్ధిల్లుచున్నది. సమయము వ్యర్థపరచక ఆమెతో జాజర అనబడే వసంతములాడుదువు రావయ్యా అని ఏడుకొండలవాడిని ఆహ్వానిస్తున్నారు అన్నమయ్య. కుంకుమాంకిత స్తనముల గుంద్రని పాత్రలలో చెమటలు నిండుకొనెను. భయపడక తన వాడి గోళ్ళతో ఎదుర్కొనుటే విజయ సూచకమగు నీళ్ళు చిమ్ముగొట్టమాయెను. ఓ వేంకటేశా లలనతో నీకూటమే ఒక గొప్ప జాజర ప్రభూ!

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయా! నేడు కళలున్న పున్నమి పొదలె (వర్ధిల్లుతున్నది). అదన తప్పక (సమయము వ్యర్థము కానీయక) జాజరలాడుదువు (వసంతోత్సవము జరుపుకొందువుగాని) రావయ్యా!

ఆ సంతోషానికి జలజాక్షియైన నీ పద్మమోము (ముఖమున) చంద్రోదయమైనట్లుంది. వెన్నెల వలె కనుపించుచున్న ఈమె నవ్వులే, నిండిపోయిన వెన్నెలకాసినట్లుంది. మరి అంత అద్భుతమైన చంద్రోదయంతో కలువలు వికసించాలి కదా! ఆ కలికి (భామిని) కన్నులనే నల్లకలువలు కూడా తన ప్రియుని చూచి వికసించినవి.అన్నీ అమరినవి. అలరి (అతిశయించి) ఈకెతో (ఈమెతో) జాజరలాడరావయ్యా!

ప్రభూ!వసంతకాలమువచ్చినట్లు తెలియుచునే వున్నది. జవ్వనముకదా! మరి ఇక్కడ యేమి చిగురించుచున్నది? ఆమె లేమోవి చిగురులు, వుప్పతిల్లెను (మొలకలెత్తుచున్నవి). నల్లని ఆమె కొప్పు సుగంధ పరిమళములు వెదజల్లి తుమ్మెదలమూకను ఆకర్షించుచున్నవి. ఈ తుమ్మెదలు జగదేక విభుడవైన నిన్నేం చేస్తాయి? దేవితో జాజరలాడుదువు రావయ్యా!

స్వామి! వుద్వేగానికి లోనై, ఈమె చనుగవపై అలదిన కుంకుమ చెమటతో మిళితమై కొప్పెరలు (గుంద్రనిపెద్దపాత్రలలో) నిండుకొనిపోయింది. ఏమాత్రమూ జంకక ఆమె వాడిగోళ్ళే బుఱ్ఱటకొమ్ములాయె (యెలుగెత్తి పిలుచు కొమ్ముబూరలైనవి). ఓ శ్రీవేంకటేశ్వరా! లంకె వేసికొని ఈ లలనను గూడితివి. మరి నీకు ఏ పొద్దునైనా అంకెలేని జాజరలే. రావయ్యా! మరి ఏ భోగమైనా నీదే.

పద్యవివరణ:

ఆ.వె॥ **పొదలె నిండు కళల పున్నమి ఈనాడు**
జాజరాడుదువులె జాణతోటి
లలనతోటి విభుడు రమ్యంబుగా గూడె
పొద్దు యేదయినను వద్దనవుగ!

సంఖ్య: VI/66 రాగం : బేహాగ్
కీర్తన : నీడల చూపులు నీకేలే యీ

బేహాగ్

29 నీడల చూపులు నీకేలే యీ
వాడుక వాడెడి వడ నీకేలె ॥పల్లవి॥

నిలువుల నటనలు నీకేలే యీ
వెలుగుల నడపులు నీకేలే
నలివులకరగులు నీకేలే యీ
కులికెటి నును సిగ్గులు నీకేలే ॥నీడల॥

నెఱుల చెదరులివి నీకేలే యీ
నెఱువగు చదరులు నీకేలే
నెఱతనపుసరులు నీకేలే యిదె
చఱగునమూసెదు చెలి నీకేలే ॥నీడల॥

నిక్కపు బొంకులు నీకేలే యిదె
నిక్కులగంటివి నీకేలే
నిక్కితి వొరపుల నీకేలే యిదె
దక్కె వేంకటోత్తముడు నీకేలే ॥నీడల॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన వివరణ నా భావనా పరిధికి తట్టిన ఆలోచన.ఇదే సరయిన భావము అని నిర్ద్వంద్వంగా చెప్పగల పాండిత్యం నాకు లేదు.ఇది నాకు తోచిన భావన. నీడల చూపులు అంటే రహస్యంగా ఏమి జరుగుతున్నదో తెలుసుకోవాలనే చూపులు. ఆ చూపులు నీకెందుకే? అనవసరమైన శ్రమతో వడలిపోయే దౌర్బల్యం నీకెందుకే అంటున్నారు దేవితో ఆమె

నెచ్చెలియైన అన్నమయ్య. చివరికి యేదియేమైనా ఆ వేంకటోత్తముడు దక్కేది మాత్రం నీకేలే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! నీడల చూపులు (రహస్యంగా యేమి జరుగుతున్నదో తెలుసుకోవాలనే చూపులు) నీకేలే? (నీకెందుకమ్మా?) యీ వాడక వాడెడివడ (ఈ అనవసరమైన శ్రమతో వడలిపోయే దౌర్భాగ్యం) నీకెందుకమా?

ఓ దేవీ! సుదీర్ఘమైన నాట్య విన్యాసములు నీకేలనమ్మా? ఈ బాహాటమైన ప్రవర్తన నీకెందుకమ్మా? మరి ఇంతాచేసి పరిచయంలోనే కరగిపోవుటలు దేనికమ్మా? అదంతా అటుంచి నీ ప్రియుని చూడగానే కులికేటి నీ లేత సిగ్గులు అన్ని యెందులకమ్మా?

ఓ దేవీ! చెదరిపోయిన ముంగురులతో ఇంత సౌందర్యం ప్రదర్శించడం దేనికమ్మా? అంతులేని చమత్కారాలు నీకెందుకమ్మా! నీ పెత్తనం చూపించుకోవాలనే సరులు (పద్ధతులు) నీకెందుకమ్మా? పోనీ నీ ఆ పెత్తందారితనము చూపిస్తావా అంటే లేదు. దానిని నీ చెఱగున మూసేస్తావు. నీవు అంత సిగ్గరివి. చెలీ! నీనాథుడుండగా ఇవన్నీ నీకేలనమ్మా?

ఓ దేవీ! నిక్కపు బొంకులు (నిజమనునట్లు భ్రమ కలిగించు అబద్ధాలు) నీకేలనమ్మా? నీవు జగదేకపతి రాణివి. తల్లీ! నీవు నిక్కులుగంటివి (నీవు కన్న కలలు నిజముగా అనుభవంలోకి వచ్చేస్తాయి). ఇక నీకు వ్యాకులత యెందుకమ్మా? నిక్కితి వొరపుల (భేషజముగల ఘర్షణ) లన్నీ నీకెందుకమ్మా? ఇదె వేంకటోత్తముడు (శ్రీవేంకటేశ్వరుడు) నీకు దక్కినాడు. ఇక తక్కిన వ్యర్థమైన విషయాలు నీకెందుకు తల్లీ!

పద్యవివరణ:

కం॥ **నీడల చూపులు యేలనె**
వాడుకతో వడలిపోవు వడ నీకేలే?
పాడగు బొంకులు యేలనె
కూడెను వేంకటవిభుండు కొఱతింకేలే?

సంఖ్య: XXVI/112 రాగం : ఖరహరప్రియ
కీర్తన : హరినిన్ను పిలిచీని అదివో అమ్మా

ఖరహరప్రియ

30 హరినిన్ను పిలిచీని అదివో అమ్మా
తెరమరుగికనేల తియ్యవమ్మా ॥పల్లవి॥

చిత్తరు పతిమ వంటి చెలియా నీవు
ఇత్తల పతికి విడెమీయవమ్మా
కొత్తమెరుగు బోలిన కోమలీ నీవు
మొత్తమి కూరిమి పతిమోముజూడవమ్మా ॥హరి॥

బంగారు బొమ్మవంటి పడతి నీవు
అంగవించి పతితో మాటాడవమ్మా
అంగజుశరము వంటి అతివె నీకే
నంగతన ముదియేల నవ్వవమ్మా ॥హరి॥

చంచుల చిగురువంటి జవ్వని నీవు
కొంచక శ్రీ వేంకటేశు కూడితివమ్మా
మించుతమ్మిలోని అలమేలుమంగా
ఎంచి ఇద్దరును మమ్ము ఏలరమ్మా ॥హరి॥

ఉపోద్ఘాతము:

అమ్మా! అలమేల్మంగా! అదివో హరి నిన్ను పిలిచినాడమా! ఇంకా నీకు తెరమరుగు యెందుకమా! ఆ మరుగు తీసివేసి స్వామిని అలరించవమ్మా! అంటున్నారు అన్నమయ్య. చిత్తరువులోని ప్రతిమవంటిదానవు నీవు కూరిమితో నీపతి మోమును తిలకించవమ్మా! బంగారు బొమ్మవంటి పడతివి నీకునంగతనమెందుకమ్మా?నీవు వేంకటపతిని కూడినావు కనుక ఇద్దరూకలసి మమ్మేలరావమ్మా!

తాత్పర్య వివరణ:

ఓ అలమేల్మంగమ్మా! నిన్ను హరిపిలిచీని (పిలిచినాడమ్మా). ఇక తెరమరుగు (నీ అంతఃపురంలో తెరల చాటున వుండటం దేనికమ్మా? ఆ తెరలను తొలగించవమ్మా!)

ఓ చెలియా!చిత్తరువులో గీసినఅందాల ప్రతిమ వంటి నీవు ఇత్తల (ఇప్పుడు) నీ పతికి విడెమియ్యవమ్మా! (ఆహ్వాన తాంబూలము నందించవమ్మా!) కొత్తమెరుగుల (అనూహ్యము, నూతనమూ అయిన తేజసును) బోలిన, ఓ కోమలీ! నీ మొత్తమి కూరిమి (నీ మొత్తము వలపును)తొణికిసలాడగా నీ పతి మోము (ముఖము)ను చూడవమ్మా! నీవు దేవేరివి ఆయన నీ మనోహరుడు.

దేవీ! నీవు బంగారు బొమ్మవంటి పడతివే. అంతమాత్రాన మాటలాడని ప్రతిమవైతే ఎలా తల్లీ! అంగవించి (ఉత్సాహముతో) మాట్లాడవమ్మా! జగదేకపతియైనవాడే నీ పతి కదమ్మా! నీవు అంగజుశరము (మన్మథుని బాణము) వంటి దానవు. నీకు నంగతనము (నంగనాచి ప్రవర్తన) దేనికమ్మా! నీ పతి మదిని యేలునట్లు చిరునవ్వు చిందించవమ్మా!

దేవీ! నీవు చలాకీతనము పొంగిపొరలే చిగురువంటి జవ్వనివి (యౌవన శోభగలదానవు) నీవు కొంచక (సంకోచించక) శ్రీవేంకటేశ్వరుని కూడితివమ్మా! శ్రేష్ఠమైన పద్మములో నెలకొనిన ఓ అలమేల్మంగా! మీ సతీపతులిద్దరూ మమ్మల్ని యెంచుకొని దయానురాగములతో మమ్ము యేలండి తల్లీ!

పద్యవివరణ:

కం॥ **హరి నిన్ను పిలిచెనమ్మా!**
తెరమరుగిక నేల తెరలు తీయవె తల్లీ!
తరుణివి బంగరుబొమ్మవు
తిరువేంకటశిఖరపతికి దేవివి నీవే.

సంఖ్య: XXVIII/93 రాగం : శుద్ధ ధన్యాసి
కీర్తన : మేటి నేరుపరులాల మెలుతలాల

శుద్ధ ధన్యాసి

31 మేటి నేరుపరులాల మెలుతలాల
కూటములిద్దరికిని గూరుచరె యెపుడు ॥పల్లవి॥

చెప్పగానే నోరూరీ చెలువుని చేతలు
చొప్పులెత్తెతని నాకు జూపగదరే
కుప్పవడీ కోరికలు గుణములు వింటేను
వొప్పుగా పొందులు నాకు నొనరించరే ॥మేటి॥

విననే వేడుకవుట్టీ విభుని చక్కదనాలు
అనువుగా నిద్దరి మాటాడించరే
మనసయ్యానాతని మంచితనాలు చూడగా
యెనయగ నాతని నింటికి దోడి తేరే ॥మేటి॥

తలచగానే వచ్చెతానె శ్రీవేంకటేశుడు
తెలుపరే నామోహము దేవునికిని
తిలకించి చూచి ఇట్టె తిరముగా పెండ్లాడె
కలకాలమును నన్నుకరుణించుమనరే ॥మేటి॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో అన్నమయ్య తాను ఒక చెలికత్తె. దేవి ఆమెతోను తోటి చెలికత్తెలను తనకూ శ్రీనివాసునికీ మీరు గొప్ప నేర్పురులు కనుక మీ నేర్పు ప్రదర్శించి జతకలపండి అంటున్నది. ఆ శ్రీరమణుని చేష్టల గురించి మీరు చెబుతుంటేనే నోరూరిపోతున్నది. ఒప్పుగా పొందులు నాకు నొనరించరే అని ప్రతిమిలాడుతున్నది. ఇదంతా తిలకించి ప్రసన్నుడై శ్రీవేంకటేశ్వరుడు ఇట్టే వచ్చి ఆమెను పెండ్లియాడినాడు.

తాత్పర్య వివరణ:

మేటి నేర్పరులారా! మెలతలార! (తరుణీమణులారా!) ఇద్దరికి (నాకూ ఆ శ్రీనివాసునికి) కూటములు గూరుచరే (కలయిక నేర్పాటు చేయండి) యెపుడు (ఇంకా యెప్పుడు చేస్తారు?)

చెలులారా! ఆయన చిలిపి చేష్టలను గురించి మీరు చెబుతుంటేనే నాకు నోరూరిపోతున్నది. చొప్పలెత్తి (ఏదో ఒక విధమున) నాకు అతనిని చూపగదరే (చూపించరాదటే!) ఆయన గుణగణములు వింటుంటేనే కోరికలు కుప్పవడీ (కుప్పలు తెప్పలుగా ముంచుకొస్తున్నాయి. ఒప్పుగా (తగినరీతిలో)ఆయనతో పొందులు (కూటములు) ఒనరించరే (కలిపించండమ్మా!)

ఓ చెలియలారా!నా విభుని చక్కదనము గురించి నాకు వేడుక కలుగుతున్నది. అనువుగా (తగు సమయం చూచి) మా ఇద్దరిచేతా మాట్లాడించండమ్మా! ఆయన మంచితనము ప్రత్యక్షముగా చూడాలని నాకు మనసుపుట్టుచున్నదే. ఆయనను యెలాగైనా నచ్చజెప్పి నాతోటి యెనయగ (పొందుకు), ఒప్పించి ఈ ఇంటికి తోడితేరే (ఈ నా గృహమునకు తోడుండి తీసుకురాండమ్మా!)

ఓ సఖీ! ఈ వింత తమాషా చూశావా? నీవు ఆ శ్రీవేంకటేశ్వరుని అట్లా తలుచుకున్నావు ఆయన ఇట్లా వేంచేసినాడు. ఆ దేవదేవునికి నాకు ఆయనపైగల మోహమును వివరించండే. ఇక చాల్లే, మీరు చేసేదేమిటి! నా వేదనను తిలకించి, మనస్సు కరిగినవాడై ఆ శ్రీవేంకటేశుడు నన్ను ఇట్టే తిరముగా (స్థిర చిత్తముతో) పెండ్లియాడినాడు. పోనీ, కలకాలము నన్ను కరుణించమనరే! నా ప్రియ సఖియలు కదా!

పద్యవివరణ:

తే.గీ॥ **మేటి నేర్పరులైనట్టి మెలతలార!**
కూటములు ఇరువురికిని గూర్పరమ్మ!
తలచినంతనె వచ్చిన వలపురేడు
తిరముగా పెండ్లియాడెను తరుణినిపుడె

సంఖ్య: XXVIII/72 రాగం : కేదారగౌళ

కీర్తన : సేయగల విన్నపము సేసితిమి నీతోడి

కేదారగౌళ

32 సేయగల విన్నపము సేసితిమి నీతోడి
పాయకిక నీయింతిని పాలించవయ్యా ॥పల్లవి॥

అడియాసలను కొంత ఆతుమను నొక కొంత
ఎడమాటలను కొంత ఇంపొందును
కడు తమకముల కొంత గడపు పొద్దులు సారె
పడతి చందంబులివి పరికించవయ్యా ॥సేయ॥

ఎదురుచూపులకొంత యెసగి సంతోషించు
మదరాగమునకొంత మనసు పట్టు
వెదకేటి గతులకొంత వేడుకల చెలరేగు
సుదతి భావంబులివి చూడగదవయ్యా ॥సేయ॥

తలపోతలను కొంత తడవు మిక్కిలి చెలగు
వలపులను వొకకొంత వాడుదేరు
ఎలమిగూడితివి నీవిపుడె శ్రీవేంకటేశ
చెలియనిటు వలెనె దయసేయగదవయ్యా ॥సేయ॥

ఉపోద్ఘాతము:

బ్రతిమిలాడి అలసిపోయిన చెలికత్తెలు స్వామితో తెగవేసి చెబుతున్నారు. ఆ చెలికత్తెలలో ఒకరైన అన్నమయ్య మధురకీర్తన రూపంలో మనకు అందిస్తున్నారు. ప్రభూ! నీతో చేయగల విన్నపాలన్నీ చేశాము. మా ఆఖరిమాట మన్నించవయ్యా! ఈ యింతిని వదలక ప్రేమతో పాలించవయ్యా! ఈమె విరహవేదన మేము చూడలేకున్నామయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ దేవా! నీతోడి మేము సేయగల విన్నపములన్నీ చేసినాము. ఇకనైనా యీ యింతిని పాయక (వదలక) పాలించవయ్యా! (ఏలుకోవయ్యా!)

ప్రభూ! ఈ పడతి చందంబులు (చేష్టలను) పరికించవయ్యా! (గమనించవయ్యా!) ఈమె పొద్దులు (రేబవళ్ళు) యెలాగడుపుచున్నదో గమనించు. కొంత అడియాసలతో (నీవామెను వదలవనే పేరాశతో) గడుపుతుంది. ఆత్మలో పరమాత్మ స్వరూపుడుగా నిన్ను భావించి కొంత సమయం గడుపుతుంది. మళ్ళీ ఇంతలోనేనీపై అలిగి యెడమాటలతో (విభేదించి మాట్లాడుతుంది, కొంతసేపు. మళ్ళీ ఇంపొందు మాటలు చెబుతుంటుంది. ఇవన్నీ అటుంచి కడుతమకమున (మిక్కిలి తన్మయత్వంతో) కొంతసేపు వుంటుంది.

ప్రభూ! ఇన్ని భావాలు ఆమెను ముప్పిరి గొనుచున్నప్పటికి ఆమె మనస్సులో వేడుకలు చెలరేగుతూనే వున్నాయి. నేను చెప్పబోయే సుదతి భావంబులు (వనిత ఆలోచనలు) పరికించవయ్యా! ఆమె కొంతసేపు నీకై యెదురు చూపులు చూస్తుంటుంది. కొంతసేపు తలపులు కలిగించిన సంతోషంతో గడుపుతుంది. కొంతసేపు మన్మథావస్థలో గడుపుతుంది. మనస్సులో పట్టుదల యెలావస్తుందా అని రకరకాల గతుల (విధానముల) వెదకుతూ కొంతసమయం గడుపుతుంది. ఇకనైనా ఈమెను కరుణించవయ్యా!

స్వామీ! ఆమె కొంతసేపు, తలపోతలను (అనేక రకములైన ఆలోచనలతో) గడుపుతున్నది. ఒక కొంత తడవు (సమయము) వలపులలో, మిక్కిలి చెలగి (అతిశయించి) వాడుదేరు (వడలిపోతుంది). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవిపుడే యెలమి గూడితివి సంతోషంతో దేవిని పొందినావు. ఇకపై ఆమెను ఇటువలెనే (ఇలాగే) దయచేసి నీ కృప చూపించవయ్యా!

పద్యవివరణ:

కం॥ **సేయగల విన్నపములను**
ఈయెడ సేసితిమి మేము ఇక నీ ఇచ్చే
శ్రీయుత వేంకటరమణా!
పాయక నీ యింతి నింక పాలింపుమయా!

సంఖ్య: V/215 రాగం : అభేరి
కీర్తన : మానరెమాయలు మగువలు-నే

అభేరి

33 మానరెమాయలు మగువలు-నే
గాను గాననుచు కనలీ శిశువు ॥పల్లవి॥

పాలట దొంగిలె బాలుడు గో-
పాలుల గూడుక పలుమరును
పోలవీ మాటలు బొంకులు యిది
యేలె యేలె మీరెల జవ్వనులు ॥మానరె॥

సారెకు వెన్నలు చవులట యీ
దూరులు మీకిక దొసగులును
చేరువ గరిమలు చెల్లవు - మీరు
పోరె పోరె వొరపుల నెర సతులు ॥మానరె॥

కింకలు మీకివి గెలుపులు - నెల
వంకలు మీకివి వన్నెలును
వేంకటపతి మీ విభుడట మీరు
బొంకక బొంకక పొలతులు మనరే ॥మానరె॥

ఉపోద్ఘాతము:

ఇవి బాలకృష్ణుని గురించి గోపికలు చెప్పుకొనే సుద్దులు. ఎంతో తేలిక అనిపించే బహుక్లిష్టమైన కీర్తన ఇది. ఓ మగువల్లారా! మీరు మాయ వేషాలు మానేయండి. పాపం ఈ శిశువును చూడండి. ఆపని చేసింది నేగాను (నేనుకాదు). గొననుచు (కానేకాదు అనుచు) ఎలా కందిపోతున్నాడో చూడండి. మీకు జాలి వేయటంలేదూ అంటున్నారు అన్నమయ్య. తానూ ఒక గోపికయై తోటి గోపికలతో చెబుతున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మగువలూ! (వనితల్లారా) ఈ బాలకృష్ణుడు శిశువు. ఆ పనిచేసింది నేగాను (నేనుకాదు) గాననచు (కాదనుచు) ఈ శిశువు కనలీ (ఆగ్రహించుచున్నాడు). ఇంకా యెందుకు పట్టుబడతారమ్మా?

ఈ బాలుడు అట (అక్కడ) పాలుదొంగిలె (పాలను దొంగిలించినాడు. ఈ పని యేదో ఒకసారి చేయలేదు. పలుమార్లు గోపాలురను కూడుకొని దొంగిలించినాడు. మేము చెప్పే ఈ మాటలు బొంకులపోలవు (అబద్ధాలు కావు). ఓ జవ్వనులారా! ఇదంతా మీరేల చేయుచున్నారు. ఏలె, ఏలె (ఎందుకే ఎందుకే)?

సారెకు (ప్రతిసారీ) వెన్నలు దొంగిలించి, చవులట (అందరికీ రుచి చూపుతాడట). ఈ దూరులు (తిట్లు) మీకు ఇక దొసగులును (విఘ్నములునూ) తప్పవట. మీ చేరువనే అతను యెన్ని గరిమలు (మహిమలు) చూపినా అవి చెల్లవు (నమ్మబడవు). ఓ నెరసతులూ (నేర్పరులైన సతులారా!) మీరు వొరపుల (ఘర్షణలను) వీడి పోరెపోరె (పొండి పొండి). ఈ బాలునితో గొడవెందుకు?

ఓ గోపికలారా! మీరు ప్రదర్శిస్తున్న కింకలు (కపట కోపములు) ఇవే మీకు గెలుపుకు ఆలంబనాలవుతున్నాయి. గోవిందుడు మీకు ఇవ్వబోయే అనురాగం ఎట్లాంటిదంటే, మీ గెలుపే, నెలవంక (చందమామ)లోని వన్నెలును (కళల సంపదలును). ఓ పొలతులారా (గోపికలారా) మీరు బొంకులు (పచ్చి అబద్ధాలు) మానండమ్మా! మీ యెదుటనున్న ఈ వేంకట విభుడే మీ విభుడట. ఇంకా యెందుకమ్మా! బొంకులు.

పద్యవివరణ:

కం॥ **మానరెమాయలు మగువలు**
తానాపని చేయలేదు తానెరుగననెన్
కానేకాదని కనలీ
ఈ నటనల శిశువుజాణ ఏపుగ బొంకున్.

సంఖ్య: XXIX/230 రాగం : గానమూర్తి
కీర్తన : వెలది సొబగులివి విన్నవించితిమి

గానమూర్తి

34 వెలది సొబగులివి విన్నవించితిమి
నెలకొని ఇక గరుణించవయా ॥పల్లవి॥

చెలపల చెలపల చెమటలు గారీ
వలపున బొడమిన వానలివి
సొలపుల సొలపుల చూపులు వొదలీ
తెలుపుగ వెన్నెల తేటలివి ॥వెలది॥

బుసబుసమను నూర్పులు చిగిరించీ
వసంతకాలపువరుసలివి
మిస మిస కాంతులు మెరుగులు వారీ
యెసగిన విరహపు టెండలివి ॥వెలది॥

మది మది గోర్కుల మంచులు గురిసీ
మదనుని యలహేమంత మిది
యిదె యిదె శ్రీవేంకటేశ యింతి గూడితి
వదలనికాగిళ్ళవాడికలివి ॥వెలది॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ భామిని సొగసులనన్నింటినీ ఏకరువుపెట్టాము. సుస్థిరచిత్తుడవై ఇక ఆమెను కరుణించే బాధ్యత నీదేనయ్యా! అంటున్నారు. తానుకూడా దేవికి ఆంతరంగిక చెలికత్తెయై. ఆకాలములోని కీర్తనలన్నీ ఇది వరకే వినినట్లు వుంటాయి. అందుకనే ఉపోద్ఘాతములో కీర్తన చరణాలను ప్రస్తావించటంలేదు. అన్నమయ్య భావన చాలా చోట్ల ఊహించవలసి

వస్తున్నది. ఇది హేమంత ఋతువవటంవల్ల మదిలోని కోర్కెలు మంచులాగా కురుస్తున్నది అంటున్నారు. అద్భుతం కదా!

తాత్పర్య వివరణ:

స్వామీ! ఈ వెలది (యువతి) సొబగులను (అందములను) నీకు విన్నవించితిమి. ఇక నెలకొని (నిశ్చయించుకొని) ఈమెను కరుణించుము తండ్రీ!

ప్రభూ! వ్యాకులపాటుతో ఆమెకు చెమటలు యెలా కారిపోతున్నాయంటే చెలపల చెలపలుగా (చిలువలు పలవులుగా) హఠాత్తుగా చూసేవారికి ఇవి వలపులు పొడచూపినందువల్ల కురిసిన వానలా అనిపిస్తున్నాయి. ఆమె చూసే సొలపుల చూపులు (ముగ్ధమోహనమైన చూడ్కులు) నీకు తెలుపవలెనంటే అవి వెన్నెల తేటలు (తరకలు).

దేవా! అసలే వసంతకాలము వరుసగా వచ్చేసింది. ఆమె బుసబుసమని నిట్టూరుస్తుంది. ఆ నిట్టూర్పులు వలపుతమకంలోంచి చిగురించిందా అనిపిస్తున్నది. సరే! వానలు పోయాక యెండలు రావాలి గదా? అవీ వచ్చాయి. ఆమె విరహము మిసమిస కాంతులతో యెసగిన (కూడుకొన్న) యెండ కాయిస్తున్నదా? అన్నట్లుంది.

ఇక హేమంత ఋతువువచ్చేసింది. ఇది మన్మథుడు విజృంభించే సమయం. వాడి పంచబాణాలు సామాన్యమైనవి కావు. మదిలో కోర్కు(ర్కె)లనే మంచు కురుస్తూనే వుంటుంది.ఓ శ్రీవేంకటేశ్వరా! పనిలోపనిగా నీవు ఈ ఇంతిని కూడితివి. ఏమో అనుకున్నాముకానీ నీ బిగికౌగిళ్ళు మంచి వాడితనము కలిగినవే ప్రభూ! కాకపోతేకాస్త చూసుకో దేవి వడలిపోగలదు.

పద్యవివరణ:

ఆ.వె॥ **వెలది సొబగులివియె విన్నవించితిమయ్య!**
కరుణజూపుమింక తరుణిపైన
ఇదె తిరుమలనాథ! ఇంతిగూడితివయ్య!
వాడి కౌగిలింత వదలవాయె.

సంఖ్య: XXVIII/2 రాగం : కళ్యాణవసంతం
కీర్తన : మేమెరుగమా యేమి మీ సుద్దులన్నియును

కళ్యాణవసంతం

35 మేమెఱగమాయేమి మీ సుద్దులన్నియును
ప్రేమములు దమకములు పెనగొనీ మీకు ॥పల్లవి॥

పలుకవే పతితోడ పగడవాతెరనోర
కులుకవే మచ్చికలు కొసరి కొసరి
చిలుకవే మోహములు సెలవినవ్వుల తేట
నెలకొన్న వేడుకలు నీయందే కలవు ॥మేమె॥

చూడవే నిడువాలు సోగ చూపులనితని
ఆడవే సరసంబు లంటివుట్టి
కూడవే కాగిటను గుబ్బ చనుగవనొత్తి
వాడికెలు మిగుల నీవలననే కలవు ॥మేమె॥

కలయవే పాన్పుపై కళలు మోమున పొదల
వెయవే రతిరాచ విభవములను
యెలమి శ్రీవేంకటేశు డితడిపుడె నినునేలె
కలికి చందములు నీకతననె కలవు ॥మేమె॥

ఉపోద్ఘాతము:

ఓ దేవీ! మేమెరుగమా యేమి? ఈ కథలన్నీ మాకు బాగా తెలుసును లేవమా! మీ ఇరువురికి ప్రేమ, తన్మయత్వమూ పెనవేసికొనిపోయినవి. ప్రణయ కళలన్నీ నీలోనే వేడుకతో నెలకొనినవమ్మా! పాన్పుపై కళలు చిందే మోముతో నీస్వామితో రతిసీమలేలవమ్మా! శ్రీవేంకటేశుడు నిన్ను యేలుకొన్నాడు ఓ ప్రభూ! ఈ కలికి చందములన్నియు నీవలననే కలిగినవయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! మీ సుద్దులు (మీ భార్యాభర్తల ముచ్చట్లు) మేమెరుగమా యేమి? (మాకు తెలియనివా యేమిటి?) మీకు ఒకరినొకరు చూడగానే ప్రేమములు (వలపులు) కలుగుతాయి. ఆ తరువాత ప్రేమవలన తమకములు (తన్మయత్వములు) కలుగుతాయి. ఆపైన మీరు ఒకరినొకరు పెనవేసుకొంటారు.

ఓ దేవీ! పగడవా తెరనోరు (పగడపు తెరవంటి ఎఱ్ఱని నీ నోరు తెరచి నీపతితో పలుకవే. కొసరి కొసరి అతనిపై మచ్చికలు చూపి కులుకవే (నీ కులుకును ప్రదర్శించవమ్మా!) తేట సెలవినవ్వులు (స్వచ్ఛమైన మందస్మితమువంటి నవ్వులు) నవ్వి మోహములు చిలుకరింపవమ్మా! అసలు వుండవలసినవేడుకలన్నీ నీయందే కలవు తల్లీ!

ఓ దేవీ! దీర్ఘమైన వాలు సోగచూపులతో ఆతని నొకపరి చూడవే.అంటివుట్టి (ఉత్సాహము తెచ్చుకొని) ఆతనితో సరసములనాడవే. చూసే వాళ్ళందరూ తన్మయత్వం చెందుతారు. దేవీ! నీ గుబ్బచన్నుగవనెత్తి స్వామి కౌగిటనుకూడుమమా! ఈ సరస, చతుర, ప్రవర్తన స్వామికి నీవలననే మిగుల అభ్యాసమైనవేమో?

సరే! నీ నిరీక్షణ ఫలించింది. నీ రమణుడు నిన్ను చేరవచ్చుచున్నాడు. కథ సుఖాంతం కాబోతున్నది. ఓ దేవీ! నీమోమున (వదనమున) కళలు పొదల (పదునారుకళలు పొడచూప) రతిరాజవిభవములను (మన్మథుని వైభవము) కన్నుల పండుగ చేయుచందమున వెలయవే (వర్ధిల్లవమ్మా!) అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడు, అతడిపుడే నిన్ను కూడినాడమ్మా! ఆ మనోహరికి ఆ చందములు (నేర్పులు) నీకతననే (నీమూలంగానే) కలవు (సిద్ధించినవి).

పద్యవివరణ:

కం॥ **మేమెరుగమటనె సుద్దులు**
ప్రేమములును తమకములును పెనగొని మీకున్
మోమునకళలే విరియగ
స్వామికి నీ చందమున వలపులు నెగడున్.

సంఖ్య: V/174 రాగం : రేతిగౌళ
కీర్తన : వెక్కసమగు కుచ విభవములు

రేతిగౌళ

36 వెక్కసమగు కుచ విభవములు
జక్కవ పులుగుల జగడములే ॥పల్లవి॥

చింత చేతనిదె చెలియనుదుటిపై
చెంతల చెదరిన చిరునెరులు
కాంత కన్నులను గండుమీలకును
కంతుడు వేసిన గాలములే ॥వెక్క॥

తమకంబున కాంతకు కరమూలపు
చెమటల తావుల చెలువములు
మమతల పెంచిన మరుని కొంతముల
జమళి తీగెలకు జలకములే ॥వెక్క॥

తెఱమోవిపై తిరువేంకటపతి
గుఱుతులు సేసిన కురుపసలు
ఒఱిగి వివశతల నుండగ సురతపు
మఱపులు దెలిపిన మర్మములే ॥వెక్క॥

ఉపోద్ఘాతము:

ఆమె అధికమైన కుచవైభవములు చక్రవాకపక్షుల జంట జగడమాడుచున్నవా అన్నట్లున్నది అంటున్నారు అన్నమయ్య. శృంగార కీర్తనలలో అగ్రతాంబూలం ఇవ్వాల్సిన కీర్తన ఇది అంటే అతిశయోక్తి కాదు. ప్రౌఢలు కానివారి సౌకర్యార్థం గోప్యం అవసరమైనది. పదపదానికి పసందైన వివరణ ఇవ్వవచ్చును. కానీ ఆ ప్రయత్నం చేయలేదు. ధ్యాస

పరమాత్ముని పై లగ్నంజేసి, భారం తిరుమలేశునిపై వేస్తే, ఆయనకృప వలన ఈ కీర్తన మీకు అవగతమవుతుంది.

తాత్పర్య వివరణ:

ఓ చెలియలార! ఇవి వెక్కసమగు (అధికంబని తోచుచున్న) ఈ దేవి కుచవిభవంబులు (స్తనయుగ్మముల వైభవములు) జక్కవ పులుగుల (చక్రవాకపక్షులు) జగడములె (కుమ్ములాటలే) అనిపించుచున్నవి.

ఆ సుందరిని చూచినారా? ఇదె చింతచేత (విచారమువలన) చెలియ నుదుటిపై చిరునెరులు (లేతముంగురులు) చెంతల (చేరువుగానుండి) చెదరిపోయినవి. ఈ కాంత కన్నులనబడే పెద్దపెద్ద మీలకు (చేపలకు) కంతుడు (మన్మధుడు) తీరికగా గాలము వేసినాడా అనిపించి, ఔను అవి గాలములే అనిపించుచున్నవి.

తన్మయత్వంలోనున్న ఈ కాంతకు బాహుమూలములనుంచి స్వేదము తావుల కనుపించుచూ చెలువములు (అందములను) ఇనుమడింపజేయుచున్నది. ఆమె వద్ద అటువంటి మరునికొంతములు (మన్మధుని ఆయుధసామాగ్రి) పుష్కలంగావున్నది. ఆమె మమతలతో పెంచిన పూలతీగెల జంటకు నీళ్ళు పోస్తుంటే, ఆమె వాటితో జలకములాడుచున్నది అనిపించుచున్నది.

చెలీ! తెఱమోవిపై (తెఱచియుండిన ఆమె అధరములపై) తిరువేంకటపతి గురుతులు సేసినాడు. అవి స్వామివారి కురుపసలు (గొప్ప చమత్కారములు... అని... నా భావన) సురతపు వివశత్వముతో బలహీనపడిన ఆ భామిని మఱపులగురించి వివరించాలంటే ఆమె మర్మములన్నీ తెలిపినట్లే మరి.

పద్యవివరణ:

తే.గీ॥ **వెక్కసంబగు కుచముల విభవములవి**
జక్కువపులుగుల జతల జగడమేమో?
మోవిపై తిరువేంకటమూర్తి గుఱుతు
మర్మముల దెల్పె దేవికి మఱవరాని.

సంఖ్య: VI/17 రాగం : కల్యాణి
కీర్తన : వలదననొరులకు వసమటవే

కల్యాణి

37 వలదన నొరులకువసమటవే
తలచినట్ల నిది దైవమె చేసె ॥పల్లవి॥

తరుణి కుచములను తామర మొగుడలు
విరిసేనో యని వెరపునను
సరగునపతి నఖ చంద్రశకలములు
దరులగలుగ నివి దైవమె చేసె ॥వలదను॥

పొలతి వదనమను పున్నమ చంద్రుడు
బలిమి నెగయునని భయమునను
మెలుత చికుర ధమ్మిలపు రాహువు
తలజెదరగ నిది దైవమె సేసె ॥వలదను॥

వనితకు వాడునో వలపు తాపమున
తనులతిక యనుచు తమకమున
ఘన వేంకటపతి కౌగిట చెమటల
తనివి దీర్చనిది దైవమె సేసె ॥వలదను॥

ఉపోద్ఘాతము:

ఓ దేవీ! ఘటనా ఘటన సమర్థుడైన ఆ దైవము తలచినట్లు జరుగుతుంది కాని, ఆయన నిర్ణయాన్ని వలదని తిరస్కరించుటకు ఇతరులకు సాధ్యమయే పనేనా తల్లీ! అంటున్నారు. దేవి చెలికత్తె అయిన అన్నమయ్య. తరుణి కుచములను తామెరల వికశిస్తున్నాయని దానిని నివారించడానికి చంద్రశకలములను బోలిన స్వామి నఖక్షతములను చూపి అవి వికసించి

తనను తాపానికి గురిచేయకుండా నివారించిందట. చూశారా దేవి సమయస్ఫూర్తి. ఈమెకా సమయస్ఫూర్తి కూడ దైవమే చేసె అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఇది (ఈ చెప్పబోవు) దేవి అగచాట్లను, దైవమే కల్పించినాడు. ఏదైనా ఆయన తలచినట్లే జరుగుతుంది. దానిని వలదన (కాదనుటకు) ఒరులకు ఇతరులకు వసమటవే (సాధ్యపడుతుందటనమ్మా?)

తరుణి కుచములను తామర మొగుడలు (మొగ్గలు) విరిసేనేమోయని వెరపునను (భీతితో) సరగున (వేగముగా) ఆదేవి సమయస్ఫూర్తితో ఆయన తన కుచములపై చేసిన చంద్రశకలములను బోలిన నఖ క్షతములను ఆతామెరలకు చూపినది. ఆమెకు ఈ దరులగలుగ (తరుణోపాయములు స్ఫురించుటకు ఆ దైవము చేతలే కారణము.

స్వామి రాకను వూహించినదేమో ఆ పొలతి (దేవి) వదనమను (ముఖమను) పున్నమి చంద్రుడు యెక్కడ బలముగ వుదయిస్తాడోనని భయపడి, ఆ మొలత (తరుణి) చికుర ధమ్మిల్లము (విరిసిన కొప్పు) రాహువువలె ఆమె వదన చంద్రికకు అడ్డము వచ్చింది. బుఱ్ఱ తిరిగిపోయేట్లు చేసేఇటువంటి సంఘటనలన్నీ ఆ దైవ నిర్ణయాలు కాక మరేమిటమ్మా?

ఈ లోపుగాఘనుడైన శ్రీవేంకటపతి యేమిచేశాడో తెలియునా?ఆ వనిత వలపుతాపమున వాడిపోతుందేమో, ఆమె తనూలతిక (లత) చిగురించదేమో అన్న సందియము కలిగినవాడై ఆమెను తన కౌగిట చెమటల తడిపినాడు. మరి ఇక వారి తనివి తీరనేలేదు. ఇది దైవముసేతలు కాక మరేమి?

పద్యవివరణ:

ఆ.వె॥ **తలచినట్లె జరుపదైవంబునకె చెల్లు,**
వలదుయనగ యొరుల వశము కాదు
దేవి తనువులతకు దేవుని కౌగిటి
చెమటలే జలములు చేవనీయ.

సంఖ్య: IX/105 రాగం : రామక్రియ
కీర్తన : కందము విందముగాక కన్నులారను

రామక్రియ

38 కందము విందము గాక కన్నులారను
అంది యెండ వెన్నె లైతే నదెవ్వరి మేలు ॥పల్లవి॥

కానీవె అందు కేమి కా దనఁగ వచ్చునా
మోనానఁ దాన(ను?)ంటేఁ జాలు మొక్కే నేను
పోనీ పోనీ వీరి వారి బద్దులైన వినెఁగా
ఆని వేము దియ్య నైతి నదెవ్వరి మేలు ॥కందము॥

తనలోనె నవ్వనీవె దాని కేమి దోసమా
వొనర మమ్ముఁ జెనకకుంటేఁ జాలు
కననీ కననీ తన కడలచుట్టరికాలు
అనుమె మిను మైతే నదెవ్వరి మేలు ॥కందము॥

మేలు మేలు యిది మేమె మేనవావి బలువా
యీలీల నన్నుఁ గడె నింతే చాలు
ఆలరి శ్రీవేంకటేశుఁ డంతటివాఁ డౌఁ గా
ఆలు మగఁ డొక్క టైతే నదెవ్వరి మేలు. ॥కందము॥

ఉపోద్ఘాతము:

మన కన్నులారా ఈ వింత గురించి కనెదము, వినెదము అది సరే, ప్రపంచంలో యెండ అంతా వెన్నెలైతే అది యెవ్వరికి మేలు చేస్తుందండీ! అంటున్నారు అన్నమయ్య. ఇదేమిటి? ఇతనికి నాకు మేనరికంవున్న మాట నిజమే. మరి అది అతని బలువా, గుత్తాధిపత్యమా? ఏది ఏమైతేనేమి ఈ విధంగా నన్నా ఆ శృంగారరాయుడు నన్ను కూడినాడు. ఇదే నాకు పదివేలు. ఓసి! పిచ్చిపిల్లా! శ్రీవేంకటేశ్వరుడంతటివాడు, మగడై ఆ యాలుమగలు ఒక్కటైతే అదెవ్వరికి మేలు?

తాత్పర్య వివరణ:

ఒక చెలికత్తె, దేవితో అంటున్నది. సఖీ! నేడు మనం కనులారా కందము విందముగాక (చూచెదము, వినెదములెండు). అయినా అంది నీకు తేలికగా లభ్యమైన యెండెంత అవసరం? ఆ యెండే వెన్నెలైతే అదెవ్వరికి మేలు?

చెలీ! అందుకేమి? కానీవే (జరిగేది జరగనీ) కాదనటానికి మనం యెవ్వరము? ఆతడు మోనాన (మాట్లాడక) వుంటే చాలు మొక్కేము (శతకోటి వందనాలు). పోనీవే! ఆయన మొండివాడు. వీరువారు మంచి బుద్ధులు చెబుతే వింటాడటమ్మా? వేము (వేపచెట్టు) చేదైతే కనీసం ఔషధంగానన్నా పనికివస్తుంది. అది తియ్యనైతే ఎవరికి మేలు? ఆయన సహజగుణాలను ఆయన్నే అట్టేపెట్టుకోమనవే.

చెలీ! నన్ను చూచి తనలో తను యెలా నవ్వుకొంటున్నాడో చూడండే. కానీలే దానికేమి దోసము? మమ్ము యేదో ఒక నెపంతో చెనకకుండా వుంటే (తాకకుండా వుంటే) చాలు. మాకు అదే పదివేలు. తనకూ నాకూ మధ్యను కడల చుట్టరికాలు (అతిశయించిన బంధుత్వాలను) కననీ కననీ లెక్కచేస్తాడేమో చెయ్యనీ చూద్దాం. ఓ చెలీ! మినుములు అనుములు అయితే యెవరికి మేలు జరగుతుందే?

చెలీ! మేలు మేలు (చాలా బాగున్నదమ్మా!) అతనికి నాపై అంత అధికారమేమిటే? ఎంత మేనరికపు మరదలినైనా మరీ అంత బలువా (గుత్తాధిపత్యమా)? సరే! పోనీలే. ఈ విధంగానన్నా ఆ శృంగారరాయుడు నన్ను గూడినాడు. నాకు అదే చాలు. శ్రీవేంకటేశ్వరుడంతటివాడు మగడైతే ఆ దంపతులు ఒక్కటైతే అదెవ్వరి మేలే? ఆత్మకా? పరమాత్మకా?

పద్యవివరణ:

కం॥ **కందము విందము కనులన్**
అందిన యెండాయె వెన్నెలది మేలానే
పొందెనను వేంకటేశుడు
అందముగా ఆలుమగలు అవరెయొకటిగా?

సంఖ్య: IX/77 రాగం : లలిత
కీర్తన : మదనరాగము నీకు మదనాతురము నాకు

లలిత

39 మదనరాగము నీకు మదనాతురము నాకు
యెదు రెదురఁ గలిగె నిందుకే మెచ్చితిఁ బో ॥పల్లవి॥

నిలువుల చెమటల నీమేను చూచి నా
నిలువెల్ల జెమరించె నేఁ డిదివో
కలువ కన్నుల నీ కావి చూచి నా కన్నుఁ
గలువలు కావి దేరిఁ గాఁకల కోపమునా ॥మద॥

వేఁడి నిట్టూరుపుల నీ వేషము చూచి నాకు
వేఁడినిట్టూర్పులు రేఁగె వెల్లవిరి
వాడుదేరెకళల నీ వదనము చూచి నేఁడు
వాడుదేరి చిన్నఁబోయ వదనము నాకు ॥మద॥

యెవ్వతో కాఁగిటి నీ యీ మేనిపచ్చి చూచి
యివ్వల నీ కాఁగిలి నీ కెక్కె నిపుడు
రవ్వల శ్రీ వెంకటేశ రతుల సంగడి నిట్టె
నివ్వటిల్ల నిన్నంటి నీయంత నైతి ॥మద॥ **77**

ఉపోద్ఘాతము:

ప్రభూ! మనిద్దరికి మదనతాపము కలిగినట్లు అనుపించినా నీది వున్నతమైన అనుభూతి. నాది సర్వసాధారణమైన అనుభూతి. నీకు మదనరాగము, నాకు మదనాతురత. ఎంత తేడా వున్నది. మళ్ళీ మనము యెక్కడో దూరదూరముగా నున్నామా అంటే యెదురెదురుగానే వున్నాము. ఇందుకే నిన్ను మెచ్చితిని బో, అంటున్నది నాయిక. ఆవిడ మరెవరో కాదు

అన్నమయ్యే. కొన్ని తావులనా వివరణ సామాన్యంగా వుంటే, అది నా నేరము కాదు. ఇది అనంత సాగరాన్ని తెప్పలో దాటాలనే దుస్సాహసమే.

తాత్పర్య వివరణ:

స్వామీ! నీకు మదనరాగము (మన్మథలీలవలన కలిగిన అనురాగము). మరి నాకు మదనాతురము (మన్మథ తాపము). వింత యేమంటే, మన మిరువురము యెదురెదురుగానే వుండటం కలిగినది. ఇందుకే నేను నిన్ను మెచ్చితినిపో.

ఇదివో నేడు చూచితివా? నీ శరీరంపై నిలువెల్లా చెమటలు చూచి నా తనువు నిలువెల్లా చెమరించినది. నీ కలువకనులు యెరుపెక్కినవి. అది చూచి సంతోషించాలి కానీ, కాకలు తీరిన కోపముతోనున్న నాకు, నా కన్నులు కూడా అరుణిమలైనవనే విచక్షణ నశించినది.

స్వామీ! నీవు శృంగారరాయడివి. నీ వేషము చూస్తే ఈ అలంకరణ యెవ్వతెకోసమోనని నేను వేడి నిట్టూర్పులను వదలలేక తిప్పలు పడుతున్నాను. రేగిన ఆ వేడి నిట్టూర్పులు వెల్లివిరిసినవి (అతిశయించినవి). కళలు శోభిల్లు నీ వదనమును చూచి నాలోని కళలన్నియు వాడుదేరె (వాడి అయినవి). కానీ నేడు నీపై అలిగినందువల్ల నాకు కళలన్నీ వడలిపోయి నా వదనము చిన్నబోయినది.

స్వామీ! ఎవ్వతో నీ కౌగిలిలో నీ మేనిపచ్చి (శరీర సౌందర్యం) చూచిందని ఇక్కడ నీ కౌగిలిలో నీకే ఇప్పుడు ప్రేమోద్రేకము అధికమైనది. వజ్ర సమానుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! సంగడిరతుల (జంటరతులతో) ఇట్టే నివ్వటిల్ల (అతిశయించగా) నీకే చెల్లినది అనుకోకు. నిన్నంటి (నీ సహచర్యములో) నేనూ నీయంతనైతిని. అది నేను నీకు వేరుగా వివరించవలెనా ప్రభూ!

పద్యవివరణ:

తే.గీ॥ **మదనరాగము నీకాయె మదనతపన**
నాకు మిగిలె, యెదురెదురు నయమునున్న
ఇందుకే మెచ్చితిని బొమ్ము ఇందిరేశ!
రతుల నీయంతనైతిని పతివి నీవె.

సంఖ్య: IX/39 రాగం : వరాళి
కీర్తన : నీటముంచు పాలముంచు నీ చిత్తమికను

వరాళి

40 నీట ముంచు పాల ముంచు నీచిత్త మిఁకను
యీటగు నీపతిభావ మిది గలది ॥పల్లవి॥

తప్పక చూచుఁ జూచు తలవంచు నంతలోనె
వుప్పతిల్లఁ బులకించు నుస్సు రనును
కప్పురగంధి నీవుఁ గదిసి కూడిన కాఁక
చెప్పరాదు విరహము చెంతల నీపతికి ॥నీట॥

చిన్నఁబోవు నంతలోనె చెలులపైఁ గోపగించు
కన్నచో వెదకు మేనఁ గప్పు కప్పును
కన్నెరొ విభుఁడు నీవు కళ లంటినదాఁక
మిన్నక చింతాజలధి మీరరాదో యమ్మ ॥నీట॥

బుద్దు లెంచుకొను లోలో పోసరించి కల్లపడు
అద్దివో శ్రీవేంకటేశుఁ డాడ నాడనె
వొద్దికై నీ విటువలె వొనగూడి వుండుదాఁక
చద్దికి వేఁడికి వెదచల్లు లాయ వలపు. ॥నీట॥

ఉపోద్ఘాతము:

ఓ దేవీ! శుష్కవచనములు చెప్పే అలవాటున్న నీపతి భావమేదో విన్నావా? ప్రియా! నీటముంచినా పాలముంచినా ఇక నీ చిత్తము అంటున్నాడు. ఆయన భావమిట్లావున్నది. ఎంత మాయగాడమ్మా! నీ పతి వేంకటేశ్వరుడు. ఒద్దికై నీవు కూడగానే యెంత ఆడినాడే!! పైగా చద్దికి వేడికి వలపులు వెదచల్లుతాడాయె. నీవు లొంగిపోక యేమి చేయగలవు? అంటున్నది దేవి చెలికత్తె. ఆవిడ యెవరో తెలియనిదికాదు. మన అన్నమయ్యే ఇంతకీ చద్దికి వేడికి అంటే యేమిటి?

తాత్పర్య వివరణ:

దేవీ! యీటగు నీపతి (శుష్కవచనములు చెప్పే నీ నాథుడి) భావము, ఇది గలది (ఇలావున్నది). నీటముంచినా పాలముంచినా ఇకను (ఇకపై) నీ చిత్తము (నీ ఇష్టము). ఎంత జాణయో చూచినావా?

ఆయన చేష్టలు చూచినావా? ఒక్కొక్కసారి తప్పక (తదేకంగా) నీకేసి చూస్తూనే వుంటాడు. అంతలోనే తలవంచుకొంటాడు. పులకించి పోతాడు. ఉస్సురని నిట్టూరుస్తాడు. ఓ కర్పూరగంధీ! నీవు చేరువయై ఆయనను కూడితే వేడెక్కిపోతాడు. ఆయన విరహవేదన ఇక చెప్పరాదు తల్లీ! నీ పతికి నీవెంత చేరువైతే ఆయన అంత వేడెక్కిపోతాడు.

దేవీ! ఇంకా చెప్పటానికి చాలా వున్నది. అంతలోనే చిన్నబుచ్చుకొంటాడు. తన చెలికత్తెలపై చిరాకుపడి కోపగించుకొంటాడు. ఎదురుగా కనుపిస్తున్నా తన వస్తువులను వెదకుతాడు. ఒక్కొక్కసారి తన శరీరం కప్పేసికొంటాడు. ఓ అమ్మాయీ! నీ విభుడు నీవు కళలంటినదాకా (కళ కళలాడినదాకా) వూరకనే చింతాజలధి (దుఃఖసాగరంలో) వుండిపోతాడు. ఓయమ్మా! ఆయనను నెగ్గటం చాలా కష్టం.

దేవీ! ఈయన సంగతి ఇంకా చెబుతాను విను. నీవు ఆయనగారిపై అలిగినవేళ, లోలోన (తన మనస్సులోనే) నీ బుద్దులు (సద్గుణములను) గుర్తుకు తెచ్చుకొని తృప్తిపడతాడు. మళ్ళీ అంతలోనే పోసరించు (పురుషాహంకారముతో మాట్లాడతాడు). అంతలో కల్లపడు (తనెంత తప్పుచేశాడోనని తనను తానే నిందించుకొంటాడు). నీవు ఆహ్వానించావని నేడు శ్రీవేంకటేశ్వరుడు సంతోషంతో ఎలా నర్తిస్తున్నాడో చూడు. ఒనగూడి ఒద్దికయై నీవిట్లా ఆయనను కూడగానే, చద్దికి వేడికి (తెల్లవారుఝామున మరియు మధ్యాహ్నమువేళ) నీపై వలపు వెదచల్లులాయె ఇకనేమి?

పద్యవివరణ:

ఆ.వె॥ **నీట ముంచు పాల నిలువునా ముంచుము**
నీదు చిత్తమికను నీపతియను,
వేంకటేశుడాడె వెలది వొద్దికజేర
చద్ది వేడికి వెదచల్లె వలపు.

సంఖ్య: IV/427 రాగం : వరాళి
కీర్తన : శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే

వరాళి

41 శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే
దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే ॥పల్లవి॥

పదునాలుగేండ్లను బాసి నీ కెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి
కదిసి నీశరణంటే కరిరాజునెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి ॥శ్రీప॥

ప్రక్కన నహల్య శాపవిమోచనముగాఁగ
అక్కరతోడుతను బ్రత్యక్షమైతివి
చక్కఁగాఁ దపముసేసేశబరియెదుట నీవు
అక్కడ నాఁ డందునుఁ బ్రత్యక్షమైతివి ॥శ్రీప॥

భావించినట్టు మతిఁ బరమయోగులకెల్ల
తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి
శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు
దైవమవై యిప్పుడే ప్రత్యక్షమైతివి ॥శ్రీప॥

ఉపోద్ఘాతము:

"ఓ శ్రీపతీ! నీకు యెదురుచూచేనాకు ఇట్లనే దాపై నేడు ఇప్పుడే ప్రత్యక్షము కావయ్యా!" అని పల్లవిని విడదీస్తే యెంత తేలికగా అర్థమయిందో చూడండి. అయితే అన్నమాచార్యులవారిని అంత తేలికగా తీసికొనరాదు. చరణాలు మొదలుపెట్టగానే నీవే తప్ప నితఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్ అనవలసిందే. తినబోతూ రుచి అడగటం దేనికండీ! మొదలు పెట్టండి. ఈ కీర్తన మీకెన్నో పౌరాణిక వాఙ్మయం పరిచయం చేస్తుంది.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీపతీ! నీ కొరకై యెదురుచూచే నాకు ఇట్లనే (ఇలాగే) దాపై (నన్ను సమీపించి) నేడు, ఇప్పుడే ప్రత్యక్షముగావయ్యా! నా కనువిందుజేయుము తండ్రీ!

ప్రభూ! ఆనాడు నీరామావతారములో పదునాలుగేండ్లు వనవాసము పోవుచు గుహుని ఆతిథ్యం స్వీకరించి మరల పదునాలుగు సంవత్సరాల తరువాత అదన (తగు సమయానికి) ప్రత్యక్షమైతివి. అదే నీ వాగ్దానం అంటే. నిన్ను శరణువేడి రోదించు కరిరాజునెదుట (కాననములో మొసలిచే) పీడించబడుతున్న గజేంద్రునికి, అదివో తొల్లియు (అంతకుమునుపే) ప్రత్యక్షమైతివి. నీవు శరణాగత రక్షకుడవనుటకు వేరే ఆధారములు కావలెనా?

స్వామీ! ఆనాడు గౌతముని శాపగ్రస్తయైన అహల్య అచేతన శిలవోలెనుండగా ఆమెను కరుణించి రామావతారంలో నీపద స్పర్శచే తిరిగి నాతిని చేసి ఆమె భర్తకిచ్చి ఆమెకు ప్రత్యక్షమై నీవెవరవో స్ఫురణ నిచ్చితివి. నీ కొరకు యేండ్లును పూండ్లును తపస్సు చేస్తూ జీవిత చరమాంకానికి వచ్చిన శబరి యెదుటకు వచ్చి, అక్కడ నాడు అందును (ఆ సందర్భంలోనూ) ఆమె మనోనేత్రానికి ప్రత్యక్షమై ముక్తి నొసంగితివి.

దేవా! నిచ్చలు (ప్రతినిత్యము) తావుకొని (వారున్నచోటికే వెళ్ళి) పరమయోగీంద్రులు నిన్ను యే విధంగా భావిస్తే ఆ విధంగా ఆ రూపంతో ప్రత్యక్షమవుతావు. అంతెందుకు, నేడు శ్రీవేంకటేశ్వరుడవై తిరుమలలో నిన్ను జింతించు (ధ్యానించు) మా బోంట్లకు (మావంటివారికి) కనులయెదుట దైవమవై ఇప్పుడే ప్రత్యక్షమైతివి. ధన్యుడను తండ్రీ!

పద్యవివరణ:

ఉ॥ **శ్రీపతి నిన్నుజూచుటకు చేసి నిరీక్షణ యుంటినయ్య నా**
దాపునకొచ్చి కన్పడవె తామరకన్నుల నీలవర్ణుడా
ఓపికతోడ నెందరినొ ఒద్దకు చేరుచు బ్రోచినాడవే
ఏపుగ వేంకటేశ్వరుడ ఏలుము నాసరి ఆర్తశ్రేణులన్.

సంఖ్య: IV/311 రాగం : సామంతం
కీర్తన : దైవమొక్కడే సంతత భజనీయుడు

సామంతం

42 దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు
భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు ॥పల్లవి॥

హరియే నకలాంతరాత్మకుఁ డటుగాన
తిరమై యొకరి నిందింపఁదగదు
అరయఁగ లోకములనిత్య మటుగాన
మరిగి కొందరిమీఁదిమమతయు వలదు ॥దైవ॥

బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన
గహనపుఁదనవుద్యోగము వలదు
సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన
వహిఁ దానేఇచ్చినవి వలదనఁదగదు ॥దైవ॥

తపములు జపములు దాస్యమూలమె కాన
వుపమల సందేహమొగి వలదు
యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి
చపలచిత్తమువారి సంగమిఁక వలదు ॥దైవ॥

ఉపోద్ఘాతము:

ఎంత అధికారమూ సంపదావున్నా తోటి నరులను దేహి అనరాదు. అహర్నిశలూ భజింపదగినవాడు ఆ దైవమొక్కడే. ఇక ఆయన మననుంచి ఆశించేది యేమిటి? భావంలో కూడా సమబుద్ధి కలిగియుండటం. తరువాత కలిగిన ఆ సమభావన పాయగతగదు. జీవితాంతం అంతా ఈశ్వరసృష్టియే అందరూ సమానులే అంటున్నారు అన్నమయ్య. నవవిధభక్తి మార్గాలలో వేంకటేశునిదాస్యమును మించినది లేదు. ఎందుకంటే అది చపలచిత్తాన్ని అణచివేస్తుంది.

తాత్పర్య వివరణ:

ఓ నరులారా! ఈ సృష్టిలో సంతత భజనీయుడు (నిరంతరం భజింపదగినవాడు) ఒక దైవమే. ఆ తరువాత మనదైనందిన జీవితంలో, సమబుద్ధి (సృష్టిలో ప్రాణులన్నియూ సమానమే) అనే భావనను వదలరాదు. ఆ భావన పాయగదగదు (మరచుట తగినపనికాదు).

ఓ నరులారా! శ్రీహరియే సకలాంతరాత్మకుడు (సర్వుల ఆత్మలలో ఆత్మరూపిగానెలకొనియున్నాడు) అటుగాన (అందుచేత). ఈ భావన తిరమై మనస్సులో స్థిరపడి) యొకరి నిందించదగదు (పరులను నిందించరాదు). అరయ (అదే విధంగా) లోకములనిత్యములు (పదునాలుగు భువనాలు అశాశ్వతమైనవే. మరి కొందరిపై మరిగిన (పెల్లుబికిన) మమకారములు నిరుపయోగము కదా!

అనేక వైవిధ్యములతో కృత్రిమంగా కల్పింపబడిన వాటికి మూలము యేది? ప్రకృతియే. గహనపు తన వుద్యోగము (ఎఱుకలేని వుద్యోగమును) చేపట్ట తగదు. సర్వేశ్వరుడు, సహజ విహారుడు (యధేచ్ఛగా యెక్కడైనా విహరించుటకు సర్వసమర్థుడు). వహి (అందుచేత) తానే అనుగ్రహించినవి, కాదనుటకు మనకే అర్హతా లేదు. అవునా?

ఓ మానవులారా! భగవంతుని సేవించుటకు నవవిధ భక్తి మార్గాలను జ్ఞానులు తెలిపినారు. తపములు, జపములు ఇవన్నియూ శ్రేష్ఠమైనవే అయినా అంతులేని సందేహాలను కలిగిస్తుంటాయి. ఈ నవ విధభక్తి మార్గాలకు మూలము ఆ దైవమును దాస్యముతో సేవించుట. ఎప్పుడైతే శ్రీవేంకటేశ్వరుని సేవించి చపలచిత్తము గలిగినవారి (రుచులు కావాలని కోరుకొనేవారి) సాంగత్యము వదలి నిరంతరం దేవుని శరణాగతిలో జీవించుట, మేలు.

పద్యవివరణ:

కం॥ **సతతము దైవంబొక్కడె**
హితముగ భజనీయుడైన హితకరుడతడే
జతయై సమబుద్ధిగుణం-
బతులితముగ బాయదగదు హరినన్నెపుడున్.

సంఖ్య: IV/350 రాగం : సామంతం
కీర్తన : ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు

సామంతం

43 ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు ॥పల్లవి॥

అరసి ధ్రువుని గాచినట్టి నీవు
కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు
కరిరాజు శరణంటేఁ గాచిన నీవు
కరతలామలకమై కలవుగా నీవు ॥ఇందరి॥

గట్టిగా విభీషణుఁగాచిన నీవు
అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు
చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు
కట్టిన ముడుపవై కలవుగా నీవు ॥ఇందరి॥

కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు
కిమ్ముల లోకములు రక్షించే నీవు
నెమ్మది శ్రీవేంకటనిలయ నీవు మాకు
కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు ॥ఇందరి॥

ఉపోద్ఘాతము:

నీవు యెంతమందిని కాపాడినావు ప్రభూ! ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, విభీషణుడు, ద్రౌపది, బలిచక్రవర్తి, సుగ్రీవుడు ఇలా యెంత వెతికితే అంతమంది నీ శరణాగతులున్నారు. ఓ శ్రీవేంకటనిలయా! నీవు మా మనస్సులోనేనెలకొనియున్నావు. మమ్మల్ని ఆక్రమించుకొని మా సమీపముననే నున్న అండదండై నీవు మాకు కలవు తండ్రీ! అంటున్నారు అన్నమయ్య. ఇందరిగాచిన యట్టి నీవు నాకు ఇట్టే నిధానమవైకలవు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ప్రభూ! ఇట్టే ఇందరిని, గాచిన (రక్షించిన) నీవు నాకును కందువ (సామర్థ్యముతో) నిధానమవై (నిక్షేపమువలె) కలవు. నీవుండగా నాకు భయమేల తండ్రీ!

స్వామీ! నీ దీనజనోద్ధరణ ఈనాటిదా? యుగాల నాటిది. అరసి (చూచి) ధ్రువుని సంరక్షించిన నీవు ఆ తరువాత దుష్టదానవుడైన హిరణ్యకశిపుని బారినుండి ప్రహ్లాదుని రక్షించితివి. కరిరాజు (కాననములో మొసలిచే పీడించబడుచున్న గజేంద్రుని) పరుగు పరుగున వెళ్ళి కాచితివి. నీ శరణాగతులకు కరతలామలకమై (అరచేతిలోని ఉసిరికాయవలె)అప్పటికప్పుడు అందుకొనుటకు నీవుకలవుగా! ఇక భయమేల?

ఓ దేవదేవా! ఆనాడు విభీషణుని గట్టిగా (కృతనిశ్చయుడవై) రక్షించిన నీవు, తదుపరి ద్వాపరయుగమున ద్రౌపదీ వస్త్రాపహరణమునాడు ఆమె మానమును సంరక్షించితివి. బలి బలమును నిర్జించి మూడడుగులు చాలని వామనమూర్తివి త్రివిక్రముడవై సద్గతినిచ్చి ఆ బలిచక్రవర్తిని రక్షించితివి.నాబోటి బలహీనులకు కూడా కట్టిన ముడుపు (మొక్కుబడివలె) కలవుగా (వుంటివి కదా!)

ఓ వేంకట నిలయా! కమ్మర (ఆ వెనుక) వాలిని వధించి సుగ్రీవుని కాపాడితివి. కిమ్ముల (అనేక పర్యాయములు అనేక విధముల ఈ లోకములను రక్షించితివి. కమ్ముకొని (ఆక్రమించుకొని) నీవుమాకు దాపుదండై (సమీపముననేవున్న ప్రాపకమువలె) కలవుగా (ఉంటివి కదా!)

పద్యవివరణ:

తే.గీ॥ ఇందరినిగాచినట్టి నీవిట్టె నాకు
కందువ నిధానమైతివి కలిగినాకు
నెమ్మదిని వేంకటనిలయ నీవు మాకు
కమ్ముకొని దాపుదండౌచు కలవు దేవ!

సంఖ్య: III/199 రాగం : లలిత
కీర్తన : నమో నారాయణ నావిన్నప మిదివో

లలిత

44 నమో నారాయణ నావిన్నప మిదివో
సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే. ॥పల్లవి॥

మనసు నీయాధీనము మాటలు నీ వాడేటివే
తనువు నీపుట్టించిన ధనమిది
మును నీపంపున నిన్ని మోచుకున్న వాఁడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే. ॥నమో॥

భోగములెల్లా నీవి బుద్ధులు నీ విచ్చినవి
యీగతి నాబతుకు నీవిరవైనది
చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే. ॥నమో॥

వెలి నీవే లో నీవే వేడుకలెల్లా నీవే
కలకాలమును నీకరుణే నాకు
యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే. ॥నమో॥ 199

ఉపోద్ఘాతము:

భక్తిజాలువారే అన్నమయ్య కీర్తననాస్వాదించండి. ఓ నారాయణుడా! నీకు నమోవాకములు. ఇదివో నా విన్నపములాలకింపుము తండ్రీ! నీకు నేనెట్లు సమానమైతాను ప్రభూ!ఓ సర్వేశ! నన్ను రక్షించవయ్యా! అంటున్నారు.

నా మనస్సు నీ అధీనంలో వుంటుంది కాబట్టే అది నీవేం మాట్లాడమంటే అది మాట్లాడుతుంది (మంచైనా, చెడైనా). మరి నా మీద నేరాలెందుకేస్తావు స్వామీ! అంటున్నారు. నేను భోగాలనుభవిస్తున్నానంటే

నీవిచ్చిన బుద్ధితోనే కదా! నా శరీరం వెలుపలా నీవే, లోనా నీవే కదా! ఇక నాకు నీ కరుణవుంటే చాలదా?

తాత్పర్య వివరణ:

ఓ శ్రీమన్నారాయణుడా! నీకు నమస్కరించుచున్నాను. ఇదిగో నా విన్నపమునాలకింపుము. నేను నీకు సమానుడగాను (సరిపోల్చదగినవాడను కాను). ఓ సర్వేశ్వరా!నన్ను రక్షింపుము తండ్రీ!

ప్రభూ! నా మనస్సు నీ ఆధీనములో వుంటుంది. అందుకే నేను మాట్లాడే మాటలు నావి కావు. అవి, నీవే. నా తనువు (శరీరము) నీవు పుట్టించిన ధనము. అయితే ఇవన్నీ నావనే భ్రమ కలుగుతున్నది. కానీ నీ పంపున (ఆజ్ఞపై) నేను ఇవన్నీ మోస్తున్నాను. ఇందులో నా తప్పేముందయ్యా? ఇక నా వెనకటి నేరాలన్నీ యెంచి శిక్షించక, రక్షించుము స్వామీ!

స్వామీ! నేను భోగాలు అనుభవిస్తున్నానంటే అది నీవిచ్చిన బుద్ధులతోనే కదా! ఈ విధంగా నా బ్రతుకంతా నీ ఇరవైనది (అధీనమైనది). చేగదీర (కావాలని) నీవు చేసిన మనిషినే నేను. ఇంతేకదా! ప్రభూ! నాలో యెంత వెదకితే అంత అజ్ఞానం వున్నది. దాన్ని వెదకినందువల్ల నీకేమి ప్రయోజనం? అదేమి చూడక నన్ను రక్షించుము దేవదేవా!

ప్రభూ! నావెలి (శరీరం బయట) నీవే వున్నావు. నాలోనా (నా అంతరాత్మలోనూ నీవే వున్నావు.) అందుకనే నేనేం వేడుక చేసికోగలిగినా అది నీ వల్లనే. నాకు నీ కరుణ కలకాలమూ వుండాలయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఇల (ఈ లోకంలో) నేను నీవు యేలుకొంటున్న బంటును. ఇంతేనయ్యా! నా నెలవు (గమ్యము) తప్పించక (చెడగొట్టక) రక్షించుము తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **నారాయణా నమో నమె**
ఆరూఢిగ విన్నపముల నాలింపుమయా
నీరూపమునకు సరియా
సారింపుము దయను కాచి సంరక్షించన్.

సంఖ్య: IV/349 రాగం : బౌళిరామక్రియ
కీర్తన : ఎన్నడు నేగందు నిందు నిందిరాపతి నీవే

బౌళిరామక్రియ

45 ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవే
కన్ను లెదుటనుండి కరుణింతుగాక ॥పల్లవి॥
పొడమినయట్టి నిన్ను పొంచికొలిచేనంటే
కడు నాకప్పుడు వివేకము చాలదు
అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁబోతే
వడి జవ్వనమదము వశమిందుగాదు ॥ఎన్నఁడు॥
వెనక నేఁ బ్రౌడనై విరతిఁ బొందేనంటే
ధనవాంచ నేమియుఁ దడవనీదు
తనువు ముదిసి నీకుఁ దపముసేసేనంటే
వానర నేమిటికి వోపికలేదు. ॥ఎన్నఁడు॥
శ్రీవేంకటేశ యీసిలుగులఁబెట్టనేల
కైవశమై నీవు గలిగుండఁగా
నీవే కృపసేసి నేఁడిటుగావకున్న
పావనమైన యీ పదవెందుఁగద్దు ॥ఎన్నఁడు॥ **349**

ఉపోద్ఘాతము:

ఓ ఇందిరాపతీ! నిన్ను నేనెప్పుడు కనులారా గాంచెదనయ్యా? నీవు నా కన్నులెదుటనే వుండి కరుణింతువుగాక అంటున్నారు అన్నమయ్య. బహు సుందరమైన ఈ కీర్తనలో నీవు నాకు కనపడంగానే కొలిచి ఆరాధించెదనంటే అప్పుడు నాకు స్పృహవుంటుందో వుండదో? నా వివేకము చాలుతుందో చాలదో... ఇట్లా నాకు అన్నీ సందేహాలే. పైగా కామక్రోధ మోహవశవర్తనుడను. చూస్తుండగానే యవ్వనం పోయి ప్రౌఢనై చివరికి ముదుసలినయ్యాను. మృత్యువెప్పుడు యే మలుపులో వస్తుందో తెలియదు. ఓ వేంకటేశ్వరా! ఇంకా నన్నెందుకు సిలుగుల బెట్టెదవయ్యా? పావనమైన నీ దివ్యపదవి నివ్వవయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ ఇందిరా రమణా! ఇందు (ఇక్కడ) నేను నిన్ను ఎన్నడు గందునయ్య! నీవే నా కన్నుల యెదుట కనబడి కరుణించెదవు గాక!

బాల్యంలో నీవు ప్రత్యక్షమైనపుడు వేచి నిన్ను కొలిచేనంటే నాకప్పుడు స్పృహ వివేకము చాలదు. పోనీలే ఆ తరువాతనైనా నీ గురించి తెలుసుకొందామా అంటే నా యౌవన మదమును వశములో వుంచుకోవటం సాధ్యపడుటలేదు. మరి నేనేం చేయాలి ప్రభూ!

సరే! పోనీలే ప్రౌఢనయ్యాక విరతి (విరక్తి) సంపాదిద్దాములే అనుకొన్నాను. కానీ విపరీతమైన ధనవాంఛ నన్ను పట్టుకొని తడవనీదు (నన్ను ప్రశాంతంగా వుండనియ్యదు) సరే! పోనీ నా శరీరం ముసలిదయ్యాక వేరే పనేమీ లేదు కాబట్టి నీకోసం తపస్సు చేద్దామనుకొన్నాను. కానీ ఇప్పుడు చూస్తే నా శరీరంలో వోపికలేనేలేదాయె.ఇప్పుడెట్లా ప్రభూ!

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకా నన్ను బాధలుపెట్టటం ఎందుకయ్యా? నాకుకైవశమై (స్వాధీనుడవై) నీవుండగా నాకేమి తక్కువ? నీవే నాపైదయచూపి నన్ను రక్షించకపోతే పావనమైన ఈ ముక్తి పదవి నాకెలా దక్కుతుంది ప్రభూ!

పద్యవివరణ:

సీ॥ **పొడమిన నిన్నట్టి పొంచి కొల్చేనంటె**
కలవివేకంబది చాలదాయె
అపైన తెలియంగ నేపాటుబడబోతె
జవ్వనమదమెక్కినివ్వటిల్లె
ప్రౌఢనై విరతికి పలుమార్లు యత్నింతు
ననిచూడ ధనవాంఛ వినదు నన్ను
తనువు ముదిసి నీకు తపముచేసెద నన్న
వానర వోపికయది కానరాదు

తే.గీ॥ **వేంకటేశ! యీసిలుగుల బెట్ట నేల?**
ఎన్నడు నిను నేగందును ఇందిరేశ!
కన్నులెదుటనే నీవుండి కరుణజూడు
పావనంబైన పదవిది ఎవనికబ్బె?

సంఖ్య: IV/348 రాగం : బౌళి
కీర్తన : ఏమిసేయుదు నింతయు నీమాయ

బౌళి

46 ఏమిసేయుదు నింతయు నీమాయ
సామజవరద నా చందమిది ॥పల్లవి॥

జలములోపలనున్నచందురునీడవలె
నలుగడలఁ గదలీ నామనసు
పెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
వెలుఁగదు నాలోని విజ్ఞానము ॥ఏమి॥

కడఁగి యాకసమున గాలియణఁగినట్లు
వడిఁగానరాదు నా వైరాగ్యము
ముడిగిముత్తెపుఁజిప్పముత్యమువిధంబున
జడిసీ నాలోని సాత్వికము ॥ఏమి॥

యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీకృపవలె
పుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిననీసేవవలెఁ గన్న నిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము ॥ఏమి॥ **348**

ఉపోద్ఘాతము:

సామజవరదుడు అంటే గజేంద్ర సంరక్షకుడు అని అర్థం. ఓ గజేంద్ర సంరక్షకా! నా విధానాలు మార్చుకోలేకపోతున్నాను. నేనేమి చేస్తున్నానో నాకే తెలియటం లేదు.పుణ్యమో పాపమో చేసేస్తున్నాను.నా మనస్సు నిలకడ లేనిది. విజ్ఞానము వెలుగనే వెలగదు. ఆకాశంలో యెత్తుకుపోయినకొద్దీ గాలి వేగము క్షీణిస్తుంది. నా వైరాగ్యం కూడా అంతే వైర్యాగం వున్నదిగాని దానికి బలం లేదు. నా సాత్విక బుద్ధి ముత్యపు చిప్పలోని ముత్యంవలే వుందిగానీ శోధిస్తేనే కనబడుతుంది. ఓ

శ్రీవేంకటేశ్వరా! నీపై నిజభక్తి నీకృపవల్లే కలిగింది.నీసేవే నానిధానము. అదే బ్రహ్మానందము అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

సామజవరదా! (గజేంద్రసంరక్షకా) నా చందమిది (నా జీవన విధానము ఇదే). దీనిని మార్చుకోలేను. ఏమి సేయుదు (ఏమి చేయగలవాడను?) ఇదంతా నీ మాయ. దీన్ని నెగ్గడం నాకు సాధ్యమా?

నీటిపై చంద్రుని నీడ నిశ్చలంగా వుంటుందా? అది నలుగడల గదలీ (అన్నివైపులా కదలిపోతూనే వుంటుంది కదా!) నా మనస్సుకూడా అంతే.అతిచంచలమైనదీ, పట్టరానిదీనూ. పెలుచు (నిలకడలేని) మేఘాలు కప్పిన సూర్యుని ప్రకాశం ఒకసారి హెచ్చి ఒకసారి తగ్గుతుంటుంది. అలాగే నాలోని విజ్ఞానము ఒకసారి బయటకు వస్తుంది, ఒకసారి స్తబ్దుగా వుంటుంది. నేనేమి చేయగలను?

అనంతాకాశంలో గాలి తన విజృంభణ చూపక అణిగియుంటుంది. అలాగే నా వైరాగ్యం మెల్లగా నడుస్తున్నదే గాని దానిలో 'వడి' (వేగము) ఏమాత్రమూ లేదు. నీరధిలో మునిగివున్న ముత్యపు చిప్పలోని ముత్యమువలె, నాలోని సాత్విక బుద్ధి పొరల మాటున నిబిడీకృతమైయున్నది.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు నీ కృపనాపై ఇట్టే కలిగినాలో అంతర్లీనమైయున్న నీపై నిజభక్తి ఒక్కటే వుప్పతిల్లినది (పుట్టినది). నీసేవా భాగ్యము నన్నుకప్పివేసినది. నీవునా కన్నులయెదుటనున్న నిధానము (నిక్షేపము) వలెనున్నావు. మరి ఆపైన బ్రహ్మానందము నాకు అప్పసమై (శాశ్వతమై)నిలిచినది.

పద్యవివరణ:

కం॥ **సామజవరదా! ఇంతయు**
నీమాయయె పోవునాదు నిజచందములున్
ఏమిటి సేయుదునయ్యా!
పూమాలల వేంకటేశ పురుషోత్తముడా!

సంఖ్య: IV/266 రాగం : పాడి
కీర్తన : కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ

పాడి

47 కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ
యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి ॥పల్లవి॥

మనసులోనికి గురి మాధవ నీ పాదాలు
తనువుపై గురి నీ సుదర్శనము
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు
పను లెన్నిగలిగినఁ బట్టకు నా నేరమి ॥కల॥

చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు
నీతి నా నాలికగురి నీ నామము
కాతరపునుదుటికిఁ గల తిరుమణి గురి
పాతకపునావలనఁ బట్టకుమీ నేరము ॥కల॥

యిహపరాలకు గురి యీ నీ శరణాగతి
సహజ మాత్మకు గురి సంతతభక్తి
మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి
బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి ॥కల॥ 266

ఉపోద్ఘాతము:

'గురి' అంటే లక్ష్యము అని అర్థము. యావత్ సృష్టికి ఒక్కటేగురి. అది కమలాక్షుడైన శ్రీహరి కరుణను సంపాదించుట. నేను దాన్ని సంపాదించటానికి కృషి చేస్తున్నాను. నేనెట్లావున్నా నా నేరము లెంచకుము ప్రభూ! అంటున్నారు అన్నమయ్య. మానవుని జీవితంలో ఇహపరాలు రెండూ ముఖ్యమైనవే. ఇవి రెండూ సాధించవలెనంటే అంత సులువైన విషయం కాదు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి ఒక్కటే ఆ రెంటికీ గురి. సహజానందం పొందాలనుకున్న ఆత్మకు గురియేది? స్వామిపై సతతము భక్తి వుండటమే.

తాత్పర్య వివరణ:

ఓ కమలాక్ష (పద్మనయనా!) మాకు ఒక్కటే గురి (లక్ష్యము) కలదు. అదే నీ కరుణ సంపాదించుట. ఓ ప్రభూ! ఈ ప్రపంచంలో నేనెట్లావున్నా నాపై నేరములెంచకుమా (నా తప్పులనెంచకు స్వామీ!)

ఓ మాధవా! నామనసు నిలుపడానికి గురి, నీ పాదకమలములు. నా తనువు (శరీరం) క్షేమంగా వుండటానికి కారణం నేను ధరించిన నీ సుదర్శన చక్రముద్రలు. ఓ కమలాక్ష నేను అంధుణ్ణి కానందుకు సంతోషిస్తున్నాను ఎందుకంటే కనుచూపులకు గురియైన నీ మనోహరరూపం నాకళ్ళెదుటే వున్నది. స్వామీ! ఈ లోకపాలనవల్ల నీకు క్షణం తీరదు. దొరికిన ఆ కాస్త సమయం నానేరాలెంచుటతో గడిపేయకు.

నాకు రెండు చేతులనిచ్చావు. ఎందుకు? వాటి గురి నీ పూజసేయుట. అందుకే రెండు చేతులనిచ్చావు. నీతిగల నా నాలుక లక్ష్యము నీ నామోచ్చరణము. కాతరపు (దృష్టికి లోనయ్యే) నా నుదుటికి గురి దానిపై గల నీ తిరుమణి (నీ పంగనామములు). నేను పాపినే ఒప్పుకొంటాను. కానీ వూరకనే నా నేరములెంచి నన్ను వేరు చేయకు ప్రభూ!

దేవా! మానవుడు ఇహపరములు రెండూ సాధించవలెనంటే గురి నీశరణాగతి. సహజ స్థితిలో వున్న నా ఆత్మకు గురి నీ సంతత భక్తి (నిరంతరమైన భక్తి). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ లోకంలో నన్ను మన్నించి నన్ను పరిపాలించితివి. ఇంకా బహువిధములైన నా నేరాలు యెంచి యేమి ప్రయోజనం? వద్దు తండ్రీ!

పద్యవివరణ:

ఆ.వె॥ **కలదు 'గురి' యొకటియె కమలాక్ష! నీ కృప**
యెంచవలదు నేరమెట్టులున్న
వేంకటేశ! నాదు వినతి మన్నించావు
దేనికేది 'గురియొ' వినుము నేడు.

సంఖ్య: III/159 రాగం : మలహరి
కీర్తన : సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితిమి

మలహరి

48 సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే
వుర్విలోన నేమెంచేవుపమ లేమున్నవి ॥పల్లవి॥

వెలయ నేమిటికైనా వెరవకుండేనంటే
యెలమి ధైర్యము నీవియ్యక లేదు
బలిమి చూపెద నేపట్టుననైనానంటే
చెలఁగి నీవే లోనిచేతనాత్మకుఁడవు. ॥సర్వే॥

జగములోపల నేనెచ్చరికై వుండేనంటే
అగపడి బుద్ధి నీవియ్యక లేదు
పగటుసంసారముభ్రమ విడిచేనంటే
మగటిమిగల నీవు మాయానాథుఁడవు. ॥సర్వే॥

కేవల మీపుట్టుగును గెలిచివుండేనంటే
ఆవేళ నీవు ముక్తియ్యక లేదు
శ్రీవేంకటేశ్వర నీకు చేకానుకిచ్చేనంటే
లావుసంపదల నీవు లక్ష్మీనాథుఁడవు ॥సర్వే॥ **159**

ఉపోద్ఘాతము:

ఇది శరణాగతి కీర్తన అని పల్లవిని చూస్తేనే అర్థమవుతున్నది. కానీ ఇందులో మెలికయేమంటే వుర్విలో నేమెంచే వుపమలేమున్నవి అనే తదుపరి వాక్యం. అంటే, ఈ భూలోకంలో మేము దేనితో పోల్చుకొని మా గురించి అసంతృప్తి పడవలెను? మేము సర్వేశ్వరుడైన నీకు (శ్రీవేంకటేశ్వరునికి) శరణుచొచ్చినాము. ఇక మాకు అన్యముల గురించిన

చింతయేల? నీవెంత ఉదారుడవంటే మేమిచ్చే చిన్న కానుకలకే మాకు అంతులేని సంపదలనిస్తున్నావు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ సర్వేశ్వరా! ఈ వుర్విలోన (భూమిమీద) మమ్ము రక్షించగలవారెవ్వరూ లేరు. అందుకే నీకు ఇదే శరణుచొచ్చితిమి. నేము (మేము) యెంచే ఉపమలేమున్నవి (మేము దేనితో పోల్చుకొని మాగురించి అసంతృప్తి పడవలెను?)

స్వామీ మాది ఏపాటి సామర్థ్యమయ్యా? వెలయ నేమిటికైనా (దేనికైనా) భయపడకుండ వుండాలంటే మాకు ధైర్యము నీవియ్యకుండా రాదు. ఏ పట్టునైనా (ఎక్కడైనా) నాబలము చూపించి అందర్నీ వశపరచుకొందామంటే నావల్లనేమవుతుంది? నాకు చేతనత్వం కలిగించే చేతనాత్మకుడవు నీవే కదా! నీవు లేకపోతే నాలో చైతన్యంయేదీ? అట్టి నీకు శరణుచొచ్చి, నా అశక్తత నొప్పుకొంటాను.

సరే! ఈ జగములో నేనెచ్చరికై (సావధానుడనై) వుంటానులే అనుకొంటే అది మాత్రం నావల్ల అయ్యేపనియా? నాకు మంచీ చెడూ విచక్షణ నిచ్చే బుద్ధి నీ వరప్రసాదమే. నీవియ్యక ఆబుద్ధి మాకు రానేరాదు. సగటు సంసారము (లావణ్యములొలికే ఈసంసారం) యొక్కభ్రమలు వదలివేద్దామా అంటే సర్వ సమర్థుడవైన నీవే మాయానాథుడవు. నీకృపలేక నేనీసంసారపు మాయనెలా నెగ్గను? మరి నేను నీకిచ్చేదేమిటి?

అవన్నీ యెందుకు, పునరావృతమైన ఈ పుట్టుకలను గెలిచి తిరిగి జన్మలేక వుందామంటే నాకు ఈ జన్మలనుంచి ముక్తినియ్యవలసిన వాడివి నీవే. అదంతా యెందుకు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు చేకానుకలు (మొక్కుబడుల) నిచ్చానంటే నీవు లక్ష్మీనాథుడవైనందున లావు సంపదలు (అంతులేని సంపదలు) నీవిచ్చేవే కదా!

పద్యవివరణ:

తే.గీ॥ **అరసి సర్వేశ్వరా నీకు శరణమంటి**
ఉర్వి నేనెంచవలసిన ఉపమలేవి?
చిన్ని కానుక నీకిచ్చువున్నతునకు
లావు సంపదనిచ్చేవు లక్ష్మీరమణ

సంఖ్య: III/173 రాగం : మాళవిగౌళ
కీర్తన : నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి

మాళవిగౌళ

49 నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి
యీకరుణకే మొక్కితి నిందిరారమణా. ॥పల్లవి॥

కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి
అమితదుర్గుణరాసి నన్నిటా నేను
అమరఁగ స్వతంత్రుఁడ వటు నిన్ను నెంచితేను
తమి నించుకంతా స్వతంత్రుఁడ నేఁ గాను. ॥నీకు॥

దేవ నీవైతే సర్వదేవరక్షకుఁడవు నే
జీవుఁడ నింద్రియాలఁ బెంచేవాఁడను
ఆవల బ్రహ్మాండాల కన్నిటాఁ బొడవు నీవు
భావించ నే నణువై పరగేటి వాఁడను ॥నీకు॥

నానార్థసంపన్నుఁడవు నావల్ల నేమి గంటివి
ఆనుక నాయంతర్యామివై పాయవు
శ్రీనిధివి నీవైతే శ్రీవేంకటాద్రిపతివి
దీనుఁడ నొకఁడ నేను ద్రిష్టించి కాచితివి. ॥నీకు॥ **173**

ఉపోద్ఘాతము:

ఓ ఇందిరారమణా! నీకు నాకు ఎట్లా కుదిరినదయ్యా? నన్ను మన్నించి నీవెట్లు నన్నేలితివి స్వామీ! నీవు ఇంత కరుణామూర్తివి కాబట్టే నేను నీకు మొక్కుతూ వుండిపోయాను అంటున్నారు అన్నమయ్య. భక్తిజాలువారే ఈకీర్తనలో తానెంత అధముడో తెలియజెప్పుకొంటూ స్వామి అనంత కళ్యాణగుణనిధి అని కీర్తిస్తున్నారు. సర్వదేవతలను రక్షించేవాడు

ఉర్వీధవుడే. ఆయన బ్రహ్మాండాలకన్నా పొడవు, మరి తాను అణు పరిమాణంకల అర్భకుడనంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ఇందిరా పతీ! నీకూ నాకూ యెట్లా కూడెను (కుదిరినది?) నీవే రీతి నన్ను అనుగ్రహించావు ప్రభూ! నీవింత కరుణామయుడవు కాబట్టే నేను నీకు శరణని మొక్కుతున్నాను.

స్వామీ! నీకూనాకూ ఒక్కపోలిక కూడా లేదయ్యా! ఓ కమలాక్ష! నీవు అనంతమైన కళ్యాణగుణములు నిధిగా గలవాడవు. మరి నేనో! నేను అన్నిటా (అన్నివిధములా) అమితమైన దుర్గుణములు కుప్పవోసిన దుర్మార్గుడను. ఎంచి చూస్తే నీవు సర్వస్వతంత్రుడవు. మరినేనో? మిక్కిలి అస్వతంత్రుడను. కొద్దిపాటి స్వతంత్రము కూడా నాకు లేదు.

నీవు దేవదేవుడవు. సర్వ దేవతలకు రక్షకుడవు. మరి నేనో? ఇంద్రియబద్ధుడనైన జీవుడను. నీవు అనంతకోటి బ్రహ్మాండాలకు ఆధారభూతుడవు. ఆ బ్రహ్మాండాలకే అంతుచిక్కని అన్నివిధములా పొడవైన వాడవు (ఉన్నతుడవు). మరి నేనో? భావించి చూస్తే అణురూపుడనై వుండేవాడను. నిన్ను నన్ను పోల్చుటెట్లు? నీవెక్కడ నేనెక్కడ?

ప్రభూ! నీవు అనేకవిధములైన ఐశ్వర్యములు, సంపదలు కలవాడవు. నీవు లక్ష్మీరమణుడవు. నావల్లనేమిగంటివి? (నావల్ల నీకేమి ప్రయోజనము?) అయినా నాపై కరుణతోనా అంతర్యామివై నన్ను వదలక వుంటావు. నీవు శ్రీవేంకటాద్రిపతివి. మరి నేనో? నేను ఒక దీనుడను. నీవే నాపై దయతలచి ద్రిష్టించి (చూచి) కాచితివి (రక్షించితివి).

పద్యవివరణ:

ఆ.వె॥ **ఎట్టు గూడెమనకు ఏలితివీవెట్లు?**
కరుణ కొరకె మొక్కి చేరినాను
శ్రీనిధివినువైతె శ్రీవేంకటాద్రీశ!
నన్ను దీనుడంచు యెన్నవలదె?

సంఖ్య: III/168 రాగం : లలిత
కీర్తన : ఎట్టున్నదో నీచిత్తమెదురాడ నే వెఱతు

లలిత

50 ఎట్టున్నదో నీచిత్త మెదురాడ నే వెఱతు
గట్టిగా హరి నీమాయ కడవఁగరాదు. ॥పల్లవి॥

నిచ్చ పతితులఁజూచి నేను సంసారినై యుందు
అచ్చపుసన్యాసులఁ జూ చటువలె నయ్యేనందు
హెచ్చి మోచివచ్చితేను యెక్కడిగొడవ యందు
ఇచ్చట నిశ్చలబుద్ధి యెందూ నేఁ గానను. ॥ఎట్టు॥

కర్ములఁ జూచొకవేళ కర్ముము నేఁ జేయఁబోదు
మర్మపుజ్ఞానులఁ జూచి మంచిదందును
అర్మిలి రెండూఁ జూచి అంతలో సందేహింతు
నిర్మలమయినబుద్ధి నేనెందుఁ గానను. ॥ఎట్టు॥

వారణాసి వోఁజూచి వారివెంటఁ దగులుదు
తేరి కొంతదవ్వు వోయి తిరుగుదును
నేరిచి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గాచితివి
యీరీతిఁ దేరినబుద్ధి యెందూ నేఁ గానను. ॥ఎట్టు॥ **168**

ఉపోద్ఘాతము:

మన యజమానికి ఏదన్నా చెప్పుకోవాలంటే ఆయన మనస్సు యెట్లావున్నది? సంతోషంగా వున్నాడా? కోపంగా వున్నాడా అని ఆయన భృత్యులు తెగమధనపడిపోతుంటారు. అదే అంటున్నారు అన్నమయ్య. ఓ శ్రీహరి నీమాయను నెగ్గటం మావల్ల అయ్యే పనికాదు. నిత్యమూ నా చుట్టూవున్న పతితులను చూసి భ్రమపడి నేనూ సంసారినైయుందును. అదే స్వచ్ఛమైన సన్యాసులవెంట తిరిగితే ఇట్లా అయ్యేదా? వీరందరి బాధ్యతనాపై వదలివేశారు. ఇదెక్కడి గొడవ వీరెవరికైనా నిశ్చలబుద్ధి వుందని నేను అనుకోను. కాశీ వెళ్ళెదనని తలచి కొంతదూరం వెళ్ళి తిరిగి వచ్చేశాను. ఓ

శ్రీవేంకటేశ్వరా! పోనీలే వీడు అర్భకుడు అని నువ్వే నన్ను గాచినావు అంతేగాని తేరినబుద్ధి నాకు అబ్బనేలేదు.

తాత్పర్య వివరణ:

ఓ దేవా! నీ చిత్తము (అభీష్టము) యెట్లావున్నదో తెలియదు. నీకు యెదురాడ (ఎదురు చెప్పుటకు) నేను వెఱతును (భయపడుతున్నాను). శ్రీహరీ! నీమాయను గట్టిగా (ధైర్యంగా) కడవరాదు (దాటనసాధ్యము).

ప్రభూ! నా చుట్టూవున్న నిత్యపతితులను చూచి ఇదే బాగుందనే భ్రమతో నేనూ సంసారినయ్యాను. మరి స్వచ్ఛమైన సన్యాసులను చూచి వారివలెనుంటే బాగుండేది కదా! వీరంతా బాధ్యత వదలి తిరుగుతున్నారా? ఇదెక్కడి గొడవ ప్రభూ! ఇచ్చట యెవ్వరికీ నిశ్చలమైనబుద్ధి లేదు. యెందునూ కానరాదు. మరి వీరు ఇక నీమాయనెట్లు తరింతురు?

ఒక్కొక్కసారి కర్ముల (కర్మయందు ప్రీతివున్నవారి) చూచి నేనుకూడా కర్మలనాచరించెదనని నిశ్చయించుకొంటాను. కాని జ్ఞానులను చూడంగానే జ్ఞానమార్గమే కర్మమార్గముకంటే, మంచిదనుకొంటాను. రెండిటిని పోల్చి తర్కించుకొని అంతలోనే సందేహం పొందుతాను. ఇన్నీ చేస్తాను కానీ నిర్మలమైన బుద్ధిని నేనెందునూ కనుగొనను.

ఒక్కొక్కసారి కాశీనగరంవెళ్ళి జన్మరాహిత్యం పొందుదామని నేనూ బాటసారినై కాశి పయనమవుతాను. కొంత దూరం పోగానే మనస్సు మార్చుకొని తిరిగి ఇల్లుదారిబడతాను. నా ఈ అనిశ్చలబుద్ధి చూచి ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్ను కాపాడినావు. ఈరీతి తేరిన (పక్వమైన) బుద్ధిని నేను యెందునూ కానను.

పద్యవివరణ:

కం॥ **నీచిత్తం బెట్టున్నదొ**
నేచెప్పగనెదురుమాట నే వెఱతునయా!
ఏ చొప్పున నీమాయను
పేచీలేకనె తరింతు వేంకటనాథా

సంఖ్య: III/186 రాగం : రామక్రియ
కీర్తన : ఎదిరించి పోట్లాడనెవ్వరితరము

రామక్రియ

51 ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లిఁక
త్రిదశవంద్యుఁడు హరిఁ దేరిచూడఁగలరా. ॥పల్లవి॥

ఘాత మీస మదరితే గగ్గులకాడవుదురు
యీతఁడు దలచూపితే నెదిరించ రరులు
అతురాన గొరిశరాయడికి నోపఁగ లేరు
చేతిగోరు మీటితేనే ఛిన్న భిన్న మవుదురు. ॥ఎది॥

పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురుగుండాలపాలౌదురు
తూపు చేత నంటితేనే తుత్తుమురై పారుదురు
రాపునీలికాశ గంటే రణభీతి గొందురు. ॥ఎది॥

మంతన మీతఁ డాడితే మానముగోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁగూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁ డెక్కడఁ జూచినఁ దానే
వింతప్రతాపముతోడ విఱ్ఱవీఁగీ నిదివో. ॥ఎది॥ **186**

ఉపోద్ఘాతము:

ఇది దశావతార వివరణ కీర్తన. నాకు ఈ కీర్తనలు అంటే యెంతో ఇష్టం. అన్నమయ్య చమత్కారం ఇటువంటి కీర్తనలలో

సుస్పష్టమవుతుంటుంది. "పైపైనితడడుగిడ పాతాళమునగుంగుదురు" – అంటే యేమిటి? పైనున్న దివ్యలోకాలను ఒక పాదముతోటి పై కనుపించే భూమినంతా, ఇంకొక పాదముతోను ఆక్రమించి, బలితలపై తన అడుగుపెట్టి పాతాళమునకు తొక్కితే కుంగుదురు. అంటే త్రివిక్రమావతారాన్ని ప్రశంశిస్తున్నారన్నమాట. ఎంత నిగూఢంగా వున్నదో చూశారా? ఇలా దశావతారాలనూ నిగూఢంగానే అందించారు. అందుకే విస్తృతమైన వివరణ ఇద్దామని సంకల్పం కలిగింది. ఎంత వివరిస్తే అంత వుంది. త్రిదశవంద్యుడు అంటే యేమిటి? బాల్యము, కౌమారము, వృద్ధాప్యము అని మూడు దశలు నరుని జీవితంలో ముఖ్యమైనవి. స్త్రీతో సంసారం చేయడం బాల్య వృద్ధాప్యాలలో నిషిద్ధం. ఆట పాటలతో కాలం గడపటం బాల్యంలో మాత్రమే చేయాలి. ఏజోక్యం లేకుండా నిశ్చింతగా దైవధ్యానం వృద్ధాప్యంలో ఉత్తమం. కానీ ఈ త్రిదశలలోనూ చేయదగిన పని శ్రీహరి శరణాగతి. అందుకనే ఆ శ్రీహరి త్రిదశవంద్యుడు అంటున్నారు. మరి ఇక జాగ్రత్తగా చదవండి.

తాత్పర్య వివరణ:

నేను ఎదిరించి యెవ్వరితో పోట్లాడను? ఈ దేవదేవునితో యెదిరించి నిలవటం యెవ్వరితరమవుతుంది? ఈ శ్రీహరి త్రిదశవంద్యుడు (బాల్యం, కౌమారం, వృద్ధాప్యం అనే మూడు దశల్లోనూ పూజనీయుడు.) ఈయనను తేరిపార చూడగల సామర్థ్యం యెవరికుంటుంది?

"ఘాతమీసమదిరితే గగ్గులకాడవు దురు"–

దెబ్బతీయగల మీసము చలించితే శత్రువులందరూ గగ్గులుకాడ (ధాన్యములేని కంకులవలె నిరుపయోగమైపోవుదురు.

"ఈతడు దలచూపితే నెదిరించ రరులు" – మత్స్యావతారం

దాచుకొనియున్న తన తలను ఇతడు వెలికిబెట్టి చూపితే అరులు (శత్రువులు) యెదిరించరు. కూర్మావతారము వర్ణించబడింది.

"అతురాన గొరిశరాయుడికి నోపగలేరు" –

గొరిశరాయుడు గోతులు తవ్వే మొనగాడిని, ఆతురాన (వేగమున) ఓపగలేరు (సహించలేరు). వరాహావతారము వర్ణించబడినది.

"చేతిగోరు మీటితేను ఛిన్నభిన్నమవుదురు" –

ఈయన తన చేతిగోరు మీటినాడంటే రాక్షస మూకలు ఛిన్నాభిన్నము (ముక్కలు ముక్కలు) అయిపోతారు. నృసింహావతారము

"పైపై నితడడుగిడిన పాతాళాన గుంగుదురు".

ఒక పాదము ఆకాశముపై ఒక పాదము భూమిపై ఇతడు అడుగుపెట్టి ఏమాత్రము సందులేక వ్యాపించి మూడవ పాదం ఎక్కడుంచనని అడిగాడు వామనుడు బలి చక్రవర్తిని. ఆయన అభ్యర్థన మన్నించి మూడవ పాదం బలిశిరస్సుపైనుంచి పాతాళాన గుంగునట్లు తొక్కేశాడు. తరువాత అతనిని రసాతలమునకు అధిపతిని చేశాడు. త్రివిక్రమావతారం వర్ణించారు.

"కోపించినంత నెత్తురు గుండాలపాలౌదురు"–

ఈయన ఆగ్రహిస్తే శత్రువులైన రాజుల మూకలు నెత్తురు మడుగుల పాలై మరణించెదరు. పరశురామావతార వర్ణన.

"తూపుచేత నంటితే తుత్తుమురులై పారుదురు"–

ఈయన తూపు (బాణముకొన) చేత అంటితేనే (తగులునట్లు వేస్తే) శత్రువులు తుత్తుములై పొడిపొడి అయిపోదురు. శ్రీరామావతారము.

"రాపు నీలికాశగంటే రణభీతి గొందురు"–

రాపిడి కలిగించు నీలి వస్త్రమును చూడగానే యుద్ధభయంతో యెప్పుడు పారిపోదామా అని చూస్తారు. బలరామావతారము వర్ణన.

"మంతన మీతడాడితే మానముగోలుపోదురు" –

ఈతడు మంత్రాంగము చేస్తే త్రిపురాసురుల భార్యలు మానము గోల్పోవుదురు. బుద్ధావతారము.

"కొంత గుఱ్ఱమెక్కితేనే గుంట గూలిపోదురు". –

ఈయన కొంత (తీక్షణమైన) గుఱ్ఱమునెక్కితే దుర్మార్గులు గుంటలలో కూలిపోతారు. కల్కి అవతారము వర్ణన.

ఇప్పుడు శ్రీవేంకటేశ్వరుడు ఎక్కడ చూచినా తానేయై వింత గొలుపుప్రతాపముతో విఱ్ఱవీగుచున్నాడు (విజృంభించుచున్నాడు).

పద్యవివరణ:

చం॥ **ఎదురుగు నిల్చి పోరుటకు**
ఎవ్వరిచేతగు ముజ్జగంబులన్
త్రిదశల వంద్యుడీ హరియె తేరి
పరాత్పరుచూడ శక్యమే?
ఇదిదశరూపముల్ గొనిన
ఈ తిరువేంకటరాయవర్ణనే
అదనుగ అన్నమార్యుడిది
అద్భుత శైలిని జెప్పె ధన్యుడన్.

సంఖ్య: IV/434 రాగం : శోకవరాళి
కీర్తన : నడవరో జడియక నవ్య మార్గమిదె

శోకవరాళి

52 నడవరో జడియక నవ్యమార్గమిది
మడుఁగిది వైష్ణవమార్గ మిది ॥పల్లవి॥

ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది
జనకాదుల నిశ్చలమార్గ మిది
సనత్కుమారుఁడుజరపుమార్గ మిది
మనువుల వైష్ణవమార్గ మిది ॥నడవ॥

నలుగడవసిష్ఠ నడుచు మార్గమిది
యిల వేదవ్యాసులమార్గం బిది
బలిమిగలుగుధ్రువపట్టపు మార్గము
మలసినవైష్ణవమార్గ మిది ॥నడవ॥

పరమమార్గం బిదె ప్రపంచమార్గము
గురుమార్గం బిదె గోప్య మిదే
గరిమెల శ్రీవేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గ మిదే ॥నడవ॥ **434**

ఉపోద్ఘాతము:

ఓ జనులారా! మీరు వైష్ణవమార్గాన్ని యెన్నుకొన్నారు. దీని ప్రధాన లక్షణమే "మడుగు" (వినమ్రత). ఇది నవ్య మార్గము (నూతన మార్గము). అయినా భయంలేదు. మీరు జడియక (భయపడక) ఆ మార్గంలో నడవండి అంటున్నారు అన్నమాచార్యులవారు. విశిష్టాద్వైత మతాన్ని చేపట్టిన అన్నమయ్య ఆ మతాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇది

ప్రపంచ మార్గము కూడా. భగవంతుని అనుగ్రహం పొందటానికి సన్యసించనక్కరలేదు. సంసారములో వుంటూనే నిస్సంగుడై మోక్షం సంపాదించవచ్చును. ఇది భక్తి మార్గం. శ్రీవేంకటేశ్వరుని కృప వుంటే ఏదైనా సాధించవచ్చును అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! ఇది ఈ (వైష్ణవము) నవ్యమార్గము (నూతన మార్గము) మీరు జడియక (భయపడక) దీనిలో నడవరో. ఇది మడుగు (వినమ్రత)కు ప్రాధాన్యమిస్తుంది. ఇది వైష్ణవమార్గము.

ఈ మార్గమునే ఘనులైన శుక మహర్షి కూడా దర్శించారు. ఇది జనకరాజర్షి యెన్నుకొన్న నిశ్చలమైనమార్గము. సనత్కుమారుడు (సనక సనందాదుల తోటి ఋషి) జరిపినమార్గము. మనువులందరూ ఎన్నుకొన్నది ఈ వైష్ణవమార్గమునే. ఇది అంత పురాతనమైనదేకాక నిత్య నూతనమైనది కూడా.అందుకనే వైష్ణవము అతి విశిష్టమైన భగవత్సేవ.

ఈ వైష్ణవమార్గము బాహాటంగా వసిష్ఠుడు నడిచి చూపిన మార్గము. వేదవ్యాసుడు కూడా ఈ ఇలలో యెంచుకొని పయనించిన మార్గము ఇదే. ధ్రువునికి ధ్రువపట్టము (ధ్రువునక్షత్రం అయ్యే అదృష్టం) కల్పించినదీ మార్గమే. ఇది మలసి (విజృంభించిన) విష్ణుమార్గము.

ఈ వైష్ణవము మనము నిత్యమూ నివసించే ప్రపంచములోని అతి శ్రేష్ఠమైన మార్గము. ఇది అతి గోప్యమని మా గురుదేవులు బోధించిన మార్గము. గరిమెల (మహిమాన్వితుడైన) శ్రీవేంకటేశ్వరుడు మమ్ము నిలిపినది ఈ వైష్ణవ మార్గములోనే. ఇందులోనే ఆయన మమ్ము అలవాటుచేశాడు.

పద్యవివరణ:

కం॥ **జడియక నడువరొ మీరలు**
పుడమిని నవ్యంబిదైన పుణ్యుల బాటే
మడుగిది వైష్ణవమార్గము
విడువక విఖ్యాతులెంచు విష్ణుని మార్గం.

సంఖ్య: IV/486 రాగం : లలిత
కీర్తన : బిరుదు బంటితడు పెద్ద హనుమంతుడు

లలిత

53 బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుఁడు
సిరులతో రామునికి సీతాదేవికిని ॥పల్లవి॥

మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు
వాఁడె హనుమంతదేవరఁ జూడరో
పోఁడిమి దైత్యులగెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు ॥బిరుదు॥

ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు
సవరనై పెనుజంగ చాఁచుకున్నాఁడు
భువిఁ గవచకుండలంబులతోఁబుట్టినవాఁడు
వివరించ నేకాంగ వీరుఁడైనవాఁడు ॥బిరుదు॥

పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాఁడు
ఘనుఁ డిన్నిటా స్వామికార్యపరుఁడు
వినయపు శ్రీవేంకటవిభునికి హితవరి
యెనసి మొక్కఁగదరో యెదుట నున్నాఁడు ॥బిరుదు॥ **486**

ఉపోద్ఘాతము:

'బిరుదుబంటు' అంటే ధీరుడైన బంటు అని అర్థం. అతి పెద్దగా కనుపించుచున్న ఈ హనుమంతుడు రామునికి సీతాదేవికి తిరిగి సిరులు సమకూర్చిన మహానుభావుడు అంటున్నారు అన్నమయ్య. మూడు లోకములు తుదముట్ట అంటే, ముల్లోకాల అంతుదాటి పెరిగిపోయాడు చూడండయ్యా అంటున్నారు. ధ్రువమండలాన్ని కూడామోస్తాడా అన్నట్లు

పెరిగిపోయాడు. సూదిదేలిన పండ్లుగల ముళ్ళ గదను ధరించి దానవులను చీల్చి చెండాడాడు. గొప్ప స్వామి కార్యదీక్షాదక్షుడు. ఇవన్నీ అటుంచి ఎప్పటికీ ఇతడు శ్రీవేంకటేశ్వరునికి హితవరి బంటే.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! మనయెదుటనున్న ఈ పెద్దహనుమంతుడు, బిరుదు బంటు (ధీరుడైనబంటు). శ్రీరామచంద్రునికి, సీతాదేవికి తిరిగి (మరల) సిరులు సమకూర్చిన నమ్మిన బంటు.

మూడులోకములు తుదముట్ట (అంతుదాటి) పెరిగిపోయినాడు చూడండయ్యా! వాడే హనుమంతదేవర. దైత్యుల (రాక్షసుల) గెల్చి పూచిన (అలరిన) తన చేతిని ఎత్తుకొని నిలుచునియున్నాడు. ఈ వాయునందనుడు, వాడి (తీక్షణమైన) ప్రతాపముకలవాడు.

ఈ మారుతి ఒకసారి ధ్రువమండలాన్ని తనతోకతోనేమోసెదనని తోక యెత్తుకొని నిలుచున్నాడు. సవరనై ఈపని సాధించుటకు తన పెద్ద పంగను చాచుకొని నిలుచున్నాడు. భూమిపై కవచకుండలములతో జన్మించిన ఇతడు వివరించవలెనంటేఏకాంగవీరుడు ఈ హనుమంతుడే. మరి ఈయన అసహాయ శూరుడు కదా!

పెనచి (బిగించిపట్టుకొని) పండ్లగోల అనే ముళ్ళగదను పిడికిలించుకొన్నాడు (పిడికిలితో పట్టుకొన్నాడు). ఈ ఘనుడు, ఇన్నిటా స్వామికార్య నిర్వాహకుడు. వినయవంతుడైన ఈ హనుమంతుడు శ్రీవేంకటపతికి హితవరి (హితమును) కలిగించువాడు. మన యెదుటనే వున్న ఈ హనుమంతునికి మొక్కగదరో.

పద్యవివరణ:

ఆ.వె॥ **బిరుదు బంటు యితడు పెద్ద హన్మంతుడు**
సిరులరాముతోటి సీతగలిపె
ఇతడు వేంకటపతి హితవరి బంటాయె
యెనసి మొక్కగదరొ యెదుట నుండి.

సంఖ్య: IV/502 రాగం : పాడి
కీర్తన : ఎంతప్రతాపమువాడు యెంతటినేరుపరి

పాడి

54 ఎంతప్రతాపమువాఁడు యెంతటినేరుపరి
యెంతని పొగడవచ్చు నీరాముని ॥పల్లవి॥

వాలినొక్క కోలనేసి వారిధి గట్టినవాఁడు
తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు
పాలించి విభీషణునిఁ బట్టముగట్టినవాఁడు
యేలుమని లంకకెల్లా నీరాముఁడు ॥ఎంత॥

కుచ్చి పర (?) మొండెముగా కుంభకర్ణఁ గొట్టినాఁడు
హెచ్చి రాకాసులఁ జంపె నీరాముఁడు
తచ్చి రావణాసురునితలలు చెండాడినాఁడు
ఇచ్చకొలఁదుల నిట్టె యీ రాముఁడు ॥ఎంత॥

సీతతో విమానమెక్కి చేరి యయోధ్యకు వచ్చి
యీతలఁబట్టమేలినాఁ డీరాముఁడు
శ్రీతరుణితోఁగూడి శ్రీవేంకటేశుఁడైనాడు
యీతఁడే దరిసించరో యీరాముఁడు ॥ఎంత॥ **502**

ఉపోద్ఘాతము:

శ్రీరామచంద్రునిపై అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తననాస్వాదించండి. ఈ శ్రీరాముడు ఎంత ప్రతాపశాలి, ఎంత నేర్పరి? ఈయనను ఎంతని పొగడుదును అని రామకథను మరొక్కసారి పునశ్చరణ చేస్తున్నారు. సీతాసమేతుడైన ఆ రామచంద్రుడే నేడు శ్రీతరుణితో గూడిన శ్రీవేంకటేశ్వరుడైనాడు ఈయనను దర్శించండయ్యా! అంటున్నారు. కుచ్చి అనే వికృత శబ్దానికి కూర్చి అనేది ప్రకృతి. అయివుండవచ్చును.

కుంభకర్ణుని మొండెము కూర్చినది పడిపోయిందని నా భావన. ఇది కాక మరొక భావన అన్నమయ్యది అయివుండవచ్చును.

తాత్పర్య వివరణ:

ఈ శ్రీరాముని ఎంతని పొగడవచ్చును. ఇతగాడు యెంత ప్రతాపశాలి!! యెంత నేర్పరి!!

ఈ రాముడు, వాలిని ఒక కోలనేసి (ఒకే ఒక బాణంతో) మట్టుబెట్టినాడు. సముద్రంపై లంక జేరుటకు వారధి (వంతెన) కట్టినాడు. తాలిమితో (ఓర్పుతో) సుగ్రీవుని ఊరడించినాడు. విభీషణుడు తననాశ్రయించి శరణంటే పాలించి (రక్షించి) లంకానగరమునకు పట్టాభిషిక్తునిగా అనుగ్రహించినాడు. ఇంత ప్రతాపముగలవాడు కనుకనే అట్టి ఘనకార్యములను చేయగలిగినాడు.

కుంభకర్ణుని మొండెము కుచ్చిపర (కూర్చినది) పడిపోవునట్లు కొట్టినాడు (బాణముతో) తెంచివేసినాడు. అతిశయించి లంకలోని రాక్షసమూకలను చంపివేసినాడు. ఈ శ్రీరాముడు తచ్చి (పరిహాసముగా) రావణాసురుని పదితలలను ఇట్టె ఇచ్చకొలదుల చెండాడినాడు (ఇష్టము వచ్చినట్టు చీల్చి చెండాడినాడు). ఈ శ్రీరాముడు రణరంగ ధీరుడు.

ఆ తరువాత శ్రీరాముడు పుష్పక విమానమెక్కి అయోధ్యను చేరినాడు. ఈతల (ఈ అయోధ్యలో) పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని పరిపాలించినాడు. నేడు తిరుమలలో ఆ మహానుభావుడే శ్రీవేంకటేశ్వరుడై శ్రీదేవితో గూడి ఈతడే వెలసినాడు. ఈయనే శ్రీరాముడు కూడా. ఈయనను దర్శించి తరించండి.

పద్యవివరణ:

తే.గీ॥ **ఎంత వీరప్రతాపుడు ఎంతమేటి!!**
ఎంతపొగడను రాముని ఇతడు దాత
రామకథ జెప్పి తిరుమలరాయడైన
ఆతడేయని మెచ్చెను అన్నమయ్య.

సంఖ్య: IV/447 రాగం : లలిత
కీర్తన : నిఖిల మింతయుమేలు నేనే తీలు

లలిత

55 నిఖిలమింతయు మేలు నేనే తీలు
మఖరక్షకుఁడ నన్నుమన్నించవే ॥పల్లవి॥

నిండును జలనిధులైనా నెఱి నేటిమొత్తములచే
నిండదు నామనసైతే నిచ్చా యాసల
పండును లోకములోని బహువృక్షతతులైనాఁ
బండదు నామనసైతే బహువిషయముల ॥నిఖిల॥

తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి
తనియదు నామనసు ధనకాంక్షల
వొనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు
పొనిగియేపొద్దు శాంతిఁబొందదు నామనసు ॥నిఖిల॥

లోకములోఁ గఠినపులోహమైనాఁ గరఁగును
కైకొని నామతి గరఁగదు భ్రమసి
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను
నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే ॥నిఖిల॥ **447**

ఉపోద్ఘాతము:

"తీలు" అంటే అనర్ధదాయకుడు అని అర్థం. "మఖరక్షుడు" విశ్వామిత్రుని యాగమును సంరక్షించినవాడా అని అర్థం. నిఖిలము అంటే సర్వమూ అని అర్థం. ఓ విశ్వామిత్ర యాగ సంరక్షకా! ఈ సృష్టిలో సర్వమూ ఉత్కృష్టమైనదే.నీ సృష్టిలో నేనొక్కడనే అనర్ధదాయకుడను.

దేవదేవా! నన్ను మన్నించవే అంటున్నారు, అన్నమయ్య. పైకి తేలికగా కనుపించినా బహు క్లిష్టమైన కీర్తన ఇది. జాగ్రత్తగా చదవండి.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ!నిఖిలమింతయు ఈ సృష్టిలోని సర్వమూ మేలైనదే.ఇది నీ ఉత్పత్తి కదా! నేనే తీలు (నేను అనర్ధదాయకుడను). నేను ఎన్నో చేయరానిపనులు చేశాను. ఓ మఖరక్షకా! (విశ్వామిత్రుని యాగసంరక్షకా!) నన్నుమన్నించుము ప్రభూ!

బాగుగా ప్రయత్నిస్తే ప్రపంచములోని జలనిధుల (సముద్రములన్నీ) నిండింపవచ్చును కానీ, ఇచ్చా ఆసల (కోరిక ఆశలతో)తృప్తిచెందని నా మనస్సు యెన్నటికీ నిండదు. లోకములోనున్న అనేకములైన వృక్షముల మీదనున్న పండ్లన్నీ పండవచ్చును గాక! అనేక విషయములలో ఆసక్తిగొన్న నా మనస్సు మాత్రం పండనే పండదు.

ఈ ప్రపంచంలో పసరమైనా (పశువు కూడ) కసవుమేసి (గడ్డితిని) తనియ (తృప్తి చెందుతుంది). కానీ ధన కాంక్షతో సతమతమయ్యే నా మనస్సు మాత్రం తనియదు (తృప్తి చెందుటలేదు). ఒనర (అతిశయించిన) కారుచిచ్చు (దావానలము)కూడా శాంతి పొందవచ్చును. కానీ నా మనస్సునిస్తేజమై యెన్నటికీ శాంతిని పొందదు.

లోకములో కఠినాతికఠినమైన లోహమునైనా కరిగించవచ్చును. కానీ ఎంత ప్రయత్నించినా భ్రమసిన (భ్రమలలోవున్న)నా మనస్సుమాత్రం కైకొని (ఎంత ప్రయత్నించినా) కరుగుట లేదు.ఇట్టివేళ ఓ శ్రీవేంకటేశ్వరా! నాపై దయదలచి నన్ను స్వీకరించితివి. ఇక నీకే శరణు అన్నానయ్యా! నెమ్మదిగా నన్ను కూడా కావగదే (అనుగ్రహింపుము) ప్రభూ!

పద్యవివరణ:

కం॥ **నిఖిలంబింతయు మేలగు**
మఖరక్షక! నేనెతీలు మన్నించగదే!
సుఖముగ నీ శరణార్థుల
సఖుడై కాపాడుమయ్య సనక మునినుతా!

సంఖ్య: IV/455 రాగం : వరాళి
కీర్తన : ఎరిగీ నెరగదు యేమి సేతు మతి

వరాళి

56 ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి
హరిదాస్యం బదియే సుఖము ॥పల్లవి॥

వెతలఁబోరలేఘనవిభవముకంటే
అతిపేదరిక మది సుఖము
గతి నెరవుల సింగారముకంటెను
సతమగుతననిచ్చలమే సుఖము ॥ఎరిగీ॥

పలుబాములఁబడు పగలిటికంటే
తెలిసి నిద్రించు రాతిరి సుఖము
అలమట గడించు నమృతముకంటే
కలపాటి తనకు గంజే సుఖము ॥ఎరిగీ॥

పరపీడలొసఁగు భవమునకంటే
ధరఁ బొడమనిచందము సుఖము
గరిమల శ్రీవేంకటపతి నీకే
శరణని యెడి నాజన్మమే సుఖము ॥ఎరిగీ॥ **455**

ఉపోద్ఘాతము:

నేనేమి చేయగలవాడను. నామతి ఈ సత్యము నెరుగదాయె? అలాగని అసలెరుగనిదా అంటే దానికి పూర్వసంస్కారము వలన కొంత తెలుసును హరిదాస్యంకంటే సుఖకరమైనది లేదు. ఘనవైభవములనుభవించేవాడు ఒకనాటికి వెతలను బొందక తప్పదు. మరి అటువంటప్పుడు హరిదాస్యములో పేదరికం అనుభవించినా సుఖమే కదా! అంటున్నారు

అన్నమయ్య. పగద్వేషంవల్ల బాములు (జన్మలు) తప్పవు మరి అటువంటి ద్వేషంతో గడిపే పగలు కంటే ఈ సత్యం తెలిసి నిద్రించే రాతిరే సుఖము. ఇవన్నీ యెందుకు శ్రీవేంకటేశ్వరుని శరణనియెడి నా జన్మయే ధన్యము అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఏమిసేతు? (నేనేమి చేయుదును). నా మతి (మనస్సు) యెరిగీ యెరుగదు (ఒకప్పుడు తెలుసుకొంటుంది, ఒకప్పుడు తెలుసుకోదు) హరి దాస్యముకంటే సుఖవంతమైనది లేదు.

ఘనవైభవములను అనుభవించేవాడు ఒకనాటికి వెతలు బొందక తప్పదు. అటువంటి వైభవాలకంటే హరిభక్తుడై అతి పేదరికం అనుభవిస్తే అది సుఖమే కదా! గతి తప్పిన శృంగారముకంటే సతమగు (శాశ్వతమైన) తన మానసిక నిశ్చలత్వమే సుఖము. ఆ నిశ్చలత్వము ఇచ్చే సుఖము నిలకడ కలిగినది.

అనేక బాముల బడు (జన్మలను పొందు) పగలు ద్వేషాలకంటే, నిద్రలో ఏద్వేషమూ వుండదనే యెఱుకగల రాతిరియే సుఖము. అలమట (చింతలో) గడించే అమృతముకంటే తనకు దొరికినంతలో గంజియైనా అమృతమువలె సుఖవంతమైనదే.

పరులను పీడించే భవమునకంటే (జన్మకంటే) ధరలో (పుడమిలో) పుట్టుక యుండుటయే సుఖము. గరిమల (మహిమాన్వితుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీకే శరణుజొచ్చాను. నిన్ను శరణు పొందిన నా జన్మమే సుఖము.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఏమిసేతుమనసు యెరిగియు నెరుగదు**
హరికి దాసుడగుటె అమిత సుఖము
వేంకటపతి నీకు ఇంక శరణమంటి
నాదు జన్మ సుఖము నన్ను వినుము.

సంఖ్య: IV/487 రాగం : దేవగాంధారి
కీర్తన : నమ్మితిజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ

దేవగాంధారి

57 నమ్మితిఁజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ
ముమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమే జపించుమీ ॥పల్లవి॥

తలఁచకుమీ యితరధర్ములు తత్త్వజ్ఞానము మఱవకుమీ
కలఁగకుమీ యేపనికైనను కడుశాంతబుననుండుమీ
వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబున నుండుమీ
కొలువకుమీ యితరదైవముల గోవిందునినే భజించుమీ ॥నమ్మి॥

కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ
మీరకుమీ గురువులయానతి మెఱయఁ బురాణములే వినుమీ
చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ ॥నమ్మి॥

వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుఁడవగుమీ
మఱవకుమీ యలమేల్మంగకుమగఁడగు శ్రీవేంకటపతిని
కెఱలకుమీ మాయారతులను కేవలసాత్వికుఁడవుగమ్మీ
తొఱలకుమీ నేరములను సింధురక్షకునినే సేవించుమీ ॥నమ్మి॥ 487

ఉపోద్ఘాతము:

మన పెద్దవాళ్ళు యేదన్నా హితబోధనుకానీ మంచిమాటను కాని ముచ్చటగా మూడుసార్లు చెప్పమన్నారు. అప్పటికీ అవతలవాడ మనమాట వినకపోతే దాన్ని అక్కడితో వదలివేసేవారు. మురహరియైన, శ్రీహరి నామము జపించమని ముమ్మాటికి నేజెప్పాను ఓ మనసా! నిన్ను నమ్మాను సుమా! నన్ను మోసం చేయక హితవుగా ప్రవర్తించు. తరించు అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో ఆనాటి తెలుగు పదాలకి నేటి తరానికి నిఘంటువు

లేక భావమే తెలియదు. కెఱలకుమీ మాయారతుల, తొఱలకుమీ నేరములను, సింధురక్షకుడు వంటిమాటలకి మనం మూగపోవలసినదే.

తాత్పర్య వివరణ:

ఓ మనసా! నిన్ను నేను నమ్మాను సుమా? కాబట్టి నాకు యెప్పుడూ హితము కలిగిస్తూనే వుండుము. నామాట విని సుఖముగా గడుపుము. మురహరుడైన శ్రీహరి నామమును జపించుము. ముమ్మాటికీ నేను జెప్పేది నీ మంచికే.

ఓ మనసా! ఇతర ధర్మములను గురించి ఆలోచించకుము. తత్త్వజ్ఞానమును అలవరచుకొనుము. కలగక (సంకోచించక) యేమిజరిగినా శాంతముగానుండము. శ్రీహరిని దక్క అన్యదేవతలను ఆరాధించకుము. స్త్రీలకోసం వలవక (వెంపర్లాడక) వైరాగ్యము కలిగియుండుము. గోవిందునే భజింపుము.

ఓ మనసా! శారీరక భోగములను కోరకుము. ప్రయత్నించి తపస్సమాధిలో సమయము గడుపుము. గురువులయానతిని దాటవద్దు. అతిశయముగా పురాణ పఠనము పురాణ శ్రవణములతో సమయమును గడుపుము. దుర్మార్గుల సహవాసం చేయవద్దు. ఇంద్రియములను జయించి ఈశ్వర ప్రాప్తికై ప్రయత్నించుము. కర్మఫలం శ్రీహరి నిర్ణయం. నాకు దుష్ఫలితం వచ్చిందని దైవదూషణ చేయక ధ్రువవరదుడైన నారాయణుని ప్రార్థించుము.

ఓ మనసా! జన్మలు తప్పవని భయపడకుము. వివేకముతో ధీరుడవై మెలంగుము. అలమేల్మంగా వల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని యెన్నటికీ మఱువవద్దు. మాయలో ముంచు మురిపాలలో కెఱలకుమీ (అతిశయించకుము). సాత్విక భావములతోనుండుము. నేరములను తొఱలకుము చేమార్పిడిగా చేయకుము. సింధు రక్షకుని (గజేంద్రవరదుని) బాగుగా సేవింపుము.

పద్యవివరణ:

కం॥ **నమ్మితిజుమ్మీ మనసా**
సొమ్ముగ నాకిపుడు హితవు జూపమెలగుమీ
ముమ్మాటికి నేజెప్పితి –
జుమ్మీ మురవైరిపేరు సుఖము జపించన్

సంఖ్య: III/228 రాగం : దేశాక్షి
కీర్తన : నారాయణ నీదాసుల నడకలివి

దేశాక్షి

58 నారాయణ నీదాసుల నడకలివి
ధారుణి నిదేపనై తగులఁగవలెను. ॥పల్లవి॥

ఆతుమలో హరిమీఁది ఆందోళనమే వలె
చేతికి లోఁగాకుంటేను చింతించవలె
ఆతనిఁ జూచేయందుకు నాసలఁ బొరలవలె
రీతి నివెప్పుడు విచారించుకొనవలెను. ॥నారా॥

నీలవర్ణకథలకు నివ్వెరగు నొందవలె
ఆలకించి యందు భ్రమయఁగవలెను
తాలిమితో మహిమలు దలపోసుకొనవలె
వేళ వేళ ధ్యానించి వెదకఁగవలెను. ॥నారా॥

చేరి శ్రీవేంకటేశు సేవించుకుండఁగవలె
గారవాన సదా మఱుగఁగవలెను
ఆరసి పెద్దల నన్నీ నడుగుచుండఁగవలె
నోరునిండా నేపొద్దూ నుతియించవలెను ॥నారా॥ 228

ఉపోద్ఘాతము:

ఓ నారాయణుడా! నీదాసుల నడవడి ఎలా వుంటుందంటే, ధారుణిలో ఇదే పనియా అన్నట్లు తగులగ వలెను, అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో శ్రీహరి దాసులు చేయవలసిన పనులేవియో చేయకూడని పనులేవియో వివరిస్తున్నారు. అంతమాత్రాన ఇది తేలికగా అర్థమయ్యే కీర్తన అనుకుంటే పొరబాటే. నీలవర్ణ కథలకు నివ్వెరగు నొందవలెను

అంటే శ్రీహరి కథలను వింటూ పారవశ్యమును పొందాలి అని అర్థం. ఇటువంటి మాటలు కోకొల్లలు ఈ కీర్తనలో.

తాత్పర్య వివరణ:

ఓ నారాయణుడా! నీ దాసుల నడకలివి (నడవడి ఈ విధముగా వుంటుంది). ధారుణి (ఈ ప్రపంచంలో) ఇదే పనై తగులగ వలెను. (ఈ శ్రీహరి పాదదాస్యమొక్కటియే పనియా అన్నట్లు ఆ ఒక్కపనిలోనే నిమగ్నమైయుండవలెను.)

ఆత్మలో శ్రీహరిమీద ఆందోళనమే (వ్యాకులతే) ఉండవలెను. ఆ శ్రీహరి నీకు స్వాధీనుడు కాకుంటే దుఃఖించవలెను. ఆతని దర్శనం కాలేదేయని విచారించి దానికై ఆశతో గడుపవలెను. ఒకే పద్ధతిలో జరిగింది పునశ్చరణ చేసికొంటూ ఇక ఆపై ఏమి చేయవలెనా అని విచారించుకొనవలెను.

నీలవర్ణుడైన శ్రీహరి భాగవత కథలను వింటూ నివ్వెఱగు (పారవశ్యము) నొందవలెను. ఆలకించిన మీదట అంతటితో వదిలేయక అందే భ్రమయగవలెను (వాటిని పునశ్చరణ చేసికొంటూ అందే సంచరించవలెను). తాలిమితో (క్షమాగుణంతో) పరులను ఆదరిస్తూ శ్రీహరి మహిమలను తలచుకొంటూ వుండవలెను. వేళవేళా (ప్రతిపూటా) ధ్యానించి శ్రీహరిని వెదకవలెను.

చేరి (తిరుమల చేరుకొని) శ్రీవేంకటేశుని, సేవించుక + ఉండవలెను (సేవిస్తూ ఉండిపోవాలి). సదా (యెల్లప్పుడూ) గారవాన (గౌరవముతో) మఱుగవలెను (సంతోషముతో నుండవలెను). పెద్దవారిని దర్శించి భగవత్ సంబంధమైన విషయములను అడుగుచుండవలెను. ఏపొద్దూ (వేళనైనా) నోటినిండా శ్రీహరీ అని పలుకుచూ ఆయనను ప్రార్థించవలెను.

పద్యవివరణ:

కం॥ **నారాయణ నీదాసుల**
మీరిన నడకలు యివేలె మించినవియవే
శ్రీరమణీ పరిపాలక
ధారుణితగులంగవలెను తనపని యిదియై.

సంఖ్య: III/203 రాగం : లలిత
కీర్తన : తెగక పరమునకు దెరువు లేదు

లలిత

59 తెగక పరమునకుఁ దెరువు లేదు
పగయెల్లా విడువక భవమూఁ బోదు. ॥పల్లవి॥

కన్నులయెదుటనున్న కాంచనముపై మమత
వున్నంతదడవు మోక్ష మొనగూడదు
అన్నముతోడిరుచులయలమట గలదాఁకా
పన్ని నసుజ్ఞానము పదిలము గాదు. ॥తెగ॥

పక్కనున్న కాంతలభ్రమగలకాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపుసంసారవిధి నున్నంతదడవు
నిక్కి పరమధర్మము నిలుకడ గాదు. ॥తెగ॥

చిత్తములోపలిపలు చింతలు మానినదాఁకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశుఁ డేలినదాసులకైతే
హత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు. ॥తెగ॥ 203

ఉపోద్ఘాతము:

తెగకపరమునకున్ తెరువు లేదు అంటున్నారు అన్నమయ్య. పరమును పొందే మార్గమే లేదట, తెగక. ఏది తెగక అంటే ఏది తిగిపోకుండా పరమున దారే లేదు? ఇహముతెగిపోకుండా. ఇహలోకంలోని భోగాలను వదలివేయాలి. భక్తివైరాగ్యాలు అలవరచుకోవాలి. మోక్షాపేక్షలో జీవితాంతం గడపాలి. పగనంతా వదలిపెట్టక భవమూ (పుట్టుకలూ) వదలిపెట్టవు, అంటున్నారు. తరువాత ఏమేమి వదలక ఏమేమి కావో

వివరించారు. అయితే శ్రీవేంకటేశుని దాసులకు మాత్రం వైకుంఠపదవి కూడా ఎప్పుడు కావాలంటే అప్పుడే సిద్ధముగా వుంటుంది, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! తెగక (ఇహమును త్రెంచివేయక) పరమునకు (దివ్యలోకప్రాప్తికి) తెరువులేదు (మార్గమే లేదు). పగయెల్లా విడువక (ప్రతీకార వాంఛతో కూడిన ద్వేషభావమును విడిచిపెట్టక) భవమూ (మరుజన్మా) పోదు (వదలదు).

మనకన్నులయెదుటనే వున్న కాంచనముపై (బంగారము మీద) మమత (ప్రేమ) వున్నంత వరకు మోక్షము (ముక్తి) ఒనగూడదు అన్నము ప్రాణము నిలుపుకొనుటకు తినవలెను. రుచులు మరుగుటకు కాదు. రుచులయలములు (యావ), వున్నంత వరకు, పన్నిన సుజ్ఞానము (సుస్థిరమైన మంచి జ్ఞానము) పదిలముగాదు (భద్రముగా వుండదు).

స్త్రీల పక్కన గడుపుతున్నంతకాలమూ వారిపై పురుషునికి యెన్నో భ్రమలు కలుగుతూనే వుంటాయి. ఆ సమయంలో శ్రీహరి భక్తిపై ధ్యాస కలుగదు. మిక్కిలి ప్రయత్నించినను భక్తి మెరయదు (వెలగదు). వెక్కసమగు (దుస్సహమైన) సంసార తాపత్రయంలో వున్నంతవరకు పరమధర్మము మోక్షప్రాప్తిని పొందే ధర్మవర్తన అలవడదు. దాని గురించి కొద్దిగా తెలిసినా అది నిలకడగా వుండదు.

చిత్తములోపల (మనస్సులోపలి) అనేక చింతలు (దిగుళ్ళు, ఆలోచనలూ) కలుగుతుంటాయి. ఆ చింతను మానివేసినదాకా సత్తుగా (బలంగా) వైరాగ్యం స్థిరపడదు. ఈపై చెప్పినవన్నీ సంసారగత ప్రాణులకు మాత్రమే వర్తిస్తాయి. శ్రీవేంకటేశ్వరుని దాసులకు మాత్రంహత్తి (అద్దినట్లు) వైకుంఠ పదవి అదిక్కడే దక్కితీరుతుంది.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇహముతెగక పరముకేదిరా తెరువది**
పగను వీడకుండ భవము పోదు
వేంకటేశుడేలు విష్ణుదాసులకును
హరి నెలవు దొరుకును అంతలోనె.

సంఖ్య: III/232 రాగం : నాట
కీర్తన : కొలిచినవారికి గొమ్మని వరములిచ్చీ

నాట

60 కొలిచిన వారికిఁ గొమ్మని వరములిచ్చీ
వెలయఁ గలశాపురవీధిహనుమంతుఁడు. ॥పల్లవి॥

బెట్టుగా నొకచేతఁ జూపెడి తనప్రతాపము
పట్టుకున్నాఁ డొకచేతఁ బండ్లగొల
మెట్టుకొన్నవి రాకాసిమెదడుతోడితలలు
రట్టడి కలశాపురదిట్టహనుమంతుఁడు. ॥కొలి॥

చెచ్చెర వీనుల నాలించేది సురలనుతులు
కొచ్చి కొచ్చి తోఁకఁ జుట్టుకొన్నది నింగి
తచ్చి చూచేది కన్నుల దాసులమీఁదికరుణ
రచ్చ కెక్కెఁ గలశాపురముహనుమంతుఁడు ॥కొలి॥

వసుధ మతిలోనిది స్వామికార్యవిశ్వాసము
వెసఁ దనపనైనది విష్ణుభక్తి
పసగా శ్రీవేంకటేశ బలు నీబంట్లలోన
రసికుఁడు కలశాపురముహనుమంతుఁడు. ॥కొలి॥ 232

ఉపోద్ఘాతము:

కలశాపురవీధిలో వెలసిన హనుమంతుని వైభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఈయన తనను కొలిచిన వారికి ఇదిగోతీసికోండని ధారాళంగా వరములు ఇచ్చేస్తుంటాడట. ఆయన ఒక చేత ఆనాటి తన ఆయుధమైన పండ్లగోలతో కొడితే రాక్షసుల తలలు మెదడుతోసహా చితికిపోయి నేలమీదపడ్డవట. ఆ హనుమ మతిలో స్థిరపడింది స్వామికార్యముపై విశ్వాసము. ఇకపోతే తన పనియేమో విష్ణుభక్తి. ఆ రసాస్వాదనలో

నిష్ణాతుడైనవాడు అని అన్నమయ్య ఉద్దేశ్యం. అన్నట్టు ఈ హనుమ తిరుమలేశుని నమ్మినబంటట.

తాత్పర్య వివరణ:

కలశాపురవీధిలో వెలసిన యీ హనుమంతుడు తనను కొలిచిన వారికి (మొక్కినవారికి) కొమ్మని తీసుకోండర్రా అని అనేక వరములను అనుగ్రహించుచున్నాడు.

ఈ స్వామి బెట్టుగా (బింకముగా) ఒక చేయి యెత్తి తన ప్రతాపమును చూపుచున్నాడు. ఇంకొక చేత పండ్లగోల (ముండ్లవలె పండ్లువున్న రాతి గదను) ధరించినాడు. ఆయన ఆపండ్లగోలతో కొట్టినదెబ్బకు రాకాసి (రక్కసుల) మెదడుతోసహా తలలు నుజ్జునుజ్జయి క్రిందపడ్డాయి. కలశాపురంలో వెలసిన ఈ దిట్టమైన హనుమంతుడు రట్టడివాడు (నానారభస చేయువాడు.)

చెచ్చెరవీనుల (నిక్కబొడుచుకున్న చెవులతో తనను దేవతలు స్తుతించే స్తోత్రములను ఆలకించుచున్నాడు. అయినా ఆయన వినమ్మడైయున్నాడనే సంకేతముగా నింగి పర్యంతం వ్యాపించిన ఆయన తోక కొచ్చికొచ్చి జుట్టుకొని యున్నది (కుచ్చులు చుట్టుకొన్నట్లు బిగుతుగా చుట్టుకొని యున్నది. ఆయన కన్నులను తరచిచూస్తే తనదాసులపై ఆయన చూపేకరుణ గోచరిస్తుంది. రచ్చకెక్కగల ఈ కలశాపురము హనుమంతుడు భక్తసులభుడు.

భూమిపై వున్నంతవరకు ఈయనకు మదిలో నెలకొన్నది (మనస్సులో స్థిరపడినది) స్వామికార్యముపై అచంచల విశ్వాసము. ఇకపోతే విష్ణుభక్తి ఈయనకు వెస (వేగముగా) తనదైనందిన కార్యక్రమమైపోయింది. పసయెప్పునట్లు శ్రీవేంకటేశ్వరుని బలవంతులైన బంట్లలో ఈ కలశాపుర హనుమ గొప్పరసికుడు (సరసప్రియుడు) అంటే కొందరిని ఆట పట్టిస్తుంటాడు.

పద్యవివరణ:

చం॥ **కొలిచినవారికీహనుమ కొమ్మని యిచ్చును బల్ వరంబులన్**
వెలుగుచు నేడు కన్పడెను వీధుల ఈ కలశాపురంబునన్
చెలువుగ వేంకటేశ్వరుని సేవతరించెడు యీ మహామహున్
తెలియుడు చిత్రమౌరసికధీమణి ఈ హనుమంతరాయుడే.

సంఖ్య: III/234 రాగం : సాళంగనాట
కీర్తన : కంటిరా వోజనులాల కరుణానిధి యితడు

సాళంగనాట

61 కంటిరా వోజనులాల కరుణానిధి యితఁడు
జంట లక్ష్మీదేవితోడ సరుసనున్నాఁడు. ॥పల్లవి॥

వాఁడివో ప్రతాపసుగ్రీవనరసింహుఁ డట్టె
మూఁడుమూర్తు లొకరూపై ముంచివున్నాఁడు
వేఁడిరక్కసులనెల్ల విదశించివేసినాఁడు
పోఁడిమి సురలఁ గాచీ భువనాధీశుఁడు. ॥కంటి॥

ఇరవైనరవిచంద్రు లితనికన్ను లివిగో
ధరణి ననంతవేదము లూర్పులు
అరుదై చెలఁగె బ్రహ్మాండ మీతనినెలవు
నిరతి సనకాదులు నిత్యసేవకులు. ॥కంటి॥

ఘనమైనశంఖచక్రములతో మెరసీని
మనిపె ప్రహ్లాదుని మన్నించె నిదె
యెనలేని శ్రీవేంకటేశుఁడై వున్నవాఁడు
అనిశము సకలాంతరాత్మ తానైనాఁడు. ॥కంటి॥ **234**

ఉపోద్ఘాతము:

జనులారా! ఇతనిని కంటిరా? ఈతడు కరుణానిధి. తనజంటగా లక్ష్మీదేవితోపాటు తన దగ్గరకు తీసికొని వున్నాడు అంటున్నారు అన్నమయ్య. ఇది ప్రహ్లాదవరదుడైన సుగ్రీవనరసింహునిపై చెప్పిన కీర్తన. ఆగ్రహంతో వేడెక్కిన రాక్షసులను విదలించివేశాడట, ఈ నృసింహుడు. సూర్యచంద్రులిద్దరూ ఈ స్వామికి రెండు కన్నులట. అనంతములైన

వేదములు ఈ నృసింహుని భయంకరమైన ఊర్పులట అంటే ఊపిరి పీల్చుటలు సనక సనందనాదులచే నిత్యమూ సేవలు గొంటాడట. శ్రీవేంకటాద్రిపైన దేవుడు కూడా ఈయనేనంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! ఇతడు (ఈ సుగ్రీవనరసింహుడు) కరుణానిధి (కరుణనిధిగా గలవాడు). తన జంట అయిన లక్ష్మీదేవితో సరసనున్నాడు (దగ్గరయైయున్నాడు). కంటిరా (చూచినారా?)

వాడివో (అదిగో వాడే) ప్రతాపశాలియైన సుగ్రీవ నరసింహుడు. అట్టే (అలాగే) మూడుమూర్తులు (త్రిమూర్తులని ప్రసిద్ధిని గాంచిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) ఒకే రూపు దాల్చి ఈ సుగ్రీవనరసింహుడైయున్నారు. వేడి (ఆగ్రహంతో వేడెక్కిన) రాక్షసులనెల్లా విదలించివేసినాడీ నరసింహుడు. భువనాధీశుడు అయిన ఈ నరసింహుడు పోడిమి (వాత్సల్యముతో) దేవతలందరినీ రక్షించినాడు.

ఇరవైన (నెలకొనిన) సూర్యచంద్రులే, ఇవిగో ఈ నృసింహుని కన్నుగవ. భూలోకంలో అనంతములైన వేదములే ఈ నరసింహుని ఊర్పులు (ఉచ్ఛ్వాస నిశ్వాసములు). అనంతమైన ఈ బ్రహ్మాండమే ఈ దేవదేవుని వాసస్థానము. విరక్తులైన సనకసనందనాదులు ఈ నృసింహుని నిత్యసేవకులు.

ఈ నరసింహుడు ఘనమైన శంఖ చక్రాయుధములతో మెరసిపోతున్నాడు. ప్రహ్లాదుని మనిపె (రక్షించెను). ఇదేమన్నించెను. ఎనలేని (సాటిలేని) శ్రీవేంకటేశ్వరుడు కూడా ఇతడే. అనిశము (యెల్లప్పుడూ) సర్వాంతరాత్మలలో తానే నెలకొని వున్నవాడు ఈ నరసింహుడు.

పద్యవివరణ:

ఉ॥ **కంటిరి గా భళా! జనులు కారణజన్ముడు ఈ నృసింహుడే**
జంటగనున్న లక్ష్మిసతి చక్కగ చెంతనెతోడు నిల్వగా
తుంటరి దైత్యమూకలను తుత్తుర చంపె, హిరణ్యజీల్చుచున్
వెంటనె వాని పుత్రునికి వేల్పులతోడుత రక్షనిచ్చెబో.

సంఖ్య: III/213 రాగం : శుద్ధవసంతం
కీర్తన : లేదందువల్ల దెలివి యెన్నటికిని

శుద్ధవసంతం

62 లే దందువల్లఁ దెలివి యెన్నటికిని
నీదయ నాపై నించినఁ గాని. ॥పల్లవి॥

అరయఁగఁ బ్రపంచ మలవడినటువలె
అరుదగువైరాగ్య మలవడదు
తరుణులరతి మతిఁ దలఁచినయటువలె
ధర నీసాకారము దలఁచదు మనసు. ॥లేదం॥

గొనకొన్న యర్థము గోరినయటువలె
కొనయగు మోక్షము గోరదు
తనుభోగములకుఁ దగిలినయటువలె
తనిసి నీ కథలకుఁ దనియదు మనసు. ॥లేదం॥

చలమును బాపము చవియైనటువలె
సలితపుణ్యము చవి గాదు
సులభ శ్రీవేంకటేశుఁడ నీమహిమిది
గలిగితివి నాకుఁ గలఁగదు మనసు. ॥లేదం॥ **213**

ఉపోద్ఘాతము:

అందువలన నాకుయెన్నటికీ తెలివిలేదని సుస్పష్టమైనది. నీదయ నాపై నింపితే కాని నాకు తెలివి రాదని అర్థమైనది అంటున్నారు, అన్నమయ్య. విచిత్రమేమంటే ప్రాపంచిక చింతన అలవడినంత తేలికగా వైరాగ్య చింతన మలవడదు. తరుణుల రతిమతి దలచినట్లు శ్రీహరిసాకార రూపము మనసు తలుచుకోలేదు. మానవుడు ధనమును తేలికగా కోరుకొంటాడు గానీ మోక్షము

కావాలని మాత్రం కోరుకోడు. మత్సర భావన కలిగించే పాపము రుచించినంతగా పుణ్యము రుచించదు. అదే శ్రీవేంకటేశ్వరుని లీల

తాత్పర్య వివరణ:

అందువల్ల (ఆ కారణంచేత) నాకుతెలివి యెన్నటికీ లేదని, అందును. నీదయ నాపై నించిన (నిండిన) గానీ నేను ఉత్తీర్ణుడనగుట జరిగేపనికాదు.

అరయగ (పరికించి చూస్తే) ప్రపంచము అలవడినంత (అలవాటు పడినట్లు), అరుదైన వైరాగ్యము మానవునికి అలవడదు (అలవాటు పడదు). స్త్రీలతో రతిక్రీడలు మనస్సులో తలచినంత తేలికగా, భూలోకంలో ఎవ్వడూ శ్రీహరి సాకార స్వరూపమును కన్నులకు కట్టుకొనలేడు. కారణమేమంటే చెడునచ్చినంత తేలికగా మంచి నచ్చదు.

గొనకొని (నిశ్చయించుకొని) అర్థము (ధనము) కాంక్షించినంత సులభంగా నరుడు మోక్షమును కాంక్షింపడు. అది కొనయగు మోక్షమే (చిట్టచివరికి సాధించవలసినదే అయినప్పటికీ) మనస్సు దానిని కోరనే కోరదు. ఈ మనస్సుకి ఇంకొక మాయరోగమున్నది. దానికి భోగాలు రుచించినంత తేలికగా శ్రీహరి కథలపై తనియదు (తృప్తి చెందదు) మనస్సు.

మానవునికి చలము (మాత్సర్యము), పాపము చవియైనట్లు (రుచించినట్లు) సలలిత పుణ్యము (మృదుమధురమైన పుణ్యము) చవిగాదు (రుచించదు). సులభముగా అనుగ్రహించే ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదంతా నీ మహిమయే ప్రభూ! నీవు నాకు కలిగితివి (లభించితివి). ఇకపై నామనసు కలగదు (కలత చెందదు) ఎందుకంటే అది నీధ్యాసలోనే వుంటుంది కదా!

పద్యవివరణ:

కం॥ **లేదందువల్ల తెలివియు**
నీదయనాపైన నీవు నించినగానీ
ఇదె కలిగితివిగ నాకున్
మదిగలగదు నిజము నిజము మధువైరిహరీ!

సంఖ్య: III/219 రాగం : సాళంగనాట
కీర్తన : నీవారైనవారికి నీపై భక్తేకాక

సాళంగనాట

63 నీవారైనవారికి నీపై భక్తే కాక
భావించనేరక వట్టిభ్రమఁ బడవలెనా. ॥పల్లవి॥

కరుణానిధి నీవు గలిగివుండఁగాను
తిరుమంత్రమే నాకు దిక్కయివుండఁగా
వరుస నాచార్యుఁడు వహించుక వుండఁగాను
పరగఁ దపము చేసి బడలఁగవలెనా. ॥నీవా॥

కమలాక్ష నీముద్రలే కాచుక నాకుండఁగాను
అమరి దాస్యము కాణాచై వుండఁగా
తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా. ॥నీవా॥

శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా
ఆవటించి నుతి వుపాయమై వుండఁగా
తావులనే శరణనేధర్మము రక్షించఁగాను
వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా. ॥నీవా॥ 219

ఉపోద్ఘాతము:

నీవారైనవారికి కూడా నీపై భక్తే కుదురుటలేదు. నీమాయకాకపోతే, వారు కూడా నిన్ను భావించనేరక వట్టి (వ్యర్థమైన) భ్రమలో పడిపోవలెనా? ఇదెక్కడి విడ్డూరం అంటున్నారు అన్నమయ్య. హరి భక్తులు కానివారి పరిస్థితి అలా వుందంటే ఆశ్చర్యంలేదు. కానీ మేము హరి శరణాగతులము. ఓ కరుణానిధీ! నీవు కలిగివుండగా, ఓం నమో నారాయణాయ అనే నీ తిరుమంత్రం దిక్కయివుండగా నా ఆచార్యుడు నా భారమువహించుకొని యుండగా నేను

ఏవేవో తపములనుజేసి వడలిపోవుట యెందులకయ్యా? అంటున్నారు. తరచి చూస్తే ఇది అద్భుతమైన కీర్తన అని అవగతమవుతుంది.

తాత్పర్య వివరణ:

ఓ దేవా! నీవారైన భక్తులకి నీపై భక్తే కుదరదా? వారికి నీపై భక్తే కాక (కుదరక) భావించనేరక (నీ ఆకారాన్ని భావనలో నిలుపుకోలేక) వట్టి (వ్యర్థమైన) భ్రమలలో బడవలెనా? ఇది తగనిపని ప్రభూ!

ఓ కరుణానిధీ! నీవునాకు కలిగివుండగా నాకు "ఓం నమో నారాయణాయ" అనే నీ తిరుమంత్రమే దిక్కయివున్నది. నాపై అపార కరుణతో వరుసలోనున్నా నాపై దయాగుణం వహించి (పొంది) మా ఆచార్యుడు మాతోడైవుండగా మాకు భక్తి జ్ఞానవైరాగ్యములు వాటంతట అవే కలుగుతాయి. వాటిని మేము గొప్ప తపస్సులతో సాధించనక్కరలేదు.

ఓ కమలాక్షా! నీ శంఖుచక్రముద్రలు నేను నాదేహంపై ధరించాను. దానివలననే నేను పవిత్రుడనయ్యాను. ఆపైన నేను నీ దాస్యము నెంచుకొని అదే కాణాచిగా (ప్రాప్యస్థానముగావుండి నీసేవలో వుండిపోయాను. నాపై తమితోడ (ఆసక్తితో) వైష్ణవులు దాపుదండై (చేరువలోనే వున్న అందదండై) వున్నారు. ఈ భాగ్యము చాలదా? ఇంకా నేను ప్రయాణాలు చేసి తీర్థములన్నీ దర్శించవలెనా? అక్కరలేదు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు నీసేవయే గతియై వుండగా ఆవటించి (పొందుపడి) నీనుతి (ప్రార్థన) నిన్ను పొందే నిరుపమాన వుపాయమై యుండగా నన్ను రక్షించేది యేమిటి? నీ శరణాగతి అనే ఒక్క ధర్మమే. ఇవన్నీ నాకుండగా అనేక దానాలు చేసి నిన్ను మోక్షంవేడుకోవలెనా?

పద్యవివరణ:

కం॥ **నీవారు అయినవారికి**
నీవనినన్ నీదుపైన నిలుచును భక్తే
భావించనేరకివ్విధి
గోవిందా! వట్టి భ్రమల కుందగవలెనా?

సంఖ్య: III/235 రాగం : ముఖారి
కీర్తన : ఉవిదలాల చూడరే వుద్దగిరికృష్ణుడు

ముఖారి

64 ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుడు
నవకపు సెలవులనవ్వుచున్నాడు ॥పల్లవి॥

అచ్చపుబాలుఁడై శకటాసురు మర్దించినాఁడు
కుచ్చి కాఁగిళ్ల నింతులఁగూడినాఁడు
మచ్చిక దోఁగెడుతాను మద్దులు విరిచినాఁడు
పిచ్చిలఁ బూతకిచన్ను పీలిచినాఁడు. ॥ఉవి॥

పిన్న నాఁడే కోడెలతోఁ బెనఁగి గెలిచినాఁడు
యెన్నికగా వేలఁ గొండ యెత్తినాఁడు
వెన్నడిని కొండపాము వెస రెండు సేసినాఁడు
పన్ని కంసునిమదము భంజించినాఁడు. ॥ఉవి॥

పొంచి పెద్దవాఁడై భూభారము దించినాఁడు
అంచెఁ బాండవులకు దిక్కైనవాఁడు
మించి శ్రీవేంకటగిరిమీఁద నిదె వున్నవాఁడు
వంచించక దాసులకు వరాలిచ్చేవాఁడు ॥ఉవి॥ **235**

ఉపోద్ఘాతము:

"సెలవుల నవ్వులు" అంటే పెదవుల మూలల నుండి కనుపించీ కనుపించని చిరునవ్వు అని అర్థం. "నవకపు" అంటే మృదువైన అని అర్థం. ఉద్దగిరి (ఉదయగిరి)లో వెలసిన శ్రీకృష్ణునిపై మధురమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య.

ఓ ఉవిదలారా చూడండమ్మా! ఈ ఉద్దగిరి కృష్ణుడు మృదువైన దరహాసం గల మోహనాకారుడు అంటున్నారు. ఇక ఆపైన శకటాసురవధ, మద్దిచెట్లను గూల్చి కుబేరుని పుత్రులకు శాపవిమోచనం చేయుట, పూతన వధ, కోడెలతో

పోరి కృష్ణుడు గెల్చుట, గోవర్ధనోద్ధరణము, కంసవధ, భారతయుద్ధం ప్రస్తావిస్తూ మధురమైన కీర్తన వినిపించారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ ఉవిదలారా! (వనితలారా!) చూడరే (చూడండమ్మా!) ఈ ఉద్దగిరి కృష్ణుడు (ఉదయగిరి కృష్ణుడు) ఎంత అందమైనవాడు. ఇతడు నడకపు సెలవుల (మృదువైన దరహాసముతో) సమ్మోహనంగా నవ్వుచున్నాడు.

అచ్చపు బాలుడై (ఆశ్చర్యము గొలుపు బాలుడై) ఇతడు శకటాసురుని మర్ధించినాడు. కుచ్చి (గుచ్చి) కౌగిళ్ళలో ఇంతులను కూడినాడు. దోగాడే వయస్సులోనే తమ దొడ్డిలోనున్న మద్ది చెట్లను కూల్చి నలకూబర మణిగ్రీవులను గంధర్వ కుమారులకు (కుబేరుని పుత్రులు) శాప విమోచనం కలిగించినాడు. పూతకి పిచ్చిల (పూతన వెఱ్ఱెత్తిపోవునట్లు) చన్నులు పీల్చి ప్రాణాలు హరించినాడు.

పిన్ననాడే (కుర్రవాడప్పుడే) కోడె గిత్తలతో పోట్లాడి గెలుపు సాధించాడు. శ్రేష్ఠుడై తన చిటికెన వేలిమీద కొండనెత్తి (గోవర్ధనపర్వతమెత్తి) గోవులను గోకులమును ఇంద్రుడి వడగళ్ళవాననుండి రక్షించినాడు. వెన్నంటి గోపాలురనుకబళించబోయిన కొండ చిలువ రాక్షసుని రెండుగా నరికి సంహరించినాడు. పూనుకొని కంసుని మదమును భంజించినాడు (నుగ్గు చేసినాడు).

కొన్నాళ్ళకు పెద్దవాడై భూదేవియొక్క భారమును నివారించుటకు భారత యుద్ధమును నడిపినాడు. ఆ యుద్ధంలోనే కాక కడదాకా పాండవులను ఆదుకునే దిక్కు అయినాడు. అన్నిటినీ మించి నేడు ఆ ఉద్దగిరికృష్ణుడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడై ఇదే వున్నాడు. ఈయనెటువంటివాడంటే తన దాసులను యెన్నడూ వంచించక అనేక వరములిస్తాడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఉవిదలార! కనుడు ఉద్దగిరిని నెల-**
కొన్న కృష్ణుడితడు కొలువుడితని
నవ్వుచున్నవాడు నవకపు సెలవుల
వేంకటగిరిపైన వెలసినాడు.

సంఖ్య: III/236 రాగం : ఆహిరినాట
కీర్తన : అరుదరు దీగతి యహోబలేశ్వర

ఆహిరినాట

65 అరుదరు దీగతి యహోబలేశ్వర
పొరిఁబొరి దాసులు పొగడుట యెట్టు. ॥పల్లవి॥

యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని
అదె ప్రహ్లాదుఁడు బంటగుటెట్లు
కదిసినరుద్రునిగర్వ మడఁచితివి
గుదిగొనిదివిజులు కొలుచుట యెట్టు. ॥అరు॥

ఘనసింహాకృతి గైకొనివుంటివీ
యెనయఁగఁ గరిఁ గాచినదెట్లు
పనివడి కంబమువగుల వెడలితివి
మనుజులు పూజించి మరుగుట యెట్లు ॥అరు॥

సరవితో వీరరసమున మించితివి
అరయఁగ శృంగారి వౌటెట్టు
సిరి పుర మెక్కెను శ్రీవేంకటాద్రిని
యిరవుగ నీతొడ యెక్కుట యెట్టు. ॥అరు॥ **236**

ఉపోద్ఘాతము:

ఇది పైకి కనిపించని, అనిపించని మహాద్భుత కీర్తన. ఇందులోని సాహితీ చమత్కారం చూడండి. ప్రభూ! నీవు చేసిన పనులేమో బహు అరుదైనవి. ఓ అహోబలేశ్వరా! పొరి బొరి (మాటి మాటికీ) నీదాసులు నిన్ను పొగడుట యెట్లు? అంటున్నారు అన్నమయ్య. ఒక పక్కన హిరణ్యకశిపుని చీల్చి సంహరించావు. ఇక వాడికొడుకు నీ శత్రువవాలిగాని నీ ప్రియమైన బంటు

అవటమేమిటి? ఇదెక్కడి వింత. రుద్రుడంతటివాని గర్వము ఖర్వము చేసితివి. ఇక ఆయన పరివారమైన దేవతలు నిన్నెట్లా కొలిచెదరయ్యా! అయినా వారు నీ శరణాగతులైనారు. ఇట్లా సాగుతుందీ కీర్తన.

తాత్పర్య వివరణ:

ఓ అహోబలేశ్వరా! ఈ గతి (నీ ఈ పద్ధతులు) బహు అరుదరుదు (చాలా అరుదైన విధానములు). ఇట్టి సంకట పరిస్థితిలో పొరిబొరి దాసులు (మాటిమాటికీ) నీదాసులు నిన్నుపొగడుట యెట్లు సాధ్యమవుతుంది?

ఎదుట (అందరూ చూస్తుండంగానే) హిరణ్యకశిపుని చించితివి (చీల్చి చంపివేశావు). అదె (వాడి కొడుకే అయిన) ప్రహ్లాదుడు నీకు శత్రువు అవ్వాలి కానీ నీ ప్రియమైన బంటు అవటం యేమిటి? నిన్ను యెదరించిన రుద్రుని గర్వమును ఖర్వము చేసినావు. ఇక ఆ రుద్రుని పరివారమైన దివిజులు (దేవతలు) నీకు పగవారవ్వాలిగానీ వాళ్ళే నిన్ను కొలవటమేమిటి?

ఘనమైన సింహాకారమును దాల్చిన నిన్ను చూసి గజేంద్రుడు భయంతో చచ్చిపోవాలిగాని నీవు గజేంద్రవరదుడివవటం యెంత విచిత్రం? ఉన్నట్లుండి స్తంభమును చీల్చుకొని బయటకు వచ్చితివి. నీవు ఎక్కడ యెప్పుడు వెలిసెదవో తెలియదు. ఇకమానవమాత్రులు నిన్ను పూజించి వరములాసించుట యెట్లు?

ఓ అహోబలేశ్వరా! సరవితో (క్రమముగా) నీవు వీరరసమును పోషించుటలో మించిపోతివి. నీవు నరసింహుడివి అది నీకు సహజమే. కానీ అరుదైన శృంగారరసమున నీవు శృంగారివవటం యేమివింత? కానీ ఏమివింతలేదని కొంచెము ఆలోచిస్తే తెలుస్తుంది. నీవు నిజానికి శ్రీవేంకటేశ్వరుడవు అందుకే సిరి (లక్ష్మీదేవి) నీవురమెక్కినది (నీ హృదయాన్నాక్రమించినది). ఇక నీతొడ మీదయెక్కి కూర్చోటమేమి కష్టము?

పద్యవివరణ:

కం॥ **అరుదరుదీగతి దేవా!**
ఇరవైన యహోబలాన యిటువుంటివిగా
పొరిబొరి దాసులు పొగడుట
హరియెట్టగు వేంకటేశుడయిన సరికదా!

సంఖ్య: III/231 రాగం : దేసాళం
కీర్తన : విశ్వరూప నీమూర్తి వివేకించలేను నేను

దేసాళం

66 విశ్వరూప నీమూర్తి వివేకించలేను నేను
శాశ్వతుఁడ నీవున్న చందమేమీ నెఱఁగ ॥పల్లవి॥

నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట
దొబ్బుకొంటాఁ దిరిగేము తోవల నిన్ను
వుబ్బి సముద్రమువలెనున్న నీప్రకృతియందు
గబ్బినై యీఁదుచున్నాఁడఁ గలఁగకుమీ. ॥విశ్వ॥

కడయుమొదలులేనికాలము నీతనువట
నడుమ నందుతోనే పెనఁగుచున్నాఁడ
అడరి నీ సొమ్ములైన ఆత్మలలో నొకఁడనై
చిడుముడి నున్న వాఁడ చిక్కువఱచకుమీ ॥విశ్వ॥

పరమున నిహమునఁ బ్రబలియున్నాఁడవట
గరిమ సోదించేము కమ్మటి నిన్నుఁ
ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము
శరణు చొచ్చితి మిఁక చనవిచ్చి కావుమీ. ॥విశ్వ॥ 231

ఉపోద్ఘాతము:

విశ్వరూపుడైన పరమాత్మతో మొఱబెట్టుకొంటున్నారు అన్నమయ్య. ప్రభూ! నేను అజ్ఞానిని.నీమూర్తి యెలావుంటుందో వివేకించలేను (వివేకముతో ఇట్లా వుంటుంది అని చెప్పలేను). శాశ్వతుడవైన ఓ పరమాత్మా! నీవు వున్నటువంటి తీరు యెట్టిదో నేను యెఱగనైతిని, అంటున్నారు.

నిదానంగా ఒకటికి రెండుసార్లు చదివి వివేకిస్తేగానీ ఈ కీర్తన అర్థంకాదు. నీవు వేరే యెక్కడో వైకుంఠంలో వుండవు.ఈ లోకమెల్లా కొద్దిగాకూడా

సందులేకుండా నిండిపోయి వున్నావు. మేము నిత్యమూ నిన్ను దొబ్బుకుంటూ తిరుగుతూనే వున్నాము. తోవలలో నిన్ను తొక్కుకొంటూ వెళ్తున్నాము. అయినా మాకు తెలియటంలేదు. మరి నీ మాయకాకపోతే ఇదేమిటి? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ విశ్వరూపా! నేను అజ్ఞానిని. నీ మూర్తి (సాకార రూపం) ఇలా వుంటుందని, వివేకించలేను (వివేకముతో తేటతెల్లమగునట్లు వివరించలేను. శాశ్వతుడవైన ఓ పరమాత్మా! నీవు వున్న చందము (తీరు తెన్నులేమిటో కూడా నేనెరుగను.)

నిబ్బరమై (నిదానముగా) వ్యాపించి ఈ లోకమెల్లా అణుమాత్రం సందులేకుండా నిండిపోయి వుంటావట. నువ్వేమో అగోచరుడవు. మేము నిన్ను దొబ్బుకొంటా (తోసుకొంటూ) తోవలలోనేవున్న నిన్ను తొక్కుకుంటూ ఆ సంగతి తెలీక తిరుగాడుతూనేవున్నాము. ఈ ప్రకృతి వుబ్బి (వ్యాపించి) సముద్రమువలె మాచుట్టూ వున్నది. గబ్బినై అర్థంలేని గర్వంతో ఇందులో ఈదులాడుతూనే వున్నాను. ప్రభూ! కలగకుమీ (నన్ను కలతపెట్టవద్దు.)

ఓ దేవా! నీతనువు (శరీరము) ఎట్లా వుంటుందో ఎవ్వరు చెప్పగలరు?నీవు కాలము స్వరూపముగాకలవాడవట. నేను ఈకాలముయొక్క నడుమన దానితోనే పెనగులాడుచుంటిని. మా ఆత్మలన్నీ పరమాత్మవైన నీ సొమ్మేకదా! ఈ ఆత్మలలో వొకడనైన నేను చిడుముడినున్నవాడ. తొట్రుపడుతూ కంగారు కంగారుగా వుండిపోయాను. ఏ జన్మనెత్తుతున్నానో యెందుకుయెత్తుతున్నానో నాకే తెలియదు. అసలే చిక్కులలో వున్న నాకు ఇంకా చీకాకు కలిగించుట యెందులకు ప్రభూ!

ఓప్రభూ!నీవు ఇహలోకమునందునూ, పరలోకములందును వ్యాపించివున్నావు. మా ఎదురుగా వున్న నిన్ను యెక్కడవున్నావా అని సోదించెదము (పరిశోధిస్తున్నాము). శ్రీవేంకటాద్రిపైసాకార రూపముతో వెలసియున్నావు. ఇక నీవెట్లావుంటావా అని వూహించుటెందులకు? నిన్ను శరణుచొచ్చి యున్నాము. ఇక అనురాగముతో మమ్ము రక్షింపుము ప్రభూ!

పద్యవివరణ:

తే.గీ॥ **విశ్వరూప నీమూర్తి వివేకమొంది**
నేను వూహింపజాలను నిముషమైన
శాశ్వతుడనీవు యుండెడి చందమేమి
యెరగనైతిని నిజమిది తిరుమలేశ!

సంఖ్య: III/237 రాగం : దేసాళం
కీర్తన : నిండు కంతటా నున్నది నీమాయ

దేసాళం

67 నిండు కంతటా నున్నది నీమాయ
వొండొకరు జనులకు నుపదేశించనేలా. ॥పల్లవి॥

నేరకుంటే సంసారము నేరుపునునీమాయ
చేరకుంటే గడులోనుచేసుకొను నీమాయ
వూర కొడఁబడకుంటే వొడఁబరచు నీమాయ
పోరి బిడ్డలకుతండ్రి బుద్ధి చెప్పవలెనా. ॥నిండు॥

నాలికె కారురుచులు నలిఁ దెలుపు నీమాయ
బేలుఁడై విరక్తుఁడై భిక్షమెత్తించు నీమాయ
పాలుమాలేమంకునైనా పనిసేయించు నీమాయ
రేలుఁబగళ్లొకరు ప్రేరేఁపుచుండవలెనా? ॥నిండు॥

చొక్కించి నోరుఁ జేతికి సూటి చూపు నీమాయ
పెక్కులాగుల నన్నిటాఁ బెనగించు నీమాయ
వెక్కనపలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తక్కకనీమహిమిది తలపించవలెనా. ॥నిండు॥ **237**

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! నీమాయ అంతటా నిండుకొని యున్నది. అటువంటప్పుడు ఒకరిద్దరు జనులకు వుపదేశించటంయెందుకు? అంటున్నారుఅన్నమయ్య. నాలుకకు ఆరు రుచులు ఒకేసారి తింటున్నాయెలా తెలుస్తున్నాయి? నీ మాయ వల్లనే తెలుస్తున్నాయి. ఒక మోసగాడిని కూడా విరక్తునిజేసి భిక్షాటనతో జీవించునట్లు చేయగలదు నీమాయ. వల్లమాలిన మంకుతనముగలవానిని

కూడా తిండిలేక పనిచేసుకొని పొట్టనింపుకొనేవానిగా చేయగలదు నీ మాయ. ఇక రేయింబవళ్ళు ప్రేరేపించుచుండవలెనా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవా! అంతటా (అన్నిచోట్లా) నీ మాయ నిండుకయున్నది (నిండిపోయి వున్నది). ఒండొకరుజనులకు (ఒకరిద్దరు వ్యక్తులకు) ఉపదేశించనేల (దాని గురించి వివరించినందువల్ల ప్రయోజనమేమిటి?)

సంసారము యెట్లా చేయాలో నేరకుంటే (తెలియకపోతే) నీమాయే దాన్ని కూడా నేరుపుతుంది. నీ మాయకు చేరకుంటే (లొంగకుంటే) వున్నట్లుండి నీమాయ వారిని లొంగదీసుకుంటుంది. ఒకవేళ ఎవడన్నా నీ మాయకు ఒడబడకుంటే (అంగీకరించకపోతే) బలవంతాన అంగీకరించేటట్లు చేస్తుంది నీమాయ. పోరి (పోట్లాడి) తండ్రి బిడ్డలకు బుద్ధి చెప్పవలసిన పనిలేదు. వారికి నీమాయే అన్నీ నేర్పుతుంది.

ఓ దేవా! మనిషి నాలికకు తీపి, చేదు, కారము, పులుపు, ఉప్పు, వగరు అనే ఆరు రుచులను వేర్వరచి తెలుసుకొనే నేర్పు కల్పించింది నీమాయే. బేలుడైన (మోసకారి అయిన వాణ్ణి) కూడా విరక్తుడిని చేసి బిచ్చమెత్తుకొనేట్లు చేస్తుంది నీ మాయ. పాలుమాలిన (లొంగని మొండివాడిని కూడ) లొంగదీసి వాడిచేత కాయకష్టము చేసేటట్లు ఒప్పిస్తుంది నీ మాయ. రేయింబవళ్ళూ ఎవరో ఒకరు ప్రేరేపించవలసిన పనిలేదు.

చీకట్లో కూడా మనిషి తిండి తినకలదు.వాడి నోటికి సూటిగా వాడిచేయి వెళ్ళేట్లు చూపుతున్నది ఎవరు? నీమాయేనయ్యా! వాటి జీవితకాలంలో అనేక లాగుల (అనుబంధాలతో) పెనగులాడేట్లు చేసేది కూడా నీమాయే. సాటిలేని అలమేల్మంగావిభుడవైన ఓ వేంకటేశ్వరా! ఇది ఎన్నడూ తగ్గని నీ మహిమ. ఇది ఎటువంటిదో తలపించవలెనా (గుర్తు చేయాలా?)

పద్యవివరణ:

ఆ.వె॥ **నిండియున్నదయ్య! నిఖిలంబు నీమాయ**
ఒకరికొకరు జనులకోపినంత
ఏల పూని తాము ఇంతుపదేశించ
వలెను వేంకటేశ వసుధయందు.

సంఖ్య: IV/30 (P381) రాగం : కాంబోది
కీర్తన : తల్లి బాసి బిడ్డలెల్ల దల్లడించినట్టు

కాంబోది

68 తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్టు నా
పల్లదా లెవ్వరి పాలయ్యానో తాము ॥పల్లవి॥

మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు
ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా
గాదిలి కర్మములేడఁ గంటివో (దీనో?) తాము ॥తల్లి॥

కాఁపుటూరి మంగలోజుగడిమీఁది రాజుగాఁగ
కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు
ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా
పాపము లెవ్వరి పంచపాలయ్యానో తాము ॥తల్లి॥

ఒట్టిన మోఁపులు మోవనోపక వూరువిడిచి
పెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు
ఇట్టె నేను శ్రీవేంకటేశుఁ గొలువఁగ నా
చుట్టము లిందరు నేడఁ జొచ్చేరో తాము ॥తల్లి॥ **31**

ఉపోద్ఘాతము:

తల్లి వదలిపెట్టిపోతే బిడ్డలు ఆ తల్లి కోసం తల్లడిల్లి పోతారుకదా! అలాగే నాలోని ధూర్తత్వములు వాటిగతేమవుతుందోకదా! అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో అన్నమయ్య ఇచ్చిన ఉదాహరణలు అద్భుతంగా వుంటాయి. ఒక కులట పోయి ఆదేశపు రాజుగారిని తగులుకొంటే వ్యధ చెందినదాని విటులంతా కుళ్ళి కుళ్ళి బాధపడ్డారు. అదే విధంగా శ్రీకారం చుట్టి నేను శ్రీహరిని కొలుచుట మొదలుపెట్టగానే ప్రేమతో నావెంట తిరిగే కర్మములు

తాము యెక్కడికి మాయమయ్యాయో? అంటున్నారు. చూశారా యెంత చమత్కారంగా చెప్పారో!

తాత్పర్య వివరణ:

ప్రభూ! నాపల్లదాలు (ధూర్తత్వములు) తాము యెవ్వరి పాలయ్యానో (ఎవరి పాలబడతాయో కదా!) వాటిగతి తల్లి వదలిపెట్టిపోయిన బిడ్డలమాదిరి అయింది. ఆ బిడ్డలెలా తల్లడిల్లిపోతారో నాలోని ధూర్తత్వములు కూడా ఆకావికలైపోయాయి.

మేదరింటిలంజ (కులటయైన ఆడుది) మేదినీశు (ఆ దేశపు రాజుగారిని) తగులుకొంటే, గోదిలి (బాధపడిన) కువిటులెల్లా (దాని దుర్మార్గులైన విటులందరూ, గుల్లినయట్లు (కుమ్ముకొన్నట్లు) ఆదిగొని (శ్రీకారం చుట్టి) నేను పోయి శ్రీహరిని కొలచుట మొదలుపెట్టగానే నా ప్రియమైన కర్మములన్నీ తాము యెక్కడికి మాయమయ్యాయో కదా!

కాపుటూరి (కాపులున్న ఊరిలోని) మంగలోజు (మంగలి ఉపాధ్యాయుడు) గడిమీద రాజుగా (తమ సీమకు రాజు అయిపోయాడు). దానితో ఆ వూరి కాపులందరూ తమపని వదలివేసి కందినయట్లు (తాపము చెందారు). అదే విధంగా, ఇక ఆగలేక నేను పోయి శ్రీహరిని కొలుచుట మొదలుపెట్టగానే నా పాపములన్నీ పోయి ఎవ్వరి పంచను చేరాయో కదా!

ఒట్టిన మోపులు మోవనేరక (పైబడ్డ పనిభారం తట్టుకోలేక) ఒక వెట్టివాడు పారిపోయాడు. అయితే ఆ వూరి వాళ్ళు వాణ్ణి వదలిపెడతారా? వెదకి పట్టుకొని పని చేయించుకొంటారు. నా చుట్టాలు కూడా అంతే నన్ను వెదకి పట్టుకొంటున్నారు. ఒకసారి నేను శ్రీవేంకటేశ్వరుని శరణని కొలువగానే నాకు వారి పీడవదిలింది. వారంతాయెక్కడకు పోయారోగాని నన్ను వదలిపెట్టారు.

పద్యవివరణ:

కం॥ **ఎవ్వరి పాలయ్యేనో**
ఇవ్వలనాపల్లదాలు ఇందరవిభుడా!
ఎవ్విధితల్లిని బాసిన
సవ్వడిపిల్లలును యెట్లు చరియింతురొకో!

సంఖ్య: IV/507 రాగం : శంకరాభరణం
కీర్తన : ఎంత భాగ్యవంతులమో యీతని బొడగంటిమి

శంకరాభరణం

69 ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి
చెంతనుండి మమ్మునేలే శ్రీ విట్ఠలేశుఁడు ॥పల్లవి॥

తుంగభద్రాతటమున తొంటిపరబ్రహ్మము
అంగవించి సాకారమైవున్నాఁడు
సంగతితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు ॥ఎంత॥

అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ-
డందరికిఁ బ్రత్యక్షమై యున్నాఁడు
సందడించి గోపికాజనములతోడుత
చెంది వున్నాఁడిదివో శ్రీ విట్ఠలేశుఁడు ॥ఎంత॥

వెలసి వనాలలోన వేదవేద్యుఁడైన హరి
అలరి కృష్ణావతారమై యున్నాఁడు
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే పదారువేల
చెలులతోఁ గూడినాఁడు శ్రీ విట్ఠలేశుఁడు ॥ఎంత॥ 507

ఉపోద్ఘాతము:

ఆహా! మేము యెంత భాగ్యవంతులమో కదా! యితని దర్శన భాగ్యము కలిగినది. ఈ శ్రీ విట్ఠలేశుడు మా సమీపమునేయుండి మమ్ము యేలినాడు అంటున్నారు అన్నమయ్య. ఈ విట్ఠలేశ్వరుడు తుంగభద్రా నదీతీరమున వెలసిన అనాది పరబ్రహ్మమట. నేడు అదే పరబ్రహ్మ సాకరరూపముతో వున్నాడు. రుక్మిణీ సత్యభామల నడుమ మహిమల విరజిమ్ముతూ

చెంగలించినాడు అంటున్నారు. పదహారువేల మంది చెలులతో కూడిన ఈ శ్రీవిట్ఠలుడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడూను అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఆహా! మేము యెంత బాగ్యవంతులమో కదా! మేము ఈతనిని పొడగంటిమి (దర్శించగలిగాము). ఈ శ్రీ విట్ఠలేశ్వరుడు చెంతనుండి (మా సమీపముననే వుండి) మమ్ము యేలినాడు (పరిపాలించుచున్నాడు).

ఈయనెవరనుకొన్నారు, తుంగభద్రానదీ తీరమున వెలసిన తొంటె పరబ్రహ్మము (అనాది పరబ్రహ్మస్వరూపుడు). సంగతితో (చేరువయై తన భార్యలైన రుక్మిణీ సత్యభామల నడుమ చెంగలించీ (అతిశయించుచూ) తన మహిమలను ఈ శ్రీవిట్ఠలేశుడు ప్రదర్శించుచున్నాడు.

అందమైన పైడిమేడలో (బంగారు భవంతిలో) ఆదిమూర్తియైన ఈ విట్ఠలదేవుడు అందరికీ ప్రత్యక్షమైయున్నాడు. సంగడించి (జతయై) గోపీవనితలతో కూడి ఇదివో ఈ శ్రీ విట్ఠలేశుడు ఆ గోపికలతో (చెంది యున్నాడు) పొందుతో వున్నాడు.

వేదములద్వారానే గోచరుడైన శ్రీహరి నేడు ఈ అడవులలో వెలసి మనకు గోచరమగుచున్నాడు. నేడు ఈ శ్రీకృష్ణావతారముతో తన లీలలను ప్రదర్శించుచున్నాడు. ఒకటి గమనించారా? ఎలమి (సంతోషముతో) ఇతడే తిరుమల శిఖరాలపై శ్రీవేంకటేశ్వరుడై యున్నాడు. ఈ శ్రీవిట్ఠలేశుడు నరకాసురుని వధానంతరం అతను చెఱబట్టిన పదారువేల రాచకన్నెలను చెఱవిడిపించి వారందరి కోరిక మేరకు వారిని ఒకేసారి పరిణయమాడాడు. ఆ చెలులతో కూడియున్నాడు.

పద్యవివరణ:

ఉ॥ **ఎంతటి భాగ్యవంతులమొ ఈతనినే పొడగంటిమీ యెడన్**
చెంతలనుండి మమ్ముయిటు శ్రీవిఠలేశుడయేలినావుగా
పొంతనెపైడిమేడలను పూని వసించితి వాది మూర్తివై
వింతగ వేంకటేశ్వరుడె విఠలనాథుడు వేల భామలై.

సంఖ్య: IV/46 (P392) రాగం : మేచబౌళి
కీర్తన : అచ్చపురాల యమునలోపల

మేచబౌళి

70 అచ్చపు రాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ ॥పల్లవి॥

ఊరుఁగాయలును నొద్దికచద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవులు గొంటివి కృష్ణా ॥అచ్చ॥

ఆకసంబున కాపుర ముఖ్యులు
నాకలోకపు నాందులును (?)
కైకొని యజ్ఞకయ్తి యాతఁడని
జోకఁ గొనియాడఁ జొక్కితి కృష్ణా ॥అచ్చ॥

పేయలు లేవు పిలువుఁడనుచు
కోయని నోరఁ గూఁతలను
మాయల బ్రహ్మము మతము మెచ్చుచు
చేయని మాయలు సేసితి కృష్ణా ॥అచ్చ॥ **46**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో "వేంకట" మకుటంకానరాదు. ఈ కీర్తనలో నిఘంటువుకు దొరకని ఎన్నో పదములను భావించవలసి వచ్చింది. కౌమారదశలో యమునా నదీతటమున చద్దులు భుజించుచూ ఊరగాయ పచ్చళ్ళు నంజుకొంటూ అచ్చం ఒక గొల్లపిల్లవాడిలా జీవించాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆకసంబున ఖేచరప్రముఖులు, స్వర్గలోకంలో నాందులును (దేవతా పురోహితులు) ఇతడే సర్వయజ్ఞకర్తయని నుతించి నమస్కరిస్తుంటే జోక

కొనియాడి (ఉత్సాహముగా కీర్తిస్తుంటే ఓకృష్ణా! చొక్కితివి (పరవశించితివి), అంటున్నారు అన్నమయ్య. స్వామి, అచ్చం లేగదూడలను కాసే గొల్లవాడిలాగానే "కో"యని కూతవేసేవాడట. ఏమి అద్భుతం!!

తాత్పర్య వివరణ:

యమునా నదిలోపలనున్న అచ్చపురాల (స్వచ్ఛమైన రాళ్ళపై కూర్చొని) ఇచ్చగించి (కడు ప్రీతితో) భుజించితివి. ఓ కృష్ణా! నిజమై గొల్లపిల్లవాడి జీవితమును గడిపితివి.

నీవు దేవదేవుడవు. అయినా గొల్లవారితో జీవించుచూ అందరిలోనూ ఒకడవై ఒద్దికతో (వినయముగా) చద్దులు (చద్ది అన్నము) ఊరగాయలు నంజుకొంటూ తిని అందరికీ పెట్టావు. సారె బాలుర (సాటిబాలురతో సరసాలాడుతూ కోరి వారు తెచ్చుకొన్న చద్దులను ఆరగిస్తూ కొత్తకొత్త రుచులు గొంటివి (ఆస్వాదించితివి). కృష్ణా! ఏమి నీ అవతార ఆవిష్కరణము!!

ఆకసంబున (గగనసీమలో) కాపురముఖ్యులు (ఖేచరప్రముఖులు), నాకలోకపు నాందులు (స్వర్గలోకవాసులైన దేవతాపురోహితులు) కైకొని (పూనుకొని), యజ్ఞకర్త యాతడేనని నిన్ను కీర్తిస్తుంటే, జోకగొనియాడ (ఉత్సాహముగా నిన్ను కీర్తిస్తుంటే) ఓ కృష్ణా! చొక్కితివి (ఏమిటిదంతా అని ఆశ్చర్యం నటించావు.)

కృష్ణా! నీవు పేయలను (దూడలను) కాస్తున్నప్పుడు అరె! దూడలు యెక్కడకుపోయాయి, పిలవండి అని పలుకుచూ "కో"యని తననోటితో కూసి వింతగా అరచేవాడివి. బ్రాహ్మణులవలంభించు మతమైన అద్వైతమతమును మెచ్చుకుంటూ దానిని అవలంభించమని బోధించితివి. ఓ కృష్ణా! నీవు చేయని మాయలు చేసితివి (ఇతరులెవ్వరూ చేయని మాయలు చేసితివి).

పద్యవివరణ:

ఆ.వె॥ **అచ్చమైన రాళ్ళ యమునా తటములోన**
ఇచ్చగించి చద్దు లిటుభుజించి
ఊరగాయనంజి సురశ్రేష్ఠులనువిని
మాయనించినావు మధువిరోధి!

సంఖ్య: IV/67 (P406) రాగం : ముఖారి
కీర్తన : నెరబిరుదిన్నిటాను నీ బంటు

ముఖారి

71 నెరబిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగనమదివో నీ బంటు ॥పల్లవి॥

ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవఁగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు ॥నెర॥

గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మొరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు ॥నెర॥

ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు ॥నెర॥ **67**

ఉపోద్ఘాతము:

"నెరబిరుదు" అంటే (అతిశయించిన సమర్థుడు) అని అర్థం. అదిగో నీ బంటు వొరసెగగనము (ఆకాశమును తాకినాడు) అంటున్నారు అన్నమయ్య. హనుమంతుడు శ్రీవేంకటేశ్వరుని నమ్మిన బంటు అని కీర్తిస్తున్నారు. శ్రీవేంకటేశుని చేతినిమ్మపండట అంటే కరతలామలకము అన్నమాట. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగపడతాడు. నీ బంటు హుటాహుటి

యెగయగా గగనమునవుండే లోకములన్నియు గడగడవణకినవట. ఆయన మందులకొండ దగ్గరకు వెళ్ళి 'కో'యని దానిని తెచ్చాడట.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ నమ్మినబంటు అయిన ఈ హనుమంతుడున్నాడే, ఆయన నీ "నెరబిరుదు" బంటు (అతిశయించిన సమర్థుడైన) బంటు. అదిగో ఆకాశంలో నీబంటు ఎలా మెరసిపోతున్నాడో చూడు స్వామీ!

ఆయన గగనసీమలో యెగురుటకు తనకాయాన్ని అమితంగా పెంచివేశాడు. అప్పుడు గగనమున కిక్కిరిసిన చుక్కలు (నక్షత్రాలు) ఆయన మొలనూలు (రత్నాలమొలత్రాటివలె తళతళలాడింది.) పెళపెళనార్చి (పెళపెళమని బొబ్బలుపెట్టి) ఈయన తన కాయమును పెంచాడు. అట్టి భవాండము (బ్రహ్మాండమంతా) పెద్ద ఆర్భటముతో (మ్రోతతో నింపివేశాడు). అప్పుడు ఆయన శరీరం బ్రహ్మాండము అంచులను మోసింది.

అది చూచి గగనముపైనున్న లోకములన్నీ గడగడ వణికినవి. ఆలోకములు ఆశ్చర్యంతో చూస్తుండంగానే హుటాహుటి (అతివేగముగా) ఎగిరాడు. మగటిమిమెరయగ (తన వీరత్వము ద్యోతకమవుతుండగా) మందుల కొండకు (సంజీవని పర్వతము తెద్దామని) నిగిడి (వ్యాపించి) 'కో'యని అరచినాడు నీ నమ్మినబంటు హనుమంతుడు.

ఇమ్ముల (ఇంపుగా) రఘుపతికి హితుడై సీతాదేవికి నెమ్మనము (మనశ్శాంతిని) అలరించిన మహానుభావుడేనీ బంటు. కమ్మర (అటుపైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నీచే (నీచేతిలోని) నిమ్మపండైనవాడు నీ బంటు. (పూర్వకాలంలో ఎక్కడికన్నా దూరప్రయాణాలు చేయాలంటే దాహానికి వుపశమనంగా నిమ్మకాయ నీళ్ళు తాగేవారు. నిమ్మపండు మన చేతుల్లోనేవుంటే దిగులే లేదు కదా! అప్పటికప్పుడు వాడుకోగలవాటిని 'కరతలామలకం' అంటారు.

పద్యవివరణ:

కం॥ **నెరబిరుదు యిన్నిటను నీ**
అరచేతిని నిమ్మపండు ఆయెనుహనుమే
మెరసెనుగగనంబదివో
తిరువేంకటనాథు గొల్చు దీటగు బంటౌ.

సంఖ్య: IV/70 (P408) రాగం : శ్రీరాగం
కీర్తన : ఇందిరకు నురముమీదిచ్చిన నాడు

శ్రీరాగం

72 ఇందిరకునురముమీఁదిచ్చిన నాఁడు
విందువలె హరియిందు విచ్చేసె నాఁడు ॥పల్లవి॥

పరమపదమునందు బహుదివ్యపరణాలు
హరి గరిమలు పొలుపలరు నాఁడు
గరుడఁడు ననంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులైరిందు నాఁడు ॥ఇందిర॥

పాలజలధిలోనఁబవళించి హరి వచ్చి
భూలోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించినేలయు మిన్ను బహుదివ్యదేశాలు
గాలించి కోనేటిదరి గైకొంట నాఁడు ॥ఇందిర॥

నరసురోరగులెల్ల నలువంకఁ గొలువంగ
పురవైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపదమిదని పాలించె నాఁడు ॥ఇందిర॥ **70**

ఉపోద్ఘాతము:

ఇది బహుతేలికగా అనిపిస్తున్న అన్నమయ్య కీర్తన. కాని తరచి చూస్తే ఇది అంత సులువైన కీర్తన కాదు సుమండీ!ఇందులో చరణాల చివరవస్తున్న 'నాడు' అన్న పదమును ఆనాడు అన్న అర్థంతో వివరించవలసి వుంటుంది. ఇందిరకు తన వురముపై చోటు ఇచ్చిననాడు శ్రీహరి విందు స్వీకరించువానివలె యిందు ఈ వైకుంఠమున నాడు విచ్చేసెను. అప్పటినుండి అదే అతని స్థానమైనది. ఈనాటికి విరజానది అనే వైకుంఠంలో పారేనదితో సహా భూమిపైశ్రీవేంకటాద్రి చేరి వేంకటపతియై శ్రీహరి వచ్చినాడు.ఆ

తరువాత ఓ మానవులారా! పరమపదమంటేఇదేనర్రా అని బోధించి పాలించినాడు. వైకుంఠవాసియైన శ్రీహరినే ముగ్ధని చేసిందంటే ఈ కోనేటిదరి గొప్పతనంఏమని చెప్పగలము?అంటున్నారు.

తాత్పర్య వివరణ:

సముద్రరాజతనయ అయిన ఇందిరాదేవిని పరిణయమాడునాడు (వేళ) శ్రీమన్నారాయణుడు పెళ్ళి కానుకగా ఆమెకు తన వురముపై (వక్షస్థలమున) నివాసమునిచ్చినాడు.ఇందు (ఈ వైకుంఠమునకు) ఆమెతో శ్రీహరి, విందువలె (వైభోగముతో) నాడు (ఆవేళ) విచ్చేసె (అరుదెంచినాడు).

ఆయన నివాసమైన పరమపదమునందు(వైకుంఠమున) అనేక దివ్యమైనవర్ణములతో దేదీప్యమానంగా వుంటుంది. ఆయన వైకుంఠ ప్రవేశమునాడు శ్రీహరి గరిమలు (మహిమలన్నియు) పొలుపుఅలరినవి (అతిశయించినవి). అందు (ఆ వైకుంఠమున) గరుత్మంతుడు, అనంతుడు (ఆదిశేషుడు), సేనేశుడు (విష్వక్సేనుడు) శ్రీహరినిత్య సేవకులైరి.

నాటినుండి శ్రీహరి పాలజలధిలో (క్షీరసాగరమున) ఆదిశేషునిపై పవ్వళించుట మొదలుపెట్టినాడు. ఒకనాడు శ్రీహరి భూలోకమును సందర్శించి ఇంతయు దీని అందాలన్నీ తిలకించి ఆ సౌందర్యాన్ని పొగడటం మొదలుపెట్టాడు. చాలాకాలం ఈ నేలను పాలించి ఆకాశంలో కంటే ఇక్కడ అనేక దివ్యదేశాలు వున్నాయని కనుగొన్నాడు.నాడుఈ భూమినంతా గాలించి తిరుమలలో స్వామి పుష్కరిణి అనే కోనేటిఒడ్డు తన స్థానముగా స్వీకరించాడు.

ఆ శ్రీహరిని నరులు, సురులు, ఉరగులు (సర్పములు) నలువంక (అన్నివైపులనుండీ) కొలుస్తుండగా నాడు, పురవైన (మిక్కుటమైన)వేడుకలు (సంతోషములు) పొదలె (వర్ధిల్లినవి). వైకుంఠంలో వుండే విరజానది, స్వామితో వచ్చి ఇక్కడ ఒకనదియై ప్రవహించినది. నాడు ఇదేనర్రా పరమపదము అని శ్రీవేంకటేశ్వరుడై పాలించడం ప్రారంభించాడు.

పద్యవివరణ:

తే.గీ॥ **ఇందిరకు తన వురముపై ఇచ్చునాడు**
విందుగొనువాని వలె హరి! విడిసె నాడు
సర్వమును జేరె వేంకట సార్వభౌమ
పరమపదమిదియేనని పలికెనాడు.

సంఖ్య: IV/51 (P395) రాగం : పాడి
కీర్తన : కలుషపు చీకటి గలుగగను

పాడి

73 కలుషపు చీఁకటి గలుగఁగను
వెలుఁగు లోకముల వెలసిన యట్లు ॥పల్లవి॥

మునుకొని పాతకములు గలుగఁగఁబో
జనులకుఁ బుణ్యము చవులాయ
ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి
కనకము ప్రమోదకరమైనట్లు ॥కలుష॥

జగములోపల విషముగ గలుగఁ బో
మిగులఁగ నమృతము మేలాయ
వగపు గలుఁగఁగా వడి సంతోషం
బగపడుటిందరి కబ్బురమాయ ॥కలుష॥

బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో (?)
మహిమల శ్రీహరి మనసాయ
విహగగమనుఁడగు వేంకటేశ్వరుఁడు
ఇహమియ్యఁగఁ బరమిచ్చైనట్లు ॥కలుష॥ **51**

ఉపోద్ఘాతము:

లోకమున పాపపు చీకట్లు పొడచూపిన తరువాతనే, అంధకారము పోయి వెలుగు వెలసినది. అట్లే పాతకము తరువాతనే ప్రజలకు పుణ్యము చేయుటయందు ఆసక్తి పెరిగినది. మొదట లోకములో ఇనుమే వుపయోగించబడింది. ఆ తరువాతనే నరులకు బంగారము యొక్క ప్రాశస్త్యము తెలిసి గొప్పఆనందదాయకమైనది. క్షీరసాగరమధనమున మొదట వెలువడినది విషమే. అటుపిమ్మటనే అమృతము పుట్టినది. మొదట దుఃఖము ఆ తరువాతనే

సంతోషము కలుగుతాయి. ముందు అన్య దేవతలపై అనురక్తి కలిగి తగ్గినాకనే శ్రీహరిపై మనసు నిలబడుతుంది. శ్రీవేంకటేశ్వరుడు కూడా ముందు ఇహమునిచ్చాకే పరమునిస్తాడు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

కలుషపు చీకటి లోకమున గలుగగను (లోకమున పాపపు చీకటి ఆవరించిన పిమ్మట మాత్రమే) వెలుగు (వెలుతురు) వెలసినది (అతిశయించినది). అట్లే ముందు చెడు లోకములను బాధించిన తరువాతనే శ్రీహరి కృప కలుగుతుంది.

మునుకొని (ముందుగా) పాతకము లోకములో చెలరేగిన తరువాతనే జనులకు ఎంతకాలం ఇలా పాపాలు చేస్తాము. పుణ్యకార్యం చేసి పదిమందిచేత మంచి అనిపించుకోవాలనే కోరిక కలుగుతుంది. మొదట లోకములో ఇనుమే వుపయోగించబడింది. ఆ తరువాతనే బంగారము మనిషికి లభ్యమయింది. ఇందరి యెదిటికి వచ్చిన ఆకనకము అంతులేని ప్రమోదము (ఆనందము) నిచ్చింది.

క్షీరసాగరమధనమున ముందు ఆవిర్భవించింది కాలకూటవిషమే. ఆ తరువాతనే అమృతము మిగులుగ (సమృద్ధిగా) మేలాయె (మేలు కలిగించింది). ముందు వగపు (దుఃఖము సిద్ధించుతుంది). అది తట్టుకొని నిలబడినవానికే ఆపైన వడిగా సంతోషము ప్రాప్తిస్తుంది. ఆ సంతోషం కూడా జీవితాంతమూ వుండదు. కష్టసుఖాలు సుఖదుఃఖాలూ కలుగుతూనే వుంటాయి. దీనికి విచారించరాదు.

పైన చెప్పినట్లు కష్టాలు ప్రాప్తించగానే నరులు ఏకాకులై ప్రపంచంలో తెలిసిన దేవతలనందరినీ ఆశ్రయిస్తారు. పోండి. ఇక వారికేం చెబుతాం? విహగగమనుడు (పక్షులకు రాజైన గరుత్మంతునిపై ప్రయాణించు శ్రీవేంకటేశ్వరుడు ముందు ఇహలోకములో సుఖదుఃఖాలనిస్తాడు. అవి తట్టుకొని ఆయనపై నమ్మకం వుంచితేనే పరమునిస్తాడు (మోక్షప్రాప్తి), కలుగుతుంది.

పద్యవివరణ:

కం॥ **కలుగగ కలుషపు చీకటి**
వెలుగులు లోకమున తాము వెలసినయట్లే
కలుగగ పాతకమాపై
సలలితమగు పుణ్యమనిన చవులూరె హరీ!

సంఖ్య: IV/359 రాగం : సామంతం
కీర్తన : ఎల్లలోకములవారి కేలిక దానే

సామంతం

74 ఎల్లలోకములవారి కేలిక దానే
కొల్లగావరములిచ్చేగురుతైనదైవము ॥పల్లవి॥

కొండల కోనలలోన కోనేటిసరిదండ
మెండైనబంగారుమేడలలోన
నిండుజవ్వనముతోడినెలఁతకౌఁగిటలోన
వుండి జగమెల్ల నేలీ నుద్దండదైవము ॥ఎల్ల॥

నాలుగుచేతులతోడ నవ్వులమోముతోడ
సోలి సంకుఁజక్రముల సొంపుతోడ
నేలమిన్ననొకటైనిలుచున్న రూపుతోడ
పాలుపడి మెరసీని ప్రత్యక్షదైవము ॥ఎల్ల॥

సంపదలు కడుమించి చవులతో నారగించి
జొంపపు విరులపూజ సొంపుమించి
యింపుల శ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడుదేవతలతోఁ బ్రతిలేనిదైవము ॥ఎల్ల॥ 359

ఉపోద్ఘాతము:

ఈ విశ్వములోనున్న లోకములలో వున్న వారందరికీ ఏలిక శ్రీహరియే సుమండీ! ఈయన యెంత జగత్ప్రసిద్ధుడైన దైవమంటే ఈయన తన భక్తులైనవారికి కోకొల్లలుగా వరములనిస్తాడు అంటున్నారు అన్నమయ్య. మరి భూలోకంలో ఆయన నివాసమెక్కడ? కొండల కోనలలో కోనేటి ఒడ్డునట. అక్కడ బంగారు మేడలో వుంటాడట. ఇంకోచోట కూడా వుంటాడు. రాత్రయితే నిండుయౌవనముతో నున్న నెలత అలమేల్మంగ కౌగిట్లో వుంటాడట. ఇక శృంగారమే ఆయన ప్రవృత్తి అనుకొంటున్నారా?

పొరబాటు. ఈ జగమెల్లనేలే ఉద్దండ దైవము ఈయనే అంటున్నారు. అఖండ సిరిసంపదలున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు చవులూరె ప్రసాదములను నైవేద్యంగా స్వీకరిస్తున్నాడట.

తాత్పర్య వివరణ:

తానే (ఆ శ్రీవేంకటేశ్వరుడే) ఎల్లలోకములవారికి (చతుర్దశ భువనముల వారికి) యేలిక (ప్రభువు). ఈ దైవము కొల్లగా (విరివిగా) వరములిచ్చే గురుతైన (సర్వశ్రేష్ఠుడైన) మహానుభావుడు.

కొండలు మెండుగావుండే, కోనలోన (అడవిలో) మెండైన (శ్రేష్ఠమైన) బంగారు మేడవున్నది.దానిలో నిండు జవ్వనముతో (పూర్ణ యౌవనముతో) వున్న నెలత (మన అలిమేల్మంగ) యొక్క కౌగిటిలో నెలకొని జగమెల్లనేలే (విశ్వమునంతా పరిపాలించు) ఉద్దండదైవము (పొడవైన దేవుడు) ఈ శ్రీవేంకటేశ్వరుడే సుమా!

చతుర్భుజములతోడ చిరునవ్వులొలికే ముఖముతోడ శంఖచక్రముల సొపుతోటి (అతిశయముతో) ఆకాశమునేల ఒక్కటై నిలిచిన రూపముతో పాలుపడి (సంప్రాప్తించి) మెరసీని (వెలుగులు విరజిమ్ము) ప్రత్యక్షదైవము ఈ శ్రీవేంకటేశ్వరుడు.

సంపదలు కడునించి (అనేకమైన సిరిసంపదలు) మించినవి (అతిశయించినవి). అటుపై ఈ దేవదేవుడు చవులతోనారగించి (రుచులను ఆస్వాదించుచు భుజించినాడు.) అటు పిమ్మట, జొంపపు (నిరంతరము కొనసాగే) పుష్పపూజ ఆస్వామి అందమును ద్విగుణీకృతము చేసినది. ఈ శ్రీవేంకటేశ్వరుడు ఇంపైన శ్రీవేంకటాద్రి నివాసమైయున్నాడు. పంపుడు (ఆజ్ఞాపింపబడిన) దేవతలతో పూజింపబడుతున్న ఈ దేవుడు ప్రతిలేని (సాటిలేని) దైవము.

పద్యవివరణ:

ఉ॥ **ఎల్లప్రపంచవాసులకు ఏలిక తానగు వేంకటేశుడే,**
కొల్లగనిచ్చుగా వరము కోర్కెలదీర్చెడి దైవమీతడే
చల్లనికొండలన్ వెలసి చక్కటి పుష్కరిణీ తటిన్ ఇదే
తొల్లిటిదైవమై సురలతో ప్రతిలేకయె మించినాడు బో.

సంఖ్య: IV/523 రాగం : సామంతం
కీర్తన : సమసె రావణుఁడు సమరములోపల

సామంతం

75 సమసె రావణుఁడు సమరములోపల
అమరులు కడు ముదమందిరి మెరసి ॥పల్లవి॥

బెరగిరి రాముని శరముల కసురలు
సురిగిరి పోట్లచురుకునను
తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన
తిరిగిరి తరుమఁగ దిక్కులకు ॥సమసె॥

కూలిరి భల్లూకుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి
వీలిరి యంగదు వివిధనాదముల
తూలిరి సుగ్రీవు దోర్బలమునను ॥సమసె॥

దాఁగిరి లక్ష్మణు దాకకు నులుకుచు
వీఁగిరి వనచర వితతికిని
పాఁగి శ్రీవేంకటపతి కృపారసమునఁ
దోఁగిరి జనులు సంతోసంబునను ॥సమసె॥ **523**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య విరచించిన ఈ కీర్తనలో వీరరసము తాండవిస్తుంటుంది. రఘురామునిచే రావణ సంహారం దీని ఇతివృత్తం. నేను ఈ కీర్తనను ఎన్నుకున్న ముఖ్య ఉద్దేశ్యం ఇందులో దాదాపు ప్రతి చరణంలోనూ ఒక తెలియని తెలుగు మాటవుంది. 'సురగిరి' అంటే తెలుగు పండితుడు కానివాడికి తెలుస్తుందా? ఆనాటి జనులు కూడా నేటివారివలెనే

సంతోసంబున శ్రీవేంకటేశ్వరుని సన్నుతించారట. అందుకే అన్నమయ్య అంటే ఆ ఏడుకొండలవాడికంత ఇష్టం. ఇందులో చాలామాటలకు నిఘంటువుల్లో అర్థాలు దొరకలేదు. సందర్భాన్నిబట్టి భావించవలసి వచ్చింది.

తాత్పర్య వివరణ:

సమరములోపల (యుద్ధములో) రావణుడు సమసె (అంతమయ్యాడు). అమరులు (దేవతలు) మెరసి (శోభాయమానంగా) కడుముదమందిరి (విశేషముగా ఆనందించిరి).

అసురలు (రాక్షసులు) రాముని శరములకు (శ్రీరాముని అస్త్రములకు) బెరగిరి (బెదిరిపోయారు). బాణములు వారికి నాటుకొనగా ఆ పోట్లు చురుక్కుమనగా సురగిరి ఎక్కడెక్కడికో పారిపోయి మటుమాయమై పోయారు. తమను తునియలు (ముక్కలు ముక్కలుగా) చేయగా నెత్తురులో తొరిగిరి (పడిపోయారు). దిక్కులు బట్టి తరుముకొస్తున్నట్లు తిరుగులాడారు.

దైత్యులు జాంబవంతుని భల్లూకసేన ఘోషములకు (అరుపులకు) కూలిరి (కొంతమంది భయంతో చచ్చిపోయారు). వాయుజ (హనుమంతుని) వాలహతి (తోకదెబ్బలకు) వాలిరి (పడిపోయారు). అంగదుడు చేసిన అనేక ధ్వనులకు, వీలిరి (విలవిలలాడిపోయారు). సుగ్రీవుడి బలసంపదను చూచి భయంతో తూలిరి (తూలిపడ్డారు).

అసురులు లక్ష్మణుని యెదురుదాడికి ఉలుకుచు (ఉలిక్కిపడుతూ) దాగిరి (పారిపోయి దాగికొన్నారు). వనచరవితతికి (వానర సమూహముల శక్తికి) వీగిరి (బలహీనపడ్డారు). ఆనాడు రావణ సంహారం అట్లా జరిగితే ఈనాడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడైన రఘురాముని కృపారసమున జనులు సాగి (ఆస్వాదించి), సంతోషములో దోగిరి (దోగాడారు).

పద్యవివరణ:

చం॥ **సమసెను రావణుండు తనుసంగరమందున బంధుకోటితో**
అమరులు మోదమంది కడు ఆ రఘురాముని సన్నుతించి మా
శ్రమలిటుబాసె ఏలుమిక జానకితోడుత పృథ్వినంతయున్
అమలుడు వేంకటేశ్వరుడు ఆయె ప్రసన్నుడు అన్నమయ్యనెన్.

సంఖ్య: II/206 రాగం : శంకరాభరణం
కీర్తన : కలది యీ మూర్తి వల్ల గతి గనవలెను

శంకరాభరణం

76 కలది యీ మూర్తి వల్ల గతి గనవలెను
యిల నిందు నమ్ముకుంటే యెందు మరిలేదు ॥పల్లవి॥

కంటిమా బ్రహ్మమును వేంకటపతిc గనినట్టు
కంటిమా అవతారాలు కతలె కాక
కంటిమా హృదయములోc గలిగిన దైవమును
కంటిమా వైకుంఠము కడవారైనాను ॥కల॥

తెలిసీనా జ్ఞానము యీదేవుని మహిమవలె
తెలిసీనా వేదాలు సందేహమే కాక
తెలిసీనా మాయ యిది యెంత చదివినా
తెలిసీనా ముందరితెరువు వెదకితే ॥కల॥

చిక్కీనా మనసు యీ శ్రీవేంకటేశ్వరువలె
చిక్కీనా ధ్యానము వట్టి చింతలే కాక
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము
చిక్కీనా పెద్దలుచెప్పే జితమైనశాంతి ॥కల॥ **206**

ఉపోద్ఘాతము:

మనకు కలిగిన ఈ మూర్తివల్ల సద్గతి గనవలెను. ఈ భువిపై ఈ స్వామిని నమ్ముకుంటే ఇక సద్గతి యెందునూ మరిలేదు అంటున్నారు అన్నమయ్య. మానవమాత్రులమైన మనకు పరబ్రహ్మ స్వరూపము గోచరమవుతుందా? ఆ శ్రీహరి అవతారాలగురించి విన్నామే కాని కన్నామా యేమన్నానా? హృదయస్థుడైన దైవమును దర్శించుట సాధ్యమా? కడవారైనాను వైకుంఠమును చూచితిమా యేమి? అది సాధ్యమవదు. మరి సులభ సాధ్యమేది? తిరుమలలో శ్రీవేంకటపతి దర్శనం అత్యంత సులభం. ఈ

జన్మకు అది దక్కించుకొన్న చాలదా? అంటున్నారు. ఆ తిరుమలయ్య కృపలేక సుఖమూలమైన శాంతి లభ్యమవదు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! యీమూర్తి (సాకారుడైన ఈ దైవశిఖామణి మూర్తి) వల్లనే భూలోకవాసులమైన మనము గతి (వైకుంఠపదవి) కనవలెను (పొందవలెను). అదిక్కడనే కలది (లభించునది). భూమిపై ఇందు (ఈ ప్రపంచంలో) ఈ స్వామిని నమ్ముకుంటే (శరణాగతినుండకుంటే) యెందు (ఊర్ధ్వ అధోలోకాలలో) ఎందునూ ముక్తిరాదు.

మనము కంటిమా బ్రహ్మము (పరబ్రహ్మమై నిరాకార నిరంజనుడైన వానిని దర్శించగలమా?) కతలె పురాణగాథల రూపంలో శ్రీహరి అవతారాలను వూహించుటయే కానీ నరమృగరూపుని చూడగలమా? మన హృదయంలోనే పరమాత్మ అంతర్యామిగా వుంటాడు కాని మనము ఆత్మ దర్శనం చేయగలమా? వైకుంఠమును, కడవారైనాను (ఇది ఆఖరి జన్మ అయినా) కంటిమా (చూశామా)? ఇదిగో తిరుమల వేంకటపతిని కనినట్లు వాటిని కనగలమా?

ఈదేవుని మహిమ పామరులకు కూడా అనుభవమవుతుంది. కానీ ఆయన గూర్చిన జ్ఞానము అంత సులువుగా కలుగుతుందా? వేదముల ద్వారా ముక్తి పొందాలనుకొంటే సందేహాల పరంపర తప్పించి భగవత్ తత్త్వము తెలుస్తుందా? శాస్త్రములు, వేదాంగములు యెంత చదివినా? భగవంతుడి మాయ యెటువంటిదో అర్థమవుతుందా? ఎంత శోధించినా ముందరి తెరువు (భవిష్యత్తులో ఏ జన్మ వస్తుందో చెప్పగలమా?) అసాధ్యం.

ప్రపంచ తాపత్రయంవున్న వారికి ఈ శ్రీవేంకటేశ్వరునిపై మనస్సు లగ్నమవుతుందా? ఈ నిరంతరమైన చింత (దుఃఖము) కాక స్వామిమీద ధ్యానము కుదురుతుందా? అనంత ప్రవాహంలా వస్తున్న కాలము నడక అర్థమవుతుందా? పెద్దలు చెప్పే చిత్త శాంతి సులభంగా చిక్కుతుందా?

పద్యవివరణ:

కం॥ **ఈమూర్తివల్ల సద్గతి**
నీమముగా గనగనగును నిలుపుచు గురినే
ఏమరచి నమ్ముకుంటే
స్వామీ! మరిలేదు దారి వసుధజనులకున్.

సంఖ్య: XV/288 రాగం : లలిత
కీర్తన : నే నన్నిటా గ్రూరుడ నీవే గతిగా వచ్చితి

లలిత

77 నే నన్నిటాఁ గ్రూరుఁడ నీవే గతిగా వచ్చితి
మానక న న్నేలుకొని మన్నించ వలెను ॥పల్లవి॥

నేరమి సేసినవాఁడు నెమ్మి యింటికి వచ్చితే
మారుకొన కన్నియును మఱవవలె
కారులు వల్కినవాఁడు గక్కునఁ బంత మిచ్చితే
నేరపుల నేస్తములే నెఱపఁగ వలెను ॥నే నన్నిటా॥

పగవాఁడైనవాఁడు బంటనని మొక్కితే
సొగసి లోఁగొని కృపఁజూడవలెను
వెగటున నానదోసి వెఱపుమాలినవాఁడు
అగపడి యాజ్ఞవెట్టుమంటే మానవలెను ॥నే నన్నిటా॥

ధనమెత్తుకొన్నవాఁడు తానే వచ్చి పనివేళ
ననిమొన నిల్చితేఁ జేకొనవలెను
వనరి యజ్ఞానమువాఁడ నిన్ను నుతించితి
ఘనుఁడ శ్రీవేంకటేశ కావవలె నన్నును ॥నే నన్నిటా॥ 288

ఉపోద్ఘాతము:

ఇది అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య రచించిన కీర్తన. దీనినాస్వాదిస్తే ఆయన తండ్రికి తగ్గ కొడుకే అని సుస్పష్టమవుతుంది. ప్రభూ! నేను జన్మతః క్రూరుడనైనందువల్ల నీ భక్తి అంటే యేమిటో తెలియకుండానే పెరిగాను. అప్పుడు నా జీవితంలోకి నీవేగతిగా వచ్చావు. ధన్యుడను. కానీ మానక నన్ను యేలుకొని మన్నించవలెను.

తాత్పర్య వివరణ:

ఓతిరుమలేశా! నేనుఅన్నిటా (అన్నివిధములా) క్రూరుడను (దుర్మార్గుడను) నా ప్రవర్తన మారదు. నీవే గతిగా (దిక్కువలె) వచ్చి, మానక (వదలిపెట్టక) నన్నేలుకొని (నన్ను పరిపాలించి) మన్నించవలెను లేనిచో నాగతి అధోగతియే.

నీపట్ల నేరముచేసినవాడు తనపొరపాటును తెలుసుకొని నెమ్మి (నెమ్మదిగా) నీ ఇంటికి వచ్చితే (వస్తే) మారుకొనక (యాగీ చేయక) అన్నీ మఱచి క్షమించవలెను. కారులు వల్లినవాడు (పరుషవచనములతో నిందించినవాడు) వునట్లుండి తన పొరబాటు గ్రహించి, పంతమిచ్చితే (పట్టుదలలు మఱచి) నీ స్నేహం కోరితే నేర్పు ప్రదర్శించి స్నేహహస్తం ముందుకు చాచాలి. మానవులకే ఇవి ధర్మాలైతే పరమాత్మవు నీకు వేరే చెప్పవలెనా?

నీవు ద్వేషించే పగవాడైనా "దాసోహం" అని నీకు మొక్కితే తను నీ బంటునని ఆశ్రయిస్తే, సొగసి (ఇంపుగా) లోపలికాహ్వానించి దయ చూపించవలెను. వెఱపు మాలినవాడు (బరితెగించినవాడు) వెగటున (ద్వేషముతో) నానదోసి (పనివేళా) నీయెదుట బడి ఆజ్ఞాపించి, పెట్టమంటే (నీదగ్గరవున్న ధనం అక్కడ పెట్టమంటే) వానిని మన్నించవలెను. ఇవి నరజాతి కారుణ్య ధర్మాలు. నీవు దేవదేవుడవు అది నీ ధర్మముకంటే నీ స్వభావము.

నీధనమునెత్తుకొని వెళ్లినవాడు తానే పనివేళా వచ్చి నీ కత్తిమొనయెదుట నిలచి తనను క్షమించమంటే వాడిని త్యజించి నిరాకరించరాదు. వ(ఒ)నరి (అతిశయించి) నేను అజ్ఞానిని. నిన్ను నుతించగానే, నేనూ ఘనుడనైపోయాను ఓ శ్రీవేంకటేశా! నన్ననూ కాపాడవలెను తండ్రీ! యేలుకొని మన్నించవలెను, అంటున్నాడు పెదతిరుమలయ్య. మనకు అపకారము చేసినవాడు తన తప్పు తెలుసుకొని మన ఇంటికి వచ్చి క్షమాపణ అడిగితే వాడిని యెదిరించక అన్నియు మరచి ఆదరించవలెను. పరుషవచనములతో నిందించినవాడు వున్నట్లుండి తన పగ వదిలేస్తే, వాడిని దెప్పక స్నేహము పంచవలెను అంటున్నారు.

పద్యవివరణ:

తే.గీ॥ **నేను అన్నిటా క్రూరుడ నీవెగతిగ**
వచ్చితిని నన్ను మన్నించవలెను గాక!
మానకయె నన్ను యేలుము మదన జనక!
ఘనుడ! శ్రీవేంకటేశ్వర! కావవయ్యా!

సంఖ్య: II/44 రాగం : ధన్యాసి
కీర్తన : హరిదాసులతోడ నల్పులు సరెనరాదు

ధన్యాసి

78 హరిదాసులతోడ నల్పులు సరెన రాదు
గురుఁడు శిష్యుఁడు ననే గుఱిదప్పుఁగానా ॥పల్లవి॥

కోరి ముత్యపుఁ జిప్పలఁ గురిసిన వానయు
సారెఁ బెంకులలోవాన సరియౌనా
శ్రీరమణుఁ డిన్నిటానుఁ జేరియుంటే నుండెఁగాక
సారెకుఁ బాత్రాపాత్రసంగ తింతాలేదా ॥హరి॥

మలయాద్రిమాఁకులును మహిమీఁదిమాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥హరి॥

అమరులజన్మములు నసురలజన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతే నాయఁగాక
తమితో నధికారిభేదములు లేవా ॥హరి॥

ఉపోద్ఘాతము:

హరిదాసులెక్కడ? అల్పులైన కామక్రోధపరితప్త మానవాళి యెక్కడ? గురుడు శిష్యుడు అన్న తేడా లేవా? ఇద్దరూ ఒక్కటే యెట్లా అవుతారు? అలా అనుకొనే లక్ష్యమే దోషభూయిష్టము, అంటున్నారు అన్నమయ్య. ముత్యపు చిప్పలోపడ్డ చినుకే ముత్యమవుతుందికాని పెంకులలో కురిసిన చినుకు ముత్యమవుతుందా? రెండు చినుకులు సమానమవుతాయా? శ్రీరమణుడు ప్రతి ప్రాణిలో జేరియుండుగాక, అంతమాత్రాన పాత్ర

అపాత్రుల మధ్య అంతరం లేదా? ఇదేమి చోద్యం. మలయపర్వతంమీద వుండే చందనపు చెట్లు భూమిమీదున్న మాకులు రెండూ ఒకటేనా? రాక్షసజన్మలకు సురశేఖరుల జన్మకు తేడా లేదా? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

హరిదాసులతో అల్పులైన కామక్రోధపరితప్త మానవులు సరెనరాదు (సరియని అనరాదు). గురుడు శిష్యుడు సమానమనే గుఱి (ఆలోచనే) తప్పు (లోపభూయిష్టము).

బహు అరుదైన ముత్యపు చిప్పలలో కురిసినవాన, సారె సామాన్యమైన పెంకులలో కురిసిన వాన సరియౌనా (సమానమవుతాయా?) శ్రీరమణుడు ఇన్నిటాను (ఈ సమస్త జీవులలో) చేరియుంటే ఉండుగాక, అంతమాత్రాన పాత్రుల అపాత్రులమధ్య అంతరం లేదా? ఏమిటీ విడ్డూరము? హరి భక్తులు పామరులు ఒకటే యెలా అవుతారు?

మలయ పర్వతము మీదనున్న చందన వృక్షాలకు భూమిపైనున్న అసంఖ్యాకమైన మానులును చలమున తొందరపాటులో యెంచి చూస్తే సరిసమానమవుతాయా? దేవుడు (పరమాత్మ) అలరి (అతిశయించి) అందరిలో అంతర్యామియైతే అయివుండవచ్చుగాక! ఆయన నెలకొన్న క్షేత్రాలలో (తనువులలో) తేడా, దిక్కులందు (జగత్తులో) లేదా?

దేవతల జన్మలకు దైత్యుల జన్మలకు జమళిపుట్టి నంతలో (ఒకే తండ్రికి పుట్టినంత మాత్రాన) సమానమయ్యాయా? మొదటి వారు హరి భక్తులైతే రెండవవారు హరి విముఖుడుకాలేదా? అందరిలోను శ్రీవేంకటేశ్వరుడు ఆత్మరూపుడై వుంటే వుండవచ్చుగాక! అధికారికీ వేరొక అధికారికి మధ్యభేదమే లేదా?

పద్యవివరణ:

కం॥ **హరిదాసులతో నల్పులు**
సరియననెట్లాను? గురుని సరిశిష్యుండా?
గురితప్పిన అంతరమున
అరయన్ అధికారి భేదమది లేదె హరీ!

సంఖ్య: III/113 రాగం : ధన్నాసి
కీర్తన : అంతవాని కింతసేయ నమరునటే

ధన్నాసి

79 అంతవాని కింతసేయ నమరునటే
వింతలు యీ సుద్దులకే వెరగయ్యీ మాకు ॥పల్లవి॥

కదిసి బ్రహ్మాండములు గర్భములో నున్న దేవుఁ-
డిదె దేవకిగర్భాన నెట్టుపుట్టెనే
అదె మఱ్ఱాకుమీఁదట నటు పవ్వళించువాఁడు
యెదుట యశోదచేత నెట్టు వినోదించీనే ॥అంత॥

అడుగులుమూఁట లోకా లటు గొలచినవాఁడు
బడిబడి రేపల్లెఁ బారాడీని
అడరి యజ్ఞభాగము లారగించే దేవుఁడు
సడితో వెన్న ముచ్చిలి చవిగొనీ నిదివో ॥అంత॥

వేదపల్లవములందు విహరించే దేవుఁడు
సాదుగొల్లెతల రతిసంగడిఁ జిక్కె
మోదపువైకుంఠాన ముదమందే కృష్ణుఁడు
యీ దెస శ్రీవేంకటాద్రి నిరవాయ నిదివో ॥అంత॥

ఉపోద్ఘాతము:

బాలకృష్ణునిపై మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. రేపల్లెలో ఒక గోపిక ఇంకొక గోపికతో ఈ మాటలంటోంది. అతడు అండపిండ బ్రహ్మాండమును సృష్టించి పోషిస్తున్న పరమాత్మ. తలుచుకుంటే తను సృజించినదంతా క్షణంలో సర్వనాశనం చేయగలడు. అంతవాడు ఈయన. అటువంటి వానికి వెన్నదొంగతనమేమిటి? గొల్లభామలతో చీకటితప్పులేమిటి? పోనేలే వీడుగడుగ్గాయి అనుకుందామంటే వీడే గీతాచార్యుడు. యజ్ఞకర్త, యజ్ఞభోక్త, వైకుంఠాధినాథుడు. వేదములు

చిగుళ్ళు వేసేచోట వింటూ పరవశిస్తుంటాడు, ఈ సుద్దులన్నీ వినాలంటే ఆశ్చర్యమేస్తుంది మాకు ఇవి చెప్పలేని వింతలు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! అంతవానికి (సర్వేశ్వరుడైనట్టి వానికి) ఇంతసేయ (ఇటువంటి మానవ సహజమైన అల్లరి పనులు చేయుట) అమరునటే (సరిపడుతుందా?) మాకు ఈ సుద్దులు (ఈ కథలు) వినుటకే వింతలుగా వున్నాయి. వెరగయ్యాను (ఆశ్చర్యముతో కూడిన భయమవుతోంది).

ఈ దేవుడు బ్రహ్మాండములన్నింటిని కదిసి (పొదువుకొని) తన గర్భములో దాచుకొన్నాడు. ఇటువంటి పరమాత్మ ఒక యాదవ స్త్రీ దేవకి గర్భవాసము చేసి శిశువువలె జన్మించడమేమి వింత? సృష్టి జలనిమగ్నమై పోయిననాడు పరమాత్మ శిశువువలె మఱ్ఱాకుపై పవ్వళించి సృష్టియెలా మొదలుపెట్టాలా అని ఆలోచించాడు. అట్టి పరమాత్మ రేపల్లె గొల్లెత అయిన యశోద దగ్గర యెట్లా వినోదించినాడు? ఎంత వింత?

అడుగులు మూట (మూడంటే మూడు అడుగుల్లో) లోకములనన్నింటినీ కొలిచి బలిచక్రవర్తి దర్పమునణచినవాడు రేపల్లె వీధులలో బడిబడి (వడివడిగా) పారాడాడట. ఏమి వింత! అడరి (పూని) యజ్ఞభాగములు దేవతలకు పంచి తాను ఆరగించే శ్రీమన్నారాయణుడు నేడు రేపల్లెలో గొల్లపిల్లలతో ఆడి వెన్నలు దొంగిలించి అందరికీ పెట్టి తానూ తిన్నాడు. ఇదివో వారిలో వెన్నలు చవిగొన్న (రుచిచూచిన) కృష్ణుని కథలు ఎంత వింతగానున్నాయి?

వేద వాఙ్మయము పల్లవించే (చిగుళ్ళువేసే) ప్రతి ఒక్కచోటా ఈ దేవుడు తన్మయత్వంతో వింటూ విహరిస్తుంటాడు. అటువంటి వేదపురుషుడు రేపల్లెలో గొల్లకంపుకొట్టే గొల్లభామలతో రతికేళిలో పాల్గొని వారికి చిక్కి పరవశింపజేశాడు. ఈ కృష్ణుడు వైకుంఠనగరిలో ఆనందిస్తుంటాడు. ఈదెస (నేడు ఈ తిరుమలలో) ఇదిగో శ్రీవేంకటాద్రి ఇరవాయ (ఆయన స్థానమైనది). ఇది యెంత విశేషము!!

పద్యవివరణ:

ఉ॥ **అంతటివానికింతయును అక్కజమొప్పగయెట్టుకూడునే**
వింతలు యిట్టి సుద్దులును వివ్వలమయ్యెను విన్నమాకునున్
కాంతలతోటి గూడి రతి కామన దీర్చెను కోర్కెలేకయే
అంతయు వేంకటేశ్వరుని అద్భుత లీలనె అన్నమార్యుడున్.

సంఖ్య: I/255 రాగం : లలిత
కీర్తన : నీవేకాచెప్ప జూపనీవె నీవేకా

లలిత

80 నీవేకాచెప్ప జూపనీవెనీవేకా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి ॥పల్లవి॥

నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి ॥నీవే॥

పసిఁడిబద్దలవారు పదికోట్లు గొలువ
దెసల బంపులు వంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ
సిసువులఁగా నేలిన సేనమొదలారి ॥నీవే॥

దొరలైన యసురుల తుత్తుమురుసేసి జగ-
మిరవుగా నేలితి వేకరాజ్యమై
పరగుసూత్రవతీపతివై వేంకటవిభు
సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి ॥నీవే॥

ఉపోద్ఘాతము:

ఇది శ్రీమన్నారాయణుని వైకుంఠంలో సైన్యాధ్యక్షుడైన విష్వక్సేనునిపై అన్నమయ్య చెప్పిన అద్భుత కీర్తన. "సేనమొదలారి" అంటే సైన్యాధ్యక్షుడని అర్థం. నీవేకా అంటే నీవేకదా! అని అర్థం. నీవేకదా! చెప్పవలెనంటే, నీవే కదా! చూపవలెనంటే, అంటున్నారు. నీవె శ్రీపతి ప్రతినిధివి, ఆయన సైన్యాధ్యక్షుడవు, అంటున్నారు. ఆ తరువాత ఆ 'సేనమొదలారి' అయిన ఆయన బాధ్యతలు అధికారాలు వివరిస్తున్నారు. అధికారం చేపట్టి పొగరెక్కిన అసురులను

తునాతునకలు చేస్తాడట శ్రీహరి సేనాపతి. జగమంతా ఏకరాజ్యమై శ్రీహరి పాలనలోకి రాగానే దానిని విష్వక్సేనుడు ఏలాడట. ఆయన సూత్రవతిభర్తట. శ్రీవేంకటపతి సిరుల రక్షకుడు, పెన్నిధి నీవేనయ్యా! అని కీర్తిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

నీవేకా (నీవే కదా!) చెప్ప (చెప్పవలెనంటే) శ్రీవిభు ప్రతినిధివి (శ్రీపతి ప్రతినిధివి). నీవేకా (నీవే కదా!) చూపవలెనంటే ఆయన సేన మొదలారివి (సైన్యాధ్యక్షుడవు).

నీవే కదా! శ్రీహరి యెట్టయెదుటే నిలుచుండి దేవతలకు మాత్రమే కనిపించు దేవుడవు. నీ అనుజ్ఞ లేనిదే వారికి శ్రీహరి దర్శన భాగ్యం కాదు. ఇందిరాపతి ఏవంక విచ్చేసినా (ఏ సమయంలో ఏతెంచినా) ఆయన ఆంతరంగిక సేవకుడవు నీవే కదా! ఆయన బాగోగులు చూసుకొనేది. అందుకే కదా! ఆయన నిన్ను తన సేనాపతిని చేసికొనినాడు.

పసిడి బద్దలవారు (బంగారు వేత్రములు లేక బెత్తములును ధరించినవారు) పదికోట్లమంది విష్వక్సేనునికి సహాయకులుగా కొలుస్తుండగా వారిని అన్ని దిక్కులకు పంపి అంతా సక్రమంగా వుందో లేదో తెలుసుకొంటుంటాడు, ఆ ధీరుడు. ముజ్జగముల వారిని (ముల్లోకవాసులను) తన వశము చేసికొని సిసువులుగా (బిడ్డలవలె) ఏలిన సేనాపతి ఈతడే సుమా!

దొరలైన (అధిపతులైన) రాక్షసులను తుత్తురుము (తునకలు తునకలు చేసి) జగములను మిరవుగా (మర్యాదపూర్వకంగా) పరిపాలించితివి. ఆపైన సూత్రవతి అను కన్యను పరిణయమాడినావు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని సిరులకు రక్షకుడవై ఆయనకు పెన్నిధివలె నిల్చిన సైన్యాధ్యక్షుడవు నీవే.

పద్యవివరణ:

చం॥ **ఇతడట విష్ణుసేనలకు యేలిక అన్నిట సర్వదక్షుడున్**
ఇతడట దేవతాళికిని యెట్టెదుటన్ కనుపించు ముందుగా
ఇతడట ముజ్జగాలగల ఈ హరిభక్తుల బిడ్డలట్లుగా
హితవుగజూచు, సూత్రవతి నేలెడి భర్తయు దైత్యవైరియున్.

సంఖ్య: II/25 రాగం : వరాళి
కీర్తన : అదివో నిత్యశూ (సూ)రులు అచ్యుత నీదాసులు

వరాళి

81 అదివో నిత్యశూ (సూ)రులు అచ్యుత నీదాసులు
యెదురులేనివారు యేకాంగవీరులు ॥పల్లవి॥

రచ్చల సంసారమనే రణరంగములోన
తచ్చి కామక్రోధాలతలలు గొట్టి
అచ్చపుతిరుమంత్రపు టారుపు బొబ్బలతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు ॥ఆది॥

మొరసి పుట్టుగులనే ముచ్చుఁబౌఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగ వేసి
పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁదూరి
యెరగొని తిరిగేరు యేకాంగవీరులు ॥ఆది॥

వొడ్డిన దేహములనే వూళ్ళలోపల చొచ్చి
చెడ్డ యహంకార మను చెఱలువట్టి
అడ్డమై శ్రీవేంకటేశునండనుండి లోకులనే
యెడ్డలఁజూచి నవ్వేరు యేకాంగ వీరులు ॥ఆది॥

ఉపోద్ఘాతము:

ఓ అచ్యుతా! నీదాసులు నిత్యశూరులయ్యా. వారి ధీరత్వమునకు వయసుతోనూ అండదండలతోను సంబంధంలేదు. వారు యెక్కడైనా యెదురులేనివారే. పైగా ఏకాంగవీరులు అనగా అసహాయశూరులు అంటున్నారు అన్నమయ్య. అయితే శ్రీహరిదాసుల వీరత్వానికి సామాన్యులైన రాజుల చతురంగ బలములకు తేడా యేమిటంటే, ఇక్కడ పోరాడే సైనికులు సంసార రణరంగంలో అలసిన మానవులు. వారి యుద్ధం అరిషడ్వర్గాలతో వారు యుద్ధంలో ఉత్సాహం కొరకు పెట్టే పెడబొబ్బలు పిచ్చిపిచ్చి

అరుపులు కాదు తిరుమంత్రోచ్చారణ. వారు మనకట్టెదెబే తిరుగుతుంటారు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ అచ్యుతా! అదివో నీదాసులు నిత్యశూరులు (ఎల్లవేళలా ధీరోదాత్తులై హరి శరణాగతిలోనే వుంటారు). వారికి ప్రాపంచిక పీకులాటవుండదు. అందువల్ల వారికి యెదురన్నది లేదు. ఒకవేళ ప్రాపంచిక భ్రమలతో పోరాడవలసివస్తే, వారు ఏకాంగవీరులు (అసహాయ శూరులు).

సందోహయుతమైన సంసార రణరంగంలో, వారి యుద్ధము, కామక్రోదాది అరిషడ్వర్గములతో వారు అవంటే జాలిచూపని నిర్దయులు. వాటి తలలు నరికివేస్తారు. వారి ఉత్సాహం "ఓం నమో నారాయణాయ" అనే తిరుమంత్రంతో అనే బొబ్బలతో ఇబ్బడవుతుంటుంది. వారు దేశాటన చేయుటకు శిష్యులను సమీకరించుటవంటి బలహీనతలు లేక ఇష్టానువర్తనులై, ఏకాంగ వీరులై వుంటారు.

మా సైనికులు మామూలు రణరంగ ధీరులేకాదు. ఇటు ముచ్చులతో (దొంగలతో) పోరాడుటలోనూ సిద్ధహస్తులే. అయితే వీరు పోరాడే బందిపోట్లు సామాన్యులు కాదు. వారు జన్మలనే పేరు బొందిన వుద్దండులు. వాటితో తలపడుట కురికి నడుములు తెగవేసి కర్మములనేకత్తులతో పొడిచి వధ్య శాలలో దూరి, నిర్భయులై తిరిగెదరు. వారు అసహాయ శూరులు. వారిని భవబంధములేమీ చేయలేవు.

సాధారణులైన మానవులకు, ఆత్మలు ఒడ్డిన దేహములు (లొంగిపోయిన శరీరములు) అనే వూళ్ళ లోపల చొచ్చి అహంకారమనే చెఱలో బంధించి వుంచటం వలన వారికి శ్రీహరి కృపకు పెద్ద అడ్డమై పోతుంది. లోకులనే అటువంటి యెడ్డెలను (తెలివితక్కువ వారిని) చూచి ఏకాంగవీరులైన హరిదాసులు పకపక నవ్వేరు.

పద్యవివరణ:

ఆ.వె॥ **నిత్యశూరులదివొ నీదాసులచ్యుతా!**
ఎదురులేనివారు యెల్లజగతి
ఎడ్డియలను జూచి ఏకాంగవీరులు
విరగబడి నగెదరు వేంకటేశ!

సంఖ్య: II/509 రాగం : బౌళి
కీర్తన : పరమపురుషుడీ బాలుడట

బౌళి

82 పరమపురుషుఁ డీ బాలుఁ డఁట
హరవిరుంచులు మొక్కేరదివో వాకిటను ॥పల్లవి॥

దేవుఁ డితఁడు సర్వదేవతల కొడయఁడు
వేవేలు వేదములచే వేద్యుఁ డితఁడు
దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ
ఏ విధము నోఁచిరి వీ రెంత భాగ్యవంతులో ॥పర॥

అంతటాఁదా నున్న వాఁడు అరయ స్వతంత్రుఁడు
అంతము నాదియు లేని ఆదిమూరితి
వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి
దొంతరకొడుకైనాఁడు తొల్లి వీరేపుణ్యులో ॥పర॥

ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు
కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు
మందగొల్లెతల కెల్ల మరఁది దా నై నాఁడు
ఇందరు నిందరే వీరి కెన్నటి సంబంధమో ॥పర॥

ఉపోద్ఘాతము:

దేవకీగర్భస్థ శిశువై యశోదాదేవితో అల్లారుముద్దుగా పెరిగి నందుని ఇంట నవ్వులు పూయిస్తున్న ఈ బాలుడు యెవరనుకొంటున్నారు. సాక్షాత్తు పరమాత్ముడు. అదిగో మీకు కనబడరుగాని పరమశివుడు పరమేష్ఠి, ఆబాలుని వాకిట నిలబడి మొక్కుచున్నారు అని అద్భుతంగా శ్రీకృష్ణ రసాయనం త్రాగిస్తున్నారు, అన్నమయ్య. ఇదే కీర్తన యెన్నోసార్లు యెన్నో చిన్న చిన్న మార్పులతో పాడుకొని వుంటాం. పల్లవి మాత్రం మరువలేనిదిగా వుంటుంది.

ఇందిరానాథుడైన ఈతడే మన ఇహపరములకు అధిపతి. నేడు వేంకటాద్రిపై కాపుండి మనరక్షకుడు రేపల్లెలోని గొల్లెతలందరితో ఒకేవావి (చుట్టరికము) వున్నదితనికి. వారికి మరిది. వీరి సంబంధము ఈనాటిదనుకొంటున్నారా?

తాత్పర్య వివరణ:

ఓ ప్రజలారా! ఈ బాలుడే, పరమపురుషుడట (పరమాత్ముడట). ఇదిగో ఇతని వాకిటను హరవిరుంచులు (పరమశివుడు, బ్రహ్మదేవుడు) నిలుచుండి వానికి మొక్కుచున్నారు.

దేవుడితడు (ఇతడే పరబ్రహ్మ). దేవతలందరికీ ఒడయడు (నాథుడు) యీతడే. ఈయన తత్త్వము తెలియాలంటే వేదములన్నింటినీ ఆకళింపు చేసికొనవలసిందే. వారి పూర్వజన్మ సుకృతమువలన దేవకీ వసుదేవులకు కన్నబిడ్డయై జన్మించాడు. ఇంత సౌభాగ్యమును స్వంతం చేసికొనుటకు వీరు నోచిన విధమెట్టిదో కదా! వీరెంత భాగ్యంతులో కదా! ఏమని పొగడగలము?

ఈతడు అంతటాతానున్నవాడు (సర్వవ్యాపకుడు). సర్వస్వతంత్రుడైనవాడు. ఆది మధ్యాంతరహితుడు. ఆదిమూర్తి (ఆదిపురుషుడు). వంతుకు (వంతులు కొద్దీ) యశోదనందగోపులను నవ్వులతో ముంచే ఈ బాలుడు దొంతర కొడుకైనాడు (పరంపరగా వచ్చిన పుత్రుడైనాడు). తొల్లింటి వీరే పుణ్యములు చేశారో కదా!

ఈ బాలుడే ఇందిరాదేవి భర్తయట. జీవులకు ఇహపరములనొసగే నాయకుడు ఇతడే. నేడు కలియుగంలో సామర్థ్యముతో శ్రీవేంకటాద్రిని యేలుతున్న శ్రీవేంకటేశ్వరుడితడే. గొల్లెతల మందకెల్ల (రేపల్లె గొల్లభామలకు మూకంతటికీ) తానొక్కడే మరది అయినాడు (చెల్లెలి మగడు అయినవాడు). ఇందరూ యిందరే. వీరితో ఇది ఏనాటి బంధమో కదా!

పద్యవివరణ:

చం॥ **అరయగ వీడు బాలుడటె ఆదిమపూరుషుడున్ పరాత్పరుం-**
డిరుగడ బ్రహ్మయున్హరుడు యేపుగమొక్కిరి నిల్చివాకిటన్
మురిపెము దీర్చెదేవకికి ముద్దులబిడ్డయశోదకాయెరా
తిరుమలరాయడే వెలసె తీర్చినకృష్ణుడు చిత్తచోరుడున్.

సంఖ్య: I/51 రాగం : ముఖారి
కీర్తన : నదులొల్లవు నాస్నానము కడు

ముఖారి

83 నదు లొల్లవు నాస్నానము కడు
సదరము నా కీస్నానము ॥**పల్లవి**॥

ఇరువంకల నీ యేచినముద్రలు
ధరియించుటె నా స్నానము
ధరపై నీ నిజదాసులదాసుల-
చరణధూళి నా స్నానము ॥**నదు**॥

తలఁపులోన నినుఁ దలఁచిన వారలఁ
దలఁచుటే నా స్నానము
వలనుగ నినుఁ గనువారల శ్రీపాద-
జలములే నా స్నానము ॥**నదు**॥

పరమభాగవతపాదాంబుజముల
దరుశనమే నా స్నానము
తిరువేంకటగిరిదేవ నీ కథా-
స్మరణమే నా స్నానము ॥**సదు**॥

ఉపోద్ఘాతము:

నేను చేసే ఈ స్నానమును నదులుకూడా అంగీకరించవు. నాకీ స్నానము కడు వేళాకోళము వంటిది అంటున్నారు అన్నమయ్య. నా రెండువైపులా నీ తిరుముద్రలు ధరించుటయే నా స్నానము. ఈ

భూమిమీద నీ స్వంత దాసులకు దాసులెవరైతే వున్నారో వారి పాదధూళి నా శరీరంపై ధరించుటయే నా స్నానము. పరమ భాగవతోత్తముల పాదపద్మముల దర్శనమే మా స్నానము. ఓ తిరుమలదేవా! నీ కథా స్మరణమే నా స్నానము అంటున్నారు పదకవితాపితామహులు.

తాత్పర్య వివరణ:

నేను చేసే నా స్నానమును నదులు ఒల్లవు (అంగీకరించవు). నాకీస్నానము కడు సదరము (మిక్కిలి వేళాకోళము మరియు హాస్యాస్పదము).

నా ఇరువైపులా భుజములమీద యేచిన (ధరించిన) తిరుముద్రలు దాల్చుటయే నా స్నానము. ఈ భూమిపై నీ స్వంతదాసులకు దాసులైన వారి చరణ ధూళిని దాల్చుటయే నా స్నానము.

శ్రీ గోవిందుని తలచిన వారల (స్మరించుచుండెడివారల) తలచుచుండుటయే నా స్నానము. శ్రీహరిని కనులార దర్శించినవారి శ్రీపాదజలములను నిత్యము తీర్థముగా స్వీకరించుటయే నా స్నానము.

పరమభాగవతులైనవారి పాదపద్మముల యొక్క దరుశనమే (దర్శనమే) నేను ఇష్టపడే నా స్నానము. ఓ తిరువేంకటగిరి దేవా (శ్రీవేంకటేశ్వరా!) పవిత్రమైన పురాణకథా శ్రవణమే, వాటి స్మరణయే నా స్నానము.

పద్యవివరణ:

తే.గీ॥ **నదులు నాస్నానమొల్లవు సదరము జుమి!**
పరమభాగవతుల పాదదరిశనంబె
నాదుస్నానము, వేంకట నగనివాస!
స్నానమికనాకు నీకథా శ్రవణమొకటె.

సంఖ్య: II/502 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎఱిగితి నమ్మితి నితడు దయానిధి

శ్రీరాగం

84 ఎఱిఁగితి నమ్మితి నితఁడు దయానిధి
మఱుఁగులు మొరఁగులు మరి యిఁకలేవు ॥పల్లవి॥

వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు
ఆదిమూర్తి శ్రీ అచ్యుతుఁడు
సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాల నితఁడే కలఁడు ॥ఎఱిగి॥

పరమపురుషుఁ డాపన్నివారకుఁడు
హరి శాంతుఁడు నారాయణుఁడు
శరణంటి మితఁడు చేకొని కాచెను
తరవాతిపనులఁ దప్పఁ డితఁడు ॥ఎఱిగి॥

హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు
ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు
వెదకితి మీతఁడు విడువఁడు మమ్ముఁక
తుదకును మొదలికి దొరకినవాఁడు ॥ఎఱిగి॥

ఉపోద్ఘాతము:

ఓ భక్తులారా! మేము ఇతనిని యెఱిగితిమి, ఆపై ఇతడు అమితదయానిధి అని నమ్మితిమి. మఱుగు మొఱుగు (చాటుమాటు) మరి ఇక అక్కరలేదు. మేము ఇతనిని బాహాటముగా కొలిచెదము గాక! అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో పల్లవి అర్థంకావటానికి చాలాసేపు పట్టింది. ఇతను వేదములను ఉద్ధరించినవాడు. విశ్వమునకు రక్షకుడు, పరమపురుషుడు, ఆపదలను

నివారించువాడు, అచ్యుతుడు, శాంతమూర్తి, నారాయణుడు, హృదయాంతరంగుడు, ఈశ్వరేశ్వరుడు, అన్నీ ఈయనే. అంతెందుకు ఇతడే శ్రీవేంకటేశ్వరుడని గ్రహించి ఇతనికి శరణంటిమి అంటున్నారు. ఇతనిని విడువము. తుదకు మొదలికిని దొరికినవాడు అంటే ఏమిటి? ఆలోచించండి.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! ఎఱిగితి (ఇతని నెఱిగితిమి). ఆపై ఇతనిని నమ్మితిమి. ఇతడు దయానిధి అని తెలిసికొంటిమి. మరి ఇక మఱుగులు మొరగులు (చాటుమాటు వ్యవహారాలు) మాకు లేవు.

ఇతడు, వేదోద్ధరణుడు (వేదములను ఉద్ధరించినవాడు). విశ్వరక్షకుడు (సదా ఈ విశ్వమును రక్షించెడివాడు). ఆదిమూర్తి (పురాణపురుషుడు) శ్రీ అచ్యుతుడు (ఎన్నడూ అంతములేనివాడు). ఇతనిని శోధించి తెలిసికొని కొలిచితిమి. సుముఖుడై (అనుకూలుడై) మమ్మేలినాడు. ఇప్పుడు యెటువైపు చూచినా మాపాలిట ఇతడే కలడు ఇది మా భాగ్యము.

అంతేకాదు, యీతడే పరమ పురుషుడు (పరబ్రహ్మ), ఆపన్నివారకుడు (ఆపత్తును నివారించువాడు) శ్రీహరి. పరమశాంతమూర్తి, శ్రీమన్నారాయణుడు. ఈ విధముగా నితనిని తెలిసికొని మేము శరణంటిమి. వెంటనే ఇతడు మమ్ము చేకొని (ఆదరించి) కాచినాడు (రక్షించినాడు). తరవాతి పనులు (శరణాగతరక్షణ, మోక్షమునొసగుట) వంటి కార్యక్రమమును ఇతడు తప్పడు.

ఈతడే హృదయమున అంతర్యామియై, అంతరంగుడుగా వుంటాడు. ఇతడు ఈశ్వరునికే యేలిక. ఇదిగో ఈయనే శ్రీవేంకటేశ్వరుడు ఈతనిని వెదకి కనుగొంటిమి. ఇకపై మేము ఇతనిని విడువము. తుదకును మెడలికి దొరకనివాడు (ఆద్యంతములు కనుగొనలేనివాడు) ఈ మహానుభావుడే.

పద్యవివరణ:

కం॥ **ఇతడు దయానిధియనినే**
హితవుగనెఱిగితిని హరిని ఇకనమ్మితిబో
ఇతనికి మఱుగులు లేవిక
చతురుడ ఓ వేంకటేశ! సప్తగిరీశా!

సంఖ్య: II/388 రాగం : లలిత
కీర్తన : అంతరాత్మ హరిగలడంతే చాలు

లలిత

85 అంతరాత్మ హరిగలఁ డంతే చాలు
యెంత కెంత చింతించనేలా వెరవ ॥పల్లవి॥

వెనకజన్మపుగతి వివరించి నే నెరఁగ
అనుగు మీఁదటిజన్మ మది యెఱఁగ
ననిచి యీ జన్మము నానాఁటఁ దెలిసేము
యెనసి యీ భవముల కేలా వెఱవ ॥అంత॥

నిన్నటిదినముకత నిమిషమై తోఁచీని
కన్నుల రేపటిచేఁత కానఁగా రాదు
పన్ని నేఁటిదినము మున్ను నోఁచినట్లే
యెన్న ఁగ నెందుకు నైనా నేలా వెఱవ ॥అంత॥

పరము నిహము నేఁ బై కొన నా యిచ్చగాదు
హరి శ్రీవేంకటపతి యఖిలకర్త
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది
యిరవైతి నింకా నాకేలా వెఱవ ॥అంత॥

ఉపోద్ఘాతము:

నా అంతరాత్మలో హరిగలడు. నాకు అంతే చాలు. ఇంక కోరేదేమున్నది? ఎంతకు యెంత చింతించను? వెరవనేల (భీతిల్లుటెందులకు) అంటున్నారు అన్నమయ్య. నా వెనుకటి జన్మయేదో నేను వివరించలేను. ముందువచ్చే జన్మయేదో వూహించనుకూడా లేను. ఈ జన్మలో యేమి జరుగుతున్నదో అక్కడక్కడా దెలిసేము మరి

అటువంటప్పుడు మన అదుపులో లేని భవములకు (పుట్టుకులకు) యెలా వెఱవ అని ప్రశ్నిస్తున్నారు. అఖిలకర్త అయిన శ్రీవేంకటేశ్వరుని శరణంటిమి. అతడు సర్వస్వతంత్రుడు నా భారం ఆయనే చూసుకొంటాడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

నా అంతరాత్మలో శ్రీహరివున్నాడు. నాకు ఆ తృప్తి చాలును. ఎంతకు నెంత చింతించను? నాకు వెరవన్‌యేల (భయపడవలసిన అవసరమేమున్నది?)

నా వెనుకటి జన్మపుగతి (యెట్లునడచినదో) వివరముగా నే నెరగను. జరగబోయే ముందటి జన్మలో యేమి అవుతానో అంతకంటే తెలియదు. ననిచి (ఆలోచిస్తే) ఈ జన్మలో యేమి జరుగుతున్నదో కొంత వరకు తెలుస్తున్నది. అటువంటప్పుడు నా అదుపులో లేని పుట్టుకలకు నేను దిగులుపడి ప్రయోజనముంటుందా?

నిన్నటిదినము కత (జరిగినదంతా) నిమిషములో జరిగింది అనే భ్రమ కలుగుతుంది. రేపు యేమి జరుగుతుందో తెలియనే తెలియదు. పన్ని (ప్రాప్తించి) నేటి దినమున జరిగేవన్నీ మున్ను నోచిన తీరుగానే జరుగుతాయి. ఇక యెంచి చూస్తే దేనికోసం మనోవ్యధ బొందాలి? భయమెందుకు?

పరముగానీ (పరలోక ప్రాప్తికాని) ఇహలోక కర్మానుభవముగాని నా చేతిలో లేవు. అవునా? విశ్వకర్త శ్రీ వేంకటేశ్వరుడే. ఆయన ఆజ్ఞావర్తనముననే యేదైనా జరుగుతుంది. ఆయన సర్వస్వతంత్రుడు. అందుకే ఆయన శరణుపొందాను. సుస్థిరంగా వున్నాను. నాకింకా యేమి భయం?

పద్యవివరణ:

ఆ.వె॥ **అంతరాత్మలోన హరిగలడది చాలు**
యెంతకెంత చింతయేల వెరవ
శరణనంటి నతని స్వాతంత్ర్యమతనిది
ఇరవుయైతి నింక యేల వెఱవ?

సంఖ్య: I/424 రాగం : శంకరాభరణం
కీర్తన : అదె వాడెయిదె వీడె అందునిందు నేగెడి

శంకరాభరణం

86 అదె వాఁడె యిదె వీఁడె అందునిందు నేఁగీని
వెదకి వెదకి తిరువీధులందు దేవుఁడు ॥పల్లవి॥

అల సూర్యవీధి నేఁగీ నాదిత్యునితేరిమీఁద
కలికి కమలానందకరుఁడుగాన
తలపోసి అదియును దవ్వు చుట్టతిక మని
యిలఁ దేరిమీఁద నేఁగీ నిందిరావిభుఁడు ॥అదె॥

చక్క సోమవీధి నేఁగీఁ జందురుని తేరిమీఁద
యెక్కువైన కువలయహితుఁడుగాన
చుక్కలుమోచిన దవ్వు చుట్టరిక మిది యని
యిక్కువతో వీధి నేఁగీ నెన్నికైన దేవుఁడు ॥అదె॥

యింతుల మనోవీధి నేఁగీ మరుతేరిమీఁద
నంతటా రతిప్రియుఁ డటుగాన
రంతుల నదియుఁ గానరాని చుట్టరిక మని
వింతరీతి నేఁగీ శ్రీవేంకటేంద్రిదేవుఁడు ॥అదె॥

ఉపోద్ఘాతము:

తిరుమల తిరువీధులందు దేవుడు రథముపై ఊరేగుతున్నాడు. ఒక రోజు సూర్యవీధిలో (తూర్పు వీధిలో) ఆదిత్యుని రథముమీద వెళ్ళి కమలానంద కరుడైనాడట. ఏమి చమత్కారమండీ. అంత దూరపు చుట్టరికమైనా తనరథముపై సూర్యునిపెట్టుకొన్నాడట శ్రీవేంకటేశ్వరుడు. అలాగే సోమవీధిలో (పడమర వీధిలో) చంద్రప్రభ రథవాహనంమీద పోతూ కువలయహితుడు (అశ్వములనిన ప్రీతికలవాడు శ్రీనివాసుడు. కువలయము అనగా కలువలనిన ప్రీతికలవాడు చంద్రుడు.) అందుచేత నక్షత్రాలు కనబడే ప్రతిచోట చుట్టరికాలు

సమకూర్చుకొన్నాడట. అదెవాడె ఆ సూర్యప్రభమీద వాడే, ఇదెవీడె ఈ చంద్ర ప్రభమీద వీడే దానిమీదా దీనిమీదా వూరేగి వస్తున్నాడు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

అదెవాడె (అదిగో ఆ సూర్యప్రభ వాహనం మీద వచ్చేది వాడే శ్రీహరి) ఇదె వీడె (ఇదిగో ఈ చంద్రప్రభ వాహనం మీద వచ్చేది వీడే శ్రీహరి). అందునిందు నేగీని (దానిమీదా దీనిమీదా వూరేగివస్తున్నాడు). ఏతిరువీధిలో వున్నాడో ఈ గుంపులో కనుక్కోవటం కష్టం. వెదకి వెదకి దేవుడెందున్నాడో కనుగొనండి.

ఈ దేవునికి తనచుట్టాలంటే విపరీతమైన అభిమానం. ఆలివైపువారు ఆత్మ బంధువులు కదా! ఈయన భార్య కమల. ఆమె కమలవాసిని. ఈ సూర్యుడు కమలానందకరుడు (కమలములను వికసింపజేయువాడు). ఆచుట్టరికానికే కట్టువడి అది సూర్యవీధిలో (తూర్పువీధిలో) ఆదిత్యతేరు (సూర్యరథముపై) యేగీని. ఇందిరారమణుడు సూర్యరథంపై పోతుంటే హారతులిచ్చి మనమూ తరిద్దాం.

చంద్రుడు కువలయా నందకరుడు (కలవపూలు అంటే ప్రీతితో వాటిని వికసింపజేస్తాడు). ఈ శ్రీనివాసుడు కూడా కువలయానందకరుడే అంటే, అశ్వములకు తన కరస్పర్శచే ఆనందము కలిగించువాడు. పైగా ఈయన భార్య లక్ష్మి కూడా క్షీరసాగరపుత్రికే చంద్రుడూ అంతే. ఏమి చుట్టరికమండీ ఇది. చుక్కలు మోచిన దవ్వు చుట్టరికం. (నక్షత్రాలంత దూరపు చుట్టరికం.) ఇక చెప్పేది యేముంది. చంద్రరథంమీద చక్కగా సోమవీధి (పడమర వీధిలో) వూరేగుతున్నాడు. ఎన్నికైన ఈ దేవుడు ఇక్కువ (మక్కువ)తో చంద్రరథముపై వూరేగినాడు.

ఇది చూచి పరవశించిన, రమణుల మనోవీధులలో మన్మధరథముపై పోతున్నాడు ఈ దేవుడు. ఎందుకంటే ఈయన రతిప్రియుడు. అటుగాన (అందుకు). అన్నట్లు మన్మథుడూ రతిప్రియుడే (రతీదేవి భర్త). ఆ రతీమన్మథులు కంటికి కనుపించరు. కానరాని చుట్టరికమైనా, వింతగా శ్రీవేంకటాద్రి వీధులలో వూరేగుతున్నాడు ఈ శ్రీవేంకటేశ్వరుడు.

పద్యవివరణ:

కం॥ **అదె వాడె ఇదియు వీడే**
వదలక అందుననునిందు వచ్చెను హరియై
వెదకీ తిరువీధుల యిటు
కుదిరిన మూడేసి ప్రభల కొలువరె దేవున్

సంఖ్య: IV/234 రాగం : పాడి
కీర్తన : అనుచు బొగడ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట

పాడి

87 అనుచుఁ బొగడఁ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట
మొనసి యీ బాలునికే మొక్కేము నేము ॥పల్లవి॥

వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు
అన్నువ నీదేవకి గర్భమందు పుట్టెను
మన్నించి యోగీంద్రుల మదిలో నుండెడువాఁడు
పన్నినపొత్తులలోన బాలుఁడై వున్నాఁడు ॥అను॥

పాలజలధిలోన పాయని గోవిందుఁడు
పాలు వెన్న లారగించె పైఁడి కోరను
వోలిఁ దనవిష్ణుమాయ నోలలాడినట్టివాఁడు
చాలి మంత్రసానులచే జలకమాడీని ॥అను॥

ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు
తగు బలభద్రునికి తమ్ముఁ డాయను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి
యెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడే ॥అను॥

ఉపోద్ఘాతము:

ఈ బాలుడెవరనుకున్నారు? తన ఉదరములో భువనాలను దాచుకొన్నవాడు. అయినా యీ దేవకీదేవి పొత్తిళ్ళలో వున్న ఈ యోగీశ్వరవంద్యుడు కావాలని ఆమెగర్భవాసమున పుట్టినాడు. పాలసముద్రాన్ని రేబవళ్ళూ విడవని ఈ గోవిందుడు బంగారుగిన్నెలో పాలువెన్నా ఆరగించాడు. తన విష్ణుమాయలో తానే వోలలాడినాడు. మంత్రసానులు స్నానం చేయించగా జలకమాడినాడట. ఎంత వింత! ఈయనే

బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు మూలమైన పరబ్రహ్మ స్వరూపుడు. బలరామునికి తమ్ముడు నేడురేపల్లెనుండి వచ్చి వేంకటముననిల్చి శ్రీవేంకటేశ్వరుడైనాడు. అన్నమయ్య బ్రహ్మాదులు ఆ బాలుని కీర్తించారు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అనచు (అంటూ) బ్రహ్మాది దేవతలు, మొనసి (పూని) ఈ బాలునికే నేము (మేము) మొక్కేము (నమస్కరించెదమని), మింట (ఆకసమున నిల్చి) అదె బొగడజుచ్చేరు (కీర్తించుటకారంభించినారు).

ఉన్నతమైన లోకములు (చతుర్దశభువనాలు) తన పొట్టలోవున్నవాడు, అన్నువ (అల్పురాలైన మానవకాంత) దేవకీదేవి గర్భమునందు పుట్టెను. ఎంత వింత! యోగీంద్రులనుమాత్రమే మన్నించి వారి మనస్సులలోనుండు నారాయణుడు పన్నిన (సిద్ధపరచిన) పొత్తిళ్ళలో బాలుడు అయినాడు. ఏమి ఈ జగన్నాటకము? దుష్టశిక్షణకు పరమాత్మ యెంత కష్టపడ్డాడు!

పాల సముద్రమున పవ్వళించి ఆదిశేషతల్పమును పాయని (విడనాడని) గోవిందుడు, కృష్ణుడైన పిమ్మట పైడికోరను (బంగారు గిన్నెలో) పాలు వెన్న ఆరగించేవాడట. నందవ్రజమున యశోదాదేవి ఒడిలో ఓలి (వరుసగా) తన విష్ణుమాయతో పరవశింపజేయువాడు, తానే ఆ మాయకు లోనై మంత్రసానులచేత పురిటిస్నానం చేయించుకొన్నాడు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులని ముగ్గురు వేర్వేరు దేవతలై సృష్టి స్థితిలయకార్యక్రమం నిర్వహించు పరమాత్మ తనసేవకుడైన ఆదిశేషునికే తమ్ముడై బలభద్ర సోదరుడైనాడు. నిగిడి (వ్యాపించి) వైకుంఠముననిలిచెడి నారాయణుడు రేపల్లెనుండి శ్రీవేంకటాద్రిపైకి వచ్చి చేరినాడు. వీడే అమరిన శ్రీవేంకటేశ్వరుడు.

పద్యవివరణ:

చం॥ **కనుగొనమూడులోకములు గర్భములోగల దేవకీసుతున్**
గొనకొని పాలువెన్నలను కొల్లగమ్రింగెడి బాలు గొల్వుడీ
తను తీరువేంకటాధిపతి తమ్ముడు రాముని కావ్రజంబునన్
అనుచు పొగడ్తలన్ కొలిచిరందరు బ్రహ్మాహరాదిదేవతల్.

సంఖ్య: IV/89 రాగం : బౌళి
కీర్తన : అడ్డములేని నాలిక నాడుదురుగాక భూమి

బౌళి

88 అడ్డములేని నాలిక నాడుదురుగాక భూమి
దొడ్డవాఁ డేమి సేసినా దోసమందు నేది ॥పల్లవి॥

అతుమలో మదనుఁ డయ్యేవాఁడవు నీవే
అతల నాలిమగఁడు ననే వారలు నీవే
ఘాతల పరాంగనఁ గలసితి వని నిన్ను
తోతో మునుల కిఁక దూరఁ జోటేదయ్యా ॥అడ్డ॥

దేహములోపలనున్న దీపనాగ్నియు నీవే
దాహము నాఁకలి నీవే తగు రుచులెల్ల నీవే
ఆహా శబరియెంగి లారగించి తనుమాట
సోహల నిందించి నవ్వఁ జోటిందునేది ॥అడ్డ॥

పుట్టుగు లోపలనున్న భోగము లన్నియు నీవే
యిట్టె ఆచారములు హీనాధికములు నీవే
గుట్టున శ్రీవేంకటేశ గొల్లఁడవై పుట్టినందు
కుట్టిపడి యెవ్వరికి నూహించఁ జోటేది ॥అడ్డ॥

ఉపోద్ఘాతము:

అడ్డములేని నాలికతో అందరూఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటారు. అందుకనే గొప్పవాడు యేమిచేసినా చెల్లుతుంది. అందులో దోసము యేదీకనబడదు అంటున్నారు అన్నమయ్య. మనుష్యుల ఆత్మల్లో మదనుడై శృంగారం ప్రదర్శించేవాడెవరు? నీవే ప్రభూ! ఆ శృంగారం జరిపే ఆలుమగలు కూడా నీవే. మరి వాళ్ళు చేస్తున్న పని బాగున్నది కాని నీవు పరస్త్రీలతో వ్యభిచరించావని నిన్ను మాటలంటున్నారు. థూ! థూ! ఈ

మునులవంటి గొప్పవాళ్ళకి దూరటానికి (నిందించుటకు) చోటెక్కడుంది అంటున్నారు. ఒకటికి రెండుసార్లు తర్కించాల్సిన కీర్తన ఇది.

తాత్పర్య వివరణ:

అడ్డములేని నాలుక కదా!అని అందరూ ఆడుదురుగాక ! (ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాట్లాడవచ్చునేమో!) ఎందుకంటే దొడ్డవాడు (గొప్పవాడు) యేమి చేసినా అందులో దోసము యేదీ కనబడదు.

ఓ దైవమా! మానవుల ఆత్మలలో మదనుడైమన్మథ తాపము కలిగిస్తున్నవాడెవరు? నీవే కదా! ఆ తాపమునానుభవించే ఆలుమగలు కూడా నీవే. వాళ్ళు అట్లా శృంగారం జరిపితే తప్పులేదు. కానీ నీవు అనేకమంది పరస్త్రీలతో వ్యభిచరించావని నిన్ననిందిస్తుంటారు. తో తో (థూ! థూ!) ఈ మునులవంటి వారికి నిన్ను దూర (నిందించ) చోటెక్కడుందో తెలియదు.)

ఓ పరమాత్మా! మా దేహములలో వేడిమిని పుట్టించే దీపనాగ్ని నీవే. అదే లేకపోతే మరుక్షణమే మరణం వస్తుంది. మా జీవితాంతమూ మాకు దాహము, ఆకలి కలిగిస్తున్నది వేరెవ్వరూ కాదు నీవే.అటువంటి నీకు ఆకలి తీర్చుకోమని శబరి యెంగిలిపండ్లు తినబెట్టిందా? ఆహా!ఈ మాట నీ సోహం (నీవే నేను)అనే భావన ప్రతిపాదిస్తోంది. ఇక నిన్ను నిందించి నవ్వటానికి ఇందుచోటేది (ఆస్కారమేది!)

పుట్టుగులోపల (జన్మలలో) ప్రాప్తించే భోగములన్నీ నీ కృపవల్లనే కలుగుతున్నాయి. ఆ పుట్టుకలో వాడి ఆచారవ్యవహారములన్నీ నేర్పి నిర్వహింపజేసేది నీవే. వాడికి హీనాధిక భావనలన్నీ నీవల్లనే కలుగుతున్నాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు నీవే గొల్లవాళ్ళ వంశంలో పుట్టినందుకు నిన్ను యెవ్వరు నెగ్గింపగలరు. వారికవకాశమేది?

పద్యవివరణ:

ఉ॥ అడ్డము లేనినాలికని ఆడుదురందరు భూమిపై వెసన్
దొడ్డగువాడు చేసినను దోసములెక్కకు రాదు యెన్నడున్
సొడ్డిడి యెంగిలిన్ శబరి సొంపుగ నోటికి బెట్ట తింటివే
వడ్డినిగుంజు సప్తగిరివాస! ప్రభో! ఇవి నీకెజెల్లెబో.

సంఖ్య: I/280 రాగం : భైరవి
కీర్తన : హరి గొలిచియు మరీ నపరములా

భైరవి

89 హరిఁ గొలిచియు మరీ నపరములా
తిరముగ నతనినే తెలియుట గాకా ॥పల్లవి॥

పంకజనాభుని పాదములు దలఁచి
యింకా మరియొక యితరములా
అంకెల నతనినే అతనిదాసులనే
కొంకక నిజముగఁ గొలుచుటగాకా ॥హరి॥

పన్నగశయనుని బంట్లకు బంటై
కొన్నిటిపై మరి కోరికెలా
యిన్ని కోరికలు యిదియే తనకని
కొన్నది కోలై కోరుటగాక ॥హరి॥

వీనుల వేంకటవిభు నామామృత
మూనిన మతి మరియును రుచులా
తేనెలుగారెడి తీపు లతని నుతి
నానారుచులై ననుచుటగాకా ॥హరి॥

ఉపోద్ఘాతము:

పరము అంటే అత్యంత శ్రేష్ఠమైనది అని అర్థం. ఏమిటది? మోక్షము. అపరము అంటే మోక్షం దక్కకపోవటం. హరిగొలిచిన వారికి కూడా అపరములా అంటున్నారు అన్నమయ్య. అసంభవం. స్థిరమైన ఆతని తత్త్వం తెలియాలేగానీ, ఒకసారి తెలుసుకొన్నవారికి ఆతని కృప గలుగక మానుతుందా అంటున్నారు. కొద్దిగా భావించక నేను చెప్పిన ఈ వివరణ

తట్టదు. ఒక్కసారి పంకజనాభుని పాదాలను నమ్మినవానికి ఇతరముల గూర్చిన చింత యెందులకు? ఆ జగన్నాథుని అతని సేవకులను ఆశ్రయించినవానికి ఆతని పాదములను కొలుచుచూ వుండటమే మోక్షము. వేంకటేశుని నామామృతం స్వీకరించిన అన్యములు రుచించునా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

హరి గొలిచిన వారికి కూడా అపరములు (మోక్షము దక్కకపోవటం జన్మ చక్రబంధంలో తగులుకోవటంలాంటివి ఉంటాయా?) తిరముగ (స్థిరముగ) అతనినే తెలియుటయే మోక్షము. అటుగాక వేరొండు కలదా?

పంకజనాభుని నిజపాదదర్శనం అయినవానికి ఇంకా మరియొక ఇతరము మీద (ఇంకొకదానిపై) వ్యామోహముంటుందా? అంకెల (ఆతని ఆధీనులై) ఆశ్రీహరిని, ఆయన దాసులను కొంకక (జంకులేక) కొలిచిన, ఆతనికృప సిద్ధిస్తుంది. ఇందులో యేమాత్రమూ సందేహానికి ఆస్కారం లేదు.

పన్నగశయనుడైన శేషాచల నిలయుని బంట్లకు (భృత్యులకు) బంట్లై (భృత్యులై) వున్నవారు కోర్కెలను జయించిన ఉన్నతులు. అటువంటివారికి కొన్నిటిపై కోర్కె వుంటుందా? ఇన్ని కోరికలున్నవారికి తమకే ఇవన్నీ కావాలని అనుకొని కోలుపోయి ఆ హరిని కోరుటగాక ఇంకా యేమన్నా ప్రయోజనం వుంటుందా?

వీనులవిందుగా వేంకటవిభుని నామామృతమూనిన (ఆస్వాదించిన) మనస్సుకు మరియొకటి రుచిస్తుందా? ఆతని నుతి (కీర్తించుట) తేనెలు గారెడి తీపి పదార్థములను సేవించుటవంటిది. ఆబగా నానారుచులు నంజెడివాడు యేరుచినీ సంపూర్తిగా ఆస్వాదించలేడు.

పద్యవివరణ:

కం॥ **హరిగొలిచియునూ మరియూ**
తరుగని అపరముల? ఇంక దయగలిగేనా?
తిరమగు ఆతని దెలియక
తిరువేంకటరాయుడెట్లు తెలియును మతికిన్.

సంఖ్య: IV/148 రాగం : గుండక్రియ
కీర్తన : కైకొంటేకాక కమలనాభునియాజ్ఞ

గుండక్రియ

90 కైకొంటేకాక కమలనాభునియాజ్ఞ
పైకొని యిన్నిటాను బాసివుండనేది ॥పల్లవి॥

హరినిర్మితములే అఖిలప్రపంచము
తొరలి యేమిటి నిందు దూషించేది
ధరణిధరునికి దాసులే జీవు లెల్లా
గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది ॥కైకొ॥

వాసుదేవుకల్పితమే వరసంసారబంధము
దోసమంటా యెందెందు దొలఁగేది
శ్రీసతీశురచనలే చేకొన్న రుచులెల్ల
యీసుతోడ నిందుమీఁద నెట్టురోసేది ॥కైకొ॥

గోవిందుమాయలే కూడినట్టి పనులెల్ల
వేవేలై యిందు నెట్టు వేసరేది
శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా
పావనమైతిమి యిఁకఁ బరచింత యేది ॥కైకొ॥

ఉపోద్ఘాతము:

మానవుడు పరమాత్మ చేతిలో కీలుబొమ్మ. ఆ కమలనాభుని ఆజ్ఞలను శిరసావహించక తప్పదు. ప్రయత్నించి ఈ సృష్టినుండి విముఖులై హరిని బాసివుండగ సాధ్యమా? అంటున్నారు అన్నమయ్య. ఈ అఖిల ప్రపంచమూ హరి నిర్మితమే. దీనిలో దేనిని దూషించగలము? జీవులందరూ భూరమణుని దాసులే మరి, ఇక యెవరిని కాదనగలను?

సంసార బంధము సమయనిబంధము. తగులుకొన్నాక దాంట్లో తచ్చాడాల్సిందేగాని తప్పుకొని తొలగుట అయ్యేపనికాదు. శ్రీవేంకటేశుని చిత్తములో నిల్పుటే దారి, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కమలనాభుని యాజ్ఞ కైకొంటే కాక (స్వీకరించుట తప్ప) యెవరైనా యేమైనా స్వతంత్రించి చేయగలరా? పైకొని (ప్రయత్నించి) ఇన్నిటాను (ఇన్నిటిలో) ఈతనిని బాసివుండ (వదలివుండనగునా?)

ఈ అఖిల ప్రపంచము హరినిర్మితములే. తొరలి (కలుగజేసికొని), ఇందులో దేనిని దూషించగలను? ఈ ప్రపంచంలోని సమస్త జీవకోటి భూవల్లభుడైన శ్రీహరిదాసులే. గరిమ (చాకచక్యంతో) ఇందుయెవరిని కాదనగలను?

తల్లీదండ్రీ భార్యాబిడ్డలు తోబుట్టువులూ మొదలైనవి విశిష్టమైన సంసారబంధములు. ఇవన్నీ వాసుదేవునిచే కల్పించబడినవే. ఈ బంధము దోషభూయిష్టమని, యెక్కడెక్కడ తప్పుకొని తిరుగగలను? నేను చేకొన్న రుచులెల్లా (ఇష్టాయిష్టములన్నీ) శ్రీసతీవల్లభుని రచనలే (చమత్కారములే). ఈసుతోడ (పక్షపాత వైఖరితో) ఇందుమీద (ఇకమీదట) నెట్టురోసేది (ఏవిధంగా ఛీత్కరించగలను?)

నాకు కూడినట్టి (కుదిరిన) పనులన్నీ గోవిందుని మాయలే. వేవేలై (అనేక విధములుగా) ఇందులోనే (ఈ మాయలోనే) ఎట్లా వేసారిపోయేది? ఇది పనికాదని శ్రీవేంకటేశ్వరుని చిత్తములో ధ్యానించి పావనుడనైనాను. ఇక నాకు అన్యమైన ఆలోచనలెందుకు?

పద్యవివరణ:

చం॥ **కమలమునాభిలోగలుగు కంజదళాక్షుని కాదనందుమే**
అమలుని యాజ్ఞకై కొనక ఆతని నన్నిట బాసివుందురే
సమయని బంధమే తగులుసాధ్యము కాదిక తప్పుకొందునే
ఇమడగయాత్మలో తిరుమలేశుడు దిక్కని ధ్యానమెంచితిన్.

సంఖ్య: II/120 రాగం : దేసాళం
కీర్తన : వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా

దేసాళం

91 వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా ॥పల్లవి॥

అరయ జీవుల కెల్లా నభేదమైతే
గురుఁడు శిష్యుఁడు లేఁడు కూడ దర్థము
సారిది నాతుమలోన సోహంభావన యైతే
సరి మునులదేవపూజలు చెల్లవు ॥వాద॥

సహజలీలావిభూతి సర్వము మిథ్యయైతే
బహుయాగాదికర్మాల పసలేదు
మహిలోని జననాలు మరణాలు మాయమైతే
విహితాచారాలు సేయ విధే లేదు ॥వాద॥

ఘటన బ్రహ్మము నిరాకారమైతేఁ బఠియింప
యిటు పురుషసూక్తాదు లివి మరేల
అటు శ్రీవేంకటేశుదాస్యములేక బిగిసితే
సటలాడుకొనెడి రాక్షసమత మవును ॥వాద॥

ఉపోద్ఘాతము:

ప్రతిసారీ ముక్తి అనేది వుందని కొందరు లేదని కొందరు వాదులాడుకోవడం యెంత నిష్ప్రయోజనం! మన పెద్దలు ఋషులు వేదాంతశ్రవణము వెట్టి చాకిరీ కోసం చేశారా యేమిటి? దానివల్ల ముక్తి కలిగిందని వారికి తెలియడంవల్లనే అంత శ్రమపడ్డారు అంటున్నారు అన్నమయ్య. జీవులందరూ అభేదమైతే ఒకరు గురువు ఒకరు శిష్యుడు యెందుకయ్యారు? ఇద్దరికీ అభేదమంటే యెంత అర్థంలేని వాదన అది? ఆత్మలో సోహం (నీవేనేను) అనే భావననే సరియైనదైతే మునులు చేసే

దేవపూజలు చెల్లుతాయా చెప్పండి. శ్రీ వేంకటేశుని దాస్యము అనే ముక్తి మార్గము లేదని బిగిసిపోతే, భూమిఅంతా రాక్షసమతమే రాటుతేలుతుంది. దైవారాధనయే వుండదు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

సారె సారె (ప్రతిసారి) వడి (శీఘ్రంగా కోరుకునే) ముక్తి (మోక్షము) లేనే లేదంటూ వేదాంత శ్రవణము (వేదవేదాంగముల అధ్యయనం) వెట్టి చాకిరీ కోసం చేశారా? మోక్షాన్ని వారు పొంది యుండకపోతే వేదపఠనం దేనికి?

ఒక్కసారి ఆలోచించండి జీవులన్నీ ఒక్కటే వాటికి భేదము లేదన్నదే నిజమైతే పుట్టినవాళ్ళల్లో ఒక్కడే గురువు యెందుకు అవుతున్నాడు? తక్కిన వారంతా ఆతని శిష్యులెందుకు అవుతున్నారు? భేదముందంటేనే వారి పుట్టుక ఒక్కటికాదని అర్థం. సొరిది (వరుసగా) ఆత్మలో సోహం భావన (అదే నేను అంటే ఆత్మే నేను) అనే భావన వుంటే మునులు చేసే దేవతా పూజలు చెల్లనే చెల్లవు కదా!

పరమాత్మ లీలా విభూతి (వైభవము) మిథ్య అయినట్లయితే, ఇంతమంది లోకంలో యజ్ఞయాగాది కర్మకాండ జరుపుతారా? వాటిలో పస యేముంటుంది? కర్మఫలమే లేకపోతే జన్మలే వుండవు కదా! మరణాల తరువాత ఇక ప్రాణులు పుట్టనే కూడదు. ఇక ఆచారాలు వాటిని నిష్ఠతో పాటించడం యెందుకు? మంచి జన్మకోరేవారే మంచి పనులు చేస్తారు. ఊరకే ఒంటికి శ్రమెందుకు?

బ్రహ్మ నిరాకారమైనా, సాకారమే. యత్ భావం తత్ భవతి. అందుకే పరమాత్మ ప్రస్తుతిలో పురుషసూక్తం మనమంతా చదువుతున్నాం. లేకపోతే నిరాకారుని గొలుచుట యెట్లు? శ్రీవేంకటేశ్వరుని దాస్యమును మరచి, బిగిసితే (నరులు భీష్మించుకొంటే) రాక్షసులు సటలాడుకొంటూ (మాయామయులై) తమ మతాన్ని వ్యాపింపజేస్తారు.

పద్యవివరణ:

తే.గీ॥ **వడిగ ముక్తి లేదంటాను వాదమేల?**
విమల వేదాంత శ్రవణమ్మువెట్టి కొరకె?
విడచి శ్రీపతి దాస్యమున్ బిగిసియున్న
రాక్షస మతంబు సటిలాడు రాటుదేలి.

సంఖ్య: IV/195 రాగం : శుద్ధవసంతం
కీర్తన : కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో

శుద్ధవసంతం

92 కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో
అటు నా వశముగాదు హరి నీచేఁగాని ॥పల్లవి॥

పాపము నెరుఁగుదు బంధము నెరుఁగుదు
మాపుదాఁకా నివి నేను మానలేఁ గాని
కోపము దుర్గుణ మని కొంతగొంత యెరుఁగుదు
తీపుల యాసలఁబడి తిప్ప లేఁ గాని ॥కట॥

చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి
యీతల నాకు వెరపు యించుక లేదు
గాతల నా మనసెల్లఁ గల్పించిన ట్లవును
చేతనైనా చెప్పినట్టు సేయలేఁ గాని ॥కట॥

నా వంకఁ గడమగాఁక నా గురుఁడు తొల్లె నన్ను
శ్రీవేంకటేశుఁడ నీ చేతి కిచ్చెను
దైవ మొక్కఁడవే నీ దాసానుదాసుఁడ నైతి
యే విధులు నే నెరఁగ నిటు నిన్నే కాని ॥కట॥

ఉపోద్ఘాతము:

ఈ జన్మమీద రోసిన అన్నమయ్య వేదన జెందుతున్నారు. అయ్యయ్యో! యీ ప్రాణికి మోక్షమెట్లా కలుగుతుందో కదా! ఓ హరీ! ఇక నాకు శక్తి లేదు. నావల్ల కాదు. నీవే దిక్కు. నీచేగాక ఇకనెవరి వల్లా కాదు తండ్రీ! ఏది పాపమో నాకు తెలియును. కానీ పాపాలు చేస్తూనే వున్నాను. ఈ సంబంధబాంధవ్యాలు ఎలా వచ్చి పోతున్నాయో యెరుగుదును అయినా చీకటి పడేదాకా వాటిని వదలను. కొంత కొంత జ్ఞానంవల్ల కోపము దుర్గుణమని యెరుగుదును కానీ తీపి ఆశలు తీరక కోపం దానంతటదే వస్తోంది. అది నా వశంలో వుండటం లేదు.నాతో ఈ భూమిలో పుట్టినవారి దుఃఖం చూసినా నాకు భయం

కలుగటం లేదు. నేనేం చేస్తున్నాను.నా మతికి తోచింది చేస్తున్నా. ఇక పాపపుణ్యాలు రాక మానుతాయా? మరి దారేమిటి?

తాత్పర్య వివరణ:

కటకటా! (అయ్యయ్యో!) ఈ ప్రాణి గతిగనుట (కడతేరుట లేక, మోక్షప్రాప్తి నొందుట) యెన్నడో (యెప్పుడోమరి). ఓ శ్రీహరీ నావశముగాదు (ఇక నావల్ల కాదు). నీచేగాని (నీవల్లనే కావాలి).

ప్రభూ! నేను మరీ అంత అయోమయంగాడిని కాదు. నాకూ పాపమంటే యేమిటో తెలుసును. బంధము అని దేనినంటారో తెలుసును. కానీ మాపుదాకా (పొద్దస్తమానమూ) నేను వాటిని పట్టుకొనే వ్రేలాడుతున్నాను. కొంత కొంత జ్ఞానం వుండటం వల్ల కోపము తగని దుర్గుణమని యెరుగుదును. కానీ తీపిఆశలు తీరక తిప్పలేగాక (చీకాకులు కలిగి) కోపము దానంతటదే వస్తోంది.

దేవా! నా చుట్టూ యెన్నో దుఃఖాలు పొందుతున్న వారిని చూస్తున్నాను. ఎంతోమంది పుడుతున్నారు.నిరర్థకమైన వారి పుట్టుకలు చూస్తూనే వున్నాను. అయినా నా పుట్టుకలో లోపాలునాకు తెలియటం లేదు. నా మనస్సుకు యెట్లా తోస్తే అట్లా చేస్తున్నాను. కానీ ఇంకొకరు మంచి చెప్పినా, నా మతికి యెక్కడంలేదు. ఇంత అస్తవ్యస్తంగా వున్నది నా పరిస్థితి. ఇక దారి యేమిటి?

చివరికి నావల్లగాక నా గురువుని శరణని తొల్లె (ఆదిలోనే) ఆశ్రయించాను. ఆయన దయాళువు. ఆయన శ్రీవేంకటేశ్వరుని చేతికి నన్ను ఒప్పగించారు. నాకు నీవొక్కడవే దైవమని అన్యులు వద్దని నీకు దాసానుదాసుడనైతిని. నాకుఇంకే పద్ధతులూ తెలియవు ఇటునిన్ను తప్ప అన్యులను సేవించను. నీ చిత్తము నా ప్రాప్తము.

పద్యవివరణ:

ఉ॥ **పాపమునేనెరుంగనిక బంధమెరుంగను మాననైతినే**
తీపివి ఆశలన్నియవి తీరక కోపము రేగి లేపుగా ఏపుగ
ఏపుగ క్రుందు జన్మలను యేనుతలంచను భీతిజెందనే
ఓపికపోయినా గురుని ఒద్దకు జేరితి ఇచ్చె శ్రీహరిన్.

సంఖ్య: II/305 రాగం : ముఖారి
కీర్తన : ఇటునిను దెలియగ నెంతటివారము

ముఖారి

93 ఇటు నినుఁ దెలియఁగ నెంతటివారము
తటుకున నాసలఁ దగులుటగాక ॥పల్లవి॥

నానామూర్తులు నగధర నీరూపు
యే నెలవుల ని న్నెటువలెఁ దలఁచుట
పూని నీ భావము పొందుగాఁ జెప్పఁగా
వీనులు చల్లఁగా వినుటే కాక ॥ఇటు॥

పెక్కునామములు బిరుదు లనంతము
లెక్కడ గొలదిగనెన్నెని పొగడుట
యిక్కువసేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుట గాక ॥ఇటు॥

వేవేలు గలవు నీ విహారభూములు
యే విధమున నెందెందని తిరుగుట
శ్రీవేంకటేశా నీ శృంగార మెల్లను
సేవించి ముదమునఁ జెలఁగుటగాక ॥ఇటు॥

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! ఈ, నీ నానామూర్తులుగా కనుపించే లీలా వినోదం అర్థం కావాలన్నా వివిధరకములుగా వీనుల విందుచేసే నీ పలుకుల భావము అవగతం చేసికోవాలన్నా, అనేకవిధములుగా నీ అనంతమైన బిరుదులను లెక్కించి పొగడాలన్నా నీసన్నుతిలో ఒకదాని తరువాత ఇంకొక నామము పలుకవలెనన్నా నీవు తిరుగాడిన ఈ విహారభూముల్లో నేనూ తిరుగాడాలన్నా, కనులారా నయనానందకరమైన నీ శృంగారవైభవం

దర్శించాలన్నా ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను సేవించుటలో ముదమున జెలగవలయును. అప్పుడే సాధ్యము. అటుగాక అది జరిగేపనికాదు. నిన్ను తెలియుటకు మేమేంతవారమయ్యా? అని అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! ఇటునిను దెలియగ (ఈ నీ నానామూర్తులుగా కనుపించే లీలా వినోదము, అర్థం కావాలన్నా) యెంతటివారము? మాకు చేతనైనదేముంది, తటుకున (ఆలోచన లేకుండా) ఆశల పాశంలో దగులుటగాక మరొకటుందా?

ఓ గోవర్ధనధరా! ప్రాణుల రూపములన్నియు నీవే కదా! మరి నిన్ను యెచ్చోటనే రూపములో నిన్ను తలచను (స్మరించమన్నావు?) నీ భావమెట్టిదో జ్ఞానులు బోధిస్తే మా వీనులకు చల్లదనము కలుగునట్లు మేము ఆకర్ణించుటే కాక ఇంకొకటియానందము కలిగించగలదా?

శ్రీహరి సహస్రనామ స్తోత్రప్రియుడు. ఆయన బిరుదులు (సామర్థ్య ప్రశంశలు) అనంతములు (లెక్కింపలేనివి). వీటిని కొలదిగ తక్కువచేసి సంక్షిప్తముగా ఆ శ్రీహరిని పొగడుట యెట్లు? ఈ నామములన్నిటినీ స్తోత్రము చేసేవారు ఒకే వరుసలో ఒకే రాగభావయుక్తముగా ఒక నామము ననుసరించి ఇంకొకటి వచ్చేటట్లు యెలా చదువగలుగుతున్నారు? ఆ మేధ నీవిచ్చినదే.

ఓ సర్వేశ్వరా! నీవు ప్రీతితో విహరించే విహారస్థలములు వేవేలు (పలువిధములుగానుండును.) నీవు యే రూపములో యెందు తిరుగుతుంటావో యెవ్వరు చెప్పగలరు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీ శృంగార లీలావైభవాన్ని ఆకళింపుజేసికోవాలంటే అంతకన్నా నిన్ను ముదమున సేవించుట వుంటుందా?

పద్యవివరణ:

కం॥ **నగధర! నీరూపంబులు**
అగపడు నానా విధాల అది తెలియుటయా!
తెగవడని ఆసద్రెళ్ళెడి
వగపుల చీకాకు బడెడి బడుగులము హరీ!

సంఖ్య: XV/5 రాగం : సాళంగనాట
కీర్తన : ఎక్కడి పురాకృతము యేమి సేసీని

సాళంగనాట

94 ఎక్కడి పురాకృతము యేమి సేసీని
యెక్కడా బలువు నీబం ట్లెట్లుండినాఁ జెల్లును ॥పల్లవి॥

నీవల్లఁ బుట్టెను బ్రహ్మ నీవు సేసినదే మాయ
భావించి నీకుక్షిలోనే బ్రహ్మాండాలూ
కావింప నీ వేలికపు కమ్మనినట్టేఁ బనులు
దైవమా యిది యెఱిఁగి నీ దాసుఁడ నే నైతిని ॥ఎక్కడి॥

భూమి నీదేవులు నీవు పుట్టించిన దమృతము
శ్రీమంతుఁడ విన్నిటా నీసేసిన ట్టవును
యేమిటివాఁడు యముఁడు యెక్కడి మృత్యువు మరి
సామజవరద మీ శరణుచొచ్చితిని ॥ఎక్కడి॥

ఏడఁజూచినా నీ దాసు లెక్కడాఁ జెడుట లేదు
యీడులేదు శ్రీవేంకటేశ నీకును
యేడవిధి యేడస్వర్గ మెక్కడిది నరకము
జాడతో నీముద్ర నా భుజముల ధరించితి ॥ఎక్కడి॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య చెప్పిన చక్కటి అధ్యాత్మ కీర్తననాలకించి తరించండి. ఓ శ్రీవేంకటేశ్వరా! మిగతావారి సంగతి నాకెందుకు గాని నీ బంట్లకు మాత్రం వాళ్ళ పురాకృత కర్మఫలం గూర్చిన దిగులే అనవసరం. అది వారినేమీ చేయలేదు. బలమైన నీ దాసులు యెట్లావున్నా చెల్లుతుంది స్వామీ! వారికొచ్చిన భయమేమీ లేదు. నీవు వసుంధర భూదేవీవల్లభుడవు. అమృతము నీ సృష్టియే. అందువల్ల నీవుంటే మృత్యుభీతి యెక్కడిది? స్వర్గము, నరకము, విధిలీల వంటి

చింతలు మాకెందుకు? నా రెండు భుజములపై నీ ముద్రలు దాల్చాను నాకు కీడు యెలా జరుగుతుంది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! ఎక్కడి, పురాకృతకర్మలు (సంచిత, ప్రారబ్ధ కర్మలు). అవి నీ దాసులను యేమిసేసీని? (ఏమి చేయగలవు? ఎక్కడా బలువు నీ బంట్లు (ఎక్కడైనా సమర్థులైన నీ దాసులు) ఎట్లా వున్నా చెల్లుతుంది.

నీ సృష్టి కార్యక్రమ నిర్వహణకు నీవు నియమించుకొన్న వారే నీ పుత్రుడు బ్రహ్మ, నీపుత్రిక మాయ. ఈ అండపిండ బ్రహ్మాండమంతా అనంతుడవైన నీకుక్షి (పొట్ట)లో నెలకొని వున్నది. ఈ ప్రపంచంలో పనులన్నీ నీవు కమ్మనినట్లే (నీ ఇష్టప్రకారమే) అవుతాయి. ఎందుకంటే సమస్తమునకు నీవే ఏలికవు. ఈ నిజం గ్రహించిన మీదట ఓ దైవమా! నేను నీ దాసుడనైపోయాను.

ప్రభూ! భూమి (భూదేవి) నీదేవుల (నీదేవేరి). అమృతము నీవల్ల పుట్టినదే. నీవు శ్రీమంతుడవు (శ్రీపతివి). అన్నిచోట్లా నీవు చెప్పినట్లే చెల్లుబాటవుతుంది. నిన్ను కాదనగలవాడా యముడు. మృత్యువు నిన్ను ధిక్కరించి రాగలదా? ఇవన్నీ తెలిసికొన్న నేను నీ దాసానుదాసుడనైనాను ఓ కరిరాజ సంరక్షకా! నన్ను కావుమయ్యా! అని నీ శరణుచొచ్చితిని.

ఆ తరువాత తిరుమల చేరుకొన్నాను. ఇక్కడికి వచ్చి చూద్దునుకదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఏడజూచినా నీ దాసులు యెన్నడూ చెడిపోయినదే లేదు. వారికి యీడు లేదు (వయోపరిమితి వుండదు). నీవు పిలిచినప్పుడు నీదగ్గరకు రావటం, అంతే. విధిప్రాతలు, స్వర్గ నరకములు, వారికి సంబంధంలేని విషయాలు. నేనూ అంతే ఎందుకంటే మేము భుజములపై నీ ముద్రలు ధరించి యున్నాము.

పద్యవివరణ:

తే.గీ॥ **భూమి నీదేవి, విశ్వమే తమరి రచన,**
మృత్యుభీతియా నీవుండ సత్యవచన!
స్వర్గ నరకాలు, విధిలీల వంతయేల?
నీదుముద్రలు దాల్చిన నేదికీడు?

సంఖ్య: IV/483 రాగం : గౌళ
కీర్తన : తలచరో జనులు యీతని పుణ్యనామములు

గౌళ

95 తలఁచరో జనులు యీతని పుణ్యనామములు
సులభముననే సర్వశుభములు గలుగు ॥పల్లవి॥

హనుమంతుఁడు వాయుజుఁ డంజనాతనయుఁడు
వనధిలంఘనశీలవైభవుఁడు
దనుజాంతకుఁడు సంజీవనీశైలసాధకుఁడు
ఘనుఁడు కలశాపుర (కాంత?) హనుమంతుఁడు ॥తలఁచ॥

లంకాసాధకుఁడు లక్ష్మణప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవసచివుఁడు
పొంకపు రామునిబంటు భూమిజసంతోషదూత
తెంకినే కలశాపుర దేవహనుమంతుఁడు ॥తలఁచ॥

చటులార్జునసఖుఁడు జాతరూపవర్ణుఁడు
ఇటమీఁద బ్రహ్మపట్టమేలేటివాఁడు
నటన శ్రీవేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపురప్రాంత హనుమంతుఁడు ॥తలఁచ॥

ఉపోద్ఘాతము:

కలశాపుర హనుమంతునిపై అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తనను ఆస్వాదించండి. ఓ జనులారా! ఈ కలశాపురహనుమంతుని పుణ్య నామములను తలుచుకోండి అని ప్రబోధిస్తున్నారు. ఈయన సులభంగా సర్వశుభములను కలిగిస్తాడని అంటున్నారు. తరువాత కీర్తనలో ఆయన ప్రస్తుతి వున్నది. ఈయన లక్ష్మణునికే యుద్ధనీతిని ప్రబోధించాడట. ఈయన చటులార్జున సఖుడట, అంటే, చలించిపోయిన అర్జునుడు కృష్ణుని గీతాబోధతో జ్ఞానియైన పార్థుని సఖుడట ఈ హనుమంతుడు. ఈ కలశాపుర

హనుమంతుడు జాతరూపవర్ణుడట. అంటే బంగారు రంగు శరీరకాంతితో శోభిల్లెడివాడు అని అర్థం. వచ్చేమన్వంతరములో ఈయన బ్రహ్మపదవి నలంకరించి సృష్టి కార్యక్రమం నిర్వహిస్తాడట ఈ హనుమంతుడు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! యీతని (ఈ కలశాపుర హనుమంతుని) పుణ్యనామములను తలచరో (స్మరించండి). ఈయన అతి సులభంగా సర్వశుభములను కలిగిస్తాడు.

ఈ హనుమంతుడు వాయుజుడు (పవన సుతుడు). అంజనీదేవి సుపుత్రుడు, ఈయనే, ఈయన వనధిని (సముద్రమును) దుమికిన గొప్ప ధైర్యము కలిగిన ఘనుడు. ఈయనకు దనుజులను మర్దించుట అంటే చాలా ప్రీతి. అర్ధరాత్రి పయనించి సంజీవని పర్వతాన్ని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించి తెచ్చాడు ఈ హనుమంతుడు. ఈ కలశాపురకాంతనేలేడి హనుమంతుడు ఘన కీర్తిమంతుడు. ఘటనాఘటన సమర్థుడు కార్యదీక్షాదక్షుడు.

ఈ హనుమంతుడు లంకకు పోయి సీతను కని ఆపై లంకానగరమును దగ్ధము చేసి లంకను సాధించినాడు. లక్ష్మణునకు ద్వంద్వ యుద్ధములోని కిటుకులను ప్రబోధించినాడు. సుగ్రీవుడు ప్రతివానరుడు వాలి గూఢచారి అని నమ్మి శంకతో వుండేవాడు. అట్టి సుగ్రీవుడు శంకలేక నమ్మిన సచివుడు (మంత్రి) ఈ హనుమంతుడు. ఈయన పొంకముగల శ్రీరాముని నమ్మినబంటు. సీతకు సంతోషము కలిగించినవాడు. తెంకిన (వాసస్థానము అయిన కలశాపురదేవుడు) ఈ హనుమంతుడు.

ఈ హనుమంతుడు చటులార్జున సఖుడు (విశ్వరూపం చూసి చకితుడైన పార్థుని మిత్రుడు). జాతరూపవర్ణుడు (బంగారు శరీర ఛాయ గలవాడు). రాబోవు మన్వంతరములో బ్రహ్మపదవినలంకరించి సృష్టికర్త అవుతాడు. ఈయన నాట్యప్రియుడైన శ్రీవేంకటేశ్వరుని నమ్మినబంటు. ఈతడు పట్టుదలగల కలశాపురదాపునుండు హనుమంతుడు.

పద్యవివరణ:

చం॥ **తలచరొ యీమహామహుని, ధన్యుడు పొందిన పుణ్యనామముల్.**
సులభము వీనిగొల్చుటయు సొంపుగ గల్గు శుభంబులన్నియున్
వెలసెను వాయునందనుడు వీధుల యీ కలశాపురంబునన్
కొలిచెను వేంకటేశ్వరుని కూరిమి బంటయి, బ్రహ్మనాబుడున్.

సంఖ్య: II/145 రాగం : రామక్రియ
కీర్తన : ఏలమమ్ము గాసిసేసే రింకా మీరు

రామక్రియ

96 ఏలమమ్ము గాసిసేసే రింకా మీరు
కాలముతో నిలిచెను కైవల్యపదవి ॥పల్లవి॥

పాపములు హరినామపఠనచేఁ బాపుకొంటి
కైపుగఁ జిత్రగుప్తుఁడా కవిలె గట్టు
కోపులఁ బుణ్యము లెల్ల గోవిందుని కిచ్చితిమి
పూఁపలస్వర్గముత్రోవ భుజవేయరో ॥ఏల॥

ఆతుమలో నజ్ఞాన మాచార్యుఁడే పాపె
ఆతల జన్మాలవాకి లటు మయ్యరో
చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడ నైతి
జాతియధర్మములాల సంబంధము విడరో ॥ఏల॥

పరమాత్ముచింతచేత బదుకు నిశ్చయ మాయె
ధరఁ గైవసముగావో తగు చిత్తమా
యిరవైన శ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము
పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు ॥ఏల॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో అన్నమయ్య తమకు కైవల్యపదము దక్కిందనీ అది తాత్కాలికమైన కైవల్యం కాదనీ కాలముతో నిలిచి, భూత భవిష్యద్వర్తమాన కాలములలో తమను అలరించే కైవల్యపదము దక్కిందని నమ్మకంగా చెబుతున్నారు. అందుకని ఇంకా మీరు మమ్ముయేల శ్రమపెట్టెదరు మాదారిన మమ్ము వదిలేయండి అంటున్నారు. తన చిత్తము పరమాత్మ చింతతో బ్రతుక నిశ్చయించుకొన్నదని కాబట్టి చిత్తమునకు ఇంకొకదారిలేదనీ తనకు స్వాధీనము కమ్మని తెగవేసి చెబుతున్నారు. మమ్మల్ని శ్రీవేంకటేశ్వరుడే స్వయంగా ఏలుకొంటానంటుంటే ఇంకా మాకు పరదేవతలతో పనేమిటి అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ పాపకర్మమా! ఓ అజ్ఞానమా! మేము హరినామ సంస్మరణచేత పునీతులమయ్యాము. హరిదాస్యముతో జీవన్ముక్తి పొందాము. మాజోలి మీకెందుకు? ఏల ఇంకా మమ్ము గాసిసేసేరు (శ్రమపెడుతున్నారు)? మాకు కైవల్యపదము దక్కినది. స్వర్గప్రాప్తివలె ఇది తాత్కాలికమైనది కాదు. కాలముతో నిలిచినది.

ఓ పాపములారా! శ్రీహరి నామపఠనముచేత నేను నా పాపములనెల్ల బాపుకొంటి (నిర్మూలించుకొన్నాను). చిత్రగుప్తునివద్ద నీ పాపపుణ్యముల చిట్టా పుస్తకము లెక్కింపులు లేక కవిలెగట్టు (పాతబడిపోయింది.) నా పుణ్యమంతా గోవిందునికి అర్పించితిని. పూపల స్వర్గము (నిస్సారమైన స్వర్గమునకు) బుజవేయరో (సున్నా చుట్టండయ్యా!)

ఓ అజ్ఞానమా! నీవు చిరకాలం నుంచి మా ఆత్మలో తిష్టవేసికొని కూచున్నావు. కాని నేడు మా ఆచార్యుని కృప మాకు కలిగింది. ఆయన మా అజ్ఞానమునంతా బాపినారు (వదలించినారు). ఇకనైనా మా జన్మాలవాకిళ్ళు గట్టిగా మూసి వేయండి. మేమిక వాటిలో ప్రవేశించము. ఎందుకంటే హరిదాస్యము స్వీకరించిన మేము జీన్ముక్తిని పొందాము. వంశపారంపర్యంగా అలవడిన అధర్మవర్తనమా మేము ముక్తులము మీకు మాకు ఏ సంబంధమూ లేదు. ఇక మాదారిన మమ్ము వదలివేయండి.

వినండి. మా గురించి మరొక్కసారి చెబుతున్నాను. మేము మా శేష జీవితమంతా పరమాత్మ చింతలో గడపవలెనని నిశ్చయించుకొంటిమి. ఓ చిత్తమా! ఇక నీ ఆటలు సాగవు. ఇక మాకు కైవసము గావో (స్వాధీనం కాలవలసిందే). ఎందుకో తెలుసా? ఇరవైన (సుస్థిరుడైన) శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా మమ్ము యేలుకొంటున్నాడు. ఇప్పుడు చెప్పండి మాకు చిల్లర కోరికలతో పనేమిటి? అవి తీర్చటానికి చిల్లరదేవుళ్ళతో మాకేల? మాదైవం ఆ ఏడుకొండలవాడే.

పద్యవివరణ:

కం॥ **ఏలమముగాసి బెడుదురు**
కాలముతో నిలిచి కలిగె కైవల్యమిదే
విలువగు హరిదాస్యముతో
తొలగెను పాపాలు ముక్తి త్రోవను కంటిన్.

సంఖ్య: IV/400 రాగం : తెలుగుగాంబోది
కీర్తన : తెగగోయుటకు హరి దివ్యనామకీర్తనము

తెలుగుగాంబోది

97 తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము
వెగటునాయుధ మిది విడువకుమీ మనసా ॥పల్లవి॥

భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి
యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే
తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని
కవగూడఁ దవిలెను కామపాశములు ॥తెగ॥

పమ్మి లోకపురుణానుబంధపు జీవికి
యిమ్ముల సంసారబంధా లివియుఁ గొన్నే
కమ్మరఁ బుణ్యపాపకలుషబంధాలు గొన్ని
సమ్మతించ భోగములే సకలబంధములు ॥తెగ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె
భావించి కొలిచిన పాయును మాయలన్ని
దేవుఁ డితని నమ్మిన తీరుఁబో దుఃఖములు ॥తెగ॥

ఉపోద్ఘాతము:

భవపాశములను తెగవేసి కోసేయవలెనంటే మార్గమేమిటి? లేకపోతే ఏమవుతుంది? కర్మపాశము తగులుకొంటుంది. అటుపై ఆశాపాశము కట్టిపడవేస్తుంది. ఆ తరువాత కామపాశము బిగించి ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంది. ఇందులో ఏ పాశమునకు కట్టువడ్డా జీవితాంతం విచారించవలసివుంటుంది అంటున్నారు అన్నమయ్య. ఇందుకు అత్యంత సులభమైన మార్గము హరిదివ్యనామకీర్తనము. ఆ సంకీర్తనము గొప్ప ఆయుధము. దాన్ని యెన్నడూ విడువరాదని హితబోధ చేస్తున్నారు. శ్రీ వేంకటేశ్వరుడు తన భక్తుల చిత్తములలోనే నెలకొనివుంటాడు. జీవుడు

ఆయననే ఆశ్రయించి పాయకవుంటాడు. అయితే ఆ భావన వున్నంతవరకు మాయ జీవుణ్ణి ఏమీచేయలేదు. ఒకసారి దేవుడికి ఈ జీవునిపై నమ్మకం కుదరగానే వాడిదుఃఖం పటాపంచలైపోతుంది.

తాత్పర్య వివరణ:

భవపాశమువల్ల కలిగే బంధాలను, తెగగోయుటకు (తెగనరకుటకు) ఒక్కటే చక్కని ఉపాయమున్నది. అదియే శ్రీహరి దివ్యనామకీర్తనము. ఇది భవబంధాలను తెంపు వెగటు నాయుధము (చీల్చి చెండాడెడి ఆయుధము). ఓ మనసా దీనిని యెన్నడూ విడువకుమీ (విడనాడవద్దు).

అసలే దేహికి భవపాశము (జన్మబంధము) చేత పట్టుబడవలసి వస్తున్నది. ఇవి చాలనట్లు వీడికి కర్మపాశములు కొన్ని జత అవుతాయి. ఆపై వేరొక కొన్ని ఆశాపాశములు వాటికి గట్టిగా చుట్టుకొంటాయి. వీటన్నిటికంటే మహమ్మారి ఇంకొకటి వున్నది. అదే కామపాశము. యౌవనం వచ్చిన దగ్గరనుంచి చచ్చే దాకా అది మనిషిని విడిచిపెట్టదు. మరి ఇన్ని పాశాలలో తగులుకొన్న జీవికి గతేమిటి?

పమ్మి (అతిశయించి) లోకములోని ఋణానుబంధాలతో కట్టువడిన జీవికి, ఇమ్ముల (విరివియైన) సంసార బంధాలు కొన్ని తగులుకొంటాయి. సరే వీటికి జతగా పాపపుణ్యాచరణములో కొన్ని కలుషముతో కూడిన బంధాలు వెన్నంటుతాయి. అయితే అందరమూ జాగ్రత్తగా గమనించవలసిన సత్యమేమంటే ఈ భోగములవల్ల కలిగేప్రయోజనం శూన్యము. అంతేకాక సకల బంధములు ఆ భోగాసక్తి వలననే కలుగుతున్నాయి.

శ్రీ వేంకటేశ్వరుడు యెక్కడో వైకుంఠంలో లేడు. ఆయన మన చిత్తములోనే వున్నాడు. జీవుడు వేరెక్కడనో వుండడు. ఆ స్వామిలోనే ఆయన అధీనంలో వుంటాడు. ఆయనను యెన్నడూ పాయడు (వదలడు). అట్లా భావించి శ్రీవేంకటేశుని కొలిచిన మాయ నిన్ను సత్వరమే పాయును (వదలును). ఈ దేవుని నమ్మిన ఇక దుఃఖములన్నీ తీరుతాయిపో.

పద్యవివరణ:

కం॥ **హరి దివ్యనామ కీర్తన**
నరుకుచు తెగగోయు భవము నా బంధములన్
దొరికిన ఆయుధమును ఇక
మరువకునెన్నడును శంకమానుము మనసా!

సంఖ్య: XV/85 రాగం : సామంతం
కీర్తన : పలుయోనులందు పుట్టి భ్రమసితిని

సామంతం

98 పలుయోనులందు పుట్టి భ్రమసితిని
అలర నే నేజాతి ననుకొందునయ్యా ॥పల్లవి॥

వెనకజన్మముల నా వేడుకైన కాఁపురాల
యెనయు సతులు సుతు లెంద రెందరో
మునుకొని యీ జన్మమునఁ గొంద రున్నారు
మనసున నెవ్వరి మా వారందు నయ్యా ॥పలు॥

ఆదికాలమున నుండి ఆయాదేహాలు మోచి
ఆ దెస యేమేలు నా సొమ్మని వుంటినో
నాదించి యిప్పుడు గొన్ని నావియనుచు నున్నాఁడ
యేది సతమని వుందు యెఱిఁగించ వయ్యా ॥పలు॥

అన్నిటా నా బాముచూచి అంతలో శ్రీవేంకటేశ
యెన్నరాని విజ్ఞాన మిచ్చితి విట్టె
పన్నిన నా మునుపటి పాట్లెల్లా నెంచుకొంటె
నన్నుఁజూచి నాలోనే నవ్వువచ్చీ నయ్యా ॥పలు॥

ఉపోద్ఘాతము:

అన్నమాచార్యులవారి ప్రథమ పుత్రుడు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు చెప్పిన అధ్యాత్మకీర్తన నాస్వాదించండి. మన పురాకృత కర్మమూలంగా జన్మలు కలుగుతుంటాయి. జన్మతోపాటే బంధుత్వాలు, వాటితో అనుబంధాలు వాటితో లంపటములు కలుగుతాయి. జీవనోపాధికి యేదో ఒక వృత్తిని చేపట్టినందువల్ల మరి కొన్ని లంపటములు తప్పవు. సతీసుతులవల్ల మరికొన్ని కొత్త బంధాలు తప్పవు. ఇవన్నీ చివరికి దుఃఖహేతువే అవుతాయి. ఇట్లా ఒక దేహం తరువాత ఇంకొకటి ధరించీ ధరించి ప్రతిసారీ అదే శాశ్వతమనే భ్రమలో వుంటాను. ఓ వేంకటేశ్వరా కొన్నాళ్ళకి నాపై కరుణతో నాకు

జ్ఞానము నిచ్చావు. అంతకుమునుపు నేను పొందిన పీకులాట తలచుకొంటే విరగబడి నవ్వాలనిపిస్తోంది.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! నేనింతకాలమూ పలు యోనులందు (అనేక మాతృగర్భములలో చొచ్చి) ఆ పుట్టుకే నిత్యమని భ్రమసితిని (భ్రమలో వుంటిని). మరి జన్మకొక్క జాతిలో పుట్టాను కదా! ఇప్పుడు నేనే జాతి వాడనంటే యేమి అనుకొందును?

వెనక జన్మలలో నాకు వేడుక కలిగించిన కాపురాలు యెన్నో కలిగినవి. వాటివల్ల ఆయాజన్మలలో సతులు సుతులు యెందరెందరో కుదిరినారు. ఈ జన్మలో కొందరు నాతో సహజీవనం చేస్తూ వున్నారు. మరి ఇంతమందిలో నా మనసున యెవ్వరిని నావారని భావించనయ్యా! అంతా ఎప్పటికప్పుడు మారిపోయేవారే కదా!

అనాదిగా ఆయా శరీరములు ధరించినప్పుడు ఆ శరీరభ్రమతోనే వున్నాను. దానివల్ల ఏమేలు నా సొమ్మయిందో నాకే తెలియుటలేదు. ఈ దేహానికి సంబంధించిన ఇప్పటివైభవములు నావి అని అనుకొంటున్నాను. ఇందులో నాది అనుకోటానికి ఏది శాశ్వతముగా వుంటుంది? నా బుద్ధికి తట్టడంలేదు. కాస్త విడమరచి చెప్పవయ్యా!

అమిత దయాళువైన శ్రీవేంకటేశ్వరుడు నా బాములన్నీ చూచి (నా అగచాట్లన్నిటినీ గమనించి), కరుణించి నాకు తెక్కించలేని విజ్ఞాన సంపదనిచ్చి ఒక జ్ఞానిని చేశాడు. ఓ ఇందిరారమణా! తొలి జన్మలలో అజ్ఞాన నిశీధిలో యెన్నాళ్ళున్నానో నాకే తెలియదు. మునుపటి ఆ అజ్ఞానంలో యెన్ని పాట్లుబడ్డానో నీకే తెలుసు. ఆ పాట్లని తలచుకొని నా అజ్ఞానానికి నేనే నవ్వుకొంటుంటాను. నవ్వు ఆగదు.

పద్యవివరణ:

చం॥ **భ్రమసితి పుట్టుకొందితిని పమ్మి అనేకములైన యోనులన్**
అమరుచు జాతి యేదలయిన అందు రవంతయు బేధముండునా
కొమరులు యెందరోవలచు కొవ్వలు లెందరొ జన్మజన్మకున్
విమలుడ జ్ఞానమిచ్చితివి వేంకటనాయక ధన్యుడైతిబో!

సంఖ్య: I/499 రాగం : మలహరి
కీర్తన : ఎట్లయినా జేయుము ఇక నీ చిత్తము

మలహరి

99 ఎట్టయినాఁ జేయుము యిఁక నీ చిత్తము
కిట్టిన నీ సంకీర్తన పరుఁడ ॥పల్లవి॥

కొందరు జ్ఞానులు కొందరు భక్తులు
కొదరు వైరాగ్య కోవిదులు
యిందరిలో నే నెవ్వఁడఁగా నిదె
సందడి హరి నీ శరణాగతుఁడ ॥ఎట్ట॥

జపితలు గొందరు శాస్త్రులు గొందరు
ప్రపత్తిఁ గొందరు బలువులు
వుపమించఁగ ని న్నొకఁడాఁగా నిందు
కపురుల నీ డింగరీఁడ నేను ॥ఎట్ట॥

ఆచార్య పురుషులు అవ్వలఁ గొందరు
యేచిన సమయులై యేర్పడిరి
కాచేటి శ్రీవేంకటపతి నే నైతే
తాచి నీ దాసుల దాసుఁడను ॥ఎట్ట॥

ఉపోద్ఘాతము:

"అన్నధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" ప్రభూ! నన్ను నీటముంచినా పాలముంచినా నీ చిత్తము నా భాగ్యము. ఎట్టయినా జేయుము నేను కాదనను. అసలు నేను యెంతటివాడనయ్యా? నేను కిట్టిన (నీకు సన్నిహితుడనైన) నీ సంకీర్తనాపరుడను. అంతకంటే నా విశిష్టత యేమీలేదు, అంటున్నారు అన్నమయ్య. నిన్ను ఆశ్రయించిన వారిలో కొందరు జ్ఞానులు, కొందరు భక్తులు కొందరు వైరాగ్యకోవిదులు

వున్నారు. నేను మాత్రం వీరిలో యెవ్వరినీ కాను. నేను కేవలం నీ శరణాగతుడను. ఇంతే కాక కొందరు నీ జపితులు కొందరు శాస్త్రకారులు, కొందరు శూరులు కూడా వున్నారు. నేను కేవలం నీ డింగరీడు అనదగ్గవాడను. అమిత దయాళువైన మా ఆచార్యులవారు ఓ వేంకటేశ్వరా! నీ దాసులు నేనో? వారి దాసులదాసులకు దాసుడను.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ చిత్తము (నీ ఇష్టము). ఎట్టయినా జేయుము. నేనెంతవాడనయ్యా? కిట్టిన (నీకు చేరువయైన) నీ సంకీర్తనాకారుడను.

నీ ఆశ్రితులు యెందరెందరోవున్నారు. వారిలో కొందరు జ్ఞానస్వరూపులు. కొందరు భక్త శిఖామణులు. ఇంకొందరు వైరాగ్యనిష్ఠాతులు ఉన్నారు. వారందరూ నీకు ఇష్టులే. నీ ప్రీతిపాత్రులేవారంతా. ఇందరిలో నేను ఎవ్వరినీకాను ప్రభూ! నేను నీ శరణాగతిని పొందిన నీ భక్తుడను. ఏదో నాకు తోచినట్లుగా నీ సంకీర్తనలతో సందడి చేస్తుంటాను.

నీ దయను కాంక్షించేవారిలో కొందరు శాస్త్రకోవిదులుంటారు. కొందరు జపతపములు నిర్వహించే తపశ్శీలురు వుంటారు. కొందరు ప్రపత్తితో (భక్తిపరవశులైన శరణాగతులున్నారు). సోదాహరణంగా చెప్పుటకు నేను ఇందరిలో ఒక్కడినీ గాను. నేను కపురుల (తొట్రుబాట్ల) గల నీ'డింగరీడును' (సేవకుడను).

సరే! అవతల ఇంకొందరు ఆచార్యపురుషులు నిన్ను సేవించుచుందురు. మరి కొందరు మంచి ముహూర్తమైనదేదో కానిదేదో తెలిసిన దైవజ్ఞులై వుంటారు. వారందరినీ కాచేది ఎవరు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవేనయ్యా. నామటుకు నేనైతే నీ దాసులకు దాసుడను. అంతే.

పద్యవివరణ:

ఉ॥ **కొందరు భక్తులున్ ధరణి గొందరు జ్ఞాన విరాగులైరిబో**
కొందరు శాస్త్రకోవిదులు కొందరు దిట్టలుబో ప్రపత్తిలో
ఇందరిలోన నెవ్వడను యేను తలంచెదగాను యెవ్వడన్
కొందరు శ్రీహరీ! గురులు కొల్చెదవారికి దాసదాసుడన్.

సంఖ్య: IV/18 రాగం : దేసాళం
కీర్తన : నీకు నీవే వలసితే నీవు నన్ను గాచుకొమ్ము

దేసాళం

100 నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్ము
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్యా ॥పల్లవి॥

పాపమూల మటు తొల్లి పైకొన్నదేహము
పాపము సేయకుండితే పక్కున నేల మాను
కోపమే కూడుగఁ గుడిచిన యీ బుద్ధి
కోపము విడువమంటే గుణమేల మాను ॥నీకు॥

అప్పు దీర్చ వచ్చినట్టి ఆయపు సంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను
తప్పు వేయవచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు
తప్పులు వేయక సారెఁ దా మేల మాను ॥నీకు॥

పంచమహాపాతకాలే పట్టుకొనేయింద్రియాలు
పంచమహాపాతకాలే(ల) బారిఁ దోయ కేల మాను
అంచెల శ్రీవేంకటేశ ఆత్మలో నీవుండఁగాను
పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను ॥నీకు॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! కావాలనుకొంటే నీవే నన్ను రక్షించుకో నాకు వశముగానివన్నీ నన్ను వదలిపెట్టేశాయి, అంటున్నారు అన్నమయ్య. దేహధారణ జరుగుటకు కారణమే పాప పుణ్యాలు అనుభవించటానికి దేహికి శరీరం అవసరమవుటయే. మరి పాపమే చేయని వానికి దేహమెందుకు? ఇంతకాలమూ కోపమే ఆహారంగా బ్రతికిన బుద్ధి ఒక్కసారిగా కోపము

విడనాడమంటే అది జరిగే పనేనా? ఈ సంసారంలో జన్మకలిగిందే అప్పు తీర్చుకోవటం కోసం అప్పు తీర్చుకోవద్దంటే సంసారం ఊరక వుంటుందా? నా మీద తప్పువేద్దామని వచ్చి ఈ కర్మబంధము నన్ను తగులుకొన్నది. ఇక నా మీద తప్పులు వేయకుండా అదెందుకు వూరకుంటుంది, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ వేంకటేశ్వరా! వలసితే (కావలనంటే) నీకు నీవే నన్ను గాచుకొమ్ము (రక్షించుకో). నాకు వసగానివెల్ల (వశముగానివన్నీ) నన్ను బాసీనయ్య (నన్ను వదలిపెట్టి పోయినవయ్యా!)

నేను నాపైన ధరించిన ఈ దేహము పాపము మూలంగానే నాపాలబడ్డది. ఇక మరి ఈ దేహము పాపము చేయకుండా యేవిధంగా వుంటుంది? ఈ నా బుద్ధివున్నదే, ఇది కోపమే తన ఆహారంగా మెక్కుతుంటుంది. ఇక ఇన్నాళ్ళకు ఇది తగదు నీకోపగుణం మానుకో అంటే అది మానివేస్తుందా?

ఈ సంసారంలో మనమంతా అప్పు తీర్చటానికే పుట్టాము. ఇక్కడికి రాంగానే కర్మబంధాలు తగులుకొన్నాయి. ఇక కర్మబంధాలవల్ల నాకు తగులములైనవారు నన్ను తప్పు పట్టక ఎట్లా వదలిబెడతారు?

నా పంచేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక మరియు చర్మము)వున్నాయే వాటి పనే నాకు పంచమహాపాతకములను అంటగట్టటము. అవి నన్ను వాటిబారినపడవేయకుండా యేలవదలును? ఓ శ్రీవేంకటేశ్వరా, నీవు అంచెలంచలుగా నా ఆత్మలో సుస్థిరుడవైనావు. ఇకపైన నీ కరుణ నాకు కాక మరెవ్వరికి కలుగుతుంది? ఒకసారి నీ దయ కలిగిందంటే ఈ జన్మలో పాపపుణ్యాలు ఇవన్నీ నన్నేం చేస్తాయి?

పద్యవివరణ:

తే.గీ॥ **పాపమూలమే దేహమ్ము పాపమేల–**
మానివేయును? వలసితే బూని నన్ను
కాచుకొమ్ము, నన్ బాసెను కాకవశము
విడిసిఆత్మనీవుంటివి వేంకటేశ!

మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



హరి నీమయమే అంతాను

(సంపుటి - III)

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

హరి నీమయమే అంతాను

(సంపుటి - III)

మొదటి ప్రచురణ

అక్టోబరు 2013

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

అంకితము

దశరథుని కంటివెలుగు అయిన

శ్రీరామచంద్ర మూర్తికి..

నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై
సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో
కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

హరి నీమయమే అంతాను

(సంపుటి - III)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు ఉపోద్ఘాతము మరియు తాత్పర్య వివరణ

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అంచితపుణ్యులకైతేహరి	83
2.	అందుకేమి దోసమా అట్టేకానీ	179
3.	అతడే సకల వ్యాపకుడు	145
4.	అన్నిటికీ కారణము హరి	13
5.	అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి	43
6.	అన్నిచోట్లా బరమాత్మ నీవు	119
7.	అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు	65
8.	అరిదిసేతలే చేసి	123
9.	అలమేలుమంగవు నీవన్నిటా నేర్పరివి	115
10.	ఆకాశమడ్డమా అవ్వలయు	135
11.	ఆటదానికి పతితో అంతచెల్లునా	27
12.	ఇంతమేటి వాడవై యింకా యేలజరసేవు	55
13.	ఇంతకాకుగలదా	103
14.	ఇంతటి దైవమవుమాకు	79
15.	ఇంతసేయగా నీకిందుయేమి	195

16.	ఇంతసేసెబో దైవమింతలోనె	131
17.	ఇందులో మొదటి కర్తయెవ్వడు	25
18.	ఇదియే సులభంబిందరికే	169
19.	ఇదెవీడె కంటి మమ్మయేతుల	29
20.	ఇద్దరి గూర్చిన వారు ఇప్పుడు	47
21.	ఇద్దరిమీజగడాలు యింక	93
22.	ఇప్పుడిదె కొలువున్నాడు యింతున దానను	51
23.	ఇన్నేసి వాపులతో యిందరి	99
24.	ఎంత భక్తవత్సలుడ విటువంటి	67
25.	ఎంతవొద్దులేదు నీకు	147
26.	ఎక్కగా రాగారాగా యిందాక	101
27.	ఎటువంటి వలపులో యిద్దరికి	121
28.	ఎన్నడు గలుగు మరి యీ భాగ్యము	21
29.	ఎగ్గో తప్పో యెఱగనిది	31
30.	ఎప్పుడును నీకేలోనే	175
31.	ఎవ్వరివాడో యెఱగరాదు	91
32.	ఏమమ్మా యశోద యిదే నీ బిడ్డ	129
33.	ఏమందుమిందుకు నెఱిగినదే	177
34.	ఏమయ్యా రమణుడ ఇంత సేతురా	15
35.	ఏమని చెప్పగవచ్చు నిదివో నీసుద్దులు	59
36.	ఏమిటికి వేడుకొనేవింత	39
37.	ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము	05

38.	ఏలవచ్చీ ఏలపోయీ	149
39.	కంటిని మన్ననలెల్లా	81
40.	కంటేసులభమిది, కానకుంటే	87
41.	కడనుండి చూచేనీకు	33
42.	కానవచ్చీ గానరాదు కమలాక్ష నీమాయ	37
43.	కొమ్మల జవ్వనములు కోరి	139
44.	కొలువులోపలనున్న కొమ్మలెల్ల	115
45.	కైవసపుదానగాని కపటిగాను	23
46.	కొంచెమును ఘనము గనుగొన	153
47.	గరిమతో వెరపేల కమలాక్ష	181
48.	గొల్లెతల నింతసేసీ	111
49.	ఘనుడతడే మముగాచుగాక	199
50.	చంచలమతులకు సాత్విక	95
51.	చదివి బ్రతుకరో సర్వజనులు	157
52.	చిత్తగించురమణుడు	171
53.	చెలినేడు తానేమి సేయనమ్మా	143
54.	చేకొంటి నిహమే చేరిన పరమని	45
55.	చూడ బిన్నవాడుగాని జూటుదనాలు	85
56.	జగములెల్లా నీదేరె జయవెట్టి	189
57.	తాపలేక మేడలెక్కదలచేము	17
58.	తార బ్రహ్మమంత్రము తానై	61
59.	తొడిబడసందుసుడి దొంగాడి	155

60.	దిక్కుల నీకతలెల్ల దెలిసెగాక	03
61.	దైవమా పరదైవమా	137
62.	దైవము పుట్టించినట్టితన	97
63.	దొరకునా ఇతని కృప	141
64.	నయగారిసటకాడ నారసింహా	187
65.	నాటిసుద్దులే వింటిమి నేటిసుద్దులు	35
66.	నిక్కమమ్మ యశోద నియ్యాన	191
67.	నిలువుల మేడలో నిలచున్నోడిదె	151
68.	నీచేతిలో వారము నీవారము	53
69.	నీవెప్పుడూ ఘనుడవే	159
70.	నేరుపరి నీవైతే నెలతైతే	73
71.	నేరుపరివౌదువమ్మ నిజము	167
72.	పతిమీదటి మోహము	133
73.	పరుసము సోకియుబ్రతుకవద్దా	109
74.	పారిరి దానవులెల్లా పంచబంగాళమై	193
75.	పొలతి దేహమే భూమండలమై	183
76.	మందులు మాకులు మరియేల	197
77.	బిగిసి యాపె నీకు బెట్టని కోట	11
78.	మన జేతికి జిక్కె మగువలాల	63
79.	మాటిమాటికి జూచి	105
80.	మాయపుదనుజులు	113
81.	మీఱరాదు దూరరాదు మేనవానవాన	19

82.	మొక్కెదమిదివో మూడు మూర్తులును	49
83.	మొదలివేల్పు మామొరయాలించవె	165
84.	మొఱవెట్టెదము మీకు మొగసాల	71
85.	మేలెల్ల నొక్కటే మించుతీలూ	161
86.	రాజపు నీకెదురేది	125
87.	వట్టి బాతిపడినీపై వలపులు	89
88.	వలపు గొరబుసేయవద్దే	107
89.	వాకిలిగాచేయట్టి వనితలము	77
90.	వింటిరటె చెలులాల వేడుక	69
91.	విన్నవించితిమి నీకు వేడుక వేళ	07
92.	వివేకమెఱగని వెఱ్ఱులము	01
93.	వీదుల వీదుల నేగె విట్ఠలేశా	163
94.	వెడలె వెడలెనదె వీధుల వీధుల	57
95.	శరణమాతనికే సర్వభావాల	173
96.	సంసారినైన నాకు సహజమే	09
97.	సుఖమును దుఃఖమును జోడు కోడెలు	75
98.	సేవింతురా ఇతని చెలగి	127
99.	హరి నారాయణ కృష్ణ అదివో	41
100.	హరి నీవాడనేకానా ఆదికాలమున	185
101.	హరిమంగళము	202

ప్రార్థన

కం॥ శ్రీహరి అంతా నీమయ-
మాహా! నా తరమెనీదు అతిశయ మెఱుగనే
ఈహల నీ భక్తులకే
ఊహించని రీతి నీదు ఉనికి తెలియుగా

మ॥ జలజాతాక్షుడు సాధువంద్యుడు మహాసామ్రాజ్యదక్షుండు శ్రీ-
లలనామానసమందిరాంగణమునన్ రంజిల్లు వైకుంఠుడున్
కొలువై సప్తగిరీంద్రుడుండ మదిలో కోరేది వేరుండునా
విలువేమున్నది భోగభాగ్య తతికిన్ వేంకన్న సిద్ధైనచో.

తరళము॥
వనజనాభుడు పత్నికోసమువంతనొందుచు కోనలన్
కనులగాంచక పుట్టలోపల కాలమంతయు బుచ్చెరా
తనకుపాలిడు కామధేనువు తానుగాచెను గొల్లనం-
ధునిగ జేసెను నెత్తురోడ్చుచు తూలి శ్రీగిరిజేరెరా.

సీ॥ అన్నమాచార్యులు వెన్నుని అలరించె
శృంగారకీర్తనజెప్పి చెప్పి
మోక్షప్రాప్తికి బాట మురవైరియని జెప్పి
భక్తి కీర్తన లెన్నో పాడిపాడి
వైరాగ్యకీర్తన పరమాత్మమెచ్చగా
విరివిగా మార్మోగె వీధివీధి
జానపదులుమెచ్చు జానుతెలుగులోన
జాజరపాడెను సారె సారె

తే.గీ॥ నారసింహుడు, రఘుపతి, నగధరుండు,
చెన్నకేశుడు, వేంకట శిఖరపతియె,
రంగుదేలిన అలమేలుమంగ విభుడె
వివరణను వ్రాయు నాజన్మ విలువపెరిగె.

ఉ॥ నాటకమందరున్ నటులె నాకగుపాత్రను నేను దాల్చితిన్
దీటుగపుత్రుడైతిపుడు తీరిచి తొల్లిటి నేను యెవ్వడన్
ఏటికి చింతయే మృగము యేజలజంతువొయే ఖగంబునో
కాటికి పోకతప్పదవకాశము లేదుట కాదనన్ హరీ!

చ॥ ఘనమగు మాయ కమ్మి కనుగానరు లోకులుమంచి చెడ్డలన్
వినయము వందనంబులను వెన్నుని భక్తిని వేంకటేశునికి
చెనకరుపొట్ట నింపుటకు చేతులజాతుల జాతురు 'దేహి' అందురున్
వనితలు బిడ్డలంచు పలు బాధలు సైతురు జన్మజన్మకున్.

కం॥ మురిపించు మల్లెలందము
పరిమళ సంపెంగలిదు సువాసనలెసగన్
పురిగాన శృంగారంబిక
హరి వేంకటవల్లభుండు అతివల గూడున్

ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా స్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము "హరి నీ మయమే అంతాను" గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను "గూగుల్" నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. "geetadeeksha" అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. "భగవద్గీత" అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక "హరి నీమయమే అంతాను" అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen.

Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు. గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి

ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు, సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇకపోతే, ఈ సంపుటి- II గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అన్నమయ్య చేపట్టిన శృంగార వర్ణన అంతా అమలినమే. పైకి స్త్రీ, పురుష రతి సమాగమం వలె అనిపించినా అది ఆత్మ - పరమాత్మల ఐక్యమే. మనోవాక్కాయ కర్మలా పరమాత్మలో ఐక్యమవ్వాలని ఆత్మపడే తహతహలే, మనకి స్త్రీ పురుష విరహవేదనవలె అనిపిస్తున్నది. కాని అన్నమాచార్యులంతటి యోగికి రతిలీలా వర్ణన, ఆత్మ, పరమాత్మల అనుసంధానమే.

అందుచేత ఈ కీర్తనలను శృంగారకీర్తనలని కాక మధురభక్తి కీర్తనలు లేక మధుర కీర్తనలు అని వ్యవహరిద్దాం. అన్నమయ్యవలె నాకు పరమాత్మ తత్త్వం అవగతమే కాలేదు. నేను ఒక జగన్నాయకుని సేవలో తుదిశ్వాస విడువాలనే ఆశతో జీవిస్తున్న అసంఖ్యాకులలో అతి సామాన్యుడను. అన్నమయ్యకు కైవల్యాన్ని ప్రసాదించిన ఆ శృంగారరాయడు నాబోటివానిని కనీసం ఎవడురా వీడు అని చూస్తాడా అంటే... అవుననే అర్హతే లేదు. అయినా నా కర్తవ్యం నేను నెరవేరుస్తాను. ఫలితాన్ని ఆశించను. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరితో గూడి రతులదేలి భారతావనిని నిరంతరం శాంతి సౌభాగ్యాలతో వుంచుగాక!

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అధవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.



సంఖ్య: I/429 రాగం : బౌళి
కీర్తన : వివేక మెఱగని వెఱ్ఱులముగాక నేము

బౌళి

1 వివేకమెఱఁగని వెఱ్ఱులముగాక నేము
దివారాత్రము నిన్నే ద్రిష్టించవలదా ॥పల్లవి॥

మానిషోడ నమ్మి వొక్కమనుజుఁడు వార్ధి దాఁటి
నానార్థములుఁ గూర్చి నటించఁగాను
దానవారికృప నమ్మి తగినసంసారవార్ధి-
లోను చొచ్చి దాఁటి గెల్వ లోకులకుఁ జెల్లదా ॥వివే॥

జుట్టెఁడుయినుము నమ్మి సొరిది నొక్కఁడు భూమిఁ
గట్టిడిభయములెల్లఁ గడవఁగాను
నెట్టనఁ జక్రాయుధునినిజనామ మిటు నమ్మి
తట్టి భవభయములు తరి దాఁటఁజెల్లదా ॥వివే॥

వేలెఁడుదీపము నమ్మి వెడఁగుఁజీఁకటిఁ బాసి
పోలిమి నొక్కనరుఁడు పొదలఁగాను
ఆలించి శ్రీవేంకటేశుఁ డాత్మలో వెలుఁగఁగాను
మేలి మాతనిఁ గొలిచి మెరయంగఁవలదా ॥వివే॥ 429

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! మేము వివేకములేని వెఱ్ఱివాళ్ళము. సరే. మరి మేము యేమిచెయ్యాలి? రేయింబవళ్ళు నీపై దృష్టిసారించి నీ ధ్యాసలో గడపవద్దా? చెక్కఓడ నెక్కి మనిషి సముద్రాన్ని దాటి రకరకములుగా ధనము సంపాదిస్తున్నాడు. దానవారి శ్రీహరికృప వుంటే సంసారవార్ధి తరించటం యేమి కష్టం చెప్పండి. ఇనుమును నమ్మి ఇనప ఓడలో

భూమియెల్లలు కనుక్కుంటున్నాడే చక్రాయుధుడైన హరి నామము నమ్మి భవసాగరం దాటలేమా అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! మేము వివేకము (యుక్తాయుక్త విచక్షణ) నెరుగని వెఱ్ఱివాళ్ళము. కావున నేము (మేము) దివారాత్రములు (రేబవళ్ళూ) నిన్నే ద్రిష్టించ వలదా? (గమనిస్తూ వుండవలెను కదా!) అన్యముల ధ్యాస వదలిపెట్టవలెను కదా!

ఒక మనుష్యుడు మానిషోడ నమ్మి (చెక్కతో చేసిన ఓడను నమ్ముకొని) దానిలో నానార్థములు గూర్చి (అనేకరకములైన సంపదలు తీసికొని నటించగా (చాతుర్యముతో కూడిన ఆప్యాయత నటిస్తూ వాణిజ్యం జరుపుతాడు). కానీ వాడు సంసార సాగరాన్ని తరించటానికి మంచి నావయేమిటో తెలియక అందులో మునిపోతున్నాడు. దానవ వైరి అయిన శ్రీహరిని నమ్మి ఆ జలధిలో దూకితే తప్పక దాటి గెలుస్తాడు.

సొరిది (ఒక క్రమములో) ఒక్కడెవడో జుట్టెడు ఇనుమును (జానెడు ఇనుపలోహాన్ని) నమ్ముకొని దానితో వ్యాపారము చేద్దామని భయములెల్ల విడనాడి ప్రయాణించుటలేదా? ఎట్టయెదుటేనున్న చక్రపాణి శ్రీపతి నిజనామమును ఈవిధముగా నమ్ముకొంటే అంతకంటే భయావహమైన భవభయమును తొలగించి కడతేరిస్తే అది చెల్లదా? ఇక ఇవన్నీ యెందుకండీ!

దీపము యెంత పొడుగుంటుంది? మహా అయితే ఒక వేలెడు (వేలంతపొడుగు) ఉంటుంది. దాన్ని నమ్ముకొని మనిషి చీకట్లు దాటుకొని పొదలుతున్నాడుకదా! (అతిశయించుచున్నాడు కదా!) మనమొరలను ఆలకించి శ్రీవేంకటేశుడు మన ఆత్మలో ప్రకాశిస్తే, బంగారము వంటి ఆ స్వామిని కొలిచి మనమూ మెరిసిపోవద్దా?

పద్యవివరణ:

తే.గీ॥ **వెఱ్ఱులము నేము లేదు వివేకమైన**
నిన్ను దిష్టించవలెనుగా నిశిబవళ్ళు
ఆత్మనెలకొన్న శ్రీవేంకటాద్రి విభుడు
మేలిమాతని గొలుచుచు మెఱయవలదె.

సంఖ్య: XXI/419 రాగం : దేసాళం
కీర్తన : దిక్కుల నీకతలెల్లా దెలిసెగాక

దేసాళం

2 దిక్కుల నీకతలెల్లాఁ దెలిసెఁగాక
వెక్కసాన నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥పల్లవి॥

యితరులు పిలిచితే నెఁ(నెం?)తైనాఁ బలుకవు
సతిమాటకై తేను జవదాఁటవు
ప్రతినలాడుకోఁగా నీపలుకుల భ్రమయించి
వెతదీర నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥

సరస మెవ్వరాడినా సరకుఁ గొనవుగాని
తరుణి నవ్వినంతనే తమకించేవు
సరవులు దప్పఁగాని చలపట్టి నే నిన్ను
విరివిగా వలపించి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥

గొలువులో నెవ్వరున్నాఁ గూరిమిసేయవుగాని
కలికిఁ బొడగంటేనే కరఁగేవు
మెలఁగి శ్రీవేంకటేశ మీరఁగాని నిన్నుఁ గూడి
వెలయ సిగ్గులు మాన్పి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥ **419**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీకతలన్నీ దిక్కుల మారుమ్రోగుతున్నాయి. ఇవన్నీ నాకు తెలుసు కాని యేమి చెయ్యను నిన్ను నా వెంట వెంట తీసికొనిపోలేనుకదా అంటున్నది నాయిక. పారవశ్యంతో అన్నమయ్య ఆ నాయికలో పరకాయప్రవేశం చేసినట్లు కీర్తననాలపిస్తున్నారు. నీవు మాయగాడవు స్వామీ!ఇతరులు నిన్ను పిలిస్తే వారితో పల్లెత్తు మాటైనా పలుకవు. సతిమాటను యెన్నడు జవదాటనంటావు. ఎన్నో ఒట్లు

పెట్టుకొంటావు. నీ పలుకులతో యెన్నో రకాలుగా భ్రమలో ముంచుతావు. ఇన్ని వేషాలు వేసే నిన్ను నమ్మక యేమి చెయ్యను? నిన్ను నావెంటవెంటనైతే తిప్పుకోలేనుకదా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! నీ కథలన్నీ దిక్కులంతా మారుమ్రోగిపోతున్నాయి. వెక్కసాన (నా ఆధిక్యము చూపించుకోటానికి) నిన్ను నా వెంటవెంట (వెనుకబెట్టుకొని) తిప్పనా (తిప్పుకోమంటావా?) ఇదియెంత తగనిపని?

ఎంత నటిస్తావు స్వామీ! ఇతరులెవరైనా నిన్ను పిలిచినా వారితో పలుకవు. నీ భార్య మాట జవదాటనే దాటవు– నీవు ప్రతినలాడుకోగా (ఎన్నో ఒట్లుపెట్టుకుంటే) ఎంత భ్రమలోపడ్డాను! ఇవ్వాళ నీవు నాకాళ్ళబేరానికి వచ్చావని నిన్ను నా వెంట వెంట దిప్పనా (తిప్పుకోనా?)

ప్రభూ! యేమి నీనటనా విలాసము! నీతో ఎవరు సరసమాడినా లక్ష్యపెట్టనట్టే వుంటావు. నీ భార్య నిన్ను చూచి నవ్విందో లేదో మైమపరచిపోతావు. సరవులు దప్పగాని (ఒక క్రమము తప్పంగానే) చలపట్టి (మత్సరముతో) నేను నిన్ను నా దర్పము చూపించుటకు నావెంటవెంట త్రిప్పుకోనా? ఇది ఉచితమైన పనియేనా?

ఓ దేవా! నీవు కొలువుదీరియున్నపుడు రాచఠీవి ఆభిజాత్యము ప్రదర్శించుచూ ఎవ్వరినీ లెక్కచేయవు. నీ భార్యను చూడంగానే కరిగిపోయి సభవాయిదా వేసేస్తావు. ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయించిన నిన్ను గూడితే వెలయ (శోభతో) నీ సిగ్గులన్నీ మాన్పి నావెంట వెంట తిప్పుకోమంటావా?

పద్యవివరణ:

ఆ.వె॥ **తెలిసె నాకు నేడు దిక్కులు యెల్లెడన్**
వింటినీదు కతలు వెక్కసాన
నిన్ను వెంటవెంటనే తిప్పమందువా?
వెఱతు నేమిజేతు వేంకటేశ!

సంఖ్య: I/430 రాగం : గుండక్రియ
కీర్తన : ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము

గుండక్రియ

3 ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము
దీమపువిజ్ఞానమే దివ్వెత్తుఫలము ॥పల్లవి॥

పాపచింత మదిలోనఁ బారకుండా నిలిపితే
చేపట్టి దానములెల్లాఁ జేసినంతఫలము
కోపానలములోన కోరికలు వేల్చితేనే
యేపున యజ్ఞాలు సేసి యేచినంతఫలము ॥ఏమి॥

కనకముపై యాస కాదని పోదొబ్బితేనే
తనకు వేవేలు ఘోరతపములఫలము
వనితల మోహములవలఁ బడకుండితేనే
దినము గోటితీర్థాలు దిరిగినఫలము ॥ఏమి॥

శ్రీవేంకటేశ్వరుఁ జేరి కొలుచుటే
ధావతిలేనియట్టితనజన్మఫలము
భావించి యాచార్యపాదపద్మమూలమే
సావధానమున సర్వశాస్త్రార్థఫలము ॥ఏమి॥ **430**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య కాలంలో రాత్రిపూట దీపపుకాంతి ఎక్కువదూరం కనుపించాలని పొడుగాటి దీపస్తంభముమీద రాత్రి బాటసారులకోసం దీపమునుంచేవారు. దివ్వెత్తునవున్నది అంటే చాలా ఎత్తున ఉన్నతంగా వున్నదని అర్థం. జీవికి మోక్షము యెప్పుడు కలుగుతుందో ఆ తిరుమలేశునికి దక్క ఇంకెవరికి తెలుస్తుంది? మరి మోక్షం దొరకనివారు ఏ ఫలము పొందుతున్నారు? వారు దీమపు విజ్ఞానమును (నిబ్బరము కలిగించు భగవత్ జ్ఞానమును) తప్పక ఆ జీవుడు సాధిస్తాడు. అది రాబోయే జన్మలలో అతనికి

మోక్షప్రాప్తినిస్తుంది. అదే దివ్వెత్తు ఫలము (చాలా ఉన్నతమైన ఫలము) నిస్తుంది అంటున్నారు అన్నమయ్య. చివరికి జీవికి ఒక విశిష్టమైన జన్మ జన్మల ఫలమొకటి తప్పక దక్కుతుంది అదే శ్రీవేంకటేశ్వరునే కొలువవలెననే స్థిర చిత్తము.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! మీరు ఏమియు జేయనవసరము లేదు. చూస్తుండంగానే ఇంతలో మోక్షం దొరుకుతుంది. మరి అది దక్కనివారి జన్మ నిష్ప్రయోజనమా? ఎంతమాత్రమూ కాదు. వారికి దీమపు విజ్ఞానమే (నిబ్బరము కలిగించు భగవత్ జ్ఞానమే) దివ్వెత్తు ఫలము (ఉన్నతోన్నతమైనఫలము).

మనస్సులో పాపచింతన బారకుండా (పరుగులు పెట్టకుండా నిగ్రహించగలిగితే పూనుకొని అన్నిరకములైన దానములు చేసినంత ఫలము తప్పక కలుగుతుంది. ఎవరి క్రోధాగ్నిలో వారు తమ కోరికలను ఆహుతి చేయగలిగితే వరుసగా యజ్ఞాలు చేసినంత ఫలము సిద్ధిస్తుంది. తమాషా యేమిటంటే ఆ ఫలము యెలా కలుగుతుందో యెవ్వరికీ తెలియదు.

ఒకనికి బంగారముపై అత్యాశను నాకువద్దు అని పోదొబ్బితేనే (పొమ్మని త్రోసివేయగలిగితేనే) అనేకములైన ఘోరతపములనాచరించిన ఫలము దక్కుతుంది. వనితల మోహము అనే వలలో పడకుండా వుంటేనే ప్రతిదినము కోటి పుణ్యతీర్థాలలో పుణ్యస్నానమాచరించినంత విశిష్ట ఫలము దక్కుతుంది.

శ్రీవేంకటేశ్వరుని చేరుకొని ఆయనను కొలచుట అంత తేలికగా లభించే ఫలము కాదు. అది ధావతిలేనియట్టి (ఆయాసము లేకుండా) జీవికి కలిగే తన జన్మ జన్మల ఫలము. భావములో నిలుపుకొనిన ఆచార్యుల పాదపద్మముల మూలము చేకొంటే సావధానులై సర్వశాస్త్రములను అవపోసనబట్టిన ఫలము దక్కుతుంది.

పద్యవివరణ:

కం॥ **ఏమియు జేయగ వలదిక**
దీమపువిజ్ఞాన మదియె దివ్వెత్తుఫలం
కామించు మోక్షపదమగు
నీమముతో హరినిగొల్వ నిజజన్మఫలం.

సంఖ్య: XXI/133 రాగం : ఆహిరి
కీర్తన : విన్నవించితిమి నీకు వేడుకవేళ

ఆహిరి

4 విన్నవించితిమి నీకు వేడుకవేళ
కన్నెను నీవు దయగా చేటి వేళ ॥పల్లవి॥

మచ్చికలు దయివారె మనసెల్ల జైవారె
వచ్చె జవ్వనానకు వసంతవేళ
చొచ్చి నిన్నుఁ బాసి తాప సూర్యుఁడెండగాయఁగా
విచ్చనవిడిగాఁ దోఁ చె వేసగివేళ ॥విన్న॥

సిగ్గులు మొలవఁజొచ్చె చెమటలేరులు హెచ్చె
కగ్గులేక మించె వానకాలపువేళ
వెగ్గళించి సెలవుల వెన్నెలలు చూపట్టి (ట్టె?)
వొగ్గి శరత్కాలము వొదిగె నీవేళ ॥విన్న॥

తత్తరపుచలి పొంచె తలపోఁతమంచు మించె
యెత్తి యలమేల్మంగకు హేమంతవేళ
బత్తితో శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
చిత్తజుకాఁకలు దేరె సిసి (శిశి?)రవేళ ॥విన్న॥ **133**

ఉపోద్ఘాతము:

మధురాతిమధురమైన శృంగారకీర్తన నాస్వాదించండి. ఆరు ఋతువులవేళలలోనూ ఆ కన్నియను స్వామి ఎలా కరుణించాలో విన్నవించుకొంటున్నారు చెలులు. మురిపెముతో ఆలకిస్తున్నాడు శ్రీనివాసుడు. ప్రభూ! ఆ కన్నియను నీవు కాచే వేళయిందయ్యా! ఇది నీవు వేడుకలతో గడుపువేళ. అందుకనే నీకు ఆమె మొరను విన్నవించుకొంటున్నాము. ప్రభూ! ఇది వసంతవేళ. మచ్చికలు దయివారె (ఒకరిపై ఒకరికి చనువు అతిశయించినది) మనసంతా పులకించింది.

ఆమె యౌవనమునకు కూడా వసంత వేళ వచ్చేసింది. ఇక నీకు ఆమెను కరుణించక తప్పదు, అంటున్నారు. ఇలా ఆరు ఋతువులలోనూ స్వామికి ఆమె అవస్థలను విన్నవించుకొంటున్నారు, అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ తిరువేంకటేశ్వరా! నీకు ఈ వేడుకవేళ (సంతోషసమయమున) విన్నవించితిమి (విన్నపము జేసికొంటిమి). ఇదే నీవు ఆ కన్యామణిని దయజూచువేళ ఇంకా నిర్లక్ష్యము చేయుట తగదు ప్రభూ!

ప్రభూ! ఇది వసంతవేళ. మచ్చికలుదైవారినవి (చనువులు అతిశయించినవి) మనసెల్లా పులకరించినది. ఆమె యౌవనమునకు కూడా ఆమనివచ్చినది. నిన్ను విడచిన తాపమును తాళలేక సూర్యుడు విపరీతమైన ఎండలు కాయగా విచ్చలవిడిగా వేసంగి తనప్రతాపము చూపింది. అబ్బ ఏమి గ్రీష్మఋతువురా అని తపించింది లోకము.

ఇంతలో వర్ష ఋతువు వచ్చేసింది. యువతులకు చెమటలు ఏఱులై పారినవి. దాని ఫలితంగా మొలకలెత్తినవి సిగ్గులమొలకలే. అటువంటి వానాకాలము కగ్గులేక (ఏ లోపము లేక) అతిశయించినది. కొంచెము వానలు తగ్గుమొగం పట్టగానే శరదృతువు వచ్చిచేరినది. ఇది వెన్నెలమాసము. పండువెన్నెల కన్నులపండుగ చేస్తుంది. వెగ్గళించి (అతిశయించి) సెలవులవెన్నెల (మొలకవెన్నెలలు) కుదురుకొన్నవి.

ఇంతలో చలికాలము ముంచుకొచ్చేసింది. అంటే హేమంత ఋతువు వచ్చేసింది. ఆ చలితత్తర (త్వరపాటు) కలిగిస్తున్నది. ఆలోచనలలో కూడా మంచు కురిసి చల్లబడినవి. అలమేల్మంగమ్మ యెత్తి (ఆధిక్యముతో) మించినది. ఇక శ్రీవేంకటేశ్వరునికోసం ఎదురు చూచిన ఆమె అమిత బత్తితో (భక్తితో) ఆయనకు వశమైనది. ఓ దేవా! పైకొని నీవామెను కూడితివి. ఇక ఆ శిశిర ఋతువునందు మన్మథుడు తన వేడిమినంత చూపి తపింపజేస్తున్నాడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **విన్నవించితిమిగ వేడుకవేళలో**
కన్నె నీవు కరుణగాచువేళ
వేంకటేశ నీవు వెలది గూడితివిట్టె
శిశిరవేళ చెలరిగె చిత్తజుండు.

సంఖ్య: I/491 రాగం : గుజ్జరి
కీర్తన : సంసారినైన నాకు సహజమే

గుజ్జరి

5 సంసారినైన నాకు సహజమే
కంసారి నే నిందుకెల్లాఁ గాదని వగవను ॥పల్లవి॥

నరుఁడనైననాకు నానాసుఖదుఃఖములు
సరి ననుభవించేది సహజమే
హరిని శరణాగతులైన మీఁదఁ బరాభవ-
మరయ నిన్నంటునని అందుకే లోఁగేను ॥సంసా॥

పుట్టిననాకుఁ గర్మపు పొంగుకు లోనైనవాఁడ
జట్టిగాఁ గట్టువడుట సహజమే
యిట్టే నీవారికి మోక్షమిత్తునన్ననీమాట
పట్టు వోయినోయని పంకించే నే నిపుడు ॥సంసా॥

మాయకులోనైననాకు మత్తుఁడనై యిన్నాళ్లు
చాయకు రానిదెల్లా సహజమే
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
మోయరానినేను నీకు మోపని వీఁగేను ॥సంసా॥ 491

ఉపోద్ఘాతము:

దేవదేవా! జీవితంలో యెన్ని పరాభవాలు! యెన్ని సుఖదుఃఖాలు! ఎన్ని కర్మబంధాలు! నేను సంసారిని ప్రభూ! నాకివన్నీ అనునిత్యం సహజమే. ఇందుకు నేను ఏమాత్రమూ కాదని వగవను (విచారించను). నేనిన్నాళ్ళూ నీ మాయకులోనై మత్తులో వుండిపోయాను. మరిపైన చెప్పినవన్నీ నాకు అంతుపట్టక పోవటం సహజమే. ఆశ్చర్యమేమీ లేదు. ఇన్నాళ్ళకు నీకు

నాపై అనుగ్రహం కలిగి ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీవు యేలుకొన్నావు. నేనే ఇన్నాళ్ళూ నీకు మోయరాని భారాన్నేమోనని కొంచెం వెనకాడుతున్నాను. నీవు జగన్నాథుడవు నీకు ఒకరు భారమా?

తాత్పర్య వివరణ:

ఓ కంసారీ! సంసారినైన నాకు మానావమానాలు సహజమే. వాటిని త్రోసిరాజు అనటానికి వీలులేదు. నేనిందుకెల్లా (నేను దీనికంతా) కాదని (నాకు వద్దని) వగవను (వ్యాకులపడను).

నేను నరుడను. నాకు నానా సుఖదుఃఖములు కలుగుట సహజమే. వాటిని అనుభవించక తప్పదని నాకు తెలియును. హరిని శరణాగతి బొందినవానికి ఆపై పరాభవాగ్ని దహించదు. ఆ పరాభవము హరిని అంటుతుందేకాని ఆయన శరణాగతులని కాదు. అందుకే నేను లోగెదను (సంకోచించుచున్నాను). నామూలంగా నీవు, అవమానం జెందుట నాకు సమ్మతముగాదు.

పుట్టుకతోటే నాకు ఇష్టాయిష్టాలు కలిగి, కర్మపు పొంగులు (కర్మవశాత్తు కలిగే ఔన్నత్యములకు) లొంగిపోయాను. ఇట్లా జట్టిగా (సాటిగా) కట్టువడటం నాకు సహజమే. కానీ నీవు భగవద్గీతలో ఏమిజెప్పావు నీవారికి (నిన్నే దిక్కని ఆశ్రయించినవారికి) మోక్షమిత్తునని నీమాటగా జెప్పావు కదా! మరి నీమాటలలో పట్టుపోయినదా అని నేను నాతల పంకిస్తున్నాను (వంచుకొని భయపడుతున్నాను).

ఇన్నాళ్ళూ నీమాయకు లోనైన నాకు మత్తులో భ్రమకలిగి జ్ఞానం చాయకు (బయటకు) రాకపోవటం సహజమే. ఇటువంటి ఆపత్కాలంలో ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీవు ఏలుకొన్నావు. అయితే ఇంకా నా సందేహమేమంటే నేను నీకు మోయరాని మోతబరువునేమో తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **సంసారినైననాకివి**
కంసారీ! సహజమేలె కాదని వగవన్
పుంసామోహనరూపా!
సంసారముమోయరాని సతమతమయ్యా!

సంఖ్య: XXI/389 రాగం : సోమరాగం
కీర్తన : బిగిసి యాపె నీకు బెట్టనికోట

సోమరాగం

6 బిగిసి యాపె నీకుఁ బెట్టనికోట
యెగసక్కెలకు నీవు యేమిసేసుకొంటివి ॥పల్లవి॥

కోపగించుకోఁబోఁగా కొలిచి మొక్కవలసె
తీపులఁ దిట్టినందుకు దీవించవలసె
చూపుల జంకించఁగాను సూడుపెనఁగవలసె
యేపున నెంతకునెంత యేమిసేసుకొంటివి ॥బిగి॥

చేవట్టితియ్యఁగఁబోఁగా చెక్కులు నొక్కవలసె
చేవమీర నవ్వఁగాను సిగ్గువడవలసె
కావరించి పైకొనఁగా కైవశము గావలసె
యే(యీ?) విదాన నుండివుండి యేమిసేసుకొంటివి ॥బిగి॥

కాఁకలు సేయఁగబోఁగా గక్కునఁ గూడవలసె
పోఁకముడి యంటఁగాను భోగించవలసె
వేఁకపుశ్రీవేంకటేశ వెలఁదిఁ గలసి తిట్టె
యేఁకట నీయంత నీవు యేమిసేసుకొంటివి ॥బిగి॥ **389**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీనివాసా! ఆమె బిగుసుకొన్నది. బింకము చూపుచున్నది. ఆమె శ్రీదేవి కనుక నీకు పెట్టనికోటవంటి రక్షణయే. నీ ఐశ్వర్యమే ఆమె. మరి నేడు పరిహాసములకుబోయి యేమైనదో గమనించు. ఆమె అలిగి కోపగించుతుంటే నీఅంతటివాడుకూడా కొలిచి మొక్కవలసి వచ్చింది. తీపిగా తిట్టితే ఆమె సహించుటలేదు. వెంటనే ఆమెను మురిపించుటకు దీవించవలసి వచ్చింది. ఆమె చూపులతో నిన్ను బెదిరిస్తుంటే ఆమె వైరం తీర్చటానికి

పెనవేయవలసివచ్చింది. ఆమె నీకు సమవుజ్జీ. ఎంతసేసుకొంటివయ్యా వేంకటేశా అంటున్నారు శృంగారశాస్త్రకోవిదుడు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయా! వేంకటరాయా! బిగిసిపోయిన (బింకము చూపుతున్న) ఆమె చిరుకోపము ప్రదర్శిస్తున్నా నీకు పెట్టనికోట (తులలేని రక్షణ వంటిది). ఆమె శ్రీదేవి. నీ ఐశ్వర్యమే ఆమె. కానీ నీవు నేడు యెగసెక్కెలకు పోయి (పరిహాసములకుపోయి) ఏమిసేసుకొంటివయ్యా?

ఆమె రుసరుసలాడుతూ నిన్ను కోపగించుకొంటుంటే, ఆమెను కొలిచి మొక్కవలసివచ్చింది కదా! తీపుల (చిలిపిగా) తిట్టినందుకు ఆమెను ఓదార్చుటకు జగదేకపతివై దీవించి సేదదీర్చవలసివచ్చింది. ఆమె చూపులతో నిన్ను బెదరించినా ఆమె వైరం పోగొట్టుటకు నీవే పెనవేయవలసివచ్చింది. నేడు ఆమె నీవు ఎంతకు యెంతైనా సమవుజ్జీయే. ఏమి సేసుకొంటివయ్యా?

ప్రభూ! నీవు ఆమెను చేపట్టి (స్వీకరించి) దగ్గరకు తీసికొనబోతే ఆమెకు బుగ్గలు సిగ్గుతో యెరుపెక్కినవి. నీవు అనునయంగా ఆమె చెక్కిలినొక్కవలసివచ్చింది. నీవు నర్మగర్భంగా నవ్వగా ఆమె సిగ్గులు చిందించినది. నీవు ఆక్రమించగా నీకు కైవశం కావలసివచ్చింది. ఈ విధంగా ఆమెకు చేరువయై యేమిసేసుకొంటివి స్వామీ!

ఆమె నీపై కాకలు సేయగబోగా (చిర్రుబుర్రులాడుతుంటే) ఆమె కోపము చల్లార్చుటకు గక్కున (తటాలున) ఆమెను కూడ వలసి వచ్చును. ఆమెననునయించునీ చిలిపి పని అది. నీవామె చీరపోకముడిని సవరించి శృంగార రసాస్వాదనకు తెరదీసితివి. ఇక నీకు భోగించక యెట్లా తప్పుతుంది? ఓ వేకపు (వెక్కసమైన) శ్రీవేంకటేశ్వరా! నీవు వుపాయంతో వెలదిని ఇట్టే గూడితివి. నీఅంతట నీవు ఏమిచేసికొంటివయ్యా!

పద్యవివరణ:

ఆ.వె॥ **బిగిసి ఆమె నీకు పెట్టనికోటాయె**
ఆమెచెప్పినట్లె ఆడవలసె
యేమిసేసుకొంటి వెగసెక్కెములకీవు
వెలది ఇట్టె చేరె వేంకటేశ!

సంఖ్య: I/470 రాగం : దేసాళం
కీర్తన : అన్నిటికి కారణము హరియే ప్రపన్నులకు

దేసాళం

7 అన్నిటికిc గారణము హరియే ప్రపన్నులకు,
పన్నినలోకులకెల్ల ప్రకృతి కారణము ॥పల్లవి॥

తలcపు గారణము తత్వవేత్తలకును
చలము గారణము సంసారులకును
ఫలము గారణము పరమవేదాంతులకు
కలిమి గారణము కర్ములకును ॥అన్ని॥

తనయాత్మ గారణము తగినసుజ్ఞానులకు
తనువే కారణము తగ జంతువులకు
ఘనముక్తిగారణము కడగన్నవారికెల్లా
కనకమే కారణము కమ్మినబంధులకు ॥అన్ని॥

దేవుcడు గారణముతెలిసినవారికెల్లా
జీవుcడు గారణము చిల్లరమనుజులకు
దేవుcడు వేరే కాcడు దిక్కు శ్రీవేంకటేశుcడే
పావన మాతనికృప పరమకారణము ॥అన్ని॥ **470**

ఉపోద్ఘాతము:

అన్నిటికీ కారణము హరియేనని ప్రపన్నులు (శరణాగతులు) త్రికరణశుద్ధిగా నమ్ముతారు. కానీ అతితెలివిగల లోకులు సమస్త సృష్టికి ప్రకృతే కారణము అని నమ్మి చరించుతుంటారు, అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశ్వరుని మాయవలన భ్రమ కలుగుతుంది. అప్పుడు తమని తాము వివేకవంతలమనుకొనేవారు ప్రతిదానికీ ఒక కారణముంటుందని విశ్లేషిస్తుంటారు. ఆ తర్కమేమిటో వివరిస్తున్నారు అన్నమయ్య. మొదటి

ఉదాహరణ చూడండి, తత్వవేత్తలకు కారణమెవరు? వారి తలపే (వారి ఆలోచనలే) వారు తాత్వికులవటానికి కారణం అవునా? కాని కాదు అన్నిటికీ కారణము శ్రీహరియే సుమా!

తాత్పర్య వివరణ:

అన్నిటికి మూలకారణము శ్రీహరియే, ప్రపన్నులకు (హరి శరణాగతులకు) శ్రీహరిదక్క వేరొకటి కారణము అనిపించదు. కానీ పన్నిన (ఎత్తుకు పైయెత్తులు వేసే) లోకులకు దేవుడేలేడు. వారు అన్నిటికి ప్రకృతియే కారణము అని అంటారు.

తత్వవేత్తలు ఆలోచనాపరులగుటకు కారణము వారితలపులు (ఆలోచనలు). సంసారమునకు కారణము జీవుల చపలస్వభావము. పరమవేదాంతులు ఆవిర్భవించుటకు కారణము ఫలము (వారు ఆకాంక్షించే ముక్తిఫలము). కర్మిష్టులు (కర్మకాండ యందు మక్కువ గలవారికి) కలిమి కారణము వారికి ధనార్జనపైనగల విపరీతమైన మక్కువ.

సుజ్ఞానులు పెంపొందటానికి కారణము వారి ఆత్మ (ఆత్మజ్ఞానము). జంతువులకు కేవలం శరీర పోషణే. క్షుధ, నిద్ర, భయ, మైధునాలే వాటి ఆవశ్యకత.అందుకని అవి శరీరంకోసం జీవిస్తాయి. కడగన్న వారికి (తమకు అంతము సమీపించేదాకా దైవధ్యానంలో గడిపే వారికి) కారణము వారు కాంక్షించే ఘనముక్తి. కమ్మిన బంధులకు (ఇంటజేరి నీసంపద కరిగించే బంధువుల రాకకు) కారణము నీవద్దనున్న కనకము (బంగారము).

తెలిసినవారికెల్ల (జ్ఞానులందరూ అన్నిటి కారణము అని భావించేది దేవుడు (పరమాత్మ). చిల్లర మనుజులకు (అజ్ఞానులైన మానవులకు) కారణము వారిలో జ్ఞానాపేక్షలేని వారి జీవుడు. వేరే ఏ దేవుడూ లేడు. అందరికీ దిక్కు శ్రీవేంకటేశ్వరుడే. పావనమైన ఆ స్వామి కృపయే అన్నిటికీ మించిన కారణము.

పద్యవివరణ:

కం॥ **అన్నిటికి కారణము హరి**
పన్నినలోకములకెల్ల ప్రకృతే తానౌ
యెన్నిన కారణమీవేం-
కన్నయె శరణాగతులకు కారణము కదా!

సంఖ్య: XXI/445 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏమయ్య రమణుడ యింత సేతురటవయ్యా

శంకరాభరణం

8 ఏమయ్య రమణుఁడ యింతసేతురటవయ్యా
కామిని నూరడించి కలయఁగరాదా ॥పల్లవి॥

పడఁతి కధరమిచ్చి పలుసోఁకించినది
బడి బడి విందువెట్ట పగలాయ
వెడవెడఁగా నవ్వి వెంగెమాడినది
తొడికేదోమటి పాలఁ దోడనే వేఁడాయ ॥ఏమ॥

తరుణి దప్పకచూచి తలవంచినది
అరిది నమ్మించి తప్పినట్లాయ
సరస మాడియాడి సరుగన దాఁగినది
పొరిఁబొరి మధ్యాహ్నేనఁ బొద్దుగుంకినట్టాయ ॥ఏమ॥

మెలుఁత గాఁగిటఁ గూడి మేను మరచినది
నిలువునీడలలోన నివ్వెరగాయ
అలరి శ్రీవేంకటేశ ఆదరించినది
ఫలియించి పసిఁడిలోఁ బరిమళమాయ ॥ఏమ॥ 445

ఉపోద్ఘాతము:

ఈసరస శృంగార కీర్తనలో అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునితో చనువుగా ఏమంటున్నారో ఆలకించండి. ఏమయ్యా రమణుడా! ఎక్కడన్నా ఇంత చేస్తారటయ్యా? ఈ కామినిని చూడు, యెంత కలత జెందియున్నదో గమనించు. నీ హృదయం కరుగుట లేదా? కాస్త ఆమెను ఊరడించవచ్చును కదా! ఆపైన ఆమెను కలియకూడదా? ఆమె నీ ప్రాణేశ్వరి కదా!అంటున్నారు. ఇందులో కొన్ని సామెతలు అవి చెప్పిన

వైనము నిజంగా అద్భుతం. చివరిగా నా విన్నపమేమంటే కొండొకచో నా భావము కొండెక్కియుండవచ్చు. అందుకు క్షంతవ్యుడను.

తాత్పర్య వివరణ:

ఏమయ్యా రమణుడా! ఎంతసేతురటవయ్యా(ఇంత చేస్తారుటయ్యా?) కామినిని (నీ ప్రియురాలిని) ఊరడించి (ఉపశమింపజేసి) కలియగరాదా? (ఆమెను రతుల దేల్చరాదా?)

ఆ పడతికి నీమధురాధరమిచ్చావు. బాగబాగు. కానీ ఆమెకు విపరీతంగా కన్నీటిని కూడా ఇచ్చావు కదా! గొప్పగొప్ప విందు భోజనం పెట్టి భోజనం చేశాక ఎవరన్నా తీరికగా పగదీర్చుకొంటారా? ఇంతకీ ఆమె చేసిన నేరమేమిటి? నిన్నుజూచి బిగ్గరగా నవ్వి వ్యంగ్యముగా మాట్లాడినది. అంతేకదా! "ఒలికిపోయిన పాలు వెంటనే వేడయ్యేవి" అన్నాడట వెనకటికొకడు. ఆ పాలు ఎలాగో నేలపాలేకదా! అవెంతవేడెక్కితే ఏంలాభం?

ప్రభూ! ఆ తరుణి అప్పటిదాకా వదలక నిన్నే చూస్తుండినది. నీవు చటుక్కున ఆమెను చూడగానే వెంటనే సిగ్గుతో తలవంచుకున్నది. నీ ఉత్సాహం నీరుకారినట్టయింది. నమ్మించి మాట తప్పినట్లు అయింది. ఆమె నీతో సరసమాడి ఆడి పరుగున వెళ్ళి యెక్కడో దాగికొనినది.నీ ఉత్సాహము చల్లబారినది. మిట్టమధ్యాహ్నమే సందె చీకట్లు కమ్మి పొద్దుగుంకినట్లయింది. నీకు అంత నిరుత్సాహం కలిగినది.

ఆ మెలత (జవ్వని)నీ కౌగిలిలో కరగిపోయి మేను మరచినది (తన ఒంటిని తానే మరచి పోయినది). నిలువ నీడలలోన (చీకటిపడేవేళ) నివ్వెరగాయ (భయంతో జలదరించినది). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవామెపై జూపుతున్న ఈ ఆదరణ ఎట్లా వున్నదంటే బంగారానికి పరిమళమబ్బినదా! అని భావించినట్లయినది.

పద్యవివరణ:

చం॥ **రమణుడు ఇంతసేతురటరా! కలికిన్ ఇటుకాదనందురా?**
సమయముజూచి కూడ్చుకొని సందిట వేగమె కూడ వచ్చునే
తమకముతోటి మైమరచు తన్వికి నివ్వెరగాయజూడగా
అమలుడ వేంకటాధిపుడ అంటెను బంగరుకున్ సుగంధమే.

సంఖ్య: I/94 రాగం : లలిత
కీర్తన : తాపలేక మేడలెక్కదలచేము

లలిత

9 తాప లేక మేడ లెక్కఁదలఁచేము
యేపులేనిచిత్తముతో యీహీహీ నేము ॥పల్లవి॥

ఎఱుకమాలినబుద్ధి యె(నె?)వ్వరైనాఁ బతులంటా
తెఱఁగెఱఁగక వీధిఁ దిరిగేము
పఱచైన జవరాలు పరులెల్లా మగలంటా
వొఱపునిలిపిన ట్లోహోహో నేము ॥తాప॥

యిందరును హితులంటా యెందైనా సుఖమంటా
పొందలేనిబాధఁ బొరలేము
మందమతివాఁడు యెండమావులు చెరువులంటా
అందునిందుఁ దిరిగిన ట్లూహాహా నేము ॥తాప॥

మేటివేంకటేశుఁ బాసి మీఁదమీఁదఁ జవులంటా
నాటకపు తెరువుల నడిచేము
గూటిలో దవ్వులవాఁడు కొండలెల్ల నునుపంటా
యేటవెట్టి యేఁగిన ట్లీహీహీ నేము ॥తాప॥ **94**

ఉపోద్ఘాతము:

ఇది ఒక అద్భుతమైన అధ్యాత్మకీర్తన. అన్నమయ్య వాడిన ప్రక్రియలో ఈ ధ్వని అలంకారం బహు అరుదుగా కానవచ్చే ప్రక్రియ. 'ఈహీహీ' అని నవ్వుతున్నారు. ఓహోహో! అని తమ వెఱ్ఱి తనానికి తామే నవ్వుకుంటున్నారు. ఇది ఒక తమాషా ప్రయోగము. మా చిత్తము ఏపులేనిది దీని తాపమునకు ఓర్వలేక మేడలెక్కదలచేము. అంతటితో చిత్తము శాంతిస్తుందా ఈహీహీ.

ఎంతపిచ్చితనము? జ్ఞానంలేని బుద్ధి ఎవ్వరైనా మొగుళ్ళేనంటూ వీధుల వెంట దారితెన్నులేక తిరిగిందిట. పడచుజవరాలు పరులంతా నా మగళ్ళేనని తాపముచెందినట్లు లేదూ? ఓహోహో!

తాత్పర్య వివరణ:

ఓ నరులారా! ఈ మాచిత్తము (మనస్సు) వున్నదే, దీనికి ఏపులేనిది (మంచీచెడ్డాలేదు). ఇది నేడు తాపలేక (ఓర్వలేక) మేడలెక్కదలచేము. మేడలెక్కితే మనశ్శాంతి కలుగుతుందా? ఈహీహీ!!

జ్ఞానములేని బుద్ధి ఎవ్వరైనా నా మొగుడే అంటూ దారితెన్నూ లేకుండా వీధులవెంట తిరిగిందట. పడుచు జవరాలు పరాయివాళ్ళంతా నా మగళ్ళే అని తాపము చెందినట్లు లేదూ మేము ఓహోహో! అని నవ్వుకోక ఏమిచేస్తాము చెప్పండి.

ఈ మనిషి యెంత వెఱ్ఱివాడు. ఇందరునూ హితులంటా, యెక్కడున్నా నేను అనుభవిస్తున్నదే సుఖము అంటూ అంతూపొంతూ లేని బాధలలో బొరలేము (దొర్లేము). మందమతి అయినవాడు ఎండమావుల్ని చెఱువులని భ్రమతో తిరిగనట్లు లేదూ?వాడు అక్కడా ఇక్కడా వెతుకులాడితే తాగే నీళ్ళు దొరుకుతాయా? మేము ఎంత పిచ్చివాళ్ళము? ఓహోహో!!

మేటియైన శ్రీవేంకటేశుని వదలివైచి పైపైవన్నీ రుచికరమైనవి అని నటించే, మనుష్యులతో వాళ్ళ దారిలో తిరిగాము. దూరపు కొండలు నునుపు అన్నట్లు కొండలెక్కి తిరిగి శ్రమపడ్డట్లయింది. మేము ఎంత బుఱ్ఱలేనివాళ్ళము? ఈహీహీ!!

పద్యవివరణ:

తే.గీ॥ **తాపలేక మేడలనెక్కదలతుమింక**
ఏపులేని చిత్తంబిది హీహి హీహి
మేటివేంకటపతి బాసి మీదమీద
నాటకపు తెరవుల మేము నడుతుమయ్య!

సంఖ్య: XXI/458 రాగం : దేశి
కీర్తన : మీఱరాదు దూరరాదు మేనవానివలెనాయ

దేశి

10 మీఱరాదు దూరరాదు మేనవానివలెనాయ
ఆఱడి నీతోడిపొందు లగడాయ నిఁకను ॥పల్లవి॥

చేరి మాటలాడఁబోతే సెలవుల నవ్వు చిందీ
వూరకుంటే పెంజెమట లుమ్మగిలీని
యీరీతి ముందరనుయ్యి యెంచ వెనకఁ దగరు
యేరా నీతోడిపొందు యేమిసేతు నిఁకను ॥మీఱ॥

తప్పకచూడఁగఁబోతే తనువెల్లాఁ బులఁకించే
రెప్పలు మూసిన కాఁకరేఁగీని
విప్పకపట్టితే నుమ్మ విడిచి తేనెగారీ
తిప్పరానినీపొందు ద్రిష్టమాయ నిఁకను ॥మీఱ॥

మోవి చవిగొంటేను మోహ మగ్గలమయ్యీ
తావితములమందితే తమివుట్టీని
యీవేళ మందాఁ బాలు యింటాఁ బాశమాయ
శ్రీవేంకటేశ కూడితి చెప్పరాదు ఇఁకను ॥మీఱ॥ 458

ఉపోద్ఘాతము:

మేనరికము చుట్టరికములో వరుస అయినవారికి జన్మతః కొన్నిహక్కులు వుంటాయి. ఈ కీర్తనలో నాయిక స్వామిని దెప్పుతున్నది. బాగుందయ్యానీవరుస.నీమాట మీఱరాదు. నిన్ను పల్లెత్తుమాట దూఱరాదు. మేనరికపుజులుం చెలాయిస్తున్నావు. బాబోయ్ నీతో పొత్తు పెట్టుకుంటే ఇకఅంతా అగడులాయ (దహించుకు) పోవటమే. నీతో ఆరడి (గొడవ) నావల్లకాదు. నీ అధరము మధురమే. కానీ దానివల్ల కలిగే మోహం అగ్గలము అంటే నమ్ము. సుగంధ పరిమళ తాంబూలముకూడా

దాహం తీర్చటం లేదు. ఈవేళ ఓ వేంకటేశ్వరా! మందాబాలు యింటా (పాలుపోసే గొల్లవారింట) పాశమాయ నీకు (బంధుత్వాలొచ్చాయి) ఔరా?

తాత్పర్య వివరణ:

స్వామీ! నీతో గొప్ప చిక్కువచ్చిపడిందే. మీఱరాదు (నీమాట జవదాటకూడదా?) దూఱరాదు (నిన్ను పల్లెత్తు మాట అనకూడదా?) నాపని, మేనవావివలెనాయ (మేనరికం దాషీకం అనుభవించటం అయిందికదా!) వద్దు బాబూ! నీ పొందు, ఆరడి (రగడవంటిది). ఇక అది ఒక అగడాయ (వేదన అయిపోయింది).

నీతో మాటలు కలిపితే ముసిముసి నవ్వులు చిందిస్తావు. పోనీ ఊరకుంటే ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠతో ఒళ్ళంతా చెమటలు ఉమ్మగిల్లె (తుకతుక వుడికించాయి). ఈ విధంగా నాపని ముందుబోతే నుయ్యి (బావి) వెనక చూస్తే తగరు (కొమ్ములు తిరిగిన పొట్టేలు) అయింది. నీతో పొందువద్దు. ఓరీ! ఇక నాకేమి చేయాలో పాలుపోవడం లేదు.

ఇక తప్పదని నిన్ను చూడగబోతే నా తనువు అంతా పులకరించింది. నీవు వెనుక నుంచి వచ్చి నా కనురెప్పలు మూయంగానే నీ స్పర్శకి కాకలు రేగి ఉద్రేకంతో మేను వేడెక్కిపోయింది. విప్పక పట్టితే (రాజీకి రాక పట్టుమీదవుంటే) వేడి దానంతట అదే తగ్గి శృంగారం తేనెలూరుతుంది. తిప్పరాని నీ పొందు (కాదు అనటానికి వీలులేని నీతో పొత్తు) ద్రిష్టమాయ (అదృష్టమువలె పరివర్తన చెందినది).

నీ అధరామృతమును చవిగొంటే నా మోహము, అగ్గలమాయె (అధికమైనది). నీవిచ్చిన పరిమళ భరితమైన తాంబూలము నందుకోగానే తమిపుట్టీని (నా దాహము ఇనుమడించింది.) ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ రోజు మందాబాలు యింట (గొల్లవారి ఇంట) నీకు పాశమాయ (అనుబంధాలేర్పడినవి) నీవు నన్ను చెప్పరానివిధముగా కూడితివి.

పద్యవివరణ:

ఆ.వె॥ **అగడులాయపొందులారడిబెట్టెను**
మీఱ, దూఱరాదు మేనవావి
మోవిచవిని జూచి మోహమగ్గలమాయె
చెప్పరాదు సుఖము శ్రీనివాస!

సంఖ్య: II/510 రాగం : లలిత
కీర్తన : ఎన్నడు గలుగుమరి యీభాగ్యము

లలిత

11 ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే ॥పల్లవి॥

అదె చంద్రుఁ డుదయించె నచ్చుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి దివిజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశిశువుకు శరణనరే ॥ఎన్నఁ॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక జల్లన విచ్చె
దండి గోకులము నిండె ద్రౌపదితపము వండె
చండప్రతాపున కిట్టె శరణనరే ॥ఎన్నఁ॥

రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుఁడు డాసె
గోపికలమనసుల కొఱత వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే ॥ఎన్నఁ॥ **510**

ఉపోద్ఘాతము:

నేడు శ్రీకృష్ణాష్టమి. ఈ రోజు అన్నమయ్య విరచితమైన శ్రీకృష్ణావతారం గురించి పాడటం నాపూర్వజన్మ సుకృతమే. ఈ శ్రీకృష్ణ పరమాత్మకు శరణం అంటే ఆయన సన్నిధి తప్పక లభిస్తుంది అంటున్నారు అన్నమయ్య. ఆ స్వామి నిన్ను తన రక్షణలోకి యెన్నడు తీసికొంటాడు, ఆ భాగ్యము నీకెప్పుడు కలుగుతుంది అని చెప్పగలిగినవారెవరు? ఆ పరమాత్మే. అష్టమినాడు చంద్రోదయ సమయాన ఉదయించిన నల్లనయ్య రాక్షసాంతకుడు. మన

మనస్సులలో దాగివున్న రాక్షసుని నశింపజేయడానికి ఇతనికి శరణు అందాము. కౌరవులను శిక్షించి పాండవులను రక్షించిన శ్రీకృష్ణ భగవానుడు ద్రౌపదీమాన సంరక్షకుడు. ఆశ్చర్యమేమంటే ఈ కలియుగంలో ఆయనే మన శ్రీవేంకటేశ్వరుడు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! మరి మాకు యీ భాగ్యము యెన్నడు కలుగును? ఇతనికి శరణనరే (శరణు అని అనండి) ఆయన మిమ్మల్ని తన సన్నిధికి ఆహ్వానిస్తాడు.

అదిగో అటుచూడండి. చంద్రోదయమవుతున్నది. అచ్యుతుడు జన్మించాడు. అదే అదనుగా కంసుని జన్మ కూడా అస్తమించుటకు ముహూర్తం నిర్ణయించబడింది. దివిజులు (దేవతలు) పొదలిరి (వర్ధిల్లిరి). రాక్షసులు పొలసిరి (దైత్యులు సర్వనాశనమయ్యారు.) క్రమముగా ఈ శిశువునకు శరణనరో (శరణువేడండి).

ఇదే శ్రీకృష్ణభగవానుడు వచ్చె (రంగములోకి దిగినాడు.) బాలకృష్ణుడైనాడు. ఇక శిష్టులైన పాండవకులమును రక్షించి అభిమన్యుని పుత్రుడైన పరీక్షిత్తును బ్రతికించినాడు. దుర్యోధనుని మూక అయిన కౌరవులు చీల్చి చండాడబడి వాళ్ళ గుండెలు ఝల్లని విచ్చుకొన్నాయి. గోకులమంతా దండితో (తృప్తితో) తనివారింది. ద్రౌపది మాన సంరక్షణ జరిగి ఆమె తపస్సు ఫలించింది. చండప్రతాపుడైన శ్రీహరికి శరణనరో!

రేపల్లె పుణ్యము ఫలించింది. శ్రీవేంకటేశుడు డాసె (సమీపమునకు వచ్చాడు). గోపికల మనస్సులలోవున్న కొఱత తీరింది. లోకంలో ధర్మము దక్కింది. గోవర్ధనము నిక్కె (పైకి లేచింది) కృష్ణుని చిటికెన వ్రేలిపై లేచింది. ఇంకా మీకు చాపల్యమెందుకు స్వామిని శరణనరో.

పద్యవివరణ:

కం॥ **ఎన్నడు కలుగును భాగ్యము?**
సన్నిధిలబియించు? హరికి శరణనరేలో?
వెన్నుడె వేంకట విభుడట
సున్నగు చాపల్యమింక సుకృతమగుపో.

సంఖ్య: IX/252 రాగం : కాంబోది
కీర్తన : కైవసపుదానగాని కపటిగాను

కాంబోది

12 కైవసపుదానఁగాని కపటిఁగాను
చేవదేర వలచితిఁ జిత్తగించవయ్యా ॥పల్లవి॥

కాయపు కాఁకలచేతఁ గసరుదు నొకవేళ
పాయపు మదము చేతఁ బదరుదును
చాయల సన్నల నిన్ను సాదింతు నొకవేళ
చేయెత్తి మొక్కే నిందుకే చిత్తగించవయ్యా ॥కైవ॥

యిచ్చిన చనవునను యీసడింతు నొకవేళ
గచ్చుల నీవద్ద నుండి గర్వింతును
ముచ్చటలాడుచు గోరుమోపుదు నే నొకవేళ
చెచ్చెరఁ బంతమిచ్చేను చిత్తగించవయ్యా ॥కైవ॥

పాదములొత్తుచు నిన్ను భ్రమయింతు నొకవేళ
సోదించి శ్రీవెంకటేశ సొలయుదును
ఆదిగొని కూడితి ని న్నలమేల్మంగ నవుదును
సేదదేర మన్నించి చిత్తగించవయ్యా. ॥కైవ॥ **252**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో అలమేల్మంగ శృంగార నాయిక, స్వాధీనపతిక. ఈమె తన వల్లభునికి పూర్తిగా స్వాధీనమై తనని తాను అర్పించుకునే బేల. ఏ కపటమూ నెరుగని ఈ జవరాలు కైవసమై మనస్ఫూర్తిగా వలచి తనవలపులు నేలుకొని చిత్తగించమని వేడుకొంటుంది. ఏదో కోపంలో కసురుకొన్నాను. యౌవనమదముతో అదిరిపడుతున్నాను. రాత్రింబవళ్ళూ నీవు అలాలేవనీ ఇలా లేవనీ సాధిస్తూనేవున్నాను. ఇందుకే నీకు చేయెత్తి మొక్కుతున్నాను. చిత్తగింపుము ప్రభూ! ఓ వేంకటేశ్వరా! నేనూ తక్కువదానను కాదేమో. నీ

పాదములొత్తి నేను చాలా నమ్రతగలదాననని భ్రమింపజేస్తున్నానేమో? లేదా నిన్ను శోధించీ శోధించీ విరసము చూపిస్తున్నానేమో? సేదదీర నన్ను మన్నింపుము స్వామీ! నన్ను చిత్తగింపుము.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నేను కపటిగాను (మోసకత్తెనుకాను). కైవసపుదానను (నీకు పూర్తిగా స్వాధీనమైపోయినదానను). చేవదేర (ఎంతో ధైర్యముతో) నిన్ను వలచితిని నన్ను చిత్తగింపుము ప్రభూ!

కొద్దిగా నా అగచాట్లనుకూడా ఆలకింపుము ప్రభూ! నేను నిన్ను కాయపు కాకలచేత (శరీర సహజమైన కోపముచేత) చిరాకుతో కసురుకొంటుంటాను. వయస్సు మదముజేత వదరుదును (ఏవోవో వాగుతుంటాను). చాయల సన్నల (రేయింబవళ్ళూ) ఒకవేళ నిన్ను సాధించి ఇబ్బంది పెడుతున్నానేమో? ఇందుకే నేను నీకు చేయెత్తి మొక్కుతున్నానయ్యా! నన్ను చిత్తగింపుము.

ఒకవేళ నీవిచ్చిన చనువును దుర్వినియోగం చేసికొని నిన్ను ఈసడించుకొంటున్నానేమో (రోత ప్రదర్శిస్తున్నానేమో)? నీవద్దనే నా స్థానము అనే వైకల్యముతో గర్విస్తున్నానేమో? ఒకవేళ మాటామాటా పెరిగి నీపై నఖక్షతములను చేయుచున్నానేమో? చెచ్చెర పంతము నిచ్చేను (శీఘ్రముగా పంతం పడుతున్నానేమో?)

ఒకవేళ నేను నిజంగా అంత మంచిదానను కానేమో? నీ పాదములు ఒత్తుచూ నేనునీ దాసినని కేవలం భ్రమ కలిగిస్తున్నానేమో? లేదా ఒకవేళ శోధించీ శోధించీ నీపై సొలయుదునేమో (విరసత్వము ప్రదర్శిస్తున్నానేమో!) ఆదికొని (నాపై కన్నువేసి) నన్ను కూడితివి. ఓ వేంకటేశ్వరా! నేను పరాయిదాన్ని కానయ్యా! నీ అలమేల్మంగనే. సేదదీరునట్లు నన్ను మన్నించి నన్ను చిత్తగింపుము ప్రభూ!

పద్యవివరణ:

ఉ॥ **కైవసమైనదాన, చిరకాలము నీకృప వేడుదానరా**
కావలెనన్ననూ కపటిగానుర వేంకటశైలనాయకా!
చేవలుదేర నే వలచి చేరితి నన్నిటు చిత్తగించుమా
దేవులనేము నీకు శ్రమ దీరగ మన్నన జూపుమోప్రభూ!

సంఖ్య: II/6 రాగం : ఆహిరి
కీర్తన : ఇందులో మొదలికర్త యెవ్వడు లేడుగాబోలు

ఆహిరి

13 ఇందులో మొదలికర్త యెవ్వఁడు లేఁడుగాఁబోలు
ముందు కరివరదుఁడే ముఖ్యుఁడుగాఁబోలు ॥పల్లవి॥

ఆడితిఁబో బహురూపా లన్ని యోనులఁ బుట్టి
తోడనె బ్రహ్మాదులనేదొరలెదుటా
జాడలు మెచ్చాలేరు చాలునన్నవారు లేరు
వేడుక నడవిఁగాసే వెన్నెలాయ బ్రదుకు ॥ఇందు॥

అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతి–
నన్ని వేదములనేటియంగడివీధి
నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు
వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు ॥ఇందు॥

సంసారపునాటకసాలలో ప్రతిమనైతి
కంసారి శ్రీవేంకటపతిమాయలోన
యింస లిన్నియుఁ దేరె నిందరుఁ జుట్టములైరి
హంసచేతిపాలునీరునట్లాయ బ్రదుకు ॥ఇందు॥ **6**

ఉపోద్ఘాతము:

ఆదిపురుషుడు కరిరాజవరదుడు అయిన శ్రీహరి అందరికంటే ముందుగా ముఖ్యుడు కాబోలు. ఆయన పరమాత్మ. ఆయన తప్పించి తక్కినవారందరూ జీవులే. ఈ జీవులకు మొదలికర్త (బ్రహ్మ) యెవ్వడూ లేడు కాబోలు అంటున్నారు అన్నమయ్య. అంటేఇందులో జీవులందరూ వరుసగా రకరకములైన యోనుల బుట్టెడి వారే. రకరకములైన కర్మములు చేసే ఈ జీవులు కర్మ ఆడించినట్లు ఆడతారు. ఆ విధంగా కొందరు బ్రాహ్మణులైతే కొందరు అన్యులవుతారు. కానీ ఆ దేవదేవుని కృప కలిగేంతవరకూ బ్రతుకు సముద్రముపై కురిసిన వానలాగా బ్రతుకంతా

నిష్ప్రయోజనమే అంటున్నారు. సంసారమనే నాటకశాలలో నిలబెట్టిన ప్రతిమల్లాంటి మానవులు శ్రీవేంకటేశ్వరుని మాయలో చిక్కి ఆయన కృప కలిగేదాక కొట్టుమిట్టాడుతుంటారు.

తాత్పర్య వివరణ:

కరివరదుడు (గజేంద్రమోక్షము సంప్రాప్తింపజేసిన శ్రీహరి) పరమాత్మ. ఆయనే అందరికంటే ముఖ్యుడు. దేవుడు కాబోలు. అయితే మిగతావారంతా జీవులే. వీరికి మొదలి కర్త (బ్రహ్మ) యెవ్వడూ లేడు కాబోలు. ఎందుకంటే కర్మ చేయాలంటే సంకల్పం కలగాలి. అది జీవునికి దేవుడే కలిగిస్తాడు.

నేనొక జీవుడను. అన్ని యోనులందు పుట్టి అనేక రూపాలు ధరించి, ఆ దేహానికి అనుగుణంగా ఆడితిబో (ప్రవర్తించాను). బ్రహ్మాదులవంటి దేవతలు ఇచ్చిన జన్మను అనుభవించక తప్పలేదు. ఆ జన్మలో నామంచి మెచ్చినవారూ లేరు. ఇక నీకు జన్మలు చాలులేరా, అన్నవారూ లేరు. మరి ఆ జన్మ అంతా నిష్ప్రయోజనమేనా? బ్రతుకంతా అడవిలో కాసిన వెన్నెలలాగా నిరర్థకమా?

ఈనాడు బ్రాహ్మణుని జన్మపొందాను. ఈ ఆటలో నేను అన్ని కర్మలనూ చేయాలి చేయించాలి. ఇది నిర్దేశించింది బహుశా ఆ దేవుడే అయి వుంటాడు. చతుర్వేదములను అంగడి వీధిలో (సభలలో) వినిపిస్తుంటాను. నేను చేస్తున్నది మంచి పనియా కాదా? నన్ను చూచి ప్రశంశాపూర్వకంగా నవ్వే వారెవరు? ఉన్నారా లేరా? బ్రతుకంతా సముద్రం మీద కురిసిన వానలాగా నిరుపయోగమా? అది తెలిసిన దేవుడు కనబడడాయె కదా!

ఈ సంసారమంతా ఒక గొప్ప నాటకశాల తగిన పాత్రలేనిచోట (కావలివాండ్లవంటి పాత్రలు) ప్రతిమలను (కొయ్యబొమ్మలను) నిలబెడతారు. జీవితంలో కొందరి పాత్రలంతే. ఇదంతా కంసమర్దనుడైన శ్రీవేంకటేశ్వరుని మాయాజాలము. ఈ నాటకములో యెంతో హింస చేశాను. దానివల్ల యెందరో చుట్టములయ్యారు. మళ్ళీమొదలు కర్మలూ జన్మలూ. పరమాత్మ హంస. అదిపాలనూ నీటినీ వేరుచేయగలదు. ఏమి బ్రతుకురా ఇది. ఇందులో పాలువుంటే కదా పరమాత్మ మెచ్చటానికి?

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇందు మొదలికర్త యెవ్వడు లేడురా**
ముందు కరివరదుడె ముఖ్యుడగును
వేంకటపతి మాయవెలయగ బంధాలు
జన్మపిదప జన్మ జరుగుచుండు.

సంఖ్య: IX/220 రాగం : భైరవి
కీర్తన : ఆటదానికి పతితో నంతచెల్లునా

భైరవి

14 ఆఁటదానికి పతితో నంతచెల్లునా
చీటికి మాటికి యంతసేసేవె నీవు ॥పల్లవి॥

పట్టినదె చల మని పంతములె నెరపేవు
అట్టె యాతని ప్రియము లంగవించవు
చిట్టకాలు వద్దనిన చెలుల మాటలు చెవిఁ
చెట్టవు నీకుఁ దగిన బీరములె కాని ॥ఆఁట॥

ఆడినదె మాటసేసి యట్టె నిలువఁ బెట్టేవు
జోడుగా నాతని మాట చొరనియ్యవు
తోడనె నే మిద్దరి చేతులుఁ బట్టి కూరిచిన
కూడియుఁ గూడవు నీ గుణములె కాని ॥ఆఁట॥

మొదలివొట్టుకు నీ మొనలు చూపేవు గాని
అదనైన మీఁద నింక నటు మెచ్చవు
యిదివో శ్రీవెంకటేశుఁ డిదె నిన్నుఁ గూడినాఁడు
చదురు లింకా నీవు సాధించేవు గాని. ॥ఆఁట॥ **220**

ఉపోద్ఘాతము:

ఆడదానికి భర్తతో అంతపంతము చెల్లదు. నీవు చీటికిమాటికీ యింత రాద్ధాంతం చేస్తున్నావు. ఇది నీకు తగదు అని నాయికు హితబోధ చేస్తున్నారు. ఆమె చెలికత్తె అయిన అన్నమయ్య. నీవు చెప్పినదే చెల్లుబడికావాలి, అని ఎలాగైనా నీమాట నిలబెట్టుకొంటావు. అతని మాటలు నీ చెవిలో చొరనీయవు. మేము ఎలాగో అలా మీ ఇద్దరినీ దారికి తెచ్చి చేతులు కలిపి రాజీకుదిరిస్తే, నీ గుణములు మానవు. ఆయనతో కూడినట్లే వుంటావు కానీ

కూడవు, అని దేవిని మందలిస్తున్నారు. కీర్తన చరణాలలో మీకీ అర్థం ప్రస్ఫుటంగా కనబడదు. కానీ ఇంత మనోజ్ఞమైన భావం వున్నది.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! ఆటదానికి (స్త్రీకి) పతితో (భర్తతో) అంతచెల్లునా? (అంతపంతము చెల్లుతుందా?) నీవు చీటికి మాటికి (చిన్న విషయాలు ప్రతివాటికీ) ఇంత రాద్ధాంతము సేసేవె (చేసేస్తున్నావే!!)

దేవీ! నీవు పట్టినదే పంతమని తీవ్రమైన పట్టుదల చూపిస్తావు. అయినా ఆతని ప్రియములను అంగవించేవు (చూరగొనేవు). నీకు చిట్టకాలు (పరిహాసము తగదనిన మా చెలుల మాట పెడచెవిని బెట్టేవు. నీకు తగిన (తోచిన) బీరములే (గర్వోక్తులేకాని) ఆయన మనసు పరవశించేవిధంగా మాట్లాడవు.

దేవీ! నీవు ఆడినదేమాట (అన్నమాటే శాసనము అన్నట్లు) నిలువబెట్టేవు (ఎలాగైనా నీమాట నెగ్గించుకొంటావు). నీ జోడీగా (భర్త అయిన) అతని మాటలు నీ చెవిలోకి చొరనియ్యవు. మా చెలికత్తెలము మీయెడబాటుజూడలేక తోడనే (వెంటనే) మేము మీ ఇద్దరి చేతులు బట్టుకొని రాజీ కుదరిస్తే, కూడియు (దగ్గరైకూడా) గూడవు (ఒకటికావు). నీ గుణములే (నీ భావాలు నీవే) కానీ పరులమాట ఆలకించవు.

ఆ స్వామి మొదటి ఒట్టు వేసికొన్నదాకానీ మొనలు (వాడితనము) చూపేవు. కానీ అదనైనదాక (ఒక్కసారి అనుకూలత పెరిగాక) ఇంక ఆయనను మెచ్చుకొనేవు. ఓ దేవీ! ఇదిగో శ్రీవేంకటేశుడు నిన్ను ఇట్టే లొంగదీసికొని కూడినాడు. చదురులు (చతురోక్తులతో) నిన్ను సాధించినాడు, కాని నీకు నీవే సాటి.

పద్యవివరణ:

కం॥ **పతితో పంతముతగునటె?**
అతివకు చెల్లునటె అంత అతి బీరములున్
హితవగునె ఇంతసేయుట
ప్రతిదానికి తిరుమలయ్యపల్లెత్తనదే?

సంఖ్య: II/508 రాగం : నాట
కీర్తన : ఇదె వీడె కంటిమమ్మ యేతులవాడు

నాట

15 ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు
కదలేసూర్యచంద్రులకన్నులవాఁడు ॥పల్లవి॥

సెలవినవ్వులవాఁడు చేక త్తిగోళ్ళవాఁడు
పలుపేగులజంద్యాల పంతాలవాఁడు
యెలమిఁ జెలిఁ దొడపై నిడుకొన్నట్టివాఁడు
చెలఁగిన ఘననారసింహుఁడటే వీఁడు ॥ఇదె॥

కొండగద్దెమీఁదివాఁడు గొప్పకిరీటమువాఁడు
దిండుపైఁడిచీరకాశ(సె?) తెక్కులవాఁడు
రెండురూపులొకటైన రీతుల మాయలవాఁడు
అండఁ బ్రహ్లాదవరదుఁ డాతఁడటే వీఁడు ॥ఇదె॥

భవనాసిపొంతవాఁడు భావించఁ దెల్లనివాఁడు
ఇవల శ్రీవేంకటాద్రినిరవైనాఁడు
జవళిపంతాలవాఁడు శఁఖచక్రములవాఁడు
తివిరిన అహోబలదేవుఁడటే వీఁడు ॥ఇదె॥ **508**

ఉపోద్ఘాతము:

ఏ ఉపోద్ఘాతము అవసరంలేని మధుర కీర్తన అహోబల నారసింహునిపై వినిపిస్తున్నారు అన్నమయ్య. ఇది యెంత పొందికగా చెప్పిన కీర్తనంటే యధాతధంగా ఒక చక్కటి సీసపద్యములో ఇమిడిపోయింది చూడండి. "భవనాశి"నదీతీరాన వెలసిన ఈ పంతాల "హరి" (సింహం) కరుణాంతరంగుడైన శ్రీవేంకటేశుడే, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ వనితలారా! ఇదె వీడె అహోబలనృసింహుడు. ఈయన యేతులవాడు (గొప్ప ఉద్ధతి కలవాడు). ఈయన నయనద్వయమే కదలే సూర్య చంద్రులు

ఈ స్వామి మొగము యెప్పుడూ సెలవి నవ్వులతో చిరునవ్వులు చిందిస్తూ వుంటుంది. ఈయన గోళ్ళు చేకత్తులవలె (బాకులవలె వుంటాయి). హిరణ్య కశిపుని చాలా పేగులను వానిపొట్ట చీల్చి తన మెడలో జంద్యములవలె ధరించాడు. ఎలమి (అతిశయించి) తన చెలిమిగల భార్యను తొడపై బెట్టుకొని యున్నవాడై చెలగిన (విరాజిల్లుతున్న) ఘన నారసింహుని కనులారా దర్శించండి.

ఈ స్వామి, కొండ గద్దెమీదివాడు. అహోబలపు కొండయే తన సింహాసనముగా అధిష్ఠించినవాడు. ఈయన ధరించిన గొప్ప వజ్ర కిరీటము ధగధగమని కాంతులు విరజిమ్ముతున్నది. మెత్తటి దిండుపై సుఖాశీనుడైనాడు. పైడి చీరె (స్వర్ణ పీతాంబరమును) కాసె బోసి కట్టినాడు. ఈయన తెక్కులవాడు (యెన్నో కిటుకులు నేర్చినవాడు). ఆయన నరుడూ సింహమూ రెండూ ఒక్కటిగా రూపుదిద్దుకొన్నవాడు. ఎన్నో విధములైన మాయలు చూపినవాడు. బ్రహ్మాది దేవతలకు అండ అయి అనేక వరములనిచ్చాడు.

ఈ నరసింహుని నివాసము భవనాశి నదీతీరము. ఈయన ధవళవర్ణపు నృసింహుడు. ఇవల (ఈ తిరుమలలో) శ్రీవేంకటాద్రిని స్థానము చేసికొని యేలుబడి కొనసాగిస్తున్నాడు. ఈయనకు మొక్కుకొని మరచితే పంతముతో తనమొక్కు తీర్పించుకొంటాడు. శంఖ చక్రధారియైన ఈ అహోబల నారసింహుడు తివిరిన దేవుడు (త్వరగా వరములిడు దేవుడు)

పద్యవివరణ:

సీ॥ **సెలవినవ్వులవాడు చేగోళ్ళ మొనగాడు**
పేగులే జంద్యంపు పోగువాడు
చెలిని వామాంకాన చేర్చి నిలుపువాడు
చెలగిన ఘన నారసింహుడితడు
కొండ గద్దియపైన గొప్ప కిరీటాన
రాజిల్లు కనకాంబరంబువాడు
రెండు రూపాలతో మెండు మాయలవాడు
అండ బ్రహ్మాదుల కయినవాడు

ఆ.వె॥ **కంటిమమ్మవీని ఘన అహోబల "హరిన్"**
జమళి పంతగాడు సాధుప్రియుడు
సూర్య చంద్రనయను సొంపార జాడుడీ
శంకు చక్రధారి వేంకటపతి.

సంఖ్య: IX/182 రాగం : సామంతం
కీర్తన : ఎగ్గో తప్పో యెఱగనిది

సామంతం

16 ఎగ్గో తప్పో యెఱఁగ నిది
నిగ్గులు దేరఁగ నినుఁ బైకొందు ॥పల్లవి॥

పలుమరు నీతోఁ బంతము లాడను
అలసి సొలసి మాటాడుదును
కులికి కులికి నినుఁ గోపించి చూడను
నలుగడఁ గూరిమిఁనాఁటఁగ జూతు ॥ఎగ్గో॥

కమ్మర నీపై కాఁకలు చల్లను
సమ్మతి వలపులు చల్లుదును
దిమ్మురేఁచి తరితీఁపులఁ బెట్టను
కొమ్మని మేకులు కొనఁ బెట్టుదును ॥ఎగ్గో॥

పాసివుంటి వని బడలిక సేయను
ఆసల రతులనె ఆలయింతు
సేసలఁ గూడితి శ్రీవెంకటేశ్వర
వేసరించ నిను విడువ నెప్పుడును. ॥ఎగ్గో॥ **182**

ఉపోద్ఘాతము:

నాయిక శ్రీవేంకటేశ్వరునితో నిక్కచ్చిగా చెబుతున్నది. స్వామీ! నేను చేసేది తప్పో ఒప్పో తెలియదు నిగ్గులు దేరిన నిన్ను పైకొనకుండా వుండలేను. ఇప్పుడు నాకు తెలిసివచ్చింది. ఇకపై నీతో పంతములాడను అలసి సొలసేదాకా మాట్లాడుతూనే వుంటాను. నా కులుకులన్నీ ఒలకబోసి నీపై కోపము ప్రదర్శించను. అన్నిరకములుగ నాకు నీపైగల అనురాగాన్ని

బట్టబయలు జేస్తాను. అదింకా నా గుండెల్లో నాటుకు బోయేట్లు చేస్తాను. ఎప్పుడూ లాగ నా కోపతాపాలు నీపై చూపించను. ప్రియాతిప్రియమైన వలపులు చల్లుదును. దిమ్మతిరిగి నిన్ను బాధబెట్టను. తగుదునమ్మా అని నిన్ను పరిహసించను అంటున్నది. అన్నమయ్య అద్భుత సృష్టి ఇది.

తాత్పర్య వివరణ:

శ్రీనివాసా! నేను చేస్తున్నది ఎగ్గో (సరియైనదో) తప్పో నాకు తెలియదు. నిగ్గులుదేరంగ (సరితూగునట్లుగా) నిన్ను పైకొందును (పెనవేయుదును గాక!)

స్వామీ! నాతప్పు నాకు తెలిసివచ్చింది. ఇకపై పలుమరు (ప్రతిసారీ) నీతో పంతములాడను. అలసినా సొలసినా నీకు తృప్తి కలిగేట్లు మాటలాడుదును. కులికీకులికీ (నాకులకులన్నీ చూపి) నాకోపమును ప్రదర్శింపను. నలుగడ కూరిమి నాటుదును (అన్నివిధములుగా నా ప్రీతిని నాటుకొనునట్లు చేయుదును).

ప్రభూ! మరల మరల నీపై నాకాకలు చల్లను. (నాకోప తాపాలను ప్రదర్శించను.) అంగీకారయుక్తమైన నావలపులను నీపై విరివిగా చల్లుదును. దిమ్మరేచి (మత్తు నెత్తికెక్కి) నిన్ను ఉపేక్ష జేయను. కొమ్మని (తీసికొనుమని) మేకులు కొనబెట్టుదును (పరిహాస పూర్వకముగా అవమానించను).

స్వామీ! దూరమై ఇన్నాళ్ళకు దగ్గరయ్యావని నా చిరాకు ప్రదర్శించను. ఆశలు దీరని రతులతో నిన్ను అలయింతును. (అలసిపోవునట్లు సేతును.) ఓ శ్రీవేంకటేశ్వరా! మంగళాక్షతలు ధరించిన నన్ను కూడితివి. ఇక నేనెప్పటికీ నిన్ను వేసరించి (విసుగుజెంది) నిన్ను విడనాడను. నేను త్రికరణశుద్ధిగా ఈ మాటలు చెబుతున్నాను.

పద్యవివరణ:

కం॥ **ఎగ్గో తప్పో యెఱుగను**
నిగ్గులు దేరంగ నేను నినుపై కొందున్
సిగ్గులు మరచిన రతులన్
దగ్గరనీకవుదునయ్యా ధరణీనాథా!

సంఖ్య: II/519 రాగం : దేసాళం
కీర్తన : కడనుంచి చూచేనీకు గనికరమైతే

దేసాళం

17 కడనుండి చూచేనీకుఁ గనికరమైతేఁగన
బడి నన్నుఁ గావు నీతో బలిమేలే ॥పల్లవి॥

వొడలుమోచినయది యొకయపరాధము
అడరి సంసారినౌటె యపరాధము
బడి నివి పఱచినపాట్లఁ బడకపోడు(దు?)
యెడనీకు మొరవెట్ట నిఁక జోటేదయ్యా ॥కడ॥

అన్నపానములు గొన్న దది యొక్క నేరమి
వున్నతి సంపదఁ బొందు టొకనేరమి
యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు
విన్నపాలు సేసి నీతో విసుగఁ బోటేది ॥కడ॥

మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల
అదనఁ గర్మాధికారినౌటొకకల్ల
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి
తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా ॥కడ॥ **519**

ఉపోద్ఘాతము:

భక్తి తొణికిసలాడే హరి శరణాగతి అన్నమయ్య వాణి ద్వారా ఆస్వాదించండి. శ్రీహరి కోటానుకోట్ల సంఖ్యలో వున్న తన శరణాగతులను తన కన్ను కొలుకులనుండి ఒక తృటి కాలం చూస్తాడట. అయితే మనధ్యాస అప్పుడు ఏ అనవసర రాజకీయాలపైననో వుంటుంది. ఆయన చూపు మన చూపు కలవదు. మరి ఆయన కృపయెలా కలుగుతుంది? మరి దారేమిటి? సర్వకాల సర్వావస్థలలో శ్రీహరి ధ్యానంలోవుండే వారికే అది సాధ్యం. మనం యెప్పుడూ హరిని తలుచుకొంటుంటే ఆయన 'కడనుండి' చూపు మన చూపుతో కలియగానే మోక్షమే. ఇప్పుడు కిటుకు అర్థమైనదా? అన్నమయ్య

అదేపని చేశారు. హరితో బలిమిలాభం లేదు శరణాగతే, ఆయన దాస్యమే సులభోపాయం. మరి మన అపరాధపెన్వరుస యెలా మన్నింపబడతాయి?

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీతో బలిమియేలే? (నీతో బలిమి చూపుటెంత అవివేకము). నీ భక్తులను నీవు కడనుండి (కన్ను కొలుకులనుండి ఒక్క చిటికె వేసేటంతసేపు మాత్రమే చూస్తావట). నీకు కనికరమైతే నాకు కనబడి నన్ను గావుము (రక్షింపుము).

నేను కోట్లాదిగా అపరాధములను చేశాను. అంగీకరిస్తున్నాను. అసలు నేను ఒడలుమోచినయది (నా శరీరం పొందినదే పురాకృత పాపమునుభవించుటకు). ఈ శరీరపు కోర్కెలు తీర్చుకోటానికి సంసారినయ్యాను. అది ఇంకా పెద్ద అపరాధము. వీటన్నిటినీ పఱచిన (వదలివేసివుంటే) నాకు ఇన్ని పాట్లు వుండేవి కావు. ఈ సంసారంలోపడ్డ నాకు నీతో మొఱబెట్టుకొనే వీలే కలుగలేదు.

ప్రభూ! ఇది అన్నమునాసించే శరీరము. అన్నము సత్తువనిచ్చి నేరాలు చేయిస్తుంది. మరి నేను అన్నము గొనుటయే నానేరమా? బలవంతుడనై సంపదలను ఆర్జించాను. అది ఇంకా ఘోరమైన నేరము. ఆ సంపద వలన కలిగిన సమస్త భోగములను అనుభవించాను. ఇన్నాళ్ళూ ఆ భోగాలు అనుభవించి ఇవ్వాళ నాకక్కరలేదు అంటే నా శరీరం ఒప్పుకొంటుందా? ఇక విన్నపాలుచేసి నాకు ఈ భోగాలనుండి విముక్తి కావాలని విసుగు జూపుటకు అవకాశమేది?

ఓ శ్రీహరీ! నా అంతర్యామివై నా మదిలో నీవే వున్నావు. అయినా నేను నిన్ను మఱచాను. అది ఒక గొప్ప కల్ల (తప్పు). అందువల్ల నా కర్మలన్నిటికీ నేనే కర్మాధికారినయ్యాను. అది ఇంకా పెద్ద కల్ల (తప్పు) చివరికి ఎట్లాగో నీకు దయ కలిగి నన్ను కాచితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! మేము జీవన్ముకులమైతిమి. ఇక తొలగిపోయాము.

పద్యవివరణ:

చం॥ **కనికరమైనచో పనిచికానగ రమ్ము మహానుభావ! నీ**
కనుకడనుండి చూతువట కాదన, నెట్టయినన్ తరింపగా
నను వడిగావుమయ్య! హరి! నాబలిమెంతటిదయ్య? దీనుడన్
వినుఁ అపరాధపెన్వరుస వేంకటనాయక నీశరణ్యుడన్.

సంఖ్య: IX/191 రాగం : లలిత
కీర్తన : నాటిసుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి

లలిత

18 నాటి సుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి
పాటింప నా వేడుకలు ప్రత్యక్షమైవున్నవి ॥పల్లవి॥

ఆ(అ?)దనఁ గోనేటిదండ హరి గూచుండి చూడఁగ
యెదుటనె జలకేలి నింతు లుండఁగా
కదిసి యమునలోన కందువైన గోపికలు
పొదిగి వలపుచల్లే పోలికయై వున్నది ॥నాటి॥

అంతలోనె వలువలు అందరుఁ గట్టుక వచ్చి
చెంత నితని కొలువు సేయఁగాను
చింతదీరఁ దొల్లి అందె చీర లిన్ని నిప్పించుక
సంతసాన నిట్లుండే సరవినే వున్నది ॥నాటి॥

అట్టె శ్రీవెంకటేశుఁ డలమేల్మంగనుఁ గూడి
నెట్టన పైఁడిమేడలో నిండు కుండఁగా
అట్టుగా వీ రిందరు నాఅడిసేసి నవ్వఁగాను
తెట్టెలై నాటి పొందులు తెలిపినట్లున్నది. ॥నాటి॥ 191

ఉపోద్ఘాతము:

తిరుమలలో వేంకటేశ్వరుడూ అలమేల్మంగ, వసంతోత్సవంలో పాల్గొంటున్నారు. నేటి యీసుద్దులు మనం ప్రత్యక్షంగా వేడుకగా చూడగలుగుతున్నాము. హరి ఈనాడు కోనేటి ఒడ్డున అదన (అనువుగా) కూచుండి చూస్తుంటే ఇంతులు జలకేళిలో వున్నారు. ఇది ఎలా వున్నదంటే ఆనాడు యమునా నదిలో గోపికలు జలక్రీడలాడుతుంటే శ్రీకృష్ణుడు వలపులు చల్లుతూ వారిని చూస్తున్న పోలికలోవున్నది. ఈనాడు కోనేటిలో స్నానం చేసిన స్త్రీలు వలువలు కట్టుకొని

అందరూ కొలువు చేసికొని చక్కటి పాటలు పాడుతుంటే ఎత్తుకొనిపోయిన చీరెలను శ్రీకృష్ణుడు తిరిగి ఇవ్వగానే గబగబా వాటిని కట్టుకొన్న గోపికలు అమ్మయ్య! అని సంతోషించి శ్రీకృష్ణునిపై ప్రేమగీతికలు పాడినట్లు వున్నది. ఇది అన్నమయ్య అద్భుత ఊహా కదంబం అవునా?

తాత్పర్య వివరణ:

నాటి సుద్దులు (ఆనాడు బృందావనములో జరిగిన కథలు) విన్నాము. నేడు ఈ తిరుమలలో జరిగిన సుద్దులు కంటిమి (చూస్తున్నాము). పాటింప (పట్టింపుగా) ఆ వేడుక ఈ నాడు ప్రత్యక్షంగా చూస్తున్నట్లున్నది.

ఈనాడు అదన (అనువుగా) హరి (శ్రీవేంకటేశుడు) ఈ తిరుమల కోనేటి ఒడ్డున కూర్చొని చూస్తుండగా యెదటనే కోనేటిలో జలకేళి ఆడుచున్న వనితలను చూస్తే, ఆనాడు యమునలో గోపికలు మనోహరంగా వలపులు చల్లుతూ స్నానం చేసినపోలికయై కానవచ్చుచున్నది.

అంతలోనే తిరుమలేశుని సేవకు జాగు అవుతున్నదని స్త్రీలందరు వలువలు కట్టుకొని వచ్చి స్వామి చెంత నిలుచుని కొలువు చేయుచూ గీతికలు ఆలపిస్తుంటే ఎలా వున్నదంటే, తొల్లి (పూర్వము) చింతదీర (తమ దిగులు పోవునట్లు) తమ చీరెలనన్నింటినీ తిరిగి ఇప్పించుకొనిన గోపికలు సంతోషంతో ఇట్లాగే వలువలు ధరించారేమో అనిపించుచున్నది.

అంతేకాదు, నేడు శ్రీవేంకటేశ్వరుడు అలమేలుమంగను కూడి నెట్టున (నిండుగా) బంగారు మేడలో, నిండుకుండలా (గంభీరమూర్తులవలె) వుంటే, వీరందరూ (ఈ భక్తులందరూ) పెద్దగా అల్లరి చేస్తూ నవ్వుతుంటే యెలావున్నదంటే... ఆనాటి తన పొందులు (కూటముల) గురించి స్వామి చెబుతుంటే నవ్వులాగక నేడు వీరంతా నవ్వుతున్నారా అన్నట్లున్నది.

పద్యవివరణ:

తే.గీ॥ **నాటిసుద్దులు వింటిమి నయము మీర**
నేటిసుద్దులు గంటిమి తేటకనుల
నీదువేడుకల్ పాటింప నీలవర్ణ!
ఎదుట ప్రత్యక్షముగనున్నవిది నిజంబు.

సంఖ్య: II/513 రాగం : లలిత
కీర్తన : కానవచ్చీగానరాదు కమలాక్ష నీమాయ

లలిత

19 కానవచ్చీc గానరాదు కమలాక్ష నీమాయ
తానే వెంటవెంటc దగిలీ నిదివో ॥పల్లవి॥

తొల్లి నీవు గలవు తోడనే నేcను గలను
యెల్లగా నీప్రపంచము యింతాc గలదు
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్టు
చల్లనినేనొకcడనే జన్మములే వేరు ॥కాన॥

వేదములు నాటివే వినుకులు నాటివే
ఆదినుండి చదివే నదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకc బోయినయట్టు
దాదాత నా తెలివి యితరుల నడిగేను. ॥కాన॥

వైకుంఠమూ నున్నది వరములు నున్నవి
యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను
కైకొని పువ్వు ముదిరి గక్కనc బిందె యైనట్టు
నీకు శరణనcగాను నేనీదేరితిని ॥కాన॥ **518**

ఉపోద్ఘాతము:

కమలనేత్రుడైన శ్రీకాంతుని మాయకు అబ్బురపడుతున్నారు అన్నమయ్య. ఒకసారి కానవచ్చీ వొకసారి కనరాదు. ఏమిటి నీమాయ! ఒకచోటవుండనీయదు. తానే మా వెంట వెంటబడి సతమతమవునట్లు చేస్తుంది ఇదివో నీమాయ దాటుటకు అసాధ్యము అని అంటున్నారు. అనాదిగా నేనూ వున్నాను, ఈ ప్రపంచమూ వున్నది. ఎద్దులెప్పటివే, వాటిమీద కప్పిన గోనెలే కొత్తవి. నేను వొక్కడినే నా జన్మలే లెక్కలేనన్ని వేదములనన్నీ ఈ జన్మలోనూ నేర్చాను. కానీ ప్రయోజనమేమిటి? వెన్న కావలసినంతవుండగా నేతికోసం యితరుల నడిగీ అడిగి ఆయాసపడ్డాను.

ఓ వేంకటేశ్వరా! నీవైకుంఠమూ అదే నీవరములూ అవే అవట్లా వుండనీ. నీవు ఈనాడు నన్ను అనుగ్రహించావు నీశరణాగతులను చెట్టుమీద పూలు పిందెలైనట్లు నీవే ఈడేరుస్తావు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ కమలనయనా! నీమాయ, వొక్కొక్కసారి కానవచ్చీ (తేటతెల్లముగా వున్నట్లుంటుంది). ఒకసారి కానరాదు (దిక్కు తెలియకుండా చేస్తుంది). ఇదిగో తానే మావెంటవెంట తగిలీ (తగులుకొంటుంది).

అనాదిగా పరమాత్మవైన నీవూ వున్నావు. జీవాత్మనైన నేనూ వున్నాను. సమస్తంతో కూడిన ఈ ప్రపంచమూ వున్నది. కాడికి గట్టిన ఎద్దులు యెప్పటివే (యెప్పుడూ వుండేవే). వాటి మీద అలంకారానికి కప్పిన గోనెలే (జనపనార వస్త్రమే కొత్తది. అంటే శరీరాలే కొత్తవి. లోపలి ఆత్మలు పాతవే అని భావము. మరి "నేను" జన్మలెత్తుతూనే వున్నాను.

ప్రభూ! వేదములూ ఆనాటివే. వాటి పారాయణా అనాదిదే. అనాదిగా వేదములనధ్యయనం చేసే నేనూ యెప్పటివాడనో తెలియదు. కానీ ఇవన్నీ దేనికి? నిన్ను తెలుసుకోవడానికేగా? దానికోసం ఇంతశ్రమ పడవలెనా? ఇంట్లో కావలసినంత వెన్నవున్నవాడు నేతికోసం వాడలో ఇల్లిల్లూ తిరిగినట్లు వుంది కదూ! కాస్త వెన్నవేడి చేసికొంటే కావలసినంత నెయ్యి నీదగ్గరే వుంది కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవైకుంఠమూ అనాదిదే. నీవిచ్చే వరములూ అనాదివే. నాకే నీవు యెన్నోసార్లు వరములనిచ్చావు. కానీ ఈ జన్మలో నన్ను తిరుమల చేరునట్లు అనుగ్రహించి నన్ను ఏలుకొన్నావు. చెట్లమీదవున్న పూలూ పాతవే, పిందెలే కొత్తకొత్తవి పుట్టి పండ్లయి కొన్ని తీపివి కొన్ని చేదువి అవుతుంటాయి. నిన్ను శరణు అంటే నీవే ఈడేరుస్తావు కదా! చింతెందుకు?

పద్యవివరణ:

ఉ॥ **కానగవచ్చు నొక్కపరి కానగరాదయె వొక్కసారి నీ**
పూనిన మాయశాంతముగ వుండగ నీయదు వెంబడించు బో
నేనొకనాడు వేదమును నేర్చితి, వ్యర్థము, వేంకటేశ్వరా!
బానలవెన్నదాచుకొని వాడలనేతికి వేసరిల్లితిన్.

సంఖ్య: IX/206 రాగం : ముఖారి
కీర్తన : ఏమిటికి వేడుకొనే వింతలో దమకించేవు

ముఖారి

20 ఏమిటికి వేఁడుకొనే వింతలోఁ దమకించేవు
కామించి నీ వాడినట్టు కాదంటినా ॥పల్లవి॥

మచ్చరములెల్లఁ దీరె మంతనాన నీవు నాతో
యిచ్చకము లాడితేనె యియ్యకొంటిని
కుచ్చి కాఁగలించి నాచెక్కులు నొక్కే వేమిటికి
నిచ్చలు నీచెప్పినట్టు నేఁ జేయనంటినా ॥ఏమి॥

ఆనలెల్ల విడిచితి నంటఁబట్టి నీవు నాకు
తేనెమోవి యిచ్చితేనె తిరమైతిని
పూనిక నాకొంగువట్టి పొంచి యాలపెనఁగేవు
పూని నీతో పొందులు నేనొల్లనంటినా ॥ఏమి॥

మంకు లన్నియుఁ దొలఁగె మనసుమర్మములంటి
సంకెలు దీరిచితేనె సమ్మతించితి
కొంకక శ్రీవెంకటేశ కూడి యింకాఁ బొదిగేవు
పొందకమైన మీఁదాఁ దప్పులు వట్టేనా. ॥ఏమి॥ **206**

ఉపోద్ఘాతము:

తమకించు అంటే తొందరపడటం వంటి అనేకానేకార్థాలు వివరింపబడి సందర్భానుసారంగా వాడబడ్డాయి. ఇక్కడ నప్పే అర్థము జంకు కనబరచుట. నాయిక నాయకునితో అంటున్నది. దేనికోసం ఇంతగా వేడుకొంటున్నావు? మళ్ళీ ఇంతలోనే జంకుతావు. కోరికలతిశయించిన నేను నీవు చెప్పినట్లు కాదంటినా? నా మంకుతనమంతా నన్ను వదలివేసినది. నామనస్సులోని మర్మము గ్రహించి నా అనుమానాలన్నీ తీరిస్తే సమ్మతించి వెనుదీయక

వేంకటేశ్వరా! నన్ను కూడి కమ్ముకొనేవు. స్వామీ! నీకు చేరికయైనాక నీ నేరములెంచెదనా? అలా యెన్నటికీ చేయను అంటున్నది నాయిక. అన్నమయ్య వినిపించిన చక్కటి సరసకీర్తన ఇది.

తాత్పర్య వివరణ:

ప్రభూ! ఏమిటికి వేడుకొనేవు (దేనికి ఇంతగా ప్రాధేయపడుతున్నావు?) ఇంతలోనే, తమకించేవు (జంకుతున్నావు). నేను కోర్కెతో నీదాననైతిని. నీవాడినట్లు (నువ్వు చెప్పినదానిని) కాదంటినా (కాదని యెన్నడన్నా అన్నానా?)

నీవు నాకు చేరువయై యిచ్చకములు (ప్రియవచనములు) చెప్పగానే నేను పరవశించిపోతాను. మచ్చరములు (నా మత్సరాన్నంతా) విడిచి పెడతాను. మంతనాన (ఏకాంతమున) ఇష్టాగోష్టికి ఇయ్యకొంటిని (అంగీకరించితిని). ఇంతలోనే నన్ను గుచ్చి కౌగలించుకొని నా చెక్కిళ్లను నొక్కేవు. నా ఇచ్ఛతో నేనే నీవు చెప్పినట్లు చేస్తాను కదా! చేయనని ఎప్పుడన్నా అన్నానా?

ఆనలు (అంక్షలు) అన్నీ విడిచిపెట్టి, అంటబట్టి (వెంటబడి) నీవు నాకు నీ అధరామృతము నందిస్తేనే నేను స్థిమితపడ్డాను. ఒకసారి స్థిరచిత్తనై నీదాని నయినాక ఇంకా యెందుకు నా కొంగుబట్టి లాగి పెనుగులాడెదవు? నీతో పొందు నేనెన్నడైనా ఒల్లనంటినా (కాదన్నానా?). ఓ ప్రభూ! నా సర్వస్వమూ నీదేనయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నా మత్సరము తొలగిపోయినది. మంకుతనము మాయమైపోయినది. నా మనస్సులోని మర్మము గ్రహించి, సంకెలు దీర్చితేనే (అనుమానములన్నింటినీ తొలగించితేనే) నేను సమ్మతించాను. కొంకక (వెనుదీయక) ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడి పొదిగేవు (కమ్ముకొనెదవు). స్వామీ! పొంకమైన మీద (నీకు చేరిక అయినాక) ఇంకా నీ తప్పులువట్టేనా (నీ నేరములెంచెదనా?)

పద్యవివరణ:

కం॥ **ఏమిటికి వేడుకొందువు?**
స్వామీ! తమకింతువింత జగపతివయ్యున్,
కామించి వేంకటేశా!
నామగడై రతుల గూడినావుగ ధన్యన్.

సంఖ్య: II/501 రాగం : పాడి
కీర్తన : హరి నారాయణ కృష్ణ అదివో మావిన్నపము

పాడి

21 హరినారాయణ కృష్ణఅదివో మావిన్నపము
తరవాతిమాట నీవే తలఁచుకోవయ్యా ॥పల్లవి॥

సడిఁబడ్డనాతలఁపుచక్కఁగాక వుండినాను
వొడయఁడవునీకృప వొగిఁ జక్కనే
గుడిగొన్నయే రెంత కొంకరవంకరలైనా
పుడమికి లోఁగొనకపోవునటవయ్యా ॥హరి॥

కాయకపునాభక్తి కడుఁ గొంచమైనాను
ఆయపునీవరములు అతిఘనమే
యేయెడ గుడి గొంచమయిన గుడిలోదేవుని-
కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా ॥హరి॥

శ్రీవేంకటేశ నిన్ను జింతించక నేనుండినా
జీవాంతరాత్ముఁడవై చేకొంటి నీవే
ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా
ఆవేళ సూత్రధారుఁ డాడించుఁ గదవయ్యా ॥హరి॥ 507

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన పల్లవిలోనే నా కలముఆగిపోయింది. ఓ హరీ నారాయణా! కృష్ణా! మా విన్నపము అదిగోనయా! దాన్ని ఆలకించి మమ్ము ధన్యులను చేయవయ్యా! అన్నారు అన్నమయ్య. బాగానే వున్నది. "తరువాతి మాట నీవే తలచుకోవయ్యా" అని పల్లవి ముగించారు. అంటే యేమిటి? నేను ఇలా భావిస్తున్నాను. ప్రతి జీవునికి అంతిమ లక్ష్యము ముక్తిని పొందటమే. ముక్తి అంటే వైకుంఠంలో నారాయణుని సన్నిధిలో వుండటమని, నారాయణునిలో ఐక్యమైపోవటమని రకరకాలుగా విశ్లేషించి జీవి అర్హతనుబట్టి పరమాత్మ ఇస్తాడంటారు.

తరవాతిమాట అంటే అంతిమ లక్ష్యమైన ముక్తి. ఆ ముక్తినినాకు ప్రసాదించటం గురించి ఆలోచించవయ్యా! అంటున్నారు. ఇక మా పాపపుణ్యాల గురించి చెప్పాలంటే జీవులంతా కీలుబొమ్మలు. "మరలు" తిప్పి ఆడిస్తున్న సూత్రధారివి నీవు. ఆటా నీదే, ఆపుటా నీదే. మాదేముందయ్యా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ హరి నారాయణా! శ్రీకృష్ణా! అదిగో మా విన్నపము (మనవిని) ఆలకించవయ్యా! "తరవాతిమాట" (అంతిమ లక్ష్యమైన ముక్తిని) గురించి నీవే తలచుకోవయ్యా! (ఆలోచన చేయవయ్యా!)

దేవదేవా! నా తలపు (ఆలోచనలు) సడిబడ్డవి (అపకీర్తిపాలైనవి). అవి సవ్యంగా వున్నా లేకపోయినా, నీవువొడయడవు (పరమాత్మవు) కాబట్టి నీదయ జూపి పూనికతో వాటిని చక్కబెట్టవయ్యా! పారుతున్న ఏరు యెన్ని కొంకర్లు వంకరలు తిరిగినా భూమిమీదనే ప్రవహించాలి కదా! మేము ఎన్ని అడ్డదార్లు బట్టినా చివరికి నీదారికిరాక తప్పదు.

ప్రభూ! కాయకపు నా భక్తి (జీవన యాత్రలో తలమునకలైన నా భక్తి) చాలా స్వల్పమే అని నాకు తెలుసును. కానీ జీవముల నిలబెట్టే నీ వరములు అతిఘనమైనవే కదా! గుడి చిన్నది అయినంతమాత్రానదాంట్లో వున్నదేవుడూ చిన్నవాడై పోతాడా? ఆయన మహిమలు చిన్నవైపోతాయా? అవి ఘనమే అందురు కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయంవలన, అజ్ఞానం వలన నేను నిన్ను చింతించక పోయినా నా జీవాంతరాత్ముడవై నీవే నన్ను స్వీకరించావు. మేము పరమాత్ముడవైన నీ చేతిలో నీవు ఆడించినట్లు ఆడే కీలుబొమ్మలము. మేము అచేతనులమే. నీవు మరలుతిప్పి ఆడమంటే నీ ఇష్టప్రకారం ఆడుతున్నాము. ఇంకా మాకు పాపపుణ్యాలుయెందుకు అంటగడుతున్నావు?

పద్యవివరణ:

కం॥ **హరినారాయణ! కృష్ణా!**
పురిగొను మా విన్నపములు పొందిక వినుమా
తరవాతమాట నీవే
విరివిగనిక తలపుకిమ్ము వేంకటరమణా!

సంఖ్య: IX/196 రాగం : మధ్యమావతి
కీర్తన : అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి కూడితి

మధ్యమావతి

22 అన్నిటా భాగ్యవంతుఁడ వాయమెరిఁగి కూడితి
యెన్నికలు మీరితేను యెట్టుండునో సుద్దులు ॥పల్లవి॥

చింతలనె కొంతపొద్దు చెక్కిటిచేఁ గొంతవొద్దు
కాంతలతోఁ గొంతవొద్దు గడపెఁ జెలి
యింతలో నీవు విచ్చేసి తిన్నియును లెస్సలాయ
యెంతలేసి పను లౌనో యించు కూరకుండినా ॥అన్ని॥

యెదురుచూచేయాస నిల్లుసింగారించే యాస
వెదకేటియాసఁ గొంత వెలసెఁ జెలి
అద నెరిఁగి దగ్గరి అంతలో నీవు నవ్వితి
యెదుగా సరసమైతే నెన్నేసివిధులో ॥అన్ని॥

చూపులనె కొంతరతి సుద్దులనె కొంతరతి
యేపులనె కొంతరతి నెనసెఁ జెలి
పైపై శ్రీవెంకటేశ భామ నిట్టె కూడితివి
యీపొద్దు లివిదక్కె నింకా నెంతదక్కునో. ॥అన్ని॥ **196**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అన్ని విధములుగా భాగ్యవంతుడవు. నీవామెను అదనెరిగి కూడితివి. ఎన్నికలు మీరితేను, అంటే గణనకు అసాధ్యమైన సుద్దులు (నీ కతలు) యెప్పుడు యెట్లుంటాయో, యెవ్వరు చెప్పగలరు, అంటున్నారు అన్నమయ్య. దేవా! ఆమె చూపులలోనే కొంత ప్రీతి, ఆమె చెప్పే కథలలో కొంత ప్రీతి, ఆమె విజృంభణములలో కొంతప్రీతి ప్రదర్శించి, ఆ చెలియ చెలగినది. అటువంటి జవరాలిని కూడా ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఇట్టే కూడితివి. నీవు

నేర్పరివి. ఈ పూట నీకు ఈ అదృష్టం దక్కింది. ఇంకా నీకు యెంత మధురానుభూతి దక్కుతుందో యెవ్వరు చెప్పగలరు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీనివాసా! నీవు అన్నిటా (అన్నిట్లోనూ) భాగ్యవంతుడవేనయ్యా! నీవు ఆ దేవిని ఆయమెరిగి (అదనెరిగి) కూడితివి. నీ సుద్దులు (నీ ప్రేమకథలు) యెన్నికలు మీరితే (గణనకు అసాధ్యమైనచో) ఎట్లుండునో, యెవ్వరు చెప్పగలరు?

ఆమెను ఒక్కసారి తిలకింపుము ప్రభూ! కొంత పొద్దు (సమయము) చింతలతో నెట్టుకొస్తున్నది. కొంత పొద్దు చెక్కిటిపై చేయిజేర్చి ఆలోచిస్తూ వుంటుంది. కాంతలతో (తన చెలికత్తెలతో) కొంతసేపు గడుపుతుంది. ఇంతలో నీవు విచ్చేసితివి.ఇన్నియును ఇప్పుడు ఆమెకు లెస్సగానే వున్నవి. ఒకవేళ నీవు ఆమెవద్దకు పోకుండా కొద్దిగా ఊరకుంటే ఎంతలేసి పనులౌనో యెవ్వరు చెప్పగలరయ్యా!

ఇంకా ఆమెను గమనింపుము తిరుమలరాయా! ఆమె కొంతసేపు ఏదో తెలియని ఆశతో నీకోసము, యెదురుతెన్నులు చూస్తుంది. కొంతసేపు ఆశతో ఇంటిని సింగారిస్తుంది, నువ్వు వచ్చి చూస్తావని. ఒకవేళ నువ్వు వచ్చి యెక్కడో నక్కివున్నావేమోనని కాలుగాలినట్లు తిరుగుతూ ఆశతో వెదకుతుంది. ఆ చెలి కొంతసేపు ఆ విధంగా నిర్వహిస్తుంది. ఇంతలో అదనెరిగి (సమయం చూసి) నీవు ఆమెను దగ్గరి (సమీపించి) నవ్వినావు. సరసములేయెదిగిపోతే ఆ చిలిపితనము యెన్నేసి విధములుగా వుంటుందో!!

దేవా! ఆమె చూసే చూపులలోనే కొంత రతి (ప్రీతి) తొంగి చూస్తుంటుంది. ఆమె నీకు చెప్పే తీపి మాటలలో కొంత రతి వుంటుంది. ఆమె నీపై చూపే యేపులలో (డాంబికములో) కొంత రతి వుంటుంది. ఈ విధంగా ఆ చెలి వర్ధిల్లుతుంది. అటువంటి ప్రియురాలిని నీవు ఇట్టే కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈపూట నీకు ఈ అనుభవం దక్కింది. ఇంకా యెంత దక్కించుకొంటావో ఏమో?

పద్యవివరణ:

తే.గీ॥ **అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి**
కూడితివి నీవు రమణిని కూర్మిజూపి
ఎన్నికలు మీర సుద్దులు యెట్టలుండు
యెంత దక్కునో శ్రీహరీ! ఇంతిసుఖము!!

సంఖ్య: II/517 రాగం : సాళంగం
కీర్తన : చేకొంటి నిహమే చేరిన పరమని

సాళంగనాట

23 చేకొంటి నిహమే చేరినపరమని
కైకొని నీ విందు కలవేకాన ॥పల్లవి॥

జగమునఁ గలిగినసకలభోగములు
తగిననీప్రసాదములే యివి
ఆగపడునేఁబడియక్షరపంజ్తులు
నిగమగోచరపునీమంత్రములే ॥చేకొం॥

పొదిగొని సంసారపుత్రదార లిల
వదలనినీదాసవర్గములే
చెదరక యేపొద్దుఁ జేయునాపనులు
కదిసిన నియ్యాజ్ఞాకైంకర్యములే ॥చేకొం॥

నలుగడ మించినాజన్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమని శ్రీవేంకటేశ్వర నీవిఁక
వలసినప్పు డీ వరముల నాకు ॥చేకొం॥ **517**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య కీర్తనలలో పల్లవి అర్ధంకాక చరణాలు తేలికగా వున్నవి కొన్ని అయితే, పల్లవి అలవోకగా వుండి చరణాలు అగమ్యగోచరంగా వుండేవి కొన్ని. ఈ కీర్తన మొదటి కోవలోకి వస్తుంది. చరణాలు సుగమంగానే వున్నాయి కానీ పల్లవి ఒకపట్టాన కొరుకుడు పడదు. ఆలకించండి. నేను ఈ విధముగా భావిస్తాను.

ఓ శ్రీహరీ! ఇహమూ పరమూ రెండూ నీ ప్రసాదములే. నన్ను చేరిన పరము అని భావిస్తూ నేను ఇహమునే స్వీకరించి అజ్ఞానంలో బ్రతికాను. ఇలా యెందుకు జరుగుతున్నది? ఎందుకంటే... పూనుకొని నీవు ఇందు కలిగి

ఉన్నావు కాబట్టి. నీ మాయవలన మేము ఇహమునే స్వీకరిస్తున్నాము. దాని వల్లనే భోగాసక్తి, భార్యాబిడ్డలపై వ్యామోహం కలుగుతున్నాయి. ఏ జన్మలోనైనా ఇదేగోల. ఎందుకంటే ఆ జన్మలన్నీ నీదు పంపులే (నీవు ఇచ్చినవే) కదా!

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! చేరినపరమని పొందిన పరలోకమని భావిస్తూ నేను ఇహమునే చేకొంటిని (స్వీకరించితిని). ఇది అంతయూ నీ మాయ. ఎందుకిలా జరుగుతోంది అంటే... కైకొని (పూనుకొని) నీవు ఇందు (ఈ రెంటిలో) కలవేకాన (వున్నావు కాబట్టి).

ఈ ప్రపంచంలో వున్న భోగాలన్నీ తగినట్లుగా నీ ప్రసాదమే (నీవు ఇచ్చినవే). ఇన్ని మంత్రములున్నాయి. వీటిలో అన్నీ అక్షర పంక్తులే కదా! ఈ అగుపించే అక్షరాల వరుసలే నిగమగోచరపు (వేద వాఙ్మయములో) మంత్రములై భాసిస్తూ మా చేత వల్లెవేయబడుతున్నాయి.

మానవులు సంసారములో పుత్రులను, భార్యలను పొందుతూనే వుంటారు. వీరంతా ఎవరు? నీదాస వర్గములే (నీదాసులే) వీరు వదలరు. జన్మజన్మకూ వెంబడి వస్తూనే వుంటారు. నేను ఏ వేళనైనా చేసే నా పనులన్నీ నీ ఆజ్ఞగా నేను స్వీకరించినవే. అజ్ఞానం వలన అవన్నీ నా పనులే అని కైంకర్యము చేసికొంటున్నాను.

నలుగడ (నాలుగు దిక్కులలో) నాకు జన్మలు కలుగుతూనే వున్నాయి. ఇట్లు పలుమరు (అనేక పర్యాయములు) ఇవన్నీ నీ పంపులు (నీవు పంపిన పుట్టుకలే). అతిశయించిన ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు కావలసిన వరములను అనుగ్రహించే నీ ప్రసాదములే ఈ జన్మలన్నీ. నీ అనుగ్రహం వుంటే ఏ జన్మ అయినా ఒక్కటే కదా!

పద్యవివరణ:

ఉ॥ **చేరినదే 'పరంబు' వడిచేకొని యుంటినిబో 'ఇహంబునే',**
తీరుగపూని నీవు హరి! తేకొనివుంటివి యిందు నందుచే,
కోరిన భోగముల్, సుతులు, కూరిమి కాంతలు నీ ప్రసాదమే
ఆరడినాదు జన్మములు అన్నియు రాయడ! నీదు పంపులే.

సంఖ్య: IX/198 రాగం : సౌరాష్ట్రం
కీర్తన : ఇద్దరి గూర్చినవారు యిప్పుడు మీరెకారా

సౌరాష్ట్రం

24 ఇద్దరిఁ గూర్చినవారు యిప్పుడు మీరెకారా
వొద్దిక్క (క్కు?) నప్పటి నేల వొరపులాడేరే ॥పల్లవి॥

కచ్చుపెట్టి నే నతనిఁ గన్నులఁ బిలచితేను
యిచ్చటఁ జెలులు మీరు యేల నవ్వేరే
ముచ్చటమాటలఁ గడు మోహముపైఁ జల్లితేను
పచ్చారుచుఁ జెలు లేల పచ్చి సేసేరే ॥ఇద్ద॥

పాయక నే నాతనిపయిఁ జెయివేసితేను
చాయల మీలో నేల సన్న లాడేరే
ఆయము లెరిఁగి నే నాకు మడిచియ్యఁగాను
వేయేసిలాగుల నేల వెంగేలాడేరే ॥ఇద్ద॥

భావించి శ్రీవెంకటేశుపాదాలు నే నొత్తితేను
వేవేగ సిగ్గున నేల వెలి నుండేరే
ఆవటించి కూడితిమి అప్పుడే మీరు లోనికి
యీవేళ వచ్చితి రింక నిట్టెవుండరే. ॥ఇద్ద॥ **198**

ఉపోద్ఘాతము:

ఓ చెలులారా! ఈ సతీపతుల నిద్దరినీ ఒక దగ్గరకు చేర్చినవారు మీరేకదా! పూర్వము మీరు చూపిన వినయము వదలి ఏల తంటాలు పెడుతున్నారే! అని ఈ పల్లవి భావము. అన్నమయ్య కీర్తనలలో పల్లవి తికమకపెట్టే కీర్తనలు లెక్కకు మిక్కుటమే. నా పతి డస్సిపోయాడని నేను ఆయన పాదాలు మెల్లగా ఒత్తుతుంటే, మీరు మితిమీరిన సిగ్గులతో యెందుకు బయట నిలుచుని వుండిపోతారు. మా ఇరువురి కూటమి అప్పుడే జరిగినది. స్వామి అలసి శయనిస్తున్నాడు. మీరేదో కొంపలు

మునిగిపోయినట్లు లోనికి చొరబడ్డారు. ఇక అట్టే వుండకండి మా ఏకాంతమును చెడగొట్టకండి, అంటున్నది నాయిక.

తాత్పర్య వివరణ:

ఓ చెలులారా! ఈ సతీపతులనిద్దరినీ కూర్చినవారు (ఒక్కచోటికి చేర్చినవారు) ఇప్పుడు, మీరేకారా మీరు మాత్రమే కదా! ఒద్దిక్కున్ (వినయములకు) అప్పటిన్ (పూర్వమువలె) కాక ఏల, ఒరపులాడేరే (మమ్ము యేల తంటాలు పెడుతున్నారే?)

ఓ చెలులారా! కుచ్చుపెట్టి (జతకలిపి) నేనతనిని కనుసైగలతో పిలిస్తే ఇక్కడ మీరంతా దేనికి నవ్వుతున్నారే? నేను ఆయనకు ముచ్చట కలిగించే తీయని మాటలతో కడు మోహింపజేస్తే, మీ చెలులంతా పచ్చారుచు (మా ఇద్దరి చుట్టూ పచారు చేస్తూ) ఏల పచ్చి సేసేరే (మమ్ము ఆరడి పెడుతున్నారే?)

ఓ చెలులారా! పాయక (విడువలేక) నేనతని చేరువ అవుదాములెమ్మని, ఆతనిపై నా చేయి వేయగానే చాయల (చాటుమాటున) మీరేల సన్నలాడేరే (సైగలు చేసికొంటున్నారే?) ఆయము లెరిగిన (వీలునెరిగిన) నేను తగిన సమయమున అతనికి ఆకుమడచియ్యగానే (తాంబూలము నిచ్చి నా సమ్మతి దెలుపగానే), వేయేసిలాగులన్ ఏల వెంగేలాడేరే (అనేకమైన పెనగులాటలతో మీరెందుకు నాతో యెకసెక్కము లాడుచున్నారు?)

ఓ చెలియలారా! నా పతి డస్సిపోయాడని నేను భావించి ఆయన పాదములనొత్తుతుంటే, వేవేగ (వేగ+వేగ) అనగా, వేగలేని సిగ్గులతో మీరు ఏల వెలినుండేరే (బయటనిలుచుంటారేల?) ఆవటించి (పొందుపరచుకొని) మేమిరువురము అప్పుడే కూడి అలసియున్నాము. ఇంతలో మీరులోనికి చొరబడ్డారు. ఇంక ఈవేళనిట్టే వుండరే (ఇట్లాగే వుండండి లోనికి రాకండి).

పద్యవివరణ:

ఆ.వె॥ **దంపతుల నిరువురి దరిజేర్చి మీరేల**
ఒరపులాడుచుంటి రరులె చెలులు?
ఆవటించి కూడి హరి వేంకటేశునిన్
అలసినాము, రండు అడ్డమేమి?

సంఖ్య: II/516 రాగం : బౌళి
కీర్తన : మొక్కెద మిదివో మూడు మూర్తులను

బౌళి

25 మొక్కెద మిదివో మూఁడు మూర్తులను
వొక్కరూపమై వొనరెఁ జక్రము ॥పల్లవి॥

చెండినరావణుశిరో మాలికల
దండలపూజల తఱచుగను
మెండుగఁ గంసుని మెదడు గంధముగ
నిండ నలఁదుకొని నిలిచెఁ జక్రము ॥మొక్కె॥

చించి హిరణ్యకసిపుపెనురక్తపు –
అంచనర్ఘ్యపాద్యమ్ములను
పంచజనఘనకపాలపుటెముకను –
పంచవాద్యములఁ బరగుచక్రము ॥మొక్కె॥

బలుమధుకై టభప్రాణవాయువుల
అలరిననైవేద్యంబులను
యెలమిని శ్రీవేంకటేశు హస్తముల
వెలసి నిలిచె నిదే విజయచక్రము ॥మొక్కె॥ 516

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశ్వరుని హస్త భూషణమై వెలుగులజిమ్మే సుదర్శన చక్ర వైభవమును కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఇదిగో త్రిమూర్తుల దివ్యశక్తి స్వరూపం అయిన సుదర్శన చక్రము. వారు ముగ్గురూ వొక్కరూపమై ఒనరిన చక్రము. దీనికిప్పుడే మొక్కెదముగాక! ఈ చక్రము తానే రామచంద్రుని కోదండమై, తానే కృష్ణుని బాహుబలమై, నృసింహుని వాడి గోళ్ళయి, పాంచజన్యుని కపాలపుటెముకయై, మధుకైటభ దైత్యుల ప్రాణ సంకటమై తన ప్రతాపమును

ప్రదర్శించినది. ఈ చక్రమునకు గల దివ్యశక్తి యెన్ని విజయములకో మూలమై విజయచక్రము అని పిలువబడుచున్నది, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! మూడు మూర్తులను (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పిలువబడే త్రిమూర్తులను) ఒక్క రూపమై ఒనరె (అతిశయించే) ఈ శ్రీహరి సుదర్శన చక్రము ఇదివో (ఇదిగో) మీకు దర్శనమిచ్చుచున్నది. దీనికిదే మొక్కెదము గాక!

దీనిని చూస్తుంటే రావణాసురుని పదితలలను చెండి (చీల్చి శిరోమాలికలు (శిరస్సుల దండవలె) ధరించి పూజలు గొనిన శ్రీరామచంద్రుని కోదండ ధనస్సు జ్ఞప్తికి వచ్చుచున్నది. కోదండమున కంత శక్తి సుదర్శనము నుండియే సంప్రాప్తించినది. దీనిని చూస్తుంటే, అలనాడు ద్వాపరయుగంలో కంసుని మెదడు యొక్క గంధముగ తన మేనినిండా (శరీరమంతా) మెండుగా (దట్టంగా) అద్దుకొని నిలిచిందా ఈ చక్రము!! అందుకే నిర్వీర్యుడై కృష్ణుని ఒక్క గుద్దుకే ప్రాణాలు పోయాయి అనిపిస్తుంది.

భీకరుడైన నరసింహుడు, హిరణ్యకశిపుని పేగులను చించి (చీల్చి) అతని రక్తప్రవాహము అంచన (పక్కన) దానితోనే అర్ఘ్యపాద్యములను స్వీకరించినాడు. పంచజనుని యొక్క ఘనమైన కపాలము (పుఱ్ఱె) యొక్క యెముకలతో చేయబడి, పంచవాద్యముల ధ్వనితో ఘూర్ణిల్లు శంఖమై శ్రీహరి చేతులలో శోభిల్లి ఆయనకు అనేక విజయములలో తోడ్పడినది.

బలవంతులైన మధుకైటభ దైత్యుల ప్రాణవాయువులను నైవేద్యముగా స్వీకరించి శ్రీహరి అలరినాడు. ఎలమి (అతిశయించి) శ్రీవేంకటేశ్వరుని హస్తములో వెలుగులు విరజిమ్ముతూ ఇదే ఈ విజయచక్రము నిలిచె (నిలిచినది).

పద్యవివరణ:

ఉ॥ మొక్కెదమింక మేము వడి మూర్తులు మూడుగ దోచగా నిదో,
ఒక్కటె రూపమై చెలగెనొద్దిక మీరినదౌ సుదర్శనం
బిక్కడ వేంకటేశ్వరుని ఈప్సితహస్తపు భూషణం బహో!!
తొక్కెను కంస, రావణుల ద్రుంచె హిరణ్యుని, పాంచజన్యునిన్.

సంఖ్య: XXIX/194 రాగం : సాళంగనాట
కీర్తన : ఇప్పుడిదె కొలువున్నా డింతలు దాను

సాళంగనాట

26 ఇప్పు డిదె కొలువున్నాఁ డింతలు దాను
వుప్పతిలు మహిమల నుద్దగిరి కృష్ణుఁడు ॥పల్లవి॥

గోవులఁగాచెఁ గొన్నాళ్లు కొండ గొడుగగ
కావరించి మద్దులను గక్కున దొబ్బె
వావులు గలయ గొల్లవనితలఁ బొందుసేసె
వేవేలు చేఁతలవాఁడు వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥

మల్లులఁ గొందరి గొట్టె మరి కంసు బొరిగొనె
తొల్లె కోడెరాకాసుల దునిమివేసె
తెల్లమిగా వసుదేవ దేవకీనందనుఁ డాయ
వెల్లవిరై మెరసీని వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥

పొంతఁ బాండవులఁ గాచె భూ భార మణఁగించె
పంతముతో దేవతల బాలించెను
యింతట శ్రీవేంకటాద్రి నేలినాఁడు మమ్మిందరి
వింత వింత సొబగుల వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥ 194

ఉపోద్ఘాతము:

ఉద్దగిరిలో వెలసిన శ్రీకృష్ణునిపై మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. అప్పుడు ప్రాభవంలో వున్న దేవాలయాలు కనుమరుగయ్యాయి. పోషణ లేక పాడుపడి శిధిలమైనవి కొన్నయితే మూలవిరాట్టు మార్పు చెందినవి కొన్ని. ఆ రోజుల్లో కృష్ణునికి వెన్నముద్దలు నైవేద్యంగా పెట్టేవారని అనిపిస్తున్నది ఈ కీర్తన వింటుంటే. పడతులిద్దరు రుక్మిణీ సత్యభామలు. పాండవులనుగాచె నంటున్నారు కాబట్టి ప్రౌఢ కృష్ణయ్య ఈ ఉద్దగిరి కృష్ణయ్య

అని భావించవచ్చు. అన్నమయ్య ఆనవాయితీ ప్రకారం ఇప్పుడు వేంకటాద్రిని యేలినాడు వింత వింత సొబగుల వెన్నముద్ద కృష్ణుడు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! ఉప్పతిలు మహిమల (అతిశయించిన మహిమలను చూపే) ఈ ఉద్దగిరి కృష్ణుడు ఇప్పుడు, ఇదే తన ఇంతులతోటి (భార్యలైన రుక్మిణీ, సత్యభామలతో) తాను వెలసి కొలువుదీరియున్నాడు.

ఆయన నందవ్రజమున కొన్నాళ్ళు గోవులను కాచాడు. ఆ రోజుల్లో ఇంద్రుడి వడగళ్ళబారి నుండి గోకులాన్ని రక్షించుటకు కొండ గొడుగుగా పట్టుకొన్నాడు (గోవర్ధన పర్వతాన్ని చిటికెన వ్రేలిపై నెత్తి గొడుగువలె దానిక్రింద వారికి రక్షణనిచ్చాడు). కావరించి (మదమెక్కి) మద్దులైన కుబేరుని పుత్రులకు గక్కున తొక్కి శాపవిముక్తులను చేశాడు. వావులు గలయ (వావి వరుసలేకుండా) గోపికలను పొందినాడు. ఈ వెన్నముద్ద కృష్ణుని చేతలు (లీలలు) వూహకందవు.

కొన్నాళ్ళకు ఆ కృష్ణయ్య కంసుని ఆహ్వానం మేరకు మధురానగరం వెళ్ళాడు. అక్కడ కొందరు మల్లులను మల్లయుద్ధంలోనే వధించాడు. పొరిగొన్న కంసుని (తనను వధించాలనుకొన్న కంసుని) సంహరించినాడు. అంతకు మునుపే ఆ క్రూరుడు పంపిన రాకాసులను అంతమొందించినాడు. తెల్లమిగా (స్పష్టముగా) తన తలిదండ్రులు దేవకీవసుదేవులని ప్రకటించినాడు. ఈ వెన్నముద్ద కృష్ణుడు మధురాతిపతియై పరిపాలించాడు.

అటుపిమ్మట ప్రౌఢ కృష్ణయ్య పాండవుల రక్షకుడై భారతయుద్ధము నిర్వహించి దుష్టరాజలోకాన్ని నిర్మూలించి భూభారాన్ని తగ్గించాడు. దేవతలందరినీ పాలించినాడు. ఇదిగో కలియుగం వచ్చేశిందని శ్రీ వేంకటాద్రిపై వెలసి అవనిని యేలుతున్నాడు. ఈయనే ఆనాటి వింతవింత శోభలు గల వెన్నముద్ద కృష్ణుడు.

పద్యవివరణ:

కం॥ **ఇప్పుడిదెకొలువుదీరెను**
అప్పడతులతోటి వెలసెనదె వుద్దగిరిన్
గొప్పగ "వేంకట" కృష్ణుడు
ఎప్పటికిని వెన్నముద్దలితనికి విందే.

సంఖ్య: II/512 రాగం : సామంతం
కీర్తన : నీచేతలోవారము నీవారము

సామంతం

27 నీచేఁతలోవారము నీవారము
యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము ॥పల్లవి॥

ఇన్నిటాఁ బూర్ణుఁడవు నీ వెరఁగనియర్థమేది
విన్నపము నేఁజేసేవిధమేది
మన్నించిననీమన్ననే మహిమలో మాబ్రదుకెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము ॥నీచేఁ॥

ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి
గొనకొని నే నిన్నుఁ గొసరేదేమి
పొనుగక యేలితివి పుట్టినమాపుట్టుగెల్ల
ననిచి నిన్ను నమ్మిననమ్మికే మావ్రతము ॥నీచేఁ॥

శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తగించనిది యేది
భావించి నేఁ బొందనిభాగ్య మేది
యేవల మాపరాభారా లింతయు నీ కెక్కినది
ఆవటించి నే నీశరణన్నదే మావ్రతము ॥నీచేఁ॥ 512

ఉపోద్ఘాతము:

తెలుగు భాష గొప్పతనం ఈ కీర్తనలో మరొక్కసారి ప్రస్ఫుటమవుతున్నది. నేను మొదట ఈ పల్లవిని "నీచేతిలోని వారము"గా ప్రారంభించి ఆయనకు లోబడివుండే ఆయన దాసులుగా అర్థం చెప్పాను. కాని పల్లవిలో నీచేతలో వారము అని అన్నమయ్య రచన. ఎంత తారతమ్యం వచ్చేసిందో చూడండి. నీచేతలో వారమంటే నీవు చేసిన దానిని కాదనలేని కర్మబద్ధులము, అశక్తులము అని అర్థం. ఏచినీకే చేతమొక్కేము. ఇదే మా వ్రతము అంటే... అతిశయించి, నీకే చేతులతో మ్రొక్కెదము మరియు ఇదియే మా నోము అని అర్థం. ఇహము మా కర్మవశమే

అయినా పరము నీచేతిలోనిది. అది నీకేలోబడి మాకు యెక్కును. ఓ వేంకటేశ్వరా! శరణు శరణు... దానిని కాస్త తీర్చిదిద్దు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! మేము, నీ చేతలోవారము (నీవు చేసిన దానిని కాదనలేని కర్మబద్ధులము). అయినా మేము నీ శత్రువులముకామయ్యా! నీవారము. ఏచి (అతిశయించి) నీకే మ్రొక్కెదము. మరియు అదే మా వ్రతము (నోము) అని నిశ్చయించుకొన్నాము.

ఇన్నిటా (ఈ విశ్వంలో) నీవే పూర్ణుడవు (సర్వశక్తి సంపన్నుడవు). నీవు యెఱంగని అర్థమేవుండదు. అటువంటప్పుడు నేను యేవిధముగా విన్నపము చేసికొనినా పర్వాలేదు. అది నీకు తెలుస్తుంది కదా! మేము నీ మహిమకులోబడి బ్రతికేవారము అది నీవు మాకు మన్నించి ఇచఇచ్చిన మన్నన. అందుకనే నేను నీ దాసుడను. నీ దాస్యమొక్కటియే మావ్రతము.

దేవా! నీవు ఘనమైన దేవమవు. నీకు కడమ యెక్కడిది (కొఱత అనేది యెలా వుంటుంది?) నిన్ను కొసరి కొసరి అడుగవలసిన అవసరమే లేదు. నీవేది కావాలంటే యెంత కావాలంటే అంత ఇవ్వగలవు. పుట్టినదాదిగా మా పుట్టుకంతా నీవు మమ్ము పొనుగక (వెనుదీయక) యేలితివి (కాపాడినావు). నిన్ను నమ్మిన నమ్మికే మావ్రతము. నిన్ను దక్క మరి దేనినీ నమ్మను ప్రభూ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చిత్తగించని విన్నపము (నీ భక్తుల అభ్యర్థన) వుండనే వుండదు. భావించి (నేను కావాలనుకొని) నీనుండి పొందని భాగ్యమేది స్వామీ! మాపరభారాలు (మా పరము యొక్క గతిని తీర్చిదిద్దే భారము) మరి నీది కాక ఇంకా యెవరిది? అది నీకెక్కినది (నీ ద్వారా సిద్ధించవలసినదే.) ఆవటించి (కృతనిశ్చయములమై) మేము నీ శరణమన్నాము. ఓ సర్వేశ్వరా! నీ శరణాగతియే మా వ్రతము.

పద్యవివరణ:

కం॥ **నిక్కుచు నీవారము హరి!**
మక్కువ నీ చేతలోన మసలుదుమయ్యా!
మొక్కేమిదె మావ్రతమగు
చక్కని శ్రీవేంకటేశ! శరణమె వ్రతమౌ

సంఖ్య: XXIX/323 రాగం : శ్రీరాగం
కీర్తన : ఇంతమేలు వాడవై యింకా నేలజరసేవు

శ్రీరాగం

28 ఇంత మేలువాఁడవై యింకా నేల జరసేవు
సంతోసముతోడనే చనవియ్యరాదా ॥పల్లవి॥

చలిచిరునవ్వులనే చిత్తము గరఁగితివి
యెలమి నాపెతోఁ బంతా లే లాడేవు
కలికిచూపులకే కాయమెల్లాఁ జెమరించె
పెలుచుఁదనాల నేల పెనఁగులాడేవు ॥ఇంత॥

పెదవిపైమాఁటలకే పెద్దగా వలచితివి
యెదిరించి యాల యెలయించ వచ్చేవు
వుదుటు గుబ్బలకే వుబ్బి మొగమోడితివి
మదిరాక్షితో నేల మారుకొనేవు ॥ఇంత॥

అట్టెచే సన్నలకే ఆ సాసలఁ జొక్కితివి
దిట్ట సరసాలనే తిట్టఁ జూచేవు
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వలమేల్మంగను
వొట్టుక యాకె నింతేల వొలలఁ బెట్టేవు ॥ఇంత॥ **323**

ఉపోద్ఘాతము:

ఓ శ్రీనివాసా! నీవు ఇంత హితుడవైకూడా ఇంకా వెనుకంజ యేల వేయుచున్నావు? సంతోషముతో ఆమెకు చనువు (అనురాగము) నందించవచ్చును కదా! అంటున్నారు అన్నమయ్య. ఆయన కాలంనాటి కొన్ని తెలుగు పదాలు నేడు వాడుకలో లేవు మొగమోడ్చడం, సాసలజొక్కటం, వొలల బెట్టటం వంటి పదప్రయోగాలు నిఘంటువుల్లో

కూడా కానరావు. అప్పుడేం చేయాలి? ఒక్కొక్కసారి భావించాలి. శ్రీనివాసుని కరుణవుంటే ఒక్కొక్కప్పుడు స్ఫురిస్తుంటుంది. నన్ను నమ్మండి.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీనివాసా! నీవు ఇంతమేలువాడవై (మేలు కోరుకొనేవాడవై కూడా,) ఇంత జరసేవు (ఇంత వెనుకాడేవు యేలనయ్యా?) సంతోసముతోడనే చనువియ్యరాదా (ప్రేమించరాదా?)

స్వామీ! నిన్ను జూడబోతే ఆ చెలి చిరునవ్వులకే చిత్తము గరగితివి (నీ మనస్సు కరిగిపోయింది.) అటువంటప్పుడు ఆమెతో పంతములేల నాడెదవు? ఆ కలికి (యువతి) చూపులకే నీకాయమెల్లా జెమరించె (నీ శరీరమెల్లా చెమటతో చిత్తడి అవుతుంది). ఇటువంటి స్త్రీతో నీవు పెలచుదనముతో (పెంకితనముతో) యేల ఆమెతో పెనగులాడెదవు?

స్త్రీలు మనస్సులో ఒకటనుకొని పెదవులతో ఇంకొకటి అంటారు. ఓ శ్రీనివాసా! నీవు ఆమెపైపై మాటలకే పెద్దగా వలచితివి. మరియేల ఆమెను యెదిరించి జగడానికి పురిగొల్పుతావు. నీవు ఆమె వుబ్బినగుబ్బలు చూడగనే తబ్బిబ్బవుదువు. మరి అటువంటప్పుడు ఆ మదిరాక్షితో నేల మారుకొనేవు (యెదుర్కొని తలపడెదవు) స్వామీ!

ప్రభూ! ఆమె చేతి సంజ్ఞలకే నీవు శ్వాస తీసికోవటం మరచినంతగా నిశ్చేష్టుడవైతివి. మళ్ళీ సరససల్లాపములాడుతూ, కోపంలో నిందిస్తావు. ఓ శ్రీవేంకటేశ్వరగా నీవు గుట్టుతో నీసతి అలమేల్మంగను కూడినావు. ఏవేవో ఓట్లు వేసికొని ఇంకా ఆమెను వలలో వేసికొన ప్రయత్నింతువు?

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇంతమేలువాడవికనేల జరసేవు**
సంతసమున సతికి చనువు నిమ్ము
ఒలల బెట్టనేల లలననుగూడక
వెంకటేశ! గుట్టు విప్పుటేల?

సంఖ్య: II/515 రాగం : నాట
కీర్తన : వెడలె వెడలె నదె వీధులవీధుల

నాట

29 వెడలె వెడలె నదె వీదులవీధుల
తొడికి దైత్యులనుఁ దుంచఁగను ॥పల్లవి॥

కోటిసూర్యు లొకకూటువ గూడుక
చాటువ మెరసేటిచక్రము
గాఁటపువేవేలు కాలరుద్రు లటు
నీటునఁ దొలఁకేటినిబిడచక్రము ॥వెడ॥

ప్రళయకాలముల బడబాగ్ని లొలుకు-
చలమరిప్రతాపచక్రము
కలకలరవముల కాలభైరవులు
కలసి మెలంగేటిగండచక్రము ॥వెడ॥

యమసహస్రములనంత మేకమై
సమరము గెలిచేటిచక్రము
అమరుచు శ్రీవేంకటాధిపుకరమునఁ
దెమలకయుండేటిదివ్యచక్రము ॥వెడ॥ 515

ఉపోద్ఘాతము:

శ్రీహరి దివ్యహస్తభూషణమైన సుదర్శనచక్రపు వైభవాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. నా భావన, తిరుమలలో సుదర్శన చక్రపు ఊరేగింపు సందర్భంగా పద కవితా పితామహుడు పాడిన కీర్తన అయివుండవచ్చును. కాలరుద్రుడు, కాలభైరవుల ప్రసక్తి అన్నమయ్యలో దాగివున్న శివతత్త్వ స్ఫురణ వెలువరిస్తున్నదేమో ననిపిస్తున్నది. వెయ్యిమంది యమధర్మరాజు అనంతముగ

యేకమైనా వారిని యుద్ధములో జయించగల ధీశాలి ఈ సుదర్శన చక్రము. శ్రీవేంకటేశ్వరుని దివ్యహస్త భూషణము ఈ చక్రము అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! అదిగో చూడండి, అదే వీధుల వీధుల (తిరుమలలోని ప్రతివీధిలోను) శ్రీవేంకటేశుని సుదర్శనచక్రము ఊరేగింపుగా, వెడలె వెడలె (పోతోంది చూడండి). దేనికి వెడలింది? దైత్యులను (రాక్షస ప్రవృత్తిగలవారిని) తొడికి (ఒడిసిపట్టుకొని), తుంచగను (సంహరించుటకు) పూనుకొనినది కాబోలు.

చాటువమెరసేటి (ప్రసిద్ధిగల కాంతులీను) ఆ చక్రము, ఒక కూటువ (ఒక్కచోట) కోటిమంది సూర్యులు కూడుకొని వున్నారా అన్నంత తేజస్సు కలిగినది. వేవేల గాటపు కాలరుద్రులు (వేలకొద్దీ కఠినాత్ములైన కాలరుద్రులు) నీటున తొలకేటి (నిస్తేజులై చలించిపోయే) నిబిడ చక్రము (దట్టమైన కాంతిగల చక్రము).

విబుధులారా! ఈ సుదర్శనచక్రము చలమరి ప్రతాపము కలిగినది (మత్సరము తొంగిచూచే ప్రతాపసమాయుతమైనది). అందువలన ఇది ప్రళయకాలమున లోకమును కమ్ముకొని దహింపజాలిన బడబాగ్ని ప్రత్యక్షముగ వ్యాపించగా కలుగు వినాశనమును సృష్టించ గలిగినది. కాలభైరవులందరూ రణగొణ ధ్వని చేస్తూ కలిసి వస్తున్నారా అన్నట్లు సంచరించే శౌర్యము గల చక్రము ఇదే సుమా!

ఇక ఈ సుదర్శన చక్ర వీరత్వము చూడబోతే అసమాన్యము. అనంత సహస్ర యములు (లెక్కింపలేని వేలకొలది కాలయములు) ఏకమై ఒక్క దండుగా మీద బడినా కూడా సమరమున (యుద్ధమున) గెలవజాలిన చక్రము ఇదే. శ్రీవేంకటాద్రీశుని హస్తములో అమరుచు (శోభించుచూ) తెమలక (స్థిరముగా) వుండేటి దివ్య సుదర్శన చక్రము ఇదే భక్తితో మ్రొక్కండి.

పద్యవివరణ:

చం॥ **వెడలెను వీధులన్ అదియె విష్ణుని చక్రముచేరి మ్రొక్కుడీ**
తొడుకుచు దుష్టదైత్యులను ద్రుంచగజాలును లిప్తపాటులో
వడిగల కోటి సూర్యసమభాసిత దివ్య సుదర్శనంబహో!!
విడువదు వేంకటేశ్వరుని వెక్కస హస్తపు భూషణంబిదే.

సంఖ్య: XXIX/517 రాగం : సామంతము
కీర్తన : ఏమని చెప్పగవచ్చు నిదివో నీసుద్దులు

సామంతం

30 ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ సుద్దులు
ఆముకొన్న నీ నటన లారడాయఁగదవే ॥పల్లవి॥

మొక్కు మొక్కరాఁగాను మునిగొప్పు జారెఁగదె
నిక్కి చూచితే సిగ్గులు నిండెఁగదవే
కక్కసించి నవ్వఁగాను కడుఁ జెమరించెఁగదె
ఇక్కడఁ బతి సంగాతా లింత సేసెఁగదవె ॥ఏమ॥

చెలుములు సేయఁగాను సేసలు పైఁబడెఁగదె
సొలయఁబోతే మతి చొక్కెఁగదవె
వెలిఁ గానుకియ్యఁగా చన్నులు గానవచ్చెఁగదె
యెలమి నీ చేఁతలే నిన్నింత సేసెఁగదవే ॥ఏమ॥

కదిసి కాఁగలించఁగా కళలు రేఁగెఁగదె
అదన మో వియ్యఁగా గంటేయఁగదవె
వదలక శ్రీవేంకటేశ్వరుఁడు తానె కూడె
యెదుటనే నీ భాగ్యా లింతసేసెఁగదవే ॥ఏమ॥ **517**

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన అన్నమయ్య నాయిక చెలికత్తెయై ఆలపిస్తున్నారు. ఓ దేవీ! నీ సుద్దులు యేమని చెప్పగవచ్చు నమ్మా? నీ నృత్యవిన్యాసము కైపెక్కునట్లు చేసినందువల్ల నీకు కొంత బాధ కలిగినది అని ఓదారుస్తున్నది, చెలికత్తె. ఈ కీర్తన తరచి తరచి ఆలోచిస్తేగాని వివరించలేము. నీవు నీ పతికి మొక్కుదామని ప్రయత్నిస్తే, తత్తరపాటులో మునికొప్పు జారిపోయింది కదమ్మా! అని నవవదువు పాట్లను వర్ణిస్తున్నారు. అంతదాకా యెందుకు? మీకు స్నేహం కలిసిన నాడే

శిరస్సున అక్షంతలుపడ్డట్లే, అయింది. నీ భాగ్యమేమని చెప్పేదమ్మా? శ్రీవేంకటేశుడే నీవాడు. నీకు లోటేముంది? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! నీసుద్దులు (నీ వలపు కతల) గురించి ఏమని చెప్పనమ్మా! నీకు నీవే సాటి. ఇదివో నిన్ను ఆముకొన్న (అలసి వివశురాలవైనంతగా) నీ నటనలు (నీవు చేసే నాట్య విన్యాసములు) ఆరడాయె (నిన్ను శ్రమతో కూడిన బాధపెట్టాయి) గదవే (కదమ్మా?)

దేవీ! నీ అవస్థ వినవేడుకవుతున్నదమ్మా! నీవు నీ పతికి మొక్కు మొక్కెదనని వంగినంతనే నీ కొప్పుముని జారె గదె (నీ ముందట జారివ్రేలాడింది.) ఆయన నవ్వుతున్నాడేమో అనే అనుమానంతో నిక్కి (పైకిసాగి) చూస్తే చెలులంతా నవ్వారని సిగ్గులతో నిండిపోయావు. నువ్వు కక్కసించి (తిప్పలుపడి) ఆయన నవ్వుతుంటే కడు చెమరించె (నీకింకా చెమటలు పట్టింది) కదమ్మా? అది చూచి నీపై నీపతి ఇంకా చెలిమి చూపించాడు కదమ్మా?

దేవీ! చెలుములు సేయగానే (మీకు స్నేహితము కలిసిననాడే) సేసలుపైబడె గదె (మీపై అక్షతల జల్లు కురిసిందిగదమ్మా!) వివాహ సందర్భముగా సొలయబోతే (పారవశ్యము చెందుటచే) నీ మనస్సు (మోహపరవశతనొందింది). నీయౌవనాన్ని కానుకగా ఇచ్చినందుకు సంకేతముగా నీ స్తనసంపద కనువిందు చేసినది. నీవు యెవరినేమని లాభమేమిటమ్మా? ఎలమి (అతిశయించిన) నీ చేష్టలే నిన్నీ స్థితికి తెచ్చాయి.

సరే! అటుపిమ్మట శ్రీనివాసుడు దేవిని సమీపించి కాగలించినాడు. దానివలన ఆమెలోని కళలు రేగినవి (అందములన్నీ ఇనుమడించినవి) దేవీ! ఆయనకు నీవు నీ మోవినియ్యగానే, గంటి ఆయె (గాట్లు పడినవి) కదవే (కదమ్మా!) అయిననూ శ్రీవేంకటేశుడు వదలక నిన్ను కూడినాడు. ఇదంతా నీ సుకృతమమ్మా! నీ భాగ్యమునేమని పొగడగలము.

పద్యవివరణ:

తే.గీ॥ **చెప్పవచ్చునేమని యిదో చెలియ! సుద్దు-**
లాముకొన్ననీ నటనలు ఆరడాయె,
కదిసి కాగలించగ నీదు కళలురేచె
భాగ్యమది వేంకటేశుడు పడతిగూడె.

సంఖ్య: XXIX/197 రాగం : గౌళ
కీర్తన : తారకబ్రహ్మమంత్రము తానై వున్నాడు రాముడు

గౌళ

31 తారకబ్రహ్మమంత్రము తానై వున్నాఁడు రాముఁడు
ధారుణిలోఁ జెలువొందె దశరథరాముఁడు ॥పల్లవి॥

కొండలంతలు వానరకోటులు గొలువఁగాను
దండితోఁ గొలువున్నాఁడు తగ రాముఁడు
అండనే సీతాదేవి యమరి కూచుండఁగాను
మెండుగ సింహాసనాన మెరసీని రాముఁడు ॥తార॥

వామదేవ కౌశిక వసిష్ఠాదులవిన్నపా-
లాముకొని వినుచున్నాఁ డదె రాముఁడు
గోమున భరత శత్రుఘ్నులు ఛత్ర చామరాలు
కామించి పట్టుకుండఁగా కడుమించీ రాముఁడు ॥తార॥

కనకపుష్పకము చెంగట వీరాసనముతో
ననిచి యానందాన నున్నాఁడు రాముఁడు
ఘన శ్రీవేంకటాద్రిపైఁ గల్పవృక్షము నీడ
హనుమంతుని చదువు లాలకించీ రాముఁడు ॥తార॥ **197**

ఉపోద్ఘాతము:

తారకరామునిగా వీరరాఘవుని కీర్తిస్తూ శ్రావ్యమైన శ్రీరామకథను వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన దశరథనందనుని స్తుతి యెన్నిసార్లు వినిపించినా కొత్త శోభలు కనబడుతూనే వుంటాయి. వామదేవుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు తన గురువులైనందువల్ల చక్రవర్తికి తమ ధర్మం ప్రకారం విన్నవిస్తున్నా శ్రీరామచంద్రుడు దానిని ఆజ్ఞగానే తలదాల్చేవాడు. అదిగో బంగారు పుష్పకవిమానము కూడా ఆయన సింహాసనము

సమీపముననే వున్నది. ఈనాటి వేంకటాద్రి కల్పవృక్షము నాటి నుండి నేటికీ మారుతి స్తుతిస్తుంటే తన్మయత్వంతో వింటాడు.

తాత్పర్య వివరణ:

ఈ శ్రీరాముడు తారకబ్రహ్మ మంత్రము (మోక్షప్రాప్తినిచ్చు పరబ్రహ్మస్వరూపుడు) తానే అయివున్నాడు. ఈయన ధారుణిలో (భూమండలంలో) దశరథ రామునిగా చెలువొందినాడు (శోభిల్లుతున్నాడు).

ఈయన నేతృత్వం వహించిన వానరసేనలో కోట్లాది వానరవీరులు ఉన్నారు. వారి ప్రతాపము కొండలంతలు (ఉన్నతమైనవి). వారందరూ శ్రీరాముని భక్తితో కొలిచారు. అందుచేత శ్రీరాముడు తగ దండితో కొలువున్నాడు (తగినట్లు సమర్థతతో కొలువుదీరియున్నాడు.) ఆయనకు వామ భాగమున అండనే (అదే గద్దెపై) సీతాదేవి కూర్చుని వున్నది. ఆమెతోపాటు శ్రీరాముడు మెండుగ సింహాసనముపై ప్రకాశించినాడు.

ఆ శ్రీరామచంద్రుడు తన గురువులను యెనలేని గౌరవంతోటి సేవించేవాడు. ఆయన చక్రవర్తియైనందువల్ల గురువులు విన్నవించుకొన్నా, శ్రీరాముడు ఆజ్ఞలవలె నిర్వర్తించేవాడు. అదిగో ఆయన సమీపముననే శ్రీరాముని గురువులు వామదేవుడు, కౌశికుడు (విశ్వామిత్రుడు) వశిష్ఠుడు వున్నారు చూడండి. అదిగో ఆముకొని ((శద్ధగా) వినుచున్నాడు ఆ శ్రీరాముడు. గోమున (సౌకుమార్యంతో) భరత శత్రుఘ్నులు చత్రము, వింజామర ధరించి కామించి ((ప్రేమతో) పట్టుకొని అతిశయించియున్నారు.

అదిగో చెంగటనే (సమీపముననే) బంగారు పుష్పక విమానము. వీరాసనముతో (సింహాసనముపై) ననిచి ((ప్రీతితో) ఆనందాతిశయమున శ్రీరాముడు వున్నాడు. అట్టి శ్రీరామచంద్రుడు కలియుగంలో శ్రీవేంకటాధిపునిగా వెలసి కల్పవృక్షమైనాడు. ఆ కల్పవృక్షపు నీడలో హనుమంతుడు నేటికి వేదపారాయణం చేస్తుంటే తిరుమలయ్య ఆలకిస్తుంటాడు.

పద్యవివరణ:

ఉ॥ **తారకబ్రహ్మమంత్రమది తానుగ శోభిలే రామభద్రుడున్**
ధారుణిలోననే చెలగి ధర్మసురక్షకుడాయె గద్దెపై
మీరక సత్యవాక్యమును మేదినినేలెను సీతతోడుతన్
వీరులసత్కరించెనట వేంకటరాముడు యేలె మారుతిన్.

సంఖ్య: XXIX/322 రాగం : లలిత
కీర్తన : మనచేతికి జిక్కెను మగువలాల

లలిత

32 మన చేతికిc జిక్కెను మగువలాల
వినయాన వేఁడుకోరే వీఁడె కాంతలాల ॥పల్లవి॥

వుబ్బుచుఁ గృష్ణుఁడు వాఁడే వుట్టలు గొట్టీ నదే
గొబ్బునఁ బట్టఁగదరే గొల్లెతలాల
అబ్బురపుఁ బాలు వెన్న లారగించి వారవట్టీ
దొబ్బి తీసుకోరమ్మా తొయ్యలులాల ॥మన॥

యింటింటి వాకిట వచ్చి ఇదె చక్కిలాలు దీసీ
అంటి పెనఁగులాడరే యంగనలాల
దంటయై గోపాలులుఁ దానూఁ బరువులు వెట్టీ
వెంటనే తగులరమ్మా వెలఁదులాల ॥మన॥

కాకుసేసి చన్నులంటి కాఁగలించుకొనవచ్చీ
యేకతాలకుఁ దియ్యరే యింతులాల
యీకడ నలమేల్మంగ నేలి శ్రీవేంకటేశుఁడు
మీ కోరి కిచ్చె మొక్కరే మెలుఁతలాల ॥మన॥ **322**

ఉపోద్ఘాతము:

అన్నమాచార్యులవారి పాండిత్యగరిమ ఈ కీర్తనలో ప్రతిఫలిస్తోంది. స్త్రీ అనే పదానికి యెన్ని పర్యాయపదాలు వాడారో చూడండి. ఈ చిలిపి కృష్ణయ్య యేమిచేస్తాడో తెలుసా? "కాకుసేసి చన్నులంటి కాగలించుకొంటాడట." అణచిపెట్టి స్తనగిరులనంటుతూ ఆలింగనంచేసికొంటాడట. ఎంత రండగొండివాడో కదా! అంటున్నారు. అయినాసరే! ఓ ఇంతులారా! వీడితో ఏకతాలకుదియ్యరే (ఒంటరిగా మాత్రం దొరకకండి) అంటున్నారు. ఆ రేపల్లె

కోడెగాడే ఈ అలమేల్మంగావిభుడు శ్రీవేంకటేశ్వరుడు. భక్తితో మొక్కరండీ అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మగువలారా! ఇదిగో కృష్ణుడు మన చేతికి చిక్కినాడు. ఓ కాంతలారా! వీనితో తలపడి నెగ్గలేము. వీనిని వినయముతో వేడుకొనండి.

అదె (అదిగో) వాడే కృష్ణుడు. ఉబ్బుచు (సంతోషముతో పొంగిపోతూ) వుట్టుల గొట్టీ (వుట్లలో గోపికలు దాచిన పాలు, వెన్నా కారిపోవునట్లు వీడు వుట్లను పగులగొట్టినాడు.) ఓ గొల్లపడుచులారా! వీనిని గొబ్బున (శీఘ్రముగ) పట్టుకొనుట అసాధ్యము. అబ్బురపు (ఆశ్చర్యకరంగా) పాలూ వెన్నా ఆరగించి (తిన్నంత తిని) వారకట్టి (పారబోసినంత పారబోసి) పాడుచేస్తాడు. ఓ తొయ్యలులారా! వీనిని దొబ్బి (తోసివేసి) పాలువెన్నా దక్కినంత తీసేసికోండి.

వీడు ప్రతిఇంటికీ వెళ్తాడు. వాళ్ళు వాకిట్లో వ్రేలాడగట్టుకొన్న చక్కిలాలు కనబడితే, వీడు వదలడు. ఓ అంగనలారా! వీడిని అంటుకొని పెనగులాడి చక్కిలాలు లాక్కోండి. దంటయై (స్వయంగా తోడుండి) తానూ తక్కిన గోపాలురూ ఎలా పరుగుతీస్తున్నాడో చూడండి. ఓ వెలదులారా! వాడి వెంటనే తగులరమ్మా (వెంటబడండమ్మా!) ఈ కృష్ణుడు అంత తేలికగా దొరకడు.

ఓ ఇంతులారా! ఈ కృష్ణుడు రండగొండివాడు. వీడు కాకుసేసి (అణచిపెట్టి) చన్నులంటి (స్తనయుగ్మమును తాకి) ఆపైన ఆలింగనము చేసికొంటాడు. ఓ ఇంతులారా! నా మాటవిని వీడిని ఏకతాన దియ్యరె (ఒంటరిగా పట్టుకోండి). ఈకడ (ఇప్పుడు) అలమేల్మంగను యేలిన శ్రీవేంకటేశ్వరుడు వీడే. మీ కోరికలు దెలిపి ఈయనకు మొక్కండి.

పద్యవివరణ:

ఆ.వె॥ **మగువలార! వీడె మనజేతికిని జిక్కె**
వేడుకొనరె హరిని, వినయమొప్ప
కాకుసేసి చనులు కాగలించంటును
జంకు గొంకులేని వేంకటపతి.

సంఖ్య: XXIX/321 రాగం : ముఖారి
కీర్తన : అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు

ముఖారి

33 అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు
నెమ్మది వింటిరటరే నిచ్చనిచ్చ కొత్తలు ॥పల్లవి॥

అల్ల వాఁడే శ్రావణ బహుళాష్టమిని నడురేయి
చల్లఁగా రోహిణివేళ జనించినాఁడు
వెల్లవిరి దేవకిదేవికి వసుదేవునికి
మొల్లమిఁ గొడుకైనాఁడు ముద్దులకృష్ణుఁడు ॥అమ్మ॥

పొంచి యశోదానందగోపులకు సుతునివలెఁ
బెంచఁగా రేపల్లెలోనఁ బెరిగీ వీఁడె
ముంచి యీతనికంటేనె ముందే బలభద్రుఁడు
అంచెల రోహిణీదేవి కవతరించినాఁడు ॥అమ్మ॥

మొదల దేవతలకు మూలభూతి యితఁడట
యెదుట లోకములెల్లా నేలీనటా
అదిగో శ్రీవేంకటేశుఁడై యలమేల్మంగాఁ దాను
చెదరక కాఁపురాలు సేసీనటా ॥అమ్మ॥ **321**

ఉపోద్ఘాతము:

ఈ గోపాలకృష్ణుని 'కతలు' నిచ్చనిచ్చ కొత్తలు అంటున్నారు తానూ ఒక గోపీస్త్రీ అయిన మన అన్నమయ్య. ఓ అమ్మలారా! అక్కలారా! అవిగో ఆ వింత సుద్దులను నెమ్మదిగా విన్నారటమ్మా! అని అంటున్నారు. ఇక ఆ తరువాత శ్రీకృష్ణ జననం, రేపల్లె చేరిక, కంసుని ఆగ్రహం, పూతనాది రాక్షస సంహారం, దేవతల సన్నుతి, ఆ శ్రీకృష్ణుడే ఈ శ్రీవేంకటేశుడు అని కీర్తన ముగిస్తారు.

అయితే ప్రతి కీర్తనలోనూ ఏదో ఒక నూతనత్వం వుంటుంది. అదే అన్నమయ్య ప్రత్యేకత. ఇందులో బలరాముడు రోహిణీ తనయుడు అనే ప్రస్తావన వస్తుంది.

తాత్పర్య వివరణ:

ఓ అమ్మలారా! అక్కలారా! అవిగో వింత సుద్దులు (కతలు) నెమ్మది (శాంతచిత్తులై) వింటారటరే (విన్నారుటమ్మా!) అవి నిచ్చనిచ్చ కొత్తలు (ఏనాటికానాడు నిత్యనూతనంగా వుంటాయి).

అల్లవాడే (అదిగో అతగాడే) రోహిణీ నక్షత్రయుక్త శ్రావణ బహుళాష్టమి నాటి అర్ధరాత్రి వసుదేవుని పత్ని అయిన దేవకీదేవికి అష్టమ శిశువుగా చల్లగా జన్మించాడు. ఈ ముద్దులొలికె కృష్ణుడు (నల్లనయ్య), ఆ దేవకీదేవికి మొల్లమిన్ కొడుకైనాడు (తఱుచుగా జన్మించు పుత్రుడైనాడు). ఈ శ్రీకృష్ణునిది నారాయణుని మూడవ జన్మ.

మరి అక్కడ మధురలో కారాగారంలో జన్మించినవాడు, పొంచి (రహస్యంగా) యశోద, నందగోపులవద్ద రేపల్లెలో పెంచబడి పెరిగి పెద్దవాడైనాడు. వీడే ఆ శ్రీకృష్ణుడు. ఈతని కంటే ముందుగానే దేవకి ఏడవ గర్భం స్రావమై ఆ బిడ్డ వసుదేవుని ఇంకొక భార్య రోహిణీ దేవి గర్భములో పెరిగి బలరాముడై జన్మించినాడు. ఈ విధంగా బలరామకృష్ణులు అన్నదమ్ములైనా, ఇద్దరు తల్లులచేత అన్నదమ్ములవలె ఒకేచోట పెరిగారు.

ఇంతకీ ఈ శ్రీకృష్ణుడు యెవ్వరనుకొన్నారు. ఈయన దేవతలకు మొదల మూలభూతి (మొదటి మూల పురుషుడు). ఆనాడు మధురను పరిపాలించాడు. నేడు ఈ తిరుమలనాథుడై యెల్ల లోకములను పాలించుచున్నాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగతో గూడి చెదరక (స్థిరముగా) కాపురము చేయుచున్నాడట. చూచి తరించెదము గాక!

పద్యవివరణ:

కం॥ **అవిగో సుద్దులు వింతలు**
అవి వినరే అమ్మలార! అక్కల్లారా!
భువినిత్యనూతనంబులు
ఇవి వేంకట కృష్ణమూర్తి యెఱుగనివటనే!

సంఖ్య: I/473 రాగం : శంకరాభరణం
కీర్తన : ఎంత భక్తవత్సలుడ విట్టుండవలదా

శంకరాభరణం

34 ఎంత భక్తవత్సలుఁడ విట్టుండవలదా
వింతలు నీ సుద్దులెల్లా వినఁబోతే నిట్టివే ॥పల్లవి॥

యిల నసురారియనే యీబిరుదు చెల్లె నీకు
బలివిభీషణాదులపాలికే చెల్లదు
కెలసి అవులే నీవు గెలుతు వెందరినైనా
తలఁచి చూడ నీదాసుల కోడుదువు ॥ఎంత॥

యిందరిపాలిటికిని యీశ్వరుఁడ వేలికవు
పందవై యర్జునుబండిబంట వైతివి
వందనకు నౌలే దేవతలకే దొరవు
అందపునీదాసులకు నన్నిటా దాసుఁడవు ॥ఎంత॥

కడుపులో లోకముకన్న తండ్రి విన్నిటాను
కొడుకవు దేవకికిఁ గోరినంతనే
తడవితే వేదములు తగిలేబ్రహ్మమవు
విడువనిమాకైతే శ్రీవేంకటాద్రిపతివి ॥ఎంత॥ **473**

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశ్వరుడు భక్తవత్సలుడు. ఆయన భక్తవత్సలత నిరూపించే భాగవతకథలన్నీ వినబోతే వింతలే. ఆనాడు నీవట్లా వుండి తోడూనీడై నీ శరణాగతులను గాచావు. ఇది కలియుగం. మేము ఇంకా బలహీనులం, బలహీనతలున్నవాళ్ళం. ఇప్పుడు కూడా నీవు ఇట్లాగే వుండకపోతే మా గతేమిటి ప్రభూ! అంటున్నారు అన్నమయ్య. ఆ స్వామి ఆయన శరణార్థియెవ్వడైనా సరే! కాపాడినాడు కదా! బలి, విభీషణుడు రాక్షసులని

త్యజించాడా? అర్జునుడికి రథసారథియై భీష్ముడి చేతిలో గాయాలపాలయ్యాడు కదా! ఆయన తన దాసుల చేతిలో ఓటమినైనా స్వీకరిస్తాడు. తన దాసులకు తానే దాసుడు. అంత భక్తసులభుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవెంత భక్తవత్సలుడవు (భక్తులను వాత్సల్యముతో చూచువాడవు.) నీ సుద్దులు (భాగవతగాథలు) యెల్లా వింతగొలుపునవే. వినబోతే అవన్నీ ఇట్టివే (ఇదే విషయం నిరూపిస్తున్నాయి.) ప్రభూ! ఇది కలియుగం. అయినా నీవు ఇట్టుండవలదా (ఇలాగే వుండాలి కదా!)

నీకు అసురవైరి అనే బిరుదు సరియైనది అనుకోనా అంటే నీవు ఆనాడు కృతయుగంలో బలిచక్రవర్తి, త్రేతాయుగంలో విభీషనుని వద్ద ఆ మాట చెల్లనే లేదు. నీవు ఆ ఇద్దరికీ రక్షకుడవైనావు. అవులే (ఔనులే) నీవు కెలసి (అవసరమొస్తే) యెవ్వరినైన గెలువగలవు. కానీ అదేమిటో నీదాసుల చేతిలో ఓడిపోతే నీకు సంతోషమే.

ఇందరిపాలిటి (ఇంతమందికీ) నీవే ఈశ్వరుడవు కదా! ఏలికవు (ప్రభువుకూడా నీవే కదా?) మరి ఆనాడు ద్వాపరయుగంలో అర్జునుడికి బండి బంటువై (రథముతోలేవాడివై) పందవై (భృత్యుడవైనావు). ఔలే (అవునులే) నీవేమో దేవతలకే, వందనకు దొరవు (నిత్యమూ స్తుతించే) యజమానివి. కానీ విశిష్ములైన నీదాసులకు మాత్రం నీవే దాసుడవు.

ఇన్నిటాను (ఈ సృష్ఠిలో అన్నిటికీ) నీవే కన్నతండ్రివి. లోకములలో యెక్కడైనా నీవే వున్నావు. కాని దేవకీదేవి కోరుకొనగానే ఆమెకు కన్నకొడుకువైనావు. తడవితే (ప్రస్తావనకు వస్తే) నీవే వేదములు తగిలే బ్రహ్మవు (నుతించే పరబ్రహ్మ స్వరూపుడవు.) మాకు మాత్రం యెన్నడూ తోడు విడువని శ్రీ వేంకటేశ్వరుడవు.

పద్యవివరణ:

తే.గీ॥ **ఎంత భక్తవత్సలుడ వయిట్టులుండ-**
వలదె? సుద్దులు వింతలు పట్టి వినగ
అసురగావు, తోలితి వరదమున్ను
వేద సంరక్షకుడ వీవు వేంకటేశ!

సంఖ్య: XVII/27 రాగం : పళవంజరం
కీర్తన : వింటెరటే చెలులాల వేడుక సంతోసివార్త

పళవంజరం

35 వింటిరటే చెలులాల వేడుక సంతోసవార్త
యింట నింట వూరనెల్ల యిదే సుద్ది ॥పల్లవి॥

కోమలి దేవకిదేవి కొడుకుc గంటే రేపల్లెc
బ్రేమతో వసుదేవుఁడు పెంచఁబెట్టి వచ్చెనట
గామిడై యశోదకూఁతుc గంసునికిc జూపెనట
ఆ మగువ కంసుని నద్దలించినదట ॥వింటి॥

శ్రావణబహుళాష్టమి సవరేతిరికాదను
ఆవేళ రోహిణి మంచిదైనొద్దునట
కావింప మేనమామకు గండమట యీతఁడే
దేవరట బాఁపలెల్లా దిక్కులc జెప్పిరి ॥వింటి॥

యిటమీఁద రాకాసుల నిందరిc గొట్టెనట
ఘటన సాధులనెల్లాc గరుణ రక్షించెనట
పటుగతి వీఁడు శ్రీవేంకటగిరికృష్ణుఁడట
నటించునలమేల్మంగ నాయఁకుడు దానట ॥వింటి॥

ఉపోద్ఘాతము:

శ్రీకృష్ణుని లీలలను గోపికలు సుద్దులుగా (కతలుగా) చెప్పుకొంటున్నారు. కాని అన్నమయ్య రామకథనైనా, శ్రీకృష్ణ చరిత్రనైనా ఒక క్రమంలో ఆద్యంతాలు వదలక వినిపిస్తారు. శ్రీవేంకటపతి మకుటం యెలాగూ శిరోధార్యమే కదా! అనేక తడవలు ఇదే కీర్తన చదివినామా అనిపిస్తుంది. కాని పరిశీలనగా చూస్తే ప్రతి కీర్తన విభిన్నంగానే వుంటుంది. యశోద కూతురుని కంసునికి వసుదేవుడు చూపించాడట అని గోపికలు చెప్పుకొనే అవకాశం లేదు. అది కంసవధ దాకా అతి గోప్యం. కాబట్టి ఇది గోపికలు పాడినా... శ్రీకృష్ణుని తలచుకొంటూ ఆయన గాథలను నెమఱువేసికొంటున్నారని

భావించాలి. అప్పుడు సరిపోతుంది. ఆనాటి దుష్టశిక్షకుడే ఈనాటి శిష్టరక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియలారా! వేడుక (వినోదము) సంతోష (ఆనందమును) ఇచ్చే వార్తను వింటిరటే (విన్నారుటే). వూరనెల్ల యింటనింట (ఊరంతా, ఇల్లిల్లూ) యిదే సుద్ది (ఇదే ముచ్చట కదమ్మా!)

తన భార్య దేవకీదేవి మధురలో కొడుకును కంటే (ప్రసవిస్తే) వసుదేవుడు అర్ధరాత్రివేళ ఆ శిశువును యమునానది దాటించి రేపల్లెలో నందుని భార్య యశోద కన్న ఆడ శిశువుతో మార్పిడి చేశాడట. ఈ విధంగా ఆ బాలుని రేపల్లెలో పెంచబెట్టాడట. గామిడైన కంసునికి (దుష్ట కంసునికి) ఆమె కూతురును తనబిడ్డేనని చూపినాడు. ఆ స్త్రీ శిశువు యోగమాయయై కంసుని అద్దరించినదట (హెచ్చరించినదట).

చెలియలారా! బాఁపలెల్లా (బ్రాహ్మణులంతా) దిక్కులు జెప్పిరి. (అనేక చోట్ల రహస్యంగా చెప్పుకొంటున్నారట). శ్రావణ బహుళాష్టమి నాటికి సమరేతిరి (అర్ధరాత్రి) ఆ బాలుడు రోహిణీ నక్షత్రంలో పుట్టినాడట. ఆవేళ పుట్టిన వాడు తన మేనమామకు పెద్ద గండమట. ఈ శిశువే దేవరట (దేవదేవుడైన శ్రీహరియట). మరి మీరు రహస్యంగా వుంచండి.

ఇక ఇప్పుడేమి జరుగబోతున్నదో తెలుసా? యిటుమీద (ఇకపై) రాకాసుల నెల్లా (రాక్షసులను రాక్షసత్వంకలవారినీ) కొట్టెనట (వధించునట). సాధులనెల్ల (సజ్జనులనందరినీ), ఘటన (పూనికతో) కరుణజూపి రక్షించునట. వీడు (ఈ బాలుడే) పటుగతి (పట్టుదలతో) శ్రీవేంకటాద్రిజేరి కలియుగంలో శ్రీవేంకట కృష్ణుడైనాడట. నాట్య ప్రవీణురాలైన అలమేలుమంగ నాయకుడు తానేనట.

పద్యవివరణ:

కం॥ **వింటిరటే చెలులారా!**
ఇంటింటా వూరనెల్ల యివె సుద్దులుబో!
తుంటరి ఆ కృష్ణయ్యే
జంటై అలమేలుమంగ స్వామైనాడే.

సంఖ్య: I/506 రాగం : సాళంగం
కీర్తన : మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను

సాళంగం

36 మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను
మఱఁగుచొచ్చితి మీకు మముఁ గావరో ॥పల్లవి॥

యేపున మనసనియేటిమా పెంపుడు లేడు(డి)
పాపమనేయడవిఁ బడినది
రాపున హరికింకరపువేఁకకాండ్లాల
పైపైని మా కింకఁ బట్టియ్యరో ॥మొఱ॥

అంచెల మావిజ్ఞానమనెడి కామధేనువు
పంచేంద్రియపురొంపిఁ బడినది
మించి వైకుంఠానకేఁగేమేటి తెరువరులాల
దించక యెత్తెత్తి వెళ్లఁదియ్యరో ॥మొఱ॥

అండనే మోహాంధకారమనెడిమాదిగ్గజము
దండి మీదయనేటివోఁదానఁ బడెను
నిండి శ్రీవేంకటేశుఁడ నేటిమావటీనిచేత
గండికర్మపుకంభానఁ గట్టించరో ॥మొఱ॥ **506**

ఉపోద్ఘాతము:

"మొగసాల" అంటే, నగరముయొక్క తలవాకిటలో వుండే చావడి అని అర్థం. దీని వాకిట్లో ప్రజలు గుమికూడి నగరంలోని విశేషాలు ముచ్చటించుకొనేవారు. ఎవరన్నా యేదన్నా నగరంలోని న్యాయాధిపతికి చెప్పుకోవాలంటే మొగసాల యెక్కేవారు. ఈ కీర్తనలో అన్నమయ్య హరి కావలివాండ్లను, వైకుంఠానికి పోతున్న ముక్తులను, తిరుమలేశుని దాసులను ఉద్దేశించి మముగావరో అని పాడుతున్నాడు. మొగసాల వాకిట్లో మీకు మొఱబెట్టుకొంటూన్నాము. మీకుమఱగు జొచ్చి మీ ఆశ్రయంలో జేరాము.

మమ్ము రక్షింపరో అని పై మువ్వురినీ ఎలా వేడుకొంటున్నారో ఆలకించండి. ఒకటికి రెండుసార్లు చదివితేగాని ఈ కీర్తన అర్థం కాదని నా అభిప్రాయం.

తాత్పర్య వివరణ:

మీకు మొఱబెట్టుకుంటున్నాము. మొగసాల వాకిటను (మొగసాల చావడిలో) అందరి ముందు మా గోడు వినిపించుకొంటున్నాము. మీకు మఱగుజొచ్చితిమి (మీ ఆశ్రమంలో చేరాము). మముగావరో! (మమ్మల్ని రక్షించండయ్యా!)

మావద్ద ఒక పెంపుడు లేడి వున్నది. అదే మామనస్సు ఏపున (అహంకరించి) అది పాపము అనే అడవిలో చిక్కుబడిపోయింది. ఓ హరికింకపు వేకకాండ్లలారా! (దుస్సహులైన శ్రీహరికింకరులారా!) రాపున (ఘర్షణ పడియైనా) మాకు మా లేడిని, ఇంక పైపైనిబట్టియ్యరో (ఇకనైనా సునాయాసంగా మాకు దొరికేట్లు చేయండి).

మా విజ్ఞానము (భగవత్ జ్ఞానము) అనే కామధేనువు (గంగిగోవు) మా అంచెల (మా ఆశ్రయంలో) వుండేది. అది ఇవ్వాళ పంచేంద్రియాల పీడ అనే రొంపిలో (బురదగుంటలో) పడిపోయి దీనంగా అరుస్తున్నది. వైకుంఠానికి పోతున్న తెరవారులారా, ముక్తిమార్గంలో వున్నారు మీరైనా దానిని వదలక యెత్తెత్తి (నెమ్మదిగా పైకెత్తి) వెళ్ళదియ్యరో! (బయటకులాగి పుణ్యంకట్టుకోండయ్యా!)

అండనే (అక్కడే దగ్గర్లో) మా పట్టపుటేనుగు వున్నది. నాతోడున్నవాళ్ళే మోహాంధకారము అనబడే ఆ పట్టపుటేనుగును దండిమీద (ఒళ్ళు పొగరు) అనే గోతిలో పడవేశారు. అటువంటి దిగ్గజాలను బయటకు వెళ్ళదీయగల ఒక మేటి "మావటి" వున్నాడు. ఆయనే శ్రీ వేంకటేశ్వరుడు ఆయనను పిలిపించి, గండికర్మలు (బలమైన కర్మలు) అనే స్తంభానికి కట్టేయించండి.

పద్యవివరణ:

ఆ.వె॥ **మొఱలు వెట్టినాము మొగసాల వాకిటన్**
మీకు దాసులమని మేము మొక్కి,
మఱగుజొచ్చినాము మముగావరో యని
వేడినాము శరణు వేంకటేశ!

సంఖ్య: XVIII/78 రాగం : మంగళకౌశిక
కీర్తన : నేరుపరివినీవైతే నెలతై తే ముద్దరాలు

మంగళకౌశిక

37 నేరుపరివి నీవైతే నెలఁతై తే ముద్దరాలు
పేరునఁ బిలిచి నీవే పెనఁగఁగరాదా ॥పల్లవి॥

చిన్నదిగనక యింతి సిగ్గుతోడ నున్నది
అన్నిటా రట్టడివి మాటాడించరాదా
తన్నుఁదానె నీపై ప్రేమ దాఁచుకొని వున్నది
సన్నలనే నీమోవి చవిచూపరాదా ॥నేరు॥

జవరాలుగనక ఆసలఁ బొంచుకవున్నది
నవకపుజాణవు నవ్వించరాదా
వివరించి బత్తి వెల్లవిరి సేయకున్నది
చివురుకెంగేలు చాఁచి చిమ్మిరేఁచరాదా ॥నేరు॥

కొమరెగనక కడుగుట్టుఁతోడ నున్నది
నెమకి దిట్టవు మేలు నెరపరాదా
అమర శ్రీవేంకటేశ అండ వాయకున్నది
సమరతి నిట్లానే చనవియ్యరాదా ॥నేరు॥ **78**

ఉపోద్ఘాతము:

ముద్దరాలు అంటే ముగ్ధయైన స్త్రీ అని అర్థం. కొమరె అంటే యౌవనవతి అని అర్థం. ఇటువంటి పదములు ఈ కీర్తనలో అడుగడుగునా కనిపిస్తూనే వుంటాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నేర్పరివైతే ఆ నెలత ముగ్ధ. నీవు ప్రేమగా ఆమెను పేరుబెట్టి పిలిచావు. అటువంటి నీవే పెనగ (కౌగలించ) వచ్చు? అంటున్నారు అన్నమయ్య. ఆమె కొమరెగనుక కడుగట్టుతో వున్నది. నీవే ఆమె

ఎక్కడున్నదో కనుక్కొని ఆమెకు మేలుచేయరాదా? ఆమె నీ అండ బాసివుండలేదు. నీవే సమభోగమున ఆమె నలరించ సమర్థుడవు. ఆమెకు ఇట్లానే చనువియ్యవయ్యా!

తాత్పర్య వివరణ:

శ్రీనివాసా! నీవు నేరుపరివైతే (నేర్పరివి అయితే) మరి నీ నెలత (తరుణి) అయితే ముద్దరాలు (ముగ్ధ). నీవే ఆమెను పేరుబెట్టి బిలిచి పెనగగరాదా? (పెనవేసుకోవచ్చునుకదా!)

ప్రభూ! ఆమె చిన్నది (చిరుప్రాయముది). కనుక ఆ ఇంతి (యువతి) సిగ్గు అధికమైయున్నది. నీవు అన్ని విధములా రట్టడివి (తెగించినవాడవు). నీవె అనునయించి ఆమెను మాట్లాడించరాదా? ఆమెకు నీపై అత్యధికమైన అనురాగము వున్నది. అయినా తన్ను తానే ఆ ప్రేమను దాచుకొన్నది. సన్నలనే (సాయంసమయముననే) నీ అధరామృతమునందించరాదా?

ఓదేవా! ఆమె జవరాలు (ప్రియురాలు) గనుక ఆశతో నీకై పొంచుకవున్నది (వేచివున్నది). నీవు నవకపు జాణవు (మృదుత్వముగల నేర్పరివి). ఆమెను సంతోషపెట్టరాదా? ఆమెకు నీవనిన అత్యంత భక్తి కలదు. కానీ దానినామె బహిర్గతము సేయలేకున్నది. చివురుటాకు వంటినీ చేయిజాచి, చిమ్మిరేచరాదా (చెలరేగరాదా)?

ప్రభూ! కొమరెగనక (ఆమె కౌమారములోనున్నది గనుక) యెక్కువ గుట్టుతో గుంభనముగానున్నది. నీవు దిట్టవు (సమర్థుడవు). నెమకి (ఆమె ఆంతర్యము కనుగొని) నీవే ఆమెకు మేలు నెరపరాదా (మంచి చేయవచ్చునుగదా!) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే ఆమె ప్రాణేశ్వరుడవు. అందుచేత అమరి ఆమె అండవదలకుయున్నది. సమభోగములో ఇట్లానే (ఇలాగే) చనువియ్యరాదా (ఆప్యాయత నివ్వరాదా!)

పద్యవివరణ:

కం॥ **నేరుపరివి నీవైతే**
కోరిన ఆ నెలత నిన్ను కూరిమి చేరెన్,
చేరినది ముద్దరాలుర
పేరున బిలిచింక నీవె పెనగగదగునా?

సంఖ్య: I/505 రాగం : బౌళి
కీర్తన : సుఖమును దుఃఖమును జోడుకోడెలు

బౌళి

38 సుఖమును దుఃఖమును జోడుకోడెలు
అఖిలముఁగన్నవారు అడ్డమూడ రెపుడు ॥పల్లవి॥

యెందాఁకా సంసార మెనసి తాఁ జేసేను
అందాఁకా లంపటము లవి వోవు
కందువ జీవుఁడు భూమిఁ గాయ మొన్నాళ్ళు మోఁచె
అందుకొన్నతనలోనియాసలూఁ బోవు ॥సుఖ॥

అప్పటిఁ దనకు లోలో ఆఁక లెంతగలిగినా
తప్పక అందుకుఁ దగ దాహముఁ బోదు
అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్లువుండె
ముప్పిరి వడ్డివారక మూలనుండినాఁ బోదు ॥సుఖ॥

దైవముపై భక్తిలేక తనకు నెన్నాళ్లుండే
దావతి కర్మపుపాటు తనకు బోదు
శ్రీవేంకటేశ్వరుని సేవ దన కెప్పు డబ్బె
వోవరి నందలిమేలు వొల్లనన్నాఁ బోదు ॥సుఖ॥ **505**

ఉపోద్ఘాతము:

సుఖదుఃఖాలు కాడెద్దులలాంటివి. అవెప్పుడూ జంటగానే వుంటయి. పూర్తిగా సుఖముకాని పూర్తిగా దుఃఖముకాని తటస్థించవు. ప్రపంచాన్నంతా అనుభవించినవారు ఈ సంగతి తెలియుటవలన యెప్పుడూ వాటికి అడ్డుచెప్పరు. అవి భగవదేచ్ఛననుసరించి వస్తూనే వుంటాయి పోతూనే వుంటాయి అంటున్నారు అన్నమయ్య. దైవభక్తిలేని మానవజన్మనెన్నాళ్ళున్నా వొరిగేదేముంది? కర్మలు చేయటం వాటి ఫలితం అనుభవించడం అంతే

గదా! శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో సేవిస్తేనే మేలు కలుగుతుంది. ఆ మేలు యెంత విశిష్ఠమైనదంటే అదినాకొద్దు స్వామీ అన్నా జమ అవుతుంది.

తాత్పర్య వివరణ:

సుఖమును దుఃఖమును జోడు కోడెలు (బండికి కట్టిన యెద్దుల జంట వంటివి). అవి యెప్పుడూ జంటానే వస్తుంటాయి. ఈ సంగతి తెలిసినందునే అఖిలముగన్నవారు (ప్రపంచాన్నంతా అనుభవించినవారు) యెపుడు (యెప్పటికీ) అడ్డమాడరు (వాటికి అడ్డుజెప్పరు).

ఎంతవరకు సంసారం మీద మమకారంతో తాను చేస్తుంటాడో, ఆ నరునికి అది (ఆ సంసారం) లంపటములై పొమ్మన్నా పోవు. ఈ జీవుడు యెన్నాళ్ళు భూమిమీద శరీరాన్ని పొందివుంటాడో అన్నినాళ్ళూ ఆ జీవికి ఆ దేహానికి సంబంధించిన కోరికలు అంటుకొని పొమ్మన్నా పోవు. ఆ జీవికి ఆ ఆసలతో సతమతమవక తప్పదు.

ఎవ్వనికైనా ఆకలివేస్తే అది లోలో (వాడిలోపల్లోపలే) దహించివేస్తూ అప్పటి (విరసత్వము) యెంతైనా పెంచుతుంది. అది దాహము కింద పరిణామంచెంది ఆ తపన యెంతకీ పోదు. తనమీద మోచిన (భారమైన) అప్పు యెన్నాల్ళున్నా, వడ్డీ రూపంలో పీడయై మనం యే మారుమూల దాగికొన్నా పోనేపోదు. ఆ వడ్డీ, ఋణం వున్నంతకాలమూ వుండేదే.

తనకు (మనిషికి) దైవభక్తిలేకపోతే యెన్ని జన్మలెత్తినా యెన్నాళ్ళు జీవించినా నిష్ప్రయోజనమే. దావతి కర్మ (దుఃఖము కలిగించే కర్మానుభవము పొందక తప్పదు). తనకు దాని పాటు పొమ్మన్నా పోదు. తనకు (ఆ జీవికి) శ్రీవేంకటేశ్వరుని సేవా భాగ్యము యెప్పుడు కలిగినా అప్పట్నుంచి అది చేసే మేలు పొమ్మన్నా పోదు.

పద్యవివరణ:

ఉ॥ **జంటగనున్న కోడెలివి సౌఖ్యము దుఃఖము వాయవెన్నడున్**
జంటను, దీనినేర్చికద! సర్వముగాంచిన సాధులందరున్
అంటియు అడ్డమాడరెపు డావిధి సైతురు వేంకటేశ! చే
కొంటిని నీదు సేవయది కూర్చెడి మేళ్ళును బోవుతోసినన్

సంఖ్య: XVIII/153 రాగం : ముఖారి
కీర్తన : వాకిలిగాచేయట్టివనితల మిదె నేము

ముఖారి

39 వాకిలిగాచేయట్టివనితల మిదె నేము
జోకదప్పకురే మీరు సుదతులాలా ॥పల్లవి॥

మచ్చిక నాతఁడు నాకె మాటలాడుకొనఁగాను
అచ్చముగ మీరేల ఆలకించేరే
యిచ్చగించి వేడుకతో నేకతాన నుండఁగాను
కొచ్చి తెరయెత్తేరేలే కొమ్మలాలా ॥వాకి॥

కొత్తగా నద్దాలు చూచుకొని వారు నవ్వఁగాను
చిత్తిణిచేఁతలనేల చేరవచ్చేరే
హత్తి పందేలతోడుత నటు చదురంగమాడే-
రెత్తులేల చెప్పేరే యింతులాలా ॥వాకి॥

శ్రీ వేంకటేశుఁడు లోన దేవులఁ జెనకఁగాను
యీవేళఁ గానుకలేల యియ్యవచ్చేరే
వేవేలురతులఁ గూడి వెసఁ బీఁటపై నుండఁగా
బావంటాఁ బైకొనేరేలే పడఁతులాలా ॥వాకి॥ **153**

ఉపోద్ఘాతము:

అన్నమాచార్యులవారి నాటి తెలుగు నేటి తరం వారికి మింగుడు పడదనటానికి ఈ కీర్తనను మించిన ఉదాహరణ దొరకదు. ఈ కీర్తన చరణాలతో నేను చెప్పిన పద్యం వినండి. అది ఎన్నిసార్లు చదివినా కొరుకుడు పడదు. నాది అంత గొప్పభాషాపరిజ్ఞానం అనుకోరాదు. ఈ కీర్తనలోని భాష బిగువు అంతటిది. ఇంతకీ ఈ పల్లవి అర్థం వూహించగలరా? ఓ చెలికత్తెలారా! మేము వాకిటిలో కావలివున్న వనితలము. మీరేల మీ

మర్యాదనతిక్రమిస్తున్నారు? మంచీ మన్ననా తప్పకండి. తిరుమలేశుడు తన దేవేరితో ఏకాంతంలో వున్నాడు. అట్లా వారిని దొంగచాటుగా చూడవచ్చునా?

తాత్పర్య వివరణ:

ఇదెనేము (ఇదిగో మేము) వాకిటిలో కావలి వుండే స్త్రీలము. ఓ సుదతులాల (దేవేరికి ఆంతరంగిక చెలికత్తెలారా!) మీరు జోకదప్పకురే (మంచీ మన్ననా తప్పకండి).

ఆతడున్ ఆకె (స్వామివారు శ్రీదేవి) మచ్చికన్ (చనువుగా) మాట్లాడుకొంటున్నారు. మీరేల అచ్చముగా (మీ స్వంత వ్యవహారంలాగా) ఆలకించేరు (వింటున్నారు?) వేడుకతో (ఉల్లాసముగా) వారిరువరూ ఇచ్చగించి (కోరికలతో) ఏకతాననున్నారు (ఏకాంత మందిరంలో వున్నారు). మీరు కొచ్చి (తొలగించి) తెరమరుగును (తెరచాటును) తప్పు చేస్తున్నారు.

ఓ ఇంతులారా! ఆ గదిలో కొత్తగా బిగించిన అద్దాలలో తమను తాము చూచుకొని వారు నవ్వుకొంటున్నారు. మీరు చిత్తిణిజాతి స్త్రీల పనులు యెందుకు చేస్తున్నారే. ఇప్పుడు వారి దగ్గరకు పోవచ్చునా. వారిరువురూ (స్వామివారు శ్రీదేవి) హత్తి (పొందికతో) పందెములు వేసికొని చదరంగం ఆడుకొంటున్నారు. మీరు వారికి మీ స్వంత యెత్తులు చెప్పి వారిని చీకాకు పెడుతున్నారు. ఏంపని అది?

ఓ పడతులారా! లోన (వారి ఏకాంతంలో) శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి చెక్కిలనొక్కితే ఈ వేళ ప్రభూ! ఇవిగో ఇంకా కొన్ని కానుకలు వచ్చాయి అటూ ఇయ్యవచ్చేరా (ఇద్దామని లోపలికి వస్తారటమ్మా?) పలు సురతుల నలసిసొలసి వారు సేదతీరుతుంటే బావగారూ అని లోనదూరి ఆక్రమిస్తారా? బుద్ధిలేదా?

పద్యవివరణ:

తే.గీ॥ **వాకిలినిగాచు వనితలము కద! నేము**
జోకదప్పకురే మీరు సుదతులాల!
తిరుమలేశుడు చెనకును దేవులనిక,
యిట్టివేళగానుకలేల యిత్తురమ్మ!

సంఖ్య: I/504 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగగ

శుద్ధవసంతం

40 ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగఁగ
యెంతవారమో భాగ్య మేమిచెప్పే దిఁకను ॥పల్లవి॥

తలకొని వొకకొంతధనము గనినవాఁడు
వెలలేనిగర్వముతో విఱ్ఱవీఁగీని
బలువుతో వొకరాజుఁబట్టి కొలిచినవాఁడు
సలిగెతో నాకెవ్వరుసరి యనీని ॥ఇంత॥

వింతగా నొక పరుసవేది చేతఁగలవాఁడు
యెంతవారిఁ గైకోఁడు యెక్కుడంటాను
పొంత నొకమంత్రము పంపుసేయించుకొనేవాఁడు
అంతటికి గురుఁడంటానని మురిసీని ॥ఇంత॥

యెగువ నొకదుర్గము నెక్కుక యేలేవాఁడు
పగవారిఁ గైకొనక బలువయ్యీని
అగపడి శ్రీవేంకటాద్రిమీఁదనున్న నిన్నుఁ
దగ నమ్మినట్టివాఁడ ధన్యుఁడ నేను ॥ఇంత॥ **504**

ఉపోద్ఘాతము:

ఇంతగొప్పదైవానివి నీవు మాకు ప్రాప్తించినావు. మా భాగ్యము యేమని చెప్పనయ్యా! మేమెంతవారము అని సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు అన్నమయ్య. కొంత మందికి ధనంవుందని గర్వం వుంటుంది. కొంతమందికి తాము రాజుగారికి కావలసినవారము అని అతిశయముంటుంది. కొంతమందికి పరుసవేది చేతిలోవుంటే (వారు ఏ లోహాన్ని తాకినా అది బంగారం అవుతుంది. వాడు నేనే అందరికంటే ఎక్కువవాడినని అందర్నీ

యెదిరిస్తుంటాడు) పొగరెక్కుతుంది. కొంతమందికి మంత్రవిద్యవుండి మురిసిపోతుంటారు. ఇవన్నీ ఐశ్వర్యాలే కానీ ఏం లాభం? వారందరికంటే శ్రీవేంకటేశ్వరుని నమ్మినవారే ధన్యజీవులు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! నీవు ఇంతటిదైవమవు. మాకు నీవు ఇటు గలుగగ (ఈ విధంగా కలిగినందువల్ల) ఇకపై ధన్యులమయ్యాము. మేమెంత వారమయ్యామోకదా! మా భాగ్యమునేమని చెప్పను?

కొంతమంది దగ్గర తలకొని (సంప్రాప్తించి) ధనము వుంటుంది. వాళ్ళు చెప్పలేని గర్వంతో విఱ్ఱవీగుతుంటారు. బలవంతుడైన ఒక రాజుగారి ఆశ్రయం పొందినవాడు ఆయనను కొలుస్తూ సలిగెతో (ఎవ్వరినీ లెక్కచేయక) వుంటాడు. వాడు నాకెవ్వరు సమానులు అనే అతిశయంతో వుంటాడు. ఆ రాజు ఏదన్నా యుద్ధంలో మరణిస్తే వీడి బ్రతుకు కుక్క బ్రతుకే కదా!

కొంతమంది చేతిలో భాగ్యరేఖ "పరుసవేది"యై వుంటుంది. వాడు ఏ లోహాన్ని తాకినా అది బంగారమవుతుంది. వాడు యెంతటివారినైనా గైకోడు (లక్ష్యపెట్టడు) నేనే అందరికంటే ఎక్కుడు (గొప్పవాడిననుకొంటాడు). కొందరికి మంత్రవిద్య వస్తుంది. వాడు అంతటికీ నేనే గురుడంటా (గురువనని) మురిసిపోతుంటాడు.

కొంతమందికి ఒక దుర్గము (కోట) వారి అధీనములో వుంటుంది. వాడికి పగవారి భయము వుండదు. వాడు ఎవ్వరినీ యెదిరించకుండానే సుఖంగా వుంటాడు. కానీ పైవారందరికీ మరుక్షణం ఏమవుతుందో తెలియదు. కానీ శ్రీవేంకటేశ్వరుని నమ్మినట్టివాడు ధన్యుడు. వాడు యెన్నడూ చెడిపోడు. నేనుకూడా ధన్యుడనే ప్రభూ!

పద్యవివరణ:

ఉ॥ **ఇంతటి దైవమీవు భువి ఏపున గొల్చితిమయ్య మాకుమే-**
మెంతటి వారమయ్య యిపుడేమని చెప్పము భాగ్యవైభవం
బంతయు నీదు సత్కృపయె అద్రిజ సన్నుతవేంకటేశ్వరా!
చింతలు బాసి నమ్మితిని శ్రీగిరినాయక! నేను ధన్యుడన్.

సంఖ్య: XVIII/403 రాగం : పాడి
కీర్తన : కంటిని మన్ననలెల్లా గడపరాయా

పాడి

41 కంటిని మన్ననలెల్లాఁ గడపరాయ మొల-
గంట లెంతవాయించేవు కడపరాయ ॥పల్లవి॥

కప్పుర మీఁగదవోయి కడపరాయ మోవి-
కప్పు లేల రేఁచేవు కడపరాయ
కప్పవోయి పచ్చడము కడపరాయ నీకుఁ
గప్పము నావలపులు కడపరాయ ॥కంటి॥

గరిసించకు రతిఁ గడపరాయ నీ-
కరుణెల్లా నాసొమ్ము కడపరాయ
కరఁగించకు మనసు కడపరాయ నాకు
గరిడీ నీకాఁగిలి కడపరాయ ॥కంటి॥

కలసి కాఁగిట నిట్టె కడపరాయ నన్నుఁ
గలికిఁ జేసితి వింత కడపరాయ
కలకాలమును మాకుఁ గడపరాయ
కలవు శ్రీవేంకటాద్రి కడపరాయా ॥కంటి॥ **403**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య కాలంలో స్త్రీలు అలంకారంగా మొలనూలు గంటలు ధరించేవారు. నడుము కదలికలకు చిరుగంటలు మ్రోగి అవిధరించినవారి కదలికలననుసరించి వింత వింత ధ్వనులు చేసేవి. కడపకు రాయడైన శ్రీవేంకటేశ్వరుని దేవేరి ధరించిన మొలనూలి గంటలు అదే పనిగా సవ్వడి చేస్తున్నాయి. ఎందుకో భావించండి. అన్నమయ్య ఏమంటున్నారంటే మొలగంటలెంతవాయించేవు కడపరాయా అని చిలిపిగ ప్రశ్నిస్తున్నారు.

అయితే అదంతా ఆ దేవికి మన్ననయేనట. ఎంత సరసశృంగారమో చూడండి. దేవి వలపులే స్వామికి కప్పములట. ఆయన కౌగిలి ఒక గరిడీ అట. అంటే ఏమిటో తెలుసుకోవాలంటే ఇదంతా చదవాల్సిందే.

తాత్పర్య వివరణ:

ఓ కడపరాయా! శ్రీవేంకటేశ్వరా! నీదేవేరినైనందువల్ల మన్ననలెల్లా కంటిని (ఎనలేని గౌరవమును పొందాను). తులలేని ఆనందం పొందాను. నా మొలగంటలు (మొలనూలుకు బిగించిన చిరుగంటలు) యెంతగా మ్రోగుతున్నాయో యేమి చెప్పమంటావు?

స్వామీ! నీ అంగీకార సంకేతమైన కర్పూరతాంబూలమును నాచేతికి అందించరాదా! నీవు వచ్చినవాడవు పూరకనే వుండవు. మోవికప్పు అధరముపై దంతక్షతములేల చేతువు? ఓ కడపరాయా! నాకు పచ్చడము (పట్టువస్త్రమును) కప్పము. ఇంత మన్ననకు పులకించిన నేను కప్పముగా నా వలపులనే నీకు సమర్పించెదను. అంతకన్నా సర్వేశ్వరుడవైన నీకు నేను యీయగలదేమున్నది?

స్వామీ! నాతో సురతిని గరిసించకు (తిరస్కరించకు). నేను వేరే సొమ్ములు (ఆభరణాలు) ధరించవలసిన అవసరం లేదు. నీయొక్క కరుణే నాకు సొమ్ములు. ఓ కడపరాయా! నీ ఆప్యాయతతో నా మనస్సును వెన్నలా కరిగించకు. ఎందుకంటే నీ బిగికౌగిలిని తలుచుకొంటే నాకు గరిడీ (మల్లయుద్ధము చేసే వ్యాయామ మంటపము) తలపుకు వస్తుంది.

ఓ కడపరాయా! నీ చాకచక్యంతో నన్ను ఇట్టే కౌగలించి చేరువవుతావు. కన్నెనైన నన్ను కలికిని చేసినావు. నీకు స్వాధీనపతికను. నీవే తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై మాకు కలకాలము కలవు ప్రభూ!

పద్యవివరణ:

కం॥ **కంటిని మన్ననలెల్లా**
గంటలు వాయింతువెంత కడపకు రాయా!
ఉంటివి వేంకటపతిగా
జంటై అలమేలుమంగ జనులను బ్రోవన్.

సంఖ్య: I/498 రాగం : దేసాక్షి
కీర్తన : అంచితపుణ్యులకైతే హరి దైవ మవుఁగాక

దేసాక్షి

42 అంచితపుణ్యులకై తే హరి దైవ మవుఁగాక
పంచమహాపాతకులభ్రమ వాప వశమా ॥పల్లవి॥

కాననియజ్ఞానులకు కర్మమే దైవము
ఆనినబద్ధులకు దేహమే దైవము
మాననికాముకులకు మగువలే దైవము
పానిపట్టి వారివారిభ్రమ మాన్పవశమా ॥అంచి॥

యేమీ నెఱఁగనివారి కింద్రియములు దైవము
దోమటిసంసారి కూరదొర దైవము
తామసులకెల్లాను ధనమే దైవము
పామరుల బట్టినట్టిభ్రమఁ బాపవశమా ॥అంచి॥

ధర నహంకారులకు తాఁదానే దైవము
దరిద్రుఁడైనవానికి దాత దైవము
యిరవై మాకు శ్రీవేంకటేశుఁడే దైవము
పరులముంచినయట్టిభ్రమఁ బాపవశమా ॥అంచి॥ **498**

ఉపోద్ఘాతము:

అంచితపుణ్యులు అంటే పూజార్హులైన పుణ్యాత్ములు అని అర్థం. వారికైతే శ్రీహరియే దైవము. ఇకపోతే పంచమహాపాతకాలు చేసే పాతకులు (పాపాత్ములు) వున్నారే వారి భ్రమ పోగొట్టటం యెవ్వరితరము అంటున్నారు అన్నమయ్య. ఈ ప్రపంచంలో ఎవ్వరికెవరుదైవమో ఉటంకిస్తున్నారు ఆలకించండి. ఇదంతా ఒక పట్టికలాగా వివరిస్తే రసాస్వాదన సిద్ధించదు. దానిని వివరణతోపాటు చెప్పాలి. ఏది యేమయినా యెవరికెవరు దైవమయినా నాకు మాత్రం తిరుమల

శ్రీవేంకటేశ్వరుడే దైవము అంటున్నారు అన్నమయ్య. కానీ ఆ స్వామి కల్పించే భ్రమను వదలటం అంత తేలిక అనుకోకండి.

తాత్పర్య వివరణ:

అంచితపుణ్యులకు (పూజనీయులైన పుణ్యాత్ములకైతే) శ్రీహరియే దైవము, అవుగాక (అయివుండుట నిక్కమే) కానీ మనలో శ్రీహరిని నమ్మని పంచమహాపాతకులు కొందరున్నారు. అట్టి భ్రష్ముల భ్రమలను వాపవశమా (తొలగింప శక్యమా?)

సత్యాసత్యములను కానని (చూడలేని) అజ్ఞానులుంటారు. వారికి తమ దైనందిన కార్యక్రమము నిత్యకర్మలే దైవము. దేహ భోగములకు బద్ధులైన (కట్టుబడిన కొందరుంటారు. వారికి తమ దేహమే దైవము. కామ పీడితులైన కాముకులు కొందరుంటారు. వారికి స్త్రీలే దైవము. పానిపట్టి (పూనుకొని) వారి భ్రమలను తొలగించ సాధ్యమా?

ఏమీ తెలియని మూర్ఖులు కొందరుంటారు. వారికి తమ ఇంద్రియములే దైవము. దోమటి (కపటత్వంగల) సంసారికి వాళ్ళ ఊరిలోనున్న దొరగారే దైవము. తామసప్రవృత్తి కల నరులకు వారివద్దనున్న ధనమే దైవము. అటువంటి పామరులు అనేక భ్రమలకు లొంగిపోతుంటారు. వారి భ్రమలను బాపవశమా (వదలించుట సాధ్యమయ్యే పనియేనా?)

ఈ ప్రపంచంలో అహంకారులకు తమరికి తామే దైవము. దరిద్రుడైనవాడు ఏ దాత దొరుకుతాడా తన దరిద్రం పోగొడతాడా అని యెదురుచూస్తాడు. కాబట్టి వాడికి దాతయే దైవము. ఎవరికెవరు దైవమైతే మాకేమిటి మాకు మాత్రం తిరుమలాధిపుడైన శ్రీవేంకటేశ్వరుడె దైవము. ప్రతివాడూ భ్రమలో వున్నా, ఆ సత్యం అంగీకరించడు. అటువంటివారి భ్రమ బాపవశమా?

పద్యవివరణ:

కం॥ **అంచిత పుణ్యులకున్ "హరి"**
పొంచిన సంసారులకును వూరి దొరయునున్
యెంచగ దైవంబనెదరు
పంచమహాపాతకులకు భ్రమవోయీనా?

సంఖ్య: XVIII/230 రాగం : బౌళి
కీర్తన : చూడ బిన్నవాడు గాని జూటదనాలు తనవి

బౌళి

43 చూడఁ బిన్నవాఁడు గాని జూటుఁదనాలు తనవి
యేడఁజూచినాఁ దానే యేమని చెప్పుదునే ॥పల్లవి॥

దొంగాడుఁ గృష్ణుఁడు తొయ్యలుల మొగములు
తొంగిచూచీ ముంగురులు దూలాడఁగా
ముంగిట ముద్దులువెట్టి మోవితేనె లానుకొంటా
యెంగిలిసేసీ నిదె యిందరి నొక్కమాఁటె ॥చూడఁ॥

వెన్న ముద్దకృష్ణుఁడు వేడుకతో జవరాండ్ల-
చన్నులంటి సారె సారె సాము సేసీని
చిన్ని చేతు లటుచాఁచి సిగ్గులురేఁచి చెనకి
సన్నలుసేసి పిలిచి సరసములాడీని ॥చూడఁ॥

వుద్దగిరికృష్ణుఁడు వొడివట్టి మానినుల
అద్దుకొని కాఁగిలించి ఆసలురేఁచీ
వొద్దిక శ్రీవేంకటాద్రి నొనగూడి మాచేఁతలు
సుద్దులుగాఁ జెప్పి చెప్పి సొలసి నవ్వీనే ॥చూడఁ॥ **230**

ఉపోద్ఘాతము:

ఉద్దగిరిలో నెలకొన్న వెన్నముద్ద కృష్ణునిపై చిలిపి శృంగార కీర్తన నాలకించండి. ఇక్కడ పాడేది ఒక గోపిక కాబట్టి ఆ కృష్ణపీడిత గోపిక అన్నమయ్యే. ఓయమ్మో! ఈ ఉద్దగిరి కృష్ణుడు చూడటానికి పిల్లవాడు కానీ జాటుతనములోమాత్రము యెక్కడ చూచినా తానే అన్నట్లుగా యెంత తిప్పలు పెట్టాడమ్మా! ఏమని చెప్పుదుమమ్మా? నడి వాకిట్లో ముద్దులు పెట్టి మోవి

తేనెలారగించి అందరు గోపాంగనలను ఒక్కమాటే యెంగిలి చేశాడు. సైగలు చేసి పిలిచి సరసములాడతాడు. కౌగిళ్ళలో కరగించి కమ్మని ఆశలు రేపుతాడు. కానీ నేడు తిరుమలేశ్వరుడై అనాటి జ్ఞాపకాలకు నవ్వుల నొలకిస్తున్నాడు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియలారా! యేమని చెప్పుదునే? (చెప్పమన్నారే!) ఏడ జూచినా దానే అయి (ఎక్కడ చూచినా తానే వున్నట్లు) ఎన్ని తుంటరి పనులు చేస్తున్నాడో చూడండి. చూడటానికి మాత్రం చిన్నపిల్లవాడే కాని జాటుదనాల (మోసగించటంలో) మొనగాడు.

దొంగ పిల్లవాడైన ఈ కృష్ణుడు కన్నెపిల్లల మొగములో మొగము పెట్టి తొంగి చూచి వాళ్ళముంగురులు దూలాడగా (యెగురుతుంటే) ఏమిచేస్తాడో తెలుసా? నట్టింట్లో ముద్దులు పెట్టి వారి మోవి తేనెలు జుఱ్ఱుకొంటాడు. ఒక్కదాన్నీ వదలకుండా ఒక్కమాటే అందరి పెదవులను యెంగిలి చేస్తాడు. ఎంత గడుగ్గాయో యేమని చెప్పమంటారు?

నిత్యమూ వెన్నముద్దలఆరగించే ఈ కొంటె కృష్ణుడు వేడుకతో జవరాండ్ర స్తనయుగ్మములను మాటిమాటికి అంటుకొంటూ అదే పనిగా అల్లరిపెడతాడు. తన చిన్ని చిన్ని చేతులను చాచి వాళ్ళని చెనకి (ఆ చేతులతో నొక్కి) సిగ్గులు రేపుతాడు. ఇంకా ఏమి వివరంగా చెప్పమంటారమ్మా!

ఈ ఉద్దగిరి కృష్ణుడు ఒడిసి పట్టుకొని యౌవనవతులను హత్తుకొని గుచ్చి కౌగలించుకొంటాడు. అంతులేని ఆశలలో తలమునకలు జేస్తాడు. కాని నేడు వొద్దికతో (అనుకూలుడై) శ్రీవేంకటాద్రి నొనగూడి ఆ కొంటెపనులన్నీ కథలు కథలుగా చెప్పి అలసిపోయేట్లు నవ్వుతాడు.

పద్యవివరణ:

ఉ॥ **చూడగ బిన్నవాడు పలు జూటదనంబుల సిద్ధహస్తుడున్**
యేడను జూచినా యతడె యేమని చెప్పెద భామలార! ఈ
వేడుకకాడు వుద్దగిరి వెన్నలముద్దల దొంగకృష్ణుడై -
నాడిటు వేంకటేశునిగ నవ్వునుతల్చుచు నాటి సుద్దులన్

సంఖ్య: I/479 రాగం : ముఖారి

కీర్తన : కంటే సులభమిది, కానకయుంటే దుర్లభ

ముఖారి

44 కంటే సులభ మిది; కానక యుంటే దుర్లభ; –
మింటిలోననే వున్న దిహముఁ బరమును ॥పల్లవి॥

హరిదాసులు మెట్టినక్కడే పరమపద–
మరయ నిందుకంటె నవల లేదు
తిరమై వీరిపాదతీర్థమే విరజానది
సొరిది నన్ని చోట్లు చూచినట్టే వున్నది ॥కంటే॥

మచ్చిక వైష్ణవుల మాటలెల్లా వేదములు
యిచ్చల నిందుకంటే నింక లేదు
అచ్చట వీరిప్రసాద మమృతపానములు
అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది ॥కంటే॥

చెలఁగి ప్రపన్నుల సేవే విజ్ఞానము
ఫల మిందుకంటే మఱి పైపై లేదు
తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు –
లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి ॥కంటే॥ **479**

ఉపోద్ఘాతము:

వైష్ణవ మత గురువుల సేవాభాగ్యం బెట్లుండునో ఈ కీర్తనలో వివరిస్తున్నారు అన్నమయ్య. ఇహము పరము మన ఇంటిలోనే వున్నవయ్యా! అంటున్నారు. అయితే మన ఇల్లు మనకు తెలియదా? అవి ఇంట్లో యెక్కడున్నాయంటారు అనుకొంటారు. ఇది సత్యమే. చక్కగా విశ్లేషించి కంటే అతి సులభంగా తెలుస్తుంది. కానకయుంటే ఇదే దుర్లభముగా వుంటుంది, అంటున్నారు. ఎక్కడైతే హరిదాసులు కాలుపెడతారో అక్కడే పరమపదము వున్నది. దీనిని మించిన పుణ్యస్థలము అవతల మరొకటి లేదు. వీరి పాద తీర్థమున్నది చూశారా... అది వైకుంఠంలో ప్రవహించే విరజానది అంత

పావనమైనది. కాని ఈ నది అన్ని చోట్లా చూచినట్లే వుంటుంది అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జనులారా! ఇది (ఈ విషయం) కంటే (పరిశీలించి చూస్తే) చాలా సులభము. కానకుంటే ఇదే కడు దుర్లభమైనది. ఏమిటది? మనం అనుభవిస్తున్న ఇహము, మన మరణం తరువాత పొందబోయే పరము, ఈ రెండూ యెక్కడో లేవు మన ఇంటిలోనే వున్నవి సుమా!

హరిదాసులు మెట్టినక్కడే (ఎక్కడ అడుగు పెడతారో అక్కడే) పరమపదము (వైకుంఠం) వుంటుంది. మళ్ళీ ఇంతకు మించి అవతల మరేమి లేదు. సుస్థిరమైన వీరి పాద తీర్థము వైకుంఠంలో ప్రవహించే విరజానది అంత పవిత్రమైనది. అయితే విరజానది కేవలం వైకుంఠంలో వున్నది. కానీ వీరి పాదతీర్థం యెక్కడైనా దొరుకుతుంది.

వైష్ణవ గురుపుంగవులున్నారే మచ్చికతో (ప్రేమగా) వారు చేసే బోధనలన్నీ మాటలు కాదు వేదమంత్రములు. ఇచ్చట (ఇహలోకములో) ఇందుకంటే (వీరి బోధల కన్నా) ఇంక (ఇంకొక ముక్తి మార్గము) లేదు. అమృతము తాగితే అమరత్వం సిద్ధిస్తుందట. అంత శ్రమ పడవలసిన పనిలేదు. వీరిచ్చే భగవత్ ప్రసాదము మన బోంట్లకు అమృత పానమువలె అమరత్వం సిద్ధింపజేస్తుంది. దాని కోసం మనం సాగరమథనం చేయనక్కరలేదు. స్వచ్ఛమైన జ్ఞానం నేర్చినవారి ఆ అమృతం అరచేతిలోనే వున్నది.

ప్రపన్నుల (భగవంతునియందు శరణాగతితో వున్నవారి) చెలగి (అతిశయించిన) సేవయే విజ్ఞానదాయకము. ఇందుకంటే ఫలము (వారి సేవ కంటే ఫలప్రదమైన మార్గము మరి పైపైలోకాలలో కూడా లేదు. శ్రీవేంకటేశుని దాసులందరూ ఆ శ్రీహరి రూపులే. దీనినెఱిగిన వారికి, ఎలమి (అతిశయించిన) మోక్షం యెదుటనే వున్నది.

పద్యవివరణ:

కం॥ **సులభంబిది కంటే మరి**
తెలియన్ కడు దుర్లభంబు తేకువ కనకన్
కలదిందులోనె ఇహమున్
విలసిల్లును పరముకూడ వేంకటనాథా!

సంఖ్య: XIX/30 రాగం : రామక్రియ
కీర్తన : వట్టిబాతిపడి నీపై వలపులు చల్లేముగాక

రామక్రియ

45 వట్టిబాఁతిపడి నీపై వలపులు చల్లేముగాక
యిట్టయితే మరియిఁక నేమిచెప్పేదయ్యా ॥పల్లవి॥

కాంతను నాయెదుటనె కాఁగలించుకొంటివి
పంతములాడఁగ నిఁకఁ బనియేది
వింతలుగా సిగ్గులెల్లా విడిచినమీఁదట
యెంతకొసరినా నందు నేమిగలదయ్యా ॥వట్టి॥

నావద్దనుండి యాకెతో నవ్వులు నవ్వితివి
భావించి చూచిన విఁకఁ బనియేది
వేవేలకు మతిలోనివెరపు దీరినమీఁద
చేవమీరినసుద్దులు చెప్పఁ జోటేదయ్యా ॥వట్టి॥

చలివాసి యాకెతోనే సరసములాడితివి
పలుమారుఁ బచ్చిసేయఁ బనియేది
అలమేల్మంగనైన న న్నట్టె యేలితివి
యెలమి శ్రీవేంకటేశ యెట్టు మెచ్చేదయ్యా ॥వట్టి॥ **30**

ఉపోద్ఘాతము:

భ్రాంతి అనే పదానికి వికృతి "బాతి". అమ్మవారు స్వామితో అంటున్నది; "మేమేదో నిన్ను మా స్వంత చేసికొనవలెననే వ్యర్థమైన భ్రాంతి పడుతుంటాము, నీపై వలపులు చల్లి వశపరచుకోవాలనుకొంటాము. కానీ నీవు వలపుకి లొంగవు. ఇట్లయితే ఇక మరి ఏమి చెప్పేదయ్యా!" అన్నమయ్య అద్భుత సృష్టిని ఆస్వాదించండి. ఆ కాంతను నా యెదుటనే కౌగలించుకొంటివి. సిగ్గులెల్లా విడిచితివి. నేను యెదుటనేవున్నా ఆమెతో అదే

పనిగా నవ్వులు. ఇదేమి పద్ధతి. మనస్సులో బయంలేనివారు ఎన్ని మాయమాటలైనా చెబుతారు. సిగ్గు బిడియం వదలి, ఆమెతో సరసములాడుతున్నావు. కానీ నీవు శ్రీవేంకటేశ్వరుడవు. అలమేల్మంగనైన నన్ను ఇట్టే కరిగించివేస్తావు.

తాత్పర్య వివరణ:

ప్రభూ! మేము వట్టిబాతిపడి (వ్యర్థమైన భ్రాంతిజెంది) నీపై వలపులు చల్లేము (ప్రేమలు కుమ్మరిస్తుంటాము). కానీ అది యెంత నిరుపయోగమైన ప్రయత్నం? ఇట్లయితే ఇక మరి నీకు యేమి చెప్పేదయ్యా!

ఆ వనితను నాయెదుటనే కౌగలించుకొంటివి. ఇంకా నీతో పంతమునకు పోయి నేను సాధించేదేమిటి? వింతగా లోకాధిపతే సిగ్గుయెగ్గూ విడనాడితే మేము చేయగలిగిందేముంటుంది? యెంత కొసరినా (కసురుకొనినా) నీవేమైనా మారేదివుంటుందా? ఇంకా అందు ఏమిగలదయ్యా? (ఇంకా అందులో ప్రయత్నించవలసిందేముంటుంది?)

స్వామీ! ఇదేమన్నా బాగున్నదా? నావద్దనే వుండి యాకెతో (ఆమెతో) నవ్వులు కుమ్మరిస్తున్నావు. ఇంకా నేను భావించవలసిన (అనుమానించాల్సిన) పనేమున్నది. అంతా స్పష్టమే. వేవేలకు (ఏ తరుణములోనైనా) మనస్సులో భయమూ, సంకోచము వదలివేసిన వాడికి చేవమీరిన సుద్దులు (నిరుపయోగమైన నీతులు) చెప్పినందువల్ల కంఠశోషే కానీ లాభమేముంటుంది?

ఓ శ్రీవేంకటేశ్వరా! చలివాసి (బిడియమును వదలిపెట్టి) నాయెదుటనే ఆమెతో సరసములాడితివి. ఇక నీతో పచ్చికొట్టి ఎవరైనా చేసేదేముంది? ప్రభూ! ఇంతకీ నేనెవరిననుకొన్నావు? నేను అలిమేలుమంగను. నన్నట్టే (లాఘవముగా) యేలితివి. నిన్ను ఏమని పొగుడుదునయ్యా?

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇట్టె "బాతి" పడితి వలపుల జల్లితి**
వేటి వశముగావు వేంకటేశ!
ఇట్లనైతే మరికనేమి చెప్పేదయ్య!
నేను నీదు సతిని నిలిచి కనుము.

సంఖ్య: I/472 రాగం : గుండక్రియ
కీర్తన : ఎవ్వరివాడో యెఱగరాదు

గుండక్రియ

46 ఎవ్వరివాఁడో యెఱఁగరాదు
అవ్వలివ్వలిజీవుఁ డాటలో పతిమే ॥పల్లవి॥

ధర జనించక తొలుత తనుఁ గానరాదు
మరణమందినవెనక మఱి కానరాదు
వురువడి దేహముతో నుండినయన్నాళ్లే
మరలుజీవునిబదుకు మాయవో చూడ ॥ఎవ్వ॥

యిహములో భోగించు నిందుఁ గొన్నాళ్లు
మహిమ పరలోకమున మలయుఁ గొన్నాళ్లు
తహతహలఁ గర్మబంధములఁ దగిలినయపుడే
అహహ దేహికిఁ బడుచులాటవో బదుకు ॥ఎవ్వ॥

సంతానరూపమై సాగు ముందరికి
కొంత వెనకటిఫలము గుడువఁ దాఁ దిరుగు
యింతటికి శ్రీ వేంకటేశుఁ డంతర్యామి
బంతి నితనిఁగన్నబదుకువో బదుకు ॥ఎవ్వ॥ **472**

ఉపోద్ఘాతము:

ఈ జీవుడు ఎన్నటివాడో చెప్పలేము. ఇక నూరేళ్ళు మించి జీవించ నసాధ్యమైన మానవ దేహంతో వీడు యెన్ని జన్మలు పొందాడో ఆయా జన్మలలో ఎవరికి పుట్టాడో యెఱుగుట సాధ్యమా? వాడు చచ్చాక యేమి జరుగుతుందో, యెక్కడికి వెళతాడో, అదీ చెప్పలేము. ఇవ్వల భూలోకంలోనూ, అవ్వల పరలోకంలోనూ వాడి పూర్వాపరాలు తెలిసినవారెవరూ లేరు. వాడి జీవిత కాలమంతా ఆటలో ప్రతిమలాగే

నిమిత్తమాత్రంగా వుంటాడు, అంటున్నారు అన్నమయ్య. మళ్ళీ వాడి సంతానం యొక్క సంతతిలాగా వాడే పుడుతుంటాడు, చస్తుంటాడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

జీవుడు గతజన్మలో చేసిన పాపపుణ్యములను అనుభవించుటకు మరల జన్మనెత్తక తప్పదు. ఈ జన్మల చక్రభ్రమణంలో ఎందరో తల్లిదండ్రులు తోబుట్టువులు సతీసుతులు మారుతుంటారు. ఈ జన్మలో తల్లి వచ్చే జన్మలో తన అన్న అవవచ్చును. కాబట్టి ఈ జీవుడు ఎవ్వరివాడో ఎఱుగరాదు (తెలియలేము). అవ్వల (పరలోకంలో) ఇవ్వల (ఇహలోకంలో) జీవుడు కేవలం ఆటలో పతిమ (నాటకంలో ఒక పక్క నిలబెట్టిన విగ్రహం వంటి నిమిత్తమాత్రుడు).

వీడు పుట్టుక పూర్వం గోచరించడు. చచ్చిన వెనుక కనబడడు. ఉరువడి (నెఱవేరి) తను ఒక దేహంలో వున్నన్నాళ్ళే వాడి వునికి. ఇట్లా మారిపోయే జీవుడి బ్రతుకు మాయకాకపోతే మరేమిటి? ఇది మాయ చూడగా మాయయే.

ఈ ఇహలోకంలో జీవించియుండగా కొన్నాళ్ళు, భోగాలూ అనుభవిస్తాడు. పరలోకంలో ఆనందం కొంతకాలం అనుభవిస్తాడు. దేహంతో వున్నప్పుడు మాత్రమే తహతహలాడే కర్మబంధములలో తగులుకొని ఆటలన్నీ ఆడతాడు. అహహ! ఈ దేహికి పడుచువాళ్ళతో సయ్యాటలతోనే బతుకు వెళ్లమారుతుంది. ప్రతి జన్మలోనూ వీడి (ఈ జీవుడి) గతి ఇంతే.

ఇకపోతే చచ్చాక కూడా వీడి ఆత్మకు భ్రమలు ఆశలూ పోకపోతే తన పుణ్యమే ఖర్చుపెట్టుకొని సంతానరూపంలో తన వారికే జన్మిస్తాడు. మళ్ళీ ఆ జన్మ అలా ముందరికి సాగుతూనే వుంటుంది. కానీ వెనకటి జన్మలో చేసిన కర్మ ఫలం అనుభవించటానికి ఈ మరుజన్మలో ఉరుకులు పరుగులు పెడుతూనే వుంటాడు కానీ తన అంతర్యామిగా శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడని గ్రహించడు. ఈ బ్రతుకుల వరుసలో ఆయనను తెలిసినప్పుడే బ్రతుకు పండుతుంది.

పద్యవివరణ:

చం॥ **తెలియగలేము జీవుడటుతేకొని యెవ్వరివాడొ ఈ భువిన్**
అలయక జీవుడౌ పతిమ ఆటలనేపుగ అవ్వలివ్వలన్
తొలుతను జన్మముందతడు తోపడు చచ్చిన వెన్కయుండునా
కలుగును వున్నదేహమున కప్పిన పిమ్మట వేంకటేశ్వరా!

సంఖ్య: XVII/66 రాగం : కొండమలహరి
కీర్తన : ఇద్దరి మీజగడాలు యింక మాకు పనిగాదు

కొండమలహరి

47 ఇద్దరి మీజగడాలు యింక మాకు పనిగాదు
తిద్దలేము నిను నాపె తిట్టుకుండేనా ॥పల్లవి॥

పెట్టరాని యానలెల్లాఁ బెట్టుకొని వచ్చితివి
యిట్టె కలసెనని యింతి తోడను
చుట్టి చుట్టి చెలులతో జూజమీద నాడేవు
రట్టు సేయ నీడ కాపె ఇట్టె రాకుండేనా ॥ఇద్దరి॥

చెప్పరాని యాకతాలు చెప్పితి వంతటిలోన
యిప్పుడువచ్చెనని యింతి తోడను
అప్పటి వసంతమాడే వతివలతోడ నీడ
చొప్పు లాపె మేడలెక్కి చూడకుండేనా ॥ఇద్దరి॥

అక్కఁర గాఁపురమెల్ల అండఁబెట్టి వచ్చితివి
యిక్కడనే వుండెనని యింతి తోడను
యిక్కువ శ్రీవేంకటేశ యేమి దలఁచోయీపెను
మిక్కుటమై కూడితివి మెచ్చకుండేనా ॥ఇద్దరి॥ 66

ఉపోద్ఘాతము:

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు తన తండ్రి అన్నమాచార్యులవారి బాణీలో చెప్పిన సరస శృంగార కీర్తన ఇది. ఆయన తను అమ్మవారి చెలికత్తెగా భావిస్తూ చెబుతున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరి జగడాలు యెప్పుడూ వుండేవే. వాటితో మాకు పనిలేదు. మీ ఇద్దరినీ సరిదిద్దలేమయ్యా! నీవు చేసే పనులు మాత్రం తక్కువైనవా? ఆమె నిన్ను తిట్టిందంటే, తిట్టకుండా

యెట్లావుంటుంది? నీవు చేసే పనులెలా వున్నాయి ఒక్కసారి ఆలోచించు. అక్కడ నీవు వనితలతో వసంతములాడుతుంటే ఆ దేవి తన మేడయెక్కి చూసింది. అక్కడ వైకుంఠంలో కాపురం వదిలిపెట్టినవాడివి ఇక్కడ చేయటం మానేసేవా? లేదే. శ్రీవేంకటేశ్వరా! నీవీమెను కూడితివికదా!

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరి జగడాలు (పోట్లాటలు) ఇక మాకు పని లేదు. మీరు ఎంత పోట్లాడుకున్నా మేము తిద్దలేము (సరిదిద్దలేము). నిన్ను ఆమె తిట్టిందంటే తిట్టదూ.

ప్రభూ! పెట్టుకోకూడని ఆనలు (ఒట్లు) పెట్టుకొని ఆమె దగ్గరకు వచ్చావు. ఆమెయేమో కరిగిపోయి నిన్నిట్టే కలిసినది. ఇంతలో చుట్టి చుట్టి తిరిగి నీ చెలులతో జాజమీద (వసంతకేళి) ఆడుతూనే వున్నావు. ఆమె నీడలోకి ఇట్లా వచ్చిందో లేదో మీ గుట్టు రట్టయ్యింది. ఆమె రానేరాదని ఎలా అనుకొన్నావయ్యా?

అంతలోనే చెప్పరాని యాకతాయి (చెప్పనలవికాని కారణాలు) చెప్పితివి. పైగా ఇప్పుడే వస్తానని ఆవిడతో చెప్పావు. ఇక్కడికి వచ్చి అతివలతో అప్పటి (ఇది వరకు మాదిరిగానే) వసంతములాడుతున్నావు. నీవింత చేస్తుంటే నీ సంగతి తెలిసిన నీ దేవేరి మేడయెక్కి నీవు చేసే నిర్వాకం చూడకుండా వుంటుందా, ప్రభూ!

అక్కడ వైకుంఠంలో నీకాపురమెల్లా అక్కడే పెట్టేసి భూలోకానికి వచ్చేశావు. ఇక్కడనేవుండిపోతానని ఈ పద్మావతిని మాయజేశావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏలీల ఆలోచించినావో కానీ ఆమెతో మిక్కుటముగా రతిలో గూడితివి. ఆమె మెచ్చక ఎలా వుంటుంది?

పద్యవివరణ:

కం॥ **ఇద్దరి మీ జగడాలను**
వద్దనివారించమాకు పనియేమయ్యా?
తిద్దగలేకే తిట్టెను
కద్దనె పెదతిరుమలయ్య కాంతుని చెనకెన్.

సంఖ్య: X/15 రాగం : గుజ్జరి
కీర్తన : చంచల మతులకు తెలియునె సాత్విక ధర్మములు

గుజ్జరి

48 చంచలమతులకుఁ దెలియునె సాత్వికధర్మములు
మంచమునీడవలె బహుమార్గములై తోఁచున్ ॥పల్లవి॥

తీపుల అల్పపుచదువుల తెలివేలా కలుగు
కాపై మిడుఁగురుఁబురువులఁ గడచునె చీఁకట్లు
పైపై ప్రాకృతదృష్టికి పర మేలా కలుగు
పాపము కనుమాయలవలె భ్రమయించుఁ గాక ॥చంచ॥

కొద్దిరఁగని జడునికి సద్గుణ మేలా కలుగూ
అద్దము చిలు ముబ్బినక్రియ అజ్ఞానము వొడమున్
నిద్దము కామాతురునకు నిజ మేలా తెలియూ
వద్దనె యండమావులవలెఁ దోఁచుఁ గాక ॥చంచ॥

అనువుగ నక్షయపుణ్యము అది యేలా చెడును
పెనఁగెటి తనవీడవలెనె పెడవాయదు యెపుడు
ఘనుఁడగుజీవుఁడు శ్రీవెంకటనాథునిఁ గని (నె?) నా
పనివడి రత్నము సానఁబట్టినగతిఁ జెలఁగున్ ॥చంచ॥ 15

ఉపోద్ఘాతము:

అధ్యాత్మ కీర్తనలు చెప్పటంలో తాళ్ళపాక వారే వుద్దండులనటంలో సందేహం లేదు. చినతిరుమలయ్య తన తాత అన్నమయ్యకు సమవుజ్జీ అని దీనిని చదివిన తరువాత మీకే అర్థమవుతుంది. పెద్ద వటవృక్షపు నీడలాగ, మంచముపైనుండి వచ్చే నీడ స్థిరంగా వుంటుందా? అది బహుముఖంగా వుంటుంది. అట్లాగే చంచల స్వభావం కలవారు సాత్వికులు కాలేరు వారి మనస్సు అస్థిరంగానే వుంటుంది అంటున్నారు. దాన్ని నిరూపించుటకు అద్భుతమైన పోలికలను చెబుతున్నారు. ఘనుడైన

జీవుడు శ్రీ వేంకటేశ్వరుని దర్శించగానే రత్నమును సానబట్టి నట్లు మిలమిల మెరిసిపోతాడు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

సత్త్వగుణప్రధానులైన సాత్వికులకు సాత్వికధర్మము అవగతమవుతుంది. చంచలమైన మనస్సు కలవారికి యెన్నటికీ సాత్విక ధర్మము తెలియదు. ఎట్లాగంటే... మంచముపైనుంచి పడే నీడ అనుక్షణం మారిపోతూ బహుమార్గములై మనకు నిరుపయోగం కదా!

తీపుల (యాతనబడు) అల్పబుద్ధులైనవారు యెంత చదివినా వారికి తెలివేలకలుగు (జ్ఞానము యెలా కలుగుతుంది?) కాపై (రక్షణకై) చీకటి పోవాలంటే మిణుగురుపురుగుల కాంతి, ఆ పని చేయగలదా? పైపై వ్యవహారముగా కేవలం ప్రాకృత దృక్పథంకల సామాన్యులకు పరము (పరలోక సుఖము) దక్కుతుందా? పాపులు మాయలోనేపడి కొట్టుమిట్టాడుతుంటారు. వారి భ్రమలు యెన్నటికీ తొలగవు.

కొద్దిరగని (మితినెరగని) జడునికి (మందబుద్ధికి) మంచి గుణము యెలా కలుగుతుంది చెప్పండి? చిలుము పట్టిన అద్దములో ప్రతిబింబం సరిగా వుంటుందా? నిద్దపు (చేరువకాగోరే) కామాతురునికి నిజము తెలుసుకొనే ఓపిక వుంటుందా? ఎండమావులు మన యెదురుగా వున్నట్లే భ్రాంతి కలుగదా చెప్పండి.

మనం చేసికొనిన అక్షయ పుణ్యము (తరగని పుణ్యము) యేనాటికీ చెడక నిరంతరం మనవెంటనే వుంటుంది. అది పెనగేటి (వెంటాడే) నీడవలె యెన్నడూ విడిచిపెట్టదు. ఘనుడైన జీవుడు శ్రీవేంకటేశ్వరుని దర్శించగానే రత్నమునకు సానబట్టినట్లు మిలమిలా మెఱసి పోతుంటాడు.

పద్యవివరణ:

కం॥ **చంచల మతులకు దెలియునె**
యెంచిన సాత్వికపు ధర్మమెవ్విధినైనన్
మంచపునీడైతోచును
మించెను చినతిరుమలయ్య మేలుగ తాతన్.

సంఖ్య: I/476 రాగం : ముఖారి
కీర్తన : దైవముపుట్టించినట్టితనసహజమే కాక

ముఖారి

49 దైవముపుట్టించినట్టి తన సహజమే కాక
కోవిధునికైనా జాలిగుణమేల విడుచు ॥పల్లవి॥

అరయఁ బంచదార నద్దుక తినఁబోతే
చేరరానిముష్టిగింజ చేఁదేల మాను
సారమైనచదువులు సారె సారెఁ జదివినా
గోరపుదుష్టునికి కోపమేల మాను ॥దైవ॥

నిప్పు దెచ్చి వొడిలోన నియమానఁ బెట్టుకొంటే
యెప్పుడును రాఁజుఁగాక యిది యేల మాను
ముప్పిరిఁ బాతకుఁడైనమూఢుఁ డెన్ని యాచారాలు
తప్ప కెంతసేసినాను దయ యేల కలుగు ॥దైవ॥

యింటిలోనఁ గొక్కు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁదవ్వ కేలమాను
గొంటరై శ్రీవేంకటేశుఁ గొలువకుండినవాఁడు
తొంటిసంసా రవుఁగాక దొర యేఁటి కౌను ॥దైవ॥ 476

ఉపోద్ఘాతము:

"పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకతోగాని పోదు" అంటారు పెద్దలు. దేవుడు పుట్టించినప్పుడు తనకు సంక్రమించిన సహజగుణం వారి జీవితాంతం పోదు. అన్నీ తెలిసిన పండితునికి జాలిగుణము యొక్క ఆవశ్యకత తెలియదా? దానిని విడిచిపెట్టి చెడిపొమ్మంటే, వాడు చెడిపోతాడా అంటున్నారు అన్నమయ్య. పంచదార అద్దుకొని తింటే ముష్టిగింజ చేదురుచిని విడిచిపెడుతుందా. చదువుకొన్నంతమాత్రాన దుష్టుడు కోపమును వదిలేస్తాడా? నిప్పును ఒళ్ళో పెట్టుకుంటే కాలదా? ఒక పాపి మూర్ఖుడైతే ఏం చేసినా వాడికి జాలి

కలుగుతుందా? పందికొక్కును తెచ్చి పెంచుకొంటే మట్టిగోడల్లో బొరియలు చేయదా? వేంకటేశుని కొలవనివాడికి సంసారిగా రోదిస్తాడు కాని దొరవంటి యోగి యెలా అవుతాడు?

తాత్పర్య వివరణ:

దేవుడు మనని పుట్టించినప్పుడు మన పూర్వ జన్మల సుకృతమునుబట్టి కొన్ని జన్మతః సహజ గుణాలు కలుగుతాయి. కోవిదుడు (పండితుడు) తన జాలిగుణముతో పరులకు మేలు చేస్తూనే వుంటాడు. తన మంచితనం మానుకొమ్మంటే మానుకొంటాడా?

ముష్టిగింజ అని తినుటకు వుపయోగించని 'గింజ' ఒకటున్నది. అది తినబోతే చేరరాదు (తినుటకు చేదై, నిరుపయోగమైనది). దానిని ఎలాగైనా తినాలని పంచదారను అద్దుకొని తింటే ఏమన్నా లాభమా? ఘోరమైన దుష్టునికి కోపము వుంటే (క్రోధ స్వభావం కలవాడైతే,) సారమైన చదువులు (ఉన్నత విద్యలు) సారెసారె చదివినా (అనేకము చదివినా) దండుగే కదా!

నిప్పును తెచ్చుకొని ఒడిలోబెట్టుకొంటే కొంతసేపయ్యాక ఒళ్ళంతా కాలిపోదా? పాపం నన్ను జాగ్రత్తగా దాచుకొన్నాడని యెప్పుడైన రాజుకోక (నిప్పు అంటుకొని వ్యాపించక) ఎందుకు మానుతుంది? పాతకుడైన (పాపములు చేసే) మూర్ఖుడు (మూఢమతి) విడువకుండా యెన్ని ఆచారాలు పాటించినా దయగలవాడవుతాడా? ఎన్నటికీ కాడు.

మన ఇంట్లో కొక్కు (పందికొక్కు) ఒకటుంది అనుకోండి. దాన్ని ప్రేమగా చూచుకొని ఇంట్లో తిరుగనిస్తే దంటయై (దిట్టంగా) గోడలు తవ్వి బొక్కలు చేయకుండా వుంటుందా? గొంటరై (కుత్సితుడై) శ్రీవేంకటేశ్వరుని ఆరాధింపనని ఎన్నడూ కొలువనివాడు సంసారబంధాలలో చిక్కుకొని సతమతమవుతాడు, వాడు తొంటి సంసారి (మొట్టమొదటి సంసారి) అవుతాడు కాని, దొర (ముక్తుడు) ఎలా అవుతాడు?

పద్యవివరణ:

ఉ॥ దైవము పుట్టుకిచ్చెనని తానెటు మానును పుట్టు బుద్ధులన్
కోవిదుకైన అబ్బుదురకూడుచు జాలిగుణంబు యెన్నడున్
శ్రీవనితా మనోవిభుడ! శీఘ్రుమె 'కొక్కు'ను తెచ్చి పెంచినన్
ఆవలమానునా సహజమైన గుణంబును గోడదవ్వదా?

సంఖ్య: XIX/533 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఇన్నేసివాపులతో నిందరిపాలగలిగె

శుద్ధవసంతం

50 ఇన్నేసివావులతో నిందరిపాలఁ గలిగె
పిన్నపెద్ధై మేలుసేసీ పెంచరే యీబాలుని ॥పల్లవి॥

నరకాసురునితండ్రి నడురేయి జనియించె
అరుదుగఁ గంసుని కల్లుఁడాయను
నిరతి శిశుపాలునినెయ్యపుమఱఁది వుట్టె
పెరుగఁగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥

వొద్దిక పాండవులకు నుదయించె మేనబావ
బుద్దితో వసుదేవునిపుత్రుఁ డాయను
వుద్దండపుగొల్లెతల కొగి మగఁడు గలిగె
పెద్దవాఁడై మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥

నేరనిదుష్టులకెల్లా నిండుచిచ్చరపిడుగు
నేరిచినశిష్టులకు నిధానము
యీరీతి శ్రీవేంకటేశుఁ డితఁడె బాలకృష్ణుఁడు
పేరడిగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥ **533**

ఉపోద్ఘాతము:

ఈ బాలుడున్నాడు చూశారా! వీడికి ఇన్నిన్ని వావులు (బంధుత్వపు వరుస) వుండటం వలన ఈయన రాక్షసులకూ బంధువే, దేవతలకూ బంధువే, క్షత్రియులైన పాండవులకూ బంధువే. ఇక గొల్లవాళ్ళయిన గోపీస్త్రీలకు సాక్షాత్తూ మగడు కూడా. ఈ బాలకృష్ణుడు కలియుగపు వేంకటేశ్వరుడై శిష్ట రక్షణా కార్యక్రమం కొనసాగిస్తూ దుష్టులకు చిచ్చరపిడుగైనాడు. ఇంత పెద్ద కార్యక్రమం వున్నది కాబట్టి ఈ

బాలకృష్ణుడు చేయవలసిన మేళ్ళు అనేకం వుండటం వలన యీ బాలుని కంటికి రెప్పలా కాపాడండి.

తాత్పర్య వివరణ:

ఈ బాలుడు విష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు. ఈతడు పిన్న పెద్ధె (ఈనాటి చిన్నపాపడు పెద్దవాడై) మేలుసేసీని (అందరికీ మేలు చేస్తాడు.) ఇన్నేసి వావులతో (ఇన్నిన్ని చుట్టరికాలతో) ఇందరి పాలగలడు (ఇందరికి చెందియున్నాడు). వీనిని జాగ్రత్తగ పెంచండి.

ఇతనికి పలువురు దానవులు బంధువులుగా వున్నారు. నరకాసురునికి ఇతడు తండ్రి, ఇప్పుడు సరిగా అర్ధరాత్రి జన్మించాడు. ఇంకొక రాక్షసుడున్నాడు. వాడిపేరు కంసుడు. వాడు ఇతనికి స్వయంగా మేనమామ. శిశుపాలుడు అని ఇంకొక దుర్మార్గుడువున్నాడు వాడు ఈయనకి మేనత్త కొడుకు, (మరిదిగా) పుట్టాడు. పెరిగిన తరువాత వీరందరికీ క్రూరమైన ఆ జన్మలనుంచి విముక్తినిస్తాడు. ఈ బాలుని మేలు చేస్తాడు జాగ్రత్తగా పెంచండి.

ఈ జన్మలో దేవదేవుడు పాండవులకు మేనబావగా దగ్గరైనాడు. వృష్ణి వంశానికి చెందిన వసుదేవునికి కన్నకొడుకు అయ్యాడు. ఉద్దండపు (సాహసవంతులైన) రేపల్లె గొల్లభామలందరికీ ఉమ్మడిగా మగడు అయ్యాడు. పెద్దవాడయ్యాక ఇతని వల్ల అనేక మేళ్ళు జరగాలి. కాబట్టి ఈ బాలుని భద్రంగా పెంచండి.

ఈ బాలుడు నేరనిదుష్టులకెల్లా (దోషపూరితులైన దుష్టాత్ములకు) చిచ్చరపిడుగు (అగ్ని వర్షించే అశనిపాతము). నేరిచిన (జ్ఞానులైన) శిష్టుల పాలిట (మంచివారికి) నిధానము (పెన్నిధి). ఈ విధముగా ఈ బాలకృష్ణుడే కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వరుడు. ఈతడు పేరడిగా (అధికముగా) మేలుచేస్తాడు. ఈ బాలుని కడు శ్రద్ధగా పెంచండి.

పద్యవివరణ:

చం॥ **కలుగవావులిన్ని సిరికాంతడు బాలునివోలె జేరెరా**
చెలువపుపాపడే పెరిగి చేయును మేళ్ళను పెంచరే హరిన్
కొలువుడు శిష్టరక్షకుడు గోపకిశోరుడు ద్రుంచుదుష్టులన్
కలియుగదైవమై మనల కావగ వచ్చెను వేంకటేశుడై.

సంఖ్య: I/471 రాగం : లలిత
కీర్తన : ఎక్కెగా రాగా రాగా యిందాకా దగులు

లలిత

51 ఎక్కెఁగా రాఁగా రాఁగా యిందాఁకాఁ దగులు
యిక్కువ శ్రీహరిమాయ నింకనెంతో తగులు ॥పల్లవి॥

తెగనికర్మమునకు దేహము దగులు
తగినదేహమునకు తరుణితో తగులు
సొగసి యారెంటికి సుతు లొక్కతగులు
అగడాయఁ గనకము అన్నిటితో తగులు ॥ఎక్కెఁ॥

యింతటిసంసారికి యిల్లొక్కతగులు
బంతికి నందు గలిగె పాఁడిపంట తగులు
చెంత నీలంపటానకు క్షేత్రము తగులు
సంతగూడేదాసదాసీజనులెల్లా దగులు ॥ఎక్కెఁ॥

మొదల జీవుఁ డొక్కఁడే మోపులాయఁ దగులు
వదలనిబంధములు వడ్డివారెఁ దగులు
వుదుటిహముఁ బరము నొక్కయందె తగులు
అదె శ్రీవేంకటపతి యంతరాత్మ తగులు ॥ఎక్కెఁ॥ **471**

ఉపోద్ఘాతము:

"రాగ" అంటే అనురాగము. రాఁగ అధికమైతే అది తగులుగా మారుతుంది. చిక్కు అవుతుంది. వీడితో గొప్ప చిక్కు వచ్చిపడింది అంటే అదే నేటి భాషలో చీకాకు అయింది. ఈ విధంగా నేను భావిస్తున్నాను. అనురాగము యెక్కువైన కొద్దీ అది చిక్కుగా మారుతుంది. శ్రీహరి మాయ అంతా వ్యాపించి వుండటంచేత ఇంకా యెంతో "తగులు"తో జీవుడు అవస్థలుపడుతున్నాడు. ఇక ఈ తగులు ఒకటి ఇంకొకదాని క్రింద మారి బాధ పెడుతుంది అంటున్నారు అన్నమయ్య. మొట్టమొదట జీవుడొక్కడే వుంటే ఏ బరువు బాధ్యత లేకుండా వుంటాడు. కానీ

బంధాలు వడ్డీవలె వచ్చిపడి వాడి తగుళ్ళు పెంచుతుంది. వేంకటపతే తన అంతరాత్మ అని తెలసేదాకా వీడిగతి ఇంతే.

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! అనురాగము యెక్కువవటం వలన, ఇందాకా (ఇంతవరకు) అది తగులు (చిక్కుగా) మారుతుంది. ఇక్కువ (వ్యాపకుడైన) శ్రీహరి యొక్క మాయచేత, ఇంకా యెంతో తగులు కలుగుతుంది.

ఈ విచిత్రమైన అనుక్రమణ చూశారా? జీవుడు తెగని కర్మము (అంతులేని కర్మము) చేసివున్నాడు. అందువలన వాడికి ఈ దేహము తగులైనది. తగిన దేహము వచ్చిన పిదప తరుణి (స్త్రీ) ఒకతె వీడికి తగులైనది. ఈ రెంటికీ కోర్కె వలన సుతులు వారికి తగులైనారు. అగడాయె (నిందలపాలు చేయు) కనకము (బంగారం) అన్ని చిక్కులకు కారణము. అవునా?

ఇంతటి సంసారికి కూడా వాడి 'ఇల్లు' వొక పెద్ద తగులుగా పరిణమిస్తుంది. ఇక సంసారమన్నాక పాడిపంటా రాకుండా కుదరదు కదా! అదొకతగులై ఆ సంసారిని పీడిస్తాయి. ఇదొక లంపటముగా మారుతుంది. వీటితోపాటు వ్యవసాయ క్షేత్రము వచ్చి, అదొక తగులై తీరుతుంది. ఇక వాటన్నిటివెంట ఒక్కొక్కటిగా దాసదాసీ జనము చేరి భరింపలేని తగులై పరిణమిస్తుంది.

మొదలుపెట్టినప్పుడు జీవుడు ఒక్కడే వుండేవాడు. వాడికి ఏ బరువూ బాధ్యతలు తగులుకోక హాయిగా వున్నాడు. వాడికి వదలని బంధాలు వడ్డీ మీద వడ్డీ తగులుకొన్నట్లు "తగులు" అయ్యాయి. దానితో ఇహమూ పరమూ జమ అయినాయి. ఈ రెండూ ఒక్కదాంట్లోనే తగులైనాయి. అదె శ్రీవేంకపతే ఈ జీవుడి అంతరాత్మ అని తెలిసేదాకా, తగుళ్ళు తప్పవు మరి.

పద్యవివరణ:

కం॥ **ఎక్కుడు రాగమె తగులౌ**
ఇక్కువ శ్రీహరిది మాయయెంతో తగులౌ
ఉక్కిరి బిక్కిరి జేయను
మిక్కుటముగ వేంకటేశ! మించిన తగులై.

సంఖ్య: XIX/32 రాగం : కురంజి
కీర్తన : ఇంతకాకు గలదా యేమోయి చెలులను

కురంజి

52 ఇంతకాకు గలదా యేమోయి చెలులను
చెంతల మందెమేళాలు సేసుకొంటి విట్లా ॥పల్లవి॥

యేకతాన నీవు నాకు నిట్టె కతలు చెప్పఁగా
దాకొని సతులెల్లాను తామూ వినేరు
జోకతో నీవు విడేలు సొరిది నా కందియ్యఁగా
చేకొని తామూ నట్టె చేతులు చాఁచేరు ॥ఇంత॥

సరసమాడుచు నా చన్నులు నీవంటఁగాను
సొరిదిఁ దమచన్నులు చూపేరు నీకు
తెరలో నాకు నీ మోవితేనె విందువెట్టఁగాను
గరిమఁ దామును నట్టె కడునోరూరేరు ॥ఇంత॥

పలుమారు నీవు నాకుఁ బచ్చడము గప్పఁగాను
కలికికాంతలు తమ్మూఁ గప్పుమనేరు
అలమేల్మంగనైన న్నట్టె నీవు కూడితేను
నెలవై శ్రీవేంకటేశ నిన్నుఁ దామూ కూడేరు ॥ఇంత॥ **32**

ఉపోద్ఘాతము:

"ఏమోయీ, ఇంత బాధించుట కలదా? నేను నీ సతిని. నిరాదరణ చూపదగునా? సమీపంలో నేనున్నా చెలియలు నీపైపై బడుతున్నారు. ఇంత పరిహాసం ఇట్లా చేసికొంటున్నావు. ఇది తగునా?" అని ఈ పల్లవికి అర్థం. అన్నమయ్య కాలంనాటి జానపదుల తెలుగు అంత తేలిక వ్యవహారం కాదు. రవ్వా శ్రీహరి గారు మా బోంట్ల కొరకు అన్నమయ్య పదకోశం వ్రాయబట్టి మేము ఊపిరి పీల్చుకొన్నట్లయింది. ఈ కీర్తన నిండా ఇటువంటివే తారస

పడతాయి. కొసమెరుపులా శ్రీదేవి ఏమంటున్నదంటే, ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దేవేరి అలమేల్మంగను నీవు నన్నట్టే కూడితివి బాగానే వున్నది. కానీ ఈ నెలతలంతా తామూ నిన్ను కూడెదమంటారు, ఇదేమి చోద్యం?

తాత్పర్య వివరణ:

ఏమోయీ! ఇంతకాకు గలదా? (ఇంతగా బాధించుట యెక్కడన్నా వుందా?) సమీపములో, నేనున్నా మందెమేళాలు (పరిహాసము) ఇట్లా సేసుకొంటివి (ఈవిధంగా చేస్తున్నావు). ఇది నీకు తగునా?

నాథా! ఏకతాన (ఏకాంతంలో) నీవు నాతో చనువుగా కతలు (విశేషాలు) చెబుతుంటే, దాకొని (దాగికొని) ఈచెలియలందరూ, తాము వినేరు (వింటున్నారు). నీవు జోకతో (ఉత్సాహంతో) విడేలు సొరిది నాకందీయగా (తాంబూలము శీఘ్రముగా చేతికందీయగా) మాకూ ఇమ్మని వాళ్ళంతా నీ ముందు చేతులు చాస్తున్నారు. చెలికత్తెలకు ఇంత చనువు ఇయ్యవచ్చునా?

నాథా! సరసములాడువేళ నీవు నా స్తనయుగ్మమును స్పృశిస్తే సొరిది (క్రమంగా) వారూ వారి చనుగవ నీకు చూపుతున్నారు. తెరచాటున నీవు నామోవితీపి రుచి చూస్తుంటే సిగ్గూయెగ్గూ లేకుండా వారూ గరిమ (మధ్యలో) వాళ్ళు తమకు నోరూరినట్లు పెదవులను తుడుచుకొంటున్నారు. చెలులకు ఇంత చనువీయదగునా?

నాథా! పలుమారు (అనేక పర్యాయములు) నీవు నాకు పచ్చడము (పట్టువస్త్రము) కప్పుతుంటే తమ మేలిముసుగు తొలగించుకొని మరీ నీముందుకు వచ్చి తమకు పట్టువస్త్రము కప్పమంటారు. ఈ కలికి కాంతలను యేమి చేయాలి? నీవు నేను నీ దేవేరి అలమేల్మంగ నవుట జేత నాతో ఇట్టే కూడితేను, సుస్థిరుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా నిన్ను తామూ సమీపించి కూడెదరు. ఎంత తెంపరులు!!!

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇంతకాకుగలదె యేమోయి చెలులను**
మందమేళమాడ మానవేమి?
కోరి వేంకటేశ! కూడు సతినినేను
తాము కోరనేల తరుణులంత?

సంఖ్య: X/14 రాగం : వరాళి
కీర్తన : మాటి మాటికి జూచి మరపులేలె

వరాళి

53 మాఁటిమాఁటికిఁ జూచి మరపులేలె
నీటునఁ బాటిగంప నీళ్లు మోచేవా ॥పల్లవి॥

తెలిపేగురుఁ డుండఁగ తెలియఁగ నేరవు
చిలుకచదువులేలో జీవుఁడా
అలవోక నెందైన ఆస మానలేవు
కల గన్నచోటి కెల్ల గంపయెత్తేవా ॥మాఁటి॥

వొబ్బిడైనవేదమార్గ మొల్లనిపుణ్య మంటేవు
జిబ్బిటాయతప మేలె జీవుఁడ
అబ్బురపువేడుకల నలసేవు పలుమారు
గబ్బివై పారేబండికిఁ గాలు చాఁచేవా ॥మాఁటి॥

వొల్లనె సంసారములో నూరకె గర్వించేవు
చెల్లఁబో రొయ్యకొవ్వేలె జీవుఁడా
నల్లని శ్రీవెంకటనాథునిబంటవైతివి
తల్లకిం దేల మేరువు తలగడనుండఁగా. ॥మాఁటి॥ **14**

ఉపోద్ఘాతము:

ఇది అన్నమయ్య మనుమడు చేసిన అద్భుతమైన అధ్యాత్మ కీర్తన. ఓ జీవుడా ఈ సంసారపు పీకులాట మాటిమాటికీ చూస్తూనే వున్నావు. కాని ప్రతిసారి మరచిపోతున్నావు. గత జన్మలో నేర్చిన జ్ఞానం నశించి మళ్ళీ పరగడుపు ఆకలిగొన్నవానివలె ప్రవర్తిస్తున్నావు. ఎక్కడన్నా పాటిగంప చెత్త తీసికెళ్ళటానికి ఉపయోగపడుతుంది కానీ తాగే నీళ్ళు తీసుకుపోవడానికి పనికి వస్తుందా? కానీ నీవు అదే పని చేస్తున్నావు. వ్యర్థమైన ప్రయాస సంసారిక సుఖాలకోసం పడుతున్నావు. ఆ సుఖాలూ శాశ్వతం కాదు, సంసారమూ శాశ్వతం కాదు. కనీసం

ఈ జన్మలోనైనా శ్రీవేంకటేశ్వరుని బంటువై తరించు. ఆయన బంగరు మేరుపర్వతం. ఆయన్ని తలగడగా వుంచుకొని యెందుకు తలకిందులవుతున్నావు? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ జీవుడా! మాటి మాటికి జూచి (ప్రతిసారీ ప్రత్యక్షంగా చూచి) కూడా మరపులేల (మతిమరపు తగునా?) నీటున పాటిగంప (చిన్న గంపలో) చెత్తయెత్తి పారయేయవచ్చుగానీ) నీళ్ళు మోయడానికి పనికివస్తుందా?

ఈ జన్మలో తెలిపే గురుడుండగా (తత్త్వజ్ఞానం బోధించే గురువు వున్నా) తెలిసికొనవైతివి. చిలుక పలుకులవంటి పనికిమాలిన చదువులు నేర్చావు. ఇంకా సంపాదించాలనే ఆశ మాన్పలేని ఆ చదువులెందుకు? కలగన్న చోటికెల్ల గంపనెత్తేవా? (కలగన్న ప్రతిదీ కావాలి అనుకొంటున్నావు). దీనివల్ల నీకు ప్రయోజనం శూన్యం.

ఎన్నో పుణ్యకార్యాలు చేశావు. కానీ అవేవీ వేద విహితములైన పుణ్యకర్మలు కావు. అవి ఒట్టిడైనవి (బాగైనవి) కావు. ఇక తపస్సులు ఒబ్బిడాయ (గబ్బిలం) మాదిరి చేసి ప్రయోజనమేమిటి? పలుమారు (అనేక తడవలు) అచ్చరువొందే వేడుకలలో మునిగి అలిసిపోయేవు. గబ్బివై (గర్వంతో) పరుగులెత్తే బండి కింద కాళ్ళు పెడుతున్నావు. జీవుడా అవిటివాడివవక యేమవుతావు?

ఓ జీవుడా! ఒల్లనె (అధికముగా) ఈ సంసారములో వూరకనే గర్వించుచున్నావు. చెల్లబో (సెబాష్!) ఈ సంసారంలో ఆనందం యెంతుంటుంది? రొయ్య కొవ్వంత (రొయ్యకు అసలు కొవ్వే వుండదు). నీ సుకృతంవల్ల ఈనాటికి శ్రీవేంకటేశ్వరునికి బంటువైనావు. ఇక నీకు బంగారు మేరుపర్వతాన్ని తలక్రింద తలగడగా పెట్టుకొన్నట్లే, మరి.

పద్యవివరణ:

తే.గీ॥ **మాటి మాటికి జూచియు మరపులేల**
పాటిగంపలో నీళ్ళను పట్టగలమె?
నల్లనైనట వేంకటనాథు బంట్లు
చినతిరుమలయ్య చెడరని చెప్పినాడు.

సంఖ్య: XVII/394 రాగం : గుండక్రియ
కీర్తన : వలపు గొరబు సేయవద్దే యింత

గుండక్రియ

54 వలపు గొరబు సేయ వద్దే యింత
యెలమిఁ జలపోరేవు యేమే నీవు ॥పల్లవి॥

సంకె లేక యాతఁడు సారెఁ జేసేచేఁతలకు
వంకలొత్త వచ్చేవు వద్దే యింత
వుంకువ నాపెనే వెంట నూడిగానకుఁ దిప్పఁగా
యింకాన న్నదిమేవు యేమే నీవు ॥వలపు॥

కాదని యాతనిఁ దారుకాణకు వేఁ బిలిచితే
వాదులాటకు వచ్చేవు వద్దే యింత
గోదిలి నావద్దఁ బేరుకొని యాపెఁ బిలువఁగ
యీదెస వినుఁ మనేవు యేమే నీవు ॥వలపు ॥

శ్రీవేంకటేశ్వరుతోడఁ జేయి వట్టి పెనఁగఁగ
వావి దెలుప వచ్చేవు వద్దే యింత
కావించి యాతఁడూ నేనుఁ గలసితే నాపెచేత
నీవేళ మొక్కించ వచ్చే వేమే నీవు ॥వలపు॥ **394**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య చెప్పిన మధుర శృంగార కీర్తననాస్వాదించండి. ఇంత వలపు గొరబుసేయవద్దే అంటున్నారు. ప్రేమను అల్లరిచేసికోవద్దని అంటున్నారన్నమాట. నీవు అతిశయించి మత్సరముతో ఇంత పోట్లాడుతున్నావేమే? అని ఈ పల్లవి రెండవ చరణానికి అర్థం. అదండీ సంగతి. పెద తిరుమలయ్య శ్రీదేవికి చెలికత్తెవలె ఈ కీర్తన పాడుతున్నారు. దాదాపు ప్రతి చరణంలోనూ ఏదో ఒక తిరకాసు వుంటుంది గమనించండి.

అందుకనే ఈ పెదతిరుమలయ్య తండ్రికి తగ్గ తనయుడు. వేంకటపతికి ఇంతకంటే ఉత్తమ సేవ వుంటుందా? మేమిద్దరమూ సురతుల నలసివుంటే ఈ వేళ ఆమెతో మొక్కించవచ్చేవేమే అని మందలిస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! వలపు ఇంత గొరబులు చేయవద్దే. (నీ ప్రేమను ఇంత అల్లరి చేసికొనకమ్మా!) నీవు ఈ వేళ యెలమిన్ (అతిశయించి) చలపోరేవు యేమే (మత్సరముతో పోట్లాడుతున్నావు దేనికమ్మా?)

ఓ దేవీ! సారె (ప్రతిసారీ) ఆతడు సంకెలేక (అసంఖ్యాకంగా) చేసే చేతలకు (ఇబ్బందికరమైన పనులకు) వంకలొత్త (వంకలు పెడదామని) వచ్చావా? ఎందుకుమా? నీకేమో ఆ చెలికత్తెపై అనుమానం. మరి ఆమె వుంకువ (కన్యాశుల్కముగా) వచ్చింది. ఇంకా ఆమెనే నీవెంట వూడిగమునకు తిప్పగా (వినియోగించి) నేడు నన్ను అదిమేవేమే (ఒత్తిడి చేస్తావేమమ్మా?)

దేవీ! కాదని (ఇలా కాదని) ఆతని (నీపతిని) తారుకాణకు (నిరూపణకు) వేబిలిచితే (ఉన్నట్లుండి పిలిపించితే) నాతో వాదులాటకు (పోట్లాటకు దిగుతావు) ఇంత చీకాకు వద్దమా! ఆమె ఒకరోజు నావద్ద ఓదిలి (గూఢముగా) స్వామిని పేరుతో వ్యవహరించిందని, నాతో ఇటొచ్చి రహస్యంగా వినమనేవు. ఎందుకమ్మా?

సరే అదట్టావుంచి నేడు శ్రీవేంకటేశ్వరుని నేను వారిస్తూ చేయిపట్టుకొని పెనుగులాడగా, నీవు చూచి వావిదెలుప వచ్చేవు (ఇది పద్ధతి కాదని చెప్పవచ్చేవు). ఇంతెందుకమ్మా అనుమానం? కానీ ఆతడే నాతో కూడినాడు. అది చూచినేడు ఆమె చేత (నీ చెలికత్తెలతో) స్వామికి మొక్కించవచ్చేవు. తిరుమలేశుడు అందరివాడమ్మా! నీవెరుగవా?

పద్యవివరణ:

కం॥ **వలపు గొరబుసేయంగా**
వలదని పెదతిరుమలయ్య పలికెను రమకున్
చలపోరేవేమేయని
పలురీతుల మందలించె, పాడెను హరికిన్

సంఖ్య: I/21 రాగం : శంకరాభరణం
కీర్తన : పరుసము సోకియు బ్రదుకవద్దా

శంకరాభరణం

55 పరుసము సోఁకియు బ్రదుకవద్దా
తిరిగి కర్మము లింక తీదీపులా ॥పల్లవి॥

పడిగాలువడియున్న ప్రాణాచారముల-
పడఁతుల నధములఁ బాలించితి
యిడుములఁ బెడఁబాప నింకనేల తెగి కొంక
గడియించి తెచ్చియు నింకఁ గడ మున్నదా ॥పరుస॥

మితిలేనిధనములు మెరసి కానుకగొని
అతిపుణ్యు లిందరి నలరించితి
ధృతిహీనులకునెల్ల దిక్కయి కాతువుగాక
వ్రతముచెల్లిన నింక వట్టఁగట్టా ॥పరుస॥

పాలించి నావిన్నపమున వేంకటరాయ
లాలించితివి నే నీలలనఁగానా
యీలాగుననె లోకమింతాఁ గాతువుగాక
పాలుదాగినమీఁదఁ బైకుడుపులా ॥పరుస॥ 21

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన నిక్కడ నేను ఎన్నుకొన్న కారణమేమంటే అన్నమయ్య కీర్తనలలో కొన్ని ఉద్దండ పండితులకు కూడా మింగుడుపడవు అని చూపటమే. ఈ కీర్తనలో తెలుగు నేటి తరానికి కొరుకుడు పడదు. ఇందులో నేను భావించినదే యెక్కువ భాగము. తప్పొప్పులు ఆ వేంకన్నకే తెలుసును. పాఠకులకి మనం ఎంత భాషరాని వాళ్ళమో చూపటమే నా

ఉద్దేశ్యము. నిరుత్సాహపడకండి. ఇదే నిజం. మనకి తెలిసింది తక్కువ, తెలియందే ఎక్కువ. అయినా ప్రయత్నించాలి కదా!

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! పరుసము సోకియు బ్రతుక వద్దా (చేత్తో తాకిస్తే ఏ లోహమైనా బంగారం అయ్యే పరుసవేది విద్య చేతిలో వున్నవానిలాగా బ్రతికితే మంచిది కదా!) తిరిగి కర్మములింక తీదీపులా (మళ్ళీ మళ్ళీ కర్మలు చేసి బాధలు బదులు తెచ్చుకోవటం ఎంత పనికిమాలిన వ్యవహారం)!!

ప్రాణాచారము వేసినవానిలాగా పడిగాలుపడి (పడికాపులుకాసి) స్త్రీలను పొందాను. అధమాధములకు యజమానినయ్యాను. నేడు, ఇడుమల వెడబాపన్ ఇంకా యేల తెగి కొంక (కష్టాలన్నీ తొలగిపోయినాయి కదా! ఇంకా జంకు దేనికి?) ఇప్పటికీ అర్థంకాలేదా? గడియించి తెచ్చియు కడమున్నదా (ఎంత సంపాదించినా ఈ కొఱత తీరేదా ఏమన్నానా?)

నేను ఒక వెలుగు వెలిగిన రోజుల్లో మితిలేని ధనములు కొనుకగొని మెరిసిపోయాను. పుణ్యాత్ములనెందరినో సంతోషపెట్టాను. అందరికీ ఏదో విధంగా ఉపయోగపడ్డాను. ధృతి హీనులకు నెల్ల దిక్కయి గాతువు గాక (ధైర్యం కోల్పోయిన వారందరికీ దిక్కు అయ్యాను. ఇవాళ నాకెవరూ లేరు. వ్రతము చెల్లినన్ ఇంకా వట్టిగట్టా? (వ్రతము పూర్తి అయిపోయింది. వట్టిపోయిన గొడ్డు దగ్గర పాలు యెవడు పిండుకొంటాడు? ఎంత అవివేకం!!)

ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీ లలన శ్రీసతివలెనే లాలించవయ్యా! నా విన్నపములను పరిపాలించుము తండ్రీ! ఇదే విధంగా ఈ లోకంలో అందరినీ రక్షించవయ్యా! నేనింక ఎవ్వరినీ ఆశ్రయించను. కడుపునిండా పాలు త్రాగినవానికి ఇంకా చిరుతిండ్లు యెందుకయ్యా?

పద్యవివరణ:

ఆ.వె॥ **బ్రతుకవలదె నరులు పరసమ్ము అంటిన**
విధముగాను భువిని వేంకటేశ!
తిరిగి కర్మ జిక్కి తీదీపులేలనో?
తెలివిలేనివాని తీరునాయె.

సంఖ్య: XIX/351 రాగం : సామంతం
కీర్తన : గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు

సామంతం

56 గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు
కొల్లకాఁడు రేపల్లెగోవిందుఁడు ॥పల్లవి॥

పలుకుల భ్రమయించె భావములఁ గరఁగించె
కొలనికరత నవ్వె గోవిందుఁడు
యెలయించి యప్పటి మాయింటిలోనే పవ్వళించె
కొలఁదిమీరినవాఁడు గోవిందుఁడు ॥గొల్లె॥

వూరక పువ్వుల వేసె నొకటొకటేసేసె
కూరిమిఁ దప్పకచూచె గోవిందుఁడు
చేరి మావారుండ వారు చెప్పరాదు తనదూరు
కోరి యశోద నీబిడ్డ గోవిందుఁడు ॥గొల్లె॥

సమ్మతించఁ జేయివేసె చన్నులతోనే రాసె
కుమ్మరించె వలపులు గోవిందుఁడు
దొమ్మిసేసి మమ్ముఁగూడె దొరవలె నదె వాఁడె
కొమ్మరో శ్రీవేంకటాద్రి గోవిందుఁడు ॥గొల్లె॥ **351**

ఉపోద్ఘాతము:

ఈ గొల్లభామలతో ఇంత అఘాయిత్యం చేసే ఈ గోవిందుడు రేపల్లెలో 'అపహరణలో' అందె వేసిన చేయి. ఆయన అపహరించేది గొల్లెతల మానములు అని ఈనాటి అజ్ఞానులు అనుకొంటారు కానీ అది నిజంకాదు. మాన రక్షణ అభిమాన రక్షణ, శరణాగతి చుక్కెదురు. పరమాత్మ మననుంచి ఆశించేది తొలినాళ్ళలో భయం, తరువాత భక్తి, తరువాత శరణాగతి చిట్టచివరిగా హరిదాస్యం. ఆ దారిలో నిష్ఠతో పోతుంటే ముక్తి లభిస్తుంది. ఇక ఆ జీవికి జననమరణాలు వుండవు. తమని తాము అర్పించుకోవటం ద్వారా

కైవల్యసిద్ధిని పొందిన ఆ గొల్లభామలని గోవిందుడు ఏమేంచేశాడో అన్నమయ్య మధుర కీర్తనలో వినిపిస్తున్నారు, వినండి.

తాత్పర్య వివరణ:

ఈ గోవిందుడు గొల్లెతలనింతసేసె (గోపికలను ఇంత అల్లరిపెట్టాడు). ఈ రేపల్లెలో గోవిందుడు కొల్లకాడు (అపహరణలో మొనగాడు). ఆతడు ఏమేం చేశాడో వినండి.

గోవిందుడు గొల్లభామలను తన పలుకుల (తీపి మాటలతో భ్రమలో ముంచేవాడు). వాటిలోని భావము అర్థంచేసికొంటే వాళ్ళ మనస్సులు కరిగిపోకుండా వుంటాయా? కొలనికరత నవ్వేను (కొలను ఒడ్డున దుశ్చేష్టలు చేసి నవ్వులొలికిస్తాడు). మా ఇంట్లో దూరి, అప్పటి పవ్వళించి (మరల మరల పడుకొని) యెలయించె (చేరువ అవుతాడు). ఈ గోవిందుడు కొలది మీరినవాడు (హద్దులు మీరినవాడు).

ఓ యశోదమ్మా! మీ గోవిందుడు అమాయకుడనుకొన్నావా? మా గొల్లెతలపై వూరకనే పువ్వులు చల్లుతాడు. ఒంటరిగా చేజిక్కించుకొంటాడు. ఆతని చూపులతో కూరిమి (విపరీతమైన ప్రేమను ముంచెత్తేట్లు చూస్తాడు.) మేము మావారితో ఏకాంతములోవుంటే తను కోరి (కావాలని) చేసిన దూరు (చెడ్డపనులు) మేము నోటితో చెప్పలేమమ్మా!

ఇదిగో ఇప్పుడు ఇంకొంచెం పెద్దవాడయ్యాడు కదా! ఆతని చేష్టలూ పెద్దవైనాయి. మమ్మల్ని సమ్మతించ (అంగీకరింపజేయుటకు) అనునయంగా మీద చేయివేస్తాడు. స్తనములకు రాపిడి కలిగిస్తాడు. వలపులను కుమ్మరిస్తాడు. మరి ఈ గోవిందుని గురించి ఏమి చెప్పము? తను మా దొరమాదిరిగా, దొమ్మిచేసి (బలవంతాన) కూడినాడు. కొమ్మరో (ఓ వనితామణీ!) వీడు యెవరనుకొన్నావు? వేంకటాద్రిపైనున్న గోవిందుడు.

పద్యవివరణ:

కం॥ **గొల్లెతల నింతసేసెను**
అల్లరిగోవిందుడితడు అటురేపల్లెన్
ఉల్లములు కొల్లగొట్టెను
నల్లని యీ తిరుమలయ్య నగధరుడే పో!

సంఖ్య: I/279 రాగం : సామంతం
కీర్తన : మాయపుదనుజులమదవైరి కపి

సామంతం

57 మాయపుదనుజులమదవైరి కపి-
రాయఁడు వీఁడివో రామునిబంటు ॥పల్లవి॥

పెట్టినజంగయు పెంపుమిగుల మొలఁ
గట్టినకాసెయు గర్వమున
నిట్టనిలిచి పూనినచేత నడిమి-
దిట్ట వీఁడువో దేవునిబంటు ॥మాయ॥

నవ్వుచు లంకానగరపుదనుజుల-
కొ వ్వణఁచినకపికుంజరుఁడు
మువ్వురు వేల్పుల మొదలిభూతియగు-
రవ్వగు సీతారమణునిబంటు ॥మాయ॥

పంకజసంభవుపట్టముగట్టను
వుంకించిన తనవొడయనిచే
పొంకపుకలశాపురహనుమంతుఁడు
వేంకటరమణుని వేడుకబంటు ॥మాయ॥

ఉపోద్ఘాతము:

కలశాపురంలో వెలసిన హనుమంతునిపై రమణీయమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. దనుజులమదమునకు శత్రువు హనుమంతుడు. వారు మాయావులు. రామచంద్రునిపట్ల నిరసన భావము కలవారు. ఆకారణాన రామునిబంటు అయిన ఈ కపిరాయుడు దనుజులను దండించాడు. ఈ హనుమ ఒక పాదమును చాచివుంచాడు. కాసెపోసి మొలదగ్గర వస్త్రమును బిగించికట్టాడు. నవ్వుతూనే లంకలో రాక్షసుల్ని మట్టుంబెట్టాడు, ఈ సీతారమణుని బంటు. నేడు తన

ఒడయడైన శ్రీవేంకటేశుని నమ్మిన బంటయినాడు అంటున్నారు. అంటే స్వామి నమ్మినబంటు.

తాత్పర్య వివరణ:

ఈ కలశాపుర హనుమంతుడు, మాయపుదనుజుల (మాయోపాయాలలో ఉద్దండులైన రాక్షసులకు) మదవైరి (మదమణచు శత్రువు). వీడివో (ఈయనే) రాముని బంటు శ్రీరామబంటు అని జగద్విఖ్యాతుడైన కపిరాయుడు (వానర శ్రేష్ఠుడు).

ఈయన ఆకారమును చూడండి. పెంపుమీర (అతిశయించునట్లుగా) తన జంగను (కాలిపిక్కను) అదిమిపెట్టి వుంచినాడు. మొలకు కాసె (గోచిలా బిగించికట్టిన వస్త్రము) కట్టినాడు. గర్వముతో తనననడుముపై ఒక చేయి వుంచుకొని నిట్టనిలువుగా నిలబడినాడు. ఈ దేవుని నమ్మిన బంటు అయిన వీడే కదా! దిట్ట.

ఈ మహానుభావుడు ఎవరనుకొన్నారు. కపి కుంజరుడు (వానరులలో పట్టపుటేనుగువంటివాడు). నవ్వుతూనే లంకానగరములోని దానవుల క్రొవ్వును కరగదీసినాడు (గర్వము నణచినాడు). మువ్వురివేల్పుల మొదలిభూతి (త్రిమూర్తుల మూలపురుషుడైన పరబ్రహ్మ) యొక్క మానవావతారమైన శ్రీరామచంద్రుని బంటు. వజ్రమువంటి వీడేకదా! సీతారమణుని కాప్తుడు.

రాబోయే కాలములో సృష్టికర్తవుకమ్మని బ్రహ్మపట్టమున, తన ఒడయనిచే (తన స్వామి అయిన శ్రీరామునిచే) నియమింపబడినవాడు. పొందికపడు ఈ కలశాపుర హనుమంతరాయుడు మరెవ్వరో కాదు తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని వేడుక బంటు (యెల్లప్పుడూ ఆనందము కలిగించు నమ్మినబంటు.)

పద్యవివరణ:

ఉ॥ **రాముని బంటువీడు కపిరాయడు, మాయలదైత్యమూకకున్**
తా, మదవైరి నవ్వచునెఢాటిగ వారల క్రొవ్వుదీసెరా
కోమలి సీతకాప్తుడయి కూలిచిలంకను బూదిజేసెరా
గోముగ వేంకటేశ్వరుని కూరిమిబంటయె, బ్రహ్మయౌ భళా!

సంఖ్య: XIX/31 రాగం : మనోహరి
కీర్తన : అలమేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి

మనోహరి

58 అలమేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి
చలములేఁటికి నిఁక సమ్మతించవే ॥పల్లవి॥

విడియము చేతికిచ్చి విభుఁడు వేడుకపడి
వొడివట్టి పెనఁగగా నొద్దనకువే
వుడివోని వేడుకతో నుంగరము చేతికిచ్చి
యెడయక వేఁడుకొనఁగా నియ్యకొనవే ॥అల॥

చిప్పిలువలపుతోడ చెక్కులు నొక్కుచు మోవిఁ-
గప్పుర మందియ్యఁగాను కాదనకువే
కొప్పు దువ్వి బుజ్జగించి కొసరి మాటలాడి
అప్పసము నవ్వఁగాను అట్టె కానిమ్మనవే ॥అల॥

యిచ్చగించి శ్రీ వేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడి
మచ్చికఁ గాఁగలించఁగాను మారాడకువే
పచ్చడము మీఁదఁ గప్పి పట్టపుదేవులఁ జేసి
చిన్నలాన నేలుకొనె నీవూఁ గైకొనవే ॥అల॥ 31

ఉపోద్ఘాతము:

ఓ దేవీ! నీవు స్వయంగా అలమేలుమంగవు. జగదేకపతి శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణివి. నీవు అన్ని విద్యలలోనూ నేర్పరివి. నీకీ రుసరుసలు బుసబుసలు శోభనిస్తాయా చెప్పు తల్లీ! మత్సరము నీకు తగదమ్మా! సమ్మతించి నీపతిని అలరించవమ్మా! అంటున్నారు అన్నమయ్య. తాంబూలము నీచేతికిచ్చు నెపంతో నీవిభుడు వేడుకపడి నీతో పెనగులాడితే చిరునవ్వుతో ఆతని కోర్కెనొద్దనకు. అంతులేని వేడుకతో వుంగరము నీవ్రేలికి

తొడుగుతానని నీ చేయి తన చేతిలోనికి తీసుకొంటే సంబరపడి సమ్మతించవమ్మా! అంతటి మహద్భాగ్యం ఇంకెవరికి దక్కుతుందమ్మా? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

దేవీ! నీవు అలమేలుమంగవు. నీవు అన్నిటా (అన్ని విద్యలయందు) నేరుపరివి (చాతుర్యము కలదానవు). ఆయన జగదేకపతియైన శ్రీవేంకటేశ్వరుడు. ఇక చలములేటికి (మత్సర భావము లెందుకు) ఆయనతో కూటమికి సమ్మతించవమ్మా!

నీ విభుడు విడియము (తాంబూలము) నీ చేతికిచ్చి నీ పతి వేడుకపడి వొడివట్టి పెనగగ (నడుముచుట్టూ చేతులు బిగించి పెనవేసికొనగా) వద్దనకువే (వద్దని చెప్పరాదమ్మా!) ఉడివోని వేడుకతో (తొలగని కుతూహలంతో) ఆయన నీ చేతికి ఉంగరము నిచ్చి స్వీకరించమని వదలక వేడుకొనినాడు. ఇప్పటికైనా దానిని గైకొని, ఇయ్యకొనవే (అంగీకరించవమ్మా!)

స్వామి నీపై చిప్పిలు వలపులు (పెల్లుబుకుతున్న ప్రేమను) నీ చెక్కిలి నొక్కుచు పరిమళ కర్పూరము నోటికందించగా కాదనకమ్మా! నిన్ను అనునయించడానికి ఆయన నీ సేవలు చేస్తాడు. నిన్ను అలంకరిస్తానని చక్కగా నీ కురులు దువ్వి బుజ్జగిస్తూ కొసరి కొసరి మాట్లాడతాడు స్వామి. అప్పసము (తనంతటతానే) నవ్వుతాడు. నువ్వుకూడా అలాగే కానిమ్మని సహకరించు. వద్దనకు.

ఇష్టముతో శ్రీవేంకటేశ్వరుడు నిన్ను గూడి చనువుగా పరిష్వంగ సుఖమందీయగా మారుమాట్లాడకుమమ్మా! ఆయన నీపై ప్రేమగా పట్టువస్త్రము గప్పి నీవే పట్టపురాణివని నిన్ను అనాదిగా యేలుకొంటున్నాడు. నీవు ఆయననూ చేతులు చాచి స్వీకరింపుము తల్లీ!

పద్యవివరణ:

కం॥ **అలమేలుమంగవమా!**
పలువిద్యల నేరుపరివి పటురాణివియున్
వలపించు వేంకటేశుని
చలమేటికి సమ్మతించి జతవగుమమ్మా!

సంఖ్య: XIX/33 రాగం : దేసాళం
కీర్తన : కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు

దేసాళం

59 కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు
కొలఁదిమీరకువయ్య గోవిందరాజా ॥పల్లవి॥

పాదములొత్తేయట్టిపడఁతికి నిదివొ
ఆదిగొని చెమరించె నంగమెల్లాను
కాదనక పచ్చడము గప్పి మఱఁగుననె
పోదితో నాపెఁ దనివిబొందిఁచవయ్యా ॥కొలు॥

సరుసఁ గూచుండినట్టిసకియకు నిదివొ
సిరులుగాఁ బులకించె చెక్కులెల్లాను
తెరవేసుకొని సిగ్గుదేరిచి గుట్టుననె
గరిమతో లోలోనె కాఁగలించవయ్యా ॥కొలు॥

శ్రీసతికి భూసతికిఁ జేరి కూడఁగ నిదివొ
రాసి నిట్టూర్పులు మించె రతులలోనా
ఆసతోడుత శ్రీవేంకటాద్రిగోవిందరాజ
లేసుగా నిద్దరిని లాలించఁగదవయ్యా ॥కొలు॥ **33**

ఉపోద్ఘాతము:

గోవిందరాజస్వామిపై సరసశృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన (గోవిందరాజస్వామి) రసికుడని జగమెరిగిన సత్యమే కాని అవ్వ!! మరీ కొలువులోనే కొమ్మలతో కొలది మీరి ప్రవర్తించుట తగదయ్యా! ఆడవాళ్ళంతా నవ్విపోయేరయ్యా! గోవిందరాజా! అంటున్నారు. శృంగారకీర్తనలకు ఉపోద్ఘాతం వ్రాసినా శృంగారం

పరిమళిస్తుంది. నీకు పొదములొత్తి సేవచేస్తున్న సుందరీమణులకు చిరుచెమటతో తనువెల్లా చెమరించింది స్వామీ! నీవు వారిని ఆహ్వానిస్తూ పట్టువస్త్రము కప్పావు. బాగానే వున్నది కానీ కాస్త చాటుమాటుగా ఆమె తనివిదీర్చవయ్యా! శ్రీదేవీ, భూదేవీ వూరుకొంటారా ప్రభూ! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ గోవిందరాజస్వామీ! వీరంతా నీ కొలువులో వున్న కొమ్మలే (స్త్రీలే) వీరు నీ సేవికలు. వీరితో కొలది మీరకుమయ్యా! (పరిమితిని దాటకు ప్రభూ!)

ఇదివో (ఇదిగో(ఓ గోవిందరాజా! నీ పాదములొత్తే పడతికి ఏమైనదో చూడవయ్యా! నీపై మధురోహలు కలిగి ఆమెనీపై ఆదిగొని (కన్నువేసి) యుండుటచే నిన్ను తలచి ఆమె శరీరమెల్లా చెమర్చినది. ఇక ఆమె అభ్యర్థనను కాదనక ఆమెపై పట్టువస్త్రము గప్పి మఱఁగుననె (రహస్యప్రదేశమున) ఆమెను పోదితో (పొదివి పట్టుకొని) తనివిదీరా సుఖించవయ్యా! ఆమె కోర్కె తీర్చుము.

ఓ గోవిందరాజా! నీసరుసనె (చెంతనే) ఒక చెలికత్తె కూర్చొని వున్నది. నీవు పై ఉవిదతో చేసిన సరాగము గమనించి ఈమెకూ అధికముగ తనువు పులకించినది. ఆమె చెక్కిళ్ళు సిగ్గుతో ఎఱుపెక్కినవి. అతి త్వరగా తెఱమఱగునకు ఆమెను కొనిపోయి గుట్టుగా ఆమె సిగ్గులు మొగ్గలు పూయించవయ్యా! అతిశయించి లోలోపలనే ఆమెను కౌగలించవయ్యా!

ఇది చూచినారో యేమోకానీ నీ ఇద్దరు సతీమణులు శ్రీదేవి భూదేవి నీకు చేరువై కూడినారు. మీ రతులలో నిట్టూర్పులరాసి అధికమైనది. శ్రీవేంకటేద్రి గోవిందరాజా ఆశపడి చేరిన వారినిద్దరినీ లేసుగా (సులువుగా) లాలించవయ్యా!

పద్యవివరణ:

తే.గీ॥ **కొలువులోపలనున్నట్టి కొమ్మలెల్ల**
నవ్విపోయేరు వోరయ్య! నడతజూచి
సుందరీమణులెదట గోవిందరాజ!
కొలది మీరకు సిరి, భూమి కలతజెంద

సంఖ్య: I/278 రాగం : ముఖారి
కీర్తన : అన్నిచోట్లఁ బరమాత్మ నీవు

ముఖారి

60 అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్ని రూపుల భ్రమయింతువుగా ॥పల్లవి॥

పాలజలనిధి నుండి బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి
భూలోకనిధివై పురుషోత్తమాన నుండి
వేలసంఖ్యలరూపై విచ్చేతుగా ॥అన్ని॥

వుత్తరమధురలో నయోధ్యలోపల నుండి
సత్తైననందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను ॥అన్ని॥

కైవల్యమున నుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీవేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటివా ॥అన్ని॥

ఉపోద్ఘాతము:

పరమాత్మునికి ఒక్క రూపమేమిటి? ఒక్క చోటేమిటి? ఇందుగలడందు లేడని సందేహమెందుకు? అన్నిచోట్లా ఆయనే. నీవే యిన్ని రూపముల భ్రమయింతువుగా అంటున్నారు అన్నమయ్య పాలజలనిధిలో ఆదిశేషుడు పట్టె మంచముగా పవ్వళించి కొందరిని అలరించాడు. బదరీవనమున గయ క్షేత్రము, ప్రయాగలోన, అనేకమైన అర్చావతారములలో ఆ

పరమాత్మే వున్నాడు. మథురలో, అయోధ్యలో, నందవ్రజలములో, పంచవటిలో, సింహాచలములోనూ ఆయనే వివిధ రూపములలో వున్నాడు. నేడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై నెలకొనియున్నాడు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ పరమాత్మా! నీవే అన్నిచోట్లా ఇన్ని వివిధ రూపములలో వున్నట్లు భ్రమయించుచున్నావు. నీవు లేని చోటేదయ్యా!

పాలసముద్రమున శ్రీహరివై పవ్వళించివున్నది నీవే. బదరీవనమున లక్ష్మీనారాయణుడై వెలసినావు నీవు. గయలో శివరూపములో ప్రయాగలోనూ శివకేశవుడివే. భూలోకనిధివై పురుషోత్తమాననున్నావు. వేల సంఖ్యలలోనున్న వివిధ రూపములతో విచ్చేసితివి.

ఉత్తరమథురలో శ్రీకృష్ణస్వామిగా, అయోధ్యలో శ్రీరామచంద్రునిగా, నందవ్రజమున గోపాల కృష్ణునిగా, పంచవటిలో శ్రీరామునిగా, సింహాద్రిలో అహోబల నృసింహునిగా ఈ లోకమును పావనము చేయుచున్న పరమాత్మవు నీవే.

ఇక ఊర్ధ్వలోకాలలోనూ నీవే కదా! కైవల్యముననున్నదీ నీవే. బ్రహ్మలోకమున బ్రహ్మదేవుడవై సృష్టిని జేయుచున్నావు. శ్రీరంగము అని పేరుబడిన వైకుంఠ నగరమున నీవే శ్రీమన్నారాయణుని రూపమున లోకములను పాలించుచున్నావు. నేడు కలిపీడితులై ఆకలి పీడితులై ఆర్తులైన మాబోంట్లను కాపాడుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై నీవే నీవే వచ్చి నెలకొంటివి తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **పరమాత్మ! అన్నిచోట్లన్**
నరులను భ్రమయింతువయ్య! నానాగతులన్
తిరుమల వేంకటపతివై
స్థిరముగ నెలకొంటివయ్య! సిరితో నీవే.

సంఖ్య: XIX/161 రాగం : ఆహిరి
కీర్తన : ఎటువంటివలపులో యిద్దరకిని

ఆహిరి

61 ఎటువంటివలపులో యిద్దరికిని
చిటుకంటే మెచ్చేవు శ్రీనరసింహా ॥పల్లవి॥

గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా
పరగ నీమోము తప్పక చూడఁగా
సరుగన నీవు వచ్చి సంగడినే కూచుండి
సిరులతోఁ బొగడేవు శ్రీ నరసింహా ॥ఎటు॥

యెదురుమేడపై నెక్కి యెలుఁగెత్తి పాడిపాడి
వుదుటునఁ దామరపూవుల వేయఁగా
పొదిగి నీవంతలోనే బుజముపైఁ జేయివేసి
చెదరక చెక్కంటేవు శ్రీనరసింహా ॥ఎటు॥

పఱపుపై నీకె నీపైపరాకునఁ జెలితోడ
అఱిముఱి నిన్నుఁ జూపేకాంత మాడఁగా
మెఱయ శ్రీవేంకటాద్రిమీఁద వచ్చి కూడితివి
చెఱఁగువట్టి చొక్కుతా శ్రీ నరసింహా ॥ఎటు॥ 161

ఉపోద్ఘాతము:

నరసింహుడు ఆగ్రహానికి మారణకాండకు ప్రతీక. అన్నమయ్య అటువంటి రౌద్రమూర్తిని శృంగార నాయకునిగా భావనచేసి అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. ఇది అటువంటిదే. తేలికగా అర్థంకాని కీర్తన అనిచెప్పవచ్చును. మీ ఇద్దరికీ ఎటువంటి వలపు కలిగిందయ్యా! ఆమెను చిటుక్కుమని చిటికవేసినంతలోనే మెచ్చేవు. ఓ శ్రీ నరసింహా!

నీవు 'లకిమమ్మ' (లక్ష్మీదేవి) వీణ వాయిస్తుంటే చూచి రయమునవచ్చి ఆమె సరసన కూర్చొని వైభవంగా ఆమెను పొగడటం మొదలుపెట్టావు. నేడు వేంకటాద్రిపై వారినీ కరుణించుచున్నావు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీనరసింహా! మీ ఇద్దరివి ఎటువంటి వలపులు స్వామీ! ఆమెను చిటుక్కుమని చిటికెవేసినంతలోనే మెచ్చేవు (ప్రశంసించావు). ఆమెకు చేరువైనావు.

గిరులెక్కి (ఈ అహోబలంకొండపైన) లకిమమ్మ (లక్ష్మీదేవి) కిన్నెర (వీణను) వాయిస్తూ పరగ (అతిశయించి) నీ వదనము పరికించగా, నీవు సరుగనవచ్చి (త్వరగా విచ్చేసి) ఆమె సంగడినే (ప్రక్కనే) కూర్చొని యుండి, వైభవముగా ఆమెను పొగడేవు (ప్రశంసించెదవు). ఓ శ్రీనరసింహా! ఆమె యనిన నీకెంతటి వలపు స్వామీ! క్షణంలో పరవశింపచేసింది.

ఓ శ్రీనరసింహా! యెదురుమేడపై (ఎదుటనున్న) మేడపై (భవనముపై) నెక్కి చాలాసేపు గీతికల నాలపించి, ఇలాకాదని ఒక్కసారిగా నీపై తామర పుష్పములను ఆమె చల్లినది. పరవశించిన నీవు ఆమెకు చేరువయై అంతలోనే ఆమె భుజముపై ప్రేమగా చేయివేసేవు. నీకు ప్రేమ అధికమై ఆమె చెక్కిళ్ళను నిమిరినావు.

ఈకె (ఈమె) పఱపుపై (శయ్యపై) నీపై పారవశ్యమున తన చెలికత్తెకు నిన్ను త్వరగా చూపించినది. నీపై అనురాగాన్ని చూపి మాడగా (మాట్లాడగా) నీవూ వశమైనావు. ఆమెను తీసికొని శ్రీవేంకటాద్రి చేరి ఆమెను చేరికయొ కూడితివి. శ్రీనరసింహుడవై అతిశయించితివి.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఎట్టి వలపులోయి ఇద్దరికిని జూడ**
చిటుకుమంటె మెచ్చు జేతువయ్య!
చెఱగువట్టి సతిని శ్రీనారసింహుడ!
కూడినావు సరసగాడవయ్య!

సంఖ్య: I/294 రాగం : ముఖారి
కీర్తన : అరిదిసేతలే చేసి తల్లాడ నిల్లాడ

ముఖారి

62 అరిదిసేఁతలే చేసి తల్లాడ నిల్లాడ
సరిలేక వుండితివి జలరాశికాడ ॥పల్లవి॥

పొలియఁ బీర్చితి వొకతిఁ బురిఁటిమంచముకాడ
నలచితి వొకని గగనంబుకాడ
బలిమిఁ దన్నితి వొకని బండిపోతులకాడఁ
దులిమితివి యేడుగురఁ దోలి మందకాడ ॥అరి॥

తడవి మోదితి వొకని తాటిమాఁకులకాడ-
నడిచితివి వొకనిఁ బేయలకాదను
పిడిచివేసితి వొకని బృందావనముకాడ
వొడిసితివి వొకని నావులమందకాడ ॥అరి॥

పటపటన దిక్కులు పగుల పగతులఁ దునిమి
నటియించితివి మామనగరికాడ
కుటిలబహుదైత్యాంతకుఁడవు వేంకటరాయ
పుటుమెగసితి జగంబుల యింటికాడ ॥అరి॥

ఉపోద్ఘాతము:

అరిది సేతలు అంటే వింతైన లీలలు అని అర్థం. అల్ల+ఆడన్ అల్లాడన్ అంటే అదిగో అక్కడ అని అర్థం. ఇల్ల+ఆడ ఇల్లాడ. అంటే ఇదిగో ఇక్కడ అంటే ద్వాపరయుగంలో అక్కడ రేపల్లెలోనూ నేటి కలియుగంలో ఇక్కడ తిరుమలలోనూ నీకు సాటి లేక జలరాశియైన సాగరముపై శయనించినట్లు నారాయణునివలె అన్ని యుగాలలోనూ వున్నావు అని అంటున్నారు అన్నమయ్య. కృష్ణలీలల క్రమంలో ఏయే రాక్షసుల్ని కృష్ణయ్య

తుదముట్టించింది చెబుతున్నారు. బహుదైత్యాంతకుడైన ఆ కృష్ణయ్యే నేటి శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! అల్ల, ఆడ (అదిగో అక్కడ) రేపల్లెలోనూ ఇల్ల,ఆడ (ఇదిగో ఇక్కడ తిరుమలలోనూ) అరిది సేతలే చేసితి (అరుదైన లీలలనే జేసినావు). జలరాశికాడ (సాగరమున) సరిలేక (సాటిలేక) వుంటివి.

పురిటిమంచము మీదనే నీకు పాలుకుడుప ఒకతె వచ్చింది. అది పూతన అనే రాక్షసి. పొలియ (అది మరణించునట్లు) దాని చనుబాలతోపాటు దాని రక్తాన్నంతా పీల్చివేసినావు. ఒకనిని ఆకాశమున అలచితివి (మట్టుబెట్టావు). వాడే తృణావర్తుడనే రాక్షసుడు. ఒకని బలంగా తన్ని శకటపు చక్రంవద్ద ప్రయ్యలు చేసినావు. వాడే శకటాసురుడు. ఆవుదూడల మందవద్దకు తోలి ఏడుగురు రాక్షసులను తుదముట్టించితివి.

ఒక రాక్షసుని తాటిచెట్లవద్ద తడవి మోదితివి (చేతులతో యెత్తి కొట్టి చంపితివి.) ఒకని ఆవుదూడలవద్ద సంహరించితివి. వాడే వత్సాసురుడు. ఒకని బృందావనము దగ్గర పిడిచివేసితివి (తొక్కిహూనం చేసినావు). వాడే కాళీయుడనే సర్పరాజు. ఆవులమందలో ఒకనిని ఒడిసితివి. ఆవుల మందలోనున్న ఒక రాక్షసుని ఒడిసి పట్టుకొని నేలకు కొట్టి చంపితివి. వాడే ధేనుకాసురుడు.

మామనగరమైన మథురలో పటపటమని దిక్కులు పగులునట్లుగా పగవారైన మల్లులను సంహరించి నర్తించావు. కుటిలురైన దైత్యులను తుదముట్టించి, తుదకు కంసుని పీచమడచితివి. నేటి కలియుగంలో వేంకటపతివై జగములన్నింటికీ ఇల్లు అయిన తిరుమలలో, పుటమెగసితివి (వన్నెయెక్కితివి) ప్రభూ!

పద్యవివరణ:

తే.గీ॥ **అరిది సేతలే చేతువు ఆడనీడ,**
సరియనేది లేకుంటివి జలధిపైన
కలియుగంబున నీవె వేంకటవిభుడవు
పుటమెగసితివి తిరుమల పుణ్యగిరుల

సంఖ్య: XIX/165 రాగం : దేవగాంధారి
కీర్తన : రాజపు నీకెదురేది రామచంద్ర

దేవగాంధారి

63 రాజపు నీకెదురేది రామచంద్ర
రాజీవనయనుఁడ రామచంద్ర ॥పల్లవి॥

వెట్టిగాదు నీవలపు వింటి నారికిఁ దెచ్చితివి
అట్టుసేయఁ బనిలేదు యిట్టె రామచంద్ర
గుట్టుతోడ జలనిధిపై గొండలు ముడివేసితి–
వెట్టు మఱువఁగవచ్చు నివి రామచంద్ర ॥రాజ॥

బతిమితోడుతఁ బైఁడిపతిమెఁ గైకొంటివి
రతికెక్కె నీచలము రామచంద్ర
మితిమీరి జవ్వనము మీఁదుకట్టితివి నాకై
యితరు లేమనఁగల రిఁక రామచంద్ర ॥రాజ॥

నావంటిసీతను నాఁగేటికొనఁ దెచ్చితి
రావాడితమకముతో రామచంద్ర
యీవేళ శ్రీవేంకటాద్రి నిరవై నన్నుఁ గూడితి
చేవదేర గండికోట శ్రీరామచంద్ర ॥రాజ॥ **165**

ఉపోద్ఘాతము:

గండికోటలో వెలసిన శ్రీరామచంద్రునిపై గొప్పకీర్తన చెబుతున్నారు, అన్నమయ్య. నీవు రాజసము మూర్తీభవించిన రాజీవలోచనుడవు. ఓ రామచంద్రా! నిన్నెదుర్కొనే మొనగాడెవరయ్యా! అంటున్నారు. నీవు ఏకపత్నీ వ్రతుడవు. సీతాదేవిపై నీవలపు వెట్టగాదు. దానిని వింటినారికి దెచ్చినావు. దానిని నాబోంట్లు నేడు రట్టు సేయవలసిన పనిలేదు అది జగద్విదితమే కపులతో కూడా చెలిమి చేసి మానవ జాతికి ధర్మవర్తన నేర్పావు. ఈ భావాలు

కీర్తన వినంగానే అర్థంకాదు. సీతాదేవి ఈ కీర్తన వినిపిస్తున్నది, అని మనం భావించాలి. నీవు ఏకపత్నివ్రతుడవు. సీతాదేవిపై నీ వలపు వెట్టగాదు. దానిని వింటినారికి దెచ్చినావు. దానిని నాబోంట్లు నేడు రట్టు సేయవలసిన పనిలేదు అది జగద్విదితమే. కపులతో కూడా చెలిమి చేసి మానవ జాతికి ధర్మవర్తన నేర్పావు. సీతాదేవి ఈ కీర్తన వినిపిస్తున్నదని మనం భావించాలి.

తాత్పర్య వివరణ:

ఓ రామచంద్రా! రాజపు నీకు (రాజసము మూర్తీభవించిన నీకు) యెదురేదయ్యా? నీవు రాజీవలోచనుడవు (కమలాక్షుడవు) రామచంద్రా!

వెట్టి (ట్ట) గాదు నీవలపు (నీ ప్రేమ వేసవి యెండవంటి తాపం కలిగించేది కాదు). కానీ లంకావాసమున నావలపును వింటినారికి దెచ్చి యుద్ధంతో పూర్తిచేశావు. ఇంత రట్టు (రగడ) చేయవలసిన పనిలేదయ్యా! రావణ సైన్యానికి అంతు చిక్కకుండా రహస్యంగా సాగరముపై వారధి నిర్మించావు. దానికోసం కొండలను తెప్పించి ముడివేసినావు. ఇవి (ఈ ఘనకార్యములను) యెట్లు మఱువగలమయ్యా శ్రీరామచంద్రా!

నీవు ఏకపత్నీవ్రతుడవైనందువలన పైడిపతిమ (సీతాదేవి బంగారు విగ్రహాన్ని) అశ్వమేధయాగములో నీ పత్నివలె మహారాణిని చేశావు. నీ చలము (మాత్సర్యభావన) అసామాన్యము. నాకోసం (సీతకోసం) నీ యవ్వనమంతా మీదుకట్టితివి (అడవిగాచిన వెన్నెల చేశావు). ఇక నిన్ను ఇతరులు యేమనగలరయా, రామచంద్రా!

రామచంద్రా! నాపేరేసీత (నాగేటిచాలులో దొరికినది). నన్ను నాగేటికొన దెచ్చితివి. రావాడి (కఠినాత్ముడవై) నాగలితో పొడిచినట్లు నా తమకముతోనే నేను నిష్క్రమించాను. చేవమీరి గండికోటలో రామచంద్రుడవై నిలిచావు. కానీ నీప్రేమ నిరుపమానము. కలియుగంలో కూడా శ్రీవేంకటేశ్వరుడవై నన్ను కూడితివి.

పద్యవివరణ:

ఆ.వె॥ **రాజసమ్ములొలక రాజీవలోచనా!**
ఏమి నీకు యెదురు రామచంద్ర!
చెలగె గండికోట శ్రీరామచంద్రుడే
తిరుమలందు చేరి యిరవునొందె

సంఖ్య: I/293 రాగం : ముఖారి
కీర్తన : సేవింతురా యితని జెలగిపరు; లిట్లనే

ముఖారి

64 సేవింతురా యితనిఁ జెలఁగి పరు;లిట్లనే
కావించె మమ్ము నెక్కడిదైవ మితఁడు ॥పల్లవి॥

పాలచవి యితఁడెఱుఁగు పాలఁ బవళించ గో-
పాలుఁడని నే మితని భజియించఁగా
పాలుపడి తల్లిచనుఁబాలుసహితంబు నే-
కాలమునుఁ బాపె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥

పుట్టింపఁ దానె మతి పురుషోత్తముఁడు మంచి-
పుట్టు వొసగీననుచుఁ బూజించఁగా
పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువులెల్లఁ
గట్టిపెట్టించె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥

కర్మకర్తారుఁడని కడలేనిపుణ్యముల-
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా
కర్మగతిఁ దెచ్చి వేంకటవిభుఁడు మావుభయ-
కర్మములఁ జెరిచె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥

ఉపోద్ఘాతము:

మేము ఈ వేంకటనాథుని మా సర్వస్వము అని నమ్మి సేవించాము. మమ్మల్ని ఈయన కృతార్థులను చేశాడు. అన్యులు ఆయననిటులనే సేవించగలరా అని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. కన్నబిడ్డకు చనుబాలు ఇవ్వటం మానేసి అన్నం తినిపించగానే తల్లికి చనుబాలు మాయమైపోతాయి. ఈ విధానము నిర్దేశించిన దైవమీ వేంకటేశ్వరుడే.

తన శరణాగతులకు పుట్టుకలు లేకుండా చేస్తాడు. ఆయన ఆశ్రితుల కర్మములు జెరిచెనంటున్నారు.

తాత్పర్య వివరణ:

మేము ఈ దేవుని ప్రాణసమానముగా సేవించితిమి. ఈయన మమ్ము కావించె ఇట్లనే (ఈవిధముగా ధన్యులను చేసినాడు). పరులు (అన్యులితనిని) చెలగి (అతిశయించి) ఇట్లా సేవించగలరా?

పాలబవ్వళించ (పాలసముద్రమున పవ్వళించుట చేత) ఇతనికి పాలరుచి యేమిటో బాగుగా తెలియును. అందుకనే ఇతనిని మేము గోపాలుడని ఆరాధించితిమి. పాలుపడి (పూనుకొని) తల్లియైన స్త్రీకి చనుబాలు సహితంబు (పూర్తిగా) ఏ కాలమును పాపె (ఏ సమయంలో ఎండిపోవాలో ఆ సమయంలో) యెండిపోయేట్లు చేస్తాడు. ఈతడు యెక్కడి దైవము (ఎటువంటి దైవమో చూశారా?)

పురుషోత్తముడని కీర్తింపబడుతున్న ఈ దేవదేవుడు, పుట్టింపదానె (పుట్టించే వాడు ఆయనే). మంచి పుట్టుకనిచ్చావు స్వామీ! అని కృతజ్ఞతతో పూజిస్తే ఆయన మాకెంత ఉపకారము చేశాడో తెలుసా? బలిమితో మా చేత పుట్టుకలను కట్టిపెట్టిండె (నీకు పునర్జన్మవుండదురా) అని ఆశీర్వదించాడు. ఇతడు యెక్కడి దైవమయ్య?

కర్మకర్తారుడని (జీవుల కర్మఫలప్రదాతయని) అంతులేని పుణ్యము కలగునట్లు ఇతనికి నా కర్మఫలము కైకొలుపగా (ధారాదత్తము సేయగా) ఈ శ్రీవేంకటేశ్వరుడు మా కర్మగతి తెచ్చి (కడతేర్చి) మా ఉభయకర్మలు (ఆగామి, సంచిత కర్మలు) తొలగించాడు. ఎట్టి దైవమో కదా!

పద్యవివరణ:

కం॥ **ఈ విధిపరులెవ్వరునూ**
సేవింతురె చెలగియిటుల శ్రీపతిహరినిన్
కావించెమమ్మునెక్కుడు
దైవంబననితడె జుమ్మి తరతరములకున్.

సంఖ్య: XIX/258 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డడు

శంకరాభరణం

65 ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డఁడు
గామిడితనాలఁ గదిసీ వీఁడే ॥పల్లవి॥

గొల్లలుఁ దానును గోపికలిండ్ల
కొల్లగా నుట్లు గొట్టీ వీఁడే
పల్లదాన వారిపాలిండ్లమీఁదట
చిల్లరసేఁతలు చేసీ వీఁడే ॥ఏమ॥

పాలువెన్నలును బానలతోడుత
కేలు చాఁచి యారగించీ వీఁడే
మేలిమిసతుల మేనబావనంటా
కోలుముందుగాఁ గూడీ వీఁడే ॥ఏమ॥

అట్టులుఁ జక్కిలా లడుకులు వేలఁ-
గట్టినఁ గోలలఁ గొట్టీ వీఁడే
దిట్టయి శ్రీవేంకటాద్రి నలమేల్మంగఁ-
గట్టుక దేవుఁడై కడఁగీ వీఁడే ॥ఏమ॥ **258**

ఉపోద్ఘాతము:

శ్రీకృష్ణరసామృతాన్ని మనబోంట్ల జేతకడుపునిండా త్రాగిస్తున్నారు అన్నమయ్య. గామిడితనమంటే దుష్టత్వము. వీడు దుష్టుడమ్మా! ఓ యశోదమ్మా! నీ బిడ్డడి ధూర్తత్వముతో తగులుకొన్నాడంటే ఇక వదలడమ్మా! అంటున్నారు. ఇక ఆపై పితూరీవలెనే శ్రీకృష్ణలీలలు వర్ణిస్తున్నారు. నేడు కలియుగంలో అలమేల్మంగను కట్టుకొని

శ్రీవేంకటేశ్వరుడై తగులుకొన్నాడు అంటున్నారు. ఎవర్ని తగులుకొన్నాడు? ఇంకెవర్ని, మనబోటి భక్తకోటిని.

తాత్పర్య వివరణ:

ఓ యశోదమ్మా! ఇదేమిటమ్మా! నీ బిడ్డడగు వీడేగామిడితనాల (ధూర్తత్వంతో) కదిసీ తగులుకొన్నాడు.

వీడు తానూ, మిగిలిన గొల్లపిల్లవాండ్రతో కలిసి, గోపికల ఇండ్లలోగల ఉట్లను కొల్లగా గొట్టీరమ్మా! (దోచుకున్నాడమ్మా!) ఇక నీకొడుకు, వీడువున్నాడే పల్లదాన (దౌష్ట్యముతో) గోపికల స్తనగిరులపై చిల్లర పనులు చేస్తాడమ్మా! ఇంత దుష్టప్రవర్తన గలవానిని మేమింత వరకు చూడలేదంటే నమ్ము మా మాట.

పెద్ద పెద్ద బానల్లో మేము పాలు వెన్నలను దాచుకొంటే చిన్న చిన్న చేతులు చాచి ఎలాగో అందుకొని ఆరగించీ (తింటాడమ్మా!) బంగారంవంటి గోప స్త్రీలను చూపి, వారి మేనబావనంటూ కోలుముందుగా (ముమ్ముందుగానే) వీడుకూడీనమ్మా! (సంగమిస్తాడమ్మా!) ఇంత తెంపరి వాడిని మేమెక్కడా చూడలేదమ్మా!

మా ఇంటివారు తినుట కొఱకు మేము అటుకులు, చక్కిలములు, అట్టులు (అట్లు) వ్రేలాడగట్టి దాచుకొంటే కోలలతో (కఱ్ఱలతో) వాటిని కొట్టి క్రింద పడ్డాక, తినేస్తాడమ్మా! శ్రీవేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడై వీడే అలమేల్మంగను కట్టుకొని (పెండ్లాడి) దేవుడై (అందరూ కొలిచే భగవంతుడై) వీడే కడగీ (వర్ధిల్లుతున్నాడు).

పద్యవివరణ:

కం॥ **ఏమమ్మ! యశోదమ్మా!**
గామిడితనములను మించె గదిసీవీడే
నీమాయదారి బిడ్డడు
లేమా! వేంకట విభుండులే, తెలియంగన్.

సంఖ్య: I/282 రాగం : కన్నడగౌళ
కీర్తన : ఇంతసేసె బో దైవమింతలోననే అయ్యో

కన్నడగౌళ

66 ఇంతసేసెఁ బో దైవ మింతలోననే అయ్యో
సంతపాక లంజఁదెచ్చి సన్యాసిఁ జేసె ॥పల్లవి॥

పరిగెలేరేటివానిఁ బట్టపురాజుఁగా
నిరతభోగము లిచ్చి నిలిపినట్లు
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు
అరయ నిత్తడిఁ దెచ్చి యపరంజిఁ జేసె ॥ఇంత॥

కుక్కలవండుకతినే కులహీనునిఁ దెచ్చి
వెక్కసపుఁబాఁపనిఁ గావించినయట్లు
దిక్కులెఱుఁగఁగఁ గష్టదేహిని నన్నుఁ దెచ్చి
గక్కనఁ దెలుకపిండి కస్తూరి సేసె ॥ఇంత॥

చెడుగైనదోమఁ దెచ్చి సింహపుఁగొదమఁగా
బెడిదంపుఁ బ్రేమతోడఁ బెంచినయట్లు
కడునధముని వేంకటపతి నను నిటు
చిడిపిరాయి దెచ్చి చింతామణి సేసె ॥ఇంత॥

ఉపోద్ఘాతము:

"సంతపాకలంజ" అంటే బజారులో వెలకు దొరికే పడుపుకత్తె. నేను అటువంటి నీచపు బ్రతుకుగడుపుతుంటే ఓ దైవమా! అయ్యో అని అనుకొని నన్ను సన్యాసినిని జేసి ఇంతటి జన్మసాఫల్యమునిచ్చావు. నీకు మరి నేనేమి ప్రత్యేపకారం చేయగలను? పరిగెలేరు కొనేవాడిని దెచ్చి పట్టపురాజుని చేశావు. ఇత్తడి వంటి పాతకుని నన్ను దెచ్చి బంగారం

చేశావు. కుక్కల్ని వండుకొని తినే కులహీనునిదెచ్చి సద్బ్రాహ్మణుని చేసినట్లు దిక్కుతెలియకుండా కష్టపడుతున్న ఈ దేహిని నన్నుతెచ్చి తెలకపిండిని కస్తూరిగా మార్చినావు. ఈ కీర్తనలోని ఉపమానములన్నీ అత్యద్భుతం. చదవండి మరి...

తాత్పర్య వివరణ:

ఇంతలోననే (ఇట్లు చూస్తుండంగానే) దైవము ఇంతసేసెబో (ఇంతటి పని చేసినాడుపో) అయ్యో! సంతపాకలంజను (పచ్చి వెలయాలిని) దెచ్చి సన్యాసిని జేసె సాధువు వంటి సన్యాసిని గావించినాడు.

పరిగెలేరేటివాణ్ణి (చెత్తాచెదారము ఏరుకొనే హీనుణ్ణి తీసుకొనివచ్చి పట్టాభిషిక్తుడైన రాజుని చేసినట్లు, శ్రేష్టములైన భోగభాగ్యములను ఇచ్చి నిలబెట్టినట్లు ఈ లోకంలో అతిపాతకుడనైన (మిక్కిలి పాపాత్ముడనైన నన్ను తీసికొనివచ్చి ఉన్నతుని జేసినావు. చూడబోతే ఇది ఇత్తడిని బంగారము చేసినట్లున్నది.

కుక్కలవంటి నీచజంతుమాంసము తినే కులహీనుణ్ణి తీసికొనివచ్చి అధికుడని పిలువబడే సద్బ్రాహ్మణుని చేశావు. దిక్కుతెలియక తిరిగే కష్టజీవియైన ఈ శరీరిని నన్ను తీసికొనివచ్చి కంపుకొట్టే తెలకపిండిని పరిమళభరిత కస్తూరిగా మార్చినావు.

అల్పమైన దోమను తీసికొనివచ్చి కొదమసింహము (సింహ కిశోరమును) చేసి ఎంతో బెడిదంబు ప్రేమ (అధికమైన అనురాగముతో) పెంచినట్లు, ఓ శ్రీవేంకటేశ్వరా! మిక్కిలి అధముడనైన నన్ను ఇట్లు చేసినావు. చిల్లరరాతి ముక్కను నన్ను దెచ్చి ఇంద్రుని కిష్టమైన చింతామణని చేశావు కదా! ప్రభూ!

పద్యవివరణ:

ఆ.వె॥ **సంతపాకలంజ సన్యాసిగావించి**
ఇంతసేసె దైవమింతలోనె
అయ్యో! వేంకటేశ! అధమునిననుదెచ్చి
అధికుజేసినావు అంతలోనె.

సంఖ్య: XVII/220 రాగం : భైరవి
కీర్తన : పతిమీదటిమోహము సతి కిట్టుండ వద్దా

భైరవి

67 పతిమీఁదటిమోహము సతి కిట్టుండ వద్దా
సతతము నీ హితవే సారెఁ గోరీఁ దాను ॥పల్లవి॥

బలిమిఁ బయ్యదకొంగు పట్టి నీవు దీసితేను
నెలఁతకొప్పువిరులు నీపై రాలెను
అల మరుఁ డందులకు నమ్ములు గురిసె నంటా
కలికి భ్రమసి నిన్నుఁ గౌఁగలించుకొనెను ॥పతి॥

వొట్టి నీ వాపెతోను వొరసి పెనఁగితేను
తొట్టి నా మైకప్పురపుధూళి నిన్నంటె
నెట్టనఁ జందురుఁడు వెన్నెలచొక్కు చల్లె నంటా
గట్టిగాఁ దెలియలేక కౌఁగలించుకొనెను ॥పతి॥

యిమ్మల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే
నెమ్మిఁ జెమటబొట్టులు నీమై నిండెను
చిమ్మియందు నించిన సేసలు పైకొనె నంటా
కమ్మర నచ్చెరు వంది కౌఁగలించుకొనెను ॥పతి॥ **220**

ఉపోద్ఘాతము:

శృంగారకీర్తనలు చెప్పటంలో తండ్రికి తగ్గ తనయుడనిపించుకొన్నారు అన్నమయ్య సుపుత్రుడు, పెదతిరుమలాచార్యులవారు. పతిమీద సతికి మోహము ఇట్లుండవద్దా అని అడుగుతున్నారు. ఎట్లావుండాలిట? ఎల్లప్పుడూ నీ హితవునే కోరుతూ తాను వుండవలెను సుమా! అంటున్నారు. నా ఉద్దేశ్యంలో చతురతలో కూడా ఈయన తక్కువ తినలేదు. శ్రీవేంకటేశుడు, దేవిని కూడితే ఆమె చెమటబిందువులు స్వామిపై రాలినవట. మొదట

ఆవిడ అవి తనపై చల్లిన అక్షతలు అనుకొన్నదట. ఆ తరువాత అసలు సంగతితెలిసి ఆశ్చర్యమూ ఆనందమూ అతిశయించగా ఆయనను సందిట బంధించినదట. ఔరా!

తాత్పర్య వివరణ:

సతికి తనపతిమీద మోహము ఇట్లుండవద్దా? సారె (ప్రతిపర్యాయము) సతతము (త్రికాలములలో సర్వావస్థలలోనూ) తాను ఆతని హితము (మంచి) కోరీ (వాంఛించునదై వుండవద్దా?) ప్రభూ!

బలిమి (బలవంతంగా) నీవు ఆమె పయ్యెదకొంగు బట్టి లాగితే, ఆ కదలికలకు నెలత కొప్పులోని పూవులు నీపై రాలినవి. అది చూచి ఇదే తగిన సమయమని యెంచి మరుడు (మన్మథుడు) అమ్ములగురిసెనంటా (తన పుష్పబాణాలు వేసినట్టై) సంభ్రమముతో నిన్ను గాఢాలింగనము గావించినది.

ఆమె సరసన బవ్వళించి నీవు ఆమెతో పట్టి పెనవేస్తే ఆమె తన మేనిపై (శరీరముపై) అలదుకొన్న మెత్తని కర్పూరధూళి, నిన్నంటె (నీకు అంటుకొన్నది). అది చూచి ఆమె నెట్టన (నడినెత్తినవున్న) చంద్రుడు తన వెన్నెలచొక్కు (మత్తును కలిగించే తన వెన్నెల) నీపై జల్లులుగా కురిపిస్తున్నాడా అనుకొని గట్టిగా దెలియలేక (నమ్మకంగా తెలియరాక) చల్లగా వుంది చాలని నిన్ను బిగియార కౌగలించినది, ప్రభూ!

ఇమ్మ (మ్ము)ల ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె నీవు జతచేరితే, ఆమె స్వేదబిందువులు నీపై రాలినవి ప్రభూ! నీమేనువాటితో నిండిపోతే, వసంతములాడెడి నీళ్ళు చిమ్ముగొట్టముతో, సేసలు (తలంబ్రాలు) నీపై కురిసినవా అని సంభ్రమంతో గాఢముగా కౌగలించినది. ప్రభూ! నీవు ఆమె పరిష్వంగానందమునట్లు బొందితివి. చమత్కారివయ్యా!

పద్యవివరణ:

కం॥ **పతిమీదటి మోహంబులు**
సతికిని యిటులుండవలదె సంతతంబగుచున్
చతురుడు పెదతిరుమలయనె
హితవేతను కోరవలెను ఇకనాతనికిన్.

సంఖ్య: I/288 రాగం : భూపాళం
కీర్తన : ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా

భూపాళం

68 ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా
శ్రీకాంతు భజియించు సేవకులకు ॥పల్లవి॥

పాతాళ మడ్డమా బలిమథనుదాసులకు
భూతలం బడ్డమా పుణ్యులకును
సేతుకైలాసములు చిరభూము లిన్నియును
పైత్రోవలట పరమభాగవతులకును ॥ఆకాశ॥

అమరావతడ్డమా హరిదాసులకు మహా-
తిమిరంబు లడ్డమా దివ్యులకును
కమలాసనునిలోకం బదియు నడ్డమా
విమలాత్ములై వెలుఁగువిష్ణుదాసులకు ॥ఆకాశ॥

పరమపద మడ్డమా బ్రహ్మాండధరుఁడైన-
ధర వేంకటేశ్వరునిదాసులకును
యిరవైనలోకముల నిన్నిటా భోగించి
వరుసలను విహరించువరవైష్ణవులకు ॥ఆకాశ॥

ఉపోద్ఘాతము:

శ్రీవైష్ణవుడై రామానుజులవారి శిష్యుడైన అన్నమాచార్యులవారు విశిష్టాద్వైతమత వ్యాప్తికి యెనలేని కృషి చేసి వైష్ణవుల ప్రాశస్త్యంపై అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. వాటిలో ఇదీ ఒకమచ్చుతునక. వైష్ణవులకు సృష్టిలోగల ఏ లోకమైనా అడ్డము కాదు అంటున్నారు. శ్రీకాంతుని భజించే హరి సేవకులకు ఏదీ అడ్డము కాదు అంటున్నారు.

శ్రీవేంకటేశుడే అవనికి దిగివచ్చిన శ్రీహరి. ఆయన భృత్యులైన వైష్ణవులకు పైన, క్రిందనున్న ఏలోకమైనా భోగించి విహరించుటకు స్థానములే అంటున్నారు.

తాత్పర్య వివరణ:

శ్రీకాంతుడైన నారాయణుని భజించే సేవకులకు (దాసులకు) ఏది అడ్డమౌతుంది చెప్పండి? ఆకాశం అడ్డమవుతుందా, లేక దానికి అవ్వల (అవతలివైపున) ఏమన్నావుంటే అది అడ్డమా?

పోనీ పాతాళము కానీ అవతల వితల, సుతల, రసాతలం వంటి అధోలోకాలు బలిచక్రవర్తిని మథించిన శ్రీహరి దాసులకు అడ్డమవుతాయా? ఆ పుణ్యాత్ములకు భూతలములో ఏదన్నా అడ్డమవుతుందా? కైలాసము అడ్డగలదా? ఊర్ధ్వలోకాలలో ఏదన్నా అడ్డమవుతుందా? పరమభాగవతులైన మహాత్ములకు ఏలోకమూ ఏ ప్రాంతమూ ఇన్నిటిలో ఏదీ అడ్డము కాదు.

అమరావతీనగరము ఇంద్రుని దేవేంద్రలోకానికి రాజధాని అయినా అదీ అడ్డము కాలేదు. హరిదాసులైన వారికి ఆ లోకాలకావలనున్న 'పెనుజీకటి' కూడా అడ్డము కాదు. ఎందుచేతనంటే వారు దివ్యులు. ఆ తరవాత బ్రహ్మదేవుని సత్యలోకమున్నది. అదికూడా పవిత్రాత్ములై వర్ధిల్లే విష్ణుదాసులకు అడ్డము కానేరదు.

ఆవల పరమపదము అని ప్రసిద్ధినొందిన వైకుంఠము వున్నది. బ్రహ్మాండమును ధరించియున్న భగవంతుడు శ్రీవేంకటేశ్వరుడై కలియుగంలో తిరుమల శిఖరాలపై యున్నాడు. ఆయన దాసులైన వారికి, ఇరవైన (నెలకొనియున్న) లోకములన్నియు భోగించుటకు విహారస్థలములై వరప్రసాదులైన వైష్ణవుల స్వాధీనములో వుంటాయి.

పద్యవివరణ:

ఉ ॥ ఆకసమడ్డమా, ఆవల ఐనను అడ్డమ, క్రిందనున్న ఆ
లోకములడ్డమా బలికి లోకమునిచ్చినవాని బంట్లకున్
నాకము అడ్డమౌనె హరినామము వీడని భృత్యకోటికిన్
ఆకడ వైష్ణవుండయిన అడ్డముకాదుర సృష్టినెద్దియున్.

సంఖ్య: I/291 రాగం : లలిత
కీర్తన : దైవమా పరదైవమా

లలిత

69 దైవమా పరదైవమా
యేవగింతలు నాకు నెట్టు దెచ్చేవో ॥పల్లవి॥

పాపకర్మునిఁ దెచ్చి పరమియ్యఁదలఁచిన
మేపులకే పోక మెయికొనీనా
తీపులు రూపులుఁ దివిరి నావెనువెంట-
నేపొద్దు నీ వేఁడఁ దెచ్చేవో ॥దైవమా॥

అధమాధమునిఁ దెచ్చి యధికుని జేసేనంటే
విధినిషేధములు వివరించునా
నిధినిధానములు నిచ్చనిచ్చలుఁ బెక్కు-
విధముల నెటువలె వెదచల్లెదవో ॥దైవమా॥

అతికష్టుఁడగునాకు నలవిగానియీ-
మత మొసఁగిన నేను మరిగేనా
ప్రతిలేనివేంకటపతి నీదునామా-
మృత మిచ్చి ననుఁ నీవే మెరయింతుగాక ॥దైవమా॥

ఉపోద్ఘాతము:

పరదైవము అంటే పరమునొసగే దేవుడు లేక మోక్షప్రదాత అని అర్థము. దైవమా! నాకెందుకయ్యా! ఈ చీదరింపులు? తీసుకు వస్తున్నావు? అని నేరుగా వేంకటపతినే ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. పాపకర్ముడను, అధమాధముడను, అతి కష్టుడను అయిన నన్ను

తీసికొనివచ్చి విశిష్టాద్వైతమనే మహత్తరమైన మతమునిచ్చి రక్షించావు నీవు. అది ఏవగింతలు తెచ్చినా సరే.

తాత్పర్య వివరణ:

దైవమా! పరదైవమా! (మోక్షప్రదాతవైన వోదైవమా) నాకు ఏవగింతలు (ఛీత్కరింపుల) నన్నింటిని యెట్టు దెచ్చేవో (ఎందుకు తెస్తున్నావయ్యా!)

పాపకర్మలు చేయుటయందే ప్రీతికలిగిన తెచ్చి, పరమీదలంచిన (మోక్షమిచ్చెదమని అనుకొనినా) వాడు మేపులకె పోక (తిండిమీద వున్న యావ వదలిపెట్టి) మెయికొనేనా (శరీరత్యాగం చేయగలడా?) దీనికి తోడు నీవే తీయటి సుఖాలూ, చక్కటి రమణులను కావాలని అంటగట్టితే ఏ పొద్దునైనా నీవెందుకు గుర్తువస్తావు?

నాబోటి అధమాధముని (పనికిరానివాళ్ళ అందరిలోనూ పనికిరానివాడిని) తెచ్చి ఉత్తముడిని చేద్దామనుకొంటే విధినిషేధము మీరగలడా? దీనికితోడు నీవే వాడికి నిధులు నిధానము (ఐశ్వర్యములు నిక్షేపములు) అంటగట్టితే? పెక్కు విధములైన భోగాలు వెదజల్లితే, ఇంకా వాటివెంట పోకుండా యెట్లా వుంటాడు? మరి ఇప్పుడు నన్ను ఏవగించుకొంటే ఏమి లాభం?

అతి కష్టుడయిన (కష్టభూయిష్టమైన జీవితం గడుపుతున్న) నాకు అలవిగాని (దుస్సాధ్యమైన) ఈ మతము (విశిష్టాద్వైతమతమును) ఇచ్చినంతమాత్రాన నేను దానిపై ఆసక్తిగలవాడినవుతానా? సాటిలేని శ్రీవేంకటేశ్వరా! నీ నామసంకీర్తన నాకు అందుకే ఇచ్చావు. దానిని ఇక వదలను. ఆ నామామృతం జుఱ్ఱుతూనే వుంటాను.

పద్యవివరణ:

తే.గీ॥ **దైవమా! పరదైవమా! తెచ్చెదేల?**
ఏవగింతలు నాకిన్ని యెట్టులయ్య!
వేంకటేశ్వరా! ప్రతిలేని వేలుపీవు
నీదు నామామృతంబిచ్చి నిలిపినావు.

సంఖ్య: XVII/444 రాగం : పాడి
కీర్తన : కొమ్మల జవ్వనముల కోరువట్టేవా

పాడి

70 కొమ్మల జవ్వనములు కోరువట్టేవా
కమ్మర మా కోరికెలు గాదె బోసేవా ॥పల్లవి॥

నామనసు అడుగ నేల నమ్మించ నీ కేల
కోమలపు మాగుణాలు కొలవట్టేవా
యేమీ మాకుచగిరు లెంత లెంత లాయ నేమి
లేమల చక్కఁదనాలు లెక్క వ్రాసేవా ॥కొమ్మల॥

యెక్కువ మా కనుఁగవ లెంత ఘన మాయ నేమి
కక్కసించి యిందులో సుంకము గొనేవా
చక్కని మాగోళ్ళివి సరి గానీ బేసి గానీ
పక్కన వినియు నాతో పందె మాడేవా ॥కొమ్మల॥

మంతనాలు నెరపేవు మరురాజ్యపదవికి
యింతటికీ నన్నుఁ బట్ట మేలించేవా
చెంతలఁ గూడితి విదె శ్రీవేంకటేశ నీవు
సంతనాన గోరి లచ్చన వెట్టేవా ॥కొమ్మల॥ **444**

ఉపోద్ఘాతము:

సరస శృంగారకీర్తనలు చెప్పటంలో తన తండ్రి అన్నమయ్యవలె పెదతిరుమలయ్యదికూడా అందె వేసిన చెయ్యి. ఓ శ్రీవేంకటేశ్వరా! కొమ్మల జవ్వనములు వంతుల ప్రకారం కాజేసేవా? అటుపిమ్మట మాకోరికలు కూడబెట్టేవా స్వామీ అని కీర్తిస్తున్నారు. పెదతిరుమలయ్య ఇంకా క్లిష్టమైన భాష ఉపయోగించాడని నా భావన. స్వామీ! నీవు సంతనాన గోరి లచ్చన వెట్టేవా అంటున్నారు అంటే యేమిటో ఊహించగలరా? అయితే మీరు పెదతిరుమలయ్య కీర్తనలు ఈ వివరణ లేకుండా తెలుసుకోగలరని నమ్మకంగా చెప్పవచ్చును.

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయా! కొమ్మల జవ్వనమును తరుణములోనున్న భామల యౌవనమును కోరువట్టేవా (వంతులుగా కాజేస్తావా?) కమ్మర (అంతకు మించి) మా కోరికలు గాదె బోసేవా? (ఒక్కుమ్మడిగా కూడబెట్టి అలరించేవా)

స్వామీ! నీకు నామనస్సుతో పనేముంది. దాన్ని అడుగవలసిన అవసరమేముంది! నన్ను నమ్మించవలసిన పనేమున్నది? నేడు అనవసరంగా మా గుణగణాలను కొలవట్టేవా? (యెంచెదవా) మా కుచగిరులు యెంతెంత ఉన్నతమైనవైతే నీకేమయ్యా? ఆడవాళ్ళ చక్కదనాలు లెక్క వ్రాయుటయే నీ ఉద్యోగమా యేమి? నీ అంత రసికుడు దొరకలేదని మేమెంతో కంగారుపడుతున్నామా యేమి?

మా కనుగవ (రెండు కళ్ళూ) యెంత విశాలమైనవి అయితే నీకేమయ్యా? కక్కసించి (పట్టుబట్టి) ఇప్పుడు మా దగ్గిర ఇందుకు సుంకము (ట్యాక్స్) తీసికొంటావా యేమి? మేము ఏదో స్త్రీలము, మా ఆటలు మేము ఆడుకొంటుంటే నువ్వు మధ్యలో పైపందేలు కాస్తావా (అటుతిరిగి చేతివేళ్ళు చాస్తే ఎన్ని గోర్లు కనబడుతున్నాయో చెప్పాలన్నమాట. ఇందులో కనిపించే గోళ్ళ సంఖ్యపై పందెము వుంటుంది. కొమ్మలు స్వామిని ఏమి పితూరీ చేస్తున్నారంటే, నీవు వాళ్ళ మాట విని పందెం కాస్తావా?

స్వామీ! నీవు మరురాజ్యపదవికి మంతనాలు నెరపేవు (మన్మథ సామ్రాజ్యము నేలుటకు మంత్రాంగం చేస్తున్నావా? అందుకోసం నన్ను పటిమేలించేవా (దానికోసం నన్ను వలపింతువా?) ఇది మరీ బాగుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నాచెంతకు చేరి నన్ను కూడినావు సంతనాన (హక్కు భుక్తముగా) నన్ను కోరుకొని, లచ్చనవెట్టేవా (నాకు ఖ్యాతి తెస్తావా ప్రభూ!)

పద్యవివరణ:

కం॥ **కొమ్మల జవ్వనములు నీ**
సొమ్మని నువు కోరువట్టి సుఖియించేవా
క్రమ్మర పెదతిరుమలయనె
పోమ్మోయీ! కోర్కెగాదె బోసేవు హరీ!

సంఖ్య: I/358 రాగం : సామంతం
కీర్తన : దొరకునా యితనికృప తుదిపదంబు

సామంతం

71 దొరకునా యితనికృప తుదిపదంబు
అరిదివిభవము లొల్లమనినాఁ బొదలు ॥పల్లవి॥

సొంపలర నితఁడు కృపఁజూచు టరుదనికాక
యింపు సామాన్యమా యితనికరుణ
లంపటముఘనమైన లక్ష్మీకటాక్షములు
సంపదలు తోడనే చల్లువెదలాడు ॥దొర॥

తగ నితనిపై భక్తి తగలు టరుదనికాక
నగుట సామాన్యమా ననిచి యితఁడు
జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులువాయఁగ నితఁడు దిప్పు దీరాడు ॥దొర॥

తిరువేంకటాద్రి సిద్ధించు టరుదనికాక
మరుగఁ దను నిచ్చునా మరియొకరిని
యిరవైనభోగములు యిష్టసామ్రాజ్యములు
విరివిగొని యితనిదయవెంటనే తిరుగు ॥దొర॥ **358**

ఉపోద్ఘాతము:

గొప్ప భక్తిరసప్రధానమైన కీర్తన అన్నమయ్య వినిపిస్తున్నారు, ఆస్వాదించండి. ఓ మానవులారా! మేము శ్రీవేంకటేశ్వరుని దాసులము. మాకు భోగభాగ్యములు, సిరిసంపదలు సామ్రాజ్యవైభవములు యెందుకు? ఈయన కృప మేము తుదిపదమైన మోక్షమును సాధిస్తే చాలును. అన్యములు మాకు అనవసరము. సొంపలరగా ఈ దేవదేవుడు కృపజూడాలేగాని ఏ మహాసామ్రాజ్యము దక్కినా అచ్చెరువందవలసిన పనిలేదు. కానీ వచ్చిన చిక్కేమిటంటే ఆ వైభవాలతో అనేక

లంపటాలు కూడా చుట్టుకొంటాయి. ఈయన మరుగు దక్కితే ఇంకా మరియొకరిని దేబిరించాల్సిన పనేమిటి అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! ఈతని (ఈ శ్రీహరి) కృప దొరుకుట సాధ్యమా? అది దొరికితే ఇక తుది పదము (మోక్షప్రాప్తి) దొరికినట్లే. అయితే ఈతని కృప కలుగగానే మోక్షముకంటే ముందే అరుదైన వైభవములు ఒల్లమనినా (మాకు వద్దు స్వామీ అన్నా) తగులుకొని అనేక చిక్కులు తెస్తాయి.

సొంపలర (సొంపుమీర) ఈతనికృప దొరుకుటే అరదు. మహాసామ్రాజ్యములు కూడా మీకు సుసంపన్నమవుతాయి. అయితే ఆ లక్ష్మీకటాక్షంతోపాటు అనేక లంపటాలు కూడ మెడకు చుట్టుకుంటాయి. దానికి తోడుగానే మరికొన్ని సంపదలు వెదచల్లుతాడు. ఇక దాంట్లోంచి బయటపడేదెన్నడు?

ఇతనిపై భక్తి తగలుట అరుదుగా ఏ జన్మలోనైనా సుసంపన్నమవుతుంది. ఇతడు ననిచి (మనపై అనురాగము కలిగి మనల్ని చూచి చిరునవ్వు నవ్వటం అంత సామాన్యంగా జరిగే పనికాదు.) ఒకవేళ జరిగితే, జగములో అనేక హితవులు సౌఖ్యములు, సరసతలు (ఐశ్వర్యములు) దిగులనేదే యెరుగనంతగా ఈతడిస్తాడు. ఆ విధంగా స్వామి తన ఆశ్రితులను తిప్పుదీరాడు (తీర్చిదిద్దుతాడు).

తిరువేంకటాద్రి సిద్ధించటం బహు అరుదుగా దక్కే సిద్ధి. ఈతని మరుగు (రక్షణ) దక్కితే ఇంకా మరియొకరిని దేబరించాల్సిన పనేమున్నది చెప్పండి. సుస్థిరంగా నెలకొన్న భోగములు ఇష్టమైన సామ్రాజ్య వైభవములు యితని దయ యెక్కడ వుంటే అక్కడకు తిరిగి తిరిగి విరివిగా వచ్చి చుట్టుకొంటాయి. తస్మాత్ జాగ్రత్త!!

పద్యవివరణ:

చం॥ **దొరకునె వీని సత్కృపయు తుట్టతుదిన్ అది ముక్తి బాటయై**
అరిది సుఖంబులొద్దనిన అంటియె తీరును చుట్టుముట్టుచున్
తరుగనిలంపటంబులవి దాపగు భక్తిని నిల్వనీదురా
తిరుమల వేంకటేశ్వరుని దీవెన బొందుటె యెక్కుడన్నిటన్

సంఖ్య: I/359 రాగం : ఆహిరి
కీర్తన : చెలినేడు తానేమిసేయునమ్మా!

ఆహిరి

72 చెలి నేఁడు తానేమిసేయునమ్మ
చెలి యేమిసేయు నీచెలు లేమిసేయుదురు
చెలువైనవిభుమేనిచెలు వింత సేయఁగా ॥పల్లవి॥

సతి నేఁడు బంగారుచవికెలోఁ జిత్రంపు-
గతులెంత చూపినఁ గడకంటఁ జూడదు
అతనిఁజూచినమంచియబ్బురపుఁజూపులు
అతనివెంటనే పోయ నటుగాఁబోలును ॥చెలి॥

తేనియలూరేటి మంచి తియ్యని మాటలు మంత్ర-
గానములుగా వినుపించి కడువేసరితిమి
వానిమాటలు విన్నవలనైనముదమున
వీనులు ముద్రించినవిధముగాఁబోలును ॥చెలి॥

నిచ్చళపుమోమున నెయ్యము దైలువారె
బచ్చనచేఁతలు గుబ్బలపైనిండనొప్పెను
అచ్చపువేడుక వేంకటాద్రిశుఁడీ రేయి
నెచ్చెలికి నిచ్చినట్టి నేరుపుగాఁ బోలును ॥చెలి॥

ఉపోద్ఘాతము:

అద్భుతమైన సరస శృంగార కీర్తన నావిష్కరిస్తున్నారు అన్నమయ్య. బాలబాలికలకు ఈ కీర్తన అసంగతమే. కాబట్టి వారు తరువాత కీర్తనకు వెళ్ళవచ్చును. ఒక చెలికత్తెగా మారిన అన్నమయ్య మిగతా చెలికత్తెలకు పెళ్ళి అయిన రెండు మూడు రాత్రులతో ఈ పద్మావతీదేవి, శృంగారరాయడైన తన విభుని నుంచి సర్వమూ నేర్చుకొన్నది. ఆమె చూపులలో ఇప్పుడు యేవేవో సమాచారములు బయటపడుతున్నాయి. మంచి చిత్తరువు గీయవమ్మా అంటే తీర్చిదిద్దిన చెవ్వుల బొమ్మల వేస్తుంది మరి ఆయన చెవులంత

ఆకర్షించినవేమో! ఆమె గుబ్బలపై ఆయన బచ్చన చేతల వేడుకయెంతవున్న తన వదనము నెంత నిర్వికారంగా పెట్టిందో చూడండి. మరి ఈ నేర్పులన్నీ ఇంకా ఎవరు నేర్వారమా? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ సఖీ! ఈ చెలి (పద్మావతీదేవి) నేడు తాను యేమి సేయగలదమ్మా! ఈవిడే యేమీ చేయలేని స్థితిలో వుంటే, ఇక ఆమె స్వంత చెలికత్తెలు యేమిసేయుదురు? చెలువైన (అందగాడైన) విభుని, మేని చెలువు (శరీర సౌందర్యము) ఆమెనింత జేసింది, మరి.

ఆ సతి పద్మావతి నేడు తన బంగారు చవికెలో (సౌధములో) చిత్రమైన గతులు (చేష్టలు) మేము ఆమెను నవ్వించుటకు చూపినా, కడకంట (కను కొలుకుల) నుండి కూడా చూచుటలేదు. అతనిని చూచినంత సంభ్రమకర మైన చూపులు అతని వెంటనే పోయినవేమో అన్నట్లు బిత్తర చూపులు చూస్తున్నది.

ఆమెకు తన ప్రియుని మాటలు, తేనెలూరే తియ్యందనము గలవైనందున అవి తన కళ్యాణమున మంత్రములుగా పురోహితులు గానము చేయుచున్నట్లు అనిపించి తానూ చదివి అలిసిపోయింది. ఆమె స్థితిని చూచి మేమూ నీరసించిపోయాము. వాని మాటలు వినివినీ నేడు చిత్రలేఖనము చేసే ఆమె హంసతూలికనుండి వీనుల (చెవుల) చిత్తరువులే గీయుచున్నది. అందుకే కాబోలు ఆమె చిత్రకళాభ్యాస మందిరము నిండా చెవుల బొమ్మలే కనుపించుచున్నవి.

ఈ పద్మావతీదేవి యొక్క నిశ్చలమైన, మోమున (వదనమున) నెయ్యము ((ప్రేమ) దైలువారె (అతిశయించినది). ఆమె విభుని చిత్రవిచిత్రములైన చేతలు చనుగవపై నెరపి అతిశయించినవి. అచ్చమైన (మెండైన) వేడుకలతో శ్రీవేంకటేశ్వరుడు, ఈ రేయి ఆమెకు నేర్పిన జాణతనము వలన కాబోలు ఆమె యెంతో గుంభనముగానున్నది.

పద్యవివరణ:

ఆ.వె॥ **చెలియనేడు తాను సేయునమ్మా! యేమి?**
నీ చెలులును యేమి నెరుపగలరు.
విభుని మేని చెలువు వింత సేసీనమ్మ!
నేర్చె వేంకటేశు నెలతయన్ని.

సంఖ్య: I/3 రాగం : సామంతం
కీర్తన : అతడే సకలవ్యాపకు డతడే యాతురబంధువు

సామంతం

73 అతఁడే సకలవ్యాపకుఁ డతఁడే యాతురబంధువుఁ-
డతఁడు దలఁపులముంగిట నబ్బుట యెన్నఁడొకో ॥పల్లవి॥

సారెకు సంసారంబనుజలనిధు లీఁదుచు నలసిన-
వారికి నొకదరిదాపగువాఁ డిఁక నెవ్వఁడొకో
పేరినయజ్ఞానంబనుపెనుఁజీఁకటి తనుఁగప్పిన
చేరువవెలుఁగై తోఁపెడిచెలి యిఁక నెవ్వఁడొకో ॥అత॥

దురితపుకాననములలో త్రో వటుదప్పినవారికి
తెరు విదె కొమ్మని చూపెడిదేవుఁ డి (డ?) దెవ్వఁడొకో
పెరిగినయాశాపాశము పెడగేలుగఁ దనుఁగట్టిన
వెరవకుమని విడిపించేటివిభుఁ డిఁక నెవ్వఁడొకో ॥అత॥

తగిలినయాపదలనియెడిదావానలములు చుట్టిన
బెగడకుమని వడినార్పెడిబిరు దిఁక నెవ్వఁడొకో
తెగువయుఁ దెంపును గలిగినతిరువేంకటవిభుఁ డొక్కఁడే
సొగసి తలంచినవారికి సురతురువగువాఁడు ॥అత॥ 3

ఉపోద్ఘాతము:

"ఆతురబంధువు" అంటే రోగార్తులకు బంధువువంటివాడు అని అర్థం. ఓ భక్తులారా! ఆ శ్రీహరియే సర్వవ్యాపకుడు. అతడే రోగార్తులకు చేయూత. ఆ మహానుభావుడు నా తలపుల ముంగిట అమరియుండే భాగ్యము నాకెన్నడు కలుగుతుందో కదా! అంటున్నారు అన్నమయ్య. మేము సంసారసాగరాన్ని ఈదలేకపోతున్నాము. అజ్ఞానపు పెనుజీకట్లలో మగ్గిపోతున్నాము. చేసిన పాపములనెడి చిట్టడవిలో దారితప్పినాము. మా

రెండు పెడరెక్కలను ఆశాపాశం విరిచికట్టేసింది. ఆపదలు అనెడి దావాగ్నిలో మండి మసి అవబోతున్నాము. ఇటువంటి దుస్థితిలో మాకు రక్షకుడు తిరువేంకటేశ్వరుడు కాక ఇంకెవ్వరు? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! అతడే (ఆ శ్రీహరే) సకలవ్యాపకుడు (అంతటా వ్యాపించియున్నాడు). ఆ దేవదేవుడే అతడేమన ఆతురబంధు (మనలో రోగార్తులకు దగ్గర చుట్టము). అతడు మన తలంపుల ముంగిట అబ్బుట (అమరియుండుట) యెన్నడొకో (ఎప్పుడు తటస్థపడుతుందో కదా!)

ప్రతిసారీ సంసారసాగరమున బడి ఈదుచు అలసిపోతూనేవున్న నన్ను ఆ వార్ధిలోని నన్ను ఒక ఒడ్డుకు చేర్చగల వాడిక యెవ్వరున్నారు? పేరుకుపోయిన అజ్ఞానము అనే చీకట్లు చుట్టుముట్టితే, దగ్గరలోనే వున్న వెలుగు రేఖయై త్రోవ చూపెడి చెలికాడు ఇంకొకరెవ్వరున్నారు?

దురితపు కాననముల (మనము చేసిన పాపములనబడే అడవులలో) దారితప్పితే మనబోటివారికి ఇదే సరియైన దారిరా ఇటుపో అని దిక్దర్శనము చేసెడి దేవుడింకొకడెవరయ్యా! అమితమైన ఆశాపాశమున పెడరెక్కలు విరిచి కట్టేస్తే భయపడకు నాన్నా! అని వచ్చి విడిపించే నాథుడు మరొకరున్నారా? లేరుగాక లేరు.

తగులుకొన్న ఆపదలు అను దావానలము (కార్చిచ్చు) చుట్టుముట్టినప్పుడు బెగడకు (భీతి చెందకు) అని ధైర్యం చెప్పినట్లు వేగముగా వాటిని ఆర్పివేయగల బిరుదు (ఉద్దండుడు) యెవ్వడొకో? తెగువ తెంపు కలిగిన శ్రీవేంకటేశ్వరుడు ఒక్కడే అని గ్రహించండి. సొగిసి (ఇంపుగా) తలచి ధ్యానించినవారికి ఆ కొండలయ్య సురతరవగువాడు (కోరికలను తీర్చే దేవలోకపు కల్పవృక్షమువంటివాడు).

పద్యవివరణ:

కం॥ **అతడే సకలవ్యాపకు-**
డతడే ఆతురల బంధుడతడు తలపులం-
దతిచేరువయై యొప్పెడి
గతినాకెన్నడొకాయనుచు కనలెదను హరీ!

సంఖ్య: XVII/446 రాగం : ముఖారి
కీర్తన : ఎంతవొద్దులేదు నీకు నేమి సేయరాదు నన్ను

ముఖారి

74 ఎంత వొద్దు లేదు నీకు నేమి సేయరాదు నన్ను
మంతనమైనదాఁకా మన్నించరాదా ॥పల్లవి॥

నగి నగి యలపయ్యా నవ్వుల నీ మాటలకు
మగటిమిఁ గొంతవడి మానరా యింక
చిగురించిఁ జెనకఁగ సిగ్గయ్యాఁ గడుంగడు
వెగటు మానినదాఁకా విడువరాదా ॥ఎంత॥

చూచి చూచి సొడగిలి సొంపుల నీ చేఁతలెల్ల
తాచి తెరమాఁటుకైనా దలఁగరాదా
వాచవిమాటలాడఁగ వాడె నిదె నా మోవి
చేచేత దగ్గరుదాఁకా సెలవియ్యరాదా ॥ఎంత॥

కూడి కూడి నిద్ర వచ్చీఁ గూరిమి నీ రతులను
వూడనికొఁగిట గొంత వుండఁగరాదా
జాడతో శ్రీవేంకటేశ సరుసఁ బెండ్లాడితివి
యీడుజోడాడినదాకా నియ్యకొనరాదా ॥ఎంత॥ **446**

ఉపోద్ఘాతము:

ఓ శృంగారరాయా! నీకెంత వొద్దికలేదయ్యా? నీతో చెలిమి చేస్తున్న నన్ను యేమి చేయరాదు? కనీసం ఏకాంతం దొరికేవరకన్నా నన్ను మన్నించరాదా? అంటున్నది నాయిక. పెదతిరుమలాచార్యులు చెప్పిన కీర్తననాస్వాదించండి. కొంచెం శ్రమపడితేగాని ఇటువంటి శృంగారకీర్తనలు వివరించలేము. స్వామీ! ఆమెనిప్పుడేకదా పెండ్లాడినావు.

ఈడుజోడు ముచ్చట పూర్తి అయ్యేదాకా నామాటలకు అంగీకరించరాదా? అంటున్నది నాయిక. కొంచెం శ్రమపడక తప్పదు మరి.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! యెంతవొద్దు లేదు నీకు (నీకెంత ఒద్దికలేదయ్యా?) నీకింతటి చనువిచ్చిన నన్నేమిసేయరాదు? (ఏమైనా చెయ్యవచ్చును). మంతనమైనదాకానైనా (మనిద్దరికీ ఏకాంతం దొరికే దాకా) నన్ను మన్నించవయ్యా!

నీ చిలిపి మాటలు విన్న తరువాత నాకు యెంత నవ్వు వస్తోందంటే నవ్వినవ్వి నాకు యలపయ్యాని (అలసట వచ్చేసింది). చిగురులువంటి నా అధరములను నీవు చెనకగా (తాకగానే) నాకు సిగ్గుముంచుకు వచ్చేసింది. వెగటుమానినదాకా (నీ చొరవకు అలవడేదాకా) నన్ను విడిచిపెట్టకూడదా?

చూడగా చూడగా సొంపైన నీ చేతలన్నీ సొడగిలినట్లున్నవి. (నేను సోలిపోవునట్లు వున్నవి. నీ చిలిపితనము దాచిపెట్టి కాస్త తెరచాటునైనా చూసుకొనవద్దా? ప్రియసంభాషణలు చేసిచేసి నా ఓష్టము యెండిపోయినది. నన్ను నీదగ్గరకు పంపేదాకా నాకు కాస్త సెలవియ్యరాదా!

ఓ శృంగారరాయా! నీవు కూడికూడి నాకు నిద్ర వచ్చేస్తున్నది. నీకూరిమి రతులకు అలిసిపోయాను. ప్రభూ! వూడని కౌగిట (బిగి సడలని పరిష్వంగములలో) కొంత వుండగ రాదా (ఒకింత తడవు వుండరాదా?) ఓ శ్రీవేంకటేశ్వరా! నా జాడ తెలిసికొని నా సరసకు జేరి పద్మావతీ పరిణయమని జగద్విఖ్యాతి దెచ్చినావు. కాసేపయ్యాక ఈడూజోడూ అనే ముచ్చట జరుగుతుంది. అది ఆడేదనుకనైనా ఇయ్యకొనరాదా (సమ్మతించరాదా)?

పద్యవివరణ:

ఆ.వె॥ **ఎంతవొద్దులేదు ఏమోయి నీకు న-**
న్నేమిసేయరాదు? యేమిటయ్య!
మంతనమగు దాకమన్నించరాదొకో!!
వేంకటేశ! యనెను పెదతిరుమల.

సంఖ్య: I/299 రాగం : భూపాళం
కీర్తన : ఏలవచ్చీ యేలపోయీ నెందుండీ ప్రాణి

భూపాళం

75 ఏలవచ్చీ యేలపోయీ నెందుండీc బ్రాణి
తోలుతిత్తిలోనc జొచ్చి దుంక దూరనా ॥పల్లవి॥

పుట్టులేక నరకాలపుంగుడై తా నుండక యీ-
పుట్టుగున కేల వచ్చీ పోయీc బ్రాణి
పుట్టుచునే కన్నవారిc బుట్టినవారి నాసలc
బెట్టిపెట్టి దుఃఖములc బెడరేcచనా ॥ఏల॥

భూతమై యడవిలోc బొక్కుచుc దా నుండక యీ-
బూతుజన్మమేల మోcచెc బుచ్చినప్రాణి
రాతిరిcబగలు ఘోరపుcబాటు వడిపడి
పాతకాలు చేసి యమబాధcబడనా ॥ఏల॥

కీటమై వేంకటగిరి కిందనైన నుండక యీ-
చేటువాటుకేల నోcచె చెల్లcబో ప్రాణి
గాటమైనసంపదల కడలేనిపుణ్యాల-
కోటికిc బడగెత్తక కొంచెపడనా ॥ఏల॥ **299**

ఉపోద్ఘాతము:

మన శరీరం ఒక తోలుతిత్తి వంటిది. ప్రాణి అని పిలువబడే ఈ జీవుడు ఈ తిత్తిలోనికి దూరినాడు. ఎట్లాదూరాడు, దానికున్న దుంకదూరినాడు (రంధ్రములలో యేదో ఒక రంధ్రములోంచి దూరినాడు). ఎందుకు వచ్చాడో, యెందుకు పోతాడో యెవరికీ తెలియదు. ఇది అన్నమయ్య కీర్తన. అంత తేలిక కాదు.

పుట్టుకలేక నరకాలలో పడివుండక ఈ ప్రాణి యెందుకు పుడుతున్నాడో తెలియదు. పుడుతూనే తన వాళ్ళకి ఆశలు కలిగిస్తాడు. అందరికీ ఆశలు

పెట్టీపెట్టీ తీరనిదుఃఖము మిగిల్చి కనుమరుగవుతాడు. వాడి దురాశాపూరిత పాపకర్మలవల్ల కీకారణ్యములో వస్త్రాలు కూడా లేని జంతు జన్మలో మగ్గుతాడు. రాత్రింబవళ్ళూ మళ్ళీ యమబాధలు అనుభవిస్తాడు. దానివల్ల కీటకమై ఎలాగో వేంకటాద్రి చేరి స్వామిని చూచి కోటికి పడగలెత్తే జన్మపొందుతాడు. ఈసారియైనా శ్రీహరిని నమ్మితేనే భక్తి ఆపై ముక్తి.

తాత్పర్య వివరణ:

మానవుని శరీరం తోలుతిత్తి వంటిది. దీనికి దుంకలు (రంధ్రములు) తొమ్మిది వున్నాయి. ప్రాణి (ఆత్మ) ఈ దేహంలోకి ప్రాణముపలె దూరుతుంది. ఏలవచ్చీ (ఎందుకువస్తుందో) యేల పోయీ (ఎందుకు పోతుందో) ఎందుండి వస్తుందో ఎవ్వరికీ తెలియదు.

పుట్టుకలేని ఆత్మలుండే చోట అది నరకమైనా అక్కడే తానుండక పుట్టుటకోసం ఎందుకు ఈప్రాణి వస్తూ పోతూ వుంటాడో, యెవ్వరికీ తెలియదు. పుడుతూనే కన్నవారికి తనవారికీ అంతులేని ఆశలు పెట్టీ పెట్టీ (కలిగించి) చివరికి నిష్క్రమిస్తాడు. అదీ యెందుకో, యెప్పుడో, యెలాగో ఎవ్వరికీ తెలియదు.

భూతమై (ప్రేత రూపమున) అడవిలో కనపడినదానిని బొక్కుచు అలాగే వుండక ఈ బూతు జన్మలో (వస్త్రములే ధరించని జంతు జీవితంలో) మోచేతులపై డేకుతాడు. రాత్రింబవళ్ళూ ఘోరమైన పాట్లు పడీపడీ పాతకాలు ఇంకా చేసి దానివల్ల ఇంకా యమబాధలు పడతాడు.

చివరికి ఎలాగో అలాగ శ్రీవేంకటాద్రిపై కీటకమై జన్మిస్తాడు. అక్కడ అలా వుండక శ్రీవేంకటేశ్వరుని దర్శిస్తాడు. చెల్లబో! (అమ్మయ్య) ఇక అలా వుండక ఆ పుణ్యం వలన. అంతులేని సంపదలున్న జన్మ పొందుతాడు. ఆ జన్మలో కూడా అంతులేని పుణ్యం చేసి శ్రీహరి శరణాగతుడైతే, ముక్తి పొందుతాడు. లేదా సిరిసంపదలలో చెడిపోయి మళ్ళీ కథ మొదటికే వస్తుంది.

పద్యవివరణ:

కం॥ **ఎందుండి యిటకు వచ్చెను?**
ఎందులకది వచ్చె? ప్రాణి యేటికి బోయెన్
కందువ శ్రీహరి తలపగ
అందిన యీ తోలుతిత్తి యందున దూరెన్.

సంఖ్య: XX/321 రాగం : శ్రీరాగం
కీర్తన : నిలువుల మేడలో నిలుచున్నా డిదె

శ్రీరాగం

76 నిలువుల మేడలో నిలుచున్నాఁ డిదె
పిలువవే రమణునిఁ బ్రేమముతోడ ॥పల్లవి॥

చలివేఁడిచేమటల జలకమార్చవే
అలసి వచ్చెఁ బతి యందుండి
పలుకుల కపురపుబాగా లీవే
తలఁపుల తమకపుదాహము గొనెను ॥నిలు॥

తనుపులకవిరులఁ దగఁ బూజించవే
తనకుఁదనకె నినుఁ దగిలీని
కనుఁగొన నవ్వులగందము వూయవే
వెనకటి విరహమపువేదన దీర ॥నిలు॥

పొరి మోవితేనెబువ్వము దొడుకవే
గరిమరతుల నాఁకలి గొనెను
మరిగి యితనితో మంతనమాడవే
యిరవుగ శ్రీవేంకటేశుఁడు గూడె ॥నిలు॥

ఉపోద్ఘాతము:

ఎత్తైన మేడమీద నిలుచుని వున్నాడే, ఆ నా విభుని పిలవండమ్మా! ప్రేమముతో నా రమణుని నామాటగా ఆహ్వానించండి. శ్రీదేవి పలుకులను అన్నమయ్య ఈ శృంగార కీర్తన ద్వారా వినిపిస్తున్నారు. ఎండన బడి వచ్చే పతి సేదయెలా తీర్చాలో వివరిస్తున్నారు. నీ అధరామృతమునే ఆయనకు ఆహారముగా నివ్వవమ్మా! అర్ధరాత్రి వేళ రతుల అలసట చేత

ఆకలివేయవచ్చును. అది చెప్పటానికి స్వామి కాస్త ఇబ్బంది పడుతుండవచ్చును. ఆయనతో రహస్యంగా సంప్రతించి కనుక్కోవమ్మా! శ్రీవేంకటేశుడిదె నిన్ను కూడి మురియుచున్నాడు, అంటున్నారు. చరణాల వివరణ కావాలంటే తాత్పర్య వివరణ చదవాల్సిందే.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! నా రమణుడు నిలువెత్తు మేడలో పైననే నిలుచునియున్నాడు. ఇదే ఆయనను పిలువవే. కాస్త ప్రేమగా పిలువవే నా రమణుని.

చలికాలంలో ఎండ వేడిమి ఇంకా వుబ్బబెట్టి చెమట అధికమవుతుంది. ఆ తడి ఒళ్ళు ఆర్చవమ్మా! (పొడి చేయవమ్మా) అందుండి (అక్కడెక్కడనుండో) నీ పతి అలసిపోయి వచ్చాడు, మరి. నీపై వచ్చిన తలపుల వలన (ఆలోచనల మూలంగా) పారవశ్యంతో ఆయనకు దాహము వేసి నోరు యెండిపోయింది. నములుటకు కర్పూరపు పలుకులుగల వక్కపొడిని అందించవమ్మా!

నీ తనువు పులకరించుటవలన ఆ పులకలు విరులవలె (పూవుల మాదిరి) తేలినవి. అవే పువ్వులన్నట్లు ఆయనను పూజించవే. తనకు తానే నీకు తగులు అవుతాడు. ఇక నిన్ను వదలడు. నీ నవ్వులే పరిమళ గంధముగా ఆయనకు బూయవే. వెనకటి విరహము (తొలిరాత్రిముందు విరహం) కూడా తీరిపోతుందమ్మా!

పొరి (క్రమముగా) అధరామృతమనే (పెండ్లి భోజనం), దొడకవే (గ్రహింపవే). రతుల మధ్యలో ఆకలి వలన ఆయన చీకాకు పడతాడేమో? ఇతనితో అతిశయించి మంతనములాడవే (రహస్య సమాలోచనలు) చేయవమ్మా! శ్రీవేంకటేశ్వరుడు అనుకూలుడై నిన్ను కూడినాడు. విడువకమ్మా!

పద్యవివరణ:

ఆ.వె॥ **నిలువు మేడలోన నిలుచున్న వాడదే**
పిలువవే రమణుని బ్రేమతోడ
పూనిమోవితేనె బువ్వము దొడుకవే
వేంకటపతి గూడివెలది! నీవు.

సంఖ్య: I/329 రాగం : శ్రీరాగం
కీర్తన : కొంచెమును ఘనముగనుగొననేల హరి దలచు

శ్రీరాగం

77 కొంచెమును ఘనముఁగనుఁగొననేల హరి దలచుఁ
పంచమహాపాతకుఁడే బ్రాహ్మణోత్తముడు ॥పల్లవి॥

వేదములుచదివియును విముఖుఁడై హరికథల-
నాదరించని సోమయాజికంటె
యేదియును లేనికులహీనుఁడైనను విష్ణు-
పాదసేవకుఁడువో బ్రాహ్మణోత్తముఁడు ॥కొంచె॥

పరమమగు వేదాంతపఠన దొరకియు సదా
హరిఁదలఁచలేని సన్యాసికంటె
మరిగి పసురముఁదినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు ॥కొంచె॥

వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృథా
తనువు వేఁపుచుఁ దిరుగుతపసికంటె
చనవుగలవేంకటేశ్వరుదాసులకు వెంటఁ
బనిదిరుగునధముఁడే బ్రాహ్మణోత్తముఁడు ॥కొంచె॥ 329

ఉపోద్ఘాతము:

కొంచెముకూడా ఘనముగా కనుగొననక్కరలేదు. ఈ మాట అతిశయోక్తి కాదు. ఎప్పుడూ హరిని దలంచే పంచమహాపాతకుడే బ్రాహ్మణోత్తమునివంటివాడు, అని అంటున్నారు అన్నమయ్య. కులహీనుడైన విష్ణుభక్తుడే గొప్ప సోమయాజులవారికంటే మిన్న. విష్ణుపాదసేవకుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు. వేదాంతపఠనం చేస్తూ

కూడా హరిని తలచని సన్యాసి కంటే విష్ణుదాసుడై పశువుల్ని తినే మాలవాడే మేలు. రమావల్లభుని తలవని తపస్వి ఏం సాధిస్తాడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కొంచెముగానైనా ఘనముగా కనుగొననక్కరలేదు. హరిని దలచు (ధ్యానించే) పంచమహాపాతకుడే అసలైన బ్రాహ్మణోత్తముడు.

వేదములనన్నింటిని చదివియునూ వాటియందు విముఖుడై, హరి కథా శ్రవణమును వినని సోమజాయులవారికంటే యేదీలేని కులహీనుడైననూ విష్ణుపాదసేవకుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

పరమమగు (ముక్తిప్రదమైన) వేదాంతపఠనము లభించికూడా దానియందు ఇచ్ఛలేక, సదా (యెల్లవేళలా) హరిని దలచుకొనని సన్యాసికంటే మరిగి (అందుబాటులోవున్న) పశురము (జంతువును, తిని క్షుద్బాధ తీర్చుకొనే మాలవాడైననూ పరమాత్మను కొలిచే వాడైతే ఆతడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

రమావల్లభుడు (లక్ష్మీపతి) అయిన శ్రీమన్నారాయణుని వినియు చదివియు ఆయనను స్మరించకపోతే ప్రయోజనమేమిటి? వాని జన్మంతా వృథా (వ్యర్థమే)

తనువు వేపుచు (శరీరాన్ని కృశింపజేయుచు) చరించే తపస్వికంటే, అందరికీ అనుకూలుడైన శ్రీవేంకటేశ్వరుని దాసుల వెంటబడి తిరిగే అధముడైన బ్రాహ్మణుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

పద్యవివరణ:

కం॥ **కొంచెమును ఘనము కాదుర**
ఎంచగబనిలేదు హరిని యెపుడుదలంచే
పంచమహాపాతకుడున్
ముంచిన సద్బ్రాహ్మణోత్తముడె ధాత్రిని పో

సంఖ్య: XX/450 రాగం : దేవగాంధారి
కీర్తన : తొడిబడసందుసుడిదొంగాడిని

దేవగాంధారి

78 తొడిఁబడ సందుసుడిదొంగాడిని
వెడఁగుఁగొప్పుశిరసు వెన్న ముద్దకృష్ణుఁడు ॥పల్లవి॥

ఆదిగొని నేరాఁగా నఱచేతివెన్నముద్ద
పాదుకొన నోర నిండాఁ బావుకొన్నాఁడు
సాదించీ నామాఁటాడఁ డచ్చమయ్యినగోలవలె
యీడెసఁ జట్టిలో వెన్న యియ్యవచ్చీఁ జేతికి ॥తొడిఁ॥

కుత్తుకబంటిదాఁకా గూనలో పాలెల్లాఁ దాగి
యెత్తుకవున్నాఁడు మొగ మిందుదాఁకాను
యెత్తుకొనఁ బిలిచితే యెంతైనాఁ గదలఁడు
వొత్తిపట్టి వూఁదుకొనీ నొకచేత నేలను ॥తొడిఁ॥

పెరుగుమీఁగడలెల్ల పిన్నవాండ్ల కందిచ్చి
దొరవలె లోననుండి తొంగిచూచీని
యెరవు లేక శ్రీవేంకటేశుఁడని మొక్కి తేను
ఇరవైతినని నవ్వీ నిట్టె సెలవులను ॥తొడిఁ॥

ఉపోద్ఘాతము:

ఉద్దగిరిలో వెలసిన వెన్నముద్ద కృష్ణునిపై అన్నమయ్య చక్కటి కీర్తన వినిపిస్తున్నారు. ఇది యెంతకూ అర్థంకాని తెలుగు కీర్తన. తాత్పర్యవివరణ చూడకుండా దీని భావం వివరించటానికి ప్రయత్నించండి. ముందు 'పల్లవి'ని చూచి చెప్పండి. "ఈ వెన్నముద్ద కృష్ణుడు, వెడగుగొప్పుదాల్చిన (చిన్ని కొప్పు నెత్తిమీద కట్టిన) కృష్ణుడు. వీడు తొడిబడసందుసుడి దొంగాడు, (ఒప్పందాలు చేసికొంటూ అవకాశాన్నిబట్టి చటుక్కున దొంగతనం చేసే) కృష్ణుడు- అంటున్నారు. ఓ వెన్నముద్దకృష్ణా! నీవే మొక్కిన వరములిచ్చే వేంకటేశుడవు అని అనండి. మధురంగా లేత నవ్వులు యిట్టే వొలకబోస్తాడు.

తాత్పర్య వివరణ:

ఈ వెన్నముద్దకృష్ణుడు తొడిబడు (ఒప్పందాలు కుదుర్చుకొనే) సందెసుడి దొంగాడు (అవకాశమును బట్టి చటుక్కున దొంగతనంచేసే చోరశిఖామణి). వీడు చూడటానికి బుద్ధిమంతుడే. వెడగు గొప్ప శిరసు (చిన్న కొప్పు నెత్తిమీద కట్టిన తలతో చూచుటకు ముద్దులొలుకుతాడు).

ఆదిగొని (కన్నువేసి) అరచేతిలో దాచుకొని తినబోతున్న వెన్నముద్దను, నేరాగా (నేను రాంగానే) చటుక్కున తెరచిన నోటినిండా కుక్కుకొని ఆ కంగారులో సగం నోటినిండా పాముకొన్నాడు (వ్రాసుకొన్నాడు). నేను సాధిస్తున్నట్లు నిష్కారంగా మాట్లాడగానే అచ్చం గొల్లవానివలె ఉడుక్కొని నేను జట్టిలో (అమ్మకానికి దాచుకొన్న) వెన్న యియ్యవచ్చీ (ఇంద నీవెన్న నీవే తీసికో) అని నావెన్న నాకే ఇస్తాడు.

ఒక రోజున మెల్లగా వంటింట్లోకి వెళ్ళి, గూనీలోని పాలెల్లా (పెద్దకుండలో మేము అమ్మకానికి దాచుకొన్న పాలు అన్నీ) కుత్తుకబంటి దాగి (గొంతుక దాకా త్రాగి) మమ్మల్ని చూడంగానే తడి ఆరిపోయిన పాలవాసన కొట్టకుండునట్లు, నోరు తెరచుకొని మొగమును ఎత్తిపట్టి గాలిలో నిలుచున్నాడు. మేము వెళ్ళి ముద్దుచేసి ఎత్తుకొంటాము దగ్గరకు రమ్మంటే, ఎంతకీ రాడే. పైగా మమ్మల్ని దూరంగా వుంచటానికి తన కొమ్ముబూర యెత్తిపట్టి ఒకచేతితో చెవులు కప్పుకొని ఏలపాట పెద్దగా పాడుతాడు. అన్నీ దొంగవేషాలే.

మేము అమ్మకానికి పెరుగు మీగడను కడవల్లో దాచుకొంటే, దాన్ని తనతోటి గొల్లపిల్లగాండ్లకు అందించి తాను దొరగారిలాగ లోపల నుండి బయటకు తొంగి చూస్తుంటాడు పెద్దవాళ్ళెవరన్నా వస్తున్నారా అన్నట్లు. ఇన్ని చిలిపి పనులు చేసినా ఈ మన శ్రీవేంకటేశ్వరుడే ఆనాటి వెన్నముద్ద కృష్ణుడు. నాకు మొక్కండి ఈనాడు నేనే మీరు ఏమి కోరితే అదిస్తాను అని అన్నట్లు సెలవినవ్వులు (మధురమైన లేత నవ్వులు) చిందిస్తున్నాడు.

పద్యవివరణ:

చం॥ **తొడిబడసందుచూచికొని దొంగతనంబులు చేయుధూర్తుడున్**
వెడగుశిరస్సుగొప్పు మన వెన్నలముద్దల దొంగ, వెన్న మీ-
గడలను తోటిపిల్లలకు గక్కున పంచును తాను నేతయై
ఎడయక వేంకటేశునిగ యెక్కెనుకొండలు వెన్నకృష్ణుడై.

సంఖ్య: IV/33 రాగం : దేసాళం
కీర్తన : చదివి బ్రతుకరో సర్వజనులు మీరు

దేసాళం

79 చదివి బ్రతుకరో సర్వజనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షరమిదియే ॥పల్లవి॥

సాదించి మున్ను శుకుఁడు చదివినట్టిచదువు
వేదవ్యాసులు చదివినచదువు
ఆదికాలపువైష్ణవులందరినోటిచదువు
గాదిలినారాయణాష్టాక్షర మిదియే ॥చది॥

సతతము మునులెల్ల చదివినట్టిచదువు
వెతదీర బ్రహ్మ చదివినచదువు
జతనమై ప్రహ్లాదుఁడు చదివినట్టిచదువు
గతిగా నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥

చలపట్టి దేవతలు చదివినట్టిచదువు
వెలయ విప్పులు చదివేటిచదువు
పలుమారు శ్రీవేంకటపతినామమై భువిఁ
గలుగు నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥ **33**

ఉపోద్ఘాతము:

"ఓం నమో నారాయణాయ" అనేది మోక్షప్రదమైన అష్టాక్షరీ మంత్రము. దీనిని ఒక్కదానిని సదాత్రికరణశుద్ధిగా జపించేవానికి వైకుంఠప్రాప్తి తప్పక కలుగుతుందని పెద్దలు చెబుతారు. అయితే ఎంత త్రికరణశుద్ధిగా చేస్తాము అన్నదే ఒక మడతపేచీ. మనకి మనం త్రికరణ శుద్ధిగా చేస్తున్నాం అనుకొంటే సరిపోదు. ఆ శ్రీమన్నారాయణుడు

అనుకోవాలి. శుకమహర్షి, వేదవ్యాసుడు, మునీశ్వరులు, చతుర్ముఖ బ్రహ్మ, ప్రహ్లాదుడు, దేవతలు, వైష్ణవ భక్తులు సద్బ్రాహ్మణులు సదా జపించిన మంత్రము అదే. నేటి కలియుగంలో "ఓం నమో వేంకటేశాయ" అనే అష్టాక్షరీమంత్రము ఆ మంత్రము వంటిదే.

తాత్పర్య వివరణ:

ఇదియే కదిసి (చేరువయైన) నారాయణాష్టాక్షరీ మంతము. "ఓం నమో నారాయణాయ" అని దానినే చదివి పఠింపుచూ మీరు సర్వజనులూ బ్రతుకరో.

మున్ను (పూర్వము) శుకుడు (శుకమహర్షి) సాధించి (సాధన చేసి) చదివినట్టి చదువు ఈ మంత్రమే. అష్టాదశ పురాణములను రచించిన వేదవ్యాసులవారు పఠించిన మంత్రము కూడా ఈ చదువే. ఆదికాలపు (అనాదిగా) వైష్ణవులందరూ త్రికరణశుద్ధిగా ప్రేమతో చదివేది ఈ చదువే, ఓం నమో నారాయణాయ.

సతతము (ఎల్లప్పుడూ) ఎల్ల మునులు (మునులందరూ) చదివినట్టి చదువు ఈ అష్టాక్షరీమంత్రమే. దుఃఖించిన బ్రహ్మదేవుడు కూడా చదివినది యీ మంత్రమునే. హిరణ్యకశిపునివల్ల అన్ని బాధలు ప్రహ్లాదుడు ఓర్చినదీ మంత్రము కొరకే. కాబట్టి వారందరికీ గతి అయినది ఈ అష్టాక్షరీ మంత్రమే. ఓం నమో నారాయణాయ.

మేము అమృతం తాగిన వారము అనే చలపట్టి (మత్సరము) కలిగిన దేవతలు కూడా భీతిల్లి పఠించినదీ మంత్రమునే. అన్ని యుగాలలోనూ సద్బ్రాహ్మణులు పఠించినదీ అష్టాక్షరీమంత్రమునే. భువి (నేటి భూమండలంలో) అదే నామము వేంకటేశ్వర అష్టాక్షరీమంత్రముగా మనందరమూ చదువుచున్నాము అట్లు కలిగిన ఈ నారాయణాష్టక్షరీ మంత్రమే తిరుమలలో ఓం నమో వేంకటేశాయ అనే అష్టాక్షరీమంత్రమైనది.

పద్యవివరణ:

కం॥ **నారాయణుఅష్టాక్షరి**
మీరినమంత్రంబు వినుడుమేలు స్మరింపన్
కూరిమి చదువుచు బతుకరొ
ధారుణి సర్వులకు ముక్తిదాయకమదె పో!

సంఖ్య: XX/339 రాగం : పాడి
కీర్తన : నీవెప్పుడూ ఘనుడవే నేనీచేతిలో దానను

పాడి

80 నీ వెప్పుడూ ఘనుఁడవే నే నీచేతిలోదానను
యేవేళ నెట్లున్నా నేమాయ నీకు ॥పల్లవి॥

వన్నెల నన్నింత నీవు వలపించినవాఁడవు
కన్నులనాచూపులకుఁ గాచుకుందువు
పన్ని తాము చేసేపైరుపంట కెదురుచూడరా
యెన్ని సేసిన నాయెడ కేమాయ నీకు ॥నీవె॥

తలఁపెల్ల నీ వన్నిటా దక్కఁగొన్నట్టివాఁడవు
పలుకులు నావెల్లాఁ బాలింతువు
మలసి తమచిలుకమాటలు ముద్దుసేయరా
యెలమి నాకొరకుఁగా నేమాయ నీకు ॥నీవె॥

కందువనారతులను కలసినట్టివాఁడవు
మందెమేళములు నావి మన్నింతువు
విందారగించేటివారు వేఁడయిన నోర్వరా
యిందులో శ్రీవేంకటేశ యేమాయ నీకు ॥నీవె॥

ఉపోద్ఘాతము:

ఓ రమణుడా! నీవు యేవేళనెటులున్నా వచ్చే లోటేముంది? నీవు యెప్పుడునూ ఘనుడవే. నేనేమో నీ చేతిలోనిదానను అంటున్నది నాయిక. ఇది అన్నమయ్య చెప్పిన శృంగార కీర్తన. నెమ్మదిగా చదివితేగాని అర్థంకాదు, మరి. నీవన్నెలన్నీ చూపి నన్నింతగా వలపించేవు స్వామీ! నాకడగంటి చూపుకోసం కాచుకొని వుంటావు. ఈ లోకంలో యెవరైనా తాము సాగుచేసిన పైరుపంటకోసం యెదురు చూడరా? నేను కూడా నీవలపుల పంట కోసం

యెదురు చూస్తున్నదాననే. నీవు నాయెడ (నాపట్ల) యెన్నిచేసినా నేనేమీ అనుకోను. ఏమిటవుతుంది స్వామీ? అంటున్నది నాయిక.

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయా! నీవెప్పుడూ ఘనుడవే. నేనే నీచేతిలో వున్నదానను (నీ ఆజ్ఞాబద్ధురాలను). నీవు జగదేకపతివి. నీవెట్లావున్ననూ చెల్లుతుంది ప్రభూ! నీకు నేమాయ (నీకేమవుతుంది?)

స్వామీ! నీవు నన్నింతగా నీవన్నెలతో (అందచందములతో) వలపించినవాడవు. నీవు కన్నులనాచూపులకు గాచుకొందువు (నా కడగంటి చూపులకై కాచుకొని వేచివుందువు). ఈ లోకంలో ఎవరైనా తాము సాగుచేసే పైరుపంట కోసం యెదురు చూడరా? నేనుకూడా నీ వలపుల పంట కోసం యెదురు చూస్తున్నదాననే. నీవు నాయెడ (నాపట్ల) యెన్ని చేసినా నేనేమీ అనుకోను. ఏమిటవుతుంది ప్రభూ?

ప్రభూ! నీవు నాతలపు అంతటా ఆక్రమించి, నిండిపోయి వున్నావు. నన్ను దక్కగొన్నట్టివాడవు (నన్ను నీవు లోగొనియున్నావు). నాపలుకులు నీవెల్లా పాలింతువు. (నేను చెప్పిందెల్లా నీవు శ్రద్ధగా వింటావని అందరూ భ్రమపడుతున్నారు). కానీ సత్యమేమంటే ఎవరైనా తాము ముద్దుచేసి పెంచుకొనే చిలుకలమాటలు శ్రద్ధగానే వింటారు కదా! నామాటలు కూడా అలాగే వింటున్నావు. నా కొరకుగా (నాకోసము) ఏమి జరుగుతుంది ప్రభూ!

స్వామీ! నీవు నా సురతములలో నన్ను గలసినవాడవు. నా మందెమేళములను (పరిహాస వచనములను మన్నించుము ప్రభూ!) విందు భోజనానికి కూర్చొన్నవారికి ఒకటిరెండు వంటకాలు నోరుకాలేటంతవేడిగా వున్నాయని తిట్టుకొంటారా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇందులో యేముంది ప్రభూ!

పద్యవివరణ:

కం॥ **ఘనుడవు నీవెప్పుడునూ**
కనుగొన నీచేతిలోన కలదాననునే
విను యేవేళనునెవ్విధి
కనుపించినయేమి అయె కమలదళాక్షా!

సంఖ్య: IV/37 రాగం : సామంతం
కీర్తన : మేలెల్ల నొక్కటేమించుతీలూనొకటే

సామంతం

81 మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే
తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే ॥పల్లవి॥

ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకమే ॥మేలె॥

యెందు నెండఁబడ్డఁగాని ఇంపునీడఁ గోరఁడు
కందువ సంసారియైనఁగాని మోక్షము గోరఁడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువబద్దున కదే కట్టినట్టి కట్లు ॥మేలె॥

కలయఁ జీఁకటియైతేఁగాని దీప మిడుకోఁడు
ఇల నజ్ఞుఁడైనఁగాని యెరుక వెదకఁడు
తలఁచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే
బలిమిఁ జంచలునికి బహుళ దుఃఖములే ॥మేలె॥

ఉపోద్ఘాతము:

సర్వసంగ పరిత్యాగులైన శ్రీవేంకటేశ్వరుని దాసులు విరక్తులు. అందుచేత వారికి, మేలూ వొక్కటే అధికమైన కీడూ ఒక్కటే. క్షమాగుణముతో సంప్రాప్తమయ్యే వారి ఆలోచనలు కూడా ఒకేలాగ సదా మంచి చేయాలి అన్నట్లే వుంటాయి, అంటున్నారు అన్నమయ్య. ఆకలిలేనివాడికి ఎంత రుచిగల పదార్థాలు పెట్టినా బాగాలేవు అంటాడు. పాపము ఎక్కువగా చేసిన వాడికే సుకృతము కలిగితే మళ్ళీ పాపము చేయడు. అదే అవివేకి వుంటాడనుకోండి

వాడికి పాపమూ ఉపకారిగానే కనబడుతుంది. ఇక మూర్ఖశిఖామణులకైతే పుణ్యముకూడా చెఱసాలలాగానే వుంటుంది, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

మేలెల్లావొక్కటే (మేలు కలిగినా ఒక్కటే) మించినతీలూ (అధికమైన కీడూ) వొక్కటే. తాలిమితో (క్షమాగుణముతో) ఫలియించు (సంప్రాప్తమయ్యే) తలపూ నొక్కటే ఆలోచనకూడా వొక్కటే. క్షమ కలిగినవారు అపకారికి కూడా ఉపకారం చేస్తారు.

ఆకలి మిక్కిలి అధికమైతేనే అన్నము రుచిగోరును (అన్నము రుచిగా వున్నదా అని చూడరు). జోకపాపము (మొత్తము పాపము) ఎక్కువచేసినవానికే సుకృతము (పుణ్యము) చేస్తే బాగుండును కదా! అనిపిస్తుంది. ఇక అవివేకులకు పాపమూ ఉపకారమే అనిపిస్తుంది. పుణ్యము కూడా మూర్ఖులకు చెఱసాలలాగానేవుంటుంది.

ఎండబడ్డవాడే (అధికమైన ఎండను అనుభవించినవాడే) చక్కటి చల్లని నీడ కోరుకొంటాడు. నీడలో వున్నవాడికి దాని సుఖం ఏం తెలుస్తుంది? సంసారియైనవాడే ముక్తి కోరుకుంటాడు. మరి యోగికి సంసారమూ ద్వేషము కాదు. అదే సంసారబద్ధులైనవారికి (సంసారమంటే తాపత్రయం పడేవారికి) ఆ సంసారమే పెద్ద ప్రతిబంధకమవుతుంది.

చిమ్మచీకటిలోవున్న వారికే కాస్త దీపపు కాంతి వుంటే బాగుండును అనిపిస్తుంది. అజ్ఞానంలో మగ్గినవారే ఎరుక (జ్ఞానము) కోరుకుంటారు. ఇక ఇవన్నీ మాకెందుకులే అని శ్రీవేంకటేశ్వరుని దాసులు నిస్సంగులు, విరక్తులు, నిర్విచారులూ అయివుంటారు కనుక అన్నిట్లోనూ జయమును పొందుతారు. ఇక చంచలబుద్ధివున్న వారి గురించి చెప్పేదేముంది? వారికి యెప్పుడైనా దుఃఖమే మిగులుతుంది.

పద్యవివరణ:

కం॥ **వేంకటపతిదాసులకును**
సంకటమౌ తీలునొకటె సంప్రాప్తంబౌ
కొంకని మేలూ నొకటే
జంకని క్షమయున్న కలుగు చక్కని తలపుల్.

సంఖ్య: XX/449 రాగం : గౌళ
కీర్తన : వీధులవీదులనేగే విట్ఠలేశా

గౌళ

82 వీదులవీదులనేఁగేవిట్ట (ట్ఠ)లేశా । వట్టి –
వేదలెల్లాఁ బాసె నిఁక విట్టలేశా ॥పల్లవి॥

వేడుకకాఁడవైతివి విట్టలేశా ।నీకు
వీడె మందుకోవోయి విట్టలేశా ।
వీడుజోడునగవులవిట్టలేశా ।నీపై
వేడెవెట్టె మావలపు విట్టలేశా ॥వీదు॥

వెలసె నీమోవి గడువిట్టలేశా ।నీకు
వెలుపలే లోనయ్య విట్టలేశా
వెలలేనిమహిమలవిట్టలేశా ।పూవు –
విలుతునిఁగన్న తండ్రి విట్టలేశా । ॥వీదు॥

వెన్నెలతేటమాఁటలవిట్టలేశా ।నా–
విన్నపానకే కూడితి విట్టలేశా
వెన్నతో శ్రీవేంకటాద్రివిట్టలేశా ।నీవు
వెన్నుఁడవు వేయినామాలవిట్టలేశా ॥వీదు॥ **449**

ఉపోద్ఘాతము:

నేటి బళ్ళారి జిల్లా హోస్పేట తాలూకాలోని పండరంగములో వెలసిన విఠ్ఠల దేవునిపై చక్కటి సరసకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. విట్ఠలేశుని వూరేగింపు వీధుల వీధుల గుండా పోతున్నది. వేద అంటే వ్యధ లేక బాధ అని అర్థం. ఈ విట్ఠలేశుడు ఇక తనను నమ్మినవారి వ్యధలన్నీ తొలగిస్తాడు అంటున్నారు. ఆయన మాటలు వెన్నెల తేటవలె చల్లగా వుంటాయట. నా

విన్నపాన నన్ను కూడినావు. అనాదిగా నన్ను శ్రీవేంకటాద్రి విట్ఠలుడవై, వేయినామాలుగల వెన్నుడవై ఆర్తత్రాణపరాయణుడవైనావు తండ్రీ! అంటున్నారు. ఆయన వేడుక కాడు అని కీర్తిస్తున్నారు. ఆయనపై వనితలకు కలిగిన వలపు వేడెవెట్టాడుట. సరిగా అర్థం కావాలంటే... తప్పదు మరి.

తాత్పర్య వివరణ:

వీధి వీధిలోనూ వూరేగింపుగా వెళుతున్న ఓ విట్ఠలేశా! వట్టి (మమ్మల్ని చేగొని) ఇక మావేదలెల్లా (వేదనలనన్నియునూ) బాసె (వదలిపోయినవి).

ఓ విట్ఠలేశా! నువ్వు వేడుకకాడవైతివి (విలాసపురుషుడవైనావు). నీవు వీడెమందుకోవోయి (తాంబూలము స్వీకరించవయ్యా!) వీడుజోడు నగవుల (ఈడూజోడూ కుదిరిన ప్రేయసీప్రియుల ముసిముసి నవ్వుల వంటి చిరునవ్వులు చిందించే) విట్ఠలేశా! మా వలపు నీపై వేడెవెట్టితిమి (నీపై మా వలపులు చుట్టుముట్టినవి.) కాస్త కనికరించవయ్యా!

ఓ విట్ఠలేశా! నీ మోవి (అధరము) ఎఱ్ఱని రంగుతో కడువెలసె (మిక్కిలి ప్రకాశించినది). నీకు మేము బాహాటంగానే లొంగిపోయినాము. లెక్కించలేనన్ని మహిమలను ప్రదర్శించే ఓ విట్ఠలదేవా! నీవు పూవు విలుతుని (పుష్పబాణుడైన మన్మథుని) కన్నతండ్రివయ్యా!

ఓ విట్ఠలేశా! ఇక నీమాటలెటువంటివంటే అవి వెన్నెలతేటవంటివి. స్వామీ! నీవు నా విన్నపమును మన్నించి నన్ను కూడితివి. నీవు వెన్నతో (చిరుప్రాయమునుండే... అంటే... అనాదిగా శ్రీవేంకటాద్రి విట్ఠలేశుడవు. నీవు వెన్నుడవు (శ్రీకృష్ణుడవు). వేయినామాల దేవుడవు.

పద్యవివరణ:

ఆ.వె॥ **విట్ఠలేశుడేగె వీదుల వీదుల**
వేదలెల్లబాపె విట్ఠలుండు
వేయినామములట వెన్నతో నీకయ్యె
నీవు వేంకటాద్రి విట్ఠలుడవు.

సంఖ్య: IV/36 రాగం : గౌళ
కీర్తన : మొదలువేల్పు మామొఱయాలించవె

గౌళ

83 మొదలివేల్పు మా మొఱ యాలించవె
యెదుటఁ గావు మము నిదివో దేవా ॥పల్లవి॥

ధరపైఁ దపసులతపములు చెరిచెను
నిరతపుణ్యముల నీరుసేసె నదె
పరకామినులను భంగపెట్టె నదె
హిరణ్యకశిపుఁ డిదివో దేవా ॥మొద॥

మునులజడ లవిగో మోఁపులకొలఁదులు
ఇనచంద్రాదుల నెక్కువగెలిచెను
చనవరియింద్రునిస్వర్గము చేకొనె
యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా ॥మొద॥

పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను
బలిమినే ప్రహ్లాదుఁ బరచీని
యెలమిని శ్రీవేంకటేశ నీవలన
యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా. ॥మొద॥ **36**

ఉపోద్ఘాతము:

దనుజుడు హిరణ్యకశిపునిపై కవిత చెబుతున్నారు అన్నమయ్య. తొల్లి ఇటువంటి ప్రక్రియ జరిగివుంటుందని నేను భావించను. ఇది అన్నమయ్యలాంటి పదకవితాపితామహునికే చెల్లింది. మొదలి వేల్పు అంటే ఆదిదైవమన్నమాట. ఓ దేవా! ఇదివో మమ్ము ఎట్ట యెదుటునె రక్షించవయ్యా! మా మొఱలను ఆలకింపవయ్యా! అని నారసింహుని వేడుకొంటున్నారు. కానీ

కీర్తనకు కథానాయకుడు హిరణ్యకశిపుడు. ధరపై దపసులతపము చెరిచె నిరతపుణ్యములు నీరము సేసెనట. పరకామినులను భంగముసేసెనట. మునుల జడలను మోపులుగా కట్టాడట. సూర్యచంద్రులను కూడా గెలిచి బాధించాడట. ఇంద్రుని స్వర్గం లాక్కున్నాడట. ప్రహ్లాదుని నానా బాధలు పెట్టాడట. ఆదిదేవుడు ఇదిగో ఈ ఆఖరి తప్పుకి మాత్రం దండించకుండా వుంటాడా? నారసింహుడై చీల్చేశాడు.

తాత్పర్య వివరణ:

ఓ మొదలివేల్పు! (ఆదిదేవా!) మామొఱ యాలించవే (వినవయ్యా!) ఇదివో దేవా! మమ్ము యెదుట (నీ యెదుటనే) గావుము (రక్షించుము).

దేవా! ఇదివో హిరణ్యకశిపుడు ధరపై (భూలోకంలో) తపసుల (మునీంద్రుల) తపములను చెరచె (చెడగొట్టినాడు). నిరత పుణ్యముల (గొప్ప పుణ్యకార్యములను చేయువారిని నీరుసేసె (నీరుగార్చినాడు). పరకామినులను (పరస్త్రీలను) మానభంగము చేసినాడు.

ఆ హిరణ్యకశిపుడు అవిగో మునుల జడలను మోపులుగా కట్టి పకపక నవ్వుచున్నాడు. సూర్యచంద్రులను కూడా ఎక్కువగా గెలిచి వారి గమనాన్ని కూడా తన ఆధీనంలో పెట్టుకొన్నాడు. చనవరి (బంధువైన) ఇంద్రుని జయించి స్వర్గాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఓదేవా! అదిగో ఆ దనుజుడు పరమదుర్మార్గుడు.

ఆ హిరణ్యకశిపుడు అనేకమంది దిక్పాలురను వారి స్థానములనుండి బలవంతంగా పారద్రోలినాడు. హరి భక్తుడైన ప్రహ్లాదుని అనేక బాధలు పెట్టాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్ని అకృత్యాలు చేసిన వానిని నీవు సంహరించక తప్పదు కదా! ఆ విధంగా కశిపుడు చెడినాడు దేవా!

పద్యవివరణ:

తే.గీ॥ **మొదటి వేలుప! వినుము మా మొఱలనెల్ల**
యెదుట మముగావుమో దేవ! ఇదియె వినతి
వింటిమాతొల్లి? అసురుపై వింతకవిత?
సిరుల వేంకటేశుడె నారసింహుడంట!!

సంఖ్య: XX/385 రాగం : సాళంగనాట
కీర్తన : నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి

సాళంగనాట

84 నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి
పేరడిమహిమలను బెరసితివి ॥పల్లవి॥

మనసు రంజిల్లఁ జేసి మారుగొండ లెక్కివుండి
ననుపుసేసుకొంటివా నాయకునిని
చనవిచ్చి తొడమీఁద సరి నాతఁ డిడుకొంటే
పెనఁగి కూడితివమ్మ ప్రియురాలవు ॥నేరు॥

చేయిచాఁచి రాఁగిలించి చిత్తగించి మోము చూచి
ఆయము లంటితివా ఆతనిని
చాయలకు నాతఁడు చల్లనినవ్వు నవ్వితే
దాయపుమోవిచ్చితమ్మ తగుజాణవు ॥నేరు॥

శ్రీవేంకటాద్రి యిది శ్రీనరసింహదేవుని
ఆవటించి కూడితివా అవుభళానను
వోవరిగా నాతఁడు నిన్నురమునఁ బెట్టుకొంటే
భావించి మెచ్చితివమ్మ పంతపుటిందిరవు ॥నే॥ **385**

ఉపోద్ఘాతము:

శ్రీ నరసింహదేవుని దేవేరి అయిన ఆదిలక్ష్మిపై చక్కటి మధుర కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ నిజలక్ష్మి! నీవు మిక్కిలి నేర్పరివి తల్లీ! అంటున్నారు. పేరుగాంచిన మహిమలతో విలసిల్లినావమ్మా! అంటున్నారు. శ్రీ నరసింహుని మనస్సును రంజింపజేయుటకు ఆయన వెలసిన కొండ కెదురుకొండపై వెలసినావు. నీకు చనువు నిచ్చి తన తొడపైనిడుకొనినాడు నరసింహుడు. అవుభళాన తొడపైనిడుకొనినాడు గాని ఆ వేంకటాద్రిపై

తిరుమలరాయుడైన స్వామి, నిన్ను తన వురముపై నిడుకొనినాడమ్మా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

నిజలక్ష్మి! (ఆదిలక్ష్మి!) నీవు మిక్కిలి నేర్పరి (సమర్థురాలవు) అవుదువమ్మా! పేరడి మహిమల (పేరుగాంచిన మహిమాన్వితవై) బెరసితివి (విలసిల్లినావు) తల్లీ!

మనస్సు రంజిల్లజేసి (శ్రీహరి మనస్సుకు ఆనందము కలిగించుటకు) ఆయన నరసింహుడై వెలసిన కొండకు యెదురు కొండపైన వెలసినావు. ఆ విధముగా నాయకుడైన నరసింహుని ననుపుసేసుకొంటివి (అనురాగమూర్తిని చేసికొంటివి). నీ అనురాగమునకు తగినట్లే ఆయన నిన్ను తన యెడమ తొడపై నిడుకొనినాడు. నీవు ఆయన ప్రియురాలవు గనుక ఆయనను పెనగి (చుట్టుకొని) కూడితివి తల్లీ!

తల్లీ! నీవు చేయిచాచి రాగిలించి (రంజింపజేసి) ఆతనిని చిత్తగించి (ఆయన నరసింహుడా లేక శ్రీహరియా అని ఆలోచించి) మోము చూచి (ఆ వదనములో శ్రీహరిని గాంచి) సంతోషముతో) ఆయములంటితివి (ఆయనను అనురాగవశమున పెనవేసితివి). పైకి ఉగ్రరూపియైనను, చాయలకు (రేయి అయినంతనె) తన చల్లని వెన్నెలవంటి నవ్వులతో నిన్ను చూస్తే దాయపు మోవిచ్చితివమ్మా! (నీవు కట్నముగా మధురాధరము నిచ్చినావు తల్లీ!)

ఇది శ్రీవేంకటాద్రి ఇక్కడా మరియు అక్కడ అహోబలంలోనూ ఆయన శ్రీనరసింహుడైన పిదప, ఆవటించికూడితివి (పొందికగా ఏకమైతివి). ఓవరిగా (చంద్రశాలలో) ఆయన నీకు తన వురముపై స్థానము నొసగినాడు. నీవు పంతముగల ఇందిరాదేవివైనా, ఆయన భావమునంగీకరించి ఆయనను మెచ్చుకొన్నావు.

పద్యవివరణ:

కం॥ **నేరుపరివౌదువమ్మా**
నీరజవాసినివి తల్లి! నిజలక్ష్మివిగా
పేరడి మహిమల బెరసితి
వౌరా!! వో సిరులరాణి! అంబుజపాణీ!

సంఖ్య: IV/38 రాగం : లలిత
కీర్తన : ఇదియే సులభంబిందరికి

లలిత

85 ఇదియే సులభం బిందరికి
కదియఁగ వసమా కరుణనే కాక ॥పల్లవి॥

నగధరుండు పన్నగశయనుఁడు భూ-
గగనాంతరిక్షగాత్రుడు
అగణితుఁడితని నరసి తెలియఁగాఁ
దగు నా కనెడిది దాస్యమే కాక ॥ఇదియే॥

కమలజజనకుఁడు కామునిజనకుఁడు
కమలాసతిపతి ఘనగుణుఁడు
విమలుఁడీహరి వెదకి కానఁగను
అమరునా శరణాగతిఁగాక ॥ఇదియే॥

దేవుఁడు త్రిగునాతీతుఁ డనంతుఁడు
కైవల్యమొసఁగుఘనుఁడు
శ్రీవేంకటపతి జీవాంతరాత్ముఁడు
భావించవసమా భక్తినె కాక ॥ఇదియే॥

ఉపోద్ఘాతము:

ఇందరికీ ఇదియే సులభంబు అంటున్నారు అన్నమయ్య. ఏమిటది? ఈ శ్రీహరి కరుణను పొందుట. దానిని కదియగ వసమా? కరుణనే కాక అంటున్నారు. ఆయన కరుణను పొందాలంటే ఆయన కరుణించవలసినదే. ఆయన భక్తికి తప్ప మరొక విధముగా వశమవడు. భక్తుల శరణాగతి ఆయనను వారివైపు చూచునట్లు చేస్తుంది. శరణాగతితో ఆయనను

కీర్తించినవారికి ఆయన కృప త్వరగా కలుగుతుంది కాబట్టి ఆయన కరుణ పొందాలంటే దాస్యము శరణాగతి భక్తి చక్కటి రాజమార్గాలు. త్రిగుణాతీతుడైన శ్రీవేంకటేశుడై భక్త సులభుడయ్యాడు.

తాత్పర్య వివరణ:

ఇందరికి (దాస్యము ద్వారాగానీ, శరణాగతిద్వారాగానీ, భక్తిద్వారాగానీ పరమాత్మను పొందాలని కోరుకొనే వారందరికీ) సులభంబు (అతి సులువైన మార్గము) ఇదియే. భక్తియే అతి సులభమైనది. అది ఆయన కరుణవలన గాక ఇంకొక విధంగా కదియగవసమా? (పొందగలమా?)

స్వామి నగధరుడు (గోవర్ధన నగమును ధరించినవాడు.) ఆదిశేషుడనుపన్నగశయనుడు. భూమి గగనములే ఆయన శరీరముగా ఒప్పినవాడు. ఆయన పరిమితి ఇంత అని నమ్మకంగా ఎవ్వరూ చెప్పలేరు. ఆయనను కనుగొని తెలియాలంటే సులభోపాయము "దాస్యమే".

పద్మసంభవుడైన చతుర్ముఖ బ్రహ్మను కన్నతండ్రి ఈ శ్రీహరియే. మన్మధుని జనకుడు కూడా ఈయనే. కమలాసతియైన శ్రీమహాలక్ష్మి భర్త ఈ నారాయణుడే. గొప్ప సుగుణములు కల విష్ణువు ఇతడే. ఈ హరి (నృసింహరూపుడు) కరుణాంతరంగుడు. శోధించి ఈయన తత్త్వం తెలుసుకోండి. అప్పుడు ఈయనను శరణాగతితో ఆశ్రయించండి. ఆయన తప్పక కరుణిస్తాడు.

ఈ విష్ణుదేవుడు (సత్వ రజ స్తమోగుణములను, త్రిగుణములకు అతీతుడు). అనంతుడు అని ప్రసిద్ధి చెందినవాడు. కైవల్యము నొసగే ఘనుడు. శ్రీవేంకటేశ్వరుడు జీవులకు అంతరాత్ముడు. ఈయనను భక్తి లేకుండా భావించగలమా?

పద్యవివరణ:

కం॥ **ఇదియే సులభంబిందరి-**
కిదివో సత్యంబు వినుడు ఈ శ్రీహరినిన్
కదియగ వశమా ఏరికి
కొదనెరుగని అతని కరుణ కూడగ వలె, పో!

సంఖ్య: XX/384 రాగం : శ్రీరాగం
కీర్తన : చిత్తగించురమణుడ చేరి యెడమాటలేల

శ్రీరాగం

86 చిత్తగించు రమణుఁడ చేరి యెడమాటలేల
చిత్తరుపతిమను నీచిత్తము నా భాగ్యము ॥పల్లవి॥

చొప్పగునావలపు చూపిచెప్పరాదు నన్నుఁ
గప్పి కాఁగిలించుకొంటేఁ గానవచ్చీని
వుప్పతించ నే నేర వూరకుండఁగాఁ జెమట
చిప్పిలీ నా మేనను నీ చిత్తము నా భాగ్యము ॥చిత్త॥

అందికూడేతరితీపు అంతిం తనఁగరాదు
కందువ నీ వంటఁగానే కానవచ్చీని
మందలించ నే నేర మరిగి నే నుండఁగాను
చిందేటిజవ్వనిని నీ చిత్తము నా భాగ్యము ॥చిత్త॥

చొక్కిననావేడుకలు సూడిదిపట్టఁగరాదు
గక్కన నీ వెనసితేఁ గానవచ్చీని
వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ నే మెచ్చ నేర
చిక్కి నీకు నుండఁగా నీచిత్తము నా భాగ్యము ॥చిత్త॥

ఉపోద్ఘాతము:

ఎడమాటలు– అంటే నేటి భాషలో పుల్లవిరుపు మాటలు అన్నమాట. వేంకటరమణుడు తన దేవిపై అలిగినాడు. సంభాషణలు లేవు. ఒకవేళ వున్నా అంటీ ముట్టనట్లు వున్నవి. ఇక ఆమెగారే బ్రతిమిలాడుతున్నది. ఓ వల్లభా! నన్ను చేరి అలరించరాదా? నా విన్నపములను చిత్తగించరాదా? నేనికపై ఏమీ అననులేవయ్యా. చిత్రపటములో బొమ్మలాగా పలుకను

సరేనా? ఇంకా నీ అలుక తీరకపోతే నీ ఇష్టప్రకారమే చేయుము. ఇక నీ చిత్తము మా భాగ్యము. అన్నమయ్య అద్భుత సృష్టి, ఈ కీర్తన.

తాత్పర్య వివరణ:

ఓ రమణుడా! చిత్తగించు (నా విన్నపములనాలకింపుము.) చేరి నావద్దకు (చేరి నన్ను) అనునయించరాదా? ఈ ఎడమాటలేల (ఇటువంటి పుల్లవిరుపు మాటలతో నన్ను నొప్పించెదవేల?) నేను చిత్రపటమువలె పలుకను లేవయ్యా! నీ అలుక చాలింపుము ప్రభూ! ఇక నీ చిత్తము నా భాగ్యము.

అతిశయించి వలపు చూపి చెప్పకూడదా ప్రభూ! నన్ను గుచ్చి కౌగలించరాదా? అప్పుడన్నా నీకు నాపై యెంత ప్రేమవున్నదో తెలుస్తుంది. ఉప్పతించ నేనేర (నాకు ఓర్వలేనితనం లేదయ్యా!) ఊరకనే నాకు చెమటలు చిప్పిల్లినవి. నన్ను నమ్మితే నమ్ము లేకపోతే లేదు. నీ చిత్తము నా భాగ్యము.

నీ కూటమివలన కలిగిన తీపులు ఇంత అని చెప్పలేనయ్యా! నీవు అంటగానే (తాకిన వెంటనే) నా ప్రతిక్రియగా అది నీకు కానవచ్చీని. పోనీ నేను నిన్ను వలదని మందలించితినా చెప్పవయ్యా. నిన్నెన్నడూ పల్లెత్తుమాట అని యెరుగను. నా జవ్వనము (యౌవనమంతా) చిందిపోతున్నది. మరిగి నేనుండగా (తీవ్రమైన తాపముతో వున్న నన్ను) కరుణించమని విన్నపము. చెప్పేది చెప్పాను, ఇక నీ చిత్తము నా భాగ్యము, ప్రభూ!

పారవశ్యముతో నా సంతోషములో నన్నుండనీ. దానిని సూడివట్టగరాదు (విరోధించుట తగదు స్వామీ!) గక్కున నీవెనసితే (చటుక్కున నన్ను పొంది చూడు) నీకే తెలుస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ననుగ్రహించి ఎట్టకేలకు ఒక్కటైతివి. నాకు మెచ్చుకోవటం చేతకాదు. పైగా నీకు చిక్కి వుండగా నేను ముగ్ధను. ఆపైన నీ చిత్తము నా భాగ్యము.

పద్యవివరణ:

తే.గీ॥ **చిత్తగించుము యెడమాటలిత్తెరగున**
తగునె రమణుడ? చేరికై తగవులేల?
చిత్రప్రతిమను నిలిచెద చెప్పినటుల
నీదు చిత్తంబు నా భాగ్యమది నిజంబు.

సంఖ్య: IV/34 రాగం : భైరవి
కీర్తన : శరణమాతనికే సర్వభావాల

భైరవి

87 శరణ మాతనికే సర్వభావాల
యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు ॥పల్లవి॥

వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు
చొచ్చెటి త్రోవెఱఁగము సోదించి మీఁద
కుచ్చిన కర్మములతో గుదియై వేలుకాడేము
హెచ్చి మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెరుఁగు ॥శర॥

నన్ను నేనే యెఱఁగను నానాచందములను
అన్నిటా నాలోనున్నహరిఁ గానను
కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ
యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెరుఁగు ॥శర॥

మొదలు దెలియను ముంచి కొన దెలియను
చదువుచునున్నవాఁడ సర్వవేదాలు
హృదయములోనుండి యిటు నన్ను గావఁగ
యిదివో శ్రీవేంకటాద్రియీశ్వరుఁడే యెఱుఁగు ॥శర॥ 34

ఉపోద్ఘాతము:

ఈశ్వరా! మా బ్రతుకుత్రోవలో అడుగడుగునా నీకృప వుండవలసిందే. మేము ఏ త్రోవలోనుంచి వచ్చి, మా కన్నతల్లి కడుపులో దూరినామో తెలియదు. కానీ కుచ్చితమైన కర్మలనేకము చేసి అవే గుదిబండలా తయారైవేలాడుతున్నాము. మమ్మల్ని రక్షించుటకు మరెవ్వరునూ లేరు. సర్వభావాలూ కూడుకొనగా (త్రికరణశుద్ధిగా) ఆయనకే శరణంటిమి. ఆయనే మమ్ము రక్షించుటెలాగుననో యెఱుగును, అంటున్నారు అన్నమయ్య. ఇక అమ్మ కడుపులోనుంచి బయటపడ్డాక జీవంతో వున్నాము కానీ జీవించుట తెలియదు కదా! అంతిమ క్షణాలలో

ఏమవుతుందో తెలియునా? వేదములన్నీ చదివాను కానీ లాభమేమిటి? నా యెదలోనే వున్న వేంకటేశ్వరుడే నన్ను గావనెరుగును, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ మానవులారా! సర్వభావాలతోటి (త్రికరణశుద్ధిగా) యిరవై మమ్ము రక్షించ (సుస్థిరుడవై మమ్ములన్ని కాపాడుటకు,) శరణమాతనికి (ఆ సర్వేశ్వరునకు శరణుజొచ్చితిమి). ఎట్లు నిర్వహిస్తాడో ఆ ఈశ్వరుడే యెఱుగును (తెలియగలడు).

ఇక మేము మా అజ్ఞానం గురించి చెప్పేదేముంది? వచ్చిన త్రోవెఱగము (మా కన్న తల్లి గర్భములోనికి ఏ త్రోవనుండి వచ్చామో తెలియదు). అంతకు పూర్వం ఏ జన్మలో చొచ్చితిమో యెఱుగము. ఎంత సోధించినా ప్రయోజనం లేదు. కుచ్చిన కర్మములతో (కుచ్చితమైన పాపకర్మము)లనేకం చేసి, గుదియై వేలుకాడేము (గుదిబండయై వ్రేలాడగా) బ్రతుకుతున్నాము. మా బ్రతుకు త్రోవ ఆ ఈశ్వరుడే యెఱుగును.

ఇక నా యెఱుక (జ్ఞానం) ఎంతటిదో చెప్పాలంటే సిగ్గు వేస్తున్నది. నన్ను నేనే ఎఱుగను. నానా చందాల (అనేక రకములైన భ్రమలలోనూ భ్రాంతులలోనూ బ్రతుకుతుంటాను). అన్ని విధములా నాకు తోడుగా నాలోనే అంతర్యామిగా వున్న శ్రీహరిని కాంచలేకున్నాను. ఆయన ఇచ్చిన మంచి కాయముతో (ఆరోగ్యవంతమైన శరీరంతో) కన్నులతో చూస్తూ జ్ఞానమును పొందుతున్నాను. కనీసం ఇదంతా యెట్లా జరుగుతున్నదో నేనెఱుగుదునా? లేదండీ, ఆ ఈశ్వరుడే యెఱుగును.

మొదలు తెలియను (నా శైశవదశనెఱుగను). కొన తెలియను (ఎలా మరణిస్తానో చెప్పలేను). కాకపోతే వేదములనన్నింటినీ చదివి వడపోశాను. అయినా నన్ను నేను రక్షించుకొనే పరిస్థితి లేదు. ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుని శరణన్నాను. ఆయన నా హృదయంలోనేవుండి నన్ను రక్షిస్తున్నాడు. అదెట్లాగో ఆయనే యెఱుగును.

పద్యవివరణ:

కం॥ **శరణం బాతనికే పో!**
పరగగ గొల్చెదను సర్వభావంబులతో
యిరవై మము రక్షింపగ
పరదైవం బీశ్వరుండె బాగుగ తెలియున్.

సంఖ్య: XX/417 రాగం : పాడి
కీర్తన : ఎప్పుడును నాకు లోనైయేరాకృష్ణా

పాడి

88 ఎప్పుడును నాకు లోనె(నై?) యేరా కృష్ణా
చెప్పేవు ప్రియ మప్పుడే చెలువపుఁగృష్ణా ॥పల్లవి॥

చన్నుల నొరసితిని సాదించేననుచు నిన్ను
వెన్నలేల దొంగిలేవు వేసాలకృష్ణా
కన్నుల జంకించితిని కాఁగిటఁ బట్టేనని
పన్ననేల మాయ లింత బాలకృష్ణా ॥ఎప్పు॥

మాటల నిన్నొరసితి మంతనానకు రమ్మని
చాటేవేల సరసాలు జంగిలికృష్ణా
యీటుతోనే నవ్వితిని యిద్దర మొక్కటేయని
వోటమి నీ కెందూ లేదు వున్నతపుకృష్ణా ॥ఎప్పు॥

కూడితి కాఁగిట నిన్ను గురుతులు నించి నించి
జాడలు దప్పకుమీ జాణకృష్ణా
వీడె మిచ్చితిని శ్రీవేంకటాద్రిపయి నీకు
వాడికలు మనసొమ్ము వన్నెల వోకృష్ణా ॥ఎప్పు॥ **417**

ఉపోద్ఘాతము:

శ్రీకృష్ణునిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఒక గోపిక ఈ కీర్తన పాడుతున్నదని భావించాలి. ఓ కృష్ణా! నీవెప్పుడూ నాకు లోనైయే వుంటావు. ఇంత అందగాడు ఈ కృష్ణుడు అనుకున్నా నీకున్న దురలవాటు ప్రియవచనములు అప్పటికప్పుడు చెప్పటమే. నీతో కొద్దిగా మాట్లాడితే చాలు ఆడవాళ్ళని మంతనానికి పిలుస్తావు. నీవు జంగిలి కృష్ణుడివి. నాతో

ఆడిన మంతనాలను నలుగురికి చాటుతావు. నీవు ఇన్ని చేసినా ఈటుతోనే (వేడుకతోనే) మనమిద్దరమూ ఒక్కటేనని నమ్మి నిన్ను చూచి నవ్వినాను. నీవు అసాధ్యుడివి. నీకెందునూ ఓటమిలేదు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ కృష్ణా! నీవు నాకు ఎప్పుడూ లోనైయే వుంటావు. కానీ నీతో వచ్చిన చిక్కేమిటంటే నీవెంత చెలువపు (అందమైన)వాడవో, నీ శుష్కప్రియ వచనములు అప్పటికప్పుడే చెప్పే ప్రియవచనములు మాత్రమే.

నన్ను సాధించాలని నాస్తనగిరులను నొక్కెదవు. నిన్నేమన్నాము? వెన్నలేలదొంగిలించేవన్నాము. నీవు వేసాలమారి కృష్ణుడవు. నన్ను కౌగిట పట్టేవని కన్నులతో జంకించితిని (బెదరించితిని). బాల కృష్ణా! నాపై ఇంత మాయాజాలం పన్ననేల?

ఓ కృష్ణా! నీతో కొద్దిగా మాట్లాడితే చాలును, ఆడవాళ్ళని మంతనానికి (ఒప్పందాలకు) రమ్మంటావు. నీవు జంగిలి కృష్ణుడవు (మొరటువాడైన గొల్లడివి). లేకుంటే ఎవరన్నా తమప్రియురాలితో ఆడిన సరసాలను బాహాటంగా చాటుకొంటారా? మనిద్దరమూ ఒక్కటేనని ఈటుతోనె (వేడుకతోనే) నమ్మి, నిన్ను చూచి నవ్వినాను. నీవు అసాధ్యుడివయ్యా కృష్ణా! నీకెందునూ ఓటమిలేదు. ఓ కృష్ణా! నీవు ఉన్నతుడవు.

కృష్ణా! నిన్ను కౌగిట కూడితిని. అదే నేను చేసిన నేరమాయేమి? నాపై నీ గుఱుతులు నించినించి నలుగురికీ తెలిసేట్లు చేశావు. నీవు జాణతనం నేర్చిన టక్కరి కృష్ణుడవు. నేడు జాడలు తప్పకుమీ (నేడు జాడ తెలియకుండా మాయమై పోవద్దు.) నీకు గుర్తువున్నదా? శ్రీవేంకటాద్రిపైన నీకు నేను వీడెము (తాంబూలము) నిచ్చాను. ఓ వన్నెలు చూపే శ్రీకృష్ణా! నేను నీకు వాడిక సొత్తును.

పద్యవివరణ:

కం॥ **ఎప్పుడును నాకులోనై**
చెప్పేవురప్రియములెల్ల చెలువపు కృష్ణా!
అప్పటికప్పుడు మరతువు
ఇప్పట్టున వేంకటాద్రి ఇరవగు కృష్ణా!

సంఖ్య: IV/5 రాగం : వసంతవరాళి
కీర్తన : ఏమందు మిందుకు నెఱిగినదే తొల్లి

వసంతవరాళి

89 ఏమందు మిందుకు నెఱిఁగినదే తొల్లి
శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి ॥పల్లవి॥

వొక మానఁజేఁదూ వొక మానఁ దీపూ
కకిపికలై రెండూఁ గలవే తొల్లి
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము
సకలానఁ గలుగుట సహజమే తొల్లి ॥ఏమం॥

పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి
నిగిడి లోకములను నిజమే తొల్లి
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకుఁ గీడు
తగిలి నొసలివ్రాఁత తప్పదిది తొల్లి ॥ఏమం॥

వెన్నెలలు చంద్రునందు వెడ యెండ సూర్యునందు
కన్నుల లోకమువారు గన్నదే తొల్లి
యెన్నఁగ శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవు
వున్నవారు నీకింద నున్నవారు తొల్లి ॥ఏమం॥ **5**

ఉపోద్ఘాతము:

ఓ ప్రభూ! నీవు శ్రీమాధవుడవు. తొల్లి (అనాదిగా) నీవు సేసిన విడ్డూరములే అన్నియును. తొల్లింటినుండి ఈ కథలన్నీ మేమెరిగినవే. ఇందుకు మేము నిన్నేమనగలమయ్యా? నీవు చేసే విచిత్రాలు అసంఖ్యాకములు కదా? ఒక చెట్టు చేదు ఫలాలనిస్తే, ఒక చెట్టు మధురఫలాలనిస్తున్నది. ఒక పక్షికి కాకిలాంటి కర్కశకంఠాన్నిస్తే ఇంకొకదానికి కోయిలలాంటి మధుర గాత్రమిచ్చావు. ఒకడిని జ్ఞానిని చేసి

ఇంకొకడిని అజ్ఞానిగానే వుంచావు. అనాదిగా ఇదంతా నీ సృష్టిలో వున్నదే. ఇదంతా నీకు సహజమే అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఇందుకు (ఈ సృష్టివైచిత్రికి) ఏమందుమయ్యా (ఏమి చెప్పగలము?) తొల్లి (అనాదిగా) ఇదంతా మేమెరిగినదే కదా! శ్రీ మాధవుడా! ఇదంతా పూర్వము నీవు చేసిన విచిత్రమే ప్రభూ!

చెట్ల విషయమే పరిశీలిద్దాము. ఒక చెట్టు చేదు పండ్లనిస్తుంది. ఇంకొక చెట్టు మధురఫలాలను ఇస్తుంది. తొల్లి (అనాదిగా) కాకము పికము అనే రెండు పక్షులూ వున్నాయి. ఒకటి కర్ణకఠోరంగా కా, కా అంటుంది. ఇంకొకటి మధురంగా కుహూకుహూమంటుంది. మానవుల్లోనూ ఒకడు అజ్ఞాని అయితే ఇంకొకడు గొప్పజ్ఞాని అవుతున్నాడు. సృష్టిలో ఇదిట్లా జరుగుట సహజమే. అనాదిగా ఇదంతా ఈశ్వరుని లీల.

అనాదిగా సృష్టిలో చతుర్దశ భువనాలు వున్నాయి. వీటిల్లో పగటిపూట వెలుతురు, రాత్రిపూట చీకటి వ్యాపించి వుంటాయి. అనాదిగా ఇది జరుగుచున్న దిన చక్రమే. సురులకు మంచి జరుగుతుంది. దైత్యులకు కీడు తప్పదు. తొల్లింటినుండి ఇదే జరిగింది. నుదుటన్ వ్రాసిన వ్రాత తప్పదు కదా! నూరేండ్లు చింతించినన్ అన్నారు పెద్దలు. ఎందుకంటే ఈశ్వరుని ఆజ్ఞ అటువంటిది.

రాత్రివేళల్లో చంద్రుడు వెన్నెలనిస్తాడు. సూర్యుడు పగటివేళ తాపము కలిగించే ఎండను ఇస్తాడు. అనాదిగా లోకములో వారంతా కనులతో చూసినది ఇదే. ఓ శ్రీవేంకటేశ్వరా! అనాదిగా ఈ సృష్టిలో ఏలికవు నీవే. నీవు వైకుంఠంలో వుంటే నీ దాసులై నీకిందవున్నవారు ఈ మిగిలిన వారంతా.

పద్యవివరణ:

కం॥ **ఏమందుమయ్య యిందుకు?**
మేమందర మెరిగినాము మీ కతలెల్లన్
శ్రీమాధవుడవునీవే
ఈమాదిరి సేసినదిదియె యేపుగ తొల్లిన్.

సంఖ్య: XX/386 రాగం : పాడి
కీర్తన : అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య

పాడి

90 అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య
చెంది యీపెతోడ నేము చెప్పకుండేమా ॥పల్లవి॥

పైపై యీపెకు నిట్టె బత్తులెల్లఁ జేసేవు
చూపులఁ దప్పక ఆపెఁ జూడవా నీవు
యీపొద్దే అన్నియును బయటవేయరాదుగాక
తీపునీగుణా లందరుఁ దెలియనివా ॥అందు॥

వంకలొత్తి యీపెతోను వట్టిబాసలు సేసేవు
అంకెమాట లాపెతోడ నాడవా తొల్లి
బింకాన మీలో వాదులుపెట్ట దోసమనికాక
ఇంకా మామరఁగువాఁడ వెఱఁగవా నీవు ॥అందు॥

ఇట్టె కాఁగిలించి యీపె నిక్కువకుఁ దీసేవు
గట్టున నిట్లా నాపెఁ గూడవా ముందు
నట్టనడుమఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ
రట్టు నిన్నుఁ జేసేనా నెట్టుకొనెఁ బనులు ॥అందు॥ 386

ఉపోద్ఘాతము:

అందులో ఏమితప్పుందిలే. అట్లాగే కానీలే-కానీవయ్యా! కాకపోతే మేము ఆమెకు చెందిన వారము. మేము చూస్తున్న నీ లీలల గురించి ఆమెకు చెప్పకుండా ఎట్లా వుంటాము? అంటున్నారు దేవి చెలికత్తెలు. ఇదంతా మాదేవికి తెలీదయ్యా. నీవు చూపే బత్తి నిజమే అనుకొంటున్నదామె. నీగుణము మేమెరుగుదుము. ఈ పొద్దున అవన్నీ బయటపెట్టమంటావా? నీవీమెను చూస్తున్నట్లు నటిస్తూ ఆ నెలతను చూస్తున్నావు. ఇది నీకు తగునా?

తాత్పర్య వివరణ:

ఓ ప్రభూ! అందులో ఏమి దోసము (తప్పు) వున్నది లేవయ్యా! అట్లాగే కానీలే. కానీవయ్యా! మేము ఆమె చెలికత్తెలము. ఆమెకు చెంది, ఆమెతో నీ వ్యవహారం చెప్పకుండా వుంటామా?

నీవేమో ఆమెకు ఆమెపై నీకు బత్తి (భక్తి) వున్నదని మాయమాటలు చెప్పి నమ్మించాలని చూస్తావు. "ఆమె"ను తప్పక చూడకుందువా నీవు? కాని ఈమె మాదేవి నిన్ను నమ్మినది. ఈనాడే నీ వ్యవహారమంతా మేము బయటపెట్టవద్దని మిన్నకున్నాము. తీపు (బాధించే) నీ గుణములు మేమెరిగినవేలే. కానీ అమాయకురాలు మాదేవి నిన్ను నమ్మినది.

వంకలొత్తి (ఆమె పెట్టేవంకలన్నింటికీ తగిన సమాధానాలు చెప్పి) ఆమెతో అనేకమైన వట్టిబాసలు (వుత్తుత్తి వాగ్ధానాలు చేస్తావు). తొల్లి (అనాదికాలంలో) నీ వాదినారాయణుడవై ఆపెతోడు (ఆ శ్రీలక్ష్మితో) అంకెమాటలాడవా (శుష్కవచనములను చెప్పలేదా?) ఆలోచించు. మా పట్టుదలకోసం మీలో మీకు తగవులు పెట్టుటయెందుకని దోసమని చూస్తున్నాము. ఇంకా మా మరగుననున్నవాడవా? మేమెరుగమా యేమి?

ఇక ఈపె గురించి (ఈ పద్మావతి వైపునుండి చూస్తే) ఇట్టె కౌగలించి ఈపెను ఇక్కువకు దీసేవు. నీవు కావాలనుకొన్న చోటికి ఈమెను రప్పించుకొనేవు. ముందు (తొలినాళ్ళలో) నీవు గుట్టుగా (రహస్యంగా) ఆ సాగరకన్యను కూడినావు కదా? నట్టనడుమ నన్ను సైతము కూడినావు కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నెట్టుకొనేపనులను (చెలరేగే వ్యవహారాలు) ఎన్ని చేసినా నిన్ను రట్టుచేయగలమా?

పద్యవివరణ:

ఆ.వె॥ **అందుకేమిదోసమట్టెకానీవయ్య**
చెందియాపెతోడ చెప్పకుండ
యెట్టులుండగలము యీనీపనులనెల్ల
వేంకటాద్రి రసికవిటుడవాయె

సంఖ్య: IV/9 రాగం : ముఖారి
కీర్తన : గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు

ముఖారి

91 గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు
పరమపద మొక్కటే ఫలమింతే కాక ॥పల్లవి॥

పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు
దాఁప నవి నిమిషమాత్రములేకాక
లోపలేడ వెలియాడ లోకులకింతేకాక
మోపినదంతా యేకముఖమేకాక ॥గరి॥

రాతిరేది పగలేది రమించు సాత్వికులకు
యీతల నింతా వెలుఁగింతేకాక
ఘాతలఁ గర్మాకర్మగతులు యీసంది వింతే
పోతరించి యెక్కనెక్కఁ బొడవేకాక ॥గరి॥

చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని
వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు
జంతువుల పురుఁడులు జడులకింతేకాక
వింతవింతసుద్దులేల విభవమేకాక ॥గరి॥

ఉపోద్ఘాతము:

ఓ కమలనయనా! నీమహిమలంటే నీదాసులమైన మాకు భయమెందుకయ్యా? నీ దాస్యమువలన చెడినవారెవ్వరూ లేరు. నీదాసులైన వారికి పరమపదమొక్కటే ఫలప్రదమైన లబ్ధి. ఇంతేకాక ఇక గమ్యమే లేదు అంటున్నారు అన్నమయ్య. ఇంత సీదాసాదాగా కనిపించే ఈ కీర్తన వివరించబూనుకొంటే నారాయణుని 'గరిమ' లాగా నన్ను అయోమయంలో పడేసింది. మోపినదంతా ఏకముఖమే అంటే యేమిటి? పోతరించి యెక్కనెక్క బొడవేకాక అంటే ఎలా వివరించాలి? వింతవింత సుద్దులేల విభవమే కాక–

అంటే అర్థమేమిటి? ఈ కీర్తనలో ఇంత తిరకాసువున్నది. నా ప్రయత్నం నేనూ చేస్తాను, ఆపైన భారం మా కొండలరాయడిదే.

తాత్పర్య వివరణ:

కమలాక్షుడైన శ్రీహరిదాసులకు గరిమతో ఆయన మహిమలంటే వెరపేల (భయమెందుకు?) వారి గమ్యము వారు ఆశించే ఫలమూ ఆ పరమపదమొక్కటే. ఇంతేకాక మరేమియూ వారు కోరరు.

ప్రపన్నాధికారులకు (శ్రీహరి శరణాగతిని పొందినవారికి) పాపమెంతటిది? పుణ్యమెంతటిది? అవి వారి దాపవగలిగినది కేవలము ఒక్క నిమేషమాత్రమే సుమా! అదే లోకపు తాపత్రయం గల వారికి ఈ అంతఃశ్శుద్ధి బాహ్యశుద్ధి అంటూ వుండవు. వీరికి చిగురించినదంతా ఏకముఖమే. వారికి ప్రపత్తి అంటే పట్టదు.

సాత్విక బుద్ధికల హరిదాసులకు రాత్రీపగలు అంటూ విచక్షణ వుండదు. వారెప్పుడూ శ్రీహరియందు రమించుచునే (తాదాత్మ్యము చెందుతూనే) వుంటారు. వారి ఇటువైపంతా దివ్యతేజస్సుతో కూడిన వెలుగు మాత్రమే తోస్తుంది. ఇక పోతే కర్మలను అకర్మలను చేస్తూ పోతరించి (మదించి) అతిశయించి వున్నవారికి, సాత్త్వికుల మాదిరిగా పరమపదము లభించే అవకాశం యేనాటికీ వుండదు.

శ్రీవేంకటేశ్వరునకు భృత్యులయిన వైష్ణవులు ఆయననే త్రికరణశుద్ధిగా నమ్మియున్నారు. వారికి యే చింతా వుండదు. ఏ సిలుగూ (ఉపద్రవమూ) రాదు. ఇకపోతే జడులైన (మూర్ఖశిఖామణులైన) నాస్తికులుంటారు. వారికి మాత్రం జంతువుల పురుడులు (జన్మలు) తప్పవు. ఎందుకంటే వారికి వైభవం మీదవున్న కాంక్ష తప్పించి శ్రీహరి వింత వింత కథలతో పనియే లేదు.

పద్యవివరణ:

తే.గీ॥ **గరిమతో వెరపేలరా? కమలనయన!**
పరమపదమొక్కటేకాక ఫలము కలదె?
వేంకటేశుని భృత్యులు వెరపులేక
నమ్మినట్టి వైష్ణవులౌట నెమ్మిమనిరి.

సంఖ్య: XXIV/191 రాగం : నాదరామక్రియ
కీర్తన : పొలతిదేహమే భూమండలమై

నాదరామక్రియ

92 పొలఁతిదేహమే భూమండలమై
కలకాలంబునుఁ గాణాచాయ ॥పల్లవి॥

కొమ్మకుచంబులకులపర్వతములు
నెమ్మదిఁ గలుగఁగ నేఁ డిదివో
పమ్మిన జవ్వనభారము మోపఁగ
తమ్మివదన కాధారంబాయ ॥పొలఁ॥

కాంతగమనముల ఘనదిగ్గజములు
కంతునిబలమై కలుగఁగను
పంతమున పిఱుఁదుభారము మోవఁగ
యింతినటనలకు నిది గతియాయ ॥పొలఁ॥

చెలియారనియెడి శేషుఁడు గలుగఁగ
అలతురుముభార మానె నిదె
వెలయఁ గూడె శ్రీవేంకటపతి యా-
కలికిని యిదియే కడుఁగతలాయ ॥పొలఁ॥ **191**

ఉపోద్ఘాతము:

ఇది ఒక విశిష్టమైన శృంగారకీర్తన. ఈ సౌందర్యవతి దేమము భూమండలమువలె ఎల్లప్పుడూ సిరులకు ఆటపట్టై ఒప్పుచున్నది అంటున్నారు అన్నమయ్య. ఈమె చనుగవ కులపర్వతములను బోలినెమ్మది కలిగించుచున్నవి. ఆ యవ్వనభారము భరించుటకు ఆ పద్మముఖికి అవే ఆధారమైనవి. గొప్ప దిగ్గజములనడకగల ఆ గజగామిని

మన్మథుని బలముమూర్తీభవించిన దానివలెనున్నది. ఆమె నితంబముల భారమైన కదలిక నాట్యాచార్యుని నాట్యగరిమను స్ఫురింపజేయుచున్నది. ఆమె తురుము ఆదిశేషుని స్ఫురింపజేయుచున్నది, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఆ పొలతి (వనిత) దేహమే భూమండలమై భాసిల్లినది. కలకాలమూ అది సిరులకు కాణాచి (ఆటపట్టు) అయినది. (ఎందుకంటే ఆమె సిరులరాణి కదా!)

ఈ కొమ్మ (కోమలాంగి) కుచంబులు కులపర్వతములు. (స్తనములు కులపర్వతములవలె సమున్నతమైనవి). నేడు ఆమె ప్రశాంత చిత్తయైయున్నది. పమ్మిన (అతిశయించిన) యౌవన భారములను మోయుటకు, ఆ తమ్మి వదనకు (పద్మముఖికి) ఆధారమైనది.

ఆ కాంతయొక్క గమనము (నడక) గజగమనము. అది ఘనమైన దిగ్గజముల నడకను తలపించును. మన్మథుని బలమువలె అతిశయించి ఆ దిగ్గజములు మిక్కిలి బలమైనవిగా తోచినవి. ఆమె ఘనమైన నితంబముల భారము మోయుటకు ఆ ఇంతి నడక లావణ్యమునకు ఇదె (ఈ నితంబుల కదలికయే) గతియాయ (ఆధారమైనది).

ఆ చెలియొక్క వేణీ భారమనెడి ఆదిశేషుడు కలిగినందున ఆమె తురుము (కొప్పు) అతిభారమై కొద్దిగా తల వెనుకకు వంచినది. ఇంత ముగ్ధమోహన అయిన ఈ అతివను శ్రీవేంకటేశ్వరుడు కూడక వదిలేనా? ఆయన కూటమి ఎన్నో శృంగారగాధలకు ఆలంబనమైనది.

పద్యవివరణ:

ఆ.వె॥ **పొలతి దేహమదియె భూమండలంబాయె**
అన్నికాలములలొ ఆటపట్టు-
ఆయె సిరులకెల్ల, అలరువేంకటపతి
కలికిగూడ వచ్చె కౌతుకమున.

సంఖ్య: IV/44 రాగం : గౌళ
కీర్తన : హరి నీవాడనే కానా ఆదికాలమున నేను

గౌళ

93 హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను
గరిమ నీ మాయలోనే కలగంటిఁగాక ॥పల్లవి॥

యీమేనే కాదా హేయమెల్లా మోచినది
ఆమీఁదఁ బుణ్యతీర్థము లాడీఁగాక
కామించి యీరెంటిసంగాతంబు నేఁ జేసి
గామిడినై యెందువాఁడాఁ గానైతిఁగాక ॥హరి॥

చిత్త మిదేకాదా చింతించెఁ బాపాలు దొల్లి
పొత్తుల పుణ్యాలు దలపోసీఁగాక
రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపురొంపిలోనికంబ మైతిఁగాక ॥హరి॥

యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది
తానకపువేదములు తడవీఁగాక
వూనిన శ్రీవేంకటేశ వొంటి నీకు శరణని
తోనే యా రెండుఁ గడచి తుద కెక్కేఁగాక ॥హరి॥ 44

ఉపోద్ఘాతము:

ఓ శ్రీహరీ! మేము ఆదికాలము నుండియూ నీవారమే. మధ్యలో నీవు కల్పించిన మాయవలన కలగన్నట్లు ఏవేవో కర్మలు చేసి నిరంతరం వాటి ఫలితములననుభవిస్తూనేవున్నాము, మమ్మల్ని ఉద్ధరించగలిగింది నీవు గాక మరెవ్వరున్నారు అంటున్నారు అన్నమయ్య. అనాదిగా నా జీవుడు జన్మలను పొందుతూనే వున్నాడు. ఆనాటినుంచీ నేను నీవాడనుకానా? మధ్యలో నీ మాయవల్ల కలగంటిని. దానివల్ల నాకు ఆ కలలో జరిగినట్లు అనిపించినవేవీ

గుర్తువుండవు. నా జన్మల వ్యవహారమూ అంతే. నాకు ఒక్కటీ గుర్తు లేదు. ఇన్ని జన్మల తరువాత నేటికి శ్రీవేంకటేశ్వరుడవైన నీ కృపగలిగి సంచితప్రారబ్ధ కర్మములను గడచి మోక్షమార్గము బట్టితని, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! నేను ఆదికాలమున (అనాదిగా) నీవాడను కానా (నీవాడనేనయ్యా!) గరిమ (ఈ మధ్యలో) నీమాయకు లోనై కలగంటిగాక! (కలలోవలె పూర్వపు సంగతులన్నీ మఱచిపోయాను).

ఈ నాహేయమైన (మాలిన్యబంధురమైన) మేను (శరీరమును) మోచినది నా జీవుడే. మానసికమైన మాలిన్యములు తేలికగా వదలవు. దానికోసం అనేక పుణ్యతీర్థాలలో స్నానములాచరించాను. ఇది నేను తెలియక చేసినది కాదు. కావాలని చేసినదే. ఈ రెండు సంగాతంబులు (కర్మములు) నేనే చేశాను. కావున గామిడినై (ఘనుడనై) ఎందువాడనుగానైతి (ఎవరికీ చెందక మళ్ళీ జన్మనెత్తాను).

తొల్లి (నా పూర్వజన్మలలో) పాపపు ఆలోచనలు చేసింది ఈ నా చిత్తమే. వాటితోపాటే కొన్ని పుణ్యపు ఆలోచనలనుకూడా చేసింది నా చిత్తము. అనవసరంగా ఈ రెండు రకములైన ఆలోచనలలో చిక్కుకుపోయింది నా చిత్తము. కత్తరపు రొంపిలో కంబమైతినిగాక (అనేక తీరుతెన్నులుగల బురదలో నిలబెట్టిన స్తంభమువలె నుంటిని).

ఈ నా నాలుక పనీపాటాలేనిది. ఇంతకాలం ఇది అనేకమందిని పొగడి పొగడి అలసిపోయింది. అట్లాగే వేదము నేర్చినందున అప్పుడప్పుడూ వేదమునూ వల్లెవేసింది. ఊనిన (పొందిన) శ్రీవేంకటేశ్వరా! నేను ఒంటరివాడనై నిన్ను శరణు అన్నాను, దానివలన ఇటు ధనాపేక్షగానూ, ఇటు జ్ఞానాపేక్షను, రెంటినీ త్యజించి తుదకెక్కితిని (మోక్షగామినయ్యాను).

పద్యవివరణ:

కం॥ **హరి నీవారమె తొల్లియు**
గరిమల నీమాయవల్ల కలగంటిమి పో
శరణని వేంకటరమణా
వరముగ తుదికెక్కువాడ వనరుహ నయనా!

సంఖ్య: XXIV/171 రాగం : సామంతం
కీర్తన : నయగారిసటకాడ నారసింహా నీ-

సామంతం

94 నయగారిసటకాఁడ నారసింహా నీ-
ప్రియమెల్లాఁ గంటి వింటి పెనునారసింహా ॥పల్లవి॥

వేరేమారురూపై వెలసే వింతిమాటున
చేరి యేమిసేసితివో శ్రీ నారసింహా
సారె నోరు దెరచేవు సతితమ్ములము నీకుఁ
గారమై తోఁచెనోకాక ఘననారసింహా ॥నయ॥

తీగెనవ్వు నవ్వేవు తెరవ నీమర్మమెత్తి
చేగదేర నేమనెనో శ్రీనారసింహా
వేగమే చెమరించేవు వెలఁదిదగ్గరనుండి
యేగతిఁ గళలంటెనో యిటు నారసింహా ॥నయ॥

అంతలోనే బుసకొట్టే వంగనకాఁగిట నీవు
చెంత నెట్టు గూడితివో శ్రీనారసింహా
దొంతిగా శ్రీవేంకటాద్రిఁ దొడ నిఁ(నిం)తిఁ బెట్టుకొంటి
పంతమిచ్చితి అవుభళనారసింహా ॥నయ॥ **171**

ఉపోద్ఘాతము:

నయగారి అంటే మృదుత్వంకలవాడని అర్థం. సటకారి అంటే మాయలమారివాడు అని అర్థం. ఈ అహోబలనారసింహుడు క్రూర స్వభావుడనుకొంటే పెద్దపొరబాటే. ఈయన మృదువైనవాడు. అంతేకాదు దనుజాంతకుడైన శ్రీహరి కాబట్టి గొప్ప మాయలమారికూడాను. అహోబలమున నెలకొన్న ఓ పెనునారసింహా! నీ ప్రియమెల్లా శ్రీలక్ష్మికిచ్చి ఆమెకు నీతొడపై స్థానమిచ్చినావని వింటిమి. నేడు మాకనులారగంటిమి,

అంటున్నారు అన్నమయ్య. నాటి అహోబలనరకేసరియే నేటి శృంగార రాయడు శ్రీవేంకటేశ్వరుడు. ఈ శృంగార వైభవం ఈనాటిదికాదు, ఆనాటిదే.

తాత్పర్య వివరణ:

నయగారివి (మృదుస్వభావం కలవాడు) సటకారి (మాయలమారి అయినవాడు) నీవేనయ్యా! అహోబల నారసింహా! ఈ శ్రీలక్ష్మిపై నీకుగల వలపు గురించి పెక్కు కథలను వింటిమి. నీ లీలలను కంటిమి.

ఈ ఇంతి నీ దగ్గర మాటతీసుకొన్నది. నామనోవల్లభుడైన శ్రీహరిని ఈ ఉగ్రసింహంవలె చూడలేను నా కంటికి ఇందీవరశ్యాముడైన శ్రీహరిగానే కనుపించు ప్రభూ! అని ఆమె కోరినది. మరి నీవేం చేశావో ఆమె నిన్ను వీడలేకున్నది. నీవు నీ నోరు కొద్దిగా తెరచి ఆమెను చూస్తుంటే ఆమె చేతి తాంబూలముపై మనసుగొంటివనిపిస్తున్నది.

ఓ నారసింహా! నీవు నవ్వుతుంటే నీనోటినుండి లాలాజలము తీగెలమాదిరి వెలువడినది. ఆమె నీమర్మమెత్తి (రహస్య వెలువరించి) ఈ నరమృగం హిరణ్యకశిపుని నిర్జించిప్రహ్లాదుని రక్షించుటకు అవతరించిన శ్యామసుదరుడు శ్రీహరి అని గ్రహించినది. ఇక ఆమె నిన్ను చెమరించక మానీనా? నీవావెలది దగ్గర చెమరించేవు. ఓ నృసింహా ఆమె ఏరీతి నీ కళలంటెనోగాని నీవామెకు చేరువైతివి.

ఓ నారసింహా! విచిత్ర మేమంటే, అంగన కౌగిటిలో కూడా నీవు బుసకొట్టే నీ అలవాటు మానలేకున్నావు. అంతలోనే దైత్యుడు తలపునకొచ్చినాడా అనునట్లు పూత్కరించినావు. ఓ శ్రీనారసింహా! శ్రీలక్ష్మిని నీ చెంతనే ఎట్లు గూడినావయ్యా? దొంతిగా (ఇద్దరు దేవేరులను) ఉమ్మడిగా ఉరమున బెట్టిన శ్రీవేంకటేశ్వరుడవు. అహోబలమున ఇంతిని తొడపైబెట్టిన పంతగానికి ముద్దు సతులముచ్చటలు మోదమాయెనేమో!!

పద్యవివరణ:

ఆ.వె॥ **నారసింహుడెంత నయగారి సటకారి**
ప్రియములెల్ల గంటి వింటినయ్య
వేంకటపు నృసింహ వెలది నీతొడపైన
పంతమొభళమున బట్టెనయ్య!

సంఖ్య: IV/20 రాగం : సాళంగనాట
కీర్తన : జగములెల్లా నీడేరెజయవెట్టి రిందరును

సాళంగనాట

95 జగములెల్లా నీడేరె జయ వెట్టి రిందరును
తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో ॥పల్లవి॥

అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥

గోవిందుఁడు జనియించె గోకులష్టమిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥

అనంతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు జనియించె
ఘనశిశుపాలాదులు గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో
అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥ **20**

ఉపోద్ఘాతము:

నేడు శ్రీకృష్ణాష్టమి. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు స్వయముగా శ్రీమన్నారాయణుడు లీలామానుష విగ్రహుడై దేవకీగర్భమున అష్టమ పుత్రునిగా అవతరించాడు. ఎన్నో లీలలు ప్రదర్శించినాడు. రాకాసులు ముట్టుపడిరట. గోవిందుడు రేపల్లెకు చేర్చబడి గోపకిశోరుడైనాడు. కావరం గలిగిన కంసుడు గడగడలాడాడు. ఘన శిశుపాలాదులు గత

చరిత్రలో మిగిలిపోయారు. తృప్తి చెందిన జనులారా! ఇకనుంచైనా ధర్మవర్తనతో బ్రతకండి అని గీతామృతమనొసగిన గీతాచార్యుడు ఆ ద్వారాకాధినాథుడు. నేడు శ్రీవేంకటేశుడై తిరుమల శిఖరాలపై జనించాడు అని కృష్ణలీలలను కీర్తించారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

నేడు కృష్ణావతారమాయ (ఈ దినముననే కృష్ణుని అవతారము ఆవిర్భవించింది). ఇదిగో, తగ (తగినట్లుగా) జగములెల్లా నీడేరినవి (సఫలత జెందినవి). ఇందరును (ఈ ప్రజలెల్లరును) జయవెట్టిరి (జయజయధ్వానములజేసిరి).

అర్ధరాత్రి వేళలో అచ్చితుడు (అచ్యుతుడు) జన్మించినాడు. ముచ్చిమి రాకాసులు (దొంగబుద్ధికల రాక్షసులంతా) ముట్టుపడిరి (సంకటములను పొందిరి). పచ్చిగాను (బాహాటముగా) జనులెల్లా పండుగ జరుపుకొనండి. ఇదిగో నిజమైన కృష్ణావతారమావిర్భవించినది.

ఓ ప్రజలారా! నేడిదే గోకులాష్టమి. ఈ కృష్ణుడు గోవిందుడై రేపల్లె జేరినాడు. ఆపైన కావరముతో కన్నామిన్నాగానని కంసుని గర్వమంతా అణగారినది. ఈ దివ్యసందర్భమును తలచుకొని జనులంతా శ్రీకృష్ణ నామామృతమును పారాయణ చేయండి. ఇదిగో ఆవేళ శ్రీకృష్ణావతరణము జరిగినది.

ఇదే కృష్ణాష్టమినాడు అనంతుడైన శ్రీమన్నారాయణుడు శ్రీవేంకటేశ్వరుడై తిరుమల శిఖరాలమీద నావిర్భవించినాడు. శిశుపాలాది ఘనమైన దుష్ట రాజలోకము గతమైరి (గతించిరి లేక గత చరిత్రలో మిగిలిపోయిరి). తృప్తిపడి ప్రజలంతా ధర్మవర్తనులై బ్రతకండి. ఇదివో మీ ప్రియమైన శ్రీకృష్ణావతారము.

పద్యవివరణ:

తే.గీ॥ **జగములెల్ల యీడేరెను జయమువెట్టి**
నేడు కృష్ణావతారంబు నిలిచెనెదుట
కృష్ణలీలలు పాడేరు కీర్తనముల
తిరుమలేశుడు మురియంగ చిరునగవుల.

సంఖ్య: XXIV/165 రాగం : శంకరాభరణం
కీర్తన : నిక్కమమ్మ యశోద నియ్యాన

శంకరాభరణం

96 నిక్కమ్మ యశోద నియ్యాన
అక్కడ నెవ్వరోకాక అటువంటివాఁడా ॥పల్లవి॥

వీఁడుగదె బాలుఁడు వెన్నలు దొంగలీ నేఁడు
కాఁడువో అదేమోసి గబ్బిగొల్లెత
చూడఁగదె నీవు సోయగపు చేతిజిడ్డు
ఆడేవు కల్లలేకాక అటువంటివాఁడా ॥నిక్క॥

చిక్కెఁగదె మీవాఁడే చేరి పెరుగుదొంగ
పొక్కాలదేమోసి బొంకుగొల్లెత
పుక్కిట నిదిగదె పొంగినట్టిమీఁగడలు
అక్కటా నీభ్రమలింతే అటువంటివాఁడా ॥నిక్క॥

యిదివో శ్రీవేంకటేశుఁ డింతేసి సేసినాఁడు
పదవే నీవేమనేవు బద్దుగొల్లెత
అదివో నీమాఁటలైతే అన్నియుఁ జెల్లెనమ్మ
అదనాయ మీకు నాడ నటువంటివాఁడా ॥నిక్క॥ 165

ఉపోద్ఘాతము:

ఈ కీర్తన వివరణ నాకు కత్తిమీద సాము అయింది. ఇది నిజానికి కృష్ణునిపై పితూరీచేయవచ్చిన గోపికతలతో యశోద సంవాదము. అందువల్ల కీర్తన అంత తేలికగా అర్థంకాదు. ఇంతేకాక కొన్ని జానపదుల సంభాషనలు నేడు చలామణిలో లేవు. "పొక్కాలదేమోసి బొంకు గొల్లెతా" అంటే ఓసి గొల్లెతా! నీకేమి పోయేకాలం వచ్చిందే (నా పిల్లవాడిని ఆడిపోసుకుంటున్నావు, అన్నట్లు.) పల్లవిలో ఉన్న రెండు చరణాలు అంతే. "ఓ యశోదా! నిక్కమమ్మా! నీయాన" అనేది గోపికలు. దానికి యశోద "అక్కడ యెవ్వరున్నారో. మావాడు

అటువంటివాడా?" (ఇది మరీబాగుంది) అన్నది. నా శక్తివంచన లేకుండా వివరణకు ప్రయత్నిస్తాను. ఇది అన్నమయ్య అద్భుత సృష్టి.

తాత్పర్య వివరణ:

ఓ యశోదా! నిక్కమమ్మా! (మేము నిజం చెబుతున్నామమ్మా!) నియ్యాన (నీయాన, నీమీద ఒట్టు). దానికి యశోద అంటున్నది, అక్కడ నెవ్వరోకాక (అక్కడ ఇంకెవరున్నారో) మావాడు అటువంటివాడా?

ఏమంటున్నావమ్మా! యశోదా! మా ఇళ్ళల్లో వెన్నలు దొంగతనంచేసే బాలుడు నేడు వీడు కాక ఇంకెవరు? ఓసి, గబ్బిగొల్లెతా (కంపు కొట్టే గొల్లదానా! కాడేవో (అది నా పిల్లవాడు కాదే). ఓ యశోదా! మీవాడి సోకైన చేతులకంటిని జిడ్డును చూస్తే తెలీటంలేదా? అన్నారు గోపికలు. యశోద వెంటనే ఎందుకమ్మా కల్లలాడి నా బిడ్డను మాటలంటారు? వాడు అటువంటివాడా?

మీవాడు పెరుగు దొంగతనంగా తింటూ దొరికిపోయాడు, అన్నారు గోపికలు. దానికి యశోద అన్నది "బొంకే గొల్లదానా! పొక్కాలదేమోసి (ఓసీ! నీకేమి పోయేకాలం వచ్చిందే) నా బిడ్డను అంటున్నారు". ఇది మరీ విడ్డూరం ఉబ్బిన మీ కృష్ణుడి పుక్కిలి చూడవమ్మా వేడి వేడి మీగడలు ఇంకా వాడి బుగ్గలలో వున్నాయి, చూసుకోవమ్మా! అన్నారు గోపికలు. అయ్యో! అదంతా మీ భ్రమే.. మా అబ్బాయి అటువంటివాడు కానేకాదు, అన్నది యశోద.

పోనీవమ్మా! యశోదా! దొంగ నీకొడుకు కృష్ణయ్య కాకపోతే తిరుమల వేంకటేశుడు, ఇవన్నీ చేశాడంటావా? పోవే వో బద్ధకస్థురాలవైన గొల్లెత! నీవేమంటున్నావో నీకు తెలుస్తున్నదా? అవునులేవమ్మా! యశోదా! మీరు గొప్పవాళ్ళు. నీవేమన్నా చెల్లుతుంది. ఆ యశోదకూడా తగినట్లు అంటించింది. మీకు అవకాశం వచ్చింది కొండెములు చెబుతున్నారు. నాబిడ్డ అటువంటివాడా?

పద్యవివరణ:

కం॥ **ఎనరో సంవాదంబును**
గొనకొని గోపెమ్మ చెప్పె కొండెములెల్లన్
తను ఆ యశోదఘాటుగ
వినిపించెను తగు జవాబు వేంకటనాథా!

సంఖ్య: IV/21 రాగం : మాళవి
కీర్తన : పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి

మాళవి

97 పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి
తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి ॥పల్లవి॥

గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై
అరదము దోలవో చయ్యన దారకా
ధరయెల్లఁ గుమ్మెలై పాతాళ మదే కానవచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను ॥పారి॥

దనుజాంతకునిసేన దగ్గరి నడవఁజొచ్చె
చొనిపి రొప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి పగ్గములు బిగించవో పయిపైన ॥పారి॥

శ్రీవేంకటేశుబలము చిమ్మిరేఁగి మించఁజొచ్చె
సేవించలమేల్మంగను సేనాపతీ
దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యములాయ
తావుకు మరలించవో తానముగాను ॥పారి॥

ఉపోద్ఘాతము:

పంచబంగాళములవటం అంటే చెల్లా చెదరైపోవటమన్నమాట. గరుడ-ధ్వజుడైన శ్రీహరి అదిగో రాకాసులపైకి కదలె. ఓ దారకుడా? ఇంకా చూస్తావే, చయ్యన రథమును తోలుము. అదిగో భూమండలం వెనకబడిపోయి, పాతాళ లోకం కనబడుతోంది. వాళ్ళు అక్కడనే వుంటారు. దుమ్ములేచిపోవునట్లు గుఱ్ఱమును పరుగులెత్తించు అంటున్నారు

అన్నమయ్య. ఇటువంటి కీర్తనలన్నీ తిరుమలేశుని బ్రహ్మోత్సవాలలో శ్రీనివాసుడు రథంపై వూరేగుతుంటే అన్నమయ్య ఆశువుగా పాడినవే. మనం ఆశ్చర్యపోయేది ఆయన పదవిన్యాసానికి. ఆ భాషాసొష్ఠవానికి.

తాత్పర్య వివరణ:

అదిగో శ్రీవేంకటేశ్వరుని రథము. ఒరే! దానవుల్లారా! మీరంతా పంచబంగాళములై (చెల్లాచెదరై) పారిరి (పారిపోయారు). తుత్తునియలై (బేజారుచెంది) గొందుల (చిన్న చిన్న సందుల్లో) దూరిపోయారు.

రాకాసులపైకి (రాక్షసులపైన) గరుడధ్వజుడైన శ్రీహరి, దండు (సైన్యము) కదిలాయి. చయ్యన (వేగముగా) ఓ దారకుడా! అరథము తోలవో (రథమును నడపవయ్యా!) భూమండలమంతా గుమ్మెలై (వెనకబడిపోయి) అదిగో పాతాళలోకం కనబడుతోంది. దుమ్ములేచిపోవునట్లు, గుఱ్ఱములను తోలవయ్యా! శ్రీకృష్ణుని రథం తోలిన నీ అనుభవం, వూరకనే పోదు.

దనుజాంతకుడైన శ్రీహరిసేన వేగముగా వస్తోంది. అది ఆ రథమునకు దగ్గరయై కదులుతున్నది. ఓ సుమంతుడా! నీకు శ్రీరామచంద్రుని రథం తోలిన అనుభవం ఇప్పుడు చూపించు. నీ వేగానికి దిక్కులను రక్షించే దిగ్గజములు, గొబ్బునమొగ్గతిల్లెను (శీఘ్రముగా మొగ్గవారినవి). నీవు పగ్గములను బిగించి రథమును నడపవయ్యా!

అదిగో భావనాదృష్టితో చూడండి. వేంకటేశుని రథము సాగుతున్నది. ఆయన సైన్యాధిపతి విష్వక్సేనులవారు, చిమ్మిరేగే (మిక్కిలి విజృంభించే) ఆ రథంలోని వేంకటరమణుని, అలమేల్మంగమ్మను సేవిస్తూ వెనువెంటనే వున్నారు. దిక్కులన్నీ స్వాధీనమైన స్వామి దేవతలంతా మొక్కుతున్నారు. ఇక రథాన్ని స్వామిస్థానమునకు మరలించండి.

పద్యవివరణ:

కం॥ **పారిరి దానవులెల్లెడ**
పారుచు తామైరి పంచబంగాళంబుల్
తూరిరి సందులు గొందులు
ఔరా! తుత్తునియలైరి హరిచెండుటచే.

సంఖ్య: XXIV/54 రాగం : మంగళ కౌసిక
కీర్తన : ఇంత సేయగా నీకిందు యేమివచ్చెనే నీవు

మంగళ కౌసిక

98 ఇంత సేయఁగా నీ కిందు యేమివచ్చెనే నీవు
యింతివేకావా చెలి యిదియేమే ॥పల్లవి॥

అలరిచేఁతలవిభుఁ డాతఁడేడ నేనేడ
చాలుఁజాలు నింత నీకు చలమేఁటికే
మూలనుండేవారిఁ దెచ్చి ముంగిటఁ వేసేనంటా
యేల యిట్టె బోధించే విదియేమే నీవు ॥ఇంత॥

మాయదారివిభుఁ డెంత మరిగిననేనెంత
ఆయనాయ ననునేల యలయించేవే
వోయమ్మ చల్లవేఁడై వున్న నన్ను నతనితో
యీయెడనే కూడుమనే విదియేమే నీవు ॥ఇంత॥

యింతలోనే శ్రీవేంకటేశుఁడే దక్కె నిట్లు
సంతముసేసితిని మెచ్చఁగవలెనే
పంతము పలుకు నొక్కపాటిగా మెలఁగునాపై
యెంతకెంతమమకార మిదియేమే నీవు ॥ఇంత॥ **54**

ఉపోద్ఘాతము:

అన్నమయ్య ఈ కీర్తనలో దేవికి అనుంగు చెలికత్తెయై ఆమెను మందలిస్తున్నారు. ఇంత రాద్ధాంతం చేస్తున్నావు, ఇందువల్ల నీకేం ప్రయోజనం కలిగిందమ్మా? అసలు నీవు ఆడదానివేకావా యేమిటే? ఇదేమిటే నీ ప్రవర్తన? అంటున్నారు. సాధ్యాసాధ్యాలను రెంటినీ చేయగల ఆయనెక్కడ నేనెక్కడ? చాలుచాల్లేవమ్మా! ఈ మొండితనం ఇకనైనా

మానుకో. ఎక్కడో మూలనుండాల్సిన వాళ్ళను తెచ్చి నా ముంగిటబెట్టుకొన్నానని యేమిటమ్మా నీ సూటిపోటి మాటలు? నీవు యేల యిట్టే బోధించేవు? ఇదేమే? నీకీ అనుమానమేమిటే? ఆయన జగదేకపతి. నీ స్వంతం అనుకొంటే యెట్లాగే?

తాత్పర్య వివరణ:

ఓ చెలీ! ఇంతసేయగ నీకిందు ఏమి ఉపయోగం కలిగిందమా! నీవు ఆడదానివే కావా యేమిటమ్మా? ఇదియేమిటమ్మా?

అలరి (చిలిపి) చేష్టలు చేయుటలో సుప్రసిద్ధుడైన నీ విభుడెక్కడ? నేనెక్కడ ఆలోచించవమ్మా! చాల్చాల్లేవమ్మా! ఇంత మత్సరము నీకు తగునా? ఇదియేమిటమ్మా? ఏల ఇట్లా అందరికీ చెబుతున్నావు? మీ ఆయన మూలనుండే వారిని దెచ్చి ముంగిట వేసెనంటూ, యేమిటమ్మా నీ పుల్లవిరుపు మాటలు?

ఓ చెలీ! మాయాతీతుడైన నీవిభుడెక్కడ? ఆయనను విడచి జీవించలేని మేమెక్కడమ్మా? అయిందేదో అయింది. ఇంకా నన్నెందుకు అలయించేవె? (శ్రమపెడుతున్నావమ్మా?) ఇది తగునా? ఓయమ్మా! నేనాతనిపై ద్వంద్వ భావాలతో వున్నాను. నన్ను ఈయెడ (ఈ సమయమున) అతనిని కూడమనుచున్నావు, నీవు.

ఓ దేవీ! ఇంతలోనే శ్రీవేంకటేశుడు తనంతటతానే నాకు దక్కినాడు. అతనిని నా స్వంతము చేసికొందామని నే ననుకొన్నమాట నిజమే. నన్ను నీవు మెచ్చుకొనక తప్పదమ్మా! నీతో పంతము వహించిన నన్ను, మాటకు కట్టుబడివుండే నన్ను ద్వేషించాల్సిందిపోయి, ఇంత మమకారం చూపిస్తున్నావేమిటమ్మా. ఇదియేమే దేవీ?

పద్యవివరణ:

తే.గీ॥ **ఇంతసేయగా నీకిందు యేమివచ్చె?**
ఇంతివేకావ? ఓ చెలీ? యేమిటమ్మ?
దక్కె శ్రీవేంకటేశుడు దగ్గరాయె
ఎందుకీమమకారంబులేల నాపై?

సంఖ్య: XXIV/66 రాగం : సాళంగనాట
కీర్తన : మందులు మాకులు మరియేలా

సాళంగనాట

99 మందులు మాఁకులు మఱి యేలా
అందులనే గుణమయ్యాని ॥పల్లవి॥

చుంగులనీతెలిచూపులు రమణుని-
కంగజబాణములయి తాఁకె
రంగగు వీడెపురసములకారము-
లెంగి లనక పతి కియ్యఁగరాదా ॥మందు॥

వెడ నీనవ్వులవెన్నెల విభునికి
వడిగల యండయు వడదాఁకె
ఆడరఁగ నతిరస మమృతరసాయనము
వొడలి కిత వతని కొసఁగఁగరాదా ॥మందు॥

చెలి నీకుచములు శ్రీవేంకటపతి-
కలయిక రుచులయి కళదాఁకె
కులికేటిగోళ్లకొనయెచ్చరికల
తెలియఁగ మఱపులు దెలుపఁగరాదా ॥మందు॥ **66**

ఉపోద్ఘాతము:

పూర్వకాలపు స్త్రీలు కొందరు భర్త తమకు వశుడవక తన ఇచ్చవచ్చినట్లున్నాడని అతనికి మందు బెట్టేవారని ప్రతీతి. ఏదోతీపి పదార్ధంలో కలిపి పెడితే భర్త గుర్తించలేక దానిని భుజించి ఆ మందు ప్రభావం వలన ఆమె చెప్పినట్లే నడుచుకొంటాడని ఒక నమ్మకం వుండేది. ఈ కీర్తనలో దేవి చెలికత్తె ఆమెను మందలిస్తున్నది. చెలికత్తె మన అన్నమయ్యేనని నేను ప్రత్యేకించి చెప్పనక్కరలేదు కదా! ఆ చెలికత్తె అంటున్నది ఓ చెలీ! ఏమిటమ్మా నీ వెఱ్ఱితనం? మందులూ మాకులూ మరెందుకమ్మా? అందులో

యేగుణం వుంటుందమ్మా? ఏమిటి నీమూర్ఖత్వం? నీపతి జగన్మోహనుడు. ఆయనను కోరని స్త్రీ వుంటుందా? ఆయన నీకు లొంగివుండాలంటే మన్మథుని తూపులవంటి చూపులు, లేత వెన్నెలవంటి చిరునవ్వు, రుచులదేలే కలలను ప్రదర్శించే బిగి కౌగిలి కావాలి. అవుంటే మందులెందుకమ్మా అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! ఈ పురుషుని వశపరచుకొనే మందులూ మాకులూ మరి యెందుకమ్మా? అందులన్ (దానివల్ల) యేగుణమయ్యాని (ఏమి ప్రయోజనం వుంటుందమ్మా?)

చీరె చుంగల (పమిట చెంగు చాటునుంచి) ఆయనను, తెలిచూపుల (నిర్మలమైన చూపులు) నీ రమణునిపై ప్రయోగించు. వాటితో ఆయనకు అంగజబాణములు తాకుతాయి. రంగగు (ఎఱ్ఱని) వీడెపురసము తాంబూలపు కారపుతమ్మ (ఘాటైన యెంగిలతమ్మ) యెంగిలి గింగిలి అనక నీపతి నోటికి అందించరాదటమ్మా? ఆ రుచి తెలిస్తే నిన్ను వదులుతాడా చెప్పు.

నీ వెడనవ్వుల (సన్నని చిరునవ్వుల) వెన్నెల నీ విభునికి వడిగల (అతిశయించిన) అండవలె వడదాకె (వెచ్చగా తాకవలెను). అడరగ (అతిశయించగా) అతిరసము (ఒక తీయని వంటకము) అనెడి అమృత రసాయనము. ఆయన ఒడలికి (ఒంటికి) మంచిది. దానిని నీ విభునికి యొసగుమమ్మా!

ఓ చెలీ! నీపతి వేంకటవిభుడు. నీ కుచగిరులు మీ కలయికలో ఆయనకు వింత వింత రుచులనందించవలెను. నీ కళానైపుణ్యమును ప్రదర్శించవలెను. నీ కొనగోటి సున్నితమైన వాడి యెచ్చరికలు, మఱచిపోనట్లు ఆయనకు తెలుపవలెను. అట్లా తెలిపి చూడరాదా?

పద్యవివరణ:

ఉ॥ **మందులు మాకులేల మఱి మానిని యాకడగంటిచూపులున్**
మందపువెన్నెలంటి చెలిమత్తుగనవ్విన చాలదే భళా!
సుందరి! చన్నుదోయి పతిచొక్కగ కౌగిట నొత్తవే తమిన్
అందులనే గుణంబులగు, ఆహరి లొంగున మందుబెట్టినన్?

సంఖ్య: IV/22 రాగం : లలిత

కీర్తన : ఘనుడాతడే మము గాచుగాక హరి

లలిత

100 ఘనుఁ డాతఁడే మముఁ గాచుఁగాక హరి
అనిశము నే మిఁక నతనికె శరణు ॥పల్లవి॥

యెవ్వనినాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి
యెవ్వనిమూలము యీ సచరాచర-
మవ్వలనివ్వల నతనికే శరణు ॥ఘనుఁ॥

పురుషోత్తముఁడని పొగడి రెవ్వరిని
కరి నెవ్వఁడు గక్కనఁ గాచె
ధర యెవ్వఁడెత్తెదనుజులఁ బొరిగొనె
అరుదుగ మే మిఁక నతనికె శరణు ॥ఘనుఁ॥

శ్రీసతి యెవ్వనిఁ జేరి వురమునను
భాసిల్లె నెవ్వఁడు పరమంబై
దాసులకొరకై తగు శ్రీవేంకట-
మాస చూపె నితడతనికె శరణు ॥ఘను॥ **22**

ఉపోద్ఘాతము:

అత్యంత సులభము, సుగమము అయిన శరణాగతి వినిపిస్తున్నారు, అన్నమయ్య. చక్కటి సీసపద్యంలో ఇమిడిన దీని

తాత్పర్యము దీన్ని చదువుతుండగానే అర్థమవుతుంది. నానోటిద్వారా దీన్ని పలికించి నా జన్మతరింపజేసిన వేంకటేశ్వరా! సదా నీ దాసానుదాసుడను తండ్రీ!

తాత్పర్య వివరణ:

ఘనుడాతడే మము రక్షించుగాక. హరి అని పిలువబడే ఆతడు, అనిశము (ఎల్లప్పుడూ) మము కాచుగాక! నేమింక (మేమింక) ఆతనికే శరణుజొచ్చెదము.

ఎవ్వని నాభికమలమునుండి చతుర్ముఖ బ్రహ్మ, సనకసనందనాది ఋషులు ఆవిర్భవించిరో, ఈ బ్రహ్మాండములన్నిటికీ రక్షకుడెవ్వరు? ఈ చరాచరములన్నీ ఎవ్వని మూలాధారముగా వర్ధిల్లుచున్నవి? అవ్వల నివ్వల (నేను అవతల వేరే లోకాలలో జీవుడుగానున్నా ఇవ్వల (ఈ భూలోకంలో జీవించివున్నా ఆతనికే శరణంటిని.)

సకలమునులు యోగులు యెవ్వరిని పురుషోత్తముడని కీర్తించినారు? అడవికొలనులో మొసలిచే పీడించబడుచున్న గజేంద్రుని రక్షించినవాడెవ్వడు, ధరలో ఎవ్వడు దనుజుల పొరిగొనియెత్తె (పొడగనిపెటి దండెత్తినాడు)? మేమిక అరుదుగానైనా గ్రహించి అతనికే శరణంటిమి.

శ్రీదేవి ప్రేమతో ఎవ్వని వురమున తిష్టవేసికొనినది? ఎవ్వడు పరబ్రహ్మయై భాసిల్లుతున్నాడు? తన దాసులు ప్రార్థించగా వారి కొరకు ఎవ్వడు శ్రీవేంకటేశ్వరుడై తిరుమల ఏడుకొండలపైనా నెలకొనియున్నాడో, ఎవ్వడు నా పాదములకు సదా మొక్కండి నా శరణార్థులను రక్షింతును అని తన పాదములను చూపుచున్నాడో ఆ దేవదేవునికే నేను శరణుజొచ్చితిని.

ఓం నమో వేంకటేశాయ.

పద్యవివరణ:

సీ॥ ఎవ్వని నాభిలో ఈ బ్రహ్మతను పుట్టె
ఎవ్వడు రక్షకుడిన్నిటికిని
ఎవ్వని మూలము యీచరాచరమెల్ల
పురుషోత్తముండెవ్వరెరుగ జగతి
ఎవ్వడు కరిబ్రోచె నెవ్వడసురవైరి
ఎవ్వడు శ్రీసతినేలు మగడు
ఎవ్వడు భాసిల్లె నిటు పరబ్రహ్మయై
ఏడుకొండలనెక్కె యేలికెవడు?

తే.గీ॥ దాసులకు రక్షకుడు హరి తాననిశము
ఆస చూపెను భక్తుల కందరికిని
"శరణుకోరుడు కాంతును శంకవలదు"
అనుచు చూపెను 'పదముల' అయ్యలార!



101 హరి మంగళము

మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః

(సంపుటి - IV)

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



హరి నీమయమే అంతాను

(సంపుటి - IV)

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

హరి నీమయమే అంతాను

(సంపుటి - IV)

మొదటి ప్రచురణ

జనవరి 2014

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

అంకితము

దశరథుని కంటివెలుగు అయిన

శ్రీరామచంద్ర మూర్తికి..

నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై
సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో
కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

హరి నీమయమే అంతాను

(సంపుటి - IV)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు తాత్పర్య వివరణ

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అతివరో శ్రీవేంకటగిరిమీద వీడె	01
2.	అంగమెల్లఁ జెమరించె నమ్మఁగారికి	03
3.	అది నాయపరాధ మిది నాయపరాధ-	05
4.	అన్నిటాఁ దాము నతిశయులే	07
5.	అన్నియు నాలో నుండఁగ నవ్వల నేమి చూచేము	09
6.	అనుచు నిద్దరునాడే రమడలవలెనే	11
7.	అప్పటి యెండ చెమటలట్టే వుండీనా	14
8.	అయ్యో వీఁడు నన్నణఁకించీనే వీని-	16
9.	ఆటవారిఁ గూడితౌరా	18
10.	ఇంకానేల చలము యేమి సేయఁగలము	20
11.	ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును	22
12.	ఇతరు లే మెరుఁగుదు రేమని చెప్పఁగ వచ్చు	24
13.	ఇహ పరసాధన మీతలఁపు	26
14.	ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మాయాచార్యుఁ	28

15.	ఎంత చనవిచ్చితివో యీపె నీపై వెదచల్లీ	30
16.	ఎంత భాగ్యవంతుఁడవో యిన్నియును నొనగూడె	32
17.	ఎక్కడి మాయామృగ మేల తెమ్మంటి నేను	34
18.	ఎక్కువతక్కువలేవో యెఱఁగ మిద్దరిలోన	36
19.	ఎపుడు వత్తువోయనుచు యెదురు చూచీఁ జెలియ	38
20.	ఎప్పుడు నీదాననే యిన్నిటా నీచిత్తము	40
21.	ఏది మాకు గతి యిఁక నీశ్వరేశ్వరా	42
22.	ఏపొద్దు చూచిన దేవుఁ డిట్లానే యూరగించు	44
23.	ఏమి సేయుదు నింతయు నీ మాయ	46
24.	ఒఱపో మెఱుపో వొయ్యారమో నీకు	48
25.	కటకటా అయ్యో కాంత నింత యేపుదురా	50
26.	కరుణించవే నిజగతి బోధించవే	52
27.	కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక	54
28.	కానకుంటే మిందాఁకా కంటి మాడకుఁ బోదము	56
29.	కాలము లారునుఁ గలిగి నీకు నిదె	58
30.	కొంగువట్ట కంత నీవు గొల్లబోయిఁడా	60
31.	కొమ్మనీ పలుకులకు కుశలమస్తు	63
32.	గుట్టాలగట్టనితేరు కొంకకెందైనా బారీ	65
33.	చదువులోనే హరిని జట్టిగొనవలెగాక	67
34.	చూడరెవ్వరు దీని సోద్యంబు పరికించి	69

35. చెల్లబో సిగ్గులేదటే చెల్లెల 71
36. తలచిన దేహము నిలువదు తానను దలచునొ 73
37. తలచిన హృదయము ఝల్లనతరుణీమణి వొయ్యారము 74
38. తానేడో మనసేడో తత్తరములవి యేడో 75
39. తినరాని కొనరాని దేవలోకపుబండు 76
40. తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ 81
41. దేవరవైతివిన్నిటా దేవులాయెనాపె నీకు 83
42. దేవుడొక్కడే గురితెలిసినవారికి 85
43. ననుబోటి చెలులెల్లా నవ్వరా నిన్నుపతి 87
44. నానాభక్తులివి నరుల మార్గములు 89
45. నిన్ను దలచి నీపేరు దలచి 91
46. నీదాస్యమొక్కటే నిలిచి నమ్మగలది 93
47. నీవు మొదలి జాణవు నీకంటె జాణలువారు 95
48. నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు 97
49. నీవే దయదలచుక నెమ్మి రక్షించుట గాక 99
50. నెలత బాసి వుండలేను నిమిషమెందునేడు నేను 101
51. పంచేంద్రియములనే పట్టణి స్వాములారా 103
52. పట్టరానిది వయసు పడతినేమనవచ్చు 105
53. పరమయోగిని శివార్పణబుద్ధి గాదిది 107
54. పెరగక బెరగక బెద్దలమైతిమి నేము 109
55. మరుగుచు జేసీ మానదుద్యోగము 111

56. మరుని నగరి దండ మాయిల్లెఱగవా 113
57. మర్మము నీవె యెఱిగి మన్నింతువుగాక నన్ను 115
58. మఱువకువే చెలియ మదన రహస్యమిది 117
59. మఱితను భోగములు మాయావిలాసములు 119
60. మానలేనే పొందుమానలేనే నిన్ను మానలేనే 121
61. ముద్దుగారీ జూడరమ్మ మోహనమురారి వీడె 123
62. మొక్కరో మొక్కరో మీరుమోమునగళలుదేరె 125
63. రమణుడు చెప్పుమా రమనీ నీయెడను 127
64. రమ్మనవే వాని రమ్మనవే–యీ– 129
65. విన్నవించవలె నీకు వేడుక దొలుదొలుతే 131
66. విరహమువలవదు రసికులు ఎనరో చాటుచు జెప్పెద 133
67. శ్రీపతి నీసేవ చిత్తము గోరదు 135
68. శ్రీ వేంకటేశ్వరుడున్నాడు చేరి యలమేల్మంగతో 137
69. సతి నిన్ను గెలిచెను జవ్వనపు గరిడీలో 139
70. సరసుడ వవుదువు జాణవవుదువు 141
71. సవతైనా నాపె మేలు సరి నీకంటె 143
72. సింగారాల మించీ నరసింహదేవుడు 145
73. సురలకు నరులకు సొరిది వినవిన 147
74. సేవించరో మొక్కరో చెలులాల నరులాల 149
75. శృంగారశేలునకు మంగళం 151

ప్రార్థన

కం॥ శ్రీపతిని నమ్మువారిని
ఆపదలంటవు నిజంబు హరిదాసులకున్
తోపవు కడగండ్లీభువి
మాపెనుభారంబుమోయు మాధవుడే, పో.

చం॥ కలుముల రాణి కౌగిటను కందిన యీ తిరువేంకటేశుడే
కొలువయి వుండనెక్కెనట కొండలుయేడు ధరాతలంబునన్
మెలకువతోడ దీనులకు మేలగుస్వాంతన మిచ్చిబ్రోచెరా
తొలకరిజల్లు బీడు బడుతుంటరి జన్మకు తోయజాక్షుడే.

సీ॥ హరిపాడకుండిన అదియేటి జన్మంబు
హరినొల్లననువాని దవదు బ్రతుకు
హరిచింతలేకున్న అదియేటిచిత్తంబు
హరిత్రోవ నడవని యతడుపాపి
హరిపైనవ్రాయకనదియు బాండిత్యమే
హరినెంచననువాడు అతడెద్రోహి
హరి భజియించక అరయునే మోక్షంబు
హరిమాయదగిలిన అలుపెమిగులు

తే.గీ॥ హరిని ద్వేషించి దూషించి రసురులిలను
హరిని కామించి గోపిక లాప్తులైరి
హరిని ధ్యానించి కీర్తించి రవనిమునులు
హరిని శరణన్నవానికే అందునతడు.

ఉ॥ చెప్పెను ఒక్కచోట మనచిత్తముసొక్కెడిమేటి కీర్తనన్
చెప్పెను ఒక్కచోట తను శ్రీహరిమెచ్చెడి భక్తిగీతికన్
చెప్పె మరొక్కచోట నిక చింతన తత్త్వవిచారదీపికై
చెప్పితి అన్నమయ్య పదశ్రేణికి మున్నుడి, భావమిత్తరిన్

కం॥ సతిపతుల మైమరపులను
అతిసులువుగ అన్నమయ్య అందించెనుగా
నుతివలె హరిపరవశుడవ
శృతిగల సంకీర్తనయ్యె శ్రీపతి వినుమా.

ఆ.వె॥ తరుణియలుక హరికి తరుగని మురిపెమై
హరికి యలుక తరుణి వెరపుగొలిపె
పరవశించు రతుల హరియును తరుణియు
హరికి మురిపెమాయె కరిగెగిరులు.

మత్తకోకిల॥
తన్మయుండగు అన్నమార్యుడు తానుపాడెను కీర్తనన్
జన్మసిద్ధికి వ్రాసినానుర శ్రావ్యమౌ వివరంబులన్
చిన్మయుండగు వేంకటేశుడు చింతలన్నియు దీర్పగా
జన్మజన్మలపాపమెల్లను చక్కగా హరియించెరా.

మ.॥ హరినే నమ్మిన ఆపదన్నదగునే అన్యాయముల్ చేరునే
గరిమన్ వేంకటనాతుడైన యతడే కష్టంబులన్ దీర్పడా
మురవైరిన్ తగుపంతమూని కొటవన్ మోక్షంబునందీయడా
సరియౌ సద్గతి నాకుదక్కె నికపై సాధింతునే దాసుడై.

ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా ప్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ

చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము "హరి నీ మయమే అంతాను" గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను "గూగుల్" నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. "geetadeeksha" అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. "భగవద్గీత" అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి.

కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక "హరి నీమయమే అంతాను" అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen. Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు. గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం

నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు, సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను.

ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇకపోతే, ఈ సంపుటి– II గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అన్నమయ్య చేపట్టిన శృంగార వర్ణన అంతా అమలినమే. పైకి స్త్రీ, పురుష రతి సమాగమం వలె అనిపించినా అది ఆత్మ – పరమాత్మల ఐక్యమే. మనోవాక్కాయ కర్మలా పరమాత్మలో ఐక్యమవ్వాలని ఆత్మపడే తహతహలే, మనకి స్త్రీ పురుష విరహవేదనవలె అనిపిస్తున్నది. కాని అన్నమాచార్యులంతటి యోగికి రతిలీలా వర్ణన, ఆత్మ, పరమాత్మల అనుసంధానమే.

అందుచేత ఈ కీర్తనలను శృంగారకీర్తనలని కాక మధురభక్తి కీర్తనలు లేక మధుర కీర్తనలు అని వ్యవహరిద్దాం. అన్నమయ్యవలె నాకు పరమాత్మ తత్త్వం అవగతమే కాలేదు. నేను ఒక జగన్నాయకుని సేవలో తుదిశ్వాస విడువాలనే ఆశతో జీవిస్తున్న అసంఖ్యాకులలో అతి సామాన్యుడను.

అన్నమయ్యకు కైవల్యాన్ని ప్రసాదించిన ఆ శృంగారరాయడు నాబోటివానిని కనీసం ఎవడురా వీడు అని చూస్తాడా అంటే... అవుననే అర్హతే లేదు. అయినా నా కర్తవ్యం నేను నెరవేరుస్తాను. ఫలితాన్ని ఆశించను. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరితో గూడి రతులదేలి భారతావనిని నిరంతరం శాంతి సౌభాగ్యాలతో వుంచుగాక!

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అథవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.

సుజనరంజనివారు ప్రచురించిన “అన్నమయ్య పద మందాకిని” జి.బి. శంకరరావు గారి వ్యాఖ్యానంతో వెలువరించారు. ఆంగ్లంలో కూడా ప్రతి కీర్తన మరియు వ్యాఖ్యానం తర్జుమా చేయబడింది. ఈ నా ప్రయత్నంలో ఆ పుస్తకం కరదీపిక అయింది. వారందరికీ సదా కృతజ్ఞుడను.

సంఖ్య: XXVI/6 (పీఠిక) రాగం : నాట
కీర్తన : అతివరో శ్రీవేంకటగిరిమీద వీడె

నాట

1 అతివరో శ్రీవేంకటగిరిమీద వీడె
కౌరవుల పాలిటి విశ్వరూపమితడు – వీడె ॥పల్లవి॥

త్రిపురంబులపైఁబారిన యాఘన తీవ్రబాణ మితఁడు
కపటపు భస్మాసురుని పాలిటికి కాలదండ మితఁడు
విపరీతపు కంభములో వెడలిన వీరసింహమితఁడు
చపలపు బాణునకు మర్మభేదియగు చక్రధరుఁడితఁడు ॥అతి॥

ధరణికింద బలినణచిన యాపాతాళశౌరి యితఁడు
దురమున నెదిరిన దనుజకోట్లకును ధూమకేతువితఁడు
ఒరశిన నరకాసురుని పాలిటికి ఉరుమని పిడుగితఁడు
పరచు రావణుని శిరములు ద్రుంచిన ప్రళయవాయువితఁడు ॥అతి॥

ఇదిగో విధి రుద్రాదుల కెల్లను వెలశిన వేల్పితఁడు
పదిలముగాఁదనుఁగాచిన యాశ్రితపారిజాత మితఁడు
కదలని యా బ్రహ్మాండకోట్లకును కన్నతండ్రి యితఁడు
వెదకి వెదకి మరి వరము లొసగు శ్రీవేంకటపతి యితఁడు ॥అతి॥

ఉపోద్ఘాతము:

తనవెంట వచ్చి, తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని దర్శించుకొని ఆనందిస్తున్న తన సఖికి అన్నమయ్య ఆ వేంకటగిరి వల్లభుని ఘనతను వివరిస్తున్నారు. ఓ అతివా! వీడేనమ్మా! శ్రీవేంకటగిరిపై వెలసిన దైవము. వీడేనమ్మా! కౌరవులపాలిటి విశ్వరూపము. త్రిపురాసురభంజనుడు, భస్మాసురుని భస్మము చేసినవాడు, స్తంభం నుండి వెడలి హిరణ్యకశిపుని జంపినవాడు, బాణాసురుని చక్రాయుధంతో చంపబూనినవాడు, బలిని పాతాళమునకు తొక్కినవాడు, అసురులకు

తోకచుక్కవలె కీడు సంప్రాప్తింపజేసినవాడు, నరకాసురునిపై పురమకనే పడిన పిడుగువంటివాడూ, రావణుని శిరములను ఛేదించినవాడూ, ఈ దనుజాంతకుడే బ్రహ్మ రుద్రాదులందరికీ వెలసిన వేల్పు ఇతడే. బ్రహ్మాండ కోటిని కన్నతండ్రివలె సంరక్షించి కోరిన వరాలిచ్చేది వీడేనమ్మా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ వనితా! వీడే శ్రీవేంకటగిరి మీద వెలసిన దైవము. వీడే నాడు కౌరవుల పాలిటి విశ్వరూపము.

త్రిపురాసురలపై వేయబడిన ఘనమైన, తీవ్రమైన బాణము ఇతడే (ఈ శ్రీహరియే). కపటవర్తనుడైన భస్మాసురుని పాలిటి కాలదండమితడు. కంభము (స్తంభము)లో నుండి వెలువడిన (బయటకు వచ్చిన) విపరీతమైన వీరసింహము ఇతడే. చపలత్వము కలిగిన బాణాసురుని భేదించి యుద్ధంలో ఛేదించి, శంకరుని వినతితో అనుగ్రహించినదీ శ్రీహరియే.

ధరణిక్రిందవున్న పాతాళమునకు బలిచక్రవర్తిని అణగద్రొక్కినదీ శౌరియే. దురమున (యుద్ధంలో) యెదిరిన (ఎదిరించిన) కోట్లాదిదైత్యుల పాలిటి ధూమకేతువు (తోకచుక్క) ఈ శ్రీహరియే. ఒరసిన (ఘర్షణపడిన) నరకాసురుని పాలిటికి ఈ శ్రీహరి ఉరమని పిడుగువంటివాడు. పిడుగులు ఉరుము వినిపించిన పిదప పడతాయి. కాని ఈ శ్రీహరి దైత్యులపై పడేటప్పుడు ఏవిధమైన ఆర్భాటమూ వుండదు. రావణాసురుని దశకంఠములను ద్రుంచిన ప్రళయ వాయువు ఈ శ్రీహరియే.

ఇదిగో విధి (బ్రహ్మదేవుడు) రుద్రాది దేవతలకొరకు అవనిలో వెలసిన వేల్పు ఈ దేవదేవుడే. ఆశ్రితులను జాగ్రత్తగా రక్షించు ఆశ్రిత పారిజాతము ఈతడే. కోట్లాది బ్రహ్మాండములకు ఈయన సుస్థిరుడైన కన్నతండ్రి. తన భక్తులను వెదకి వెదకి మరీ వరములొసగేవాడు ఈ శ్రీవేంకటేశ్వరుడే.

పద్యవివరణ:

కం॥ **శ్రీవేంకటగిరిమీదను**
ఓ వనితా! వీడె చేరె వొద్దికతోడన్
ఈ విశ్వరూపుడే పో
చావై కౌరవుల గూల్చె సఖులను బ్రోచెన్.

సంఖ్య: IX/297 రాగం : సముద్రదీపిక
కీర్తన : అంగమెల్ల జెమరించె నమ్మగారికి

సముద్రదీపిక

2 అంగమెల్లఁ జెమరించె నమ్మఁగారికి
అంగజరసములుబ్బీ నయ్యఁగారికి ॥పల్లవి॥

చెక్కునఁబెట్టిన చేయి సెలవి నవ్విన నవ్వు
అక్కజమై తోఁచీ నదె అమ్మఁగారికి
చిక్కని మోముకళలు చెయివట్టి పెనఁగేటి
అక్కర వేడుకనిండె నయ్యఁగారికి ॥అంగ॥

సరుస కంబముమాఁటు సమరతితోడు చూపు
అరుదుగఁ జిమ్మిరేఁగె నమ్మఁగారికి
తొరల నాడినమాట తొడమీఁద నింతిఁబెట్టి
అరమరపులునిండె నయ్యఁగారికి ॥అంగ॥

మంచముపై సరసాలు మర్మముపై మంతనాలు
అంచుమోచె నెదుటనె అమ్మఁగారికి
కొంచక అలమేల్మంగఁ గూడినట్టి గురుతిదె
అంచ శ్రీవెంకటగిరి అయ్యఁగారికి ॥అంగ॥

ఉపోద్ఘాతము:

మధుర శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. అమ్మగారు దేవేరి అలమేలుమంగ అయ్యగారు వేంకటవిభుడు. ఆమెగారికి మదనతాపము హెచ్చి తనువెల్ల చెమర్చినది. ఆయనగారికి కామరసములబ్బి తమకములు అధికమైనవి. ఇద్దరి స్థితిగతులను వర్ణిస్తున్నారు అన్నమయ్య.

పరిణితలేని బాలబాలికలకీ కీర్తన త్యజింపదగినదే అని నా అభిప్రాయము. వివరణ చదివితే మీరూ నాతో ఏకీభవిస్తారు. ఆఖరి

చరణాల అన్వయం, చూడండి "ఏ సంకోచములేక అలమేలుమంగను కూడినట్టి గుఱుతులివిగో శ్రీవేంకటగిరి హంస అయిన అయ్యగారిపై". మరి అదండీ శృంగారకీర్తన అంటే.

తాత్పర్య వివరణ:

ఈ అమ్మగారికి ప్రియసమాగమ పారవశ్యంబున తన అంగమెల్లా (శరీరమంతా) చెమరించెను (చెమర్చినది). ఇక అయ్యగారికి తమకంతో మన్మథ రసములు వుబ్బినవి (ఉప్పొంగినవి).

అమ్మగారు తన చెక్కిలిపై చేయిజేర్చి చిరునవ్వులు చిందిస్తున్నది. ఆయన జగన్మోహనరూపం చూచిన ఆమెగారికి విపరీతమైన ఆశ్చర్యం కలిగింది, పురుషుల్లో ఇంత అందగాళ్ళుంటారా! అని. తనకు దక్కిన కళలకాణాచియైన ఆమెను గాఢముగా చుట్టుకొని పరవశించాలని అయ్యగారికి చిలిపివూహ కలిగింది. ఆయనకు ఎంతో వేడుక కలిగింది.

సరగునయున్న స్తంభముచాటున సమరతిపెనగిన అమ్మగారికి అరుదుగా అంగనలకు కలిగే వివశత్వము కలిగినది. ఇక అయ్యగారికి, తొడలనాడిన మాట (వేగిరముతో పలికిన మాటలు) ఆమె తన తొడపై కూర్చొనియుండగా వచ్చాయి. అరమరపులు నిండెను (ఏమాత్రమూ బరువులేనందువల్ల అపరిమితమైన సందేహం కలిగినది).

ఇకవారి శయ్యపై సరసాలు. రహస్యపు మంతనాలు జరిపిన అమ్మగారికి యెదుటనే (తన కట్టెదుటనే) అంచెమోచె (స్తనాగ్రమును ఆయనకు అందించి చిలిపి పారవశ్యత కలిగించినది). శ్రీవేంకటేగిరి అంచ (తిరుమలలో వెలసిన హంస) అయిన శ్రీవేంకటేశ్వరుడు ఏమాత్రమూ సంకోచించక అలమేల్మంగను గూడినాడు. ఇదే ఆ గుర్తులు కానవచ్చుచునే యున్నవి.

పద్యవివరణ:

తే.గీ॥ **అమ్మగారికి జెమరించెనంగమెల్ల**
అయ్యగారికి వుబ్బీని అధికమగుచు
అంగజరసము, కూడిరి హరి తరుణులు
మధురమారేయి చెలరేగె మన్మథుండు.

సంఖ్య: I/271 రాగం : విటపి
కీర్తన : అది నాయపరాధ మిదినాయపరాధ-

విటపి

3 అది నాయపరాధ మిది నాయపరాధ-
మదియు నిదియు నాయపరాధము ॥పల్లవి॥

నెరయ రూపములెల్ల నీరూపమేకా-
నరయనియది నాయపరాధము
పరిపూర్ణుఁడగు నిన్నుఁ బరిచ్ఛిన్ననినిఁగా-
నరయుట యది నాయపరాధము ॥అది॥

జీవాత్మునిఁగాఁ జింతింపఁ దలఁచుట
యావంక నది నాయపరాధము
సేవించి నిను నాత్మఁ జింతింపకుండుట
ఆవల నిది నాయపరాధము ॥అది॥

యీడెరఁగక వేంకటేశుఁడ నినుఁ గొని-
యాడుట యది నాయపరాధము
యేడఁ జూచిన నాయెదుర నుండఁగ నిన్ను-
నాడనీడ వెదకు టపరాధము ॥అది॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య పరమాత్ముని ఓ దేవదేవా! అదీ నా తప్పే ఇదీ నా తప్పే ఒప్పుకొంటున్నాను. నన్ను మన్నించు అంటున్నారు. ఏమిటా తప్పులు? పరమాత్మ సర్వవ్యాప్తుడు. విశ్వమంతా కిక్కిరిసి నిండియున్నాడు. అది గ్రహించలేకపోవటం ఒక ఘోరతప్పిదము. అట్టి పరమాత్మకు దేశకాలనామ రూపములతో పరిమితిని విధించడం నా రెండవ తప్పు. రెండూ నా అపరాధములే. నిన్ను సేవించి నా ఆత్మలో ప్రతిష్ఠించలేకపోవటం నిజంగా నా అపరాధమేనయ్యా! అంటున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నా శక్తి సామర్థ్యాల పరిమితి నెరుగక అనంతుడవు అవ్యక్తుడవు అయిన నిన్ను, సులభంగా కీర్తించి

నీ అనుగ్రహం పొందాలనుకోవటం నా తప్పుల్లోకెల్లా పెద్దతప్పు. నా ఎదుటనే నీవుండగా యెక్కడో వైకుంఠంలోనే వుంటావని అనుకోవటం నా ఘోర తప్పిదమే, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! అది (నీవు విశ్వవ్యాప్తుడవని గుర్తుంచుకోకపోవటం) నా అపరాధము (తప్పు). ఇదీ (పరమాత్మవైన నీకు దేశ, కాల, నామ, రూపములతో పరిమితిని విదించుట) నా అపరాధమే (తప్పిదమే). అదియు నిదియూ (ఆ రెండు తప్పులూ) నావే.

ఈ సృష్టిలో అనేక విధములుగా గోచరించుచున్న రూపములన్నీ నీ రూపములే. నీవు పరిపూర్ణుడవు. అట్టి నిన్ను పరిచ్ఛిన్ననిగా (విభజించదగ్గవానిగా) అరయుట (చూచుటకూడా) నా అపరాధమే. ఇలా యెన్ని అపరాధాలను చేస్తున్నానో చెప్పలేకున్నాను.

జీవుల ప్రాణశక్తి నీవిచ్చినదే అయినందున జీవాత్మ నీవేనని నేను పొరబడినమాట నిజమే. ఆ వంక (ఆ విధముగా) చింతించదలచుట నా అపరాధమే. అయితే నీవు మాకు ఆత్మలనిచ్చింది నిన్ను సేవించి మా ఆత్మలలో ప్రతిష్ఠించుకోవాలని, గ్రహించమని, ఆ విధముగా ఆత్మావలోకనముద్వారా నిన్ను సేవించలేకపోవటం నా తప్పుకాక మరేమిటి?

ప్రభూ! నీవు నాకు కలలో నీ దర్శనము నొసగినప్పుడు నేను చాలా చిఱుత ప్రాయమువాడను. ఆ నాచిన్ననాటినుంచే నిన్ను కీర్తించనారంభించాను. అదే నా తప్పిదమా? ఓ శ్రీవేంకటేశ్వరా! యెక్కడ జూచినా నీవే నా యెదురుగా వున్నావు. అది గ్రహించక కేవలం తిరుమల శిఖరాలపైననే వున్నావని భ్రమించడం ఘోరాతిఘోరమైన అపరాధము.

పద్యవివరణ:

కం॥ **అదియును నాయపరాధమె**
ఇది నాయపరాధమయ్య! ఇదియున్ అదియున్
గుదియగు అపరాధంబులె
వదలవు నన్నెన్నడేని పన్నగశయనా!

సంఖ్య: IV/75/P411 రాగం : సరస్వతి
కీర్తన : అన్నిటా దాము నతిశయులే

సరస్వతి

4 అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగనధికులె యెసఁగఁగను ॥పల్లవి॥

పరంపరలగు భవములఁ బొడమియు
చిరంతనులే జీవులిదే
ధురంధురులే దురిత సుకృతముల
జరామరణ విశారదులే ॥అన్నిటా॥

సదా బహుల విషయమత్తులయ్యు
మదాతురులే మనుజులిదే
ముదాసక్తులే మోహవిదూరులే!
చిదానందులే చిరయశులే ॥అన్నిటా॥

భృశం సుఖులే పుణ్యులందరు
సుశాంతాత్ములే శుభమతులే
విశారదులే వేంకటరమణుని
వశంవదులే వరిష్ఠులే ॥అన్నిటా॥

ఉపోద్ఘాతము:

"లోకోభిన్నరుచిః" అని పెద్దలు చెప్పిన విషయాన్ని అన్నమయ్య అద్భుతమైన ఈ కీర్తనలో వివరిస్తున్నారు. అద్భుతమైన కీర్తన అని యెందుకంటున్నానంటే యెక్కడా హరి సన్నుతి కనబడదు కానీ నిజానికి హరి సంస్మరణయే. దీన్ని వివరించడం నల్లేరుపై నడక కాదు, కీకారణ్యం దాటడమే. ఈ మానవులు అన్నిటిలోనూ తాము అతిశయించిరి. తమబోటివారిలో అధికులై యెన్నుకోబడినారు. వీరు బహువిధములుగా

జీవించి కొందరు భ్రష్టులైనారు కొందరు వరిష్ఠులైనారు. కొందరు మదోన్మత్త మోహవిదూరులైనారు, కొందరు చిదానందచిరయశులైనారు. ఇలా యెందుకు జరుగుతున్నది? కాస్త ఆలోచించి సమాధానం ఇవ్వండి.

తాత్పర్య వివరణ:

ఈ మానవులు, తాము అన్నిటన్ అతిశయులే (అతిశయించినవారే). ఎన్నికకాబడి సర్వాధికులై యెసగిరి (వర్ధిల్లిరి).

ఈ లోకములో, పరంపరలగు భవములు (వరుసగా అనేక జన్మలు) బొడమియు (పొందికూడా) ఈ జీవులంతా చిరంతనులే (చిరకాలమునుండీ వున్నవారే సుమా!) వీరంతా దురంధరులే (అనేక భారములను బాధ్యతలను వహించినవారే). దురితసుకృతముల నొనరించినవారే (పాపములను పుణ్యములను రెంటినీ చేసినవారే). జరామరణ విశారదులే (వృద్ధాప్యముచే పీడించబడి మరణించినవారే సుమా!)

వీరిలో కొందరు యెల్లప్పుడూ బహు (అనేకరకములైన) విషయ వాంఛలలో మత్తెక్కి జీవించారు. ఇదే ఆ మనుజులు, మదాతురులే (అధికమైన మదముచే అతిశయించినవారే) అయ్యారు. వీరిలో కొందరు ముదాసక్తులు (ఎప్పుడూ సంతోషం కోరుకొంటుంటారు). వారు మోహవిదూరులే (మోహమునుండి చాలా దూరమున నున్నవారే). కొందరు వారిలో చిదానంద స్వరూపులూవున్నారు. వారికి చిరకాలం యశస్సు (కీర్తి) కలుగక యెలా వుంటుంది?

ఇక మరికొందరున్నారు. వారు భృశంసుఖులు (అధికమైన సుఖాపేక్ష గలిగినవారు). సుఖము కావాలనుకొన్నవారు పుణ్య కార్యములు చేస్తూ మంచి శాంత చిత్తులై శుభములను కోరే మానవులై వుంటారు. విశారదులై (ప్రావీణ్యము) కలవారై వుంటారు. వారంతా శ్రీవేంకటేశ్వరునకు వశంవదులే (వశమై చరించేవారే), వరిష్ఠులే (సర్వశ్రేష్ఠులే సుమా!)

పద్యవివరణ:

ఆ.వె॥ **అన్నిటాను తాము అతిశయించినవారె**
ఎసగనధికులైరి యెన్నబడిరి
ధర వరిష్ఠులైరి తము వశంవదులైరి
మాధవుని భజించి మానవాళి.

సంఖ్య: IV/190 రాగం : చారుకేశి
కీర్తన : అన్నియు నాలో నుండగా నవ్వలనేమి చూచేము

చారుకేశి

5 అన్నియు నాలో నుండఁగ నవ్వల నేమి చూచేము
యెన్నఁడు గానని మాయ యెరఁగవో మనసా ॥పల్లవి॥
యీడనే సంసార మిదె యింద్రజాలమై యుండఁగ
యేడకైనాఁ జూడఁ బోయే మింద్రజాలము
పాడితో నా పుట్టుగులే బహురూపాలై యుండఁగ
వేడుకయ్యీ బహురూపవిద్యలు చూడఁగను ॥అన్నియు॥
నటన దినదినము నాటకమై యుండఁగాను
సటవట నాటకాలు సారెఁ జూచేము
ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను
ఆటమటపువిద్యలు అన్నియుఁ జూచేము ॥అన్నియు॥
పాపపుణ్యములు రెండు బారివిద్య లుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము
యేపున శ్రీవేంకటేశుఁ డిటు మమ్ము భ్రమపాపె
నా పనులు నేనే చూచి నవ్వులు నవ్వేను ॥అన్నియు॥

ఉపోద్ఘాతము:

అన్నియా నాలోనే వుండగా వేరొకటి చూడటం దేనికి? ఓ మనసా! నీవెన్నడూ గ్రహించలేని మాయ ఇదే అని యెరగలేకున్నావు కదా! అంటున్నారు అన్నమయ్య. కీర్తన అంతా చక్కటి సీసపద్యంలో ఇమిడింది గమనించండి.

తాత్పర్య వివరణ:

ఓ మనసా! అన్నియు (నేను వివరించబోతున్న లక్షణములు సర్వమూ) నాలోవుండగా ఇంకా అవ్యల (అక్కడెక్కడో) చూడవలసిన అవసరమేముంది? ఎన్నడునూ చూడని మాయ ఇదని యెరుగలేవా.

ఈడనే (ఇక్కడ నాకన్నుల యెదుటనే) వున్న ఈ సంసారము, ఇదే గొప్ప ఇంద్రజాలము వంటిది. ఇది వుండగా యెక్కడననో ఇంద్రజాలము చూపిస్తున్నారట చూడాలి అని బయలుదేరాను. పాడితో (క్రమముగా) జరిగిన

నా పుట్టుగులే (జన్మలే) బహురూపములై యున్నవి. ఒకసారి జంతువుగాను, ఒకసారి పక్షిగాను, ఒకసారి కీటకంగాను ఒకసారి జలజరముగాను పుట్టాను. ఇంకా అక్కడెక్కడో బహురూప విద్య చూపిస్తున్నారంటే పరిగెడతాను. ఎంత బుద్ధిహీనుడిని.

దినదినమూ నేను నటిస్తూనే నాటకము వంటి జీవితం గడుపుతున్నాను. కానీ యెక్కడనో కపట పాత్రధారులు నటించే నాటకం ప్రదర్శిస్తున్నారంటే నిద్రమానుకొని ఆ నాటకము చూస్తాను. మాయా ప్రభావితుడనై అనేక సంఘటనల్లో కనికట్టుకు లోనైనట్లుండగా, నిజముగానే అటమటపు (వంచన జరిగే) కనికట్టు విద్యాప్రదర్శనకు పరుగులు పెడతాను. ఎంత తెలివిలేనివాడిని!!

నేను అనునిత్యమూ పాపపుణ్యములనబడు రెండు విధములైన బారివిద్యలను (అతికష్టభూయిష్టమైన నేర్పు ప్రదర్శించు విద్యలు) జరుపుచునేయున్నాను. కానీ, కోపులన్ ఆటలవారిని చూడనేగెదము (కానీ తీగెపై ఆటలాడేవారు ప్రదర్శించే ఆటలు చూడాలని ఆరాటపడుతుంటాను. దయదలచిన శ్రీవేంకటేశుడు మమ్ము భ్రమలనుంచి వెలికిదీసినాడు. ఈనాడు నేను చేసిన పనులను జూచి నేనే నవ్వుకొంటున్నాను.

పద్యవివరణ:

సీ॥ **ఈడనే సంసారమిదె ఇంద్రజాలంబు**
యేడకోపోనేల యెంచి చూడ
పగర నా జన్మలే బహు రూపములు కదా!
బహురూపవిద్యకై పరుగులేల?
దినదిన నటనల మనుగడే నాటక-
మిక వేఱు నాటకమేల చూతు?
పలుమాయలంబడి కలిగెను కనికట్టు
వేఱొండు కనికట్టు కొఱకు బొదు

తే.గీ॥ **పాపపున్నెములను రెండు బారివిద్య-**
లుండ, తీగపై నాటకు వురుకులేల?
వేంకటేశుడు భ్రమలోన బెట్టెనేల?
నవ్వులొచ్చెను ననుజూచి నాకెమనస!

సంఖ్య: II/14 రాగం : బృందావని
కీర్తన : అనుచు నిద్దరునాడే రమడలవలెనే

బృందావని

6 అనుచు నిద్దరునాడే రమడలవలెనే

మొనసి యివెల్లాఁ జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు ॥పల్లవి॥

రాముఁడ పండ్లు నాకు రండు వెట్టరా
యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు
ప్రేమపుతమ్ముఁడఁగాన పిన్ననే నీకు
యీమాట మఱవకు యిందరా కృష్ణుఁడా ॥అనుచు॥

యెక్కిన వుట్టిపై నన్ను నెక్కించరా వోరి
వుక్కునఁ బడేవు రాకు వద్దురా నీవు
పక్కున మొక్కేరా నీపయిఁడికాల్లకు వోరి
అక్కతోఁ జెప్పేఁగాని అందుకొనే రారా ॥అనుచు॥

యెవ్వరు వొడవో సరి నిటు నిలుతమురా వోరి
నివ్వటిల్ల నీ వింత నిక్కవొద్దురా
రవ్వల శ్రీవేంకటేద్రిరాయఁడనేరా అయితే-
యివ్వల నీకంటేఁబెద్ద యిది నీ వెఱఁగవా ॥అనుచు॥

ఉపోద్ఘాతము:

"అమడలు" అంటే కవలపిల్లలు అని అర్థం. ఈ కీర్తన బలరామకృష్ణుల సంవాదము. అలా విడిగా ఆలోచిస్తేనే ఈ కీర్తన అర్థమవుతుంది. నిజంగా ఇద్దరు పిల్లలు ఒకే ఈడువాళ్లు

మాట్లాడుకొంటున్నారా అనిపిస్తుంది. పల్లవిని చూద్దాం. ఇట్లా అనుకొంటూ ఆ ఇద్దరూ కవలపిల్లలవలెనే ఆడుకొనిరి. అతిశయించిన యివన్నీ చూచి బ్రహ్మాది దేవతలు ఆహా! యేమి మన భాగ్యము!! ఆదినారాయణుని ఆదిశేషుని ఇట్లు చూచి తరించినాము అని మనసారా వారికి మొక్కినారు. మొదటి చరణంలో "ఒరే రాముడూ! నాకు రెండు పండ్లు పెట్టరా" అని అడిగాడు కృష్ణుడు. దానికి రాముడు గడుసుగా "ఏమిరా నీవూ నాకు ఇట్లానే నీవు ఇత్తువా" అన్నాడు. ఇక మూడవ దాంటో "ఒరే! నీకు పిన్ననే? ప్రేమపు తమ్ముడగానా!! అని గునిసాడు కృష్ణుడు. "అదీ! ఈ మాట మరువకు మరి. ఒరే! కృష్ణుడూ ఇందరా తిను" అన్నాడు రాముడు. ఇది అన్నమయ్య రమణీయ కల్పనా విభావరి.

తాత్పర్య వివరణ:

అనుచు (ఇట్లా అనుకొంటూ) ఆ ఇద్దరును అమడలవలెనె (కవలపిల్లల మాదిరిగా) మాట్లాడుకొన్నారు. మొనసి (అతిశయించునట్లు) ఇదంతా చూచిన బ్రహ్మాది దేవతలు ఆ అపర ఆదినారాయణునకు ఆదిశేషునకు భక్తిపారవశ్యమున మ్రొక్కిరి ఆపైన వారి యీ సంవాదమును వినిరి.

"రాముడా! నాకు, రం(రెం)డు పండ్లు వెట్టరా (పెట్టరా)"

"ఏమిరా! నీవు నాకు యిట్లానే యిత్తువా?"

"నీకు పిల్లనే? (చిన్నవాడిని కదరా!) ప్రేమపు తమ్ముడగానా?"

"మరువకు యీమాట. కృష్ణుడా! యిందరా (ఇదిగో తీసికో)".

"ఓరి రాముడూ! యెక్కిన వుట్టిపై (ఎత్తైన ఆ వుట్టి మీదకు) నన్ను యెక్కించరా!"

"ఉక్కున (ఉక్కిరిబిక్కిరియై) నీవు, పడేవు (క్రింద పడిపోతావు). వద్దురా. రాకురా (రావద్దు)".

"ఓరి! అన్నా! నీ పయిడికాళ్ళకు (బంగారు పాదాలకు) పక్కున (చటుక్కుమని) మొక్కేరా (దండము పెడతానురా)"

"అక్క(ర)తో (ఆపేక్షవల్ల) చెప్పానురా! కానీ, రారా! దీనిని అందుకొనే (అందుకొనేవు)".

"ఓరి! రాముడూ! సరి (సరే!) ఎవ్వరు వొడవో (మనిద్దరిలో ఎవ్వరు పొడుగో), ఇప్పుడు కొలుచుకుందాము, రారా! ఇటు నిలుతువు (ఇక్కడ నిలబడు, యిప్పుడు నీకన్నా నేనే పొడుగు)."

"ఒరే! నీవింత నివ్వటిల్ల నిక్కవొద్దురా! (అతిశయంతో గర్వపడకు. ఇప్పుడు నేను అన్నను అని గుర్తుంచుకో)".

"నేనూ, శ్రీవేంకటేశ్వరుడనని గుర్తుంచుకోరా!"

"అయితే అయింది. నీకంటే పెద్దవాడిని. శేషాద్రిపతిని. నీకు గుర్తులేదా? వేంకటన్నా!"

పద్యవివరణ:

కం॥ **అనుచును యిద్దరు బల్కిరి**
విని అమడల వలెనెనున్న విష్ణుని శేషున్
మొనసియివెల్లను జూచుచు
ఘన బ్రహ్మాదులును మొక్కి గాంచిరి లీలన్.

సంఖ్య: V/26 రాగం : మోహనకళ్యాణి
కీర్తన : అప్పటియెండ చెమటలట్టే వుండేనా

మోహనకళ్యాణి

7 అప్పటి యెండ చెమటలట్టే వుండీనా
నెప్పు దప్పు బొంకేవు నే నెఱంగనా ॥పల్లవి॥

ఆవులఁ గాచిన నాటి యడవికంపల జీర-
లావల నేఁడు మాయక అట్టే వుండీనా
యేవంక నెవ్వతో నిన్ను నెనసి చేసిన చేఁత
నీవెంత మొఱఁగిన నే నెఱంగనా ॥అప్పటి॥

వెన్నలు ముచ్చిలునాఁడు వేఁడి పాలారగించిన-
అన్నువ నీ మోవి పొక్కులట్టే వుండీనా
వన్నెకాఁడ యెవ్వతెకో వలలఁ జిక్కిన నీ-
నిన్న మొన్నటి సుద్దులు నే నెఱంగనా ॥అప్పటి॥

రంగుగ మధురలోని రమణి మెత్తిన నాటి-
అంగడి గందపుఁ బూఁతలట్టే వుండీనా
చెంగట మొఱఁగి కలసితివి వేంకటరాయ
నింగి మోచిన చేఁతలు నే నెఱంగనా ॥అప్పటి॥

ఉపోద్ఘాతము:

తాటిచెట్టెందుకు ఎక్కావురా అంటే దూడ గడ్డికోసం అన్నట్లున్నదీయన వ్యవహారం. ఏమిటయ్యా అంత తడిసి ముద్దయ్యావు అని నాయిక అడిగితే అప్పుడు రేపల్లెలో యెండలో ఆవుల్ని కాచాడట అందుకని అవి చెమటచారలట. ఒంటిమీద ఆ గాట్లేమిటంటే ఆవుల్ని కాస్తుంటే ముళ్ళకంప తగిలి గీరుకుపోయిందట. నీ పెదవులపై ఆ పొక్కులేమిటంటే, తను వెన్నదొంగతనంగా తింటూ ఎవరన్నా చూస్తారని చటుక్కున వేడిపాలు నోట్లో పోసుకొన్నాడట పెదవులు కాలిపోయాయట. నీ ఒంటినిండా ఆ గంధపు పూతలెక్కడివని అడిగితే మధురానగరంలో కుబ్జ మరీ ఒత్తుగా గంధము రాసిందట అదింకా పోలేదట. ఇక ఒళ్ళుమండిన నాయిక ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఆకాశాన్ని తాకిన అఖండుడవని నేనెరంగుదునులే. నీవు నెప్పుదప్పు బొంకేల చెప్పెదవు

నీ వ్యభిచార వర్తనము నేనెరుగనిదా అని దెప్పి పొడిచింది. ఇది, తాళ్ళపాక అన్నమాచార్యుని చమత్కార శిల్పము.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! అప్పటి (ఆనాడు రేపల్లెలో కుఱ్ఱవాడివై నీవు వుండగా) యెండలో తిరిగి ఆవుల్ని కాచేనాటి చెమట చారికలు అట్టే వుండీనా? ఎందుకు నెప్పుదప్పు బొంకెదవు (ఎప్పుడు పడితే అప్పుడు అబద్ధాలు చెబుతావు?) నేనెఱగనా (నీ దొంగ వేషాలు నాకు తెలియదా) ఎవ్వరిదగ్గర నీ బొంకులు?

నీవు ఆవుల్ని కాచేరోజుల్లో అడవిలో ఒకసారి ముళ్ళకంపలో పడిపోయావా? నేడు ఆ జీరలు మాయక అట్టే వుండీనా? ఆహా! ఏమి బొంకుతున్నావు? నిన్ను ఏవంకలోనో ఎవ్వతో నీ ఒంటిపై కామోద్రేకంతో గీరి వుంటుంది. అతిశయించిన నీ కామకేళి నేనెరుగనిదా? నీవెంత మొరగినా (వాదించినా) నాకు నీ వేషాలన్నీ తెలియును.

నీవు వెన్నలు ముచ్చిలునాడు (దొంగతనం చేసేరోజుల్లో) ఒకరోజు పొరబాటున వేడిపాలు నోట్లో పోసికొనగా పెదవులు కాలినవా? అన్నువనీ మోవి పొక్కులు (ఆ తొందరలో నీ పెదవులు పొక్కులైనవా?) ఏమి కథలల్లుతావు? ఓ వన్నెకాడా! నీవు దేనివలలో పడ్డావో నేనెరుగనా? నిన్న మొన్నటిదాకా బృందావనంలో తమరి రాచలీలలు నేనెరుగనా?

నీ వంటిపై ఆ గంధపు పూతల గురుతులెక్కడివి? అంటే నీ సమాధానం ఏమిటో యెలా చెప్పావయ్యా! రంగులీనే మధురానగరంలో కుబ్జ వంటి రమణులు (జాణలు) నీ శరీరంపై మెత్తిన పరిమళ గంధపు పూతలు, అట్టే వుండీనా? ఓ శ్రీవేంకటేశా! నీవు చెంగట మొఱిగి కలిసితివి (నా ముందర మొండిగా వాదించి నన్ను కూడినావు). నింగిమోచిన నీచేతలు (ఆకాశమును ఆక్రమించిన ఘనుడవు నీవని) నాకు తెలియదా?

పద్యవివరణ:

ఉ॥ **అప్పటి యెండలో చెమట కంటిన చారలు నేడునిల్చెనా**
నెప్పులు దప్ప బొంకెదవు నీవ్యభిచారము నేనెరుంగనా
ఇప్పుడుయెట్లు కానబడు యెప్పటికన్నెల వెన్నదొంగవో
తప్పిదమంతనాదె తమిదగ్గర జేరితి వేంకటేశ్వరా!

సంఖ్య: V/147 రాగం : అఠాణి
కీర్తన : అయ్యో వీడు నన్నణకించీనే వీని-

అఠాణి

8 అయ్యో వీఁడు నన్నణఁకించీనే వీని-
కొయ్యతనాలణఁచక కోపమేల తీరునే ॥పల్లవి॥

గుట్టున వాఁడిందు రాఁగ గొబ్బున నే ముంగురులు
పట్టుకొని పరపుపైఁ బడఁదీసి
గట్టిగ గుబ్బలమీఁది కస్తూరిచెమటలనే
అట్టునిట్టు సేయక నా యలపేల తీరునే ॥అయ్యో॥

గక్కున వాఁడిందు రాఁగా గడెవెట్టి తమకాన
చెక్కుదోయి నా కొనచేతనే నొక్కి
పుక్కిటితమ్ముల మిడి పొదిగొన్న కౌఁగిటిలో
నొక్కినఁగాని నా నొగులేల తీరునే ॥అయ్యో॥

కూరిమి వాఁడిందు రాఁగా కొంకక నా వాఁడిగోళ్ళ
జీరలుగా నొడలెల్ల జిమ్ముచుఁ దీసి
ధీరత వేంకటగిరి దేవుఁడైన వానికి నా-
నేరుపెల్లఁజూపక నా నెగులేల తీరునే ॥అయ్యో॥

ఉపోద్ఘాతము:

శృంగార నాయిక వేదన బహురసవత్తరంగా అభివర్ణిస్తున్నారు, అన్నమయ్య ఆమె 'శివంగి'యై వేంకటగిరిరాయడు కంటబడితే రక్కిబెడదామని ఆలోచిస్తోంది. తన గబ్బిగుబ్బలపై అంటిన చెమటల కస్తూరిని ఆయనకు వంటిపై మెత్తేయాలట. ఆయనలోపలికి రాంగానే గడియబెట్టేసి మీదపడి చెక్కిలితో నొక్కి తన నోటితాంబూలం ఆయన నోట్లో దోపి వూపిరాడకుండా సందిటగట్టిగా బంధించక తనబుగులోతీరే దారేలేదట. నావాడిగోళ్ళతో నా వాడిని గీరి వాడి వక్షస్థలాన్ని

చీరేస్తాను. శ్రీవేంకటేశ్వరుడు దేవుడైతే నాకేం? నా నేర్పరితనమంతా ధైర్యంగా చూపించకపోతే నానెగులెలా తీరుతుందే అంటున్నారు. ఇంతకీ ఈ కీర్తనపల్లవి అంత తేలిక అని భావించవద్దు. అయ్యో! వీడు తనచిలిపి పనులతో నన్ను నవ్వులపాలు చేస్తున్నాడే. వీడి ఆలస్యం భరించలేను. వీడి కొరకరాని కొయ్యతనం అణచకపోతే నా కోపం యెలా తీరుతుందే? అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలీ! అయ్యో! (అక్కటా!) వీడు నన్ను అణకించీనే (అపహాస్యంపాలు జేస్తున్నాడే) వీడి కొయ్యతనము (చిలిపితనమును) అణచకపోతే నాకోపం ఎలా చల్లారుతుందే.

వాడు (శ్రీవేంకటేశుడు) గుట్టున (రహస్యంగా) ఇక్కడకు రాంగానే గొబ్బున (తటాలున) వాని ఉంగరాల జుట్టుపట్టి పరుపుపై పడవేసి కస్తూరిపూత మెత్తిన నా గుబ్బిగుబ్బలపై చెమటలు అంటునట్లు అట్టునిట్టు సేయక నా యలుపేల (అలసట) తీరే దారి కనబడుటలేదు.

వాడు (ఆ తిరుమలరాయుడు) ఇక్కడకు రాగానే తటాలున తలుపు గడియ పెట్టేసి తమకంతో నా చేతికొనలతో వాని బుగ్గలు నొక్కి నా బుగ్గనున్న ఎఱ్ఱని తమ్ములపు తమ్మిని వాని నోటగుక్కి కొగలించి గట్టిగా నొక్కివేయకపోతే నా నొగులు (నా పగ) ఎలా చల్లారుతుందే చెలియా! నువ్వైనా చెప్పవే.

అయ్యగారు శృంగారరాయలుంగారు కదా! రాత్రి శృంగారానికి వస్తారు కదా! అప్పుడు చెబుతాను ఆయనపని. వాడు కూరిమితో, ఇందురాగా (ఇక్కడకు వచ్చినదే తడవుగా) కొంకక (ఏమాత్రమూ జంకక) నా వాడిగోళ్ళతో వాడి వొడలంతా జీరలుగాగ (తట్లు తేలేలాగా) ఒళ్ళంతా గీకిపెడతా. నేనూ ధైర్యలక్ష్మినే. ఆయన శ్రీవేంకటేశ్వరుడే. దేవుడైతే నాకేమిటి? నా నేర్పరితనము చూపక నా నెగులేల దీరునే (నా కోపమెట్లా చల్లబడుతుందే?)

పద్యవివరణ:

ఆ.వె॥ **అకట! నన్ను'వీడు' అణకించెనే చెలీ!**
రయమునేలరాడు రాయడిటకు
కొయ్యతనమణచక కోపంబుతీరునా?
నేనణచెద వీని నేర్పుజూపి.

సంఖ్య: I/163 రాగం : కేదారగౌళ
కీర్తన : ఆటవారి గూడితౌర

కేదారగౌళ

9 ఆటవారిఁ గూడితౌరా
ఆటవారిఁగూడి అన్నిచోట్ల బొమ్మ-
లాట లాడించ నధికుండవైతివి ॥ఆట॥

గురుతరమగు పెద్దకొట్టాము లోపల
తిరమైన పెనుమాయఁ దెరగట్టి
అరయ నజ్ఞానము లవి యడ్డముగఁజేసి
పరగ సుజ్ఞానదీపములు ముట్టించి ॥ఆట॥

తోలుబొమ్మల దొరకొని గడియించి
గాలిచేత వానిఁ గదలించి
తూలేటిరసములు తొమ్మిది గడియించి
నాలుగుముఖముల నలువున నాడించ ॥ఆట॥

నిన్నే మెత్తురుగాని నీకేమి నీలేరు
మన్నించుదాతలు మరి లేరు
యెన్నఁగఁ దిరువేంకటేశ్వర నీదాసు
లున్నతులై నిన్ను నుబ్బించి పొగడఁగ ॥ఆట॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అధికుండవైతివి. ఔరా! ఆటలాడేవారిని గూడి సృష్టిలో యెక్కడ బడితే అక్కడ బొమ్మలాట ఆడిస్తున్నావు. మేము కేవలం నిమిత్తమాత్రులమై నీవు చెప్పినట్లు ఆడుతున్నాము అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తన వివరణ అనుకొన్నంత సులభం కాదు. దీనిని జాగ్రత్తగా గ్రహించండి. కొన్ని పదములు రాగం కోసం మార్పుచెంది అవగాహన క్లిష్టతరమైనది. ఉదాహరణకు ఈ చరణం చూడండి. "నిన్నే మెత్తురు గాని నీకేమి నీలేరు మన్నించు దాతలు మరిలేరు". నిజానికి ఇది "నిన్నే మెచ్చెదరు

కానీ నీకేమియున్ ఈయలేరు, నీవలె మన్నించు దాతలు మరిలేరు" అని వుంటే అర్థమవుతుంది. రాగంలో కీర్తన ఇమడవలెను కాబట్టి పదము లుప్తము రపభేదము చెందుతాయి. ఆ సమన్వయం కోసమే ఈ వివరణ.

తాత్పర్య వివరణ:

ఔరా! శ్రీవేంకటేశ్వరా! ఆటవారిని గూడితివి (ఆడించేవారిలో చేరిపోయావు) అన్నిచోట్లా (ప్రతిచోటా) బొమ్మలాటలాడించ (కదిలే బొమ్మలతో రకరకములైన ఆటలనాడించుటవలన అధికుడవైతివి (సర్వశ్రేష్ఠుడవైనావు).

గురుతరమగు (అత్యధికమైన పరిమాణముగల) ప్రపంచమనే పెద్ద కొట్టాములోపల (కోష్టములో) స్థిరమైన పెనుమాయ అనే తెరను కట్టినారు. ఆ తెరవలన అజ్ఞానము అనే అడ్డంకులు ఆ తెరచుట్టూ వున్నాయి. సుజ్ఞానము అనే దీపాన్ని ఆ కొట్టాములో వెలిగిస్తేనే సరైనదారి కనబడుతుంది. లేకపోతే తొక్కిసలాట ప్రమాదాలూ తప్పవు.

ఓ దేవా! ఆ కొట్టాములో ఒక గొప్ప తోలుబొమ్మలాట జరుగుతున్నది. ఈ తోలుబొమ్మలలో గాలిని 'ఆయన' నింపటం వలన ఆ తోలుబొమ్మలకి ఆడేశక్తి వచ్చింది. గాలిపోతే ఆటా ఆగిపోతుంది. ఏ బొమ్మలో ఎంత గాలివున్నదో ఎవ్వరికీ తెలియదు. తూలేటి (చంచలములైన) నవరసములు (శృంగారము, హాస్యము, కరుణ, వీరము, రౌద్రము, భయానకము, భీభత్సము, అద్భుతము మరియు శాంతము) వాటి ఆటకు జోడించి, నలుదిక్కులా ఆ తోలుబొమ్మలాటతో అందరికి నవవిధములైన ఉద్వేగములను కల్పించావు.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ బొమ్మలాట చూచినవాళ్ళంతా నిన్ను మెచ్చుకొంటారు. కానీ ప్రతిఫలంగా తిరిగి నీకు ఏమీ ఇవ్వలేరు. ఎందుకంటే నీవే అందరినీ మన్నించే దాతవు. నిన్ను మన్నించగలవాడెవ్వడు ప్రభూ! వారిలో కొందరు నీదాసులై నిన్ను వుబ్బించి (వారి ఆటలతో నిన్ను సంతోషపెట్టి) ఉన్నతులైనారు.

పద్యవివరణ:

కం॥ **ఆటలవారిని గూడియు**
నీటుగ ఆడింతువయ్య! నీవెల్లడయున్
పోటున అధికుడవైతివి
దీటుగ యీ బొమ్మలాట ద్రిప్పుచును హరీ!

*** పోటున = శౌర్యములో**

సంఖ్య: XXV/164 రాగం : ఖరహరప్రియ
కీర్తన : ఇంకానేల చలముయేమి సేయగలము

ఖరహరప్రియ

10 ఇంకానేల చలము యేమి సేయఁగలము
అంకెకు వచ్చెను అధరామృత ఫలము ॥పల్లవి॥

కలికి వనాలనీడఁ గడు నీకెదురుచూడ
కులుకునవ్వులతోడఁ గొప్పు వీడ
చెలులెల్లాఁ జూచేరు జిగిఁ గౌను లసియాడ
బలిమిఁ జేకొనవయ్య బత్తితోఁ గూడ ॥ఇంకా॥

సతి నీపాదాలు మెట్ట చన్నులు నీవు ముట్ట
తతి నిన్ను నిదె దిట్టతనాలఁ దిట్ట
అతివలు సొలసేరు అంగాలఁ జెమట దొట్ట
సతతము మెచ్చవయ్యా జాణలు చేపట్ట ॥ఇంకా॥

జలజాక్షి నీపక్క సరసముల వే చొక్క
తలపోసీఁ దనచక్కఁదనాలు నిక్క
లలి శ్రీవేంకటేశ నీలలన నీకు మొక్క
కలకాల మేలు మిక్కడ రతికెక్క ॥ఇంకా॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య శృంగార కవితాఝరి ఇది. దేవి చెలికెత్తలు శృంగారరాయని పద్దకు వచ్చి తమ నెచ్చెలి స్థితిగతులు వర్ణించి ఆమెను చేపట్టమని ప్రాధేయపడుతున్నారు. స్వామి శృంగార చేష్టలు చూచి వారికి కూడా తమకంతో అవయవములన్నీ చెమటలతో ముద్దయైపోయాయట. వీరంతా జాణలేకానీ వారూ నీవలపుల సరళికి నిన్ను చేపట్టమని ఆశిస్తున్నారు. కానీవయ్యా! నీకందరూ కావలసినవారే ఆమె నీలలన. కలకాలము నీకే మ్రొక్కుచున్నది. ఆనందపరవశుడవై ఆమెనేలుకోవయ్యా! అంటున్నారు. ఈ కీర్తన అంత్యప్రాసల విభావరితో అన్నమయ్య వైదుషీగరిమను చాటుతున్నది.

పల్లవే యెంత క్లిష్టమో చూడండి. ఇంకా మాకు స్త్రీ సహజమైన మచ్చరము యెందుకయ్యా? మేము యేమి చేగలవారము? నీవిచ్చిన అధరామృతఫలము యెవ్వతెమఱువగలదు. అదియేవనితనైనా వశపరచుకొగలదు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయా! మాకు చలము (మత్సరము), ఇంకానేల (ఇంకెందుకు?) ఏమిసేయగలము (మేము మరేమి చేయగలవారము?) నీ అధరామృతఫలము అంకెకు వచ్చెను (మమ్ము నీ అధీనము జేసినది).

ఈ కలికిని చూడవయ్యా! వనాలనీడలలో (గొప్పవృక్షముల నీడల్లో) కులుకుచు మధురస్మితయై నీకోసం యెదురుచూచింది. చీకాకుతో ఆమె కొప్పు కొంచెం సడలింది, యెందుకంటే ఆమెకేను (నడుము) ఆమె నడుస్తున్నప్పుడు అల్లల్లాడినది. అది చెలులమెల్లా చూచితిమి. మేమందరము భక్తితో నీవశమయ్యాము. ఇక మమ్ము చేకొనుమయ్యా!

ఆమె నీ పాదాలకు మ్రొక్కినది. నీవామెను లేవనెత్తుసమయమున కొంటెతనముతో ఆమె చన్నులంటినావు. నీవు చేసిన పనికి ఆమె దిట్టతనాన (ధైర్యముగా) యేమిటాపని అని తిట్టినది. ఆమె అయితే రోషంతో నిన్ను తిట్టిందికానీ అతివలమైన మేము అందరమూ అదిజూచి పారవశ్యముతో సొలసిపోయాము. మా అంగములు చెమటలతో తడిసి ముద్దయిపోయాయి. సతతము (యెల్లవేళలా) నీ జాణలమై పోయాము. మమ్ము మెచ్చవయ్యా! దయచూపి చేపట్టవయ్యా!

మరి మమ్మల్ని చూచిన ఆ జలజాక్షి పద్మావతి వూరకుంటుందా? నీ పక్కకు చేరి వేసరసాల (పలు సరసములతో) చొక్క (పరవశించినది) ఆమెకు నీవు మమ్ము కాదని తనను కూడినందుకు నిక్కు (గర్వము) యెక్కువయై తనెంత అందగత్తెయో, అని తలపోసింది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకూ నీలలనకు ఇదే మ్రొక్కుచున్నాము. కలకాలము రతికెక్కి (ప్రఖ్యాతితో) ఇక్కడ (తిరుమలలో) యేలుము.

పద్యవివరణ:

చం॥ **చలమది యేల నింక సరసంబున లొంగితిమయ్య నీకు నీ**
లలనలమయ్య అంకెకిటురాక మరొక్కటిసేయ నేర్తుమా
ఫలమది తీపి అద్దితివొ పండిన నీ అధరామృతంబహో!!
వలపులతేడ! వేంకటపు పన్నగశాయివి మేలుకో ప్రభూ!

సంఖ్య: II/307 రాగం : వరాళి
కీర్తన : ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును

వరాళి

11 ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁజూడవే ॥పల్లవి॥

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడనేరుతునంటా మరి నే నహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను
గాఁటాన దొరనంటా గర్వింతు నేను ॥ఇట్టి॥

నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు ॥ఇట్టి॥

మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నా తపోమహిమ యిది యనుచును
వున్నతి శ్రీవేంకటేశ నన్ను నేమి చూచేవు
అన్నిటా నాయాచార్యువిన్నపమే వినవే ॥ఇట్టి॥

ఉపోద్ఘాతము:

ఓ మధుసూదనా! నా వెఱ్ఱితనము ఇటువంటిది అని ఏరీతిగా చెప్పుకొందునయ్యా! నా తిప్పలు గ్రహించి, నవ్వుకొని నీవే నన్ను దయజూడవయ్య, అంటున్నారు అన్నమయ్య. నాలోవుండి మాట్లాడించేది నువ్వు. ఒక నిబద్ధతతో లోకములను పరిపాలిస్తున్న నువ్వు. అసంఖ్యాకమైన జీవరాశిని పుట్టించిన సృష్ఠికర్త నువ్వు. మంచివాడైనా చెడ్డవాడైనా అందరికీ ఐశ్వర్యమునిచ్చేది నువ్వు. మా అందరికీ ఇహమున

కామనలు పరమున మోక్షము నొసగువాడవు నువ్వు. కానీ అజ్ఞానంతో, అహంకారముతో అంతా నా ఘనతేనని విఱ్ఱవీగుతున్నాను. నా వెఱ్ఱితనం చూచి నన్నెందుకు నవ్వుకొంటావు? నా ఆచార్యుడే నాకు నీ మహిమ తెలిపాడు. ఆయన నేర్పిన విన్నపమే ఆలకింపుమయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! ఇటువంటి నా వెఱ్ఱితనము గురించి యేమని చెప్పుకొందును ప్రభూ! నెట్టన (అనివార్యముగా) తేటతెల్లమవుతున్న దీని గురించి నవ్వుకో కాదనను. కానీ నన్ను దయతో రక్షింపుము.

నీవు పాటించి (పూనుకొని) నాలో అంతర్యామిగా వుండి పలికించుచున్నవాడవు నువ్వే. లోకములనన్నింటినీ నీవే నీటుగ (సమర్ధవంతంగా) యేలుతుంటే (పరిపాలిస్తుంటే) నేను గాటాన (మొండిగా) నేనే దొరనంటూ అందరికీ గర్వంతో చెప్పుకొంటున్నాను.

ఈ ప్రపంచంలోని మనుష్యులందరినీ నెమ్మదిగా పుట్టించావు. కానీ నేను నాసంతానాన్ని చూచుకొని నా బిడ్డలు అని మురిసిపోతుంటాను నాకున్న సంపదలన్నింటినీ ఇచ్చిన దయామయుడు నీవైతే నేను అదంతా నా ఘనత అని నేను సంపాదించానని విఱ్ఱవీగుతున్నాను.

ప్రభూ! మమ్మల్ని మన్నించి మాకు ఇహమునందు సుఖశాంతులు, పరమునందు మోక్షమును ప్రసాదించువాడవు నువ్వే. కానీ నేను అదంతా నా తపశ్శక్తి అని గర్వపడుతుంటాను. ఉన్నతిగల శ్రీవేంకటేశ్వరా! నన్నేమి చూచెదవు స్వామీ! అన్ని విధములుగా నా ఆచార్యుడు నేర్పిన నా శరణాగతిని వినుము.

పద్యవివరణ:

ఉ॥ **ఏమని చెప్పుకొందునిక యిట్టిది వెఱ్ఱితనంబునాదె పో**
హే మధుసూదనా! నగుచునిందుకు నెట్టనజూపు మాకృపన్
కామనలన్ని దీర్ప నిను గ్రక్కున వేడెద వేంకటేశ్వరా!
నా మహనీయుడౌ గురుని నమ్మిక నిక్కము జేయవేడెదన్.

సంఖ్య: XI/26 రాగం : బిందుమాలిని
కీర్తన : ఇతరు లేమెరుగుదురు రేమని చెప్పగవచ్చు

బిందుమాలిని

12 ఇతరు లే మెరుఁగుదు రేమని చెప్పఁగ వచ్చు
పతులకు సతులకు భావజుఁడే సాక్షి ॥పల్లవి॥

తలఁపు గలిగితేను దవ్వు లేమి చేరు వేమి
అలరి సమ్మతించితె నడ్డాఁక లేమి
కొలఁది మీరినప్పుడు కొంచమేమి దొడ్డ యేమి
సెలవిచ్చి యేకతానఁ జేసినది చేఁత ॥ఇతరు॥

యిచ్చకమె కలిగితే యెక్కు వేమి తక్కువేమి
హెచ్చిన మోహములకు నెగ్గు సిగ్గేది
పచ్చియైన పనులకు పాడి యాల పంతమేల
చెచ్చెరఁ దమకుఁ దాము చెప్పినది మాట ॥ఇతరు॥

అన్నిటా నొక్కటియైతే నైన దేమి కాని దేమి
యెన్నికల కెక్కితేను యీడు జోడేది
వున్నతి శ్రీవేంకటేశుఁ డొనగూడె నేర్పు లివి
కన్నెలుఁ దాఁ గూడిన గతులే సంగతులు ॥ఇతరు॥

ఉపోద్ఘాతము:

ఈ శృంగార కీర్తన అన్నమయ్య విశృంఖల శృంగారాన్ని ప్రోత్సహిస్తున్నారా, అనిపిస్తుంది. కానీ అది సరికాదు. సతీపతులు శృంగారాన్ని తమకంతో జంకూ గొంకూ లేక జరుపవలెను. భార్యాభర్తలకు భావజుడే సాక్షి, అంటున్నారు. ఆ సతీపతుల భావావేశము ఇతరులేమెరుంగుదురు? అని వాదిస్తున్నారు. ఇది ఆరువందల ఏళ్ళనాటి కీర్తన అయినప్పటికీ అన్నమయ్య వెలిబుచ్చిన భావాలు నేటికీ వెలలేనివే. ఇష్టము కలుగుట ప్రధానము. అదియేర్పడిన పిమ్మట సతీపతులలో ఒకరు యెక్కువేమిటి? ఒకరు తక్కువేమిటి? మోహము ముప్పిరిగొనిన పిదప యెగ్గుసిగ్గులుండకూడదు. అప్పటికప్పుడు భావావేశంతో

చేసే పనులకు సరియైనది సరికానిది అంటూ వివక్షత వుండదు. తొందరలో తమకు తామే మాటలాడుకొన్నా అది మాటలు చెప్పుకొన్నట్లే. అయ్యా! ఇదండీ సంగతి. అన్నట్లు ఈ కీర్తనలో అన్నమయ్యవాడిన "సంగతి" వేరే అర్థం.

తాత్పర్య వివరణ:

సతీపతుల భావావేశము, వలపు పరవళ్ళు, తమకపు తహతహలు ఇతరులు యేమి తెలియగలరు. వారి అవస్థలకు భావజుడే (మన్మథుడే) సాక్షి.

భార్యాభర్తలు శారీరకంగా విడిగా వున్నా మానసింకంగా వారు ఏకశరీరులే. ఒకరిమీద ఒకరికి తలపు కలిగివుంటే దవ్వులేమి? చేరువేమి? (వారిమధ్య దూరమేమిటి దగ్గర యేమిటి?) వారికి అంగీకారమైతే అడ్డాక (అడ్డంకులు) యెందుకు? వారిలో భావావేశం కొలది మీరినప్పుడు (హద్దు దాటినప్పుడు) వారిమధ్య ఎక్కువ తక్కువలుండవు. మధురాధరము అందుకొన్నాక ఏకాంతంలో యేమిచేసినా అదే సరైన చేత (పని).

దంపతుల మధ్య ఒకరిపై ఇంకొకరికి, ఇచ్చకము (ఆపేక్ష) కలిగితే ఒకరు యెక్కువ ఇంకొకరు తక్కువ అనే అంతరములుండవు. ఎవరెక్కువ? యెవరు తక్కువ? వారి మధ్య మోహావేశము పరిధి దాటితే యెగ్గు సిగ్గులుండకూడదు. పచ్చియైన పనులకు (అప్పటికప్పుడు అంచులు దాటిన భావావేశము చేసే చిలిపి చేష్టలకు) పాడియాల (తగినది యేమిటి?) పంతమేల (పట్టుదలలు ఎందుకు?) చెచ్చెరలో (ఆ తొందర తొందరలో) తమలోతాము చెప్పుకొన్నా అది ఒకరికింకొకరు చెప్పినట్లే.

అన్ని విషయాల్లోనూ స్త్రీ పురుషులు తాము ఒక్కటే అనుకొంటే వారి మధ్య అయినదేమిటి? కానిదేమిటి. ఇంకొక విపరీతమేమంటే, ఎన్నికలకెక్కితే (ఒకరినొకరు ఎన్నుకోవటం అంటూ జరిగితే) తమమధ్య ఈడూ జోడూ వున్నదా లేదా అనికూడా చూడరు. ఉన్నతుడైన శ్రీవేంకటేశుడు ఒనగూర్చిన నేర్పులు సహజసిద్ధములు. కన్నెలను కూడెడితరుణంలో, గతులే సంగతులు (వారి కదలికలే తకధిమి తకధిమి).

పద్యవివరణ:

ఆ.వె॥ **ఇతరులేమెరుగుదు రేమని చెప్పేది**
పతుల సతుల కెల్ల భావజుండె
సాక్షి, పరుల చింత సహజమే వీడుట
పేర్మిదెల్పెమనకు వేంకటపతి.

సంఖ్య: II/225 రాగం : బిలహరి
కీర్తన : ఇహ పరసాధన మీతలపు

బిలహరి

13 ఇహ పరసాధన మీతలఁపు
సహజజ్ఞానికి సత మీతలపు ॥పల్లవి॥

సిరులు ముంగిటను జిగిఁ దడఁబడఁగా
హరిని మఱవనిది యది దలఁపు
సరిఁ గాంత లెదుట సందడిగొనఁగా
తిరమయి భ్రమయనిదే తలఁపు ॥ఇహ॥

వొడలి వయోమద ముప్పతిల్లినను
అడఁచి మెలంగుట యది దలఁపు
కడఁగుచు సుఖదుఃఖములు ముంచినను
జడియని నామస్మరణమే తలఁపు ॥ఇహ॥

మతి సంసారపుమాయ గప్పినను
అతికాంక్షఁ జొరనిదది తలఁపు
గతియై శ్రీవేంకటపతి గాచిన
సతతము నితనిశరణమే తలఁపు ॥ఇహ॥

ఉపోద్ఘాతము:

తలపు అంటే ఆలోచన. అన్నమయ్య ఈ కీర్తనలో అనవసరమైన తలపులతో సమయం వ్యర్థం చేసికొనక ఇహపరములను రెంటినీ ఇయ్యగల ఈ శ్రీహరి తలపులో జీవితం సుఖదుఃఖాల వ్యాకులతకతీతంగా గడిపి సదా ఆ హరి నామస్మరణలో ముక్తిపొందమంటున్నారు. జ్ఞానియైనవానికి ఈ తలపు సహజంగానే స్థిరపడి వుంటుంది. వాడికి ఏ సాధనా అవసరంలేదు అంటున్నారు. భగవంతుని తన కష్టాలలో కన్నీటితో ప్రతి ఒక్కరు

తలచుకొంటారు. కాని సంసారపు మాయ కమ్ముకొనిన వేళ అత్యాశకు లొంగక మానవాళికి గతియైనది శ్రీవేంకటేశుని తలపు. ఆతని శరణాగతియే సదా నిజమైన తలపు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈ తలపు (ఈ శ్రీహరి గురించి చేసే తలపు) ఇహలోకములో సుఖశాంతులను పరలోకంలో ముక్తిని అనుగ్రహించును. సతము (యెల్లప్పుడు) జ్ఞానియైనవానికి ఈ తలపు సహజంగానే స్థిరముగా వుంటుంది.

ముంగిటిలో సిరులు, జిగి (శోభను) పెంపొందించి తడబడునట్లు చేస్తాయి. ఆ సమయంలో కూడ హరిని మరువనివాడెవడో వానితలపే నిజమైన తలపు. సరిగాంతలు (యుక్తవయసున ఉన్న స్త్రీలు) యెదుట సందడి చేయుచున్న వేళ స్థిరచిత్తముతో ఏ భ్రమలకూ లొంగనివాని తలపే అసలైన తలపు.

యుక్తవయస్సులో యౌవనము విజృంభించిన వేళకూడా ఆ భావోద్వేగాలను అణచిపెట్టి నిర్మల చిత్తుడై మెలగునట్లు చేసే తలపే శ్రేష్ఠమైన తలపు. ఎవ్వరినైనా, ఏ సమయమునైనా సుఖమో దుఃఖమో ముంచెత్తిననూ, కడగుచు (ప్రయత్నించి) జడియక (భయపడక) వుంచినదే నిజమైన తలపు. అది ఆ శ్రీహరి నామస్మరణ మాత్రమే యీయగలదు. మరెవ్వరితలపైనా పనికిమాలినదే.

మానవుని మతిని (మనస్సును) సంసారపుమాయ కమ్ముకొని, అమితమైన కాంక్షలతో (కోరికలతో) ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అటువంటి సమయంలో కూడా ఆ శ్రీవేంకటేశ్వరుని గతిగా భావించే తలపే శాశ్వతమైన తలపు. ఈతని తలపే ఆయన శరణాగతిని బోధించునది.

పద్యవివరణ:

కం॥ **ఈతని తలపే యిహపర**
ముల్ తప్పక నొసగు జుమ్మి!! మురహరిభక్తిన్
చాతురి సహజ జ్ఞానికి
ఈ తలపే వేంకటేశునిడు శాశ్వతమౌ.

సంఖ్య: III/183 రాగం : గంభీరనాట
కీర్తన : ఈతడే ముక్తిదోవ యీతడే మాయాచార్యు

గంభీరనాట

14 ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మాయాచార్యుఁ
దీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి ॥పల్లవి॥

అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి
పదములు సేసి పాడి పావనముసేసెను. ॥ఈతడే॥

అలరుచుఁ దాళ్లపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీవేంకటనిధియే తానై
కలిదోషములు వాప ఘనపురాణములెల్ల
పలుకుల నించి నించి పాడినాఁడు హరిని ॥ఈతడే॥

అంగవించెఁ దాళ్లపాక అన్నమాచార్యులు
బంగారు శ్రీవేంకటేశుపాదములందు
రంగుమీర శ్రీవేంకటరమణుని యలమేలు
మంగను యిద్దరిఁ బాడిమమ్ము గరుణించెను ॥ఈతడే॥

ఉపోద్ఘాతము:

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు అన్నమాచార్యుని సుపుత్రుడు. తన తండ్రి హరిసాయిజ్యం పొందిన పిదప ఈయన కూడా తండ్రి ఆదేశానుసారం హరి సంకీర్తనాచార్యుడై పెక్కు శృంగార అధ్యాత్మిక కీర్తనలు చెప్పారు. ఈయన కూడా 'వేంకట' మకుటంతోనే లలితమైన జానపద భక్తకోటిని అలరించారు. కొన్ని కీర్తనలు తన తండ్రి శ్రీవేంకటేశ్వరుని అవతారంగా కీర్తిస్తూ చెప్పారు. ఈ కీర్తన అటువంటిదే. ఈ అన్నమాచార్యుడే ముక్తికి త్రోవ. ఈతడే మా

ఆచార్యుడు ఇతడు అవనిలో అవతరించుట వలననే మేమందరూ బ్రదికితిమి. ఈయన్నమాచార్యులు శ్రీవేంకటేశునెదుట లోకములోని వేదములను చక్కటి పదములుగా పాడి మనందరి బ్రదుకులు పావనము చేసినారు, అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఈతడే (ఈ అన్నమాచార్యుడే) ముక్తి మార్గము జూపిన ఘనుడు. ఈతడే మా ఆచార్యుడు (గురుదేవుడు). ఈతడు కలుగబట్టి (మావంశమూల కందమగుటచే) ఇందరు ఈ అవనిలోనున్న హరిభక్తుల మందరమూ బ్రదికితిమి (బ్రతుకులో సార్ధకత పొందాము).

అదిగో ఆయనే తాళ్ళపాక అన్నమాచార్యులు. ఇదిగో ఈ శ్రీవేంకటేశుని యెదుట వెదవెట్టి (హరిభక్తి వ్యాపింపజేయుటకు) లోకములో వేదములనన్నింటినీ అలవోక పదములుగా చేసి, పాడి హరికి వినిపించి అందరి బ్రదుకులను పావనమొనర్చినాడు.

అలరిన తాళ్ళపాక అన్నమాచార్యులవారు భగవంతునిలో ఐక్యమై తానే శ్రీవేంకటనిధియై నిలిచినాడు. తన జీవితకాలంలో అన్నమాచార్యులవారు కలిదోషములను వాపు (నివారించు), ఘనమైన పురాణములనన్నింటినీ కీర్తనలలో పలుకులుగ (పదములుగా) నించినించి (నింపివేసి) హరిని పాడినాడు (హరినామ సంకీర్తనము చేసినాడు.)

ఈ తాళ్ళపాక అన్నమాచార్యులవారు అంగవించి (ఉత్సుకతతో) హరినామ సంకీర్తనాచార్యుడై బంగారము వంటి శ్రీవేంకటేశ్వరుని పాదపద్మములను మనందరికీ అందించినారు. రంగుమీర (శోభలీనునట్లుగా) ఆయన తిరుమలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు, ఆ దేవదేవుని దేవేరియైన అలమేలుమంగను యిద్దరినీ కీర్తించి మమ్ము కరుణించి ముక్తి మార్గమును ప్రసాదించి హరిసాయుజ్యం పొందినాడు.

పద్యవివరణ:

కం॥ **పెదతిరుమలయ్య పాడిన**
దిదిగో హరికీర్తనంబు ఇతని జనకుడే
ముదముగ ముక్తికి త్రోవను
బ్రదుకును అందించెనవని భక్తులకెల్లన్.

సంఖ్య: XXIII/369 రాగం : వసంతభైరవి
కీర్తన : ఎంత చనవిచ్చితివో యీపె నీపై వెదచల్లీ

వసంతభైరవి

15 ఎంత చనవిచ్చితివో యీపె నీపై వెదచల్లీ
కొంతపుఁజూపుల చూడికుడుతనాచారు ॥పల్లవి॥

ముప్పిరిఁ దా మనసార ముడిచినదండలు నీ
కొప్పున ముడిచీఁ జూడికుడుతనాచారు
తప్పులేక నిన్నుఁ జనుఁదామరమొగ్గలు మోవ
గుప్పీ నిన్నిదివో చూడికుడుతనాచారు ॥ఎంత॥

చేరఁదీసి నీమీఁద చెమటపయ్యద గప్పి
కూరిమి గొసరీఁ జూడికుడుతనాచారు
చేరి వేఁడుకొని వేరు సేయకుమని నీచెక్కు
గోరనొత్తీ నిదె చూడికుడుతనాచారు ॥ఎంత॥

అంకెల శ్రీవేంకటేశ అదె నీమైఁ దనమేని
కుంకుమ వూసీఁ జూడికుడుతనాచారు
అంకపురతులఁగూడి అలమేలుమంగె తానై
కొంకుదేర్చె నిన్నుఁ జూడికుడుతనాచారు ॥ఎంత॥

ఉపోద్ఘాతము:

ఇది బహుఅరుదైన అన్నమయ్య సంకీర్తన. ఏకైక వనితా ఆళ్వార్ అని కీర్తించబడుతున్న ఆండాళమ్మ (గోదాదేవి)పై చెప్పిన కీర్తన ఇది. "చూడరమ్మ సతులాల!" అన్న ప్రఖ్యాత కీర్తన మొదటిదైతే ఇది రెండవ కీర్తన అని చెప్పుకోవచ్చు. ఇంతకు మించి మరొక కీర్తన మనకు నేటివరకు లభ్యంకాలేదు.

"కొంతపు జూపులు" అంటే వలపులు నిండిన చూపులని అర్థం. స్వామీ! నీవీ చూడికుడుతనాంచారికి యెంతచనువిచ్చావోగాని ఈమె నీపై

వలపు నిండిన చూడ్కులను ప్రసరింపుచున్నది అంటున్నారు. చూడికుడుత నాంచారి అంటే "ఆముక్తమాల్యద" అనగా "విడచిన విరిదండ" అని అర్థం. అన్నట్లు ఇది గొప్ప శృంగార సంకీర్తన.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవీమెకు యెంత చనువు (కూరిమి) నిచ్చినావో కాని ఈపె (ఈమె) నీపై కొంతపు జూపుల (వలపు జూడ్యులను) వెదచల్లీ (విరజిమ్మినది). ఈమె నీవు శ్రీరంగనాథునిగా వెళ్ళి చేపట్టిన చూడికుడుత నాంచారి (ఆముక్తమాల్యద గోదాదేవి).

ముప్పిరి దా మనసార ముడిచినదండ (తాను అతిశయముగా మనసారా తన తలలో అలంకరించుకొన్న పూలదండ) నీ కొప్పున ముడిచినదయ్యా. ఈ చూడికుడుత నాంచారి (ఆముక్తమాల్యద, గోదాదేవి). తప్పు అనే భావనయే లేక నిన్ను తన చన్నులనే తామరమొగ్గలను మోపి నీపై గుప్పి (కుమ్మరించి) నిన్నలరించినది ఈ చూడికుడుత నాంచారి.

స్వామీ! నిన్ను చేరదీసి (దగ్గరకు తీసికొని) నీమీద పరిమళభరితమైన తన చెమటల చిత్తడిలో తడిసిన తన పయ్యెదను (వల్లెవాటును) కప్పి కూరిమి నించినదా చూడికుడుత నాచారు. ఆ జవ్వని నిన్ను చేరి నీ చెక్కులకు తన చెక్కిలినొత్తి కొనగోటితో నీకు గుర్తుండునట్లు నొక్కి నిన్ను వేడుకొనిదయ్యా! ఆ చూడికుడుతనాంచారి.

ఆమెకు స్వాధీనుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! అదె (అదిగో) నీమైన (నీతనువుపై) తన వంటికి వ్రాసిన పరిమళ భరితమౌ కుంకుమను పూసినదయ్యా! ఆ చూడికుడుత నాంచారి. తానే నీ అంకముజేరి రతుల నలరించిన మా అమ్మ అలమేలుమంగమ్మయై, నిన్ను కొంకుదేర్చె (సంకోచించక అలరించినదయ్యా!) మా చూడికుడుత నాంచారి.

పద్యవివరణ:

కం॥ **చూడికుడుత నాంచారిని**
కూడుచు చనవిచ్చినావు కోర్కెల దీర్పన్
ఈడగుకొంతపుజూపుల
వీడని నీచిన్నదయ్యా! వేంకటరమణా!

సంఖ్య: XXIX/471 రాగం : హమీర్ కళ్యాణి
కీర్తన : ఎంత భాగ్యవంతుఁడవో యిన్నియును నొనగూడె

హమీర్ కళ్యాణి

16 ఎంత భాగ్యవంతుఁడవో యిన్నియును నొనగూడె
మంతనాన నీకె నిట్టె మన్నించవయ్యా ॥పల్లవి॥
చెలిమి చేటఁడు చల్లె చెలియ నీమీఁదను
కలికితనాలు నీకు గంపలఁ బెట్టె
వలపులు నీ యెదుట వాములుగాఁ గూడపెట్టె
యెలమి నీ కోరికె లీడేరెనయ్యా ॥ఎంత॥
నగవులు మూఁట గట్టె నలినాక్షి నిన్నుఁ జూచి
పగటుఁ జేఁతలు నీకు బండ్లఁ బెట్టె
మొగమిచ్చ లెల్లా నీ ముందల దొంతి వేరిచె
తగులాయములు నీకు దలకూడెనయ్యా ॥ఎంత॥
వావులు గాదె బోసె వనిత నీ పొందుసేసె
మోవి సన్నలు నీమీఁద మోపు గట్టెను
యీవేళ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
దేవులాయ నీ వేడుక తిరమాయనయ్యా ॥ఎంత॥

ఉపోద్ఘాతము:

ఇది గొప్ప శృంగార కీర్తన. అయితే ఈ కీర్తన ప్రత్యేకత యేమిటంటే అన్నమయ్య తన సమకాలీన రైతుకుటుంబాలు వుపయోగించే పదజాలమును విరివిగా వాడి ఈ కీర్తనకి కొత్త అందాలు జతపరిచినారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మోతుబరిగా కూడా, యెంత భాగ్యవంతుడవయ్యా? నీకు ఇవన్నీ సమకూడినవి కదా! ఈమెను ఇప్పుడే యేకాంతమున కలిసి మన్నించవయ్యా! అంటున్నారు. తాత్పర్య వివరణ నాస్వాదిస్తే ఈ పదకవితాపితామహుని భాషాపటిమ అర్థమవుతుంది. ఉదాహరణకి ఈ చరణం చూడండి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ వనిత తన వావులు (నీతో పరిణయంద్వారా కలిగిన చుట్టరికమును) గాదెబోసినది (అనేకమంది బంధువులను మూకగా

సమకూర్చుకొన్నది). నీతో పొందు సేసినది. మోవి సన్నలను నీమీద మోపులుగ కట్టినది (తన పెదవి అంచులతో నీకు మాత్రమే తెలియునట్లు సైగలు అనేకము చేసింది.) ఈ కాంత అలమేలుమంగయే నీ దేవేరి. ఈమెతో నీ వేడుకలన్నీ స్థిరమైనాయి ప్రభూ!

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవు యెంత భాగ్యవంతుడవయ్యా? నీకు యిన్నియును (ఈ వైభోగములన్నీ) ఒనగూడె (జతకూడినవి). ఇట్టే (అతి సులభముగా) ఈకెను (ఈమెను) మంతనాన (నీ ఏకాంత సేవలో) మన్నించవయ్యా! (ఆదరించవయ్యా!)

ఈ చెలియ తనపై నీవు చూపిన చెలిమిని తిరిగి నీపై చేటలతో వెదచల్లినది. తన కలికితనంబులను (అందచందములను) గంపలకెత్తి నీకు అందించినది. తన వలపులనన్నింటినీ ఆమె వాములుగా (తన చేతులతో చేసిన కుప్పలుగా) కూడబెట్టినది (పేర్చిపెట్టినది). వీటన్నిటితో నీ కోరికలన్నియు, ఈడేరినవయ్యా! (నెరవేరినవయ్యా!)

ప్రభూ ఈ నళినాక్షి నిన్ను జూచి తన నవ్వులనన్నింటిని ఒక మూటవలె కట్టినదయ్యా! తన పగటు జేతలను (శృంగార చేష్ఠలను) నీకు బండ్లకెత్తినది (నీ కొరకే ప్రత్యేకముగా రవాణా చేసినది). నీ ముందల (ముంగిటిలో) తన మొగమిచ్చలెల్లా (తన కోరికలనన్నింటినీ) దొంతివలె పేర్చినది. దానివలన మీ చెలిమి పరిణయమై నీకు ఆయములు తలకూడెనయ్యా (నీకు బంధుత్వాలు దగ్గరయైనాయి).

ఆపై శ్రీనివాసకళ్యాణము జరిగింది. ఆ వనిత నీతో పొందులను సేసి (రతులలో పాల్గొని) వావులుగా గాదెబోసినది (నీతో పరిణయము ద్వారా కలిగిన చుట్టరికములను మూకగా సమకూర్చుకొన్నది). మోవి సన్నలను నీమీద మోపులు కట్టినది (తన పెదవుల అంచులతో నీకు మాత్రమే సంకేతమందునట్లు అనేక సైగలను చేసినది).ఈ కాంత మరెవ్వరో కాదు నీ దేవేరి అలమేలుమంగయే. ఈమెతో నీ వేడుకలన్నీ స్థిరమైనాయి తండ్రీ!

పద్యవివరణ:

ఉ॥ **ఎంతటి భాగ్యవంతులమొ యిన్నియునున్ సమకూడె, నందుచే**
మంతనతోడ నీ రమణి మన్నన జూడుము వేంకటేశ్వరా!
వంతుగగాదె బోసినది వావులు, పొందులమోవి సన్నలన్
కాంతయె నీదు దేవులట కామిని వేడుకలే తిరమ్ములౌ.

సంఖ్య: XVII/322 రాగం : మిశ్రమధువంతి
కీర్తన : ఎక్కడి మాయామృగమేల తెమ్మంటి నేను

మిశ్రమధువంతి

17 ఎక్కడి మాయామృగ మేల తెమ్మంటి నేను
అక్కడ నా వల్లనే యపరాధ మనుమీ ॥పల్లవి॥

రాముఁ డెన్నఁ డిందు వచ్చు రావణు నెన్నఁడు చంపు
నీ మాట హనుమంత నిజమా యిది
యేమని నన్నుఁ దలఁచు యెట్ల నున్నాఁడు తాను
ఆ మాటే యింకొక్కపరి అడిగేఁ జెప్పుమా ॥ఎక్కడి॥

యెటువలెఁ బొద్దు వేగు నినకులేశ్వరునకు
నీటున నన్నుఁ బాసిన నాటనుండి
కటకట తన్నుఁ బాసి కంటి నే నిన్నియును
యిటువలె దైవ మాయ యింత నన్నుఁ జేసెఁగా ॥ఎక్కడి॥

వుంగరము పుత్తెంచెను వున్నదిగా కృప నాపై
కంగిన పగెల్లా నీఁగి కైకొనె నన్ను
కంగుగ శ్రీవేంకటాద్రి రఘుపతి నన్నుఁ గూడె
యింగితాన నయోధ్య యేలెఁగా యిప్పుడు ॥ఎక్కడి॥

ఉపోద్ఘాతము:

తన తండ్రి అన్నమయ్య బాటలో నడచి పద సంకీర్తనాచార్యుడైన పెదతిరుమలయ్య చెప్పిన కవిత ఇది. లంకలో తనను జూడవచ్చిన మారుతి ముందు కన్నీటితో తన మనోవేదన తెలియజేస్తున్నది సీతమ్మ. "ఎక్కడన్నా బంగారు లేడి వుంటుందా? దాన్నెందుకు నేను తెమ్మన్నానో? ఓ హనుమా! శ్రీరాముని వద్దకు నువ్వు వెళ్ళి నావల్లనే తప్పు జరిగిందని అనవయ్యా! నా రాముడెప్పుడీ లంకకు వచ్చి ఈ రావణుని వధించి నన్ను చెఱవిడిపిస్తాడు? ఇంకొక్కసారి నామనోవేదన నా నాథునికెరిగించవయ్యా! ఇనకులతిలకుని కేరీతి పొద్దుగడచుచున్నదయ్యా! నావేంకటరాముడు

నన్ను గూడి యెన్నడయోధ్యనేలునో కదా!". పెద తిరుమలయ్య ఈ కవిత చెప్పిన తీరు చూస్తుంటే రామాయణం అంతా పదకవితలో చెప్పి తానూ తరించాడని తెలుస్తున్నది. ఇది మనబోంట్లకూ ముక్తిహేతువ అయింది.

తాత్పర్య వివరణ:

మాయామృగము (రాక్షస మాయచే కల్పించబడిన మాయలేడిని) నేనేలదెమ్మంటిని? అక్కడ (నా శ్రీరాముని వద్ద) నా వల్లనే అపరాధము జరిగిందని అనుమీ (అనవయ్యా! మారుతీ).

ఇందు (ఇక్కడికి) నా రాముడెన్నడు వచ్చును? రావణునెన్నడు చంపును? ఈ మాట నిజమేనా? ఓ హనుమంతా! నన్ను రాముడు యేమని దలచుచున్నాడో కదా! నా రామచంద్రుడు తాను యెట్లా వున్నాడు. ఆమాటే (ఆ మాటనే) ఇంకొక పర్యాయము అడిగే (అడుగుతున్నదానను), జెప్పుమా (నాకు యెఱింగిచవయ్యా!).

ఇనకులేశ్వరునకు (సూర్యవంశ దీపకుడైన శ్రీరామునికి) యెటువలె పొద్దు వేగును (ఏ విధముగా పొద్దు గడుచుచున్నది?) నీటున (రాజసముతో) నన్ను వీడిననాటినుండి ఆయన పరిస్థితి యెట్లున్నది? కటకటా! (హతవిధీ) హనుమా! తనను బాసిననాటినుండి (వీడినప్పటినుండి) ఈ జరిగినవన్నీ, నా కండ్లతో నేనే చూశానయ్యా! ఆ దైవము ఇటువలెనాయె (ఈవిధంగా శత్రువైనాడు). నన్ను ఇట్లు చేసినాడు.

నా భర్త రామచంద్రునికి నాపై కృప వున్నది కావున, ఓ హనుమా! నీ చేత తన ఉంగరమును పుత్తెంచెను (పంపించినాడు). రావణవధ అనంతరం, కంగినపగలెల్లా (కమ్మిన పగ అంతా) ఈగి (విడిపోయి) నన్ను కైకొనె (స్వీకరించినాడు). కంగుగ (అతిశయముగా) ఈ వేంకటాద్రి రఘువీరుడే ఇప్పుడు (ఈ త్రేతాయుగమున) ఇంగితముతో అయోధ్యనేలినాడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **"ఏలదెమ్మనంటి? కలదె బంగరు లేడి?**
తప్పుజేసినాను" తరుణి వగచె
హనుమకెరుక బరచి తనరాముదెమ్మనె
పెదతిరుమల పాడెనాది కృతిని.

సంఖ్య: XXII/112 రాగం : బేహాగ్
కీర్తన : ఎక్కువతక్కువలేవో యెఱగ మిద్దరిలోన

బేహాగ్

18 ఎక్కువతక్కువలేవో యెఱఁగ మిద్దరిలోన
వొక్కటై నీవురముపై వున్న దిదె చెలియ ॥పల్లవి॥

ఆకడ జలధి దచ్చి యమృత మిచ్చితి నీవు
ఆకైకైతే మోవిఁ జిందీ నమృతము
సైకపుఁబసిఁడిచీర సరిఁగట్టితివి నీవు
మేకొని యీకైకైతే మేనెల్లఁ బసిఁడే ॥ఎక్కువ॥

నిగిడి కౌస్తుభపుమాణికము గట్టితి నీవు
మగువకైతే నోరెల్లా మాణికములే
బెగడి యాకసమెల్లాఁ బెద్దసేసి కొలచితి
బిగిసేయీ చెలికైతేఁ బిడికెఁడు నడుమే ॥ఎక్కువ॥

పలుమారు జలధిలోఁ బవళించితివి నీవు
కలికి గుణములోనే ఘనజలధి
యెలమి శ్రీవేంకటేశ ఇప్పుడు గూడితిగాని
జలజాక్షియైతే నిన్ను సన్నలనే కలసె ॥ఎక్కువ॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీహరీ! మీ ఆలూ మగలిద్దరూ సమవుజ్జీలే. ఎవ్వరెక్కువో ఎవ్వరు తక్కువో యెఱుగజెప్పుట అంత తేలిక వ్యవహారం కాదు. అనాది కాలంలో భూదేవి వలె ఆమె నిన్ను చేపట్టినది. తరువాత జలనిధిపుత్రియై నిన్ను పరిణయమాడగ నీవామెను నీ ఉరముపై నుంచుకొని నీ ప్రేమకు సాటిలేదని నిరూపించినావు. కానీ ఆమె ఆధిక్యతను నిలిపినావు. ఇప్పుడు నీవెక్కువో ఆమె యెక్కుడైనదో మేము చెప్పలేకున్నాము. నీవు ఇదేమిరా మీ అజ్ఞానం అన్నట్లు నవ్వులొలకబోయుచూ

ఆమెను గూడితివి. కానీ ఆ జలజాక్షి సన్నలనే సందెపొద్దుల్లోనే నిన్ను కలిసినది కదా! ఇంతకీ యెవ్వరెక్కువయ్యా? ఏడుకొండలవాడా!

తాత్పర్య వివరణ:

ఆలూమగలిద్దరూ సమవుజ్జీలే. ఎక్కువతక్కువలేవో (ఆమె యెక్కువో నీవెక్కువో, లేక ఆమె తక్కువో లేక నీవే తక్కువో) చెప్పుట సాధ్యపడుటలేదు. కానీ సామాన్యులమైన మా బోంట్లకు ఆ చెలియ నీతో ఒక్కటైనీఉరముపై నెక్కుటయే యెక్కుడుగా తోచుచున్నది.

ఇటు నిన్ను చూస్తే జలనిధిదచ్చి (క్షీర సాగరమును మధించి) అమృతమును దేవతల కందించిన దేవదేవుడవు. ఆకైకైతే (అటు ఆమెను చూద్దామా అంటే) తన అధరము అమృతమయమేనాయె. నీకేమో, సైకపు (సన్నని మేలైన) పసిడి చీరె (పీతాంబరమును) కట్టినవాడవు. ఇక మేకొని ఆమెకైతే (సమ్మతించిన ఆమెకు అయితే) మేనెల్లా పసిడియే (శరీరమంతా బంగారమే).

ఓ శ్రీహరీ! నీకైతే ప్రసిద్ధి జెందిన కౌస్తుభము అనే మాణిక్యము భూషణమై మెడలో కట్టియున్నది. ఆమెకైతే నోరెల్లా మాణిక్యములే (ఆమె పలువరుస మాణిక్యములవలె తెల్లగా మెరయుచున్నవని భావము). నీవు ఒకనాడు బెగడ పెద్దసేసి (వామనావతరాంలో నభంబు గొడుగై అన్నట్లు భయంకరంగా పెరిగిపోయి ఆకాశమును నీ పాదంతో కొలిచావు). ఇక ఆమె అంటావా, ఆ చెలికైతే బిగిసిన నడుము ఆకాశము (బిగించిన నడుము) పిడికెడు మాత్రమే. పాదముకంటే పిడికిలే చిన్నది కదా!

ప్రభూ! నీవైతే పలుమార్లు సముద్రములో పవ్వళించినావు. ఆమెను చూడబోతే ఆ కలికి సుగుణములు జలధివలె అనంతమైనవి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవంటే ఇప్పుడు కలియుగంలో ఆమెను కైవసము చేసికొని కూడినావు కానీ, జలజాక్షియైతే నిన్ను సన్నలనే కలిసే (చీకట్లు ముసురుకొంటున్నప్పుడే అనగా కృతయుగంలోనే చేపట్టినది). స్వామీ! ఎవ్వరెక్కువో ఎవరు తక్కువో నీవే తేల్చుకోవయ్యా!

పద్యవివరణ:

కం॥ **ఎక్కువతక్కువలేవో**
చక్కగజెప్పంగరాదు సతియగు ఈకే
వొక్కటిగ వురముపైనే
యెక్కెను శ్రీహరియెఱుంగు యెక్కుడు యెవరో?

సంఖ్య: XXVIII/52 రాగం : రామప్రియ
కీర్తన : ఎపుడు వత్తువోయనుచు యెదురు చూచీ

రామప్రియ

19 ఎపుడు వత్తువోయనుచు యెదురు చూచీఁ జెలియ
వుపమించి చెప్పితిమి వువిదఁ జెందవయ్యా ॥పల్లవి॥

నెలఁతకనుఁ గలువలకు నీమోముఁ జందురుని-
నలరంగఁ జూపగదవయ్య నేఁడు
కలికి చక్కఁదనంబు కడఁగి ప్రతిబింబించ
తళుకు నీ చెక్కుటద్దములు చూపవయ్యా ॥ఎపుడు॥

నిరతి మెఱఁదీగెకును నీబాహుశాఖ లివి
అరడుగాఁ జూపఁగదవయ్య నేఁడు
సరిఁ జన్నుజక్కవలు జంటవాయకయుండ
తొరల తను సూర్యకాంతులు చూపవయ్యా ॥ఎపుడు॥

గళనాద పికములకు కడు నీ జవ్వనమదము
అలమి చోటుగఁ జూపవయ్య నేఁడు
వలచి శ్రీవేంకటేశ్వర యీకెఁ గూడితివి
కలకాలమును నిటులఁ గరుణ చూపవయ్యా ॥ఎపుడు॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య అమ్మవారి చెలికత్తెయై సందేశం తీసుకొనిపోయారు. "ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఎప్పుడు వచ్చెదవోనని మా చెలియ యెదురు తెన్నులు చూస్తున్నదయ్యా! ఉపశమించి (సత్వరమే పూనుకొని) ఆమె వేదన నీకెరుకపరచినాము. ఆ ఉవిదను చేరుకొని కరుణించవయ్యా! మరి సందేశం విన్నాక సప్తగిరీశుడు ఒక్క క్షణమైనా జాగు చేయకలడా? మా

చెలియ ఈ జవ్వని సుమధురగాత్రము, కోయిల గళములోని కూజితమును స్ఫురింపజేయుచున్నది. నీ యౌవనప్రాయమును ఆమెకు చోటుగా జూపవయ్యా! ఎట్లైతేనేమి నీవు ఆమెను కూడినావు. కలకాలము ఇట్టి కరుణనే ఆమెపై జూపుము ప్రభూ!

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవు యెపుడు వత్తువోయనుచు మా చెలియ యెదురు చూచీ (నిరీక్షించినదయ్యా!) ఆమె పరిస్థితిని నీకు ఉపమించి (సత్వరమే పూనుకొని) చెప్పినామయ్యా! ఇకనైన ఆ ఉవిదను జెందుమయ్యా (చేరుకోవయ్యా!)

ప్రభూ! ఆ నెలత కన్నులనే కలువపూవులకు నీ ముఖమను చంద్రబింబమును, అలరంగ (అతిశయించునట్లు) నేడు చూపవయ్యా! ఆ కలికి తనెంత చక్కనిదో చూచుకొంటుంది గాని కొద్దిగా నీ తళుక్కుమను చెక్కుటద్దములను (అద్దములవంటి చెక్కిళ్ళను) చూపవయ్యా!

నిరతి (గొప్ప ఆసక్తితో) అలతాంగి తన మెయిదీగెను (తన శరీరమనే లతను) ఇవిగో నీ బాహువులు అనే తరుశాఖలను ఆధారముగా అల్లుకొనిపోవుటకు దోహదము చేయవయ్యా! సరియైన ఆమె కుచద్వయము జక్కువపిట్టలజంటకు నీ తనువు అనే సూర్యకాంతిని ప్రసరింజేసి ఆ జక్కువల జంట (చక్రవాక పక్షుల జంట) మురియునట్లు జేయుమయ్యా!

ఓ శృంగారరాయా! కోయిలల గళనాదము (కంఠస్వరము) గల మా నెచ్చెలి మెచ్చిన నీ జవ్వనమదమునకు నేడు ఆమె కౌగిలిని చోటుగా చూపవయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వలచి ఈమెను కూడినావు. ఇకపై ఆమెను ఇటువలెనే కరుణించి కలకాలము సుఖించవయ్యా!

పద్యవివరణ:

తే.గీ॥ **ఎపుడు వత్తువోయనుచు తానెదురుజూచె**
చెలియ, వుపమించినీకది చెప్పినాము
ఉవిద జెందుము కూడుచు ఉన్నతముగ
వెలది నిటువలె కరుణించు వేంకటేశ!

సంఖ్య: XX/374 రాగం : ఆహిరి
కీర్తన : ఎప్పుడు నీదాననే యిన్నిటా నీచిత్తము

ఆహిరి

20 ఎప్పుడు నీదాననే యిన్నిటా నీచిత్తము
చప్పుడు సేయుటేకాని సాదించనేరను ॥పల్లవి॥

చూపులకు లోనై సుద్దలకు వెలియై
నీపొందు సేసేను నిచ్చలు నేను
తీపులనే పిలుపులు తిట్లనే బలుపులు
మోపుగట్టివేసే నీపై మొరఁగనేరను ॥ఎప్పుడు॥

పలుకులకు గురై పంతానకు మరఁగై
వలపులు చల్లేను వాసికే నేను
సెలవుల నవ్వులును చేతులనే పువ్వులును
నిలువున వేసేను నెపాలు నే నేరను ॥ఎప్పుడు॥

తమకములకుఁ జిక్కి తలపోఁతలకుఁ జొక్కి
సమముగాఁ గూడేను సారెకు నేను
అమరె శ్రీవేంకటేశ అంకెలును-లంకెలును
జమళి నీపై వేసేను సటలు నే నేరను ॥ఎప్పుడు॥

ఉపోద్ఘాతము:

నాయిక తిరుమల నాయకుడైన శ్రీవేంకటేశ్వరునకు తన వేదన ఈ కీర్తన రూపంలో విన్నవించుకొంటున్నది. ఈ శృంగార నాయిక స్వాధీనపతిక అని స్ఫురిస్తున్నది. తానెప్పుడూ ఆయన స్వంతమే అని నొక్కివక్కాణిస్తున్నది. అన్నీ నీ ఇష్టప్రకారమే కానీవయ్యా! నేను నిన్ను పల్లెత్తుమాట అన్నానా? ఎప్పుడన్నా నా మనస్సులో కోరికను తెలిపితినో లేదో యెరుగను. కానీ నిన్నెన్నడూ సాధించి యెరుగను. నేను అనునిత్యం నీ పొందుకొరకు తహతహలాడు దానను. దానిమూలంగా చూచేవాళ్ళు మన గురించి ఏవేవో కథలుగా చెప్పుకొంటున్నారు. కొంతమంది చులకనగా చూస్తున్నారు. అయితే అవనీ

నీవు తిట్టినా నాకు సుఖంగానే వుంటుంది. నీ మాటలే నాకు తీపి మూటలు. నిన్ను పల్లెత్తు మాట అన్నానా? మొరగనేరను అంటున్నది. అన్నమయ్య మధుర కీర్తననాస్వాదించండి.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నేను యెప్పటికీ నీదాననే. అన్నిటిలోను నీ మాట కాదని యెఱుగను. నీ చిత్తమే (నీ ఇష్టప్రకారమే) కానిమ్ము. చప్పుడు సేయుటేగానీ (యెప్పుడైనా నా మనస్సులో మాట చెప్పుకొన్నానేమోకానీ) యెన్నడైనా నిన్ను సాధించి యెరుగుదునా?

ప్రభూ! చూపులకులోనై (చూచేవాళ్ళ శంకతో కూడిన చూపులకు లోనైతిని). వాళ్ళు మనగురించి చెప్పుకునే సుద్దులకు (కథలకు) వెలియై (కించపరచబడ్డాను) కానీ నిచ్చలు (యెల్లప్పుడూ) నీ పొందునే నేసేను (నీ చెలిమినే కోరితిని). నీ మాటలే నాకు తీపి మూటలు. నీవు తిట్టినా నాకు సుఖమే. వాటన్నిటినీ మోపుగా కట్టి అవతలపెట్టానేకానీ, మొరగనేరను (నిన్ను వంచించి యెరుగను).

స్వామీ! నేను పలుకులకు గురై (పడరాని మాటలు పడ్డాను). నీ పంతాలకు తలవొగ్గాను. నేను యెన్నికయైన నీ వలపులను చల్లాను. (నీపై వెదలజల్లాను.) ఎన్నడన్నా నాపెదవులపై చిరునవ్వును చెదరనిచ్చానా? సుకుమారమైన పువ్వులవంటి నా చేతులతో నిన్నారాధించాను కదా! ఎన్నడన్నా నీపై నెపమువేశానా?

ఓ శృంగారరాయా! నేను నీ తమకములకు (నీవు కలిగించిన తన్మయత్వానికి) చిక్కువడ్డాను. నీ గురించి, తలపోతలకు (ఊహలకు) చొక్కితిని (పరవశించిపోయాను). నేను నిన్ను కూడిన ప్రతిసారీ సమరతి పొందులలో మైమరచితిని. నీతో లంకెపడినాక (జతకుదిరినాక) అంకెలకు వచ్చితిని (నీ స్వాధీనమైపోయాను). ఓ శ్రీవేంకటేశ్వరా! నా తనువు మనసూ జమళి (జంటగా) నీకర్పించాను. సటలనేనేరను (కపటమనునది నేనెరుగను) ప్రభూ!

పద్యవివరణ:

కం॥ **చప్పుడుసేయుటె కానీ**
యెప్పుడు సాధించనేరనెరుగవొ చెలియన్
యెప్పటికి నీదు సతినే
దెప్పకనన్నేలుకొమ్ము తిరుమలతేడా!

సంఖ్య: IV/153 రాగం : ధర్మవతి
కీర్తన : ఏది మాకు గతి యిక నీశ్వరేశ్వరా

ధర్మవతి

21 ఏది మాకు గతి యిఁక నీశ్వరేశ్వరా
యీ దెస మముఁ గరుణ నీదేర్చవయ్యా ॥పల్లవి॥

పొంచి మును భోగించిన భోగములు దలఁచి
అంచెల నాలుబిడ్డల నటు దలఁచి
కంచపుటాహారములు కన్నవెల్లాను దలఁచి
యెంచి నిన్నుఁ దలఁచక యిట్లున్నారమయ్యా ॥ఏది॥

కన్నులఁ జూచినఁదెల్లా కడు నాసలఁ దగిలి
విన్న వినుకులకెల్లా వేడ్కఁ దగిలి
పన్నిన సుఖములకుఁ బైకొని వెనుతగిలి
వున్నతి నిన్నుఁ దగులకున్నారమయ్యా ॥ఏది॥

చెంది గృహారామక్షేత్రములు మరిగి
పొందగు సంసారమిప్పుడు మరిగి
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
కందువ మరిగీ మరుగకున్నారమయ్యా ॥ఏది॥

ఉపోద్ఘాతము:

ఓ ఈశ్వరేశ్వరా! ఈ సంసారపుమాయలో తగిలి కొట్టుకుపోతున్నాము. మేము జీవులము, అజ్ఞానులము. భోగాసక్తితో భోగమే పరమావధిగా దైహిక సుఖాల వెంపర్లాటలో బ్రతుకుతున్నాము. ఆలుబిడ్డలు, సిరిపందలు వున్నా పీకులాటే, లేకున్నా పీకులాటే. తిన్న తిండినే తింటున్నాము. చూచినవాటినే చూస్తున్నాము. చూచినదెల్లా కావాలనే ఆశ. విన్నమాటలే వినాలనే వాంఛ.

పొందిన సుఖాలే మళ్ళీ మళ్ళీ కావాలనే కోరిక. కానీ నిన్ను తలచుకోవాలంటే ఆసక్తియే లేదాయె. గృహము వుంటే గృహలక్ష్మి లేదని ఆరాటం. ఆ రెండూ వుంటే పొలముపుట్రా లేదని దిగులు. ఇదే సంసారపు యావ. కానీ శ్రీవేంకటేశుడు అలమేల్మంగపై నాకు ఒక్కొక్కసారి భక్తి కుదురుతుంది ఒక్కొక్కసారి భక్తి కుదరనే కుదరదు. ప్రభూ! మమ్ము కరుణించవయ్యా!

తాత్పర్య వివరణ:

ఓ ఈశ్వరేశ్వరా! మాకు వేరేగతి యేదయ్యా! ఈ దెస (ఈ విధముగా) మమ్ము కరుణించి ఈడేర్చవయ్యా! (గమ్యము జేర్చవయ్యా!)

ఈ జీవులు భగవంతుని పొందితే కాని మరుజన్మలేక ముక్తిని పొందజాలరు. ఇంతకు మునుపు అనుభవించిన సుఖాలనే నెమరువేసికొంటుంటాను. కంచములో పెట్టుకొని రోజూ ఆహారం తింటున్నా మళ్ళీ మళ్ళీ తినాలనే వుంటుంది. చూచినవన్నీ మళ్ళీ చూడాలనుకొంటాను. కానీ ఓ ఆదిదేవా! నిన్నేగతిగానెంచి ధ్యానించి ఇట్లా క్షేమంగా వున్నామయ్యా!

దేవా! మా కన్నులతో చూచిన ప్రతిదానివెంటా ఆశతో పడతాను. వీనులకు శ్రావ్యమైనవన్నీ మరల వినాలని కోరుకొంటాను. నా మనస్సును మురిపించే సుఖాలే ఇంకా ఇంకా కావాలని కోరుకుంటాను. కాని ఉన్నతోన్నతుడవైన నీవెంట పడమన్నా పడను.

ప్రభూ! ఈ సంసారమనే మాయాజాలంలో పడి ఇల్లాలు, ఆరామం (ఇల్లు) క్షేత్రములు (పొలములు) అంటూ వెంపర్లాడతాను. వాటిపై తీరని మమకారం పెంచుకొంటుంటాను. అందమైన శ్రీవేంకటేశ్వరా! నీవు అలమేలు మంగకు పతివి అయిన నీపై మాత్రం మక్కువ పెంచుకోను. ఇట్లా అనవసరమైనవాటిపై మక్కువ పెంచుకొనే నాపై నీవే దయచూపాలి.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఏది మాగతింక హే ఈశ్వరేశ్వర!**
యీదెసగరుణించి ఆదిదేవ!
ఎంచిమమ్ము వడిగ యీడేర్చవయ్య! నే
మరిగి మరుగకుంటి తిరుమలేశ!

సంఖ్య: III/299 రాగం : జంఝూటి
కీర్తన : ఏపొద్దు చూచిన దేవుడిట్లానే యారగించు

జంఝూటి

22 ఏపొద్దు చూచిన దేవుఁ డిట్లానే యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెను ॥పల్లవి॥

మేరుమందరాలవలె మెరయు నిడ్డెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ఏపొద్దు॥

పలుజలధులవంటి పైఁడివెండిగిన్నెలు
వెలిఁగొండలంతలేసి వెన్న ముద్దలు
బలసినచిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెలరస మందిచ్చినట్లుండెను. ॥ఏపొద్దు॥

పండినపంటలవంటి పచ్చళ్లుఁ గూరలును
వండి యలమేలుమంగ వడ్డించఁగా
అండనే శ్రీవేంకటేశుఁ డారగించీ మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను. ॥ఏపొద్దు॥

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశ్వరునికి ఆరగింపు సేవ జరుగుతున్నది. అత్యుత్సాహంగా పాల్గొన్న అన్నమయ్య ఆ వైభవం చూచి ఆనందం ఇనుమడించి ఈ కీర్తన చెప్పివుంటారు. ఈ తిరుమల దేవుడు ఏ పొద్దు చూచిన అది పగలైనను, రేయైనను ఇట్లాగే ఆరగించును అంటున్నారు. ఆ వంటకాలు రకరకాల రూపులతో పదివేల రుచులతో వున్నాయా అనిపిస్తుందట. ఇడ్డెనులు, చుట్టుబళ్ళు, రాజాన్నములు, వెన్నముద్దలు, పంచదార గుప్పించిన చిలుపాలు, రకరకములైన పచ్చళ్ళు, కూరలు అనేకములై వున్నది. ఇన్నివున్నాయని ఈ దేవుడు తొందరలో సరిగ్గా తినడేమోనని, అలమేల్మంగ దగ్గరవుండి మరీ ఒక్కొక్కటే మురిపెంగా తినిపిస్తోందట. ఆస్వామి తరువాత తానూ భోంచేసి మిగిలినవి మనబోటి అదృష్టవంతులైన దాసులకు ప్రసాదంగా అందిస్తారట. ఆహా!!

తాత్పర్య వివరణ:

ఈ దేవుడు (శ్రీవేంకటేశ్వరుడు), ఏ పొద్దు చూచిన (ఏవేళ చూచిననూ) ఇట్లానే ఆరగించు (ఇదే విధముగా భోజనం చేస్తాడు). వీటన్నిటినీ పరికించండి. రకరకాల రూపములతో పదివేల రుచులతో (అనేకమైన రుచులతో) వున్నట్లుండెను.

ఈ స్వామికి వడ్డించిన ఇడ్డెనులు (నేటికాలం ఇడ్లీలు.. ఆనాటి ఆవిరికుడుములు) చూడండి. మెరుస్తున్న మేరు మందర పర్వతములవలెనున్నవి కదా! చుట్టుబళ్ళు (నేటికాలపు చక్కిలాలవంటివి) అవి సూర్యచంద్రులవలె వెలుగులు చిమ్ముతున్నాయి. అరసి రాజాన్నములు అందుపై (ఆపైన) వడ్డించండి. (నేటి కాలపు పులిహోర వంటి చిత్రాన్నములు రుచికరంగా పెట్టారు). ఈ పదార్థాలన్నీ రాసులుగ వడ్డిస్తే బోరన (అనంతాకాశంలో) చుక్కలు రాసివోసినట్లుండె (నక్షత్రాలను పరచినట్లున్నది).

ఇక ఈ వంటకాలను వడ్డించిన, పైడి వెండిగిన్నెలు (బంగారము వెండితో చేసిన పాత్రలను) చూడండి. పలుజలధులవలె (అనేక సముద్రములను చూస్తున్నామా అన్నట్లుంది.) పంచదార బాగుగా గుప్పించిన, బలసిన చిలుపాలు (మరగకాచిన జున్నుపాలు) చూడండి ఎలావున్నాయో ఇక్కడ. శోభాయమానమైన వెన్నెలను రసముగా మార్చి అందించినట్లున్నది కదా!

ఇక ఈ దేవునికి వడ్డించిన అనేకమైన పచ్చళ్ళు, కూరలు ఎలావున్నాయో చూడండి. (ఈ వసుంధరపై పండిన రకరకములైన పంటలను ఒక్కచోట పేర్చినట్లున్నది. అనేకమైన రంగులలో పరిమాణములలో వున్న వాటిని ఈ శ్రీవేంకటేశ్వరుడు తొందరలో తినడేమోనని ఆయన దేవేరి అలమేలుమంగ దగ్గర కూర్చొని ఒక్కొక్కటి తినిపిస్తున్నది. ఆ యారగింపు మనకళ్ళతో మనం చూడలేము. మరి ఇక మిగిలిపోయిన ఆ నైవేద్యాలన్నీ వారు తమ దాసులమైన మనకోసం వుంచారా అన్నట్లుంది.

పద్యవివరణ:

కం॥ **ఏపొద్దు చూచినను మా–**
శ్రీపతికీ ఆరగింపు చెల్లునిటులె పో,
రూపుల పెక్కులు రుచులున్
తోపెను పదివేల వోలె తోయజనాభా!

సంఖ్య: IV/348 రాగం : సౌరాష్ట్ర
కీర్తన : ఏమి సేయుదు నింతయు నీ మాయ

సౌరాష్ట్ర

23 ఏమి సేయుదు నింతయు నీ మాయ
సామజవరద నా చందమిది ॥పల్లవి॥

జలములోపలనున్న చందురు నీడవలె
నలుగడలఁ గదలీ నామనసు
పెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
వెలుఁగదు నాలోని విజ్ఞానము ॥ఏమి॥

కడఁగి యాకసమున గాలియణఁగినట్లు
వడిఁగానరాదు నా వైరాగ్యము
ముడిగి ముత్తెపుఁజిప్ప ముత్యమువిధంబున
జడిసీ నాలోని సాత్వికము ॥ఏమి॥

యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీకృపవలె
వుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిన నీ సేవవలెఁ గన్న నిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము ॥ఏమి॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీహరీ! ఇదంతా నీమాయ. నేను ఆ మాయనుంచి బయట పడలేకున్నాను. ఓ కరిరాజ వరదా! నా విధానము ఇదియేనయ్యా! నీపై నిజమైన భక్తి కుదరవలెనంటే అది తేలిక వ్యవహారం కాదు. మాపై నీకు కృప కలుగవలెను.

అప్పుడే నాబోంట్లకు నీపై నిజమైన భక్తి కుదురుతుంది. నీసేవాభాగ్యము నాకు నిధానమువలె దొరికినది. నీసేవనాకు యెల్లప్పుడూ బ్రహ్మానందమును అందిస్తుంది. అన్నమయ్యకున్న గొప్పతనం నిజము అంగీకరించటం. తనకు సాత్విక గుణం వున్నదికానీ ముత్యపు చిప్పలోని

ముత్యంవలె కడలిలోతుల్లో వున్నదట. తన విజ్ఞానం మేఘాలు కప్పిన సూర్యుడివలె ప్రకాశానికి నోచుకోలేదు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! ఏమి సేయుదు (నేనేమి చేయగలనయ్యా!) ఇంతయు (ఇదంతా) నీవు కల్పించిన నీ మాయ. ఓ సామజవరద! (మదించిన కరిరాజును రక్షించినవాడవు) నీవు ఇక నన్ను చూస్తే, నా చందమిదియె నా విధానము నాదే. అది మారేది కాదు.

ఒక కొలనులో ప్రతిఫలించే చంద్రుని చూస్తే నీళ్ళు కదలినప్పుడల్లా చంద్రుని నీడకూడా అన్నివైపులా కదులుతుంది. నా మనస్సు కూడా అన్నివైపులకు పరుగులు తీస్తున్నది. పెలుచుమేఘములు (కారుమబ్బులు) కప్పిన సూర్యబింబంవలె నాలోవున్న విజ్ఞానము ప్రకాశించకున్నది. అందువలన నేను అజ్ఞానిగానే మిగిలిపోయాను.

దేవా! అనంతమైన ఆకాశమున గాలివున్నా మన కన్నులకు కానరాదు. నా వైరాగ్యము కూడా అంతే ప్రభూ! అది వడిగానరాదు (అది ఒకపట్టాన కానరాదు). సముద్ర జలములలో మునిగివున్న ముత్యపు చిప్పలో ముత్యము యేవిధంగా దాగివుంటుందో నాలోని సాత్విక గుణము కూడా చలించు స్వభావము కలదై అప్పుడప్పుడూ ప్రయత్న పూర్వకంగా మాత్రమే బయటకు వస్తుంది.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్నాళ్ళకు నీకు నాపై కృప కలిగి నీపైన నిజమైన భక్తి వుప్పతిల్లినది (ఉబికి బైటకు వచ్చింది). నీసేవాభాగ్యము నీపై కప్పినదె నాకు దొరికిన నిధానమై వర్ధిల్లినది. ఇంకా చెప్పేటందుకు ఏమున్నది ప్రభూ! బ్రహ్మానందము అప్పసమై (ఎల్లప్పుడూ) నిలిచిపోయినది.

పద్యవివరణ:

ఆ.వె॥ **ఏమిసేయగలము ఇంతయు నీమాయ,**
సామజంబుగాచు విమలచరిత!
నాదుచందమిదియె నారాయణా! హరీ!
వుప్పతిల్లె భక్తి అప్పసముగ.

సంఖ్య: V/129 రాగం : హంసానంది
కీర్తన : ఒఱపో మెఱుపో వొయ్యారమో నీకు

హంసానంది

24 ఒఱపో మెఱుపో వొయ్యారమో నీకు
వెఱతుమయ్య గోవిందుఁడా ॥పల్లవి॥

కపటమో నిజమో కరుణయొ కోపమో
వుపచారమో వుపతాపమో
నిపుణత త (ఁద) నపై నెయ్యమే నేసేవు
విపరీతము గోవిందుఁడా ॥ఒఱపో॥

ననుపో నగవో నయమో ప్రియమో
చనవో చలమో సరసమో
కనుకూరిమియో గయ్యాళితనమొ
వెనుతగిలేవు గోవిందుఁడా ॥ఒఱపో॥

మంకో మరులో మదమో ముదమో
జంకో లంకో జగడమో
శంకలేక నను సరుగనఁ గూడితి
వేంకటగిరి గోవిందుఁడా ॥ఒఱపో॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలో చక్కటి పదబంధం కూర్చి గోవిందుని సంస్తుతిస్తున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో శ్రీకృష్ణుని ఓగోవిందుడా! ఒఱపో, మెఱుపో వయ్యారమో కానీ నీకు వెఱతుమయ్యా! నీ సౌందర్యం చూసినా, నీ దివ్యకాంతిని చూచినా, నీ ఒయ్యారము చూసినా నీకు వెఱతుమయ్యా! ఓ గోవిందుడా నిన్ను శరణుజొచ్చిన మాకదే పదివేలు ప్రభూ! అంటున్నారు

అన్నమయ్య. నీపై నా భక్తికపటమో నిజమో! నీకు నాపై కరుణ వస్తుందో రాదో! నీకు నాపై కోపమేమో వూహించలేను. ఉపచారమో ఉపతాపమో, సంతసమో వూహించలేను. నాతో నెయ్యమే సేసేవు. గోవిందుడా! ఇదంతా విపరీతమే.

తాత్పర్య వివరణ:

ఓ గోవిందుడా! మాకేమి తెలియుటలేదు. నీ దివ్యసౌందర్యము, నీమేని ప్రకాశము వర్ణించనలవికానిది. నీ ఒయ్యారమును యెంత చూచినా తనివి తీరుటలేదు. అప్పుడప్పుడు నీవంటే భయంకూడా కలుగుతుంటుంది.

నిన్ను చూచి మేమేమీ నిశ్చయం చేసికోలేకపోతున్నాము. నీవు కపటివో, నీ ప్రవర్తన నిజమైనదో, నీవు కరుణాంతరంగుడవో కోపిష్టివో, నీవు మాకు చేసేది ఉపచారమో, నెయ్యమో తెలియుటలేదు. ఈ విధంగా లెక్కించలేని భావాలు కలుగుతున్నాయి.

ఓ గోవిందుడా! నీవు వద్దన్నా మావెంటబడతావు. అది ననుపో (నీకు మాపైన అనురాగమో, నగవో (నవ్వులాటయో) నయమో (అనుకూలతయో) ప్రియమో (ప్రేమో) చనువో లేక ప్రణయతాపమో తెలియుట లేదు. నీవు నాపై చూపిస్తున్నదంతా కూరిమియో గయ్యాళితనమో తెలియుటలేదు. కృష్ణా! వద్దన్నా నా వెనుతగిలేవు (వెంటపడతావయ్యా!) గోవిందుడా!

నీ ఆలోచనలనర్ధం చేసుకోలేకపోతున్నాను. నీది మంకుతనమో మరులో (వలపులో) మదమో (గర్వమో) సంతోషమో, జంకో (భయమో) లంకో (సంకోచమో) తెలియుటలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు శంక అనునది లేక నన్ను కూడితివి. నీవు వేంకటగిరి గోవిందుడవు ప్రభూ!

పద్యవివరణ:

ఆ.వె॥ **ఒఱపొ, మెరపొ లేక ఒయ్యారమో నీకు**
వెఱతుమయ్య మేము వేంకటేశ!
కపటమో నిజంబొ కరుణ గోవిందుడా!
శంకలేకకూడు సతులనెల్ల.

సంఖ్య: అన్నమాచార్యులజీవిత చరిత్ర పీఠిక P112
రాగం : కాపీ కీర్తన : కటకటా అయ్యో కాంత నింత యేపుదురా

కాపీ

25 కటకటా అయ్యో కాంత నింత యేపుదురా
అటమటము గాదు నీయాన సుమ్మీ నిజమయ్య ॥పల్లవి॥

కొసరినా నిన్నే కాని కోపించినా నిన్నే కాని
కసరినా నిన్నే కాని కాదన్నా నిన్నే కాని
విసరినా నిన్నే కాని వేసరినా నిన్నే కాని
ఇసుమంతైనా అన్యమెఱుఁగదయ్యా ॥కట॥

అలసినా నిన్నే కాని ఆఁకొన్నా నిన్నే కాని
పిలిచినా నిన్నే కాని పేరుకొన్నా నిన్నే కాని
సొలసినా నిన్నే కాని సోఁకనాడినా నిన్నే కాని
కలనైనా తలఁపెందూ కలుగదు గదవయ్యా ॥కట॥

కొనియాడినా నిన్నే కాని గుంపించినా నిన్నే కాని
పని(న?) వినా నిన్నే కాని పాడినా నిన్నే కాని
మనసిచ్చి యలమేలుమంగపతి వేంకటేశ
యెనసితివి మా చెలి నింక నేచ నేమిటికయ్యా ॥కట॥

ఉపోద్ఘాతము:

ఇది శృంగార సంకీర్తనవలె కనుపించినా అంతర్లీనంగా ఇందులో అధ్యాత్మికత వుందని పెద్దలు చెబుతారు. కటకటా! అయ్యయ్యో! ఈ కాంతను ఇంత యేపుదురా. ఓ శ్రీవేంకటేశ్వరా! అటమటలుగాదు నేను వంచించుట లేదయ్యా! నీ ఆన పెట్టుకొని చెబుతున్నాను, సుమా! సత్యం చెబుతున్నానయ్యా! అంటున్నారు అమ్మవారిలా భావించుకొన్న

అన్నమయ్య. నాకు ఇతరులతో పని యేమి? కొసరినా నిన్నే కోపించినా నిన్నే, కసురుకాన్నా నిన్నే కాదని తిరస్కరించినా నిన్నే. విసుగుకొన్నా నిన్నే. నీవు తప్పించి నేను పరులెవ్వరినీ యెరుగను. నీవు తప్పించి నేను అన్యమేదియు నెరుంగను అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కటకటా! (అయ్యయ్యో!) కాంతను ఇంత యేపుదురా (బాధిస్తారా?) అటుమటము గాదు (ఇందులో వంచన యేదీలేదయ్యా!) నీయాన సుమ్మీ! నీమీద ఒట్టుపెట్టుకుంటున్నాను. సత్యము చెప్పుతున్నానయ్యా!

నాకు అన్యులెవ్వరున్నారు కొసరి కొసరి వేడినా నిన్నే. ఆగ్రహం చూపించినా నిన్నే. కసురుకున్నా నిన్నే కాదని తిరస్కరించినా నిన్నే. విసుగుకొన్నా నిన్నే. నాకు ఇసుమంతైనా లొక్యం లేదు. ఈ జవ్వని ఇసుమంతైనా అన్యమెరుగదయ్యా! శ్రీవేంకటేశ్వరుని విడిపోదు

ఆయనకై నిరీక్షించుచూ అలిసిపోతాను. అయినా నిన్ను విడనాడలేను. ఆకొన్నా (ఆకలితో అలమటించినా) నిన్నే. పేరుకొనినా నిన్నే. సొలసినా (పరవశించినా) నిన్నే. సోకనాడినా (తగిలినా) నిన్నే. కానీ అన్యములైన వాటి గురించి కలనైన తలంచను. ఆ తలపే రాదుకదయ్యా!

ప్రభూ! కొనియాడినా నిన్నే. గుంపించినా (అతిక్రమించినా) నిన్నే. పనివినా నిన్నే (ప్రలాపించినా నిన్నే). పాడినా (కీర్తించినా) నిన్నే. ఓ శ్రీవేంకటేశ్వరా! మ సఖియైన అలమేల్మంగకు నీ కరుణనొసగితివి. ఇంక ఆమెను బాధించక ఆమెకు అనురాగమీయవయ్యా!

పద్యవివరణ:

కం॥ **కాంతను యేపుదురా ఇటు**
ఇంతటి అటమటలు తగునె ఇది అన హరీ!
కాంతుడ! అలమేల్మంగకు
సంతోషము కూర్పవయ్య జతకూడుటచే.

సంఖ్య: IV/381 రాగం : ఆహిర్‌భైరవ్
కీర్తన : కరుణించవే నిజగతి బోధించవే

ఆహిర్‌భైరవ్

26 కరుణించవే నిజగతి బోధించవే
హరి నిన్నుఁ గొలువక యలసీఁ బ్రాణి ॥పల్లవి॥

కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁ గాంతలతోడి వేడుకలు
లలి నిందుకుఁగా లంపటములఁబడి
పలుమారు నూరక బడలీఁ బ్రాణి ॥కరు॥

నిన్నటి యాహారనిజరుచివలెనే
అన్నువ నిప్పటి యాహారము
యెన్న నిందుకే యిడుమలఁ బొరలుచు
కన్న గతులఁ గడుఁ గలఁగీఁ బ్రాణి ॥కరు॥

పరుసము సోఁకిన బంగారమువలె
పరమభాగవతపట్టములు
అరయఁగ శ్రీవేంకటాధిప నీకృప
యిరవుగఁ గని తుదకెక్కీఁబ్రాణి ॥కరు॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీహరీ! నన్ను కరుణించవయ్యా! నిజగతి (సరియైనగమ్యము) బోధింపుము ప్రభూ! నిన్ను గొలువక అలసీప్రాణి (అలుపేమిగిలి ఎంతో అలసిపోతున్నాడు,) అంటున్నారు అన్నమయ్య. కలలో ఇంతులను కూడినట్లు భ్రాంతి చెందుతాడు. ఇకవెలి (వెల్లివిరియునట్లుగా) కాంతలతో వేడుకలలో పాల్గొంటాడు.

దీనిమూలంగా అనేకమైన లంపటాలలో చిక్కుకొంటాడు ప్రాణి. ఈ లంపటాల వలన విపరీతంగా అలసిపోతాడు ప్రాణి. నిన్న తిన్న ఆహారం గొప్ప రుచిగా వుందని భ్రమ కలుగుతుంది. నిప్పులపై కాల్చిన రొట్టె ఆహారంగా తినే ప్రాణికి అనేక కష్టాలను పొంది కడు వేదన జెందుతున్నాడు ప్రాణి. పరమభాగవతుల పట్టములు, పరుసము సోకిన బంగారమువలె అతిశయిస్తాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకృప నెలకొన్న ప్రాణి తుదిపదమెక్కుతాడు. (మోక్షం పొందుతాడు ప్రభూ!)

తాత్పర్య వివరణ:

శ్రీ శ్రీహరీ! నన్ను కరుణించవయ్యా! నాకు నిజమైన దారి చూపించవయ్యా! హరిని గొలువక ప్రాణి అలసిపోతాడు.

కలలో ఇంతులను కలిసి, వెలిగాంతలతో అనేక లంపటముబడి పలుమార్లు వూరకే బదలీ ప్రాణి

ఆహారము నిజరుచినిప్పటి నిప్పులపై కాల్చినప్పటిదే. ఈ విధముగా అనేక కష్టములలో పాలుపంచుకొని కన్నగతుల (ఇదివరకు చూసిన) కడుగలగీప్రాణి.

పరుసవేదిని తాకించిన బంగారమువలె పరమభాగవతులను పొందిన వారికి నీ కృప కలుగుతుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ కృప ఇరవుగ గని అతిశయించి పొంది. బ్రాణి తుదకెక్కె మోక్షప్రాప్తిని పొందినాడు.

పద్యవివరణ:

కం॥ **హరి నిన్ను గొలువకుండిన**
సరగున యలిసీని ప్రాణి సజ్జన వినుతా!
పరసము సోకినకనకము,
కరుణించవె బోధజేసి కమలారమణా!

సంఖ్య: IV/255 రాగం : హిందోళం
కీర్తన : కలడా యింతటి దాత కమలనాబుడేకాక

హిందోళం

27 కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక
కలఁడన్నవారి పాలఁ గలిగిన దైవము ॥పల్లవి॥

యిచ్చెను సంపద లితఁ డింద్రాదులకునెల్ల
యిచ్చెను శుకాదుల కిహపరాలు
యిచ్చెను వాయుజునికి యిటమీఁదిబ్రహ్మపట్ట-
మిచ్చల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము ॥కలఁడా॥

కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద
కట్టె విభీషణుకు లంకారాజ్యము
కట్టియిచ్చె నజునికి గతచన్నవేదాలు
కట్టెను శ్రీసతిచేతఁ గంకణసూత్రములు ॥కలఁడా॥

పెట్టెను దేవతలకు పేరినమృతపువిందు
వెట్టెను భక్తవత్సలబిరు దితఁడు
యెట్టె శ్రీవేంకటాద్రి నిందరికిఁ బొడచూపి
పెట్టెఁ దన ప్రసాదము పృథివి జీవులకు ॥కలఁడా॥

ఉపోద్ఘాతము:

కమలనాభుడేకాక ఆయన సరిపోల్చగల దాత కలడా. కలడన్నవారికి గలిగిన దైవము. ఇంద్రాదులకు అంతులేని సంపదలనిచ్చాడు, శుకాదిమునులకు ఇహపరముల నొసగినాడు. తనను కొలిచిన వాయునందనునికి బ్రహ్మపట్టము నొసగినాడు. ఘంటాకర్ణునికి కుబేరత్వము నొసగినాడు. దేవతలకు అమృతము విందుచేసినాడు. ఈ

వేంకటపతి ఇందరికి పొడచూపి పృధ్విలోని జీవులకు తన ప్రసాదముపెట్టి ధన్యులనుచేసినాడు.

తాత్పర్య వివరణ:

కమలనాభుడేకాక ఇంతటి దాత మరొకరు కలరా? (వున్నారా?) ఈ దైవము కలడన్న వారికి వున్నానని నిరూపిస్తాడు.

ఈ దేవదేవుడు ఇంద్రాదులకు తనపై గల భక్తికి మెచ్చి అంతులేని సంపదలనిచ్చాడు. శుకుడు మొదలైన మహర్షుల భక్తికి మెచ్చి ఇహమున భాగవత రచనావైదుష్యమును పరమున కైవల్యమును ఒసగెను. వాయుజుడైన హనుమంతుని సేవలకు భక్తికి మెచ్చి వచ్చే మన్వంతరములో బ్రహ్మత్వము నొసగినాడు. ఘంటాకర్ణుడను భక్తునికి కుబేరత్వమునొసగినాడు.

ధ్రువుని భక్తికి మెచ్చి కమలజుకంటే (బ్రహ్మలోకము కంటే) యెంతో మీదనున్న నక్షత్ర మండలమును ప్రసాదించినాడు. రాక్షస కులమునకు చెందినవాడైనను విభీషణుని శరణాగతికి మెచ్చి లంకారాజ్యము నొసగినాడు ఈ శ్రీహరి. అజునకు (చతుర్ముఖ బ్రహ్మగారికి) గత చన్నవేదములు (కోల్పోయిన వేదములను కట్టియిచ్చెను (ఒకటిగా తిరిగి అందించినాడు). శ్రీసతి (లక్ష్మీదేవి) మెడలో సూత్రధారణ చేసి పరిణయమాడినాడు.

పేరిన (ఒక క్రమములో కూర్చొనియున్న) దేవతల భక్తికి మెచ్చి అమృతపు విందుపెట్టినాడు. ఇతడు భక్తవత్సలుడన్నబిరుదును అనేక సందర్భాలలో నిలుపుకొన్నాడు. శ్రీవేంకటాద్రిపై ఇందరికీ శ్రీవేంకటేశ్వరునిగా పొడచూపి (దర్శనమిచ్చి) పృధ్విలోని (భూమిపైని) జీవులకు ఈ తిరుమలలో తన ప్రసాదమును పెట్టినాడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **కలడెయింతదాత కమలనాభుడెకాక**
కలడు యన్న వార్కి కలిగినహరి
పెట్టె దేవతలకు పేరిన అమృతంబు
విందుచేసెనింక వేంకటపతి!

సంఖ్య: XXVI/105 రాగం : సామ
కీర్తన : కానకుంటి మిందాకా కంటి మాడకు బోదము

సామ

28 కానకుంటి మిందాఁకా కంటి మాడకుఁ బోదము
కానీలే అందుకేమీ కళవళ మేలయ్యా ॥పల్లవి॥

తొంగి చూచె నదె సీత తూరుపునఁ దమ్ముఁడా
సంగతిఁ జందురుఁ డింతె సతి గాదయ్యా
చెంగట నే వెదకఁగాఁ జేరి నవ్వీఁ జూడరాదా
రంగగు వెన్నెల లింతే రామచంద్ర చూడుమా ॥కాన॥

పొంచి చేతఁ బిలిచీని పొద దండ నదె సీత
అంచెలఁ దీగె ఇంతే అటుగాదయ్యా
యెంచనేల దవ్వులను యెలిఁగించీ వినరాదా
పెంచవు నెమలి గాని పిలుపు గాదయ్యా ॥కాన॥

నిలుచుండి చూచె నదె నిండుఁగొలఁకులో సీత
కలువ లింతే ఆపె గాదయ్యా
కలికి శ్రీవేంకటాద్రిఁ గాఁగిలించె నిదె నన్ను
తలఁపులో నాకె నిన్నుఁ దగిలుండునయ్యా ॥కాన॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య ఇటువంటి కీర్తనలలో తన ప్రతిభనంతా గుప్పిస్తారు. నిజానికి సీతాపహరణము తరువాత ఆమె కోసం వెతుకుతున్న శ్రీరామునికి దేన్ని చూచినా తన సీతవలెనే భ్రమ కలిగింది. లక్ష్మణుడు అన్నా ఇది కేవలం నీ భ్రమ అంటూ నిజము నెరుకపరుస్తాడు. ఇటువంటి కీర్తనలు తెలుగు సారస్వతంలో బహు అరుదని ధంకా బజాయించి మరీ చెప్పవచ్చును. కొసమెరుపుగా ఈ సంవాదంలో పాల్గొన్న శ్రీరాముడే శ్రీవేంకటేశ్వరుడని నిరూపించటానికి "ఓ తమ్ముడా! ఆమె శ్రీవేంకటాద్రిపై కొగలించినదయ్యా!" అన్నాడు రాముడు దానికి లక్ష్మణుడు "అంతేకావచ్చుననన్నా! నీ తలపులలో ఆమె నిన్ను తగిలవుండవచ్చును" అన్నాడు.

తాత్పర్య వివరణ:

లక్ష్మణా! ఇందాకా (ఇప్పటిదాకా) సీతను కానకుంటిమి (చూడలేకపోయాము). కంటి (అదిగో నాకు అక్కడ కనుపిస్తున్నది) ఆడకు బోదము అక్కడకు పోయెదము పదవయ్యా! అన్నాడు రాముడు. అన్నా! అందులకేమి కానీలేవయ్యా! కళవళమేల (అందోళన యెందులకు?)

తమ్ముడా! తూర్పు కొండపైనుండి నాసీత అదిగో తొంగి చూస్తున్నట్లున్నదయ్యా.

అన్నా! ఈరోజు పౌర్ణమి అగుటచే చంద్రబింబం కనపడింది. అది నీ సతికాదయ్యా!

లక్ష్మణా! తనని యెదురుగా వుంచుకొనే వెతుకుతున్నామని నా సీత మనల్ని చూచి నవ్వుతున్నదయ్యా.

రామచంద్రా! కాంతులీనే వెన్నెలయ్యా! అది

లక్ష్మణా! అదిగో ఆ పొదచాటు నుంచి పొంచి చూస్తూ చేతులూపుతూ నన్ను పిలుస్తున్నదయ్యా!

రామచంద్రా! పొదలకల్లుకొన్న లత గాలికి కదలి నీకు అలా అనిపిస్తున్నదయ్యా!

లక్ష్మణా! అదిగో వినవయ్యా! దూరంగా యెక్కడినుంచో నన్ను యెలుగెత్తి పిలుస్తున్నది.

అన్నా! అది వదినగారి పిలుపుకాదయ్యా! దూరంగా యెక్కడో నెమలి కూతపెట్టుచున్నది.

లక్ష్మణా! అదిగో ఆ నిండుకొలనుదగ్గర నిలుచుండి నా సీత నన్ను పిలస్తున్నదయ్యా! నీకు కనబడుట లేదా?

అన్నా! అవి విరిసిన కలువపూవులయ్యా! నీ భార్య కన్నులు కావు.

అయ్యో! లక్ష్మణా! ఇదెనన్ను శ్రీవేంకటాద్రిపై నాసీత కౌగలించినదయ్యా!

రామచంద్రా! నీ తలపులలో (ఆలోచనల్లో) తగిలుండునేమో (నిన్ను కలిసినదేమో?) ఇది వాస్తవము కాదయ్యా!

పద్యవివరణ:

కం॥ **సౌమిత్రి రామచంద్రులు**
తామన్వేసించి జనకతనయన్ సీతన్
రాముడు భ్రమ తిరుమలపై
సౌమిత్రితొ జరిపినాడు సంవాదంబున్.

సంఖ్య: XX/105 రాగం : వసంత
కీర్తన : కాలము లారును గలిగి నీకు నిదె

వసంత

29 కాలము లారునుఁ గలిగి నీకు నిదె
బాలకీయందె పైపై నీకు ॥పల్లవి॥

సతికొప్పు విరులు జలజల రాలిన
లతల వసంతకాలము నీకు
కతగాఁ దనమైకాఁకలు చూపిన
అతివేసవికాల మప్పుడే నీకు ॥కాలము॥

కాఁగిటిచెమటల కడు నినుఁ దడిపిన
కాఁగల తొలుకరికాల మది
వీఁగనిచూపుల వెన్నెల చల్లిన
రాఁగినమతికి శరత్కాలంబు ॥కాలము॥

లంచపుఁబులకల లలన నీరతుల
కంచపుహేమంతకాల మది
యెంచఁగ శ్రీవేంకటేశ వలపుసతి
వంచ శిశిరకాలవైభవ మాయ ॥కాలము॥

ఉపోద్ఘాతము:

ఆరు ఋతువులలోనూ భగవంతుడు ఆరు సొబగులను నింపాడు. అమ్మవారి సౌందర్యం ఆ ఋతువులను ఎలా ఆవిష్కరిస్తున్నదో ఈ అద్వితీయమైన కీర్తనలో శ్రీనివాసునికి వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ దేవదేవా! ఆరు ఋతువులూ ఈ నీ నాయికలో ఎలా ప్రతిఫలిస్తున్నాయో

వినవయ్యా! విని ఆ శోభలన్నీ నీ కానుకలే కాబట్టి పూర్తిగా ఆస్వాదించి ఆమెను ధన్యం చేయుము ప్రభూ! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

కాలములు (ఋతువులు) ఆరున్నూ ఇదే నీకు కలిగినవి. ఈ బాలకి (తరుణ ప్రాయపు చిన్నదానికి) యందే పైపై ఋతువుకు తగ్గట్లే నీకు ఆవిష్కరిస్తున్నది ప్రభూ!

దేవా! నీవామెను చేరుకోగానే నీకు నమస్కరించుటకు వంగిన ఆమె కొప్పులోని విరులన్నీ జలజలా రాలి నీకే వసంతఋతువు వచ్చినదా పుష్పించిన లతలు పూలను రాల్చి నిన్నాహ్వానించుచున్నదా అనిపించినది. నీ విరహమున వేగినందున ఆమె శరీరము వేడిమిని వెదజల్లుచూ వేసంగి అంటే ఇట్లా వుంటుందా అనిపించుచున్నది? అప్పుడే వేసవి వచ్చిందా అని నీకే భ్రమ కలిగినది.

స్వామీ! నీ కౌగిటిలో ఆమెకు చెమటలధికమై జలజలా రాలి నిన్ను తడిపి ఆహా! తొలకరి జల్లులు కురియుచున్నవి. వర్షఋతువు అప్పుడే వచ్చేసిందా అని నీ మదిలో స్ఫురించింది. వీగని (తొలగించలేని) ఆమె వెన్నెలవంటి చల్లని చూపులు నిన్ను రాగిన (రంజిల్లినందున) మతికి (మనస్సున) శరత్ ఋతువు వచ్చినదేమో అనిపించినది.

ప్రభూ! ఆ లలన నీ రతి వైభవమున పులకరింతలు పొడచూపి ఆహా! అప్పుడే హేమంతఋతువు వచ్చేసినదా? అందుకే ఈమె గజగజ వణుకుచున్నదా అనిపించినది. ఓ శ్రీవేంకటేశ్వరా! యెంచి చూస్తే నీ వలపులలో తలమునకలైన నీ సతి వంచ (ముఖ్యమయిన) శిశిర ఋతువు వైభవమును ఆవిష్కరింపజేసినది. మరి ఇవన్నీ నీ స్వంతమే కదా!

పద్యవివరణ:

ఉ॥ **కాలములారునున్ కలిగె కల్కికి హే! తిరువేంకటేశ్వరా!**
బాలకి శోభలన్నియిటు ప్రాప్తమునీకిక యంచునెట్టులో
మేలుగజెప్పె కీర్తనము మిక్కిలి సొంపుగ నాలకించు, యే
కాలమునందు నిట్టి కృతి కమ్మగ పాడినదన్నమార్యుడే

సంఖ్య: XXII/98 రాగం : దేశాక్షి
కీర్తన : కొంగువట్ట కంత నీవు గొల్లబోయిడా

దేశాక్షి

30 కొంగువట్ట కంత నీవు గొల్లబోయిఁడా
కుంగక నీకు మొక్కేము గొల్లబోయిఁడా ॥పల్లవి॥

పొలసు మాటల గొల్లబోయిఁడా నీ-
కొలము దాఁచకువోయి గొల్లబోయిఁడా
పొలము మేపకు గొల్లబోయిఁడా
కొలువుకంబము చాటు గొల్లబోయిఁడా ॥కొంగు॥

పొడవాటికాళ(ళ్ల?) గొల్లబోయిఁడా
గొడవలు మానవోఇ గొల్లబోయిఁడా
పొడలమెకము గొల్లబోయిఁడా
గొడగెత్తి యాలఁగాచే గొల్లబోయిఁడా ॥కొంగు॥

బుద్ధులగొలువు గొల్లబోయిఁడా
కొద్దిలేనిదాఁటుల గొల్లబోయిఁడా
మద్దుల శ్రీవేంకటాద్రి మందబోఇఁడా నీకు
గుద్దే బాదాలు నే గొల్లబోఇఁడా ॥కొంగు॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య వినిపించిన అద్భుతమైన దశావతార కీర్తనను ఆస్వాదించి తరించండి. బోయిడు అంటే సారథి అని అర్థం. గొల్లబోయిడా అంటే గొల్ల రథసారథి అని అర్థం. ఓ గొల్లసారథీ! నీవు అంతగా మా కొంగువట్టకు. మేమేమాత్రమూ అవమానం అనుకోకుండా నీకు

మ్రొక్కెదము. ఆపైన భగవంతుని దశావతారములను యెంత నర్మగర్భంగా చెప్పారో చిత్తగించండి.

తాత్పర్య వివరణ:

ఓ గొల్లబోయీడా! (గొల్లవాడివయ్యును రధసారథివైన దేవా!) నీవు అంతగా మా కొంగులువట్టకు (పట్టుకోకు). కుంగక (ఏమాత్రం సంకోచించక) నీకు మొక్కేము ప్రభూ!

పొలసుమాటలు గొల్లబోయిడా. చేపకంపువంటి మాటలు మాట్లాడే గొల్లబోయిడా (మత్స్యావతారము).

కొలముదాచకు వోయి గొల్లబోయిడా. నీకులమును దాచకుము గొల్లబోయిడా! (కూర్మావతారము. కూర్మము జలచరము మరి పృధ్వీచరము).

పొలముమేపకు గొల్లబోయిడా పొలములోపడి మేయవద్దు గొల్లబోయిడా! (వరాహావతారము).

కొలువు కంభముచాటు గొల్లబోయిడా రాజసభలో స్తంభము యొక్క చాటునుండి వెలువడిన గొల్లబోయిడా (నరసింహావతారము).

పొడవాటి కాళ్ళ గొల్లబోయిడా నింగి అంత ఎత్తుకు పెరిగిన కాళ్ళున్న గొల్ల బోయిడా. యుద్ధములు నరమేధము మానవయ్యా (పరశురామావతారము).

పొడలమెకము గొల్లబోయిడా! జింకకు లొంగిపోయిన గొల్లబోయిడా (రామావతారము).

గొడగెత్తి యాలగాచే గొల్లబోయిడా! గొడుగు నెత్తిబట్టుకొని ఆవులను కాచిన గొల్లబోయిడా! (శ్రీకృష్ణావతారము).

బుద్ధులు గొలువున్న గొల్లబోయిడా! బుద్ధుడై త్రిపురాసురుల భార్యలను భ్రమింపజేసిన గొల్లబోయిడా (బుద్ధావతారము).

కొద్దిలేని దాటుల గొల్లబోయిడా! ఎన్నో దాడులు నిర్వహించిన గొల్లబోయిడా (కల్కి అవతారము).

శ్రీ వేంకటాద్రిపై చెట్ల చాటున మానవులను కాపాడుటకు వెలసిన సారధివి. నేను నీ పాదములను పట్టి కొల్చెదనయ్యా! గొల్లబోయీడా!

గొడవలు మానవోయీ గొల్లబోయిడా (వామనావతారము).

పద్యవివరణ:

కం॥ **చక్కటి దశావతారపు**
చిక్కటి కీర్తనము మేధచిందించవలెన్
చిక్కులు పెక్కులు నరయగ
మిక్కిలిరసవత్తరంబు మీకున్ శౌరీ!

సంఖ్య: శేషాచార్యులవారి వ్రాతప్రతి సంఖ్య (43) రాగం : ఆనందభైరవి
కీర్తన : కొమ్మ నీ పలుకులకు కుశలమస్తు

ఆనందభైరవి

31 కొమ్మ నీ పలుకులకు కుశలమస్తు
సమ్మదపు వయసు కైశ్వర్యమస్తు ॥పల్లవి॥

బెడఁగు కళలను చాల పెంపొందించుచున్న నీ
యుడురాజు మోముకభ్యుదయమస్తు
కడివోని నీరజపు కళికల నుగేరు, నీ
నెడఁద కుచములకు నభివృద్ధి రస్తు ॥కొమ్మ॥

వొగరు మిగులగ తేనె లొలుకు నున్నట్టి నీ
చిగురు మోవికిని ఫల సిద్ధిరస్తు
సొగసు చక్రములతో సొలయు నీ పిరుదులకు
అగణిత మనోరథావ్యాప్తిరస్తు ॥కొమ్మ॥

తనరు తుమ్మెదగములఁ దరము నీ కురులకును
అనుపమంబైన దీర్ఘాయురస్తు
నను ద్వారకాకృష్ణుఁడనుచుఁ గూడిన నీకు
అనుదినము నిత్య కల్యాణమస్తు ॥కొమ్మ॥

ఉపోద్ఘాతము:

శేషాచార్యులవారి వ్రాతప్రతితో సంప్రాప్తించిన ఈ శృంగార కీర్తనలో నాయికకు ఆశీర్వచనం పలుకుతున్నారు కవి. నాయిక పలికే ముచ్చటైన పలుకులకు కుశలమస్తు అంటున్నారు. సమ్మదపు వయసుకు ఐశ్వర్యమస్తు, అంటున్నారు. నాయిక స్తనవైభవమునకు అభివృద్ధిరస్తు అని ఆశీర్వదిస్తాడు శృంగారరాయుడు. ఇటువంటి చిలిపి ఆశీర్వచనము

నభూతో నభవిష్యతి. శ్రీవేంకటేశ్వరుడు నిత్యకళ్యాణచక్రవర్తి. నిత్య పెళ్ళికొడుకు. తుమ్మెదల బారును బోలిన ఆమె కేశ సంపద దట్టమైనది. ఆ కేశపాశమునకు దీర్ఘాయురస్తు అంటున్నారు. ద్వారకాకృష్ణుడవై నన్ను గూడిన నీకు నిత్యకళ్యాణమస్తు అంటున్నది నాయిక.

తాత్పర్య వివరణ:

ఓ కొమ్మ! (తరుణీ) నీ పలుకులకు (మాటలకు) కుశలమస్తు (కుశలమగుగాక!) సమ్మదపు (సంతోషము కలిగించు నీ వయస్సునకు, అనగా చక్కని ప్రాయముగల సుందరాంగికి ఐశ్వర్యమస్తు.

బెడగుకళలు (మనోజ్ఞమైన కళలకు) చాలా పెంపు కలిగించు నీ ఉడురాజమోమునకు (నీ చంద్రబింబము వంటి ముఖమునకు) అభ్యుదయమస్తు (అభ్యుదయము కలుగుగాక!) పద్మముల బారువలెనుండు నూగారునకు హృదయ సీమలోనున్న స్తన సంపదకు అభివృద్ధి కలుగుగాక!

తేనెలు చిందించు నీ అరుణాధరములకు ఫలసిద్ధిరస్తు. ఆ చిగురుమోవికి కూడ ఆ ఫలముదక్కుగాక! సొగసైన చక్రములవలె నయనానందకరములైన నీ జఘనములకు అగణితమనోరథా వ్యాప్తిరస్తు.

తనరు (అతిశయించు) తుమ్మెదలబారువంటి తురుము (కొప్పు) గల నీ కేశసంపదకు అనుపమమైన దీర్ఘాయురస్తు. నన్ను ద్వారకా కృష్ణుడనని కూడిన నీకు ప్రతిదినము నిత్యకళ్యాణము పచ్చతోరణముగా విలసిల్లుదువుగాక!

పద్యవివరణ:

ఆ.వె॥ **సమ్మదపు వయసుకు సంపన్నమస్తు, ఆ**
కొమ్మపలుకులకును కుశలమస్తు
నన్ను కృష్ణుడంచు నళినాక్షికూడిన
నిత్య శుభములగును నిలుచు సిరులు.

సంఖ్య: II/152 రాగం : కదనకుతూహలం
కీర్తన : గుఱ్ఱాల గట్టనితేరు కొంకకెందైనా బారీ

కదనకుతూహలం

32 గుఱ్ఱాలఁ గట్టనితేరు కొంకకెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీని వేడుకతో జీవుఁడు ॥పల్లవి॥

సరి పిఱుఁదే రెండుజంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁజూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాలఁ॥

పంచమహాభూతములు పంచవన్నె కోకలు
పంచల చేతులు రెండు బలుటెక్కెలు
మించైన శిరసే మీఁదనున్న శిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాలఁ॥

పాపపుణ్యములు రెండు పక్కనున్న చీలలు
తోపులయున్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాలఁ॥

ఉపోద్ఘాతము:

జ్ఞానస్వరూపులైన వేదాంతులు ఈ శరీరాన్ని రథంతోనూ, అందున్న జీవుని రథసారథితోనూ పోల్చి చెప్పారు. పరమాత్మరథికుడు, అని అద్భుతమైన అధ్యాత్మకీర్తననావిష్కరిస్తున్నారు అన్నమయ్య. కట్టనిగుఱ్ఱాలు ఇంద్రియాలు పరిగెట్టి రథాన్ని తీసుకువెళుతున్నాయి. ఇక జీవుడు విఱ్ఱవీగుతూ తోలుతున్నాడు. ఇంతకు మించి వివరణ ఉపోద్ఘాతములోనే ఇస్తే సమంజసంగా వుండదు.

తాత్పర్య వివరణ:

ఇంద్రియములు అనబడు గుఱ్ఱములు లాగే శరీరమనే ఈ రథాన్ని తోలే సారధి జీవుడు. దేవుడు అని పిలువబడే పరమాత్మ దీని రథికుడు. ఈ గుఱ్ఱాలు జంకూ గొంకూలేక ఎందైనా బారీ (ఎక్కడికైనా పోతాయి). జీవుడు విఱ్ఱవీగుతూ దీన్ని తోలుతున్నాడు.

సరిగ్గా ఈ రథానికి వెనకాల రెండు జంటగా వున్న "బండికండు" (బయటకు చూచే కంతలు) వున్నాయి. పాదాలు చాచి వుంచుకోవటానికి నొగలు (కాడికట్టటానికి ఆధారమైన బండి మొదట్లో వుండే 'కఱ్ఱ' కూడా వున్నది.) చూపులు రెండూ వున్నవే అవే గుఱ్ఱాలను అదుపులో వుంచే పగ్గాలు. దొరవలె ఈ రథాన్ని తోలుతున్న సారధియే జీవుడు.

పంచమహాభూతములని పిలువబడె (పృథ్వి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము) ఐదురంగుల వస్త్రములను తెరలవలె కట్టబడినవి. ఈ మానవుని రెండు చేతులు, ఈ రథానికి అమర్చబడిన రెండు టెక్కెములు (రెండు జెండాలు). మించి ఉన్నతముగా కనబడుతున్న మానవుని శిరస్సే ఈ రథము పైభాగముననున్న శిఖరము. పంచేంద్రియములతో కూడిన ఈ రథాన్ని ఠీవీగా తోలుతున్నాడు ఈ జీవుడు.

ఈ రథ చక్రాలు ఇరుసుల్లోంచి వూడిపోకుండా రెండు చీలలు పక్క భాగంలో వుంటాయి. అవేమిటో ఈ రథానికి తెలియునా? ఈ మానవుడు చేసే పాపపుణ్యాలే ఆ చీలలు. ఈ రథాన్ని ముందుకు తొయ్యడానికి దొబ్బుతెడ్డు అని వుంటాయి. అవేమిటో తెలుసా? ఈ మానవుడు స్వీకరించే అన్నపానీయాలే దొబ్బుతెడ్లు. ఈ రథాన్ని యెక్కి శ్రీవేంకటేశ్వరుడు తిరు వీధులగుండా ఈ రథముపై పోతున్నాడు. అంతరాత్ముడైన ఆ దేవదేవుడు కాపాడి ఈ రథమును ముందుకు తీసికొనిపోతున్నాడు.

పద్యవివరణ:

కం॥ **జీవుడు నడిపే రథమిది**
దేవుడు రథికుండు చూడ దీనికి హయముల్
లేవట, శిరసే శిఖరము
ఈవిధి వర్ణించదెలిసె ఇదె జ్ఞానమహో!!

సంఖ్య: I/449 రాగం : బేగడ
కీర్తన : చదువులోనే హరిని జట్టిగొనవలెగాక

బేగడ

33 చదువులోనే హరిని జట్టిగొనవలెఁగాక
మదముగప్పినమీఁద మగుడ నది గలదా ॥పల్లవి॥

జడమతికి సహజమే సంసారయాతన యిది
కడు నిందులోఁ బరము గడియించవలెఁగాక
తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకితేఁ గలదా ॥చదువు॥

భవబంధునకు విధిపాపపుణ్యపులంకె
తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెఁగాక
అవల వెన్నెలలోనె అల్లునేరే ళ్లింతే
నివిరి నిన్నటివునికి నేఁటికిఁ గలదా ॥చదువు॥

దేహధారికిఁ గలదే తెగనియింద్రియబాధ
సాహసంబున భక్తి సాధించవలెఁగాక
యీహలను శ్రీవేంకటేశుదాసుల వలన
వూహించి గతిగానక వొదిఁగితేఁ గలదా ॥చదువు॥

ఉపోద్ఘాతము:

మానవ జన్మనెత్తిన తరువాత ఏదోవిధంగా బ్రతుకు గడపక తప్పదు. లోకంలో వ్యవహారాలను కొనసాగిస్తూనే భగవంతునిపై భక్తిని సాధించి చదువును కొనసాగించాలి. హరిని తెలుసుకొని సాధించవలెను. జీవితంలో విజయాలు అవకాశాలు వస్తూ వుంటే మదము పెచ్చుమీరి ఆపైన భగవద్భక్తి కుదరమన్నా కుదరదు అంటున్నారు అన్నమయ్య. మందమతికి సంసారయాతన సహజంగానే ఇంకాస్త యెక్కువగా

బాధిస్తుంది. అందుకనే సంసార యాతన అనుభవిస్తూనే పరమును గడించుటకు ప్రయత్నించాలి, అంటున్నారు. ఇంద్రియాల బాధ అనివార్యమే అయినా పట్టుదలతో భక్తిని సాధించాలి.

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! విద్యలను అభ్యసించు తరుణముననే ఆ విద్య పరమావధి సంపాదన కాదని భగవంతుని తెలిసికొనుట అని గ్రహించవలెను. హరినే జట్టిగొనవలెను (తెలిసికొని వశపరచుకొనవలెను). ఒక్కసారి విజయ పరంపరలను అందుకొన్నాక మదమెక్కి మగుడ (మరల) అది (హరిభక్తి) సాధ్యం కాదు.

జడమతికి (మందమతికి) సంసారపు యాతన సహజమే. ఇందులోనే (ఈ సంసారయావలోనే) పరమును (మోక్షమును) గడించుటకు ప్రయత్నించ వలెను. తొడరి గాలప్పుడు (బాగుగా గాలి వీస్తున్నప్పుడు) తూర్పెత్తక (తూర్పారబట్టాలిగాని) గాలివిడిచిపోయాక ఇంకా చేసేదేముంటుంది?

భవసాగరములో పడినవానికి పాపపుణ్యముల లంకె బంధనమై వుంటుంది. ఇందులో వుంటూనే క్రమక్రమంగా (మెల్లిమెల్లిగా) బంధవిముక్తుడవటానికి ప్రయత్నించాలి. ఆలుబిడ్డలతో సంగత్వము వదిలించుకొనలేని జీవులము. వారితో సంగత్వంవున్నా తామరాకు మీద నీటి బొట్టువలె వున్నా, అంటీముట్టనట్లుండాలి. కాలము గడిచిందంటే తిరిగి రానేరాదు.

దేహధారులకు ఇంద్రియముల బాధ తప్పదు గాక తప్పదు. దీనికి ఒక్కటే తరుణోపాయము. ధైర్యంతో చక్కటి భక్తిని సాధించవలెను. ఇకపైన శ్రీ వేంకటేశ్వరుని దాసులతో చెలిమిచేసి ఆయనే గతియని వూహించి శరణాగతితో వొదిగితే జీవితంలో సార్థకత కలదుగాని లేకున్న బ్రతుకే వ్యర్థము కదా!

పద్యవివరణ:

చం.॥ **చదువును అభ్యసించుతరి చక్కగ శ్రీహరి జట్టి గొన్వలెన్**
మదములు యెక్కినన్ మగుడ మాధవు బొందుట సాధ్యమౌనొకో
వదలవు దేహధారులను వంతలు, యింద్రియమాయజాలముల్
మదినెరి వేంకటేశ్వరుని మానక దిక్కని నమ్మగావలెన్.

సంఖ్య: I/96 రాగం : సావేరి
కీర్తన : చూడరెవ్వరుదీని సోద్యంబు పరికించి

సావేరి

34 చూడరెవ్వరు దీనిసోద్యంబు పరికించి
చూడఁజూడఁగఁ గాని సుఖ మెఱఁగరాదు ॥పల్లవి॥

ఎడతెగనిమమత వేయఁగరాని పెనుమోపు
కడలేనియాస చీఁకటిదవ్వుకొనుట
నిడివైనకనుచూపు నీడనుండిన యెండ
వడిచెడనితమకంబు వట్టితాపంబు ॥చూడ॥

బుద్ధిమానినచింత పోనియూరికిఁ దెరువు
పొద్దువోవనివలపు పొట్టపొంకంబు
యెద్దుఁబట్టినసివం బెఱుకమాలినప్రియము-
లొద్దికవిహారంబు లుబ్బుఁగవణంబు ॥చూడ॥

తీపులోపలితీపు తిరువేంకటేశ్వరుని-
చూపు, తనుఁబొడగననిచూపు లోచూపు,
ఆపదలువాయునెయ్యపుఁదలఁపు లీ(లో?) తలఁపు
రూపైనరుచిలోనిరుచి వివేకంబు ॥చూడ॥

ఉపోద్ఘాతము:

సోద్యంబు అంటే చోద్యము అని అర్థం. ఎవ్వరూ ఈ చోద్యమును గుర్తించరు. పరికించి చూడగా చూడగా ఈ సంసారంలో ఏం సుఖముందో ఒక పట్టాన అర్థమవదు. మానవుడు భ్రమకులోనై మమకారానికి వశుడై పెద్దపెద్ద మోకులతో కట్టివేయబడినట్లు ఈ సంసారానికి బద్ధుడౌతాడు. నాది, నావాళ్ళు, నా సుఖము అంటూ చివరికి చచ్చేదాకా ఈ భ్రాంతిలోంచి బయటపడలేడు. ఏనాడైతే శ్రీవేంకటేశ్వరుని కృప కలిగి ఆ స్వామిని తెలుసుకుంటాడో ఆనాడు ఈ భవబంధ విముక్తుడై వైకుంఠప్రాప్తినొందుతాడు.

తాత్పర్య వివరణ:

ఎవ్వరూ దీని (ఈ సంసారము యొక్క) సోద్యంబు (చోద్యమును) పరికించిచూడరు (బాగా విశదముగా పరికించి చూడరు). ఒకవేళ అలా నిశితంగాచూస్తే అసలు దీంట్లో ఏమీ సుఖంలేదని చాలా తేలికగా అర్థమవుతుంది.

మమతానురాగాలకు బద్ధుడైన జీవుడు పెద్దపెద్ద మోకులతో కట్టబడినట్లు కోరికలకు లొంగిపోతాడు. ఇది చీకట్లో త్రవ్వుకోవడంలాంటిది. ఒకదారి తెన్నూ వుండదు. మోహానికి వశుడైన వాడి పరిస్థితి యెలా వుంటుందంటే వాడికి చల్లని నీడలోవున్నా తీక్షణమైన యెండ తాపాన్ని అనుభవిస్తూనే వుంటాడు. నాది, నావాళ్ళు అనే బంధాలలో తగులుకొన్నవాడికి తమకము కలుగుట సహజమే. కానీ వట్టి తాపం మిగిల్చే దానివలన ప్రయోజనమేమిటి?

బుద్ధిలేకుండా చేసే ఆలోచన పోనివూరికి దారి కనుక్కోవడంలాంటిది. అసలు నువ్వు ఆ ఊరికే పోనప్పుడు దారి వివరాలు తెలుసుకొని ప్రయోజనమేమిటి? పొద్దుపోవటం లేదని యెవరన్నా ప్రేమలో పడతారా? ఎద్దును పట్టుకొన్న సింహానికి దాని మీద జాలి వుంటుందా? గుఱ్ఱాలకి దాణాలో పురుగులున్నాయా లేదా అని విచారించేవాడు అనవసరమైన విషయాలతోనే కాలయాపన చేస్తాడు. వాడు యెన్నటికీ భగవంతుని తెలుసుకోలేడు.

శ్రీవేంకటేశ్వరుని చూపు ఎంత మాధుర్యం తొణికిసలాడేదంటే, అది తీపులోపలి తీపు (మధురమైన వాటన్నిటికంటే మధురమైనది). ఆ చూపు ప్రసరిస్తే ఇక ఆపద అనేదే వుండదని, నమ్మకంగా చెప్పవచ్చును. రుచికరమైన వాటన్నిటికంటే రుచికరమైన ఆ చూపులో పరవశించటమే, వివేకమని గ్రహించగలిగితే ఆ దేవదేవుని కృప తప్పక కలుగుతుంది.

పద్యవివరణ:

ఆ.వె॥ **చూడరెవరు దీని సోద్యంబు పరికించి**
చూడచూడగాని సుఖములేదు
వేంకటేశునెంచి ప్రేమతో సేవించ
జన్మధన్యమగును శాశ్వతముగ

సంఖ్య: XXVI/365 రాగం : హనుమత్తోడి
కీర్తన : చెల్లబో సిగ్గు లేదటె చెల్లెల

హనుమత్తోడి

35 చెల్లఁబో సిగ్గు లేదటె చెల్లెల
అల్లన నిన్నెంచుకోవే అక్కరో నేఁడు ॥పల్లవి॥

సేసకొప్పేల వదలె చెల్లెలా
ఆ సుద్ది బావ నడుగు మక్కరో నీవు
సేసితివే బలుచేఁత చెల్లెలా
ఆస నీవంటిదే కాదా అక్కరో నాకు ॥చెల్లబో॥

చెంది నిన్ను నమ్మితిఁగా చెల్లెలా
అందుఁ బాలు గద్దు గదె అక్కరో నాకు
చిందువందాయ వావులు చెల్లెలా
అంది నీమారే నేను అక్కరో నేఁడు ॥చెల్లబో॥

చిన్నదానవంటా నుంటిఁ జెల్లెలా
అన్నిటా నీవే పెంచితి వక్కరో నన్ను
చిన్నలు నీమేన నిండెఁ జెల్లెలా
అన్నిటా శ్రీవేంకటేశుఁ డక్కరో కూడెనో ॥చెల్లబో॥

ఉపోద్ఘాతము:

చెల్లబో! అంటే సర్లేపో! అన్నట్లు. ఈ కీర్తనలో అక్కాచెల్లెళ్ళిద్దరు వాదులాడుకొంటున్నారు. ఇది యుగళగీతం. అక్క విసుర్లకు చెల్లెలు రక్కున సమాధానం చెబుతున్నది. ఇద్దరికీ కట్టుకొన్న మగడు ఒక్కడే. చెల్లెలు నాయకుణ్ణి వశపరచుకొని తన చెప్పుచేతల్లో పెట్టుకొన్నది. వళ్ళు మండి అక్కగారు ఓసి చెల్లెలా ఎంత సిగ్గుమాలినదానివే నువ్వు అని రుసరుసలాడింది. వెంటనే గడుసరి చెల్లెలు అంటించింది. అదేదో ముందు నువ్వు చూసుకోవే, నాకు నీతులు తరువాత నేర్పుదువుగానిలే అన్నది. రసవత్తరమైన ఈ అక్కాచెల్లెళ్ళ సంవాదాన్ని అన్నమయ్య బహు హృద్యంగా చిత్రీకరించారు.

తాత్పర్య వివరణ:

అక్క: సర్లేపో! ఒసే చెల్లెలా! నీకు ఏమాత్రం సిగ్గులేదటే?

చెల్లెలు: అక్కరో ! (ఒసే అక్కా!) అల్లన (అల్లదిగో) నిన్నెంచుకోవే (నిన్ను నీవు యెంచుకోవే.)

అక్క: ఓ చెల్లెలా! సేసకొప్పేల వదలె (బిగించి కట్టిన నీ కొప్పు ఎందుకు వదులయ్యిందో నాకు చెప్పవే?)

చెల్లెలు: అక్కరో (ఓ అక్కగారూ!) ఆ కథేమిటో మా బావగారినే అడిగితే బాగుంటుంది.

అక్క: అబ్బ! చేయాల్సిందంతా చేసి ఏమి చెబుతున్నావే చెల్లెమ్మా!

చెల్లెలు: ఓ అక్కగారూ! నాకు మాత్రం కోరికలుండవా?

అక్క: ఓ చెల్లెమ్మా! నిన్ను నమ్ముకొన్నందుకు చక్కటి గుణపాఠం నేర్పావులేవమ్మా!

చెల్లెలు: అందు పాలుకద్దు గదే! అక్కరో! (అందుకేగదా! నేనూ భాగాన్ని పంచుకొన్నాను అక్కగారూ!)

అక్క: చెల్లెలా! అందుకనే వాపులు చిందువందాయె. (అందుకే మన వరుసలు చిందరవందర అయినవే చెల్లెలా!)

చెల్లెలు: ఓ అక్కగారూ! నీకు బదులు నేనున్నాను సుమా!

అక్క: ఓసి చెల్లెలా! నువ్వు చిన్నదానివనుకొన్నాను కదే!

చెల్లెలు: ఓ అక్కగారూ! అన్ని విషయాలలో నీపెంపకమే నన్నింతదానిని చేసింది.

అక్క: చెల్లెలా! నీ శరీరమంతా ప్రణయచిహ్నాలు నిండెను కారణమేమిటే?

చెల్లెలు: ఓ అక్కా! నీకు తెలియదా? శ్రీవేంకటేశ్వరుడు నన్ను గూడినాడు.

పద్యవివరణ:

కం॥ **"చెల్లెను బో సిగ్గన్నది**
చెల్లెల! లేదంటె నీకు" చిందెను అక్కే
"అల్లన నిన్నెంచుకోవె"
గిల్లుచు చెల్లెమ్మ చెప్పె గీరగ బదులున్.

సంఖ్య: V/360 రాగం : పటదీప్
కీర్తన : తలచిన దేహము నిలువదు తానను దలచునొ తలచడొ

పటదీప్

36 తలఁచిన దేహము నిలువదు తాననుఁ దలఁచునొ తలఁచఁడొ
వలనుగఁ జెలిమాటలు విని వచ్చీనో రాఁడో ॥పల్లవి॥

శిరసున నంటిన పునుఁగిటు చెక్కుల జారెడిననుచును
ఉరవడిఁ దివియుచుఁ గొనగోరూఁదిన చందములు
మురిపెపు మొలనూళ్ళపై (ఱులపై?) మొగపుల సొబగులు చూచుచు-
నరుదుగ గరమున నక్కడ నంటెడి యాసలును ॥తలఁచి॥

చెనకుల వీడెపురసమిదె సెలవులఁ జెదరెడిననుచును
నునుపగు గోళ్ళ (ఱుల?) వాతెర నొక్కిన చందములు
పెనగొను ముత్యపుసరముల పెక్కువ దీర్చెదననుచును
చనవునఁ జనుఁగవపైఁ జే చాఁచిన చందములు ॥తలఁచి॥

వుద్దపు నడపులలోపల నొయ్యన పాదము జారిన-
నొద్దికతో ననుఁగొఁగిట నొరసిన చందములు
నిద్దపుఁ దిరువేంకటగిరినిలయుఁడు ననుఁ దనకొఁగిట-
నద్దిన కస్తురి చెమటల నలమిన చందములు ॥తలఁచి॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య శృంగారకీర్తనలలో నాయిక విప్రలంభ. ప్రియుని యెడబాటును సోర్వలేక అనేక విరహావస్థలకులోనై వ్యాకులతతో వుంటుంది. తన ప్రియునికోసం తాను అలంకరించుకొని క్షణమొక యుగంలా యెదురుచూస్తూంటుంది. చివరికి వేంకట రమణుని ఆగమనంతో కథ సుఖాంతమవుతుంది. ఆమె మధుర స్మృతులు, చిటిపొటిఅలుకలు, నాయిక తన చెలికత్తె (అన్నమయ్య)తో తన విరహవేదన సందేశంగా పంపింది. ఇంతలో స్వామి అక్కడకేతెంచాడు. ఆమె వ్రాసుకొన్న పునుగు జవ్వాది కరిగి ఆమె బుగ్గలమీద వ్యాపిస్తుంటే నాయకుడు చటుక్కున తన కొనగోటితో దానిని చిమ్మాడట. ఇలా చాలా వుంది చెప్పటానికి.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! ఆయన తలపులు వస్తే, నాదేహము నిలచుట లేదే. తానును (తనుకూడా) నన్ను తలచుకొంటున్నాడో లేదో. వలనుగ (సావకాశంగా) చెలిమాటలను విని నాస్వామి, వచ్చీనో రాడో వూహించలేకున్నానే.

నా తలపై నుండి పునుగు అనే సుగంధద్రవ్యము యెక్కడ నా బుగ్గలపై జారుతుందోనని నా నాథుడు చటుక్కున తన కొనగోటితో చిమ్మివేశాడే. అది కూడా ఉరవడి (బహువేగంగా) దివియుచు (తీసివేయుటవలన) తనగోరు నాకు గీసుకుందేమోనని ఆయన వూదిన విధానము యెంత హృద్యమంగా వున్నదే? నా నడుముపై ఒడ్డాణము ఎంతో పొందికగా వుందనే నెపంతో నా మొలనూలును సుతారముగా తడుముతూ కొంటెగా 'అక్కడ' తాకుతాడు. అబ్బ! యెంత చిలిపివాడే.

చెలీ! నా పెదవులపై తాంబూలపు మరకలు దట్టంగా వ్యాపించాయనే వంకతో ఆయన తన గోరితో నా పెదవిపై మీటుతాడు. నేను వేసికొనిన ముత్యాల హారము మెలికలు పడిందనే నెపంతో చనువుతో సవరిస్తున్నట్లు నటిస్తూ నా చనుగవపై చేతులు చాచి చిలిపిగా స్పృశిస్తాడు. ఇంత చిలిపివానిని నేనేమి చేయగలనమ్మా?

ఓ చెలీ! మే మిరువురము కలిసి ఏకాంతంలో వాహ్యాళికి వెళ్ళినప్పుడు మేము నడుస్తున్నాము. అప్పుడేమి జరిగిందో తెలియునా? ఒయ్యన (సుతారముగా) నా పాదము తడబడినది. ఇక అంతే... తన నునుకౌగిట (నులివెచ్చని కౌగిట్లో) నన్ను బిగించి వేస్తాడు. నిద్దపు (సాటిలేని) తిరువేంకటేశ్వరుడు నన్ను తన కౌగిటిలో ఆ విధముగా అద్దినపుడు నా చెమటలో తడిసిన కస్తూరి మైపూత ఆయన నోటికి అంటుకొన్న విధము యెంత బాగున్నదే? చెలీ! ఆ స్మృతులు నన్ను నిలువనీయుటలేదే.

పద్యవివరణ:

కం॥ **తలచిన దేహము నిలువదు**
తలచునొ తన నతడు లేక తలపేరాదో?
వలనుగ చెలిమాటలు విని
మలయప్పే నన్ను జేరి మన్నించు నొకో!!

సంఖ్య: శేషాచార్యులవారి వ్రాత ప్రతి సంకీర్తన: 241 రాగం: అభేరి
కీర్తన : తలచిన హృదయము ఝల్లను తరుణీమణి యొయ్యారము

అభేరి

37 తలఁచిన హృదయము ఝల్లను తరుణీమణి యొయ్యారము
కలిగీనా యిక నొకపరి కన్నులఁ జూడఁగను ॥పల్లవి॥

మోమరవంచి పదాంగుటమున నిల నొయ్యన వ్రాయుచు
కోమలి కన్నీరెడనెడ గ్రుక్కుచు రెప్పలను
వేమరు నాదెస జూచిటు వీడ్కొన నొల్లని భావము
యేమని తలపోయుదు విధి నేమని దూరుదును ॥తలచి॥

చెక్కిట చేయిడి యలసతచే వదనము కడు వాడఁగ
వెక్కసమగు డగ్గుత్తుక వేడుక నణఁపుచును
అక్కరదీరఁగ నాతో నాడిన సొలపుల మాటల
నెక్కడ బొగులుదు ధైర్యం బేగతి నిల్పుదును ॥తలచి॥

నను గృష్ణాయని పేర్కొని నవ్వుచు కౌఁగిట నలముక
అనువునఁ జిక్కితి వికనిన్నడుగిడనీ ననుచు
తనువునఁ బులకలు నిగుడఁగ తామరసానన యెప్పటి
చనవున నొనరించిన యుపచారపు చందములు ॥తలచి॥

ఉపోద్ఘాతము:

ఇది నాయకుడు ఆలపించే విరహ గీతిక. శేషాచార్యులవారి వ్రాత ప్రతి వలన లభ్యమైన ఈ కీర్తన శ్రీనివాసుని హృదయ స్పందనను ఆవిష్కరిస్తున్నది. నాయికను యెడబాసిన నాయకుడు ఆమె అందాలను తలచుకొంటూ విరహ గీతికను ఆలపిస్తున్నాడు. ఈ తరుణీమణి వొయ్యారము తలచుకోగానే నా హృదయము ఝల్లుమని పులకిస్తున్నది. ఏదీ ఒక్కసారి ఆ సౌందర్యాన్ని కనులారా దర్శించనీ అంటున్నారు, అన్నమయ్య, ఓ కృష్ణా! యనిపిలుస్తూ

నిన్ను బిగికౌగిట బంధించి నిన్ను యెక్కడికీ కదలనివ్వను అన్నది నాయిక. ఈ విధంగా నాయిక ప్రణయస్మృతులను నెమరువేసుకొంటూ విరహ వేదనననుభవిస్తున్నాడు శ్రీవేంకటేశ్వరుడు.

తాత్పర్య వివరణ:

ఆహా! ఈ తరుణీమణి వొయ్యారమును తలచుకొంటేనే, నా హృదయము ఝల్లుమని పులకిస్తున్నది. ఏదీ మరొక్కసారి చూద్దామా అనుకొంటే కనిపిస్తుందా? ఆ సౌందర్యం.

ఆమె తన మోమును అరవంచి (సగము వంచుకొని) పదాంగుటమున కాలిబొటవ్రేలిని సుతారముగా నేలపై వ్రాయుచూ కన్నుల నిండుగా నీరు నింపుకొని పదేపదే నాయకునివైపు చూస్తూ తనను విడచిపోవద్దని పదే పదే అభ్యర్థించుచున్నది. ఆ దృశ్యం జ్ఞప్తికి రాగానే నాయకుడు అయ్యో ఇక విధిని యేమని నిందించను అని వాపోతున్నాడు.

ఆమె అలసటతో తన చెక్కిట చేయిజేర్చి వదనము బాగా వడలిపోగా, అతిశయించిన డగ్గుత్తుకతో స్వామికి వేడుక కలుగునట్లుగా ప్రీతిపూర్వకంగా నాతో సొలపుల మాటలు ఆడినది. అదిచూసి శ్రీపతినైన నేనూ నీరుకారిపోయాను. నాకు మాత్రం ధైర్యం యెక్కడనుంచి వస్తుంది. ఆమె పరిస్థితి నాయకుడినైనా నన్నే కలవరపెట్టుచున్నది.

నన్ను శ్రీకృష్ణా! యని పేర్కొనుచు నవ్వుతూ బిగికౌగిట నలిపివేస్తూ నాకు అనువుగా చిక్కినావులే నిన్నికవదలను అంటూ ఒంటిమీద పులకలు కమ్ముకొనగా చనువుతో ఆమె చేసిన ఉపచారములు గుర్తుకువచ్చి పద్మమువంటి ముఖముకల ఆమెను స్మృతికి తెచ్చుకొని మరీ వేదన చెందినాడు స్వామి.

పద్యవివరణ:

కం॥ **తరుణీమణి వొయ్యారము**
పురిగొని తలవంగ యెడద పురివిప్పెనుబో
అరయగ ఒకపరి కన్నుల
తరుణీ సౌందర్యగరిమ తలపున కలుగున్.

సంఖ్య: XX/121 రాగం : రాగేశ్వరి
కీర్తన : తానేడో మనసేడో తత్తరము లవి యేడో

రాగేశ్వరి

38 *రూపకతాళం*

తానేడో మనసేడో తత్తరము లవి యేడో
పానిపట్టి ఇటువంటి భ్రమ యింత గలదా ॥పల్లవి॥

ఖండచాపు

సుదతి విబునిమోము చూచె పరాకున
అదనఁ గప్రపుభర ణద్దమంటాఁ జూచీనే
పదకము నడుమఁ బైపైఁ బెట్టి మొలనూలు
కదిసి హారమంటాఁ గట్టుకొనెఁ జూడవే ॥తానేడ॥

మిశ్రచాపు

యేఁటవెట్టి పతితోడ మాటలాడి వేగిరాన
గాఁటపుటందెలు తనకరములఁ బెట్టీనే
పాటియైనవుంగరాలు పాదపువేళ్లఁ బెట్టి
యీటుగా మట్టెలు వేళ్ళ నిదియేల పెట్టీనే ॥తానేడ॥

సంకీర్ణచాపు

కామిని శ్రీవేంకటేశుఁ గదిసేటివేడుకను
వేమరు మాణిక్యములు విడెమంటా నిచ్చీనే
ఆమనిరతిఁ దనిసి అంతలో నన్నీఁదెలిసి
సామజగమన ఇన్నీఁ జక్కఁజేసుకొనెనే ॥తానేడ॥

ఉపోద్ఘాతము:

అమ్మవారి చెలికత్తెలు తమలో తాము ముచ్చటించుకొంటున్నారు. ఏమిటో ఈ పద్మావతి వ్యవహారం అయోమయంగా వున్నది. తానెక్కడ వున్నదో, తన మనస్సు యెక్కడవున్నదో, ఈ తత్తరపాటు లేమిటో అర్థం కాకుండా వున్నది. పానిపట్టి (పూనుకొని) ఇటువంటి భ్రమ ఇంతచేటున

కలుగుతుందా? అనుకొంటున్నారు చెలికత్తెలు. అత్యద్భుతమైన ఈ ప్రణయతాపం అన్నమయ్య భావనాకాశంలోని తటిల్లతలు. రసహృదయాలకు గాని ఈ భావనారుూరి లాలిత్యం అవగతం కాదు.

తాత్పర్య వివరణ:

ఆహా! ఈ ప్రణయ వేదన యెంతటిదో కదా! ఈ పద్మావతి పరిస్థితి ఇలావున్నదేమిటి? తానెక్కడవున్నదో, తన మనసెక్కడ వున్నదో, అసలీ తత్తరపాటులేమిటో అర్థంకాకుండా వున్నది. పానిపట్టి (పూనుకొని) యెవ్వరికైనా ఇంత భ్రమకలుగుట యెక్కడైనా వున్నదా?

ఈ జవ్వని తన ప్రాణవల్లభుని సుందరవదనారవిందమును చూచే పరాకులో కర్పూరపు పలుకులున్న భరిణి అద్దమని భ్రమించి అందులో తన ముఖమును చూచుకొనినది. ఇక మెడలో ధరించవలసిన పతకాలహారాన్ని నడుమునకు పెట్టుకొన్నది. నడుమునకు పెట్టుకోవలసిన మొలనూలు (ఒడ్డాణమును) హారమని భావించి మెడలో ధరించినది. ఏమి ఈ విపరీతము?

ఓ సఖీ! ఈ వింతను చూడవమ్మా! తన పతితో ఏటవెట్టి (పక్షమున మాట్లాడదామనుకొని) ఆ కంగారులో తనకాలి అందియలను, తన చేతులకు ధరించినది. కాలివేళ్ళకు ధరించవలసిన మెట్టెలను ఉంగరాలని భ్రమించి చేతివేళ్ళకు పెట్టుకొన్నది. ఏమిటో ఈమె పరాకు బహు వింతగానున్నది.

ఆ కామిని తన విబుడైన శ్రీవేంకటేశ్వరుని కలసే ఆనందంలో కెంపు వర్ణముగల మాణిక్యాలను ఎఱ్ఱని తాంబూలము అనుకొని తన వల్లభునికందించింది. చివరికి రతిలో తన్మయత్వముననుభవించిన ఆ తరుణీమణి సామజగమనయై (మదపుటేనుగు నడకవలె హుందాయైన నడకగలదై) వీటన్నిటినీ తిరిగి చక్కబెట్టుకొనినది.

పద్యవివరణ:

ఆ.వె॥ **తాను యెక్కడుందొ మనసెక్కడున్నదో**
తత్తరంబులేడ తగిలినాయె
పానిపట్టి ఇట్టి భ్రమయింత కలదొకో
వేంకటేశు గదిసె వెలదితాను.

సంఖ్య: VII/284 రాగం : శుద్ధధన్యాసి
కీర్తన : తినరాని కొనరాని దేవలోకపు బండు

శుద్ధధన్యాసి

39 తినరాని కొనరాని దేవలోకపుఁబండు
మనసునఁ దలఁచితే మరిగించే పండు ॥పల్లవి॥

పంటకెక్కి పాలవెల్లిఁ బండిన పాలపండు
తొంటిగొల్లెతల మోవి దొండపండు
అంటుకొన్న మేనిచాయ అల్లునేరేడుఁబండు
ముంటిసింహపుగోళ్ళ ముండ్లపండు ॥తిన॥

ఇచ్చల వేదశాస్త్రాలు దెచ్చిన పేరీఁతపండు
తచ్చిన దైత్యమారి దేవదారుఁబండు
పచ్చిదేర మెరసిన బండిగురువిందపండు
యిచ్చవలెనన్న వారియంటనరటిపండు ॥తిన॥

తెమ్మగా మునులపాలి తియ్యనిచింతపండు
తె(తి?)మ్మల సిరివలపుఁ దేనెపండు
యిమ్ముల శ్రీవేంకటాద్రి నింటింటిముంగిటి పండు
కొమ్మల పదారువేల గొప్పమామిడిపండు ॥తిన॥

ఉపోద్ఘాతము:

ఇదిగో ఈ దేవలోకపు పండు చూడండి. దీనినెవ్వరూ తినలేరు. అలాగని ఈ పండును కొనుటకు కూడా సాధ్యము కాదు. కానీ ఈ పండును మనస్సులో స్మరిస్తే ఆశకలిగించే పండు ఇది అంటున్నారు అన్నమయ్య. ఈ పండు వున్నది చూశారా, ఇది పాల సముద్రంలో పండినదని గ్రహించండి. అందుచేత ఈ పండు పాలుగారుతూ వుంటుంది. పూర్వం రేపల్లె గొల్లభామల మోవికి ఈ పండు దొండపండువంటిది అంటుకొన్న ఈ పండుయొక్క మేనిచాయ అల్లు నేరేడు పండు రంగు కలిగివున్నది. ఇంకొక

తమాషాయేమిటంటే ఈ పండుకి ముండ్లు కూడా వున్నాయి. అవి సింహపు గోళ్ళలా వాడి ముండ్లున్నపండు. ఇప్పుడర్థమయిందా?

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! అది తినరాని పండు సుమండీ! అదే విధంగా ఆ పండును కొనుటకు కూడా సాధ్యం కాదు. ఎందుకంటే ఇది బజారులో వెలకు దొరికే పండు కాదు. ఈ పండు యొక్క మరొక ప్రత్యేకత యేమంటే దీనిని మనస్సులో తలచినంత మరిగించే పండు (ఆశగొలిపే పండు).

ఇది పాలపండు (పాలుగారేటటువంటి పండు). ఇది పాలవెల్లిలో (క్షీరసాగరమున) పంటకొచ్చిన పండు. ఇది రేపల్లె గొల్లభామల పెదవులకు తాకిన దొండపండు. ఇక దీని రంగును చూడండి. నినిగలాడే అల్లునేరేడు పండువంటి మేని ఛాయ కలిగినదీపండు. ఇంకొక విచిత్రమేమంటే సింహముయొక్క వాడి గోళ్ళలాగా ముండ్లున్న పండు ఇది. అనగా నృసింహుని అవతారమే ఈ పండు అని అర్థం.

ఇచ్చల (ఇచ్ఛతో) చతుర్వేదములను సముద్రగర్భమునుండి వెలికి దెచ్చిన పేరీతపండు (ఖర్జూరపండు) ఇదే సుమండీ! తచ్చిన (కపటులైన) దానవులపాలిటి దేవదారుపండు ఇదే. పచ్చిదేర మెరసిన పండిన గురువింద పండు ఇదే సుమండీ! ఇచ్ఛతో వలెనన్నవారి (కావాలనుకొన్నవారికి) ఇంటిలోనే దొరికే తీయటి అరటిపండు ఇదే.

ఇది మునీశ్వరుల పాలిటి తేమవూరే రుచికరమైన చింతపండు. తేమ కలిగిన (ఆర్ద్రత కలిగిన) లక్ష్మీదేవి వలచిన తేనెలూరు పండు ఇదే సుమండీ! శ్రీవేంకటాద్రిపైన ఇంటింటా ముంగిటనే దర్శనమిచ్చే పండు ఇదే. పదహారువేలమంది కొమ్మలు రాచకన్నెలపాలిటి రుచులతిశయించిన మామిడి పండు ఇదే.

పద్యవివరణ:

కం॥ **తినుటకు గొనుటకు గానీ**
ఒనగూడని దేవలోకమొందిన పండై
మనసున దలచిన తడవునె
పనిగామరగించు పండు పసతో గొనరో!

సంఖ్య: XXVI/ పీఠిక 12, 13 రాగం : యమన్
కీర్తన : తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ

యమన్

40 తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ
సరవిలేని చెంచువారి సంతయేలె తనకును ॥పల్లవి॥

పరికిదండ పొగడదండ బండిగురిగింజ దండ
బెరకులేని పికిలిదండ బలిదండలన్నియు
మెరసి కానుకియ్యబోతె మేనిదండలడిగెనమ్మ
మరల చెంచువారితోడి మాటలేలె తనకును ॥తిరుమల॥

ముసురుతేనె జుంటితేనె ముదిరినట్టి పెరలతేనె
పొసఁగ మించు పూవుతేనె పుట్టతేనె లన్నియు
వొసఁగి కానుకియ్యబోతె మోవితేనె లడిగె నమ్మ
యెసఁగ చెంచువారి యెంగి లేఁటికమ్మ తనకును ॥తిరుమల॥

వెలగపండు జీడిపండు వెలలేని మోవిపండు
పలుకుదొండపండు పాలపండు కానుకిచ్చితే
చెలఁగి పక్కపండు మంట శ్రీ వేంకటనాయకుఁడు
యెలమి కూడెనమ్మ చెంచు లేఁటికమ్మ తనకును ॥తిరుమల॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య రచించిన పలుకీర్తనలలో నాయకుడు గిరిజనుడు లేక చెంచు జాతికి చెందిన సోగ్గాడు. ఆయనకు శృంగారహేలలో సమవుజ్జీ అయిన నాయిక కొండొకచో మాటకు మాట జవాబు చెప్పగల జాణ. ఈ కీర్తనలో చెంచిత తిరుమలయ్య విందుకెళదామని నిశ్చయించుకొన్నది. తన తోటి చెంచితతో యేమంటన్నదో వినండి. ఈ తిరుమలయ ఇచ్చే విందు మంచిగా వుంటుందంటే వున్నాను. మేమేదో చెంచువారము. మా సాంగత్యం ఆ తిరుమలయ్యకు యేమి అవసరం? కావాలంటే, రకరకములైన అడవిపూలదండలతో ఆ స్వామిని అలంకరిద్దాం. పుట్టతేనె వంటివి అనేకరకరములైన తేనియలను స్వామికి

ఇద్దాము. జీడిపండ్లు, దొండపండ్లు వంటి పలురకములైన పండ్లను తినిపిద్దాము. అయినా ఈ తిరుమలయ్య తన పక్కనే నన్ను పడుకోమని యెంత బలవంతం చేస్తున్నాడో చూడండమ్మా! అవ్వ!!

తాత్పర్య వివరణ:

ఓ చెంచితా! ఇప్పుడు తిరుమలయ్య ఇవ్వబోతున్న విందు వున్నది. మంచిగా వుంటుందంటున్నారు. సరే! కదా! అని నేనూ వుండిపోయాను. సరవిలేని (ఒకతీరూ తెన్నూ లేని) చెంచువారమైన మాయొక్క సంత (సాంగత్యం) తనకును (ఆ స్వామివారికెందుకమ్మా?)

ఆయనగారు చేసిన పనిని చూశావా! పోనీకదా! తిరుమల దేవుడని అనేకమైన అడవిపూలదండలు వేశాను. పరికిదండ, పొగడ దండ, బండి గురివింద దండ, పికిలి దండ, బలిదండ, మాలలుగా కట్టి ఆయనకు సమర్పించాను. ఆయన గారికి ఈ దండలు వద్దట. నా మేనిదండ (నా శరీరాన్నే దండగా వేయాలట) కావాలట. అయినా మాబోటి చెంచువారితో ఆయనకిట్లాంటి నంగనాచి మాటలేమిటి?

సరే! అదలావుంచు. ఏదో తిరుమల దేవుడు కదా! అని యెన్ని రకాలైన తేనెలు అందించానమ్మా? ముసురు తేనె, జుంటి తేనె, బాగా ముదిరిన పెరల తేనె, అప్పటికప్పుడు కోసిన పూవులనుండి సంపాదించిన తేనె, అనేక రకములైన పుట్టతేనెలను, ఆయనగారికి కానుకగా ఇవ్వబోతే, ఆయన గారికి ఈ కానుకలేవీ వద్దట. అవ్వ!! ఆయనకి నా మోవితేనె (తీపి పెదవుల తేనే కావాలట.) ఆయనగారికి చెంచువారి యెంగిలి అయితే కానీ పసందుగా వుండదేమో?

ఆ తిరుమలయ్య కోసం ఎన్నిపండ్లు యేర్పాటు చేశానమ్మా! వెలగపండు, జీడిపండు, వెలయెంతో చెప్పలేని మోవిపండు, పలుకు దొండపండు, పాలపండు వంటి యెన్నో రకాలైన పండ్లను ఆయన గారికి కానుకగా ఇస్తే ఆయనగారికి ఆ పండ్లేమివద్దట. ఆ శ్రీవేంకటేశ్వరుడికి నేను తన పక్కనే పండుకోవాలట. పైగా అలా అంటూనే నన్ను కూడినాడమ్మా! తనకు ఈ చెంచిత యెందుకమ్మా?

పద్యవివరణ:

ఉ॥ **మంచిదె విందు దేవునిది మానక వుండుమనంటె వుంటినే**
చెంచులమైన మా చెలిమి సేయగ నేటికి సంతయేలనో
యెంచిన జుంటితేనియలు యెక్కువదండలు పండ్లు పెక్కులై
వంచనలేక నాయకుడు పక్కన పండు మనంచువొత్తెబో.

సంఖ్య: VII/3 రాగం : సింహేంద్ర మధ్యమము.
కీర్తన : దేవరవైతివిన్నిటా దేవులాయనాపె నీకు

సింహేంద్ర మధ్యమము

41 దేవరవైతివిన్నిటా దేవులాయనాపె నీకు
ఆవల మిమ్మిద్దరినేమని పొగడేమయ్యా ॥పల్లవి॥

పున్నమ వెన్నెలజోడు పూవులలోని వాసన
ఉన్నతిమీరి నీ పురమెక్కెను
మన్నన సంపదరాశి మదనుని పుట్టినిల్లు
వన్నెతో నీకు రాణివాసమాయను ॥దేవర॥

పాలజలనిధితేట బంగారులోపలికళ
కీలితముగా నీ కెంగేలు వట్టెను
మేలులో సాకారము మించులోకము భాగ్యము
తాలిమితో నీకు మూలధనమాయను ॥దేవర॥

అందరిని గన్నతల్లి ఆదిమూలమైన లక్ష్మి
కందువ నీ ముంజేతికంకణమాయను
యిందునె శ్రీవేంకటేశ యీపె సర్వమోహనము
కందు వాయ నిన్నుఁగూడె(డి?) కలిమెల్లా మెరసె ॥దేవర॥

ఉపోద్ఘాతము:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేవాధిదేవుడవైతివి. ఆమె నీ దేవేరి అలమేల్మంగ అటుపై మీ ఇద్దరినీ యేమని పొగడగలమయ్యా! అంటున్నారు అన్నమయ్య. ఆమె అనేక సంపదలకు మారురూపు. సాక్షాత్తు మన్మథుని అంతటి అందగాడిని కన్నతల్లి. ఆమె శోభాయమానంగా నీ రాణివాసమును చేరినది. నీ ఉరమునధిష్ఠించినది. ఆమె పాలజలనిధి యొక్కతేట. ఆమె నీ చేయిపట్టి నీతో వైకుంఠముచేరి నీ మూలధనమాయనయ్యా! అమె ఆదిమూలమైన

లక్ష్మీదేవి. ఆమె నీకు ముంజేతి కంకరణమై వెలుగులు జిమ్మినది. ఈమె సర్వమోహనమైన నీ కలుములరాణి, కలిమెల్లా మెరయునట్లు ఆమె నిన్ను గూడినదయ్యా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఇన్నిటాను (ఇన్ని విధములుగా) నీవు దేవరవైతివి మా కందరికీ ప్రభువువైనావు. ఆపె (ఆమె) నీకు దేవులాయె (దేవేరియైనది). ఆవల (అటుపైన) మీ ఇద్దరినీ యేమని పొగడగలమయ్యా!

పున్నమినాటి వెన్నెల సౌందర్యరాశియై సుగంధపుష్ప పరిమళమువలె అద్భుతమైన సువాసనలతో నీ పురమెక్కినదయ్యా! ఆమె మన్ననతో నీ సంపదలకెల్ల రాశియైనది. మన్మథునికి పుటినిల్లు (కన్నతల్లి) ఈమెయే. వన్నెతో శోభాయమానంగా ఆమె నీకు రాణివాసమైనదయ్యా! ఇట్టి నీ దేవేరి గురించి యేమి చెబుదునయ్యా?

ఆమె క్షీరసాగరములోని కలిమితేట. బంగారమునకు దేనిమూలంగా కళవస్తుందో ఆ కళను సమకూర్చే దేవేరి ఈమెయే. కీలితముగా (నీకు బద్ధురాలై) ఈ దేవి నీచేయిపట్టి నీవెంట క్షీరసాగరమును మెట్టినదయ్యా! మేళ్ళన్నీ సాకారమైనట్లు ఈమె నిన్ను జేరినదయ్యా! ఈ లోకపు భాగ్యఫలము ఈ శ్రీమహాలక్ష్మియే. శోభాయమానంగా ఈమె నీకు మూలధనమై భాసిల్లినది.

మనందరికి కన్నతల్లి ఆదిమూలమైన ఈ లక్ష్మీదేవి. ఓ దేవదేవా! కందువతో (అతిశయించినదై) ఈమె నీ ముంజేతికి కంకణవలె దీప్తించినది. ఇదే విధముగా శ్రీవేంకటేశ్వరా! ఈపె (ఈమె) సర్వ మోహనముగా అతిశయించినది. ఆ రీతిగా నిన్ను కూడిన ఆ శ్రీదేవి కలిమి అంతా ఒక్కచోటనే చేరినట్లు మెరసినది.

పద్యవివరణ:

ఆ.వె॥ **దేవులాయె నాపె దేవరవైతివి**
ఏమి పొగడగలము యింక మిమ్ము
కన్నతల్లివమ్మ! కనకమాలక్ష్మివి
వేంకటేశురాణి! విరులబోణి.

సంఖ్య: II/241 రాగం : భోగ్
కీర్తన : దేవుడొక్కడే గురితెలిసిన వారికి

భోగ్

42 దేవుఁ డొక్కఁడే గురితెలిసినవారికి
యీవలావల చూచినా నిఁక లేదు తెఱఁగు ॥పల్లవి॥

కోపము మానితేనే కోటిజపాలు సేయుట
పాపము సేయకుంటేనే బలుతపము
లోపల తా నూరకుంటే లోకమెల్లాఁ జరించుట
మాపుదాఁకా వెదకినా మఱి లేదు తెరఁగు ॥దేవు॥

పరకాంత నంటకుంటే బలుపుణ్యాలు సేయుట
సొరిది నాస మానుటే సోమపానము
సరి మోనాన నుండుటే సన్యాసము చేకొనుట
యిరవైతే నంతకంటే నిఁక లేదు తెఱఁగు ॥దేవు॥

పలుసుఖదుఃఖములఁ బాసివుండుటే మోక్షము
అల చంచలము మాను టది యోగము
యిలపై శ్రీవేంకటేశుఁ డిచ్చినసుజ్ఞాన మిది
యెలమి బుద్ధిఁ బోల నిఁక లేదు తెఱఁగు ॥దేవు॥

ఉపోద్ఘాతము:

గురి తెలిసిన వారికి అంటే జీవితలక్ష్యం తెలిసినవారికి పరమాత్మ ఒక్కడే. ఆయనను మనం యే పేరుతో పిలిచినా ఆయన తప్పించి ఈ ప్రపంచంలో కానీ ఆవల ఊర్ధ్వలోకాలలో కాని ఇంకొక ముక్తి మార్గం లేదు అంటున్నారు అన్నమయ్య. సుజ్ఞానము నందుకోవలెనంటే ముందుగా మానవుని నైతిక ప్రవర్తన అకళంకితముగా నుండాలి. కోటి జపముల నాచరించటం కంటే కొద్దిగా కోపాన్ని నిగ్రహించుకోవటం సర్వ శ్రేష్ఠమైనది. మనస్సును స్వాధీనపరచుకోవటం కంటే

గొప్పతపస్సు మరొకటుంటుందా? పరస్త్రీల పొందునాశించని వాడికంటే పుణ్యాత్ముడు మరొకడుంటాడా? శ్రీవేంకటేశ్వరుడు అందించే ఇట్టి సుజ్ఞానమే సర్వోత్కృష్టమైన జ్ఞానము అంటున్నారు.

తాత్పర్య వివరణ:

గురి తెలిసినవారికి (జీవితలక్ష్యం తెలిసిన వారికి) దైవముతప్ప అన్యమేదియు అక్కరలేదు. దైవము తప్పించి మోక్షమార్గాన్ని అందించగలవారు ఎవ్వరునూ లేరు. ఈవల (ఇహలోకమైన ఈ ప్రపంచంలో కాని) ఊర్ధ్వ లోకాలని పిలువబడే పరలోకాలలోకాని ఇంకొక తెఱగు (దారి) లేనేలేదు.

కోపమును మానితే (నిగ్రహించితే) కోటి జపములను చేయుటకంటే శ్రేష్ఠము. పాపము చేయక పోవటం కంటే గొప్ప తపస్సు మరొకటి లేదు. లోపల తానూరకుంటే (మనస్సును నిగ్రహించుకోగలవానికి) లోకములన్నీ తిరిగినట్లే. మాపుదాకా (చీకటి పడేదాకా) వెదకినా ఇంకొక దారి కనబడుతుందా?

పరకాంతలనంటకుంటే (పరస్త్రీల పొందునాశించనివానికి) కలిగే పుణ్యం మరెవ్వరికీ రాదని గ్రహించండి. ఆశను పూర్తిగా వదలివైచినవానికంటే యజ్ఞ దీక్షలో సోమపానము చేయుటకంటే ఉత్కృష్టమైనది. చక్కగా మౌనవ్రతమును పాటించగలవాడు శ్రేష్ఠమైన సన్యాసదీక్షను వహించినవానికంటే అధికుడు. ముక్తికి ఇంతకంటే శ్రేయస్కరమైన తెరవు (దారి) లేదు.

మోక్షము అంటూ వేరే యెక్కడనో లేదు. సుఖదుఃఖములను రెంటినీ పరిత్యజించటంకంటే మోక్షమార్గం ఇంకొకటి లేదు. చపలత్వమును మానుటకంటే వేరే యోగమార్గము, ముక్తి పొందవలెనంటే లేదు. శ్రీవేంకటేశ్వరుడు జీవులకందించగలిగిన సుజ్ఞానము ఇదే. ఎలమి (ప్రేమ స్వరూపులైన) బుద్ధిమంతులకంటే ముక్తి మార్గం చూపగలవారెవ్వరునూ లేరు.

పద్యవివరణ:

కం॥ **గురి తెలిసిన శ్రేష్ఠులకును**
అరయంగా దేవుడొక్కడదె సత్యంబౌ
తెరగన్న దింకలేదుర
ధరకీవల ఆవలైన తగు జ్ఞానమిదే.

సంఖ్య: XI/37 రాగం : ఖమాస్
కీర్తన : ననుబోటి చెలు లెల్లా నవ్వరా నిన్ను పతి

ఖమాస్

43 ననుబోఁటి చెలు లెల్లా నవ్వరా నిన్ను పతి
చెనకినదాఁకా గుట్టు సేయంగ వలదా ॥పల్లవి॥

కనుసన్న సేసితేనె కరఁగతి రమణుఁడు
తనువు సోఁకితే నెంత తమకింతువో
యెనసెటివేళనె యిన్నియు నయ్యాఁ గాక
అనువు నీ ప్రియములు అందరిలో వలెనా ॥నను॥

మాటలాడినంతలోనె మరులుగొంటి వాతఁడు
నాటఁగ నవ్వితే నెంత నయ మవుదువో
పాటించి యేకతమందె పచ్చి దేరిఁ గాక నీవు
వాట మైనసరసాలు వాకిటనె వలెనా ॥నను॥

యిక్కువఁ గూడినంతలో యిచ్చితివి చన వెల్ల
మొక్కితే విభుని కెంత మోహింతువో
మక్కువ శ్రీవెంకటేశుమహిమ లీడేరుఁ గాక
చెక్కులు నొక్కక తొల్లె సిగ్గ లింత వలెనా ॥నను॥

ఉపోద్ఘాతము:

ఏమమ్మా! నీపతి నిన్ను చెనకినదాకా కాస్త గుట్టుగా వుండవమ్మా! నాబోటి చెలికత్తెలు నీ వ్యవహారం చూచి నవ్వరా? అంటున్నారు అన్నమయ్య. నీ రమణుడు నీకేసి చూసి సైగచేయగానే కరిగి నీరైపోతావు. ఆయన శరీరం నీకు తాకగానే తమకంతో మైమరచిపోతావు. ఏకాంతంలో మీరెట్లావున్నా ఆక్షేపణలేదు. కానీ అందరిలో అయితే యెబ్బెట్టుగా వుంటుంది కదా! అంటూ నచ్చచెబుతున్నది దేవి చెలికత్తెయైన అన్నమయ్య. ఆయన నిన్ను ఒక్కసారి

కూడినంతనే ఇయ్యరాని చనవులన్నీ ఇచ్చేశావు. ఇక ఆయన నీ దాసుడై మోహిస్తే నిన్ను ఆపశక్యమా? శ్రీవేంకటేశుని మహిమ లీడేరు గాక! చెక్కిలి నొక్కగానే సిగ్గులమొగ్గవవుతావు కదమ్మా!

తాత్పర్య వివరణ:

ఓ దేవీ! ఏమిటమ్మా! ఈ భోళాతనము. నాతోటి చెలులంతా నిన్ను చూసి నవ్వుకోరటమ్మా! నీ పతి ఆయనంతట ఆయన పచ్చి నిన్ను చెనకవలెను (తాకవలెను) అంతదాకా గుట్టుగా వుండవద్దా?

దేవీ! నీ రమణుడు నిన్ను చూచి కాస్త కన్నుగీటగానే అంతగా కరిగిపోతావేమిటమ్మా? ఇక నీ విభుడి మేను సోకగానే యెందుకంత పరవశించి పోతావమ్మా? ఇవన్నీ మీ ఇరువురికి ఏకాంతంలో చెల్లుతాయిగానీ అందరిలో కాదు గదమ్మా! నీ ప్రియములను నలుగురిలో బయటపెట్టరాదు. కాస్తంత గుట్టు వుండాలి.

దేవీ! నీ రమణుడు కాస్తంత లాలనగా మాట్లాడగానే నీవాతనిపై మరులు గొంటివి. ఆతడు నీ హృదయంలో నాటుకొనేటట్లు నవ్వితే ఇక ఏమైపోతావో యేమో? అయినా ఈ సరసాలన్నీ ఏకాంతంలో జరుగవలసిన పనులమ్మా! మరీ ఇంత బాహాటంగానా? మీ పచ్చి శృంగారం ఏకాంతంలో మధురంగా వుంటుంది కానీ నలుగురిలో ఎబ్బెట్టుగా వుంటుంది. వాటమైన సరసాలను వాకిట్లోనే వదలి వేయాలమ్మా!

దేవీ! నీ విభుడు ఇక్కువతో (అనురాగముతో) ఒక్కసారి గూడగనే ఆయనకు అంతులేని చనవునిచ్చేశావు. ఇక ఆయన తన శృంగారలీల ప్రదర్శించీ నీకు మొక్కితే యేమైపోతావమ్మా? మక్కువ చూపించే ఆ శ్రీవేంకటేశ్వరుడు తన మహిమలన్నీ ప్రదర్శించినాడు. ఇంకా ఆయన నీ చెక్కిలి నొక్కనేలేదు తొల్లె (ముందుగానే) అంత సిగ్గేమిటమ్మా?

పద్యవివరణ:

కం॥ **ననుబోటి చెలులు యెల్లన్**
పనివేళానవ్వుకొనరె పతిచెనకవలెన్
వినవే గుట్టుండ వలెన్
యెనసిన యేకాంతమందు యిరువురి కొలువే.

సంఖ్య: II/469 రాగం : కానడ
కీర్తన : నానాభక్తు లివి నరులమార్గములు

కానడ

44 నానాభక్తు లివి నరులమార్గములు
యే నెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి ॥పల్లవి॥

హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి ॥నానా॥

అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతనిదాసుల సేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతిని వుండు టదివైరాగ్యభక్తి ॥నానా॥

అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశుకైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి ॥నానా॥

ఉపోద్ఘాతము:

జీవుల అంతిమ లక్ష్యం భగవంతుని చేరుకోవటమే. అది యెవరికెంత కాలం పడుతుందో చెప్పగలవాడు భగవంతుడొక్కడే. అసంఖ్యాకులైన భక్తులు భగవంతుని చేరుతూనేవున్నారు. ఇది ఒకనాటితో అంతమయ్యే విధానము కాదు.

పూర్వం కొంతమంది జ్ఞానులు భగవంతుని చేరుకోవటానికి ఉత్తమమైనది నవవిధ భక్తి అని ఆ భక్తి మార్గాలను వివరంగా అందించారు. ఏ మార్గమైనా

పట్టుదలతో కొనసాగిస్తే భగవంతుని చేరుస్తుంది. మన అందరికీ తెలిసిన మార్గాలకి భిన్నంగా ఈ కీర్తనలో అన్నమయ్య మరికొన్ని భక్తి మార్గాలను ప్రతిపాదించారు. రాక్షసభక్తి తురీయభక్తి, రాజసతామసభక్తి, నిర్మలభక్తి, నిజభక్తి - వీటి వివరము తెలుసుకోవాలంటే దీన్ని చదవక తప్పదు.

తాత్పర్య వివరణ:

ఇవి (ఈ నేను జెప్పబోతున్నవి) నరులు అవలంభించవలసిన, నూతన భక్తి మార్గాలు. ఒక్కటి మాత్రం సత్యం. ఏ నెపాననైనా అతడే (ఆ నారాయణుడే) భక్తిని తానే ఇయ్యకొనును (ఇస్తాడు).

శ్రీహరి ఉన్నాడున్నాడని తీవ్రంగా వాదించటమే ఉన్మాద భక్తి. పరులను గొలువక కేవలం శ్రీహరినే నమ్ముకొని వుండేది పతివ్రతా భక్తి. శ్రీహరిని ఆత్మలో సందర్శించగలుగుటయే విజ్ఞాన భక్తి. ఏమాత్రమూ అరమరికలు లేక అన్నీ శ్రీహరికి చెప్పుకోవటమే ఆనందభక్తి.

అతి సాహసాలతో పూజలు చేస్తూ భగవంతుని కొలిచే వారిది రాక్షస భక్తి. శ్రీహరి దాసులను సేవిస్తూ పవిత్రంగా జీవితం గడిపేదే తురీయ భక్తి అవుతుంది. ఈ లోకంలో ఏదో ఒక కోరికతో భగవంతుని కొలుచుటయే తామసభక్తి అని అనవచ్చును. నాకింకేమీ అక్కరలేదు ఆతడే నాకు గతి అని వుండుటయే వైరాగ్య భక్తి అని పిలువబడుతున్నది.

అట్టే నేను సర్వ స్వతంత్రుడను. నేను యేమిచేస్తే అదే సరైన పూజ అనే భావనతో చేసేదే రాజసభక్తి. ఆ దేవదేవునికి శరణాగతితో జీవించుటయే నిర్మల భక్తి. గట్టిగా శ్రీవేంకటేశ్రునికి కైంకర్యము చేస్తూ తట్టుముట్టు లేనిదే (అన్య విషయములపై యేమాత్రమూ తగులము లేనిదే) నిజమైన భక్తి. కానీ ఏ భక్తి మార్గమైనా తుది శ్వాసదాకా దీక్షతో కొనసాగిస్తేనే తుది పదము దక్కుతుంది. (మోక్షం సిద్ధిస్తుంది.)

పద్యవివరణ:

కం॥ **నానావిధముల మార్గా-**
లీనా డిటు అన్నమయ్య ఇటు జెప్పెనుగా
మానక నారాయణుడే
తానే ఈ కొనును భక్తి దయగల్గుటచే.

సంఖ్య: I/27 రాగం : వరము
కీర్తన : నిన్ను దలచి నీ పేరు దలచి

వరము

45 నిన్నుఁ దలఁచి నీ పేరు దలఁచి
నన్నుఁ కరుణించితే నెన్నికగాక ॥పల్లవి॥

అధికునిఁ గాచు టేమరుదు నన్ను-
నధమునిఁ గాచుట యరుదుగాక నీకు
మధురమౌ టేమరుదు మధురమూ, చేఁదు
మధురమౌటే మహిలో నరుదుగాక ॥నిన్నుఁ॥

అనఘునిఁ గరుణింప నరుదుగాదు నీకు
ఘనపాపుని నన్నుఁ గాచు టరుదుగాక
కనకము గనకము గానేల, యినుము
కనకమవుటే కడు నరుదుగాక ॥నిన్నుఁ॥

నెలకొన్న భీతితో నిన్నుఁ జెనకితిఁగాక
తలకొన్న సుఖినైనఁ దలఁచనేల నిన్ను
యెలమితోఁ దిరువేంగళేశుఁడ నాపాలఁ
గలిగి నీ కృప గలుగుఁజేతువుగాక ॥నిన్నుఁ॥

ఉపోద్ఘాతము:

ఓ దేవదేవా! నిన్ను తలచి నీపేరు స్మరించి నన్ను కరుణించు ప్రభూ! అని వేడుకొనే నన్ను కరుణించటం గొప్పగాని, పుణ్యాత్ములను, యోగులను మునులను కరుణించటం యేమి గొప్ప? వాళ్ళు చేసికొన్న పుణ్యమే వాళ్ళను కాపాడుతుంది. నాబోటి యెందుకూ పనికిమాలిన వాడిని ఒక్కడినన్నా దయదలిస్తే నీ గొప్ప కానీ అంటూ శ్రీవేంకటేశ్వరునికే

సవాలు విసురుతున్నారు, అన్నమయ్య. చేదు పదార్థములను మధురంగా చేస్తే అది గొప్ప, మధురమైన వాటిని తీపిగా చేయటం యేమి గొప్ప? అని దెప్పిపొడుస్తున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! నిన్ను దలచి నీపేరు తలచి నన్ను కరుణించితే యెన్నికగాని మునీశ్వరులను యోగులను నిష్ణాతులను కరుణించినంతమాత్రాన ప్రయోజనమేమిటి స్వామీ!

ఎవ్వడో గొప్పవాడైన అధికుని కరుణిస్తే ప్రయోజనమేమిటి ప్రభూ! నాబోటి అధముని గాచుట (రక్షించుట) అరుదైన విషయము. నీకు మధురమైన పదార్థములను తీపిగా చేయుట యేమంత ఘనకార్యము? చేదు పదార్థములను మధురంగా చేయటం విశేషము. భువిలో నీవంటివాడు చేయదగ్గ అరుదైన మహిమలు ఇంకా చాలా వున్నాయి.

అనఘుని (యెన్నడూ పాపము చేయనివానిని) కరుణించటం యేమంత విశేషము చెప్పవయ్యా? ఘనమైన పాపములను చేసిన నాబోటివానిని గాచుట (కాపాడుట) అరుదైన విశేషము. బంగారమును బంగారం చేయటము యేమంత గొప్ప విశేషము? ఇనుమును బంగారం చేస్తే అది చెప్పుకోదగ్గ విశేషమవుతుంది.

అధికమైన భీతిచే వేధింపబడుటచేత నిన్ను చెనకితిని (ఆశ్రయించితిని). సుఖంగావున్నవాడికి నీ కృపతో పనేముంది? ఎలమితో (అనుకూలుడవై) ఓ శ్రీవేంకటేశ్వరా! నా పాలగలిగి నీకృప జూపింతువుగాక! మరొక విధంగా నీ కృపతో అవసరమేమున్నదయ్యా?

పద్యవివరణ:

ఉ॥ **నిన్నుదలంచి నిశ్చలపు నీనిజభక్తిని నీదు నామమున్**
మన్ననతో స్మరించి నిను మానక గొల్చెదజూపు మాదయన్
ఉన్నతుడంచునమ్మితిని ఉత్తముఁబ్రోచుట దండగే కదా!
ఎన్నికజేసి పాపినని యెంచక బ్రోవుము గొప్ప అప్పుడే.

సంఖ్య: II/20 రాగం : అభోగి
కీర్తన : నీ దాస్యమొక్కటే నిలిచి నమ్మగలది

అభోగి

46 నీ దాస్య మొక్కటే నిలిచి నమ్మఁగలది
శ్రీదేవుఁడవు నీ చిత్తము నా భాగ్యము ॥పల్లవి॥

అనుష్ఠానములు గతియని నమ్మి చేసితినా
తనువిది మలమూత్రములప్రోగు
జనులలో నుత్తమపుజన్మమే నమ్మితినా
వొనరఁ గర్మమనేవోఁదానఁబడినది ॥నీ దాస్య॥

చదువుల శాస్త్రములజాడలు నమ్మితినా
పొదలినమతములపోరాట మది
మదిమదినుండిన నా మనసే నమ్మితినా
అదియును నింద్రియాల కమ్ముడువోయినది ॥నీ దాస్య॥

పుత్రదారదనధాన్యభూములు నమ్మితినా
పాత్రమగురుణానుబంధము లవి
చిత్రముగ ననుఁ గావు శ్రీవేంకటేశ నీవే
పత్రపుష్పమాత్రమే నా భక్తియెల్లా నీకు ॥నీ దాస్య॥

ఉపోద్ఘాతము:

భగవంతునికి శరణాగతితో మొక్కుతున్నారు అన్నమయ్య. ఈ సృష్టిలో నమ్మగలిగింది యేదన్నా వున్నదా అంటే నీ దాస్యమొక్కటే ప్రభూ! తక్కినవన్నీ అశాశ్వతమే, అంటున్నారు.

నీవు సాక్షాత్తూ శ్రీదేవుడవు, శ్రీమన్నారాయణుడవు ఘటనాఘటన సమర్థుడవు. నన్ను కాపాడవయ్యా! ఇది నా విన్నపము. ఆపైన నీ చిత్తము నా భాగ్యము, అంటున్నారు. అనుష్ఠానములు గతియని నమ్మటానికి వీలులేదు.

ఎందుకంటే శుచి శుభ్రతలను పాటిస్తూ అనుష్ఠానము చెయ్యాలికదా! ఈ శరీరమే మలమూత్రాల కుప్ప, కదా! పోనీనాది ఉత్తమ జన్మ అనుకొనే వీలున్నదా అంటే లేదు. జన్మ అనేది కర్మము అనే గోతిలోబడి పాప పుణ్యాలు అనుభవిస్తూనే వుంటుంది. శ్రీవేంకటేశుని కరుణలేకపోతే అంతే సంగతులు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నేను నిలిచి నమ్మగలిగినది ఒక్క నీ దాస్యమునే ప్రభూ! మమ్మల్ని యెప్పుడు రక్షించాలో నీకు తెలియదా? నీవు శ్రీదేవుడవు. మమ్మల్ని యెట్లా రక్షిస్తావో, నీ చిత్తము, మా భాగ్యము ప్రభూ!

దేవా! నిష్ఠతో అనుష్ఠానము చేద్దామనుకొంటే అదే గతియని నమ్మటానికి వీలులేదు. నా శరీరం నిండా మలమూత్రాలే కదా! ఇంకా శుచియేమిటి శుభ్రతయేమిటి? పోనీ జనములందరిలో నాదే ఉత్తమ జన్మ అనుకొందామా అంటే అదీ వీలులేదు. అది కర్మము అనే, వోదాన బడి (గోతిలోబడి) చేసిన పుణ్యములు పాపములు ఫలితమేదన్నా వున్నదంటే అది అనేక జన్మలను దాల్చటమే.

పోనీ నేను చదివిన శాస్త్రములను నమ్ముదామా అనుకొంటే, అది ఒక మతము ఇంకొక మతంపై ఆధిక్యతకోసం చేసే పోరాటమే. చివరికి ఆ మతముల సారమువలన నేర్చేదేమిటి? పోనీ నా మనస్సును నమ్మి అది చెప్పినట్లు చేద్దామా అంటే దానంత నిలకడలేనిది ఇంకొకటి లేదు. అది ఏనాడో ఇంద్రియాలకు అమ్ముడుపోయింది.

పోనీ నా పుత్రులను భార్యలను ధనధాన్యములను నమ్మి వుందామా అంటే వారంతా నా పాత్రతకొద్దీ ఋణానుబంధంగా లభించినవారే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే చిత్రముగా నన్ను కాపాడవలెనయ్యా! కానీ దురదృష్టవశాత్తు నీపై నా భక్తి యెల్లా ఫల పత్ర పుష్పములను సమర్పించుటకే పరిమితమైయున్నది ప్రభూ!

పద్యవివరణ:

ఆ.వె॥ **నిలిచి నమ్మగలది నీదాస్యమొక్కటే**
నీదు చిత్తమింక నిగమవినుత!
నాదు భాగ్యమయ్య! శ్రీదేవుడవు నీవు
పుత్రదారధనము పొరి నిలచునె?

సంఖ్య: XXV/1 రాగం : లతాంగి
కీర్తన : నీవు మొదలి జాణవు నీకంటే జాణలు వారు

లతాంగి

47 నీవు మొదలి జాణవు నీకంటే జాణలు వారు
కావరపు నిన్నుఁ జూచి కన్నుల నవ్వేరు ॥పల్లవి॥

గుట్టున నెవ్వతెనో కూడవలసి యందరి-
నట్టే పనులు చెప్పి యంపేవు నీవు
నెట్టన గొందరిందులో నీ తలఁపు తామెరిఁగి
చుట్టి చుట్టి నీవద్దనే సుద్దులు చెప్పేరు ॥నీవు॥

పొద్దున నెవ్వరింటికో పోవలసి ఇంటివారి
నిద్దురలు వొమ్మనేవు నెమ్మది నీవు
వుద్దండపుకాంత లిది వూహించి తాము దెలిసి
వొద్దికతోఁ బాదములు వొత్తేరు నీకును ॥నీవు॥

సందడి నెవ్వతెతోనో సరసమాడవలసి
అందరి వసంతాలాడుమనేవు నీవు
ఇందె శ్రీవేంకటేశ నే నెఱిఁగితేఁ గూడితివి
విందుచెప్పి కొందరైతే వేడుకఁ గూడేరు ॥నీవు॥

ఉపోద్ఘాతము:

జాణ అంటే చతురతగల రసికుడు అని విశేషార్థము. అన్నమయ్య ఈ శృంగారసంకీర్తనలో నాయకుడు జాణ అయితే ఆ కామినులు నాయకుని కంటే జాణలు అంటున్నారు. వారేం చేశారో తెలియునా? గర్వముతో అతిశయించిన ఆ కాంతలు నిన్ను జూచి తమ కన్నులతోనే నవ్వుతున్నారయ్యా! అంటున్నారు. ఆ జాణలు శ్రీవేంకటేశ్వరుని మించినప్పటికీ ఆయన తగిన సమయస్ఫూర్తితో అందరితోటి వసంతములాడి, తాను యెవ్వరితో ఆడవలెననుకొన్నాడో ఆమెతో కూడా ఆడి చివరికి ఆమెను కూడినాడు.

విందులో పాల్గొనిన మరికొందరు జాణలు సందుచూసికొని వారు కూడా నిన్ను కూడినారయ్యా! అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మొదలి జాణవు (అగ్రశ్రేణి రసికుడవు). వారు (ఆ కాంతలు) నీకంటే జాణలు (నిన్ను మించిన చతురులు). కావరపు నిన్ను జూచి (గర్వము అతిశయించియున్న నిన్నుజూచి) వారు తమ కన్నులతోనే నవ్వేరయ్యా!

స్వామీ! నీవేమీ తక్కువవాడవా? నీవు గుట్టుగా యెవ్వతెనో కూడవలసియున్నది. అందరికీ నీవు యేవేవో పనులు జెప్పి పంపివేసినావు. నెట్టన (అనివార్యముగా) నీ ఆలోచనలను తెలిసికొనిన ఆ జాణలు చుట్టీచుట్టీ నీవద్దనే వుంటూ యేవోవో సుద్దులు (పనికిరాని విషయాలను) చెప్పి కాలయాపన చేస్తున్నారు.

పొద్దున్నే నీవెవరింటికో వెళ్ళెదననుకొన్నావు. నీవు ఈ వనితలకు తీపి కబుర్లు చెప్పి, అలిసిపోయినారు, కాస్త విశ్రాంతి తీసికోండని నెమ్మదిగా చెప్పావు. ఉద్దండులైన ఆ కాంతలు తాము జరుగబోయేది ముందే వూహించి అణుకువతో వున్నట్లు, నీ పాదములను వొత్తుతూ కాలయాపన చేశారు. మరి వారేమీ తక్కువవారా?

సరే! నీవుకూడా ఇట్లా కాదనుకొని, ఒక ఉపాయం ఆలోచించావు. నీవు యెవ్వత్తెతో సరసమాడవలెననుకొంటివో, అందరితోపాటు ఆమెనూ వసంతములాడమని అడిగినావు. ఇందే వో శ్రీవేంకటేశ్వరా! నాకు తెలిసిపోయిందని నన్ను వూరకయించుటకు నాతోను కూడినావు. విందులో పాల్గొన్న జాణలు, సందుచూసికొని వారుకూడా వేడుకతో నిన్ను గూడేరయ్యా!

పద్యవివరణ:

కం॥ **నీవు మొదలి జాణవంట**
కోవిదులై నిన్ను మించి గూడిరి జాణల్
కావరపు నిన్ను జూచుచు
భూవర! నవ్వేరు చెలులు పొలకువతోడన్
* పొలకువతోడ = జాడతో

సంఖ్య: II/127 రాగం : ధీర శంకరాభరణం
కీర్తన : నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు

ధీర శంకరాభరణం

48 నీవు సర్వసముఁడవు నీవు దేవదేవుఁడవు
యీవల నాగుణదోషా లెంచ నిఁకనేలా ॥పల్లవి॥

పూవులపైఁ గాసీఁ బొరి ముండ్లపైఁ గాసీని
ఆవల వెన్నెలకేమి హాని వచ్చీనా
పావనుల నటు గాచి పాపపుంజమైన నన్నుఁ
గావఁగా నీకృపకునుఁ గడమయ్యీనా ॥నీవు॥

గోవుమీఁద విసరీఁ గుక్కమీఁద విసరీని
పావనపు గాలికిని పాపమంటీనా
దేవతలరక్షించి దీనుఁడనైననాకుఁ
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా ॥నీవు॥

కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేఁడు గావవే ॥నీవు॥

ఉపోద్ఘాతము:

మానవమాత్రులకు స్వపర బేధముంటుంది కానీ నీవు దేవదేవుడవు. సర్వులూ నీకు సమానులే. నేను మానవాధముడనని ఒప్పుకొన్నాక ఇంకా నా గుణదోషములనెంచినందువలన ప్రయోజనమేమిటి స్వామీ! అంటున్నారు అన్నమయ్య. సుకుమారమైన పూవులపై కాసేది వెన్నెలయే. గుచ్చిబాధించు ముండ్లపై కాసేది వెన్నెలే. వెన్నెలకేమన్నా హానికలుగుతుందా? పావనులైన వారిని కాచేది నీకృపే. నాబోటి పాపరాశులను కాచేది నీదయయే. నాబోటి ఒక్కడిని

ఉద్ధరించినందువల్ల, నీకేమన్నా లోటు కలుగుతుందా ప్రభూ! అంటున్నారు. మరి ఇంకా ఆలస్యమెందుకు?

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవు సర్వ సముడవు (అందరూ సమానులే అని భావించు లోక పితవు). కానీ నేను మానవమాత్రుడను. ఈవల (ఇటుపైన) నా గుణదోషాలెంచి ప్రయోజనమేమిటి ప్రభూ!

దేవా! నీవు వెన్నెలవంటివాడవు. పూవులపై కాచేదీ పండువెన్నెలే, బాధించే ముండ్లపై కాచేదీ పండువెన్నెలే. ముండ్ల మీద కాసినంతమాత్రాన వెన్నెలకేమన్నా హాని కలుగుతుందా? పావనులైనవారిని కాచేది నీ కృపయే. నాబోటి పాపపుంజమైన వారిని కాచేదీ నీ కరుణయే. నన్నొక్కడిని కాచినంతమాత్రాన నీకు కడమయ్యీనా (లోటేమన్నా కలుగుతుందా ప్రభూ!)

చక్కటి గాలికి, అటు పవిత్రమైన గోవు మీద విసరినా, లేక ఇటు కుక్క వంటి అల్ప జంతువు మీద విసరినా భేదమేముంటుంది? కుక్క మీద వీచినంతమాత్రా గాలి అపవిత్రమైపోతుందా? నీవు నిత్యమూ నీ ఆశ్రితులైన దేవతల్ని రక్షించుతూనే వుంటావు కదా! దీనుడనైన నాబోటి వానినొక్కని రక్షించినంత మాత్రాన వాడికి దోవ జూపి కాపాడినంతమాత్రాన నీకేమన్నా దోషం అంటుకొంటుందా? ప్రభూ!

వెలుగులు వెదజల్లే మార్తాండునికి అగ్రకులజుడి ఇంటిమీది యెండపడేట్లు చేసినా లేక కులహీనుడి ఇంటిమీద యెండపడేలా చేసినా, ప్రపంచంలో ఎండకు కలిగే హాని యేమన్నా వున్నదా? వలసి (కావలెననియొచిస్తే) పవిత్రమైన శ్రీవేంకటాద్రిపై నీవిచ్చే వరములకు నాలో అంతర్యామివై నిలిచి నీవిచ్చే వరములకు తేడా యేమీ లేదు. అందుకని నేడే నన్ను కావుమయ్యా!

పద్యవివరణ:

తే.గీ॥ నీవు సర్వసముడవయ్య! దేవదేవ!
నాదు గుణదోషముల నెంచ నయమదౌనె?
వలచి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చి
నిలిచి వరములనిచ్చుచు వెలసినావు.

సంఖ్య: II/336 రాగం : ధన్యాసి
కీర్తన : నీవే దయదలచుక నెమ్మి రక్షించుటగాక

ధన్యాసి

49 నీవె దయదలఁచుక నెమ్మి రక్షించుటగాక
యీవలఁ గొలిచేనంటే యీడైనవాఁడనా ॥పల్లవి॥

పరగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే
హరి నీకు నెదురుమాఁటాడేవాఁడనా
గరిమ సువస్తువులు కానుక ఇచ్చేనంటే
సరుస నీకన్నా నేను సంపన్నుఁడనా ॥నీవే॥

మెలఁగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే
జలజాక్ష నే నీతో సరివాఁడనా
బలువైన నీపరమపదము గోరేనంటే
వలనైననీతోడివంతువాఁడనా ॥నీవే॥

తాలిమితో నాలో నిన్ను ధ్యానము సేసేనంటే
పాలసుఁడ నేను నీపాటివాఁడనా
యేలితివి శ్రీ వేంకటేశ నన్నుఁ గృపతోడ
యీలీల నీ మహిమలు యెరిఁగేటివాఁడనా ॥నీవే॥

ఉపోద్ఘాతము:

అన్నమయ్య కీర్తనలో ఒక్కొక్కప్పుడు పల్లవిని అర్థం చేసికోవటమే కత్తిమీద సాములా వుంటుంది. ఓ దేవదేవా! నీవే యేదో విధముగా నాపై దయదలచి ప్రేమతో రక్షించాలి. ఇకపైన నిన్ను కొలిచేనంటే నేనెంత? నా బ్రతుకెంత, స్వామీ? నేనేమైనా నీకు సాటియైనవాడినా, గోవిందా? ఈడూజోడూ కుదిరిన స్నేహితుడనా? అని ప్రశ్నిస్తున్నారు. భగవంతుని సర్వోన్నతత్వము అర్థం చేసికొంటే మన అల్పత్వం మనకే అవగాహన అవుతుంది. పోనీ నిన్ను ధ్యానం

చేసి మెప్పిద్దామనుకొంటే నా అంత "పాలసుడు" మరొకడు లేడు, (అంటే యేమిటో) కనుక ఓ శ్రీవేంకటేశ్వరా! యేదో ఒక మహిమ జూపి నీవే పుణ్యం కట్టుకోవాలి.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీహరీ! నీవే దయదలచుక (దయచూపిద్దాములే అనుకొని), నెమ్మి (పూనుకొని) నన్ను రక్షించవలెను గానీ, ఈవల (ఇటుపైన) నిన్ను కొలిచెదనని, నీకు వాగ్దానం చేద్దామా అంటే, నేనేమైనా నీకు తగిన వాడినా ప్రభూ!

ఓ శ్రీహరీ! నీకెదురుపడి నామనవి విన్నవిద్దామా అనుకొంటే నీముందు నా నోరేపెగలదాయెను. పోనీ విలువైన సువస్తువులు (మంచి వస్తువులు) నీకు సమర్పించి నిన్ను మెప్పిద్దామంటే, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మికే మగడివైన నీ సంపదను యెవ్వరి సంపదతో పోల్చగలను? నీదగ్గరవున్న వాటినే నీకిచ్చేటటువంటి దుస్సాహసం చేయగలనా దేవా!

నీవు సకల సద్గుణసంపన్నుడవు. అది అందరికీ తెలిసిన విషయమే కదా! ఓ జలజాక్షా! ఇక నేను నీ గుణగణాలను మెచ్చికొని ఆనందించడం యెంత హాస్యాస్పదము? పోనీ నువ్వుండే పరమపదములో నాకూ కాస్త స్థానమియ్యవయ్యా! అని ప్రార్థిద్దామా అంటే దానిని అడిగే అర్హత నాకున్నదా? ప్రభూ! నేనేమైనా నీసాటివాడనా స్వామీ!

తాలిమితో (ధైర్యంతో) నిన్ను నామదిలో ధ్యానించి, నిలుపుకొందామనుకుంటే నేను పాలసుడను (మూర్ఖ శిఖామణిని) నీ పాలివాడనా (నీ బంధువర్గానికి చెందినవాడను కాను.) ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను కృపతో యేలితివి. నేను నీ మహిమల నెరిగే సమర్థుడనా? నా అజ్ఞానం మన్నించి నీవే పుణ్యం కట్టుకోవాలి తండ్రీ!

పద్యవివరణ:

కం॥ **నీవే దయదలచుచు నను**
యేవిధినో గావకుంటె యింకెవరికినౌ
యీవల గొలిచేనంటే
గోవిందా! యీడుజోడు కుదిరెనటయ్యా?

సంఖ్య: XVII/20 రాగం : భాగేశ్వరి
కీర్తన : నెలతబాసివుండలేను నిమిషమెందు నేడు నాకు

భాగేశ్వరి

50 నెలఁత బాసి వుండ లేను నిమిష మెందు నేఁడు నాకు
తలఁపులో నీవలెనే రతుల తరుణిఁ గలయు టెన్నఁడే ॥పల్లవి॥

ముదిత నాయెదుట నిలిచి మోసులువార నవ్వు నవ్వి
కదులుఁజూపులఁ జూచి నాకు కన్ను లార్చు టెన్నఁడే
వదలుఁబయ్యద సవదరించి వలపుతేట చవులు చూపి
కొదలు మాటల ముద్దు గునిసి కూరిమి గొసరు టెన్నఁడే ॥నెలత ॥

చెలియ సిగ్గున మోము వంచి చెక్కునఁ జేయి మాటు సేసి
మలసి వీడె మిచ్చి ఆకు మడిచి యిచ్చు టెన్నఁడే
వలుద చన్ను లురము మోఁపి వాసన యూర్పు చల్లిచల్లి
కలయ మోవితేనె లొసఁగు కంచము పొత్తు లెన్నఁడే ॥నెలత॥

యింతి నన్నుఁ జేరఁ బిలిచి యింటిలోని పరపు మీఁద
దొంతికళలు రేఁగ నంటి దొమ్మి సేయు టెన్నఁడే
వింత లేక యిపుడె శ్రీవేంకటేశ్వరుఁడనైన
పొంతనున్న నన్నుఁ గూడ పొద్దు దెలియు టెన్నఁడే ॥నెలత॥

ఉపోద్ఘాతము:

ఇది పెదతిరుమలాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తన. అన్నమయ్య సుపుత్రుడైన పెదతిరుమలయ్య తండ్రి ఒరవడిలోనే పెక్కు శృంగార, అధ్యాత్మ కీర్తనల వేంకటేశ్వర మకుటంతో చెప్పారు. ఈ కీర్తనలో విరహతాపంతో మగ్గిపోతున్న తిరుమలేశుడు అయ్యో! నేను ఆ నెలతను బాసి యెందునూ ఒక్క నిమేషమైనా వుండలేకపోతున్నాను. ఓ తరుణీ! నా తలపులలో నైనా సురతమున నన్ను గూడుటెన్నడే? అని

వేంకటరమణుడంతటి వాడు వాపోతున్నాడు. వలపులలోని అనిశ్చిత పరిస్థితి యెంతటి వారినైనా వేధిస్తుందని ఇంకా ప్రత్యేకంగా చెప్పాలా?

తాత్పర్య వివరణ:

అయ్యో! హతవిధీ! నేను ఈ నెలతను బాసి (వదలి) ఒక్కనిమిషమేనా వుండలేను. నాకు యెందున్ (యెక్కడచూచినా) ఆ నిమేషమే, ఏడు (ఒక ఏడాదిగా) అనిపిస్తోంది. ఈవలెనే (ఈవిధంగానైనా) కనీసం తలపులలోనైనా రతుల ఈ తరుణిని గూడుటెన్నడో కదా!

ఆ ముదిత నా యెదుట నిలచి మోసులువార (మొలకలెత్తునట్లు) నవ్వితే, నిలకడలేని చూపులతో నాకేసి చూస్తూ తన కన్నుల నార్పుట ఆమె యెన్నడు చేస్తుందా అది నేనెన్నడు చూస్తానోకదా! వదులైన పయ్యెదను బిగించి, తేటవలపులు కన్నులతో చవులూరునట్లు చూచి ముద్దు మాటలతో గునుస్తూ కూరిమితో నన్ను కసురుకోవటం యెప్పుడు చేస్తుందో కదా!

ఆ చెలియ, సిగ్గులు పూస్తుంటే మెల్లిగా తన మోమును, ఒకపక్కకు వంచి తన చెక్కిళ్ళపై చేయవుంచి యేవేవో మాట్లాడుతూ, మలసి (ఉద్యమించి) తాంబూలమును మడిచి నా నోటికందించటం యెన్నడో కదా! వలుదగు (పెద్దపెద్ద) చన్నులను నా వురమునకు ఒత్తి సుగంధ పరిమళములను వెదజల్లు నా ఊర్పులను (నా ఊపిరిని) తన ఊపిరితో ఒక్కటి చేయుట యెన్నడు జరిగేనో కదా!

నా ఇంతి నన్ను చేరబిలిచి నా ఇంటిలో పరపుమీద రతికళలు నిగ్గుతేరగా దొమ్మివలె చేయుట యెన్నడు జరుగుతుందో కదా! ఏవింతా జరుగకుండానే శ్రీవేంకటేశ్వరుడనైన నాకు పొద్దు అనేది తెలియకుండా తనవద్దనే వున్న నన్ను ఆమె యెన్నడు కూడునో కదా!

పద్యవివరణ:

చం॥ **నెలతను బాసివ్యర్థముగ నిల్చుట సాధ్యము కాకయుండెనే**
తలపుననైననున్ రతులతన్మయమొందుచు గూడుటెన్నడే?
వలుదగు చన్నులన్ వురమువత్తుచు వాసనయూర్పు చల్లుటల్
కలికిరొ! యెన్నడే యనుచు కాంతుడ! ఆ పెదతిర్మలయ్యనెన్.

సంఖ్య: III/324 రాగం : బౌళి
కీర్తన : పంచేంద్రియములనే పట్టణస్వాములాల

బౌళి

51 పంచేంద్రియములనే పట్టణస్వాములాల
తెంచి బేర మాడుకొని దించరో బరువు ॥పల్లవి॥

తగిన సంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపు టోడబేహారివాఁడ
జగతిఁ బుణ్యపాపపుసరకులు దెచ్చినాఁడ
దిగితి బూతురేవునఁ దీరుచరో సుంకము ॥పంచే॥

అడరి గుణత్రయములనేటి తెడ్డులచేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁజంచలములనేగాలి చాప లెత్తినాఁడ
వెడమాయపుసరకు వెలకియ్యరో ॥పంచే॥

అతుమయనేటికంభ మంతరాత్ముఁడెక్కియుండి
నీతితో మమ్ముఁగాచుక నిలుచున్నాఁడు
అతఁడే శ్రీవేంకటేశుఁ డటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణ మియ్యరో ॥పంచే॥

ఉపోద్ఘాతము:

విశేషమైన ఈ కీర్తనలో అన్నమయ్య మానవ శరీరాన్ని ఓడతోను జీవుని ఈ సంసార సాగరంలో ఆ ఓడపై తిరుగుతూ వుండే యెడతెగని వ్యాపారితోనూ పోలుస్తున్నారు. వీడు బేరం చేసే సరుకులు పాపపుణ్యాలట. ఈ వ్యాపారి రకరకాల రేవుల్లో సుంకాలు చెల్లించుకొంటూ జీవితాంతం అవిశ్రాంతంగా బేరము చేస్తూనేవుంటాడట. గుణత్రయములనే, తెడ్లు చేతబట్టి ఇన్నాళ్ళదాకా ఈ నావను నడిపించావు. చంచలమైన ఈదురుగాలిలో కోరికలనే తెరచాపలెత్తి మాయతో

కూడిన సరుకులను ఏదో ఒక వెలకు క్రయ విక్రయాలు చేస్తుంటావు. ఈ శరీరంలోగల పంచేంద్రియములనే పట్టణస్వాములను, ఆ శ్రీవేంకటేశ్వరుడే కాపాడి ఈ జీవుణ్ణి ఒడ్డుకు చేరుస్తున్నాడంటున్నారు.

తాత్పర్య వివరణ:

పంచేంద్రియములు (శ్రోత్రము, త్వక్కు, చక్షువు, జిహ్వా, ఘ్రాణము అనబడు ఐదు ఇంద్రియాల, పట్టణ ప్రభువుల్లారా! ఏదో విధంగా తెంచుకొని బేరమాడుకొని ముందు బరువునైతే దించుకోండయ్యా!

బిగుతుగావున్న దేహముతో ఓడవ్యాపారము చేసే బేహారీ (వ్యాపారీ) ఈ సంసారసాగరంలో తిరుగులాడుతూ, ఈ జగత్తులో పాపపుణ్యాలనే సరుకులను క్రయవిక్రయాలు చేస్తూ అనేక బూతురేవుల్లో దిగినావు. ఎక్కడికక్కడ సుంకం కట్టుకొంటూ అవిశ్రాంతంగా బేరసారాలు చేస్తూనేవున్నావు.

ఓ బేహారీ! నీ నావ నడుపుకొనటానికి నీవు ఉపయోగించే తెడ్లు చేతబట్టి ఇన్నాళ్ళూ సముద్రమధ్యంలో నడిపావు. ఎంతో చంచలమైన గాలిలో కోరికలనే తెరచాపలెత్తి ఈ నౌకాయానం చేశావు. ఇంతా చేసి నీవు బేరసారాలు చేసే సరుకులు వెడమాయపు సరుకులు. (ఇవన్నీ మాయతో కూడిన అవాస్తవపు సరుకులు). ఏదో ఒక వెలకిచ్చి ప్రయాణం కొనసాగించు.

ఏదన్నా రేవులో ఈ నావను నిలుపవలెనంటే దీన్ని (ఈ ఆత్మను) అంతరాత్ముడు యెక్కివుండి నీతితో మానవులను కాపాడుతూ నిలుచునియున్నాడు. ఆ కాపాడే వాడు యెవరనుకొన్నారు. సాక్షాత్తూ ఆ శ్రీవేంకటేశ్వరుడే. మాకూ మీకు కూడా కర్త అతడే. ఓ దేవదేవా! ఘాతమాని (దెబ్బతీయటం మానివేసి) ఇకనైనా మాకు సుగుణములనీయవయ్యా!

పద్యవివరణ:

కం॥ **పంచేంద్రియమ్ములనబడు**
మించిన పట్టణపుదొరలు మీరిది వినుడీ
తెంచుచు బేరంబాడుచు
దించరొ మీబరువునిచట దీరిచి సుంకం.

సంఖ్య: XXVIII/1 రాగం : జయంతిశ్రీ
కీర్తన : పట్టరానిది వయసు పడతి నేమనవచ్చు

జయంతిశ్రీ

52 పట్టరానిది వయసు పడఁతి నేమనవచ్చు
చుట్టమగుపతిఁ దెచ్చి చూపరే సతికి ॥పల్లవి॥

దుమ్ములెగయఁగ వలపు దూరుపెత్తీఁ జెలియ
నుమ్మగిలుచున్న నిట్టూరుపులను
చిమ్మిరేఁగుచునున్న సిగ్గులు నానఁగఁబెట్టి
చెమ్మఁ జెమటల నేమి సేతమే ఇఁకను ॥పట్ట॥

వుడివోనితమకముల నుమురఁబెట్టీఁ జెలియ
పొడవు దమకముల తలపోఁతలోన
యెడనెడల జిరునవ్వు లెండఁబోసీ నదివొ
కడలేని విరహఁపుఁగాఁకలనుఁ జెలఁగి ॥పట్ట॥

గుదిగొన్న కోరికలఁ గూడఁపెట్టీఁ జెలియ
తుద నెదురుచూపుల కన్నుదోయి యందు
అదనెరిఁగి శ్రీవేంకటాధిపుఁడు గూడఁగా
సదమదపుకాఁగిటను సమరతులఁ బెనఁగె ॥పట్ట॥

ఉపోద్ఘాతము:

ఈ జవ్వని వయస్సు పట్టరానిది. దీనికి ఆమెను తప్పుబట్టి ప్రయోజనం లేదు అంటున్నారు అన్నమయ్య. శ్రీనివాసునికి ఆమెకు గల చుట్టరికము నెరింగించి ఆ సతికి అప్పుడు తన పతిని దెచ్చి చూపించండమ్మా! అంటున్నారు. తానూ ఒక చెలికత్తె పాత్రను పోషిస్తున్న అన్నమయ్య. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే ఆనాటి వ్యవసాయదారులు వాడే విశేషణాలను ఈ కీర్తనలో విరివిగా

వాడారు. దుమ్ములెగయుట, దూరుపెత్తుట, ఉమ్మగిల్లుట, చిమ్మిరేగుట, నుమురబెట్టుట, యెడనెడ చిరునవ్వులెండబోయుట, కోరికలను కూడబెట్టుట వంటి వ్యవసాయ సంబంధమైన పదజాలము ఈ కీర్తన ప్రత్యేకత. వ్యవసాయాన్ని శృంగారంతో మేళవించటం అన్నమయ్యకే చెల్లింది.

తాత్పర్య వివరణ:

ఈ పడతి వయస్సు పట్టశక్యముకానట్లు పరుగులు తీయుచున్నది. ఇక ఆమె నేమనవచ్చును? చుట్టరికము కలిసిన పతిని తీసికొని వచ్చి ఈ సతికి జూపరే!

ఈ చెలియ వలపును దుమ్ములెగసేటట్లు దూరుపెత్తిపోయుచున్నది. ఉమ్మగిల్లిన (ఆవిరిచేత ఉడకబెట్టబడిన నిట్టూర్పులను చిమ్మిరేగుచున్న సిగ్గులతో నానబెట్టి చెమ్మగిల్లిన చెమటలను ఇకపై మనమేమి చేయగలమమ్మా? అంతా యౌవన మహాత్యమేనేమొ?

ఉడివోని తమకముల (ఏమాత్రమూ తొలగని) తన తమకములను (తన్మయత్వములను) ఉమురబెట్టి (ఆవిరిలో ఉడకబెట్టి) ఆ చెలియ, పొడవైన (దీర్ఘమైన తమకములతో నిండిన తలపోతలలో యెడనెడ (విడివిడిగా) తన చిరునవ్వులను యెండబోసినది. అందుచేత అదిగో ఆ చెలియ విరహవేదనలో కాకలు చెందుచున్నది.

ఆ చెలియ, గుదిగొన్న (కూడబెట్టిన) కోర్కెలను ఒకచోట చేర్చి చివరకు బెదురు చూపులు చూస్తూ కన్నుదోయియందు కలతనిద్దురలలో బాధపడుచున్నది. అదనెరిగిన తిరువేంకటేశ్వరుడు ఆ తరుణిని కూడినతోడనే ఆమె, సదమదపు (నలిగిపోయిన విధముగా) స్వామి కౌగిలిలో సమరతుల ఓలలాడినది.

పద్యవివరణ:

ఆ.వె॥ **పట్టరానివయసు పడతినేమనవచ్చు**
చుట్టమైన పతిని జూపిసతికి
పొందుసేయరమ్మ! పొరి వేంకటేశుతో
సమరతులబెనగెను స్వామి తోడ.

సంఖ్య: శేషాచార్యులవారి వ్రాతప్రతి సంకీర్తన 10
రాగం : లవంగి కీర్తన : పరమయోగిని శివార్పణ బుద్ధి గాదిది

లవంగి

53 పరమయోగిని శివార్పణ బుద్ధి గాదిది
తరుణి తాపము వింత తపమాయగాని ॥పల్లవి॥

విరహతాపముచేత పొరలి పొరలిన వీడి
సరసంపు నెరివేణి జడగట్టెగాని
అరుదైన చింతతో నలయుచును దినదినము
సరసిజాననమేను సగమాయ గాని ॥పరమ॥

కలకంఠిగళనీల గరళమ్ము గాదిది
నలువైన నీలమణి నాయకము గాని
తెలుపైన నిజభూతి దేహంబు గాదిది
దళమైన కపురగంధపు పూత గాని ॥పరమ॥

తరుణ కోమల సుధాకరురేఖ గాదిది
తిరువేంకటేశుఁడద్దిన నఖము గాని
పరగంగ వైరాగ్యభావంబు గాదిది
వరవధూమణికి పరవశమాయగాని ॥పరమ॥

ఉపోద్ఘాతము:

విరాగినిలా కనపడుతున్న ఈ తరుణి వైరాగ్యభావనలతో పరమయోగినిలా గోచరిస్తున్నా నిజానికిది శివార్పణ కోసం కలిగిన విరక్తి బుద్ధి కాదు. ఈమె యొక్క విరహతాపమే వింత తపముగా అయింది. కాకపోతే ఈమెకీ వైరాగ్యం యెంతసేపు అంటున్నారు అన్నమయ్య. శేషాచార్యులవారి వ్రాతప్రతిద్వారా లభ్యమైన ఈ చక్కటి శృంగార కీర్తన అంతర్లీనంగా అన్నమయ్యలో నాటుకొనియున్న హరిహరుల మధ్య అభేద భావన ప్రతిబింబిస్తున్నది. విరహతప్త అయిన నాయిక కురుల సంరక్షణ గాలికి వదలివేసినందువలన, స్వామిని వలె, శివుని కురులమాదిరి జడలు కట్టినది. తన గళసీమలో కేవలం

ఒకే ఒక్క నీలమణి ధరించినందువలన మెడనీలకాంతితో మెరస్తూ నీలకంఠుని తలపిస్తున్నది. శరీరంపై కర్పూరగంధాన్ని మెత్తినందువలన శరీరం శివుని వంటిరంగు ధవళచ్ఛాయతో మెరయుచున్నది. ఆమె దేహంపై శివుని అర్ధచంద్ర రేఖలేమిటా? అవి వేంకటరమణుని నఖక్షతములు అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఇది, పరమయోగినివలె కనబడుతున్న ఈ తరుణీమణి, యొక్క నిజమైన శివార్పణ వైరాగ్యబుద్ధి యేమాత్రమూ కాదు. ఆమె విరహతాపమే వింత తపముగా అయినట్లున్నది.

విరహతాపముచేత ఈ పొలతి అటూయిటూ పొరలినందువలన వీడిన కురులు, సరసమైన ఆమె వేణి జడలు కట్టినది కాని, అవి జటాజూటములుగావు. అరుదుగా కలిగిన చింతవలన దినదినము ఆమె కృశించి అలసిపోయినది గావున ఆ పద్మవదన చిక్కి సగమైనట్లు కనిపిస్తున్నది గాని ఆమెకే విరక్తీ లేదు.

కోకిల స్వనముగల ఈ కలకంఠి గళసీమలోనున్న నీలమణి వలన నలుపైన వర్ణములో ఆమె గళము నీలకాంతితో మెరయుచున్నది గాని గరళము సేవించిన పరమశివుని వలె నీలకంఠయైనందువలన గాదు. తెలుపైన నిజవిభూతి అలదిన దేహము యేమాత్రము కాదు యీమెది ఆ కనబడుచున్న దవళరేఖలు శివుని విభూతిరేఖలు కావు. కర్పూర గంధము మెత్తిన కోమలి దేహము తెల్లగా మెరయుచున్నది అంతియే.

తరుణ వయస్కురాలైన ఈ కోమలి, శివునివలె చంద్రరేఖలను దేహముపై ధరించలేదు. తిరుమల నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు శృంగార గరిమలో గావించిన అర్ధచంద్రాకృతిగల నఖక్షతములవి. సుదీర్ఘ సురతమున పరవశించిన సుందరి వైరాగ్య భావనలతో వున్నదనే భ్రమ కలిగించినా, ఆ వరవధూమణి పరవశమే గాని అది వైరాగ్యము కాదు.

పద్యవివరణ:

కం॥ **తరుణీ, తాపంబిప్పుడు**
విరహంబై మారిపోయె వింత తపముగా
హరుగొల్చు పరమయోగిని
పరవశయై హరినిగూడె, పడతులు స్థిరమే!!

సంఖ్య: III/352 రాగం : రేవగుప్తి
కీర్తన : పెరగగ బెఱుగగ బెద్దలమైతిమి నేము

రేవగుప్తి

54 పెఱుగఁగఁ బెఱుగఁగఁ బెద్దల మైతిమి నేము
కఱుకఱులేకాని కడగంటలేదు ॥పల్లవి॥

సరి నిన్న భుజిఇంచి చాలునన్న యన్నమే
అరిది నేఁడప్పటిని నాస రేఁచీని
ధరలో రాతిరి గూడి తనిసిన సతులే
పరగ నప్పటిని విభ్రాంతి రేఁచీని ॥పెఱు॥

మాయఁ గట్టివిడిచిన మలినపుఁగోకలు
యీయెడ నుదికితేనే యిచ్చరేఁచీని
కాయముపై మోఁచి పెట్టెఁగట్టివేసిన సొమ్ములు
మాయలై దినదినము మమతరేఁచీని ॥పెఱు॥

నీవు వట్టిన చలమో నేము సేసినట్టి తప్పో
శ్రీవేంకటేశ్వరుఁడ చిక్కితి మిందు
మోవరాని మోపయి ములుగనియ్యదు మమ్ము
చేవసంసారముపైఁ జిమ్మిరేఁచీని ॥పెఱు॥

ఉపోద్ఘాతము:

సంసారం సాగరం దుఃఖం అన్నారు పెద్దలు. ఈ సంసార సాగరాన్ని దాటవలెనంటే తేలిక వ్యవహారం కాదు. పెరిగి పెరిగి మనం పెద్దవాళ్ళమై వృద్ధులమైపోతాం గాని దీంట్లో మార్పేమీ వుండదు. చివరికి గతం చూసికొంటే మనిషికి మిగిలేవి కఱుకఱులే అంటే ప్రయాసమాత్రమే అంటున్నారు అన్నమయ్య.

చేసిన సంసారమే చేస్తున్నా, నిన్న తిన్న తిండే నేడూ తింటున్నా, నిన్న పెట్టుకొన్న సొమ్ములే నేడూ పెట్టుకొన్నా, నిన్న కట్టుకొన్న వస్త్రములే మళ్ళీ ఉతికి

నేడూ కట్టుకొన్నా నాకు తృప్తి కలుగుటలేదు. ఇందులో మా తప్పు యెంతవున్నదో నాకు తెలియదు. లేక బడుగు జీవులమైన మాపై నీవు పట్టిన పంతమా? అనేదీ నేనెరుగను. కానీ ఓ శ్రీవేంకటేశ్వరా ఈ రొంపిలో చిక్కుకుపోయాను. మోయరాని ఈ సంసారభారం మోస్తున్నాను. ఇంక నావలన కాదయ్యా! అంటున్నారు.

తాత్పర్య వివరణ:

నేము (మేము) పెరగగ బెరగగ (పెరిగి పెరిగి) పెద్దవాళ్ళమై పోయాము. కానీ మాకు మిగిలిందేమిటి? కఱుకఱులే కాని (తీరని ప్రయాసలు మిగిలాయి కానీ) కడగంట లేదు. (జీవితంలో తృప్తి అన్నది కలుగలేదు.)

అదేమి విచిత్రమోకాని, నిన్న భుజించి ఇక చాలు అనుకొన్న అన్నమే నేడు తింటే మరీ రుచిగా వున్నది. ఆకలిని పుట్టించినదేదియోకాని ఈనాడు ఇంకా తినాలనే ఆశ కలుగుతున్నది. ఈ లోకంలో నిన్న రాత్రి సుఖించిన పడతినే నేడు సుఖించినా ఇవ్వాళ మరీ నూతనంగా వున్నది విభ్రాంతిని కలిగిస్తున్నది. ఇదెట్టి మాయయో తెలియరాదు.

ఇదియెట్టి మాయాజామోకాని, నిన్న కట్టి విడచిన వస్త్రములనే నేడు ఉతికి శుభ్రపరచి తిరిగి ధరిస్తే నూతనంగా సుఖంగా వున్నది. నిన్న బాగా ఇష్టంగా అలంకరించుకొనిన నగలనే తిరిగి నేడు వేసికొని అలంకరించుకొంటే అదే తృప్తి కలుగుతున్నది. ఏదో మాయ చల్లినట్లు దినదినమూ ఆ నగలపై మమకారం పెరిగిపోతున్నదే కాని తరుగుటలేదు.

ఓ తిరువేంకటేశ్వరా! ఇది నీవు పట్టిన చలమో (పంతమో), లేక నేము (మేము) చేసిన తప్పో తెలియవచ్చుట లేదయ్యా! కానీ ఇందు (ఈ సంసార సాగరంలో) చిక్కితిమి (చిక్కుబడిపోయాము). మోయరాని పెద్ద త్రాడువలె మమ్మల్ని కట్టేసుకొన్నది. మమ్మల్ని మునగనివ్వదు తేలనివ్వదు. ఈ సంసారముపై చేవతో జిమ్మిరేచీనీ (దీనిపై మిక్కిలి భ్రాంతితో విజృంభించి కొత్తకొత్త ఆశలను రేపుచున్నది.)

పద్యవివరణ:

ఆ.వె॥ **పెరిగి పెరిగి మేము పెద్దలమైతిమి**
కఱుకఱులు మిగిలెను కలిగె శ్రమలు
చట్టుబండలైన సంసారమందున
చిక్కివేంకటేశ! జిమ్మిరేగె

సంఖ్య: IV/92 రాగం : నాగమల్లి
కీర్తన : మరుగుచుజేసీమానదుద్యోగము

నాగమల్లి

55 మరుగుచుఁ జేసీ మానదుద్యోగము
నరహరి నీకృపే నాగతి గలది ॥పల్లవి॥

అనుపమమైన భయంబున నరకము
వినియెదఁగాని వెరచి విడువను
మనియెడి జీవుల మరణభవంబులు
కనియెదఁగాని కలంగదు మనసు ॥మరు॥

రాసుల మలమూత్రపు సోదన లిటు
సేసీఁగాని చీ యనదు తనువు
ఆసలనర్థపుటార్జనయలపుల
వేసరుదుఁగాని విరతి నిలుపను ॥మరు॥

నిరతముఁ దలఁపఁగ నిదురయుఁ తెలివియు
తొరలీఁగాని తొరలనీదు గుణము
యిరవగు శ్రీవేంకటేశ్వర నీవే
పరమాత్మవు ననుఁ బాలించఁగదే ॥మరు॥

ఉపోద్ఘాతము:

జీవునికి ఆత్మలో సత్యాసత్య వివేచన కలిగినా ఆశాపాశ బద్ధుడై లౌకికవిషయములమీద మరులుగొంటుంటాడు. మరుగుచు మమకారమును ఆస్వాదిస్తూ ఏవేవో ప్రయత్నాలు చేస్తూ అనేక లంపటాలలో చిక్కుకొని పోతాడు. రోజు రోజుకీ మృత్యువుకి దగ్గరవుతున్నానని తెలిసినా, నరకము అనేది ఒకటి వుందని నమ్మినా, మలమూత్రాదులచే కలుషితమైన ఈ దేహాన్ని విపరీతంగా ప్రేమిస్తుంటాడు. ఎన్నడూ ఛీ ఇంక చాలు అనుకోడు. ఎంత

ధనం సంపాదించినా దానిపై వ్యామోహంపోదు. మరి ఈ బ్రతుకింతేనా? దీంట్లోంచి బయటపడే దారే లేదా? ఉన్నది. నరహరికృప వేడుకోవాలి. నీవే దిక్కు, నీవే నాగతి అని వేడుకోవాలి. శరణు తండ్రీ! అని విరక్తితో ఆ శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయిస్తే అప్పుడు ఈ జనన మరణాలనుంచి ముక్తి లభిస్తుంది. అందాకా.. అంతే అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ నరహరీ! మరుగుచు జేసి (అన్నీ ఆస్వాదించాలనే, అత్యాశకులోనై) అనేక ప్రయత్నాలను కొనసాగిస్తూ ఈ జీవుడు రోజులు గడుపుతుంటాడు. ఒకనాటికి నీకృప కలిగి నీవే గతి అనే సత్యం తెలిసి అప్పుడు నీవే రక్షించాలని ఆశ్రయిస్తాడు.

సాటిలేని భీతినొందుచు నరకము అంటే విని దానిని తలచుకొని వణికి పోతుంటాను. కాని వెరచి (భయపడి) పాపకర్మలను మానుటలేదు. అశేషమైన ఈ జీవుల మరణములను, భవములను (పుట్టుకులను) చూస్తూనే వుంటాను కానీ నా మనసు నాకేమవుతుందో అని మాత్రం కలత జెందదు.

ప్రతిదినమూ నా శరీరం విసర్జించే మలమూత్రాలను చూస్తేనే వుంటాను కానీ ఒక్కనాడైనీ ఛీ అని ఏవగించుకోను. మనం చాలా ఇష్టముతో భుజించిన ఆహారం మలమూత్రాలుగా మారిపోయిందా లేదా? సంపాదించిన ధనం నా జీవితాంతమూ సరిపోతుందో లేదోనని ధనము నార్జించీ ఆర్జించీ అలసిపోతానే కానీ విరక్తితో సంపాదించింది, ఇక చాలులే అని తృప్తి చెందను.

నిత్యమూ నిదురిస్తూనే వున్నాను. మళ్ళీ నిదురలేచి నా పనులు పూర్తిచేసికొని మళ్ళీ నిదురిస్తూనే వుంటాను. ఇట్లా యెన్నిసార్లు చేసినా నా దుర్గుణాలను మాత్రం నా బుద్ధి మానుకోదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు ఆశ్రయమిచ్చి కాపాడినావు. నీవే పరమాత్మవు. నన్ను పరిపాలించే స్వామివి నీవేనయ్యా!

పద్యవివరణ:

చం॥ **మరుగుచుజేయు యత్నములు మానదు జీవుని ఆశవీడునా?**
నరహరి నీకృపేగతిగ నాకిక దక్కెను, దేహమంతయున్
నరకమె, మూత్రముల్ మలమె నచ్చినదేమిటి రోతయే కదా!
తిరుమలరాయదా! భళిర! తీరదు మోహము యేమిచిత్రమో!

సంఖ్య: V/262 రాగం : మేచకళ్యాణి
కీర్తన : మరుని నగరిదండ మాయిల్లెఱగవా

మేచకళ్యాణి

56 మరుని నగరిదండ మాయిల్లెఱఁగవా
విరుల తావులు వెల్లవిరిసేటి చోటు ॥పల్లవి॥

మఱఁగు మూఁక చింతల మాయిల్లెఱఁగవా
గుఱుతైన బంగారుకొండల సంది
మఱపుఁ దెలివి యిక్క మాయిల్లెఱఁగవా
వెఱవక మదనుఁడు వేఁటాడేచోటు ॥మరుని॥

మదనుని వేదసంత మాయిల్లెఱఁగవా
చెదరియు జెదరని చిమ్మఁ జీఁకటి
మదిలోన నీవుండేటి మాయిల్లెఱఁగవా
కొదలేక మమతలు కొలువుండేచోటు ॥మరుని॥

మరులుమ్మెతల తోఁట మాయిల్లెఱఁగవా
తిరువేంకటగిరి దేవుఁడ నీవు
మరుముద్రల వాకిలి మాయిల్లెఱఁగవా
నిరతము నీసిరులు నించేటిచోటు ॥మరుని॥

ఉపోద్ఘాతము:

విశిష్టమైన ఈ శృంగార గీతికలో పరమాత్మను చేరుకోవాలని జీవాత్మ పడే తహతహను హృద్యమంగా చిత్రీకరిస్తున్నారు అన్నమయ్య. ఈ కీర్తన పాడుతున్న నాయిక మరెవ్వరో కాదు అన్నమయ్యే. తన భక్తినంతా కలబోసి తిరుమలేశ్వరుని తన దేహమనే ఇంటికి ఆహ్వానిస్తున్నారు. తన హృదయమనే ఆలయంలో నిత్యపూజలందుకోమని మరీమరీ అభ్యర్థిస్తున్నారు. మరుని నగరిదండ అంటే మన్మథుని వాకిలియట ఆమె ఇల్లు. అక్కడ పూబాలల

తావులన్నీ వెల్లివిరుస్తుంటాయట. అసంఖ్యాకమైన యోచనలకు వాళ్లిల్లే తావట. ప్రఖ్యాతిచెందిన బంగారుకొండల దగ్గర వుందట. వాళ్ళింట్లో యెప్పుడూ మదనుడు వేటాడుతుంటాడట. ఒకటికి రెండుసార్లు చదవాలి మరి.

తాత్పర్య వివరణ:

ఓ శృంగారరాయడా! మరుని నగరిదండ (మన్మథుని వాకిలి అయిన) మా ఇల్లు యెఱగవా (యెక్కడుందో తెలియదా?) ఆ చోట విరులతావులు (పుష్పముల సుగంధములు) వెల్లివిరిసే (విజృంభిస్తుంటాయి).

ఓ ప్రియా! మా ఇల్లు యెడతెగని ఆలోచనలకు నెలవు. ప్రఖ్యాతి చెందిన బంగారు కొండలనడుమ వున్నది. మఱపు, తెలివి, ఇక్క (జ్ఞానాజ్ఞానముల విశ్లేషణ) – ఈ మూడూ నెలకొన్న తావే మా ఇల్లు. అక్కడ ఇంకొక విశేషముంది. అక్కడ మన్మథుడు అవిశ్రాంతంగా వేటాడుతూనే వుంటాడు.

మన్మథుని వేదసంత (వేదపారాయణం) మా ఇంట నిత్యమూ జరుగుతుంది. అంటే యెన్నో మన్మథ పాఠాలు నేర్చుకొంటుంటారు. అదీ యెట్టి చోట నేర్చుకొంటారంటే అక్కడ చీకటి పడంగానే చెదరీ చెదరని చిమ్మ జీకట్లు అలుముకొంటాయి. మా ఇంటికి రాంగానే మా మదిలో నీవు తిష్ఠవేసికొని వుంటావు. కొదవలేని మమతలకు పుట్టినిల్లు మా ఇల్లు. దానినెఱగవా? యేమి విడ్డూరం?

మా ఇల్లు కోరికలనే ఉమ్మెత్తపూలు విరివిగా విరబూచే తోట. ఓ తిరువేంకటేశ్వరా! ఇన్ని మాటలెందుకు? నీవు వుండే ఆనందనిలయమే నా ఇల్లు. అది ఇంకా యెటువంటిదో తెలుసా? మన్మథుని ముద్రలు సాధన చేస్తుంటారు, అక్కడ నిరతము (నిరంతరమూ). ఆ ప్రదేశమున నీ సిరులు (వైభవమ్ములన్నీ) బాగుగా నిండి పొరలుతుంటాయి.

పద్యవివరణ:

కం॥ **తరుణీ మాయిల్లెఱగవ**
మరుని నగరిదండ కదటె మన్మథ మొలకా
విరులన్ తావులు సకలము
విరిసే చోటమ్మ! రావె విభుని గవయగన్–

సంఖ్య: VIII/170 రాగం : మలయమారుతము
కీర్తన : మర్మము నీవె యెఱిఁగి మన్నింతువుగాక నన్ను

మలయమారుతము

57 మర్మము నీవె యెఱిఁగి మన్నింతువుగాక నన్ను
ధర్మమా నీకు నాకుఁ దారుకాణలయ్యా ॥పల్లవి॥

పల్లదపు నా మాటకు భావించే అర్థము నీవు
చల్లని నా మనసుకు సాక్షివి నీవు
తెల్లముగా నా మోములో తేటలకళలు నీవు
చెల్లఁబో యింకా విచ్చి చెప్పనేఁటికయ్యా ॥మర్మ॥

చెప్పరాని నాచేఁతకు సెలవినవ్వులు నీవు
నొప్పు నావయసునించే వొడివి నీవు
ముప్పిరి నా చక్కఁదనమున కద్దమవు నీవు
చిప్పిల నింకా విచ్చి చెప్పనేఁటికయ్యా ॥మర్మ॥

గట్టి నా చన్నులమీఁది ఘనహారమవు నీవు
పట్టిన నా వ్రతానకు ఫలము నీవు
యిట్టె శ్రీ వెంకటేశ యెనసితివింత నన్ను
చిట్టకాననిఁక విచ్చిచెప్పనేఁటికయ్యా ॥మర్మ॥

ఉపోద్ఘాతము:

ఈ కీర్తనలోని నాయిక తన నాయకునికి స్వాధీనపతిక. ఆమె పూర్తిగా తనని తాను అర్పించుకొని తన స్వామి గీచిన గీటు దాటని ముగ్ధ. ఆమె అంగాంగమూ స్వామి చేష్టలే వ్యక్తమవుతున్నాయి. ఆమె తన నాయకునికి ఇలా మనవి చేసికొంటున్నది. స్వామీ! అన్నీ యెరిగిన నీవు నన్ను మన్నింతువుగాక! నీకు నాకు తార్కాణములెందుకయ్యా? నా భావమూ

అర్థమూ నీవే. నా మనస్సాక్షివీ నీవే. నాముఖ కళలో వెలిగే కాంతివీ నీవే. నా పెదవుల అంచులలో విరిసే చిరునవ్వు నీవే. నా ఉరోజములపై నాట్యమాడే హారాలూ నీవే. నా వ్రతాలన్నిటి ఫలమూ నీవే. నీవు నన్ను కలియుట జన్మజన్మల పుణ్య ఫలం అంటున్నదీనాయిక.

తాత్పర్య వివరణ:

ఓ దేవదేవా! నీవే నా మర్మము నెరిగిన వాడవు. అందుచేత నీవే నన్ను మన్నింతువుగాక! నీకూ నాకూ తార్కాణములు (బుజువులు) యెందుకయ్యా?

నా మాటలలో అంతర్లీనంగావున్న భావనవు నీవే ప్రభూ! వాటి అర్థములుకూడా నీవే. చల్లని నా మనస్సాక్షివి కూడా నీవే ప్రభూ! నా ముఖపద్మములో తేటతెల్లముగా ప్రస్ఫుటమవుతున్న కళలన్నీ నీవే. చెల్లబో! (తెలిసెనులే) ఇంకా విప్పి చెప్పవలసిన వివరమేమున్నదయ్యా శ్రీవేంకటేశ్వరా!

దేవా! నా చేతలు చెప్పరానివి. వాటిని జూచి నీవు సెలవి నవ్వులు (మనోహరమైన) నవ్వులు వెదజల్లుతావు. నీవు ఒప్పయిన నా వయసును ఒడిని నించే మగధీరుడవు. వెల్లివిరిసిన నా చక్కదనము చూచుకొనుటకు పట్టిన అద్దము నీవే. చిప్పిల్లునట్లుగా ఇంకా నీకు విపులీకరించవలసిన పనేమున్నది దేవా!

నా గట్టి చన్నులమీద ఆడుతున్న ఘనమైన హారములన్నీ నీవే. నేను పట్టిన అన్ని వ్రతాలకు తగిన ఫలము నీవే. ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఇట్టే స్వీకరించి నీదానిని చేసికొంటివి.

పద్యవివరణ:

ఆ.వె॥ **మర్మమంత యెఱిగి మన్నింతువటుటగాక**
తారుకాణములవి తరుణికేల
తెలియునన్ని నీకు తిరుమలనాయకా!
ఇంక విప్పిజెప్పయేమి గలదు?

సంఖ్య: XXVIII/32 రాగం : నాటకురంజి
కీర్తన : మఱవకువే చెలియ మదన రహస్యమిది

నాటకురంజి

58 మఱవకువే చెలియ మదనరహస్య మిది
యెఱుఁగుకొంటే మేలు ఇందులోనే వున్నది ॥పల్లవి॥

సేయరాని వినయము సేసితే దంపతులకు
పాయని చుట్టరికమై పైకొనును
యేయెడా మొగమోటము లెప్పుడు గలిగితేను
మోయరానిమోపులై మునుకొను మోహము ॥మఱ॥

యేపొద్దు మంచితనాన నెనసితే జాణలకు
దాఁపురాలై వేడుకలు తతిగొనును
కాఁపురపు సరవులే కడుఁగడు కరపితే
ఆఁపరాని తమకము లలవడివుండును ॥మఱ॥

తిరమైన రతులద్దితే నేరుపరులకు
సరససల్లాపములు చవులు మించు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
వరుసతో మెలఁగితే వలపు లీడేరును ॥మఱ॥

ఉపోద్ఘాతము:

ఎన్ని రాజ్యాలకధిపతి అయినా, ఎన్ని సిరిసంపదలున్నా, ఎంత విఖ్యాతి గడించినా దాంపత్య జీవితంలో ఆనందం కొరవడితే వాడి బ్రతుకే నిష్ఫలం అంటున్నారు అన్నమయ్య. చెలియా! మఱవకువే అని ప్రౌఢ వనితగా మారిన అన్నమయ్య ప్రియసమాగమం కోసం యెదురుతెన్నులు చూస్తున్న నాయికకు ప్రబోధిస్తున్నారు. అక్షరసత్యమైన ఈ బోధ నేటి నవీనకాలంలోకూడా విలువైన దాంపత్య రహస్యాలను అందిస్తున్నది తిరమైన రతులు అద్దితే నేర్పరులైన దంపతులకు ప్రతిరాత్రీ వసంతరాత్రి. ఆ సరస సల్లాపముల మాధుర్యం

అనుభవిస్తే జీవితంలో కలిగే తృప్తి జన్మజన్మలకీ ఆ మాధ్యమే కావాలంటుంది. అంతటి శ్రీవేంకటేశ్వరుడు నిన్ను గూడినాడు. ఈ రహస్యాలనాకళింపుచేసికొని ఆ స్వామితో సుఖించు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! ఇది మదనరహస్యము. దీనిని బాగుగా అర్థముచేసికొని పాటించు. ఎఱుగు కొంటే (తెలిసికొంటే) దీనిలో ఎంతో మేలుకలదమా!

ఓ చెలియా! ఎంతో వినయంగా వుండే పడతి భర్త ప్రేమను చూరగొంటుంది. ఈ వినయం ఒక్క స్త్రీలకే కాదు, పురుషులకూ ఆవశ్యకమే. వినయము గట్టి చుట్టరికమువలె గాఢమైన అనుబంధాన్ని పెంచుతుంది. దంపతులు ఒకరినొకరు గౌరవించుకొంటే మోహము అనే మాధుర్యం ఆ గౌరవాన్ని ప్రేమగా మారుస్తుంది. అది జీవితాంతం అంటిపెట్టుకొని వుంటుంది. మొగమాటంలేని దంపతులు అపార్థాలతో అలమటిస్తారు.

ఏపొద్దునైనా మంచితనానికి మారుపేరైనవారు జీవితంలో నిత్యమూ ఆనందపుటంచులు చూడగలరు. వేడుకలు వారికి దాపురాలౌతాయి (దాపరికము లేని) తతి (జీవనమాధుర్యాన్ని) అందిస్తుంది. చక్కటి కాపురాన్ని నడపగలిగే సతీపతులు ఆపరాని తమకములతో జీవనమాధుర్యాన్ని అనుభవిస్తారు.

నేర్పరులైన భార్యాభర్తలు తిరమైన (స్థిరమైన) రతులలో తేలియాడుతుంటారు. వారి జీవితంలో సరససల్లాపములకు ఏనాడూ లోటువుండదు. దాంపత్యం చవులూరుతూ వుంటుంది. ఇటువంటి మధురమైన ఊహలలో నీవు తేలియాడుతున్నప్పుడే శ్రీవేంకటేశ్వరుడు నిన్ను గూడినాడు. వరుసతో మెలగితే (సక్రమముగా మెలిగితే) స్వామిని కూడిన నీ కోరికలీడేరవా చెలియా? నీవు తప్పక సుఖిస్తావు.

పద్యవివరణ:

కం॥ **చెలియా! మదనరహస్యము**
తెలియుము మరువకుము నీవు దీనిని వినవే
విలువగు దాంపత్యంబున
తొలగని మేళ్ళెన్నో కలవు తొయ్యలి నిజమే.

సంఖ్య: IV/152 రాగం : షణ్ముఖప్రియ
కీర్తన : మఱి తను భోగములు మాయావిలాసములు

షణ్ముఖప్రియ

59 మఱి తను భోగములు మాయావిలాసములు
యెఱిఁగినట్ల నుండు మఱపించుఁ దలఁపు ॥పల్లవి॥

అనిశము నీ కొలువు అది యొకటే నిజము
నినుఁదలఁచుటొకటే నిజము
పనివడి నీ దాసుఁడై బ్రదుకుటొకటే నిజ-
మొనర నిన్ను నుతించేదొక్కటే నిజము ॥మఱి॥

పరగ నీమీదఁ జేయు భక్తియే నిలిచినది
నిరతపు వైరాగ్యమే నిలిచినది
శరణని నీకుమొక్కే జ్ఞానమే నిలిచినది
అరసి నిన్నుఁబూజించినదే నిలిచినది ॥మఱి॥

చదివి నిన్ను వెదకి సాధించుటే ఫలము
అదన నీకృపాపాత్రుఁడౌటే ఫలము
యెదుట నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
యెదలోన నీ ధ్యాన మిన్నిటికి ఫలము ॥మఱి॥

ఉపోద్ఘాతము:

శ్రీహరియొక్క మాయావిలాసము వలన దైహిక భోగములలో మునిగితేలిన్నాళ్ళూ మఱపు కలుగుతూనే వుంటుంది. నిజం మరుగుననే వుండిపోతుంది. తెలిసినట్లే అనిపించినా యేమీ తెలియనీయదీ మాయ. ఏదో ఒకనాటికి శ్రీవేంకటేశ్వరుని కృప కలిగి ఆయనపై భక్తిని పెంచుతుంది. అది గొప్ప ధ్యానసంపదను కలిగించి జన్మలచక్రబంధంలోనుంచి బయటపడవేసి ముక్తినిస్తుంది, అని జీవిత పరమార్థం బోధిస్తున్నారు అన్నమయ్య. ఏమిచేస్తే యేది ఫలితంగా వస్తుందో విపులీకరించబడినదీ కీర్తనలో ఉదాహరణకి భగవంతుని శరణాగతివలన ఫలితమేమిటి? అని ప్రశ్నిస్తే ఆ దేవదేవునికి

నిరంతరమూ మ్రొక్కాలనే జ్ఞానమునిస్తుంది, అంటున్నారు. పల్లవిని ఒకటికి రెండుసార్లు చదవాలి.

తాత్పర్య వివరణ:

మఱి, ఈ తనువు వెంపర్లాడే భోగములన్నీ శ్రీహరియొక్క మాయా విలాసములే (మాయ మానవులకు కలిగించే విలాసమే). దీని మహిమవలన, యెఱిగినట్లునుండు (అన్నీ తెలిసినట్లే వుంటుంది). కానీ విపరీతమైన మఱపుకలిగి ఒళ్ళుమరచిపోయేట్లు ఆలోచనే నశిస్తుంది.

దేవా! అనిశము (ఎల్లవేళలా) నీ కొలువు (ఆరాధన) ఒక్కటే నిజమైనది. నిన్ను తలచుట ఒక్కటే నిజమైనది. పనివడి (పూనుకొని) నీదాసుడై బ్రతుకుట ఒక్కటే నిజమైన బ్రతుకు. ఒనరగ (ఒప్పగునట్లు) నిన్ను నుతించుట (కీర్తించుట) ఒక్కటే నిజమైన ముక్తి మార్గము. తక్కినవన్నీ ఎంత మాత్రమూ విలువనివ్వవలసినవి కావు.

ప్రభూ! నీమీద జేయు భక్తి ఒక్కటే (నీపైభక్తే) నిరంతరమూ నిలిచివుండగలిగినది. నిరతపు (నిరంతరమూ వుండే) వైరాగ్యమొక్కటే నిలిచివుండగలిగినది. శరణాగతితో నీకుమ్రొక్కి నీ భృత్యుడై వుండగోరుటే నిజమైన జ్ఞానము. నీ మహిమను కనుగొని సదా నిన్ను పూజించుటే నిలిచివుండే పుణ్యము.

చదువుల పరమార్థం జీవనోపాధికాదు. అది తనువు పోషణకు ఒక మార్గము మాత్రమే. చదువుల నిజమైన పరమార్థము నిన్ను (భగవంతుని) వెదకి సాధించుటయే. అదియే ఆ చదువుల సత్ఫలము. దానివలన కలిగే సత్ఫలితమే నీ కృపను పొందుట. నా యెట్టయెదుట నిలిచిన శ్రీవేంకటేశ్వరా! నీవు దేవి అలమేల్మంగపతివి. ఈ సాధనలన్నిటిఫలితమే, నిన్ను ధ్యానించవలెననే ధ్యాసను మనస్సులో నిలుపుతుంది.

పద్యవివరణ:

ఉ॥ **భోగములన్నియున్ తనువు పొందెడిమాయ విలాసమే భళీ!**
రాగము పెంచునామఱపు రాదు స్పృహన్నది జీవితాంతమున్
వీగు నిజంబులన్నియును వేంకటనాథుని సత్కృపే ధరన్
తూగని ధ్యానసంపదను తోయజనాభుని భక్తి నిల్పుబో!!

సంఖ్య: XXVI/47 రాగం : సుందర రంజని
కీర్తన : మానలేనే పొందు మానలేనే నిన్ను మానలేనే

సుందర రంజని

60 మానలేనే పొందు మానలేనే నిన్ను మానలేనే
ఆనెను మోహము నేఁ డంటవే నాదేహము ॥పల్లవి॥

చక్కఁదనములతేట చల్లని వెన్నెలవూట
వొక్కమాటాడవే నీ వొద్దిక మాట
చక్కెరవింటిలో తూపు జవ్వనములో నీరూపు
గక్కనఁ జూడవే కడకంటిచూపు ॥మాన॥

యింపుఁజిగురుఁజప్పర మిన్నిటిలో బిత్తరము
సొంపుగఁ జాఁచవే నీ సోగకరము
సంపదల ముజ్జగము చందురుని సోయగము
జంపులేల యెత్తవే నీ సవరనిమొగము ॥మాన॥

మదనుని తేరుజోక మంచిమెఱుఁగులరేక
యెదురు చూడఁగ వచ్చే విట్టి నీరాక
ఇదె శ్రీవేంకటగిరి నిరవై వావిలిపాటఁ
బొదలిన రాఘవుఁడఁ బొందితి నదె ॥మాన॥

ఉపోద్ఘాతము:

వావిలిపాటి రఘురాముడు తన శృంగారనాయిక సీతను తలచుకొంటూ పాడిన విరహగీతిక ఇది. రాముని విరహబాధ సీతతో ఎలా చెప్పాడంటే ఆమెను కలలో చూశాడని చెప్పుకోవచ్చును. విరహబాధ పంచుకొంటే తరుగుతుంది కాని ఎవ్వరితోటీ పంచుకోలేరు. అన్నమయ్య చెప్పిన కొన్ని రాముని విరహవేదనలు లక్ష్మణునికి చెప్పుకొంటే అతను అన్నను ఓదార్చినట్లు వున్నాయి. ఈ కీర్తనలోని చాలా తెలుగు పదాలకు అర్థం వివరించకపోతే అవగతంకాదు. వావిలిపాటి వీరరాఘవుడే వేంకటగిరిపై శ్రీవేంకటేశ్వరుడు అంటారు అన్నమయ్య. సీతా! నీవు

మదనుని తేరుజోక, మంచి మెరగులరేక, యెదురుచూడగవచ్చేవిట్టి నీరాక అంటున్నాడు. రాఘవుడు. అంతతేలికగా అర్థమయ్యే వ్యవహారం కాదు, మరి

తాత్పర్య వివరణ:

వైదేహీ! మానలేనే పొందు (నీపొందును విడువలేను). నిన్ను మానలేనే (నీకు దూరంకాలేను). ఆనెను మోహము (మోహము కురియుచున్నది). మానలేను నేడు అంటవే నా దేహము (నేడు నీ తలపులు మానలేను నా దేహము నాలింగనము చేసికొనవే.)

జానకీ! నీవు చక్కదనముల తేటవు. చల్లని వెన్నెలయొక్క వూటవు. నీవు బహు ఒద్దిక (వినయము)తో మాట్లాడెదవు. మరొక్కసారి నాతో మాట్లాడవా? నీవు చక్కెరవింటిలో తూపువు (చెఱకు విలుకాడైన మన్మథుని విల్లు విడిచిన బాణానివి). జవ్వనము నీరూపులో విరిసింది. ఓ తరుణీ! నీ కడకంటి చూపును నాపై వెంటనే ప్రసరించనీయవే.

ఓ రమణీ! నీవు ఇంపైన లేత చిగుళ్ళతో వేసిన చప్పరము (పందిరివి). ఇన్నిటిలోనూ నీ బిత్తరము (శృంగారము మరువనసాధ్యమైనది). నీ సొగసైన కరముతో (చేతితో) నన్ను సొంపుగా ఒకపరి తాకవే. ముల్లోకములకు చల్లని వెలుగునిచ్చు చంద్రుని సోయగము (సౌందర్యము) నీ వదనములోనే నాకు కనుపించుచున్నది. జంపులేల (మనమధ్య వ్యర్థమైన మాటలు దేనికి)? సవరని (దిద్దుబాటచేయని) నీ మొగమును యెత్తి నన్నొక పర్యాయము చూడవే.

ఓ ప్రియా! నీ నడక మన్మథుని రథము వస్తున్నట్లు వున్నది. నీవు మంచిమాటలు చెప్పి నన్ను వంచింపజూస్తున్నావు. నేనేమో నీరాకకోసం క్షణమొక యుగములా గడుపుతున్న నీ రమణుడను. నేను ఇక్కడ శ్రీవేంకటగిరిపై నెలకొనినై వావిలిపాటిని వదలి వచ్చిన రాఘవుడనే. ఇదిగో నిన్ను పొందితిని ఆనందాన్ని అనుభవించితిని.

పద్యవివరణ:

కం॥ **ఓ వీరరాఘవేంద్రా!**
వావిలిపాటీ నివాస వైదేహివిభో!
ఆవిష్కరింతు నరుదుగ
నీవెన్నిన మధురగీతి నీకంకితమౌ.

సంఖ్య: XI/343 రాగం : మోహన
కీర్తన : ముద్దు గారీ జూడరమ్మ మోహనమురారి వీడె

మోహన

61 ముద్దు గారిఁ జూడరమ్మ మోహనమురారి వీఁడె
మద్దులు విరిచిన మా మాధవుఁడు ॥పల్లవి॥

చల్ల లమ్మనేరిచిన జాణ గొల్లెతల కెల్ల
వల్లెతాడు మా చిన్న వాసుదేవుఁడు
మొల్లపు గోపికల మోవిపండులకు నెల్ల
కొల్లకాఁడు గదమ్మ మా గోల గోవిందుఁడు ॥ముద్దు॥

మందడిసానుల కమ్మని మోముఁదమ్ములకు
చెందినతుమ్మిదవో మా శ్రీకృష్ణుఁడు
చందమైన దొడ్డివారి సతుల వయసులకు
విందువంటివాఁడమ్మ మా విఠలుఁడు ॥ముద్దు॥

హత్తిన రేపల్లెలోని అంగనామణుల కెల్ల
పొత్తుల సూత్రము మా బుద్ధుల హరి
మత్తిలి వ్రేతల నిండుమనసుల కెల్లాను
చిత్తజునివంటివాఁడు శ్రీవెంకటేశుఁడు ॥ముద్దు॥

ఉపోద్ఘాతము:

ముద్దులొలికే యీ మోహనమురారిని చూడండమ్మా, ఇతడు మాధవుడు. శాపగ్రస్తులైన కుబేరుని పుత్రులను బ్రోచుటకై మద్దిచెట్లను రెంటిని ఒకేసారి కూల్చినాడు అని పల్లవితోనే బాలకృష్ణుని విశేషంగా కీర్తిస్తున్నారు అన్నమయ్య. దీని తాత్పర్య వివరణ కనుపించినంత సులభం కాదు. ఉదాహరణకి మందడిసానులు అంటే గొల్లభామలని అర్థం. పద్మములవంటివారి కమ్మని మోములపై యెప్పుడూ వాలి మకరందం

జుఱ్ఱుదామని ఆత్రపడే తుమ్మెద మా మాధవుడు, అంటున్నారు. శ్రీవేంకటేశ్వరుని వరప్రసాదికే ఇటువంటి సొంపుల కవిత్వం అబ్బుతుంది. మనబోంట్లు చదివి రసాస్వాదన చేయగలిగితే ధన్యులమే.

తాత్పర్య వివరణ:

ఓ అమ్మలారా! ముద్దులొలుకుతున్న యీ మోహనమూర్తి మురారిని చూడండమ్మా! ఈ మాధవుడు రేపల్లెలో మద్దులు (మద్దిచెట్లను) విరిచి (కుప్పకూల్చి) గంధర్వులకు శాపవిమోచన కలిగించినాడు.

జాణలైన గొల్లెతలు మధురానగరంలో చల్లలు అమ్మబోతుంటే వారందరికీ ఈ మాధవుడు వల్లెతాడువలె (పాశము మాదిరిగా) వెంటాడుతాడు. మొల్లపుగొల్లెతల (అధికముగా గొల్లభామల) అధరములనే తీయటి పండ్లను కొల్లగొట్టటంలో మా గోలచేసే గోవిందుడు సిద్ధహస్తుడు గదటమ్మా! వీడి చతురత వర్ణించలేనిదంటే నమ్మండి.

మందడి సానుల (గొల్లభామల) కమ్మని ముఖపద్ములపై వాలి యెప్పుడూ ఆ పద్ముల మకరందమును జుఱ్ఱుకోవాలని ఆత్రపడే గండుతుమ్మెద మా శ్రీకృష్ణుడు. చందమైన (అందాలొలికే) దొడ్డివారి సతుల (గొల్లవనితల) వయస్సులకు (యౌవనములకు) మా విట్ఠలుడు విందువంటివాడమ్మా!

హత్తిన (కౌగలించిన) రేపల్లె అందగత్తెలందరికీ ఒకే పొత్తులో మగడైన మంగళసూత్రము మా బుద్ధిమంతుడైన హరి. అంటే ఆ శ్రీహరి యెవ్వరినీ నిరాశపరచడు అని అర్థం. మత్తిల్లిన వ్రేతల (గొల్లభామల) నిండైన మనస్సులకు ఈ శ్రీవేంకటేశ్వరుడే చిత్తజునివలె (మన్మథుని మాదిరి) చూరగొని మురిపిస్తాడు.

పద్యవివరణ:

ఉ॥ **ముద్దులుగారె చూడరిదె మోహన కృష్ణుడు యీ మురారి తాన్**
ముద్దులగూల్చి శాపములు మాయగ దీర్చెను మాధవుండు, ము-
ప్పొద్దుల గూడి గొల్లెతల పొందులు కొల్లగ గొట్టె, నేడు యీ
సుద్దులు పాడుచుంటవినిసొంపుగనవ్వును వేంకటేశుడై.

సంఖ్య: XI/304 రాగం : అమృతవర్షిణి
కీర్తన : మొక్కరో మొక్కరో మీరు మోమున గళలు దేరె

అమృతవర్షిణి

62 మొక్కరో మొక్కరో మీరు మోమునఁ గళలు దేరె
యెక్కువ శ్రీవేంకటేశుఁ డింతులలో వాఁడె ॥పల్లవి॥

తేరుమీదఁ నెక్కీ హరి దేవుళ్లుఁ దానును వాఁడె
భోరునను దేవదుందుభులు వాఁగఁగా
తోరపుమోఁకులు వట్టి దొరలు బ్రహ్మాదు లెల్ల
ధీరతఁ దీశే రదే తిరువీథులందును ॥మొక్కరో॥

వేడుక రథముమీఁద వెలసీ శ్రీపతివొద్ద
ఆడేరు పాడేరు అచ్చర లెల్ల
వీడెపు సెలవులతో వెలఁదులతో హరి
యీడు లేక యేఁగి వచ్చీ నింటింటి వాకిటను ॥మొక్కరో॥

శ్రీవేంకటేశుఁడు వాఁడె చేరి యలమేలుమంగ
సావధానమున సరసము లాడఁగ
దేవాసనం బెక్కి తేఁకువ నారగింపులు
వావిరిఁ జేకొనీ వాఁడె వాడవాడలను. ॥మొక్కరో॥

ఉపోద్ఘాతము:

శ్రీవేంకటేశ్వరుని రథము తిరువీథులగుండా సాగిపోతున్నది. ఒళ్ళంతా కళ్ళు చేసికొని భక్తులు ఆ రథోత్సవము చూచి తన్మయత్వం చెందుతున్నారు. పులకించిన అన్నమయ్య ఈ కీర్తననందుకొన్నారు. తన ముఖములో కళలన్నీ తేరిన శ్రీనివాసుడు తన ఇద్దరు దేవేరులతో సరసములాడుకొంటూ, భక్తులిచ్చిన నైవేద్యాలను ఆరగిస్తూ సెలవుల నవ్వులు చిందిస్తూ ముందుకు సాగిపోతున్నారు. భాగ్యమంటే మీదే.

స్వామికి మొక్కరో. ఈయన మొగములో కళలు తాండవిస్తున్నాయి. దేవాసనమెక్కి వాడవాడలా భక్తులనాశీర్వదిస్తున్నాడు అంటున్నారు.

తాత్పర్య వివరణ:

అందరికంటే యెక్కువవాడైన శ్రీవేంకటేశ్వరుడు మోమున కళలన్నీ దేరగా (తన ముఖములో కళలన్నీ అతిశయించగా) నేడు తన ఇంతులతో (దేవేరులైన శ్రీదేవి భూదేవులతో) వూరేగుతున్నాడు. స్వామికి మొక్కరో మొక్కరో (మొక్కండయ్యా!)

శ్రీహరి తన దేవుళ్ళు (దేవేరులు) తనూ తేరుమీద నెక్కీ (రథముపైనెక్కారు). దేవదుందుభులు, భోరున (గొల్లుమని) వాగగా (శబ్దము చేస్తున్నాయి). తోరపు మోకులు (బలమైన త్రాళ్ళను) వట్టి (పట్టుకొని) దొరలు (పురశ్రేష్ఠులు), బ్రహ్మాది దేవతలు తిరువీథులలో ధీరత దీశేరు (ధైర్యంగా లాగుతున్నారు). అదిగో చూడండి.

వేడుకతో వెళుతున్న ఆ రథముమీద వెలసిన శ్రీపతి వద్ద, అప్సరసలందరూ అదిగో ఆడుతున్నారు (నృత్యం చేస్తున్నారు). పాడేరు (అద్భుతంగా గానము చేస్తున్నారు.) ఇక ఆ తిరు వేంకటేశ్వరుడు వీడెపు సెలవులతో (తాంబూలంవలన యెఱ్ఱబడిన పెదవులు మెరుస్తుంటే) తన వెలదులతో (దేవేరులతో కలిసి) ఇంటింటివాకిట (ప్రతి ఇంటి వాకిట్లో వచ్చి) యీడులేక యేగీ (ఎంతసేపు పట్టినా వేచి) అప్పుడు వెళుతున్నాడు.

వాడే (ఆయనే) శ్రీవేంకటేశ్వరుడు. తన దేవేరి అలమేలుమంగతో చేరి సావధానముగా (తీరికగా) సరసములాడుకొంటూ, దేవాసనంబెక్కి (సింహాసనమునధిష్టించి) యున్నాడు. తేకువ (అతిశయముతో) తనకు నివేదన చేసినవి ఆరగిస్తున్నాడు. వావిరి (పట్టుదలతో) వాడలవాడల (ప్రతివాడకూ వెళుతున్నాడు). అదిగో మీరు మొక్కి తరించండి.

పద్యవివరణ:

కం॥ **మోమున కళలేదేరెను**
భామలలో వేంకటేశు పరికించరె, ఆ
స్వామికి మొక్కరొనేడే
ధీమంతుడు రథమునెక్కె తిరువీథులలో.

సంఖ్య: XX/291 రాగం : కీరవాణి
కీర్తన : రమణుడ చెప్పుమా రమణి నీయెడను

కీరవాణి

63 రమణుఁడ చెప్పుమా రమణి నీయెడను
జమళి రెండొకటఁ జల్లీ వలపు ॥పల్లవి॥

మోతుగు వూచెనో మొల్ల వూచెనో
కాతరపుచెలి కన్నులను
చూతము వూచెనో సురవొన్న వూచెనో
ఘాతల నీసతికాయమున ॥రమణుఁడ॥

పగడము వండెనో పైమోవి పండెనో
అగపడి యీకాంతఅధరమున
పొగరునిమ్మలో పోకలు వండెనో
మగువ కిదివో నెమ్మదిఁ జన్నులను ॥రమణుఁడ॥

తమలపుఁజిగురో దాడిమచిగురో
అమరెఁ గరములనె అంగనకు
చెమటలఁ గూడితి శ్రీవేంకటేశ్వర
సమరతి మీ యిచ్చలు చిగిరించె ॥రమణుఁడ॥

ఉపోద్ఘాతము:

ఈ అద్భుతమైన శృంగారకీర్తనలో అన్నమయ్య ఇలా చిలిపిగా అడుగుతున్నారు. "ఓ రమణుడా! ఈ సంగతి చెప్పవయ్యా! నీ రమణీమణి ఒక్కదాంట్లోనే రెండూ వుండేలాగా నీపైజంటవలపులను యెలా చల్లగలిగిందయ్యా? చూడటానికి సిగ్గుల మొగ్గలా వున్నది కదా!" అతిశయించిన భక్తి చనువును పెంచి స్వామి ఆంతరంగిక రతిముచ్చట్లను అడిగే ప్రోత్సాహము కలిగింది కవికి. కీర్తన నిండా విరబూచిన పుష్పసుగంధాలే. ఇక మోవి తేనెలు జుర్రుటలు, దంతక్షతములదాడి,

చెమటలచిత్తడి, శృంగార భక్తికి యెల్లలుండవు. ఆనందపరవశత్వమే పరాకాష్ఠ. అమలిన శృంగారం అన్నమయ్య అత్యభిమానవిషయం. వయశ్యుడెంత చనువుతీసికొంటాడో అంతచనువూ తీసికొంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ రమణుడా! ఈ విషయం చెప్పవయ్యా! నీవింత ఉత్సాహంగా వున్నావు కదా! నీరమణి నీ మీద జమళి రెండొకటైనట్లు (రెట్టించినట్లు) వలపులను చల్లిందాయేమిటయ్యా? లేకపోతే నీలో అంత ఆనందాతిరేకమెందుకు?

నీ కాతురపుచెలి (నీ వ్యాకులత చెందిన తరుణి) కన్నులలో మోదుగపూలు పూచినవి. మొల్లలు పూచినవి (ఎదురు చూచిచూచీ కన్నులెఱ్ఱబడి కాయలు కాచినవి అని భావము). నీ సతి కాయమున (దేహమున) కందిపోయినందువలన మామిడి పూతపూచింది అన్నట్టున్నది. సురవొన్నలు (పొన్నలు) పూచినవి అన్నట్లున్నవి. ఆ విధముగా ఆమె శరీరము గాయపడినది.

తాంబూల సేవనవలన ఆపె అధరములెఱ్ఱబారినవి. ఆమె పగడములను వండలేదు కదా! లేక ఆ అధరముల అరుణిమ నీదంతక్షత విలాసము కాదుగదా! నీ మగువ చన్నులకిదివో, పొగరెత్తిన నిమ్మపండ్లు తలపుకు వచ్చుచున్నవి లేక అవి పెద్దపెద్ద పోకలు పండినవాయేమి?

ఓ శ్రీనివాసా! ఆమె సొగసైన చేతులను చూచినావా? అవి చిగురు తమలపాకులవలె లేతగానున్నవి. దాడిమచిగురు (దానిమ్మ మొగ్గలవలె సుతారముగానున్నవి). ఓ శ్రీవేంకటేశ్వరా! ఉత్సుకతతోనున్న నీకు చెమటలధికమై ఆమెను కూడితివి. మీ ఇచ్చలు (కోరికలు) సమరతులతో ఇబ్బడై చిగురించినవి. ఇంతకు మించి నేనేమి చెప్పగలను తండ్రీ!

పద్యవివరణ:

చం॥ **రమణుడ చెప్పుమా రమణి రంజిల జేసెను యెప్పుడే విధిన్**
జమళిగ రెండునూ కలిసి చక్కగనొక్కటి ఆయెజూడగా
తమలపులేచిగుళ్ళవలె దాడిమ పూవలె చేతులుండెబో
చెమటలగూడుమా రతుల శ్రీకరవేంకటశైలనాయకా!

సంఖ్య: V/283 రాగం : దేశ్
కీర్తన : రమ్మనవే వాని రమ్మనవే యీ–

దేశ్

64 రమ్మనవే వాని రమ్మనవే – యీ –
తమ్మికనుఁగొనల తళుకులవాని ॥పల్లవి॥

మెలుపున నేను మేడమీఁద యీ–
చిలుకఁబేరుకొని పిలువఁగను
అలపున వీథిఁ దానరుగుచును తనుఁ
బిలిచితినంటాఁ బలికినవాని ॥రమ్మనవే॥

కేరడమైన కిన్నెరలో యీ–
నారణి ముట్టుచు నలుగడను
చేరువల తాఁజెలఁగుచును యిటు
పేరుకొనుచు ననుఁ బిలిచినవాని ॥రమ్మనవే॥

పరవశమై నేఁ బానుపున యీ–
గిరికుచముల నొడ్డగిలఁగాను
తిరువేంకటఘనగిరిపతి ననుచును యీ–
సిరులుగ ననునిటు చెనకినవాని ॥రమ్మనవే॥

ఉపోద్ఘాతము:

నాయిక ఈ కీర్తనలో తన చెలికత్తెయైన అన్నమయ్యతో ఆ శ్రీవేంకటేశ్వరుని రమ్మనవే. ఈ తమ్మికన్నులవానిని తళుకుచెక్కులవానిని నావద్దకు రమ్మనవే అని అడుగుతున్నది. ఆవిడగారు తన మేడమీద నిలుచుని తన చిలుకతో మాట్లాడుతుంటే, మధ్యలో ఆ శ్రీనివాసుడుదూరి నన్ను పిలిచావా? యేమిపని నీకు నాతోవున్నది అని నా మీదనే నెపమున్నట్లు మాటలాడినాడే. నా కిన్నెరను నేను మీటుచూవుంటే తను వచ్చి తీగెను ముట్టుకొని ఏమీ తెలియనట్లు నలుదిక్కులా చూస్తాడు. ఈ చేరువలో యెక్కడో వుంటాడే. నాపేరు తనకు తెలియనట్లు నాపేరునే

పెద్దగా పిలుస్తూ నవ్వుతాడే. నేను పానుపుపై నా పాలిండ్లు వొత్తుకుపోయేట్లు పరుండగా నేను తిరువేంకటపతిని అని గాఢంగా రమిస్తాడు. ఇంకా యేమి చెప్పమంటావే... అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ చెలియా! వానిని రమ్మనవే. ఇక్కడకు రమ్మని పిలువవే. తమ్మికనుగొనలలో (తామరపూవుల వంటి తన కన్నుకొనలనుండి) తళుక్కుమని చూచే నా స్వామిని రమ్మనవే.

చెలియా! నేను నా మేడమీద విలాసముగా నిలుచుకొని నా చిలుకను పేరుపెట్ట పిలిస్తే అతగాడు మధ్యలో దూరి తాను వీధిలో తనదారిన పోతుంటే నేను కావాలని పిలిచినట్లు పలికి, యెందుకు పిలిచావు నీకు నాతో యేమిపని అన్నట్లు మాటాడినాడే.

ఓ చెలీ! కేరడమైన (నిర్లక్ష్యంగా) నేను కిన్నెరను మీటుతూవుంటే, ఇతగాడు వచ్చి నారణి (తీగెను) ముట్టుకొని ఏమీ తెలియనట్టుగా నలుదిక్కులూ చూస్తాడే. చేరువనే (ఈ చుట్టుపక్కలనే తానూ తిరుగుచూ, చెలగుచు (అతిశయముతో) నన్ను పేరుపెట్టి పిలిచీ చిలిపిగా నవ్వులు చిమ్ముతాడే.

ఓ చెలియా! అలసిన నేను పరవశముతో నా పానుపుపై ఒత్తిగిలిపడుకుంటే నా బరువుకి, నా గిరి కుచములు నలిగినవి. ఇంతలో హఠాత్తుగా ఇతగాడు యెక్కడనుండియో వూడిపడి ఓ రమణీ! నేనే వేంకటరమణుడను అని నను మాట్లాడనీయకుండా బిగికౌగలించి కూడినాడే. సిరులుగా (వైభవముగా) నన్నట్లు చెనకిన వానిని (తాకినసొగసరిని) నేనూ విడువలేనే.

పద్యవివరణ:

కం॥ **రమ్మనవే ఇక వానిని**
తమ్మికనుల సొంపుమీరు తళుకులవానిన్
కొమా! తిరువేంకటపతి
ఉమ్మడిరతులందు సొక్కి ఉమ్మగిలేనే.

సంఖ్య: XXV/311 రాగం : మాండ్
కీర్తన : విన్నవించవలె నీకు వేడుక దొలుదొలుతే

మాండ్

65 విన్నవించవలె నీకు వేడుకఁ దొలుదొలుతే
యెన్నికసేసెఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥పల్లవి॥

నీవు మాటలాడినట్టె నేనూ మాటలాడితేను
తావిబెల్లములోఁ బంచదార చల్లుట
వోవరిలో నే నిందుకు వుప్పనిచప్పనితిట్లు
యీవల నే నాడేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥

మొక్కిన నీ మొక్కులకు ముంచి నేనూ మొక్కితేను
మక్కళించి అల్లులుఁ దామర లల్లుట
చిక్కుదీరఁ గొనగోళ్ల చిమ్మిరేఁచి కొంత గొంత
ఇక్కువ లంటేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥

సిగ్గులమీఁద సిగ్గులు చేరి నేనూ నెరపితే
వొగ్గి ముత్యాలును వజ్రాలు నర్పించుట
అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
తగ్గక గర్వించేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥

ఉపోద్ఘాతము:

శృంగార కళలో ప్రావీణ్యురాలైన ఈ నాయిక కొద్దిపాటి గడుసరిదే. నాయకునితో మునుముందే నిక్కచ్చిగా చెబుతున్నది. స్వామీ! నీవు సంతోషంగా వున్నప్పుడే అన్ని విషయాలు నీకు మునుముందుగానే విన్నవించేస్తే ఆ తరువాత నన్ను తప్పుపట్టే అగత్యం రాదు. నన్ను యెన్నికజేసేముందే నేనేమిటో నీకు తెలిస్తే మంచిది అంటున్నది. అన్నమయ్య శృంగార కీర్తనలలో నాయిక కొండొకచో ముగ్ధ, కొండొకచో పంతగత్తె, కొండొకచో జాణ, కొండొకచో జగడాలమారిది. కానీ అందరికీ శ్రీవేంకటేశ్వరుడంటే అవ్యాజప్రేమ. స్వామి కౌగిలికి తహతహలాడుతుంటారు. కారణమేమంటే వారంతా ఆత్మస్వరూపులు.

పరమాత్ముడైన తిరుమలేశ్వరుడే వారి అంతర్యామి. ఆత్మ పరమాత్మతో యేనాటికైనా ఐక్యమవక తప్పదు. అదొక అపురూప సంగమము.

తాత్పర్య వివరణ:

ఓ తిరుమల నాయకా! నీకు వేడుకన్ (ఆనందముతో వున్నప్పుడు) తొలుదొలుతే (మునుముందుగానే) విన్నవించవలె (మనవి చేసికొనుట మంచిది). యెన్నికసేసెజుమ్మీ! (నన్ను యెన్నుకొనేవు సుమా!) తరువాత నన్ను యెగ్గుపట్టవలదు (నా తప్పులనెంచకూడదు, మరి).

నీవు యెట్లా మాట్లాడితే నేనూ అట్లాగే మాట్లాడతాను. నీవు సరసంగా మాట్లాడితే నేనూ సరసమే మాట్లాడతాను. అప్పుడెలావుంటుందో తెలుసా, తావి బెల్లములో (పరిమళభరితమైన బెల్లముపై) పంచదార చల్లినట్లు వుంటుంది. ఓవరిలో (ఏకాంతమందిరంలో) నేను ఉప్పని చప్పని తిట్లు తిట్టినా, నా మాటలను పట్టించుకోకూడదు. ఆ తరువాత నన్ను తప్పుపట్టవలదు.

నీవు నాకు మొక్కితే, నేను దురుసుగా వుంటాననుకోకు. నేనూ నీకు మొక్కుతాను. అప్పుడెట్లా వుంటుందో తెలుసా? అల్లులను (తమిళంలో అల్లులు అంటే కలువపూలు అని అర్థం) తామరపూలు అల్లుకొనిపోయినట్లుంటుంది. నేను అప్పుడప్పుడు నా కొనగోళ్ళతో నీ జుట్టు చిక్కు తీస్తూ కొంతగొంత చిమ్మిరేచినా (విజృంభించినా) ఆ తమకంలో నీ మర్మములనంటినా, నన్ను తప్పు పట్టరాదు. ముందే చెబుతున్నాను.

నీవు సిగ్గరివైతే నేనూ సిగ్గులమొగ్గనే. అప్పుడు మనకలయిక యెలావుంటుందో తెలుసా? ముత్యాలతో వజ్రాలను కలగలిపి వాటితో శ్రీవేంకటేశ్వరుని అర్చించినట్లుంటుంది. ఓ తిరుమలనాయకా! అగ్గమై (నీ ఆధీనురాలైన) నన్ను కూడితివి. మరి అప్పుడు నాకు గర్వమెక్కక యేమవుతుంది? అంతమాత్రానికే నా తప్పునెంచకూడదు. సరేనా?

పద్యవివరణ:

ఆ.వె॥ **విన్నవించవలెను వేడుకన్ తొలుదొల్తె**
యెగ్గు పట్టవలదు యెన్నుకొనిన–
పిదప నన్ను నీవు వేంకటనాయకా!
గర్వమెక్కుజుమ్మి! కాంతలకును.

సంఖ్య: XXVIII/27 రాగం : మిశ్రతిల్లింగ్
కీర్తన : విరహము వలవదు రసికులు వినరో చాటుచు జెప్పెద

మిశ్రతిల్లింగ్

66 విరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద
తరితీపనుచెఱకున నిత్తరిఁ బండువండె నిదె ॥పల్లవి॥

బగి వాయఁగరా దిఁక దంపతులకు నెక్కడ చూచిన
చిగురుకుఁ జేఁగలు వచ్చెను చిత్తజురాజ్యమున
తగిలి తగిలి కోవిలకూఁతలు మొగసాలలకెక్కెను
జగమున విరసపుఁబవనుఁడు చల్లనివాఁడాయ ॥విరహ॥

పొసఁగఁగ నెవ్వరికైనను పొందులె జరపఁగ వలసెను
పసిమొగ్గలు వాడెక్కెను వసంతకాలమున
ముసగస లాడెడు తుమ్మిద మోతల చలములు చెల్లెను
సుసరముననె పగరాజును చుట్టమువాఁడాయ ॥విరహ॥

కలయికలే కలకాలము కాణాచులుగాఁ బరగెను
ఇలలో శ్రీవేంకటపతియిచ్చిన సంపదను
యెలమిని పదారువేలకు ఇతఁడే మగఁడై నిలిచెను
కలగొని మనసనియెడి చెలికాఁడునుఁ దోడాయ ॥విరహ॥

ఉపోద్ఘాతము:

"రసికులు" అంటే శృంగార రసాస్వాదనలో దిట్టలైనవారని చెప్పుకోవచ్చును. వారికి ఊరట కలిగే నాలుగుమాటలు చెబుతున్నారు అన్నమయ్య. విరహము వలదు అని నేను చాటి చెబుతున్నాను. నా మాటలు నమ్మండి, చెఱకు విలుకాడైన మదనుని పంట ఇప్పుడు పండింది. దంపతులకు ఇక యెడబాటుండదు. ఇకపై ప్రేమికులమీద చల్లని మలయపవనాలు వీస్తాయి గాని వేడి విరహపు గాడ్పులు వీయవు. ఇకపై విరహాల పగవాడైన చంద్రుడు చల్లని చెలికాడవుతాడు ప్రేమికుల

కలయికలకు కాణాచియైన తిరువేంకటేశ్వరుడు వలపు సంపదలను వారికి యిస్తాడు. పదహారువేలమంది భామల ఉమ్మడి మగడైన ఆ స్వామిని మీ మనస్సనే చెలికానితో కూడి ఆశ్రయించండి, మరి.

తాత్పర్య వివరణ:

ఓ రసికులారా! నేను చెప్పబోయేది వినండి. ఇది రసికుల రాజ్యము. ఇక్కడ విరహముతో వేదనజెందరాదు. మిక్కుటముగా, తీపి కలిగిన చెఱకుతో చేసిన విల్లుగల మన్మథుడు, ఇత్తరి (ఇప్పుడు) వాని పండువండెను (పంటపండింది). వాడి ఇష్టమే చెల్లుతున్నది.

ఈ చిత్తజుని రాజ్యములో దంపతులకు నిబంధనయేమంటే బగివాయగరాదు (వారుతోడు వీడరాదు). చిగురుకు జేవవచ్చెను (లేచిగుళ్ళకు బలమువచ్చింది). అనగా చిగురిస్తున్న ప్రేమలు బలపడినవి అని అర్థము. మధురమైన కోయిల కూజితములు, మొగసాలకెక్కెను (నగరపు తలవాకిళ్ళలో కూడా వినిపిస్తున్నాయి). విరసము కలిగించు వేడిగాలి చల్లబడి జగమున చల్లదనము కలిగించెను.

వసంతకాలము వడివడిగా వచ్చినందువలన పసిమొగ్గలు వాడెక్కెను (లేతమొగ్గలు గట్టిపడినవి). ఎవ్వరికైనా (ఏ ప్రేమజంటకైనా) పొందులే జరుగునట్లు నిబంధన పాటించాలి. సుసరమున (ఈ విరహకాలందాకా) పగవాడై ప్రవర్తించిన, పగరాజు (చంద్రుడు) కూడా ప్రేమికుల దారిలోకి వచ్చినాడు. ముసగసలాడెడి తుమ్మిదల (ఝంకారములు చేయు భ్రమరములకు) చలములు చల్లెను (అతిశయము నశించినది) అవి కూడా మౌనము వహించినవి.

ఇలలో శ్రీవేంకటపతి ఇచ్చిన సంపదలే ప్రేయసీప్రియుల సమాగమములు. వారి కూటములకు కాణాచి (చిరకాలము వాసస్థానము) కలకాలం కొనసాగే వారి కలయికలే. ఉత్సుకతతో పదహారువేలమంది పడతులకు ఏకకాలంలో మగడై నిలిచిన శ్రీవేంకటేశ్వరుడు మనస్సు అనే చెలికానిని పంపినాడు. ఆ మనస్సుని ఆశ్రయించి దంపతులంతా కోర్కెలు తీర్చుకోండి.

పద్యవివరణ:

చం॥ **విరహములేలనో రసికవేత్తలు చెప్పెడి మాటనమ్మరో**
మరులను గూర్పుమన్మథుడు మానడు ఆతనిపంటపండెనే
విరసపు వేడిగాడ్పులిటు వీవక చల్లని గాలితోడనే
ఇరవుగ వేంకటేశ్వరుడు ఇంపుల గూర్చెను వేల జంటలన్

సంఖ్య: IV/107 రాగం : శుభవసంతవరాళి
కీర్తన : శ్రీపతి నీసేవ చిత్తము గోరదు

శుభవసంతవరాళి

67 శ్రీపతి నీసేవ చిత్తము గోరదు
పాపముల వెంటనే పారీనయ్యా ॥పల్లవి॥

తెగని కర్మము దేహములు గోరు
వగల యీపీఁగ వ్రణాలు గోరు
నగుచుఁ దొల్లింటి నా పూర్వకర్మములు
పొగరు భోగములే పొందించెనయ్యా ॥శ్రీపతి॥

సాకిరి వయసు సంసారము గోరు
చీకురు వాయులు జీడిమాను గోరు
దీకొని నా తోడి తీరనింద్రియములు
కైకొని మర్మములు గలఁచీనయ్యా ॥శ్రీపతి॥

వేదవిజ్ఞానము విరతియే కోరు
నీదాసుఁడైతేనే నీ శరణు గోరు
యీదెస శ్రీవేంకటేశ నీవు నాలో
పాదైయుండి నన్ను బ్రదికించే న(వ?)య్యా ॥శ్రీపతి॥

ఉపోద్ఘాతము:

జీవుని బలహీనతయేంటంటే పంచేంద్రియాలకు వశుడై వాటిని సంతోషపెట్టడానికే ఈ జన్మనంతా వెచ్చిస్తాడు. కర్మలవల్లనే జన్మలు కలుగుతున్నాయని జ్ఞానులు చెప్పినా ఈగ మనుష్యుల పుండును ఆశ్రయించి తొలిచినట్లు పూర్వకర్మలవలన ప్రాప్తించి భోగాల మత్తులో ఇంకా కర్మలు చేసికొట్టుమిట్టాడుతుంటాడు. గబ్బిలము జీడిచెట్టునాశ్రయించినట్లు యౌవనం నాకు సంసార సుఖమే కావాలి అని బలవంతం చేస్తుంటుంది. వేద వేదాంతములందించే విజ్ఞానము వలన మాత్రమే జీవునికి వైరాగ్యము కలుగుతుంది. మరి చదువు రానివారికి చావు పుట్టుకలు తప్పవా? అంటే దానికీ ఒక సులభోపాయమున్నది. అదే శ్రీవేంకటేశ్వరుని దాసులై దేవదేవా! శరణు అని

స్థిర చిత్తముతో బ్రదుకుగడపటం. ఇదంతా బాగానే వున్నది కానీ అన్నమయ్య ఆవేదన యేమిటంటే శ్రీపతీ! నా మనస్సు చెప్పినమాట వినటం లేదు అది పాపముల వెంట పరుగులు తీస్తున్నది కానీ నిన్ను శరణు అనటం లేదు. నువ్వే దయతలచాలి అంటున్నారు.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీపతీ! నీ సేవను నా చిత్తము (మనస్సు) కోరుట లేదయ్యా! అది పాపములవెంట పారీని (పరుగులు తీస్తున్నది. నా గతేమిటి?

ఈ జీవుడు ధరించిన దేహము యెడతెగని కర్మలను చేస్తూనేవుండాలని కోరుతుంటుంది. 'ఈగ' మక్కువతో పుండును తొలిచినట్లు ఈ దేహము కర్మలనే ఆశ్రయిస్తుంది. గత జన్మలలో చేసిన శుభాశుభకర్మల వలన, ఈ జన్మలో భోగములు కష్టములు కలుగుతుంటాయి. భోగాలు పొగరుబట్టిస్తాయి. కష్టాలు దైవాన్ని తిట్టిస్తాయి. ఈ రెండిటివలనా జననమరణ చక్రబంధంలో చిక్కుకుపోతాడు జీవుడు.

ఓ శ్రీహరీ! సాకిరివయసు (జీవులకు సాక్షీభూతముగావున్న యౌవనము) సంసార వాంఛలలో తగులుకొనునట్లు చేస్తుంది. చీకురువాయులు అనే ఒక జాతి గబ్బిలాలు జీడిమామిడి చెట్లనాశ్రయించి జీవిస్తుంటాయి. అదే విధంగా యౌవనం సంసార సుఖాన్నే ఆశ్రయిస్తుంది. ఇక నా పంచేంద్రియాలూ పూనుకొని నన్నెదిరిస్తూ నాచేత చేయరాని పనులు చేయించి నా అయుర్దాయాన్ని తగ్గిస్తుంటాయి. ఇక నేనేమి చేయగలనయ్యా?

దేవా! వేదవేదాంతములందించే విజ్ఞానమువలన జీవికి గొప్ప జ్ఞానము సిద్ధిస్తుంది. దానివలన వైరాగ్యము కలిగి సర్వసంగపరిత్యాగి అవుతాడు జీవుడు. దానికి శ్రీవేంకటేశ్వరుడని కృప కలుగవలసిందే. మరి అదెలావస్తుంది? ఆ దైవశిఖామణి దాసులై ఆయన శరణాగతితో బ్రతుకు గడుపుతుంటే అప్పుడు యేదో ఒకనాడు ఆయన అనుగ్రహం తప్పక లభిస్తుంది.

పద్యవివరణ:

కం॥ **శ్రీపతి నినుసేవించగ**
ఈ పట్టున నాదుమనసు యెంచదు నిన్నే
ఆపన్నుడనని వేడదు
పాపంబుల వెంటబడుచు పరుగులదీయున్

సంఖ్య: శేషాచార్యులవారి వ్రాతప్రతి సంకీ: 213
రాగం:కుంతలవరాళి. కీర్తన: శ్రీవేంకటేశ్వరుడున్నాడు చేరి యలమేల్మంగతో

కుంతలవరాళి

68 శ్రీవేంకటేశ్వరుఁడున్నాఁడు చేరి యలమేల్మంగతో
భావించి మనవాండ్లు బ్రతుకరే మీరు ॥పల్లవి॥

కుచ్చి కుచ్చి యాతనినే గోరి పాడరే
రెచ్చి తమకము రేచి మోహించరే
ముచ్చట గొత్తగా బదములు చెప్పరే
పచ్చిదేర నుతియించి బ్రతుకరే మీరు ॥శ్రీవేం॥

మొగము జూచి యాతనినే మోహించరే
నగుతా మేలమాడి యానందించరే
తగిలి సేవసేసి ముందర నిలువరే
పగటునఁ బ్రార్థించి బ్రతుకరే మీరు ॥శ్రీవేం॥

శరణుజొచ్చి యాతనినే సారె నమ్మరే
వరములరాయని పాడి వర్ణించరే
ఇరవై శ్రీవేంకటేశుఁడేలే నన్ననరే
పరమునిహమునిచ్చిని బ్రతుకరే మీరు ॥శ్రీవేం॥

ఉపోద్ఘాతము:

ఇది తాళ్ళపాక శేషాచార్యులవారి వ్రాతప్రతినుండి లభ్యమైన కీర్తన. జీవులు నిరంతరం ఆరాటపడేది ఆనందంగా జీవించాలని. ధనమూ వైభవము, సంపద మనిషిని సంతోషపరుస్తాయి. అందులో సందేహం లేదు. కానీ ఆ భౌతిక సుఖాలిచ్చే సంతోషం క్షణభంగురము. శాశ్వతంకాదు. అదే భగవంతుని శరణాగతి నాకుచాలు అనుకొనే వాడికి కలిగేది తృప్తితో కూడిన ఆనందము. ఇది శాశ్వతమైనదీ, మనందరినీ తరింపజేసేదీను.

శ్రీవేంకటేశ్వరుడు ఆయన దేవేరి అలమేలుమంగ చేరి మన కన్నుల యెదుటవున్నట్లు భావించగలిగిన వారికి బ్రతుకు నల్లేరుపై బండిలా చక్కగా సాగుతుంది. స్వామిపై అచంచలమైన భక్తితో వుండండయ్యా! అంటున్నారు

తాత్పర్య వివరణ:

ఓ భక్తులారా! శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేలుమంగమ్మను చేరి మన కన్నులయెదుట వున్నాడు. మీరు తిరుమలలో లేకున్నా వారు మీ కన్నులముందువున్నట్లు భావించి మీరు మనవాండ్లందరూ ఆనందంతో బ్రతుకరో!

ఆతనినే కోరి, కుచ్చికుచ్చి (ఆయనపై కూర్చి కూర్చి) కమ్మటి పాటలు పాడండయ్యా! రెచ్చిపోయి తమకము రేచునట్లు (మైమరపు కలుగునట్లు) ఆ స్వామిని మోహించండి. కొత్త కొత్త పదములు కూర్చిన ముచ్చటైన చరణాలను చెప్పండయ్యా! పచ్చిదేర (మీ జీవితాలను పండించుకొని) ఆ దేవదేవుని నుతిస్తూ మీరంతా హాయిగా బ్రతకండి.

శ్రీనివాసుడు జగన్మోహనుడు. ఆ స్వామి ముఖమును జూచి మోహించండి. ఆనందం పంచుకోండి. తగిన విధంగా పూనుకొని ఆయనకి సేవ చేస్తూ ముందర నిలవండి. మీరంతా స్వామిని పగటున (కీర్తిస్తూ) ప్రార్థించుతూ మీ బ్రతుకులు గడపండి.

ఓ ప్రజలారా! ఆతనినే (ఆ ఏడుకొండలవాడినే) సారె (ప్రతిసారీ) శరణుజొచ్చి ఆయనపై నమ్మికతో వుండండి. మిక్కుటముగా వరములు గుప్పించే ఆ వరములరాయుని పైపాటలు పాడి అద్భుతంగా వర్ణించండి. మనందరికీ ఆశ్రయమైన శ్రీవేంకటేశ్వరుడే నన్ను యేలి ఇహపరములనొసగి రక్షిస్తాడు. అంతా ఆనందంతో జీవించండి.

పద్యవివరణ:

కం॥ **అలమేలుమంగ తోడుత**
కొలువై యున్నాడు ఏడు కొండలపైనన్
చెలిమిని శ్రీవేంకటపతి
ఎలమిని భావించి బ్రతుకుడెల్లరు భక్తిన్.

సంఖ్య: XX/517 రాగం : కర్ణరంజని
కీర్తన : సతి నిన్ను గెలిచెను జవ్వనపుగరిడీలో

కర్ణరంజని

69 సతి నిన్ను గెలిచెను జవ్వనపుగరిడీలో
మతిలోన మెచ్చిమెచ్చి మన్నించు రమణుఁడా ॥పల్లవి॥

కనుసూటి వలపూ కాంత చూచినచూపు
కొనకెక్క మరుఁడదె గురులేసెను
మొనకత్తిసామూ ములువాఁడికొనగోరు
పెనఁగి చెక్కులనొత్తి పేరెమువారెను ॥సతి॥

చేసూటి వలపూ చెలి కాఁగిలించినది
బాసతోనే కాయజుఁడు పందెమాడెను
మూసిదింపు మొరఁగూ ముంచిన పయ్యదకొంగు
ఆసలు నీకుఁ జూపి ఆయాలు రేఁచెను ॥సతి॥

మొగసూటి వలపూ మోహపు రమణినవ్వు
తగవుతో మదనుఁడు దారగట్టెను
అగపడి శ్రీవేంకటాధిప నీవు గూడితి
జగమింతయుఁ దీరి చనవుచేకొనెను ॥సతి॥

ఉపోద్ఘాతము:

నాయికయొక్క శృంగార చేష్టలను మల్లయోధులు చేసే సాముగరిడీలతో పోల్చి చెబుతున్నారు అన్నమయ్య. ఆమె తన కౌశలం చూపి తిరుమలేశునే గెలిచిందిట. ఓ రమణుడా! ఆమెను నీ మదిలో తెగమెచ్చుకొని మన్నించవయ్యా! అంటున్నారు. అయితే ఆమె కుస్తీపట్టి స్వామిని గెలువలేదు. ఆమె కనుసూటి వలపు, చేసూటివలపు, మొగసూటి వలపు కుమ్మరించి తన రమణుని గెలిచిందట. అంటే ఏమిటంటారా? మరి వివరణ చదవక తప్పదండీ. ఆమె దగ్గర ఇంకాకొన్ని కత్తిసాముకోసం సిద్ధపరచుకొందట. అవేమిటో తెలుసా? వాడి చురకత్తులవంటి తన గోళ్ళు. చివరికేం జరిగింది? శ్రీవేంకటేశుడు పెనగి ఆమెను కూడినాడు. ఆమె

జగడములు మాని చనువుతో మగని దరిజేరగా ఆమె నవ్వుచూచి మన్మథుడికి వచ్చినదారి బట్టక తప్పలేదు.

తాత్పర్య వివరణ:

ఓ రమణుడా! నీ సతీమణి, జవ్వనపు గరిడీలో (యౌవనమనే మల్లశాలలో) నిన్ను గెలిచింది. ఆమెను నీ మతిలోనే (మనస్సులోనే) మెచ్చిమెచ్చి (బాగా మెచ్చుకొని) మన్నించవయ్యా! (ఆదరింపుము ప్రభూ!).

ఆకాంత నిన్ను చూచిన చూపు కనుసూటివలపు (తిన్నగా నీ కన్నులలోకి చూస్తూ మల్లయుద్ధంలోవలె వలపును) రేపింది. అది చూచి మన్మథుడు భారం నీస్వామిపై వేసి ఒక కొనకి పారిపోయాడు. ఇక ఆమె మొనకత్తిసాము (బాకులతో చేసే యుద్ధం) యేమిటో తెలుసా? ముళ్ళలాంటి తన వాడిగోళ్ళకు పనిచెప్పటమే. ఆమె వాటితో పెనగి తన చెక్కిళ్ళు నీ పెదవులకు ఒత్తి పేరెము వారెను (గుఱ్ఱములాగా పరిగెత్తినది).

చేసూటి అంటే చేతులతో మల్లయుద్ధపు పట్టులో బిగించడం. ఆమె చేసూటివలపుతో తన బిగికౌగిలిలో నిన్ను బంధించినది. కాయజుడు (మన్మథుడు) బాసజేసి ఇరువురి యుద్ధంలో పందెములు గట్టాడు. ఆమె పయ్యెదకొంగు మూసిదింపు (మల్లయుద్ధం ముందు ఊపే జండా). స్వామీ! నిన్ను ఓడించటానికి ఆమె ఉపయోగించే కిటుకు యేమిటంటే నీ ఆయములంటుట (నీ శరీరంలోని సున్నితస్థానములను తాకుట).

మొగసూటి అంటే ఒకరి మొగములోకి ఇంకొకరు చూస్తూ కుస్తీపట్టు బిగించడం. ఆ రమణి నవ్వుతో మోహములను వెదజల్లుతూ వలపుల మొగసూటిచేసింది. అది చూచి మదనుడు వచ్చినదారిబట్టినాడు. ఓ శ్రీవేంకటాధిపా! నీవు నాకు దర్శనమిచ్చి కూడితివి. జగడములన్నియు తీరి మన మధ్య చనువులు పెరిగి విరిసినవి.

పద్యవివరణ:

ఆ.వె॥ **సతి నినుగెలిచింది జవ్వన గరిడీలొ**
మతిని మెచ్చి ఆమె మన్ననిమ్ము
జగడమంతదీరు చనువులు పెరుగును
రమణుడా! తరుణిని రతులదేల్చు.

సంఖ్య: XXVIII/488 రాగం : లలిత
కీర్తన : సరసుడ వవుదువు జాణ వవుదువు

లలిత

70 సరసుఁడ వవుదువు జాణ వవుదువు
యిరవైన పనులు మీరిద్దరికిఁ దగును ॥పల్లవి॥

కళలు మోమున నిండె కన్నులఁ జెంగావి మించె
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగెను
యెలమి నేకతమున నింతి నేమిసేసితివో
వులివచ్చి సిగ్గులను వోలలాడీని ॥సర॥

చెమట చెక్కులఁ గారె చిత్తము సంతసమందె
తమి మేనఁ బులకలు దైవారెను
రమణితో నీవెంత రతిసాము సేసితివో
తిమురుచు సంతోసాన తెప్పలఁ దేలీని ॥సర॥

మోవిపైఁ దేనియ లూరె ముచ్చటలు నోరికబ్బె
పూవులు కొప్పున నుండి పొందుగ రాలె
శ్రీవేంకటేశుఁడు కాంతఁ జెంది యం(యెం?)త చేసితివో
వేవేలు వేడుకలను వినోదించీని ॥సర॥

ఉపోద్ఘాతము:

ఈ శృంగార సంకీర్తనలో అన్నమయ్య తిరువేంకటేశ్వరుని జాణతనాన్ని సరసత్వాన్ని ప్రశంసించి మీ ఇద్దరిజంటా చూడముచ్చటగా వున్నదయ్యా! మీ ఇద్దరూ ఒకరికినొకరు తగినవారు అని పొగుడుతున్నారు. కళలు విరజిమ్మే ఆ కామిని మోమున కనులు చెంగావిరంగులో ప్రకాశిస్తున్నాయి. ఆమె చిరునవ్వు మనోహరంగావున్నది. ఆనందంతో పులకరిస్తున్న ఆమె సిగ్గులమొగ్గ అయింది. ఆ రమణికి నీరతి సామర్థ్యం యెంత

చూపితివోగాని తిమురచు సంతోషపు తెప్పమాదిరిగా తేలియాడుతున్నది అంటున్నారు. ఇది సరసశృంగార భక్తి అశ్లీలతకు మలిన భావాలకు తావులేని రసమయలోకం తాళ్ళపాక కవులది.

తాత్పర్య వివరణ:

ఓ తిరుమలనాయకా! నీవు సరసుడవవుదువు. నీవు జాణవు (నేర్పరివి) కూడా అవుదువు. మీ ఇద్దరికీ, యిరవైన (అతిశయించిన) పనులు తగియున్నవి.

ప్రభూ! నీవు చూపిన నీ శృంగారలీల వలన ఆ తరుణి మోమున (వదనమున) కళలు నిండినవి. నిద్రలేమిచేత ఆమె కన్నులు చెంగావి రంగులో (యెఱ్ఱబారి) మెరుస్తున్నాయి. సెలవుల (మధురాధరములపై) లేచిరునవ్వులు చిమ్మిరేచుజున్నవి (చెలరేగుచున్నవి). చిలిపిగా ఏకాంతమున నువ్వామెను యేమిజేసితివోగాని ఆమె ఉలివచ్చి సిగ్గుల (లేతసిగ్గుల) మొగ్గ అయినది. ఆమె ఆ సిగ్గులలోనే వోలలాడినదయ్యా!

స్వామీ! ఆమె చిత్తము సంతోషముతో నిండినందువలన చెక్కిళ్ళమీద చిరుచెమటలు కారినవి. తమితో (తన్మయత్వంతో) మేన (శరీరముపై) పులకలు దైవారినవి (తేలినవి). ఆ రమణికి నీరతి సామర్థ్యమెంత జూపితివో తెలియదుకాని తిమురుచు (వేగిరపాటుచెందుచు) సంతోషపు తెప్పలపై (నావలపై) ఆమె తేలియాడుచున్నది.

ఓ రమణుడా! ఆమె మోవిపై (అధరముపై) తేనియలూరినవయ్యా! ముచ్చట్లతో ఆమె నోరు నిండిపోయింది. ఆమె కొప్పునుండి తలలో అలంకరించుకొన్న పూవులు రాలిపోయినవి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవాకాంతకు చెంది (ఆమెవాడవై) యెంత సేసితివోగాని, ఆమె వేవేల వేడుకలతో (అసంఖ్యాకమైన వినోదాలలో) ఓలలాడినదయ్యా!

పద్యవివరణ:

కం॥ **సరసుడజాణవుయవుదువు**
యిరవైనాపనులు మీరలిద్దరికి దగున్
తిరవేంకటేశుడా! యిక
తరుణిని మురిపించవయ్య! తమి బులకలతో

సంఖ్య: XX/326 రాగం : మధ్యమావతి
కీర్తన : సవతైనా నాపె మేలు సరి నీకంటె

మధ్యమావతి

71 సవతైనా నాపె మేలు సరి నీకంటె
అవల నాపె చెప్పినఅట్టె సేయవయ్యా ॥పల్లవి॥

యేపున నన్ను మన్నించి యేమి సేయవలసిన-
నాపెనే యేకతమున నడుగవయ్యా
దాపుగ నాఁడుజాతికి దయగల దెప్పుడును
మాపుదాఁకా మగవాఁడు మత్తుఁడై యెంచఁగను ॥సవ॥

నేరుపున నీవు నాతో నెత్తమాడవలసిన
కోరి యాపె నొద్దఁ బెట్టుకొనవయ్యా
ఆరితేరినాఁడువారి కాఁడువారే తోడునీడ
గారవపు మగవాఁడు కపటే యెపుడు ॥సవ॥

శ్రీవేంకటేశ్వర నన్నుఁ జేకొని కూడితి విట్టె
యేవేళ నలమేల్మంగ కియ్యకోలయ్యా
కైవశమై ఆఁడువారు కనిపించేయట్టివారు
వావులనే మగవారు వంతువా సెఱఁగరు ॥సవ॥

ఉపోద్ఘాతము:

రుసరుసలాడుతున్నది రమణునిమీద ఒకామె. ఏమి కపటివయా! నీవు. నీకంటే నాకు సవతి అయినప్పటికీ ఆవిడే నయము. నీవు ఎవరి మాటవింటే యేమి? ఆవిడచెప్పినట్లే చేయరాదా? నేను చెప్పినట్లు చేయవలసిన పనిలేదు. ఆమెనే అడుగు. మీరు ఏకాంతంలో వున్నప్పుడు చెప్పుకోరా యేమిటి? చీకటిపడితే చాలు మగవాడు విధేయతలు నటిస్తాడు. నీవు యెవరితో నేస్తంగా వుండాలి అనుకొంటే వాళ్ళనే నీ నెత్తిన బెట్టుకోరాదా? ఆడదాని మనస్సు ఇంకొక ఆడుదానికే తెలుస్తుంది. మగవాడు కపటము నేర్చిన మోసగాడు. ఎప్పుడూ వాడిని

నమ్మకూడదు. ఓ శ్రీవేంకటేశ్వరా! యేదో నోరుజారి అన్నానులేవయ్యా? నీవు యెన్నటికీ అలమేల్మంగమగడివే. ఏది ఏమైనా ఆడది సులభంగా స్వాధీనురాలవుతుంది. మగవాడికి వావివరుసలుకూడా వుండవు, అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్య వివరణ:

ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె నా సవతి అయినప్పటికీ నీకంటే ఆమే సరియైనది. నీకంటే ఆమే యెంతో మేలు. ఇప్పుడు మించిపోయిందేమివున్నది. అవల (అక్కడ ఆమె ఇంట్లో ఆపె (ఆమె) చెప్పినట్లే నడుచుకోరాదా? కాదన్నదెవరు?

ఇకపోతే నాసంగతి. నన్నేం చేయాలోకూడా, మీరే ఏకతాన (ఏకాంతంగా వున్నప్పుడు) కూడబలుక్కుని నిశ్చయించేసెయ్యండి. ఆమే నీకు మంచి సలహానివ్వగలదు. దగ్గరనుంచి పరిశీలిస్తే ఆడదానికి ఆడదేశత్రువనటం, నిజం కాదు. ఆడదెప్పటికీ దయవున్నదే. ఎంచిచూస్తే చీకటి పడితేనే మగవాడి మంచితనం. రాత్రివూహల్లో యెప్పుడూ మత్తెక్కివుంటారు మీ మగవాళ్ళు.

నీవు నాతో నీ నేర్పంతా చూపించి, నెత్తమాడువేళ (పాచికలాడుతున్నప్పుడు) సాక్షిగా, ఆమెనే నీవద్ద పెట్టుకోవయ్యా! ఇప్పుడు నేనేమీకాదన్నానా? ఈ మాటమాత్రంనిజము. ఆడదానిమనస్సు ఆడదే అర్థంచేసికొని అండగా వుంటుంది. మీ మగవాళ్ళు చూపించేగౌరవం అంతా నటనే. మీదంతా కపట బుద్ధే.

సరేలే స్వామీ! అయిందేదో అయింది. దాసుని తప్పులు దండముతోసరి. నీవు శ్రీవేంకటరమణుడవు. ఏదో నాపై కరుణతో నన్ను చేకొని కూడినావు. లేనిచో దేవదేవుడవైన నీవెక్కడ? తుచ్ఛమైన నరులము మేమెక్కడ? ఈ వేళ నీవు అలమేలుమంగమ్మ ఇయ్యకోలే (ఆమె ఆజ్ఞానువర్తివే). ఒక్కసారి కైవశమైన ఆడది జీవితాంతం నమ్మకంగా వుంటుంది. కానీ మగవాడికి మాత్రం వావివరుసా వుండదు. వాళ్ళు మంచీ చెడూ చూడు.

పద్యవివరణ:

ఆ.వె॥ **సవతియైననేమి ఆవిడేమేలయ్య!**
చేయవయ్య! ఆమె చెప్పినట్లె
మోసగాడెతాను మొగవాడు యేనాడు
వెలదులేక మాయె వేంకటేశ!

సంఖ్య: II/228 రాగం : నాసికా భూషిణి
కీర్తన : సింగారాల మించీ నరసింహదేవుడు

భూషిణి

72 సింగారాల మించీ నరసింహదేవుఁడు
చెంగట నున్నాఁడు నరసింహదేవుఁడు ॥పల్లవి॥

సురలు జయ వెట్ట నసురలెల్ల మొరవెట్ట
సిరితో మెలఁగీ నరసింహదేవుఁడు
ధరణి వంపెట్టఁ బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట
శిరసెత్తె నలి నరసింహదేవుఁడు ॥సింగా॥

కాంచనదైత్యుఁడు దొరకాలువనెత్తురు వార
చించెను గోళ్ల నరసింహదేవుఁడు
పంచలఁ బంతాలు మీరి భవనాశియేరు వార
చెంచతలఁ గోరీ నరసింహదేవుఁడు ॥సింగా॥

బలిమి పైపై నెక్క ప్రహ్లాదుఁ డట్టె మొక్క
చిలికీఁ గరుణ నరసింహదేవుఁడు
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీఁద
చెలువమే చూపీ నరసింహదేవుఁడు ॥సింగా॥

ఉపోద్ఘాతము:

అహోబల నృసింహదేవునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ నరసింహుడు శృంగార కళలో కూడా ఆరితేరినవాడు. మన చెంగట (దగ్గర) నేయున్నాడు. అసురులంతా అయ్యో మా హిరణ్యకశిపుడు అన్ని వరాలను పొంది కూడా దారుణంగా మరణించాడే అని 'ఏకావికలై' పారిపోయారు. శ్రీలక్ష్మిని తన తొడపై కూర్చొనబెట్టుకొని వలపును కురిపిస్తున్నాడు. అసురుడి వరం అతిక్రమించకుండా నరుడూ మృగమూకాని

ఒక విచిత్రమైన జీవి, ఏ ఆయుధముకాని గోళ్ళతో చీల్చి, ఇంటా బయటాకాని గడపపై కూర్చొని, నేల ఆకాశమూ కాక తన తొడపై వుంచుకొని, సాయంసంధ్యలో చంపాడు. చెంచెతలను కోరాడు యెందుకంటే లక్ష్మీకళ చెంచుల పుత్రికగా పుట్టింది. అంత ఉగ్రుడూ ప్రహ్లాదుని ప్రార్థన మన్నించాడు. మరి ఆయన శ్రీవేంకటేశ్వరుడు కదా!

తాత్పర్య వివరణ:

సింగారాలమించిన (శృంగార కళలో మొనగాడైన) ఈ నరసింహదేవుడు, మన చెంగటనే (దగ్గరనే వున్నాడు). ఈ అహోబలనృసింహుని కీర్తించండి.

ఈ నరసింహుని భీకర రూపాన్ని చూచి దేవతలంతా జయవెట్టె (జయజయ ధ్వానాలు చేశారు). అసురులెల్లా మొరవెట్టె (మొత్తుకొంటూ) పారిపోయారు. సిరితో (శ్రీలక్ష్మితో) మెలగినవాడీ నృసింహుడు. ధరణివంపెట్ట (భూమిగగ్గోలుతో నిండిపోగా) ఆ ధ్వనుల ప్రతిధ్వనులతో ఆకాశం నిండిపోగా నరసింహదేవుడు, నలి (విజృంభించి) శిరసెత్తి (తలపైకెత్తి చూచినాడు).

కాంచనదైత్యుడు (హిరణ్యకశిపుడు) దొరయైనా వానినెత్తురు కాలువలై పారినది. ఈ నృసింహదేవుడు ఆ రాక్షసుని తన వాడిగోళ్ళతో చీల్చి చెండాడినాడు. పంతాలు తీరినవి కనుక భవనాశియేరు (నది) ప్రశాంతముగా పారింది. అప్పుడు యీ నృసింహదేవుడు చెంచుల కన్య సాంగత్యం కోరినాడు. అదంతా శ్రీహరిలీల మరి.

అంత భీకర నరసింహుని చూచిగూడా ప్రహ్లాదుడు శ్రీహరి భక్తుడైనందువలన బలిమితో (ధైర్యంతో) నృసింహుని పైనెక్కి కీర్తించాడు. ఆ నృసింహదేవుని మనస్సు కరిగి ఆతనిపై కరుణ, చిలికించినాడు. శ్రీవేంకటాద్రిపై అలరిన శ్రీవేంకటేశ్వరుడే ఈ అహోబల నృసింహుడు. ఈయన అందరికీ తన స్నేహభావం చూపించాడు.

పద్యవివరణ:

కం॥ **సింగారాలను యీ నర-**
సింగము మించేను దైవశేఖరుడితడే
చెంగటనున్నాడే తన
అంగన శ్రీలక్ష్మి గూడి ఔబళమందున్.

సంఖ్య: శేషాచార్యుల వ్రాతప్రతి. పీఠిక పి46, 47
రాగం : నాదబృందావని కీర్తన : సురలకు నరులకు సొరిది విన విన

నాదబృందావని

73 సురలకు నరులకు సొరిది విన విన
అరుదు తాళ్లపాక అన్నమయ్య పదములు ॥పల్లవి॥

చక్కెరై చవిచూపీ జాలై తావి చల్లీ-
నక్కజపు మాఁతువఱ్రాలై మెఱసీని
నిక్కుటద్దములై మా నిలువు నీడలు చూపీ-
నక్కర తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

పన్నీరై పైఁబూసీఁ గప్రంబై చలువరేఁచీ
మిన్నగల ముత్యములై మెయినిండీని
వెన్నుబలములై మా వెంట వెంటఁ దిరిగీని
అన్నిట తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ
పుట్టుతోనె గురువులై బోధించీని
గట్టి వరాలిచ్చే శ్రీవేంకటనాథుని మెప్పించీ-
నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

ఉపోద్ఘాతము:

తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారి రచన ఇది. శేషాచార్యులవారి వ్రాతప్రతినుండి లభించినది. పీఠికలోని దీనిని తన తాతగారు అన్నమాచార్యులవారి విశిష్ఠతను ప్రశంసిస్తూ చినతిరుమలయ్య చెప్పారు. ఈ అన్నమాచార్యులవారి అరుదైన (తరచుగా లభించని) పదములు (పదకవితలు) సురులు, నరులు విని పులకించిపోతున్నారు. చక్కెర తియ్యదనము కలిగి పూలసౌరభములొలికే కీర్తనలివి. సాహిత్యంలో వజ్రాలవంటి వారినే ఆశ్చర్యపరచేటట్లు వున్నాయి, ఈ కీర్తనలు. ఈనాటికీ అన్నమయ్య మా వెన్నంటే

వస్తున్నారు అంటే అతిశయకోక్తి కాదు. ఇవి ప్రత్యక్ష వేదాంతశాస్త్రములు నిత్యములు అనగా శాశ్వతములు. నేను పుట్టిననాడే వారు నా గురుపుంగవులైనారు. దిట్టమైన వరాలనిచ్చే శ్రీవేంకటేశ్వరునే మెప్పించారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు, అంటున్నారు చినతిరుమలయ్య.

తాత్పర్య వివరణ:

అరుదైన (విశిష్ఠమైన) ఈ తాళ్ళపాక అన్నమయ్య కీర్తనలను విని పైలోకాలలోని సురులు (దేవతలు) భూమిపైన నరులు (మానవులు) సొరిది విని విని తరచుగా విని తరించినారు, ఆనందమును పొందినారు.

ఇవి చక్కెరవలె మధురమైనవి. జాలువారే తావి (పుష్ప సౌరభాలను) వెదజల్లుచున్నవి. ఆశ్చర్యము గొలిపే, మాతువఱ్రాలై (సాహితీ రత్నములై) మెఱసీని (కాంతులు జిమ్మాయి.) నిక్కుటద్దములై (నిలువెత్తు అద్దములై మా నిలువు నీడలు చూపీ (మా మంచి చెడులను ప్రతిబింబించే అద్దములే) తాళ్ళపాక అన్నమయ్యగారి పదకవితలు.

ఈ కీర్తనలు, పన్నీటివలె సేదదీర్చునవి. గప్తంబై (కర్పూరమువలె) శీతలకరమైనవి. మిన్నగల ముత్యాలు (ఈ కీర్తనలు మంచి ముత్యాలవంటివి). వీటితో వళ్ళంతా అలంకరించుకోండి. ఆయన నీడలో పెరిగినందువలన ఆయన మా వెన్నెముక బలమువలె మా వెనువెంటనే వున్నాడు. అన్ని విధములా ఆయనవలె మేమీ శ్రీవేంకటేశ్వరునిపై పదకవితలు చెప్పాలని ప్రయత్నిస్తాము.

ఈ కీర్తనలు నిత్యమూ వేదాంత సారాన్ని వెలుగులోకి తెస్తాయి. ఆయన నా పుట్టుకనాడే నా గురుదైవమైనాడు. దిట్టమైన వరాలనిచ్చే తిరుమలేశ్వరుని అట్టే మెప్పించే పదకవితలు చెప్పారు తాళ్ళపాక అన్నమయ్య. ఆయన మా పాలిట శ్రీహరి.

పద్యవివరణ:

ఆ.వె॥ **నరులు విని తరించ సురులంత మురియగ**
అరుదు కీర్తనములనన్నమయ్య
పాడి హరిని బొందె పరమపదమునెక్కి
చిన తిరుమల పొగిడె, మనవడతడె.

సంఖ్య: XXVIII/16 రాగం : శహన
కీర్తన : సేవించరో మొక్కరో చెలులాల నరులాల

శహన

74 సేవించరో మొక్కరో చెలులాల నరులాల
కైవశమై వున్నవాఁడు కరుణాకరుఁడు ॥పల్లవి॥

బాసికము గట్టుకొని బంగారుగద్దెమీఁద
లాసి కూచున్నాఁడదివో లకిమమ్మతో
సూసకపువనితలు సోబానఁ బాడఁగాను
భాసురమై యొప్పె నదె ప్రహ్లాదవరదుఁడు ॥సేవిం॥

మునులు చదువఁగాను ముంజేతి కంకణాలతో
యెనసి నవ్వులు నవ్వీ నిందిరతో
అనయముఁ బేరఁటాం డ్లారతులెత్తఁగాను
పనివూని వరాలిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు ॥సేవిం॥

పొలఁతలు వడ్డించఁగా బువ్వానఁ గూచుండి
చెలఁగి సరసమాడీ శ్రీదేవితో
యెలమి శ్రీవేంకటాద్రి నీతఁడే యెందుచూచినా
బలవంతుఁడై వున్నాఁడు ప్రహ్లాదవరదుఁడు ॥సేవిం॥

ఉపోద్ఘాతము:

అహోబలనారసింహుని కళ్యాణమహోత్సవం వైభవోపేతంగా జరుగుతోంది. హరి (సింహము) అయినప్పటికీ కైవశమై (అటు ప్రహ్లాదుని భక్తికీ ఇటు శ్రీలక్ష్మి రక్తికీ స్వాధీనమై) కరుణాకరుడైనాడు. ఇక భయమెందుకు? చెలులారా (వనితల్లారా) ఈ మహానుభావుని సేవించరో ఓ నరులారా! ఈతడే శ్రీవేంకటాధిపుడు కూడా. మరి ఇక ఆలశ్యం దేనికి మొక్కండి. ఈ ప్రహ్లాద వరదుడు ఏ వరముకోరినా ఇస్తాడు అంటున్నారు. అచ్చు తెలుగుమాటలు కీర్తన నిండా పుష్కలంగా వుండటం వలన నిఘంటువులు కావాలి నేటి తరాలవారికి. అందుకే ఈ తాత్పర్య వివరణ. 'బాసికము' అంటే తెలియదు 'బువ్వాన' కూర్చోటమంటే తెలియదు,

'సూసకము' అంటే తెలియదుకదా! మనమేం చేస్తాం? నాగరికత నమిలి తినేసింది మనని.

తాత్పర్య వివరణ:

ఓ చెలులాల! (వనితామణులారా!) ఓ నరులాల (మానవులారా!) సేవించరో (ఈ నరసింహునికి సేవచేయండి) మొక్కరో (ఈ ప్రహ్లాదవరదునికి మొక్కుకోండి). ఇదే తగిన సమయం. ఇటుప్రహ్లాదుని భక్తికి, అటు శ్రీలక్ష్మి రక్తికీ తాను కరుణాకరుడై కైవశమై (స్వాధీనుడైవున్నాడు.) పైగా నేడు ఈయన కళ్యాణము కూడా.

ఈ నారసింహుడు బాసికము (పెండ్లిలో వధూవరుల నొసటన కట్టబడెడి బలామలకంలేక చిన్న పతకము) కట్టుకొని బంగారు గద్దె (సింహాసనము)పై, లాసి కూర్చున్నాడు (గట్టిగా ఆశీనుడైనాడు). సూసకపు వనితలు (నేటికాలంలో రాళ్ళబిళ్ళ అని పిలువబడే ఆనాటి 'తిరుగుడు బిళ్ళ' ధరించిన స్త్రీలు సోబాన (శోభనం పాటలు) పాడుతున్నారు. బాసురమై (వెలుగులు విరజిమ్ముతూ) ఆ ప్రహ్లాదవరద నరసింహుడు ఒప్పుగానున్నాడు.

మునులు, చదువగాను (వేదపఠనము చేస్తుంటే) తనముంజేతి కంకణాలు మిలమిలా మెరుస్తుంటే ఈ నరసింహుడు ఇందిరాదేవితో నవ్వులొలికిస్తూ యెనసి (గొప్పగా) కనువిందు చేస్తున్నాడు. అనయము (మరీమరీ) పేరంటాండ్లు ఆరతులెత్తగా (మంగళ హారతులిస్తుంటే) ఈ ప్రహ్లాదవరదుడు పనివేళా పెక్కువరాలనిచ్చేస్తున్నాడు.

ఇక అంతా, పెండ్లి భోజనాలకు కూర్చొన్నారు. ఆ ముచ్చట యెలావున్నదో చూడండి. పొలతలు (పెండ్లివారిలో స్త్రీలందరూ) వడ్డిస్తుంటే బువ్వాన గూచుండి (పంక్తి భోజనాలకి కూర్చున్నారు.) ఈ నరసింహుడు శ్రీదేవితో సరసాలాడుతూనేవున్నాడు. ఎందుచూచినా, (ఇటు అహోబలంలోనూ అటు తిరుమల వేంకటాద్రిలోనూ) ఎలమి (సంతోషముతో) బలవంతుడై ఈ ప్రహ్లాదవరదుడు శోభిల్లుతున్నాడు.

పద్యవివరణ:

కం॥ **సేవించరో చెలులు హరి**
కావగమొక్కండి నరులు కరుణాకరునిన్
కైవశమైవున్నాడిటు
భావింపగ సప్తగిరుల వరదుండితడే.

సంఖ్య: శేషాచార్యులవారి వ్రాతప్రతి సంకీ. 73
రాగం : సురటి కీర్తన : శృంగారశీలునకు మంగళం

సురటి

75 శృంగారశీలునకు మంగళం
సంగీతలోలునకు మంగళం ॥పల్లవి॥

కనకాంబరునకు కరుణాకరునకు
మనసిజగురునకు మంగళం
మునివరదాతకును దనుజ విజేతకును
మనుకులనేతకును మంగళం ॥శృంగార॥

విధినుత హరికిని విశ్వాధారునకు
మధుసంహారికిని మంగళం
బుధపోషనకును భోగిశయనునకు
మధుభాషనకును మంగళం ॥శృంగార॥

బహుమతయతికిని మహిరమాపతికి
మహనీయధృతికిని మంగళం
విహగవాహనునకు శ్రీవేంకటేశునకు
మహితదేహునకు మంగళం ॥శృంగార॥

ఉపోద్ఘాతము:

దీనితో నా చిరకాలవాంఛ తీరబోతున్నది. భక్తి, వైరాగ్య, శృంగారములొలికే అన్నమాచార్యులవారి కీర్తనలకు సి.డి. రూపంలో వెలువరించాలని నా కోరిక. నేడు "సుజనరంజని" హైదరాబాద్, ఇండియా వారి 108 కీర్తనల సి.డి. నాకు లభ్యమై 75 కీర్తనలకి ఉపోద్ఘాతము, తాత్పర్య వివరణ జోడించి ఈ పుస్తకం వెలుగులోకి రావడానికి చేయూతనందిస్తోంది. ఈ పాటలు పాడిన "సత్తిరాజు వేణుమాధవ్" గారికి అభినందనలు. జి.బి. శంకరరావు గారి వ్యాఖ్యానం చాలా బాగున్నది.

సుజనరంజని కో-ఆర్డినేటర్ శ్రీ మహీధర సీతారామశర్మ గారికి కృతజ్ఞుడను. వారి ఒరిజినల్ సి.డి.లోని 108 సంకీర్తనలలో 75ను యెన్నుకొని ఈ సి.డి. తయారు చేస్తాను. మొత్తం 75 కీర్తనలకు తాత్పర్య ఉపోద్ఘాతములు చక్కటి విశ్లేషణ అందిస్తాయని నా ఆశ. సుజనరంజనికి చెందినవారికందరికీ అంజలి సమర్పిస్తున్నాను. డి.టి.పి. నిర్వహించిన శ్రీ కె. వెంకటేశ్వరరావు (కె.వి.ఆర్) గారికి కృతజ్ఞతలు.

"ఓం నమో వేంకటేశాయ"

తాత్పర్య వివరణ:

శృంగారశీలుడైన శ్రీవేంకటేశ్వరునికి మంగళమగునుగాక! సంగీత లోలుడై పరవశించు తిరుమలేశ్వరునికి మంగళములు కలుగుగాక!

కనకాంబరునకు (పీతాంబరుడైన శ్రీహరికి) మంగళము. కరుణాసాగరునకు మంగళమగును గాక! మనసిజ గురుడు మనస్సులోనే జన్మించు మన్మథుని తండ్రి అయిన లక్ష్మీనారాయనునకు మంగళము పలికెదను. దనుజవిజేత (రాక్షసాంతకునకు) రమ్యమైన మంగళము. మానవునిగా జన్మించి శ్రీరామచంద్రమూర్తి అని పిలువబడిన చక్రవర్తికి మంగళమగునుగాక!

విధినుత (బ్రహ్మదేవునిచే స్తుతింపబడు పరమ పురుషునకు), విశ్వమును ఉదరములో భరించు విష్ణునకు మంగళాశాసనములు. మధు అనే రాక్షసుని మట్టుబెట్టిన మహామహునకు మంగళము. బుధజనులను (పండితులను) ఆదరించు పురుషోత్తమునకు మంగళము. భోగి శయనుడు (ఆదిశేషునిపై పరుండు) ఆదిమూర్తికి మంగళము. మధురముగా మాట్లాడెడి మహీపతికి మంగళములు కలుగుగాక!

అన్నిమతలములకు ఆధారమైనవానికి, భూ రమా విభునికి మంగళా శాసనములు. మహనీయమైన ధృతి (ధైర్యము) గల మహానుభావునకు మంగళము. విహగవాహనుడు (గరుడగమనుడు) అయిన శ్రీవేంకటేశ్వరునకు, మహిత (గొప్పదైన) దేహము కల మా దేవునికి, అన్నమాచార్యులవారి కీర్తనా మంగళములు.

పద్యవివరణ:

కం॥ **శృంగారశీలునికి ఇక**
మంగళమని పాడరమ్మ! మహిళామణులూ!
సంగీతలోలుడలమేల్-
మంగమ్మకు వేంకటయ్య మగడాయెనుగా.

మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః